UNIVERSAL LIBRARY

OU_204493

UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81-6 A64 Accession No. T2049

Author [illegible]

Title [illegible] 1926

This book should be returned on or before the date last marked below.

శ్రీ శుభమస్తు.

శ్రీగర్గభాగవతము

ఇయ్యది

సికింద్రాబాదు పురవాసియు, బాలనీత్యాద్యనేక గ్రంథకర్తయు నగు

బ్రహ్మశ్రీ

చిఘ్ఘుల [?] అప్పయ్యశాస్త్రిచే

రచియింపఁబడి

గుంటూరు కన్యకా ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడి ప్రకటింపఁబడియె.

మొదటికూర్పు 1,000 ప్రతులు.

1926.

[స్వామ్యసంకలితము] [వెల రు. 3-0-0

శ్రీగర్గభాగవత బాలనీత్యాద్యనేక గ్రంథకర్త.

చివుకుల అప్పయ్యశాస్త్రి.

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః.

శ్రీ గర్గభాగవత
విషయసూచిక.

విషయము. పుట.

—— గోలోకఖండము ——

శ్రీగర్గభాగవత మాహాత్మ్యము	
ఇష్టదేవతాప్రార్థన	
శ్రీగర్గాచార్యుండు నైమిశారణ్యమున కేతెంచుట	౧
బహులాశ్వుఁడు నారదమునిని సత్కరించి ప్రశ్నించుట	౨
నారదుండు బహులాశ్వునకుఁ బరమాత్మావతారంబులంగూర్చి తెలుపుట	౨
బ్రహ్మదేవుండు దేవవాసుదేవసహితంబుగా గోలోకంబున కేగుట	౫
గోలోకవర్ణనము ...	౫
బ్రహ్మాదిదేవతలు శ్రీకృష్ణుని స్తుతించుట	౧౦
శ్రీకృష్ణుండు దేవతల కుచితోక్తులాడుట	౧౧
శ్రీరాధాకృష్ణ సంవాదము ...	౧౨
ప్రతియూథ గోపికల వృత్తాంతము	౧౪
మైథిలాదినారీ వృత్తాంతము ...	౧౮
మునియూథాది గోపికల పూర్వచరిత్రము	౧౬
కృష్ణుండు యోగమాయను నియోగించుట	౨౧
కంస పూర్వజన్మ వర్ణనము ...	౨౨
కంసుండు దిగ్విజయం బొనర్చుట ...	౨౩
రాధావతార వర్ణనము	౩౩
దేవకీవసుదేవ వివాహవర్ణనము ...	౩౮
బలరామావతార వర్ణనము	౩౯
శ్రీకృష్ణజనన కథాప్రారంభము ...	౪౧
శ్రీకృష్ణావతార ఘట్టము	౪౨
దేవకీవసుదేవు లావిర్భవించిన శ్రీకృష్ణుని వినుతించుట ...	౪౩
నందుండు పుత్రోత్సవంబు చేయుట ...	౪౬
పూతన కంసప్రేరితయై గోకులంబున కేతెంచుట	౫౧
శ్రీకృష్ణ కవచము	౫౨
పూతనా పూర్వజన్మ వృత్తాంతము ...	౫౩
బాలకృష్ణుం డుత్కచాసురవధం గావించుట ...	౫౫

విషయము.		పుట.
ఉత్కచాసుర పూర్వజన్మ వృత్తాంతము	...	,,
బాలకృష్ణుండు తృణావర్తునిం గూల్చుట	...	౫౬
బ్రాహ్మణులు శ్రీకృష్ణునకు రక్షసేయుట	...	౫౭
తృణావర్త పూర్వజన్మవృత్తాంతము	...	,,
యశోదానందుల పూర్వజన్మవృత్తాంతము	...	౫౯
గర్గుండు గోకులంబునకేగి రామకృష్ణులకు నామకరణంబులఁ గావించుట		౬౦
గర్గుండు వృషభానుని దరికరిగి రాధాకృష్ణ ప్రశంసఁజేయుట		౬౧
నందుండు నందనునింగొని భాండీరవనంబునకేగుట	...	౬౩
శ్రీరాధాకృష్ణులకు వివాహమహోత్సవంబు రహస్యంబుగా జరుగుట		౬౪
రాధ శిశువైన హరిని తిరిగి గోకులంబునకుఁ జేర్చుట		౬౯
శ్రీకృష్ణ బాలలీల	... ...	,,
శ్రీకృష్ణ దధిచౌర్యలీల	... ...	౭౦
నారదుఁడు నందోపనంద వృషభాను లక్షణంబులఁ దెలుపుట		౭౩
శ్రీకృష్ణ మృద్భక్షణలీల	... ...	,,
విశ్వరూప ప్రదర్శనము	... ...	౭౪
యమళార్జున మోక్షము	... ...	,,
యమళార్జున పూర్వజన్మవృత్తాంతము	...	౭౭
దుర్వాసుండు గోకులంబందలి నందనందనునింగాంచి మోహంబుజెందుట		,,
దుర్వాసుండు వాసుదేవునిం గీర్తించుట	...	౭౯

—♦ బృందావనఖండము ♦—

సన్నందుండు నందునకు బృందావనంబును వర్ణించి చెప్పుట		౮౧
వారాహావతార వర్ణనము	...	౮౪
గోవర్ధనపర్వత చారిత్రము	... ...	౮౫
యమునానదీ చరితము	... ...	౮౮
నందుండు యాదవసహితంబుగా బృందావనంబున కరుగుట		౯౦
శ్రీకృష్ణుండు వత్సాసురుని వధించుట	...	౯౧
వత్సాసుర పూర్వజన్మ వృత్తాంతము	...	,,
శ్రీకృష్ణుండు బకాసురుని జయించుట	...	౯౨
బకాసుర పూర్వజన్మ వృత్తాంతము	...	౯౫
శ్రీకృష్ణుం డఘాసురునిం బరిమార్చుట	...	౯౬
అఘాసుర పూర్వజన్మ వృత్తాంతము	...	,,
శ్రీరామకృష్ణులు పాకుపాల్యం బొనరించుట	...	౯౮

విషయము.		పుట.
రామకృష్ణులు ధేనుకాసురుని జంపుట	...	౧౦౦
ధేనుకాసుర పూర్వజన్మ వృత్తాంతము	...	౧౦౩
శ్రీకృష్ణుఁడు కాళియమర్దనంబు జేయుట	...	"
కాళియపత్నులు శ్రీకృష్ణుని స్తుతించుట	...	౧౦౫
శ్రీకృష్ణుండు దావాగ్నిపానం బొనర్చుట	...	౧౦౬
కాకభుశుండిముని కథ	... ...	౧౦౭
కాళియ వ్యాళోపాఖ్యానము	... ...	౧౦౮
శ్రీరాధాకృష్ణ ప్రీతివర్ణనము	... ...	౧౧౨
తులసీవ్రత మాహాత్మ్యము	... ...	౧౧౮
శ్రీకృష్ణుండు మాయాగోపికయై రాధ దరిజేరుట	...	౧౨౧
మాయాగోపికా రాధికా సంవాదము	...	౧౨౩
రాసక్రీడావర్ణనము	...	౧౨౯
గోపీవిరహ వర్ణనము	...	౧౩౫
గోపికలు శ్రీరాధాకృష్ణుని గీర్తించుట	...	౧౩౮
శ్రీకృష్ణుండు గోపికలకుఁ బ్రసన్నుండగుట	...	౧౩౯
యమునా తటమందు రాధాకృష్ణుండు విహరించుట	...	౧౪౦
శంఖచూడ కంసులు గదాయుద్ధం బొనరించుట	...	౧౪౧
శ్రీకృష్ణుండు శంఖచూడుని వధించుట ...	...	౧౪౨
గోపికలు విహ్వలలై శ్రీకృష్ణునిం జేరుట	...	౧౪౪
అసురిమహాముని కథ	...	౧౪౫
శంఖచూడోపాఖ్యానము	...	౧౪౮

—— గిరిరాజఖండము ——

శ్రీకృష్ణుండు తండ్రిని నింద్రపూజనుగూర్చి ప్రశ్నించి గోవర్ధనగిరిని బ్రశంసించుట		౧౫౩
గోవర్ధన పూజావిధి	...	౧౫౪
గోవర్ధన పూజా మహోత్సవము	...	౧౫౫
ఇంద్రుండు గోకులంబుపైఁ గోపించుట	...	౧౫౭
శ్రీకృష్ణుండు గోవర్ధనపర్వతం బెత్తుట	...	౧౫౮
శ్రీకృష్ణాభిషేకము	...	౧౫౯
గోపకులు శ్రీకృష్ణుని బరీక్షించి నిస్సందేహులగుట	...	౧౬౧
దధిహరణలీల	...	౧౬౭
గిరిరాజ విభూతి వర్ణనము	...	౧౬౮
గిరిరాజోత్పత్తి వర్ణనము	...	౧౭౦
గిరిరాజ మాహాత్మ్యము	...	౧౭౩

విషయము. | పుట.

—♦ మాధుర్యఖండము ♦—

విషయము		పుట
శ్రుతిగోపికోపాఖ్యానము	...	౧౭౮
ఋషిగోపికోపాఖ్యానము	...	౧౮౧
మిథిలాగోపికాపాఖ్యానము	...	౧౮౩
కోసలగోపికోపాఖ్యానము	...	౧౮౬
అయోధ్యావాసినీగోపికోపాఖ్యానము	...	౧౮౮
యజ్ఞసీతోపాఖ్యానము	...	౧౯౫
ఏకాదశీవ్రత వర్ణనము	...	౧౯౬
పుళిందినీగోపికోపాఖ్యానము	...	౧౯౯
రమాసఖ్యాదిగోపికోపాఖ్యానము	...	౨౦౦
దివ్యాస్త్రిగుణవృత్తిగోపికోపాఖ్యానము	...	౨౦౩
దేవకన్యాగోపికోపాఖ్యానము	...	౨౦౪
జాలంధరీగోపికోపాఖ్యానము	...	౨౦౫
సముద్రకన్యకాదిగోపికోపాఖ్యానము	...	౨౦౮
యమునాపంచాంగము	...	౨౦౯
యమునా కవచము	...	౨౧౦
యమునా స్తోత్రము	...	౨౧౧
యమునా పటల పద్ధతులు	...	౨౧౨
ప్రలంబాసుర వధ	...	౨౧౪
ప్రలంబాసుర పూర్వజన్మ వృత్తాంతము	...	౨౧౫
కృష్ణుండు దావాగ్నిని మ్రింగి గోపకులను రక్షించుట	...	౨౧౬
శ్రీకృష్ణుండు గోపకులకు వైకుంఠలోకంబు జూపుట	...	౨౧౮
సుదర్శనోపాఖ్యానము	...	౨౨౦
శ్రీకృష్ణుండు వ్యోమారిష్టాసురులను వధించుట	...	౨౨౧

—♦ మధురాఖండము. ♦—

విషయము		పుట
కంసుండు శ్రీకృష్ణ వధార్థంబై పన్నాగంబులఁ బన్నుట	...	౨౨౫
కంసుం డక్రూరుని గోకులంబునకుఁ బంపుట	...	౨౨౬
వాసుదేవుండు కేశినిశాచరుం ద్రుంచుట	...	౨౨౮
కేశి పూర్వజన్మ వృత్తాంతము	...	౨౨౯
అక్రూరుండు గోకులంబున కరుగుట	...	౨౩౦
శ్రీకృష్ణుం డక్రూర సహితుండై యరుగుచు రాధాదుల నూఱడించుట		౨౩౩
అక్రూరుండు యమునానదిని రామకృష్ణుల దర్శించుట	...	౨౩౬

విషయము.		పుట.
శ్రీకృష్ణుండు మధురకుఁ జేరుట	...	౨౩౭
రామాది సహితుండగు కృష్ణుండు రజకునిం జంపి వాయకసుదాముల ననుగ్రహించుట	...	౨౩౯
శ్రీరామకృష్ణులు కుబ్జతో సంభాషించుట	...	౨౪౧
శ్రీకృష్ణుండు ధనుర్భంగంబు గావించుట	...	౨౪౨
సూర్యాస్తమయ వర్ణనము	...	౨౪౩
మధురాపుర పురంధ్రీ విరహ వర్ణనము	...	౨౪౪
సూర్యోదయ వర్ణనము	...	౨౪౫
కంసుండు మల్లరంగంబు నిర్మింపం జేయుట	...	,,
శ్రీరామకృష్ణులు కువలయాపీడ గజంబును వధించుట	...	౨౪౬
రామకృష్ణులు చాణూర ముష్టికాద్యసురుల వధించుట	...	౨౪౭
శ్రీకృష్ణుండు కంసుని వధించుట	...	౨౫౧
శ్రీకృష్ణబలరాములచేఁ గంసానుజాష్టకంబు హతంబగుట	...	౨౫౩
కంసుని భార్యలు విలపించుట	...	౨౫౩
రామకృష్ణులు దేవకీవసుదేవుల చెఱమాన్పి యుగ్రసేనునిఁ బట్టాభిషిక్తుం జేయుట	...	౨౫౪
రజక పూర్వజన్మ వృత్తాంతము	...	౨౬౦
వాయకసుదాముల పూర్వజన్మవృత్తాంతము	...	౨౬౧
కుబ్జాపూర్వజన్మ వృత్తాంతము	...	౨౬౩
కువలయాపీడగజ పూర్వజన్మ వృత్తాంతము	...	,,
చాణూరాది మల్ల పూర్వజన్మ వృత్తాంతము	...	౨౬౪
కంసానుజాష్టక పూర్వజన్మవృత్తాంతము	...	౨౬౫
పంచజన పూర్వజన్మ వృత్తాంతము	...	,,
శ్రీకృష్ణుం డుద్ధవుని గోకులంబునకుఁ బంపుట	...	౨౬౬
ఉద్ధవుండు రాధాగోపికలను నూఱడించుట	...	౨౮౪
గోపికాగీతలు	...	౨౮౫
ఉద్ధవుండు గోకులంబునుండి మధురకువచ్చుట	...	౨౭౧
శ్రీకృష్ణుం డుద్ధవసహితంబుగా గోకులంబున కరుగుట	...	౨౭౨
శ్రీకృష్ణుండు రాధతో సంభాషించుట	...	౨౭౫
శ్రీకృష్ణుండు ఋభుమునిని జీవన్ముక్తుం జేయుట	...	౨౭౮
శ్రీకృష్ణుండు రాధికకు నారదోపాఖ్యానంబుఁ జెప్పుట	...	౨౭౯

విషయము.		పుట.
బలరాముండు కోలనిశాచరుం ద్రుంచుట	…	౨౯౫
మధురాపురీ మాహాత్మ్యము	…	౩౦౩
—♦ ద్వారకాఖండము ♦—		
కంసుని భార్యలు జరాసంధు మ్రోలకువచ్చి విలపించుట	…	౩౦౭
శ్రీకృష్ణునిపై జరాసంధుఁడు దండయాత్ర జేయుట	…	౩౦౮
జరాసంధుండు శ్రీకృష్ణునకుఁ బరిహాసోక్తులాడుట	…	౩౦౯
శ్రీకృష్ణుఁడు జరాసంధునితో డీకొనుట	…	౩౧౦
శ్రీకృష్ణుండు బలరామునికిం జిక్కిన జరాసంధుని విడిపించుట		౩౧౫
కాలయవనుండు నారదప్రేరితుండై కృష్ణునిమీఁద దాడివెడలుట		౩౧౬
శ్రీకృష్ణుం డర్ణవమధ్యంబున ద్వారకాపురంబు గట్టించుట	…	౩౧౭
కాలయవనుండు శ్రీకృష్ణుని వెంబడించి పోరుట	…	౩౧౮
ముచుకుంద వృత్తాంతము	…	౩౧౯
బలరామ వివాహమహోత్సవము	..	౩౨౩
శ్రీరుక్మిణీకల్యాణ కథాప్రారంభము	…	౩౨౬
రుక్మిణి బ్రాహ్మణుని ద్వారకకుఁ బంపుట	…	౩౨౯
శ్రీకృష్ణుండు రథారూఢుండై కుండినపురికిఁ జేరుట	…	౩౩౧
రుక్మిణి కృష్ణునికై నిరీక్షించి చింతించుట	…	౩౩౩
రుక్మిణి కులదేవతా పూజకై బయలుదేరుట	…	౩౩౫
శ్రీకృష్ణ విజయము	…	౩౩౬
రుక్మి కృష్ణుని వెంబడించి పోరుట	…	౩౩౯
బలరాముండు సహోదర ఖిన్నయగు రుక్మిణి నూఱడించుట		౩౪౧
శ్రీకృష్ణుండు ద్వారకాపురంబున రుక్మిణిం బెండ్లాడుట	…	౩౪౨
శ్రీకృష్ణుండు సత్యభామాది సతులం బెండ్లాడుట	…	౩౪౩
నారదుండు ద్వారకాపురాగమన హేతువులఁ జెప్పుట	…	౩౪౫
గోమతీనదీ మాహాత్మ్యము	…	౩౪౮
చక్రతీర్థ మాహాత్మ్యము	…	౩౪౯
శంఖోద్ధారతీర్థ మాహాత్మ్యము	…	౩౫౩
ప్రభాసతీర్థ మాహాత్మ్యము	…	౩౫౫
సరస్వతీతీర్థ మాహాత్మ్యము	…	౩౫౬
గోమతీసింధుసంగమ మాహాత్మ్యము	…	”
సాగర మాహాత్మ్యము	…	౩౫౮
రైవతాచల మాహాత్మ్యము	…	”

విషయము.		పుట.
యజ్ఞతీర్థకపిటంకాది తీర్థమాహాత్మ్యము	...	౩౬౧
గోపీభూమీ మాహాత్మ్యము	...	౩౬౨
సిద్ధాశ్రమ మాహాత్మ్యము	...	౩౬౫
రుక్మిణి మొదలగువారు రాధను ప్రశంసించి సత్కరించుట	...	౩౭౦
శ్రీకృష్ణుండు రాధాష్టభార్యాదులంగూడి రాసక్రీడంగావించుట		౩౭౩
ద్వారకాపురీ వర్ణనము	...	౩౭౬
ద్వారకా ద్వితీయదుర్గవర్ణనము	...	౩౮౦
ద్వారకా తృతీయదుర్గ ప్రశంస	...	౩౮౧
—♦ విశ్వజిత్ఖండము ♦—		
మరుతోపాఖ్యానము	...	౩౮౫
నారదముని బహులాశ్వునకు రాజసూయవృత్తాంతంబు జెప్పుట		౩౮౮
యాదవులు దిగ్విజయార్థంబై వెడలు ప్రద్యుమ్నునభిషేకించి బహుమతులిడుట		౩౮౯
ప్రద్యుమ్నుండు సేనాసహితంబుగాఁ గచ్ఛాదిదేశంబుల కరుగుట		౩౯౪
ప్రద్యుమ్నుఁడు చేదిదేశంబు గెలుచుట	...	౩౯౮
తలిదండ్రులు శిశుపాలునకు హితోపదేశం బొనరించుట	...	౪౦౦
శిశుపాలుఁడు ప్రద్యుమ్నునిపై దండెత్తుట	...	౪౦౧
ద్యుమచ్ఛక్తులు యాదవసేనతోఁ బోరి సాత్యకి కృతవర్మలచే నీల్గుట		౪౦౨
రంగపింగులు యాదవబలంబుతోఁ దలపడి భానునిచే హతులగుట		౪౦౪
ప్రద్యుమ్నుండు శిశుపాలునితోఁబోరి యోడించుట	...	౪౦౬
ప్రద్యుమ్నుండు కొంకణదేశాదులం గెలుచుట	...	౪౦౭
దంతవక్త్రుఁడు మన్మథునితోఁబోరి యోడుట	...	౪౦౯
మన్మథుఁడు విదర్భాదిదేశంబులు గెలుచుట	...	౪౧౩
మన్మథుం డగస్త్యమహామునింగాంచి జ్ఞానోపదేశంబు బొందుట		౪౧౪
ప్రద్యుమ్నుండు పరశురాముని దర్శించుట	...	౪౨౧
మన్మథుం డంగవంగాదిదేశంబుల కరుగుట	...	౪౨౨
మన్మథుఁడు మిథిలాదేశంబున కేగుట	...	౪౨౫
బ్రహ్మచారివేషంబునయున్న ప్రద్యుమ్నుండు ధృతిచేసిన సత్కారంబులకు మెచ్చి నిజరూపంబుతోఁ బ్రసన్నుండగుట		౪౨౬
ప్రద్యుమ్నుఁడు మగధదేశంబునకుఁ జని జరాసంధునితోఁబోరి యోడించుట		౪౨౮
ప్రద్యుమ్నుఁడు కురుదేశంబులం గెలుచుట	...	౪౩౪
యాదవ కౌరవ యుద్ధవర్ణనము	...	౪౩౬
రామకృష్ణులువచ్చి యాదవ కౌరవులకు సఖ్యంబుగూర్చుట		౪౩౯

విషయము.		పుట.
ప్రద్యుమ్నుండు త్రిగర్తాదిదేశంబుల జయించుట	...	౪౪౧
ప్రద్యుమ్నుం డలకాపట్టణంబున కరుగుట	...	౪౪౩
కుబేరనలకూబరాది యోధపుంగవులు యాదవులతోం బోరుట		౪౪౫
కుబేరుండోడి బలులిచ్చి ప్రద్యుమ్నునిం బొగడుట	...	౪౪౯
మన్మథుండు కింపురుషఖండంబును గెలుచుట	...	౪౫౦
ప్రద్యుమ్నుండు హరివర్షంబు జయించుట	...	౪౫౪
మరుం డుత్తరకురుఖండంబును జయించుట	...	౪౫౫
ప్రద్యుమ్నుండు హిరణ్మయ ఖండంబును గెలుచుట	...	౪౫౮
ప్రద్యుమ్నుండు రమ్యక ఖండంబును గెలుచుట	...	౪౬౦
ప్రద్యుమ్నుండు మానవదేశంబున కేగుట	...	౪౬౧
ప్రద్యుమ్నుండు కేతుమాల ఖండంబును జయించుట	...	౪౬౩
ప్రద్యుమ్నుండు భద్రాశ్వఖండంబును గెలుచుట	...	౪౬౪
వృకుండను కృష్ణపుత్రుండు హ్యాష్టదైత్యునిం గూల్చుట	...	౪౬౫
సంగ్రామజిత్తు భూతసంతాపనాసురునిం జంపుట	...	౪౬౭
అనిరుద్ధుండు వృకాసురుని వధించుట	...	౪౭౦
సాంబుండు కాలనాభరాక్షసునిం బరిమార్చుట	...	౪౭౨
దీప్తిమంతుండు మహానాభాసురునిం దెగటార్చుట	...	౪౭౪
భానుండు హరిశ్మశ్రుదైత్యుని ఖండించుట	...	౪౭౫
శకుని తనతమ్ములు గూలుట విని చింతించి యాదవులతోం బోరుటకేతెంచుట		౪౭౬
శకుని ప్రద్యుమ్న యుద్ధవర్ణనము	...	౪౭౮
శ్రీకృష్ణాస్త్ర నిర్గత శ్రీకృష్ణుండు తద్వధోపాయం బాలోచించి గరుడునకుం జెప్పుట		౪౮౨
గరుడుండు శకుని శుకహరణార్థంబై చంద్రద్వీపంబునకుం బోవుట		౪౮౩
శకునిదైత్యుండు శ్రీకృష్ణునితోం బోరి నీల్గుట		౪౮౫
శ్రీకృష్ణుండు చంద్రావతీపురికేగి శరణాగతులైన శకుని భార్యాపుత్రులకభయదానం బొసగుట		౪౮౮
నారదుండు జనకునకు శకున్యాద్యసుర పూర్వజన్మవృత్తాంతంబు జెప్పుట		౪౮౯
ప్రద్యుమ్నుం డిలావృతఖండంబును గెలుచుట	...	,,
శ్రీకృష్ణుండు వేదనగరంబున కేగుట	...	౪౯౧
నారదుండు జనకునకు రాగతాలనృత్యాది భేదంబులం దెల్పుట		,,
ప్రద్యుమ్నుండు గంధర్వదేశంబు గెలుచుట		౪౯౭
ప్రద్యుమ్నుండు శక్రసఖుని జయించుట		౪౯౯

విషయము.			పుట.
ప్రద్యుమ్నుండు సుందరీస్వయంవరంబున కేగుట		...	౫౦౩
ప్రద్యుమ్నుండు దిగ్విజయంబొనర్చి ద్వారకాపురి కరుదెంచుట			౫౦౪
ఉగ్రసేనుండు రాజసూయం బొనర్చుట		...	౫౦౬
బలభద్రఖండము			
ప్రాడ్వివాకముని బలరామావతారముం గూర్చి దుర్యోధనునకుం జెప్పుట			౫౦౭
జ్యోతిష్మత్యుపాఖ్యానము	...	...	౫౧౩
దేవేంద్రాదులు జ్యోతిష్మతిని మోహించి కోరుట		...	౫౧౪
జ్యోతిష్మతి ఇంద్రాదులను శపించుట	...	...	౫౧౬
బ్రహ్మవరంబున జ్యోతిష్మతి రేవతియై పుట్టుట		...	౫౧౮
ప్రాడ్వివాకుండు దుర్యోధనునకు శ్రీకృష్ణచరిత్రంబు సంగ్రహించి వచించుట			౫౧౯
బలరామ రాసలీలా వర్ణనము	...	...	౫౨౦
బలభద్ర పంచాంగము	...	...	౫౨౨
విజ్ఞానఖండము			
వ్యాసుం డుగ్రసేనుదరి కరుదెంచుట		...	౫౨౬
లోకకర్మగతి నిరూపణము	...	...	౫౨౯
నిర్గుణభక్తియోగ వర్ణనము	...	...	౫౩౦
భక్తమాహాత్మ్యము	...	...	౫౩౧
భక్త్యుత్కర్ష వర్ణనము	...	...	౫౩౨
హరిమందిర ప్రతిష్ఠావర్ణనము	...	...	౫౩౪
షోడశోపచారపూజావిధానము	...	...	౫౩౮
శ్రీకృష్ణదండకము	...	...	౫౪౦
పరబ్రహ్మనిరూపణము	...	...	౫౪౩
శ్రీ గర్గభాగవతపఠనాదిఫలము	...	...	౫౪౫

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః

ఉపోద్ఘాతము.

శ్లో॥ నూతనజలధరరుచయే గోపవధూటీదుకూలచోరాయ
తస్మై కృష్ణాయ నమస్సంసారమహీరుహస్యబీజాయ॥

గుణగ్రహణచణులారా !

ధర్మము శ్రేయస్సాధనమనియు, నధర్మంబు తద్భిన్నహేతువనియు మీకుఁ దెలియనిది కాదు. మంచిపని ధర్మంబనియుఁ జెడ్డపని యధర్మంబనియు నెఱుంగఁబడుచున్నది. ఈ ధర్మాధర్మంబులను నిర్ణయించుటకు శ్రుతిస్మృతిపురాణేతిహాసంబులు ప్రబలప్రమాణంబులు. శ్రుతు లపౌరుషేయంబులనియు, వానియభిప్రాయంబులను మాత్రము వ్యక్తీకరించి త్రికాలజ్ఞులును నిగ్రహానుగ్రహసమర్థులు నగు మహర్షులచే నాయా యుగంబుల కనుగుణంబుగా వ్రాయఁబడినవి స్మృతులనియు ద్విజులకుమాత్రం బివి పాఠ్యంబులనియు, వానియాశయంబులు సులభగ్రాహ్యంబగునట్లు మహానుభావుల చరిత్రంబుల నుపబలంబుగాఁ జూపుచు రచింపఁబడినవి పురాణేతిహాసంబులనియు, నివి స్త్రీశూద్రాదులకుఁ బాఠ్యంబులగుననియు ఇవి యొకటితరువాత నొకటి ప్రమాణంబగుననియుఁ దెలియనగును. ఇవి విధించిన విధులను మానవు లేమాత్రమును మీఱఁగూడదు. మీఱి యథేష్టంబుగా సంచరించువాఁ డైహికాముష్మికసుఖదూరుం డగునని శ్రీకృష్ణుండు భారతాంతర్గతమగు భగవద్గీతయందు

శ్లో॥ యశ్శాస్త్రవిధిముత్సృజ్య । వర్తతేకామకారతః
న స సిద్ధిమవాప్నోతి । నసుఖం న పరాం గతిం
తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే । కార్యాకార్యవ్యవస్థితౌ॥

అను శ్లోకంబుల మూలమునఁ జెప్పియున్నాఁడు. ఇంక నా శ్రుతిస్మృతిసూత్రపురాణేతిహాసయథార్థభావంబులను జక్కఁగా నెఱుంగుటకై వ్యాసవశిష్ఠపరాశరశంకరాచార్య విద్యారణ్యాదిమహానుభావు లనేకగ్రంథంబులను రచించియున్నవారు. అవి చూడఁదగును. కాని యేవో రెండు కావ్యశ్లోకంబులం జదివికొని వేదాదుల కర్థంబుఁ జెప్పఁబూనఁగూడదు. చెప్పఁబూనినచోఁ బరమేశ్వరద్రోహి యగును. వేద పరమేశ్వరులకు భేదం బేమాత్రంబును లేదు. ఇట్లే సర్వగ్రంథంబులందును జెప్పంబడియున్నది. వేదవేదాంగ మీమాంసాదిశాస్త్రాధ్యయనంబు చక్కఁగాఁ గావించి

తదుక్తకార్యాచరణనిష్ఠాగరిష్ఠుండగుటయు కాక సత్సహవాసప్రవర్తనంబులు గలిగి నిర్మలంబగు మనంబుతో సంచరించు యోగ్యుండే యావేదంబున కర్థంబుఁ జెప్పుట కర్హుండు. ఇట్టివారు మనకు లభింపనితఱిఁ బూర్వోక్తగ్రంథరాజంబులనే ప్రమాణంబులనుగా గ్రైకొనవలెను. ఇట్లుచేయక కొందఱు మహర్షుల మనియు మహాత్ములమనియు నింకనేవేవియో పేరులం దగిలించుకొని బయలుదేరి యిచ్చ వచ్చినట్లు వేదాదుల కర్థంబులం దెల్పి ధర్మం బధర్మంబుగాను నధర్మంబు ధర్మంబుగాను బోధించి జగంబును జీకాకుపరచునపుడెల్ల సచ్చిదానందుండును, బ్రహ్మాండమండలనాథుండును దయాకరుండును నగు పరమేశ్వరుండు గమనించి యవతారంబుల నెత్తెదనని

> శ్లో॥ పరిత్రాణాయసాధూనాం। వినాశాయ చ దుష్కృతాం
> ధర్మసంస్థాపనార్థాయ। సంభవామి యుగేయుగే.
> యదాయదాహిధర్మస్య। గ్లానిర్భవతి భారత
> అభ్యుత్థానమధర్మస్య। తదాత్మానం సృజామ్యహం॥

అని భగవద్గీతాముఖంబున నుడివియున్నాఁడు. అట్లెత్తిన యవతారంబులు పెక్కులు. అవి యంశాంశాంశకలావేశపూర్ణ పరిపూర్ణతమావతారంబు లని యాఱు తెఱంగులుగా నున్నవని వ్యాసాదులు నిర్ధారించియున్నారు. అందు శ్రీరామకృష్ణావతారంబులు పరిపూర్ణతమంబులు. ప్రస్తుత ప్రస్తావనీయంబు శ్రీకృష్ణావతారంబు. ఇద్దానిం గూర్చి మీరు భారత భాగవత హరివంశ బ్రహ్మవైవర్తపద్మపురాణ విష్ణుపురాణాదులందును నుపనిషత్తులందును జదివి యుండవచ్చు. వాని యన్నిఁటియందు శ్రీకృష్ణచరిత్రంబు సమగ్రంబుగాఁ జెప్పఁబడియున్నదని తలంచి యుండవచ్చును. కాని బ్రహ్మమానసపుత్త్రుండును, జ్ఞాననిధియును రాధారమణనామపారాయణపరాయణుండును, దేవమౌనీంద్రుండును నగు నారదుం డట్లెంచక గర్గాచలంబునం దపంబుఁ జేసికొను శ్రీగర్గమహర్షి సమీపమునకుం బోయి "వ్యాసాదులు విడిచిపెట్టిన శ్రీకృష్ణచరిత్రంబును జక్కఁగాఁ జెప్పి రచింపుమనియు నీ గ్రంథంబే మిథిలాధినాథుండగు బహులాశ్వునకుఁ జెప్పి వాసికెఁ దెచ్చెదననియు" నుద్బోధింప నతండు ధన్యుండ నైతినంచు నెంచుచు నంగీకరించి తత్కృష్ణపవిత్రచరిత్రంబు ద్వాదశసహస్రశ్లోకపరిమితంబుగా "గర్గసంహిత" యను పేర నూత్నగ్రంథం బొందు రచించె. ఏతద్విషయం బింక నెఱుంగ నెంచువా రిద్దాని మాహాత్మ్యమునం జూడం గలరు.

గర్గసంహిత.

ఇద్దానియందు గోలోక బృందావన గిరిరాజ మాధుర్య మధురా ద్వారకా విశ్వజి ద్బలభద్ర విజ్ఞానములను నవఖండంబులు గూర్పఁబడియున్నవి. ఇందు

వ్యాసాద్యనుక్తవిషయంబులు విపులంబుగను, తదుక్తప్రధానవిషయంబులు క్లుప్తంబుగను రచింపఁబడినవి. పంద్రెండువేల శ్లోకంబు లున్నవని యీవఱకుఁ జెప్పంబడియె. ఇందు ముఖ్యంబుగా గోలోకఖండంబందలి గోపికల పూర్వచరిత్రంబులును, గంసదిగ్విజయంబును, రాధావతారవర్ణనంబును, ఉత్కచపూతనాది పూర్వజన్మవృత్తాంతంబులును, రాధాకృష్ణ వివాహమహోత్సవంబును, శ్రీకృష్ణుం జూచి దుర్వాసుండు భ్రాంతుండగుటయు బృందావనఖండంబందలి గోవర్ధనపర్వతచారిత్రంబును, యమునానదీచరిత్రంబును, వత్సబకాదిదైత్య పూర్వజన్మ వృత్తాంతంబులును, రాధాకృష్ణ ప్రీతివర్ణనంబును, గిరిరాజఖండంబందలి గోవర్ధనోత్పత్తివిభూతిపూజావిధిమాహాత్మ్యంబులును, మాధుర్యఖండంబందలి పెక్కు గోపికల చరిత్రంబులును, యమునాపంచాంగంబును, మధురాఖండంబందలి కుబ్జావాయక సుదామచాణూరాది కంసానుజాష్టక పూర్వజన్మ వృత్తాంతంబులును, ద్వారకాఖండంబందలి ద్వారకాగమన హేతునిరూపణంబును, తత్పురీతీర్థమాహాత్మ్యంబులును, ద్వారకాదుర్గప్రశంసయు, విశ్వజిత్ఖండంబందలి మరుత్తోపాఖ్యానము, మన్మథదిగ్విజయంబును, శ్రీకృష్ణపుత్రసామర్థ్యంబులును, శ్రీకృష్ణుండు పుత్రసహితుండై హిరణ్యాక్షపుత్రులగు శకుని మొదలగు రాక్షసులం జంపుటయు, వేదనగర వృత్తాంతంబును, హిమాలయప్రాంతంబున మన్మథుని సుందరి వరించుటయు, నుగ్రసేనుండు రాజసూయంబు జేయుటయు, బలభద్రఖండంబందలి దుర్యోధన ప్రాడ్విపాకసంవాదంబును, జ్యోతిష్మత్యుపాఖ్యానంబును, బలభద్రరాసలీలయు, బలభద్రపంచాంగంబును, విజ్ఞానఖండంబందలి వ్యాసోగ్రసేన సంవాదంబును మొదలగు నవి నూతన విషయంబులు, పూర్వోక్తనవఖండంబులతోడనే యీ గర్గసంహిత పరిపూర్తియైనట్లు తన్మాహాత్మ్యమునందుఁ జెప్పంబడినది. ఇవిగాక అశ్వమేధఖండంబనునది మఱియొకటి ఇందునసేకలదు. అం దుగ్రసేనుండు నారదప్రేరితుండై శ్రీకృష్ణసమ్మతిమీఁద నశ్వమేధయాగంబుఁ జేయఁబూనుటయు, ననిరుద్ధుండు దిగ్విజయంబునకై బయలుదేరుటయు లోనగు పెక్కువిషయంబులు గలవు. గర్గుం డీ ఖండంబు సంహితనంతయు రచించిన తరువాతఁ గొంతకాలంబునకు రచించిన ట్లా ఖండాదియందే చెప్పియుండుటవలన నీ సంహితాగ్రంథంబునకు నా యశ్వమేధఖండంబునకు నంతగా సంబంధములేదని తెలియుదురుగాక. ఐనను దానిని సగమువఱకుఁ దెనిగించితి.

విచారణీయాంశములు.

ఇందు శ్రీకృష్ణుండు ద్వాపరకలియుగ సంధికాలమం దవతరించినట్లు తెలియుచున్నది. ఇది భాగవతాది సర్వగ్రంథసమ్మతంబు. భాగవతాది గ్రంథంబులందుఁ జెప్పినట్లు శ్రీకృష్ణుండు జనించిన దివసంబు శ్రావణబహుళాష్టమి యని లిఖింపక భాద్రపద బహుళాష్టమియని యీ సంహితయందు గర్గమునీంద్రుండు వ్రాసియున్నాఁడు. దీనికిఁ గారణంబేమో విజ్ఞులు విమర్శించి నిర్ణయింతురుగాక.

మఱియు నిందు ద్వారకాఖండంబునం జక్రతీర్థమాహాత్మ్యసందర్భంబునందు గజేంద్రమోక్షణకథ వచ్చును. అందుఁ గరిమకరంబులకు నేఁబదియైదేండ్లుమాత్రమే పోరుజరిగినట్లు తెలియుచున్నది. ఇఁక భాగవతమందన్ననో యొక వెయ్యిసంవత్సరంబు లారెంటికి దంటపోరినట్లు వ్రాయంబడియున్నది. కాన నిదియు విమర్శకులు విచారింతురుగాక.

ఇంక నిందు నిట్టివే యీషద్భేదంబులుగల విషయంబులుగలవేమో పరిశీలించి యథార్థంబును దెల్పుదురుగాక.

వెండియు నిందుఁ జెప్పంబడు వైకుంఠలోకాదులేకాక అజితలోకము, గోలోకము, శ్రీలోకము, రమావైకుంఠాధోవైకుంఠోర్ధ్వవైకుంఠలోకంబులు మొదలగునవి మాకుఁ గ్రొత్తవిగాఁ గనుపడ వచ్చును. కాని యివి శ్రుతియందును, భారతభాగవతములందు సంగ్రహించియు బ్రహ్మవైవర్తమహాపురాణంబునందు విస్తరించియుఁ దెల్పంబడినది.

ఇందితరగాథలు పెక్కులు మనోహరంబుగానుండినను ప్రధానంబుగా శ్రీరాధాకృష్ణ గోపికా చరిత్రంబులున్నవి. కాన వీరింగూర్చి యిచ్చటఁ గొలఁదిగా వ్రాయఁదలఁచితి.

రాధ

శ్లో॥ అనయారాధ్యతేకృష్ణో । భగవాన్ హరిరీశ్వరః
లీలయా రసవాహిన్యా । తేనరాధాప్రకీర్తితా॥
శ్లో॥ రాధికాపి పరాశక్తిః । కృష్ణే చానందరూపిణీ
నిత్యా చ నిత్యసత్యస్త్రీ ।స్వాధారేపురుషోత్తమే॥ (బృహద్బ్రహ్మసంహిత.)
శ్లో॥ రమయాతురకారస్యా । దాకారేఽస్త్వాదిగోపికా
ధకారోధరయాహిస్యా । దాకారోవిరజానదీ॥

అను శ్లోకములనుబట్టియు, నీ గర్గసంహితలోని గోలోకఖండమందు శ్రీరాధాకృష్ణ వివాహంబు జరిపింపఁ బురోహితుఁడుగా వచ్చిన బ్రహ్మదేవుం డవ్వారిని స్తుతించు సందర్భమునుబట్టియు,బ్రహ్మవైవర్తమహాపురాణమందలి రాధికాఖ్యానముంబట్టియు మఱియు నితరోద్గ్రంథంబులనుబట్టియు నా దేవి పరాశక్తి యనియు త్రిగుణాత్మిక యనియు, నిత్యయనియు విష్ణ్వనపాయనియు శ్రీకృష్ణభక్తిస్వరూపిణియనియు దెలియుచున్నది. ఆజగదంబయంశంబువలననే వాణీ మంగళదేవతా సర్వమంగళ లుద్భవించిరనియు నీ జగదంబ శ్రీకృష్ణునకు దన యష్టభార్యలకంటెను, గోపికామణులకంటెను బ్రియతమయనియు "రాధాకృష్ణ" యని యుచ్చరింపవలెగాని విడదీసి పల్కఁగూడదనియు, భేదబుద్ధితో విడదీసిపల్కినవారలు రౌరవాదినరకంబులం బడుదురనియు వ్యక్తంబగుచున్నది. దీనింబట్టి యా లోకమాతనుగూర్చి సామాన్యయనియు

శ్రీకృష్ణుని యుంపుడుకత్తెయనియు వ్రాయు నజ్ఞులపలుకులు నింద్యంబులనియు నిరాకరంబులనియు మనము గట్టిగా నమ్మవచ్చును. ఇంక నీ రాధాదేవింగూర్చి తెలిసికొనందలంచినవారీ గర్గసంహితాగ్రంథంబును సమగ్రంబుగాఁ బఠింతురుగాక.

శ్రీకృష్ణుఁడు

కృష్ణశబ్దముంగూర్చి

శ్లో॥ కృషి ర్భూవాచక శ్శబ్దో। న శ్చానందవిధాయకః
సదానందసమావేశః। కృష్ణ ఇత్యభిధీయతే॥

శ్లో॥ సచ్చిదానందరూపాయ। కృష్ణాయాఽక్లిష్టకారిణే
నమో వేదాంతవేద్యాయ। బ్రహ్మణే పరమాత్మనే॥ (బృహద్బ్రహ్మసంహిత.)

శ్లో॥ సద్యఃప్రాణిపవిత్రాణి। జగతాం మంగళాని చ
కకారః కమలాకాంతః। ఋకారో రామ ఇత్యపి॥

శ్లో॥ షకారః షడ్గుణపతిః। శ్వేతద్వీపనివాసకృత్
ణకారో నారసింహోఽయ। మకారోహ్యక్షరోగ్నిభుక్

శ్లో॥ విసర్గౌ చ తథాహ్యేతౌ। నరనారాయణావృషీ
సంప్రలీనాశ్చషట్పూర్ణా। యస్మిన్ శబ్దే మహామునీ

శ్లో॥ పరిపూర్ణతమే సాక్షా। త్తేన కృష్ణః ప్రకీర్తితః
శుక్లోరక్త స్తథా పీతో। వర్ణోఽస్యాను యుగంధరః॥ (గర్గసంహిత గో.అ. ౧౫.

అని చెప్పఁబడినది. దీని యాంధ్రీకరణము జూచిన విశదము కాఁగలదు.

శ్లో॥ శేషో నాగో భవేద్రామః।కృష్ణో బ్రహ్మైవ శాశ్వతం॥ అధర్వణీకృష్ణోపనిషత్తు.

ఇట్లనే ఛాందోగ్యోపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు, గోపాలోత్తరతాపనీయోపత్తులలోఁగూడఁ జెప్పఁబడి యున్నది. ఏతత్కారణంబున శ్రీకృష్ణుండు పరాత్పరుండనియు వేదాంతవేద్యుండనియు, సర్వశక్తిసంపన్నుండనియు, పూర్ణావతారంబగు పరిపూర్ణతమావతారుఁడనియు నెఱుంగఁబడుచున్నది. కాని కొందఱు లౌకికులు గ్రంథపరామర్శ చేయక గోపికావస్త్రాపహరణ జలక్రీడా రాసక్రీడాదిస్థలములందైనను యథార్థంబును గుర్తెఱుంగక యా యోగేశ్వరుంపు చోరుండనియు, జారుండనియు, మాయలమారియనియు వారివారి ఇచ్ఛవచ్చినట్లుల్ల వ్రాయుచున్నారు. ఇది నింద్యంబు.

ఈ మహామహుండు పూర్వాధునిక స్వదేశీయ విదేశీయ పండితాఖండలుల విమర్శనంబులందు నిలిచి జగత్పూజ్యుండనియుఁ బరమేశ్వరుండనియు వాసిఁగాంచుటం బట్టి నే నెక్కువగా వ్రాయవలసిన యవసరంబు గాన్పింపదు. మఱియు వ్రాయుటకు శక్తియుఁలేదు.

గోపికలు.

"గో" అనగా నింద్రియము. ఇంద్రియంబులను వశపఱచుకొనిన వారలు గోపులనియు, గోపికలనియుఁ గాఁగలదు. అనగా జితేంద్రియులని యర్థము. ఆజితేంద్రియులే మునులు. ఈ మునులు శ్రీరామచంద్రవామనాద్యవతారంబులను బరాత్పరుం డెత్తినపుడు ప్రార్థించి వరంబులం గైకొని గోపికలుగాఁ బుట్టి తమ మనోరథంబులం దీర్చికొనియున్నవారు. కాని వారు కామాంధలగు గొల్లతలుకారు. ఈ యభిప్రాయంబును నాథర్వణీ కృష్ణోపనిషదాదులును, బ్రహ్మవైవర్తాది మహాపురాణంబులును, గర్గసంహితయందలి గోలోక బృందావన మాధుర్యఖండంబులును, బలపరచుచున్నవి. సీతారామాంజనేయసంవాదమందలి ప్రథమాశ్వాసంబులోని "సలలితేంద్రియ" అను పద్యంబుసైతము పూర్వోక్తాభిప్రాయంబునే విశదీకరించినది. కాన శ్రీరాధాకృష్ణగోపికామణులంగూర్చి మనము దెలిసికొని యున్నాము. ఇఁక

గర్గసంహితాగ్రంథకర్త

నుగూర్చి తెలిసికొనవలసియున్నది. ఈగ్రంథకర్తపేరు గర్గాచార్యులు. వీరు వేదవేదాంగపారీణులును మహర్షులును గవివరులునునై మిక్కిలి ప్రసిద్ధిఁజెందినవారు. వీరితో సమానుఁడగు జ్యోతిశ్శాస్త్రవేత్త యింతవఱకు లేఁడని బుధులు పల్కుయున్నారు. ఈ మునీంద్రుండు జ్యోతిషమునందు "గర్గసంహిత, గర్గమనోరమ" మున్నగు శబ్దంబులను, రచించియున్నాఁడు. ఈ మహామహుండు శ్రీకృష్ణచంద్రునకుఁ బురోహితుండనివచించినప్పు డాతని పూర్వపుణ్యప్రభావతపస్సామర్థ్యంబులం జెప్ప నప్ఫణీంద్రుండుసైతం బశక్తుండని నాయాశయము. కాన నీవిషయమును విడిచి దీనియాంధ్రీకరణముగూర్చి యించుక నిట ముచ్చటించుచున్నాను.

ఆంధ్రీకరణావశ్యకము.

ఇద్దానియం దితరగ్రంథంబులందులేని పెక్కు మనోహర నూతనవిషయంబులుండుట, శ్రీరాధాకృష్ణగోపికలనుగూర్చి సంశయంబులం దీర్చి సంతోషంబుగూర్చు సద్భావంబులు సెలంగుట, ఇదివరకెవ్వరు దీని నాంధ్రీకరింపకయుండుట, నవలలను నాటకములను వ్రాయువారలకుఁ గొన్ని చిత్రకథ లుండుటయు హేతువులు. దీనికి గర్గసంహితయను నామంబునకు మాఱుగా నా యాంధ్రీకరణంబునందు

గర్గభాగవతము

అని నామకరణంబు గావించినాను. ఇందు భగవచ్చరిత్రంబును, భక్తులచరిత్రంబులు నుండుటం బట్టియు సామాన్యలోకంబు "గర్గసంహిత" యను దాని కర్థంబు గ్రహింపఁజాలదనియు గర్గభాగవతం బన్నచో సులభంబుగా నందలి కథ తెలియంగఁ గలదనియుఁ దలంచి యట్లు నామంబుంచితి. ఈ భాగవతంబునందుఁ గొన్నితావుల చేర్పు మార్పులు సమయోచితంబుగాఁ గూర్పఁబడినను మాతృకాభిప్రాయంబునకు

విరుద్ధంబుగా నుండనేరదు. సంస్కృతకృతిలోని యమునా బలభద్ర సహస్రనామ స్తోత్రంబు లిందు వ్రాయఁబడలేదు. వానిని నాంధ్రీకరింపక ప్రత్యేకంబుగా ముద్రించిన బాగుగ నుండునని యెంచితి. ఆంధ్రభాషలో లేని యీ నూతనగ్రంథరాజంబు నాంధ్రీకరించుటకు గొల్లపూడి ఆంజనేయశాస్త్రిగారు తమ జీవితకాలములో నా కొసరించిన హెచ్చరికయే యని కృతజ్ఞతతో మీకుఁ దెల్పుకొనుచున్నవాఁడను. నా కవిత్వములోని గుణావగుణములు విమర్శించి నన్ను ధన్యునిగాఁ జేయ సుధీమణులగు మిమ్ములను వేఁడుచున్నవాఁడను. ఇందు ముఖ్యంబులగు తప్పులు గొన్ని సవరించి తుదిని ముద్రించితి. మిగిలినవి మీరే దిద్దుకొని క్షమింపఁ బ్రార్థితులు. ఇందునే విషయంబందునైన నెంతమాత్రమేనిఁ దోడ్పడిన బ్రహ్మశ్రీ పైడిమర్రి రామమూర్తి మొదలగు సుజనుల కందఱకును గృతజ్ఞుఁడనై భుక్తిభక్తిముక్తుల నొసంగుటకు శ్రీరాధాకృష్ణునిఁ బ్రార్థించుచున్నవాఁడను.

రెండవకూర్పున విస్తరించి వ్రాయఁదలఁచి యిప్పు డతిసంగ్రహంబుగా నీ యుపోద్ఘాతమును వ్రాసినందులకు మన్నింతురుగాక.

శా॥ ఏరొట్లన్నను దీనినిం గుఱిచి శ్రీ ♦ కృష్ణార్చనాలోలుపుల్
ధీరుల్ దీనదయాళురుఁ రసికులుఁ ♦ ధీమంతులుఁ భూమిలో
లేరే? చూడరె? మెచ్చరే? యిఁకను జా ♦ లింబొంద నాకేటికా
శ్రీరాధారమణుండు పూర్ణదయవీ ♦ క్షించుఁ గదా యెట్టులేఁ.

క॥ ఎందాఁక సూర్యుఁడుండునొ, యెందాఁక సుధాకరుండు ♦ నెసఁగునొ తారా
బృందంబెందాఁకను దివిఁ, జెందునొ యందాఁక నిది వ ♦ సించుత భువిలోఁ.

అక్షయవత్సర శ్రీరామ
నవమీ సౌమ్యవాసరము.
గుంటూరు.

భవద్విధేయుఁడు,
చివుకుల అప్పయ్యశాస్త్రి.
(సికింద్రాబాదు.)

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః

శ్రీ గర్గభాగవతమాహాత్మ్యము.

గరుడధ్వజకులగురు
నాగమసర్వార్థవేది ♦ నవ్యయమహిమున్
యోగీశవంద్యచరణుని
శ్రీగర్గాచార్యకవిని ♦ సేవింతు మదిన్. ౧

శా॥ బోధాకార్యధురీణ! మానితిలకా! ♦ పూనికన్ బురాణంబులన్
బోధింపన్ జెవులార వింటి మఘుని ♦ ర్మూలంబునుం గంటి మా
రాధామాధవసత్కథాగ్రథితగ ♦ ర్గప్రౌఢసత్సంహితా
సాధిష్ఠత్వమహత్వసత్వరచనా ♦ సామర్థ్యముల్ దెల్పవే! ౨

ఉ॥ ఈవిధి శౌనకుం డడుగ ♦ నిద్ధపురాణపరాయణుండు వే
దావళితత్త్వనిర్ణయమ ♦ హాత్ముఁడు సూతుఁడు మానిసం
భావితగర్గసంహిత ప్ర ♦ భావము నారదుచేత వింటి మున్
భావములందు నాఁటునటు ♦ బల్కెడ మీరిపు డాలకింపుఁడీ! ౩

వ॥ తొల్లి విమలంబును వివిధవిధఫలపుష్పవిరాజితంబును నగు కైలాసశిఖరంబునందు సాంద్రంబగు నొక్కవటభూరుహాధఃప్రదేశంబునఁ బ్రేక్షకమనోభిరామంబగు నొండుమండపమున యక్షరక్షస్సిద్ధసాధ్యకిన్నరకింపురుషనిషేవితుండై సహస్రప్రభల వెలుంగుచు లోకశంకరుండగు శంకరుండు సింహాసనాసీనుండగుట శర్వాణి యవలోకించి నిజమనోరథమును మనోనాయకునకు నివేదించుకొనఁదలంచి సర్వమంగళసంపన్నురాలై సమీపించి సన్నుతించి సాంజలియై యిట్లనియె. ౪

చ॥ సతతము నేదొ ధ్యానమును ♦ సల్పుదు రేలకొ? దాని నిశ్చయ
స్థితి జనికర్మమర్మములఁ ♦ జెప్పుఁడు విష్ణుసహస్రనామముల్
శ్రుతపడెఁ దొల్లి యిప్పల య ♦ శోదకిశోరుని పూతజీవితం
బతులముగా వచించుటకుఁ ♦ బ్రార్థనచేసితిఁ బ్రాణనాయకా! ౫

వ॥ అన విని శర్వుండు శర్వాణి కిట్లనియె. ౬

గీ॥ సర్వమంగళ! రాధేశు సచ్చరిత్ర, గర్గసంహిత యందునఁ గ్రాలుచుండె
ననఁగ నగజాసతీమణి తనదువిభుని, తోడఁ దిరిగియు నిట్లు మాటాడఁదొడఁగె.

చ॥ కలవుగదా పురాణములు గావ్యములున్ మఱి సంహితాదులున్
గలవుగదా త్రివేదములు గ్రాలునుగా నితిహాససంచయం
బులు నివియెల్లవీడి యొక మూలవసించెడి గర్గసంహితన్
దలఁచితి రేలకో? యది వినంగఁ గుతూహల ముప్పతిల్లెడిన్. ౮

చ॥ ఇదియునుగాక గర్గకవి యీకృతి నెవ్వరిబోధఁ జేసెనో
ముదమొదవించు శ్రీహరి య మోఘవిలాసము లెట్లు నింపెనో?
యిది వినినట్టివారు సుఖ మెట్టి ఫలంబుల నొందనుందురో?
యిదివఱకేరు దీని విని వృద్ధినిఁ జెందిరో? వీనిఁ దెల్పుఁడీ! ౯

చ॥ ఇటులఁ బ్రియావచస్సుల గిరీశుఁడు వించుఁ బ్రసన్నచిత్తుఁడై
కటువిబుధప్రకాశితస భన్ గని శీతలగోత్రపుత్రి! సం
కటహరశౌరిరాధల ప్రకర్ష మహత్త్వను గర్గసంహితో
త్కటమహిమంబుఁ బల్కెదను దత్పరతన్ వినుమా! యుమాసమా! ౧౦

వ॥ తొల్లి భగవానుఁడగు హరి స్వచరిత్రంబుఁ బ్రచురింప బ్రహ్మదేవునిచేఁ బ్రార్థితుండై భూతలంబున కరిగి యరసి రాధాదేవికిఁ జెప్పి గోలోకంబునకుఁ జన నచట ననంతునిచే వందితుండై యాతని వేఁడికోలుమీఁదఁ బవిత్రంబగు తన చరిత్రంబు సంపూర్ణంబుగా శేషున కుపదేశించె. అంత నా యనంతుం డా యనంత శయానుజీవితంబు విరించికిని విరించి ధర్మునకును, ధర్ముఁడు దనకుమారులకు నుపదేశించుచు వచ్చిరి. పిమ్మటఁ దత్కథాసుధను నరుఁడు గోలి నారాయణు నకును, నారాయణుఁడు భగవత్సేవాపరతంత్రుండగు నారదమహర్షికి నుపదేశించె. అంత నా మహర్షి త్రికాలజ్ఞుండగు గర్గాచార్యునకు భక్తినిక్షేపంబును బరమజ్ఞాన మానితంబునగు శ్రీకృష్ణచరితంబుఁ జెప్ప నా గర్గుఁ డందలి మహిమం బాలోకించి యుపదేశకుండగు నారదమహర్షిని హర్షోత్కర్ష మనస్వియగుచు సన్మానింప సంత సించి యా నారదుండు గర్గున కిట్లనియె. ౧౧

ఉ॥ దోసమొకింతలేనిదియు స్తుత్య మభీష్టద మవ్యయం బనా
యాససుఖప్రదంబు గమలాక్షపదాంబుజభక్తిదంబునై
వాసినిఁగన్న కృష్ణభగవానుని కీర్తిని సంగ్రహించి నీ
కీసమయంబునందు వచియించితి విస్తర మిద్దిసల్పుమా! ౧౨

చ॥ విరివినిసల్పినట్టియిన విశ్వమునం దిదియే ప్రసిద్ధికిన్
సరగున వచ్చునై వడిని శక్తికొలంది నొనర్తు వ్యాసుఁడీ

వరకు మదాజ్ఞచేత నల ♦ భాగవతంబును సల్పె దానిని౯
మరుగువనుంచి నీకృతియె ♦ మా బహులాశ్వునకు౯ వచించెదన్. ౧౩

చ॥ అనవుడు గర్గమౌని విన ♦ యావనతుండయి వీనులారఁగా
విని మునినాథ! మీ నుడులు ♦ విశ్వహితంబులె కాని మాకు నం
దని పటులైన మీర్కరుణఁ ♦ దాల్చితి కేని రచించెద౯ జుమీ
యనవుడు నారదుండు ముద ♦ మందెను డెందమునందుఁ బార్వతీ! ౧౪

వ॥ అంత దేవర్షియగు నారదుండు సంతోషావేశంబున వీణాతంతియుల నవరించుచు శబ్దించుచు నాడుచుఁ బాడుచు యోగీశబృందారకబృందవందితంబగు బ్రహ్మలోకంబున కరిగె. గర్గాచార్యుండును గర్గనామంబునం బరగు నొక్క యచలంబున నిశ్చలస్వాంతంబున నారదోపదేశంబున విన్నవియుఁ దాను గన్న వియు నింక నెన్నన్నియొ తెన్నుల నెన్నియున్న యా వెన్నునిమహిమంబులను, విచిత్రచరిత్రంబులను, నారదబహులాశ్వసంవాదంబును నిరూపించుచు శ్రీకృష్ణభక్తి వివర్ధనకరంబగు నొక్కశాస్త్రంబు ద్వాదశసహస్రశ్లోకపరిమితంబుగా రచించి యుండె. అంత దానికి గర్గసంహితయను నామంబు ప్రసిద్ధంబయ్యె. ౧౫

ఉ॥ ఈ కృతి విన్నమాత్రన న ♦ భీష్టములెల్ల ఫలించు నిక్కమీ
వాకున కొక్కసత్కథను ♦ బల్కెదఁ గల్కరో! వజ్రపుత్రుఁడు౯
బ్రాకటజీవితుండు ప్రతి ♦ బాహుఁడు మాలిని నాఁగ నాలితో
శ్రీకరకృష్ణపాలితపు ♦ ఠీ౯ మధుర౯ నివసించె నయ్యెడ౯. ౧౬

ఉ॥ సంతతిలేమిఁ జింతలఁ గృ ♦ శత్వమునందుచు సంతుకై తపో
వంతులకు౯ సువర్ణపశు ♦ వస్త్రధరాప్రభృతిప్రదానముల్
సాంతపనాశ్వమేధముఖ ♦ సర్వమఖంబులఁ జేసియు౯ మన
శ్చింతయొకింతయు౯ విడక ♦ చిక్కుచు నిట్లు విచార మొందెడి౯. ౧౭

మ॥ ధనమా లోపములేకపోయె నిఁక మా ♦ దాంపత్యసంబంధమా
యనుకూలంబు బలంబు నత్యధికమే ♦ యారోగ్యమా యోగ్యమే
ఘనరాజ్యంబు నయాన్వితంబు గొఱతల్ ♦ గాన్పింప వెచ్చోటఁ ద
త్తనయాభావమె భావశల్యమయి చిం ♦ తావార్ధి న౯ ముంచెడి౯. ౧౮

చ॥ పితరులు తర్పణోదకము ♦ వెగ్గలి కోష్ణముగా గ్రహించి భూ
పతిప్రతిబాహు పిమ్మటను ♦ బాలుఁ డొకండును లేకపోవుట౯
గతు లిఁక మాకు లేవనుచుఁ ♦ గన్నుల నీరునునించుచుందు రా
స్థితిఁగని యూరకుండవల ♦ సె౯ మఱి యేమియొనర్తు దైవమా! ౧౯

చ॥ తురగము లున్ననేమి బహు ♦ దుందుభిబృందము లున్ననేమి చి
త్రరథము లున్ననేమి ధన ♦ రాశులు యోధులు నున్ననేమి ధీ

వరసచివుల్ పురోహితులు ♦ బంధువులుం గవు లున్ననేమి నే
ర్పరితనమున్ననేమి యొక ♦ బాలుఁడు నాకు జనింపనప్పుడున్. ౧౦

ఉ॥ దేవమహర్షి సంతతి పి ♦ తౄణములన్నిఁటిఁ దీర్చివేయు మ
జ్జీవిక సార్థకంబని వ ♦ చింపఁగ నైహికపారమార్థిక
శ్రావితసౌఖ్యముల్ గడన ♦ సల్పితి నంచుఁదలంప స్వార్జిత
శ్రీవిభవంబు మంచిదని ♦ చెప్పఁగ నర్హుఁడు పుత్రవంతుఁడే. ౧౧

ఉ॥ వ్యాకరణంబునన్ గిరయు ♦ బాధమదంబునఁ గుంజరంబు రా
కాకువలాప్తుచేత నిశ ♦ కంజనికాయముచేఁ దటాకమున్
వ్యాకరణశ్రుతిస్మృతిన ♦ యాదివిదగ్రణులన్ సభాస్థలం
బాకస మభ్రవంక్తిని వ ♦ రాత్మజుచేఁ గులమొప్పు నెప్పుడున్. ౧౨

ఉ॥ సంతతిలేని గేహమును ♦ జన్మము వ్యర్థములౌటఁ బ్రాజ్ఞుఁ డా
సంతును వృద్ధిఁ జేసికొని ♦ సౌఖ్యములన్ గననౌనటంచు నిం
తింతనరాని చింతలను ♦ నెద్చిడి నాప్రతిబాహుభూవరుం
డంత స్వకీయమూర్ధజచ ♦ యార్జునతన్ గని యాశ వీడడిన్. ౧౩

తే॥ భార్యతోఁడుత నిట్టులఁ ♦ బ్రబలదుఃఖ, మొందుచుండిన ప్రతిబాహు ♦ నొక్కనాఁడు
మధురయందున శాండిల్య ♦ మౌని వేడ్కఁ, జూడ నేతెంచె గిరిజ! వి ♦ శుద్ధచరిత!

చ॥ మునిపతిరాక గన్గొనుచు ♦ ముందుగ లేచి నమస్కరించి య
ర్చనల ననేకముల్ సలిపి ♦ రంజిలఁజేయ మునీశ్వరుండు న
మ్మనమునఁ గౌతుకంబు గని ♦ క్ష్మాతలనాథ! కుటుంబరాష్ట్రపా
లనములఁ జక్కనుంటివె? సు ♦ లక్షణసౌఖ్యము లబ్బుచున్నవే? ౧౪

చ॥ అని యడుగంగ ఱేఁడు సక ♦ లార్థవిదగ్రణి! పూర్వజన్మసం
ప్రణిహితదోషలబ్ధనిజ ♦ బాధ యనిర్వచనీయమయ్యె నే
మని వచియింతు? రాష్ట్రమున ♦ నన్వయమందునఁ బట్టణంబునం
దున సుఖముండినట్టులుగఁ ♦ దోఁపదు మీరిది గుర్తెఱుంగరే? ౧౫

చ॥ మన ప్రతిబాహ్వనంతరము ♦ మంచిగఁ బాలనఁ జేయువాఁ డొకం
డు నిచట లేఁడటం చెదఁగ ♦ దుర్జ వెతనందుచునుండ్రు నా ప్రజల్
గనులకుఁ బండువౌ సుతుఁడు ♦ గన్పడుగా యని నాదు భార్య నే
నును బితృదేవతల్ సతము ♦ నొచ్చుచు మేమియొనర్తుఁ? జొత్తెతన్. ౧౬

ఉ॥ నాగతి యిట్టులుండె దయ ♦ నా పయిఁ గూర్చుచు దివ్యదృష్టిచే
బాగుగఁజూచి పుత్రుఁగను ♦ భాగ్యము నాకొనఁగూడఁజేయుఁడీ!
యోగికులావతంస! విన ♦ నువ్విళులూరుచు నుంటి నింక నా
[illegible] ♦ యొనంగఁ జెపుఁ డనన్ మహేశ్వరీ! ౧౭

క॥ నావుడు శాండిల్యుండును, భూవర! బహుళప్రదానముల మునుమీరల్
గావించియుంటి రందునఁ, దావకభావార్థసిద్ధి దనరక పోయెన్. ౨౯

ఉ॥ ఐన శుభప్రదంబును మ హామహిమోత్తమ ముత్కటవ్యథా
దీనహృదబ్జమిత్రమును దివ్యకథామృతపూరితంబు సం
తానఫలప్రదం బహిత దారుణమౌ నల గర్గసంహితన్
మానిని మాలినిం గలిసి మంచితనంబున నాలకింపుమా! ౩౦

చ॥ ధనమునుగోరువారలును ధర్మముఁగోరెడివారు విద్యలా
ర్జననొనరించువారు జెఱ సాలలనుండి విముక్తికోరువా
రును కులదీపకాత్మజుసు రూపముఁగాంచఁదలంచువారలీ
ఘనమగు గర్గసంహితను గర్ణములార వినంగనౌ విభూ! ౩౧

చ॥ క్రతువులు సత్రయాగములు గాశి గయా మధురా ప్రయాగతీ
ర్థతతిగమంబులన్ గలుగు ధన్యతకంటెను గర్గసంహితా
కృతి వినుటన్ లభించు కృత కృత్యత నుత్యము గాన దీనిఁ బం
డితుఁడును బామరుండును గ డించి వినందగు నెన్నిభంగులన్. ౩౨

చ॥ సతులును బిన్నపెద్దలును సర్వకులంబులవారుగూడ స
న్మతిఁ బఠియింపవచ్చును వినందగు నట్లొనరింప వారని
ర్మితియును వేళలే దిది య మేయపురాతనజన్మపుణ్యసం
తతిలభియించుఁగాని వెఱ దారులఁ జిక్కదు నిక్కమేలికా! ౩౩

ఉ॥ పాపు లవైష్ణవుల్ జగద బాంధవులున్ గురుభక్తిహీనులున్
దోపిడికాండ్రు నాస్తికులు ధూర్తులు గర్వులు గర్గసంహితా
ప్రాపణమం దనర్హు లిఁకఁ బ్రాణు లనిత్యము లౌటచేత తే
పేపని యెట్టులైనా యిపు డియ్యదివించు సుపుత్రుఁ గాంచుమా! ౩౪

చ॥ భవనము శుద్ధిసల్పి బహు వర్ణవిచిత్రితరంగవల్లులన్
బ్రవణతతోడఁ బెట్టుచు శు భప్రదమౌ కదళీవిభాసుర
ప్రవిమలమండపంబున ను పల్లవపంచకవారిపూర్ణమై
భవయుతకుంభ ముంచి గజ వక్త్రుని కర్చలఁదొల్తఁ జేయుమా! ౩౫

ఉ॥ నమ్మి నవగ్రహంబుల క నంతరమందునఁ బూజ సల్పి శ్రా
వ్యమ్మగు గర్గసంహితకు భక్తిని నర్చ లొనర్చి స్వీయదా
ర్ఢ్యమ్ముకొలంది దక్షిణగ హేమము వెండినె వక్తకిచ్చి యో
గ్యమ్మగు తద్ఘటంబున మ హామ్మగు శ్రీఫలముంచనౌ విభూ! ౩౬

ఉ॥ అంతట భక్ష్యభోజ్యపర మాన్నఘృతాధికలేహ్యచోష్యముల్
శాంతి మహానివేదనము నల్పుచుఁ దత్తులసీదళంబు ల

ర్యంతము బూజజేసియు శు ♦ భార్తిక మిచ్చి ప్రదక్షిణంబు లా
యంతిమవాసరంబున న ♦ నర్గళరీతి నొనర్పనా ప్రభూ ! ౩౭

సీ॥ పండితపుత్రుఁడై ♦ భారతకథలని, ముసలమ్మకతలను ♦ మూల్గువాని
శ్రీరంగనీతులఁ ♦ జెప్పెడు దొమ్మఱి, గుడిసెలలో దూరు ♦ కొంటెవాని
దబ్బఱ నొరులను ♦ దబ్బిబ్బు నొనరించి, లిబ్బులఁగాఁ జేయు ♦ లేకివాని
వైష్ణవుండనటంచు ♦ విష్ణుమిత్రుండైన, శివు నహర్నిశము దూ ♦ షించువాని
తే॥ కామకోపాదివైరిష ♦ ట్కంబువలనఁ, బరగువానిని హఠశఠ ♦ వాదములను
జేయువానిని వక్తగఁ ♦ జేయరాదు, గాన నందున జాగ్రత్త ♦ కాశ్యపీశ ! ౩౮

చ। హఠశఠవాదియై జనుఁ ♦ కార్తిని గూర్పఁగ గర్గసంహితా
పఠనము భంగమౌనటులఁ ♦ బల్కుఱు యత్నమొనర్చువాఁడు దా
జఠరము బ్రద్దలై మడియు ♦ సందియ మిందున లేమి నెవ్వఁడేఁ
శఠహఠహీనుఁ డౌచు గురు ♦ శౌరులభక్తిని నుండనౌ విభూ ! ౩౯

చ॥ వరమగు బ్రహ్మచర్యవిధి ♦ వర్తిలి ప్రత్యహ మేకభుక్తముఁ
జొరవగఁ జేసియేని పరి ♦ శుద్ధహవిష్యమొ కందమూలమో
పెరుగో ఫలంబొ పూరికలో ♦ పిండియొ భక్ష్యములే గ్రసించుచుఁ
ధరను బరుండి తొమ్మిదిది ♦ నంబులఁ దాఁక వినంగనౌ కథఁ. ౪౦

చ। ఎవఁడు సమస్తశాస్త్రచణుఁ ♦ డెవ్వఁడు సద్గురువంశసంభవుం
డెవఁడు కృపాకరుండు మఱి ♦ యెవ్వఁడు మాధవభక్తిపూరితుం
డెవఁ డఖిలప్రజావిశయ ♦ హింసకుఁ డెవ్వఁడు సాధుబోధనా
వివరణదక్షుఁ డెవ్వఁడు వి ♦ వేకి యతండె ప్రవక్తయయ్యెడిఁ. ౪౧

ఉ। ఉక్తవిధిఁ బ్రవక్తను ని ♦ యుక్తుని జేసినమీఁదట యథా
శక్తిగ వేఁడి బాడబులఁ ♦ జక్కని ద్వాదశవర్ణమంత్రముఁ
యుక్తజపంబు సల్పి సక ♦ లోత్కటవిఘ్నము లంతరింపఁగా
రక్తి స్వమిత్రబాధువులు ♦ రా నొనరించి గ్రహింపనౌఁ గథఁ. ౪౨

వ। అంత నయ్యాచార్యవర్యుచేఁ బ్రత్యవరోధవిహీనంబుగాఁ బ్రత్యహంబు మూఁడు జాములు గర్గసంహితను నొకఖండంబుచొప్పునఁ బ్రాగల్భ్యగళంబునఁ జెప్పింపనగు. ఈనిర్ణీతయామత్రయకాలంబున లఘుశంకాదికృత్యంబుల నిర్వర్తించి పాణిపాదముఖప్రక్షాళనంబు లాచరించుటకుఁగా నెక్కడనేనిఁ గధాంతమం దాపించి రెండుమూరులా వాచకునకు విశ్రాంతి నీయందగు. ఇట్లు సక్రమంబుగాఁ బారాయణంబుఁ జేయుంచుచుఁ దొమ్మిదవదినంబున నవమంబగు విజ్ఞానఖండంబున గర్గసంహితాగ్రంథంబు నావాహనాదిషోడశోపచారంబులఁ బూజించి పిమ్మట సాధుబోధనాచతురుండగు నబొప్పద్ధనుగూడ శ్రద్ధమెయి నర్చింపనగు. కథావిశ్రామంబైనతఱి విష్ణు

భక్తిపరాయణులగు స్త్రీపురుషజనంబులతోఁగూడఁ గాంస్యశంఖమృదంగాదిసమన్వితంబుగా నలుగడల నాట్యంబు సలుపుచు జయజయధ్వానంబులతో భగవన్నామసంకీర్తనంబు సేయందగు. అనంతరంబునం దా గర్గసంహితాకృతి స్వర్ణసింహాసనంబందుంచి సదక్షిణగా నాచార్యుని కర్పింపఁదగు. ఇట్లాచరించినవారైహికసౌఖ్యం బనుభవించి యంతిమంబున శ్రీహరిం బొందుదురు. ఇక్కలియుగంబున నిదియే చక్కని సుఖోపాయంబై యఘనిర్మూలకంబై యనంతసుఖప్రదంబై యలరారుచున్నయది. ఇట్టి గర్గసంహితాశ్రవణంబుకంటె భుక్తిముక్తిప్రదంబగు నన్యం బేమియున్నదని వినవలతునో వచింపుమని ప్రతిబాహుభూవరు నడుగ నతఁ డవనతశిరస్కుఁడై ప్రసన్నుండగుచు శాండిల్యమహర్షి కిట్లనియె. ౪౩

ఉ॥ కంటిని మిమ్ము నిమ్మెయిని ♦ గన్నులపండువగా మునీశ్వరా!
వింటిని సంహితామహిమ ♦ వీనుల విందుగఁ బాపనాశముం
గంటిని మీరు సెప్పినప్ర ♦ కారము కార్యములన్ ఘటింప నే
నుంటిని నన్ సపుత్త్రుఁగ నె ♦ టో యొనరింపు మటంచు వేఁడెదన్. ౪౪

తే॥ అంత శాండిల్యమౌనియు♦నభిమతించి, సర్వమంగళప్రదగర్గ♦సంహితాకృ
తిన్ బ్రబోధింపఁగాఁ బ్రయ♦త్నించి యమున,గట్టునన్ మండపముఁగట్టిఁ♦గ్రమవిధిని.

ఆ॥ అవల మధురయందు ♦ నమరిన జను లది
యాలకించి యచటి ♦ కరుగుదెంచి
రంత వేఁడును పర ♦ నాద్యంతముల బ్రాహ్మ
ణులకు నన్నదాన ♦ ముల నొసంగి. ౪౫

తే॥ హస్తి రథ హయ డింగరా ♦ నర్ఘ్యమణి సు
వర్ణ గో ధనరాశులఁ ♦ బరమభక్తి
నల్ల శాండిల్యముని కిడె ♦ నంత మునియు
గర్గసంహితాకృతిఁ జెప్పె ♦ కౌతుకమున. ౪౬

తే॥ ఆసమయమందె నీకుఁ బ♦ల్కాఁడినట్టి, హరిసహస్రనామంబుల♦నధికకరుణఁ
జెప్పె తేఁ డంతమున ముని♦సెప్పినటుల, భువనమోహను శ్రీకృష్ణు♦బుద్ధినిల్పి.

మ॥ మురళీగానమనోహరా! విబుధసం ♦ పూజ్యా! జగన్మోహనా!
కరుణాభూషణ! దైత్యశోషణ! జగ ♦ త్కల్యాణకృత్త్రాణ! మో
దరహాసాంచితపూర్ణచంద్రసుముఖా ♦ ధారాధరాభప్రభా!
దరచక్రాదిధరా! నగేంద్రధర! రా ♦ ధామాధవా! భూధవా! ౪౭

మ॥ అని ప్రార్థించి నమస్కృతుల్ సలుపఁగా ♦ నా దేవదేవుండు వం
శిని వేత్రంబును దాల్చి పీతపటముల్ ♦ సెల్వారగాఁ గోటిమా

రనిభుండై యనుకంపతో నగుచు నా ♦ రాధాసతింగూడి యా
తన్నిమ్రోలన్ దెసలున్ వెలుంగఁదగ నా ♦ స్థన్ నేత్రపర్వంబుగాన్. ౫౦

వ॥ ఇట్లు ప్రాదుర్భవించిన జగన్మోహనాకారుండగు శ్రీకృష్ణుని శాండిల్య మహర్షియుఁ, బ్రతిబాహుభూపతియుఁ, బట్టమహిషియగు మాలినియు గాంచి ప్రత్యుత్థానం బొనరించి నమస్కరించి యిట్లని వినుతించిరి. ౫౧

సీ॥ శ్రీవత్సలాంఛనా! ♦ శ్రీగజపోషకా!, శ్రీగళమిత్ర! చ♦క్రి! జోహారు
గోలోకనాయకా! ♦ గోపలీలాన్వితా!, వైకుంఠలీలాప్ర♦వర! జోహారు
దేవర్షి వందితా! ♦ దివ్యరూపాంచితా!, గిరిరాజపతిమనో♦హర! జోహారు
బృందావనవిహార ♦ బృందారకకదంబ, రక్షక! రాధేశ్వ♦రా! జోహారు
తే॥ నందనందన! నారాయ♦ణా! జోహారు
దానవాంతక! మానవో♦త్తమ! జోహారు
సచ్చిదానంద! యింద్రాను♦జా! జోహారు
కృష్ణ! రోచిష్ణు! జిష్ణు! హ♦రీ! జోహారు. ౫౨

ఉ॥ అంతట శ్రోతలెల్ల హరి ♦ కైదుపదుల్ బొనరించి శ్రీపతీ!
సాంతము మాదు తప్పులను ♦ జక్కఁగ మన్ననసేయుచున్ సుధీ
మంతుని వంశకర్త సుకు♦మారుఁ గుమారుని రేని కిచ్చి మా
కంతములేని బత్తి తమ ♦ యందున నుండ ననుగ్రహింపుమా! ౫౩

చ॥ గిరిజ! యిటుల్ నుతింపఁ గని ♦ కృష్ణుఁ డఖండఘనస్వరంబునన్
వరముని! పౌరులార! బహు ♦ భక్తిని నిష్ఠ మదీయవాక్యముల్
సరిగ వినుండు! గర్గకృత ♦ సంహిత కామచతుష్టయప్రదం
బరిహరణంబు విన్నఁ దమ ♦ యర్థితవాంఛ ఫలించితీరెడిన్. ౫౪

చ॥ ఎవ రెవ రెట్టికోరికల ♦ నేరియు గోరియు గర్గసంహితా
శ్రవణము నాచరించెదరొ ♦ సంశయ మింతయు లేనియట్టు ల
య్యవి యవి వారివారికిని ♦ హత్తునుగా యని కోర్కె లిచ్చి మా
ధవుఁడు నదృశ్యుఁ డయ్యెను ము♦దంబును నందరు బొందిరో యుమా! ౫౫

క॥ మునివరశాండిల్యుండును, ఘనమధురాబ్రాహ్మణులకు ♦ గౌరవపక్కిన్
ధన మిడి ప్రత్యేకముగా జననాయకు నూఱడించి ♦ చనియె మృడానీ! ౫౬

ఉ॥ మాలిని మానినీమణి స ♦ మంజసభూషణకమ్రమై విభున్
లీలల సోలి చూలు నవ ♦ లీలఁగఁ బొందియు నూతికాలమం
దోలి సుపుత్రుఁ గాంచె నిజ ♦ యుక్తకృతిప్రతతిన్ జనేశుఁడున్
మేలని యిచ్చెఁ బాఱులకు ♦ మేదిని గోగజహేమవస్త్రముల్. ౫౭

తే॥ ప్రాజ్ఞ దైవజ్ఞనాజ్ఞ సుబాహువనఁగ, నామకరణంబు సల్పి యనంతరమునఁ
బాలతోషిత మతనికిఁ గోరినట్టుల, నిడుచు సంతృప్తుఁజేసి తా నిట్లు తలఁచె. ౫౮

ఉ॥ వేసిన సత్రముల్ప్రపలు వేసిన వాపితటాకకూపముల్
జేసిన యజ్ఞయాగములు జేసిన గోధనభూమిదానముల్
జేసిన దేవపూజ ఫలియించి యొకమ్మడి సిగ్గుఁజెందు నా
కీసమయంబునన్ దనయుఁ దేర్పడ సల్పుటఁగంటి ధన్యతన్. ౫౯

క॥ ఏవంవిధముదితుండై, భూవరుఁడా గర్గమౌని బోధితగాథా
శ్రావిత సౌఖ్యములందుచు, శ్రీవిభు గోలోకమునకుఁ జివరన్ జేరెన్. ౬౦

చ॥ ధనగృహరాజ్యపుత్రసుఖ తన్వియశస్సుకృతప్రభావవా
హనపరమార్థముల్ గలుగు నట్లు రచించును గర్గసంహితా
మనన మటంచుఁ బార్వతి కుమాపతిబల్కియు మిన్నకుండుటన్
గని మును లూరకుండుటయుఁ గాంచి యపర్ణ వచించె నిట్టులన్. ౬౧

సీ॥ గంగాధరా! శౌరి గాథాసమన్విత, గర్గసంహిత బలుకంగవలయు
నావుడు శ్రీగళుఁడా విష్ణుచరితంబు, సర్వంబు వినిపించి సంతసించి
గౌరిరో! కలియందు గంగకుఁ గుడివైపు, రెండుక్రోశములం దఖండితముగఁ
బెంపువహించెడి బిల్వకేశవనానఁ, జెందిన శ్రీకర సిద్ధపీఠ

తే॥ మందు గోలోకవైష్ణవబృందసహిత, నాచు శ్రీ భాగవతసంహితాదికోశ
ములను విందువటంచుఁ దానిలుపుదలఁచు, సల్పె నీయితిహాసంబు శౌనకుండ!

చ॥ గిరిజ ప్రసన్నురాలగుచుఁ గృష్ణకథార్థిని యయ్యెఁ దత్కలిన్
సురసదియామ్యభాగమున సొంపుదలిర్చెడి సిద్ధపీఠమం
దరుసున సర్వమంగళ యటంచు వచింప సురూపమొంది శ్రీ
హరికథలన్ వినన్ జనన మందును శౌనక! మానినాయకా! ౬౩

క॥ ఇది వినిపించిన వినినను, జదివించినఁ జదువువారి సర్వార్థంబుల్
గొదకొనుఁ బాపములన్నియు, సదమదమా విష్ణుపదముఁ జక్కఁగఁ జిక్కున్.

గద్య. ఇది శ్రీ చివుకుల అప్పయ్యశాస్త్రి ప్రణీతంబును, సమ్మోహనతంత్రాం
తర్భూతంబును నగు శ్రీగర్గసంహితా మాహాత్మ్యంబు సమాప్తము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీ రాధాకృష్ణపరబ్రహ్మణే నమః

కృతజ్ఞత.

పోషకులు.

మ. రా. శ్రీ. నల్లుట్ల నరసింహారావుగారు, దేశముఖ్, మక్తేదార్, జనగాం, నైజాం.

,, మహాలక్ష్మి సుబ్బయ పుత్రుండును, వేంకటసుబ్బమ్మ భర్తయునగు చివుకుల రామకృష్ణయ్యగారు, మన్నూరు, ఒంగోలుతాలూకా.

,, మారేమండ నరసింగరావు పంతులుగారు, బి. ఏ., అసిస్టంటు ఆడిటరు, హెచ్. ఇ. హెచ్. ది నైజాము రైల్వే, శికింద్రాబాదు.

,, (పిసుపాటి వెంకటరంగయ్యగారి జ్ఞాపకార్థము) వెంకట్రాయశర్మగారు, వేదశాస్త్రాంగ్లపాఠశాలాసంస్థాపకులు, నిర్వాహకులు, ఆనరరీ బెంచిమేజస్ట్రీట్, జమ్మవరం యెస్టేటు ప్రొప్రయిటర్లు, కరవది, ఒంగోలు తాలూకా.

,, పరచ లక్ష్మమాంబానంతరామ ద్వితీయపుత్రుండగు రామేశ్వరరావుగారు, మక్తేదారు, కారేపల్లి, ఇల్లెందులపాడు తాలూకా.

,, రుమాళ్ళ కుమారస్వామి సాహుకారుగారు, శికింద్రాబాదు.

,, చీకోటి వీరన్నగారు, కంట్రాక్టర్సు అండ్ జనరల్ మర్చంట్సు, శికింద్రాబాదు.

,, బూర్గు విశ్వనాథం బ్రదర్సువారు, బ్యాంకర్సు, అండు గోల్డు మర్చంట్సు, శికింద్రాబాదు.

మ. రా. శ్రీ. జనగాం వర్తకసంఘమువారు, జనగాం.

" చిటిమెళ్ళ నరసిములుగారు, జనగాం.

" నెల్లుట్ల రామలింగుగారు, షాపురము సంస్థానము మేనేజరు, నెల్లుట్ల.

" గాదె చినకోటిరెడ్డిగారి కుమారుడు రామకోటిరెడ్డిగారు, భూస్వాములు, సరస్వతీగ్రంథాలయ ప్రతిష్ఠాపకులు అండ్ మేనేజరు, తాలూకా కోఆపరేటివ్ సూపరు వైజింగ్ యూనియన్ డైరక్టరు, కోఆపరేటివ్ సొస యిటీ ప్రెసిడెంటు, ఫారెస్టు పంచాయితీ రిజర్వు ప్రెసి డెంటు, చంద్రాజుపాలెం, సత్తెనపల్లి తాలూకా, గుంటూరుజిల్లా.

" నాగారెడ్డి దొరవారు దేశాయి (జమీందారు) యల్లారెడ్డి తాలూకా, నిజాంబాద్ జిల్లా.

ఈ యుదారశిరోమణు లీతద్గ్రంథంబునకు పోషకత్వము వహించి తగినట్లు ద్రవ్యసహాయ మొనరించి నన్ను సఫలమనోరథుని గా చేసినందులకు బ్రహ్మాండనాయకుండగు శ్రీరాధాకృష్ణుం డాయు రారోగ్య భాగ్య పుత్రపౌత్రాభివృద్ధులు కలుగునట్లు రక్షించుగాక !

ఇట్లు,

☞ గ్రంథకర్త.

శ్రీ రాధాకృష్ణపరబ్రహ్మణే నమః

శ్రీగర్గభాగవతము.

ఇష్టదేవతాస్తుతి.

లావణ్యసుధాసముద్రవిలస ♦ చ్ఛ్రీమంతు నామ్నాయవీ
థీలోకోత్తరసంచరిష్ణు విబుధ ♦ ధ్యేయాత్ము గంగాకరున్
వ్యాకేంద్రాంచితదేహు విష్ణుని బర ♦ బ్రహ్మంబు గోపాలకున్
లీలామానుషరూపు శంకరుని నే ♦ నిత్యంబు సేవించెదన్.

ఉ॥ ఐదువదుల్ బొనర్చెద న ♦ ఘావళిభేదికి నంతరాయవి
చ్ఛేదికి వేదవేదికి వి ♦ చిత్రతరోందురురాజసాదికిన్
మోదకఖాదికిన్ ద్రుహిణ ♦ భూతపతిప్రముఖప్రశంసనా
మోదికి సుప్రసాదికిఁ గు ♦ బుద్ధినిషూదికి సాధువాదికిన్॥ ౨

ఉ॥ తోయరుహాసనుండు నఘ ♦ తూలధనంజయుఁ డుత్తమశ్రుతి
ధ్యేయుఁ డనాదివేదమయుఁ ♦ డీశుఁ డుదారుఁడు ధీరుఁడున్ జగ
ద్గేయుఁడు భారతీవిభుఁడు ♦ దేవమునీంద్రనుతుండు బ్రహ్మ దీ
ర్ఘాయువు సత్కళాప్రతిభ ♦ నచ్ఛయశంబు నొసంగి ప్రోచుతన్॥ 3

చ॥ జ్వలనుఁడు పావకుండు రవి ♦ చంద్రులు వస్తునుసాధకుల్ మునీ
శు లతిథు లద్రి వంటయిలు ♦ శుద్ధసురాపగ తోయదాత్రి వే
ల్పులమొనకాఁడు కార్యపరి ♦ పూర్ణవిచారకుఁ డన్నపూర్ణ దా
నలలితగాఁగ విందుల ఘ ♦ నంబుగఁ జేయు మహేశుఁ డోముతన్. ౪

ఉ॥ శంకర! భక్తితత్పరవ ♦ శంకర! నిర్జితధర్మదూరదు
స్సంకర! సర్వలోకపృథు ♦ శంకర! దర్పకదర్పశైలనా
శంకర! జిష్ణువిష్ణుముఖ ♦ సన్నుతిపాత్రసుధాంశుశేఖరా!
సంకటరాజిఁ బాపి ననుఁ ♦ జల్లనిచూపులఁ జూడుమా! కృపన్. ౫

శా॥ బ్రహ్మా! కొల్చెద గర్గభాగవతమున్ ♦ హస్తంబునన్ బూని యాం
ధ్రమ్మున్ జెప్పు ననల్పయత్నమున నే ♦ దైవాజ్ఞచుంటిన్ సుశ

బమ్మల్ బల్కుమ! మద్రసాగ్రగతవై ♦ బ్రాహ్మీ! కృపాంభోనిధీ!
సమ్మోదావృతభారతీ! భగవతీ! ♦ సంగీతరంగస్మృతీ! ౬

శా॥ అంబా! సర్వసుపర్వనాథచతురా ♦ స్యాంభోజకాసారకా
దంబా! యంబుజకీరపుస్తకసము ♦ ద్యన్మాలికాంచత్కరా
లంబా! తుంబురునారదాదిముని సం ♦ శ్లాఘార్హవీణాకళా
లంబా! నంబర మింబుగా నిడి వచ ♦ శ్శ్లాఘ్యున్ నన్ను సల్పవే. ౭

శా॥ పూతా! నీచెయిదమ్మునున్న పటికం ♦ పున్ దాలమాలన్ నఖ
వ్రాతోస్రప్రచయప్రభిన్నమును గీ ♦ రం బాస్థగాఁ జూచి సం
జాతామోదమనోగతిన్ గరకబీ ♦ జభ్రాంతిఁ జంచూపుట
స్ఫాతిన్ లాగ నదల్చునట్టి దరహా ♦ సం బెప్డు నన్ బ్రోచుతన్. ౮

ఉ॥ దుర్గమమార్గవర్గయుత ♦ తుంగతుషారశిలోచ్చయాత్మజా!
దుర్గతదుర్గతిస్థితివి ♦ దూరకృతిప్రథితాష్టమూర్తి సం
సర్గ! విచిత్రసర్వవిధ ♦ సర్గనిదాన! సువర్ణదుర్గ! నా
కర్గళహీనసత్కవిత ♦ యబ్బునటుల్ బొనరింపుమా! దయన్. ౯

ఉ॥ రాణిని మామమామతొలి ♦ రాణిని పోషితదేవతాసుర
శ్రేణిని నారదాదిముని ♦ సేవ్యమనోహరవాణి సైకత
శ్రోణిని భృంగవేణిని ద్రి ♦ శుద్ధిగ శ్రద్ధను గొల్తు నిత్యక
ల్యాణము బచ్చతోరణము ♦ నర్థ మనారతమొంది యబ్బగాన్. ౧౦

ఉ॥ ఏకలికిన్ వరించి హరి ♦ యుద్ధనరోత్తముఁడయ్యె మన్మథుం
డేకమలాక్షికిన్ గలిగి ♦ యెల్లెడ రూపసియయ్యె దూమ్యడో
పాకరుఁడేమితోడగుట ♦ స్తవ్యసుధాకరుఁడయ్యె వార్థిర
త్నాకరమయ్యె దేనిఁగన ♦ నట్టి హరిప్రియ నన్నుఁ బ్రోచుతన్. ౧౧

సంస్కృతకవీంద్రస్తుతి.

ఉ॥ నాకనివాసినిత్యనుత ♦ నారదబోధితుఁడై కళానిధి
శ్రీకరుణాతిరేకమునఁ ♦ జిత్రకవిత్వము “మానిషాద” ను
శ్లోకముఖానఁబుట్ట రఘు ♦ శూరచరిత్రము వ్రాసినట్టి వా
ల్మీకిమహర్షి కాదికవి ♦ మిత్రులకే నొరిగల్ బొనర్చెదన్. ౧

చ॥ నవనవభావభావితము ♦ నైగమసూక్తినియుక్త మద్భుత
ప్రవిలసితంబు సత్పురుష ♦ పావనజీవితభాసితంబుఁ బా
పవిమలతాలవిత్రమును ♦ భద్రనదీనదచిత్రచిత్రితం
బు వినుతమా పురాణతతిఁ ♦ బూనిక వ్రాసిన వ్యాసుఁ గొల్చెదన్. ౨

చ. కవనము జాహ్నవీఝరము ♦ కైవడిఁ జాలి నుతింతు గర్గునిన్
గవివరకాళిదాసుని జ ♦ గద్గురుశంకరు బాణ దండి భా
రవి జయదేవ శూద్రక ధ ♦ రావిభు భోజుల రాజశేఖరున్
గవిభవభూతి మల్హణునిఁ ♦ గల్హణ బిల్హణ జల్హణాదులన్. ౩

ఆంధ్రమహాకవి ప్రార్థనము.

ఉ. మోదముతోడ మ్రొక్కెదను ♦ ముద్గలగోత్రజు నన్నయార్యు మా
వైదికవంశదీపకు న ♦ పారతపఃఫలధన్యు నష్టభా
షాదయితున్ సుమత్యమర ♦ సద్గురునిన్ నిగమార్థవేది నాం
ధ్రాదికవీంద్రు భారత మ ♦ హాగమసత్కృతిసంవిధానునిన్. ౧

ఉ. కక్కురితిన్ బదంబులను ♦ గైకొనకుండఁ దెనుంగు బాసలోఁ
జిక్కిన శబ్దజాలము సు ♦ శీలురు మెచ్చఁగ సేకరించి పే
రెక్కిన భారతంబు పదు ♦ నేనుకృతుల్ రచియించి కైతకున్
దిక్కన వన్నెకెక్కు కవి ♦ తిక్కన కేను నమస్కరించెదన్. ౨

ఉ. కన్నులనీరు నీరధిగఁ ♦ గాఱ్చు సరస్వతిఁ గాంచి "యమ్మరో
బన్నపడంగనేల"యని ♦ భాగవతాహ్వయకోశరాజమా
పన్నదయాళురామునికి ♦ భక్తిని నంకితమిచ్చి యామె యా
పన్నతఁ బాపినట్టి కవి ♦ బమ్మెరపోతన కేను మ్రొక్కెదన్. ౩

మ. వినుతింతున్ ఘనశంభుదాసకవినిన్ ♦ భీమన్న సోమన్నఁ గే
తన శ్రీనాథుని మారనాఖ్యుఁ గవితా ♦ ధన్యాత్ముఁ బెద్దన్నఁ ది
మ్మన సూరన్నల రామరాజకవినిన్ ♦ మల్లన్న శ్రీకృష్ణరా
యనరేంద్రున్ మఱిఁ బ్రస్తుతాంధ్రకవితా ♦ వ్యాపారపారీణులన్. ౪

కవివంశానుక్రమణిక.

తే. దేవదేవ! రాధాకృష్ణ! ♦ యీవసుధను, నీకుఁ దెలియని దె ♦ య్యది నీరజాక్ష!
యైన నాచరితంబు నీ ♦ వవధరింపు, మాత్మనుతియని మెచ్చక ♦ యబ్జనాథ! ౧

సీ. విద్వదగ్రణియు భా ♦ రద్వాజగోత్రుండు, నారాయణాఖ్యుండు ♦ నాదు తాత
గీతాధ్యయనకృతి ♦ పూతచరితుఁడైన, కామయ్యసూరి నా ♦ కన్నతండ్రి
సకలసాధ్వీమణీ ♦ సంస్తవమెంతయు, గనిన కోటమ్మ నా ♦ కన్నతల్లి
విధిగుండికాతట ♦ ప్రథితమౌ నందిపాడ్గ్రామోత్తమంబు నా ♦ కన్నచోటు

తే. చిపురులయని గృహాఖ్యయుఁ ♦ జెలఁగు కృష్ణ!, నిద్ది ననుఁగని యైదేడు ♦ లేగువఱకుఁ
బెంచినట్టివారల కుల ♦ వృత్తమింక, దత్తుఁగైకొన్నవారి వృ ♦ త్తాంతము విను.

సీ॥ చివుకుల కులవార్ధి ♦ శీతకరాప్పయ, నామకబుధుఁడు పి ♦ తామహుండు
స్కంధత్రయాత్మక ♦ జ్యోతిషధీర సుబ్రహ్మణ్య విబుధుండు ♦ వరజనకుఁడు
దానధర్మప్రియా ♦ నూనాచరణరత, యైన లక్ష్మిదేవి ♦ యమలజనని
ధరఁ జిత్రపూరు సీ ♦ తారామనామక, వ్యాకరణజ్ఞుండు ♦ వరగురుండు
తే॥ గోత్ర మరయ భారద్వాజ ♦ గోత్రమె సుమి, వాసమెన్నఁగ హైదరా ♦ బాదునరిస
రాంచితంబును ధార్మిక ♦ ప్రాంచితంబు, పరమునైన శికిందరా ♦ బాదుపురము.
తే॥ పిదప నన్బెంచుకొని బహు ♦ ప్రీతిఁ గనెడి
లక్ష్మిదేవమ్మ దయతోడ ♦ లలితరీతిఁ
పెరిగి ప్రాక్తనార్జితపుణ్య ♦ విధిని ధనము
విద్దె బుద్ధియు యశమబ్బఁ ♦ దద్దనుంటి. ౪
ఆ॥ తత్పురంబునందు ♦ ధారాకులోద్భవ, నన్నపూర్ణఁ బెండ్లి ♦ యాడియుంటి
నద్ది గొంతకాల ♦ మగుడు గౌరినిఁ గొల్వ, దివికిఁ గదలిచేర ♦ తిరిగి నేను. ౫
క॥ ఇంగొలు వెంకటసుబ్బయ, వెంకమ్మల మనుమరాలు ♦ వినుతచరితయౌన్
వెంకట అప్పయ రుక్మిణి, పంకజనేత్రలకు బిడ్డ ♦ వరయగు దుర్గన్. ౬
తే॥ ప్రీతిఁ జేపట్టియుంటిని ♦ వేదవిధిగ, రాధికాకృష్ణకరుణచే ♦ రమణిమాకు
పుత్రుఁడొక్కఁడు మాకిప్డు ♦ పుట్టియుండె, నవని వాఁడు సుబ్రహ్మణ్యుఁ ♦ డనఁగ నెగడు.
సీ॥ వ్రాసితి గద్యలో ♦ బాలనీతియనంగ, భారతకథలతోఁ ♦ బరగుకృతిని
నాంధ్రీకరించితి ♦ నాదిశంకరకృత, నరసింహనుతి ధ ♦ న్యతఘటిల్ల
గావించితిన్ దెల్గు ♦ గాళిదాసరఘాంగ, దూతకావ్యంబు సం ♦ తోషమొదవ
విరచించియుంటిని ♦ వేంకటేశ్వర సువి, జ్ఞప్తి లోకస్థితి ♦ సరిగఁ దెలియ
తే॥ మఱియు వర్ణవ్యవస్థ సా ♦ మంజసవిధి, వ్రాసియుంటి రజస్వలా ♦ పరిణయదృఢ
ఖండనకృతి రచించితిఁ ♦ గాంచి బుధులు, బళిర! యనిమెచ్చ శ్రీకృష్ణ! ♦ పరమపురుష!
ఆ॥ ఇట్టినేను దొలుత ♦ నిష్టదేవాచార్య, జనకనుకవినుతుల ♦ సల్పి నాభ
వంబు సార్థకముగ ♦ భక్తితో నీ కంకి, తముగఁ గృతిరచింపఁ ♦ దలఁచినతఱి. ౭

ప్రకృతకృతిప్రశంస.

సీ॥ నిత్యమై మానిసం ♦ స్తుత్యమై శ్రీకృష్ణ, నుత్యసద్వృత్తనా ♦ న్నత్య మగుచు
గేయమై పండిత ♦ జ్ఞేయమై సజ్జన, ధ్యేయమై దీనాళి ♦ దేయమగుచు
స్వాద్యమై విరచిత ♦ పద్యమై యదువీర, విద్యానవద్యతా ♦ హృద్యమగుచు
శ్రావ్యమై విబుధసం ♦ సేవ్యమై నవరస, భావ్యమై ముఖ్యస ♦ త్కావ్యమగుచు

తే॥ వేదతుల్యంబునయి జగ♦ద్విదితమగుచు, గర్గమునికృతమైనట్టి♦గర్గసంహి
తాహ్వాయేతిహాసము దెల్గు♦నందు లేక, తెలుఁగ సంస్కృతమం దని♦చెవికి సోఁక.

తే॥ జనకుఁ డాత్మజుఁ గైకొని♦సర్వకళల, శోభ జెందెడి చంద్రునిఁ♦జూపఁజూచి
జనక! యదిదెమ్ము తెమ్మని♦యనెడిబాలు, భావమును బోలు చిత్రభా♦వంబుతోడ.

మ॥ కని యా కబ్బముఁ దెల్గుసేయ మదిలోఁ ♦ గౌతూహలం బొంది భ
క్తిని వాణీకృపఁగోరి తోఁచినటులన్ ♦ దెల్గింప నేనుంటిఁ గా
వున నీవీకృతియందునిల్చి దయఁ ద ♦ ప్పుల్ వాపి యొప్పుల్ సదా
తనరం జేయ నమస్కరించెదను రా ♦ ధాకృష్ణ! కృష్ణప్రియా! 3

శ్రీగర్గభాగవత కృతిపతి.

శ్రీరాధాకృష్ణులు.

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః.

శ్రీ గర్గభాగవతము

గోలోకఖండము.

శ్రీరమణీ మనోహరవి ♦ శేషమనోజ్ఞపదారవిందముల్
శారదఫుల్లపద్మరుచి ♦ సామ్యములన్ మునిభృంగజుష్టముల్
నీరజవజ్రచిహ్నముఖ ♦ నిస్తులముల్ హృతభక్తతాపముల్
భూరివికారనూపురవి ♦ భూషితముల్ మదిలోనఁ జేర్చెదన్.

చ॥ ఎవనిముఖాంబుజంబున వ ♦ రేక్షురసాధికరుచ్యమాద్యమున్
దివిజమనోజ్ఞమై వెడలు ♦ దివ్యసుధన్ గడుపారఁ గ్రోలి సం
స్తవము బుధుల్ వొనర్తురల ♦ సాత్యవతేయుఁడు విష్ణురూపుఁడున్
బ్రవిమల బాదరాశ్రమని ♦ వాసుఁడు నాకృతి దిద్ది ప్రోవుతన్. ౨

శ్రీ గర్గాచార్యుండు నైమిశారణ్యమున కేతెంచుట.

క॥ ఒండొకవేళను యోగా, గ్ర్యుండతితేజస్వి, జ్ఞాని ♦ కులతిలకుఁడు గ
ర్గుండల నైమిశవనమున, నుండెడి శౌనకునిజూడ ♦ నొగినేతెంచెన్. 3

తే॥ శౌనకుండును వచ్చిన ♦ శాంతిదాంతి, సంతతానంద భరితుఁడు ♦ సర్వవిదుఁడు
నైన మునివరుఁగని లేచి ♦ యధికభక్తి, నర్చలన్ సల్పి మునియుక్తుఁ ♦ డగుచు మ్రొక్కె.

చ॥ అలఘుచరిత్ర! మాయెడకు ♦ నక్కటికంబున మీరు వచ్చుటల్
సులభమె? యార్యచర్య! గృహి ♦ శోకముమాన్పదె! ధ్వాంతమూడ్చు త
మ్ముల చెలికంటిలోని పరి ♦ పూర్ణతమంబును బాపదే! యహా!
పలుకఁగఁ జాల నిందలిప్ర ♦ భావములెల్ల మునీంద్రచంద్రమా! ౫

వ॥ పండిత ప్రకాండులు బహుభంగుల వర్ణించుచుండు బ్రహ్మాండ నాయకావతారంబులంగూర్చి నాసందేహంబులు దీరునట్లుగా విశదీకరింపుఁడని సవినయంబుగా, సానందంబుగా నడుగ సంతసించి యా గర్గాచార్యుం డతని కిట్లనియె. ౬

ఉ॥ ఓ యమలాత్మ! వింటె నిపు ♦ డుత్తమ తద్భగవత్ప్రశంసనున్
బాయక యిద్ది శ్రోతలకు ♦ వాచక పృచ్ఛక లేఖకాళికిన్
శ్రేయముగూర్చు నిందులకు ♦ జెప్పెద నే నితిహాస మొందు నే
దేయెడ విన్నమాత్రమున ♦ నెల్లయఘంబులఁ బాపఁ జాలునో. ౭

❧ బహులాశ్వుఁడు నారదమునిని సత్కరించి ప్రశ్నించుట. ❧

చ॥ తొలుతఁ బ్రతాపవంతుఁడు వి ♦ ఖ్యాతమదుండును గృష్ణభక్తిస
ల్లలితుఁడు శాంతమూర్తి బహు ♦ లాశ్వుఁడు నా మిథిలాధినాయకుం
డలరు నతండు పుష్కరస ♦ మాగతనారదమౌనిఁ గాంచి పూ
జల నొనరించి పీఠము నొ ♦ సంగి కృతాంజలియై ము నిట్లనెన్. ౮

చ॥ ప్రకృతిపరుం డనాది భగ ♦ వంతుఁడు పూరుషుఁడున్ మహాత్ముఁడున్
సకలహృదంతరస్థుఁడయి ♦ సన్నుతి నొందినవాఁడు పాంచభౌ
తికతను వొందె నెందుల కు ♦ దీర్ణచరిత్ర! దయాపయోనిధీ
సకలము దెల్పుమా యనఁగ ♦ సమ్మతి నారదుఁ డిట్లు సెప్పెడిన్. ౯

❧ నారదుండు బహులాశ్వునకుఁ బరమాత్మావతారంబులంగూర్చి తెలుపుట. ❧

చ॥ నటుఁడు స్వలీల మోహము గ ♦ నం జనఁ డన్యుఁడ నంచు నెంచఁబోఁ
డటులఁ బరాత్పరుండు స్వక ♦ ళాతిశయమ్మున వేదసాధుగో
పటలధరామరావన మ ♦ వారిగఁ గోరుచు జన్మమెత్తు ను
త్కట మది లాతివారు గని ♦ తల్లడ మొందుదు రయ్య భూవరా! ౧౦

చ॥ అనవుడు మేదినీశుఁడు మ ♦ హాముని! సజ్జనరక్షణార్థమై
నెనరున నెన్నిమాఱు లటు ♦ నీరజలోచనుఁ డెత్తె జన్మముల్
వినఁ దొర నుంటిఁ గాన దయ ♦ వీనులవిందుగఁ దెల్పవన్న నా
జనకున కబ్జయోనిజుఁడు ♦ సక్క వచింపఁ గడంగె నిట్టులన్. ౧౧

వ॥ శ్రీహరి సాధుసంరక్షణార్థంబై యెత్తిన యవతారంబు లంశంబులనియు, నంశాంశంబులనియు, నావేశంబులనియుఁ, గళలనియుఁ, బూర్ణంబులనియుఁ, బూర్ణతమంబులనియు నాఱు తెఱంగులుగానుండునని యింతకుమున్నె వ్యాసాదులు నిర్ధారించియుండిరి. ఆయవతారంబు లెత్తినవా రెవరెవరన? అంశములవలన బ్రహ్మాదులును, నంశాంశములవలన మరీచ్యాదులును, నావేశములవలన భార్గవాదులును, గళలవలనఁగపిలకూర్మాదులును, బూర్ణమువలన శ్రీనృసింహుండును, శ్వేతద్వీపాధిపతియగు హరియు, వైకుంఠుండును, యజ్ఞుండును, నరనారాయణులును, బూర్ణతమమువలన సకలభువననాయకుండై యత్యుత్కృష్టధామంబగు గోలోకంబున విరాజిల్లు శ్రీకృష్ణుండు నుద్భవిల్లిరని చెప్పంబడు. కార్యాధికారు లంశావతారులనియుఁ, దత్కార్యాధికారుల యాజ్ఞలకుఁ లోఁబడి తోడ్పడువా రంశాంశావతారులనియుఁ, బర

మాత్మ పెఱవారి యంతఃకరణంబులం జొచ్చి యగణ్యంబులును, మాన్యగణ్యంబులునునగు పుణ్యకర్మంబుల నిర్వర్తింపఁ జేసి నిర్గమించినవాఁ డావేశావతారుం డనియుఁ, బ్రతియుగంబున ధర్మచ్యుతి యగుచున్నప్పుడెల్ల నారసి తద్ధర్మం బుద్ధరించి చనినవాఁడు కళావతారుండనియుఁ, జతుర్వ్యక్తులును, నవరసములును, బహుబలంబులును గలకార్యంబు లెవనియందు శోభిల్లుచుండునో యట్టివాఁడు పూర్ణావతారుం డనియు, సర్వచరాచర తేజోరాశి దేదీప్యమానంబగు స్వతేజంబునం గలియ వెలుంగునో యట్టి పరంధాముండు పరిపూర్ణతమావతారుండనియు నెఱుంగునది.

క॥ అరయఁగ శ్రీకృష్ణుండే, పరిపూర్ణతముండు లాఁతి ♦ వారలు గారా
హరి యొక కార్యము సేయఁగఁ, దరుదెంచి యనేకకృతుల ♦ నక్కజఁ జేసెన్. ౧౩

చ॥ ఎవఁడు పరాత్పరుండొ పురు ♦ షేశ్వరుఁ డెవ్వఁడొ పూర్ణుఁ డెవ్వఁడో
యెవఁడు పురాణుఁడో మఱిఁ బ ♦ రేశుఁ డెవం డలవాని నాస్వయం
భువు సలసద్గుణాకరు న ♦ మూల్యకృపాకరు నామహాత్ము నా
ప్రవిమలు నాపరాత్పరుని ♦ భక్తిఁ గడున్ శరణంబు వేడెదన్. ౧౪

ఉ॥ శౌనక ! తేఁడు నారదవ ♦ చస్సుల నిట్టుల వించు మోదబా
ష్పావిలతాక్షముల్ దుడిచి ♦ యాముని కిట్లను శ్రీరమేశుఁడ
న్న్యూనతమావతారమును ♦ నొందుట లెందుల కట్టి ద్వారకా
ఖ్యానగరంబునన్ భరత ♦ ఖండమునన్ విలసిల్లు టేలకో. ౧౫

ఉ॥ ఆకమలాక్షుఁ డెట్లొ యిల ♦ కాగతుఁ డయ్యెను గాక వాని గో
లోకచమత్కృతుల్ సుజన ♦ లోకహితార్భకబాలలీల లయ్యాసం
ఖ్యాకములైన కార్యములు ♦ గౌరవభాజన జీవితంబు నీ
నాకు వినన్ బ్రియం బలరు ♦ నారద ! చెప్పుము తప్పకుండఁగాన్. ౧౬

ఆ॥ నూరుపుట్టువులను ♦ భూరిపుణ్యక్షేత్ర, పర్యటనతపముల ♦ భక్తి సలుపు
మానవుండు సుజన ♦ మైత్రిని బొందెడిఁ, నతఁడె ముక్తికర్హుఁ ♦ డగును దలఁప.

ఉ॥ ఎన్నఁడు బోసికొందుఁ జెవిఁ ♦ గృష్ణకథామృతచారుధార లిం
కెన్నడు జూతునో సురము ♦ నీశ్వరబాడబముర్ల బాధ్య నిం
కెన్న డొనర్తునో సరసి ♦ జేక్షణదాసపదాబ్జసేవ నిం
కెన్నడు బాయునో కలుష ♦ వృద్ధినిబద్ధమదీయపద్ధతుల్. ౧౭

వ॥ అని నానావిధంబుల నువ్విళ్ళూరు నాజనకాపరనామక బహులాశ్వ రాజేంద్రుంగని నారద మునీంద్రుం డిట్లనియె. ౧౮

ఉ॥ ఇష్టుఁడు భక్తవత్సలుఁడు ♦ కృష్ణుఁడు నీకిట దర్శనంబిడన్
గష్టమటంచు నెంచక సు ♦ [illegible]

భీష్మముదీరు ధన్యతయు ♦ వే ఘటియించును విప్రదేవుఁడున్
విష్టపనాథుఁడైన హరి ♦ విశ్రుతు నిన్నుఁదలంచు ద్వారకన్. ౨౦

ఉ॥ భూవరవర్య! మీ సుకృత ♦ ముల్ బహుళంబులు గావె యెవ్వరే
నీవిధి యాపరాత్పరుని ♦ యెన్నిక కందిరె? యమ్మచెల్ల! యే
మీ! విబుధాళిభాగ్యదశ ♦ యెన్నట ధాతకు వాని తాత కా
శీవిమనాయకాగ్రణికిఁ ♦ జెల్లునె? యెన్నటికేనిఁ జాగురే. ౨౧

ఉ॥ వాకునుబొందియున్ బ్రణుతి ♦ పాత్రుఁ బవిత్రచరిత్రుఁ గృష్ణునిన్
వాకొనఁడేనిఁ దన్నరుఁడు ♦ పాత్రమునం దిడియున్న యన్నమున్
జేకొనవట్టి వానివలె ♦ సిద్ధముజేసిన ముక్తినిచ్చెనన్
గైకొని యెక్కనట్టిజను ♦ కైవడి వీటిడిమ్మె నశించెడిన్. ౨౨

చ॥ క్రమముగ మాధవాగమన ♦ కారణ మాడెద నీవరాహక
ల్పమునను తొల్లిఁ గాశ్యపి, ఖ ♦ లప్రభుదానవదైత్యనారభా
రము దలఁదాల్పలేమిని శ ♦ రణ్యములేమిని గుంది గోస్వరూ
ప మమర దేహమున్ వణఁక ♦ బ్రహ్మసమీపము జేరి భక్తితో. ౨౩

చ॥ కని వినుతించి మ్రొక్కు లిడఁ ♦ గంజజుఁ డాయమ నాదరించి యే
మని యిటు లిందుఁ జొచ్చితివో ♦ యద్ది వచింపుమ భూసతీమణీ!
యనవుడు తద్వసుంధర క ♦ రాంబుజముల్ ముకుళించి గద్గద
స్వనమున దాను బొందు బహు ♦ బాధలఁ జక్కఁగ విన్నవించుడున్. ౨౪

చ॥ విని యతఁ డమ్మరో! వగవు ♦ వీఁడుము శక్తికొలంది సాయమే
నొనరుతునమ్మ! రమ్మని సు ♦ ధోదనపంక్తి సమేతుఁడై త్రిలో
చను సహకారిగాఁ గొనుచుఁ ♦ జక్రి గృహంబును భక్తసన్నుతం
బును ననవద్య మవ్యయము ♦ ముక్తిద మొంది తదంతరంబునన్. ౨౫

చ॥ సిరిచెలినిన్ జతుర్భుజు సు ♦ శీలుని గాంచి నమస్కరించి రా
కరహిని విన్నవింప విని ♦ కంజదళాక్షుఁడు భీతధాత్రిశం
కరముఖదేవరాజిఁ దమ ♦ కంబునఁ గన్గొని యూఱడించి ఖే
చరవరులార! నానుడులు ♦ శాంతముతో విని యాచరింపుఁడీ. ౨౬

మ॥ గణనాతీత విలాసలోలుభుని సా ♦ క్షాత్సర్వసంపూర్ణునిన్
బ్రణవాకారు స్వయంభుపుర్ణ్ భృతబహు ♦ బ్రహ్మాండు శ్రీకృష్ణునిన్
దృణరీతిన్ గని వీడినన్ బనులు య ♦ క్కించిత్తు గావందునన్
బ్రణుతంబున్ విశదంబునవ్యయము ద ♦ త్స్వామిస్థలం బొందుఁడీ. ౨౭

వ॥ అనవిని సర్వసుపర్వపరివృతుండగు విరించనుండు విష్ణుపున కిట్లనియె. ౨౮

శా॥ స్వామీ! మీరలుగాక యన్యవిభుల • స్మద్దృష్టిలో లేర? యే
మేమీ! మిమ్ముగలమించు పూర్ణతముఁ డు • న్నే? యున్న నవ్వానిదా
ధామం బెచ్చట? నెట్టివాతని చరి • త్రల్ ప్రేమతోఁ దెల్పఁగా
మేమిమ్మున్మదిఁ నుతించుచుంటి మన ల • క్ష్మీనాయకుం డయ్యెడన్. ౨౯

బ్రహ్మదేవుండు దేవవాసుదేవసహితంబుగా గోలోకంబున కేగుట.

వ॥ బృందారక బృందపరివృతుండగు శతానందున కానందంబు ఘటిల్ల సకలబ్రహ్మాండశిఖరంబున కూర్ధ్వభాగంబున విలసిల్లు తద్గోలోకమార్గంబు జూపించి, శౌరి దురాసద్వీరించి గాంచి మేలు మేలని మెంచి తలపంకించి యా తెన్నున నడచుచు శ్రీవామనపాదపద్మప్రదేశినీనఖంబున విభిన్నంబైన బ్రహ్మాండాగ్రభాగంబును, బ్రహ్మారసమయంబునగు బిలంబునందు జలద్వారమార్గంబునుండి బయలు వెడలు సురానీకంబును, నధోభాగంబునఁ గూఁకటిమూఁగయును పక్కవలెఁ జక్కనై వెల్గు భూనభోగోళాదికంబును, మఱియు నజ్జలంబునం దింద్రాయనఫలంబులకరణి నిటులటులఁ దొరలుచుండు లెక్కకుఁ జిక్కని బ్రహ్మాండంబులను గాంచి భీతులైన వారిరీతిని విస్మితులగుచుఁ గోటికోటలంది యోజనంబులదాటి యట ధర్మవినిర్మితంబులగు రమ్యహర్మ్యంబులతోడను, నభేద్యంబులగు ప్రాకారంబులతోడను, నూత్నంబులగు రత్నంబులతోడను, సాంద్రంబులగు భూరుహంబులతోడను, విరాజిల్లు నెనిమిది పట్టణంబులం జొచ్చి యచ్చమెచ్చి యవి గడవఁ జని మున్దట. 30

గోలోకవర్ణనము.

సీ॥ హార నీహారసాం • ద్రాట్టహాసైరావణక్షీరధవళవ • ర్ణంబుతోడ
స్నానాగతప్రజా • సంఘసంరక్షణోద్గతకరనిభతరం • గములతోడ
జ్వరకఫవాతాది • సకలరోగనివార, కస్వచ్ఛరుచ్యోద • కంబుతోడ
ధగధగద్ధగిత ర • త్నప్రభాసంతాన, బంధురసోపాన • పటలితోడ
తే॥ సకలకళ్యాణసూచక • శకుని మధుర, కలకలంబులతోడుతఁ • జెలఁగుచుండు
విరజయనునది దరిఁజేరి • వింతలెన్నొ, నయనపర్వముగాఁగని • నడచి నవల. 31

తే॥ కోటిసూర్యనిభంబు న • కుంఠితంబు, నగుమహాల్లోకమును బొంది • యాస్థలములు
మిఱులు గాఁగని హరియాజ్ఞ • సరసిజజుఁడు, దన్మహామున్ మ్రొక్కి వినుతించె • దానిలోన.

శా॥ శాంతాకారమనోహరంబు బుధసం • స్తవ్యంబు ధామంబు ని
శ్చింతన్ గన్గొని దానియందున మహా • శేషున్ సహస్రాస్యు శ్రీ
మంతున్ దీర్ఘ మృణాలతుల్యధవళున్ • మాంద్య స్వలోకించి ధీ
మంతుల్ ధాతృముఖాది నిర్జరులసా • మాన్యంబుగా మ్రొక్కుచున్. 33

సీ॥ సకలచరాచర • సంభవస్థితిలయ, హేతుభూతులమంచి • యిక్కయెద్ది
స్వర్గాదినాయక • శక్రాదిదిక్పతి, కామప్రదంబైన • ధామమెద్ది

వారాంబుపర్ణాశ ♦ నాతీతసంసార, మునిరాజ హృద్గమ్య ♦ మూలమెద్ది
మాయామనోబుద్ధి ♦ మమకారచిత్తమ, హత్తత్త్వవికృతి సం ♦ హారమెద్ది
తే॥ యఖిలమాన్యుల కీశ్వరుం ♦ డనఁగ నెద్ది, లోకనుతమయ్యె నద్దిగో♦లోకమనఁగఁ
జెల్లుచుండు మహాలోక♦మల్ల శేషు, పృథుతరోత్సంగమందు వీ♦క్షించి మఱియు.
మ॥ అరరే! యిట్టిహిరణ్యరత్నమయ గే ♦ హద్వారబంధంబు ల
య్యారె! యీరుచ్యజలాన్వితహ్రదములా ♦ హా! యీయదృచ్ఛావిహా
రరహస్థానము లౌర! యీమణిగణ ♦ ప్రాప్తోరుపణ్యంబుల
ద్దిర! యీగోవ్రజసంపదల్ వనము లీ ♦ ధీరుల్ ప్రశంస్యుల్ బళీ. ౩౫
చ॥ ఇటుల నుతించి వేల్పులుర ♦ హిన్ మొగసాలను జేరునంతలో
జటులవిలాసమన్మథులు ♦ శ్యామశరీరులు కృష్ణపార్షదుల్
దటుకున వచ్చి నిల్వఁడు కు ♦ తంత్రము మానుఁడు మానుడుల్ వినుం
డిటుల మముల్ శరించి యెట ♦ కేగఁదలంచితి రిరలియ్యెడన్. ౩౬
ఉ॥ ఎవ్వరు మీరు! మీదు కుల ♦ మెయ్యది? యెట్టిది మీచరిత్ర? మీ
రివ్విధిఁ జైనముల్ సలుప ♦ నేమిగతం బెది మీప్రదేశ మీ
దవ్వుననుండు గోపదవి ♦ దండకువచ్చుట కేమి కారణం
బావ్వనో? వీనికుత్తరము ♦ లొయ్యన మాకిడి లోనికేగుఁడీ. ౩౭
ఉ॥ నావుడు దేవతల్ విని ఘు ♦ సప్రతిభోన్నతులార! మాదియా
దేవకులంబు నాకము స్వ ♦ దేశము వీరలు బ్రహ్మవిష్ణు దు
ర్గావిభులేము వాసవ ము ♦ ఖత్రిదివేశుల మెుందుకోర్కితో
శ్రీవనమాలి దర్శనము ♦ సేయఁగవచ్చితిమయ్య నావుడున్. ౩౮
ఉ॥ మానులు ద్వారపాలకులు ♦ మాధవపార్షదు లాసిలింప వా
ర్తానివహం బెఱింగియుఁ బ ♦ రంబగు నంతిపురంబు సొచ్చి గో
స్థానవిభున్ గుఱించి సుర ♦ సంగతిఁదెల్పఁ దదాజ్ఞనొందు చం
ద్రానన, రమ్యపీతపరి ♦ ధానము వేత్రము దాల్చిపెల్చునన్. ౩౯
ఉ॥ వచ్చి వియచ్చరుల్ గని కృ ♦ పామతి నిట్లనె వేల్పులార! మీ
రెచ్చటనుండి నిచ్చటికి ♦ నెంచుఁ గాగతులైతి రింక మీ
యిచ్చను నచ్చులేక చెపుఁ ♦ డేద్రుహిణాండ వినేతలయ్య వా
క్రుచ్చుఁడు ముచ్చటించెద ము ♦ కుందున కన్నఁ దదాదితేయులున్. ౪౦
ఉ॥ అండము లెన్నియుండినవొ ♦ యయ్యవి యెవ్వొ యెఱుంగ మొందు బ్ర
హ్మాండ మిదే యెఱుఁగుదు మ ♦ హా భవదుత్కృచయంబు చిత్రమై
యుండెడి నండ మన్య మిఁక ♦ నుండ దటంచు వచింతు మమ్మ! యో
యండజయాన చంద్రిముఖి! ♦ యంచు సురల్ నుడువంగ నామెయున్. ౪౧

శా॥ ధాతా! యండము లెందుఁ గోట్లకొలఁదిన్ ♦ దైవాఱు నిద్దానినే
భాతిన్ మీరు మెలంగుచుం ద్రటు ప్రతి ♦ బ్రహ్మాండమందున్ సుర
వ్రాతం బుండును వేఱువేఱుగ నిజ ♦ గ్రామాభిధానంబులన్
జాతిన్ దెల్పఁగలేక స్థాణుగతి నీ ♦ చాయన్ జనం దెవ్వఁడున్. ౪౨

ఉ॥ దోమలు మేడిపండులను ♦ దొల్లుచు నన్యమెఱుంగజాలన
ట్లేమియు నొక్కయండమున ♦ యీర లెఱింగి వసింత్రు కాని యిం
కేమియు గుర్తెఱుంగరుగ ♦ యిట్లు గృహంబును వీడకుందు రే
మీమతిపోయెనో ముదిమి ♦ మేకొనెనో యిది మంచిరీతియో. ౪౩

చ॥ అని యుపహాస్యమున్ సలుప ♦ నాయమరు ల్వివి మానమూనుటన్
గని హరి, వారి భీతులుగ ♦ గాంచి యిటు ల్వచియించె భూవరా!
ఘనుఁడగు బృశ్నిగర్భుఁ డటఁ ♦ గ్రాలెనొ యెద్ది త్రివిక్రమావతా
రనఖరభిన్నమా నల వ ♦ రస్థలినుంచుము మందయానరో. ౪౪

ఉ॥ ఈవిధి నిందిరావిభుఁడు ♦ హృద్యముగాఁ బలుకంగ నల్గ రా
జీవదళాక్షి విం చతనిఁ ♦ జేరి నుతించియు లోని కేగి రా
ధావిభునాజ్ఞ గొంచుఁ ద్వరి ♦ తంబుగ గ్రమ్మఱ వచ్చి యట్టి లే
ఖావళి కద్ది దెల్పి చన ♦ నాత్రిదశుల్ జని రయ్యె లోనికిన్. ౪౫

ఉ॥ నాకులు గాంచి రంతట న ♦ నశ్వరకల్పలతాప్రకృష్టగో
లోకము ధూతదేవరిపు ♦ లోకము వర్ధితరాధికాధవా
లోక మధఃకృతత్రిదశ ♦ లోకము రక్షితగోపగోపికా
లోకము నాకమున్ విహిత ♦ లోక సుగమ్యమనోజ్ఞలోకమున్. ౪౬

వ॥ వెండియు.

శా॥ సౌందర్యోజ్జ్వలితశుల్ త్రిమూర్తిముఖు ల ♦ స్వప్నుల్ విలోకించి రా
నందస్యంది విదూరదేశభవర ♦ త్నస్నిగ్ధసోపాన స
త్సందోహాన్వితతీరభాసుర, యదృ ♦ చ్ఛాయానవిభ్రాజితన్
బృందిష్టోర్మిమనోహరన్ వరనదిన్ ♦ గృష్ణన్ గళిందాత్మజన్. ౪౭

మ॥ వరబృందావనపట్టనోన్నతదశల్ ♦ వాసంతలక్ష్మీ విలా
స రుచుల్ చిత్రపతత్రినైకవిధసు ♦ శ్రావ్యస్వనంబుల్ మనో
హరరంభావట నారికేళఖదిరా ♦ మ్రాదిద్రుమంబుల్ మహా
త్తరగోవర్ధనపర్వతంబుగని యా ♦ ధామంబునన్ వేడ్కతో. ౪౮

ఉ॥ కాంచిరి సౌధవీథులను ♦ గాంచిరి భాసురరాసమండలుల్
గాంచిరి నూత్నరత్నకన ♦ కద్యుతిరాజితచంద్రశాలలన్

గాంచిరి పేయతోయ పరి ♦ కల్పితకూప తటాకఖాతముల్
గాంచి రథేద్యవప్రపరి ♦ ఖావరణచ్ఛదికూటముల్ మఱిన్. ౪౯

చ॥ పులినములందు మందగతి ♦ భూషితశీతలవాతపోతము
ల్లలిత ఘుమాయమాన కమ ♦ లప్రకరస్థపరాగ సౌరభం
బులఁ బలుమాఱుఁ దాలిచి య ♦ మోఘవిధంబున వీవఁగా సుఖం
బులఁ గనుచుండు వారి గని ♦ మోదము జెంది రమర్త్యులంతటన్. ౫౦

శా॥ ప్రాకారాజిరథేయరాజత పృథు ♦ ద్వాత్రింశద్దారామరా
ధాకీర్ణం బరుణాశ్మయోచ్ఛ్రబహుసా ♦ ద్వ్యాప్తంబు సప్తప్రకా
రాకల్పోజ్జ్వలపద్మరాగసహితం ♦ బబ్జోపమా కుంజ మా
లోకించెన్ సురలోకమెల్ల నల గో ♦ లోకంబునన్ బిమ్మటన్. ౫౧

క॥ మిక్కిలి చక్కని కాంతుల, నిక్కెడి సిడుకెక్కియముల ♦ నెక్కొని కడు మ
త్తెక్కిన శుకపికబర్హుల, వాక్కులుగల పూలయిండ్ల ♦ బాటలుగనియెన్. ౫౨

ఉ॥ శారదకోటి పూర్ణశశి ♦ సామ్యమనోజ్ఞలు దారహారమం
జీరలలంతికాంగద వి ♦ చిత్రశిరోమణి బాలసూర్యవి
స్ఫారిత కర్ణికాంచితలు ♦ భామిను లామణి చత్వరాళి శృం
గారిత వస్త్రముల్ గనుచు ♦ గంతులవేయుట జూచి యంతటన్. ౫౩

సీ॥ సింగారముంగాఱు ♦ బంగారు రంగారు, శృంగాలఁజాలవె ♦ లుంగునవియు
హారహీర పటీర ♦ శారదతారేశ, గౌరాద్రి ధవళిమ ♦ మీఱునవియు
బాపాలచాలును ♦ దాపాలమోలినిఁ, గూలుఁపజాలు పా ♦ ల్గారెలు నవియు
జన్నారి పొన్నారి ♦ శింజినీ కింకిణీ, ఘంటాది భూషలు ♦ గలుగు నవియు

తే॥ శోభనాకారములచేత ♦ సొంపుజెందు, నవియుఁ బీతపుచ్ఛములచే♦నలరునవియు
గుణవయశ్శీలములచేతఁ ♦ గొమరుమిగిలి, నవియు నాథేనుతతులట♦నమరుచుంట.

చ॥ నలుపునఁ గొన్నియావు లరు ♦ ణంబునఁ గొన్నియు ధూమ్రమందుఁ గో
కిలరుచిఁ గొన్ని తామ్రపు జి ♦ గిన్ మఱికొన్ని హరిద్రఁ గొన్నియున్
జెలఁగుచు లేడిపిల్లవలెఁ ♦ జెచ్చెర దాట్లిడు లేగలొంది తో
ద్యాలుల కరాంకముల్ గలిగి ♦ యంబుధి నోలెఁ బయస్సు లిచ్చుటల్. ౫౫

తే॥ మఱియు గోగణములయంద ♦ మందగతిని, నిడుపుగొంతులఁ గొమ్ములనీటుగల్గి
ధర్మభారంబు ప్రోయుచుఁ♦దద్దనిటులఁ, నటులఁదిరుగాడు నాఁబోతు♦లచటఁ గనిరి.

ఉ॥ ఈహాను పేత్రవంశుల ధ ♦ రించితదంబుజనేత్ర సామ్య స
మ్మోహనులైన గోపకులు ♦ మోహనరాగ గణంబునన్ జగ
న్మోహన కృష్ణలీలల వి ♦ నోదముగాఁ గొనియాడి ధేనుసం
దోహము గాచుటన్ గనిరి ♦ దోషవిదూరులు వేల్పులో విభూ. ౫౭

తే॥ ఇటు నికుంజంబు విబుధులీ♦క్షించి మ్రొక్కి, దానిలోనికిఁ జని బహు♦తైజసము స
హస్రపత్త్రాంచితంబును ♦ నైన యంబు, జంబుజూచి తదూర్ధ్వభా♦గంబునందు.

ఆ॥ తనరు షోడశదళ ♦ ఘనవనజంబును, గన్నులారఁ గాంచి ♦ కౌతుకంబు
బొంది దానిమీఁదఁ ♦ బాలుపారునష్టప, త్త్రియుత దివ్యతామ ♦ రసముపైన.

ఉ॥ కౌస్తుభశోభితంబులు న ♦ ఖండములద్భుతకాంతికాంతముల్
ప్రస్తుతమానినుత్యములు ♦ ప్రాక్తనపాపవినాశకంబులున్
నిస్తులముల్ బరంబులును ♦ నిర్మలమౌ నిడు మూడుమెట్లతో
శస్తిని బొందు గద్దియను ♦ జక్కఁగఁగన్గొని దానియందునన్. ౬౦

సీ॥ ఒకవంక నకలంక ♦ వికచాంబుజేక్షణ, శ్రీదామముఖగోప ♦ సేవలలర
నొకచాయ మోహినీ ♦ యువతీ ప్రభృత్యష్ట, మహిళలువ్యజన చా♦మరలవీవ
నొకదండఁ బండిత ♦ ప్రకరంబు "లోంస్వస్తి" యనివేదలపితంబు ♦ లనుబఠింప
నొకదెసఁ బార్షదు ♦ లుజ్జ్వలయష్టులన్, ధరియించి వే బరా ♦ బరులు సేయ,

తే॥ వెండియొండెడ నితరాండ ♦ వృత్తమంత, విన్నవింపఁగవచ్చిన ♦ విభులువెలుఁగఁ
గోటిచంద్రోపమచ్ఛత్త్ర ♦ కోటులుపరి, భాగమందునఁ బూజ్యులు ♦ బట్టియుండ.

సీ॥ నీలమేఘశరీరు ♦ నీరజలోచను, నిఖిలాండనాయకు ♦ నిత్యు నుత్యు
మకుటకుండలహార ♦ మాణవకావాప, కోర్మికాశృంఖలా ♦ యుక్తు శక్తు
శ్రీవత్సలాంఛను ♦ స్మితపూర్వభాషిని, శ్రీనివాసునిఁ బీత ♦ చేలు బాలు
నాజానుబాహునిఁ ♦ దేజోవిరాజితు, గమలనాభుని వంశ ♦ కలితు లలితు,

తే॥ దత్తు స్వచ్ఛందకుంచిత ♦ దక్షిణాంఘ్రి, కలితు సవిధస్థరాధికా ♦ లలితవామ
బాహువేష్టితనిజగాత్రుఁ ♦ బద్మనేత్రుఁ, గనిరి నేత్రపర్వంబుగా ♦ జనకరాజ.

మ॥ కని యానందసముద్రమగ్నమగు లో ♦ కవ్యూహముంబోలెఁ దా
మునుహర్షాంబుసమేతనేత్రులగుచున్ ♦ మూర్ధంబుతో లేఖులా
ఘను బృందావనభాసురున్ నరహరిన్ ♦ గారుణ్య రత్నాకరున్
వినుతుల్ జేసి నమస్కృతుల్ సలిపిరో ♦ పృథ్వీపతీ! నావుడున్. ౬౩

క॥ అయ్యా! దేవతలట్టుల, నయ్యంబుజనాభుఁగాంచి ♦ యామీఁదన్ వా
రెయ్యది సల్పిరొ కరుణను, నియ్యెడ వచియింపమిమ్ము ♦ నేనర్థింతున్. ౬౪

వ॥ అని యడుగంగ నారదుండా జనకనరేంద్రున కిట్లనియె. ౬౫

శా॥ కంతేకాలహిరణ్యగర్భముఖలే ♦ ఖప్రష్ఠులీక్షింప వై
కుంఠుం డష్టభుజోజ్జ్వలద్ధరి, జగ ♦ త్కోటీశ కృష్ణాకృతిన్
కుంతస్తోమము భీతినిం గనఁగ సు ♦ శ్లోకుల్ ముదంబంద ని
ష్కుంఠీభూతము లీవమయ్యె మఱి యో ♦ క్షోణీన్నుతాఘ్ర్యంబుజా. ౬౬

తే॥ కోటిసూర్య నిభుండు న♦కుంఠితబలుఁ, డమలచరితుండు నధికద♦యామయుండు
నగు నృసింహుండు సనుదెంచి ♦ యట్టికృష్ణు, లోన నిశ్శేషరీతిని ♦ లీనమయ్యె.

వ॥ వెండియు సహస్రభుజపరిశోభితుండై సిరినిగూడి నిజాయుధంబులఁ ధరించి పార్షదసహితంబుగా లక్షాశ్వంబులఁ బూన్చిన తెల్లని తేరునెక్కి చనుదెంచిన వాఁడును, శ్వేతద్వీపాధిపతియునగు శ్రీహరియు, నసంఖ్యాకంబులగు వానరానీకంబులు సుట్టుముట్టి కొలువ భరతలక్ష్మణశత్రుఘ్నులను భ్రాతృవరుల తోడంగూడి సీతాసహితుండై దశకోటిసూర్యప్రతీకాశంబులగు చామరంబుల తోడను, లక్షధ్వజంబులతోడను, లక్షచక్రంబులతోడను, లక్షోత్తుంగతురంగంబుల తోడను, మేలిమిబంగారున వెలుంగు కలశంబులతోడను, విరాజిల్లు దివ్యరథంబెక్కి విల్లమ్ములందాల్చిన పూర్ణావతారుండును, బుండరీకాక్షుండును నగు శ్రీరామ చంద్రుండును, ప్రలయకాలాభీలంబులగు నగ్నిశిఖలవలె జాజ్వల్యమానంబగు దేహంబుగలవాఁడును, దక్షిణానామసతీసమేతుండును, సురేశ్వరుండును, జ్యోతిర్మయరథారోహకుండును నగు యజ్ఞుండును, విద్యుల్లతావిద్యోతితంబులగు జటాజూటంబులుగలవాఁడును, చతుర్భుజుండును, వ్యూఢోరస్కుండును, మునివేషధారియు మునిజనవినుతుండును, నగు నరనారాయణుండును, ననువీర లపార తేజఃపుంజంబున రంజిల్లువాఁడును, నీలమేఘశరీరుండు నగు నా శ్రీకృష్ణుని దివ్యతేజంబున లీనంబగుట నమరులువీక్షించి యాతనిఁ బూర్ణతమావతారుండనియు, ననన్యసామాన్యుండనియు గుర్తెఱింగి హర్షభయాశ్చర్యబద్ధబుద్ధులై కేలుమోడ్పు లనుసంధించుచు నిట్లు వినుతించిరి.

బ్రహ్మాదిదేవతలు శ్రీకృష్ణుని స్తుతించుట.

శా॥ రాధానాథుఁ మహానుభావుఁ బరిపూ ♦ ర్ణస్వామినిన్ యజ్ఞునిన్
గోధామేశు స్వయంభువున్ బరమునిన్ ♦ గోవర్ధనాద్రీశ్వరున్
సాధువ్రాతమునీంద్రపోషణరతున్ ♦ సత్యున్ మహాత్మున్ సమ
స్తాధారాద్యునిఁ గృష్ణు మొక్కెదము సా ♦ ష్టాంగంబుగా భక్తితో. ౧౯

చ॥ సతిసుతబాంధవప్రభృతి ♦ సర్వుల వీడి జలానిలాశన
వ్రతులయి కాననంబులఁ బ్ర ♦ వర్తిలుచున్ దపమాచరించు యో
గితతి నినున్ మహాత్మునిగఁ ♦ గీర్తన సేయును భక్తపంక్తి సా
కృతిగఁ దలంచు మేము నుతి ♦ యింతు మనన్యమహాపరాత్మగా. ౨౦

చ॥ ఘను లనుమానహేతువుల ♦ గాని ప్రయుక్తులగాని స్ఫోటవా
దనియతిగాని యింకొక ప ♦ థంబునఁగాని యొకప్పుడేని ని
న్ననుఁగొనఁ జాలకుండిరి స ♦ నాతనుఁ గారణకారణున్ నిరం
జనుఁ బరు నిర్వికారుని వె ♦ సన్ శరణం బిడఁ గొల్తు మియ్యెడన్. ౨౧

ఉ॥ కొందఱు కర్మరూపమని ♦ కొందఱు యోగమటంచు వెండియుఁ
గొందఱు కాలమంచు మఱిఁ ♦ గొందఱు బ్రహ్మమటంచుఁ గర్తయం
చందురు కొందఱీనుడుల ♦ కందని సర్వజగత్ప్రతీకఁ నిన్నుఁ
జెందితి మిత్తఱిఁ శరణుఁ; ♦ జెందితి మందఱమేము హర్షముఁ. ౭౨

చ॥ ఎవరు శుభంబు లిచ్చు నమ ♦ రేడిఁక తావక పాదపద్మయు
గ్మవిహితసేవలఁ విడిచి ♦ కాశి గయా ముఖతీర్థయాత్రలఁ
సవనతపః ప్రదానముల ♦ సల్పుదురో యలవారు విజ్ఞతా
వ్యవహితులై కృతార్థతను ♦ నందరుగా శుభగోకులేశ్వరా. ౭౩

చ॥ సకలమనోవిహారివయు ♦ సర్వజగచ్ఛలదర్థసాక్షివై
సకలనిలింపయోగికుల ♦ సన్నుత రూపుఁడవై పరాత్మవై
ప్రకటితరీతి నీవిట వి ♦ రాజిలుచుండఁగ నల్పబుద్ధులఁ
వికటులమైన మేమొక ప్ర ♦ వృత్తి మెదల్పఁగలారమే ప్రభూ! ౭౪

శా॥ శ్రీ రాధాలలనాలలామహృదయ ♦ శ్రీచంద్రహారోజ్జ్వలా
మారాకారవిరాజమాన మహితా ♦ మానాయకా! గోపికా
చారుప్రేక్షణజీవహారరుచిరా ♦ సత్యస్వరూపా! విప
ద్భారాపన్నుల మమ్ము నెమ్మిఁగనరా ♦ వా? దేవ! రక్షింపవా! ౭౫

ఉ॥ గోపితతిప్రభూ! చతుర ♦ గోపకవేషవిహారలీల! బృం
దావనపాలకా! నిగమ ♦ ధర్మనిదాన! దయాపయోనిధీ!
గ్రావవిభూ! యరంబునను ♦ కష్టములఁ గడుఁగుందు నీయిలా
దేవిని ధర్మధారిణి ను ♦ దీర్ణచరిత్రను జూచి కావుమా. ౭౬

క॥ ఈకరణిని సురలందఱు, శ్రీకృష్ణుని వేడ రమ్య ♦ జీమూతోక్తిఁ
గోకులనాథుండాహరి, నాకులఁ గని యిట్లు పలికె ♦ నరవరవినుతా. ౭౭

శ్రీకృష్ణుండు దేవతలకు చితోక్తులాడుట.

ఉ॥ వింటిని మీచరిత్రము వి ♦ వేచన జేసి వచించుచుంటి నీ
వెంటనె పోయి మీసతులు ♦ వెన్కొన యాదవవంశమందు ని
ష్కంటకులై జనింపుఁడది ♦ గన్గొని మీకృతిఁదీర్ప భూవ్యథల్
గెంటఁగ నేను బుట్టెదను ♦ గీర్తితయద్యదువంశమందునఁ. ౭౮

ఉ॥ నావచనంబులే శ్రుతులు ♦ నాదు ముఖంబు ధరామరోత్కరం
బావులు నాశరీరము మ ♦ హాత్ములు సాధులు నాదుప్రాణముల్
దేవతలైన మీరలును ♦ దివ్యమదంగము లయ్యలార! యో
దేవతలార! యేగుఁడటు ♦ దీర్చుడు సేయుఁడు సెప్పినట్టులన్. ౭౯

చ॥ క్రతువుల జాతిరీతులను ♦ గారుణికత్వము, ధర్మపద్ధతుల్
హాతమొనరించు దుర్మతుల ♦ నంతము జేయఁగ శిష్టసంఘము
న్నతిఁ గనఁజేయ ధర్మము ఘ ♦ నంబుగ నిల్పుటకున్ స్వయంబుగాఁ
బ్రబలియుగమందుఁ బుట్టెదను ♦ బంతము దాల్చి నింకఁ బెల్చసన్. ౮౦

ఉ॥ ఇట్టులఁ బల్కు స్వేశు జగ ♦ దీశుఁగనుంగొను రాధ! యూపిరుల్
గిట్టెడి మాడ్కి దావమునఁ ♦ గీడులు మూడిన శీఁగవోలె ని
ట్టిట్టనరాని గోడొదవ ♦ నీక్షణ యుగ్మమునందు వెచ్చనీ
రుట్టిపడంగ మేనుగగు ♦ రొందఁగ మూర్ఛితయౌచు నిట్లనెన్. ౮౧

❧ శ్రీ రాధాకృష్ణ సంవాదము. ❧

ఉ॥ ప్రాణపతీ! యిలాభరముఁ ♦ బాపఁగఁ బుట్టెదనంచు దేవతా
శ్రేణికిఁ జెప్పియుంటి వది ♦ సెల్లును నాగతిఁ గూర్చి లేశమీ
వాణినిఁ బల్కరైతిరిది ♦ భర్తల కృత్యమె? మిమ్ముఁబాసి నా
ప్రాణము లుండఁజాలవని ♦ బాగుగ నమ్ముఁడు నెమ్మనమ్మునన్. ౮౨

ఉ॥ ఇత్తఱి నాదు భావము న ♦ చించితి లక్ష్యము సేయకుండ మీ
చిత్తము వచ్చినట్టుల ని ♦ సీ! యసరోయుచుఁ బోవునప్పు మ
చ్చిత్తగతాశయంబు మఱిఁ ♦ జెప్పెద మీయెడబాటునన్ గడున్
దత్తఱమొందు నాయొడలు ♦ దగ్లును గప్పుర మింకున ట్లనన్. ౮౩

శా॥ ఆర్యా! యెంతటి మాటలాడితివె? ని ♦ న్నా! వీడి నేనేగుటల్
ధైర్యంబున్విడకుండ నానుడులు దా ♦ త్పర్యంబుతో విన్మ నీ
కార్యంబుల్ నెఱవేర్తు భూభరముఁ బో ♦ కార్తున్ వ్యథన్ మానుమా
"భార్యామూల మిదం గృహ"మ్మనెడిపూ ♦ ర్వన్యాయ మాలింపవే. ౮౪

వ॥ అని శ్రీకృష్ణుండు వలుక విని రాధాదేవి క్రిమ్మఱ నతని కిట్లనియె. ౮౫

మ॥ ఎట నానందకరావనీరుహాలస ♦ ద్బృందావనంబుండదో
యెట గోవర్ధనశైలముల్ జెలఁగదో ♦ యెచ్చోట నానామహో
త్కటభైషజ్యజలప్రయుక్తయమునా ♦ ధారల్ బ్రివర్తిల్లవో
యట కేరానుగ వచ్చినన్ సుఖమునా ♦ కావంతయున్ లేదుగా. ౮౬

చ॥ అనియన నాలకించి హరి ♦ యాస్థను స్వస్థలినుండి దివ్యమా
నెనుబదినాల్గు క్రోసులను ♦ నింపగు భూమిని గోపవర్ధనం
బను గిరినిన్ గళిందజను ♦ నంపి సతిన్ దనుపంగ, బ్రహ్మయున్
గని పలుమాఱు మ్రొక్కి నయ ♦ గారముగాఁ బలుకాడె నిట్టులన్. ౮౭

ఉ॥ దిక్కెది లేనివారలకు ♦ దిక్కగ నెక్కొని యున్న శ్రీహరీ!
యెక్కడనట్టిపేరుమ వ ♦ హించి జనింతువా నీవు? కొండియే

నెక్కడ యాయమర్త్యులట • నెట్టి యభిఖ్యలఁ బుట్టనో నీ
విక్కృతిఁ జక్కఁగాఁ దెలుపు • మీ యన నక్కమలాత్మఁ డిట్లనెన్. ౮౮

మ॥ పరమేష్ఠీ! చెవియొగ్గి సావధిగ నా • వాక్యంబు లాలింపు మేఁ
బరిపూర్ణంబుగ దేవకీరమణికిన్ • బ్రాదుర్భవింతున్ సతీ
వరయౌ రోహిణి యందుఁ నాకళయె యు • త్పన్నంబగున్ బిమ్మట
న్సిరియున్ రుక్మిణి నాగ భీష్మనికి జ • న్మించున్ జుమీ వెండియున్. ౮౯

చ॥ ధరణియు సత్యభామయగు • దక్షిణ లక్ష్మణ సత్య బృందయున్
విరజ కళిందజానదియు • వ్రీడయు భద్రయు దోష నాశకృ
త్సురనది మిత్రవిందయు వి • శుద్ధమృడానియు జాంబవంతు కూఁ
తురుగ జనింతు రింక నల • తోయ్యలు లందఱు నాతుగ ల్గెడిన్. ౯౦

తే॥ తొలుత రుక్మిణి మరుఁడు ప్ర • ద్యుమ్నుఁడనఁగ, నవతరించును నిరుద్ధుఁ • డనఁగ నతని
కవతరింతువు నీవిందు • నటమటల ను, జెందవలదింక వినుము నేఁ • జెప్పినుడులు.

వ॥ సుచంద్రనామకుండు వృషభాను నామంబుతోఁ బుట్టి కళావతీ నామాంతరకీర్తిసతీమతల్లికను వరించి యామెయందు రాధ యను పేరం బరగు పరమేశ్వరింగనఁగలండు. ద్రోణుండను వసువును నందుండన జన్మించి భూదేవియగు యశోదను బెండ్లాడి విరాజిల్లు. ౯౧

ఉ॥ ఆసమయంబునందు శిర • మందునఁ బింఛము లల్లలాడ సా
వాసము సేయు గోపికలు • భక్తిని రక్తియు క్తవేషలై
వాసిగ జుట్టుముట్ట ఘను • భాతిని మేను వెలుంగఁ బీతస
ద్వాసముగట్టి గోష్ఠమున • వంశినిఁ బాడుచొనర్తు రాసముల్. ౯౩

సీ॥ నాళీకసంభవా! • నావ్రజమందునఁ, గలిగెడి సంగతు • ల్గాంచవయ్య
నందునిగేమున • సుందర శ్రీదాముఁ, డనువాఁడు ప్రియుఁడయి • యలరునయ్య
యుపనందగృహములు • నూర్జితయశుఁడగు, సుబలుఁడు సఖుఁడయి • ప్రబలునయ్య
నవనందగృహముల • నరకేశవాంశజ, స్తోకనామకుఁడు మి • త్రుఁడగునయ్య

తే॥ మఱియు షడ్వృషభాను స • ద్మంబులందు, సఖులుగానుంద్రు ప్రస్థతే • జస్విదేవు
లును విశాలవరూథపు • లును ఋషభుఁడు, ననెడివారలు సర్వక • ళ్యాణయుతులు.

చ॥ అనవుడు హర్షమొంది విధి, • యత్తఱిఁ గమ్మని నిట్లు పల్కెనో
యి నిఖిలవేదదైవతము • తీ! వృషభానుఁ డెవండొ నందుఁడే
యనఘుఁడొ వారిలక్షణము • నానవనందుల వారి లక్షణం
బును నుపనంద లక్షణముఁ • బూర్తిగఁ జెప్పఁగ మిమ్ము వేడెదన్. ౯౪

వ॥ అనవుడు భగవంతుండు సంతోషించి యెవఁడు తొమ్మిదిలక్షల యావు లకు విభుండగునో వాఁడు నందుండనియు నైదులక్షల గోవులకధిపతియైన వాఁడు పనందుండనియు, బదిలక్షల ధేనువులకుఁ బ్రభుండైనవాఁడు వృషభానుండనియు, గోటిసురభుల కధినాథుండైనవాఁడు నందరాజనియు, నేఁబదిలక్షల నైచికులకు విభుండైనవాఁడు వృషభానువరుండనియుఁ జెప్పంబడు. సుచంద్రద్రోణులను నిరువురుమాత్రమే గోపరాజులుగా నావ్రజమందు జనింపఁగలరనియు, శరరాకా సుధాకరధవళిమఁ బురణించు శుభ్రవస్త్రంబులందాల్చి యగణ్యలావణ్య తారుణ్య సంపన్నలై విలసిల్లు గోపవిలాసినుల శతయూథంబులు ప్రవర్తిల్లగలవనియు గుర్తెఱుంగుమన నాలించి యవ్విరించి శ్రీకృష్ణున కిట్లనియె. ౯౭

తే॥ భువనకారణకారణ! ♦ పుణ్యపురుష!, దీనరక్షక! దేవ! యో ♦ దేవదేవ
డెందమందునఁ గరుణను ♦ బొందుపరచి, యూథలక్షణమెఱిఁగింపు♦మోపరేశ.

సే॥ అనఁగ వెన్నుఁడు పూర్తిగా ♦ నవధరించి, యంబుజాసన! పదికోటు♦లర్బుదమగు
నట్టి పదియర్బుదంబులై♦యగును యూథ, మిటులఁబల్కె-రిసర్వము♦నింద్రులయ్య.

వ॥ అందునఁ గొందఱుమందయానలుబృందావనపాలికలుగను, గొందఱు మద్ద్వారపాలికలుగను, గొందఱు పార్షదలుగను, గొందఱు శయ్యోపకారిణులు గను, గొందఱుసుందరులు కుంజనికుంజపుంజ బు నిర్మించువారుగను, గొందఱు గోలోకవాసినులుగను, గొందఱు గోవర్ధనంబుననుండువారుగను, గొందఱు శృంగారకారిణులుగను, గొందఱు మానులయొక్కయు యోగులయొక్కయు, నాశ్రమంబుల నివసించువారుగను నుందురని యెఱుగుము. ౯౯

మ॥ మఱి గంగా, మధుమాధవీ, సులలితా, ♦ మాయా, విశాఖా, రమా,
విరజా, శ్రీయమునా, హ్వయాష్టవర సా ♦ ధ్వీషోడశౌఘంబుల
ద్దిర! మేల్మేలన నేత్రపర్వమగు ద్వా ♦ త్రింశత్సఖీయూథము
ల్వెలిలంగాఁగలవట్టి నావ్రజమునన్ ♦ బ్రాహ్మీపతీ! వెండియున్. ౧౦౦

వ॥ శ్రుతిరూపలయు, మునిరూపలయు, యజ్ఞసీతారూపలయు బుళిందాంగ నలయు, నయోధ్యావాసినులయు, మైథిలలయు, గోసలలయు, వెండియుఁ దొల్లియుగం బుల నాచే నెవరెవరు వరంబులం జెందియుండిరో యవ్వారలయు యూథంబులు బ్రవర్తిల్లగలవని యెఱుంగు మన నాతమ్మిచూలి తమ్మికంటి కిట్లనియె. ౧౦౧

తే॥ విశ్వకారణకారణ! ♦ వీరలెల్ల, రేమిపుణ్యమొనర్చిరో ♦ యెట్టివరము
లొందిరో దుర్లభంబు నా ♦ నందకరము,నైన మీవ్రజమందెటు ♦ నమరగలరొ.

వ॥ విశదీకరింపుమని వేద మాధవుండు వాణీధవున కిట్లనియె. ౧౦౩

శ్రుతిరూప గోపికల వృత్తాంతము.

క॥ శ్వేతద్వీపమునందునఁ, బూతశ్రుతులెల్ల హరినిఁ ♦ బుణ్యప్రవచో
వ్రాతమునన్ బ్రార్థింపఁగ, శ్వేతద్వీపేశహరి వ ♦ చించెడి నిట్టుల్. ౧౦౪

ఉ॥ డెందమునన్ ముదంబురు గ ♦ డించఁగఁబొందితి నెట్టిసందియం
బిందునలేదుగాన వర ♦ మిచ్చెదఁ గోరుఁడు మీమనోరథం
బొందుఁడు కాలయాపనము ♦ నూరకచేయకుఁడేఁ బ్రసన్నతన్
జెందిన నేరికైన నతి ♦ శీఘ్రముగా ఫలసిద్ధిగాదొకో. ౧౦౫

చ॥ సకరుణ నిట్లుఁ దెల్ప శ్రుతి ♦ సంతతి సంతసమొంది శ్రీహరీ!
ప్రకృతిపరంబు నవ్యయము ♦ వాగ్మ్యదగోచర మద్వయంబు ని
ర్వికృతము చిత్స్వరూపము వి ♦ వేకినుతంబునునైన మీ జగం
బకలుమరీతిఁజూప మిమ్మఁ ♦ బ్రార్థనజేసితి మేము భక్తితో. ౧౦౬

చ॥ అనవుడు నాజనార్దనుఁ డ ♦ నన్యము హర్షదమౌ స్వలోకమున్
గనుఁగొనఁజేయఁగా శ్రుతిని ♦ కాయముజూచి ముదంబు బొంది యం
దునఁ దిలకించి నిర్మలిన ♦ తోయ సుపూరిత, హంసనిస్వన,
ఘనయమునన్, మణిప్రకర ♦ నాగరిశోభయతీరరాజితన్. ౧౦౭

ఉ॥ ఆవలఁ గౌతుకప్రదము ♦ నాయతకుంజవిరాజితంబు వాం
ఛావళిదాగయుక్తము ని ♦ రామయమున్ ఋతుషట్కవర్తి సౌ
ఖ్యావహమద్భుతోరుపరి ♦ ఖావళిసాధసమేతమైన బృం
దావనకాననంబుఁగని ♦ తత్పరమందునఁ గన్నులారఁగా. ౧౦౮

తే॥ రత్నధాతుమయముశ్రీక ♦ రంబు వివిధ, విహగమండలయుక్తంబు ♦ విమలవారి
పూర్ణనిర్ఝరకందర ♦ భూషితంబు, నైన గోవర్ధనము గాంచె ♦ నచటనవల.

శా॥ నానారాసరసాన్వితంబు బుధమా ♦ న్యంబైన తద్గోపికా
స్థానంబందుఁ గిశోరమూర్తియయి త ♦ ద్దైత్యారి దైవాటి "మీ
కానందంబుగ నాదు లోకమిదె ప్ర ♦ త్యక్షంబుగాఁ జూపితిన్
గ్గానన్ మీమదిఁగోర్కులున్నయెడలన్ ♦ నాసన్నిధిన్ బల్కుఁడీ." ౧౦౯

వ॥ అని శ్రీహరి యడుగ శ్రుతు లవధరించి కౌతుకకంకణపూరితలోచన
లగుచు నాశ్రుతివిశ్రుతున కిట్లనియె. ౧౧౦

చ॥ మనసిజకోటిసుందరత ♦ మూలెడిరూపునుగన్న నీపయిన్
మనములునిల్చె మన్మథుఁడు ♦ మమ్ముల నూరక వేపుచుండెఁ గా
వున నెటునీదులోకమునఁ ♦ బుణ్యలు, కామినులౌచు సౌఖ్యముల్
గనిరటు మేము స్త్రీలమయి ♦ కాంతు మనంతసుఖంబులో హరీ. ౧౧౧

మ॥ శ్రుతులిట్లు ల్వచియింప శ్రీహరి జెవుల్ ♦ జొప్పించి యాలించి యో
శ్రుతులారా! భవదీయవాంఛ కెదియున్ ♦ సోమింపరాదాయె స
మ్మతమయ్యెన్ వ్రజమందు వేతలుగ జ ♦ న్మంబెత్తుఁడీ! నైజయో
గ్యత సారస్వతకల్పమైనతఱి నా ♦ గామిస్స్వయంభూస్థితిన్. ౧౧౨

ఉ॥ ఆవసుధాలసన్మధుర ♦ యందుననందము గల్గివెల్గు బృం
దావనమందుఁ జెన్నలరు ♦ తాదృశమామక రాసమండలిన్
నేవిధిగాఁ జెలంగియు న ♦ నింద్యవిధంబున జారరీతి మీ
భావమెఱింగి మైత్రి మిముఁ ♦ బావనులన్ బొనరింతు నెంతయున్. ౧౧౪

తే॥ ఇటులఁ దెలిదీవి హరినైన ♦ యేను కరుణ, వరము సంగితి దానిచే ♦ వారు గోపి
కలుగ జన్మింతు రన్యగో ♦ పులనుగూర్చి, విస్తరంబుగఁ బల్కెద ♦ వినుము వలుద.

తే॥ అట్టి త్రేతాయుగంబున ♦ నాదితేయ, రక్షణార్థము రాక్షస ♦ శిక్షణార్థ
మేనుబుట్టితి శూరత ♦ నినకులాబ్ధి, సోముఁడును దాశరథియగు ♦ రాముఁడనఁగ

మైథిలాదినారీ వృత్తాంతము.

ఉ॥ అట్టులఁ బుట్టి జానకి స్వ ♦ యంవరమున్ గననేగి యీశువి
ల్లట్టును ఫెళ్ళన్ విఱిచి ♦ పార్థివు లబ్బుర మొంద సీతఁ జే
పట్టి మనోజమూర్తినయి ♦ వర్తిల శ్రీమిథిలాపురంధ్రులి
ట్టిట్టవరాని మోహమున ♦ నెంతయుఁ జూచి రమర్త్యనాయకా. ౧౧౭

ఉ॥ అంతట వారు ప్రేముడిని ♦ నా రఘురాముని మ్రోలఁ జేరి యే
కాంతమునన్ "మహాత్మ! పతి ♦ గాఁదగి ప్రోవు మనంగ జానకీ
కాంతుఁడు దీని ద్వాపరయు ♦ గంబు గతించెడివేళఁ బుణ్యమ
త్యంత మొనర్చి వేత్రతలయి ♦ యావ్రజమందు జనించి పొందుఁడీ. ౧౧౮

ఉ॥ ఆ మిథిలాపురంధ్రులకు ♦ నట్లువరంబు దయాళుఁడైన శ్రీ
రాముఁడొసంగి యాపరశు ♦ రాముని గర్వము బల్మిఁ గోసలా
ఖ్యామహితస్వదేశగతి ♦ యందు నడంచియు వచ్చుచుండఁ ద
ద్భామినులాతనిన్ నయన ♦ పర్వముగాఁ గని మెచ్చి రిట్టులన్. ౧౧౯

శా॥ ఆ జాబిల్లిని గేరుచుండు మొగమా ♦ యాజానుబాహుద్వయం
బా జాజ్వల్యజిగి మీఱు దువ్వలువలా ♦ వ్యాహారమాధుర్యమా
తేజం బా కరుణాళుతాగరిమ యా ♦ ధీరత్వసత్వంబులా
సౌజన్యంబు నుతింపనోపుదురె యో ♦ చంద్రాస్యలారా పరుల్. ౧౨౦

చ॥ ఇటులఁ బరస్పరమ్ము దల ♦ వింతులు చింతన మాచరించి యు
త్కటమగు మోహమొంది పతి ♦ గా వరియింపఁగ, రాముఁడొప్పి తా
నిటు నొడివెన్ వ్రజంబున న ♦ హీనపవిత్రత మీరు గోపికా
పటలిగఁ బుట్టుఁడీ యపు డ ♦ వారిగ దీర్తును మీ యభీష్టముల్. ౧౨౧

తే॥ కోసలాంగనలకు నిటు ♦ గోర్కులిచ్చి, సేనముంగల నడువంగ ♦ సీత గూడి
వడి నయోధ్యాపురమునకు ♦ వచ్చెనచట, గలపతుల్ వానిఁ గవితమ్ముఁ గవిరిస్నామ్మ

వ॥ అంతఁ గొంత తడవునకు నాయయోధ్యానివాసినులగు విలాసినులు

మూర్ఛఁ దేఱి సరయూనదీతీరంబుఁ జేరి యారామచంద్రుని మనంబుల నిల్పి తపం
బొనరించు సమయంబున "మానినులారా! యమునా తటినీతట విరాజమానబృం
దావనాంకస్థితగోకులంబున మీరు గోపికలుగా జన్మించుఁడు. అత్తఱి నీసీతారాముం
డును దత్స్థలంబున వెలింగి మీయభీష్టములం దీర్పంగలండు విచారంబు మానుఁడను"
నాకాశవాణి శ్రుతముగా నవ్వారలలరిరి. అంత శ్రీరాముండును నిజజనకుని యాజ్ఞ
నాదలఁ దాల్చి మాతృబంధ్వమాత్య మిత్రభృత్యాది సర్వజనంబులను సకలసుఖం
బులను విడిచి నిర్జనంబును భయంకరంబునగు దండకారణ్యంబునకు సీతాసౌమిత్రి
సమేతుండై చనె. ౧౨౨

ఉ॥ అత్తఱి లక్ష్మణుండు విలు ♦ హస్తమునన్ గొని వెంటనంటి జా
గ్రత్తగఁ గాచుచుండ రఘు ♦ రాముఁడు జానకితోడఁగూడి క
న్నత్తక నిశ్చలాత్మను ద ♦ పించి జపించి నుతించి కాంచఁద
త్పత్తిని గోరు దండకవ ♦ నస్థ మునీంద్రుల పాలికిం జనెన్. ౧౨౩

ఉ॥ ఆసమయంబునందు ముని ♦ లందఱు స్వీయసమాధిఁ గన్నయా
భాసురవాసుఁడా మకుట ♦ భాసితమస్తకుఁడా ప్రశస్త సీ
తాసుదతీశుఁడా దశర ♦ థప్రభుపుత్త్రకుఁడయ్యు నట్లు మా
క్వేసముతోడ వచ్చుటను ♦ వింతఁగజూచి తలంచి రీవిధిన్. ౧౨౪

చ॥ మురళిని వేత్రమున్ విడి య ♦ పూర్వతరాకృతి వచ్చుటేలకో
యరుదగుఁ, గారణం బెవియొ? ♦ యక్కట! యంచు సమాధినుండి స
త్వరగతిలేచి మ్రొక్కి పలు ♦ భంగుల వేడఁగ రాముఁడున్ దయా
కరుఁడయి కాంచి యేవరము ♦ గావలెనో మునులార తెల్పుఁడీ. ౧౨౫

మునిరూపాది గోపికల పూర్వచరిత్రము.

చ॥ అనవుడు వీనులార విని ♦ యామునులందఱు రామభూమ! నీ
దు నుదుల కిప్పుసంతసము ♦ తో నిటువల్కుచునుంటిమయ్య! నీ
కొనరిన పూతసీతవలె ♦ నొయ్యన మమ్మును స్త్రీలఁ జేసి మా
కనుపమసౌఖ్యముల్ గలుగు ♦ నట్టులొనర్పుమటంచు; నావుడున్. ౧౨౬

ఉ॥ రాముఁడు, వారికోరికఁ బ ♦ రాకును వీడి గ్రహించి యోముని
స్తోమలలాములార! బహు ♦ దుర్ఘట మిద్దియె ప్రార్థ్యమైనచో
నీమెయి లక్ష్మణాకృతి ధ ♦ రించి ఘటించెద, నొప్పరేని మీ
రామతిలుండు ద్వాపరయు ♦ గాంతమునందున గోకులంబునన్. ౧౨౭

ఉ॥ అత్తఱి మీ యభీప్సితము ♦ లన్ని ఫలించును గాని యిప్డు కిం
చిత్తు ఫలింప వేలయన? ♦ సీతనువీడి మఱొక్కనాతినిన్

జి త్తమునందలంపమిన ♦ చెప్పితిఁబై విధి, నిట్లుపల్కి లో
కో త్తరమైన పంచవటి ♦ నొందె నతండు, సుపర్వనాయకా!. ౧౨౮

తే॥ అంతఁ దత్ప్రాంతమందున ♦ నలరుచుండు, పర్ణశాలఁ బ్రవేశించి♦వనమునందు
సంచరించెడి రాముఁ గా ♦ మించికాంచు, నాపుళిందవాసినులగు ♦ నతివలెల్ల.

తే॥ మదనపీడితలై రామ ♦ పదరజంబు, నుత్తమాంగంబులందుంచి ♦ యుసురువిడువ
నుద్యమింపఁగ శ్రీరాముఁ ♦ డుత్తముండు, వర్ణిమై వారిదరిఁజేరి ♦ పరమకరుణ.

తే॥ పడఁతులార! మీరిప్పుడు♦ప్రాణములను, వృథగ వీడకుఁడీ మనో♦రథముద్వాప
రాంతమందునఁ బృందావ ♦ నాఖ్యనలరు, వనమునందున సంసిద్ధి♦పడయఁగలరు.

ఉ॥ శంకలవీడి పల్కియిటు, ♦ సక్కఁదిరోహితుఁడయ్యె నంతటన్
గొంకక, రామరాజు కపి ♦ కోటియుతుండయి రావణాది దు
స్సంకరులన్ జయించి నిజ ♦ సాధ్విని బుష్పక మెక్కఁజేసి భూ
శంకరుఁడై యయోధ్యకు వె ♦ సన్ జనుదెంచెను హంసవాహనా. ౧౩౨

తే॥ అట్టులేతెంచి మించి♦పట్టాభిషిక్తుఁ, డయి సుఖంబులఁ బొందుచా♦యవని తనయఁ
బంపె నడవికి లోకాప ♦ వాదముననె, యెంతవారికేన్ సంసృతి,♦వంత లిడును.

చ॥ క్రతువులఁ జేయ రామునకుఁ ♦ గౌతుక మొప్పెపుడున్ జనించెనో
శ్రుతిహితపక్కి నష్టపుడు ♦ చొక్కపుబంగరుబొమ్మ, తత్సతీ
ప్రతికృతిగాఁ జెలంగ నవి ♦ బాధముగా నగుచుండె నంత నా
ప్రతికృతు లూపిరుల్ గలిగి ♦ రాముని గీమున హెచ్చె నోవిధీ. ౧౩౪

క॥ హెచ్చిన ప్రతికృతులచ్చట, ముచ్చటగా వెల్గు రామ ♦ మూర్తినిఁ గని తా
ర్మచ్చిక సంభోగింపఁగ, నిచ్చను వాంఛించిచెంత ♦ కేగె నతండున్. ౧౩౫

క॥ వచ్చిన ప్రతికృతులను గని, నిచ్చయముగ మీయభీష్ట ♦ మేఁ దీర్పను జూ
నెచ్చెలులారా! యనివా, క్రుచ్చెను దరువాత నవ్వి ♦ గుయ్యిడెనిట్టుల్. ౧౩౬

క॥ రామా! సీతారామా! మేమా క్రతుకాలములను ♦ మెలఁగుచుఁ బూర్తిన్
బ్రేముడి సల్పితిమేలొకో? యీమెయిమాకోర్కి దీర్ప ♦ విది యుచితంబో.

వ॥ అన విని శ్రీరామచంద్రుం డిట్లనియె. ౧౩౮

చ॥ ప్రతికృతులార! మీనుడులు ♦ బాగుగనున్నవి, సత్యమైన బ్రి
స్తుతమున నప్రశస్తముగఁ ♦ దోఁచుచున్నవి సీతతోడనే
వ్రతము ధరించియుంటిఁ బర ♦ భామ గ్రహింపను రాజయోగి మీ
యతులవరంబు ద్వాపరయు ♦ గాంతమునన్ వ్రజమందుఁ దీర్చెదన్. ౧౩౯

తే॥ అట్టి శ్రీరామువానతి ♦ నటులనవియు, గోపికలుగజన్మించు న ♦ కుంఠితముగ
మఱియు నితరగోపికలను ♦ గుఱిచి నేను, విస్తరించెద వినవయ్య ♦ వేల్పుపెద్ద.

వ॥ రమావైకుంఠలోకమున నివసించు విలాసినులును, శ్వేతద్వీపంబున నున్న యన్నులును, నూర్ధ్వవైకుంఠంబుననుండు నువిదలును, నజితపాదాశ్రితాంగనలును, శ్రీలోకాచలవాసినులగు స్త్రీజనంబులును, సముద్రనిర్గత శ్రీలక్ష్మీ సఖురాండ్రును, దివ్యలను పేరంబరగు మానినులును, నదివ్యలనునామంబునఁ జెలంగు చేడియలును, సత్వరజస్తమోగుణవృత్తులుగల సతులును, వివిధవిధంబుల సలిపిన యఖండపుణ్యంబులవలన భూమియందు గోపికలుగా జన్మింతురు. మఱియు రుచియనువాని కుమారుండును, మదంశసంభూతుండును, సుందరుండును, స్వర్గాధిపతియునగు యజ్ఞునింగాంచి కామించి దేవలమునివాక్యంబున హిమవత్పర్వతమం దచలభక్తిశోఁ దపంబుగావించిన దేవకాంతలును, బృందావనంబున కనతి దూరంబున విరాజమానంబగు వ్రజమందు గోపికలుగా జన్మింపంగలరు. వెండియు భూమియందుండు నోషధులుసాక్షాత్కరించిన ధన్వంతరి దేవుండంతర్హితుం డగుట వీక్షించి భరతఖండంబున నిష్ప్రయోజకులమైతిమని మిగుల దుఃఖించి స్త్రీరూపంబులంధరించి యాదేవుని నెమ్మనంబునందు నిల్పి నిజమనోరథసిద్ధియగునందాఁక నాలుగుయుగంబులు గడచునంతవఱకుఁ దపంబొనరింప నద్దేవుండు మెచ్చి సాక్షాత్కరించి వరంబులం గోరుండని ప్రసన్నవదనంబుతోఁ బలుక వార లమ్మహాత్మున కిట్లనిరి. ౧౪౧

తే॥ దేవదేవ! నీరూపము♦దివ్యమయ్య, మాకుఁ బతివౌచు సుకమిడి♦మనుపవయ్య
యనఁగ నద్దేవుఁడద్దాని ♦ నవధరించి,తిరిగివచియించె నిట్లోష♦ధీసతులకు. ౧౪౨

తే॥ ద్వాపరాంతమునందున ♦ వల్లరులుగ, బృందకావని జన్మించి ♦ యారలున్న
రాసకేళులఁ గామితోడ♦రమణమెలఁగి, వాంఛలను దీర్తునని దయఁ♦బల్కెదాన.

తే॥ అచలభక్తిసంయుక్తభా ♦ గ్యవతులైన, వారు బృందావనంబునఁ ♦ జారుగోపి
కలుగ జన్మింపఁ గలరుగా♦కమలజాత! యంచు వాచించి మఱి వచి♦యించెనిట్లు,

క॥ జాలంధరపురిఁ జెలఁగెడి, హేలావతులట్టి హరిని ♦ బృందాపతినిఁ
లీలంగనుఁగొని యాహరి, యేలీలనొ భర్తయైన ♦ నింపగు మాకుఁ. ౧౪౩

క॥ అని మొదఁదలఁచెడివారికి, వినఁబడె నిట్లభ్రవాణి, ♦ బృందావిభునిఁ
వినుతుల్ సేయుఁడు బృందా, వనమున జనియింపుఁ డపుడు♦ఫలమగు మీకుఁ.

చ॥ మఱియు సముద్రకన్యకలు ♦ మత్స్యశరీరినిఁగాంచి మోహసా
గరమున మున్గి యాహరి న ♦ ఖండముగాఁ గొనియాడ నాతఁడా
దరమున వారి కోర్కులిడెఁ ♦ దద్వరరీతిని బృందకాటవిఁ
గరముగ వారు గోపికలు ♦ గా జనియింపఁగలారు పద్మజా. ౧౪౭

ఉ॥ చండపరాక్రముం డఖల ♦ శత్రునిషూదనపండితుండు ను
ద్దండపదావదుండును వ ♦ దాన్యుఁడునౌ పృథుభూభుజుండు బ్ర

హ్మాండవిభుత్వదీపితమ ♦ దంశమునన్ జనియించి కామముల్
దండిగఁ బిండనుండె, వసు ♦ ధాసురభీమణి యందు, నత్తఱిన్. ౧౪౫

తే॥ దివ్య నావిభుఁన్ బర్హిష్మ ♦ తీపురంబు, నందుఁ బొందిన సుందరీ♦బృంద మాస్థ
గాంచిమోహించి యాయత్రి♦కడకునేగి, భక్తిఁబ్రణమిల్లి యిట్టులఁ ♦బలికెనయ్య.

పంచచామరము.

మహామునీ! యనుగ్రహంబు ♦ మాపయిన్ ఘటించి యీ
మహానుభావుడైన రాజు ♦ మాకునెట్లు భర్తయై
విహారమార కేళిపాళి ♦ విశ్వసించియుండునో
బిహాసఁ జేయకుండ మీరు ♦ సెప్పరయ్య! యిత్తఱిన్. ౧౪౬

చ॥ అన విని యత్రివక్త్రనిటు ♦ లంగనలార! ధరిత్రికామనో
వున సకలేప్సితంబులను ♦ బూర్తిగఁ బిండుచు నుండుఁడిట్లురం
బున నొనరించినన్ భవద ♦ మూల్యమనోరథముల్ వసుంధరా
వనిత ఘటించు నమ్ముఁ డిటు ♦ వ్యాజమొకింతయు నేని లేదిఁకన్. ౧౪౭

ఉ॥ మానినుడిన్ సతుల్ విని స్వ ♦ మానసపాత్రముతోడ ధారణీ
ధేనువునం దభీష్టములఁ ♦ దేఁకువఁ బిండిరి దానిచేతఁ ద
న్మానినులెల్ల వ్రేతలుగ ♦ మద్వ్రజమందు జనింత్రు కామసే
నానిహితాప్సరోంగనలు ♦ నాథునిగాఁ గమలాక్షుఁ గోరుచున్. ౧౪౮

ఉ॥ శ్రీయుత గంధమాదనముఁ ♦ జేరి ప్రసిద్ధుని మానినాథు నా
రాయణుఁ గాంచి మోహము గ ♦ రంబుగఁ బొంది మహాత్మ! భర్తవై
యీయెడ సాఁకుమన్న నతఁ ♦ డీరు వ్రజస్థలమందు వ్రేతలై
హాయిగఁ బుట్టుఁ డట్టియెడ ♦ నందఱ వాంఛలఁ దీర్తునంచనెన్. ౧౪౯

వ॥ అంత. ౧౫౦

చ॥ సుతలనివాసినుల్సతులు ♦ సుందర వామనమూర్తిఁ గాంచి మో
హితలయి నాథుఁడౌటకు న ♦ హీనముగాఁ గొనియాడి తద్దయో
న్నతిని గడించి మద్వ్రజము ♦ నన్ జనియింతురు నాగకన్యలీ
వితమున భర్తృకామలయి ♦ వేఁడి యనంతునిఁ దత్కృపన్ భువిన్. ౧౫౧

క॥ బృందావనరాజమునన్, సుందరులౌ గోపికలుగ ♦ శోభిల్లి మహా
నందముఁ బొందుచు వాంఛా, బృందము నెందంగఁ గలరు ♦ విశ్వస్రష్టా. ౧౫౨

వ॥ వెండియుఁ గశ్యపుండను మహర్షి, వసుదేవుండన, నదితియను సతీమ
తల్లి, దేవకీదేవియనఁ, బ్రాణనామకవసువు, శూరుండన, ధ్రువుండనువసువు
దేవకుండన, వసునామకవసు వుద్ధవుండన, దక్షుండు, దయానిధియగు నక్రూరుండనఁ,

కుబేరుండు హృదీకుండన, వరుణుండు కృతవర్మయనఁ, బ్రాచీనబర్హి గదుం డన, మరుతుం డుగ్రసేనుండన, జన్మింతురు. ౧౪౭

తే॥ అట్టియుగ్రసేనాఖ్యునే ♦ నఖిలరాజ్య, మునకు మూర్ధాభిషిక్తుఁగా ♦ నొనరఁజేసి
సర్వవిధముల సర్వదా ♦ చల్లనైన, చూపుఁ జూపుచుఁగాపాడు♦చున్ వసింతు.

వ॥ మఱియు నంబరీషుండను రాజు యుయుధానుండనఁ, బరమభాగవ తోత్తముండగు ప్రహ్లాదుండు సాత్యకియన, క్షీరసముద్రుండు శంతనుండన, ద్రోణనామకవసువు భీష్ముండన, దివోదాసుండు శల్యుండన, ఖద్యోతాంశసంజనిత భగుండు ధృతరాష్ట్రుండనఁ, బూషుండనువాఁడు పాండుండన, ధర్ముండు యుధిష్ఠిరుండన, బవనుండు భీమసేనుండన, స్వాయంభువమను నర్జునుండన, శతరూప యను రమణి సుభద్రయన, సూర్యుండు కర్ణుండన, నాశ్వినేయులు నకుల సహదేవులన, బ్రహ్మ బాహ్లీకుండన, వైశ్వానరుండు ద్రోణాచార్యుండనఁ, గలి దుర్యోధనుండన, జంద్రుం డభిమన్యుండన, శివుం డశ్వత్థామయనం బరఁగి భూతలంబున, జన్మింపఁగలరు. ఇట్లు యదువులయుఁ గౌరవులయుఁ దక్కుంగలవారలయు కులంబులందు స్వాంశంబులతో స్వస్త్రీసాకంబుగా నాయానతిం బుట్టంగలరు. గోకులంబున రమాంశగలిగి జన్మించు గోపికలు పదాఱువేలకు మించిచెలంగుదురని యెఱుంగుమనిచెప్పి యోగమాయం గాంచి యీాకరణి నాజ్ఞాపించె. ౧౪౯

కృష్ణుండు యోగమాయను నియోగించుట.

చ॥ చతురత దేవకీలలన ♦ సప్తమగర్భము సంగ్రహించి గో
పతియగు నందు గోష్ఠమున ♦ బాహుబలుండగు కంసు భీతిచే
ద్రుతగతిఁ బోయియున్నయల ♦ రోహిణి నా వసుదేవపత్ని యం
దతుల నొనర్చి నందసతి ♦ యైన యశోదకు నీవు పుట్టుమా. ౧౫౦

ఉ॥ శ్రీపతి, యోగమాయకిటు ♦ సెప్పుట దేవగణంబుతోడ బ్రా
హ్మీపతి యాలకించి కమ ♦ లేశునకుర్ నతిసల్పి భూమి సం
తాపమడంచి సాంత్వలపి ♦ తంబుల; నద్భుతకాంతిసంతతో
ద్దీపితమా స్వధామమును ♦ దేవత లారతు లెత్తఁగాఁ జనెన్. ౧౫౧

క॥ ధరణీనాయక ! కృష్ణుఁడు, పరిపూర్ణతమావతార ♦ భగవంతుండీ
ధరఁ గంసాదినరేంద్రని, కరవధకై పుట్టునయ్య ♦ గమనింపు మిటుల్. ౧౫౨

చ॥ తనువున నెన్నిలోమములు ♦ దార్కొనియున్నవో యన్నినాలుకల్
గొని విబుధుల్ నుతించినను ♦ గోపతియౌ హరి సద్గుణంబులం
దున నొకదాని నెన్నినటు ♦ దోఁపక వారలశక్తిఁదోఁచు నిం
గిని విహగంబు లాత్మగతిఁ ♦ గేరుచు నాకడఁదాక నట్లనన్. ౧౫౩

ఉ॥ భూరమణుం డిటుల్ వలికె ♦ భూసుర! క్రోలితిఁ ద్వద్వచోమృతం
బీరిటఁ గంసవీరుఁడని ♦ యేరికిని పేర్కొనియుంటి రాతఁడే
యూరవసించు నెవ్వఁడతఁ ♦ డుత్తముఁడో యధముండొ పూర్వబృం
దారకుఁడో యసుర్యుఁడో య ♦ థాస్థితిఁ దెల్పుఁడనన్ మునీంద్రుఁడున్. ౧౬౪

కంస పూర్వజన్మ వర్ణనము.

చ॥ నరపతి! తొల్లి వార్ధిమథ ♦ నంబున దుష్టుఁడు కాలనేమిక
ర్బురుఁ డల చక్రితో సమర ♦ మున్ బొనరించి హతుండు గా నిశా
చరగురువైన భార్గవుఁడు ♦ స్వప్రతిభన్ బ్రతికించె వానినిన్
మరల నతండు యుద్ధమును ♦ మాధవుతో నొనరింప నెంచుచున్. ౧౬౫

క॥ మందారాచలసవిధం,బందరవిందజునిఁగూర్చి ♦ యబ్దశతక మా
నందదదూర్వారసమే, సందియములు లేక క్రోలి ♦ సలిపెఁ దపమున్. ౧౬౬

వ॥ అంత సర్వాణీకాంతుండాతని తపంబునకు మెచ్చి తత్సమీపంబునకు వచ్చి యిట్లు వాక్రుచ్చె. ౧౬౭

చ॥ తపమునుమెచ్చి వచ్చితిని ♦ దానవనాయక! నీమనోరథం
బిపుడు వచింపుమన్న నతఁ ♦ డెందఱు దేవత లీప్రపంచమం
దపరిమితద్విషిష్టులయి ♦ యచ్యుతుఁడే శరణీయుఁడంచు నె
ల్లపుడు నుతింతు రద్దివిజు ♦ లన్ మృతిలేనటు నాకొనర్పుమా. ౧౬౮

చ॥ వరమిది యిమ్మనంగ నల ♦ బ్రహ్మయు దుర్లభమిద్ది యిప్డు క
ర్బుర! మఱియొక్క జన్మమునఁ ♦ బొందెద విద్యది నిక్కమయ్య సం
బరమున నుండవయ్య యని ♦ పల్కెను బిమ్మట వాఁడు తద్వచ
స్సరణిని నుగ్రసేనునకు ♦ జానుగఁబుట్టెను గంసనాముఁడై. ౧౬౯

వ॥ అంత నక్కంసుండు. ౧౭౦

ఉ॥ పిల్లతనంబునుండిఁ బెఱ ♦ పిల్లలఁదిట్టుచుఁగొట్టి నెట్టుచున్
మల్లులతోడఁబోరుఁ బలు ♦ మాఱొనరించుచుఁ గ్రీడలాడి రం
జిల్లెడివేళ, దిగ్జయము ♦ సేయ జరాత్మజమాగధేశ్వరుం
డుల్లసమూనుచున్ యమున ♦ యొడ్డునవేసి గుడారు వీరుఁడై. ౧౭౧

తే॥ అట్టికంసునితోఁగయ్య♦మాడఁదొడఁగె, నింతలోనాజరాసుతునకు♦సొంతమగుచు
వేయియేనుగులబలమున ♦ విస్తరిలిన, కువలయాపీడమనుకరి♦క్రొవ్విమిగుల. ౧౭౨

తే॥ గొలుసులన్నియుఁదెగటార్చి♦కొంపలెల్లఁ, గూలఁద్రోయుచుశిబిరముల్♦గొలుపఱచి
గిరితటంబులఁబడఁద్రోసి♦సరభసమునఁ, గంసుఁడొనరించు నాజికిఁ గదలిచేరె.

శా॥ శుండాలంబిటుసొచ్చి ఘీంకృతుల ది ♦ క్షోభంబు గావించి వే
తుండంబెత్తి రథాశ్వమత్తకరులన్ ♦ దూలించి జృంభించి దో

ర్దండాఖండుల జెట్టిజట్టులను బా ♦ అంద్రోలఁ గంసుండు త
చ్చండాదండముఁ బట్టి మట్టె ధరణిన్ ♦ శూరాగ్రణుల్ మెచ్చఁగా. ౧౭౪

ఉ॥ క్రిమ్మఱి భూమినుండి నల ♦ కంసుఁడు దాఁగి గరమ్ములన్ లఘు
త్వమ్మున నెత్తి యూపిరులు ♦ వ్యత్యయమొందఁగఁ ద్రిప్పి త్రిప్పి యం
తమ్మునఁ దజ్జరాసుతు న ♦ దభ్రభవరూధినిపైన నూఁకుక్రో
శమ్ములు దాఁటునట్టుల వె ♦ సన్ విసరెన్ గసి వాసి భాసిలన్. ౧౭౫

ఉ॥ గంధగజమ్ము నీవితము ♦ గాఁ బడద్రోయుటఁ జూచి తజ్జరా
సంధుఁడహా! యిదేమి బల ♦ సంపదఁ బెంపునుతింప శక్యమే!
బాంధవులందుఁగాని పర ♦ పార్థివులందునఁ గాని స్నేహసం
బంధజనాళిఁగాని యిటు ♦ బాధబలిష్ఠునిఁ గాంచ లేదహా. ౧౭౬

చ॥ పరధనముల్ హరించితినిఁ ♦ బార్థివులందఱ రూపుమాపితిన్
గురు కవి విప్రమాన్యు లను ♦ కూలురుగా వసియింపఁ జేసితిన్
నరసురఖేచరప్రకర ♦ నాశమొనర్చితిఁ జక్రవర్తినై
ధరణిని నేలుచుంటి నిటు ♦ దార్ఢ్యని చేయఁగ లేదు నే నెటన్. ౧౭౭

ఉ॥ ద్రవ్యము, రూపము, గులము, ♦ దక్షవిపక్షవిమర్దనక్రియా
భవ్యబలంబు మాన్యత య ♦ పారయశంబును సాహసంబు సం
భావ్యముగా వసించుటను ♦ బాధ ముదంబు ఘటిల్లె వీని మ
ద్భవ్యసుతాద్వయం బిడి వి ♦ వాహితుఁ జేసెదనంచు నెంచితాన్. ౧౭౮

తే॥ హస్తి లక్ష, యర్బుదము ♦ హయంబు, లయుత
దాసురాండ్రిఁ, ద్రిలక్ష ర ♦ థంబు లొసఁగి
ప్రస్తుతుండైన కంసభూ ♦ పాలమణికి
నస్తిఁ, బ్రాస్తిని, నొసఁగెఁ బ్రి ♦ శస్తరీతి. ౧౭౯

వ॥ అంత. ౧౮౦

కంసుండు దిగ్విజయం బొనర్చుట.

తే॥ ద్వంద్వయుద్ధంబు నందతి ♦ ధన్యుఁడైన, కంసుఁ డేకాకియై భుజ ♦ కాండపటిమ
రమ్యమాహిష్మతీపుర ♦ రాజమునకు, నరిగెఁ దత్పురపాలకు ♦ లదల నెదల.

సీ॥ చాణూరముష్టిక ♦ శలకూటతోశల, నామకనరవర ♦ నందనులను
మల్లతల్లజుల సా ♦ మంబునన్ జీరి యో, గండలారా! రండు ♦ కదనమునకు
విజయమొందినమీకు ♦ భృత్యుఁడనౌదు నే, విజయమొందినమీరు ♦ భృత్యులగుదు
రిందుల కొప్పిన ♦ నీపురప్రముఖులు, ముంగల రూఢిగాఁ ♦ బోరు జరుగు

తే॥ ననెడి పణమును దెల్పెను ♦ నవలవార, లేము వీనికి నొప్పితి ♦ మింకఁ గంస!
చేయవలసిన కృత్యముల్ ♦ చేసినీవు, లెమ్ము, ఖండన భూమికి ♦ రమ్మనంగ.

ఉ॥ పోరునకాతఁ డొప్పికొని ♦ ముందుగ ముగ్గరమందు మ్రొగ్గ చా
ణూరునిఁ బట్టి నేలపయి ♦ నొవ్వఁగఁ గొట్టిన ముష్టికుండు, బ
ల్పొరుప మొంది యాదవకు ♦ లప్రభు, ముష్టులఁ దాక, నాతఁడున్
ఘూరత నొక్క గ్రుద్దునకె ♦ సొమ్మసిలన్ బ్రహరించె వానినిన్. ౧౮౩

చ॥ అదిగని కూటమల్లుఁడు మ ♦ హోరుష రా యదువీరుఁ డాతనిన్
బదముల రెంటఁ బట్టి ధర ♦ పైఁ బ్రహరింపఁగఁ గాంచి తెక్కలన్
జదుముచు వచ్చి సట్టి శలు ♦ స్కంధమునన్ గ్రహియించి యెన్నియో
కదుములు గట్టఁ దోఁసి వడిఁ ♦ గ్రమ్మఱఁ బట్టుచు నెట్టె నంతటన్. ౧౮౪

ఉ॥ మల్లుఁడు తోశలుండు నభి ♦ మానముగాఁ జనిపోరఁ గంసుఁడ
భ్యుల్లస మొంది తద్దనుజు ♦ నూరుయుగంబును జేతిశోడ శో
షిల్లగఁ బట్టి నెట్టియు గ ♦ సిన్ బడియామడ లేగఁ ద్రోసి వే
మల్లలితోక్తి దాసులగు ♦ మల్లుల వారలఁ గూడి పోఁడిమిన్. ౧౮౫

తే॥ చని ప్రవర్షణాద్రికి నంత ♦ సంచరించు, ద్వివిదనామకవానర ♦ వీరుఁగాంచి
కదనమాగదమ్మనఁగ నా ♦ కపియు నిరువ, దెనమిదిదినముల్ వానితో ♦ ననియొనర్చె.

చ॥ మదమున నొక్క భూధరమ ♦ మాంతముగాఁ గొని కంసుపైన నా
యదనున వేయ, నాతఁడల ♦ యద్రి గ్రహించి కపీశు పుఱ్ఱ వే
సదమద మొంద వైవఁ గపి, ♦ చక్కసి ముష్టులఁ గంసుఁ గ్రుమ్మి యా
చదలున కేగ, ఱేఁడు రథ ♦ సమ్మున వెంటనెపట్టి కూల్పఁగా. ౧౮౭

చ॥ ద్వివిదుఁడు, తత్ప్రహారమున ♦ విస్మృతిసెంది కృశించి శల్య మా
త్రవపుపుగల్గి యాగనని ♦ తత్క్షణమందున దాసుఁడయ్యె నా
యవసరమందు, నంతనల ♦ యాదవవీరుఁడు ఋశ్యమూక నా
మవనికి నేగి కేశియను ♦ మానవభక్షకుఁ డొక్కఁడుండఁగా. ౧౮౮

ఉ॥ వాని, హయస్వరూపుని, న ♦ పారఘనస్వనుఁ, జూచి, ముష్టులన్
బూనికఁ గ్రుమ్మి, త్రోఁచి, తరు ♦ పుంజమనోజ్ఞమహేంద్రశైలము
న్మానసవేగసామ్యగమ ♦ నంబునఁ జేరి, సులీల, నూఱుమా
ళ్లానగ మూఁడఁగాఁ జెఱికి ♦ యట్టిటులన్ బడవైచె నందునన్. ౧౮౯

ఉ॥ ఆమెయిఁ గాంచెఁ గంసవిభుఁ ♦ డాప్రలయాతిభయంకరోజ్జ్వల
ద్ధామనిధిన్, సమస్తవసు ♦ ధావిభుకంఠవిలుంఠనక్రియో
ద్దామయశోల్లసత్పరశు ♦ ధారణధైర్యమనోభిరామునిన్
రామునిఁ, గోపరక్తముఖు ♦ బ్రాహ్మణవంశపయోధిసోమునిన్. ౧౯౦

ఉ॥ కాంచి శిరంబునన్ గరయు ♦ గంబు లగించి యతండు మ్రొక్కి ధ్యా
నించి ప్రదక్షిణంబుల న ♦ నేకములన్ బొనరించి కాళ్ళపైఁ
గించను గాంచకుండఁ బడఁ ♦ గిన్క వెలింగెడి భార్గవుండు శాం
తించి కొలందిఁగా నతని ♦ ధీరునిఁ జూచి యిట్లు వచించెడిన్. ౧౯౧

ఉ॥ మానవకీటకాధముఁడ! ♦ మర్కటడింభక! దోమవోలె నీ
వీనగమందు నైతివని ♦ యిమ్మెయి నెమ్మనమందునమ్మమా!
మానిని, క్షత్రియుండ, నస ♦ మానుఁడనంచుఁ దలంచితేమొ యే
దీనిమిషంబునందున మ ♦ దిష్టవిధంబున నాచరింపుమా. ౧౯౨

చ॥ ధనువిది లక్షభారకలి ♦ తంబును దత్త్రిపురాహవంబునం
దున దనుజారి శంభునకుఁ ♦ దోడుగ నిచ్చిన దర్థనంతమున్
ఘనమును క్షత్రియాళి వధ ♦ కై శివుఁడొప్పి నాకు నిచ్చియుం
డిన దిపు డెక్కుపెట్టుము! త్రు ♦ టిన్ మఱిఁ జంపెద లేనిచో, ననన్. ౧౯౩

ఉ॥ తూర్ణముగా యదూత్తముఁడు ♦ ధూర్తకృపాన్వయభార్గవోక్తులన్
గర్ణములారఁగా విని సు ♦ ఖంబుగ నంబుజ సప్తతాలకో
ద్వర్ణితచాపముం గొని య ♦ థావిధిఁ జూచుచు లక్షమొంద నా
కర్ణములాగి టంకృతి ని ♦ కాయ మొనర్చెను నూలుమాల్గిన్. ౧౯౪

ఉ॥ గుండెలు బ్రద్దలయ్యె ఘన ♦ కోటుకుపాటున మ్రోసె నట్టి బ్ర
హ్మాండముగూడ సప్తబిల ♦ సార్థముగాఁ గడుమాఱుమ్రోఁగె భూ
మండలమందుఁ దారకలు ♦ మందగ రాలెను దిగ్గజంబులున్
దండిని వీడి తల్లడిలెఁ ♦ దచ్ఛరటంకృతి సల్పునట్టులన్. ౧౯౫

ఉ॥ అంతటఁ గంసుఁ డాశరము ♦ నచ్చటనుంచి మహానుభావ! నే
నెంతటివాఁడ క్షత్రియుఁడ ♦ నింతయుఁగానక దైత్యుఁడన్ జుమీ
స్వాంతమునందు శాంతమును ♦ జక్కఁగఁ బొందుఁడి! దాసదాసుఁడన్
జింతదొలంగ సేవలను ♦ జేసెదఁ దప్పక నన్నుఁ బ్రోవుఁడీ. ౧౯౬

చ॥ అనుచు నమస్కరింపఁగ మ ♦ హాగ్రహపూరిత జామదగ్న్యుఁడున్
వినుచుఁ బ్రసన్నచిత్తుఁడయి ♦ వీర్యసమంచితతచ్ఛరంబు నా
తనికి నొసంగి ధైర్యమును ♦ దార్ఢ్యము గల్గిన వైష్ణవంబు దీ
నిని గొను మిద్ది దద్దయును ♦ నీయరులన్ బరిమార్చునో బలీ! ౧౯౭

తే॥ కాని యిమ్మహాచాప మే♦ఘనుఁడుపుడక, విఱిచినట్టుల విఱుచునా♦వీరవరుఁడె
నిన్ను యుద్ధరంగంబున♦మన్ను జేయుఁ, గలఁడటంచు నెఱుంగుమో♦ యలఘువీర!

చ॥ అటుపయిఁ గంసుఁడాబుధున ♦ కొఁ దల మ్రొక్కి యనంతరంబునన్
జటులమదోన్మదుండగుచు ♦ సప్తసముద్రవృతావనీస్థలిన్

దిటముగ వీరుఁడై తిరిగి ♦ దీకొను వారలు లేనియట్టులు
త్కటముగ సల్పి భూపతుల ♦ కష్టములన్ గయికొంచు నావలన్. ౧౯౯

చ॥ జలనిధి తీరమేగి యట ♦ సస్యము బోలిన రూపుతోడ బు
స్సలఁ బలుమారును గొట్టుచుఁ బ్రజ ♦ జాతతి కెంతయు భీతిఁగొల్పుచున్
జెలఁగు నఘాసురున్ గనియుఁ ♦ జేతగ్రహించి యసృక్కులొల్కఁగా
నిలపయిఁ గొట్టి దండగ ధ ♦ రించి గళంబున, లోఁచి వానినిన్. ౨౦౦

తే॥ వింతఁ దూర్పున వంగదేశాంతరములఁ, బుంగవాకారముననున్న ♦ పూర్వదివిజుఁ
డౌ నరిష్టునితోడుత ♦ నని యొనర్చి, హస్తి హస్తితోఁ గలిసి పో ♦ రాడినటుల.

చ॥ మలను నరిష్టరాక్షసుఁడు ♦ మందగతిన్ బెకలించి కొమ్ములన్
బలుఁడగు కంసరాజుతల ♦ పైఁబడ వ్రేయుగ వెంటనే యతం
డలమలఁ గొంచరిష్టుశిర ♦ మందున వైచి బలిష్ఠముష్టితో
నిలఁబడవైచి రక్కసు, జ ♦ యించి నడిన్ జనె నుత్తరాశకున్. ౨౦౨

తే॥ అందుఁ బ్రాగ్జ్యోతిషాఖ్యతో ♦ నలరుపురికి, నేగి నరకాసురాహ్వయు ♦ నిద్ధబలుని
దైత్యుఁ గనుఁగొని తనదుయ ♦ థార్థభావ, ములను దెలుపంగ వాంఛించి ♦ పలికె నిట్లు.

ఉ॥ ఓనరకాహ్వయా! వినుము ♦ యుద్ధము గోరుచు వచ్చియుంటి నో
దానవనాయకా! సమితి ♦ దానము సేయుము! శౌర్యమొప్పఁగ నీ
పూనికనేఁ బరాజయముఁ ♦ బొందిన దాసుఁడ నౌదు నొండె నీ
కేని పరాజయంబయిన ♦ నీవును దాసుఁడవౌదు నాకొగిన్. ౨౦౪

క॥ ఇరువురు శపథము నిట్టులఁ, గరముగ నేర్పఱచుకొని య ♦ ఖండరణంబున్
హరి హరిఁ బోరెడి సరణిని, సరభసమునఁ జేసి రమర ♦ చయము నుతింపన్.

చ॥ జనకనరేంద్ర యాగమున ♦ సాధ్యబలుండగు నాగ్రహంబుతో
నని మొనఁ గంస భూమివిభుఁ ♦ డాగి యొదిర్చిన యట్టు లిప్పుడీ
దనుజుని మల్లయుద్ధమునఁ ♦ దాఁకి ధరన్ బడవేసి క్రమ్మఱన్
గొని యలవానినీడున న ♦ కుంఠితరీతిని బాఱవేయఁగా. ౨౦౬

ఉ॥ ధేనుకదైత్యుఁ డాగ్రహము ♦ దేఱుప హెచ్చఁగఁ దద్యదుప్రభున్
బూనికఁబట్టి ధాత్రిపయిఁ ♦ బొర్లునటుల్ పడద్రొబ్బ నాతఁడౌ
దానవు పందయామడలు ♦ దాఁటఁగ నెట్టె ద్రఢిష్ఠముష్టులన్
వానినిఁ జూర్ణమౌనటుల ♦ వారిగఁ గొట్టె ననంతరంబునన్. ౨౦౮

తే॥ బలితృణావర్తదైత్యుఁడు ♦ భౌమునాజ్ఞ, యుద్ధసన్నద్ధుఁడై కంసు ♦ నొడిసిపట్టి
యంబరంబున కేగియు ♦ నచట లక్ష, యోజనంబుల పైనని ♦ యొనరఁ జేసె ౨౦౯

ఉ॥ అంత ననంతమైన బల ♦ మందిన కంసవిభుండు వానిఁ ద
త్ప్రాంతమునుండి భూతలము ♦ పైఁబడు లాగున నోట రక్తము

త్యంతము గ్రక్కునట్టుల ర ♦ యంబునఁ ద్రోయ బకుండుగాంచి బ
ల్పాంతముతో గ్రసించుట క ♦ వారణపద్ధతి నేగె నంతటన్. ౨౦౯

చ॥ కులిశసమానముష్టి యదు ♦ కుంజరుఁ డా బకదైత్యవీరునిన్
సులువుగఁగూల్చె నాతఁడును ♦ ఘోరతరేఁపఁగ లేచి వారిదం
బులవలెఁ గాలులార్చి తెలు ♦ పుంగలఱెక్కలు గల్గి వానినిన్
బులుఁగును బోలెఁ బైకెగసి ♦ పొట్టనుబెట్టుకొనెన్ గుటుక్కునన్. ౨౧౦

ఉ॥ కంసుఁడు బాహ్యమేగుటకుఁ ♦ గర్బురకంఠము వట్టి నెట్టనన్
హింసనొనర్చె దాని కతఁ ♦ డేడ్తెఱఁజూపఁగ లేక క్రక్క నా
యంసలుఁ డాబకున్ ధరను ♦ నాగ్రహవృత్తినిఁ ద్రోసి దేవతా
శంసితరీతిఁ గొంచుఁ బలు ♦ సారులు ద్రిప్పి జయించె బిమ్మటన్. ౨౧౧

క॥ ఆతని చెలియలు పూతన, భీతిసి విడి రణము సేయ ♦ వేచను దేరన్
భూతలపతి నగి నే నెట, నాతులతో ననికి దిగను ♦ నమ్ముమయమ్మా! ౨౧౨

చ॥ అదియునుగాక యట్టిబకుఁ ♦ డన్నయె నాకగుఁగాన నీవు సిం
హొదవఁగఁదోడఁబుట్టువయి ♦ యొప్పఁగ నుండుమటంచుఁబల్కె ని
య్యది విని శక్తిఁగన్న వసు ♦ ధాత్మజుఁడౌ నరకాసురుండు త
త్త్రిదశవినాశకృత్యమున ♦ ధీరుఁడు గంసుని వేఁడెఁ దోడుగాన్. ౨౧౩

చ॥ అనవుడు నాతఁడొప్పి జితు ♦ లైనప్రలంబముఖాసురేశ్వరుల్
దనుఁగొలువంగ శంబరుని ♦ ధామముఁ జేరి స్వకీయభావమా
తని కెఱుఁగంగఁ జెప్పె నల ♦ దానవనాథుఁడు శంబరుండు దా
ఘనబలుఁడయ్యుఁ గంసుని న ♦ కారణరీతిని డీకొనం డహో. ౨౧౪

చ॥ మఱియును గంసుతోడ సను ♦ మానము మానుచు నట్టి శంబరుం
డఱిముఱి నేస్తమున్ స్వకస ♦ ఖాన్వితుఁడై యొనరించె దానికా
నెఱసరి సంతసించి మద ♦ నిస్తులుఁ డౌచుఁ ద్రిశృంగశృంగమం
దిఱికినవ్యోమపుణ్యజను ♦ నీక్షణఁజేసి మహాగ్రహంబునన్. ౨౧౫

చ॥ పదములఁ దన్న నిద్దురను ♦ బాసి యతండును రక్తనేత్రుఁడై
గదయెది దెమ్ము తెమ్మనుచుఁ, ♦ గంసుని హింసనొనర్చె గ్రుద్దులన్
యదుకులనాథుఁడద్దిగని ♦ యా యనిముష్టులఁ గ్రుంగఁజేయఁ బూ
ర్వదివిజుఁ డాయదుప్రభుఁ గ ♦ రంబు బలంబున గ్రుద్దెఁ దద్దయున్. ౨౧౬

చ॥ ఇటులఁ బరస్పరమ్ము రణ ♦ మెంతయు ఘోరముగాఁ గచాకచిన్
దిటముగ సల్పి రందుఁ దుద ♦ ధీరతఁ గంసుఁడు వ్యోమదైత్యుసు
త్కటముగఁ బట్టి కొట్టి తన ♦ దాసునిగా నొనరించుకొంచుఁ దా
నటుపయి నేగుచుండు సమ ♦ యంబున, నేనరుగంగ మ్రొక్కెయున్. ౨౧౭

శా॥ దేవా! యుద్ధము సేయ నిచ్చఁగల దే ♦ ధీరుం బ్రశంసింతువో
యేవీరుం గెలువంగఁ బూనెదవో ♦ యేమాడ్కిఁ జేయింతువో
మీవాణీవిధి లక్ష్యమందునిచి యా ♦ మేడంబునేఁ జేసి మీ
భావంబుం నెఱవేర్తుఁ గాన దయతోఁ ♦ బల్కందగుం నారదా. ౨౧౯

మ॥ అనఁగా నాతని కిట్లు సెప్పితిని న ♦ త్యానందకృత్సూక్తులన్
దనుజా! జిత్వరబాణదైత్యవిభుతోఁ ♦ దట్టాడి మట్టాడుమా
చనుమా! పట్టును బట్టుమా! యశము నా ♦ చంద్రార్కమౌనట్లుగాఁ
గనుమా! హర్షము గూర్చుమా! మిగుల వే ♦ గంబే జయంబొందుమా!

చ॥ జనకనరేంద్ర! యంత నల ♦ సాహసధైర్యసమేతనేతయుం
దనభుజవిక్రమక్రమముఁ ♦ దద్దఁ దలంచి మదించి మించి యా
ఘనబలుఁడైన బాణుఁ డటఁ ♦ గయ్యమునన్ దనుమాడి వత్తు నే
నని శపథం బొనర్చుచుఁ బ్ర ♦ యాణము సల్పె క్రమ క్రమంబుగాన్. ౨౨౦

ఉ॥ శోణితనామపట్టణము ♦ శూరులు మెచ్చఁగఁ జొచ్చె నంత నా
బాణుఁడు, కంసు రాకయును, ♦ బన్దను, బెద్దలచేత వించు గీ
ర్వాణమదప్రహారకుఁడ ♦ వాఙ్మహనీయనాథుఁడైన యా
బాణునిఁ గూర్చి యాకరణిఁ ♦ బగ్గెనొనర్చెనె? నెగ్గునే? యిటన్. ౨౨౧

ఉ॥ మమ్మని రక్తనేత్రుఁడయి ♦ యుర్విని మారెసు గ్రుంగ నాగలో
కమ్ము నుసుండు వారలును ♦ గంపము నొందఁగ భూమిమీఁద దా
ర్ఘ్యమ్ము గొలందిని నొక్క సాటి ♦ ముక్కుసి కొట్టి ఘనంబు మాడ్కి నా
దమ్మొనరించి "కంసుఁడ! ప్రమ ♦ తేఁ బుగఁ గ్రుంగిన దీని నెత్తుమా. ౨౨౨

చ॥ అనుపుఁ డత్తఱంబుననె ♦ హస్తి యదృచ్ఛఁ గరంబుఁ గొన్నమా
డ్కిని మహావీరవర్యుఁడు న ♦ డిన్ ధర, హస్తములన్ గ్రహించి పై
కినుకఁగ నెత్తె, నత్తఱి మ ♦ హాద్రులు గూలె రసాతలంబు లే
దును వెసఁ బైకి లేచెను, గ ♦ దుం జలియించెను దిగ్గజంబులున్. ౨౨౩

చ॥ తమపటిఁ గంసుతోఁ రణముఁ ♦ దాల్మినొనర్పఁగనుండు బాణు, నా
యదనునఁ గాంచి యీశుఁడు ర ♦ యంబునవచ్చి "బలిష్ఠ! బాణ! నీ
కిది సమయంబుగాదు మఱి ♦ యుద్ధబలుండగువాఁడు కృష్ణుచే
నదమదమొందు నన్యులకు ♦ సాధ్యుఁడుగాఁడని విశ్వసింపుమా. ౨౨౪

చ॥ మఱియును భార్గవుండు, నస ♦ మంబును వైష్ణవమైన యస్త్రమున్,
వరము, నొసంగె నీతనికి. ♦ వైరము నానుడి మానుమా" యటం
చిరువురకెంతయో చెలిమి ♦ యేర్పడ నేర్పుగ సల్పె, నంత, సం
బరమునఁ గంసభూవరుఁడు ♦ పశ్చిమదిక్కునకేఁగెఁ గ్రక్కునన్. ౨౨౫

చ॥ అటుపయిఁగంసుఁడాదెస మ ♦ హాసురుఁడొక్కఁడు వత్సరూపము
త్కటముగఁ బొందియుండెనని ♦ కర్ణములారఁగ నాలకించి తాఁ
బటురయమొప్పఁజేరి నర ♦ భక్షకునాతనిఁగాంచి వానితోఁ
జటులరణంబొనర్చి యవ ♦ సానమునందు నమందశక్తితో. ౧౨౬

ఉ॥ వాలముపట్టి నేలపయి ♦ వత్సనిశాచరు బాఁది యంత త
చ్ఛైలము వెంటనే తన వ ♦ శంబొనరించి తురుష్కభూమిలో
నూలుకొనంగఁ గాలయవ ♦ నుండను దైత్యుడొకండుగ్రాలె నం
చోలిఁజెవిన్ బడన్ వడి మ ♦ హాబ్ధతపద్ధతిఁజొచ్చెఁ దత్థ్సలిన్. ౧౨౭

తే॥ కాలయవనుండు నాచేతఁ ♦ గంసురాక, విని యమాత్యులతోడుత ♦ విజనదేశ
మందు యోజించి యాజియం♦దతనిఁగూల్చి, జయముగాంచెద నేనని♦జనకరాజ.

సీ॥ చూర్ణీకృతాఖండ ♦ శూరతాభూషితా, రాతులై యొప్పు పా ♦ దాతికులును
ఖండీకృతారాతి ♦ మండలశుండాల, మండలులైన వే ♦ దండములును
న్యక్కృతాదభ్రాభ్ర ♦ నవ్యగంభీరని, నాదంబులౌ మార్వ ♦ నాదములును
ధిక్కృతసూర్యాశ్వ ♦ దివ్యమనోవాయు, ధాటీయుతంబులౌ ♦ ఘోటములును

తే॥ బృథులరథములు సెలఁగఁగ ♦ వీరవీర, కాలయవనుండధఃకృత ♦ ఘనవిమాన
యానమెక్కి యొక్కుమ్మడి ♦ నరులమెదల, గాలమైతాఁక రణభేరి♦గీలుకొలిపి.

శా॥ రక్తిన్, యుక్తిని, వాహినీపతులఁజే ♦ రంబిల్చి ఘోరాహవో
ద్యుక్తుల్ గండు, క్రియాకలాపములఁ బ్ర ♦ త్యూహంబులేకుండఁ గా
యుక్తంబొనటులాచరింపుఁడని యి ♦ ట్లుత్సాహముంగొల్పి తా
రక్తశ్మశ్రుగదాధరుండయి సమి ♦ ద్రంగంబు సొచ్చెన్వడిన్. ౧౩౦

శా॥ కంసుం డాతని వానిసేనఁగని ని ♦ ష్కారుణ్యభావంబునన్
ధ్వంసబున్ బొనరింప నెంచి రిపుదో ♦ ర్దండతుతిప్రక్రియా
సంసిద్ధిప్రథితప్రధానగద, ల♦క్షౌభారయుక్తన్ సుధీ
సంసత్తుల్ గొనియాడఁ జేతఁగొని యా ♦ సంగ్రామరంగంబునన్. ౧౩౧

చ॥ గిరగిరఁద్రిప్పి వానిపయిఁ ♦ గేఁచన వేసియు సింహనాదమే
ద్తైఅ గరువంబునన్ సలిపె ♦ దిగ్గజముల్ చలియింప ఖేచరో
త్కరము భయంపడన్ ధర వ ♦ కావకలై పగులన్ గిరుల్ వడన్
శరధిసమూహమింక రిపు ♦ సైన్యమనన్యపు దైన్యమొందఁగా. ౧౩౨

ఉ॥ వెంటనె దంటయా యవన ♦ వీరుఁడు మీఁదికి వచ్చుతద్గదన్
గెంటుటకై మహాప్రలయ ♦ కీలితదండసముజ్జ్వలద్గదన్
గంటగిలంగవేసె. నిది, ♦ కంసగదాయుధమున్, బరస్పరం
బంటుచు దంటపోరతిశ ♦ యమ్ముగ సల్పెను మింటమంటలన్. ౧౩౩

తే॥ ఎట్టకేలకు రంపును ♦ గొట్టినట్టి, పిండివలెనయ్యె నంతఁ గం ♦ సుండు కాల
యవను నవనిపైఁ బడవేసి ♦ హస్తములను, బట్టికొట్టుచు జీవచ్ఛ♦వంబొనర్చి.

తే॥ బాణవర్షంబు గురిసెడి ♦ వానిసేనఁ, గాంచి గదతోడఁజూర్ణము ♦ గాఁగఁగొట్టి
యశ్వరథగజవీరుల ♦ హతమొనర్చి, ఘనముచాడ్పున గర్జించె ♦ జనకరాజ!

క॥ అంతట భయపడి మ్లేచ్ఛుల, నంతముగాఁ జింతనొంది♦యని విడి వడినే
పొంతలకో పరుగిడ; వాఁ, డంతయుఁగని మిన్నకుండె ♦ నాఁగనటంచున్. ౧౩౬

సీ॥ ప్రలయార్కబింబంబు♦వలె జిగిగలవాఁడు, గంబాలవలెఁ దోడల్♦ గలుగువాఁడు
గగనంబుఁ బోలిన ♦ కౌనుగల్గినవాఁడు, కమలాభ నేత్రముల్ ♦ గ్రాలువాఁడు
వాటమౌ పెద్దక ♦ వాటముక్రియ బొమ్మ,లరువాఁడు హారముల్♦ వఱలువాఁడు
నాఁబోఁతుమూఁపుల♦యంద మొందినమూఁపు,లమరువాఁడు కిరీట♦మలరువాఁడు

తే॥ రక్తవర్ణము, నసితవ♦స్త్రములునిడుపుఁ,గూకటుల్ గలుగువాఁడును♦గుండలములు
బద్మమాలయుఁ గలవాఁడు♦బలుఁడునైన, కంసుఁడంతటఁ గడుఁగండ♦ కావరమున.

వ॥ శత్రుపులకభేద్యంబగు వర్మంబుదాల్చి గదాముద్గరతోమరభిండివాలఖడ్గంబులను ధనుర్బాణంబులను నాజానుబాహువులన్ ధరించి పీనాంసంబుపైఁదూణీరంబునిచి జరామరణరహితులగు నమరుల నోడింపఁదలంచి తనచేఁబూర్వజితులైన చాణూర, ముష్టి, కారిష్ట, శల, తోశల, కేశి, ప్రలంబ, బక, ద్వివిద, తృణావ, ర్తాఘ, కూట, నరక, బాణ, శంబర, వ్యోమ, ధేనుక, వత్సాసురులు దన్నుఁజుట్టుముట్టి కొలుప ననుచరులు జయజయధ్వానంబు లొనర్పఁ బటహఢక్కాకాహళాది వివిధవాద్యశబ్దంబుల దిక్కులు పిక్కటిల్లి మాఱుమ్రోయ రణభేరిమ్రోఁగించి సమరోత్సాహసంపన్నుండై స్వీయచమూసమూహంబులకు సేనానులను నియమించి యుత్సేకించి ముక్కంటి నెక్కసక్కియమాడు రౌద్రాకారమ్మతో దండెత్తి వేల్పులకునికిపట్టగు సమరావతీపురంబుసొచ్చి యుచ్చమెచ్చియుండ. ౧౩౭

ఉ॥ శక్రుఁడు గాంచి వజ్రిముఖ ♦ శస్త్రములన్ గొని దాఁడిచేసె భూ
చక్రము గిర్గిరందిరుగ ♦ సాగరముల్ గలఁగంగఁ, దమ్ముఁడౌ
చక్రియు సంతసింప రిపు ♦ సైన్యము దైన్యముఁబొందుచుండ, ని
ర్వక్రపరాక్రమక్రమవి ♦ భాసురదేవగణంబు వెంటరాన్. ౧౩౮

ఉ॥ వీరులు వీరలిర్వురును ♦ విగ్రహమున్ బొనరింపసాఁగి దు
ర్వారభయంకరంబులగు ♦ బాణకృపాణగదాది శస్త్రసం
భారములన్ బరస్పరమ ♦ వారిగఁబోరియు దొమ్మియుద్ధమున్
నేరుపుతోడ ఘోరముగ ♦ నేఁదమినాడఁగ సల్పిరో విభూ! ౧౪౦

ఉ॥ ఒండొరు లిట్లు శౌర్యమున ♦ యుద్ధమొనర్చెడి కాలమందుఁ గో
దండ శరంబులన్ దమము ♦ దండిగఁ గ్రమ్మగఁ దేరునెక్కి యా

ఖండలుఁ డుద్ధతిన్ మెఱపు ♦ కైవడివెల్గు శతారమా పవిన్
గండునిఁ గంసునిం దునుమఁ ♦ గాఁ బడవైచెను మెచ్చఁ జూపఱుల్. ౨౮౧

ఉ॥ జృంభితదేవరాజపవి ♦ శీఘ్రగతిన్ బరికించి కంసుఁడు
స్తంభితకోపుఁడౌచు నరి ♦ దారణ దారుణ ముద్గరంబునన్
జంభవిభేది వజ్రమువె ♦ సన్ జెడి యంచులు మొక్కవోయి యు
క్కుంభినిఁ గూలునట్టుల న ♦ కుంఠితరీతి నొనర్చె నింద్రుఁడున్. ౨౮౨

శా॥ ఆలోకించి, మహోగ్రహోగ్రుఁడయిఁ, య ♦ య్యాలంబునన్, ఖడ్గముం
గేలం దాలిచి కంసశీర్షము పయిం ♦ గీలించి భీమారవం
బొల్లిన్ సల్పఁగ మాలతో మదకరే ♦ భోత్తంసముం గొట్ట నా
లీలన్ మాటి యలక్ష్యమయ్యె నది, హా ♦ హిన్, గంసుఁ డాహట్టునన్. ౨౮౩

చ॥ తడయక లక్షభారగురు ♦ తాదృఢతావిదితాష్టధాతుయు
క్తడమరకార్యకారి గదఁ ♦ దాల్చి పురందరు మీఁద వైవ నా
తఁడుగని దానిఁగైకొని న్ద్రు ♦ తంబునఁ గ్రమ్మఱ దైత్యవీరుపై
నిడఁ దన రౌతు మాతలి య ♦ హీనరుషన్ జనుదెంచి తోడుగాన్; ౨౮౪

చ॥ అలుకను గంసుఁ డాత్మహరి ♦ ఘాయుధమొంది మహేంద్రు మాఁపుపై
బలిమిని గొట్టఁ దోసఁగడ ♦ పట్టె క్షణంబతఁడామరుద్గణం
బులుగని గృధ్రపక్షయుత ♦ ముల్ బహుదీప్తిదీప్తబాణముల్
లలిఁగొని కంసుఁ గప్పెఁ;జడు ♦ లన్ మొగులర్కునిఁ గప్పుచొప్పునన్. ౨౮౫

ఉ॥ బాణుఁడు వేయిపాణుల న ♦ పారముగా విలునొత్తి యామరు
చ్ఛ్రేణుల బాణజాలములఁ ♦ జెండుట నావసు, రుద్ర, సూర్య, గీ
ర్వాణ బలిష్ఠులట్టికని ♦ పౌరుషమూని యనేకరీతులన్
బాణములన్నిటిన్ బఱపి ♦ బాణుని త్రాణ నణంగఁ జేయుటల్. ౨౮౬

ఉ॥ కాంచి మదించి మించి నర ♦ కత్రిదశారి, పల్లంబరాక్షసా
ద్యంచితుఁడై ఘనారవము ♦ నట్టుల బొబ్బలు వెట్ట, వేల్పులా
లించి సమీకరంగమున ♦ లీలను మూర్ఛను వ్రాలిరట్టి వ
జ్రాంచితుఁ డప్డులేచి యధి ♦ కాగ్రహనిగ్రహబద్ధచిత్తుఁడై. ౨౮౭

తే॥ పాటితాఖండశాత్రవ ♦ పాటవంబు, రమ్య విగ్రహాభాసురై ♦ రావతంబుఁ
గంసదైత్యుని రణమునన్ ♦ హింసఁజేయు, నంకుశాస్ఫాలనంబున♦ నంప,నదియు.

చ॥ కదనము సొచ్చి తుండమును ♦ గైకొని ఘూత్కృతులన్ బొనర్చి దు
ర్మదమును గ్రక్కచిల్లటుల ♦ మాటికిమాటికి ఘంటికాధ్వనుల్
రొదనొనరింప మంచుమల ♦ రూఢిసిఁ బోలి చరించి కంసునిన్
బదములఁ గూల్చ నాతఁడని ♦ వార్యబలోద్ధత శౌర్యధుర్యుఁడై. ౨౮౯

సీ॥ సింధూరఘనసార ♦ చందన కస్తూరి, గోరోచనావాస ♦ నారుచిరము
జంద్రికా మల్లికా ♦ శంకరశరదిందు, రజతాద్రివర్ణవి ♦ భ్రాజితంబు
శృంఖలా ఘంటికా ♦ శ్రేణి నిర్గతకర్ణ, పేయనినాద సం ♦ వేష్టితంబు
నభ్రగంగాప్రవా ♦ హాంబుని భవనాద, సమధికఘీంకార ♦ సంయుతంబు
తే॥ ప్రబలసంపన్నమున్ రమ్య ♦ రత్నకంబ, శాశ్వతంబును నగు నల ♦ యభ్రముపతి
దంతసంతానముం బట్టి ♦ తన పిడికిలిఁ, గొట్టి యింద్రుని రెండవ ♦ గ్రుద్దుగ్రుద్దె.

ఉ॥ దేవవిభుండు కంసనిహ ♦ తిన్ గడుదవ్వునఁ గూలెనట్టి యై
రావత మూరుపర్వముల ♦ వ్రాలుచు వ్యాకుల మొంది క్రమ్మఱన్
జేవ దలిర్ప లేచియుఁగ ♦ సిన్ రదనంబులఁ గొట్టి కంసుని
న్జేవడి లక్షయామడలు ♦ నెట్టెను మేలు! బళీ! బళీ! యనన్. ౨౫౧

చ॥ పడినను వజ్రకాయుఁడగు ♦ వాఁ డిసుమంత విచారమొంది యా
పిడుగువితానఁ జొచ్చి యని ♦ బెబ్బులికైవడిఁ గింకతోడ బ
ల్గడుసుగనున్న యాకరినిఁ ♦ గట్టిగఁ బట్టి రణాంగణంబునన్
బడునటు సల్పి పింఛిగతిఁ ♦ బల్లనొనర్చియుఁ జెండెఁ దొండమున్. ౨౫౨

క॥ అంతట నైరావతమున్, వంతన్ గడుఁగుంది వైరి ♦ వరులను దోడ్తో
నంతముసేయుచు నసివిడి, శ్రాంతిన్ గాన స్వర్గమేగె ♦ సరభసవృత్తిన్. ౨౫౩

ఉ॥ ఆపయిఁ గుంద వైరులు, మ ♦ హాబలు లర్ఘురె! యంచు నెంచ సం
తాపమువీడ నెచ్చెలులు, ♦ ధైర్యము స్వీయజనంబు వొందఁ, ద
చ్చాపము వైష్ణవంబుగొని ♦ జ్యానుఘటించుచు నెక్కుపెట్టి బ
ల్దాపుల వేల్పుమూఁకల వి ♦ ఘాతమొనర్చెను గంసుఁ డంతటన్. ౨౫౪

ఉ॥ కొందఱు వేల్పు లాజివిడి ♦ కుందుచుఁ బాఱిరి కాల్కొలందిగాఁ
గొందఱు ముక్తచూడులయి ♦ కూలిరి, తాళఁగ లేక కొందఱున్
సందుల గొందులన్ దరుల ♦ చాటున మాటున నక్కిరక్కిలిన్
గొందఱు ముక్తకచ్ఛులయి ♦ కోల్పడి రాత్మమహత్త్వమానముల్. ౨౫౫

ఉ॥ ఈరహినిన్ బరాజయము ♦ నెంతయుఁ బొందియు బాఱుచుండు బృం
దారకులన్ గనుంగొనుచుఁ ♦ దద్యదువీరుఁడు వారిగద్దియన్
జారుతరాతపత్రములు ♦ సత్వరితంబుగలాఁగికొంచు దే
వారులు వెంటనంట మధు ♦ రాహ్వయ పట్టణ మొందె నోవిభూ! ౨౫౬

వ॥ అని జనకునకు నారదమహర్షి వచించెనని శ్రీగర్గాచార్యుండు శౌనకునకుపదేశించి వెండియు నిట్లని చెప్పందొడంగె. హరిభక్తియుక్తుండును, మిథిలాధినాథుండు నగు బహులాశ్వుండు సురర్షివర్యుండగు నారదమునింగాంచి స్వామీ! మీసందర్శనంబున నాజన్మంబు చరితార్థంబయ్యె. నాకులం బనాకులంబై యమలం

బగు యశంబునుగాంచి లోకనుతంబయ్యె. మానుషుల నాకల్మషంబులు నశించిన వయ్యె. దుర్జనుండేని శ్రీకృష్ణభక్తులగు భవాదృశుల సందర్శనంబున నఘనిర్మూలకుండై సజ్జనుండగునని యొక్కమొగిఁ బెద్దలు వక్కాణింతురుగాదె! మఱియుఁ దత్కంసాది దుష్టవధార్థంబై పూర్ణావతారంబెత్తిన శ్రీకృష్ణుం డారాధాదేవితోఁగూడి యాగోకులంబున జన్మించి యేయేక్రీడల నెట్లెట్లొనరించెనో యెవరినెవరి ధన్యాత్మలంగావించెనో యాతెఱంగంతయు వినవలతుఁగాన వు వినిచి తాపత్రయనిర్మూలనంబొనరింపవేయని ప్రార్థింప నమ్మునీంద్రుం డారాజేంద్రుతో నిట్లనియె. ౨౫౭

ఉ॥ శ్రీకమలేశభక్తుఁడు సు ♦ శీలుఁడు నా నిమి యేకులంబు న
వ్యాకులముఁ బొనర్చి చరి ♦ తార్థమొనర్చెనో యాస్థతోడ నీ
వేకులమంనుఁ బుట్టి కడు ♦ వృద్ధిని జెందఁగ సల్పియుంటివో
యాకులమిత్తఱిన్ హరిక ♦ థామృతధారల ముక్తిఁజెందదే. ౨౫౮

మ॥ ఘనరక్షఃకులనాథకంసవధకై ♦ కాకుండ శిష్టావనం
బును సల్పన్ జనిఁ గాంచు కృష్ణుని మహా ♦ పూతంబులౌ పాపనా
శనకృచ్ఛీలములౌ శుభప్రదములౌ ♦ శ్రావ్యంబులౌ లీలలన్
వినవయ్యా! మిథిలాధినాథ! జనకా! ♦ విష్ణ్వంఘ్రిబద్ధాత్మతోన్. ౨౫౯

రాధావతార వర్ణనము.

మ॥ దివిఁ గప్పన్ ఘనముల్ నభస్సితఘనా ♦ ధృద్ఘ్నప్రయుక్తోదురా
డ్దివసంబంమఁ బవల్ జనించెను మహా ♦ తేజోవిశేషంబు యో
గ్యవిధిన్ దద్వృషభాను భార్య కలరా ♦ ధాభిఖ్య ముఖ్యంబుగా
నవలంబించి కళిందజాతటనికుం ♦ జాసన్నగేహంబునన్. ౨౬౦

చ॥ దెసలు ప్రసన్నతం గనెను, ♦ దేవగణంబులు సల్లెఁ బువ్వుముల్
బసదనమొందు సుందరులు ♦ బాటలు వాడిరి, కమ్మతెమ్మెరల్
విసరెను వాసనల్ దగ, ది ♦ విన్ గ్రహతారకలున్ వెలింగ నా
నిసువు జనించు నత్తఱిన ♦ నిర్వచనీయ మహత్వమేర్పడన్. ౨౬౧

ఉ॥ ఈ సుముహూర్తమందు జని ♦ నెత్తిన కోటిశరత్సుధాకరో
ద్భాసురపుత్రికన్ గని య ♦ థావిధిగాఁ దలిదండ్రులెంతో సం
తోసము సెంది దక్షిణల ♦ తోడుత గోవుల రెండులక్షలన్
భూసురవర్యసంతతికి ♦ మ్రొక్కి యొసంగిరి భావభక్తితోన్. ౨౬౨

ఉ॥ దేవమునీంద్రదుర్లభయు, ♦ దివ్యయుఁ, బూజ్యయుఁ, గోటిజన్మసం
భావితపుణ్యలభ్యయు, న ♦ పారమహాద్యుతిభాసమానరా
ధావిదితాఖ్య, స్త్రీసముది ♦ తప్రణయోక్త్యుపలాలితాంగియా
శ్రీవృషభాను పుత్రిఁ గని ♦ చెంది రమందముదంబు దేవతల్. ౨౬౩

ఉ॥ మేలిమిజాళువాపహోయలు ♦ మీఱి సువాసనతోడఁగూడి తా
గాలమెఱుంగుఁబొంది మగ ♦ తాల విలాసముఁ బ్రోసి వెల్గు ను
య్యాలను రాధికాశిశువు ♦ హాయిఁ బరుండఁగఁబెట్టి నెచ్చెలుల్
జోలలఁబాడి రానిసువు ♦ శుక్లసుధాంశునిఁబోలి పెంచ్చెడిన్. ౧౬౪

తే॥ నవ్యరాసమండల మండ ♦ నాయమాన, రాధికాదేవి, వృషభాను ♦ రమ్యవసతి
దీపపుంజంబుమాదిరి ♦ దివ్యచంద్రి, కవలె వెల్గించి వెల్గు న ♦ ల్గడలఁగడిఁది.

తే॥ అట్టి శ్రీకృష్ణుమెడయందు ♦ హారవిధిని, గ్రాలియుండెడి నుత్కృష్ట ♦ రాధ, నేను
భక్తితోడుత, వేమఱు ♦ భావమందు, ధ్యానమొనరించి తిరిగెద ♦ ధాత్రిలోన. ౧౬౬

వ॥ అన విని రాజేంద్రుండు మానీంద్రునితో నిట్లనియె. ౧౬౭

తే॥ ఏమియావృషభాను న ♦ దృష్టగరిమ,! యేమియాతని జాతకం ♦ బేమిదశయొ!
కాని యంతటిరాధను ♦ గనుటకొఱకు, నేమొనర్చెనో నాకది ♦ యెఱుఁగఁ జెపుమ!

మ॥ అనినన్ నారదుఁడాలకించి ధరణీం ♦ ద్రా! తొల్లి జన్మంబునం
దు నృగుండన్ వసుధాతలేంద్రునకుఁ బు ♦ త్రుండై మహాభాగుఁడై
ఘనుఁడై సర్వనరేంద్రనాథుఁడయి శ్రీ ♦ కాంతాంశసంభూతుఁడై
తనరెన్ నిర్జితకామరూపుఁడయి యి ♦ ద్ధాత్రిన్ సుచంద్రుండనన్. ౧౬౯

వ॥ ఇట్టి సుచంద్రుండనువానికిఁ, బితృదేవతలు తమ మానసంబున జన్మించినవారును, నతిమనోహరరూపిణులును, నగు కళావతి, రత్నమాల, మేనక, యను కొమరితలందుఁ గళావతియనుదానిని సాలంకారగావిధ్యుక్తముగా దానం బొనర్చిరి. పిమ్మట రత్నమాలను విదేహాధినాథునకును, మేనకను హిమవంతుని కొసంగి వివాహంబు విధివిధానంబుగా నొనర్చిరి. అంత వారిలో రత్నమాలకు సీతయు, మేనకకుఁ బార్వతియు నుద్భవిల్లిరి. వీరల చరిత్రంబులు పురాణంబులందుఁ బ్రసిద్ధంబులై యుండు. ఇఁక సుచంద్రుండనువాఁడు కళావతీసహితుండై గోమతీతీరంబుననుండు వనంబున దివ్యంబులగు పండ్రెండువత్సరంబులు బ్రహ్మను గూర్చి తపంబొనరింప నప్పరమేష్ఠి మెచ్చి యాతనిదరిఁ జొచ్చి వరంబు వేఁడుమనిన నతం డాలించి తనవెన్నునఁ బెరిగిన వల్మీకంబును దొలఁగించుకొనుచు నిర్మలదృష్టితో నద్దేవదేవుంగనుంగొని ప్రణమిల్లి యల్లన నిట్లు ప్రార్థించె. ౧౭౦

తే॥ నీదు దర్శన మబ్బుట ♦ నేను దేవ, దేవ! ధన్యతఁ జెందితి ♦ దివ్యమగుచుఁ
బరముకంటెను బరమయి ♦ వఱలుచుండు, మోక్షమొసఁగుమునాకిదే ♦ ముఖ్యవరము.

మ॥ అని ప్రార్థింపఁగ నాకళావతియు దుః ♦ ఖాంభోధినిర్మగ్నయై
కనుమో దేవ! నమస్కృతుల్ గొనుమ! నా ♦ కిష్టంబు మాయింపుమా
యనుమానంబును మానుమా! యెడద నీ ♦ యాలాపమాలింపుమా!
కనఁగా స్త్రీలకు భర్త యేడుగడయై ♦ క్రాలున్ గదా యోవిధీ! ౧౭౧

చ॥ తనపతికంటె వేఱొకటి ♦ దైవము సాధ్వులకెందు లేదటం
చు నిఖిలశాస్త్రముల్ వలుకు ♦ సూవె! దయన్ బతికీవు మోక్షమి
చ్చిననొకదాసినౌదు, మఱి ♦ జీవితనాయకు వీడి యెట్లు జీ
వన మొనరింతుఁ? గాన విడు ♦ పట్టును, శాపము నిత్తు లేనిచోన్. ౧౭౩

ఉ॥ నావుడు బ్రహ్మ దద్దరిలి ♦ నాతిరొ! పూతచరిత్రవౌటచే
నే వెఱపొందుచుంటి నిఁక ♦ నేను వచించినమాట సత్యమౌఁ
గావున నీవునుం దివికిఁ ♦ గాంతుని గూడియె యేఁగవమ్మ! సౌ
ఖ్యావహమార్గమొంది మన ♦ వమ్మ! క్రమమ్ముగఁ గాలమేగినన్. ౧౭౪

తే॥ ద్వాపరాంతమునన్ మీరు ♦ దంపతులుగ, భరతఖండమునందునఁ ♦ బరిఢవిల్లు
గంగయమునలనడుమను ♦ గ్రాలుచుండు, భూమియందునఁ దప్పక ♦ పుట్టఁగలరు.

తే॥ అంత మీ కల రాధిక, ♦ యనుఁగుబిడ్డ, యగుచు నెప్పుడుపుట్టునో ♦ యపుడు మీరు
మోక్షమందంగనుం డ్రిఁక ♦ మూల్గకమ్మ, యనుచు నోదార్చె నావల ♦ నావరమున.

తే॥ శ్రీభలందన నృపతికిఁ ♦ జిన్నిబిడ్డ, యై కలావతి, కాన్యకు ♦ బ్జాహ్వయపురి
యజ్ఞకుండసముద్భవ ♦ యై యపూర్వ, భవ్యరూపముతోడుతఁ ♦ బ్రభవమయ్యె.

క॥ అంత సుచంద్రుఁడు పూర్వో, దంతజ్ఞానంబుతో మ ♦ దనతుల్యుఁడు ధీ
మంతుఁడు గోపవరుండుగఁ, బంతుగ సురభానునింటఁ ♦ బ్రభవంబయ్యెన్. ౧౭౫

క॥ ఆతఁడు వృషభానుండని, భూతలమున ఖ్యాతికెక్కి ♦ పొలుపారఁగఁ బ్ర
జ్ఞాతిశయుండగు నందుఁడు, చేతంబునఁదలచి చూచి ♦ చివరకువేడ్కన్. ౧౭౬

క॥ తొలిబామునందుఁ జెలఁగిన, తెలివిగల కళావతీ స ♦ తీతిలకంబున్
బలుఁడగు నాతనికిడి ప్రాఁ, బలుకులు వచియించినటు వి ♦ వాహ మొనర్చెన్.

తే॥ పదపడిఁ గళావతీవృష ♦ భానువరులు, నతిశయప్రీతి నఖిలసౌ ♦ ఖ్యములఁ గనుచుఁ
గాఁపురముఁ జేయుచుండిరీ ♦ కథనువినిన, జనులు, స్వర్గపదంబునఁ ♦ దనరఁగలరు.

ఉ॥ శ్రీమధురాపురాన యదు ♦ శేఖరులందఱు, శూరునానతిన్
ధామమహితద్విజాగ్రణిని ♦ గర్గుఁ బురోహితుఁగా నొనర్చి బ
ల్ప్రేమ ముడిఁజూచి రొక్కయెడ ♦ వేదవిదుండగు నాతఁడంతొ గా
రామునఁ జేరె నట్టి మధు ♦ రానగరీశుని రమ్యహర్మ్యమున్. ౧౮౧

వ॥ సకలజనమనోభిరామంబగు నాసౌధమందున నవరత్నఖచితంబులై నయన పర్వముగావించు హాటకకవాటంబులుగలిగి, చేఁగలమెకంబులచేతుల యాక్షేపంబులఁ దాకుళ్లఁజెందు తేఁటులపాటల నీటువొంది యవిచ్ఛిన్నంబుగాఁ బ్రశస్తహస్తి గండస్థలంబులనుండి స్రవించుమదంబునఁ జల్లనై సువాసితంబును, నానామండన మండితంబును, నఖండంబునై వెలుంగు నొండుమండపంబునఁ బరపురరథరథ్యరథిక వినాశకరణసమర్థంబులగు కరితురగరథపతాకంబులతో శత్రువులకభేద్యంబులగు

తనుత్రాణంబులందాల్చి నిల్చి పగతుఱ రూపుమాపఁజాలుభటవర్యులు జయజయని నాదంబులుసలుప, నిర్వక్రపరాక్రములగు దేవకాక్రూర, కంసాదివీరులు నల్గడలఁ బరివేష్టించికొలువఁ బరిజనంబులు ఛత్రచామరంబులంగేలంబూని యుభయపార్శ్వంబులందునిలువ, నభఃపీఠంబున విరాజిల్లు తరణికరణి, సర్వార్థప్రదాతయగు చింతామణిపైఁదనరారు సురపతిసరణిని, సింహాసనంబునఁజెలంగు యదువిభుండును, నిగ్రహానుగ్రహాసమర్థుండునునగు నుగ్రసేనుండు తనచెంగటకేతెంచు నాబ్రహ్మాదివర్యుని ౨౭౩

ఉ॥ కాంచుచుఁ గన్నులారఁ దన ♦ గద్దెను డిగ్గన డిగ్గి శీర్షముల్
వంచి నమస్కరించి యదు ♦ వర్యులఁగూడి తదంఘ్రియుగ్మమ
ర్చించి సుభద్రపీఠిని వ ♦ సింపనొనర్చి స్తవంబు భక్తిఁగా
వించి నతోత్తమాంగుఁడయి ♦ వేఱగు పీఠినిఁ దాఁజెలంగఁగన్. ౨౭౪

దేవకీవసుదేవ వివాహవర్ణనము

ఉ॥ గర్గబుధోత్తముండు గని ♦ కౌతుకమొంది ప్రియంబుతోఁజతు
ర్వర్గమొసంగు దీవనల ♦ బాగుగఁ జేసి యదూత్తమా! భవ
ద్వర్గమునందు సేమమొకొ? ♦ పాడియుఁ బంటయుఁ జక్కనున్నవే?
దుర్గమముల్ సుఖంబులొకొ? ♦ తోషణమొందుచునుందురే! ప్రజల్. ౨౭౫

చ॥ అని సుఖమడ్గి తత్సవిధ ♦ మందు వసించిన దేవకాఖ్యుని
గని వినుమోయి దేవక! య ♦ నంతను నారయ యాదవాన్వయం
బున వసుదేవుఁబోలిన సు ♦ బుద్ధి మఱొక్కఁడులేఁడు గాన నీ
తనయను నాదుమాటవిని ♦ తద్బలి కీవిడి పెండ్లిసేయుమా! ౨౭౬

వ॥ అనవుడు నాతండు సరియనియొప్పి స్వజనహితసహితంబుగా దేవకీవసుదేవులకు వివాహంబు శాస్త్రవిహితంబుగా నొనర్చి దాసీసహస్రంబును, హయనియుతంబును, గజాయుతంబును, గోలక్షద్వయంబును, రథనియుతంబును బారిబర్హంబుగా సమర్పించి భేరీమృదంగఢక్కావీణావేణుగోముఖాది నానా వాద్యంబులు శ్రావ్యంబుగా మ్రోఁగుచుండ నల్లునితోఁ దన కూఁతును బయనంబు సేసి సర్వాలంకృత్యలంకృతంబగు నరదంబు రప్పించి దానిపైఁ దన్మిథునంబునెక్కించి యనుపుచుండుతఱిం గంసుఁడు తన చెలియల యుల్లంబు సంతసిల్లంజేయఁ దద్రథంబధిరోహించి రథ్యంబుల రశ్ములంబట్టి వినోదంబుగా నడుపుచున్నంత.

ఉ॥ అంబరవాణి, యీమె కను ♦ నష్టమగర్భము నిన్నుఁ జంపు స
త్యంబిపుడీవు మిక్కిలి ద్రు ♦ తంబున మావులఁబట్టి త్రోలుచున్
సంబరమొందుచుంటివిఁక ♦ స్వాంతమునం బరికింపుమా! యటం
చింబుగఁ బల్కెఁ గంసునకు ♦ నెత్తిఱ నయ్యదివించు నాతఁడున్. ౨౭౭

ఉ॥ చెట్టలఁగూడువాఁడగుటఁ ♦ జెల్లెలటంచనకుండఁ గొప్పునుం
బట్టుచు వాఁడివాలుఁగొని ♦ భావమునన్ దయవీడి చంప మో
పెట్టుటఁగాంచి పార్షదులు ♦ భీతినిజెందిరి కుందిరందఱున్
గట్టడికర్మమంచనిరి ♦ గౌరవభాజనులెల్ల రయ్యెడన్. ౨౮౯

మ॥ వసుదేవుం డల కంసుఁబట్టికొని బా ♦ వా! భోజవంశంబునన్
బసఁగాఁ జేసెడివాఁడవై బలుఁడవై ♦ బాణాఘభౌమాదులన్
గసిమై నల్పి సుకీర్తిచే నలరి శ్లా ♦ ఘ్యప్రక్రియాకారివై
స్వసయౌ నీమెను బట్టి కొట్టుటిది సా ♦ జన్యంబె? మాన్యంబొకో? ౨౯౦

చ॥ అదియునుగాక నాకిపుడె ♦ హాయిగఁ బెండిలి నల్పి యీవిధిన్
సదమదముంబొనర్చెడి వి ♦ చారణఁ జేయుట గూడదయ్య! నీ
యెద దయఁ బూనవయ్య! శుభ ♦ మెంతయు నీకు ఘటించు నీమెపై
మదమును జూపకయ్య! యభి ♦ మానము మానకుమయ్య! యయ్యెడన్. ౨౯౧

ఉ॥ చిన్నది సుందరీమణి సు ♦ శీలయుఁ గావున నీకుమంచు నె
న్నెన్నియొ తెన్నులన్ వినయ ♦ మెంతయుఁ దోఁప వచింప నాతఁడా
యన్నిటి నాలకింపక ద ♦ యారహితుండయి యామెఁ జంపఁగా
నున్నఁ, గడంగి క్రమ్మఱను ♦ యుక్తవిధిన్ వసుదేవుఁ డిట్లనెన్. ౨౯౨

ఉ॥ చక్కనియక్కఁ డీఁడ! వినుఁ ♦ జంపెడి దష్టమగర్భమేకదా
చక్కఁగనున్న దొక్కనుడి ♦ సాంతముగా విని యద్ది చేయుమా!
యిక్కమలాక్షియర్భకుల ♦ నెప్పటికప్పుడె తెచ్చి యిచ్చెదన్
నెక్కొని చంపుమా! భయము ♦ నెట్టుమ! చెల్లెలిఁ బ్రోవుమా! దయన్.

ఉ॥ నావుడుఁ గంసవీరుఁడును ♦ నాకు భయంబిఁక లేదటంచుఁదా
నావసుదేవసూక్తి విని ♦ యంతట స్వీయగృహంబు సేరె. నా
దేవకితోడఁగూడి వసు ♦ దేవుఁడుగూడ స్వధామమొందె భీ
త్యావృతమానసుండయి ధ ♦ రాధిపమౌళిమణీ! సుధీనిధీ! ౨౯౪

తే॥ అట్టులాకంసుఁ డిలుసేరి ♦ యస్త్రశస్త్ర, ధరులఁబదివేల జోదులఁ ♦ దత్క్షణమునఁ
బంప వారలు వసుదేవ ♦ భవనమొంది, ముట్టడించిరి పరుగిడి ♦ పోవకుండ.

క॥ ఆవసుదేవుఁడు పిమ్మట, దేవకియందష్టసుతుల ♦ దివ్యులఁగనియున్
గేవలమాయను గన్నెగ, శేవనుగనె వానిరీతి ♦ కవి వచింతున్. ౨౯౬

ఉ॥ ఆదినిఁ గీర్తిమంతుఁడను ♦ నర్భకునొక్కనిఁగాంచి కొం చతం
డాదను గంసుమ్రోల నిడ ♦ నాతఁడు గన్గొని యిచ్చమెచ్చి యో
యాదవ! వీఁడు నన్నడఁపఁ ♦ డష్టమగర్భముఁ బ్రుంతుఁ గాన వే
మోదముతోడఁ వీనిఁగొని ♦ పొమ్మనిచెప్పె. విదేహనాయకా! ౨౯౭

క॥ అంతట వసుదేవుండును, సంతసపడి కొడుకుఁగూడి ♦ చని స్వగృహమునన్
వింతలుగద! యరయఁగ దు, శ్చింతక వాక్యంబులంచుఁ, ♦ జెలఁగుచు నుండెన్.

ఉ॥ అత్తఱిఁ గంసవీరవరుఁ ♦ డభ్రపథంబున వచ్చునాకు నా
యత్తముసేసి యర్ఘ్యము ప ♦ దాబ్జయుగంబున కర్చసల్పి యో
సత్తమ! నీదుభావమును ♦ సత్వరమే వచియింపుమన్న నేఁ
జిత్తము హర్షమొందునటు ♦ సెప్పితి నాతనికిట్లు లోవిభూ! ౨౯౯

తే॥ దేవతలు దేవకీముఖ ♦ దివ్యసతులు, దేవులెల్లరు తద్వసు ♦ దేవముఖులు
నష్టవసువులు నందాదు ♦ లట్టి బుక్కు, లెల్లగోపికలై యుండి ♦ రిలను గంస.

చ॥ మఱి వృషభానునామముఖ ♦ మాన్యులు వేల్పులు, నట్టి దేవకీ
తరుణికి నేడుగర్భములు ♦ దైవవశంబునఁగల్గు. నాయనం
తరమున నష్టమం బమరి ♦ తప్పక నిన్వధియించునంచు ని
ర్జరులని, రద్ది నీకిపుడు ♦ చక్కఁగ జెప్పితి గుర్తెఱుంగుమా! ౩౦౧

చ॥ ఇటుల మదాశయంబునిడి ♦ యేగితి దానిని విన్నకంసుఁడు
త్కటమగు కోపమొంది యదు ♦ కాండము నంతయుఁ జంపఁబంతమున్
దిటముగఁబట్టి యట్టి వసు ♦ దేవుని, దేవకి, బంధనంబునం
దటమటసెంద సంకెలల ♦ హస్తములన్ దగిలించి యుంచియున్. ౩౦౨

ఉ॥ దేవకి పెద్దబిడ్డఁగొని ♦ తీక్ష్ణతరంబుగ నొంపుబండపైఁ
జేవను గొట్టి నిట్టులనె ♦ చిత్తమునందలి విష్ణుభీతి నా
దేవకి పుత్రషట్కము వ ♦ ధించెఁ గ్రమంబుగ; నుగ్రసేనధా
త్రీవరుఁ డిద్దివించు వసు ♦ దేవుని రక్షణసేయు పూన్కితోన్. ౩౦౩

ఉ॥ ఆగ్రహవహ్ని మండ సభ ♦ యందువసించిన శత్రుపుత్రు దు
ష్టాగ్రణిఁ గంసవీరుఁ గను ♦ లారఁ గనుంగొని యడ్డగింప నా
యుగ్రబలుం డెదుర్కొనుచు ♦ నుద్ధతిఁజూపఁగ నుగ్రసేనయో
ధాగ్రణు లుగ్రశస్త్రముల ♦ నంది యవక్రపరాక్రమంబునన్. ౩౦౪

ఉ॥ కాచి స్వకీయసైన్యములఁ ♦ గాల్చిరి కంసునిసేనఁ దత్స్థితిన్
జూచిన కంసవీరు లరి ♦ శూరబలంబుల మాయఁజేయఁగా
లేచి మహాస్త్రశస్త్రముల ♦ లీలఁగ వేయఁదొడంగి రంతటన్
ద్రోచుకొనం గడంగిరి య ♦ దుప్రవరుల్ మఱిఁ గంసయోధులున్. ౩౦౫

తే॥ ద్వారదేశమునందు ను♦భయుల సైన్య,ములును బోరాడె నాశుగ♦ములఁ గఠారు
లను బరస్పరజయకాంక్ష ♦ దనరెనందు, జనులుపదివేలుమడిసిరి ♦ శక్తిలేక.

తే॥ అంత నాకంసవీరుఁ డ♦య్యాహవమునఁ, దండ్రిసేనలఁ గనుఁగొని ♦ తత్క్షణమున
రోషరోహితమూర్తియై ♦ రుద్రమాద్రి, వైరిమత్తేభహరి గదఁ ♦ బట్టి కొట్టె.

ఉ॥ కొందఱు ఛిన్నపాదులును ♦ గొందఱు ఛిన్నలలాటకుల్ మఱిం
గొందఱు భిన్నకంఠులును ♦ గొంద ఱధోముఖు లూర్ధ్వగాత్రులున్
గొందఱు పీతవస్త్రులయి ♦ కూలిరి గొందఱు బాఱి రందునన్
గొందఱు నెత్రుటఁ గ్రక్కిరిఁక ♦ గొందఱు మూర్ఛితులైరి వెండియున్. ౩౦౮

ఉ॥ కాయములందు గాయములఁ ♦ గాఱెడి నెత్రున నిండె నుగ్రసే
నాయతగోష్ఠి; చూపఱుల ♦ హా యని చింతిలి రంతఁ గంసుఁడున్
బాయక యుగ్రసేన విభుఁ ♦ బట్టుచు గద్దియనుండి నీడ్చి యా
సాయము సేయువారిని, వె ♦ సన్ జెఱఁబెట్టెను ద్రాళ్ళఁగట్టియున్. ౩౦౯

ఆ॥ మఱియుఁ గంసవిభుఁడు ♦ మధుశూరసేన దేశములగడనఁ జేసి ♦ స్వర్ణపీఠ
నెక్కి మిగుల నిక్కి ♦ చెల్లయాదవులను, బాధపెట్టుచేలెఁ ♦ బార్థివేంద్ర. ౩౧౦

తే॥ యదువరులు, వాని హింసల ♦ కాగలేక, దేశకాలపాత్రములిటఁ ♦ దికమకలుగ
నుండెనని యెంచి దూరమం ♦ దున్న స్వీయ,బంధుగృహముల కేగిరి ♦ ప్పట్టునందు.

బలరామావతార వర్ణనము.

తే॥ దేవకీసతి కేడవ ♦ దివ్యగర్భ, మధిక హర్ష శోకములతో ♦ నతిశయింప
యోగమాయ, దానిని గొని ♦ యుక్తరీతి, రోహిణీకుక్షిఁ గూర్చె ని ♦ రూఢశక్తి.

తే॥ అంత మధురాపురీ ప్రజ ♦ లరరె! యేమి! దేవకీగర్భమేమయ్యె ♦ దివ్యశక్తి
నెటకుఁ బోయెనో? యేవిధి ♦ యెఱుకపడదు, చిత్రమయ్యెడినని లలిఁ ♦ జెప్పుకొనిరి.

తే॥ అవల రోహిణికి గర్భమై ♦ యైదు దినములైన పిమ్మట దేవకీ ♦ మానవతియు,
నందమందిరమెంతయు ♦ నాణెమైన, ప్రభల వెలుఁగంగ భవ్యమా ♦ వ్రజమునందు.

తే॥ ఐదు గ్రహము లుచ్చస్థితి ♦ నలరుచుండఁ, దులను స్వాత్యుడు బుధవార ♦ కలితమైన
భాద్రపదశుద్ధషష్ఠినిఁ ♦ బట్టపవలు, కులవధూమణియా నామె ♦ బలునిఁ గనియె.

ఉ॥ వేల్పులు, పూలగుత్తులను ♦ బెల్లుగఁ జల్లిరి, వారిదోత్కరం,
బల్పతుషారముం గురిసె, ♦ నావల, నందుఁడు, బిడ్డకున్ బ్రియా
జల్పిత జాతకర్మమును ♦ సల్పి ధరామరపంక్తి కాల న
స్వల్పముగా నొసంగి హిత ♦ బాంధవ గోపుల గౌరవించియున్. ౩౧౧

ఉ॥ గాయకవర్యులన్ మిగుల ♦ గానమొనర్పఁగఁ జేసె నప్డు ద్వై
పాయన దేవరాత గురు ♦ వర్య వసిష్ఠులు నేను దేవలుం
డా యెడ కేగి సత్కృతుల ♦ నంది ముదంబును బొందియుండ ద్వై
పాయనుతోడ నందుఁడతి ♦ భక్తిఁ గరంబుల మోడ్చి యిట్లనెన్. ౩౧౨

శా॥ ఆర్యా! సుందరుఁడైన బాలకుఁడు పం ♦ చాహంబులన్ బుట్టె నీ
యార్యాణికి బరికింపఁ జిత్రములలో ♦ నత్యద్భుతంబయ్యె నీ

కార్యం బెచ్చటనైనఁ జూచితివె యో ♦ కారుణ్యరత్నాకరా!
స్థైర్యంబుల్ గలిగింపవే! మఱియు నా ♦ సందేహముం బాపవే! ౩౧౮

చ॥ అని యదుగర్గ ప్రసన్నుఁడయి ♦ వ్యాసుఁడు నందునికిట్లు చెప్పె వీఁ
డనుపమసుందరుం, డహికు ♦ లాధిపుఁడే బలిరాము దేవకీ
వనితనుఁజేరియుండ హరి ♦ పంపున సొంపుగ యోగమాయ, గై
కొని యల రోహిణీలలనఁ ♦ గూర్చెను నెవ్వరెఱుంగనట్లుగాన్. ౩౧౯

ఉ॥ నంద! భవన్నికేతనము ♦ నన్ గనియుంటివి వీని నయ్యరే!
యిందుదివాకరేంద్రముఖు ♦ లిద్ధమునుల్ గనఁజాలరే! మఱే
మందుము నీదుభాగ్యము న ♦ హా! యతనింగన వచ్చియుంటిమే
మిందుల; కిప్పుడా శిశువు ♦ నేర్పడఁ జూపుము! కోర్కెఁ దీర్పుమా. ౩౨౦

మ॥ అనినన్ నందుఁడు వానిఁజూపఁదమి నా ♦ వ్యాసాదులుం గాంచి చి
ద్ఘనరూపాయ, నమోస్తు తే, భగవతే, ♦ కంసానుజారాతయే,
ఘన నీలాంబర ధారిణే, సలిలజా ♦ కర్ణాంతనేత్రాయ సం
దనిశాంతాంతరభాసురాయ గురవే, ♦ ధర్మజ్ఞనేత్రే నమః. ౩౨౧

పంచచామరము.

బలీ! హలీ! ధరాధరా య ♦ పారధైర్యసాహసా!
ప్రలంబఘాతకా! సురాసు ♦ ర ప్రధానవిక్రమా!
కలాలవాల! గౌరవర్ణ ♦ కమ్రరూప మోహనా!
సులక్షణోజ్జ్వలక్షణా! య ♦ శోమతీసుతాగ్రజా! ౩౨౨

సీ॥ నీ వజేయుండవు ♦ నీవె ధ్యేయుండవు, దుర్జనలోకైక ♦ భర్జనుండ!
కూపకర్ణారివి ♦ కుంభాండవైరివో, తీర్థయాత్రాసక్త ♦ దివ్యచరిత!
బల్వలారివి నీవ, ♦ ద్వివిదారివీవయో, హస్తినాపురకర్ష ♦ ణాతిచతుర!
నీవె పూర్ణుండవు ♦ నీలాంబరుండవు, భీమదుర్యోధన ♦ విభుగురువర!
తే॥ రుక్మిధేనుకకూటవి ♦ రోధివీవె, దేవదేవుండవీవెయో ♦ రేవతీశ!
రౌహిణేయుండ వీవె ప♦రాత్పరుండ, వీవె మావందనములొంది♦కావవయ్య!

చ॥ జయజయ కామపాల! యదు ♦ సంతతిసాగరజాతచంద్రమా!
జయజయ దేవకీతనయ! ♦ సత్యదయాశుచిసారమేదురా!
జయజయ నిర్మలాత్మ! వ్రజ ♦ సంభవ గో జన గోపికా ప్రియా!
రయమునఁ గాంచి రామ! బల ♦ రామ! దయన్ మము రక్షసేయుమా!

తే॥ ఇది పఠించిన మానవు♦లెల్ల పాప, ములను ద్రోసి యష్టైశ్వర్య♦ములను బొంది
హరిపదంబుఁ గాంచెద రంత♦వ్యాసముఖులు, నతులఁజేసి సరస్వతీ♦నదికిఁజనిరి.

శ్రీకృష్ణజననకథాప్రారంభము.

కం॥ మఱియుఁ బరిపూర్ణతముండును, బురుషోత్తముఁడైన కృష్ణ ♦ మూర్తి జగచ్ఛం
కరుఁడయి వసుదేవ మాన, స్సరసీరుహమందుఁ జొచ్చె ♦ జనకనరేంద్రా! ౩౨౮

తే॥ అదిమొదలుకొని వసుదేవుఁ ♦ డర్కచంద్ర, వహ్నులనుమించు తేజున ♦ వఱలి యింద్రు
తీరునన్ వెల్గె. నౌర! యా ♦ దేవకియును హరిని గర్భంబునందాల్చె ♦ హర్షమతిని.

తే॥ తాల్చినది మొదల్కొని యట్టి ♦ తన్వి మేఘ, మందుఁ జంచలకైవడి ♦ నాలయమున
వెలుఁగఁ దొడఁగె నా కంసుండు ♦ గలయఁ జూచి, యడలుకొనియనుకొనె నెదన ♦ యాత్మ నిట్లు.

సీ॥ లేదు నిస్సత్త్వ ♦ లేదు ఖేదము లేదు, కడుపున నొప్పియో ♦ కరులు లేవె,
తొంటిపీడయు లేదు ♦ తోఁపక యుండుట, లేదెట్టి చెట్టల ♦ వాదు లేదె,
యన్నముపై రోఁత ♦ యందుచుండుట లేదు, చిక్కిపోవుట లేదు, ♦ చీడ లేదె,
గృహకృత్యములనొందు ♦ గ్రేణి సేయుట లేదు, మంచినడవడియు ♦ మాన లేదె.

తే॥ అశుచి, లేదింతచింతయు ♦ నంద లేదు, నాదు నిర్బంధముప్విడ ♦ లేదయారె!
యిలను గర్భిణులెందఱో ♦ కలరుగాని, యిట్టి గర్భిణి నెచ్చోట ♦ నేను సూడ. ౩౨౯

ఉ॥ అంచితకాంతిసంయుత, శు ♦ భాంగిని, దేవకిఁ, గూర్చి యాతఁ డ
ల్లంచి, కటా! కటా! యకట! ♦ యేనిఁకఁ దక్కనటంచు, నెంతో చిం
తించి, భయాకులుండగుచు ♦ దేవకి! నన్ను వధించు గర్భ, మే
తెంచెను. గానఁ బుట్టఁగ వ ♦ ధింతు నటంచనె నాకతాయయై. ౩౩౦

చ॥ పలికి యటుల్ యదుప్రభుఁడు ♦ భ్రష్టమనంబున నింటికేగి యా
వలమురితాలుపెప్డు నను ♦ బట్టి వధించునో యంచు దిక్కులన్
గలయఁగఁ జూచు, నూఁచుఁ దలఁ, ♦ గ్రాఁగును, వాఁగును, గ్రొవ్వు, నవ్వు, మీ
సలఁ బలుమాఱు నువ్వు, నిఁకఁ ♦ జచ్చితి నీహరిచేత నంచనున్. ౩౩౧

తే॥ అట్టి వేళను గంగాధ ♦ రాబ్జయోని, ముఖనిలింపులు, నేమును ♦ మునులఁ గూడి
వచ్చి వసుదేవు చెఱసాల ♦ పైని నిల్చి, పుట్టఁబోయెడి శ్రీకృష్ణ ♦ మూర్తి కెఱఁగి.

సీ॥ స్వాప్నాద్యవస్థలన్ ♦ సల్పఁ గారణుఁడయ్యు, నొండెడఁ గాకయే ♦ యుండు నెవఁడు
యోగీంద్రులకుఁ జిక్క ♦ కుండియు భక్తజ, నతతికిం జిక్కును ♦ కృతి యెవండు
పంచభూతంబులన్ ♦ బరిధవిల్లఁగఁ జేసి, యవ్వాని నడపెడి ♦ నధికుఁ డెవఁడు
స్థావరజంగమ ♦ సకలసృష్టికి మూల, కందమై సుఖముగాఁ ♦ గ్రాలు నెవఁడు

తే॥ మాదృశామర్త్యులందఱ ♦ మనుచు నెవఁడు, దుష్టశిక్షకుఁ డెవ్వఁడు ♦ శిష్టరక్ష
కుండు నెవఁడగు నీవెగా ♦ దొక్క? నిన్ను, సన్నుతినిసల్పఁగల మొకో ♦ శరణు శరణు.

తే॥ వీతిహోత్రుని యందున ♦ విస్ఫులింగ
గణము పొరరానికైవడిఁ ♦ గ్రతుభుజులును

ఋషులు రాజులు మహాదాదు ♦ లెవనియందుఁ
జొరఁగ వీల్గాదొ యా నీకు ♦ శరణు లివిగొ. ౩౩౪

చ॥ బలుల బలుండవై సుజన ♦ వశ్యుఁడవై యుపకారకారివై
యిలకు విభుండవై శ్రుతుల ♦ కింతయుఁ జిక్కనివాఁడవై మహా
ప్రలయమునన్ వెలుంగు భగ ♦ వంతుఁడవై పరిపూర్ణమూర్తివై
చెలఁగెడి నిన్నిదే శరణు ♦ సెందితిమో వసుదేవనందనా! ౩౩౫

స్రగ్విణీవృత్తము.

రాధికావల్లభా! ♦ రమ్యరూపాన్వితా!, సాధుబృందారతా! ♦ సత్యశౌచాయుతా
గోధనాధీశ్వరా! ♦ గోపవేషోన్నతా!, శ్రీధరానాయకా! ♦ చిత్తజాతాత్మజా.

తే॥ ఆదిమధ్యాంతరహిత! యో ♦ యప్రమేయ! నిత్యశుద్ధబుద్ధావ్యయ ♦ నిర్వికల్ప
నిర్గుణానందఘనమూర్తి! ♦ నిన్ను మేము, శరణుసెందితి మియ్యదే ♦ శరణు శరణు.

వ॥ మఱియు గతాగతంబులగు కల్పంబులందును, యుగంబులందును, మన్వంతరంబులందును, నంశాంశాంశకలావేశపూర్ణపరిపూర్ణావతారంబులం గల్పించి జగంబు సృజించి యందుఁ గర్తవై భర్తవై హర్తవై చెలంగి పరిపూర్ణతమావతారంబెత్తి దుష్టశిక్షణంబును, శిష్టరక్షణంబు నొనర్ప బద్ధకంకణుండవై శ్రీకృష్ణనామంబునం బెరుగఁ బోవునీకు మే మొనర్చిన నమస్కారంబులమే లెంచి మాపయి దయనించి గ్రహించి యధర్మమడంచి ధర్మంబుద్ధరింపుమని ప్రార్థించి వెండియు.

ఉ॥ మ్రొక్కెదమేము నీదుపద ♦ ముల్ దలఁదాల్తుము పాదధూళి, సొం
పెక్కిన విగ్రహంబు నెద ♦ నెప్పుడు సంస్మరియింతు మాఖ్యయున్
జిక్కఁగ నుచ్చరించెదము ♦ సత్వరమే దయచేసి మార్తురన్
దుక్కొనరింపవయ్య! హరి! ♦ తోయజపత్రవిశాలలోచనా! ౩౩౬

తే॥ ఇట్లు ప్రణుతించి బ్రహ్మాదు ♦ లిద్ధమునులఁ, గూడి ముదమున హరిఁ గొని ♦ యాడు చాత్మ
గేహములకేగి, రంత శ్రీ ♦ కృష్ణమూర్తి, జననమందెడి సమయము ♦ దనరెనపుడు.

శ్రీకృష్ణావతార ఘట్టము.

చ॥ దెసలు ప్రసన్నతంగనెను ♦ దేజముదాల్చెనభంబు భూమియున్
బసదనమొందె, సంద్రము ల ♦ భంగురలీలను బొంగెఁ, దారకల్
మిసమిసలాడె, వాహినుల ♦ మేయముగాఁ బ్రవహించె వేడ్కతోఁ
బసులు పయస్సులన్ బిదికెఁ ♦ బద్మములున్ వికసించె వెండియున్. ౩౪౧

సీ॥ పరిమళంబునుగూడి ♦ బాధలఁబోఁగొట్టు, మలయవాతము, వీచె ♦ మందగతిని
జింతలఁబోఁద్రోచి ♦ చెవులకునింపుగా, గాయకుల్, బాడిరి ♦ క్రమరీతి
గాసిఁదొలంగించి ♦ కర్ణపేయముగాఁగ, శారికాదులు, గూసె ♦ సౌఖ్యదశను
భేరీమృదంగాది ♦ వివిధతూర్యంబులు, మ్రోయఁగాఁ దొడఁగెఁ బ్ర ♦ మోదవిధిని

తే॥ వాసనావాసితంబగు ♦ పౌష్పరజము, వ్యాప్తిసెందుచు నుండె న ♦ పారసరణిఁ
దేంట్లు పాటలువాడెను ♦ దివ్యపక్కి, జలధరంబులు వర్షించె ♦ స్వల్పరీతి.

ఉ॥ దేవగణంబు పూవులను ♦ దివ్యముగా వెదచల్లె నగ్రజుల్
భావములన్ భయంబు విడి ♦ వహ్నుల వ్రేల్చి ముదంబు సెందిరా
పావకుఁడున్ మహోజ్జ్వలత ♦ భాసిలెఁ బౌరులుఁ, బల్లెవాండ్రు, సా
ఖ్యావహమార్గముం గనిరి ♦ హర్షముసెందిరి సుందరీమణుల్. ౩౮౩

క॥ ఆడిరి రంభాదులు దమిఁ, బాడిరి తత్కిన్నరులును, ♦ బహువిధనుతులన్
వేఁడిరి చారణసిద్ధులు, గూడిరి గంధర్వజనులు ♦ గొనియాడుటకై. ౩౮౪

తే॥ జయజయారావముల్ సల్పి ♦ సర్వజనులు, మునులు దీవెనలం జేసి ♦ మురియుచుండ
యాదవేంద్రులు సభయులై ♦ యలరుచుండఁ, బారిజాతాదికుసుమముల్ ♦ బైని వ్రాల

తే॥ అర్ధరాత్రంబున ందింపుఁ ♦ డభ్యుదయము, సెందినను గనుచీఁకటి ♦ జెలఁగ హర్ష
యోగ, బుధవార, రోహిణీ ♦ యుక్తమైన, భాద్రకృష్ణాష్టమిని వృష ♦ భంబునందు.

ఆ॥ అరణియందు నగ్ని ♦ కరణిని దేవకీ, దేవియందుఁ గృష్ణ ♦ దేవవిభుఁడు
వుట్టె మంచివారి ♦ మోములు వికసింప, వికటుల మొగములును ♦ వెల్లఁ బాఱ.

సీ॥ చిత్రములఁగ వెల్గు ♦ శ్రీవత్సపాళితోఁ, గమనీయతారహా ♦ రములతోడఁ
గనలపండువు సేయు ♦ కౌస్తుభమణితోడ, మధుభృదన్వితపద్మ ♦ మాలతోడ
బంగరుఁబుఁ దుడించు ♦ పట్టుపుట్టముతో, సరసనాదమనోజ్ఞ ♦ మురళితోడఁ
గనదగ్నిప్రభములౌ ♦ కంకణంబులతోడ, మించునుహసియించు ♦ కాంచితోడఁ

తే॥ బరిధవర్తులమంజీర ♦ బాహుదముల, తోడ బాలప్రభాకర ♦ తుల్యమకుట
కుండలములతో, నల్లము ♦ గురులఁ జెలఁగు, మొగముతో నొప్పుచుండెడి ♦ ముద్దుకృష్ణు.

చ॥ సరసిజపత్రనేత్రు, ఘన ♦ సామ్యమనోహరరూపునిన్ మహో
ద్ధురరుచిధూతసంతమసు, ♦ దోర్బలుఁ, గోటిమనోజమోహను,
న్సురుచిరపత్రమండితు, ఘు ♦ నున్, బరిపూర్ణతమావతారు, శ్రీ
హరినిఁ, బరాత్పరున్, సుతుగ ♦ నానకదుందుభి సూచి వేడ్కతోన్. ౩౮౫

తే॥ అట్టి పురుటింటిలోపల ♦ నగ్రజులకు, నిచ్చనిడె లతుగోవుల ♦ నెడదనదలు
విడిచి యాదివ్యపుత్రుని ♦ విశ్వమయుగ, నెఱిఁగి బద్ధకరుండయి ♦ యిటుల వేఁడె. ౩౮౬

దేవకీవసుదేవు లావిర్భవించిన శ్రీకృష్ణుని వినుతించుట.

సీ॥ వాస్తవంబున నీవు ♦ వఱలుదు వొకఁడవై, ప్రకృతిగుణంబున ♦ బహుళమైతి
వఖిలలోకములకు ♦ నాదిమకర్తవై, భర్తవై హర్తవై ♦ ప్రబలుచుందు
వట్లయ్యు దేహవ ♦ ర్ణాముల స్ఫటికంబు, బోలె నేమంటక ♦ క్రాలుచుందు
వాకాశ, విశ్వంభ ♦ రాంత, ర్బహిస్సులఁ, గర్మసాక్షివియైచుఁ ♦ గడలుకొందు

తే॥ వవనిభారముఁ దీర్పంగ ♦ నలరితీవు, పూరుషోత్తముండవు నాకుఁ ♦ బుత్రుఁడవుగఁ
బుట్టియుంటివి ధన్యతఁ ♦ బొందినాఁడ, గంసభయమును మాన్పి న ♦ న్గావవయ్య.
చ॥ అని వసుదేవుఁ డావిధిని ♦ నాపరిపూర్ణతమావతారుఁ గృ
ష్ణునిఁ గొనియాడి మ్రొక్కులిడఁ ♦ జూచి పరాత్మ యటంచెఱింగి నం
తన యల దేవకీసతి ము ♦ దంబునఁ జేతుల బాలకృష్ణునిన్
గొని తమి ముద్దువెట్టుకొని ♦ కోమలసూక్తుల వేఁడె నిట్టులన్. 3౫౨
శా॥ వైకుంఠా! గరుడధ్వజా! సురవరా! ♦ భక్తాబ్జమిత్రోదయా!
లోకగ్రామణి! పూరుషోత్తమ! హరీ! ♦ లుంటాకఘోరాంతకా!
శ్రీకృష్ణా! యదునందనా! యదువరా! ♦ సేవింతు నిన్నానవే
నాకంసప్రభుభీతివీడి కుతుకం ♦ బాదంగ రక్షింపుమా! 3౫౩
క॥ అనవుడు భగవంతుండ, ల్లననగి తలిదండ్రులన్ సు ♦ లక్షణయుతుఁడై
కనుఁగొని కరుణామతి నిటు, ఘనముఁగ వాక్రుచ్చె నమృత ♦ ఘటితమృదూక్తిన్.
మ॥ జననీ! పృశ్నియనంగ సాధ్వివయి ప్రా ♦ గ్జన్మంబునం దుంటివో
జనకా! శ్రీ సుతపాఖ్యఁ బొందియుఁ దనూ ♦ జాతార్థివైయుంటి వీ
వును, నీయమ్మయు, బ్రహ్మయాజ్ఞఁ దపముల్ ♦ భుక్త్యంబువుల్ వీడి శ్ర
ద్ధను మన్వంతరమాచరించితిరిసూ! ♦ తాదాత్మ్యభావంబునన్. 3౫౫
ఉ॥ అంతట నేఁ, బ్రసన్నతను ♦ నందుచు మీదరికేగుదెంచి మీ
స్వాంతగతేప్సితంబులను ♦ సత్వరమే వచియింపుఁడన్న ని
శ్చింత, భవాదృశాత్మజుని ♦ జెందెడి భాగ్యముగల్గఁజేయవే!
సంతసమానుమాకన, నొ ♦ సంగితిఁ దద్వరమేను బిమ్మటన్. 3౫౬
చ॥ కమలభవుండు దంపతులు ♦ గా మిముఁ గూర్చెను దద్వరంబునన్
క్రమముగ మత్సమాత్మజుఁడు ♦ గాఁదగు నంచుఁ దలంచి యెల్లెడన్
నెమకితిఁ గాని యెచ్చటను ♦ నేను గనుంగొనలేక మీకునం
తిమమున విశ్రుతుండన న ♦ తిప్రమదంబునఁ బుట్టితిన్ జుమీ. 3౫౭
చ॥ మఱుసటి జామునం దదితి ♦ మానిని నా మఱిఁ గశ్యపుండనన్
వఱలెడి మీకుఁ బుట్టితిని ♦ వామననామముతోడ, నిప్డిటుల్
దిరిగి జనించితిన్ గనుకఁ ♦ దెప్పున నన్గొనిపోయి నందమం
దిరమున నుంచి యందుఁగల ♦ దివ్యశిశుం గొని యిందుఁ జేరుమా! 3౫౮
చ॥ అని వచియించి దేవకియు ♦ నానకదుందుభి కన్నులారఁగాఁ
గనుఁగొనుచుండఁగా నతఁడు ♦ గందువుతీరుగ మాఱెనయ్య! నం
త నతఁడు నాశిశుంగొనుచుఁ ♦ దర్లఁదలంపఁగ; నాయశోదకు
న్దనయుఁగ యోగమాయ జన ♦ నంబును సెందెను గోకులంబునన్. 3౫౯

సీ॥ అప్పుడడ్డంబుగా ♦ నాబిడ్డఁ గైకొని, యల్లనల్లన ♦ నడుగులిడుచు
యోగమాయాశక్తి ♦ నుక్కుబీగంబులు నర్గళశృంఖల ♦ లట్టియూడ
దిట్టమౌతలుపులు ♦ దెరువంగఁబడఁ గను, మాటామలోకంబు ♦ మాటుమణఁగఁ
గావలివారలు ♦ గాఢనిద్రను జెంద, నంధకారంబులు ♦ నంతరింప

తే॥ వేయిమొగములఁ జిలువయు ♦ వెంటనంటి, దీర్ఘఫణములఁ గృష్ణుపైఁ ♦ దెరచిపట్టి
వానపడకుండఁగావంగ ♦ భయదయమున, బాట తనమధ్యమంబునఁ ♦ బరఁగనిడఁగ.

వ॥ నందుని వ్రజంబునకుం గ్రమంబుగాఁ జేరి గాఢనిద్రింబోయిన వేలను దిలకించు
చు హరియోగమాయాప్రభావంబున నడ్డుపాటులేక యశోదశయ్యాకడకుం జని తన
కొమరునిం బరుండఁబెట్టి యందున్నఁ జిన్నిపాపను గ్రహించి యటనుండి వెడలి యము
నం దాటి నిజకారాగృహంబునకు వచ్చి యాబిడ్డను దనసతీమణికిచ్చి యినుపగొలు
సులం దనకాళ్లకుఁ దగిలించుకొని యేమియు నెఱుంగని వానికరణిఁ గునుకుపడి బెదరుగల
వానిపోలికను నదరుచు గంభీరచిత్తంబున నుండె. ఆరేయి గాఢనిద్రం జెందిన
యశోదకు, వసుదేవుం డానల్లనయ్యను దనశయ్యను బరుండఁబెట్టుటయుఁ దనబిడ్డను
గొనిపోవుటయుఁ దెలియకుండెనని యెఱుంగునది. ౩౬౧

చ॥ ఇంకఁ జెఱసాలలోన సిసు ♦ వేడ్చుడి సవ్వడి నాలకించి ర
క్షకులు ద్రుతంబునన్ జనియుఁ ♦ గంసుని కయ్యది సెప్ప నాతఁడున్
దికమకఁబొంది యాచెఱను ♦ దేవకిబిడ్డను లాగఁబోవఁగా
స్వకరము నడ్డువెట్టి తన ♦ భ్రాతకునిట్లనె నామె దీనయై. ౩౬౨

శా॥ అన్నా! చంపకుమన్న! యీసుతను, నీ ♦ కాయుష్య, మారోగ్య, మ
త్యున్నత్యంబును, గల్గుఁ గాన విడు నా ♦ కాత్మోద్భవుల్లేరు; నీ
కన్నన్ దీనదయాళు రెవ్వరిల నీ ♦ కన్నన్ మఱెన్నున్ననో
యన్నా! ప్రోవుము నీకుఁ జేసెదను సా ♦ ష్టాంగప్రణామంబులన్. ౩౬౩

తే॥ అరయ నవమాసములు మోసి ♦ యఖిలకష్టములనుబడి నేనుగనినట్టి ♦ పుత్రవరుల
నార్వురను జంపితివి కాదె ♦ యన్న! నీకుఁ, గీడు సేయని యీకన్నెఁ ♦ గృపనుగనుమ!

ఉ॥ కన్నులనుండి నీర్విడిచి ♦ కన్నియ, చిన్నది యన్నుమిన్న యా
పన్నయు నా కుమారికను ♦ బాహులఁ గప్పి నిజాగ్రజన్ము నె
న్నెన్నియొ తెన్నులన్ వినయ ♦ మెంతయుఁ దోఁపఁగ వేఁడు దేవకిన్
దన్నుచు నావలం దఱిమె ♦ దైత్యవరుండగు కంసుఁ డక్కటా! ౩౬౪

తే॥ దేవకీదేవి యిటుఁ గంసు ♦ దిగులుతోడఁ, గడుపు గడ్డముఁ గాళ్ళును, ♦ గరయుగంబుఁ
బట్టుకొని బ్రతిమాల నా ♦ చెట్ట, నెట్టి పట్టుపట్టి యాబిడ్డను ♦ బట్టి యీడ్చె.

ఉ॥ దుష్టుఁడు యాదవాధముఁడు ♦ తుంటరులన్ బలుదంట మేదినీ
కష్టకృతిప్రదాయకుఁ డ ♦ కారణవైరసమార్జనుం, డఘ

స్పష్టుఁడు కంసుఁ డంత నల ♦ పట్టిని గాళ్ళనుబట్టి బండపై
నష్టము సేయఁ గొట్టుచు ఘ ♦ నంబుగ నెట్టుడు యోగమాయయున్. ౩౧౬

ఉ॥ కంసుని వీడి పైకెగసి ♦ కాంతిమదాయుధముల్ ధరించి ద్వి
ధ్వంసకృతిప్రశస్తశత ♦ పత్రసహస్రితురంగసంగతం
బంసలపార్శ్వదావృతము ♦ నచ్ఛముఁ జామరయుక్తమౌ రథో
త్తంసము నెక్కి యష్టభుజ ♦ దండములొంది శతార్కభాసయై. ౩౧౭

చ॥ ఘనరవమొప్ప నిట్లనియెఁ, ♦ గంస! నినున్ వధియింప నింతకున్
మునుపె పరేశ్వరుండు నఘ ♦ మూలవినాశకుఁడైన కృష్ణుఁడే
జననముఁ జెందె వ్యర్థముగ ♦ శక్తి యొకింతయు లేని దీనులన్
గని వెతఁబెట్టుచుంటి విది ♦ గౌరవకృత్యమె? వీరకృత్యమే?. ౩౧౮

తే॥ యోగమాయ, కంసునికిట్లు ♦ యుక్తరీతిఁ, జెప్పి వింధ్యాచలమ్మునఁ ♦ జేరియచట
బహుళనామంబులన్ బొంది ♦ వఱలుచుండె, నోయి బహుళాశ్వభూవరా! ♦ యుచితచరిత!

ఉ॥ పిమ్మట నుగ్రసేనజుఁడు, ♦ విస్మితుఁడై యల యోగమాయ వా
క్యమ్ముల చాలఁ గాంచి చెఱఁ ♦ గ్రాలెడివారల వీడి వారి పా
దమ్ములఁ బ్రాలి పాపుఁడను ♦ దప్పుడు వాఁడను, పాపకర్ముఁడన్
మిమ్ము నయారె! యిందున న ♦ మిత్రుఁడనై వెతఁబెట్టితిం గదా. ౩౨౦

మ॥ భగినీ! మన్మథరూపులైన సుతులన్ ♦ బల్మోమునేఁ జంపి ని
న్నగచాట్లం గడుఁబెట్టియుంటి, దయ న ♦ మ్మా! నన్ను మన్నింపుమా!
పొగరుంబట్టిన వాఁడనైతి ఖలసం ♦ బుద్ధుండనైతిం జుమీ
వగపుంజెందక కష్టమోర్చి యెటో బా ♦ నా నన్ను రక్షింపుమా! ౩౨౧

ఉ॥ కాలము ముంచుఁ బ్రాణులను ♦ గాలమె తేల్చెడిఁ బ్రాణిరాశి, నా
కాలమెవండెఱుంగు? ఘన ♦ కాండము, నిశ్చలమైన, గాలికిన్
దూలెడి లీలఁ గాలగతి ♦ దుష్టుఁడనై వెలిపల్కనమ్మి మి
మ్మోలిఁగఁ గష్టపెట్టితిని ♦ నోర్చుఁడు, తీర్చుఁడు నాదు తప్పులన్. ౩౨౩

ఉ॥ అష్టమగర్భమాస్థ నిను ♦ నంతమొనర్చునటంచు మిన్ను సు
స్పష్టముగా వచించె నది ♦ సత్యముగాక చెలంగె నిప్పుడీ
యష్టమగర్భమో యబల ♦ యైజనియించెను యోగమాయ నన్
నష్టముసేయువాఁడు జన ♦ నంబును జెందెనటంచు వాక్కొనెన్. ౩౨౪

ఉ॥ వాఁడెటనుండెనో మఱియు ♦ వాఁడెటులుండెనో నాకునిప్పుడే
కీడులు మూడునో యెవరు ♦ గేలిసలన్ దమిఁ గొట్టనుందురో
జాడనెఱుంగనైతి నెటు ♦ సంచరణంబొనరింతుఁ గొల్తు నా
పోఁడిమి నూడఁగొట్టకుఁడు ♦ బ్రోవుఁడు సోదరి! సోదరీపతీ! ౩౨౫

తే॥ ఉగ్రసేనాదుల కెల్లఁ జెప్పి ♦ యుచితరీతి, దేవకీవసుదేవుల ♦ దిగులువాపి
మెఱఁగి యంకట నిలుసేరెఁ, ♦ గృష్ణునమ్మ, వారికే శుభమెట్లు సే♦కూరదయ్య!

చ॥ పదపడిఁ గంసవీరుఁడు ప్ర ♦ భాతమునందున మేలుకాంచి దు
ర్మదమున నా ప్రలంబముఖ ♦ రాక్షసులన్ బిలిపించి యోగమా
య దెలిపినట్టి వాక్యముల ♦ నన్నిఁటి వారికిఁ జెప్పి పిల్లలన్
సదమదముం బొనర్పుఁడు ర ♦ సాతలమందుఁ గసాయివారలై. ౩౨౨

వ॥ అని బెట్టిదంబుగా నాజ్ఞాపింప నాచెట్టలువిని దేవా! నీవు దేవాసుర ద్వంద్వయుద్ధంబందుఁ బేరెక్కి యుక్కుమిగిలి ధనుష్టంకారం బొనరింప నన్నిలింపులు సైతము గంపంబుసెంది కాల్కొలందిఁ బాఱరే? ఇఁక బాలురవలననా మనకు భయంబు గలుగునది? ముఖ్యంబుగా నీకు వైరియగు నమ్మాశేషికి గో, విప్ర, సాధు, శ్రుతి, ధర్మాదులు, తనువులైయుండు. అవ్వానియందే యాతండుద్భవిల్లుంగాన నదవ్వధోపాయం బాలోచించి యానతిమ్మని విన్నవించుకొన నయ్యుగ్రసేనియు యోచించి యంనుల కురరీకరించె. అంత నా దేవానాం ప్రియు లత్యుత్సాహంబుతో వెడలి నలుగడలఁ దిరిగి తిరిగి పుర, గ్రామ, జనపద, వన, వనధులఁ, దత్తత్కాలోచితంబుగాఁ గామరూపధరులై సర్పంబు లాఖువుల రంధ్రంబులం దూరుమాడ్కిఁ జొచ్చి చొచ్చి, చూచి, చూచి, పశు, పక్షి, మృగ, నరసమూహంబు లందలి తల్లిచనుఁబాలు వీడఁజాలనివియై, మనోహరంబుగా నుండు లేఁగలను, గ్రుడ్లను, బసికూనలను, బిడ్డలను భూతబేతాళురంబోలి చంపఁ దొడంగి క్రమక్రమంబుగా నిర్వీర్యులగుచు సంచరించుచుండిరి. అంత నావ్రజంబునందు. ౩౨౩

నందుండు పుత్రోత్సవంబు జేయుట.

సీ॥ నందుఁడు వఱువాత ♦ నందనోత్సవమును, జరుపంగఁ దలఁచి భూ ♦ సురులఁబిలిచెఁ
బిలిచి తత్పదపద్మ ♦ ములకు షోడశవిధు, లను బూజలన్ భక్తి ♦ దనరసలిపె
సలిపియు లక్షగో ♦ వులను దక్షిణలతో, ధాన్యముతోఁగూడ ♦ దానమిచ్చె
నిచ్చి వారొనరించు ♦ నీప్సితార్థంబులఁ, గలిగించు దీవెనల్ ♦ దలను గొనియెఁ

తే॥ గొనియు భేరీ మృదంగాది ♦ నినదముఖల
దిశల మ్రోఁగ సువాసినుల్ ♦ దివ్యభక్తి
మంగళారతులెత్తన ♦ మందగతిని
జాతకర్మంబు నొనరించె ♦ జనక! మఱియు. ౩౨౪

చ॥ తిల గుడ తైల తూల ఘృత, ♦ దివ్యమణీ ధరణీ, సువర్ణ వ
స్త్రలవణసప్తధాన్య ఫల ♦ దానములన్ వసుధాతలామరేం

ద్రులకు విధేయుఁడై యొసఁగి ♦ తోఁచినరీతిని బ్రైనిదక్షిణల్
బలుమఱు నిచ్చి నందుఁడన ♦ వద్యసుతోత్సవబద్ధచిత్తుఁడై. ౩౮౦

సీ॥ గాత్రమూలముగాఁగ ♦ గాయకుల్ గానంబు, గావించి రవ్వాణి ♦ గానసరణి
క్షేమవస్త్రముల సిం ♦ గారంబుగావించి, సానివాండ్రాడి ర ♦ చ్చరలకరణిఁ
గర్ణపర్వము నర్చు ♦ కావ్యముల్ గవులును, వ్రాసిరి తద్బాద ♦ రాయణిరహి
విజయసూచకములౌ ♦ ధ్వజినీపతాకముల్, జెలఁగె నాస్కందుని ♦ సేనఁబోలె
తే॥ శంఖ దుందుభి వీణాది ♦ సకలవాద్య, యంత్రములు గడుమ్రోసెనా ♦ యబ్ధ్రగతిని
నింద్రజాలంబులన్ జేసి ♦ రైంద్రజాలికు, లల శౌరిపుట్టినవేడు ♦ కలకు, మఱియు.

సీ॥ సందులగొందులఁ ♦ జదుకంబులందునఁ, జిమ్మి వాసితవారిఁ ♦ జిలుకరించి
పంచలాదులందు ♦ వాఁకిళులందున, నలికించి రంగవ్ర ♦ ల్లులనలర్చి
వీడుల వాడల ♦ మేడల గోడలఁ, జిత్రరుపుల్ వ్రాసి ♦ చెలువునింపి
మండప తోలికా ♦ మండలప్రాంగణం, బుల సర్వవిధములఁ ♦ బొల్పుసల్పి
తే॥ దేవతాగారసత్రాది ♦ దివ్యభవన, ములను దత్తదుచితకృత్య ♦ ములను వెలయఁ
జేసి బురుజులఁగలశముల్ ♦ సెలఁగఁజేసి, నందనోత్సవమున్ సల్పె ♦ నందుఁడెలమి.

ఉ॥ బంగరుశృంగముల్ బసుపు ♦ పచ్చనిపుచ్ఛముఁ జిత్రధాతులన్
ఖంగునమ్రోఁగు గంటలను, ♦ గాంతిలచేతులగుర్రులన్, మనో
జ్ఞాంగము, రక్తకంబళము ♦ లక్ష్యములైన, సువర్ణహారముల్
హంగగు వత్సముల్, గలిగి ♦ యావులు రాజిలె నప్పుడచ్చటన్. ౩౮౩

తే॥ అంత వృషభానువర్యుఁడా ♦ యవసరమున, నందనందనోత్సవమహా ♦ నందవార్త
విని కళావతియుక్తుఁడై ♦ జనులుగొల్వ, సొరుగొరున నెక్కి తా ♦ త్సదనమొందె.

చ॥ మఱి నవనందవర్యులును, ♦ మాన్యులు శ్రీవృషభానుముఖ్యము
ద్ధుకు లుపనందులున్ జెలిమి ♦ తోఁ దిరుగాడెడి భూపవర్యులున్
సరసత రాత్మబంధువులు ♦ శాస్త్రపురాణనయప్రవీణతా
విరతయశోదయాఢ్యులును ♦ వే సనుదెంచిరి నందునిక్కడన్. ౩౮౪

సీ॥ ఉత్తమాంగంబుల, ♦ నుష్ణీషములఁ దాల్చి, వానిపైదండల ♦ వఱలఁజేసి,
పచ్చబొందళముల ♦ గ్రిచ్చుఅ ధరియించి, తొళసిదళంబులన్ ♦ దొడవులొంది
పిల్లనగ్రోవులఁ ♦ బెదవులనులగించి, బెత్తములన్ జేతి ♦ వ్రేళ్ళఁబట్టి
గురిజలంగట్టిన ♦ క్రొమ్ముడియుంగల్గి, నెమ్మిలపురులను ♦ నెఱయఁగట్టి
తే॥ మోమునందునఁబొట్టిడి ♦ పుత్రకులను, గూడి వేడుకతోడుత ♦ గోపకులును
జిన్నికృష్ణునుత్సవమును ♦ గన్నులారఁ, ! గాంచవచ్చిరి నందు ని ♦ క్కమునరేంద్ర.
క॥ పురమున నుండెడి వారొం, డొరులును శ్రీనందపుత్ర ♦ కోత్సవమునకున్
సరగునఁ బోదము రండని, సరసముగాఁ జెప్పికొనుచుఁ ♦ జనిరచ్చటికిన్. ౩౮౬

మ॥ కమనీయాంగద తార హార తరల ♦ గ్రైవేయ కావాపకా
సమచూడామణి హేమ హీర నవవ ♦ స్త్ర క్షౌమ చీనాంశుక
ప్రమదారత్నమదేభ గో పృథురథ ♦ భ్రాజత్తురంగంబులన్
గ్రమమొప్పన్ గొని తెచ్చి యిచ్చి రతిథుల్ ♦ కంజాక్షు పై వేడ్కలోన్. ౩౮౮

తే॥ దధియు,క్షీరంబు,ఘృతముహ♦స్తములఁబూని, కర్జూరకేలఁగైకొని♦గళములటుల
నిటులఁద్రిప్పుచు గోపక♦వృద్ధులింక, బాలుఁ గేగిరి కృష్ణోత్స♦వంబుఁజూడ. ౩౮౯

ఉ॥ నందుఁడు పుత్రకోత్సవము ♦ నం గల రాజుల బంధుపాళి నా
నందముతోడఁ గాంచి నయ ♦ నంబుల బొమ్మములోల్క వారికిన్
విందులొనర్చి సత్కృతుల ♦ వేమఱు సల్పుచు హాయినుండ వా
రందఱు నందరాజుఁ గొని ♦ యాడిరి పాడిరి సంతసంబునన్. ౩౯౦

తే॥ ఓవ్రజేశ్వర!యోనంద!♦యోగ్యచరిత!,ధీర సుకుమారసుకుమారు♦దివ్యదేహుఁ
గనుట ధన్యతిగంటిమి ♦ కాలకాల, ముఁగనుండెడి నీకోర్కి ♦ ముగిసె నేఁడు.

చ॥ అనవుడు నందుఁ డిట్టులను ♦ నర్థవిదగ్రణులార! నాపయిన్
నెనరిడి మీరు వల్కినడి ♦ నిక్కవమే యని మీ యనుగ్రహం
బునను ఘటిల్లె మద్వ్రిజముఁ ♦ బొందిన గోపుల యాజ్ఞఁబూని యే
ననిశము సంచరింతుఁ గద ♦ యయ్యది మీరలు గుర్తెఱుంగరే. ౩౯౨

ఉ॥ అయ్యెడ గోపికల్ వ్రజము ♦ నందలి నందసుతోత్సవంబుఁ దా
మొయ్యన నాలకించుచు నొ ♦ హో యని యబ్బురమొంది చంకలన్
జయ్యన బొట్టెలం గొని స్వ ♦ సద్మకృతుల్ విడనాడి గుంపుగా
నెయ్యముతో వ్రజేశ్వరుని ♦ సర్వ్యతమొందఁ దలంచి నెమ్మదిన్. ౩౯౩

సీ॥ మంజుమంజీరముల్ ♦ మంజులధ్వనిసేయఁ, గాంచికాఘంటికల్ ♦ ఖంగఖంగ
దారహారంబులు ♦ దాఱుమూఱాడఁగఁ, గరకంకణములు గల్♦ గల్లనంగ
గబ్బిగుబ్బలు పైఁటఁ ♦ గ్రాలి పింపిసలాడఁ, జెమ్మట నెమ్మేను ♦ సెమ్మగిల్లఁ
గుసుమహారంబులు ♦ గురులనుండియు వ్రాలఁ, గస్తూరిచేర్చుక్క ♦ గరగుచుండ

తే॥ నూడిపోయెడి చీరల ♦ వీడఁబట్టి, కొంచు మైదీఁగె మించును ♦ మించి వెలుఁగ
నందరాజ గోకులముకు ♦ బొంది దాని, సుందరత విచిత్రంబుగాఁ ♦ జూచుచవల.

ఉ॥ ఆ విమలాంగ బాలకుని ♦ యాస్యముకుండి పదంబులంటఁగా
నావల నల్లయావల, య ♦ వాదుల నుప్పురు, నెట్టనీఖలిం
కేవియొ దృష్టిదోషము శ ♦ మింపఁగ మాటికిఁ దీఘివేసి బ
ల్దీవనఁజేసి పల్కిరిటు ♦ దియ్యఁదనంబున నయ్యశోదకున్. ౩౯౫

ఉ॥ అమ్మ! యశోద! మంగళము ♦ లబ్బెఁగదమ్మ! సుతుండు నీదుభా
గ్యమ్మున్నఁ గల్గెనమ్మ! చిర ♦ కాలమునుండియు నోఘు నోముతే

యిమ్మెయిఁ బండెనమ్మ! కృత ♦ కృత్యవునైతిగదమ్మ! మాకు మో
దమ్ము ఘటిల్లెనమ్మ! ప్రమ ♦ దమ్మున వీనిని బెంపవమ్మరో! ౩౯౬

ఉ॥ ఆపయి నా వధూమణి వ ♦ రాంగనలార! సుతుండు నాకు మీ
ప్రాపునఁ గల్గెఁగాని యిత ♦ రక్రియఁ గాదిటు నెమ్మిఁజూడఁడం
చోపికఁబల్కె రోహిణిరో! ♦ యోగ్యచరిత్రల వెల్గు వీరికిన్
సాఁపడఁజేసి సత్కృతుల ♦ సల్పుమ! యేమియు లోటులేనటుల్. ౩౯౭

చ॥ అనవుడు నట్టి రోహిణియు ♦ నచ్ఛచరిత్రమనోజ్ఞ గోపికా
జనుల సుచేలధారిణుల ♦ సాఁపడఁజేసి సపర్యలాచరిం
చెను మఱి మర్త్యలోకమున ♦ శ్రీహరి, నందుని కాత్మజాతుఁడై
జననము నొందెనంచు జయ ♦ శబ్దములంతట నిండె. నావలన్. ౩౯౮

తే॥ గోపికా గోపకులుగూడి ♦ కుతుకమతుల, వీరి మున్నెవరఁబోలిన ♦ పెద్దవారు
లేరులేరని దధి ఘృత♦క్షీరములను, బోయుఁదొడఁగిరా వ్రజహంత♦ఖురదగాఁగ.

చ॥ నరహరి యుత్సవంబును గ ♦ నన్ బెదదొడ్డులు గొందఱందు వే
యరుగుచు గోఁచులూడఁగని ♦ యయ్యవి దోపుచుఁ గ్రమ్మఁ జిమ్మటల్
బోరిఁబోరి దోఁజుచాగుచును ♦ బూన్కి మఱిన్ జనసాగి జట్టున
న్జలజల జాటి యన్యహాస ♦ నంబున కాస్పదులైరి భూవరా! ౪౦౦

చ॥ మఱియును వందిమాగధులు, ♦ మాన్యులు, సూతులు, వేదశాస్త్రవి
త్సరసులు నైతిహాసికులు ♦ జక్కనిమాటలనాడ నందుఁడున్
గరమరుసంబుబొంది మమ ♦ కారముతో ననభూషణాంబరో
త్కరకరిగోసహస్రతుర ♦ గంబుల నిచ్చెను వారి కోలిమై. ౪౦౧

తే॥ భుక్తి ధనవృద్ధి సంసిద్ధి ♦ శక్తులెలమి, వాడవాడల నూరూర ♦ భవనభవన
ములను సంపూర్ణముగఁగల్గి♦మూల్గుచుంట,నిద్ధికావలయుననుట♦యెఱుఁగఁబడదు.

ఉ॥ బంగరు రంగుమైమెఱుఁగు ♦ బంగరుబొజ్జయుఁ బైఁడిపోగులున్
బంగరు పాగయున్ గలిగి ♦ ప్రాఁబలుకుల్ దన నాల్గుమోములన్
ఖంగునఁ బల్క మేటియయి, ♦ క్రాలుచునుండెడి బ్రహ్మ భార్యతోఁ
బొంగుచు నంచనెక్కి వ్రజ ♦ మున్ జని వెన్నునిఁ జూచు వేడ్కతోన్. ౪౦౩

ఉ॥ ఆతని వెంట నీశుఁడల ♦ యాపుల పోతుచు, నగ్ని మేఁకనున్,
వాతము ఖంజనంబునుఁ, బ్ర ♦ భాకరుఁడున్ బెదతేరునున్, బలా
రాతి మదద్విపంబు, యమ ♦ రాజును దున్నను, జంద్రుఁ డిఱ్ఱి, పా
ణ్మాతురుఁడున్ మయూరము, హ ♦ లాహలుటి నెక్కియు నేగి రిట్టులే. ౪౦౪

కవిరాజవిరాజితము.

వరుణుఁడు సక్రము, వైశ్రవణుండని ♦ వార్యగతిస్తుత పుష్పకముల్
గురుఁడును గృష్ణముఁ, గోడిని సౌమ్యుఁడు ♦ గ్రోతిని భౌముఁడు శుక్రుఁడును
ద్ధురగవయంబు, విధుంతుదుఁ డుష్ట్రిముఁ, ♦ దోయజమిత్రకుమారశనై
శ్చరుఁడును సక్రము, జయ్యన నెక్కరి ♦ సాగిరి నందగృహంబునకుల్. ౪౦౫

చ॥ సిరియు సుపర్ణు, దుర్గయును ♦ సింగము, నైచికి రూపుఁగన్న యా
స్థిరయు విమానరాజమును, ♦ దీర్ఘకృపాణముఖాస్త్రయష్టులల్
గరములఁగొన్న వష్టి, శిబి ♦ కల్, మఱి డోలఁబదార్వ రమ్మలుల్
మురిపెముతోడ నెక్క వ్రజ ♦ ముల్ జనసాగిరి మాధవార్థమై. ౪౦౬

చ॥ సనకసనందనాదిముని ♦ చంద్రులు, నేను, యథార్థపద్ధతిల్
వనజదళాయతాక్షుని గ ♦ నల్ విధితోడుత గోపగోపికా
జననినదప్రయుక్తమగు ♦ సర్వశుభాస్పద నందమందిరం
బునుగని ప్రీతిపూరిత సు ♦ బుద్ధులఁ జేరితిమో నరేశ్వరా! ౪౦౭

ఉ॥ అందఱమందఁ జేరి హరి, ♦ నాపరిపూర్ణతమావతారు, గో
విందునిఁగాంచి మ్రొక్కితిమి, ♦ వేదవచస్సుల వేఁడియుంటి, మా
నందు సపర్యలందరి మ ♦ నర్థము లేగెనటంచు నెంచి యా
నందముఁ బొంది క్రిమ్మఱి చ ♦ నల్ సమకట్టితి మేము మైథిలా! ౪౦౮

తే॥ అందఱేగిన తరువాత ♦ నందరాజు, మధురయందలి వసుదేవ ♦ విధముగాంచి
పుత్రకోత్సవముం జెప్ప ♦ భూపతియగు, కంసునికిఁ గప్పముంగట్టఁ ♦ గదలిపోయె. ౪౦౯

పూతన కంసప్రేరితయై గోకులంబున కేతెంచుట.

ఉ॥ ఆతరువాతఁ గంసవిభుఁ ♦ డా హరిజన్మము నాలకించి వే
ఘాతముసేయఁ బూతనను ♦ తంత్రముతో ననుపంగ, నామహా
భీతము, ఘర్ఘరస్వనముఁ ♦ బోలిన నాదముతోడ, ఘోష సం
ఘాతము గోష్ఠముల్ పురులఁ ♦ గాంచుచుఁ దిర్గుచు నెట్టకేలకుల్. ౪౧౦

సీ॥ కందుకంబులఁబోలు ♦ గబ్బిగుబ్బలు పైఁటఁ, గులుకుచు క్షీరము ♦ లొలుకుచుండ
నిండుజాబిల్లిని ♦ నివ్వెఱఁబడఁజేయు, నెమ్మోముకళలచే ♦ నగడుచుండఁ
దామరతూండ్ల వి ♦ ధంబున డంబైన, భుజములు భూషలల్ ♦ బొల్పుగాంచ
మెలిమిజాళువా ♦ లీలనుగ్రాలెడి, నెమ్మేను దోడవుల ♦ నీటుసెంద

తే॥ మల్లెమొల్లల వాసించు ♦ తెల్లపుట్ట, ములను గట్టి పదాబ్జముల్ ♦ గలుగుకలికి
చేతెనుండెడి రూపంబు ♦ బొందినంను, వ్రజము సొచ్చెను శ్రీకృష్ణ ♦ బాలుదునను.

వ॥ అంత. ౪౧౨

మ॥ రతియో రంభయొ వాణియో శచియొ దు ♦ ర్గాసాధ్వియో లక్ష్మియో
శతసంఖ్యాకలఁ జూచియుంటెమిటు ల ♦ స్మద్దృష్టిలో లేరటం
చతిరేకంబుగ మెచ్చి రోహిణి, యశో ♦ దాద్యంగనల్ లోనిక
ద్భుతరీతిన్ జననించు పూతనను జే ♦ ద్రోయంగ లేదా పెయిన్. ౪౧౩

ఉ॥ రోహిణి నాయశోదను ని ♦ రోధమొనర్చి కరంబులన్ జగ
న్మోహనుఁ జిన్నికృష్ణుఁగొని ♦ ముద్దిడి స్వీయకుచంబులందు న
వ్యాహతనాశకృద్విషము ♦ నక్కలనింపుచు నంకమందు నా
రోహితుఁజేసి స్తన్యము న ♦ రుచ్యము నా చినిపాపకిచ్చెఁగా. ౪౧౪

చ॥ హరియుఁ బయోధరంబులను ♦ నాస్యము నందిడి కృత్రిమంబులో
నరసి పయఃప్రయుక్త విష ♦ మంత నసృగ్విధమాంసశల్యసం
కరముగఁ గ్రోల, నాయసుర ♦ గర్వమువీడి కుమార ! వీడుమా
పిరివిడునంచుఁ బాఱినను ♦ వీడమిఁ బూతన యంతిమంబునన్. ౪౧౫

చ॥ అచలము లేదునన్ బృథుగు ♦ హావళితోడఁ బ్రతిధ్వనింప, నీ
యచల, చలింప, సాగరము ♦ లన్నియు ఘూర్ణిలుచుండ, దిక్ప్రభు
ప్రచయము దల్లడిల్లఁ బలు ♦ బాధలఁ గెవ్వనఁ గేకవేసి త
త్కుచరితమెల్లఁ దెల్లముగఁ ♦ గూలె భయంకరరూపయు క్తయై. ౪౧౬

ఉ॥ అత్తటి నాలుగ్కోసులకు ♦ నంతరమందునఁ గల్గు చెట్లపై
న్మొత్తము చూర్ణమాయె. నల ♦ పూతన యొక్కశరీర సౌష్ఠవం
బత్తరళేక్షణల్ వ్రజము ♦ నందలి గోపగణంబు సూచి బ
ల్తత్తరమొంది చిత్తరువు ♦ లన్ మఱపించుచు నిల్చి రంతటన్. ౪౧౭

ఉ॥ చిన్నతనంబునన్ జెలఁగు ♦ శ్రీహరి, పూతనపాలు గ్రోలి వే
మన్ననఁ గల్గి సందియము ♦ మాయుటకై యెటనేని ప్రాణమొం
దున్నదొ యేమొ యంచు నొడ ♦ లూరక చూచెడి వానిమాడ్కి న
భ్యున్నతి దానిపైని నగు ♦ మోమున నెల్లెడ దోఁగి యాడుటన్. ౪౧౮

శ్రీకృష్ణ కవచము.

ఉ॥ గోపులు గాంచి యచ్చెరువు, ♦ గూర్మిభయంబులు, గల్గుచుండ, నీ
పాపఁడు నెగ్గనేరఁడని ♦ పాణుల లాగిరి రోహిణీయశో
దాపతిపత్నులా కొమరుఁ ♦ దక్షణమందు నురంబునందిడన్
గోపిక లాకుమారుని క ♦ కుంఠిత రక్షనొనర్చి రిట్టులన్. ౪౧౯

తే॥ తొల్తనఘహారకాళింది ♦ తోయములను, ధేనుపుచ్ఛభ్రమణముల ♦ ధేనుమూత్ర
గోమయంబులనాచిన్ని ♦ కొడుకు జలక, మాడఁజేసిరి దొలిమిన్కు ♦ లాడినట్లు.

సీ॥ శ్రీకృష్ణుఁడీనీదు ♦ శిరముఁ గాచుత, గళము వైకుంఠుండు ♦ గాచుఁగాత
దెలిదీవిఱేఁడు వీ ♦ నులను బ్రోచును గాత, ముక్కును యజ్ఞుండు ♦ బ్రోచుఁగాత
నరసింహమూర్తి నీ ♦ నయనముల్ బ్రోవుత, రాముండు నాలుక ♦ నోముఁగాత
నరుఁడు, నారాయణుం ♦ డరుదైన యోష్ఠముల్, ముద్దులకుద్దిగాఁ ♦ బ్రోచుఁగాత

తే॥ హరికలాభవసనకాదు ♦ లాకపోల, ములను బ్రోచుత గపిలస ♦ న్ముని, చిబుకము
రక్షసేయుత శ్వేతవా ♦ రాహమూర్తి, ముదముతోడుత ఫాలంబు ♦ బ్రోచుఁగాత.

తే॥ ఉరము దత్తయోగీశ్వరుఁ ♦ డోముఁగాత, మూఁపులను ఋషభుండును ♦ బ్రోవుఁగాత.
కరములన్ మత్స్యమూర్తియుఁ ♦ గాచుఁగాత, భుజయుగంబును బృథురాజు ♦ బ్రోవుఁగాత.

తే॥ కడుపుఁ గమఠుండు బ్రోవుతఁ ♦ గరుణతోడ, నాభిఁగావుత నట్టి ధ ♦ న్వంతరియును
మోహినీదేవి గుహ్యంబుఁ ♦ బ్రోవుఁగాత, కటిని వామనమూర్తియు ♦ గాచుఁగాత.

తే॥ ఓముతన్ వెన్ను భార్గవ ♦ రాముఁ, డూరు, వులను బాదరాయణముని ♦ బ్రోచుఁగాత
గావుతన్ గాళ్లఁ గల్కి పి ♦ క్కలను జంఘ, ములను దయను బ్రోతురుగాత ♦ బుద్ధబలులు.

తే॥ ఇట్లు శ్రీకృష్ణ కవచంబు ♦ నెఱిఁగి చదివి, సర్వరక్షలఁ జేసిరి ♦ చతురమతుల
నిద్ధభగవంతు డావిధి ♦ కెలమిఁ జెప్పె, నతఁడు శివునకుఁ బల్కఁగా ♦ నతఁడు మరల

తే॥ కనికరమున దుర్వాసుఁడన్ ♦ మునికి ననియె, నతఁడు శ్రీయశోదకుఁ జెప్పె ♦ నదియెవండు
నిత్యమును బ్రభాతంబున ♦ నిశ్చలమతిఁ, జదువునో వాఁడు పాపముల్ ♦ జెసుపు జనక!

తే॥ అంత రోహిణియున్ యశో ♦ దాంగనయును, రక్షసేసిన పిమ్మట ♦ బ్రాహ్మణులకు
వివిధదానముల్ సల్పి ♦ పిల్లనికిని, బాలు ద్రాగించి హాయిగా ♦ వఱలిరయ్య!

తే॥ అవల నందాది గోపకు ♦ లామథురను, వీడి తమ టెంకికిన్ దిర్గి ♦ వేడ్కఁ జేరఁ
వచ్చుచుండంగఁ బూతనా ♦ భయదవపువుఁ, బథిని గాంచి కుఠారముల్ ♦ వరుసఁ గొనుచు

క॥ రక్కసి యొడలును ముక్కలు, ముక్కలుగాఁ జేసి యమున ♦ పొన్నరిదరిని
మిక్కిలి చితులను బేర్చుచుఁ, జక్కఁగ దహనంబు జేయ ♦ సాగిరి పిదపన్. ౪౨౯

ఉ॥ కాలినదానినుండి పొగ ♦ కల్మషనాశకమై పవిత్రమై
యేలకికాయలా యగరు ♦ నిద్ధలవంగములన్ బటీరమున్
బోలు సువాసనన్ వెడలెఁ. ♦ బూతన యుత్తమలోకమొంద నా
శ్రీలలనేశుఁడే సలిపెఁ ♦ జిత్రమనం జనకుండు నిట్లనెన్. ౪౩౦

పూతనా పూర్వజన్మ వృత్తాంతము.

ఉ॥ పూతన, బాలఘాతిని య ♦ పూర్వవిమస్తని దుష్టశీల యా
నాతికి నెట్లు స్వర్గము జ ♦ నార్దనుఁ డిచ్చెను? బూర్వజన్మమం
దేతలిదండ్రులీయమకు, ♦ నెట్టిది దీనిచరిత్ర సర్వమీ
రీతిఁ జెప్పి చిత్తమును ♦ నింపున నింప నుతింతు నారదా! ౪౩౧

చ॥ అనవుడు భూతలేంద్ర! యది ♦ యాదిమజన్మమునన్ బలిప్రజే
శునిసుత, రత్నమాల, యన ♦ శోభిలితండ్రి సవంబునందు వా
మనుఁడనుపేర నొప్పెడి ర ♦ మాపతినింగని పుత్రమైత్రితోఁ
దనరుచు నిట్టి పుత్రకుఁడు ♦ దార్కొనినన్ జనుఁబాల నిత్తుఁగా. ౪౩౨

చ॥ అని మనమందునం దలఁచె ♦ నాబలి స్వప్రియుభక్తుఁడౌట నా
తనిసుతయంచు వత్సలతఁ ♦ దద్వర మాహరి యామె కిచ్చని
చ్చెనుజుమి యంత నావనిత ♦ శ్రీహరిసూక్తిని నా విధానఁ బూ
తన యనుపేర నిద్ధరణి ♦ ద్వాపరమేగిన మీఁదఁ బుట్టెరా. ౪౩౩

చ॥ హరిని స్పృశించి స్తన్యమును ♦ నాస్థనొసంగి నశించి వెంటనే
పరమపదంబు నొందెఁగద ♦ పార్థివ! పూతన మోక్షసత్కథా
సరణిని విన్న వ్రాసినను ♦ జక్కఁ బఠించిన దోషరాశి చె
చ్చెరవిడి తత్త్రివర్గ ఫల ♦ సిద్ధులు గల్గును నెట్టివానికిన్. ౪౩౪

వ॥ అని యిత్తెఱంగున శ్రీగర్గాచార్యుండు శౌనకునకు వచింప నతండు పరమానందభరితుండై మహాత్మా! శ్రీకృష్ణచరితంబు వినిపించి నాజన్మంబు సఫలంబు గావించితిరి. మఱియు శాంతిదాంతివిశ్రాంతస్వాంతుండును, శ్రీకృష్ణభక్త శిరోమణియునగు నాబహులాశ్వుం డా నారదమహర్షిం గాంచి యావల నేమని పృచ్ఛించె నది యానతిండని ప్రార్థించుటయు గర్గుం డిట్లనియె. ౪౩౫

తే॥ అనుటకు జనకుండెడద ♦ హర్షమొంది, "అద్యధన్యోస్మినారద"! ♦ యచ్యుతాంఘ్రి
నిహితమతులకు నెల్లెడ ♦ నెగ్గుకుండుఁ, జిన్ని వెన్నునికతఁ బైనిఁ ♦ జెప్పుమనుచు.

ఉ॥ నారదుఁ డిట్లనెన్ జనక ♦ నాయక! యొక్కదినంబునందు నా
శౌరిభవోదయుక్తతిథి ♦ సంఘటిలంగ యశోద గోపగో
పీరమణీయుతై మిగుల ♦ వేడుకఁ జేయఁదలంచి భూమిబృం
దారకబృందమున్ బిలిచి ♦ దానములన్ బొనరించి యంతటన్. ౪౩౬

చ॥ సురుచిరమైన రూపమున ♦ శోభిలు బాలుని ముద్దుకృష్ణునిన్
బరిమళయుక్తవారుల న ♦ వారిగ స్నానమొనర్పఁ జేసి త
త్సరసిజనేత్రయుగ్మమునఁ ♦ జక్కఁగఁ గాటుకదిద్ది రోహితాం
బరములఁగట్టి బొట్టునిడి ♦ బంగరుసొమ్ములఁబెట్టి సొంపుగాన్. ౪౩౭

తే॥ డోలికారత్నమందున ♦ బాలపాన్పు, పైనిఁగూర్చుండఁ బెట్టఁగ ♦ మానవతులు
మంగళారతు లెత్తి య ♦ భంగభంగి, బాటలవళినిఁ బాటలఁ ♦ బాడి రవల.

స్రగ్విణీవృత్తము.

లాలి శ్రీమాధవా ♦ లాలి దేవస్తుతా, లాలి కేళీప్రియా ♦ లాలి గోపీప్రియా
లాలి నారాయణా ♦ లాలి స్మేరాననా, లాలి కృష్ణాహ్వయా ♦ లాలి నందాత్మజా.

చ॥ అని యిటు లాలిజోలలను ♦ నందము చందము నొంద సుందరీ
జనములు పాడుటన్ వినుచు ♦ సంతసమంది యశోద, చిన్నిప
ట్టిని శయనింపఁజేసి తన ♦ యింటికి వచ్చినవారి గౌరవం
బును బొనరించు తొందరను ♦ బుత్త్రుని విస్మృతిఁజెందె నయ్యెడన్. ౮౮౧

బాలకృష్ణుం డుత్కచాద్యసురవధంగావించుట.

తే॥ అంతకాఁడగు తత్కంసు ♦ నాజ్ఞ వెడలి, గంధవహనిభదేహుఁ డు ♦ త్కచసురారి
యొండుబండినిఁ గొనివచ్చి ♦ దండితోడఁ, బండినట్టి శ్రీహరిపైని ♦ బడియె నపుడు.
క॥ హరి యాఁకొనుచును గిదుకుచుఁ, గెరలుచును నడుమనడుమఁ ♦ గెవ్వునఁ గేకల్
బోరిఁబోరి వేయుచుఁ బొరలుచుఁ, జరణంబును జాచుచల్ల ♦ శకటముఁ దన్నెన్.
తే॥ పిదపఁ దద్ధతి నాబండి ♦ పెళపెళపెళ, విఱిగి పాడయె నందలి ♦ సురరిపువును
నీల్గి నెఱిరూపుఁగని హరి ♦ కెరఁగి గోజ, గమున కరిగె శతాశ్వర ♦ థంబు నెక్కి.
ఆ॥ ఆముహూర్తమున య ♦ శోమతీనందాది, గోపగోపికలల ♦ కూలినట్టి
బండిరొదనువించు ♦ దండినివిడనాడి, పనులమాని యటకు ♦ వచ్చియరయ.
తే॥ అల్ల పిల్లనికడనున్న ♦ యర్భకతతి, యందఱము మేముగుమిఁగూడి ♦ యాడుతఱిని
బాలుఁ డాఁకొనియేడ్చుచుఁ ♦ బదమున నొక, బండినిం దన్నెననిచెప్ప ♦ వారలు విని.
మ॥ అరరే యీతఁడు మూడుమాసములవాఁ, ♦ డాబండి నేదండితోఁ
జరణంబున్ గొనితన్నె? ఏని హరికే ♦ సర్వార్థముల్ వ్యర్థమై
పరగంగా నదినింగికేగి పుడమిన్ ♦ బాతంబుగాఁ జాలెనా?
యరయన్ బాలకులాడు మాట నిజమే ♦ నా? యద్భుతంబయ్యెడిన్. ౮౮౭
ఆ॥ అని విచిత్రమొంది ♦ రవలయశోదయుఁ, బిల్లవానియేడ్పు ♦ వినుచువచ్చి
పాలు గుడువవయ్య ♦ గోలఁజేయకుమయ్య, యంచు జన్నుఁ గుడిపె ♦ నవల వ్రేలు.
చ॥ చిడిముడిపాటునన్ జెలఁగు ♦ చిడలఁ బీడల నూడఁగొట్టఁగా
విడిముడి నిచ్చి జన్నముల ♦ విప్రులచే నొనరింప సల్పి చే
పడెడి పిశాచ బాధయును ♦ బాడువడన్ బొనరించిరయ్య! నా
పుడు మునినాథ! మున్ను నల ♦ పోకిరి యేఁడెటుఁ బొందె మోక్షమున్. ౮౮౯

ఉత్కచాసుర పూర్వజన్మ వృత్తాంతము. T 2049

చ॥ అని యడుగంగ మాని ముద ♦ మందుచు నిట్లను నోనరేశ్వరా!
మునుపు హిరణ్యలోచనుని ♦ పుత్రకుఁ డుత్కచనాముఁడై శుభా
యనమగు లోమశాశ్రమము ♦ నర్గి యటన్ గలచెట్లఁ గొట్టివే
సె నదియు లోమశుండు గని ♦ భీయని యిట్లు శపించె వానినిన్. ౮౯౦
ఉ॥ దుర్మతి! యుత్కచా! తరుల ♦ దుంపలతోడుత నూడఁబీకి నీ
దుర్మదమంతఁ జూపితివి ♦ తోడ్తన దుష్కృతరీతి సర్వముల్

వర్ణ్మము వీడునట్లొడలు ♦ వాయుభు నీల్గుమనంగ వాఁడు త
న్మర్మ్మము గుర్తెఱింగి యల ♦ మౌనిపదంబుల వ్రాలి యిట్లనెన్. ౭౯౧

తే॥ మౌనిచంద్ర! కృపాసింధు! ♦ మాన్యచరిత, నీదువిస్తృతమహిమము ♦ నెఱుఁగ
నాదు తప్పుచుమన్నించి ♦ నయనములను, జల్లఁగాఁజూచి మోక్షమొ ♦ సంగునాకు

తే॥ పిదపమౌనీంద్రుఁడెదమెచ్చి ♦ విధి నెఱింగి, యుత్కచా! వాయురూపమ్ము ♦ నొందిచాతు
షంబుసనుమీఁద వైవస్వ ♦ తంబునందు, హరిపదస్పర్శమోక్షమ్ము ♦ నందఁగలవు.

తే॥ అని కరుణతోడఁబల్కెనో ♦ యనఘ! సుజన, కోపమేక్షణంబున్నఁ ♦ బాపమూడ్చి
యైహికాముష్మికసుఖంబు ♦ లందఁజేయుఁ, గానిచెడదారిఁబోవదో ♦ శాశ్వతీశ!

తే॥ ఇట్టివరమున నుత్కచుం ♦ డట్టిరీతి, వాయువిగ్రహుఁడైహరి ♦ పాదఘంటి
పరమధామము నెందె న ♦ వక్రవిక్ర, మక్రమా! మీఁదిహరికథ ♦ మఱియువినుము!

బాలకృష్ణుండు తృణావర్తునిం గూల్చుట.

చ॥ ఒకపరి నాయశోద తన ♦ యూరువునందున నాటలాడు బా
లకు స్మితవక్త్రు లాలనము ♦ లన్ బొనరించెడిలోన నట్టి పు
త్రకుఁ డచలేంద్ర భారుఁడయి ♦ తారసిలన్ వెరవేమి లేకయో
పికధరఁబెట్టి భీతిలుచు ♦ వీఁడెటు పర్వతభారుఁడయ్యెనో! ౭౯౬

తే॥ ఇలను బాలకులెందఱో ♦ కలరుగాని, యిట్టిబిడ్డను నేనెప్పు ♦ డెందుఁజూడ
ననుచు మిక్కుటన వ్రేలిడి ♦ తనరునంతఁ, గంసునాజ్ఞఁదృణావర్త ♦ కర్బురుండు.

తే॥ నందు వ్రజమొంది సుడిగాలి ♦ నాల్గుదెసల, బిట్టువీచుచుఁగన్నుల ♦ మట్టిఁగొట్టి
జగము నంధకారంబుగా ♦ సల్పిఘోర, శబ్దముంజేసి కృష్ణుని ♦ సంగ్రహించె.

చ॥ ఇటు ఘటికాద్వయంబు గను ♦ లింతయు విప్పఁగ రానియట్లు చీఁ
కటులును దుమ్ముగ్రమ్ము సుడి ♦ గాలి, సెలంగుటఁ గాంచలేక పి
మ్మట వడితో యశోద, స్వకు ♦ మారుని నెల్లెడఁజూచి చూచి యె
చ్చటఁ గనలేక కన్నులను ♦ జల్లల నశ్రువులొల్క నివ్వెఱన్. ౭౯౯

ఉ॥ నాయన! కృష్ణ! యేభవ ♦ నంబున నుంటివొ యెట్టులుంటివో
యే ఘెదకేగితో సుజను ♦ లేరయినన్ నినుజూచియుందురే
నా యెద నిల్వలేదకట! ♦ నాగతియెట్లికనంచు నెంతొవా
పోయియుఁ జూచుచుండె సుర ♦ భుల్ మృతవత్సముఁగాంచు చాడ్పునన్. ౮౦౦

వ॥ అనంతరంబునందు గోకులంబందలి సుందరీ మణులా యశోదార్తోదనంబు విని యేదియో పుట్టిముగ్గెనని యెంచి పఱతెంచి యామెవలన హరి వృత్తాంతంబంతయు నాలించి చింతించి యోచించి విచారించుచుండ బ్రహ్మాండనాయకుండగు నబ్బాలకుండును తృణావర్తుండను రక్కసునితో వియన్మండలమందు లక్షయోజనంబులుజని క్రమంబుగా మేరుధరాధరతుల్యభారుండై వాని మూఁపుననుండ

సాదుండగీడు. ౪౬౧

ఉ॥ మోయఁగలేను వీని నిఁక ♦ బొట్టగదా యని యొప్పియుంటి న
బ్బో యచలేంద్రమంచు విడఁ ♦ బోవుట కృష్ణుఁడెఱింగి కంఠమా
హాయనుచట్టిపట్టుకొన ♦ నా యసురుండు నయో! యయో! యయో!
యోయికుమార! నన్నువిడు ♦ మూపిరు లుంపుమటన్న వెన్నుఁడుర్. ౪౬౨

చ॥ మెడ బిగఁబట్టి యాయసురు ♦ మింటనె చంపఁగ వానిజోలి య
ప్పుడె ఘనునిర్ దటిత్తువలెఁ ♦ బొందెఁ దదచ్యుతునందు నంత దై
త్యుఁడు దివినుండి కృష్ణసహి ♦ తుండయి తుండెములౌనటుల్ శిలర్
వడిఁబడెఁ దద్ధ్వనిర్ గదలఁ ♦ బాఱె వసుంధర మ్రోఁగె దిక్కులుర్. ౪౬౩

ఆ॥ అంత గోపకాంత ♦ లదిగాంచి యరుదెంచి, సంతసించి కృష్ణు ♦ సంగ్రహించి
యందునున్న నంద ♦ సుందరినిం బిల్చి, మెలమితోడనిచ్చి ♦ యెంచిరిట్లు. ౪౬౪

ఆ॥ పూర్వభవములందుఁ ♦ బుణ్యవ్రతంబులఁ, జేసినాము, నిజమె ♦ చెప్పినాము
సాధుసేవ, భక్తి ♦ సల్పినామోకాని, యాశవిడిన వీఁడు ♦ హాయిదొరకె.

చ॥ అని ముదమొంది గోపసతు ♦ లమ్మ! యశోద! ప్రమాదముం దృజిం
చి సిసువుఁబెంపవమ్మ! పరి ♦ శీలనఁజేయఁ గుమారునోరు దూ
పను వెలిబాఱెఁ బ్రత్తిపువు ♦ భాతిని గావునఁ బాలనిచ్చి డో
ల నితని నిద్రపుచ్చి పను ♦ లర్ మఱిఁజూడుము గూడదాలముర్. ౪౬౬

ఉ॥ ఈవిధినిర్ వచించి తమ ♦ యిండ్లకు నేగిరి బాలుహాయి గో
పావళి యాలకించి ముద ♦ మందెను బిమ్మట సూనునిర్ యశో
దావనజాక్షి యంకమునఁ ♦ దారిచియుర్ జనుఁబాలనిచ్చి మో
హావృతయాచుఁ గోకఁగొని ♦ యశ్రువులద్దుచుఁ జాల జాలితోర్. ౪౬౭

ఉ॥ రోహిణి! దైవమొక్క కొమ ♦ రుర్ దయనిచ్చెను గాని పుత్రసం
దోహము నీయలేదు గద ♦ తుష్టినిఁ జెందుదుమన్న వీనికే
సాహసికాపకారములు ♦ సర్వము గల్గెడి నెప్డు ప్రాణసం
దేహమె కాని తిండిఁదిని ♦ తేటగనుండఁడె ప్రస్తుతంబునర్. ౪౬౮

ఉ॥ మిత్తిమొగంబునుండి విడి ♦ మేదిని కీతఁడువచ్చె నారయర్
జిత్తము దత్తరిల్లెడిని ♦ జేయుట కేమియుఁ దోఁపలే దెటర్
జొత్తు, నిఁకెందు నుందు, విధి ♦ సూడ నదృష్టము కృష్ణుఁడుంట నా
విత్తము, వస్త్రముల్, బ్రతుకు, ♦ వేశ్మములన్నియు నున్నవయ్యెడిర్. ౪౬౯

ఉ॥ ఈకొడుకే యరిష్టముల ♦ నేమియుఁ జెందకయున్నచో ధరా
నాకుల కర్థదానముల, ♦ నవ్యగృహంబుల దేవతాళికిర్

శ్రీకమలేశపూజలను, జేసెదనమ్మరో! నేను వీనిని
గైకొని "యంధయష్టి" వలెఁ గాలము యాపనసేయు నుంటిఁగా. ౪౭౦

బ్రాహ్మణులు శ్రీకృష్ణునకు రక్షసేయుట.

చ॥ అని యనునంతలోన ద్విజు లందఱు సుందరనందమందిరం
బున కరుదెంచి నందుఁడిడు పూజల నొజ్జ గ్రహించి దీవనల్
బొనరిచి యయ్య! మీ సుతుఁడు బొందఁ డనర్థము, సౌఖ్యసంపదల్
గనుఁ, జిరజీవియై యలరుఁ గావునఁ గుందకుఁడంచుఁ బ్రీతితోన్. ౪౭౧

చ॥ నవకుశ పల్లవంబులను నవ్యజలంబులఁ గర్ణపేయ సం
స్తవముల, వేదసూక్తులను, స్వస్తివచస్సుల, సామగీతులన్
సవము యథావిధిన్ జరిపి చక్కఁగ నగ్నికి నర్చనల్పి మా
ధవునకు రక్షసేసిరిటు దానవిధానవిదగ్రణీ! గుణీ! ౪౭౨

వ॥ దామోదరుండు చరణంబులను, విష్టరశ్రవుండు జానువులను, శ్రీహరి యూరువులను, శ్రీకృష్ణుండు నాభియు, రాధికాధవుండు కటిభాగంబును, పీతాంబరుం డుదరంబును, పద్మనాభుండు హృదయంబును, మధురానాథుండు ముఖంబును, ద్వారకారమణుం డుత్తమాంగంబును, నసురాంతకుండు పృష్ఠంబును, శ్రీపరాత్పరుండు సర్వప్రదేశంబులను రక్షించుగాకయని యా పాపని దీవించిరి. ౪౭౩

ఉ॥ అంతట నందుఁ డాద్విజుల కావులు లక్షను, లక్షవస్త్రముల్
వింతలగొల్పు రత్నములు వేయి, దశాధికలక్షవిత్త, మ
త్యంతవిధేయుఁడై యొసఁగి యంపి స్వబంధుసుమిత్రలోకమున్
సంతసమొందఁజేసె మణిజాలసువర్ణధనాంబరంబులన్. ౪౭౪

తే॥ అని వచింపఁగ జనకుండు హర్షమొంది, నారదా! తృణావర్తుఁ డశ్వరుఁడగు
హరిని లీనమైపోయెఁద దాదిమజని, నెవ్వఁడైయుండునో యానతీ తెలుఁగఁ జెప్పుము!

తృణావర్త పూర్వజన్మవృత్తాంతము.

చ॥ అనవుడు నారదుండనియె నాతఁడు పాండుధరాధిపుండు య
జ్ఞనిరతుఁ డచ్యుతాంఘ్రి జల జస్థితచిత్తుఁడు ధర్మనిష్ఠుఁడున్
ఘనబలుఁడున్ వదాన్యుఁడు గఁ గ్రాలియు రేవతటంబునందు వే
కనులను గల్గి వేసతులఁ గాముకుఁడై వసియించె నయ్యెడన్. ౫౭౬

తే॥ అటకు దుర్వాసుఁడన్ముని యరుగుదెంచె, నప్పుడాతఁడు గనియు సాష్టాంగనతుల
సల్పలేదది గన్నయా సంయమి గని, మచ్చరీ! యసురుండవై మలయుమిలను.

సు॥ అని శాపంబు నొసంగ నొచ్చి మదియం దాపాండుభూపాలుఁ డో
మునినాథా! భవదీయపాదములనా మూర్ధంబునన్ దాల్తు వే

నను రక్షింపు మటంచు వేడ ముని యా ♦ నారాయణస్పర్శచే
తను మోక్షంబును జెందనుండుపనిరో ♦ దద్రీతి నా భూపుడున్. ౪౭౯

తే॥ ధరఁ దృణావర్త నామక ♦ దానవుండు, గట్టితనమునఁ దిగ్గుచుఁ ♦ దుట్టతుదను
నట్టి నందునిపట్టిని ♦ నంటి యట్లు, ముక్తిఁబొందెను బహులాశ్వ ♦ భూవరేణ్యా!

వ॥ అంత నొక్కనాఁడు యశోదాదేవి. ౪౮౦

సీ॥ కనకమణి ప్రభా ♦ కనదురుడోలికా, రత్నమందుఁ బరుండి ♦ క్రాలువాని
దృష్టిదోషము వాపు ♦ తిలకంబు వానిని, జిన్నారి పొన్నారి ♦ చిన్నవాని
నంతములేనట్టి ♦ వింతలుగలవానిఁ, గాలిఁ బ్రేల్గుచుచుఁ ♦ గదలువాని
నల్లవానిని జిన్ని ♦ నగుమోమువానిని, గాటుకగలతమ్మి ♦ కనులవాని

తే॥ కృష్ణచంద్రుని సూనుని ♦ దృష్ణతోడఁ, గాంచి తనతోడఁ గూర్చుండఁ ♦ గా నొనర్చి
పాలనిచ్చి ప్రమోదముఁ ♦ జాలజెందు, చుండ హరి యావులించుచుఁ ♦ జూపె జగము.

తే॥ అద్దియామెయుఁ గన్గొని ♦ యరరె యేమి!, బ్రహ్మముఖులైన దేవతల్ ♦ వఱలి రహహ
యుర్ఘురే విశ్వమంతయు ♦ నగపడెడిని, ననుచు వింతతోడుతఁ దన ♦ కనులమూసి.

తే॥ పిల్లఁడెటఁబోయెనోయను ♦ భీతిచేత, కనులఁ గ్రమ్మఱఁ దెరచియుఁ ♦ గాంచలేక
సొమ్మసిల్లెను నందుని ♦ సుదతి తపము, నలఁతి వర్ణింపఁ దరమా నె? ♦ యవనినాథ!

యశోదానందుల పూర్వజన్మవృత్తాంతము.

క॥ అనవుడు నారద! నందుఁడు, దనసతితోఁ గలిసి యెట్టి ♦ తప మొనరించెన్
ఘనుఁడగు శ్రీహరి వారికిఁ, దనయుండయి కల్గుటేల ♦ తప్పక చెపుమా! ౪౮౪

తే॥ అనఁగ మౌనియు నిట్లనె ♦ నష్టవసువు, లందు మేల్బంతియైన ద్రో ♦ ణాహ్వయుండు
ధరయనెడి భార్యతోఁ గూడి ♦ హరిని గొల్చు, చుండి సుఖముగా దివమేలు ♦ చుండెఁ గాని.

ఉ॥ బిడ్డలు లేని కారణము ♦ పెల్లుగఁ జింతలఁ బెట్ట నాతఁడా
గడ్డుపనిన్ నివారణము ♦ గా నొనరింపఁ దలంచి యాలితో
నడ్డులేక మందరకు ♦ లాచలమొందె విరించిఁ గూర్చి చే
పడ్డ ఫలానిలాంబువులఁ ♦ బర్ణములన్ క్షుధఁదీర్చు చొక్కెడిన్. ౪౮౬

ఉ॥ పుట్టలు వెట్ట ఘోరతప ♦ ముల్ బొనరింపఁగ నర్బుదాబ్దముల్
నెట్టన బ్రహ్మ వచ్చి యత ♦ నిం గని ద్రోణ! తపంబు మెచ్చితి
న్దిట్టవె కాని యేవరము ♦ నీవడుగన్ మదినెంచియుంటివో
గట్టిగఁ జెప్పి కైకొని సు ♦ ఖంబును గాంచుమటన్న ద్రోణుఁడున్. ౪౮౭

చ॥ ధరయను భార్యతోఁ గలిసి ♦ తత్క్షణమందున మీఁదిపుట్టలన్
సరగున నెట్టు చాపిధికి ♦ సాగిలి మ్రొక్కి దయాపయోనిధీ!
సురకులశేఖరా! కరుణఁ ♦ జూచి జనార్దనుఁ డాత్మజుండుగాఁ
బొరయు నటుల్ ఘటించి ప్రియ ♦ పూరితభక్తిని మాకొసంగుమా! ౪౮౮

ఉ॥ ఇయ్యది తప్పవేఱొకటి ♦ యెద్దియు వల్దని వేడ బ్రహ్మ యో
యయ్య! యలభ్యమా వరము ♦ నడ్గితి వైన మఱొక్కజన్మమం
దియ్యది సెందనుందువని ♦ యేర్పడఁ జెప్పి తిరోహితుండుగాఁ
జయ్యన ద్రోణుఁడుర్ ధరయు ♦ సంతసమందుచు నేగిరింటికిన్. ౪౮౯

తే॥ అంత ధర,యశోదయనంగ ♦ నవనియందు,ద్రోణుఁడున్ నందుఁడనఁబుట్టి ♦ తుష్టినుండ
బ్రహ్మవాక్యంబు నిజము స♦ల్పంగమధుర,నుండి వారికిసుతుగ ♦ శ్రీశుండు సనియె.

చ॥ మధుకముకంటె, యుక్తవిధ ♦ మాఁగిన మామిడిపండు కంటె నా
మధువునకంటె, నాచెఱకు ♦ మాధురికంటెను, ద్రాక్షకంటె, నా
మధుసుధకంటెఁ, దియ్యనయి ♦ మాటికిమాటికిఁ గ్రోలఁజేయు నీ
మధురిపుసత్కథామృతము ♦ మంగళదంబయి యుంట నాదిలోన్. ౪౯౧

మ॥ హరి, శృంగాచలమందు నాకొసఁగె, నే ♦ నాపైన నద్దాని నా
నరనారాయణమౌనివర్యులకు నా ♦ నందంబుతోఁ జెప్పి యీ
పరినీకాడి కృతార్థతన్ జెలఁగితిన్ ♦ భ్రాజత్ప్రభావోదయా!
మఱి యీవేమివినంగఁ గోరెదవొ? యా ♦ మాటన్ వెసన్ బల్కుమా! ౪౯౨

క॥ ఏతద్రీతిని నడుగఁగ, నేత, యలరి కృష్ణుఁడచట ♦ నిసువయి యేయే
చేతలఁ జేసెనొ యాకత, నీతఱి ననుకంపను వచి ♦ యింపు సురర్షీ! ౪౯౩

తే॥ అనఁగ నారదుఁడిట్లనె ♦ నవనినాథ! యట్టి వసుదేవుపంపున ♦ నరమున యదు
కులపురోహితుండైన గ♦ర్గుండు వ్రజము, నసఁగ నందుండు పూజించి ♦ సన్నుతించి.

గర్గుండు గోకులంబునకేగి రామకృష్ణులకు నామకరణంబులఁ గావించుట.

ఉ॥ ఓమునివర్య! నా వ్రజము ♦ నోంమటచేతఁ బవిత్రమయ్యె నీ
యే మిపుడే కృతార్థులము ♦ నీయదువంశము ధన్యమయ్యె మీ
రీమెయి నా కుమారులకు ♦ నీ సుకుమారుల కాదరంబునన్
నామములన్ ఘటించి కరు♦ణన్ గృతిగా నను జేయ వేఁడెదన్. ౪౯౫

చ॥ అని వినుతింప నామునియు ♦ నట్టులె చేసెద నంచు నొప్పి నం
దుని, గొనిపోయి యొంటరిగ ♦ దుర్ణయకంసుఁడు సేయఁబోవుబా
ధను వివరించి యియ్యది మి ♦ ధస్థ్నలమందునఁ జేయునౌనటం
చు నుడివి యావ్రజేశుఁడు, య ♦ శోదయు, వేడ్కను జూచుచుండఁగాన్. ౪౯౬

చ॥ తొలుత నవిఘ్నమస్తనుచు ♦ ధూర్జటినందనుఁ బూజసల్పి య
వ్వలను నవగ్రహంబులకు ♦ భక్తిని నర్చలొనర్చి యంత బా
పలకు సమగ్రదక్షిణ ల ♦ పారముగానిడఁజేసి దేవతా
వలికి నమస్కరించి యిటు ♦ వల్కెను నందుని కోనరేశ్వరా! ౪౯౭

ఉ॥ రోహిణి కాంచినట్టి కొమ ♦ రుండు, మునీంద్రహృదబ్జపంక్తి న
వ్యాహతమా విహారము ప్రి ♦ యంబున సల్పుటచేత, భక్తిస
న్నాహసమేతులన్ నిజగు ♦ ణంబులతో రమియింపఁ జేసి యా
యైహికపారమార్థికము ♦ లందు రమించుట రాముఁడయ్యెడిన్. ౯౯

తే॥ గర్భసంకర్షణమున సం ♦ కర్షణుఁడన, రేవతికి భర్తయగుటను ♦ రేవతీశుఁ
డనఁగ బలశాలులందున ♦ నతిశయుండు, నగుటఁ బట్టియు బలుఁడన ♦ నతిశయిల్లు.

క॥ నందా! మఱియుతుపేళ్ళ, నందంబుగ వినుము శోభ ♦ నప్రదముల్ ద
ద్బృందారక వందితముల్, సందేహనివారకములు ♦ సద్గతిదంబుల్. ౧౦౦

సీ॥ కమలావిభుఁడగుఁగ ♦ కారంబుచేతను, శ్రీరాముఁడగును ఋ ♦ కారమునను
షడ్గుణయుక్తుఁడౌ ♦ స్వచ్ఛసితద్వీప, కాంతుండునగును ష ♦ కారమునను
నారసింహుఁడగు ణ ♦ కారంబుచేతను, నల యకారంబుచే ♦ నగ్నిభుక్కు
నగు విసర్గముచేత ♦ నల నరనారాయ, ణాఖ్యమునీంద్రులు ♦ నగుదురందు

తే॥ వలనఁ గృష్ణాభిధానమె ♦ లలితమాను, గానఁ బెట్టితిని యుగయు ♦ గంబులందు
ధవళరక్తపీతరుచులఁ ♦ దత్తదుచిత, రీతిఁ దాల్చుచు జగతి వ ♦ ర్థిల్లునయ్య! ౧౦౧

చ॥ అదియునుగాక ద్వాపరయు ♦ గాంతమునన్ గలియాదికాలమం
దుదయము సెంది కృష్ణతను ♦ నొందుటబట్టియుఁ గృష్ణనామమే
కుదిరెడి, నీసుపుత్రకున ♦ కున్, వృషభానులలాము గీమునం
దొదవిన రాధకున్ బతిగ ♦ నుంట నితండగు రాధికేశుఁడున్. ౧౦౨

తే॥ వసువులను నింద్రియంబుల ♦ వఱలు దేవ, తలమనంబులఁ దగుచుఁ బ ♦ నులను నెల్ల
నాచరించుట వాసుదే ♦ వాఖ్యగూడఁ, గలుగు నీ కుఱ్ఱనికి ముంద ♦ నిల ప్రజేశ!

ఉ॥ శ్రీకరుణాకరుండును, న ♦ శేషజగత్పతి శేషశాయి, గో
లోకనివాసియైన హరి, ♦ లోలుభుఁడై యిట నాత్మజాతుఁడై
నీకుఁ జెలంగెఁ గంసముఖ ♦ నిర్జరవైరుల రూపుమాప స
ల్లోకముఁ బ్రోవ భూభరము ♦ లుప్తముగా సలుపంగ; దేవరా! ౧౦౪

ఉ॥ ఆపరమేశు లీలలును ♦ నాఖ్యలు సూడఁగ వేదగుహ్యముల్
పాపవినాశకంబులయి ♦ భ్రాజిలుఁ ద్వద్గృహమందు నాతఁడే
పాపఁడుగా జనించెఁగద! ♦ భాగ్యమదేమని సన్నుతింతు నీ
వే పరిపూర్ణధన్యుఁడవు ♦ వింతలుగా వని యేగె భూవరా! ౧౦౫

గర్గుండు వృషభానుని దరికరిగి రాధాకృష్ణ ప్రశంసఁ జేయుట.

ఉ॥ నందుఁడునున్, యశోద, నిజ ♦ నందను లీలలఁ జూచి చూచి యా
నందము నొందుచుండి రల ♦ నైష్ఠిక గర్గమునీంద్రుఁ డల్ల శా

ళింది తటంబునందున వె ♦ లింగెడి నా వృషభానుపట్టణం
బొందిచొ రంజదాలయము ♦ నొయ్యనఁ దద్వృషభానువర్యుఁడున్. ॥ ౧౦౬

సీ॥ శ్వేతాతపత్రంబు ♦ వేయుటచే నిర్జ, రేంద్రుఁబోలుచునుండు ♦ నిద్ధభోగి
దండంబుఁ బట్టుట ♦ ధార్మికవరుఁడైన, ధర్ముఁబోలు న ♦ దభ్రతనువు
బ్రహ్మతేజంబుచు ♦ బలముగాఁ బొందుట, సూర్యునింబోలెడి ♦ నార్యవర్యు
బుస్తకమేఖలా ♦ శస్త్రహస్తుండౌట, బ్రహ్మకై వడినుండు ♦ బ్రాహ్మణవరు

తే॥ తెల్లపుట్టంబులంగట్టి ♦ తేజరిల్లు, చుంట విష్ణునికై వడి ♦ నొప్పుచుండు
గర్గమునివరు భక్తితోఁ ♦ గాంచిలేచి, మ్రొక్కి గద్దియనిడి పాద ♦ పూజసల్పి.

ఉ॥ ఉత్తమలోకపర్యటన, ♦ మర్త్యుని శాంతినిగూర్చి సర్వలో
కోత్తరమై మనుష్యముల ♦ మూఢ్చి పవిత్రముజేసి తీర్థసం
పత్తురచించి దివ్యమగు ♦ పద్ధతినుండ నొనర్చునప్డు నా
చిత్తగతాఘపుంజములఁ ♦ జెండుట చిత్రమె మౌనినాయకా! ॥ ౧౦౮

చ॥ మునివర! నాకు రాధయను ♦ ముద్దియ యొక్కతె కల్గె దాని నే
ఘనున కొసంగుమన్నఁ దమిఁ ♦ గానలవానికి నిచ్చెదన్ జుమీ
యనవుడు తన్మునిప్రవరుఁ ♦ డా వృషభానునిఁ దోడుకొంచు ని
ర్జనయమునాతటస్థలిస ♦ రాసరి జేరి వసించి యిట్లనెన్. ॥ ౧౦౯

ఉ॥ ఓ వృషభాను! గోపకుల ♦ నుత్తముఁడై భగవంతుఁడై మహా
దేవముఖాదిదేవుఁడయి ♦ దివ్యజగత్ప్రభుఁడై పరేశుఁడై
గోవిభుఁడై వ్రజాధిపున ♦ కుం దనయుండయి వెల్గు కృష్ణుఁడే
యావనితామతల్లికకు ♦ నాత్మవిభుండగునట్లొనర్పుమా! ॥ ౧౧౦

క॥ అందులకతఁ డానందముఁ, బొందుచు శ్రీకృష్ణమూర్తి ♦ పుట్టగనేలా?
నందుని నందనుఁడై వ్రజ, మందుండుటయేల? నుడువు♦మా! యన మునియున్.

మ॥ అవనీభారముఁ దీసి వేయుటకుఁ గం ♦ సాదిద్విషద్ధింసకై
సవములొ ప్పెనఁగ బ్రహ్మ వేఁడ హరి యా ♦ జన్మంబు సెందెన్ దదీ
యవధూరత్నముతొన్ని శాంతమున రా ♦ ధాభిఖ్యతోఁ గూడి సం
భవముంబొందెఁ బ్రధానమేయదిగ నా ♦ వాక్యమ్ము లాలింపుమా! ॥ ౧౧౨

చ॥ అనవుడు బాగుబాగనుచు ♦ నావృషభానుఁడు స్వీయభార్యతో
ఘనముగ యోచనల్ సలిపి ♦ కాఁగల కార్యముఁగూర్చి మోద బా
ష్పనికర మొల్కఁ గ్రమ్మఱ న ♦ పారతపఃఫలధన్యుఁడైన యా
మునివరుతోడ నిట్లనియె ♦ మోడ్చి కరంబుల మైథిలేశ్వరా! ॥ ౧౧౩

తే॥ ఈవు సెప్పినరీతి శ్రీ ♦ కృష్ణమూర్తి, కిచ్చి పెండ్లిని నొనరింతు ♦ నిద్ధసీదు
దయఘటిల్లెను గావునఁ♦దదుపయమమ్ము, మీరె చేయుట బాగని♦కోర మునియు.

వ॥ ఈ రాధాకృష్ణవివాహంబు నిర్వహించి నేను సేయింప సమర్థుండను గాను. మఱియేమంటివేని యమునాధునీతటంబున విలసిల్లు బృందావనంబునకుఁ జెంగటనున్న భాండీరంబను వనంబున నిర్జనంబయి నయనపర్వంబొనర్చు నొక్క ప్రదేశంబున సురాధినాథుండగు నప్పితామహుండే వచ్చి తత్పరిణయంబు సేయించు. మఱియుఁ దద్దుహితను శ్రీకృష్ణార్ధాంగిగా గుర్తెఱుంగుము. తద్భవిష్యజ్జామాతయగు శ్రీకృష్ణుండు గోలోకంబున నివసించు పరమేశ్వరునిగాఁ దెలిసికొనుము. వీరలెల్ల రాలోకంబునుండియే యాగతులైతిరి. ఇదియంతయు నీ రాధాదేవి సంకల్పజనితంబని భావింపుము. ఎవరి దర్శనంబు, నరామరమునివరులకు దుర్లభంబై దుర్ఘటంబై యున్నదో యట్టివారు నీ నట్టింట గోపికాగోప సహితులై విరాజిల్లఁగలరని పలుక నాయాలుమగలు పెల్లుమోదిల్లి శ్రీరాధాకృష్ణ ప్రభావం బెఱింగి క్రమ్మఱ రాధాశబ్దనిర్వచనంబు సేసి తత్త్వమంతయుఁ దెలిపి కృతార్థులఁ జేయవే యని ప్రార్థించుడు నతండిట్లనియె. ౫౧౫

ఆ॥ రమ రకారమయ్యె ♦ రాజిల్లు నాకార, మాదిగోపియయ్యె ♦ నా ధకార
మా ధరిత్రియయ్యె ♦ నాకార మావిరజాభిధాన,సతియు ♦ నయ్యె ధీర! ౫౧౬

ఉ॥ ఈ విధి గంధమాదనమ ♦ హీధరమందున సామవేదపుం
భావమటంచు మాధవుని ♦ వక్త్రమునుండియె వింటిఁగృష్ణుఁడన్
దేవునితేజునాలుగగు ♦ తెన్నులుగానయి లక్ష్మి, భూమి లీ
లా విరజాహ్వయంబులఁ జె ♦ లంగి లయించెను రాధలోపలన్. ౫౧౭

తే॥ దానిచే రాధ పరిపూర్ణ♦తమ యగుటను, రాధికాకృష్ణుఁడంచు వి♦రతియు లేక
శాంతి దాంతి సమేతులౌ♦శాస్త్రవిదులు, జపమునల్పుచునుంద్రుని♦శ్చంచలముగ

క॥ రాధాకృష్ణాయనునది, బోధపడన్ దలఁచుచున్న ♦ పురుషులు శుభముల్
సాధుజనమైత్రిఁ గని యా, గోధామముఁ జేరఁ గలరు ♦ కువలయ నాథా! ౫౧౯

క॥ అనవుడు నావృషభానుం
డును జిత్రమువొందియుండు ♦ డున్ శ్రీగర్గుం
డును వృషభానుని పూజలఁ
గొని నిజధామమున కేగె ♦ క్షోణీనాథా! ౫౨౦

తే॥ ఒక్కదినమందు శ్రీనందుఁ♦డొయ్యనొయ్య, నాత్మభవునంకమందుంచి♦యాలఁద్రోలు
చల్ల యమునా నదీతట♦మందునున్న, వాయుకంపిత భాండీర♦వనికిఁ బోయె. ౫౨౧

✤ నందుండు నందనునింగొని భాండీరవనంబున కేగుట. ✤

ఉ॥ అత్తఱిఁ గృష్ణునిచ్చ మొగు ♦ లాకసమందున నుండఁ బయ్యరల్
జిత్తము తత్తఱిల్లునటుఁ ♦ జెట్టులు గూలెడిరీతి వీవ నం

ధాత్త్రధరిత్రి గా మఱి మ ♦ హాభయదంబయి కన్పడంగ నె
గ్గెత్తుచుఁ గుఱ్ఱఁడేడ్చుట వి ♦ జేశుఁడు గర్గ్గొని భీతభీతుఁడై. ౫.౧౨

తే॥ అంకమండలి పుత్రకు ♦ నాతురమునఁ, బట్టుకొని చిత్తమందునఁ ♦ బరమభక్తిఁ
బతితపావను,భగవంతుఁ,♦బరమపురుషు, నమ్మిశరణువాంఛించుకా♦లమ్ములోన.

ఉ॥ కోటికళానిధిప్రభల ♦ గోటను మీఱెడి తేజుగల్గి లా
లాటికమాస్యమందిడి ల ♦ లంతికఁ, గంకణ, తార, హారముల్
హాటకభూషలన్ మెఱసి ♦ శ్యామల వస్త్రములన్ ధరించి బ
ల్మీటుగనుండు రాధయను ♦ లేమ, సమక్షమునందు భాసిలన్. ౫.౧౪

చ॥ అదరి యతండు మ్రొక్కులిడి ♦ యంజలిఁగూరిచి యీకుమారుఁడే
గద యలవిష్ణు, వీవితని ♦ కాంతల యందున ముఖ్యురాలవై
కుదిరితి గాదె! గర్గముని ♦ కుంజరుఁ డెంతొరహస్యమంచు ని
య్యది వచియించె వీనిని మ ♦ దంకమునుండి గ్రహింప వమ్మరో! ౫.౧౫

ఉ॥ వారిదభీతుఁడైనటుల ♦ వర్తిలు వీని గ్రహించి క్రచ్చరన్
జేరిచి నాగృహంబునకుఁ ♦ జేసెడి నానతులందుకొమ్ము రా
ధారమణీమణీ! యనఁగఁ ♦ దద్వనితామణియిట్లు పల్కెనో
ధీరవరేణ్య! నీవినుతి ♦ తృప్తి ఘటించుట దాని నొప్పితిన్. ౫.౧౬

ఉ॥ నావుడు నందుఁడీ వటుల ♦ నాకుఁ బ్రిసన్నతఁబల్కుచున్నచో
భావుక యుష్మదంఘ్రియుగ ♦ పద్మనిబద్ధసుబుద్ధినిచ్చి భ
క్త్యావళిమైత్రి యెప్పుడగు ♦ నట్టుల దేవిరో! చేయుమన్న రా
ధావనితాలలామయుఁ “ద ♦ థాస్తు” ని యాతని యంకమందునన్. ౫.౧౭

ఉ॥ సూరునితీరువెగ్గెడి య ♦ శోదకిశోరుని నాత్మభర్తను
న్నారవరీతిఁ గొంచు, నల ♦ నందుఁడు గర్గుని మ్రొక్కియేగ, భాం
డీరవనాంతరంబునఁ గ ♦ డింది ప్రియంబునఁ జేరి నిశ్చయా
కారము దాల్చి నద్దెసలఁ ♦ గాంతులఁ బర్వుచునుండు నంతలోన్. ౫.౧౮

శ్రీరాధాకృష్ణులకు వివాహమహోత్సవంబు రహస్యంబుగా జరుగుట.

శా॥ గోలోకంబుననుండి భూమి, యటకున్ ♦ గోమేధికాదిప్రభా
హేలాభాసురహేమరూపమును నెం ♦ తేన్ దాల్చి యేతెంచె వి
చీలీలోల్ల సదర్కపుత్రి, కనక ♦ శ్రీ రత్నశోభాంచితో
ద్వేలారోహణ సౌధముల్ గలిగి దీ ♦ ప్తిన్ జెందె హర్షంబుతోన్. ౫.౧౯

ఉ॥ దేవతరూత్కరంబు, వ్రత ♦ తివ్రతతుల్, ఫలపుష్పసారభో
జ్జీవిత శీతవాతములుఁ ♦ జిత్రఖగోద్గతకర్ణపేయ నా

నా విధకూజితంబులు, న ♦ నంతకళల్ సెలువారమీఱు బృం
దావన మన్ని తెన్నుల ను ♦ తంబయి యచ్చటఁ జొచ్చి ముచ్చటన్. ౧౩౦

తే॥ రత్నశిలలును, సెలయేళ్లు ♦ గ్రాలి సొగసు, నింపుగుహాలను బంగరు ♦ నీటుగలుగు
శిఖరముల్ గల్గి యెల్లెడఁ ♦ జిత్రరుచులఁ, బర్వి గోవర్ధనాద్రియుఁ ♦ బరఁగ నచట.

సీ॥ కాసారదీర్ఘికా ♦ ఖాతపద్మాకర, కూప ఘటీయంత్ర ♦ దీపితంబు
ప్రాకారకుట్టిమ ♦ ప్రాంగణ చత్వర, సౌధవీథీ సభా ♦ సంయుతంబు
శారికాపరభృత ♦ కీరపారావత, శ్రవణపర్వధ్వని ♦ సంగతంబు
హైమపతాకాధ్వ ♦ జాలంబ సౌత్సుక్య, భటవర్యనికరవి ♦ భ్రాజితంబు

తే॥ బరిమళత్పుష్పవాసనా ♦ వాసితంబు, మత్తషట్పద ఝుంకృతి ♦ మానితంబు
భవ్యవాసంతమాధుర్య ♦ భాసురంబుఁ, గుశలదంబైనయొండు ని ♦ కుంజమలరె.

తే॥ అందు నా యచ్యుతుండు పీ ♦ తాంబరములఁ
దాల్చి కౌస్తుభరత్న వే ♦ త్రిమురళులను
గొని వినీలమేఘప్రభన్ ♦ దనరి కోటి
మన్మథాకార రమ్యుఁడై ♦ మంగళమతి. ౧౩౩

మ॥ విలసద్భూషణ వామబాహువున సం ♦ ప్రీతిస్మితాస్యంబుతో
లలనారత్నము రాధికన్ గొనుచుఁ ద ♦ ల్లాజాహరిద్రాంబుభృ
త్కలశాలంకృతి కుంకుమాక్షత కుశ ♦ క్షౌమాదివైవాహికా
ర్థలసన్మండపమందుఁ జేరి యలరెన్ ♦ దత్సింహపీఠంబునన్. ౧౩౪

క॥ ఇరువురు సింహాసనమున, వఱలినతఱి విద్యుదంబు ♦ వాహములవలెన్
మెఱసిరి పిమ్మట నటకా, పరమేష్ఠియు వచ్చి మ్రొక్కి ♦ ప్రణుతించె నిటుల్.

ఉత్సాహ॥ హరి! యనాదిమధ్యనిధన ♦ యప్రమేయ! యవ్యయా
వరద! పరమ! నిర్వికల్ప ♦ భక్తకల్ప! రాధికే
శ్వర! యగణ్య భువననాథ ♦ చక్రిపాణి! శార్ఙ్గి! నే
శరణు నిన్ను జెందుచుంటిఁ ♦ జక్కఁ జూచి ప్రోవుమా. ౧౩౬

శా॥ లీలాలోలుఁడవై చెలంగెడితఱిన్ ♦ లీలావతీనామయై
గోలోకంబున నీమె యామతిలు వై ♦ కుంఠాధినాథుండవై
క్రాలన్ లక్ష్మియనంగ నీజనని వి ♦ భ్రాజిల్లు రాముండవౌ
కాలంబందున నీమె సీతయగు నో ♦ గ్రావోత్తమోద్ధారకా! ౧౩౭

క॥ హరివిగ జన్మించిన తఱి, నరవిందాలయగఁ బుట్టు ♦ యజ్ఞుండనఁగన్
బరఁగుతఱి దక్షిణాఖ్యను, వఱలును గద యీమె భక్త ♦ వత్సల! కృష్ణా. ౧౩౮

తే॥ నరునిఁ గలిసి నారాయణ ♦ నామకుఁడవు
గాఁగ నీసతీమణి శాంతి ♦ నాఁగ ఛాయ

భాతిన్ నరహరివిమై ♦ పరఁగుతటి ర
మాహృది యనంగనొప్పు వ ♦ లాహకాభ ! ౧౩౯

సీ॥ ఎప్పుడు బ్రహ్మవై ♦ యెసఁగెద వపుడీవె, వరఁగుఁ దటస్థయా ♦ ప్రకృతి కృష్ణ!
యెప్పుడు కాలమై ♦ యెసఁగుచుందువొ యప్పు, డీవె ప్రధానమా ♦ సిద్ధచరిత!
యెపుడు శరీరప్ర ♦ వృద్ధవిరాట్టువో, యపుడీవె ధారుణి ♦ యగుదు దేవ!
యెపుడు చతుర్విధ ♦ వృద్ధాంతరాత్మవో, యపుడు లక్షణవృత్తు♦లగుదు తండ్రి
తే॥ యెపుడు జగదంకురాదిమ ♦ హేతువైన
పృథుమహత్తువై యుందువో ♦ యీవె యపుడు
సగుణ మాయవై రాధ నా ♦ జన్మమొందు
నందనందన! సుందర ♦ కుందరదన. ౧౪౦

తే॥ గౌరమేచక కాంతులఁ ♦ గలిగి రెండు, విధములౌ మహత్తును నీవె ♦ విశ్వయోని!
మఱియు గోలోకపతివీవె ♦ శరణొనర్తు, శరణుజేసెద నాయనా! ♦ జలజనాభ.

మ॥ కరుణాభూషణ! సత్యభాషణ! జగ ♦ త్కల్యాణ కృత్ప్రాణ! నే
ర్పరి వాద్యుండవు కేవలుండ విఁక నీ ♦ రాధాసతీరత్నమో
పరమై నిర్విడలేనిదై ప్రకృతియై ♦ భాసిల్లు. మీరిర్వు రి
త్తఱిఁ బెండ్లాడుట లోకసంగ్రహము గా ♦ దా! భక్తకల్పద్రుమా! ౧౪౨

తే॥ ఇప్పుడిట మీకుఁ బెండ్లి జే♦యింప నన్ను, బిలిచితిరి లోకవిధి వింత♦గొలిపె సద్గు
ణా! ప్రతిమ! "యథా రాజా త ♦ థా ప్రజా"య, నియెడి నానుడి గననయ్యె ♦ నీరజాక్ష!
ఆ॥ కాన మీ యనుమతి ♦ నేను వేదోక్త ప
ద్ధతిని మీకుఁ బెండ్లిఁ ♦ గుతుక మతిని
జరుగునట్లు జేయఁ ♦ జాలుదునని యల్ల
ఘనవివాహ వేదిఁ ♦ జనియె నవల. ౧౪౪

ఉ॥ మంగళవాద్యముల్ శ్రవణ ♦ మాధురిగా మొఱయన్ సరస్వతీ
సంగుఁడభంగురాభరణ ♦ జాలలసద్వృషభాను పుత్రికా
మంగళకంఠమం దవని ♦ మండలనాటకసూత్రధారిచే
మంగళకార్యకారియగు ♦ మంగళసూత్రము గట్టఁజేసియున్. ౧౪౫

చ॥ చని మిథునంబు ముంగలఁ గృ ♦ శానుని బ్రజ్వలితున్ బొనర్చి యిం
ధనఘృతతండులంబుల య ♦ థావిధి హోమమొనర్పఁజేసి రా
ధనుఁ గమలాక్షుఁ గైకొని ప్ర ♦ దక్షిణముల్ దగ సల్పఁజేసి వే
ద్యను నిగమోక్త సప్తపది ♦ కార్యముగా నొనరించి పిమ్మటన్. ౧౪౬

చ॥ హరి యురమందు రాధకర ♦ ము హరి హస్తము రాధయొమ్మునన్
వఱలఁగఁజేసి మంత్రములఁ ♦ బాఠమొనర్పఁగసల్పి హార మా

పురుషవరేణ్యు కంఠమునఁ ♦ బొల్తుక యా జలజాక్షుఁడా సతీ
వరగళమందు వేయునటు ♦ బల్మిఁ గొనర్చి ముదన్వితాత్ముఁడై. ౧౪౭

ఉ॥ దంపతు లట్టి వహ్నికిఁ బ్ర ♦ దక్షిణముల్ మఱిఁ జేయఁ జేసి బ
ల్సొంపుగనున్న గద్దియను ♦ సుస్థితులన్ బొనరించి వారు ధ్యా
నింపఁగ నైదు మంత్రముల ♦ నేర్పుగఁ జెప్పుచు రాధఁ జక్రికే
తంపులులేక తండ్రివలె ♦ దాన మొనర్చియు నొప్పగించుదున్. ౧౪౮

ఉ॥ మంగళికోళ్ళు గీతముల ♦ మాటికి మాటికి శోభసెందె దే
వాంగన లాటపాటలను ♦ హర్షము సెందిరి దిట్టలైన మా
ర్దంగికపాణివాదులును ♦ దాళము వేసిరి మంచిపూల వా
నంగురియించి రంబరము ♦ నన్ విబుధుల్ బహులాశ్వ భూవరా ! ౧౪౯

క॥ అంతట సదయుఁడు రాధా
కాంతుఁడు సంతోషమొంది ♦ కని యవ్వాణీ
కాంతుఁ దన పురోహితాగ్రణి
సంతసమున నిట్లుపలికె ♦ జనకనరేంద్రా ! ౧౫౦

తే॥ కలుగఁబోవు ననర్థముల్ ♦ దెలిపి శ్రుతులు
వలుకురీతిని మెలఁగుచు ♦ మెలఁగఁజేసి
యైహికాముష్మికసుఖంబు ♦ లంది యందఁ
జేయువాఁడె పురోహితుఁ ♦ డోయి నలువ ! ౧౫౧

ఆ॥ అట్టివాఁడవీవు ♦ హర్షించితిన్ గౌర, వ మెటు నీకుఁ జేయ ♦ వలెనొ చెప్పుమ
యన్న నతఁడు మ్రొక్కి ♦ యచ్యుతా ! నీపద, పద్మములను దలఁచు ♦ భక్తినిమ్ము.

తే॥ కాని మీసలపైనుండు ♦ తేనెలవలెఁ
జెలఁగు నైహికసుఖములు ♦ వలదు వలదు
జన్మమును గోరువారె యా ♦ సౌఖ్యములను
గోరవలెఁగాని యన్యుండు ♦ గోరరాదు. ౧౫౩

చ॥ అనఁగ రమేశ్వరుండును “త ♦ థాస్తు” ని పల్కఁగ బ్రహ్మ వందనం
బునిడి స్వమందిరమును ♦ బొందె ననంతరమందుఁ గుంజమం
దున హరి, రాధ వెట్టిన చ ♦ తుర్విధదివ్యమనోహరాన్నముల్
గొని కడుపారఁగాఁ గుడిచి ♦ క్రోడిగమాడుచుఁ వేడ్కఁబోదులన్. ౧౫౪

చ॥ తములము రాధకీయ్య నల ♦ తన్వి గ్రహించి గ్రసింప నా త్రివి
క్రముఁడు కరంబుచేఁ బ్రియ క ♦ రంబునుబట్టి విహార మందున
గ్రమముగఁ జేసి నిర్వ్యరు జొ ♦ కారముగా సరసోక్తులాడుచున్
దమకముఁ బొందు చాడుచును ♦ దాఁకుచు నుండిరి కృష్ణుఁ డావలన్. ౧౫౫

మ॥ వరబృందావననామదైవిక వన ♦ ప్రాబల్యసాఫల్యము
చ్చెరువొందన్ గని, చూపి, మేచకరుచి ♦ స్నిగ్ధోర్మికాధోరణీ
సరసధ్వానవిభాసురోరుయమునా ♦ సంపత్తునుం గాంచి త
త్తరుణీరత్నము సూడనట్లు లచటన్ ♦ దబ్బాటునన్ దాఁగఁగన్. ౧౧౬

చ॥ ప్రియసతి యిట్లటుల్ వెదకి ♦ వృక్షముపై నొకకొమ్మచాటునన్
నియతిగనుండు భర్తఁగని ♦ నివ్వెఱపాటున నవ్వి పుట్టముల్
రయమునఁబట్టి లాగికొని ♦ క్రమ్మఱఁ బెన్మిటిఁ గాంచనట్లు ని
ర్భయమున నా నికుంజమునఁ ♦ బాఱుచు డాఁగె రహస్స్థలంబునన్. ౧౧౭

చ॥ తదుపరి మామమామ, వని ♦ తామణి రాధఁ గళిందపుత్రికా
నదిదరిఁ గుంజమందుఁ గని ♦ నవ్వి చెఱఁగును బట్టిలాగి వా
రిదము తటిల్లతన్ మెఱయు ♦ రీతిఁ దమాలము హైమవల్లిచే
గొదకొని వెల్గుమాడ్కిఁ జెలిఁ ♦ గూడుచు శోభిలె నో మహాప్రభూ ! ౧౧౮

శా॥ ఆధిక్యప్రియరాసకేళులను బ ♦ హ్వానందమానట్లు శ్రీ
రాధాకృష్ణులు సల్పఁగాఁ దొడఁగి రా ♦ భ్రాజచ్చతుశ్శాలలన్
సౌధాగ్రంబుల, శారికాశుకపిక ♦ శ్రావ్యస్వనాంచద్ధ్వనీ
వీధిన్ వాసితపుష్పశయ్యల మఱిన్ ♦ బృందావనం బందునన్. ౧౧౯

ఉ॥ అర్థిసమూహకల్పతరు ♦ వైన రమాపతి రాధతోడ గో
వర్ధనశైలసానువులఁ ♦ బల్మఱు క్రీడలఁదేలి సత్కళా
వర్ధితలక్షపత్రయుత ♦ పద్మము నెచ్చెలి కేలునుండి లీ
లార్థముగా గ్రహించి యము ♦ నాపగ చెంతకుఁబాఱె నవ్వుచున్. ౧౨౦

ఉ॥ అత్తఱి రాధ వెంటఁబడి ♦ యాహరి పచ్చని పట్టుపుట్టముల్
బెత్తము, వంశిఁ, గైకొనఁగ ♦ వెన్నుఁడు సూచి చెలీ ! యిదేమి ! నీ
చిత్తము భ్రాంతమయ్యెనొకొ ? ♦ సిబ్బితి నూడఁగ బీక నేనటన్
జొత్తును నవ్వరొక్కొ నను ♦ జూచి జనుల్ దయనిమ్ము వానినిన్. ౧౨౧

చ॥ అన విని యామె యో ప్రియుఁడ ! ♦ యందముగా నొక దండితామరన్
గొని కరమందుఁబెట్టుకొనఁ ♦ గోడిగమాడుచు నీవు దాని నేఁ
గనని విధిన్ గ్రహించి మఱిఁ ♦ గాలికొలందిఁగ బాఱుచుంటివే
ఘనమొకొ యిద్దిఁ గాన నివి ♦ కంజమొసంగిన యప్పు డిచ్చెదన్. ౧౨౨

ఉ॥ నావుడు నందపుత్రుఁ డల ♦ నాతిని గన్గొని కొమ్మ ! కొమ్మరో !
యీ వరపద్మమంచు నిడ ♦ నింతియు గైకొని వంశివేత్రముల్
శ్రీవసనంబు నిచ్చియు వి ♦ శేషముదంబును బొందె హాయిగా
నావనినట్లు లిర్వురు వి ♦ హారము సేసిరి రాజశేఖరా ! ౧౨౩

ఉ॥ శ్రీరమణుండు పిమ్మట న ♦ శేషసుఖాకరమై చెలంగు భాం
డీరవనంబునందగి క ♦ డిందిముదంబున భార్యకెంతో శృం
గారసుపత్ర భంగమిడి ♦ కన్నవఁ గాటుక దిద్ది సొమ్ములొ
వ్వారిగఁ దొడ్గి పూవులను ♦ బాగుగఁగూర్చె ననంతరంబునన్. ౧౬౪

చ॥ కుతుకము సెంది రాధికయుఁ ♦ గూర్మిని భర్తకలంకరింపఁగా
యతనము సేయులోన నతఁ ♦ డాత్మ కిశోరత, వీడి తోనఁ జి
న్నతనము నొంది భూస్థలిని ♦ నాకుచు దొర్లుచుఁ గొట్టి కొంచు న
ద్భుతముగ నేడ్వసాగఁగద ♦ పూర్వనిజాకృతిఁ దెల్పుచున్ ప్రభూ! ౧౬౫

చ॥ అదిగని రాధ, భీతిపడి ♦ యయ్యారె! యెట్లు కిశోరతాకృతిన్
వదలె, నెటుల్ శిశుత్వమున ♦ వర్తిలె! నీ హరి; యోమనోహరా!
వదలితివేల? గోలనుగ ♦ ప్రాణములెట్లిఁక నిల్పఁజాలు! నా
ప్రదుకొ భవద్వశంబుగ, కృ ♦ పన్ ననుఁజూడవె యిద్ది వీడవే! ౧౬౬

చ॥ అని వెతనొందుచుండు సమ ♦ యంబున నంబరవాణి, యోసతీ!
వినుము భవిష్యమందితఁడె ♦ పెన్మిటి నీకగుఁగానఁ బూర్తిగా
వనటను మాను మన్న నల ♦ భామినియున్ సరియంచు నా హరిన్
గొని యల నందగేహమును ♦ గోరికఁ జేరి యశోద కిట్లనెన్. ౪౬౭

రాధ శిశువైన హరిని తిరిగి గోకులంబునకుఁ జేర్చుట.

క॥ అమ్మా! ముసు నీపతి పన, నమ్మధికమ్ముగను పీవ ♦ నా కిడఁ వీనిన్
నెమ్మదిఁ జూచుచుఁ గ్రమ్మఱ, సమ్మదమునఁ జేర్చు నాదు ♦ సదనంబునకున్.

తే॥ అని నుతింపగదానికే ♦ నభిమతించి, నాఁటగోలెఁ గాపాడుచు ♦ లోటులేక
తిరిగి తెచ్చితిఁ గొనుము నీ ♦ దివ్యపుత్రుఁ, బెట్టుపోఁతల జక్కఁగాఁ ♦ బెంపవమ్మ!

చ॥ విని యది యామె హర్షమున ♦ బిట్టుకవుంగిలిఁ గొంచు నమ్మ! యీ
దినము శుభప్రదం బెడఁద ♦ దిట్టముగాఁ దొడఁగెన్ మదీయ పు
త్రునినిడి వేడ్కఁ గూర్చితి ను ♦ తుల్ నినుఁ జేయఁగ శేషుఁడాగునే?
యని బహుపూజలన్ సలిపి ♦ యంప స్వగేహము సేరె రాధయున్. ౧౭౦

చ॥ ఇటుల రహస్యమై యలరు ♦ నీ కమలాపతి సత్కథాస్థితిన్
దిటముగ విన్నవారలును, ♦ దివ్యముగాఁ బఠియించువారు, ను
త్కటముగ వ్రాయువారు నిజ ♦ కల్మషశైలము లెల్లఁ గూల్చి యం
తట హరిధామ మొందుదురు ♦ తథ్యము పథ్యము భూవరాగ్రణీ! ౧౭౧

శ్రీకృష్ణ బాలలీల.

వ॥ అంత నా వ్రజంబునందా మాయామానుష విగ్రహులగు రామ
కృష్ణులు గౌరనీలవర్ణంబుల విరాజిల్లుచు రోహిణీయశోదల పెట్టుపోఁతల దినక్రమం

బున శుక్లకళానిధివోలె వర్ధిల్లి పదంబులయందలి యందియలు గల్లుగల్లని మ్రోఁగ దోఁగి యాడుచుఁ దల్లుల యంకంబుల నధిరోహించి నయనంబుల విలాసంబులఁ జూపించుచుఁ గ్రీడించుచు నెక్కొక్కమాఱు సూపఱు లచ్చెరువొందఁ ఫణంబు విప్పిన నాగసర్పంబుమాడ్కి శిరంబునిక్కించి భుజపాదంబులఁ బాఱుచు వచ్చుచుఁ బోవుచుఁ జిఱునగవు మొగంబున మొలకలెత్త మనోహరులై వసియించుచు సింగంపుఁ గోదమలై వడి నిర్భయంబుగా బాలలీలలం గావించుచు నీలపీతాంబరంబులం గట్టి కండ్లఁ గాటుక మెఱయ నవరత్నఖచితభూషణంబులుఁ బొలుపార ముజ్జగంబుల ముద్దులకుఁ బెన్నుద్దులై తద్దయు వెలుంగు కుమారులను, దల్లులను, గోపికలను, గాంచుచు నిజగృహకృత్యంబులనైతము మఱచుచునవదలఁజాలక యచ్చటనే నివసించి పెల్లుమోదిల్లుచుండిరి. ఆ నందుండును నిజమందిరంబునందు సింహశాబకసదృశుండును, నందనుండునునగు చిన్నికృష్ణుని లీలలం గాంచుచు నానందించుచుండె. అవల నా యశోదాదేవి దృష్టిదోషంబాపఁ గొంపోవుతఱి గోపిక లామె కిట్లనిరి. ౫౭౨

ఉ॥ అమ్మ; యశోద! యెప్పుడు త్వ ♦ దాత్మజు నాటలకై గ్రహించి బా
హ్యమ్మున కేగవల్దు సుతుఁ ♦ డయ్యెను దుగ్ధముఖుండు వీని శీ
ర్షమ్మునఁ గాకపక్షము వి ♦ రాజిలె డిగ్గ బయిపండ్లు రెండు నూ
ర్ధ్వమ్మున వీనికుండుటఁ గ ♦ రంబగు గండము మేనమామ కౌ. ౫౭౩

తే॥ మేనమామయు వీనికి ♦ మెలఁగఁడయ్యె, గానఁ దోషము వీనికే ♦ కలుగుఁ గనుక
హాని తొలఁగుట కొఱకయి ♦ దానములను, భూసురామరగోవేద ♦ పూజసలుపు.

చ॥ అనఁగ యశోద, రోహిణియు, ♦ నందుల కొప్పి సుతోల్లసార్థమై
ధన మణి, సౌరభేయ, వసు ♦ ధా, ఘృత, వస్త్ర, సువర్ణ, దానముల్
బొనరిచి దేవ, గో, నిగమ ♦ భూసుర పూజలసల్పి రాసుతుల్
గొనకొని హేలఁదప్పటడు ♦ గుల్ ధరఁ బెట్టుచు సింహదృష్టితోఁ. ౫౭౪

తే॥ తద్ద సరిసమానులగు శ్రీ ♦ దామ, సుబల, ముఖసఖులఁగూడి ఖేలనం ♦ బుల నొనర్చి
వేడ్క నుద్యానవనముల, ♦ విమలయమున, పులినముల విహారములను ♦ సలిపిరవల.

ఉ॥ బాల విలాసహాసముల ♦ భామిను లెంతయు సంతసంబుతో
సోలునటుల్ వొనర్చి యటు ♦ సూచి యిటుల్ సని మిత్రయుక్తుఁడై
పాలను, వెన్న మీఁగడను ♦ బాగుగఁ బేరిన జిడ్డుపెర్గు, గో
పాలుర యిండ్లఁ దూఱుచు న ♦ వారిగ శ్రీహరి గ్రోలుచుండెఁగా. ౫౭౫

ఆ॥ ఒక్క దివసమందు ♦ నుపనందు సుందరి, యగు ప్రభావతి తన ♦ యాలయమునఁ
గృష్ణుఁ డట్లుతస్క ♦ రించుటఁ బలుమాఱు, గనుచుఁ గనలి వ్రజము ♦ కడకువడిగ.

శ్రీకృష్ణ దధిచౌర్యలీల.

చ॥ అరిగి యశోద కిట్లనియె ♦ నమ్మరో! నీదయ నాకు నీవలెఁ
బెరుఁగును బాలువెన్నయును ♦ బెల్లుగఁ గా నవిహాయ భాండముల్

త్వరఁగొని వచ్చులోన నెటొ ♦ వచ్చుచు నీ కొమరుండు వానిని౯
చిఱునగవొప్పు మోమున గ్రి ♦ సించెను గించను నేను గాంచఁగా౯. ౫౭౯

ఉ॥ ఇట్టుల నెన్నిమాఱులనొ ♦ యీతఁడు చౌర్యముఁ జేసెఁగాని వీఁ
డట్టి ప్రజేశ్వరాత్మభవుఁ ♦ డౌటను నీపయిఁ గూర్మిఁ గ్రమ్మఱ౯
దిట్టుటఁగూడ లేదు సుద ♦ తీ మణిరో! యన నాయశోదయు౯
బట్టికి బుద్ధిసెప్పియుఁ బ్ర ♦ భావతితోడ నిటుల్వచించె౯. ౫౮౦

ఉ॥ ఓసి ప్రభావతీ! యిటు ల ♦ నుత్తమగోవులు కోటియుండెడి౯
నా సదనంబు పాల్పెరుఁగు ♦ నవ్యఘృతంబుల మున్గితేలు వీఁ
డే సమయంబునందు నవి ♦ యేమియుఁ దాకఁడె యెట్లు నీ బస౯
మోసముజేసి తాఁగె; నిది! బుద్ధికిఁ దోఁపదు గాని యేమన౯. ౫౮౧

ఉ॥ నీగృహమందు నెంత నవ ♦ నీతము పాలును బెర్గు నోయెనో
యాగతిఁ దిర్గి నావలన ♦ నయ్యవి చయ్యనఁ దీసికొమ్మ బా
గోగుల నీదు పుత్త్రికుని ♦ నోర్చిన యట్టుల వీని నోర్చుమా!
నాగలబ౯ విడ౯ సలిపి ♦ నాపయిఁ గూర్మిని వీడకుండుమా! ౫౮౨

చ॥ మఱియును నీగృహంబునకు ♦ మాకొమరుం డరుదెంచి యా
పెరుఁగును బాలు మీఁగడను ♦ వెన్నను దొంగిలి మ్రింగునప్డు ని
ష్కరుణను వాని నీడ్చికొని ♦ చయ్యన నాదరికేగుదెంచిన౯
బరికెను దూఱుచు౯ మిగుల ♦ బాఁదెద నెట్టెద గుంజఁ గట్టెద౯. ౫౮౩

చ॥ అనఁగఁ బ్రభావతీసతియు ♦ హర్షము సెంది స్వధామమొందె నో
జనకవిభూ! మఱొక్కతఱి ♦ సంగడికాండ్రను గూడి యేపున౯
వనరుహలోచనుం డల ప్ర ♦ భావతి యింటనె దొంగిలింపఁగాఁ
జని తలుపుల్ గవాక్షము ల ♦ సాధ్యవిధంబున మూసియుండుట౯. ౫౮౪

ఉత్సాహ॥ కంటఁ గాంచి నేస్తకాండ్ర ♦ కైలమీఁద నెక్కి యా
యింటిప్రక్క గోడఁ జేరి ♦ యేరు సూడకుండ న
ట్టింట దూఁకి యుట్టి నున్న ♦ యెల్లగోరసంబుల౯
గొంటకై కరంబులెత్తఁ ♦ గొంచెమేని నందమి౯. ౫౮౫

ఉ॥ ఱోలును వేసి దానిపయి ♦ రుంద్రసుపీఠమువైచి దానిపై
బాలుర నిల్వఁబెట్టి మఱి ♦ వారలపై వడి నెక్కి పూర్తిగాఁ
గాలును నెత్తి చేతుల సు ♦ కంబుగఁ జాఁచిన నందకుంట గో
పాలక బాలకృష్ణుఁడు న ♦ పారరుష౯ గని యూఁచి శీర్షము౯. ౫౮౬

ఉ॥ దండముఁగొంచు నుట్టి దృఢ ♦ త౯ బ్రహరించెను దానిచేత నా
భాండములెల్ల బ్రద్దలయి ♦ పాలును బెర్గును వెన్నముద్దలు౯

దండిగ ధాత్రిపైఁ బడుటఁ ♦ దద్ధరియుం గని యవ్విధిఁ గోలెఁ ద
ద్భాండరవంబులోఁ గల ప్ర ♦ భావతియుం విని వచ్చి వెంటనే. ౧౮౭

ఉ॥ పాఱెడి బాలురందు హరి ♦ పాణిని గట్టిగఁ బట్టి భీతి దై
వాఱగ లోచనంబులను ♦ బాష్పము లొల్కఁగ నందుమన్కికిం
జేరిచి నిల్వఁబెట్టి వ్రజ ♦ శేఖరు ముంగలఁ జూచి లజ్జతోఁ
జీరను మోముఁ గప్పికొనె ♦ శ్రీహరి చింతిలె స్వాంతమం దిటుల్. ౧౮౮

తే॥ ఈమె సెప్పిన నా తల్లి ♦ యెఱిఁగియెఱిఁగి, నన్నుఁ బడఁదన్నుగాననే ♦ నున్నరూపు
వదలి యీ పెకుమారుని ♦ వలెఁ జెలఁగినఁ, జెడుగు లేదని యారూపు ♦ సెందియుండె.

ఉ॥ అంతఁ బ్రభావతీవనిత ♦ యాగ్రహనిగ్రహబద్ధబుద్ధి గే
హాంతరమందునం జెలఁగు ♦ నట్టి యశోదను బిల్చి యమ్మరో!
వింతగనున్నదమ్మ! యిది, ♦ పెర్గుఘటంబులఁ గూలఁగొట్టి తా
నంతయుఁ ద్రాఁగె నమ్మ! యిపు ♦ డన్నములోనికిఁ గూడ లేనటుల్. ౧౯౦

క॥ మఱియొకపరి నీబుడుతఁడు, మఱుదెరువున నేగుదెంచి ♦ మాయింటను బా
ల్పెరుగుల, మస్తువు, దినుతఱి, నరిగిన నాయత్తునూపి ♦ హసియించి చనెన్.

క॥ ఇఁక నొకపరిని బెరడున జ, లక మాడెడి నాదుకడకు ♦ లంఘించుచు నీ
దుకుమారుం డరుదెంచుచు, నకటా! నాకట్టుకోక ♦ హరియించి చనెన్. ౧౯౨

ఆ॥ చెప్పరాని పనులఁ ♦ జేయఁగారాని సేఁ, తలను గోకులమునఁ ♦ గలకలంబు
గలుగ నీవిధమున ♦ సలుపుచు నుండెఁగా, యేమిసేయవలెనొ ♦ యెఱుఁగఁ జెపుమ.

ఉ॥ ఇట్టులఁ జేయుఁ గాపురము ♦ నెట్టులఁ జేసెదమమ్మ! యిట్టి యి
క్కట్టులు మీకుఁ గల్గుతఱిఁ ♦ గష్టము సౌఖ్యము మీకుఁ దోఁచు, ని
ట్టట్టులఁ దోఁచునమ్మ! యిట ♦ నేమిఁక నుండగలేము వీఁడునుం
బాట్టమె? రామరామ! యది ♦ వొందగ నేరదు వీనియందునన్. ౧౯౪

చ॥ అనవుడు నాయశోద యధి ♦ కాగ్రహమొందుచు నో ప్రభావతీ!
గనులను గంతదీసి యిటుఁ ♦ గాంచుము నీవు మృషాపవాదముం
నెన రెదవీడి వాడితివె? ♦ నీతనయుం డవి తస్కరింప నా
తనయుఁడు సంగ్రహించెనని ♦ తంటగఁ బల్కుట పాడియే మొకో? ౧౯౫

చ॥ అదివిని యాప్రభావతి, ము ♦ ఖాంబరముం దొలఁగించి పుత్రు ని
ష్పదుఁ గని యబ్రబమొంది యెటు ♦ వచ్చితి విచ్చటికయ్య యింటికీ
యదనున రమ్ము పోవుద మ ♦ టంచుఁ దదర్భకుఁ గొంచు నేగ న
య్యాది గని నంద గోపబలు ♦ లావ్రజవాసులు నవ్విరంతటన్. ౧౯౬

చ॥ హరి, దొలిరూపునం జెలఁగి ♦ యాయమ వోయెడి బాటకడ్డమై
తరుణి! మదంబ కింకనిటు ♦ తప్పక చెప్పదవేని నీమనో

హారపరరూప మొంది పరి ♦ హాసమొనర్చెద నంచుఁ బల్కి నా
సరసిజనేత్ర సిగ్గున స్వ ♦ సద్మముఁ జేరెను మైథిలేశ్వరా! ౯౭

తే॥ ఈప్రభావతి గతివిన్న ♦ యెల్లగోపి, కలును గృష్ణునిఁబట్టక ♦ గారవముగఁ
జూడ సాగిరి క్రమముగా ♦ శుక్లచంద్రుఁ, బోలికృష్ణుఁడు వృద్ధిని ♦ బొందుచుండె.

చ॥ క్రమముగ వృద్ధిసెందు హరిఁ, ♦ గంజదళాక్షుని నీలవర్ణునిన్
విమలుని దివ్యవిగ్రహుని ♦ వేమఱుఁగాంచుచు నెల్ల వ్రేతలున్
దమిఁగొని ముద్దువెట్టుకొని ♦ ధామములందున నాట పాట లం
దముగ నొనర్ప సాగిరి గ ♦ దా యని పల్కె నరేంద్రుఁ డిట్లనన్. ౯౮

తే॥ నారదా! నవనందోప ♦ నందనామ, ములను షడ్వృషభానుల ♦ పూతనామ
ములను మఱివారు సేయు ప♦నులను దెలుప, వేఁడుచుంటి ననంగ, నా♦విబుధమౌని.

నారదుఁడు నందోపనంద వృషభాను లక్షణంబులం దెలుపుట.

తే॥ రంగవల్లీశ రంగోజి ♦ మంగళులన, శ్రీశమంగళాయనులన ♦ శ్రీధరుఁడన
దేవనాయక విమలులన్ ♦దివ్యజనులు, భూమి నవనందులననుందు♦పూతచరిత!

తే॥ సాంబనీతిహారోత్రాగ్నిభు ♦ శ్యాంతగోపతి శ్రుతశ్రీకర వ్రజ ♦ దేవపావ
నులను పేళ్ళతో నుపనందు♦లిలను జెలఁగు, మందరని నీవెఱుంగుమో♦యుర్వినాథ!

తే॥ మఱిఁ బతంగుఁడు శుక్రుఁడు ♦ మార్గదుండు, దివ్యవాహనగోపేష్ట్ర ♦ దివ్యనీతి
విదులనంగ షడ్వృషభాను♦లొదవఁగలరు, వారికుండు పత్తనముల♦వరుసవినుము!

వ॥ శ్యామలాకారమనోహరులై హస్తంబులందు వేత్రంబులం దాల్చి శ్రీగోలోకనికుంజప్రధానద్వారంబు నాశ్రయించి యా శ్రీకృష్ణుని యనుగ్రహం బును సంపాదించు మహాత్ములు నందులనియు, వంశబర్హంబులు సెలంగ సర్వాంగ సుందరులై తన్నికుంజతోరణాంతికంబున విరాజిల్లు గోకోటులను బరిపాలించు వారుపనందులనియు, దండపాశంబులంగైకొని తల్లోకద్వారషట్కంబునందుండి తద్దుర్గంబులను, గాపాడు సమర్థులు వృషభానులనియు నెఱుంగుము. అంత ౧౦౪

చ॥ హరినుడి వారలందఱు ర ♦ యంబున గోజగముం ద్యజించి యీ
ధర కరుదెంచి తద్వ్రజము ♦ దార్కొని వెల్గిరి వారి శక్తి యం
దఱు పరకైన నెన్నఁగల ♦ మా! యల బ్రహ్మయుఁ బల్కి నాగునే
సురుచిరకృష్ణలీలలను ♦ జూచినవారె కృతార్థులో విభూ! ౧౦౫

శ్రీకృష్ణ మృద్భక్షణ లీల.

చ॥ నరవర! యొక్కనాడు యము ♦ నాతటినీతటమందుఁ జేరి త
త్సరసిజపత్రలోచనుఁడు ♦ సందియమేమియు లేక మట్టినిన్
బొరిఁ బొరిఁ జేతులంగొనుచుఁ ♦ బొక్కుట నబ్బలి సూచి యబ్బ! శ
ర్కరవలె నిద్దిబొక్కెదవె! ♦ కమ్రిపదార్థము లెన్నొయుండఁగాన్. ౧౦౬

తే॥ చాలుఁ జాలు నిసీయిసీ ♦ సరగ రార, సోదరా! యంచుఁ బిలిచినఁ ♦ జూచి యతఁడు
రాక యాకరణిని బొక్కు ♦ రహిని యుంట, నెఱిఁగి బలుఁడు యశోదకు ♦ నెఱిఁగి చెప్పె.

ఆ॥ అంత నల్ల ముగుద ♦ యాత్మజుం డింటికి, వచ్చినంత వాని ♦ పాణిఁ బట్టి
పట్టి! యుక్కుఁబట్టు ♦ బాసినప్పటి నుండి, సలుపుపనులు నాకుఁ ♦ దెలిసెఁ గదర.

ఉ॥ అన్నము లేకయా! మనకు ♦ నాఁకలిదీర, గుడంబు లేకయా
యెన్నిన క్రమవస్తువుల ♦ నేమియు లేకయ యేలకో యిటుల్
మన్నును దింటివయ్య! మఱి ♦ మాటవచింప వబద్ధమన్న నీ
యన్న గనుంగొనెం గదర ♦ యాగడ మింతగఁ గూడునే సుతా! ౬౦౯

చ॥ అడుగఁగ నిట్టు లట్టి కమ ♦ లాయత లోచనుఁ డుర్వి నిజాంబకే
బుడుతను గాను నాకును బు ♦ భుక్షయు లేదు గృహంబునందు ద
ద్దుడ ముఖ క్రమవస్తువులు ♦ గూడక పోవుటగాదు, కాని మీ
నుడువు లబద్ధముల్, గనుము ♦ నోటను వాసన యెట్టులున్నదో. ౬౧౦

క॥ చెప్పెడు మాటలు సేటును, దప్పక తెచ్చనను సామె ♦ త నిజంబౌ న
ట్లెప్పుడు నను బ్రహరింపఁగ, నప్పిన్నలు నీకుఁ జెప్పి ♦ రమ్మా! రమ్మా. ౬౧౧

విశ్వరూప ప్రదర్శనము

క॥ అని తన మహాద్భుతాస్యం, బును జూపఁగ నామె వాని ♦ భూధర తటినీ
వనవనధి భువన సురనర, దనుజాది సమేత వక్త్రి ♦ తామరసంబున్. ౬౧౨

మ॥ కని యారా యఖిలార్ణవంబు లిచటన్ ♦ గన్పట్టె నాపట్టునన్
వనముల్ గన్పడుఁ నాదెసన్ నగములున్ ♦ వర్తిలు నీవెపునన్
మనుజుల్ దానవరాజులున్ దివిజులున్ ♦ మాగోపకుల్ గోపులే
నను నాథ ర్తయు నుంటి మిద్ది నిజమా ♦ నో కాదో! యేమాయయో. ౬౧౩

ఉ॥ కాఁడు సుతుండు నాకితఁడు, ♦ జ్ఞానపరీత పరాత్మ గానిచో
వీఁడు చరాచర ప్రవృత ♦ విశ్వముఁ జూపఁగఁ జాలునే! యటం
చాడి యథార్థతత్త్వమని ♦ యక్కలి వాయ విరాగబుద్ధితో
వేఁడు యశోదకున్ గొలిపె ♦ వెన్నుఁడు వైష్ణవమాయ భూవరా! ౬౧౪

ఉ॥ గోకులమందుఁ బ్రత్యహము ♦ గోపిక లెల్లను లేచి వేకువన్
శ్రీకమలేశ సచ్చరిత ♦ రీతులఁ దద్దధిమంథనంబులన్
వాకొనుచుండు రందముగఁ ♦ బార్థివ! యొక్కదినంబునన్ యశో
దా కువలాక్షి పాడుచటుఁ ♦ దద్దధిఁ ద్రచ్చెడి కాలమందునన్. ౬౧౫

యమళార్జున మోక్షము.

చ॥ త్వరఁ దన పుత్రుఁ డమ్మ! చనుఁ ♦ బాలిడు వెన్న నొసంగుమంచు నూ
పురములు గల్లు గల్లనఁగఁ ♦ బోవుచు గంతులు వేయు చట్టులి

ట్లగుగుచు వచ్చుచుఁ నగుచు ♦ నార్చుచుఁ జేతులఁజూపి గెంతుచ
న్దిరుగుచుఁ గ్రమ్మఱన్ జనుచు ♦ నెట్టెను నెట్టన నట్టిమంధనిన్. ౬౧౬

చ॥ పగులఁగఁ ద్రోసి యట్లు వడిఁ ♦ బాలు కుమారునిఁ గాంచి వా
నిగతిని బట్టి యామె జన ♦ నేర్చిన నాతఁడు సిక్కకుండ దే
వగణమునీంద్రయోగి జన ♦ పంక్తికినెల్ల సలభ్యుఁడైన యా
యగణిత దివ్యమూర్తి యొక ♦ యంగన కెట్టులఁ జిక్కు భూవరా! ౬౧౭

చ॥ అటు దన తల్లి వెంటఁబడి ♦ యక్కలి మిక్కలి బొంకుచుండుటన్
దటుకున భక్తవశ్యుఁడగు ♦ తద్ధరి గన్గొని చిక్కనేమిరా!
యటమట నన్ను బెట్టినటు ♦ లంకఱఁ బెట్టుచు నుందువంచు ను
త్కటమగు కిన్కరేగి సుతుఁ ♦ గట్టఁగ ఱోటఁ దలంచి నెమ్మదిన్. ౬౧౮

చ॥ గుణమునఁ గట్ట బూజకదిఁ ♦ గొంచెము దక్కువగాఁగ లాఁతిదా
గుణమునఁ గట్టినన్ గొఱఁత ♦ గూడుట వేఱొకత్రాటఁ గట్టఁగా
నణువు కొఱంతయయ్యె నిటు ♦ లన్నిగుణంబులఁ గట్టదయ్యె నా
గుణముల దాఁటు చక్రి యెటుఁ ♦ గూర్కొన నొప్పెడి నీగుణంబులన్. ౬౧౯

తే॥ అట్టులన్ ద్రాడులన్నియుఁ ♦ గట్టిగట్టి, విసివి నొచ్చెడి తల్లిపై ♦ వీక్షణంబు
బఱపి భక్తవత్సలతఁ ద ♦ ద్బంధనంబు, స్వయముగాఁ జెందె నోరాజ ♦ చంద్రమౌళి.

చ॥ అరయఁగ నీప్రసాదము ష ♦ హాత్ముల కవ్యభిచారబుద్ధి సం
భరితమహానుభావుల క ♦ పార తపఃఫలధన్యమానిరా
ద్యాదుల కభిజ్ఞయోగిజన ♦ పాళికి శూలికిఁ దమ్మిచూలికిన్
సిరికినిగూడ నెప్పుడును ♦ జేకుర లేదని గుర్తెఱుంగుమా! ౬౨౦

ఉ॥ అత్తఱి గోపికాలలన ♦ లగ్యోదకుం జనుదెంచి యాదిలోఁ
దుత్తుమురైన కుండఁగని ♦ తోడనె మిక్కలి ద్రాళ్ళ ఱోటికిన్
గుత్తముగాఁగఁ గట్టఁబడి ♦ కొంకుచు జంకుచు నున్నవెన్నునిన్
జిత్తము దత్తరిల్లఁగని ♦ చెచ్చెరఁ బల్కిరిటుల్ యశోదకున్. ౬౨౧

తే॥ ఓయశోదమ్మ! మా యిండ్ల ♦ నురక యెపుడు, పెరుఁగుకుండలనిట్టులే ♦ పెట్లఁగొట్టు
చున్న మేము నీపట్టిని ♦ బిన్నవాఁడ, టంచుఁ దిట్టము కొట్టమో ♦ మించుబోఁడి.

క॥ లాలనమున దోషంబులు, బాలురకుఁ గలుగునెడి ♦ ప్రథవిని నీవీ
లీలను దండించితివో, గోల! యితం డెల్లఁబోటి ♦ కుఱ్ఱఁడు గాఁడే. ౬౨౨

క॥ అదరింపుము బెదరింపుము, కుదిరింపుము మంచిబుద్ధి ♦ గూర్మిని గానీ
కిదుకుచు నాడెడి బాలుని, గదియుచు బ్రహరింపవలదు ♦ కాంతామణిరో!

చ॥ పెరుఁగు ఘటంబు వోయెనని ♦ పిల్లని నీవిధిఁ ద్రాళ్ళతోడ ని
ష్కరుణను గట్టియుంటి విది ♦ చాలదె జాలిని వాలి యిట్టులన్

బారిఁబారిఁ గొట్ట వత్తు విధి ♦ వోలునె నీకును జాలుఁజాలు లే
సరగఁదొలంగు మన్న నల ♦ సాధ్వియుఁబోయెను లోని కంతటన్. ౬౨౬

చ॥ కమలదళేక్షణుండు బహు ♦ కాలమునుండియు మద్దిజంటయై
యమునదరిన్ జెలంగుట ద ♦ యామతిఁ గన్గొనిపోయి వాని మ
ధ్యమమున నాయులూఖలము ♦ నడ్డముగా మరలించియుండ నా
యమళమహార్జునంబు లిల ♦ యందు దళన్నిధ్వనిఁ గూలె వేళ్లతోన్. ౬౨౭

తే॥ అతుల నిర్మూలముగఁ బడి ♦ నట్టి రెంటి, సాలములనుండిఁ బ్రదుటిలోనఁ ♦ గిలికిల
లుద్గతంబగు లైవడి ♦ నురురుచులను, సిద్ధులిద్ద ఱుద్గతులైరి ♦ సిద్ధిగనుచు ౬౨౮

ఉ॥ శ్రీదయితాంఘ్రియుగ్మగత ♦ శేముషి! వారటుబుట్టి యట్టి దా
మోదరుఁడైన బాలునకు ♦ మ్రొక్కి శిరంబున దీనరక్షకా!
నీ దయ మేము ధన్యులము ♦ నేఁటికిఁ బ్రాప్తనమానిశాపమున్
బేదటికంబు బొందెఁగద ♦ విశ్వమయుండవు కాక బిడ్డవే. ౬౨౯

ఆ॥ ఎట్టిపాపియైన ♦ నేవిధంబున నైన, నాదికారణుఁడవు ♦ నక్షరుఁడవు
నైన నిన్నుఁ దలఁచె ♦ నేని దివ్యుండయి, పుణ్యలోజగంబుఁ ♦ బొందుఁగాదె. ౬౩౦

చ॥ ధనజనయౌవనాది జని ♦ తంబగు గర్వము లేశమేనియున్
గననివిధంబు భూసురులఁ ♦ గాని బుధావళిఁగాని చూచినన్
వినయవిధేయతల్ గలిగి ♦ వేమఱు గౌరవమాచరించు రీ
తిని మఱి నీ పదాబ్జములఁ ♦ దీరని భక్తి నెసంగుమో హరీ! ౬౩౧

ఉ॥ శ్రీదయితాయ ధూర్జటివి ♦ శేషసఖాయ నిరంజనాయ తే
సాదితపూతనాయ ఘన ♦ సారమృగీమదవాసితాయ హా
రాదివిభూషితాయ హరి ♦ హార్షితమానిజనాయ భూమిదే
వాదికులాశ్రయాయ అమ ♦ రాదినుసద్గురవే నమోనమః. ౬౩౨

చ॥ అని యిటు లారమాధిపతి ♦ నగ్గలికన్నుతిసల్పి యుత్తరం
బునఁగల స్వస్థలంబులకుఁ ♦ బోయిరి నందుఁడు దొట్టి బ్రేలు త
ద్ఘనతరుపాతసస్వనము ♦ తత్పవిరావమటంచుఁ దత్థ్సలం
బున కరుదెంచి భీతినలు ♦ మూలలఁ గన్గొని యెంతొ వింతతోన్. ౬౩౩

క॥ పవియూ పడలేదిటఁ బృథు, పవనంబా వివలేదు ♦ బలు లెవరిందున్
దవులుచు గొడ్డట నఱికిన, సవడియులేదెట్లు లిట్టి ♦ శాఖులు పడెనో. ౬౩౪

క॥ అని యందఱున్ని తెన్నుల, ఘనముగ శోకించుచుండు ♦ కాలమున నటన్
దనరిన బాలకులందఱు, వినియిట్టులఁ జెప్పిరయ్య! ♦ పృథ్వీనాథా! ౬౩౫

తే॥ అయ్యలార! యానందుని ♦ యాత్మభవుఁడు, పీనసాదున ఱోలును ♦ వేగమసరి
యడ్డముగ ముందుకీడ్వ నీ ♦ యవనిజములు, వడియె సిద్ధయుగంబింపు ♦ వెడలి చనియె

ఆ॥ అని వచింపఁ గొంద ♦ ఱా పల్కు లమృతంబు,లనిరి గొందఱునిజ ♦ మనిరి సంది
యంబు గొందఱంది ♦ రంత నందుఁడు నిజ,నందనుండు చెట్ల ♦ క్రిందఁబడఁగ.

ఉ॥ పోఁడిమినున్నదానికిఁ బ్ర ♦ మోదముఁ బొందుచు వందయావులన్
దూడలతోడ బాపలకుఁ ♦ దొట్టెలకుండ నొసంగి పట్టి క
ట్టూడఁగఁ దీయ నట్టి కప ♦ టోరుకుమారుఁడు దాను గోవు నా
జాడలు వారెఱుంగనటు ♦ సల్పెను జూపుల నాటపాటలన్. ౬౩౮

క॥ అనవుడు బహులాశ్వుఁడిటు, లనె నారద! వీరలెవ్వ ♦ రరయగ నెవరో
వనమాలి దర్శనంబెటు, దనరెనొ వచియింపుమనఁగ ♦ దయఁ దన్మునియున్.

యమళార్జున పూర్వజన్మ వృత్తాంతము.

వ॥ భూపా! తొల్లిఁ గుబేరుని కుమారులగు నలకూబర మణిగ్రీవు లొక్కనాఁడు నందనవనంబు జెంది మందాకినీతీరంబున నచ్చరలతోడ నిచ్చకువచ్చినయట్లు విచ్చలవిడిగా విగతవస్త్రులై విహరించుచు రమించుచు నాడుచుఁ బాడుచు వారుణీ మదిరాపానోన్మత్తులైయుండిరి. ఇయ్యెడ నయ్యెడకు దేవలమహర్షివరేణ్యుండు యాదృచ్ఛికంబుగాఁ జనుదెంచె. అట్టిపట్టున వారిరువురు నిజవయోధనబలరూపంబుల గర్వించి యమ్మహామునిని లెక్కసేయరైరి. అద్దానిం గన్న నామౌనివరుండు మీరిరువురు దుష్టశీలురై ధనయౌవనమదాంధబంధురులై నిర్లజ్జులై వృక్షంబులఁ బగిది విహరించుచున్నవారు. కావునఁ బెక్కువర్షంబులు జనుదాఁక ననోకహంబులై యుండి ద్వాపరాంతంబున యమునాతీరంబుననుండు మహావనసమీపమునందుఁ బరిపూర్ణతమావతారుండును,గోలోకనాయకుండును,దామోదరుండునగు శ్రీకృష్ణుం గాంచి సంచితపాపవిముక్తులై మీయుక్తరూపంబులం బొందగలరని యనుగ్రహించి చనుడు వారలిద్దఱు నద్ధరణినిఁ దద్రీతి నిరుమద్దులై జన్మించి తద్గోవిందసుందరపదారవింద పరిస్పందంబున విగతపాపులై తదగాకారంబులం ద్యజించి పూర్వాకారంబులం దాల్చి యుత్తరదిశయం దలరారు నలకాపురియను నిజస్థానంబునకుఁ బోయిరని యెఱుంగుమని చెప్పి వెండియు నిట్లనియె.

దుర్వాసుండు గోకులంబందలి నందనందనునింగాంచి మోహంబుజెందుట

తే॥ ఒక్కసమయంబునందునన్ ♦ యోగివర్యుఁ,బరువిఁ బరిపూర్ణతముఁగృష్ణు ♦ భక్తవత్స
లునిఁ గనంగ దుర్వాసుఁడన్ ♦ మునివరుండు, వేగ వ్రజమండలంబున ♦ కేగుదెంచి.

ఉ॥ అవ్వలఁ బాలురం గలిసి ♦ యా యమునాపులినంబులందు బ
ల్జివ్వలఁ జేసి ఖేలన వి ♦ చిత్రములన్ బొనరించి పోటిగా
నెవ్వఁడిఁ బాటి వచ్చి నగి ♦ నేలను దొర్లి దిగంబరుండునై
మవ్వపుమాటలాడు చిని ♦ మాణవకున్ గని కొంతిదవ్వునన్. ౬౪౨

చ॥ కనఁగనఁగా మనంబునను ♦ గాఁ డితఁడా హరి, కాని వీఁడు నం
దునికొడుకై వసించునని ♦ తోఁచెడి నిశ్చయకృష్ణుఁడైనచో
గునగునఁబాఱి బాలకుల ♦ కూఁకటిఁబీకునె? గేలిసేయునే!
యని తమిఁబొందె నంతఁ గమ ♦ లాక్షుఁడు తన్మునిచంద్రుఁ బ్రీతితోన్. ౬౪౩

ఉ॥ కాంచి స్వయంబుగాఁజని సు ♦ కంబుగ నామునియంక మొంది యే
తెంచుచుఁబోవుచున్ నగుచు ♦ దివ్యమృగేంద్ర విలోకనంబులన్
మించి మనోహరోక్తుల న ♦ మేయముగాఁ బలుకాడి తిరిగ్ తో
తెంచి సమక్షమందు బహు ♦ దీప్తులు వెల్వడ నిల్చె నవ్వుచున్. ౬౪౪

ఉ॥ ఆ సమయంబునందు నగు ♦ నా హరిలోనికిఁ బూజ్యుఁడైన దు
ర్వాసుఁడు శ్వాసమూలమున ♦ బ్రాఁతిగఁబోవుచు నిర్జనాటవీ
భాసితలోకమొండుగని ♦ ప్రాప్తమిదెట్టుల నయ్యెనంచు నే
వేసటలేక తద్వనిని ♦ విస్మితుఁడై చరియించువేళఁదాన్. ౬౪౫

చ॥ అజగరవక్త్రమందుఁబడి ♦ యందున సప్తజగద్బిలాన్వితం
బజిత మహఃప్రపంచమును ♦ నంతఁ గనుంగొని దానియందునన్
గజిబిజిగా భ్రమించి తెలి ♦ గ్రానముఁజేరి తపంబుఁ దత్ప్రభున్
భజనముసేయుచున్ సలిపె ♦ వత్సరముల్ శతకోటిదాఁటఁగాన్. ౬౪౬

వ॥ అంత నమ్మునికాంతుం డంను నైమిత్తికప్రలయంబు సంభవించి యఖిలార్ణవంబులేకముఖంబై యీయోనిని ముంచివేయుటం గని యవ్వాని నీఁది యీఁది విసివి తదంతంబుగానక స్మృతిదప్పి సహస్రయుగంబు లందే వసించి క్రమ్మఱలేచి యజ్జలంబులందుఁ దిరిగి యందు మఱియొక బ్రహ్మాండంబుఁగని సంచరించుచు నొక్క రంధ్రంబునం దూఱి యందలి సృష్టివిచిత్రం బెల్ల నాలోకించి సంతోషించి తదగ్రభాగంబున విరాజిల్లు నిర్ద్రిహిణాయు వెంతయు భ్రమించుటంగాంచి యందుఁ బ్రవేశించి శ్రీహరిని ధ్యానించి తదండంబునుండి నిర్గతుండయి మరల సలిలరాశింగని యందుఁ బొందుపడియున్న యనేకబ్రహ్మాండంబులను గాంచి చిత్రపడి యమునాపగాంతంబుసేరి తత్పులినంబులను, గోలోకగోవర్ధనంబులను జూచి గో, గోపికా, గోపక, కోటులతో నీటుగానుండెడి నొందుదండినికుంజంబునం జేరి. ౬౪౭

ఉ॥ నైకదివాకరద్యుతిక ♦ నత్పృథువేదిని లక్షపత్రకో
భాకర పద్మమం దలరు ♦ పంకజనాభుని రాధికేశు గో
లోకవిభున్ బ్రపూర్ణతము ♦ లోలుపతన్ గని క్రమ్మఱిల్లి యా
శ్రీకమలేశు శ్వాసమునఁ ♦ జిత్రముగా వెడలెన్ మహాప్రభూ! ౬౪౮

చ॥ వెలువడి మౌని యట్లతనిఁ ♦ బిల్లని దివ్యకళిందజాపగా
లలిత వనంబునందుఁ జెలు ♦ లన్ లలిఁగూడుచు నాడువానిఁ, గ

న్నులఁగని యా పరేశుఁగని ♦ నూనముగా మదినెంచి మ్రొక్కులన్
బలుమఱు సల్పి సల్పి భయ ♦ భక్తులతో నిటువేఁడె సాంజలిన్. ౬౪౯

దుర్వాసుండు వాసుదేవునిఁ గీర్తించుట.

మ॥ అనఘా! నిన్ను నలంతివానిఁగ మనం ♦ బందెంచి కాంచంగ నీ
ఘనతేజంబును నీ మహామహిమ నీ ♦ కాయంబు నీ సద్గుణం
బును నీసృష్టిచమత్కృతుల్ జగములున్ ♦ బూర్ణంబుగా నాకు నీ
వనుకంపన్ దెలియంగఁ జూపితివిగా ♦ దా! భక్తచింతామణీ! ౬౫౦

క్రౌంచపదవృత్తము.

వారిదకేశా! స్మేరవిలాసా! ♦ భవభవభయహర! ♦ భవికదహస్తా
హారమనోజ్ఞా! ధీరసులభ్యా! ♦ యఖిలసుగుణనిధి! ♦ యమృతకరాస్యా!
సారసనేత్రా! శ్రీరుశరణ్యా! ♦ సకలభువనధర! ♦ జలరుహనాభా
శ్రీరమణీయా! శ్రీరమణీశా! ♦ శివసఖ! కరముల ♦ శిరమునఁ గూర్తున్. ౬౫౧

తే॥ ఇట్లు శ్రీకృష్ణుఁ గొండాడి ♦ ఋషివరుండు, బదరికాననమొందె నో ♦ పార్థివేంద్ర!
యని జనకునకు నారద ♦ ముని వచించె, నదియె మీకిటుఁ బలికితి ♦ ననఁగ మఱల.

ఉ॥ శౌనకమౌని గర్గముని ♦ సత్తముఁగూర్చి యిట్లువచించె నో
మౌనివరా! రమేశుకథ ♦ మాధురి నీదయఁగ్రోలియుంటి నా
పైని విదేహదేశపతి ♦ పాలకుఁడా ఋషివర్యు నారదున్
బూనికనేమి యడ్గె నన ♦ బుద్ధిమదగ్రణి గర్గుఁ డిట్లనెన్. ౬౫౩

చ॥ మునివర! శౌనకా! వినుము ♦ భూపుఁడు నారదుతోడ భక్తి ని
ట్లనియె శుభప్రదంబు సక ♦ లాఘపయోధరతీవ్రమారుతం
బనగు నుపేంద్రసచ్చరిత ♦ మున్ మతి యా యవతారకృత్యముల్
వినరు మనంబునందునిచి ♦ నీవు వచింపుము మౌనిరాణ్మణీ! ౬౫౪

తే॥ అవలఁ దన్మునివర్యుఁడో ♦ యనఘ! తగిన
ప్రశ్న మొనరించియుంటివి ♦ పాపతాప
ఖండనసమర్థగోలోక ♦ ఖండమిపుడు
వింటివాపైనిఁ దత్కథన్ ♦ వినుము భక్తి. ౬౫౫

ఉ॥ దేవ! మహానుభావ! వసు ♦ దేవభవా! భవధాతృవంద్య! బృం
దావనరమ్యపర్యటన ♦ తత్పర! సత్పురుషాగ్రగణ్య! రా
ధావనితామనోజ్ఞ! దధి ♦ తక్రపయోనవనీతచోర! యిం
ద్రావరజా! ప్రపూర్ణతమ! ♦ యంబుజలోచన! పాపమోచనా! ౬౫౬

మాలినీవృత్తము॥ శ్రుతివిదిత సుకీర్తీ! ♦ సూర్యబింబస్థమూర్తీ!
హితవిహిత సమృద్ధా! ♦ వృద్ధిసిద్ధిప్రసిద్ధా!
రతిపతివిధతాతా! ♦ రాసకేళీ సమేతా!
చతురతరవిలాసా! ♦ సచ్చిదానందభాసా!

గద్యము:- ఇది శ్రీమత్పరమపవిత్రాపస్తంబసూత్ర, భారద్వాజసగోత్ర, చివుకుల కులజలధికళానిధి, కోటమాంబా కామయ తనయ, లక్ష్మీదేవీ సుబ్రహ్మణ్య దత్తపుత్ర, శ్రీకృష్ణప్రసాదాసాదిత కవిత్వనిశ్చయ, సుజనవిధేయ, శ్రీనివాసాపరనామధేయాప్పయశాస్త్రిచే నాంధ్రీకృతంబైన శ్రీగర్గభాగవతంబందలి గోలోకఖండము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

హరిః ఓం తత్సత్

శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః.

శ్రీ గర్గభాగవతము.

బృందావనఖండము.

శ్రీ రామానుజ వర్యా!
నీరజపత్రాయతాక్ష! ♦ నిఖిలసురేశా
ధీరసమర్చితపాదా!
ప్రారూఢజ్ఞానరూప! ♦ రాధాకృష్ణా! ౧

వ॥ అని యిట్లు చెప్పందొడంగె. భూపా! నందుండొక్కసమయంబందు నవనందుల, నుపనందుల, షడ్వృషభానువులను, సహాయకారులను, మిత్రులను, గర్గసుఖముల యం దాఱితేఱిన గోపవృద్ధులను బిలిపించి మహాసభం గావించి యందు నవ్వారల నుద్దేశించి తన రాష్ట్రింబునంగలుగు పూతనాతృణావర్తశకటాగమనతరుపాతాద్యుపద్రవంబులను వెలిబుచ్చి ప్రతిక్రియల నడుగ నాలకించి యందు దీర్ఘదర్శియగు సన్నందుండను గోపవృద్ధుండు సకలజనమనోహారులగు రామకృష్ణులంగొని తనయంకమందిడి నందుని కిట్లనియె. ౨

సన్నందుండు నందునకు బృందావనంబును వర్ణించి చెప్పుట.

ఉ॥ ఎందున నేయుపద్రవము ♦ లేమియు నుండవొ యట్టిదేశముం
జెందినఁగల్గు సౌఖ్యము సు ♦ శీలుఁడు నీకొమరుండు వీఁడె మా
యందఱ జీవనంబు సుమి! ♦ యర్థము ప్రాణము సమ్మదంబు నీ
నందను మించి యుండవని ♦ నమ్ముము నెమ్మనమందు నందుఁడా! ౩
క॥ అందున మనమందఱమూ, బృందావన రాజమునకు ♦ నిత్తఱిభార్యా
నందనసఖ గృహపరికర, బృందముతోఁబోయిన సుఖ ♦ యింపఁగలముగా. ౪
క॥ అనవుడు నందుండిట్లనె, ననఘా యిదియెంతవఱకు ♦ నలముకొనెనొ యం
దునఁగల వీళ్ళెట్టివియో, ఘనముగ జెప్పంగనిన్నుఁ ♦ గాంక్షింతు సుధీ! ౫

చ॥ అనవుడు ప్రాగుదగ్దిశల ♦ యందల బర్హిషదంబు దక్షిణం
బున మధురాపురంబును బ్ర ♦ మోదదశోణపురంబు పశ్చిమం
బునఁదగ నద్దియొప్పు నది ♦ పూర్తిగ నెన్నదినాల్గుకోసులన్
దనరును సార్థయోజనము ♦ తద్విపులం బని పల్కె నెండియున్. ౬

ఉ॥ అంబరచుంబి భర్మమయ ♦ హార్మ్యములన్ నవరత్నదవ్యపీ
తాంబర హైమపణ్యముల ♦ సజ్జనవాలయహంసరమ్యపే
యాంబులసత్తటాకముల ♦ నందముబొందె ప్రయాగతీర్థరా
జంబునఁ బూజితంబయి ప ♦ సన్ దగుఁ దన్మధురాపురంబహా! ౭

ఉ॥ ఆవిధి నొప్పు నామధుర ♦ యందికలో వనరాజమౌచు బృం
దావనమొండు వర్తిలెడిఁ ♦ దద్వని సర్వమనోజ్ఞ కృష్ణ లీ
లావని యుండు నందున వి ♦ హారముఁ జేసెడి వారిదైన భా
గ్యావధి నిర్ణయింపఁగల ♦ మా! వినుమా! యటచుండు సౌఖ్యముల్. ౮

క॥ ఇరువదినాలుగుకోసుల, వఱసున వ్యాపించినట్టి ♦ వనములు నందీ
శ్వర గోవర్ధన నగములు, మఱియును బృహత్సానుగిరియు ♦ మట్టుకొనెనటన్. ౯

తే॥ మలయమారుతం బాత్మీయమూలమునుండి, యమునమీఁదుగ నరుదెంచి హాయిపడుచు
సుమపరిమళంబులం గొని ♦ సురతరతులు, విరతులన్ స్వస్థపడునట్లు ♦ వీచుచుండు.

చ॥ మఱియు నికుంజసైకత స ♦ మంజసవేదికలుండు వానిలో
సరసులు ప్రేలు ప్రేతలు న ♦ జస్రము క్రీడల సల్పుచుంద్రు మీ
రరుసమునన్ విహారముల ♦ నందునఁ జేయఁగ వచ్చుఁగానఁ జె
చ్చెర నిటనుండి లెండటకుఁ ♦ జేయుఁడు మీరలుఁడు సౌఖ్యపద్ధతిన్. ౧౧

తే॥ పసులకుంగావలసినంత ♦ కసవుగలదు, జలమొ పీయూషతుల్యమై ♦ చెలఁగునచట
నంచు సన్నందుఁడన నతఁ ♦ డద్దిరొప్పుచు, తీర్థరాట్ప్రాజ్ఞుబొందెనో ♦ తెలియఁ జెపుమ

చ॥ అనవుడు గోపవృద్ధుఁడిటు ♦ హార్షముతో వచియించె నో ప్రభూ!
మునుపు నిమిత్తజ్ఞ్యపలయ ♦ మున్ జనుదెంచినవేళ శంఖుఁడన్
ఘనసుర వైరి వేదగణ ♦ కంటకుఁడై యొకఁడుండు వాఁడు దే
వనికరమున్ బరాజితమ ♦ పారముగా నొనరించి యేడ్తెరన్ ౧౩

చ॥ జలరుహయోనిలోకము నె ♦ సం జని నిద్రను గుఱ్ఱువెట్టు నా
నలువను గాంచి పూతముగు ♦ నైగమ వైదిక లోకికార్థికో
జ్జ్వలతర సంగతుల్ వెలుపఁ ♦ జాలిన ప్రాఁజలుకుల్ హరించి త
జ్జలనిధిలోనికిం జనియె ♦ సర్వదివౌకసు లక్కిలింబడన్. ౧౪

ఉ॥ వేల్పులు గుందుచుండఁ గని ♦ విష్ణుప్రయజ్ఞవిభుండు గాంచి య
స్వల్పరఘుపాకృతిన్ జెలఁగి ♦ చాసికి నెక్కి సముద్రముం మున న

స్వల్పవిధంబునం దిరుగు ♦ శంఖసురారినిఁ జూచి వానితో
సల్పె సమిత్తు భీతికర ♦ శౌర్యధురంధరపూర్ణమూర్తియై. ౧౫

చ॥ సరగున వాఁడు స్వభ్రుకుటి ♦ సాల భయంబునుగొల్ప శూల మా
హరి నొసటన్ బడన్ విసరె ♦ నంతట నాహరి చక్రధార నా
ర్పఱియలు దానిఁజేయ నల ♦ రక్కసి యక్కమలాక్షు వక్షమం
దురవడిఁ గొట్టె దానికిని ♦ నోర్చి పరాత్పరుఁ డాగ్రహంబునన్. ౧౬

చ॥ గదఁగొని దైత్యపృష్ఠమునఁ ♦ గండలు కావర మూడ వైవ దు
ర్మదసురవైరి వ్రాలి నెత ♦ మగ్గి మఱిన్ వడిలేచి ముష్టితో
నదరుగ నగ్రుద్దెఁ జక్రియుఁ గ ♦ నుంగొని స్వీయసుదర్శనంబునన్
గుదిరిచి వానిగట్టి తలఁ ♦ గొట్టె నిలింపులు సంతసింపఁగాన్. ౧౭

తే॥ శంఖసమరూపు నసురు న ♦ సాధ్యబలుని, శంఖనాముకు నిట్టులఁ ♦ జదిపి శ్రుతులఁ
గొనుచుఁ గడలిని వెల్వడి ♦ వనవలఁ బుంబు, మీఁదికేతెంచె శ్రీహరి ♦ మేదినీశ!

ఉ॥ అంతఁ జతుర్భుజుండు సక ♦ లామరసార్థముగాఁ బ్రయాగరా
ట్ప్రాంతము జేరి వేదముల ♦ బ్రహ్మకొసంగి సవంబుఁ జక్కఁగా
నంత మొనర్చి యానలఁ బ్ర ♦ యాగునిఁబిల్చుచుఁ దీర్థరాజుగాఁ
జింతదొలంగి సంతసము ♦ నొందగఁ జేసెను గోకులేశ్వరా! ౧౯

చ॥ పదపడి తీర్థనేత, యొక ♦ ప్రక్కఁ గళిందసుపుత్రియున్ మఱో
క్కదెసను జహ్నుపుత్రికయుఁ ♦ గ్రాలి స్వకీయతరంగచామరా
లదరుచుఁ బట్టి వీవఁ దల ♦ నక్షయసద్వట మాతపత్రమై
కుదురుగ నుండ భాసిలెడి ♦ గోపకనాయక! నందనామకా! ౨౦

ఉ॥ అంతట సర్వతీర్థము ల ♦ నర్ఘగరిష్ఠిఁ బ్రయాగతీర్థరా
ట్ప్రాంతముసేరి జోతములఁ ♦ బల్కొనర్చి భయానఁబన్నుల
త్యంతము గట్టి క్రమ్మఱి స్వ ♦ ధామములం జనె నంత నట్టి శ్రీ
కాంతుఁడు నిర్జరాన్వితము ♦ గా నరిగెన్ దన మన్కికిన్ సుధీ! ౨౧

ఉ॥ ఆసమయంబునం దెకల ♦ హ ప్రియుఁడైన సురర్షివర్యుఁడా
యాసములేక తత్స్థలికి ♦ నాగతుఁడై నుతుఁడౌచు రమ్యసిం
హాసనమందు భాసిలు ప్ర ♦ యాగునిఁ దీర్థపతిన్ గుఱించి సం
తోసముతోడ నిట్లనియె ♦ ద్రోణముఖాసముజప్రభూత్తమా! ౨౨

చ॥ ఇలఁగల యెల్లతీర్థము ల ♦ హీనత మీకుఁ గరంబులిచ్చి పూ
జల నొనరించి యిప్పుడిట ♦ సాగెను తీర్థవిభుండవై తివం
చలరితిఁగాని తన్మధుర ♦ యందలి తీర్థ మొకండు రాక మి
మ్ములను దిరస్కరించెన్ నలుపఁ ♦ బూనుటఁ జింతిలుచుంటి దేవరా! ౨౩

తే॥ అంత నాప్రయాగుండు మ ♦ హాగ్రహంబుఁ, జెంది తీర్థంబులంగూడి♦శ్రీనివాస
లోకమున కేగి వినతు ల ♦ నేకములను, జేసి బద్ధాంజలుఁడయి వ ♦ చించె నిట్లు.

ఉ॥ దేవ! భవద్దయన్ గలిగెఁ ♦ దీర్థవిభుత్వము గాని యట్టి బృం
దావనమాది తీర్థములు ♦ తద్విధి నీడకు రాక బిట్టు న
న్నేవపడన్ సుమీ యకట! ♦ యియ్యది యంతము లేని చింత నా
భావమునందుఁ గూర్చెడిని ♦ వచ్చితి దీనిని నీకుఁ దెల్పఁగన్. ౨౭

ద॥ అనవుడు విష్ణుమూర్తి విని ♦ యయ్య! ప్రయాగ! ధరాతలంబునన్
దనరెడి సర్వతీర్థములఁ ♦ ద్వాద్వశముం బొనరించియుంటి నై
నను మధురావ్రజంబులకు ♦ నాథుగ నిన్ఘటియింపలేను గా
వున నవి యేగుదెంచ విఁకఁ ♦ బూన్కిని వచ్చిన త్రోవఁ బట్టుమా! ౨౮

చ॥ అల మధురావ్రజంబనఁగ ♦ నల్పమటంచుఁ దలంచితే మొకో
లలితజగత్త్రయాధికసు ♦ లక్షణలక్షితమున్ బరమ్మునన్
ప్రబలయవిభాసురంబును ప్రబ ♦ భారుచిరంబయి నాగృహంబుగాఁ
జెలఁగు నటంచు నెంచుమని ♦ చెప్పఁ బ్రయాగుఁడు విస్మితాత్ముఁడై. ౨౯

ఆ॥ మాధవునకు మ్రొక్కి ♦ మాధురమండలి, కరిగి పూజఁ జేసి ♦ యాత్మగేహ
మునకుఁబోయె నిద్ది ♦ మున్ను భూగర్వంబు, మాయఁ జేయు నట్లు ♦ సేయఁబడియె.

తే॥ అన వ్రజేశుఁడు గోపవృ ♦ ద్ధా! మహాత్మ! యెటుల భూగర్వనాశన♦మెవని చేతఁ
జేయఁబడె మును పయ్యది♦సెప్పుమయ్య, యనఁగఁ గ్రమ్మఱ సన్నందుఁ♦డనియె నిట్లు.

వారాహావతార వర్ణనము.

తే॥ తొల్లి వారాహ కల్పమం ♦ దున జనార్దనుండు వారాహరూప వి ♦ నోదుఁడగుచు
నా రసాతలంబున నుండి♦నవనిఁ గోఱ, లందునం దాల్చి నిల్పెనో♦యనఘ! యపుడు.

చ॥ వలమురి తాల్పు దంతముల ♦ పైని వెలింగెడి భూమి యామతో
సలిలపరంపరల్ గడచి ♦ సాగెడి తద్భగవంతుఁ గూర్చి తాఁ
బలికె నిటుల్ మహాత్మ! నలు ♦ ప్రక్కలు మిక్కిలి వెక్కసంబుగా
జలములు నిండె నన్నిఁకను ♦ జక్కఁగ నెక్కడ నుంతువో కదా. 30

చ॥ అచల యటు ల్వచింప విని ♦ యచ్యుతుఁ డాయమ కిట్లనెన్ ధరా!
యెచట మహీరుహంబులు ప్ర ♦ దృష్టము లౌనో? జలస్థితద్రుతం
బెచట నణంగునో యచట ♦ నే నిను నిల్పెదఁ గాన నీవు వృ
క్షచయముఁ జూచుచుండు మనఁ ♦ గాశ్యపి గ్రమ్మఱ శంకితాత్మయై. 31

చ॥ పురుషవరేణ్యా! స్థావర స ♦ మూహము నాకు జనించు నీచరా
చరముల మాయ నేనెకద ♦ సంతతమున్ దగియుందు నిప్పుడీ

కరణిని బల్కుచుండుటకుఁ ♦ గారణ మెయ్యది? యన్యధాత్రియుఁ
వలెనె నటంచుఁ దోఁచెడి న ♦ బద్ధమొ సత్యమొ నాకుఁ దెల్పుమా! ౩౭

ఆ॥ అని యడిగడిలోన ♦ నాజలంబులయందు, రమ్యవృక్షరాజి ♦ రాజిలంగఁ
జూచి ధరణి యిట్లు ♦ శ్రీచతుర్భుజుఁగూర్చి, మానరహితయగుచు ♦ మరలనడిగె.

చ॥ కిసలయపత్రపుష్పఫల ♦ కీలితమై సుమనోమనోజ్ఞమై
యొసఁగిన వృక్షసంతతుల ♦ నేఁ గనుఁగొంటిని నవ్వి యెచ్చటన్
బొసఁగునొ యద్దిదెల్పి మదిఁ ♦ బొందిన సందియముల్ జనంగ సం
తసము ఘటింపవే యనఁగఁ ♦ దత్కరియాపుఁ డిటు ల్వచించెన్. ౩౮

తే॥ క్ష్మామతల్లిక! మాథుర ♦ మండలంబు, ముదురాఁగల దయ్యది ♦ భూరిలయము
నందునం జెక్కుచెదరక ♦ పొందియుండు, ముజ్జగంబుల సొంపును ♦ మొనసియుండు.

ఆ॥ అదియుగాక నాకు ♦ నాకరంబుగ నద్ది, యొసఁగు సాటి దాని ♦ కేది లేద
టంచు నెంచవమ్మ! ♦ యనవుడు బుడమియు, బిగువువిడిచి హరికి ♦ వినతి జేసె.

తే॥ ఇటు ధరాగర్వభంగంబు ♦ నెంతొసల్పి, గోజగమునుండివచ్చిన ♦ క్షోణిఁగూడి
ప్రలయమందున మిక్కిలి ♦ ప్రబలుచుంట, నద్దియన్నిఁటమించెనో ♦ యాలఘుచరిత.

మ॥ అనిన న్నందుఁడు పల్కె నిట్టుల మహా ♦ త్మా! శౌరిగాథావిధిన్
వినఁగాఁ జేసితి వింక విష్ణుకథలన్ ♦ విజ్ఞుండవై యుండు వీ
వని గోవర్ధననామశైలభవమా ♦ హాత్మ్యంబుఁ, గాళిందివా
హిని జన్మంబును, దన్మహత్త్వ దయ వా ♦ చింపంగ నే వేఁడెదన్. ౩౯

క॥ అనవుడు నన్నందుండో, యనఘా! యొకతటిని హస్తి ♦ నాహ్వయపురమం
దునఁ బాండువిభున కా శంతను తనయుఁడు సెప్పినట్లు ♦ తద్ద వచింతున్. ౪౦

చ॥ పురుషవరుండు నీశుఁడు ప్ర ♦ పూర్ణతముండు రమావిభుండు నా
హరి సుజనావనార్థము ధ ♦ రాధికభారనివారణార్థమున్
విరసనిరాసనార్థము భు ♦ విన్ ప్రభవింపఁదలంచి రాధతో
నరమున భూమికీవరుగు ♦ మా! యని వాకొన నామె యిట్లనెన్. ౪౧

తే॥ ఎచట బృందావనము లేదొ ♦ యేస్థలంబు,నందు నుత్తుంగ గోవర్ధ ♦ నాద్రిలేదొ
యెందుఁ గాళిందియున్ లేదొ ♦ యందు నేను, వాసముం జేయఁజాల నో ♦ పరమపురుష!

తే॥ అంత శ్రీకాంతుఁడాక్షణ ♦ మందు వేడ్క, నిలకు నెన్బదినాల్గుకో ♦ సులను జెలఁగు
భూమి గోవర్ధనాద్రియుఁ ♦ బుణ్యయమున, నాత్మధామమునుండి తా ♦ నంపె నవల.

గోవర్ధనపర్వత చారిత్రము.

చ॥ ఎనుబదినాల్గుకోసులను ♦ నిర్వదినాల్గు మహావనంబులన్
దనరుచు సర్వవంద్యయయి ♦ ధారణి యిద్ధరఁజేరె గోప్రవ
ర్ధనగిరి ద్రోణశైలకుల ♦ తస్యకి భారతవర్ష పశ్చిమా
శనుగల శాల్మలిస్థలిని ♦ జన్మము సెందెను నందనామకా! ౪౪

తే॥ అట్లు పుట్టిన గోవర్ధ ♦ నాద్రిపైన, విరులవానలఁ గురిసిరి ♦ సురలు మేరు
శీతనగరాజములువచ్చి ♦ శీఘ్రము లిల, సోకఁగా మ్రొక్కి భక్తితోఁ ♦ జుట్టివచ్చి.
శా॥ శైలేశా! పరిపూర్ణ మాధవ నివా ♦ సం బాధ్యముౘ్ గోపికా
జాలాభీరపరీవృతంబు సురభి ♦ స్ఫాతిప్రతీతంబునౌ
గోలోకంబున బృందకావనమునన్ ♦ గోవర్ధనాఖ్యన్ గళా
లీలాశోభితశైలరాట్టువయి హా ♦ ళిన్ వెల్గు దీవే కదా! ౪౬
తే॥ మధురబృందావనాంకాయ ♦ మహిత సర్వ, శైలపాలాయ గోలోక ♦ మాళికే ప్ర
పూర్ణశమలసచ్ఛత్రాయ ♦ పూతవిగ్ర, హాయ గోవర్ధనాయ తు ♦ భ్యం నమోస్తు.
చ॥ అని కొనియాడి స్వీయసిల ♦ యంబుల కేగెను మీఁద నానగం
బు నిఖిలశైలనాథుఁ డను ♦ పూర్ణయశంబును బొందె నొక్కవే
ళ నఖిలతీర్థము లని పు ♦ లస్త్యమునీంద్రుఁడు గోప్రవర్ధనా
ద్రి నసితరూపు ద్రోణసుతుఁ ♦ బ్రీతిని గన్గొని చొచ్చి యచ్చటన్. ౪౭
సీ॥ అల్లిబిల్లిగ నల్లి ♦ యుల్లాసముం గూర్చు, మల్లెల మొల్లల ♦ నెల్లఁ జూచి
మొలకలెత్తుచుఁ బెరుఁగుచుఁ ♦ దళతళలాడెడు, పచ్చికబైళ్ళను ♦ హెచ్చుమెచ్చి
తియ్యని నీటిచేఁ ♦ జయ్యన జబ్బులన్, దీర్చెడి సెలయేళ్ళ ♦ తీరుఁ గాంచి
చిలుకల వానకో ♦ యిలల కోయిల కమ్మ, చవిగల్గు పల్కుల ♦ నవధరించి
తే॥ మంచిమెకములసొరును ♦ గాంచి మిగుల, వింతలీనెడి రంగుల ♦ నెంతయుఁ గని
మేలుబంగారుచివరల ♦ చాలు నోలిఁ, బొగడి మేలిదు నిదియని ♦ బుద్ధిఁ దలఁచి. ౪౮
చ॥ మఱి యిది జ్ఞానసత్స్థలము ♦ మంగళహేతు వమూల్యరత్నసం
భరితము శ్యామసుందర మ ♦ పారతపశ్చరణానుకూలమం
చరుదుగ నెంచి తజ్జనకు ♦ నండకుఁ జేరి తదర్చనానమ
స్కరణి గ్రహించి దీవనల ♦ నల్పి యిటుల్ వచియించెఁ బ్రీతితోన్. ౪౯
తే॥ ద్రోణ! మలజేఁడ వీవు గీ ♦ ర్వాణనికర, సన్నుతుఁడవు దివ్యౌషధీ ♦ సంయుతుఁడవు
దారుఁడవు సర్వలోకస్థ ♦ నారజీవ, నప్రదాతవు నీవె య ♦ నశ్వరుఁడవు. ౫౦
ఉ॥ కావున నర్థిఁ నిన్ మునిని ♦ గాశినివాసుఁడనైన నేనిటుల్
దావక పార్శ్వమొందితిని ♦ ద్వత్సుతవర్యుని గోప్రవర్ధన
గ్రావవిభున్ బిడాన నిడి ♦ కౌతుకముౘ్ ఘటియింపవయ్య! యిం
కేవిధి నేరిచేఁ గొలఁది ♦ యే నుపయోగము లేదు భూధరా! ౫౧
సీ॥ రంగదభంగత ♦ రంగసంగతగంగ, విష్ణుపాదోద్భవి ♦ వెలుఁగు నెచట
మృత్యుంజయుండయి ♦ నిత్యశంకరుఁడగు, విశ్వేశ్వరుండును ♦ వెలయు నెచట
సుందరవదనార ♦ విందుఁడౌ శ్రీబిందు, మాధవస్వామియు ♦ మలయు నెచట
మూర్తిత్రయప్రాజ్య ♦ పురగత చిత్రముల్, బురడించు వింతలు ♦ వొలయు నెచట

తే॥ నెట్టి పాపిష్ఠుదోషంబు ♦ లేగునెచటఁ, జరమదశఁ గర్ణమంత్రంబు ♦ శంభువలనఁ
గలుగునెచట నా కాశిఁద్వ ♦ ల్లలిత తెనయు, గోప్రవర్ధనగిరి విభుఁ ♦ గుదుర నిడెద.

చ॥ ఇటు లటనుంచి పల్లరుల ♦ వృక్షములన్ బెనుపొందియున్న త్వ
చ్ఛటులకుమారుపైఁ దపము ♦ సల్పి యభీష్టము లొందనుంచు న
చ్చట మఱిఁ జుట్టుప్రక్కలను ♦ శైలమొకండును లేదు గాన నీ
వటమటఁజెందకుండ నిడు ♦ మా! మఱుమాటల మానుమా యిఁకన్. ౫౬

తే॥ అనుపులస్త్యునిఁగాంచిద్రో ♦ణాచలపతి, యిటులనిటుపల్కె మునివరా! ♦ సరసుఁబ్రియుని
వీని విడనాడి బ్రతుకను ♦ గాని మీదు, శాపభీతి నీతనికి సూ ♦ చన నొనర్తు.

తే॥ నాయనా! గోప్రవర్ధనా! ♦ నగకులేశ!, శుభము త్రైవర్గ్య ఫలసిద్ధి ♦ యుభయవృత్తి
గలుగు భారతకర్మభూ ♦ ములకుఁ దొరఁగ, నీమునీంద్రునివెనువెంట ♦ నేగవయ్యా!

చ॥ అని జనకుండు పల్కనల ♦ యద్రివిభుండగు ద్రోణపుత్రుఁడున్
విని యయిదామడల్ గలుగు ♦ విస్తృతి యోజనయుగ్మమెత్తు నిం
కనిడివి యెన్మిదామడలు ♦ గ్రాలిన నన్నెటుఁ గొంచు నేదెదన్
జనెదవొ యట్లైన పొమ్ము! ముని ♦ సత్తమ! యన్నఁ బులస్త్యుఁ డిట్లనెన్. ౫౭

పంచచామరము॥ గిరిప్రభూ! బిరాన నాదు ♦ కేల హాయి నెక్కినన్
గరంబుగా వహించి నిన్నుఁ ♦ గాశిచెంతఁ జేర్చెదన్
బరీక్ష జేయు మీవనంగఁ ♦ బర్వతేశ్వరుండు సం
బరంబునన్ మఱిన్ వచించె ♦ బద్ధశస్తహస్తుఁడై. ౫౮

ఉ॥ ధీవర! పోవువేళ నెట ♦ దించెదవో యటచుందుఁ గ్రమ్మఱ
న్లేవను నాప్రతిజ్ఞ యిది ♦ నీదయవచ్చిన యట్లొనర్పుమా
నావుడు దత్పులస్త్యముని ♦ నాథుఁడు శాల్మలి నాఁగ దీవిలోఁ
బావిత కౌశలస్థలికిఁ ♦ బ్రక్కఁగ దించెద డించ మధ్యలోన్. ౫౯

క॥ ఏవంవిధశపథంబున్, గావింపగఁ శైలవిభుఁడు ♦ గన్నిరొల్కన్
వేవినతుల్ జనకునకున్, గావించి పులస్త్యసవ్య ♦ కరమున నెక్కెన్. ౬౦

ఉ॥ ఎక్కనతోడ మౌనివరుఁ ♦ డేగఁ దొడంగెను దిన్నఁదిన్నగా
నక్కధరంబు మానసము ♦ నందిటుబాటను జింతిలెన్ బళీ
యిక్కడ నల్ల సర్వభువ ♦ నేశ్వరచక్రి భవిష్యమందునన్
నెక్కొని దాన మాన శిశు ♦ నిర్మలకేళుల సల్పుఁగావునన్. ౬౧

ఉ॥ కాంచి కృతార్థతన్ బొరసి ♦ కాల్కదలింతును గాని పోవ నం
చెంచి శరీరభారమును ♦ నెక్కువగా నొనరించె నంత యో
గాంచితమౌని యాభరము ♦ హస్తమునందు వహింపలేక వే
దించి వ్రజంబునందు విర ♦ తిన్గొని విస్మృతి నెంది పంతమున్. ౬౨

ఉ॥ శౌచము దీర్చి తానమును ♦ సల్పి మఱిన్ మలఁజేరి యోగిరీ !
లేచి బిఱాన రమ్మని ల ♦ లిన్ బ్రియ మాడుచు లేప లేవమిన్
జూచి మహాత్మ్యసత్వములఁ ♦ జూపుచుఁ బూ_ర్తిగ హ_స్తయుగ్మముల్
జాఁచియు నె_త్త నంగుళము ♦ సాగక పోవుట గాంచి ధీరతన్. ౯౩

తే॥ ఓగిరీంద్రుఁడ ! నామాట ♦ వేగ వినుము, లెమ్ము రమ్మ నావెనువెంట ♦ లేవమికిని
గారణంబును దెలుపుమా ♦ కదలకుండు, కరముభర మొందఁబోకుమా ♦ కఠినహృదయ !

చ॥ అన గిరి, తప్పు నాయెడల ♦ నల్పమునేని జెలంగ లేదు గా
వున ననుఁ దూలనాడకుము ♦ పూర్వపు పంతము జ్ఞ_ప్తిదెచ్చికో
మ్మన మునివర్యుఁ డాగ్రహము ♦ నందుచు నోష్ఠము లల్లలాడఁగాఁ
గనులెఱఁగా శరీర మతి ♦ కంపము నెంద శపించె నిట్టులన్. ౯౪

తే॥ ఓయి గోవర్ధనాచల ! ♦ యుగ్రుఁడవయి, నామనోరథ భగ్నంబు ♦ నాటఁ జేసి
యుంటివందునఁదిలమాత్ర ♦ మొయ్యనొయ్యనొడలుదఱుగంగ క్షీణించు ♦ చుండుమయ్య

క॥ అంతఁ బుల_స్త్య మునీంద్రుఁడు, చింతన్ శ్రీకాశిపురికిఁ ♦ జేరెను గిరి ను
వ్వంతగ నంతకు నంతకు, వంతన్ గృశియించు చుండె ♦ వఱలెను నందా ! ౯౫

శా॥ రంగత్తుంగతరంగసంగతమహా ♦ రంహఃప్రవాహోల్లస
ద్గంగావాహిని యెంతదాఁకఁ దగునో ♦ గ్రావేశగోవర్ధనో
త్తుంగుం డుండునో యంతదాఁకఁ గలి, సం ♦ స్తుత్యప్రభావంబులన్
బొంగుల్ గాని మఱొక్కరీతి మనునే ? ♦ భూతుల్వి రాజిల్లునే ? ౯౬

మ॥ ఇది గోవర్ధనశైలజీవితము నెం ♦ తేన్ భ_క్తితో వ్రాసినన్
జదువన్ బాపము లేగుఁ బుణ్యమొదవున్ ♦ సందేహమావంతయున్
గుదురన్ లేదని పల్కి తిర్గి యమునా ♦ కూలంకషాజీవితం
బు దయాళుండయి గోపవృద్ధు వలుకం ♦ బూనెన్ విదేహాధిపా ! ౯౭

యమునానదీ చరితము.

ఆ॥ వె॥ నంద ! యాకళింద ♦ నందన, గోలోక, మందునుండి శ్రీశునాజ్ఞ ♦ నవనిఁ జేర
దలఁచి తొలుత సర్వ ♦ ధారణీ భ_ర్తకు, హరికి మ్రొక్కియిట్లు ♦ ధరణిఁ జొచ్చె.

తే॥ అందు బ్రహ్మద్రవోద్భవ ♦ మైనగంగ, విరజయన్ నది రెండును ♦ విలయ మొందె
నంద ! పరిపూర్ణతమయా క ♦ ళిందతనయ, కృష్ణు ముద్దురాణి గా ♦ నెఱుఁగుమయ్య !

వ॥ అట్టి యమునాస్రవంతి మహ_త్తరంబగు వేగంబున విరజాధునీ వేగంబు నధఃకరించి యనేకబ్రహ్మాండంబులం జొచ్చి క్రచ్చఱ నచ్చటనుండి వెల్వడి భాగీరథీ నదిం జేరి స్వవేగంబునం దత్ప్రవాహజవంబును ధిక్కరించుచు వామనవామ పాదాంగుష్ఠనఖభిన్నబ్రహ్మాండమ_స్తకంబును బ్రహ్మరసమయంబును నగు బిలంబు సొచ్చి యందలి విష్ణుపదితోఁగూడి యజితంబును దుష్ప్రాప్యంబునై ధ్రువలోకంబున

కనతిదూరంబున నుండు వైకుంఠపురంబుఁ బ్రవేశించి మించి యటనుండి వెడలి బ్రహ్మలోకంబునకుం జని యందునుండి నధోభాగంబున బ్రాలి వందల కొలఁది బృందారకుల యందంపుఁదావులఁ జొచ్చి చొచ్చి చూచి చూచి మెచ్చి చెచ్చెర మేరుశైలశిఖరాగ్రభాగంబునం బడి వెల్వడి తత్ప్రాంతంబుల దంబువహించు ధరాధరంబులకూటంబుల నుల్లంఘించి గండశైలంబుల నతిక్రమించి తన్మేరుదక్షిణభాగంబున కేగ నుద్యమించి తననుండి సురనిమ్నగను బ్రత్యేకింప నది హిమాలయంబున కరిగె. తదుపరిఁ దరణితనయాతరంగిణి నయనపర్వంబగు వర్ణంబులం జెన్నుమీఱు కళిందనామకశైలోచ్చయంబధిరోహించి కాళింది యనంబరఁగి తత్సాను గండశైలంబులు చూర్ణీకృతంబులుగాఁ బ్రవహించి కృష్ణవర్ణంబును నమోఘద్రుతంబును గలిగి భూఖండంబుననుండు దేశంబుల కేగుదెంచి వానిం బవిత్రీకరించి ఖాండవవనంబునకుం జనుదెంచి యందు గోవిందునాజ్ఞ దివ్యరూపంబు ధరించి తపం బొనరించి నిజజనకుండగు నినునిచే వినిర్మితంబైన హర్మ్యంబునందు నివాసం బొనరించి కొలఁదికాల మగుడు మగిడి వ్రజమండలంబు సేరి యందు మంగళాయనంబును, భూమండలమండనాయమానంబును నగు మధురాపురంబునకుఁ జేరువనున్న బృందావనంబందలి మహావనంబునందుండు రమణీయసైకతప్రదేశంబునఁ జిత్రంబగు గోపికాయూథంబొండు నిర్మించుకొని గోకులంబుననున్న శ్రీకృష్ణునితోడి రాసక్రీడకై వసతి యొనర్చి యానందబాష్పములొల్కఁ బశ్చిమవాహినియై తద్వ్రజమండలంబునకు ముమ్మారు మ్రొక్కి యందలి దేశంబులను శుద్ధపరచి తీర్థరాజంబగు ప్రయాగను బొంది తిరిగి సురనిమ్నగంగూడి నిలింపులు విరులుగురియ సరిత్పతింగలిసి యం దనుయాయినియగు గంగాదేవికి గద్గదవాణితో నిట్లనియె. ౭౨

శా॥ అమ్మా! విష్ణుపదంబునం గలిగి బ్ర ♦ హ్మాండంబులం బూర్ణపూ
తమ్ముల్సల్పి సమస్తలోకనతపా ♦ దద్వంద్వవై యాశశీ
ర్షమ్మం దెక్కి యశేషతీర్థమణివై ♦ సౌశీల్యసంపన్నవై
యిమ్మాడ్కిన్ జరితార్థవైతివిగదా ♦ యీరేడులోకంబులన్. ౭౩

తే॥ అమ్మ! హరిలోకమునకిదే ♦ యరుగుచుంటి, నవల నీదయవచ్చిన ♦ యట్టులేగు
మమ్మ! నానుడులందున ♦ నల్పములగు, తప్పులున్నను మన్నించి ♦ దయనుగనుము.

మ॥ అనినన్ జాహ్నవి సంతసంబుగని యో ♦ యమ్మా! కళిందాత్మజా!
ననుఁ గొండాడుట న్యాయమొక్కొ? హరి మా ♦ న్యంబైన వామాంసమం
దున జన్మించి ప్రపూర్ణురాలవయి సం ♦ స్తుత్యప్రభావంబులన్
దనరన్ సర్వజగత్పవిత్రవయి తీ ♦ ర్థశ్రేష్ఠవై యుంటివే. ౭౪

క॥ మఱిఁ బరిపూర్ణతముండగు, హరికిన్ సతివైతివమ్మ! ♦ యనఘచరిత్రా!
యరిగెదఁ బాతాళమునకు, నెరసుల క్షమియింపుమమ్మ! ♦ నెమ్మిని గనుమా!

తే॥ మనుజఖేచరమానులు ♦ గనఁగరాని, నీవు నాకంటఁబడి మఱిఁ ♦ బోవుచుంటి
వందులకుఁ గుందెదను మఱి♦నల్ల వ్రజము,నందు యూథంబుతో రాస♦మందుఁగనెద.

క॥ ఇటులఁ బరస్పరమొరిగలఁ, జటులమ్ముగఁజేసికొనియు ♦ జాహ్నవి దా ను
త్కటగతిఁ బాతాళమునకుఁ, దటములఁ బోఁద్రోసికొనుచుఁ♦దరలియు వరుసన్.

ఉ॥ భోగవతీవనస్థలిని ♦ భోగవతీవిదితాఖ్యమై మహా
నాగపరీతవిస్తృత పి ♦ నాకిశిరంబునఁ జేరి భాసిలన్
సాగెఁ గళిందజానదియు ♦ సప్తసముద్రలసజ్జగంబుపై
వేగఘనప్రవాహముల ♦ విశ్రమమొందక పాఱి పిమ్మటన్. ౭౯

శా॥ లోకాలోకనగంబు స్వర్ణమయమున్ ♦ లోకస్తుతంబొంది యా
లోకంబున్ బొనరించి సానుతటము♦ ల్గూలంగఁ బెంధాటి స్వ
ర్లోకం బేగి సమస్తలోకముల నా ♦ లోకించుచున్ దిర్గి గో
లోకశ్రేష్ఠముఁ బొందె సర్వవిబుధ ♦ ల్పుష్పంబులన్ జల్లఁగాన్. ౮౦

క॥ ఇది యమునా శుభచరితముఁ, జదివిన వ్రాసినను నఘము♦సదమదమొందున్.
గొదకొను పురుషార్థంబులు, మదమూడును శాంతమొదవు ♦ మాన్యచరిత్రా!

నందుండు యాదవసహితంబుగా బృందావనంబున కరుగుట.

క॥ అని సన్నందుఁడు వల్కఁగ, విని నందుఁడు దఱచి చూచి ♦ బృందావనమున్
జన యత్నించి స్వపురమున, జనులకు సాటింపఁజేసి ♦ జనకనరేంద్రా! ౮౨

ఉ॥ సారథివీథితో విబుధ ♦ సంతతితో రథరథ్యపంక్తితో
వీరులతో శిశుప్రకర ♦ వృద్ధులతో వ్రజగోపగోపికా
వారముతోఁ గుమార బల ♦ పంకజనాభులతోడ రోహిణీ
నారి యశోదలం గలిసి ♦ నవ్యరథంబున నెక్కి చక్కఁగాన్. ౮౩

చ॥ ఘనముగ గాయకోత్కరము ♦ గానమొనర్పఁగ శంఖదుందుభి
స్వనములు నొప్ప గోగణము ♦ భాసిల స్వస్తిదవాచనంబులున్
దనరఁగఁ బూజ్యనందవసు ♦ ధాతలనాథుఁడు బృందకావనం
బున కరిగెన్ మఱిన్ వసన ♦ ముం బొనరించెను భూతలేశ్వరా! ౮౪

తే॥ మఱియు వృషభానువరుఁడునుమహిషితోడ, గజమునెక్కి రాధికనునంకమునునుంచి
గాయకులును మార్దంగికుల్♦గ్రమగతుల, వాద్యమొనరింపబృందకా♦వనముఁబొందె.

క॥ నందులు నుపనందులు చే, రొందిన వృషభాను మఱి ♦ యుత్తమగతితోఁ
బొంది పదార్థసహితులయి, బృందావనమొందె మిగుల ♦ వేడుకతోడన్. ౮౫

చ॥ పిదపఁ బదారు కోసులను ♦ వెల్గుచునుండు ప్రదేశమందునన్
సదన సభా కుటీర వన ♦ సౌధ చతుష్పథ రాజవీథులున్

గుదిగిన యేడుద్వారములు ♦ గోటలు బేట లగడ్తలున్ శుభ
ప్రదమగు వేయికుంజములు ♦ భాసిలఁ బట్టణ మొండు గట్టియున్. ౮౭

ఉ॥ అందున నందరాజు నను ♦ యాయులునున్ వృషభాను షట్కమున్
నందులు గోపులందఱు ఘ ♦ నంబుగ వాసములం బొనర్చి రా
నందుని సుందరాలయము ♦ నన్ వృషభాను గృహస్థబాలురం
బొంది యశోద, గోపికలు, ♦ మోదము సెందఁగ నాడువేడుకన్. ౮౮

చ॥ చతురులు లోకసమ్మతులు ♦ సర్వకళాకరు లప్రమేయు ల
ప్రతిములు దివ్యులున్ బతిత ♦ పావనులున్ గుసుమాస్త్ర రూపులున్
సితరుచినీలవర్ణులు వి ♦ నీల హరిద్వసనాంచితుల్ జగ
త్పతులగు రామకృష్ణులట ♦ ప్రీతినిఁ బూనుచుఁ బశుపాల్యమున్. ౮౯

సీ॥ ప్రొద్దుననే లేచి ♦ చద్దిమూటలఁ గొంచుఁ, గోడెకాండ్రను వేడ్కఁ ♦ గూడుచుండ్రు
కూడి వత్సములెల్ల ♦ గుంపులుగాఁ గూర్చి, కేల వేత్రము లొంది ♦ త్రోలుచుండ్రు
త్రోలియు నెట్టన ♦ దోషవినాశక, యమునాసరిత్తట ♦ మరుగుచుందు
రరిగి తత్పులినంబు ♦ లందున భూషలు, గల్లుగల్లని మ్రోయ ♦ గంతులిడుదు

తే॥ రిడియు ముచ్చటలాడుచు ♦ నెసఁగుచుందు, రెసఁగిచద్దులమూటల ♦ వెసనువిడుతు
రువిడి మక్కువ మెక్కుదు ♦ రు మఱిమెక్కి, వంశివాదనక్రముల్లై ♦ వఱలుచుండ్రు.

శ్రీకృష్ణుండు వత్సాసురుని వధించుట.

చ॥ ఒకదినమందు నొక్కతఱి ♦ నొక్కనిశాటుఁడు కంసుబోధచేఁ
బ్రకటితవత్సరూపమున ♦ రామరమేశులు ద్రోలు దూడలన్
సుకముగఁ జేరి వత్సముల ♦ శోషిలఁ జేసియు గోపులం గడున్
దికమకసల్ప వారలగ ♦ తిస్థితులం గని పాఱె రంతటన్. ౯౧

ఉ॥ వంచకకంసచోదితుఁడు ♦ వత్సనిశాటుఁడు దోఁక నట్టి బా
డించి రమేశుమూఁపున వ ♦ డిన్ బ్రహరింపఁగఁ దోడి బాలురే
తెంచ జనార్దనుండు గని ♦ ధీరత నాతని కాళ్ళఁబట్టి హిం
సించి కపిద్ధవృక్షమునఁ ♦ జేతులఁ ద్రిప్పుచుఁ బాఱవేయుడున్. ౯౨

ఉ॥ కూలెను నట్టి వృక్ష మది ♦ కూలియు నన్యకపిత్థభూజముల్
రాలిచె వాని తేజ కమ ♦ లాపతియందున లీనమయ్యె నా
వేలుపులెల్లఁ బుష్పముల ♦ వేమఱుఁ జల్లిరి పిల్లలెల్లరున్
జాలు బళీ! బళీ! యనిరి ♦ సంతసమందఱు వొందిరో విభూ! ౯౩

వత్సాసుర పూర్వజన్మ వృత్తాంతము.

చ॥ పదపడి తేఁడిటుల్ వలికెఁ ♦ బంకజనాభకథాప్రవీణ! నా
రదమునివర్య! యీ యసుర ♦ రాజెవఁడో యల కృష్ణు లీనమై

కుదిరె నెటు ల్వాచింపుమని ♦ కోరఁగ నట్టి యమర్త్యమౌని స
మ్మదమున వాని తొల్లి కత ♦ మానవనాథున కిట్లు వాకొనెన్. ౯౪

చ॥ మురసుతుఁ డాసురుండు క్రతు ♦ భుఘ్నసుతేత ప్రమీలనామకుం
డరుసమునన్ వసిష్ఠముని ♦ యాశ్రమమొందియు నందినీమహా
సురభినిఁ జూచి కైకొనఁ ద్రి ♦ శుద్ధిగ నెంచి ధరామరాకృతిన్
వటుఁడై యొసంగు మద్దియని ♦ ప్రార్థనఁ జేసెను తన్మునీంద్రునిన్. ౯౫

చ॥ వినిన వసిష్ఠుఁ డేదియును ♦ వెల్లడి జేయకయుంట నల్లనం
దిని, గని యోరి దైత్య! కుమ ♦ తీ! మునిధేనువు నన్ను సంగ్రహిం
ప నిటకువచ్చి మోసమున ♦ బాపని వేసము వేసి యాచనన్
బొనరుతువే యిసీ! వెసను ♦ బొమ్మిఁక వత్సవికారమొందుమా! ౯౬

చ॥ అని శపియింప నా యసురుఁ ♦ డప్పుడు వత్సతఁ జెంది మానినం
దినుల నమస్కరించి సుమ ♦ తిన్ నను రక్షణసేయుమంచుఁ బ్రా
ర్థన మొనరింప నా సురభి, ♦ ద్వాపరపుం దుద బృందకావనం
బున హరి ద్రోలు వత్సములఁ ♦ బొందిన ముక్తిఘటిల్లు దానవా! ౯౭

తే॥ అనుచుఁ గరుణింపఁ దత్ప్రిమీ ♦ లాసురుండు
తద్విధిన్ వత్సరూపంబుఁ ♦ దాల్చి ద్వాప
రాంతమునఁ దద్వనమునందు ♦ నల్ల వత్స
ములను గలిసి హింసలఁ జెంది ♦ కలిసె హరిని. ౯౮

క॥ ఇందునఁ జిత్రము లేదని, డెందమునం దెలుఁగుమయ్య ♦ దీవిని నెగ్గో
విందునిఁ దలఁతురో వా రానందంబునఁ బరమమొంద్రు ♦ నారవరేణ్యా! ౯౯

క॥ సమయాంతరమందున హరి, క్రమముగ బలరామమిత్ర ♦ రాజియుతుండై
ప్రముదితసురభులఁ ద్రోలుచు, యమునారమణీయతటము ♦ నరిగిరి పిదపన్.

శ్రీకృష్ణుండు బకాసురుని జయించుట.

తే॥ అందు వజ్రతుండంబు బృహత్పదములు, శ్వేతశైలాభరూపంబుఁ ♦ జెలఁగితిరుగు
బకనిశాటుఁ డొక్కండు త ♦ త్పద్మనాభుఁ,గని గుటుక్కున మ్రింగె ని ♦ ష్కరుణ నపుడు.

ఉ॥ కాంచిన తోడియర్భక ని ♦ కాయము భీతి మహాత్ములార! యీ
వంచకుఁ డెవ్వఁడో కద య ♦ పారవికారశరీరియౌచు మా
పంచకు వచ్చి మా చెలిని ♦ బాలునిఁ గృష్ణుని మ్రింగె నయ్యొ! మీ
ర్గాంచరె? దిక్కులేదిచటఁ ♦ గారుణికంబున మమ్ముఁ గావరే! ౧౦౨

తే॥ అంచు విలపింపఁగా నిలిం ♦ పాధిపుండు, పిన్నలార! మీరింతయు ♦ వెఱవవలదు
వచ్చుచుంటి నం చఖిలదే ♦ వతలఁగూడి, సర్వశస్త్రాస్త్రయుక్తుఁడై ♦ సరభసమున.

ఉ॥ వచ్చి మహాసురేశ్వరుఁడు ♦ బాధ బలిష్ఠుఁడునైన వానిపైఁ
గ్రచ్చఱ వజ్రముల్ విసర ♦ రక్కసియుల్ బడి లేచి యంతగా
నొచ్చక తిర్గి కొట్టమిఁ గ ♦ నుంగొనినట్టి పితామహుండు బ
ల్మెచ్చిన బ్రహ్మదండమున ♦ నీసునఁగొట్టె ననంతరంబునన్. ౧౦౪

చ॥ పుడమి నతండు తద్ధతిని ♦ మూర్తము మూత్రము సొమ్మసిల్లి వే
యొడలు విదల్చి పెల్చన స ♦ ముత్థితుఁడై ఘనసామ్య నిస్వనం
బడలఁగఁజేసి ధిక్క్రియను ♦ నావిధిఁ గ్రమ్మఱఁ గొట్టకుంట రు
ద్రుఁడు గని స్వత్రిశూలమును ♦ రోసముతోఁ గొని వేసె వానిపై. ౧౦౫

తే॥ తద్ధతిన్ బక్షమొక్కటి ♦ దఱుఁగ బడిన, వాఁడు ప్రాణముల్ విడలేదు ♦ పవనుఁడద్ది
గాంచి స్వీయాస్త్రముల్ వేయఁ ♦ గా నతండు, గదలికదలనియట్టులఁ ♦ గ్రాలెనవల. ౧౦౬

చ॥ యముఁడు స్వచండదండముఁ ద ♦ దాసురుపై నిడె నద్ది చండవి
క్రముఁడగు వానిఁ జంపమియె ♦ కాక కడున్ జెడిపోయె నంత న
ర్యముఁడటులన్ హతిన్ గనక ♦ హాయిగనుండెడి దైత్యుఁజూచి రో
సముపడి నాటవేసెను వె ♦ సన్ బహుళాతశతాశుగంబులన్. ౧౦౭

చ॥ దనుజుఁడు వాని కించుక వె ♦ తన్ గనకుండుట గుహ్యకేశుఁడున్
గనుచుఁ గృపాణముల్ విసరఁ ♦ గా నలవాని ద్వితీయపక్షముల్
జనియెనుగాని నీల్గఁ డది ♦ చంద్రుఁడు గాంచి కసిన్ హిమాస్త్రమా
తనిపయి వేయ శైత్యమునఁ ♦ దాళక సొమ్మను బొందె వెంటనే. ౧౦౮

ఉ॥ ఆయసురుండు లేచి తిరు ♦ గాడుచునుండుట జూచి యగ్ని, యా
గ్నేయమహాస్త్రమేయ నల ♦ నీచుని నెమ్మెయి నున్నరోమము
ల్కాలెనుగాని డమ్మనఁడు ♦ లొంగఁడు నొవ్వఁ డెదుర్కొనండు వే
దాయఁడు దూలనాడఁడు గ ♦ దా! యలదైత్యుఁడదేమి చిత్రమో! ౧౦౮

చ॥ వరుణుఁడు తద్విలోకింగనుచుఁ ♦ బాశముతో నల వానిఁ గట్టి యీ
ధరణిని నీడ్చినప్పటికిఁ ♦ దద్భులుఁ డీల్గక గాయమొందెఁ ద
త్సరణినిఁ గాంచి కాళి, గదఁ ♦ జట్టనఁ గైకొని కొట్ట నాతఁడున్
శిరమున గాయమైన మృతి ♦ నొందఁ డదెంతటి గట్టియాయువో. ౧౧౦

ఆ॥ అవల శక్తిధరుఁడు ♦ నరుదెంచి శక్తి నా, యసురవరుని నఱుకఁ ♦ గసినివిసర
నతఁడు గాలుదెగిన ♦ మృతిని జెందకయుండి, నెల్ల వేల్పులఁగని ♦ యుల్లమందు.

తే॥ ఇట్టు లూరక యున్నచో ♦ నింకనన్నుఁ, జంపుదురుగావునన్ నాదు ♦ శక్తికొంతఁ
జూపనగునని యెంచి త ♦ త్సురలలోనఁ, జొచ్చి పెనుగాలి కైవడి ♦ మచ్చరమున.

ఆ॥ రక్తనేత్రుఁడగుచు ♦ శక్తియుక్తుండయి, నిర్జరులను బట్టి ♦ నెట్టికొట్టి
వారు దనదు బాధ ♦ బడలేక నింగికి, బరుగులెత్తఁ దఱిమి ♦ తఱిమి మరల.

చ॥ వరయమునాతటంబునకు ♦ వచ్చి హరిద్దళకంబు ప్రోయఁగా
నఱచి చరించుటంగని సు ♦ రర్షులు బ్రహ్మబుషుల్ మహామునుల్
సురలును బ్రాహ్మణుల్ ప్రథిత ♦ సూరులు తత్సలి కేగుదెంచి త
త్సరసిజపత్రనేత్రు హరి ♦ సన్నుతి జేసిరి భక్తితో నిటుల్. ౧౧౪

తే॥ దీనరక్షణ తత్పరా! ♦ దేవదేవ!, వాసుదేవ! కేశవ! శివ ♦ పరమమిత్ర!
మిత్రజై వాతృకాక్ష! వి ♦ చిత్రచరిత!, భువనమోహన! శ్రీకృష్ణ! ♦ పుణ్యపురుష!

తే॥ అయ్య! మావిన్నపంబిద్ది ♦ యాలకించి, మిగుల నీకోసమై యిందు ♦ వగచుచిట్టు
లెదురు చూచు నీపిన్నల ♦ నీవువచ్చి, కరుణఁ గావుము నీకగుఁ ♦ గాత శుభము.

వ॥ అంత. ౧౧౭

చ॥ బకవపునందునున్న హరి ♦ వారల ప్రార్థన మాదరించి పూ
నికఁ దన దేహ మెక్కుడుపగ ♦ నేర్పున నల్పఁ దదాసురుండు దా
శక క్షతకంధరుండయి యి ♦ లన్ గమలాపతిఁ గ్రక్కుచొక్కి పా
యక మఱలన్ హరింగొఱక ♦ యత్న మొనర్చి మహాగ్రహాగ్రుఁడై. ౧౧౮

తే॥ తీవ్రతుండంబుభాసిల్లఁ ♦ దీవ్రగతిని, జనియె నంతటఁ గృష్ణుఁడా ♦ దనుజునిగని
వాలముంబట్టి కొట్టుచుఁ ♦ గేల నాస, గజము గొమ్మును విఱిచిన ♦ కరణి విఱిచె.

చ॥ అవల ఖగేశ్వరుండగు బ ♦ కాసురుఁ డంతము నొందె వేడ్క దే
వవితతి శ్రీహరీ! జయము ♦ బాగు బళీ! యను గెల్పుఁదెల్పు వా
జ్ఞినదామృతోడఁ బుష్పతతి ♦ నిన్ వెదఁజల్లిరి నెచ్చెలుల్ హరిన్
బ్రవణముతోఁ గవుంగిళులఁ ♦ బల్మఱు జేసి నుతించి రెంతయున్. ౧౨౦

ఉ॥ మృత్యుముఖంబునుండి నిల ♦ కెవ్వరిటుల్ మని వచ్చిరొక్కొ? సం
స్తుత్యుఁడ వీవెయంచు విబు ♦ ధుల్ గొనియాడెడి లోన దైత్యనా
న్నత్యకళల్ వ్రజాధిపతి ♦ నందనకృష్ణునిలోన లీనమై
నిత్యతఁజెందె నంత హరి ♦ నెచ్చెలులన్ దగి సంతసంబుతోన్. ౧౨౧

తే॥ రమ్యవత్సముల్ ద్రోలుచు ♦ రాగములను, మురళితోడుతఁ బాడుచు ♦ ముద్దులొలుక
వసతిఁజనులోనఁ దోడియ ♦ ర్భకులు ముందు, జేరి యిండ్లకు నలకృష్ణు ♦ సేతఁ దెలుప.

తే॥ పౌరులందఱు విస్మిత ♦ భావులైరి, జనక! నావుడు నాలించి ♦ సాహసాంక
శౌర్యధననిధిలేశుఁడు ♦ శాంతిదాంతి, యుక్త నారదముని కొక ♦ యుక్తిఁబలికె.

ఉ॥ దూబఱతిండిపోతగుచుఁ ♦ దోయజలోచను ప్రింగి డింకి గా
రాబున వాని లీనమయి ♦ రాజిలుచుండెడి వాఁడెవండో? యా
పోబడి దెల్పుమంచు స్తవ ♦ ముం బొనరింపఁగ మానినాయకుం
డా బకదైత్య పూర్వకథ ♦ నంతయు తేనికి నిట్లు వాకొనెన్. ౧౨౪

బకాసుర పూర్వజన్మ వృత్తాంతము.

ఉ॥ భూవర! యీ బకాసురుఁడు ♦ పూర్వపుజన్మమునందుఁ దా హయ
గ్రీవనిశాటపుత్రకుఁడ ♦ కృత్యపరాయణుఁ డుత్కలాఖ్యుఁడై
దేవతలన్ జయించి యిటు ♦ దెమ్మని కైకొని వారి ఛత్రిమా
దేవతలంబు నేలె నొక ♦ దివ్యశతాబ్దము లర్థవంతుఁడై. ౧౨౫

ఉ॥ అల్ల నిశాచరేశుఁడు క ♦ శాకరనాకమునందు వీఁకతోఁ
జెల్లుబడిన్ జరించు చొక ♦ సింధుపయోనిధిసంగమస్థలిన్
బల్లన నొక్కనాఁడు జని ♦ యందికలోఁ గల జాజలాఖ్యు ప
ర్ణోల్లసదాశ్రమం బరిగి ♦ యుద్ధతి మీనులఁబట్టు కోర్కతోన్. ౧౨౬

ఆ॥ అందుఁ జెలఁగు మకుఁగు ♦ నందు గాలము వేసి, నిజమనోరథంబు ♦ నెఱిపడునటు
లల్పుకొనుచునుండ ♦ జాజలమౌనియుఁ, గాంచి జాలిఁజెంది ♦ కరుణతోడ.

క॥ తగుదునని వచ్చి యిచ్చటి, కగచాట్లనుబెట్టి వీని ♦ హరియించెదవే?
తగదిది దగదిది నీకో, మగవాఁడా వినుము నాదు ♦ మాటలఁ బోపో. ౧౨౭

క॥ లేరే శూరులు ధీరులు, లేరే భూపాలకులును, ♦ లేరే మల్లుల్
లేరే దుర్మతు లిల నీ,శూరతఁజూపింపఁ జంప♦గ్రుక్కింపఁగుఛీ! ౧౨౮

క॥ ఇతరుల జోలికిఁ బోవక, సతతము దగినట్లు గసవు ♦ జలములఁగొని స
న్మతివృత్తి నీమడుఁగునన్, బ్రతికెడి నీరుషమము లడపఁ ♦ బాడియెఁజెపుమా!

తే॥ అని హితోపదేశముసేయ♦నట్టిచెట్ట, వినియు విననట్లు జెలఁగు చా♦పనిని విడువ
కుండె నిల దుండగీంద్రుడకు ♦ దండిబుద్ధి,యేమిలేనప్డు జెప్పిన ♦ నెట్లువచ్చు.౧౩౧·

ఉ॥ జాజలమౌని యంత సుర ♦ శత్రునిఁగన్గొని యోరిదుష్ట! నీ
తేజ విడన్ బకత్వము న ♦ తి త్వరితంబుగఁ జెందుమన్న నా
యోజఁ దదాసురుండు దన ♦ యుత్తమతేజము వీడఁ గొంగయై
రాజిలఁజూచి యట్టి ముని ♦ రాజునుజేరి నమస్కరించుచున్. ౧౩౨

చ॥ మునివర! జాజలా! యెఱుఁగ ♦ మ్రొక్కెదఁ దప్పు క్షమింపుమయ్యా! మీ
ఘనమగు సంగమం బఖల ♦ కల్మషహారము మిత్రశత్రులం
దున ఘననీచులందు సుఖ ♦ దుఃఖములందునఁ బొన్నుమన్నులం
దున మిముబోటి యోగులకుఁ ♦ దోఁపదు భేదము గానఁ గావుమా! ౧౩౩

చ॥ మఱియును మీదు దర్శనము ♦ మాకు లభించుట బట్టి దోషముల్
దొలఁగెను బుణ్యముల్ గలిగ ♦ దుష్కరయోగకృతార్థ! నీదయన్
బరము ఘటిల్లుఁగాదె యిఁక ♦ నన్నుభరించుట నీకసాధ్యమే?
సరగునఁ బ్రోవుమా యనుచు ♦ సన్నుతులం బొనరించె నంతటన్. ౧౩౪

తే॥ సరిగ షష్టిసహస్రవ ♦ ర్షములఁ దాఁకఁ, దపముఁ జేసిన జాజల ♦ తత్త్వవిదుఁడు
గినుక వీడి ప్రసన్నుఁడై ♦ దనుజనాయ, కునకు నిట్టులఁ బలికె నో ♦ జనకరాజ!

తే॥ ఇరువదెన్మిదవ యుగమం ♦ దెసఁగుచుండు, ద్వాపరాంతమునందున ♦ భరతఖండ
మందు వైవస్వతంబున ♦ నలరు మాథు,రవ్రజమున బృందావన ♦ రాజ ముండు.

ఉ॥ అందల నందనందనుఁడు ♦ నాపరిపూర్ణతముండు నట్టి గో
విందుఁడు వత్ససంతతులఁ ♦ బ్రీతినిఁ ద్రోలెడివేళ వైరముల్
జెందుచుఁ గృష్ణుతోఁ గలిసి ♦ చెన్నవహింతువు సందియం బిటుల్
బొందదు స్వర్ణనేత్రముఖ ♦ పుణ్యజనుల్ బగఁజేరరే హరిన్. ౧౩౮

తే॥ అటులఁ బలుకఁగఁ నుత్కలుం ♦ డిటుల బకతఁ, జెంది బృందావనంబునఁ ♦ జేరి శౌరి
మ్రింగి శత్రుత నార్జించి ♦ మృతినిబొంది, కలిసె హరిని సన్మైత్రి సత్ఫలదముగద

శ్రీకృష్ణుం డఘాసురునిం బరిమార్చుట.

క॥ అంతట హరి వత్సము ల,త్యంతముగాఁ ద్రోలుకొనుచు ♦ నాత్మసఖుల్ రాన్
వంతులఁ గాళిందీనది, చెంతకు నొకసమయమందుఁ ♦ జేరెను జనకా! ౧౩౯

ఉ॥ అత్తఱిఁ బాముఱూపున న ♦ ఘాసురుఁ డొక్కఁడు క్రోశదీర్ఘుఁడై
యెత్తిమొగంబు నోర్దెఱచి ♦ హెచ్చిన శైలమువోలె బాటలో
మత్తతఁ బండె నద్దిగన ♦ మాథురకాననసంచరిష్ణు గో
పోత్తములెల్ల రేగ నల ♦ యుక్కరి డక్కున మెక్క గ్రక్కునన్. ౧౪౦

ఉ॥ వారిని రక్షసేయ బల ♦ భద్రయుతుండయి వానిలోనికా
శౌరి సనన్ నిశాచరులు ♦ సంతసమందిరి గుందిరెల్ల బృం
దారకు లార్తనాదములు ♦ తత్ప్రియమండలిఁ గల్గె నంత ల
క్ష్మీరమణుండు యోచనము ♦ జేసి తదాసురదేహ మందునన్. ౧౪౧

తే॥ తన శరీరంబు పెద్దగఁ ♦ దద్దఁజేసి, వాని ప్రాణంబులల్లాడఁ ♦ బట్టి తలను
భిన్నముగఁ జేసి స్వజనగో ♦ వితతిగూడి, వచ్చె నీవల కాదైత్య ♦ వరుఁడు సచ్చె.

ఆ॥ అంత వాని తేజు ♦ హరియందుఁ జంచల, ఘనమునందుఁ గలియు ♦ కరణిఁగలిసె
విరుల నెల్లసురలు ♦ గురిసిరి నరవరా!, యనఁగ నతఁడు మునిని ♦ నడిగె నిట్లు.

అఘాసుర పూర్వజన్మ వృత్తాంతము.

ఉ॥ వీఁడెవఁడో కదా యెటుల ♦ విష్ణువునందున లీనమయ్యె వీఁ
డెడవసించుఁ బ్రాగ్జనిని ♦ నెట్టిది వీనిచరిత్ర! శ్రీహరిన్
వేఁడక వైరరూపమున ♦ వింతగఁజొచ్చెను సెల్లబో! యీ
జాడ నెఱుంగఁ గోరితిని ♦ సత్వరమే వచియింపు నారదా! ౧౪౨

ఉ॥ ఆవలఁ దన్మునీంద్రుఁ డిటు ♦ లాడెను భూవర! వీఁడు శంఖుఁడన్
దేవగణారిపుత్రకుఁడు ♦ దీర్ఘబలుం డఘనామధేయుఁడున్

యాఁవనదర్పితుండు మద ♦ నాకృతిభాసురుఁ డన్యనిందకుం
డావిలభావభావితుఁడు ♦ నై తొలిజన్మమునందునం దగుర్. ౧౪౫

క॥ మలయాచలమున నాతం, డలఘుతపంబాచరించు ♦ నష్టావక్రుల్
లులితశరీరిఁ గురూపిని, నలయక యొకతటినిఁజూచి ♦ హాస్యమొనర్చెన్. ౧౪౬

క॥ హాసముఁ బొందిన తన్మునిఁ, రోసముతో నోరిదుష్ట! ♦ రూఢిగ నీకా
యాసడము నిడెడి సప్పవు, వేసము దగుగాత్రమని శ ♦ పించెను జనకా! ౧౪౭

చ॥ పదపడి నాతఁడల్ల ముని ♦ పాదముల్ బడి భక్తివేఁడ స
ద్ధృదయుఁ డతండు నెమ్మిఁగని ♦ దేవవిభుండగు కృష్ణుఁడెప్డు నీ
యుదరమునందునన్ జెలఁగి ♦ యుక్కడగించునో యట్టివేళ నీ
వదిర! యనంగ దివ్యమగు ♦ నాకృతి జెందెద వోరి యాసురా! ౧౪౮

క॥ స్పష్టముగ నట్లు జెప్పఁగఁ, గష్టోరగరూప మతఁడు ♦ గని క్రమ్మఱ నా
విష్టపనాథునిఁ గలిసెఁ ద్రి, విష్టపవాస్తవ్య లంద ♦ వీల్గానివిధిన్. ౧౪౯

తే॥ వత్సబకశంఖద్రత్యాఘ ♦ వక్త్రిములను, జొచ్చి క్రచ్చఱ నీవల ♦ వచ్చిమనిన
కృష్ణుసంగతిఁ గ్రమముగాఁ ♦ దృష్ణతోడ, విని యశోద దిగులుపడి ♦ వేగపడుచు

తే॥ నగరవాసుల నందోప ♦ నందవరుల, నందు వృషభాను గోపక ♦ బృందములను
రోహిణిం గళావతిఁ గృతి ♦ వాహకులను, బెద్దలను బిన్నలను బిలి ♦ పించి చేర్చి.

చ॥ మనవ్రజమం దుపద్రవ మ ♦ మందముగా జనియించె నంచు వే
మనము మనంబునం దలఁచి ♦ మంచిదటంచు వచింప నీస్థలం
బున కిరుదెంచియుంటి మది ♦ వోయిన యట్టులఁ దోఁప దిందునన్
గనుక నిఁకేమిసేయనగుఁ ♦ గట్టిగ రోచనజేసి చెప్పుఁడీ! ౧౫౨

ఉ॥ నాతనయుండొ చంచలుఁ డ ♦ నారతమాడెడివాఁడు పిల్లలో
యాతత మర్కటాభులు గ ♦ దా! యిఁక నాడుటో దూరమందు నా
చేఁతలో ప్రాణహారములు ♦ సిక్కఁడు వాఁడిఁక నేమొనర్తు మీ
ర్బ్రీతిగఁ గాంచి సత్పదముఁ ♦ బల్కుఁడి ప్రేముడిఁబట్టిఁ బ్రోవుఁడీ. ౧౫౩

చ॥ కొలఁది దినాల క్రిందటను ♦ గుత్సితుఁడో బకదానవుండు నా
లలితకుమారుఁ జంపఁగ వి ♦ లక్షణతుండముతోడఁ బైకి రా
నలవిధి వానిఁ దప్పుకొని ♦ యాయువుతోఁ దగెనంట వత్సు బా
ధలఁ దొలఁగించుకొంచు నెటొ ♦ ధారణిలో మనెనంట నక్కటా! ౧౫౪

తే॥ మఱి యఘాసురహింసల ♦ మాన్పుకొంచు, బ్రతికిబ్రతుకనియట్టులఁ ♦ బరఁగెనంట
బ్రతిపదంబున నీరీతి ♦ బాధలెల్ల, గలుగు చుండఁగ నిచట నే ♦ కరణి నుందు?

తే॥ ఇదిమొదలు వత్సములఁ గావ ♦ నేను నాదు, కొడుకు వెలుపలకంప నో ♦ గోపులార!
యనుచు నేడ్చుయశోదను ♦ గనుచు నందుఁ, డాశ్వసించియు నిట్టుల ♦ ననియె జనక!

ఉ॥ నెచ్చెలి! గర్గసూక్తుల ము ♦ నిప్రకరోక్తుల బ్రాహ్మణోక్తులన్
గ్రచ్చఱ విస్మృతింబొరయఁ ♦ గ్రాలితివో! భ్రమ జెందియుంటివో!
హెచ్చిన పిచ్చి జెందితివొ! ♦ యేమియొకాని సుతుండు గీడులన్
విచ్చును గాన దానములఁ ♦ బ్రీతినొసంగుము మంగళార్థమై. ౧౫౭

చ॥ అనఁగ యశోద పాలుఁలకు ♦ నర్ఘధరానవరత్న దానముల్
బొనరిచి స్వీయభూషణస ♦ మూహము సాగ్రజుఁడైన యాత్మపు
త్రునకిడె లక్షధేనువుల, ♦ స్థూలవృషాయుతమున్, ద్విలక్షమూ
ల్యనయవరాన్నరాశుల న ♦ నర్గళ రీతి నొసంగె నందుఁడున్. ౧౫౮

శ్రీరామకృష్ణులు పశుపాల్యం బొనరించుట

వ॥ పదపడి గోపకాజ్ఞ నవ ♦ భావజరూపులు బాపతాపదు
ర్మదరహితుల్ మనోహరులు ♦ రామరమేశులు పశుపాల్యమున్
వదలక చక్కఁగా సలుపు ♦ పద్ధతి నొప్పుచు నీడుజోడునం
గుదిరిన వారినిం గలిసి ♦ గోవులఁ ద్రోలఁగసాగి రంతటన్. ౧౫౯

తే॥ సర్వకల్యాణకరములౌ ♦ సౌరభేయు,లు నిరుపక్కల ముంగల ♦ వెనుకఁ జెలఁగి
నందనందనబలరామ ♦ సుందరవద, నారవిందముల్ జూచుచు ♦ సౌరుమీఱె.

సీ॥ చిన్నారిపొన్నారి ♦ పొన్నన రవలను, బన్నిన దండలు ♦ ప్రభలనీన
నపరంజిచిఱుగజ్జె ♦ లందియల్ మొదలైన; సొమ్ములఝుంకృతుల్ ♦ గ్రమ్ముకొనఁగ
విన్నువాఁకను నంచ ♦ వెల్లగుఱ్ఱమ్ముఁ జో, దంతిని మించిన ♦ కాంతు లలర
బలిసినపక్కలు ♦ జెలువంపు నడుమును, నడవడి రూపును ♦ గడలుకొనఁగ
తే॥ రెండుతూములపాలను ♦ బిండఁగలుగు, మంచిపొదుఁగు వెలుంగఁగ ♦ మలయుచుండు
దొడ్డగిడ్డులు వెన్నుని ♦ తోడఁగూడి, నల్లవలువతాల్పుఁగనుచు ♦ నడవఁదొడఁగె.

తే॥ అందు నెట్టని బొట్టుల ♦ నరుణపాద, ములను బచ్చని కోఁకలఁ ♦ బొట్టికొమ్ము
ల మఱిఁ గైలాసనిభశరీ ♦ రమును గొప్ప, కోడెలనుగల్గు నావులు ♦ గొన్నియుండు

చ॥ మఱియును గొన్ని ధేనువు ల ♦ మందఘనద్యుతి భాసురాకృతి
న్వఱలును గొన్ని పాటలము ♦ నన్ హరితంబునఁ గొన్నియాలు బం
గరువలె మేరుపర్వతము ♦ కైవడిఁ గొన్నియుఁ గొన్ని వింతవై
న రుచుల వెల్గుఁ గొన్ని యరు ♦ ణంబున రాజిలుచుండు వెండియున్. ౧౬౩

తే॥ కపిల వర్ణమునంగొన్ని ♦ కపిశవర్ణ, మందుఁ గొన్నియు నుందును ♦ సుందరమగు
గంగడోలును బొల్పారఁ ♦ గ్రాలుఁ గొన్ని, బొడుగుకొమ్ములఁ గొన్నియుఁ ♦ బొల్పుఁగాంచు
తే॥ వక్రశృంగంబులన్ గొన్ని ♦ వఱలు హరిణ, శృంగసమశృంగములఁ గొన్ని ♦ సెన్నుమీఱు
గుంభికుంభసమాన క ♦ కుదముల బల, మునను జెలఁగు నాఁబోతులు ♦ దనరు నందు.

చ॥ అభయముగాఁగ రామహరు ♦ లావుల గోవులఁ ద్రోలువేళలన్
నభమున సర్వవిష్టపము ♦ న్ప్రతిభాప్రథములై జగన్మహా
విభులయి రమ్యపంకజను ♦ వేలసతీమణి జీవితేశులై
ప్రభవము గాంచి మించు రవి ♦ రాజులభంగి వెలింగి రోవిభూ! ౧౫౬

చ॥ ప్రతివనమందునం జెలఁగు ♦ పచ్చనిపచ్చిక బైళ్ళఁ జొచ్చి స
మ్మతమున మెక్కి తృప్తిపడి ♦ మంచి జలంబులఁ గ్రోలి స్వీయవ
త్సతతులఁ గూడి నిక్కి బల ♦ శౌరుల చుట్టునుముట్టి అంకెలన్
సతతము వేయుచున్ బఖిని ♦ సాగును గిడ్డులు వెండి గిబ్బలున్. ౧౫౭

వ॥ అంత గోపాలకుండగు శ్రీకృష్ణుం డాత్మసఖులం గూడి యమునాతీర విభాసురంబును, దాలహింతాలతమాలప్రవాల రసాల సురసాల నక్తమాలనింబ జంబు జంబీర కపిత్థాశోక పున్నాగ నారికేళ నాగరంగనీప కదంబ కదళ్యాశ్వత్థ బిల్వఖర్జూర భూర్జక్రముక ఖదిర పిచుపిచుల కుందారమందార కోవిదార దేవదారు పలాశప్లక్షాది నానావిధ ఫలవృక్షసమాకీర్ణంబును, మాధవ్యాదిసకల లతాసంభృతంబును, మధురాంబుపూరితనిర్ఝరదరీయుత గోవర్ధనాచలేంద్ర విరాజమానంబును, జతుస్త్రింశదారామపరీవృతంబును, నేత్రపర్వంబును నగు బృందావనంబునం జొచ్చి యచ్చటఁ జెలంగు శుకపికశారికాపారావత కోకిల పుంస్కోకిల కోక మరాళ మయూర మత్తమధులిడాది కలనాదంబుల హాయి నాలించుచుఁ బారిజాత పాటల చంపక హరిచందన కుందసౌరభంబుల నాఘ్రాణించుచు మెడవంచ నక్కఱ లేనియట్లు పెచ్చుపెరిగి యిచ్చను గలిగించు లేపచ్చికబయిళ్ళ నాలం ద్రోలుచు రమణీయంబు లగు సైకతంబులఁ గ్రీడించుచు మధువనంబునను, దాలవనంబునను, దివ్యకామవనంబునను, గుముద్వనమందును, నందీశ్వరాచలప్రాంతస్థవనంబునను, గుళవనంబునను, లతాజాలసంపన్నంబై మహాపుణ్యాకరంబై ఖాండీరోద్యానోపవనంబై దైవాఱు భద్రవనంబునను, లోహార్గళవనంబునను, మఱియుఁ దత్పరిసరస్థితవనోపవనంబులం దెల్లెడలను నేకకాలంబున నొక్కపగిది గోపాలనం బనేకాకృతులం దాల్చి యొనరించుచు సాయంకాల మగుడు నాలను మందగాఁ గూర్చి కేలం బెత్తమును, శీర్షంబునం బింఛంబును, విశాలవక్షంబునఁ దారహారములును వెండియుఁ దత్తదవయవోచితాలంకారంబులు దళతళలాడ రాకాపూర్ణేందుసుందరంబును, నిందిరానందసంధాయకంబును, నగు నగుమోమునం జెలువాఱి బింబంబును, దినావసానాంచితదినమణిబింబంబును, హసియించు శోణవర్ణంబున వెలుంగు నోష్ఠంబులందు సకలాపశబ్దాబ్ధప్రభంజనవంశిని లగించి మించి జగన్మోహనుండై మోహనరాగంబు విరాగులకు సయితం బనురాగంబు గలుగునట్లు బాడుచుఁ

గ్రమ్మఱి గోరజంబు లాకాశంబునం బర్వ నందరాజవ్రజంబునకు వచ్చుచున్న వృత్తాంతంబు గోపకాంత లెఱింగి యాతురంబున. ౧౬౮

తే॥ గృహమునందలి కష్టముల్ ♦ గెంటుటకును, సంతసంబును బొందఁగా ♦ స్వాంతమందు
మఱువరానట్టి కృష్ణుని ♦ మఱలఁజూడ, నెంచి హరియున్న చోటికి ♦ నేగి రంత. ౧౬౯

ఉ॥ సందుల నాలఁ ద్రోలుచును ♦ సాహసికుండయి సింహదృష్టితో
బందుగులున్ దమిన్ గనఁగ ♦ బాలకరీంద్రవిలాసయానుఁడై
యందముచందము న్నలిగి ♦ యట్లిటులన్ దిరుగాడు ముద్దుగో
విందుని నందనందనుని ♦ వీక్షణతృప్తిఁగఁ గాంచి రాసతుల్. ౧౭౦

ఉ॥ ధేనురజోవిరాజితుఁడు ♦ దివ్యఘనద్యుతిభాసురుండు జాం
బూనదతారహార మణి ♦ భూషితుఁడున్ గనకాంబరుండు వం
శీనినదాంచితుండు సర ♦ సీరుహనేత్రుఁడు భాసుఖోరుసం
ధానచణుండు కృష్ణుఁడు స ♦ తంబును మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. ౧౭౧

తే॥ తొలుత శ్రీహరి బుధవార ♦ కలితకార్తి, కసితపక్షాష్టమీతిథిన్ ♦ బసులఁ బ్రోవ
గుదురుటంబట్టి యయ్యది ♦ గోపకాష్ట,మియని బుధులంద్రు గుణసాంద్ర! ♦ మేదినీంద్ర!

చ॥ అమృతముగాఱు మోముగల ♦ యచ్యుతుఁ డొక్క దినంబునందు నే
మమున స్వమిత్రు లన్నయును ♦ మైత్రిని వెన్కనఁ ద్రోలు చల్ల గో
సమజముఁ దాలకాననము ♦ సన్నిధి కేగెను గాని దాని మ
ధ్యమమున ధేనుకుం డనెడి ♦ దానవుఁడుండెఁ బ్రచండశక్తితోన్. ౧౭3

రామకృష్ణులు ధేనుకాసురుని జంపుట.

చ॥ అల హరిమిత్రు లద్దివిని ♦ యందునఁ జేరక పోయి రంతటన్
బలి హరియన్నయైన బల ♦ భద్రుఁడు రౌద్రము సాహసంబునున్
గలుగఁగ దానిలోనికి సు ♦ కంబుగఁ జేరుచుఁ దాలసత్ఫలం
బులఁ గొనుకోర్కి నెల్లెడలఁ ♦ బూర్తిగఁ దిర్గి చెలంగి యొక్కెడన్. ౧౭౪

ఉ॥ నల్లనిపట్టుపుట్టముల ♦ నాణెముగాఁగటిఁ గట్టి తాళ్ళనున్
గొల్లలుగాఁ జెలంగు ఫల ♦ కోటు లిలంబడ రెండు చేతులన్
బెల్లుగఁబట్టి యూపఁ బృథి ♦ వీస్థలి నయ్యవి రాల వానిఁ గొం
చుల్లస మొందఁ బొబ్బిడె ♦ నుర్వి వణంకఁగ గుండె నీరుగాన్. ౧౭౫

ఉ॥ అంతఁ బతత్ఫలారవము ♦ లావనినుండిన కంసమిత్రుఁ డ
త్యంతబలుండు క్రూరుఁడు ఖ ♦ రాకృతియుక్తుఁడు ధేనుకుండు ఘ
స్రాంతరమందు నిద్రిలు మ ♦ హాసురుఁడెంతయు వించు నట్టె లో
కాంతకకోపరూపుఁడయి ♦ యాబలుఁ గన్గొని దువ్వి మీసలన్. ౧౭౬

ఉ॥ చేరుచుఁ బక్షిమూర్తులను ♦ సీరి యెదన్ వడిఁగొట్టి సారెకున్
సారెకు గార్దభస్వనము ♦ సల్పుచుఁ బాఱుచుఁ బైకివచ్చుటల్
సీరియుఁ గాంచి లీల నొక ♦ చే నల దానవపక్షిమూర్తుల
వ్వారిఁగఁబట్టి రోసమునఁ ♦ బాఱఁగ వైచెను దాలశాఖపై. ౧౭౭

చ॥ విసరిన వెంటఁ దత్పృథుల ♦ వృక్షముగూలెను దానిరాపిడిన్
బసచెడి ప్రక్కచెట్టు లిల ♦ పైఁబడ నద్భుతమయ్యె ధేనుకుం
డసమునఁ దిరిగి లేచి హరి ♦ హస్తములం గొని యామడన్ బడన్
విసరె గజంబు లాతికరి ♦ వీఁకను నెట్టినయట్లు భూవరా! ౧౭౮

చ॥ తదుపరి రౌహిణేయుఁ డల ♦ దానవునిం గొని త్రిప్పి భూమిపై
సదమదమొంద బాఁదె నల ♦ సంహతిఁ దద్దనుజుండు శీర్షముం
జదియఁగ సొమ్మసిల్లి త్రుటిఁ ♦ జట్టనఁ గ్రమ్మఱ లేచి చూచి దు
ర్మదపరిపూర్ణమూర్తియయి ♦ మండి మహత్తరతన్మృథంబునన్. ౧౭౯

చ॥ శిరమున నాల్గుకొమ్ములను ♦ సృష్టినొనర్చుచు గోపబాలురన్
బొరిఁబొరిఁ గ్రుమ్మి క్రుమ్మి పలు ♦ పోకలఁ బోయెడు వారిఁ గాంచి స
త్వరగతి డాయుచున్ బొడిచి ♦ బాధలఁ బెట్టుచుఁ గొట్టి చట్టనన్
ధరఁ బడఁ నెట్టఁగాఁ దొడఁగె ♦ ధార్మికవర్య! యనంతరంబునన్. ౧౮౦

తే॥ నైకటికులును హరిసఖుల్♦నయచణులును, దంటలైనసుబలుఁడును, శ్రీ♦దాముఁడింక
స్తోకుఁడును నితరు లాతని♦మండగముకు, గాంచి పరికరంబులఁ గొంచుఁ♦గదలి రంత.

క॥ శ్రీదాముఁడు దండమునన్, బాఁదెను సుబలుండు ముష్టి ♦ వానిని మొట్టెన్
మోఁదెన్ స్తోకుఁడు ద్రాటను, నాదట నంశుండు నతని ♦ నడుగునఁ దన్నెన్.

తే॥ మఱియుఁ దేజస్వినామకో♦ద్ధురబలుండు, రహిని నర్ధచంద్రప్రహా♦రముల శాస్త్ర
చోదితంబగు విధమున♦సలిపి బలిమి, వెంటనంటెను మిక్కిలి♦కంటుతోడ. ౧౮౩

తే॥ అర్జునుండను గోపకుం♦డతనిఁ ద్రోసె, బాదమున విశాలర్షభ♦బలుఁడు గొట్టె
బంతితోడ వరూథపుఁ♦డతిబలమునఁ, దద్దనుజవర్యుఁ బ్రహరించెఁ♦దర్పమున.

క॥ సావాసంబునఁ జేవను, నావెన్నుని మెప్పుగాంచి ♦ యండనుగల యా
దేవప్రస్థుండా దుర్భావాన్వితదైత్యు చెంప ♦ లన్ వాయించెన్. ౧౮౫

చ॥ పదపడిఁ గృష్ణచంద్రుఁడు న ♦ పారబలంబున రెండుచేతులన్
ద్రిదశరిపున్ గ్రహించి సారి ♦ దిన్ బయికెత్తుచు డించి క్రిందికిన్
మద మణఁగంగఁ ద్రిప్పి పలు ♦ మాఱులు నెట్టన గోప్రవర్ధనా
ఖ్యఁదనరు కొండపై విసరె ♦ నంతట ధేనుకదానవేంద్రుఁడున్. ౧౮౬

తే॥ రెండుగడియలు గడఁబట్టి ♦ లేచి మఱల, మేను జాడించుకొని హరి♦మిళితమైన
మోముఁ దుడుచుచుఁ బొగరునఁ♦బూర్ణదీర్ఘ, శృంగములఁ గృష్ణుఁ గైకొని♦నింగిఁ జేరె.

చ॥ తదుపరి లక్షయోజనములు ♦ దాఁటినమీఁదట నాతఁ డందునన్
గదనము గృష్ణుతోఁ సలుపఁ ♦ గా నతఁ డాతని రెండుచేతుల
న్గదియఁగఁబట్టి భూమిపయి ♦ నాడులు చూర్ణముగాఁగ మూర్ఛిలన్
గొదకొని నెట్టె నంత నల ♦ కొంటెయు వెంటనె లేచి కంటునన్. ౧౮౮

ఉ॥ శృంగములన్ హరిన్ బొడిచి ♦ చిత్రతరంబుగ గోప్రవర్ధనో
త్తుంగనగంబు మూలముల ♦ తోడఁ బెకల్చియుఁ గృష్ణునెత్తిపై
ఖంగన వైచెఁ దోడుతనె ♦ కంజదళాక్షుఁడు దానిలాగికొం
చంగుగఁ దిర్గి వానితల ♦ యందునఁ ద్రోసెను ధారుణీశ్వరా ! ౧౮౯

చ॥ మఱల నిశాటుఁ డామల స ♦ మర్ధతఁ గైకొని వేసెఁ గృష్ణుపైఁ
దిరిగి తదబ్జనేత్రుఁ డల ♦ దివ్యగిరిన్ గొని పూర్వరీతిఁగ
ర్బురశిరమందు వైవ నల ♦ పుణ్యజనుండును దిర్గి కిన్కఁ ద
ద్గిరిఁగొని శౌరిపై విసరి ♦ కేకుచు నార్చుచుఁ బాఱె ఱివ్వనన్. ౧౯౦

ఉ॥ హేతిసమస్వశృంగముల ♦ నిద్ధబలున్ బలుఁ గ్రుమ్మి పాదసం
ఘాతములన్ హతిన్ సలపి ♦ కంధులు ఘూర్ణిల సర్వనిర్జరుల్
భీతిల భూమిమండలము ♦ వెట్టె వకావకలై చెలంగఁ బెం
గూతను వేయ నా ముసలి, ♦ కోపపరీతమనస్వియై వెసన్. ౧౯౧

చ॥ గడుసున ధేనుకాసురుని ♦ గట్టిగఁ జేతులఁబట్టి భూమిపైఁ
జెడఁబడఁ గొట్టి సొమ్మసిలఁ ♦ జేసి మఱిన్ గొని వజ్రకల్పమౌ
పిడికిట మొట్ట డమ్మపయె ♦ వేల్పులు నందనజాతపుష్పముల్
దడదడఁ జల్లసాగిరిగ ♦ ధైర్యపరాక్రమసాహసాంచితా ! ౧౯౨

తే॥ మృతకళేబరమందున ♦ మేఘమందు, మెఱపు నరణిని నగ్ని యా ♦ పరునియందు
నఖిలజగములు జనియించు ♦ నట్టు లొకఁడు, వింతగా వెలుదేరి బ ♦ ల్వేడ్కతోడ.

సీ॥ చామనచాయయుఁ ♦ జక్కని పుట్టముల్, పద్మమాలలు సాలఁ ♦ బరఁగుచుండ
వేయిచక్రంబుల ♦ విరవముల్ దగ వేయి, ధ్వజములు మిక్కిలి ♦ భాసిలంగ
బంగరుసొమ్ములు ♦ ప్రభలుమించెడి గొప్ప, రతనముల్ మిక్కిలి ♦ రాజిలంగ
లక్షపార్షదులును ♦ లక్షచామరములుఁ, బదివేలగుఱ్ఱముల్ ♦ వఱలుచుండ

తే॥ దివ్యయోజనవిస్తీర్ణ ♦ దేహమొంది, స్రగ్వియై మనోయాయియై ♦ రౌహిణేయ
హరులకుం బ్రణమిల్లియు ♦ నప్పు డచట, ఘనరథంబెక్కి గోలోక ♦ మునకుఁ జనియె.

ఉ॥ ఈగతి ధేనుకాసురునిఁ ♦ గృష్ణబలుల్ వధియించి తమ్ము నా
గోగణగోపకోత్కర మ ♦ కుంఠితరీతినిఁ బ్రస్తుతింపఁగా
వేగమ వారినిం గలిసి ♦ వేడుక నిండ్లకుఁ జేరసాగిరో
యోగిజనప్రమోదకర ♦ యోగ్యచరిత్ర విభూషితప్రభూ ! ౧౯౫

క॥ నావుడు జనకుం డిటులనె, నోవిబుధా! ధేనుకాఖ్యుఁ ♦ డుత్తమగతి నే
యేవిధిఁ జెందెనొ తొలి జని, లోపిఁ డెవ్వండో దయఁ బ ♦ లుకుమా! తెలియన్.
క॥ అనవుడు నారదముని యిట్లనియెను నో జనకరాజ! ♦ యాదిమజని నీ
దనుజుఁడు జరిపిన వృత్తము, వినుమా! యనుమానమేల? ♦ వినిపింతుఁజుమీ!

ధేనుకాసురపూర్వజన్మ వృత్తాంతము.

చ॥ ఉలిపి విరోచనాసురకు ♦ లోద్భవుఁడున్ బలిపుత్రకుండునై
నలిగ వసించు సాహసిక ♦ నాముకుఁ డీతఁడు గంధమాదనా
చలమున వాసమున్ సలిపి ♦ సమ్మదుఁడై పదివేల లేనుల
న్గలిసి మనోజరంగమున ♦ నాట్యము సల్పెడి కాలమునందునన్. ౧౯౮
ఉ॥ భామల నూపురంబుల ర ♦ వంబుల మ్రోయ, గుహాంతరంబునన్
నేమముతోడ నుండెడి ము ♦ నిప్రవరుండగు దుర్వసుండు స్వీ
యామితయోగభంగుఁడయి ♦ యంఘ్రులఁ బాదుకల్ ధరించి ని
ర్ధూమ కృశానురూపమును ♦ దాఁకొని యష్టినిఁ గేలఁ బట్టియున్. ౧౯౯
క॥ మీసల మెలియం బెట్టుచు, రోసమునన్ వాని డాసి ♦ రూక్షోక్తుల నో
వేసరి! ఖరరూపము నీ, కీసమయము నందునె ఘటి ♦ యించుతఁ బలువా!
తే॥ కానిచో నీవు తపమునఁ ♦ గ్రాలువాని,నన్ను వ్యర్థ నొనర్తువే ♦ నయనములకుఁ
గావరం బెక్కియుండెనే ♦ ఖరనిశాట!, దుర్వసుండని యెఱుఁగవే ♦ త్రొక్కివిడుతు.
క॥ అనవుడు సాహసికుండును, విని తన్ముని పాదములను ♦ వే వ్రాలి నన్
నెనరున నా యపరాధము, లను నోరిచి ప్రోవుమో యి ♦ లావిబుధేంద్రా!
ఉ॥ ఈరహి వేఁడ మౌనివరుఁ ♦ డిట్లనె నాలుగులక్షలేండ్లుగా
భారతవర్షమం దలరు ♦ పావితమాథురమండలస్థిత
శ్రీరమణీయతాళవనిఁ ♦ జెందెడి శౌరిసమేతసీరితోఁ
బోరి నశించి నిక్కముగ ♦ ముక్తిని జెందెద వోరి యాసురా! ౨౦౩
తే॥ అతుల ముక్కోపియైన మ ♦ హాతపస్వి, మరలఁగరుణింప నాదైత్య ♦ వరుఁడుగార్థ
భాకృతిం బొంది ధేనుకా ♦ హ్వాయముఁ దాల్చి, యుక్కరుల లోన మేటియం ♦ చుగ్గడింప.
క॥ తాలవనంబునఁ జేరుచుఁ, గాలంబును గడపుచుండి ♦ కమలాక్షోక్తిన్
నీలాంబరకరముఖమున, నీలిగి యటు ముక్తి జెందె ♦ నిరవద్యవిభూ! ౨౦౫
క॥ హరి స్వయముగఁ జంపమికిన్, వరకారణమేది యనినఁ ♦ బ్రహ్లాదున కో
"వరచరితా! నీకులమే, తరుణమునన్ జంప ననుచు ♦ దయవరమిడుటే"

శ్రీకృష్ణుండు కాళియ మర్దనంబు జేయుట.

చ॥ మఱియొక కాలమందున ర ♦ మా విభుఁడన్నను రామువీడి త
త్సురభులఁ ద్రోలుచున్ జెలుల ♦ తోఁ దగి యట్టి కళిందజా తటం

బరమునఁ జొచ్చెఁ దన్నది వి ♦ షావృతవారుల గ్రోలి వెంటనే
పరవశతన్ బశుల్ వడిమె ♦ త్రావిరి తద్ధరిమిత్రు లద్దరిన్. ౨౦౭

క॥ ఆపుండరీకనేత్రుఁడు, గోపాలక గోగణంబు ♦ గూలుట గని సం
తాపింపక దయఁ బ్రోచెను, నాపోఁడిమి విస్తరింతు ♦ ననఘా వినుమా! ౨౦౮

ఉ॥ ఎప్పుడు మిత్రగోప్రతతు ♦ లేమి యెఱుంగక యందుఁ గూలెనో
యప్పుడు శౌరి వారు గడు ♦ పారఁగ ద్రాగిన వారిలో విషం
బొప్పుటఁ గాంచి పుష్పకుల ♦ నొద్దికఁ గట్టుచు నెక్కి నీపమున్
దెప్పునఁ దత్తరంగిణిఁ ♦ దేఁకున దూఁకె శుభాలునన్ విభూ! ౧౦౯

తే॥ తత్పతనమునఁ దన్నద్యు ♦ దకము గలఁతఁ, బాఱె నల్గడలందునఁ ♦ బర్వె నప్పు
డంబుఁగల కాళియాహిగ్ర ♦ హంబునాఁ, నంబుగాఁ దొడంగెను తల్ప ♦ రంబునందు.

ఆ॥ కాళియోరగుఁడు ♦ గనలుచు వంద భోగముల విప్పి విషముఁ ♦ గ్రక్కియక్క
మలనయను డాసి ♦ యలఘుదంష్ట్రిలతోడఁ, గొఱికి బాహువులను ♦ నెఱిగఁ గప్పె.

ఉ॥ అంత ఘనాఘనాభుఁడు ని ♦ జాపఘనంబు ఘనంబొనర్చి య
త్యంతబలంబుతోడ నల ♦ వ్యాళము కప్పును దుల్చి కేలఁ బు
చ్ఛాంతముఁ బట్టి గిర్రున ♦ నౌర! యహా! యనఁ ద్రిప్పి త్రిప్పి యా
వంతను ద్రొక్కి శాతశత ♦ బాణములన్ బఱపెన్ నరేశ్వరా! ౨౧౨

ఉ॥ ఆనలఁ గాళియుండును భ ♦ యంబును గొల్పుచుఁ దిర్గి రేఁగి యా
శ్రీవిభు వామహస్తముఁ గ ♦ సిన్ గ్రహియించె ననంతరంబునం
దావన జేశుఁ డుండు గుడి ♦ హస్తముతోఁ దనుపీడ దానినిన్
జేవను గొట్టి తార్క్ష్యవలెఁ ♦ జేకొని యేఁచుచుఁ ద్రోసెఁ దన్నదిన్. ౨౧౩

చ॥ పదపడి తద్భుజంగపతి ♦ పంతముతోఁ జనుదెంచి శ్రీరమే
శు దరికి నేగ నా ఘనుఁడు ♦ సూచి రయంబున దాని వాలమున్
విదిలిచి త్రోసి రోసమున ♦ భీమునిశాతశతాశుగంబులన్
గొదకొని నైవ నాతఁడును ♦ గొంకక క్రమ్మఱ నమ్మహాత్మునిన్. ౨౧౪

ఉ॥ దాయుచుఁ గోఱలన్ గఱచి ♦ ధావనమెత్తెడి లోన నట్టి నా
రాయణమూర్తి పూర్ణబల ♦ రాజితుఁడై యల కాళియాహి నా
హా! యనఁ జేతఁ బట్టి తన ♦ యాయతముష్టిని మొట్టె దానిచే
నా యురగంబు తన్నిమిష ♦ మందునఁ దాళక పొంది సొమ్మనున్. ౨౧౫

తే॥ వందమొగములఁ గ్రిందికి ♦ వంచి తనకు, నభిముఖంబుగఁ బడుట బ్ర ♦ హ్మాండనాయ
కుఁడగు హరి గాంచి తన్మణి ♦ కోటిరుచిర, ఫణములం దెక్కి మురళినిఁ ♦ బట్టె నంత.

ఉ॥ నాటకరంగమం దలరు ♦ నర్తకుఁడై వడి వేషమున్ జగ
న్నాటకసూత్రధారి హరి ♦ నవ్యవిధంబునఁ దాల్చి సుస్వరం,

బాట, లయల్ సెలంగ విబు ♦ ధావళి మెచ్చుచుఁ బుష్పవర్షమే
లోటును లేనటుల్ గురియ ♦ లోలుభతన్ గడుఁ బాడ వంశితోన్. ౨౧౭

ఉ॥ వెండియు మాధవుం డటుల ♦ వేడుక గానము సేయుపట్టునన్
దాండవసన్మహోత్సవగ ♦ తత్ప్రతిభాఢ్యమహానటాభుఁడై
దండి లయాదియుక్తగతిఁ ♦ దద్దఁ బదంబుల వేసి భోగముల్
జెండఁ గడంగ నచ్చిలువ ♦ చెల్వలు వల్వల నశ్రు లొత్తుచున్. ౨౧౮

కాళియపత్నులు శ్రీకృష్ణుని నుతించుట.

క॥ చని యల హరిపదములఁబడి, వినవే చెవియొగ్గి మాదు ♦ విన్నపము దయన్
గనవే చల్లని చూపునఁ, గొనవే మావందనముల ♦ గోపాలమణీ! ౨౧౯

క॥ విన్నారము నీ మహిమముఁ, గన్నారము గన్నులారఁ ♦ గరుణాభరణా!
యున్నారము నీ కృపకై, యన్నారము మమ్ముఁ గావు ♦ మని జగదీశా! ౨౨౦

క॥ ఘననిభ! యభయశుభప్రద!, వనమాలీ! కనకచేల! ♦ వంశీలోలా!
వనజాతపత్రలోచన!, వనజాసనమదనజనక! ♦ వననిధిశయనా! ౨౨౧

ఉ॥ జిష్ణుముఖామరప్రతతి ♦ సేవ్యపదాంబుజ! యంబుజోదరా!
జిష్ణుముఖస్వబంధుహిత ♦ శేఖరపోషక! కౌస్తుభాదిరో
చిష్ణు! యలంకరిష్ణు! బహు ♦ చిత్రచరిత్రమనోజ్ఞ! ప్రాజ్ఞ! శ్రీ
కృష్ణ! కృపామతిం గనవె ♦ యీవిఁకఁ బ్రోవవె మమ్ము మా పతిన్. ౨౨౨

ఉ॥ చూచితి మాత్రిలోకములఁ, ♦ జూచితి మేదుసముద్రము, ల్మరిన్
జూచితి మేదుకొండలను ♦ జూచితి మెల్ల ధునీవతంసముల్,
జూచితి మెల్లచోట్ల, జిత ♦ సూర్యశశిద్యుతి! నీవు దప్ప నే
ర్పొ్రిచెడివారు లేరు సుమి ♦ ప్రోవుమ! మా పతియైన కాళియున్. ౨౨౩

క॥ పతిభిక్ష మాకుఁ బెట్టుచు, ద్రుతమున రక్షింపుమయ్య ♦ ద్రుహిణాండసమా
హితవిపులోదర! యని సంస్తుతిఁ జేసిరి కాళియుందు ♦ సూచి నతుండై. ౨౨౪

క॥ దీనజనావనతత్పర!, నానెరసు క్షమించి రక్ష ♦ ణము సేయుమ! రా
ధానాయక! యని వేఁడఁగ, నా నలినాక్షుండు వల్కె ♦ ననుకంప నిటుల్.

తే॥ కాళియాహ్వాయభోగీంద్ర! ♦ కౌతుకమున, మిత్రపుత్రకళత్రస ♦ మేతుఁడవయి
లెమ్ము రమణకద్వీపంబుఁ ♦ బొమ్ము నీకు, నెట్టిలోపంబు లేదని ♦ యెఱుఁగు మందు.

ఉ॥ తత్పతగేంద్రబాధ లటఁ ♦ దప్పక కల్గునటంచు నెంచెదో
తత్పరితాపమొందకుము ♦ తద్బలి, త్వద్వనితాస్తవోల్లస
న్మత్పదపద్మలాంఛనస ♦ మంచితమంచుఁ దలంచి మెచ్చి యా
పత్పథమందుఁ ద్రోయఁడని ♦ భావమునందున నమ్ముమో ఫణీ! ౨౨౭

ఉ॥ అంతటఁ గాళియోరగము ♦ నా హరికిన్ గిడిగిళ్ళొనర్చి వే
కాంత, స్వబంధువుల్ మొదలు ♦ గాఁ గలవారలఁగూడి యల్ల ద్వీ
పాంతరమొందె నంత ఫణి ♦ యందు ముకుందుఁడు సిక్కికొన్న వృ
త్తాంతము విన్న నందముఖ ♦ తద్వ్రజవాసులు సర్వు లాదటన్. ౨౨౮

వ॥ తద్బాలకృష్ణుం డున్న ప్రదేశంబున కరిగి తద్యమునాతరంగిణీ నిర్గతుండై యద్దరిపైఁ బెద్దనిద్దురవోయిన చెలికాండ్రను లేపి ముద్దుమొగమునం జెఱుఁగవొప్ప నవ్వారితోఁ గూడి ముచ్చటాడుచు వచ్చెడి నచ్చిన్ని వెన్నునిం గన్నులపండువగాఁ గాంచి హర్షించి కౌఁగిలించి చుంబించికొనిరి. వెండియు నందుండును, దత్సుందరియుఁ, దమ నందనున కభయశుభవిభవంబులు లాభింపఁ బరమానందంబుతో భూబృందారకబృందంబునకు వందనపూర్వకంబుగా ననేకదానంబు లొనర్చిరి. అంత నిజవక్షోజంబులం దక్షీణంబుగా క్షీరంబు స్రవింప యశోదాదేవియు. ౨౨౯

చ॥ హరిఁ గొని ముద్దువెట్టుకొని ♦ హర్షముఁ బొందెను నెల్లవ్రేలు, వ
య్యర గడుహాయిగా విసర ♦ నక్కలిఁదీర్చుకొనంగఁ దన్నదీ
పరిసరమందుఁ దామసిని ♦ బాగుగ నిద్దుర వోవ సాగిరా
త్మరమణులున్ సుతుల్, సఖులు, ♦ దమ్ములునుజుట్టి శయింప నంతటన్. ౨౩౦

శ్రీకృష్ణుండు దావాగ్నిపానం బొనర్చుట.

చ॥ నడినిసి వేణుఘర్షణము ♦ నన్ జనియించిన కారుచిచ్చు బ
ల్వడిఁ బ్రళయాగ్నితుల్యమయి ♦ పండిన గోపకులన్ దహింప రా
నడలుచుఁ జూచి వారలు ని ♦ రాశ్రయులై బలరామయుక్త కృ
ష్ణుఁడుగల చోటి కేగి పలు ♦ జోతములం బొనరించి భక్తితోన్. ౨౩౧

తే॥ కృష్ణ! శ్రీకృష్ణ! మమ్ములఁ ♦ దృష్టితోడఁ, గావుమియ్యదె కార్చిచ్చు ♦ కనులుమిఱులు
సెందునట్టుల వచ్చెడిఁ ♦ బొందు లివిగొ, పోవుచున్నవి దేవరా ♦ ప్రోవవయ్య!

చ॥ అనఁగ సరోజలోచనుఁ డ ♦ ఘావళితూలధనంజయుండు జి
ఘ్నుఁడు బరాత్పరుండు నరి ♦ దారణధీరుఁ డుదారుఁడాదితే
యనుతుఁడు నైన కృష్ణుఁడు త ♦ దార్తులఁ గన్గొని గోపులార! యిం
కను భయమొందఁబోకుఁ డిది ♦ గ్రచ్చఱ నార్పెద మూయుఁడీ కనుల్. ౨౩౩

తే॥ అనుచుఁ గ్రమముగ దాయు దా ♦ వాగ్నినోట, మ్రింగెనం దాదిగోపకుల్ ♦ మిగులవింత
నొంది ప్రొద్దున మేల్కాంచి ♦ యూరికేగ, సాగిరో మిథిలేశ్వర! ♦ జనకరాజ!

క॥ అని వచియింపఁగ ఱేఁడును, విని వింతలఁబొంది మరల ♦ విన నుత్సాహం
బును జూపుచు నారదముని, ఘనునకు వాక్రువ్వఁదొడఁగెఁ ♦ గౌతుకమతితోన్.

చ॥ ఎవనిపదాబ్జయుగ్మరజ ♦ మీపదునాల్గు జగంబులందు జ్ఞా
నవిభవవృద్ధులెన్నొ జన ♦ నంబుల నెత్తియుఁ జెందలేక మా

న విరతులైరో యట్టి చర ♦ ణంబులె యుత్తలోఁ గాళియాహిపై
నివెలిఁగెఁ జూడఁ దత్క్రియలు ♦ నివ్వెఱపాటును గల్గఁజేయవే ? ౨౩౯

క॥ ఈయురగేంద్రుఁడు ప్రాజ్ఞని, నే యేరీతులఁ జెలంగె ♦ నెఱిఁగింపుము ధీ
రా ! యన నామునియాతఁడు, స్వాయంభువ కాలగ భృగు ♦ వంశభవుండై.

తే॥ వేదశిరుఁడను పేరొంది ♦ పెరిగి వింధ్య, యనెడి పర్వతరాజంబు ♦ నందు నెక్కి
నిశ్చలంబుగఁ దపమును ♦ నియతితోడ, జనులు లేనట్టి చోటున ♦ సల్పుతఱిని.

కాకభుశుండిముని కథ.

ఆ॥ తపముఁ జేయ నెక్క ♦ తలిసి యశ్వశిరోహ్వ,యుండునట్టి వింధ్య ♦ యుచితమంచు
నెంచి యేగుదెంచ ♦ నెక్కతంబుననొ ప్ప, వక సమేతుణములఁ ♦ బలిపి నెఱిఁగ.

చ॥ తపమును జేయఁగా నిచటఁ ♦ దావు ఘటిల్లదు హాయిలేదు నా
దుపలుకులన్ గ్రహించి చను ♦ తోడ్తనె వేఱుస్థలంబు మీబృహ
త్తపమునకై కనుంగొనుము ♦ తర్లుము నిల్వకు మిం దనంగ నా
తపసియు నిట్లు వాకొనియెఁ ♦ దావకృశానుసమాననేత్రుఁడై. ౨౪౦

చ॥ ఇది పరమేశుభూమిగద ♦ యెవ్వరిపెత్తన మేమిలేదె యిం
దిదివఱ కెందఱో మును ల ♦ హీనతపం బొనరింపరే ? యిటన్
గుదిరి తపంబు నే సలుపు ♦ కోర్కిని వచ్చితి నింతమాత్రకే
పదరుచు నాపయిన్ బుసలఁ ♦ బర్వెడి సర్పముమాడ్కి వత్తువే ? ౨౪౧

ఉ॥ వచ్చితి వక్కతంబున సు ♦ పర్ణభయంబు ఘటింపఁ బామవై
క్రచ్చఱఁబొమ్ము పిమ్మట న ♦ ఖండుఁడు వేదశిరుండు ధూర్త ! నీ
యిచ్చ దురాశయప్రచుర ♦ [illegible]ంచుక తప్పన కింతఁ జేసెదే ?
చొచ్చి క్రియార్థివైయిచట ♦ సూటులఁ బోటుల మాటలాడెదే ? ౨౪౨

ఉ॥ కావునఁ గావుకావనెడి ♦ కాకివి గమ్మనె నంత నిద్దరున్
జేవ చెడన్ వెతన్ బడుచు ♦ శ్రీహరి దిక్కని నమ్మియుండ రా
థావిభుఁ డేగుదెంచి యల ♦ తాపసులన్ గని ప్రీతిపూర్వకో
క్త్యావళి నూఱడించి ముద ♦ మందఁగ నిర్వర కిట్లు వాకొనెన్. ౨౪౩

ఉ॥ ఏమి పరస్పరం బిటుల ♦ నిప్పుడు శాపము లిచ్చుకొంటి రా
హా ! మితిమీఱు కోపమును ♦ నందుట మానుల కర్హ మొక్కొ ? మీ
రీమెయి శాంతిఁ బొందుఁడిఁక ♦ నిర్వురు మత్ప్రియభక్తులౌట మీ
క్షేమముఁ గోరి వచ్చితిని ♦ జెప్పెడి నానుడు లాలకింపుఁడీ ! ౨౪౪

ఉ॥ నానుడి రిత్తసేయు యత ♦ నంబును జేసెదఁ గాని భక్తసం
తానవచస్సమూహ మన్య ♦ తంబుగ సల్పను నిద్ది నాప్రతి

జ్ఞానియమంబు వేదశిర ♦ సా ! యటులైనను నీశిరంబునన్
బూనిక మత్పదంబులిడి ♦ ముక్తుని జేసెదఁ దార్క్ష్యభీతి పోన్. ౨౪౫

ఉ॥ ఆకుల నొందఁబోకు మిఁక ♦ నశ్వశిరా ! వినుమయ్య ! నానుడుల్
గాకత నీవు సెందినను ♦ గారుణికంబున జ్ఞానమిత్తుఁ ద
త్కాకవికారకార్యములు ♦ గ్రాలవు నీయెడ నయ్యెడన్ మహా
ప్రాకట శుద్ధమత్తులిని ♦ రాజిల నుందువు నిత్యవంబుసూ. ౨౪౬

తే॥ ఇట్లు కరుణించి శ్రీహరి ♦ యేగె నవల, నశ్వశిరుఁడు నీలాద్రిని ♦ నాత్మఘోష
మగుచు జ్ఞానియై రామభ ♦ క్త్యంచితుఁడయి, శ్రద్ధ రామాయణంబును ♦ జదువుచుండి.

ఆ॥ గరుడుఁ డొక్కయెడను ♦ గాంక్షింపఁ దత్పూర్వ, పుస్తకస్థతత్వ ♦ మును వచించి
తపముఁ జేయసాగెఁ ♦ దా దాత్మ్యభావంబు, తోడ జనకరాజ ! ♦ త్రోసి చింత. ౨౪౭

కాళియ వ్యాలోపాఖ్యానము.

తే॥ ఇఁకను వేదశిరోవార్త ♦ నీవు వినుము, రహిని జాక్షుషమన్వంత ♦ రంబునందు
నల్ల దక్షప్రజాపతి ♦ యాత్మసుతలఁ, బదునొకండ్రను దక్షకశ్య ♦ పమునికిచ్చె.

తే॥ అల్లవ్రజమందు వసుదేవు ♦ నాలియగుచు, హాలినిఁ గనినట్టి రోహిణి, ♦ యట్టిసతుల
యందునన్ గద్రువ యనంగ ♦ నలరి కోట్లు, కొలఁదిఁ జిలువలన్ గాంచెను ♦ గోర్కెదీర.

ఆ॥ అట్టి కాద్రవేయు ♦ లందు హాలాహల, కలితములును రత్న ♦ లలితములును
నమలపంచశతఫ ♦ ణాంచితములునైన, పన్నగములు కొన్ని ♦ వఱలు మఱియు.

తే॥ విషధరములును శతఫణా ♦ న్వితములు మణి, గణమనోజ్ఞములైన నా ♦ గములు గొన్ని
గలవు తద్వేదశిరసుఁ డీ ♦ చిలువలందుఁ, గాళియాఖ్యను మేటియై ♦ క్రాలె నవల.

ఆ॥ ఎల్లసర్పములకు ♦ నల్లశేషుఁడు నాథుఁ, డయ్యె నతఁడె యచ్యు ♦ తాగ్రజుఁడన
రాముఁడనఁగ రోహి ♦ ణీమహిళన్ బుట్టె, వెండి యింతకుఁ దొలి ♦ విషయము విను.

చ॥ ఒకసమయంబునందునఁ బ ♦ యోరుహనాభుఁడు పద్మనేత్రుఁడున్
బ్రకృతిపరుండు విష్ణుఁ డల ♦ పన్నగనాథునిఁ గాంచి యిట్లనెన్
సకలజనోపకారముగ ♦ సర్వజగత్ప్రథుభారమున్ దల
న్నికమక లేక మోయుటకు ♦ నీవె సమర్థుఁడవో ఫణీశ్వరా ! ౨౫౪

తే॥ నీవు దప్పిన వేఱువా ♦ రెందులేరు, కాన నాయాజ్ఞ నిది మోయఁ ♦ గడఁగుమయ్య !
యంతులేనట్టి బలము నీ ♦ కలరుటను న,నంతుఁడను పేరుగల్గె ఫ ♦ ణాధరేంద్ర !

చ॥ అనవుడు శేషుఁ డిట్లనియె ♦ నచ్యుత ! నాకిది సంకటంబె యై
నను భవదాజ్ఞ భూభరము ♦ నా తలఁ దాలుతుఁగాని యెంతదాఁ
కనో మొటు మోయుసాని; యది ♦ యంతయుఁ బూసను గ్రుచ్చునట్లుగాఁ
గనికర ముంచి నాకుఁ బలు ♦ కన్ నిను వేఁడెద లోకనాయకా ! ౨౫౬

ఉ॥ అంత ననంతశాయియు న ♦ నంతఫణీశ్వర ! నీవచస్సులన్
జింత దొలంగె సంతసముఁ ♦ జెందితి నీవిఁక మద్గుణంబు ల
త్యంతముఁ దెల్పు పేరుల స ♦ హస్రముఖంబుల వేయివేయిగా
సంతత ముచ్చరించుచు ర ♦ సాధరముల్ దల మోయుచుండుమా ! ౩౫౭

క॥ ఎప్పుడు నానామములున్, జప్పగనై పోవునో ర ♦ సాధరము న్నీ
వప్పుడు వీడుము శేషా !, యొప్పును నీకదియ నాకు ♦ నూరీకృతమా. ౩౫౮

వ॥ అంత శేషుం డురరీకరించి తిరిగి శ్రీహరి కిట్లనియె. ౩౫౯

క॥ ఆధేయంబుల కెల్లను, నాధారుఁడ నగుదుఁగాని ♦ యాధారుఁడనా
నా ధురమున కేధీరుం, డాధారుండగు వచింప ♦ వయ్య రమేశా ! ౩౬౦

ఉ॥ నాపుడు దేవకీసుతుఁడు ♦ నాగకులేశ్వర ! నేను కూర్మమై
చేవను నిన్ను మోసెదను ♦ జెందకు మిందున సందియంబులన్
గావునఁ బొమ్మటంచుఁ బలు ♦ కన్ భుజగేంద్రుఁడు లేచి భక్తితో
శ్రీవిభు ప్రొక్కి పూజల వి ♦ శేషముగాఁ బొనరించి వెంటనే. ౩౬౧

తే॥ లక్షయోజనములక్రింద ♦ లలిని వెలుఁగుచుండు పాతాళలోకంబు ♦ నొంది బహుళ
భువనమండలభారంబుఁ ♦ బూనిచేతఁ, దలను బెట్టుకొనెన్ జండ ♦ బలముతోడ.

తే॥ ఆదిశేషుఁడు పాతాళ ♦ మరిగినపుడు, సర్పఫణులును జనుదెంచి ♦ సత్వరగతి
బ్రహ్మయాజ్ఞను సేవించి ♦ భక్తితోడఁ, దత్ఫణీంద్రాజ్ఞఁ గొనియోలిఁ ♦ దరలి యచట

వ॥ కొన్ని యతలంబునకుఁ గొన్ని వితలంబునకునుఁ గొన్ని సుతలంబునకును గొన్నితలాతలంబునకుం గొన్ని పాతాళంబునకుం గొన్ని రసాతలంబునకుం జనె. అందు రసాతలమందునుండు రమణకద్వీపంబా కాళియాదివ్యాళంబుల కునికిపట్టుగాఁ జెలంగుఁగాదె. వెండియు నేమి వినవలతువో తెల్పుమన నా బహులాశ్వుండు మునీశ్వరా ! ఇతరసర్పంబులకు లేని భీతి యా రసాతలాంతర్భూతరమణకద్వీపస్థిత కాళియదీర్ఘపృష్ఠంబున కేల గలిగెనో యానతిండనివేఁడ దేవమునీంద్రుం డా రాజేంద్రునితో నిట్లనియె. ౩౬౨

క॥ గరుడుం డల ద్వీపమునన్, విరివిగ ఫణులుండు నంచు ♦ విని చని కని యా
యురగంబులఁ బ్రతిదినమును, గరుణను విడి కుడువఁ దొడఁగెఁ ♦ గడుపార సుధీ !

తే॥ స్వార్థపరుఁడయి యటు దమ్ముఁ ♦ జంపుచుంటఁ
గాంచి యచ్చటి యెల్ల నా ♦ గములు గుమిగఁ
జేరి యోచించి యాతని ♦ చెంతకేగి
వందనములను గావించి ♦ భయముతోడ. ౩౬౩

మ॥ గరుడా ! గాలిని మేసి మూలల నెటో ♦ కాల్గన్న మమ్మిట్లు త
త్కరుణాసాగరపద్మనాభరథముల్ ♦ ద్వన్మాతృభక్తుండవున్

వరకాయుండను పక్షినాథుఁడవునై ♦ బాధించుటల్ నీకుఁ బెం
బరువా? పాడియ? పగ్గెయా? సుకృతమా? ♦ పల్కంగదే ధీనిధీ! ౨౬౮

తే॥ స్వార్థపరత మీబోఁటి ధీ♦శాలురకును, నున్నచో నెల్లలోకంబు♦లొక్కసారి
ధ్వంసమైపోవె కావవే!♦పరమకరుణ, నక్కరణిఁ గానిచో విను♦మొక్కమాట.

చ॥ ప్రతిదినమిట్లు మమ్ములను ♦ బట్టి గ్రసింపకయున్న, మేము స
మ్మతిఁ బ్రతిమాసమందునను ♦ మాంసవనస్పతిశోణితాన్నసం
యుతముగ నొక్కసర్పమును ♦ నున్కుల చాలుగ మీకు నిత్తు మీ
వితమున నొప్పి ప్రోవుమని ♦ వేఁడఁగఁ దార్క్ష్యుఁడు వల్కె నిట్టులన్, ౨౬౯

ఉ॥ ఒప్పితిఁ గాన మీరలిఁక ♦ నున్కులచాలుగ మాసమాసమున్
సప్పముఁ గొంచు నాకడకుఁ ♦ జక్కఁగ వచ్చిన లెస్సయౌ; మఱిన్
దప్పిన నష్టపూర్తికయి ♦ నామది నచ్చినయట్లు మిమ్ము నే
నుప్పన చప్పునల్ గనక ♦ యూరక మెక్కెద నంచు నమ్ముఁడీ! ౨౭౦

తే॥ ఇట్టి తీర్మాన ముభయులు ♦ నేర్పడంగఁ, జేసికొని రంత ఫణులును ♦ జెప్పినట్టు
లిండ్లచాలుగ బలులిడు ♦ చెదల వెఱపు, విడిచియుండిరి పిమ్మట ♦ వినుము భూప!

తే॥ క్రమముగా నిండ్లవరుసను ♦ గాళియాహి, సద్మమున కట్టియేర్పాటు ♦ సంభవింప
నతఁడు దా మేటి యనినిక్కు♦చందలివల, బలినిఁగొని యేగకుండె నా♦పట్టునందు.

మ॥ వినతాపుత్రకుఁ డట్టి గొప్పబలికై ♦ వీక్షించి వీక్షించి గ్ర
క్కునఁ గాలోగ్రసమానుఁడై యరిగి త ♦ త్కుంభీనసశ్రేష్ఠుపై
ఘనపాదంబులు సంచలించు నటులన్ ♦ గాపించె నద్దానికా
యనిలాహారి సహింపలేక పడి మూ ♦ ర్ఛాక్రాంతుఁడై క్రమ్మఱన్. ౨౭౩

చ॥ తెలివిని లేచి బుస్సలను ♦ దీక్ష్ణవిధంబునఁ గొట్టి నాల్కలన్
బులుఁగులతేని నాకి తన ♦ భోగశతంబును విప్పి కోఱలన్
బలుమఱుఁ గంటుతోఁ గఱవఁ ♦ బక్షివిభుండును దానిఁబట్టి తె
క్కలఁగడు బాఁది తుండమునఁ ♦ గైకొని మేదిని మోఁదె భూధవా! ౨౭౪

చ॥ బరువడిఁ గాళియోరగము ♦ పట్టఁగరాని మహాగ్రహంబునన్
గరుడుని నిట్లటుల్ గవిసి ♦ కాననికైవడి తార్క్ష్య నాసికన్
ద్వరగతితోడఁ దప్పుకొని ♦ తత్పదయుగ్మము నట్టె చుట్టుచున్
బోరిఁబోరిఁ బీకి క్ష్వేళమును ♦ మోములఁ గార్చుచు లాగె ఱెక్కలన్. ౨౭౫

ఆ॥ అపుడు గరుడి ఱెక్క ♦ లంపు మయూరక, నీలకంఠములును ♦ నోలిఁ బుట్టె
నాశ్వయుజమునందు ♦ నాదిపక్షదశమి, వాని దర్శనంబు ♦ భద్రకరము.

ఉ॥ పిమ్మట వైనతేయుఁ డతి ♦ భీకరలోచనుఁడౌచుఁ దీక్ష్ణతుం
డమ్మునఁ గాళియున్ గొని త ♦ టాలున నేలను గూలఁగొట్టి దే

హామ్మును జీల్పఁబూను తఱి ♦ నాఫణి గన్గొని యాగనంచుఁ బా
దమ్ము గొలందిఁ బాఱె నల ♦ తార్క్ష్యుఁడు సైతము వెంటనంటఁగాన్. ౨౭౭

చ॥ క్రమముగ నాపృదాకు వటు ♦ ఖండము లేడును గొప్పవైన గ్రా
మములను సాగరంబులను ♦ వాఁకల దీవుల దివ్యసప్త లో
కములను జొచ్చి చొచ్చి యటఁ ♦ గ్రాలెడివారల వేఁడివేఁడి పృ
ష్ఠమున ఖగేశ్వరుం డగుప ♦ డంగ భయంబును బొంది టక్కునన్. ౨౭౮

చ॥ మరల నభోజగంబున క ♦ మందగతిన్ జని యేరిఁ గోరినన్
హరి భయ మిందుఁ గల్గునని ♦ యందఱు నూరకయుంటఁ గాంచి యా
పరముఁడు దేవవంద్యుఁడును ♦ వ్యాళవిభుండును నైన శేషు డ
గ్గరి వినుతించి మ్రొక్కి తమిఁ ♦ గద్గదవాణిని వేఁడె నిట్టులన్. ౨౭౯

ఉ॥ దోషమదేభకేసరివి ♦ తోయజలోచనశయ్య వుర్వి సం
తోషకృతిప్రవీణుఁడవు ♦ ఘాతవిరోధివి సర్పరాజ వో
శేష! ఖగేశ్వరుం డిపుడు ♦ చెండఁగ వచ్చెడిఁ గాళియాఖ్య న
న్బోషణ మెంతయున్ సలిపి ♦ పుణ్యముఁ గైకొను మో కృపానిధీ! ౨౮౦

మ॥ అని ప్రార్థింపఁగ శేషుఁ డిట్లనియె నో ♦ వ్యాళేశ్వరా! నానుడుల్
వినుమా యిచ్చటఁ జుట్టుప్రక్కలను ని ♦ న్బ్రోతున్ విడన్ బ్రోవఁగా
మొనకాండ్రెవ్వరు లేరటంచు మదిలో ♦ ముమ్మాటికి న్నమ్ము మై
నను నీపై నిదయున్ రహస్యమగు స్థా ♦ నంబున్ వచింతున్ జుమీ! ౨౮౧

తే॥ మునుపు సౌభరియను ముని ♦ ఘనుఁ డొకండు
యమునదరినున్న బృందావ ♦ నాంతరమున
నయుతవత్సరముల్ దాఁటు ♦ నటులఁ దపము
జలమునందున నిలుచుండి ♦ సలుపుచుండె. ౨౮౨

ఉ॥ ఆతఱి నజ్జలంబుల ఝ ♦ షాధిపచర్యను గాంచి మౌని సం
ప్రీతిని బొంది డెందమునఁ ♦ బెల్లు గృహస్థ్యపుహాయాళుఁ డౌచు మాం
ధాతృసుతాశతంబును య ♦ థావిధిఁ జేకొని శ్రీశసద్దయన్
భూతినిఁ బొంది మామ ముద ♦ ముం గన హాయిగ నుండె వారితోన్. ౨౮౩

ఆ॥ అంతఁ గొంతకాల ♦ మగుడు తత్సౌభరి, మౌనివర్యుఁ డచల ♦ మానసమునఁ
దపముఁ జేయఁదలఁచి ♦ తద్యమునాశైవ, లినికిఁ బోయి దాని ♦ వనమునందు.

చ॥ తపనునిఁబోలి తేజమునఁ ♦ దద్భవబంధవిముక్తికోసమై
తపమొనరింపఁగా నిలిచి ♦ తత్ఖగనాథుఁడు స్వచ్ఛదంబులన్
దపతపకొట్టకుండఁ దన ♦ దాఁపున వ్రాలి చరించు సర్వమీ
నపతిని మ్రింగుటన్ ఝషగ ♦ ణంబులు దానికిఁ గుందుచుండుటన్. ౨౮౪

చ॥ కని కడుఁ గ్రుద్ధుఁడై విహగ ♦ కాంతునిఁ గన్గొని యోరిధూర్త! వా
రినిఁ గసవుఁ గ్రసించి పర ♦ రీతుల జోలికిఁబోని మీనవా
ఘుని వృథ మ్రింగియుంటి విది ♦ దూష్యముగాదొకొ? హింస శంసయే?
చనుమిఁక దీని మెట్టితివొ ♦ చచ్చెదవంచు శపించె నందునన్. ౨౮౬

చ॥ గరుడుఁడు సొచ్చనేరఁ డటఁ ♦ గావునఁ గాళియనాగ! నీవు స
త్వరగతితోడ సార్థసుత ♦ భార్యుఁడవై చని తత్కళిందజాం
తరమున నుండుమా పిదపఁ ♦ దత్ఫణి, యా రహిఁ ధైర్యమొప్పఁగా
నరవడిఁ బోయి తద్వ్యమున ♦ నున్కి నొనర్చె విదేహనాయకా! ౨౮౭

ఆ॥ ఇటులఁ గాళియుఁడు ఖ ♦ గేంద్రున కాడిన, పలుకు నంగవించి ♦ భయమెకాక
ప్రాణవిశయమొందెఁ ♦ బరికింప "సత్యమే, వజయతి"యను పల్కు ♦ వట్టిదగునె?

తే॥ అంత కృష్ణుఁడు యమునాప ♦ గాంతికంబుఁ, జొచ్చినప్పుడు తద్దంద ♦ శూకమదము
నుడిపి కరుణించి యాదీవి ♦ నడలులేని, వరమొసంగుచుఁ గ్రమ్మఱ ♦ బనిపె జనక!

క॥ కాలియమర్దన కథయిది, పాలసులే న్వినిన మిగులఁ ♦ బావనులై గో
పాలునిఁ జూతురు మఱి భూపాలక! నీవేమి వినఁగ ♦ వలతువొ చెపుమా!

చ॥ అటుపయి భూపుఁ డిట్లనె సు ♦ రాళి సుధన్ గడుపారఁ గ్రోలియున్
జటులవిలాసలోలలగు ♦ చానల మోవినిఁ గోరునట్లు ము
చ్చటగల తేంట్లు మత్తకరి ♦ సంతతి దానముఁ ద్రాగి పద్మమె
చ్చటయని కోరుమాడ్కి హరి ♦ సత్కథఁ గోరరె? భక్తులో మునీ! ౨౯౧

ఉ॥ కావున శ్రీరమావిభుని ♦ గాథల నింకొక గాథఁ దెల్పవే?
యీవఱ కీరు రాధయను ♦ నింతి దమిన్ శిశువున్ బరేశుఁడా
దేవకినందనుం గొని శ్రు ♦ తిస్థితపద్ధతిఁ బెండ్లియాడి బృం
దావనిలో విహారమును ♦ దద్దయు నొంటిగఁ జేయ వెంటనే. ౨౯౨

చ॥ హరి, దమి నామెతో విడువు ♦ మూర్తి భవిష్యమునందు నీకు నే
వరునిగనుండి రాసములఁ ♦ బల్మఱు నర్తనటంచుఁ బల్కె నం
చరుసముతో వచించితివె? ♦ యావిషయంబుల నానుపూర్విగాఁ
గరముగ నిప్డు సెప్పవె? య ♦ కారణకారణికత్వ మేర్పడన్. ౨౯౩

శ్రీరాధాకృష్ణ ప్రీతి వర్ణనము.

చ॥ అనవుడు నారదుండు మిథి ♦ లావని నాథున కిట్లు వాకొనెన్
జనకనరేంద్ర! ప్రశ్న బహు ♦ సమ్మతమై శుభదంబు నయ్యెడిన్
ఘనము త్రిలోకదుర్లభము ♦ గాదె రమాదయితామనోభిరా
మునికత నీవు విన్ముమన ♦ ముం బెఱపోకలఁ బోవనీకయే. ౨౯౪

మ॥ జలజాక్షుం డొకనాఁడు బింబతులితో ♦ ష్ఠం బందు నందంబుగాఁ
గలనాదాంచితవంశినిం జొనిపి సం ♦ గాతంబుతోఁ దిర్గు నె
చ్చెలులన్ గూడుచుఁ బాడుచున్ నగుచు గో ♦ శ్రేణిన్ దమిన్ ద్రోలు చా
జలజాతాప్తసుతాతటిన్ జనె విరా ♦ జన్మూర్తి కామ్యుండనన్. ౨౯౭

తే॥ అతఁడుపోయిన బాటల♦నలరు జనప, దముల వృషభానుపురమునఁ♦దద్దవెలుఁగు
వెలఁదు లందఱు దమిఁబొంది♦విరిసెనంది, తాళఁజాలక నేలపై♦ద్రావి రయ్య.

ఆ॥ అట్టి నందసుతుని ♦ యాకృతిప్రతిభాది, విషయములను సరిగ ♦ వినిన కనిన
రాధ నెచ్చెలులును ♦ రమణీయగాత్రలు, నగు విశాఖ లలిత ♦ లాతురమున.

చ॥ చిలుకల ముద్దుపల్కులును ♦ జిందముచందము మీఱునట్టి ద
మ్ములకెనయైన కన్గవయు ♦ బున్నసుధాకరతుల్యవక్త్రముల్
దళతళలాడు మించువలెఁ ♦ దద్దవెలింగెడి మేను బెళ్కుకు
లుకులుగల రాధికాంగనను ♦ గొంకక చేరి వచించి రిట్టులన్. ౨౯౮

మ॥ నవలామిన్నరో! మానుడుల్ వినుము వి ♦ న్నాణంబుగా నేఁడు త
న్నవలీలారతుఁడైన కృష్ణుఁడు దివా ♦ నాథాత్మజాతీరమున్
నవకందర్పుఁ డనంగ సాగి మురళీ ♦ నాదంబు వోల్పార ధే
నువృషశ్రేణులఁ ద్రోలుచున్ జనె నిటే ♦ నోరూరఁగాఁ జూపఱుల్. ౨౯౯

ఉ॥ తేఁటులదాఁటు నెక్కురులు ♦ దేనియలొల్కెడి మోవి బంగరున్
మీఱెడి వల్వ లజ్జముల ♦ మించు కనుంగవ నిండుచందురున్
మాఱెడి నవ్వునెమ్మొగము ♦ మల్లియమొగ్గలగేరు దంతముల్
వాటపు చూపులున్ గలిగి ♦ వాఁడలరుం గద! ముద్దుగుమ్మరో! ౩౦౦

సీ॥ ముఖముఁ జూపించెనా ♦ పుణ్యంబు సేకూరుఁ, గన్నెత్తిచూచెనా ♦ కలుగుమేలు
పక్కన నవ్వెనా ♦ పండువన్నెలగాయుఁ, గలిసిమాట్లాడెనా ♦ కలుగుఁ జెలిమి
వేణువు నూఁదెనా ♦ విశ్వంబు భ్రమాన్పడు, డాసెనా మదనుండు ♦ డాయుచుండుఁ
గరముఁ జేపట్టెనా ♦ కంతుకాఁకలుదీరుఁ, గోపించెనా వైరి ♦ కోటి గూలు

తే॥ కరుణఁబజూపిన మోక్షంబు♦గల్గుఁగాదె, యామహాత్ముండు నీహృద♦యంబునందుఁ
దలఁచుచుండినవాఁడెకా ♦ జలజనేత్ర, పాదపంకజయుగసక్త ♦ బంభరంబ!

ఉ॥ వేరువ బాలురం గలిసి ♦ వేడుకపాటలఁ బాడుచున్ జగ
చ్ఛ్రీకరగోసమూహములఁ ♦ జేర్చుచు లీలగఁ ద్రోలుచున్ మనో
జాకృతివచ్చు నా హరియె ♦ యద్భుతుఁడు వంద్యుఁడు దర్శనీయుఁడో
హో! కమలాక్షి! యన్నవిని ♦ యుబ్బుచు రాధ వచించె నిట్టులన్. ౩౦౨

క॥ చెలులారా! మీరిప్పుడు, పలికిన ఘను రూపు నిందు ♦ భావాయుఁడు కని యా
వల నాతనిఁ దెలిపెద నని, పలుకఁగ నాచెలులు నేర్పు♦బలిమినిఁ గమ్మన్. ౩౦౩

ఉ॥ నందకుమారసౌష్ఠవ ఘు ♦ న ప్రతిమన్ విలిఖించి యామె కా
నందముతో నొసంగ నల ♦ నవ్యలతాంగియు దానినిం గరం
బందు ఘటించి కాంచి కను ♦ లార మఱిన్ మనసారఁగోరి వీని నే
మందు మనోహరుండనియె ♦ యందును బొందెదఁగాక త్రొందరన్. ౩౦౪

చ॥ అని మనమందునం దలఁచి ♦ యట్లనె చూచుచు మోహవారిధిన్
మునిఁగె ననంగఁ గూరుతను ♦ బొందియదాటున బృందకాటవిన్
ఘననిభుఁడున్ శుభాంగుఁడును ♦ గాంచనచేలుఁడు నైన శౌరి వే
డ్కను దనతోడఁ గూడినటు ♦ గాంచి యొకానొక స్వప్న; మాదటన్. ౩౦౫

తే॥ మేలుకొని భూషణోత్కర ♦ కీలితుఁడగు, హరి వియోగంబు నై పక ♦ యాకులతను
బొంది కలఁదన కబ్బిన ♦ ముచ్చటలను, దలఁచి తలఁచి కన్నులనుండి ♦ జలములొలుక.

సీ॥ ఈముఖపంకజా ♦ మృతము నే నెన్నఁడు, ద్రావుభృంగంబనై ♦ తనరఁగలనొ
యీముఖపూర్ణేందు ♦ కౌముదియెప్డునా, పైఁబడ నాకాంక్ష ♦ బాపఁగలనొ
యీముఖజీవన ♦ జామోదముల్ బర్వ, నెన్నఁడు మూర్కొని ♦ హెచ్చఁగలనొ
యీముఖసుఖపీఠి ♦ నెన్నఁడు నామోము, దామర నేనుంచి ♦ తనియఁగలనొ

తే॥ యీమనోహరాంగునిఁగూడి ♦ యెన్నఁడేను, సూనశరశరబాధల ♦ మానఁగలనొ
యీసుముఖుని నేనె త్తి ♦ నాసతోడ, సుముఖుగాఁజేసికొని వేడ్కఁ ♦ జూడఁగలనొ

ఉ॥ ఎన్నఁడు చేతులార! భువ ♦ నేశ్వరు దేహ మలంకరింతునో
యెన్నఁడు సుందరుండయిన ♦ కృష్ణు ముద్దులఁ బెట్టికొందునో
యెన్నఁడు వాని పెన్నురము ♦ నెక్కి రతిన్ రతిఁ దేల్చుచుందునో
యెన్నఁడు తత్కరంబుఁగొని ♦ యిట్లిటులన్ వని సంచరింతునో. ౩౦౬

క॥ అని చింతించుచు నా ఘనుఁ, గనుఁగొనఁగాఁ దలఁచి తోఁచ ♦ క చరించుటఁగాం
చిన యా చెలికత్తియ లా, వనజాక్షుని జాడఁ దీయ ♦ భావించి యెదన్. ౩౦౭

ఉ॥ చూచిరి సందుగొందులను ♦ జూచిరి సర్వచతుష్పథంబులన్
జూచిరి సర్వగోష్ఠములఁ ♦ జూచిరి రథ్యలఁ జుట్టుప్రక్కలన్
జూచిరి గాని యెచ్చట య ♦ శోదకిశోరుఁడు లేమిఁ దిగ్గిపోఁ
జూచెడిలోన నెల్లకడఁ ♦ జూచిరి వచ్చెడి గోపడింభకున్. ౩౧౦

తే॥ కనిన యా చెలికత్తెలు ♦ గాంచి ముదము,
ముందుగాఁ బోయి రాధాస ♦ ముఖమున కిటు
పల్కిరోయమ్మ! రమ్మ ♦ త్పంకజాక్షుఁ
డాలఁ ద్రోలుచు నిటువచ్చు ♦ నోలిఁ గనుమ! ౩౧౧

క॥ అన నాయమ పెన్నిధిఁగాం, చిన పేదరహిన్ జెలంగి ♦ చెలికత్తెలతోఁ
జని సౌధాంతరమందునఁ, దనరెడి వాతాయనంబు ♦ దాపునఁ దగుచున్.

మ॥ కనవే! యేమది ధూళిపుంజమెసఁగెన్ ♦ గంజాక్షుఁ డేతెంచునా?
ఘనముల్ గ్రమ్మినయట్టు లంబరమణిన్ ♦ గ్రమ్మెన్ జుమీ యాదెసన్
వినవే మంజులవంశినాదములు నీ ♦ వీన్దోయిఁ జొప్పించి, యే
దనవేమీ చెలిరో యదేవినదమో ♦ యాలించి వాక్రువ్వుమా! ౩౧౩

మ॥ ఎవరో డాయుచునుండి రట్లు గనుమీ ♦ యిందిందిరప్రోల్లస
న్నవసూనాంచితమాలికాధరుఁడు పీ ♦ నస్కంధుఁ డాజానుబా
హువృత్తుండున్ వరచేలధారుఁ డదిగో ♦ యుంకించి కాంచంగ మా
ధవుఁడే యంచుఁ దలంతు నిక్కవమె కా ♦ దా యో సఖీబృందమా! ౩౧౪

వ॥ అని వీక్షించుచు యోచించుచు ననుమానించుచు నాతురపడుచుఁ
బృచ్ఛింప నాసఖు లౌనౌనని యలరుచుఁ దలలూచి సంకోచపథంబునుండి మిత్ర
తారకలందు నిందునికైవడి నొప్పారుచు నాలం ద్రోలుచుఁ గ్రమక్రమంబుగా
సమీపించెడి శ్రీకృష్ణునిం జూపుడువ్రేలునం జూప నాయంగనామతల్లిక యొక్క
సారిఁ గన్నులార సోరణగండ్లనుండిఁ గాంచి ౩౧౫

సీ॥ దర్శనీయంబులన్ ♦ దర్శనీయముగాదె, యీమహామహుముఖం ♦ బింతులార!
పేయంబులందునన్ ♦ పేయంబుగాదె యీ, శౌరి యధరసుధ ♦ చానలార!
స్పర్శనీయంబులన్ ♦ స్పర్శనీయముగాదె, యీ మాధవుని మేను ♦ లేమలార!
గేయంబులందునన్ ♦ గేయంబుగాదె యీ, ఘను దివ్యచరితంబు ♦ కాంతలార!
తే॥ జ్ఞేయములయందు జ్ఞేయమీ ♦ తోయజాక్షు
వర్తనముగాదె సతులార! ♦ ప్రార్థ్యములను
ప్రార్థ్య మీ జగన్మోహను ♦ పరమసంగ
మంబుగాదె నారీతిల ♦ కంబులార! ౩౧౬

క॥ అని తన చెలులకుఁ జెప్పుచుఁ, గనుతెప్పను వాల్పక హరిఁ ♦ గనుచిల మూర్ఛి
ల్లె నతండు నోరచూపులఁ, గని యామెను దలఁచె నిటులఁ ♦ గౌతుకమతితోన్.

సీ॥ కచములా యివిగావు ♦ ఘనముఖాంబుజసుధన్, గ్రోలుభృంగముల ♦ గుంపుగాని
వేణియా యిదిగాదు ♦ వెనుకలరక్షించు, భయమిడు కృష్ణస ♦ ర్పంబుగాని
వక్త్రమా యిదిగాదు ♦ బహుళలోకానంద, కరపౌర్ణిమా నిశా ♦ కరుఁడుగాని
హాసమా యిదిగాదు ♦ హర్షంబుగూర్చెడి, దివ్యరాకేందుచం ♦ ద్రికలుగాని
తే॥ కనుల యివిగావు గండుమీన్ ♦ గవయకాని, కంఠమా యిదికాదు శం ♦ ఖంబుగాని
కుచములా యివిగావు వా ♦ న్గొప్పగిండ్లు, గాని మైదీఁగె యిదిగాక ♦ కాదె చపల,
మ॥ భువిలోనన్ దివిలోన దీనికెనయౌ ♦ పూఁబోఁణి లేదెందు నీ
స్తవనీయద్యుతిభాసురన్ ఘనకచన్ ♦ దారుణ్యలావణ్యవై

భవవిభ్రాజిత నిర్జితస్మరసతిన్ ♦ భాగ్యాంచితన్ శ్రీమతిన్
దవులన్ లేని నరుండు వ్యర్థుఁడుగదా ♦ తర్కింప భావంబునన్. 3౧౯

తే॥ కాన నీ చానతోఁగూడి ♦ కరుణఁదొఱఁగి, విరతిలేకుండ శరముల ♦ వేయు మదను
మదము సదమదమొనరించి ♦ ముదము నేను, గాంచనానని యింటికే ♦ తెంచె నంత.

చ॥ లలితయు, రాధఁజేరి యిటు ♦ లన్ బలుకాడఁదొడంగె నమ్మరో!
పలుకవు రావు నవ్వవు సు ♦ భక్ష్యయుతాన్నముఁ గ్రోల వేదియున్
దలఁపవు మంచినూనియలఁ ♦ దద్దయు రుద్దుచు దువ్వి దువ్వెనన్
దలను నలంకరింపవు య ♦ థార్థము నాకిపు డీవు సెప్పవే! 3౨౧

చ॥ హరిని మదిన్ మనోవిభుగ ♦ నన్నివిధంబుల నెంచియున్న స
త్వరగతి వాని నెయ్యమగు ♦ పద్ధతిఁజూడుము నీకు మేలగున్
ధరణికి మంచియగా నిఁక వ్య ♦ థాజ్వలనుం డల కుంభకార వ
హ్ని రహిని భగ్గుభగ్గుమని ♦ నిన్నిసుమింతయుఁ గాల్పఁడో చెలీ! 3౨౨

ఉ॥ పిమ్మట రాధికామహిళ ♦ వేడుకతోఁ దన పద్మపత్రనే
త్రమ్ముల విప్పి చూసి లలి ♦ తా! మునినిర్జరపూజితాంఘ్రి యు
గ్మమ్ముగలాఁడు ముద్దులను ♦ గాచ్చెడు వాఁడును నైన యచ్యుతుం
డిమ్మెయి రానిచో నిచటి ♦ కే నిదె దేహముఁ బూదిఁ జేసెదన్. 3౨3

ఉ॥ ఇట్టుల గద్గదోక్తి వచి ♦ యింపఁగ నాసఖి వించు నోచెలీ!
యెట్టులొ పట్టుకొమ్మెదను ♦ నేనెరవేర్చెద నీకుకోర్కె నీ
పట్టున నంచు నల్ల వృష ♦ భానుపురంబును వీడి తోడనే
యట్టి కళిందజానదికి ♦ నందిక లోఁగల బృందకాటవిన్. 3౨౪

తే॥ మాధవీముఖవల్లరుల్ ♦ మలయవివిధ, విహగకలకలారావముల్ ♦ వినపడంగఁ
గడిమి చెట్టుచాయను నొంటి ♦ గా వసించు, పసిఁడిపట్టముతాల్పు పా ♦ ర్శ్వమునఁ జేరి

ఉ॥ శౌరి! త్రిలోకసుందరియు ♦ సాధ్వియుఁ దద్వృషభాను పుత్రియై
మీకెడి రాధ నా రమణి ♦ మిమ్ములఁజూచిన నాఁటఁగోలె మీ
పేరు దలంచి శోడపయిఁ ♦ జక్కఁగ వ్రాసిన బొమ్మకైవడిన్
మాఱుచు నోర్మిదల్ప దది ♦ మాయయొ యేదియొ చెప్పలేనుగా. 3౨౬

చ॥ వినుఁ గనుమూయుఁ గాంచుఁ జను ♦ వెన్కకు వచ్చును గూరుచుండు ని
ల్చును బడు లేచు మిన్నుగను ♦ సొమ్మసిలున్ దెలివొందు శ్రీహరీ!
యనుఁ బ్రణమిల్లు నేడ్చు నగు ♦ హా యని వేసరు నిట్టులన్ క్షణం
బునకొకతీరుచేయు నది ♦ బుద్ధికిఁ దోఁపదు లోకమోహనా! 3౨౭

చ॥ సుమలతి బాణజాలముగ ♦ సోముఁడు హాలహలోరుమూలకం
దముగ సుగంధి దుష్కటు వి ♦ ధంబుగ సొమ్మెలనిప్పుతునుకఁగాఁ

గమలినశోక భార్యముగఁ ♦ గ్రాలెడి రాధకు, నందుచేత నా
యమ పెదమేడ పాడుపడి ♦ నట్టులఁదోఁచెడి పద్మలోచనా! ౩౨౮

ఉ॥ కావున నొక్కమాఱు మమ ♦ కారముతోఁ జనుదెంచి యట్టి రా
ధావనితామతల్లికకు ♦ దర్శనమిచ్చి సుఖంబు గూర్పవే?
నీవెకదా సమస్తధర ♦ ణీ జననస్థితినాశనంబులన్
దేవుఁడవింక సర్వమున ♦ దిక్కగువాఁడవు రమ్ము శ్రీహరీ! ౩౨౯

చ॥ అని పరమేశ్వరుం గుఱిచి ♦ యాలలితాలలనాలలామ నే
ర్పున మనవింబొనర్చుకొనఁ ♦ బూతచరిత్రుఁడు కృష్ణచంద్రుఁడున్
విని ఘనవాణి నిట్లనియె ♦ భీతమృగాక్షిరో! నీమనోహరో
క్తినిఁ జెవులార వింటి నల ♦ స్త్రీ యటు సేయుట ప్రేమునన్ సుమీ! ౩౩౦

ఉ॥ ప్రేమ మనోవికారమగు ♦ ప్రేమ గృహస్థశుభప్రదంబగున్
ప్రేమయె సృష్టిమూలమగుఁ ♦ బ్రేమయె పోషణముఖ్యహేతువౌఁ
బ్రేమ వినాశకంబగును ♦ బ్రేమయె ధర్మనిదానమయ్యెడిన్
బ్రేమయె సర్వవశ్యమగుఁ ♦ బ్రేమనుమించిన లాతియున్నదే! ౩౩౧

ఉ॥ ఈ రహిఁ బ్రేమయాట నల ♦ యింతియు నట్టులఁ జేయుచుండెఁగా
క్షీరమునందుఁ దత్త్వతరు ♦ చిస్థితి భేదములేని రీతిగా
నారయ నాకు నామెకును ♦ నంతరమింతయు లేదు మున్ను భాం
డీరవనిన్ విహారము గ ♦ డించిగ నైనటు లిప్డు మాకగున్. ౩౩౨

ఉ॥ రాధకు నాకు భేదము గ ♦ రంబుగఁ గూర్చి జగంబునందు నే
ర్పోధలు సల్పుచుందు రల ♦ పుణ్యజనుల్ యమపాశబద్ధులై
బాధలఁ బొందుచుందురని ♦ భావమునందు నెఱుంగు మిట్టులన్
సాధులు భేదదూరులయి ♦ సన్నుతి సల్పరె? ముక్తిఁగాంచరే? ౩౩౩

ఉ॥ కావున లెమ్ము పొమ్మలఁతి ♦ కాలములోపల నేను వచ్చెదన్
నావుడు తల్లతాంగియును ♦ నమ్రత నాతని యాజ్ఞఁగొంచు బృం
దావని వీడి రాధ సవి ♦ ధంబునకుం జనుదెంచి యొంటిగా
భావమునం దలంచుచెదో ♦ వర్తిలు నామెకుఁ బల్కె నిట్టులన్. ౩౩౪

శా॥ అమ్మా! రాధరో! శౌరిఁ జేరి కనఁగా ♦ నవ్వానిపై నీకు మో
హమ్మెట్టుల్ వసియించెనో యటుల నీ ♦ యం దాతఁడున్ బూర్ణమో
హమ్మున్ బొంది వసించె నం చెఱుఁగుమీ ♦ యవ్వానికిన్ నీకు భే
ద మ్మావంతయులేదు మీర్జగమునన్ ♦ ద్వైవిధ్యమై యుంద్రుగా. ౩౩౫

తే॥ కొలఁది కాలములోపలఁ ♦ గూర్మి నాతఁ
డిటకుఁ జనుదెంచునని యెంతు ♦ నెడఁద నయిన

వాని రాకకు సత్కార్య ♦ పాళి పాళిఁ
జేయుచుండుము నీకిష్ట ♦ సిద్ధియగును. 33౬

ఉ॥ ఈగతిఁ జెప్ప నామె స్వయము ♦ కెంపురుచిన్ నయనోత్పలంబులున్
బాగుగ విప్ప నిట్లు మఱిఁ ♦ బల్కెఁ జెలీ! యలవానిరాకకై
యేగతి నెట్టికార్యముల ♦ నే నొనరింపఁగ నౌనొ యెట్టి య
భ్యాగతిదేవతీర్థముల ♦ యర్చలఁ జేయఁగ నౌనొ? చెప్పుమా! 33౭

తే॥ మఱియు మాగురువును ముని ♦ వరుఁడునైన, గర్గుఁడీ యిష్టసిద్ధికై ♦ కార్యములను
జెప్పెనో వాని నాకు వ ♦ చింపుఁ డిప్డు, ఓ చెలియలార! యనికోరె ♦ నుర్వరేశ!

తే॥ అట్టి సమయంబునందుఁ ద ♦ దాళిపాళిఁ, జతురయైన చంద్రానన ♦ స్వాంతమందు
మిగుల యోచించి యమ్మరో! ♦ మీసెలవున, నొక్కసత్క్రియఁ జెప్పెదఁ ♦ జక్క వినుము

తులసీవ్రత మాహాత్మ్యము.

చ॥ వరదము మంగళప్రదము ♦ భాగ్యదముం దనయప్రదంబునుం
బరమము మాఱిజాడ్యముఖ ♦ వారకముం గులదీపకంబు దు
ష్కరహరిదర్శనప్రథమ ♦ కారణముం బహుపావనంబునుం
సిరి కెనయైన తత్తులసి ♦ సేవను భక్తిని జేయుచుండుమా! 3౪౦

క॥ తులసినిఁ జూచినఁ దాఁకినఁ, బలికిన శ్రుతిశాస్త్రవిహిత ♦ పద్ధతితోఁ బూ
జలఁ జేసిన మఱిఁ దత్కథ, నలఁతిని వినినంతమాత్ర ♦ నఘము లణంగున్.

తే॥ నవవిధాత్మకభక్తి న ♦ నారతంబు, దులసి నమ్మిన వారలు ♦ దోషములను
విడిచి పుణ్యాత్ములై యొక ♦ వేయియుగము,లరుగునందాఁక వైకుంఠ ♦ మందునుంద్రు.

చ॥ కనులకుఁ బండువౌ తులసిఁ ♦ గైకొని యెవ్వఁడు మంచిచోటు గ
న్గొని యొక యాలవాలమును ♦ గోర్కెనొనర్చియు నందు నాటి క
మ్మని యుదకంబు ప్రత్యహము ♦ మప్పితమౌనటుఁబోసి గొప్ప వృ
ద్ధిని గనునట్లు జేయునో య ♦ దేవిధి వాఁడును వృద్ధిఁబొందుఁగా. 3౪3

సీ॥ సారంబు గల్గిన ♦ చక్కని నేలలోఁ, జదుకంబుగా నుండు ♦ స్థలముఁగాంచి
యందునఁ గుందార ♦ మందార పున్నాగ, చూతాదితరువులఁ ♦ జుట్టుబెట్టి
యవల మరంద ని ♦ ష్యంది నానావిధ, పుష్పభూరుహములఁ ♦ బొందుపఱచి
పదపడి సౌరభ ♦ పర్యాప్తవాసిత, మల్లికాదిలతల ♦ నల్లఁజేసి

తే॥ చుట్టుఁ గొలఁది చోటును విడి ♦ శుభ్రపఱచి, చిన్న చిన్న సరస్సులు ♦ సెలఁగనడుమఁ
గళలకుం దల్లి యిల్లగు ♦ తులసికోట, వైచు పుణ్యుండు వైకుంఠ ♦ వాసి యగును.

శా॥ భాస్వత్ప్రసమాంచితోరు తులసిన్ ♦ బ్రహ్మ్యామకాలంబునం
దే స్వాపంబును లేచి చూచు జనులో ♦ దీర్ఘాయురైశ్వర్యదే

హాస్వాస్థ్యంబులు గల్గి పుణ్యాత్ములై ♦ యా స్వర్గలోకంబునం
దస్వప్న ల్వినుతింప నుండఁగలరో ♦ యంభోజపత్రేక్షణా! ౩౮౭

సీ॥ అన్నసత్రంబుల ♦ నమరించినంగూడఁ, దులసినాటుఫలంబు ♦ దొరకునొకొ
ఫలపుష్పతరువనుల్ ♦ బ్రబలవేయించినన్, దులసినాటుఫలంబు ♦ దొరకునొకొ
వరజలయుతములౌ ♦ చెఱువులన్ ద్రవ్వినన్, దులసినాటుఫలంబు ♦ దొరకునొకొ
షోడశదానముల్ ♦ సొరిదిఁగావించినన్, దులసినాటుఫలంబు ♦ దొరకునొకొ

తే॥ దశవిధములగు దానముల్ ♦ విశయరహితుఁ, డగుచు సల్పినంగాని య ♦ జ్ఞాశ్వమేధ
శతము నాచరించినఁగాని ♦ సకల శుభద, తులసినాటుఫలంబు ♦ దొరకునొకొ?

తే॥ కన్నులారంగఁ దులసినిఁ ♦ గాంచఁడేనిఁ, జేతులారంగ దులసి న ♦ ర్చింపఁడేని
నోరు నొవ్వఁ దులసికతల్ ♦ నుడువఁడేని, వాని జన్మంబు మిక్కిలి ♦ వ్యర్థమమ్మ!

చ॥ తులసిదళంబులన్ సకల ♦ దోషవిదూరులు వేల్పు లెల్లరున్
వెలుఁగుచునుందు, రవ్విసర ♦ వింగొని శ్రీహరిపాదపంకజం
బులకు విధేయతాఘనితిఁ ♦ బూజల సల్పిన వాని జన్మమే
వెలగల దర్థవంతము న ♦ భిజ్ఞనుతంబును ముక్తియుక్తమున్. ౩౮౮

సీ॥ ఏవీడు తులసిచే ♦ నెసఁగియుండఁగలేదొ, వీడుగాదది వట్టి ♦ బీడు గాని
యేవాడ తులసిచే ♦ నెసఁగియుండఁగలేదొ, వాడగాదది వల్ల ♦ కాడు గాని
యేయిల్లు తులసిచే ♦ నెసఁగియుండఁగలేదొ, యునికిగాదది పెద్ద ♦ యొలికి గాని
యేతోట తులసిచే ♦ నెసఁగియుండఁగలేదొ, తోటగాదది చేటు ♦ చోటు గాని

తే॥ తులసిలేనట్టి చోటులఁ ♦ జెలఁగుజనము, జడమగునుగాని యయ్యది ♦ జనముగాద
టంచు నెఱుఁగుచుఁ బూజల ♦ నహరహంబు, సల్పుచుండుమ తులసికి ♦ శ్రద్ధతోడ.

తే॥ తులసి వాయువు లేయింటఁ ♦ జెలఁగుచుండు
నట విషూచిమసూచికా ♦ ద్యామయములు
నించుకేనియుఁ జొరఁబడవం ♦ చెఱుఁగవమ్మ!
కాలుఁడా యింటివారలఁ ♦ గనులఁ గనఁడు. ౩౯౦

తే॥ తులసిదళమంజరిం గొని ♦ తలనుదాల్చి, ప్రాణముల్విడిచిన వాఁడు ♦ బాధపంచ
పాతకంబుల సల్పినన్ ♦ బావనుఁడయి, యముని దండన మొందఁడో ♦ యన్నుమిన్న!

క॥ తులసీ కాష్ఠజ గంధము, డలఁబూసినఁ బాపమెదియు ♦ డక్కొనదమ్మా
తులసీవనిగల గేహం, బులు పుణ్యక్షేత్రములుగఁ ♦ బొల్పారుఁగదా. ౩౯౧

తే॥ నూఱు బారువలైన బం ♦ గారు మఱియు, నాల్గువందల బారువ ♦ ల్గలు వెండి
దానమిచ్చిన ఫలమెంత ♦ దనరు నంత, ఫలముగల్గు నిట్టి తులసి ♦ పాలనమున.

తే॥ తులసిపాదునఁగలనీరు ♦ దలనుజల్లిన గృహి, యమునాపగామఖ ♦ స్నానఫలముఁ
బొంది నీటఁ జెలంగి ము ♦ భువన మంట,ని జలజముమాడ్కి భవభీతి ♦ నింగనఁడుగ

తే॥ తులసినీడను శయనింప ♦ దోషమడఁగుఁ, దులసిపూసలఁ దాల్చినఁ ♦ గలుగు శుభము
తులసిఁ బైవిధిఁ బూజల ♦ సలుప హరియుఁ, బ్రీతిఁ బొందును దులసి వ ♦ ర్ణింపఁ దరమె.

తే॥ తులసియుండిన శ్రాద్ధముల్ ♦ ఫలదములగు,
దులసిఁ బెంచిన వంశముల్ ♦ బొలుపుఁ గాంచు
దులసి మాహాత్మ్యమెన్నుట ♦ సులభమొకొ?
త్వరగ నీవును దులసి సే ♦ వలను సలుపు. ౩౯౬

చ॥ అని తులసీ ప్రభావము మ ♦ హాదృతితో నుడువంగ రాధికా
వనితయు నాలకించి భయ ♦ భక్తులఁ దత్తులసీవనంబు స్థా
పన మొనరింప నెంచి తగు ♦ పద్ధతులం గమనించి కేతకీ
వన మనుకూలమైనదని ♦ భావమునందుఁ దలంచి వెంటనే. ౩౯౭

వ॥ తద్వనంబునందు మధ్యప్రదేశంబు రమ్యంబని యెన్ని యందు బహురమణీయంబగు నూరుమూరల చుట్టుకొలతగల చోటును గొని యాస్థలంబున బంగారుగోడల నెత్తుగఁ గట్టించి పద్మరాగమణులతోఁ దటంబు నిర్మింపించి కాంచనధ్వజంబుల నెల్లెడ నెత్తించి యందుఁ బ్రేక్షకమనోభిరామంబగు తులసీమందిరం బలరునట్లు బొనరించి తన్మందిరాంతరంబున సర్వదోషహారంబై పచ్చనిపల్లవంబులఁ బొలుపారు శ్రీతులసీవనంబు స్థాపించి యవ్యాజంబగు నిశ్చలమనంబున సమాహూతుండును వేదవేదాంగ విదుండును బురోహితుండు నగు గర్గాచార్యుండు మంత్రపూర్వకంబగు తంత్రం బుపదేశించుచుండ నభిజిన్నక్షత్రయుతశుభముహూర్తంబున శ్రీకృష్ణప్రీతికై పరమభక్తిసంభరితయై తత్సేవాపూజాదులఁ జేయ నారంభించి యాశ్వయుజ శుద్ధపూర్ణిమాదివసంబున దీక్షవహించి చైత్రపూర్ణిమాపర్యంతము నారాధించి పంచామృతంబులను నిక్షురసంబునను నామ్రరసంబునను ద్రాక్షారసంబునను నారికేళరసంబునను శుద్ధోదకంబునను నభిషేకించి ప్రత్యేకంబుగాఁ బ్రతిపూర్ణిమా తిథియందు విశేషోపచారంబులం గావించుచు వైశాఖశుద్ధప్రతిపద్దినమందు దద్వ్రతోద్యాపనం బొనరించి రెండులక్షల బ్రాహ్మణుల నన్నముఖదానంబులతోఁ దృప్తులం గావించి యామలకప్రమాణంబులును వర్తులంబులును నమూల్యంబులును నగు లక్షభారమౌక్తికంబులను గోటిభారదివ్యస్వర్ణంబును నాచార్యునకు దానం బొసంగి ఖేచరులు దుందుభులు మ్రోఁగించి కీర్తించి జయజయారావంబులుఁ సల్పుచు బుష్పవృష్టినిఁ దత్తులసీమందిరంబుపైఁ గురియం గని యానందమందు రాధికాసుందరి సముఖంబున. ౩౯౮

సీ॥ మించును మించిన ♦ మేనిపైఁ దళతళ, లాడు బంగరు చీర ♦ లమరుచుండఁ
దమ్ములఁ దమకు వే ♦ తమ్ములఁ గాఁ జేయు, కన్నుల నమృతంబు ♦ గాఱుచుండఁ
నల్లనిపెంద్రాచుఁ ♦ జిల్లరగా సల్పు, పెంజడ పిఱుదులఁ ♦ బుంజియాడఁ
దామరతూండ్లను ♦ దాఁటు చౌ చేతుల, బంగరుసొమ్ములు ♦ వరఁగుచుండ

గీ॥ హేమకుండలమకుటంబు♦లలరుచుండ, వెలుఁగుచుండుపదాత్తేండ్ల♦వెలఁది యగుచు
గరుడగలహేమపీఠిపైఁ ♦ గ్రాలి తమ్మి, కంటివాల్గంటి తులసి వే♦ల్పను వెలింగె.

చ॥ కనుపడి యట్టులామె తమ ♦ కన్నుగ రాధను గౌఁగిలించి యి
ట్లనియెను నోసతీతిలక ♦ మా! భవదర్చలచేఁ బ్రసన్నతన్
గని యిట కేఁగుదెంచితిని ♦ గానఁ ద్రిశుద్ధిగ నేవరంబు నీ
వనయము గోరుచుంటి వది ♦ యక్కజవచ్చి ఫలప్రదంబగున్. ౩౬౦

చ॥ మఱి సుభగత్వమున్ వఱల ♦ మంచిదటంచుఁ బ్రసిద్ధురాలవై
ధర మనుచుండువమ్మ! యిది ♦ దప్పదు భూతలసంగ్రహార్థమై
కరముగ నిట్లు గోరితివి ♦ గాదె! యనంతరమందు నామె సం
బరమున బ్రొక్కి నాకుఁ బతి ♦ భక్తి నహైతుకి నిమ్ము బృందరో! ౩౬౧

చ॥ అనఁ దులసీమహేశ్వరియు ♦ నట్టులె నీకగుఁగాక యంచుఁ దాఁ
జని నటుమీఁద రాధ నిజ ♦ సద్మముఁ జేరెను మైథిలేశ్వరా!
యనవుడు ఱేఁడు వల్కె శర ♦ దబ్జమరందముఁ ద్రాగి తేంట్లు తృ
ప్తిఁ గనునట్లు లీకథన ♦ తృప్తిని జెందఁగఁ జాల నారదా! ౩౬౨

తే॥ కాన మఱి హరికథను బ♦ల్కంగ వేఁడుచుంటిఁ దద్రాధికాదేవి♦యుత్తమవిధిఁ
దులసి నర్చించెఁగద దానఁ ♦ గలిగినట్టి, ఫలములన్ జెప్పవేఁడెద ♦ బ్రహ్మపుత్ర!

శ్రీకృష్ణుండు మాయాగోపికయై రాధ దరికేగుట.

ఉ॥ నావుడు దేవమౌనియు న ♦ నంగడఁగెన్ మిథిలాధినాథ! రా
ధావధు వావిధిన్ మిగులఁ ♦ దత్తులసీవ్రత మాచరించుటన్
శ్రీవిభుఁ డాలకించియుఁ బ ♦ రీక్ష నొనర్పఁ దలంచి తోడనే
యావృషభానుపట్టణము ♦ నర్థి ప్రమోదముఁ బొందు చందునన్. ౩౬౩

ఉ॥ కంకణ తార హారములు ♦ గమ్మలు నందెలు నత్తు కాంచియున్
కింకిణులున్ దగన్ గనక ♦ నిర్మల వస్త్రములన్ ధరించి బ
ల్వంకపు కేశపాశమును ♦ బూని యహో యన గోపికాకృతిన్
జంకక తాల్చి తత్సదన ♦ సన్నిధి కేగి మదేభయానయై. ౩౬౪

మ॥ వరుసన్ ద్వారసమాశ్రితాంజననిభే ♦ భశ్రేణులన్ బ్రోల్లస
త్పరిఖావప్రపసభాలయాంగణచతు ♦ ర్ద్వారంబులన్ ఛత్రచా
మరహారాన్వితసింహపీఠముల ధ ♦ ర్మస్థానముల్ దివ్యహ్యా
న్నరుదాపమ్యజవాంచితాశ్వములఁ బ్రే ♦ మన్ జూచి యా పిమ్మటన్. ౩౬౫

ఆ॥ వత్ససహిత ధేను ♦ వారమహోక్షముల్, గన్నులారఁగాంచి ♦ కరమునందు
బెత్తమొప్ప మంచి ♦ పిల్లనగ్రోవితో, నసిగఁ బాడు గోప ♦ సమితిఁగాంచి.

క॥ శ్రీరాధాంతఃపురమును, జేరి కవాటాలయాది ♦ చిత్రంబులనున్
భూరిసభాస్థలములలోఁ, గోరిక వర్తించుచుండు ♦ కోమలులఁ గనెన్. ౩౬౮

ఉ॥ కృత్రిమ గోపికామణి మ ♦ ఱిన్ వృషభానుకుమారికీర్తి వా
దిత్రముఖంబునన్ మిగులఁ ♦ దేటగఁ దెల్లమొనర్చు గోపికల్
చిత్ర విచిత్ర పుష్పములఁ ♦ జేకొని వేడుకతోడఁ జెంగనా
లాత్రములేక వేయుటను ♦ నాస్థను గన్గొని మెచ్చి యంతటన్. ౩౬౯

తే॥ కుందమందార దాడిమీ ♦ కోవిదార, మాలతీ కేతకీ బృంద ♦ మాధవీప్ర
భృతి ధరారుహోపేతంబు♦వివిధవిహగ, కలితమగు నుపవనమొండు♦గ్రాలు నందు

సీ॥ కల్పవృక్షసుగంధ ♦ క్రమంబు మధుమత్త, షట్పద ఝంకృతి ♦ సంయుతంబు
గంధార్త శీత జ ♦ గత్ప్రాణ యుక్తంబు, శుకముఖఖగరవ ♦ శోభితంబు
ననిలాల్ప ధూత స ♦ హస్ర దళాంబుజ, భాసురం బఖిల పు ♦ ష్పాశ్రితంబు
కూపవాపీసరః ♦ కుల్యామనోజ్ఞంబు, బుష్పశయ్యావళి ♦ భూషితంబు

తే॥ న్యక్కృతామర నాయక♦నవ్యసౌధ, రమ్య మమర నుతము నైన♦రాధికాస
తీమణీదివ్యకుంజంబు ♦ దేజరిలుట, గాంచి యెదమెచ్చి యందునఁ ♦ గౌతుకమున.

తే॥ వఱలు మేఘమందిరమందు♦బాలతరణి,కుండలాంచితల్ దత్కార్య♦కుశలలును సుము
ఖులును వరవస్త్రధరలు నా♦చెలిమికత్తె,లలరుచుండుటఁ గని కొంచె♦మవల నరిగి.

ఉ॥ కుంకుమపుష్పవన్నెలను ♦ గూర్చిన సన్నని పట్టుబట్టలి
ర్వంకలఁ గట్టియుండ సుమ ♦ వారులు జల్లఁగ నెల్లచోటులన్
సంకుముదైణనాభిఘన ♦ సారపటీరసువాసనల్ దగన్
వంక యొకింతలేని యటు ♦ భాసిలు రాజగృహంబునుం గనెన్. ౩౭౩

ఉ॥ అందునఁ జేటికాసహిత ♦ లౌ చెలికత్తెలఁ గోటిచంద్రులన్
డిందొనరించు తేజలరి ♦ కివిగ నుండెడి కావిమోవినిం
జెంది సతీలలామయు సు ♦ శీలయు నైనుతిఁబొందు రాధికా
సుందరి యెద్దిరో తలఁచు ♦ చున్ బదమున్ గదలించుటం గనెన్. ౩౭౪

ఉ॥ అత్తఱి రాధికాసతియు ♦ నట్లు క్రమంబుగ,డాయు గోపికా
త్యుత్తమఁ గాంచి కౌఁగిళుల ♦ నొంది పదంబుల క్షాళనంబుకై
యుత్తమలోకరీతి జల ♦ మొయ్య నొసంగియుఁ బీఠమిచ్చి లో
కోత్తరమైన పద్ధతిని ♦ నొద్దకుఁ బోయి వచించె నిట్టులన్. ౩౭౫

తే॥ అమ్మ! స్వాగతమియ్యదే♦యందవమ్మ!, మాగృహంబున కీవిపు♦డేగుదెంచ
ధన్యతమనైతి నోయమ్మ! ♦తప్పకుండ, నర్ఘ్యమొంది నాయాతిథ్య♦మందవమ్మ!

మాయాగోపికారాధికా సంవాదము.

చ॥ ఇది యెటనుండిరాక మఱి ♦ యెక్కడి కేగఁ దలంచియుంటివో
యెది భవదీయవాస మిఁక ♦ నెట్టిదొ నీచరితంబు నేటికీ
యదనున నాసమీపమున ♦ కాగతవైతివొ చెప్పు మవ్వి నా
కుఁ దగినవైనఁ జేసెదను ♦ గొంకక పద్మదళాయతేక్షణా! ౩౭౭

ఉ॥ భూతలమందుఁజూడ నినుఁ ♦ బోలినరూపము గోచరింప దే
ర్పీతిగ నిన్ను జూతు రల ♦ పెద్దలు ధన్యత గాంచకుందురే
యేతఱి నీపదాబ్జముల ♦ నెచ్చటఁ ద్రొక్కెద వద్ది యత్తఱిన్
పూతమహాపురంబగుచుఁ ♦ బొల్పువహింపదె? గోపికామణీ! ౩౭౮

క॥ అమ్మా! శుభదము వాంఛా, దమ్మును నఘజాలశైల ♦ దంభోళియు నై
సమ్మదకరమగు మీ నా, మమ్మును వినఁగోరుచుంటి ♦ మాన్యచరిత్రా! ౩౭౯

క॥ కృతిచే, స్మృతిచే, ద్యుతిచే, గతిచేఁ, గరుణాకటాక్ష ♦ కలితస్థితిచే,
మతిచే, వచనముచే, శ్రీ,పతివలె భాసిల్లితీవు ♦ భామామణిరో! ౩౮౦

ఉ॥ మిమ్ములఁ జూచినం గొలఁది ♦ మేరను మీఱు ప్రియంబు డెందమం
దిమ్మెయిఁ గల్గుచుండెడి, ర ♦ మేశునకున్ మఱి మీకుఁ దారత
మ్యమ్మది గోచరింపదుగ ♦ యందున నేను ననాందగా మిమున్
నమ్మి తలన్ వహించుచు ఘ ♦ నంబుగఁ దప్పక సత్కరించెదన్. ౩౮౧

చ॥ మఱియును మీరు నిత్యమును ♦ మానక యిచ్చటి కేగుదెంచి మీ
దరిసెన మియ్యఁ గోరితిని ♦ దద్విధి వీలొనఁగూడదేని మీ
వర గృహ మెచ్చటన్ గలదొ ♦ పల్కుము వచ్చెదఁ బ్రత్యహంబు ని
ద్దర మొకచో నెటో కలిసి ♦ తద్దయు ముచ్చట లాడనా సఖీ! ౩౮౨

క॥ నావుడు మాయా యువతియు, శ్రీవిభుఁడున్ దేవుఁడైన ♦ శ్రీకృష్ణవిధుం
డా వనజాక్షికి రాధిక, కావశ్యకభక్తి నిటుల ♦ ననియెను జనకా! ౩౮౩

ఉ॥ ఊరెది యన్న నందపురి ♦ నొందిన నందుని యిక్కప్రక్కఁ గా
శేరదిశన్ బ్రభాపటలి ♦ వెల్గెడి గోకులమై చెలంగు నా
పేరిక గోపదేవియని ♦ విశ్వమునన్ విదితంబు రాధ! నీ
సారును జేటియా లలిత, ♦ సక్కవచింపఁ గనంగ వచ్చితిన్. ౩౮౪

చ॥ నవనవపుష్పవాసనల ♦ నవ్యలవంగలతాదిసంతతిన్
నవకపుఁ దేంట్ల పాటలను ♦ నానెముగా ఫలియించు చెట్లులన్
నవనవలాడు నీవనము ♦ నా కనులారఁగఁ గాంచియుంటి వా
సవఘననందనోపవని ♦ సైతము దీనికి సాటివచ్చునే? ౩౮౫

ఉ॥ ఇట్టుల నిర్వురుం గలిసి ♦ యేవియొ ముచ్చటలాడి కొంచటన్
జెట్టులచాటుచోటులను ♦ జేరుచు నాడుచుఁ బాడుచున్ మఱిన్
నెట్టుచుఁ బాయుచున్ నగుచు ♦ నివ్వెఱసెందుచు బంతియాటలన్
బెట్టుగఁ జేయుచున్ మిగుల ♦ వెల్గుచునుండిరి మైథిలేశ్వరా! ౩౮౬

ఉ॥ అంతట గోపదేవత మ ♦ హాద్భుతితో సఖి కిట్లువల్కె నో
యింతులమేలుబంతి! యిఁక ♦ నేగెదఁ బ్రొద్దదె గ్రుంకెఁ దిర్గి నీ
చెంతకు నేఁ బ్రభాతమునఁ ♦ జేరెద మద్గృహ ముండు దవ్వునన్
జింతను వీడి యాజ్ఞయిడి ♦ చెచ్చెరఁ బంపుమ గోపికామణీ! ౩౮౭

చ॥ పలుకఁగ నిట్లు రాధిక య ♦ పార విచారపయోధిమగ్నయై
యిలపయిఁ గూలు రంభవలె ♦ నేమియెఱుంగక సొమ్మసిల్లె నె
చ్చెలు లదిగాంచి శీతల వి ♦ శేషకృతుల్ బొనరించుచుండి రా
వల నల గోపదేవి వృష ♦ భానుకుమారిక ప్రక్కఁ జేరుచున్. ౩౮౮

ఉ॥ గోగణగోరసాగ్రజులఁ ♦ గూరిమి యెక్కువయాట దప్పకే
వేగవలెన్ జుమీ యనుచు ♦ నెట్టులొ రాధిక నాశ్వసించి గో
పీగణ మాస్థ మ్రొక్కఁ సర ♦ విన్ వృషభానుపురంబు వీడి బ
ల్వేగమ చేరె నందపుట ♦ భేదనసంగతగోకులంబునన్. ౩౮౯

క॥ మాయాంగనయా హరి యట, రేయిని జని నిద్రవోయి ♦ రేకం బుదితుం
డై యలరెడి లో మఱి రా, ధాయతనం బొందె నామె ♦ యాత్రిని బాపన్.

వ॥ అంత.

ఉ॥ వచ్చిన గోపి నామె గని ♦ భక్తిని ఫుల్లసరోజనేత్రయై
యిచ్చి సువర్ణపీఠికను ♦ నెంతయు నెయ్యము దోఁప నమ్మరో!
యిచ్చట సిన్న నన్నువిడి ♦ యేగితి వప్పటినుండి నీరహిన్
హెచ్చిన శోకతాపముల ♦ నెబ్బెటికంబును జెందితిన్ జుమీ! ౩౯౧

చ॥ తొఁలుత నపథ్యసేవ బహు ♦ తుష్టిని గూర్చి యనంతరంబునన్
సిలుగు ఘటించు నట్టులగు ♦ చెట్టల కూడిక యిద్దిగాక శి
ష్టుల సహవాసమాటఁ దొలి ♦ శోకముఁ బొందుట లయ్యె నిప్డు మి
మ్ములఁగను భాగ్య మొందితిని ♦ బోయిన మల్లియఁ బొందు చాడ్పునన్. ౩౯౨

చ॥ అనవుడు గోపదేవత త ♦ దార్తి యథార్థమటం చెఱింగి తా
నును వెతఁగన్న దానివలె ♦ నోరు మెదల్పకయుంట రాధికా
వనితయు గాంచి స్వీయులగు ♦ భామలచే నడిగించి మైత్రియే
ఘనముగ నొందితాను దషు ♦ కంబున గోపకదేవి కిట్లనెన్! ౩౯౩

ఉ॥ ఓలలనాలలామ! వగ ♦ పొందెదవేలొకో? నీకు నెట్టి తం
టా లొనగూడలేదుగద! ♦ టక్కరులెవ్వరు నిన్ను బాటలో
గోల నొనర్పలేదుగద! ♦ కొంప మగండె యధోముఖంబునన్
నీలగఁగొట్టలేదుగద! ♦ నీతలిదండ్రులు దన్నలేదుగా. ౩౯౪

చ॥ మఱియు ననాంద యత్తయును ♦ మామయు జుట్టల నేరు మర్దనం
బఱిముఱి సల్పలేదుగద ♦ యధ్వపరిశ్రమ మేమిలేదుగా
దురుసుగ నిన్నుగూర్చి సవ ♦ తుల్ బలు కొండెములాడి కొట్టన
ల్పరుగద! యేదొ వాకొనినఁ ♦ బాపెద వానిని యుక్తియుక్తనై. ౩౯౫

ఉ॥ కోరదవేనిఁ గొమ్మవిగొ! ♦ కోటలు బేటలు దోటలున్ గళా
చారుతరాభ్రచుంబిపృథు ♦ సౌధములున్ నునుపట్టుపుట్టముల్
హీరము లర్ధముల్ మణులు ♦ నేన్గులు గుఱ్ఱము లాలచాలు శృం
గారలసత్సఖీజనము ♦ గ్రాలుచు నుండెడి గోపదేవతా! ౩౯౬

చ॥ ధనమునొసంగి దేహమును ♦ దప్పక యొప్పుగఁ బ్రోవ నౌను ద
త్తనువునునిచ్చి మానము య ♦ థావిధి రక్షనొనర్ప నౌను ద
ద్ధనుతనుమానముల్ మిగుల ♦ దానమొనర్చి సుమిత్రకార్య మె
గ్గునఁ బడకుండఁగాంచి యను ♦ కూలముగా నెరవేర్పనౌఁగదా. ౩౯౭

చ॥ కపటము వీడి మిత్రవరు ♦ కష్టసుఖంబుల నొక్కరీతిఁ దో
డుపడి హితంబులం బలికి ♦ కొంపులఁ బాపి యశస్సుగూర్చి నే
రుపున నెవండు వర్తిలును ♦ రూఢిగ వాఁడె ధరన్ గృతార్థుఁడై
యపగతపాపుఁడౌచు హరి ♦ యవ్యయధామముఁ బొందు నెచ్చెలీ! ౩౯౮

ఆ॥ ఆప దబ్ధి నీద ♦ ననువైననౌకయు, సౌఖ్యసాధమెక్కఁ ♦ జక్కని యధి
రోహిణి మదకామ ♦ మోహాభయాద్యద్రి, వజ్రముగద జగతిఁ ♦ బరమసఖుఁడు

తే॥ పాపములఁ బాపు హితవెంచు ♦ భవ్యగుణము, వెల్లడించు దుర్గుణముల ♦ డొల్లఁ జేయు
గుహ్యమును దాఁచు నక్కఱన్ ♦ గోరినదిడు, నిడుములన్ విడఁడుగ! సుమి ♦ త్రుఁడుదలంప

తే॥ తనకు నుండిన ధనమెల్ల ♦ దానమిచ్చి, యైనఁ జెలి ప్రాణముల రక్ష ♦ నహరహంబు
సేయవలెనని పెద్దలు ♦ సెప్పుచుండ్రు, గాన నీకష్ట మేదొ ప ♦ ల్కుంగఁ దగును

చ॥ విసమును లోన నింపుకొని ♦ ప్రేముడి వెల్లడిఁ జల్లి మైత్రి సం
తసమునఁ జేయు మానవుఁడు ♦ దండధరాజ్ఞను గింకరాగ్రణుల్
గసిఁ బ్రహరింప బాధలను ♦ గాచెడి వారలు లేక కాంచఁడే?
వసుధఁ గుశీలుఁడౌ నటుని ♦ భాతిని నిందలఁ బొందఁడే చెలీ! ౪౦౨

తే॥ కానఁ జెలినైన నాకు నీ ♦ కష్ట మెఱుఁగఁ, జెప్పవేఁడితి బైన నీ ♦ చిత్తమమ్మ!
యనుచుఁ బ్రార్థింపఁగా గోపి యా ♦ హరియు నగుచు, నల్లనల్లన రాధ కి ♦ ట్లని యెజనక!

తే॥ సతిరో! గోవర్ధనాచల ♦ సానువులను, వింతలనుగొల్పు నిఱుకైన ♦ వీథులందు
బెరుఁగుకుండను దల నిడి♦విక్రయింప, సంచరించుచు నుంటిఁ ద♦త్సమయమందు.

ఉ॥ పిల్లనఁగ్రోవిఁ బెత్తమును ♦ బింఛము సన్ననిపట్టుపుట్టముల్
మెల్లని చూపు, జిర్నగవు, ♦ మేఘమనోహరవర్ణ మొప్ప భా
సిల్లెడి నందుపట్టి, నను ♦ సిబ్బితి వీడుచు నడ్డగించి నా
యుల్లము జల్లనన్ గరము ♦ నొందిి కరంబిడి డాసి పైసుకన్. ౪౦౫

ఉ॥ పెండిలిఁ జేసికొమ్ము నను ♦ వేఱుగ నెంచకుమంచుఁ బల్కె నో
మొండిశిఖండి! నవ్వెదువుఁ ♦ బుద్ధి యొకింతయు లేదె, దూరమం
దుండు, స్వయంభువున్ బెరుఁగు ♦ దొంగను నిన్ను వివాహమాడ నీ
కుండరె చెల్లెలమ్మలు? న ♦ వోధను నన్నిటులంటఁ బాడియే? ౪౦౬

చ॥ అనఁగ నతండు నాపయిని ♦ న్నాగ్రహమెంతయుఁ జూపి పెర్గకుం
డను బగులంగఁ గొట్టి దధి ♦ డగ్గఱి లాగి యురీయవస్త్రముఁన్
గొని కడువేగ నందివర ♦ గోత్రకకుప్పున కేగఁ గాంచి తో
డ్త నతనిఁ జిక్కఁజేసికొన ♦ దవ్వునరున్ జని వచ్చితిన్ వృథా. ౪౦౭

చ॥ అదిసుత, వాని పేరు మన ♦ మందుఁ దలంపను జూడ నాతఁడో
యదుకులజుండు, నిర్ధనుఁడు, ♦ నల్లఁడు రూపసిగాఁడు, దేబె, గా
న దయితుగా గణింపనుగ ♦ నానుడి సత్యమటంచు నమ్మి నీ
యెద నల కృష్ణు భర్తగ గ్ర ♦ హింపకు మమ్మ! సఖీవతంసమా! ౪౦౮

చ॥ పగఁ జెళ్ళి యిట్లు బల్కె వృష ♦ భానుకుమారిక యాలకించి బ
ల్వాగపును నబ్బురంబుఁగని ♦ బాపురె! యంచు సరస్వతిన్ స్వవా
క్యగతి ఘటించి యాదృతిని ♦ నాసఖ కిట్లనె గోపదేవతా!
యిఁగ నిటు రిత్తమాటలను ♦ నెక్కడ నీవనకమ్మ! యారయన్. ౪౦౯

చ॥ ఎవనిఁ గనుంగొనన్ విధిమ ♦ హేశముఖుల్ దప మగ్నిఁజేసిరో
యెవని పదాబ్జధూళిని వ ♦ హింప శుకాసురిదత్తు లాస్థ యో
గవిధి సమాధినుండి రల ♦ కైటభమర్దను నాదిపూరుషున్
బ్రవిమలునిన్ బ్రపూర్ణతము ♦ వైరముతోడ వచింతువే? సఖి! ౪౧౦

ఉ॥ ధర్మము లుద్ధరింపఁగ, న ♦ ధర్మములన్ నశియింపఁజేయ, స
త్కర్మము నిల్ప, వేదములఁ ♦ గావ, సుశీలురఁ బ్రోవ, ధారణిన్
శర్మముఁగూర్ప, దుర్జనులఁ ♦ జంప, దయాదులఁ బెంపుజేయ నే
మర్మము లేక పుట్టిన ర ♦ మాపతి దూఱుదువే యటుల్ జెలీ! ౪౧౧

ఉ॥ శ్రీరమణీయగోపులు వి ♦ శేషవిధంబుగ నాలఁ గాచుటన్
గోరస మెప్డు గ్రోలుటను ♦ గోతతి నామములన్ జపించుటన్

గోరజమూనుటల్ దలల, ♦ గోసుముఖంబుల నెప్పుడున్ జూచుటల్
వారలె శ్రేష్ఠు లాకులమె ♦ వర్ణ్యమటంచు నెఱుంగుమో చెలీ! ౪౧౨

చ॥ మునుపు మహేశ్వరుండె హరి ♦ మోహనరూపముఁజూచి మోహకం
ధినిఁబడి తన్నుఁ గొంచు దరి ♦ తెన్నులు దోఁచక యెంతొ వెట్టి యె
త్తినజను కైవడిన్ దనదు ♦ దివ్యముఖంబు సెడంగఁ బాములన్
బుసుకల బూదిఁ బెంజడలఁ ♦ బొంది విసంబును ద్రాగఁడే? ప్రియా! ౪౧౩

చ॥ నరసురయక్ష సిద్ధముని ♦ నాయకు లెవ్వని పాదపద్మముల్
శిరమునఁదాల్చి మ్రొక్కులిడి ♦ శ్రీ గలుగన్ భయభక్తులన్ బలిన్
సరగునఁ దెచ్చియెవ్వనికి ♦ సందియ మందక యిచ్చుచుందురా
సిరిచెలి నిర్ధనుండనుచుఁ ♦ జెప్పఁగరాని నుడుల్ వచింతువే? ౪౧౪

చ॥ వికటకృతి ప్రవీణులయి ♦ విశ్వముఁ బాడొనరించు ధేనుకున్
బకు నఘు బూతనాసురిని ♦ వత్సనిశాచరు వ్యోమదైత్యునిన్
శకటసురారినిన్ మఱి ని ♦ శాటుల నెందఱనో వధించి సౌ
ఖ్యకరవిధానముల్సలిపి ♦ క్రాలెడి నాహరియున్ వినింద్యుఁడే! ౪౧౫

చ॥ అల హరిభక్తిలేనియెడ ♦ నాతఁడు బ్రహ్మయుగాని యిందిరా
లలనయుగాని మూఁడు కను ♦ లన్దగు నీశుఁడుగాని యేరుగా
ని లలితకృష్ణరూపము స్వ ♦ నేత్రములన్ గనరమ్మ! భక్తవ
త్సలుఁడుగదా! చెలీ! పలుకు ♦ తాదృశనిందకు వాఁడు పాత్రుఁడే? ౪౧౬

చ॥ పరమదయానిధిన్ బతిత ♦ పావను విద్రుమబింబసన్నిభా
ధరవిలసత్ప్రియధ్వనిన ♦ దన్మరళీరతునిన్ ధరామనో
హరు స్మితపూర్వభాషి నిగ ♦ మాదినుతున్ జగదేకసుందరున్
హరిని నవాదిమధ్యలయు ♦ నట్టుల దూఱుట దోషమౌసుమీ! ౪౧౭

క॥ గోలోకనాకధాత్రీ, పాలున్ గరుణాలవాలు ♦ స్వర్ణసుచేలున్
బాలున్ బుధనుతసద్గుణ, జాలున్ లీలావిలోలు ♦ శపియింపకుమా. ౪౧౮

ఉ॥ ఆహరినిన్ భజించు పతి ♦ తాధములైనఁ బవిత్రులౌచు నా
యైహికపారమార్థికము ♦ లందలి సౌఖ్యము లొందకుందురే?
మోహముతోడ నావిధిని ♦ ముచ్చట లాడితివైనఁ దిర్గి నీ
యూహఁదలంపుమా! యనఁగ ♦ నొయ్యన నాయమ రాధ కిట్లనన్. ౪౧౯

చ॥ చెలి! భవదుక్తి ధోరణి వ ♦ చింపఁగ శక్యమె? యాబృహస్పతిన్
బలుకుల కల్కిఁబోలి శ్రుతి ♦ పద్ధతి నొప్పుచు నన్నుఁ దృప్తఁగా
సలిపెను సత్యమమ్మ! యిఁకఁ ♦ జక్రధరుం డిట నల్పకాలమం
దలరుచు నీ యభీష్టముల ♦ నన్ని యొసంగు నటంచు నెంచెదన్. ౪౨౦

ఉ॥ అంతట రాధ, వేడ్కపడి ♦ యమ్మరో! యాహరి ప్రేమతోడ నీ
పొంతకు వచ్చి నట్టయినఁ ♦ బొల్పుగ నేమి యొనర్పనౌను ప
ర్యాంతరమందు రానియెడ ♦ నాక్షణమందున నీకు నా ధనం
బంతయు నిచ్చి కానుకఁ బ్ర ♦ యాణము సల్పెద నంచు భక్తితోన్. ౪౨౧

ఉ॥ కన్నుల మోడ్చి గద్దెపయిఁ ♦ గంజదళాక్షుని భావపద్మమం
దెన్నుచునుండ శ్రీహరియు ♦ నిందునిభానన దివ్యభక్తి సం
పన్నను స్వేదసంయుతను ♦ బాష్పసమేతను రాధఁజూచి యా
పన్నదయాళుఁడౌచు స్వక ♦ పౌరుషదేహముఁ దాల్చె భూవరా! ౪౨౨

చ॥ పిదప సఖుల్ గనన్ ఘనగ ♦ భీరగళంబున శౌరిఁ రాధికా
సుదతికి నీరహీన్ బలికె ♦ సుందరి! యోకరభోరు! యిందుస
న్వదన! వ్రజేశ్వరీ! తరుణి! ♦ పంకజగంధి! చెలీ! భవజ్జపం
బెద లలిమెచ్చి వచ్చితిఁ ద్వ ♦ దీక్షణయుగ్మము విప్పి చూడుమా! ౪౨౩

ఉ॥ నీవిటఁ "గృష్ణ! రమ్మ"నుచు ♦ నిశ్చలభక్తిని బిల్వ వించు నా
గోవుల, గోపులన్, యమున ♦ కూలమునన్ విడి యందునుండి నీ
భావగతేప్సితంబుల న ♦ వారిగ నిచ్చి ముదంబుఁగూర్ప నే
ధావనముల్ బొనర్చి యిట ♦ దండిగ నుంటినిఁ గంటఁగాంచుమా! ౪౨౪

ఉ॥ ఇత్తఱి నిందునుండి నొక ♦ యిందునిభానన లేచి వెంటనే
తత్తఱపాటుతోఁ జనియెఁ ♦ దత్సతి, దేవియొ దయ్యమో మదో
న్మత్త నిశాంచరాంగనయొ ♦ మానవనారియొ యేరొ పల్కుమా
యుత్తరకాక్షులన్ మదిని ♦ నెంతయు నమ్మట బాము నమ్మకే. ౪౨౫

ఉ॥ కావున నేరిమాటలను ♦ గాదని నానుడు లెల్ల నమ్మచున్
నీవిఁకఁజూడు లేనియెడ ♦ నేనిటు వచ్చుట వ్యర్థమౌ సుమీ
నావుడు రాధ వేగ నయ ♦ నంబుల విప్పుచుఁ గృష్ణుఁజూచి యా
శ్రీవిభుఁ గౌఁగిలించుకొని ♦ చెందె ముదంబు విదేహభూవరా! ౪౨౬.

తే॥ ఇట్టి శ్రీకృష్ణసత్కథ ♦ నెవ్వరు విను, చుందు రవ్వార లిద్ధర ♦ నొంది సుఖము
లంతమందున గోలోక ♦ మందు నలరి, సకలసుఖములఁ గాంతురు ♦ జనకరాజ!

చ॥ అనవుడు మైథిలేశ్వరుఁడు ♦ హర్షపరీతమనస్కుఁడౌచు నో
మునివర! కృష్ణచంద్రుఁడటు ♦ బూనికని నావృషభానుపుత్రి ప్రే
మ నొగిఁ బరీక్షసల్పి యను ♦ మానము మానుచుఁ బ్రీతి ద
ర్శన మిడి యాత్మలీలఁ దొలి ♦ సల్పినకార్యము సెప్పుమా! యనన్. ౪౨౮

ఉ॥ నారదుఁ డిట్లనెన్ జనక ♦ నాయక! మాధవుఁ డంత మాధవీ
వీరుధముల్ గ్రహించి కడు ♦ వేడుక మాధవమాసమందు బృం

దారమణీయకాననము ♦ దర్పకుఁ డమ్ముల వేయు రాసకే
ళీ రచనేశుఁడై చని స్వ ♦ లీలలఁ జూపఁగడంగెఁ బొంగుచున్. ౪౨౯

రాసక్రీడా వర్ణనము.

క॥ వైశాఖ మాస పంచమి, శ్రీశుఁడు చంద్రోదయంబు ♦ నెసఁగన్ బ్రేమా
వేశముతో రాధాసతి, నాశుగతిన్ బోయి కూడె ♦ యమునోపవనిన్. ౪౩౦

వ॥ దేవా! యది యెట్లంటవేని వినుము. మున్ను గోలోకంబునుండి వెన్నని యానతిఁ గొంతదివ్యప్రదేశం బిద్ధరాస్థలంబున కాగతంబైనదని వాక్రుచ్చితి. అందుఁ బద్మరాగమయంబై కామధుక్ద్రుమంబులను మాధవీముఖవల్లరులను బుష్ప సుగంధంబులను దివ్యంబగు రూపంబు ధరించి నందనవనంబు విడంబించుచు బృందావనం బలరారు. దివ్యరత్నఖచితసోపానసంపన్నంబై వివిధవిహాగపరివృతంబై పుండరీకమండితంబై యమునాధునీరాజంబు ప్రవహించు. రత్నకూటవిభాసురంబును రత్నధాతుమయంబును ఫలపుష్పలతాసమాకీర్ణంబును నై సుందరంబులగు బిలంబులను మధురాంబుపూరితంబులగు నిర్ఘరంబులను శ్రావ్యంబులగు బంభరఝంకారంబులను జెలఁగి కరీంద్రంబుపగిది వెలుఁగు గోవర్ధనాచలేంద్రంబు దేజరిల్లు. ఉప్పరవీదినోరయు నుప్పరిగలను వాటంబులగు కొలువుకూటంబులను బొంకంబులగు నంకణంబులను నింబునుగొల్పు కంబంబులును గెల్పునుదెల్పు నిక్కినటెక్కియంబులను జక్కనిచదుకంబులను మధుమత్తంబులై శ్రీరాధాకృష్ణగాథాగానం బొనరించుచు నర్తించు మధువ్రతంబులను శుకపికశారికాముఖవిహంగకలకలనాదంబులను సంగతంబై శ్వేతపీతారుణపుష్పసందోహబంధురంబులగు నికుంజంబులు పుంజిమీఱు. మఱియు సహస్రదళసరోజరజంబుల సారెసారెకుఁ దూలించుచుఁ బుష్పసౌరభగ్రహణం బొనరించి చల్లనిపిల్లవాయువు లల్లల్లన వీచుచుండఁ జెలఁగు కుంజంబులును జెన్నుమీఱు. అందు నాసమయంబున శీలరూపవయస్సంపన్నలై విరిపాన్పు లమర్చు వెలఁదులు గొందఱును శృంగారకార్యకరణప్రవీణలగు శృంగారవతులు గొందఱును ద్వారపాలికలగు నారీమణులు గొందఱును బార్షదలగు భామలు గొందఱును ఛత్రచామరంబులం బట్టి మిసమిసలాడు మెలఁతుకలు గొందఱును బూలసొమ్ముల రచింపఁ జాలిన పొలఁతులు గొందఱును బృందావనపాలికలగు కుందరదనలు గొందఱును గోవర్ధనాచలనివాసినులగు కోమలాంగులు గొందఱును వీణావేణుమృదంగపాణివాదవిధానవిజ్ఞాననిధులగు మిటారులు గొందఱును విరాజిల్లిరి. మఱియు నందు నర్తతి నత్తామరసాక్షుసమీపంబున రాసక్రీడార్థంబు ద్వాదశయూథంబులును బ్రవర్తిల్లె. వెండియు నటకు ౪౩౧

క॥ నల్లనివర్ణంబొప్పఁగ, నల్లనిచీరన్ ధరించి ♦ నవమణిభూషల్
బెల్లుగఁదాల్చియు యూథం, బల్లనఁగొని కమలనేత్ర ♦ యగు యమున సనెన్.

తే॥ తెల్లవన్నియ చెన్నారఁ ♦ దెల్లకోక, వెలుఁగ ముక్తాభరణములు ♦ సెలఁగయూథ
యుతయు సుందరవదన శ్రీ ♦ మతియునైన, గంగ వేడుకతోఁ దుతఁ ♦ గదలిచనియె

తే॥ అంత శ్రీరమాదేవియు ♦ నరుణవసన, ములను దగి విధువిద్యుతి ♦ లలితయగుచుఁ
బద్మరాగవిభూషలు ♦ బరఁగ మంద, హాసమున యూథసహితయై ♦ యరిగె మఱియు

తే॥ పూలతోడవులఁ బెట్టి యం ♦ భోజరుచిని, దనరి తెల్లనిపుట్టంబు ♦ దాల్చి యూథ
మొంది శ్రీమధుమాధవి ♦ నందనంద, నసతి దమితోడ నేగె న ♦ నంతరమున.

తే॥ వరహారిద్రవస్త్రముం గట్టి ♦ సరసవాక్య, చతురయై గౌరసందీప్తి ♦ సహితయగుచు
రత్నభూషల ధరియించి ♦ రాణమీఱు, విరజ యూథంబుఁ గైకొని ♦ వెడలిచనియె.

తే॥ మాయ, లలిత, విశాఖలు ♦ స్వీయములగు, భూషణాంబరశోభలు ♦ బోలుపుగ నలుప
యూథములతోడ రమ్యబృం ♦ దోపవనము, రాసలీలార్థ మేగిరో ♦ రసికవర్య!

తే॥ అంత యూథసమేత హా ♦ కృష్టభార్య, లరిగి రంతట నవ్వారి ♦ యష్టసఖుల
యూథములు నేగె షోడశ ♦ యూథములును, బోయె ముప్పదిరెండన్ని ♦ యుత్తమునకు

చ॥ చదలున రిక్కలం గలిసి ♦ చందురుఁ డుండిన మాడ్కి వంశినిం
బెదవులఁ బెట్టి పాడుచును ♦ బెత్తముఁ గైకొని పచ్చపుట్టముల్
గుదురుగఁగట్టి పింఛమును ♦ గూకటిఁదాల్చి మనోజ్ఞరీతి ము
ప్పది మఱిరెండు యూథముల ♦ భామలఁగూడి యుపేంద్రుఁడొప్పెఁగా. ౪౩౯

చ॥ రతిని రతీశ్వరుండు దగి ♦ రాజిలుచాడ్పున రాసమందు శ్రీ
పతి యల రాధతోఁగలిసి ♦ భాసిలి వంశిని దివ్యరాగసం
తతులను బాడుచున్ యమున ♦ దాపున కేగి ప్రియాకరాంబుజం
బతిశయకోమలస్వకర ♦ రాబ్జమునన్ గొని సైకతస్థలిన్. ౪౪౦

తే॥ కూరుచుండి బృందావని ♦ సౌరుఁగనుచు, సరస సల్లాపముల్ దమి ♦ సలిపి నగుచు
లేచి కుంజకుంజంబున ♦ లీలఁదిరిగి, టక్కునన్ సతి కేల్విడి ♦ డాఁగె నెటనొ.

చ॥ అటుపయి రాధికాలలన ♦ యాతనిఁ గన్గొన గ్రమ్మఁరు గ్రమ్మఁరునం
దటవిని సంచరించి కని ♦ యంతిమ మందొక కొమ్మనున్న శ్రీ
చటులవిలాసు స్వప్రియునిఁ ♦ జట్టనఁ గాంచుచుఁ బట్టి నవ్వి య
చ్చట నెటొ యొక్కశాఖకుఁ ♦ జాటునఁ దానును డాఁగెఁ జక్రియున్. ౪౪౨

ఉ॥ ఏమఱుపాటునన్ స్వసతి ♦ యేగుచు దాఁగిన చోటు మార్గణం
బేమఱకుండఁజేసి తుద ♦ నెంతయుఁ గుంజములందుఁ బాఱు రా
ధామహిళన్ ధరారుహము ♦ దాపునఁ గన్గొని కేల్గ్రహింపఁగా
నామె స్వహస్తమున్ గొనుట ♦ కట్టిటులన్ గదలించె నత్తఱిన్. ౪౪౩

సీ॥ కాకినల్పును మించు ♦ చీఁకటి గ్రమ్మఁరులు, బంగారు తీవియఁ ♦ బరఁగి నట్లు
నాణెముగా నుండు ♦ నల్లనిమబ్బులు, వెలిఁగెడి మించునఁ ♦ జెలఁగి నట్లు

నీలాచలేంద్రంబు ♦ నిగనిగలాడెడి, బంగరుగనుల వె ♦ లింగి నట్లు
నేరేడుపండును ♦ మీఱిన నెమ్మేను, బచ్చని పచ్చల ♦ వఱలి నట్లు

తే॥ కృష్ణుఁడా రాధికాసతిఁ ♦ దృష్ణతోడ, మదనమోహనుఁడై రతి ♦ సుదతిఁగూడు
మన్మథుండన బృందయఁ ♦ మధురవనిని, రాసరంగంబునందున ♦ రాణమీఱె

ఉ॥ ఎందఱు గోపికల్ గలరొ ♦ కృష్ణుఁడు నందఱ కన్నిరూపులన్
బొందుచు రెండు ప్రక్కలను ♦ ముద్దులగుమ్మలు వెల్ల నంతరం
బందునఁ దా వసించి నటు ♦ నట్టుల నాట్యమొనర్చె వ్రేతలా
నందముతోడఁ బాడుచును ♦ నాట్యము సల్పిరి దివ్యవైఖరిన్. ౪౪౫

క॥ సించెను దమి మది హరి, నవ్వించెను బరిహాసకముల ♦ నింపుగ నాశ్లే
షించెను సర్వవిధుల మెప్పించెను రాసముల గొల్ల ♦ యింతుల నెల్లన్. ౪౪౬

తే॥ ఇంద్రుతోఁగూడి సురభామ ♦ లెల్ల కేలిమి, నలరినట్టుల గోపికల్ ♦ హరినిఁగూడి
వెలిఁగి రిట్టులఁ గృష్ణుఁడు ♦ లలితరాస, ములను సలిపెను గాళింది ♦ పొంత, నంత.

మ॥ జలకేళీరచనాకుతూహలముతో ♦ సంఫుల్ల పద్మోత్కరం
బల యక్షీజనమందు యక్షవిభుఁ డా ♦ యన్ ప్రీతిబద్ధాత్ములున్
జలజాతాయతపత్రనేత్రలగు ఘో ♦ షాయోషలన్ వెల్గుచా
జలజాతాప్తసుతాతటంబు నరుగన్ ♦ సాగెన్ నిరాతంకుఁడై. ౪౪౭

ఆ॥ అప్పు డాదియందు ♦ నాభీరసుందరీ, మణులు తటినిలోఁ గ్ర ♦ మముగఁ దిగుచుఁ
దరఁగలను కరములఁ ♦ దమ్ము నాశ్లేషింప, నరుగుదెంచు యమున ♦ నాదరించి. ౪౪౮

తే॥ చనులబంటిని జలనిల్వ ♦ శౌరి గని క, రేణువులఁగూడి కరియాడు ♦ రీతిఁ జనుచు
నగుచు నీర్గొంచు డాయుచా ♦ మగువలగుమిఁ, జల్లుచున్ గాఁగిలించుచు ♦ జనుచునుండు.

క॥ అత్తఱి నత్తరళాక్షుల, నెత్తావులుగల్గు వస్త్ర ♦ నివహము దేలెన్
దత్తరణికుమారిక తల, హత్తిన యుష్ణీషమనఁగ ♦ నవనీనాథా! ౪౫౧

ఉ॥ ఇట్టుల సర్వగోపికలు ♦ కృష్ణుని రాసవిహారమందు నే
నట్టులు లేనియట్టుల మ ♦ నంబున నుండెడి వాంఛ లన్నిటిన్
బెట్టుగఁ బొందిరా పటహ ♦ వేణుమృదంగవిపంచికాదు లి
ట్టిట్టన నట్లు మ్రోసె జగ ♦ దీశ్వరకీర్తిని జాటెనా యనన్. ౪౫౨

తే॥ యక్షచారణవిద్యాధ ♦ రాంగనలును, సిద్ధగంధర్వకిన్నర ♦ చేటికలును
రాసరంగంబు వీక్షించి ♦ రతినిమీఱె, ప్రశ్లథన్నీవులైరి యో ♦ పార్థివేంద్ర!

తే॥ వేల్పు లారాసరంగం బ ♦ నల్పరీతిఁ, గాంచి తత్సురాంగనలతోఁ ♦ గలిసి పూల
వానఁ గురిసిరి పిమ్మటఁ ♦ బద్మనాభుఁ, డా విధమున జలక్రీడ ♦ లాడి వేగ. ౪౫౪

ఆ॥ ఎల్ల వ్రేతలఁ గొని ♦ యల్ల గోవర్ధన, గిరికి నరిగి యందు ♦ వఱలుచుండు
శుద్ధరత్నఖచిత ♦ సిద్ధబిలంబునన్, రాసకేళిఁ జేసి ♦ రాధతోడ. ౪౫౫

తే. అల్లనల్లనఁ దిరుగాడి యచట గొప్ప, గొప్ప పూలగద్దియపైనిఁ గూరుచుండి
పర్వతస్థసౌదామినీ భాసురాభ్ర, మువలెఁ బొల్పారె భూవరా! యవల వినుము!

చ. అతిశయకాంతికాంతమగు నా పెనుగద్దియ నున్న రాధికన్
గుతుకముతోడ నెచ్చెలులు కుంకుమసంకుమదైణనాభి పు
ష్పతతిపటీరకజ్జలసువర్ణమణిప్రసృతోరుభూషణ
ప్రతతి నలంకృతుల్ సలిపి భాసిలఁజేసి రనంతరంబునన్ ౪౫౭

చ. యమున, నవప్రసూనరస మక్ష్వవిధంబున మీఁదఁ జల్లి యా
యమకు విధిప్రకారముగ నర్చల సల్పియుఁ బ్రేమకాళిసే
ద్రములకు విందొనర్చు నవరత్నవిభాసురనూపురంబులన్
గ్రమముగఁ బాదతోషికము గా నిడి కౌతుకమొందెఁ బిమ్మటన్. ౪౫౮

ఉ. గంగదభంగతుంగబహురమ్యతరంగవినోద యైన శ్రీ
గంగయుఁ, గీర్తినందిని కకల్పమభక్తిపరీతచిత్తయై
ఖంగను గజ్జియ ల్లలిగి కమ్మల పందువ సేయుచుండు పా
దాంగద మొందు కాన్కఁగ సమర్పణముం బొనరించె నావలన్. ౪౫౯

చ. విరజయు, గోటిచంద్రసమ విద్యుతిసంయుత చంద్రహార, మిం
పార, వరకింకిణుల్, మధుమతీసతి, యంగదయుగ్మ మేకదా
శి, రుచిరకంకణంబులను శ్రీమధుమాధవి, హారముల్ విశా
ఖ రతనాలకంటె మఱిఁ గమ్మలు బంది, యొసంగెఁ బొంగుచున్. ౪౬౦

తే. అంగుళీయకమణులఁ జంద్రానన సతి, లలిత కంచుకరత్నముల్ జెలువమిన్న
యైన యానందిభామ, యపర్ణ్యఫాల, తోరణంబు నొసంగె సంతుష్టితోడ.

ఆ. బాలభానుతుల్య ఫాలపుష్పంబును, చంద్రకన్య, యిడెను సంతసమునఁ
బద్మపూర్ణ, శీత భానుభాసమ, ఫాలతిలకబిందు వొలి నొసఁగె. ౪౬౨

తే. మఱియుఁ బద్మావతియు ఘ్రాణ మౌక్తికంబు,
బాహుపురులను శతచంద్ర వక్త్రి, యింక
వరశిరోమణిన్, సుందరీ భామినియును,
భక్తితోడుత నిచ్చె నో పార్థివేంద్ర. ౪౬౩

క. బృందావననాయికయగు, బృందాసతి, రమ్యరత్న వేణిని, మఱి యా
నందదచూడామణి నా, నందముతోడ వృషభాను నందన కిచ్చెన్. ౪౬౪

తే. కృష్ణచంద్రుండు ప్రేముడి నెసఁగి యిట్లు, రమ్యశృంగారసంస్ఫుర ద్రాధతోడఁ
గూడి గిరిమీఁద నొప్పెను గోర్కితోడ, యజ్ఞుఁడా దక్షిణాసతి నలరినట్లు. ౪౬౫

తే. ఎలమి గోవర్ధనాద్రియం దెచటఁజక్రి, రాసరంగంబు నిర్మించి రాధతోడ
రాసకేళుల సల్పుచు రాణమీఱె, నచట శృంగారమండలం బలరె, భూప!

ఉ॥ పిమ్మట స్వప్రియల్ గలిసి ♦ వెన్నుఁడు చంద్రసరోవరంబు చే
గమ్మనఁ జేరి దానియుద ♦ కమ్ములలో గజపంక్తిఁ గూడు నా
గమ్మ విధాన నాటలను ♦ గ్రాలఁ గళానిధి, చంద్రకాంతర
త్నమ్ముల రెండుగొంచు నిడ ♦ తద్వ్రజభానుకుమారి కాస్థతోన్. ౪౬౭

తే॥ వేయిదళములు గల రెండు♦తోయజంబు,లొంది యొక్కటి రాధకు♦నొకటి హరికి
నిచ్చి చనియెనుఁ దరువాతఁ♦గృష్ణుఁడెలమిఁ, బరమ బృందావన శ్రీని♦సరిగఁ గనుచు,

ఉ॥ భూరుహవల్లరీయుతము ♦ బుణ్యసరోవరభూషితంబు నా
నారుచిరమ్యబాహులవ ♦ నంబున కేగియుఁ దిర్గి చెమ్మటల్
గాఱఁ జరించు నెచ్చెలుల ♦ గాంచి సమంచితవంశి, మేఘమ
ల్లారమనోజ్ఞరాగ మతు ♦ లంబుగఁ బాడె విదేహభూమిపా! ౪౬౯

ఉ॥ అంచితరాగ మట్లు విని ♦ యభ్ర మదభ్రముదంబుఁ బొంది వ
ర్షించె సువాసనారుచిర ♦ శీతలవాతము వీచె గోపికా
సంచయముల్ వ్యథల్ విడిచి ♦ సంతస మందియుఁ గృష్ణచంద్రు ధ్యా
నించుచు సద్గుణంబులను ♦ నెమ్మిని గానముఁ జేసె నంతటన్. ౪౭౦

చ॥ హరి యటనుండి లేచి తన ♦ యంగన లెల్లను వెంటనంట స
త్వరగతి నేత్రపర్వమగు ♦ తాలవనంబున కేగి యందు సం
బరమున రాసకేళులను ♦ బాడుచు సల్పఁగడంగె నింతలోఁ
గరము వ్రజాంగనాతతి ద ♦ గన్ దగి చెమ్మట గ్రమ్మ నిట్లనెన్. ౪౭౧

శా॥ శ్రీకృష్ణా! హృదయేశ్వరా! వినుము! మా ♦ రీతుల్ దగ న్నాలుక
ల్పీకన్ సాగను దూరమయ్యె నల కా ♦ ళిందీనదీరాజ మి
క్లోకాండంబుగఁ గాఱుచుండెఁ జెమటల్ ♦ సృష్టిస్థితిధ్వంసముల్
జోకన్ సల్పెడివాఁడ వీవె యిపుడా ♦ శుద్ధాంబులం దాడనా. ౪౭౨

చ॥ అని వినయంబుగాఁ బలుక♦నాకమలేక్షణుఁ డాలకించి గొ
బ్బునఁ దనవేత్రదండమున ♦ భూమిని బాఁదె ననంతరంబునం
దున నట వేత్రగంగ యన ♦ దొడ్డధునీమణి పుట్టె దాని స్ప
ర్శనమున బ్రహ్మహత్యలు గ ♦ రంబు నశించుఁ బరంబుఁ గల్గెడిన్. ౪౭౩

ఉ॥ అంత ననంతలోకపతి ♦ యా హరి రాధను గోపికాజనం
బంతయుఁగొంచుఁ దజ్జలము ♦ నందు యదృచ్ఛగఁ గ్రీడలాడి బల్
సంతసమొంది యద్ది విడి ♦ సాగి లతాతరుపంక్తితోడ నా
పొంతఁ జెలంగుచుండిన కు ♦ ముద్వనముల్ జన మైథిలేశ్వరా! ౪౭౪

ఉ॥ అచ్చట నచ్యుతుం డలరి ♦ యాయళిఝుంకృతు లాలకించుచున్
మెచ్చుచు రాసరంగమును ♦ నిర్మితిఁ జేసి సఖీజనంబులన్

జొచ్చియు రాసమున్ సలిపె ♦ సొంపుగ రాధయు మండనంబు లా
పచ్చనిపట్టుపుట్టముల ♦ భాసిలు సామి కొనర్చెఁ దత్స్థలిన్. ౪౮౭

సీ॥ సౌరభవాసిత ♦ చంపకసుమములఁ, గరము గట్టిన నడి ♦ కట్టు గలిగి
వేయిదళంబుల ♦ వెలుఁగు పద్మంబుల, సొంపుదు నింపిన ♦ శ్రుతులఁబొంది
కనులపండువసేయు ♦ గట్టుకడిమిపూల, దంబు సెలఁగు కిరీ ♦ టంబుఁబొంది
యందంబుగా నుండు ♦ మందార కుసుమంబు, లమరిన యుత్తరీ ♦ యంబు నొంది
తే॥ మోహినీమాలఁదాల్చి యం ♦ భోజయష్టిఁ, గేలఁగైకొని మల్లికా ♦ కేతకీ కు
సుమములన్ వెల్గు హారము ♦ సొరిదివేసి, తులసితోఁ గూడు తోమాలఁ ♦ జెలఁగుచక్రి.

వ॥ సర్వర్తుకాంతుండగు వసంతుం డొప్పిన చొప్పున స్వప్రియచే నట్లు కుసుమద్వనంబునం బుష్పంబులచే నలంకరింపఁబడి తేజరిల్లఁ, దద్వ్రజాంగనాజాలం బాలోకించి వీణావేణుమృదంగనాదంబులం బొనర్చి మనోహరంబు లగు భైరవ మేఘమల్లార భూపాళ హిందోల బంగాళ మాళవి దీపక కోశల మోహన పున్నాగ శ్రీరాగాదులను వేఱువేఱుగా గానంబొనర్చి యష్టతాళంబులను, షడ్జమధ్యమ గాంధారంబు లనెడి మూఁడు గ్రామంబులను, స, రి, గ, మ, ప, ద, ని, యను సప్త స్వరంబులను, హావ, విభావ, భావానుభావసంభావితంబులును హృదయంగ మంబులును నగు నృత్యంబులం గావించి జగన్మోహనులగు శ్రీరాధాకృష్ణులను సంప్రీతులం జేయఁ దత్సుందరీబృందపరివృతుండగు నాహరి, యటనుండి వెడలి మురళీగానంబు కర్ణపేయంబుగా నల్పుచు వికచన్మాలతీమాధవీముఖలతావిద్యో తితంబును, దివ్యవృక్షసమావృతంబును, శారికాకీరాదివిహగకలరవసంభ్ర తంబును, నిర్జనంబును, సకలజనమనోభిరామంబు నగు మధువనంబున కేగి యందు నందనవనంబున బృందారకేంద్రుం డింద్రాణీసహితుండై యానందంబుఁ జెంది నట్లు గోపికాగణంబులతోఁ గ్రీడించి పిల్లుమోదిల్లి యందునుండి వెడలి

ఉ॥ కుందవనంబు నామ్రవనిఁ, ♦ గోమలమాలతిసద్వనంబు, నా
నందదనాగరంగవని, ♦ నవ్యకదంబవనంబుఁ గేతకీ
బృందవనంబు, దీర్ఘవట ♦ విస్తృతసద్వని, దాడిమీవనిన్
సుందరపిప్పలావని, న ♦ శోకవనిన్ గని తిర్గి పిమ్మటన్. ౪౮౮

చ॥ వకుళ కరిల్ల కుంజ పిచు ♦ బాదర నింబ తమాలసద్వన
ప్రకరముఁ బొంది కాంచి మఱి ♦ ద్రాక్షల కానకు, నేగి శ్రీఫల
ప్రకటవనంబుఁ జొచ్చి యటు ♦ పైఁగదళీవనిఁ జూచి కోవిదా
ర కుటజ దేవదారువన ♦ రమ్యముఁ గన్గొని యుల్లసంబునన్. ౪౮౯

క॥ తులసీవనమునఁ జొచ్చియు, బొలుపును గని యంతఁగల్ప ♦ భూరుహావనిలోఁ
లలితంబుగఁ దిరిగియు నా, స్థలమును విడనాడి సంత ♦ సంబున నేగన్. ౪౯౦

ఉ॥ కామవనంబుఁ జేరి యటఁ ♦ గ్రాలు గిరీంద్రమునందు గోపికా
స్తోమముతోడ నాడి నగు ♦ చుఁ మధురాధరలగ్నవంశితోఁ
బ్రేముడి గానముఁ సలుప ♦ బ్రేతలు మోహపయోధిమగ్నలై
యేమియు గుర్తెఱుంగనటు ♦ లిద్ధర వ్రాలిరి మూర్ఛతో విభూ ! ౪౮౧
చ॥ మఱియు నమర్త్యభామలు వి ♦ మానములన్ మదనాస్త్రభిన్నలై
సురలను గూడి కశ్మలత ♦ సోలుచు వీడడి పోకముళ్లతో
వఱలిరి నర్దెఱుంగులగు ♦ ప్రాణులు స్థావరరాజితోడ సొ
మ్మ రహిని బొందె నిల్చె నది ♦ మండలి యార్ద్రతఁ జెందె శైలముల్. ౪౮౨
ఉ॥ కామవనంబునం దలరు ♦ గ్రావము శ్రీహరి పాదచిహ్నితం
బై మెఱపొందె నందెవఁడు ♦ పానముఁ దానము నాచరించునో
యామనుజుండు ధన్యతను ♦ నందును భూవర ! యంత శౌరి గో
పీమహిళాన్వితుండగుచు ♦ వేడ్కను జేరుచు నందిశైలముఁ. ౪౮౩
చ॥ కదునిదుపైన సానువులఁ ♦ గ్రాలుచు రాసము సల్ప నుండి నా
పడఁతులు నాన యెక్కవగ ♦ భావములందునఁ బొంది వెంట రాఁ
దొడఁగక పోవుటన్ గనుచుఁ ♦ దోడ్తనె రాధికతోడఁ గూడి య
క్కడనె యదృశ్యుఁడయ్యెఁగద ♦ కాంతలు ముగ్ధలుగారె ! యారయన్. ౪౮౪

గోపీ విరహ వర్ణనము.

ఉ॥ అంతట గోపికాలలన ♦ లాత్మమనోహరుఁ జూడ వాఁడు త
త్ప్రాంతమునన్ వసింపమిని ♦ బాష్పము లొల్కుచునుండ భీతితో
నెంతయు నిట్లటుల్ దిరుగు ♦ నిట్టివలెన్ వనమందు నింక నా
చెంతలఁ దిర్గిరో జనక ! ♦ చెప్పఁగరాని యనంతచింతలన్. ౪౮౫
క॥ కురరులు కురరముఁ జూడవు, కరణిని గరినాథుఁ గరులు ♦ గానని భంగిన్
హరిఁగనఁ జాలక వెత్తిని, వఱలిన రహి వారు దిరిగి ♦ ప్రశ్నించి రిటుల్. ౪౮౬
సీ॥ మధుకంబ ! కంటివే ♦ మధురిపుఁ గానవే, మధురసా! మధురిమ ♦ విధితవచను
బ్రహ్మణ్య ! కంటివే ♦ రక్షిత బ్రహణ్యు, క్షీరికా ! కానవే ! ♦ క్షీరచోరు
నర్జున ! కంటివే ♦ యర్జునసన్మిత్రుఁ, గుందమా ! కానవే ! ♦ కుందరదనుఁ
బూతనా ! కంటివే ♦ పూతనాఘాతకు, భూరుండి కానవే ♦ భూరమణుని
తే॥ హేమపుష్పిక ! కానవే ♦ హేమచేలుఁ, దిలకమా ! కానవే ! బుధ ♦ తిలకుఁ గనిన
నెనరు మాపయి నించి యీ ♦ నిముసమం మం,జూపి రక్షింపరే మమ్ము ♦ శోకమూడ
సీ॥ మన్మథ ! కానవే ♦ మన్మథ మోహను, మందార ! కంటివే ♦ మందహాసు
పున్నాగ ! కానవే ♦ పున్నాగ వందితుఁ, జిత్రక ! కంటివే ♦ చిత్రచరితు
సహకార ! కానవే ♦ సజ్జనసహకారిఁ, గితవంబ ! కంటివే ♦ కితవరిపుని
శ్రీఫలా ! కంటివే ♦ శ్రీరమణీశ్వరుఁ, గృష్ణలా ! కంటివే ♦ కృష్ణచంద్రుఁ

తే॥ సకలవృక్షమ్ములార! మా♦సకల భువన, నాయకుని గాంచినం గరు♦ణాళువులయి
యెచట నుండిన వార్త మా♦కెఱుఁగఁ జెప్పు, వేఁడుచుంటిమి శిరముతో♦వినతిఁ జేసి

చ॥ వనవనమందు నిట్టుల న♦ పారముగా హరివర్ణనంబులన్
బొనరిచి సర్వవృక్షముల♦ ముంగల కేగి కరంబులన్ మహా
వినయముతోడ మోడ్చి బహు♦ వేదన వేఁడిన, నవ్వి సెప్పుమిన్
వనటను గృష్ణ! కృష్ణ! యని♦ పల్కుచు నాహరి నమ్మియుండుడున్. ౪౮౯

ఉ॥ గోపిక లంద అబ్రముగఁ♦ గోమలి యాకృతులం ద్యజించి ల
క్ష్మీపతిరూపముల్ భ్రమర♦ కీటవిధంబునఁ జెంది తత్పదా
రోపితభూమిపైఁ దగి ని♦ రూఢిగఁ గాంచియుఁ గాంచలేక రా
ధాపదయుఙ్ దుదన్ గని రి♦ తత్పదచిహ్నితదివ్యదేశమున్. ౪౯౦

క॥ నాపుడు మిథిలేశుండో, దేవమునీ! చక్రి, రాధఁ♦ దేఁకువఁ గొని తా
నేవిధి నెచటకుఁ జనియెనో, యేవిధి మఱి గోపికలకు♦ నెట నగుపడెనో? ౪౯౧

చ॥ అని యడుగంగ మౌని, జన♦ కా! వినుమా హరి, రాధతోడ ని
ర్జనము, రహస్యమైన వట♦ సాలసమీపమునందుఁ జేరి గొ
బ్బునఁ దనరాణినిన్ గబరి♦ పుష్పులచేత నలంకరించె నం
త నల ప్రియాలలామయు ము♦ దంబు మనంబునఁ బొంది డంబునన్. ౪౯౨

తే॥ చక్రినీలకుంతలముల♦సంగ్రహించి, మెలియఁ బెట్టి సువాసనా♦మిళితతైల
ములను బూయుచు దువ్వి సం♦పూర్ణ చంద్ర,ముఖమునం బత్రభంగంబుఁ♦బూని సల్పె.

ఉ॥ అంతట రాధికాచ్యుతులు♦ నావటము న్విడి భద్రకానన
ప్రాంతముఁ జెంది యంత ఖది♦ రప్రకటాటవి కేగి తిర్గుచున్
సంతస మొంది బిల్వవనిఁ♦ జక్కఁ భ్రమించియుఁ గోకిలాటవిన్
వింతలఁ జూచి పాడుచును♦ వేడుకఁ జెందుచునుండిరో విభూ! ౪౯౪

చ॥ అరయుచు వ్రేత లట్టులఁ ద♦ దచ్యుత పాదసుచిహ్నితావనీ
సరణినిఁ బట్టి పోవుతఱి♦ స్వస్తిక, చక్ర, ఝషా, ష్టకోణ తో
యరుహ, ఘట, త్రికోణ, విశి♦ ఖాంకుశ, కేతన, శంఖ, నీల గో
ఖుర, సమచంద్ర, వజ్ర, యవ♦ గుంఫిత రేఖలఁగాంచి వెంటనే. ౪౯౫

చ॥ ఘనముగ నున్న ఛత్ర యవ♦ కంబు సుచక్ర గదార్ధచంద్ర జీ
వనజ కుశాంకు శాసన ల♦ వంగ లతా ధ్వజ బిందుయుగ్మ మ
త్స్య నగ శతాంగ శక్తి విల♦ సద్వర రేఖలఁ జూచి రాధికా
వనిత పదంబు లివ్వి యని♦ వాకొని రా వ్రజకాంత లంతటన్. ౪౯౬

చ॥ ఒకయెడ నిల్చి మార్గమున♦ నోచెలులార! రమేశ్వరుండు రా
ధికను గ్రహించి యీపథినిఁ♦ దిన్నగ నేగెను గాంచ నానటం

చకయుతభక్తిఁ గోకిలమ ♦ హాటవిఁ జేరిరి తత్ప్రవేశసూ
చకరవ మా వనిం దిరుగు ♦ శౌరియు వించల రాధ కిట్లనెన్. ౪౯౮

తే॥ కోటిచంద్రప్రతీకాశ! ♦ కువలయాక్షి!, రాధికా! ప్రియ! గోపికల్ ♦ రా మొదలిడి
నిన్నుఁ గొంపోవఁ గలరిఁక ♦ నీవు వేగ, నరుగుదెంచుము నాతోడ ♦ ననియె నవల.

ఉ॥ మానవతీలలామయు, స ♦ మంజసయౌవనరూపశీలకా
లీనమనోజ్ఞ రాధిక, బ ♦ లిప్రభువైరి నచించు సూక్తిసం
తానము నాలకించి ప్రియ! ♦ తాళను నే సుకుమారిఁ జెమ్మట
ల్మేన స్రవించెడిన్ గదల ♦ లే నిఁక నన్నెటుఁ గొంచు నేగెదో! ౪౯౯

ఉ॥ ఇట్టులఁ జెప్పఁగా సరసి ♦ జేక్షణుఁడున్ విని స్వీయమైన హా
బట్టున వెల్గు పుట్టమును ♦ బట్టి స్రవించెడి స్వేద మార ని
క్కట్టులు సట్టన న్విడువఁ ♦ గాఁ దగినట్టుల వీచి దేవి! యీ
పట్టున లెమ్ము రమ్మనుచుఁ ♦ బాణిఁ బట్టుచుఁ బల్కె నామెయున్. ౫౦౦

చ॥ పెడచెవిఁ బెట్టి యూరుకొనెఁ ♦ బిమ్మట లచ్చిమగండు తిర్గి యా
పడఁతికి నిట్టులన్ బలికె ♦ మానినిరో! మనముందుపట్టు ని
ష్ఫలము గనిపెట్ట గోపికల ♦ మొత్తము వచ్చెడి, నిందు వారిని
న్విడి యెటకేని బోయి యట ♦ నీకెది యిష్టమొ యద్ది దీర్చెదన్. ౫౦౧

ఉ॥ కావున లెమ్ము నాభుజము ♦ గట్టిగఁ బట్టుచు నెక్కు హాయిగా
నీవు వసింపు మంచుఁ గను ♦ నిక్కనస్కంధము మీఁద నాయమన్
దా వహియించి యెక్కడకొ ♦ తర్లె, ననంతరమంను గోపికల్
శ్రీవిభుఁ గాంచఁ జాలక వి ♦ శేషవియోగకృశానుదగ్ధలై. ౫౦౨

ఉ॥ సిబ్బితి వీడి యా యడవిఁ ♦ జేరి కడుంగడు నేడ్చి రా దరిన్
బ్రబ్బిన గోపి యూథము ల ♦ వారిగ వించల కోకిలాటవిన్
గొబ్బునఁ జేరి యాద్రుతినిఁ ♦ గోమలులార! నిమేష మీరిటన్
నిబ్బర మొందుఁడీ కనుల ♦ నీరము గాఱఁగ నియ్యకుండుఁడీ! ౫౦౩

చ॥ అని తమి నాశ్వసించు తఱి ♦ నన్నలు గొందఱు రెండు ప్రక్కలం
దున మకరందసేచనము ♦ తుష్టిగ సల్పి సుగంధ వస్తువుల్
గొని మెయిఁ బూసి తళు ♦ కు ల్గలుగంగ నలంకరించి వీ
వనలను ఛత్రచామరలఁ ♦ బట్టుచు వీవ మహాద్భుతాకృతిన్. ౫౦౪

చ॥ సవిధము నందు వేడ్కనొక ♦ స్వామిని గన్పడి యల్ల గోపికా
నివహము నూఱడించి "బళి! ♦ నీరజలోచనలార! రాధికా
ధవుఁడటు రాధ మానమును ♦ దాఁగొన నేగెడి" నన్న విన్న న
బ్జవిపులనేత్రలైన వ్రజ ♦ భామలు విస్మయ మొందిరో విభూ! ౫౦౫

క॥ వింతల నటుబొందిన త, త్కాంతలు తాళస్వరములు ♦ గ్రాలఁగఁ దచ్ఛ్రీ
కాంతగుణయశోగానము, చింతలఁ బోఁద్రోసి యిటులఁ ♦ జేసిరి భక్తిన్. ౫౦౬

గోపికలు శ్రీరాధాకృష్ణుని గీర్తించుట.

తే॥ నందనందన! యానంద♦కంద! కుందరదన! మన్మథమోహనా♦సదయహృదయ!
విశ్వభూషణ! జనసుత! ♦ విశ్వదీప!, విశ్వదుఃఖవినాశకా ♦ వినతు లివిగో.

చ॥ అవనిసురోత్తమ శ్రుతి జ ♦ యధ్వజ! నందకులాబ్జభాస్కరా!
దివిషదమోఘవంద్య! సుర ♦ తృప్తిదకార్యధురీణ! ధారణీ
ధవ! మధువైరి! ముక్తజన ♦ దర్పణ! కంసమురాదిమారణా
ర్థవిధికృతావతార! యదు ♦ రాజ! జయంబు ఘటిల్లుచుండుతన్. ౫౦౮

క॥ గోపాల సింధు చంద్రమ!, గోపకవంశాద్రిశిఖర! ♦ గోధునికమలా!
గోపరిపాలన దక్షా!, గోపక గృహ రత్నదీప! ♦ గోపక వినుతా! ౫౦౯

క॥ రామాభిరామ! సుగుణో, ద్దామా! కల్యాణసీమ! ♦ దైత్యవిరామా!
కామటతేజోధామా!, రామానుజ వారిదాభ ♦ రామా! భూమా! ౫౧౦

క॥ రాధాస్యసరోజాళీ!, రాధాముఖచంద్రకోక! ♦ రాధారమణీ
మాధుర్యలతామాధవ!, రాధాహృచ్చంద్రహార! ♦ రాధాకృష్ణా! ౫౧౧

ఉ॥ ఎవ్వఁడు రాసకేళులను ♦ నింతులఁ గూడుచు నాచరించెనో
యెవ్వఁడు వేణుగానమున ♦ నెల్లజగంబులఁ దృప్తిఁ జేసెనో
యెవ్వఁడు గోపికాళి నయ ♦ నేంద్రియజీవనమూలహారమై
యవ్వముగా వసించు నల ♦ మాపతి మా పతి మమ్ము మన్చుతన్. ౫౧౨

ఉ॥ ఏవిభుఁడెల్ల యూథముల ♦ యిష్టముదీర్పఁ గడంగె నేఁడు రా
ధావనజాక్షిమానము న ♦ దాటున నొంటిగ మాన్చె నేఁడు బృం
దావనిఁ దళ్కుసల్పె వసు ♦ ధావిభవాఢ్యుఁ డెవండొ యెవ్వఁడా
గ్రావము శుద్ధిజేసె నల ♦ కారుణికుండు ప్రసన్నుఁడయ్యెడున్. ౫౧౩

చ॥ అరుణ, కళానిధుల్, జ్వలను ♦ సట్లు, ప్రసన్నవనప్రవేశమో
ఘురకవనప్రవేశముగ, ♦ సొంపగు చల్లనిగాలి వీల్చుగా
విరు లెఱనిప్పుతునకలుగ, ♦ వేశ్మము నొల్కగ, మాకుఁ దోఁచె ని
న్దొఱఁగిన నాఁటగోలె దయ ♦ తోడఁ బ్రసన్నతఁ బొందు మోహరీ! ౫౧౪

చ॥ తొలుత, సుదాసపుత్రకుని ♦ తొయ్యలి, భర్తను వీడి బాధల
న్నలిగెను, దానికంటె నలు ♦ నాతి, పతిన్ విడి కష్టమొందె నా
సిలుగుల మించి సీత తన ♦ జీవితనాయకుఁ బాసి పెల్లు బా
ములఁ బడె దానికన్న నిది ♦ పొందఁగ రానిది కృష్ణ! ప్రోవుమా! ౫౧౫

శ్రీకృష్ణుండు గోపికలకుఁ బ్రసన్నుండగుట.

మ॥ అని ప్రార్థింపఁగ దేవకీసుతుఁడు భూ ♦ షాలంకృతాకారుఁడై
నును పుట్టంబులఁ గట్టి తన్మురళిచే ♦ నూఱారు రాగంబులన్
ఘనలీలన్ గడు గానమున్ సలుపుచా ♦ కాంతాసమూహంబునన్
దనరెన్ రాధను గూడి చిర్నగవు వ ♦ క్త్రింబందుఁ బొల్పారఁగాన్. ౨౧౬

తే॥ అంత గోపిక లందఱు ♦ జింతలవిడి, వచ్చి నిలిచిన కృష్ణుని ♦ ముచ్చటఁగని
యొక్కసారిగ లేచి య♦నుత్తమ విధిఁ, జుట్టు ముట్టిరంతట మధు♦సూదనుండు

క॥ గోపిక లెందఱు గలరో, రూపము లన్నింటిఁ దాల్చి ♦ రోచిష్ణుండై
యాపడుచులలో నడుమను, నేపునఁ దా నిల్చి నాట్య ♦ మెలమి నొనర్చెన్.

తే॥ చేసి యట్టుల నాట్యంబు ♦ శ్రీధరుండు, వనమునం దొక్కచో నుండ♦వల్లవసతు
లుగని యాజలజాలయా♦లోలు డాసి,దోసముల క్షమింపు మటంచుఁ♦జేసి నతుల.

క॥ వినవే మా మొఱ, దేవా!, కనవే కారుణ్యమతిని ♦ గాసుగ జగమున్
గని సర్వము నీవే యని, మనమందున నమ్మి మమ్ము ♦ మఱచుట దగునే ?

క॥ నమ్మిన మమ్మును మోస, మ్మిమ్మాడ్కి నొనర్చి యెచటి ♦ కేగితివో నీ
నెమ్మది యెట్లు సహించెనొ, యమ్మక్క ! యిదేమి న్యాయ ♦ మయ్యా కృష్ణా!

ఉ॥ అపయిఁ గృష్ణమూర్తి వినుఁ ♦ డంగనలార ! మనోజ్ఞ పుష్కర
ద్వీపమునందు దధ్యుదధి ♦ దివ్యమునీంద్రుఁడు హంసనామకుం
డోపి మనుద్వయాంతరము ♦ నుత్తమపద్ధతిఁ గోర్కిలేక నా
ప్రాపును వేఁడుచున్ దపము ♦ బాఢముగా నొనరించె నింతలోన్. ౨౨౨

తే॥ యోజనార్ధశరీరము ♦ నొందియున్న, రెండు చేఁపలే తెంచి యా ♦ దండిజోగి
మ్రింగె. వానిలో నుండి య ♦ భంగ భంగి, నిర్గమించెఁ బాణాన్నమక ♦ నిర్జరారి.

ఉ॥ భక్తున కంతవంత యటు ♦ వచ్చుట గాంచి బిఱాన నేగి నా
శక్తిని వానిఁగొట్టి ముని ♦ సత్తముఁ గాచియుఁ దెల్లదీవిలో
యుక్తముగాఁ జెలంగెడి ప ♦ యోధి ఫణీశ్వరతల్పమందునన్
రక్తిఁబరుండి వెండియుఁ గ ♦ రంబుగ మీవెతఁ గాంచి వచ్చితిన్. ౨౨౪

తే॥ భక్తవశ్యుఁడ నెప్పుడున్ ♦ భామలార !, క్షీర సాగర మందలి ♦ శేషశయ్య
గాఢనిద్రను జెందెడి♦ బాధ సౌఖ్య, మువిడి యిటు వచ్చుటకు నదే♦మూలమయ్యె.

తే॥ శాంతి దాంతి సమేతులు ♦ సర్వసములు, నైరపేక్ష్యులు నగు ముని♦నాథులెల్ల
జ్ఞానవిషయుల్ రసాదుల ♦ సరణి నెఱుఁగు, కరణి నానిరపేక్షు సు ♦ ఖమని కంద్రు

తే॥ అంత గోపికలో దేవ ! ♦ యబ్ధియందు, శేషశయ్య నీకొప్పిన ♦ చిత్రరూప
మిపుడు దయతోడఁజూపు మో♦కృష్ణచంద్ర!, యనుచు సన్నుతింపఁగ నాతఁ♦డభిమతించి

సీ॥ అభ్రంకషంబులౌ ♦ యలలతోడుతఁ గ్రాలు, పాలకడలి నటఁ ♦ బ్రాఁకఁజేసి
నవరత్నములతోడ ♦ నయనపర్వ మొనర్చు, ప్రాసాదరాజముల్ ♦ బ్రబలసల్పి
బాల ప్రభాకర ♦ భవ్య సహస్ర భో, గంబులు గల శేషుఁ ♦ గ్రాలఁజేసి
వృషభాను పుత్రియై ♦ విశ్వమోహినియైన రాధను లక్ష్మిగా ♦ రాణమార్చి
తే॥ అష్టభుజములఁదాలిచి♦యంఘ్రితలము, నంటుఁగేలుమాల జవరాలు♦నడుగు లొత్తి
కోటి మార్తాండ మూర్తియై ♦ కుండలీంద్ర,శయ్య నిద్దురవోయె నో ♦ జనకరాజ!
చ॥ పదపడి గోపికావళి, య ♦ పాంపతి నిర్మిత శేషశయ్యపైఁ
గుదిరిన కృష్ణచంద్రుఁగని ♦ కొంకక మైదుపదుల్ బొనర్చి స
మ్మదమును బొందె నేస్థలి న ♦ మోఘముగా హరి దర్శనంబు త
త్సదతుల కిచ్చె, నాస్థలము ♦ దోషహరంబును బుణ్యదంబగున్. ౧౨౯

యమునాతటమందు రాధాకృష్ణులు విహరించుట.

క॥ పిమ్మట హరి, గోపీ వ్రా, తమ్ములతోఁ గూడి వేగ ♦ తద్యమునా నీ
రమ్ములను గళాకేళి సు, ఖమ్ముగ నొనరించె రాధి ♦ కాయుక్తుండై. ౧౩౦
చ॥ వనజదళాయతాక్షి వృష ♦ భానుకుమారిక, లీల లక్షప
త్రనిభృతదివ్యపద్మముఁ గ ♦ రంబునఁ దాలిచి నిల్వఁగన్న యా
కనకపటుండు డాసి తమ ♦ కంబునఁ గూడుచుఁ బాడు చుండి య
ట్టె నగుచు నెల్లొ దానిఁ గొని ♦ టక్కున నేగఁ గడంగెఁ దన్నదిన్. ౧౩౧
తే॥ అంత నక్కమలేక్షణ,♦యభయుఁడగుచు, నక్కళిందజానదిఁజను♦నచ్యుతుఁగని
వెంటబడి వాని పట వంశి♦వేత్రములను,గొని హసించుచుఁ జనసాగె♦జనకరాజ!
ఆ॥ అపుడు శౌరి గాంచి♦యయ్యావి ప్రేయసీ!, నాకు నిచ్చి పొమ్మ♦నంగ నామె
నాథ! నా కమలము ♦ నాకిమ్ము పిమ్మట, నీకు నివ్వి యిత్తు ♦ నిక్కమనఁగ.
క॥ గరుడ ధ్వజుఁ డోతరుణీ, సరి సరి యిఁకఁ జాలుఁజాలు ♦ సరసము నాతోఁ
బురుషుల మించఁగ నెంతువె, సరగున నవి దెమ్ము పిదప ♦ జలజముఁ గొమ్మా!
తే॥ అవల రాధయు మాధవా!♦యున్నమిద్ధ,దొంగతన నాతమ్మిఁగొనలేదె♦దోసమెవరి
దయ్య! యోచించు మనఁ గృష్ణుఁ♦డా కమలము, నామె కిడి తనవస్తువు♦లన్నిటిఁగొనె.
క॥ శ్రీరాధా హరులంతటఁ, గోరిక భాండీరవన ము ♦ కుంఠితగతితోఁ
జేరి యలంకృతు లొండొరు, లారాయనఁ జేసికొనిరి ♦ హరిదాసమణీ! ౧౩౨
తే॥ పిదప శ్రీకాంతుఁ డట్టి యా♦భీరసతులఁ, గూడి మాధవీముఖలతా♦కుసుమభరిత
మైన లోహజంఘ వనంబు ♦ నరిగి యెల్ల,గొల్లఁతెల తలలన్ బూలఁ♦గూర్మి ముడిచి
ఆ॥ అచట నుండి గదలి ♦ యమున తీరంబున, గోప సతుల తోడఁ ♦ గూడి తిరిగి
తరులతాసుమఫల ♦ పర మహాపుణ్య వ,నంబుఁ జేరి విపుల ♦ నవ్యధరను.

చ॥ సురపతి యప్సరోంగనల ♦ శోభిలి యాడెడి మాడ్కి రాధికా
తరుణిని గూడి గోపికలు ♦ దాళము వేయుచుఁ బాడుచుండ న
బ్బురమగు రాసకేళులను ♦ బొల్పుగఁ జేయఁగఁ డంగె నందు భూ
వర ! యొకచిత్రమయ్యె నది ♦ వల్కెద బాగుగ నాలకింపుమా ! ౪౩౯

శంఖచూడ కంసులు గదాయుద్ధం బొనరించుట.

ఉ॥ దక్షుఁడు ముద్గరాజి ధన ♦ దప్రభుభృత్యుఁడు శంఖచూడుఁడన్
యక్షుఁడు సాటిలేక ధర ♦ యం దొకవేళను నాముఖంబునన్
శిక్షితకంసవిక్రమ వి ♦ శేషము వీనుల నాలకించి స్వీ
యాక్షయ లక్షభారయుత ♦ మౌ గదఁ గేల గ్రహించి యుద్ధతిన్. ౪౪౦

చ॥ వడి మధురా పురంబునకు ♦ వచ్చి మదోత్కట కంసగోష్ఠి క
ప్పుడె చని మ్రొక్కి యాదవ వి ♦ భూ ! యిల నీవు గదా సమి త్కృతా
ర్థుఁడవని వచ్చితిన్ గనుకఁ ♦ దోడ్త గదాసమరంబు జేయఁగా
నడిగెద, నిందు నోటరియె ♦ నాఘనజేతకు దాసుఁడయ్యెదన్. ౪౪౧

తే॥ అనఁగఁ గంసుఁడు దానికి ♦ నభిమతంబు, జూపిగదగొని మధ్యాహ్న ♦ సూర్యపగిది
మండిపడి శంఖచూడుతో ♦ భండనంబు, సల్పమొదలిడె వారలా ♦ సమయమందు.

క॥ కరి గరిఁ బోరెడి కైవడి, హరిహరియును జేరి కలహ ♦ మాడిన యట్టుల్
గిరి గిరి దాఁకిన విధిఁ జూ, పరులకు నగుపడుచు వారు ♦ పటుదర్పమునన్. ౪౪౩

ఆ॥ ప్రలయకాల మేఘభయద ♦ రావముబోలు, రెండుగదల రొదలు ♦ రేగుచుండె
నటియు నటుఁడు, నటన ♦ జటులంబుగా సల్పు, కరణి వారు బోరఁ ♦ గ్రాలి రపుడు

తే॥ రెండు గదలును మొత్తని ♦ పిండియాట, జూచి కంసుండు గసి శంఖ ♦ చూడయక్షుఁ
బిడికిటం గొట్ట గ్రమ్మఱఁ ♦ బృథులముష్టి, శంఖచూడుండు కంసునిం ♦ జదియఁగొట్టె

చ॥ సురనికరంబనంతమునఁ ♦ జూడ యదూద్వహ శంఖచూడు లి
ట్లిరువదియేడు వాసరము ♦ లేగెడి దాఁకనిఁ బోరునాచరిం
చిరి విదపన్ యదుప్రభువు ♦ చేత గ్రహించుచు శంఖచూడు నం
బరమున వందయామడలు ♦ బాఱఁగ వైచె ననంతరంబునన్. ౪౪౭

తే॥ శంఖచూడుండు పైనుండి ♦ చదికిలఁబడి, కొంత చింతించి క్రమ్మఱఁ ♦ గోడిపుంజు
వోలె లేచియుఁ గంసునిఁ ♦ బూన్కిఁబట్టి, వినునఁ బదివేలయామడల్ ♦ జనఁగవిసరె

చ॥ అటుపయి నుగ్రసేనసుతుఁ ♦ డాకసమందున నుండి గూలి మ
ల్లటపడి తిర్గి లేచియుఁ జ ♦ లంబున సింగము మాడ్కి వానిపైఁ
దటుకున వ్రాలి పట్టుకొని ♦ ధారణినిం బడఁదన్నె, యక్షుఁడం
తటఁగసిఁ గంసుఁ గొట్టి వసు ♦ ధాస్థలిఁ ద్రొక్కెను మైథిలేశ్వరా ! ౪౪౯

చ॥ ఇటుల మదాతిరేకులు న ♦ హీన బలిష్ఠులు ముష్టిభండనో
త్కటులు గదాజిధన్యులు న ♦ కంపిత ధీరులునైన వారలా
ర్భటులు సెలంగ యుద్ధము న ♦ పారముగా నొనరింప భూమి వే
చటులభయంబునన్ వణఁకె ♦ సాగెను వీరులు సెంది రబ్రమున్. ౫౪౯

తే॥ అట్టి కాలంబునందున ♦ నఖిలయదుపు, రోహితాగ్రణి, శ్రుతిశాస్త్ర ♦ రూఢిభావ
విదుఁడు గర్గ మునీంద్రుఁడు ♦ కదనముఁజని, వినతులంగొని కంసుని ♦ గనియె నిట్లు.

వ॥ యదువరా! ముందు కదనంబు మాని నానుడు లాలకింపుము ఈ మహా బలిష్ఠుండగు శంఖచూడుండు నీతో దీటుకు రాఁ దగు పోటుమగండుగాఁడు. కాన నీకు సాంపరాయంబు సాంప్రతం బసాంప్రతంబ యగు మున్ను బలశాలివగు నీదృఢ ముష్టిని సర్వసుపర్వేంద్రుని వాహనంబగు నైరావతంబు సైతము ధరణిం బడి క్షోభిల్లి యమరావతీపురంబునకుం బరుగిడదే?! మఱియు నీ బలంబున డిందిన వీరుల పేరు లుగ్గడింప నలవియగునే? వెండియు నీ యక్షుండు నీకు సఖ్యుండు గాని వధ్యుండు గాఁడు. పరిపూర్ణతముండగు శ్రీకృష్ణునిచే వీఁడు మడియం దగిన వాఁడు. కాన సందియంబు మాని వేవేగ వీనితో నేస్తం బొనరింపుమని చెప్పి శంఖచూడుని వైపునకుం దిరిగి యక్షవరా! మీయిరువుర కొక్కఁడే ఘాతకుండై యుంటఁ గంసుండు నీకుఁ బ్రాణమిత్రుండగునట్లొనర్చుకొనుమని యుపదేశింప నా యదువరశంఖచూడు లా మునివాక్యంబు చొప్పున సఖ్యం బొనర్చిరి. కొంత కాలమగుడు తద్యక్షుండు మిత్రుని వీడ్కొని స్వగృహంబున కేగుచు, మార్గమధ్యంబున నిశీథమందు మనోహరంబగు రాసగానం బాలించి తత్తాలశబ్దానుసారంబుగా నరుగుదెంచి రాసమండలంబు గన్గొని యందు రాధికాలంకృతవామభుజుండును, స్వచ్ఛందవక్రీకృతదక్షిణపాదుండును, వేత్రవంశీధరుండును, జగన్మోహనుండు నగు శ్రీకృష్ణుండు ఛత్రచామరాద్యంచితలగు గోపికలు సుట్టుముట్టి కొలువ, రాసక్రీడ లొనర్చుటం గాంచి రాసేశ్వరుండు వాసుదేవునిగా నెఱింగి యతని సామాన్యబాలుగా గణించి సుందరులగు తద్గోపికల నపహరింప నెంచి సమీపించె నని విన్నవింప విని రాజేంద్రుం డాశ్చర్యమగ్నమనస్వియై మునీంద్రుతో నిట్లనియె. ౫౫౧

శ్రీకృష్ణుండు శంఖచూడుని వధించుట.

తే॥ అంత రాస రంగంబున ♦ నతఁడు సొచ్చి, యేమిచేసెను? నాకది ♦ యెఱుఁగఁ దెలుప
మిముఁ బరావరవిత్తము ♦ నమలభక్తి, నభినుతించెద నన ముని ♦ యనియె నిట్లు

ఆ॥ అధిప! వ్రేతలెల్ల ♦ రా తాళభూరుహ, యతశరీరు ధీరు ♦ వ్యాఘ్రముఖుని
నసితవర్ణు యక్షు ♦ నతిలలజ్జిహ్వుని, గాంచి పరుగు లిడిరి ♦ కడిఁది నడలి.

తే॥ అపుడు కోలాహలంబులు ♦ నతిశయిల్లె, యక్షుఁడా పాటు నతివలఁ ♦ హరి హరి యని
పాఱెడి శశిచంద్రాననఁ ♦ బట్టి యుత్త, రాశఁ జనెఁ గాము లెంతిసా ♦ హసులు దలఁప

శా॥ పోరా పోకిరి! లేకి! నన్విడువురా ♦ భూమిన్ స్వసల్ దల్లులున్
లేరా నీకిఁక నున్నచోఁ దగున ఛీ ♦ లేదా నయంబించుకేన్
రారా చూడర మంచి చెడ్డలను నన్ ♦ రక్షింపరా యేఘనుల్
మారాకారుఁడు నావిభుండు త్రుటిని ♦ న్మాయింపఁడా తుంటరీ! ౫౫౫

క॥ అనిమూలుచు హరి హరి హరి, యను చడలుచు నార్చు చల్ల ♦ యక్షునిమీఁదన్
దనరుచు నరిగెడి తనచెలి, వనజాక్షుఁడు గాంచి సాల ♦ పాణియయి చనెన్. ౫౫౬

ఉ॥ ఆవల గుహ్యకుండు వెను ♦ నంటుచు దండధరోపమానుఁడై
లావున వచ్చుచున్న కమ ♦ లాపతిఁ గన్గొని భీతి నల్లహే
లావతి నచ్చటన్ విడి ప ♦ లాయన మయ్యెను బిమ్మటన్ దదిం
ద్రావరజుండు నుద్దవిడి ♦ నగ్వావిధంబున వెన్కొనెన్ జుమీ. ౫౫౭

చ॥ కని యది యక్షుఁ డెల్లెడలఁ ♦ గాల్కొలఁదిన్ బరుగెత్తినన్ జనా
ర్దనుఁ డగధారియై వెనుకఁ ♦ గ్రాలుట శీత నగాంతికంబునన్
కని యొకసాలమున్ బెఱికి ♦ కయ్యముఁ గోరుచు శ్రీశసమ్ముఖం
బున నిలుచుండ శౌరి, యల ♦ భూరుహముం గొస వేయ వానిపై. ౫౫౮

ఉ॥ వాతహతాగరీతి వడి ♦ వాఁడిలపైఁ బడి తిర్గి యుత్థితుం
డై తన ముష్టి శ్రీధరుఁ బ ♦ దన్ బ్రహరించి దిగష్టకంబునన్
మ్రోఁతసెలంగ రోసమున ♦ బొబ్బలిడన్, హరి, గాంచి యక్షునిన్
జేత గ్రహించి త్రిప్పియుఁ గ ♦ సిన్ ధరఁగూల్చె ననంతరంబునన్. ౫౫౯

తే॥ శంఖచూడుండు కృష్ణుని ♦ సంగ్రహించి, భూతలంబున బాఁదెను ♦ బ్రీతి మాని
ద్వంద్వయుద్ధ మేతద్రీతి ♦ వఱలఁ బుడమి, యడలఁ దొడఁగెను నంతిమం ♦ బందుఁ జక్రి.

చ॥ పిడికిలితోడఁ దచ్ఛిరము ♦ భిన్నమొనర్చియు దానినుండి వె
ల్గెడు మణి భాగ్యవంతుఁ డవ ♦ లీలగ శేవధియ న్నిధిన్ గ్రహిం
చెడు విధి సంగ్రహించెఁగద ♦ శ్రీపతియై హరి, యన్యదీయమా
విడిగల కెంపుఁగై కొనియె ♦ వింత ఘటింపదె? యుద్ది భూవరా! ౫౬౧

తే॥ అంతఁ దజ్జ్యోతి శ్రీకమ ♦ లాక్షమిత్రుఁ, డైన శ్రీదామునందున ♦ లీనమయ్యె
నిటుల శంఖచూడుని వధి ♦ యించి మణికరుఁ డయి వెన్నుఁడు గ్రమ్మఱి ♦ వడిని వెడలి.

తే॥ రాసరంగంబుఁ జేరి సం ♦ తోసమొదవ, మణి నల శశిచంద్రాననా ♦ మహిళ కిచ్చి
గోపికలఁగూడి తద్రాస ♦ కుర్దనములఁ, జేసి యమునాతట శ్రీని ♦ జేరి కనుచు.

క॥ బృందావనమున కరుగుచు, నందున విహరింప నెంచె ♦ నటుపై హరిచేఁ
బొందిన వరమున నోషధి, బృందము సతులౌచు యూథ ♦ వృతలై రతికై. ౫౬౪

చ॥ హరిసవిధంబునన్ నిలువ ♦ నచ్యుతుఁడట్టి లతాంగనా జనం
బరుసమునన్ గనుంగొని మ ♦ హాద్భుతితో మనసార వారితో
మురళిని గీతిఁ బాడి నగు ♦ మోమున రాసమొనర్చి యా యనం
తరమున రాధతో యమున ♦ దాఁపునకుం జని చూచి తత్తటిన్. ౧౬౫

చ॥ త్రివిధములన్ సమీరణుఁడు ♦ దివ్యసుమంబుల సౌరభంబులన్
నవకము జెంది వీవఁగఁ గ ♦ నద్వట వంశికదంబయుక్తమై
భవికదమై మనోజ్ఞమును ♦ భాసిలు సైకతమందు రాసకే
ళి వలనఁ గల్గినట్టి శ్రమ, ♦ లీల నశింప వసించె భూపతీ! ౧౬౬

తే॥ అపుడు గోపికా వేణు వీ ♦ ణాదివాద్య, సరణి ననుసరించి సకల♦సురలు గరము
వార లిర్వురపైఁ బూల ♦ వాననుగురి, యుంచి రందలి సతులు సే♦వించిరిటుల

గోపికలు విహ్వాలలై శ్రీకృష్ణునిం జేరుట.

చ॥ మరగిన కొందఱన్నులరె ♦ మాపతి! మాపయిఁ గోపమేల? సుం
దరులము గామె యేమిఁకను ♦ దాళగలేము, విరాళి హెచ్చె ని
ష్ఠురముగ నుండఁ బోకుమని ♦ జోత లొనర్చిరి, గొంద ఱంగనల్
వరగళమందు హారముల ♦ వైచి వసించిరి కృష్ణునింగలన్. ౧౬౭

సీ॥ కాంతుఁడా! రమ్మని♦కరముచు లాగుచుఁ, గుతుకముం గనుచెలుల్ ♦ గొంతమంది
పంకజనాభుని ♦ వక్షంబు దాఁకుచుఁ, గోర్కు లొందెడి సతుల్ ♦ గొంతమంది
కరములఁ గమలాక్షు♦ గ్రాలసల్పుచు వనిన్, గ్రుమ్మరు కోమలుల్♦గొంతమంది
శ్రీహరి మ్రోలను♦జేరి తళ్కుల బెళ్కు, కులుక్కులం దగు చెలుల్♦గొంతమంది

తే॥ రాధికా వేషమును బూని♦రాణమీఱఁ, గుదురుగా నాడు మెలఁతలు♦గొంతమంది
కృష్ణవేషంబుతోడుతఁ ♦ గీర్తనంబు, వింతగాఁ జేయు కాంతలు ♦ గొంతమంది.

సీ॥ తాళస్వరంబులన్ ♦ మేలిమిరాగముల్, బాడిరి కొందఱు ♦ భామినులును
హావవిభావసం ♦ భావితఘణుతుల, నాడిరి కొందఱు ♦ చేడియలును
విశ్వమోహనుఁడైన♦వెన్నునిన్ గనులారఁ, గాంచిరి కొందఱు♦కామినులును
జారిణీవృత్తుల ♦ శౌరినిం జేరుచుఁ, గోరిరి కొందఱు ♦ కోమలులును

తే॥ పూరుషోత్తముతోడుతఁ♦బూలబంతు, లాడఁదొడఁగిరి కొందఱు♦ప్రోడలు మఱి
దానవారాతితోఁ దమి ♦ దాఁగురింత, లాడిరో జనకా! కొంద ♦ ఱతివ లింక.

సీ॥ కడియంబు లందియల్♦గల్లుగల్లని మ్రోయ, హరి మధురాధర♦మాను సతులు
యోగి దుర్లభమైన ♦ శ్రీగరుడధ్వజు, దట్టమా కౌగిలిఁ ♦ దనరు సఖులు
చిన్నినవ్వున వెల్గు♦వెన్నుని నెమ్మోముఁ, గని నవ్వి ముద్దులన్♦గొను రమణులు
కృష్ణ, కృష్ణా యని ♦ కేవల భక్తితో, నాతని గుణముఁ గొం ♦ డాడు చెలులు

తే॥ సరసపరిహాసముల్ జేసి♦సమ్మదంబుఁ, జెందు మందయానలు తత్క♦ళిందజాస
రిత్తటిఁ మూఁగి రాధికా ♦ శ్రీహరులకు, దృష్టిఁ గూర్చుచునుండిరో♦దివ్యచరిత!

చ॥ హరియును వారలం గలిసి ♦ యాడుచుఁ బాడుచు వీడ మిచ్చుచున్
మఱియును గొంచు వృక్షముల ♦ మాటున డాఁగుచుఁ గావిమోవులన్
గొఱుకుచు నవ్వుచున్ బ్రణయ ♦ కోపముఁ బొందుచు వారికోర్కులన్
ద్వర నెరవేర్చుచున్ మిగుల ♦ భాసిలుచుండెను మైథిలేశ్వరా! ౫౭౨

సీ॥ సకలవిధంబులన్ ♦ జక్కఁగాఁ బోషించు, తలిదండ్రులన్ జుట్ట ♦ ములను వీడి
యాపదల్ బాపుచు ♦ నఖిలసుఖంబుల, గడనఁజేసెడి విడి ♦ ముడివి విడిచి
యుభయలోకానంద ♦ మొదవించు సుందరి, యైన యర్ధాంగిని ♦ నవలఁ ద్రోసి
మెండగు నెండలన్ ♦ మండియు, వానలఁ, దడసియుఁ జలిచేత ♦ దడను జెంది

తే॥ యన్నపానాదులన్విడి ♦ యనిలభక్షకులయి నిర్వాతదీపము ♦ వలె సమాధిఁ
గ్రాలు యోగులుసైతము♦గాంచలేని, హరినిఁ బొందిరా సతులిది♦యరుదు గాదె.

ఆ॥ ఇటుల ద్వారకేశుఁ ♦ డింతులతోఁ గూడి, రాసకేళి సల్పె ♦ నాసమయము
నందు నొక్కచిత్ర ♦మయ్యె నయ్యది యేది, యనినఁ జెప్పుచుంటి ♦ వినుము జనక!

ఆసురిమహాముని కథ.

క॥ ధీరుండగు నాసురిముని, నీరజదళనేత్రు నమ్మి ♦ నిర్మలతపమున్
నారదనామకనగమునఁ, గోరిక విడి చేయుచుండఁగ ♦ క్షోణీనాథా! ౫౭౫

ఉ॥ దానికి మెచ్చి యచ్యుతుఁ డ ♦ తండు తపం బొనరించు వేళలో
మానక సుందరాభరణ ♦ మండితుఁడై సహధర్మిణీయుతుం
డై నగుమోముతో నలని ♦ యక్షియుగంబున గోచరించు చ
న్మానసముదంబుఁ గూర్చుచుఁ జ ♦ నున్ బ్రతిఘస్రమునందు భూవరా! ౫౭౬

తే॥ ఇట్టి తరుణంబునందు శ్రీ♦కృష్ణుఁ డొక్కపరినిఁ దన్నేత్రముల కగు♦పడక పోయె
దీని కెంతో యా యాసురి♦మౌనివర్యుఁ,డాదఁ జెందుచు యోచించి♦యచటనుండి.

ఆ॥ తపము నాపి కృష్ణ ♦ దర్శనలాలసుఁ, డగుచు లేచి యల మ ♦ హామునీంద్ర
మాన్యబదరికాశ్ర ♦ మంబున కేతెంచి, హరిని గనక వగచి ♦ యందు సాగి.

క॥ లోకాలోకాద్రికిఁ జని, శ్రీకాంతుని వెదకి కనక ♦ చేష్టడి యచటన్
దూఁకొనిన పార్షదులఁగని, వీకన్ బ్రశ్నింప, వారు ♦ వీక్షింప మనన్. ౫౭౯

క॥ శ్వేత ద్వీపముఁ జేరుచుఁ, బీతపటుఁడు శేషశయ్య ♦ వెలుఁగమిఁగనుచున్
బ్రాఁతిగఁ బొగులుచు నచ్చటి, లాఁతుల నడిగియును నేమి ♦ లాభములేమిన్.

తే॥ అధికదుఃఖంబుఁబొందియు♦హా!యిదేమి, యెచట వెదకిన శ్రీహరి♦యెఱుఁగఁబడక
యుండె నేనేమి సల్పనో♦నుందునెందు?, నెటుల నాతనిఁ జూతునో♦యెఱుకపడదు

క॥ అనుకొను చిట్టుల మతి శ్రీ, వనజాక్షుని నెమకి దివ్య ♦ వైకుంఠంబున్
జని తత్స్థలమున శ్రీపతిఁ, గనజాలక మిగుల వగచి ♦ కదలియు నచటన్. ౫౨

తే॥ వడిని శ్రీరమా వైకుంఠ ♦ పదవిఁజొచ్చి, చూడ నచ్చట నాతఁడు ♦ శోభిలమిని
గుంది పిదప నిక గోలోక♦కుంజమునను, బృందకాటవిన్ వెదకి గో♦విందుఁగనక.

క॥ కని కావలి వాండ్రను నో, ఘనులారా! మీరు హరినిఁ ♦ గంటిరె? యేచో
టున కేరితిని జనియెనో, యనుమానము మాని తెలుప♦నర్థింతుఁ జుమీ. ౫౪

ఆ॥ అని యడుగఁగ వార ♦ లగ్రజాగ్రేసరా!, వినుము మావిభుండు ♦ పృశ్నిగర్భ
కలితవామనాండ ♦ కనదిల కిద్దెస, నరిగె ననిన నల్ల ♦ యాసురిముని. ౫౫

ఉ॥ ఆసరణిన్ మనోగతిని ♦ నాజగము న్విడి యుద్ధరాస్థలం
బాసను జొచ్చి చూడ నిట ♦ నా హరి గన్పడకుంట నెమ్మదిన్
వేసటఁ బొంది తుట్టతుద ♦ విష్ణుని జిష్ణుఁ గృష్ణు నిల్పి కై
లాసగిరిన్ జెలంగెడి క ♦ ళానిధిమౌళినిఁ గాంచి మ్రొక్కియున్. ౫౬

తే॥ నీలకంఠ! మహాదేవ♦నీరజాక్షుఁ, గాంచ నేను వైకుంఠలో♦కంబు మొదలు
పరమగోలోకముందాఁక♦సరిగ వెదకి, యుంటిఁగాని యాచక్రి, నా♦కంటఁ బడఁడు.

క॥ కావున దేవా! యెచ్చట, దేవకి తనయుండు వఱలుఁ ♦ దెలుపుము దయతోన్
నావుడు గంగాధరుఁడును, నీవిధి వచియించె మునికి ♦ నిద్ధచరిత్రా! ౫౭

ఉ॥ నెమ్మది నాసురీ! యరయ ♦ నీవె కృతార్థుఁడవంచు నెంతు నా
యొమ్మికనుండు కర్మవిమ ♦ యుల్ సు రసాదులఁబోలె నల్పకా
మమ్మున నుండు మాను లస ♦ మాన మనూనజనార్థ్యముల్ రహ
స్యమ్మును నిర్గుణంబు నగు ♦ సౌఖ్యలవం బెఱుఁగంగ నేర్తురే? ౫౮

తే॥ కాన నీవిటు నిష్కామ♦మాని వగుచు, నిర్గుణాధిక సౌఖ్యంబు♦నిస్తులముగఁ
జెందియుంటివి రిత్తగాఁ ♦ జేసితి శ్రమ, పద్మనాభుని గననింక ♦ భావమున్న.

చ॥ విపులమహోదధిన్ మిగుల ♦ వేదనఁ బొందెడి హంసమాని న
ట్లుపగతదుఃఖుగా సలిపి ♦ యాఱగు చందుల నుండి బృందకా
విపినము నందు రాసమున ♦ వ్రేతలఁ గూడుచు నుండెఁ గాన నీ
విపు డట కేగుచుండు మిదె ♦ యేనును వచ్చెద మానినాయకా! ౬౧

చ॥ అను చటు లాసురిం గలిసి ♦ త్వరింబకుఁ డాయమునాతరంగిణీ
ఘనతటసంగతోరుతరు ♦ కాండలతావిలసన్నికుంజ పుం
జనిభృతసైకతస్థలికి ♦ సాగఁగ నద్దిరి గోజగన్నివా
సినులగు ద్వారపాలికలు ♦ సేతులఁ దాలిచి మంచిబెత్తముల్. ౬౨

ఉ॥ అడ్డిన వెంట నాయిరువు ♦ రా పుపుఁబోఁడుల కిట్లు పల్కిరీ
రెడ్డముఁ బెట్టఁ బోకుఁ డిఁక ♦ నే మతిమానముతుండి నాస్థ నా

దొడ్డ రమేశుఁ గాంచ వడి ♦ తోఁ జనుదెంచితి మమ్మలార! మీ
ర్చెడ్డ ఘటింపకుండ హరిఁ ♦ జేర నొనర్పుడి! చూపుఁడీ దయన్. ౫౯-౩

తే॥ తరులుఁ దటినులు గోవులు♦ధాత్రియందుఁ, దమిఁ "బరోపకారార్థమి♦దంశరీర"
మనుచు ఫలతోయ దుగ్ధంబు♦లనిశమిడుచు,నలరినటు బుధుల్ పరహిత♦మందునుండ్రు

వ॥ అంత నాద్వారపాలికలు. ౫౯-౪

ఉ॥ బాగుగ నున్న వీరనెడి ♦ పల్కులు గాని క్రియన్ ఫలింపవా
శ్రీగరుడధ్వజుం డిపుడు ♦ స్త్రీప్రకరాన్వితరాసఖేలనో
ద్యోగిగ నుండి మే మిచట ♦ నుండ విధించెను గాన లోఁతివా
రీగడి దాఁటి లోపలకు ♦ నేగిన ముప్పగు మాకు వారికిన్. ౫౯-౫

ఉ॥ లేనిమొదన్ హరిం గనఁగ ♦ లిప్స దృఢంబుగ మీకు నున్నచో
మానసరోవరంబు జని ♦ మజ్జనముం బొనరించి గోపికా
మానవతీసురూపము ల ♦ మందముగా ధరియించి వచ్చిన
న్లోనికిఁ బోవఁ జాలుదురు ♦ నూల్కొనుఁ డోద్విజులార! దానికిన్. ౫౯-౬

ఉ॥ నావుడు వార లిద్వ రల ♦ నాతుల వాకుల నాలకించి యా
తావును వీడి సాగి త్వరి ♦ తంబుగ మానసకోవరంబు నం
దోవుచుఁ దానమున్ సలిపి ♦ యుగ్మలి రూపులఁ దాల్చి తోడ్త నా
శ్రీవిభు రాసమండలము ♦ జేరి యనంతరమందు మెల్లఁగాన్. ౫౯-౭

సీ॥ స్వచ్ఛజాంబూనద ♦ భ్రాజిత పద్మరా, గాంచిత ధరణీస ♦ మన్వితంబు
మాధవీముఖలతా ♦ వీథీకదంబాది, భూరుహ సందోహ ♦ భూషితంబు
నుండితప్రాంగణ ♦ మండప స్తంభస, భావీథిపంక్తి వి ♦ భాసితంబు
నరుణసితాసిత ♦ హరితవిచిత్ర వ, ర్ణస్ఫురత్పుష్ప వి ♦ రాజితంబు

తే॥ లలిత వాసంత చంద్రికా♦విలసితంబు, విహగ మధుకూజితం బబ్జ♦వితతియుతము
శీతలానిలాన్వితము సం♦ప్రీతి కరము,నగు నికుంజ మొక్కఁడు గని♦యరిగి యందు

సీ॥ కోటిమన్మథరూపుఁ ♦ గోటీందు తేజునిఁ, గౌస్తుభశోభితుఁ ♦ గమలనేత్రుఁ
గనకమయాంబరుఁ ♦ గరుణాపయోనిధిఁ, గమలామనోహరుఁ ♦ గమలనాభు
శ్రీవత్సచిహ్నితు ♦ శ్రీనరస్నేహితు, శ్రీద్వారకావాసు ♦ శ్రీనివాసు
జలధరవర్ణుని ♦ సర్వభూషణయుతు, వేత్రవంశీధరు ♦ వినుతచరితు

తే॥ గోపికావృతునిన్ రాస ♦ కుర్దనేశు, ద్విరద గామినీరాధికా ♦ విహితు వరదుఁ
గృష్ణు దూరముగాఁ గాంచి♦ కేలుమోడ్చి, యెల్లగోపికల్ గనుచుండ♦నిట్టులనిరి.

తే॥ కృష్ణ! కృష్ణ! కృపాసింధు ♦ కీర్తనీయ, దేవదేవ! జగత్పతీ! ♦ దివ్యచరిత!
పద్మనాభ! నారాయణా!♦పరమపురుష!,విశ్వకారణ! శౌరి! మా♦వినతులివిగో.

తే॥ భూమి భూరిభారము బాప♦బుణ్యనరులఁ,గావ వేదముల న్నిల్పఁ♦గా మఖములఁ
బ్రోవ వైకుంఠలోకంబు♦బూన్కి వదలి,నందు పంకిని బిడ్డవై♦యలరితివిగ. ౬౦౨
క॥ రాధాధరమధుభృంగా!, శ్రీధర! బ్రహ్మాండకోటి ♦ శేఖర! గోపీ
యూధావృత! మధుసూదన!, మాధవ! గోవింద! చక్రి!♦ మమ్ములఁ గనుమా.
తే॥ అరయ సర్వావతారంబు♦లందు నీవె,గాదె పరిపూర్ణతముఁడవు♦ఘనచరిత్ర!
వరదుఁడవు నీవె గోలోక ♦ పతివినీవె, పరమయోగీశుఁడవునీవె ♦ పరమపురుష!
తే॥ నిన్నుఁ జూడంగ నెల్లెడ♦నెమకినెమకి, తుట్టతుద కిటు వచ్చుచుఁ♦దోయజాక్షుఁ
డవగు నిన్నని యఘము ల♦డంచి ధన్య,తముల మైతిమి రాసేశ!♦దయను గనుమ.
తే॥ అంత భగవంతుఁ డానుతి♦నాత్మమెచ్చి, రాధతోడఁ బ్రసన్నుఁడై♦రవలుగురియు
మేఘగంభీరవాణి నా♦మేటితబుసు,లకు వచించె నేత్రదీప్తి♦నకలుషముగ. ౬౦౬
క॥ షష్టిసహస్రాబ్దంబులు, కష్టపడి తపంబుసల్పఁ ♦ గరుణను గని మీ
యిష్టము నడిగినఁ జెప్పమి, నిష్టులని యుపేక్షజేసి ♦ యొసఁగితిఁ గాదే. ౬౦౭
ఉ॥ ఐనను మీ యభీష్టముల ♦ నన్నిఁటి నిత్తుఁ దెల్పుఁడన్న నీ
శానుఁడు నల్ల యాసురియు ♦ సాగిలి మ్రొక్కి మహాత్మ! యన్యముల్
వేనిని గోర మీ విపుడు ♦ ప్రీతిని రాధిక నీదు పాదముల్
ధ్యాన మజస్రముర్ సలుపు ♦ నావిధి మాకు నను గ్రహింపుమా! ౬౦౮
తే॥ అవలఁ గృష్ణుఁడు దానికి ♦ నభిమతింప, శంకరాసురు లావంశి ♦ సాలసవిధ
మున మనోహరతరుయుత♦పులినమందు, నిత్యవాసము జేసిరో ♦ నుత్యచరిత!
క॥ పిమ్మట రాధాపతి లో,పమ్ములు లేనట్టిరీతిఁ ♦ బద్మాకారా
మమ్మున వ్రేతలతో రా,సమ్ములఁ బ్రేమమ్ముతోడ ♦ సలిపెను జనకా! ౬౧౦
ఆ॥ ఆఱుమాసము లిటు ♦ లతివలఁగూడుచు, రాధికాధవుండు ♦ రాసములను
జేసియుంట గోపి ♦ కాసముదాయంబు, పూర్ణతుష్టిఁబొందె ♦ భూప! యవల.
క॥ అరుణోదయవేళను ని,ద్దురవిడి గోపీజనంబు ♦ తొందర స్వకమం
దిరముల కేగఁ దొడఁగె నిజ,వరయూధములెల్ల జుట్టు ♦ పరివేష్టింపన్. ౬౧౨
తే॥ నందనందనుఁ డంత స్వ♦మందిరమున, కేగె వృషభానుసుత తన♦యింటికరిగె
నిట్టి రాసకేళీ కథ♦నెవరుభక్తి, వినెదరో వారు ముక్తులై♦తనరఁగలరు. ౬౧౩
తే॥అనఁగ జనకుండు నారదా!♦యఘముఖాసు,రరుచులెట్టుల రాధికా♦రమణుఁగలిసె
నెటుల శంఖచూడుని జోతి♦కృష్ణమిత్రుఁ,డైన శ్రీదాములో లీన♦మయ్యెఁ!జెపుమ!

శంఖచూడోపాఖ్యానము

తే॥ అంత మునివరుఁ డిట్లనె♦నమలచరిత!, రమ్యగోలోకవార్త నా♦రాయణముని
ముఖమునన్ మున్నువింటిని ♦ భూప! వినుము, చిత్తమన్యస్థలంబునఁ♦జేర్చకుండ.
క॥ దామోదరునకు ముప్వురు, భూమి, శ్రీ, రాధ, లనెడి ♦ పొలఁతులు గలరా
భామినులందున రాధా, కామినియే హరికి ముఖ్య ♦ కాంతగ నుండెన్. ౬౧౬

వ॥ అంతఁ బరిపూర్ణయౌవనాఢ్య యగు రాధ తనవిభుండు సవతియగు విరజతోఁ గూడి వేడుకగా నేకాంతంబుగాఁ గ్రీడించుచుండెనను సంగతి నిజసఖిచే విని మిగుల వగచి వందయామడ లెత్తును వందయామడల విస్తృతంబును గోటిభానుసన్నిభంబును గోట్యశ్వకల్పితంబును హారతారాంచితంబును నై యొప్పు నరదం బధిరోహించి ౬౧౭

చ॥ కరములయందు బెత్తములు ♦ గ్రాల దశార్బుదచేటికాజనుల్
వఱలుచు నాల్గుప్రేవలను ♦ భద్రముగూర్ప సువర్ణభూషణో
త్కరము ధరించి కోటిశశి ♦ కాంతివిభాసురయై మనోహరుఁ
హారిని గనంగఁ బైనమయి ♦ యద్భుతచిత్రము లెల్లఁ జూచుచున్. ౬౧౮

తే॥ ఒయ్య నెయ్యన శ్రీకృష్ణు♦నునికిఁ జేరు, తఱి హరిన్యస్తుఁడైన శ్రీ♦దాముఁ డొగి
సాల నిల్చి యారాధికా♦స్యందనంబు, నడ్డగించె స్వప్రభుసూ♦క్తి ననుసరించి.

తే॥ అవల నడ్డిన శ్రీదాము ♦ నధికబలుని, జక్రిమిత్రుని రాధికా ♦ సఖులు గాంచి
యిట్టి దొరసాని తేరెటు♦లీవు నిల్పు, వెడలితి వటంచుఁ గొట్టిరి♦ బెత్తములను.

తే॥ అంతఁ బొదరింటిలోపల ♦ నధివసించు, కృష్ణుఁ డారాధికాసఖు ♦ లేపుమీఱ
ద్వారపాలకుఁ దన్నడి ♦ ధ్వనుల వినుచు, భీతిచేఁ దిరోహితుఁ డయ్యెఁ ♦ బిదప విరజ

తే॥ అడలినదియై చుగోలోక♦ మందుఁ గోటి, యోజనాయుతంబుగఁ బాఱె♦ నుదధి యుర్విఁ
గ్రమ్మినట్టుల, రవియు న♦ల్గడల నొక్క, సారి వెల్గిన పద్ధతి ♦ ధారుణీంద్ర! ౬౨౦

తే॥ అంత సఖులతో రాధ కుం♦జాంతరంబు,జొచ్చి యెల్లెడఁ గని మధు♦సూదనుండు
భీతిచేఁ దిరోహితుఁడౌట♦ విరజ నదిగ,మాఱుట నెఱింగి మఱి నిజా♦గారముఁ జనె.

తే॥ అవలఁ గృష్ణుఁడు హ్లాదిని♦యైన విరజ, మరల సాకారగా సల్పి♦ పరిసరంబు
నందు వెల్గు బృందావన♦మందు నున్న, కుంజమున రాసముల్ జేసెఁ♦ గూర్మిఁ బిదప.

ఆ॥ విరజ, శౌరివలన ♦ హరినిభసప్తపు, త్రులను గనియె వార ♦ లల వనంబు
నకుఁ దొడవులుగఁ దగి♦రొకపరిఁ దమ్ముల, నన్నలు ప్రహరించి ♦ రాడుకొనుచు.

క॥ చిఱుత లపుడు మఱిఁ గొట్టక, పరువిడి హరియుక్తజనని ♦ పయ్యెద డాఁగన్
విరజయు గని వత్సలతన్, గరములఁ గొని బుజ్జగించెఁ ♦ గన్ మోక్తులతోన్.

క॥ వనజాక్షుం డటు తన చెలి, తను విడి యల యర్భకులను ♦ దమిఁ గొనుచుంటన్
గని కనలి యదృశ్యుం డయ్యెను విరజ గడు వగచి హరి ♦ యెడఁబాయుటచేన్.

తే॥ కొడుకులార! మీరలు హరి♦ కూడిక చెడ,సలిపితిరి దాన జలధులై♦ జంతుకోటి
గ్రోలనట్లు నైమిత్తికా♦ఖ్యాలయమునఁ,గలిసికొనురీతి నుందురు♦ గాక భువిని.

వ॥ అని శపింప నయ్యేడ్వురు కొమరులు మాతృశాపనిహతులై తత్క్షణంబునఁ బ్రియవ్రతంబు నరదంబుగా రచించి యందు సమాస్థితులై భూలోకంబునకుం జనుదెంచి లవణేక్షుసురాసర్పిదధిదుగ్ధజలంబులను పేర సప్తార్ణవంబులై

ప్రాణికోటి గ్రోలరాని క్షారజలంబులు గలిగి యగాధంబులై జడంబులకుఁ దల్లి యుండె ప్రథమద్వీపంబున లక్షయోజనంబులందును, ద్వితీయద్వీపంబున రెండు లక్షలయోజనంబులను, తృతీయద్వీపంబున నాల్గులక్షలయోజనంబులను, చతుర్థ ద్వీపంబునం దెనిమిదిలక్షలయోజనంబులను, పంచమద్వీపంబునం బదాఱులక్షల యోజనంబులను, షష్ఠద్వీపమునందు ముప్పదిరెండులక్షలయోజనంబులను, సప్తమ ద్వీపమునం దఱువదినాల్గులక్షలయోజనంబులను నాయామంబు వేఱువేఱుగాఁ బొంది యొండొరులకు సంబంధంబులేని మాడ్కిఁ బ్రవహింపం దొడంగెను. అంత నవ్విరజాకాంత, సంతాన కాంత విరహాతురయై కుందుచుండఁ గరుణాసముద్రుం డగు నుపేంద్రుండు గ్రమ్మఱఁ బ్రసన్నుండై "జీవితేశ్వరీ! నిన్ను బాసి నేనొక క్షణంబైన నుండఁజాలను. మఱియు మన తనయుల నహరహంబు జూచి నిజశక్తిని గాంచుచుండఁ గలవని వరం బొసంగి యోదార్చి తన వియోగంబున రాధికకుఁ గలిగిన సిలు గెఱిగి యటనుండి వీడ్కొని నెచ్చెలియగు శ్రీదాముతోఁ గూడి తద్రాధాకుంజంబునకుం జని తోరణంబున నిలుచుండఁ ద్రిపురసుందరియు మాన వతియు నగు నారాధిక, గనుఁగొని సకోపయై యిట్లనియె. ౬౨౯

చ॥ నరహరి! పొమ్ము పొమ్మటకె ♦ నాదరిఁ జేరకు మా నికుంజమం
దరుసముతోడ నా విరజ, ♦ యాపగగా నదమౌచు నీవు సం
బరమున నెల్లకాలమును ♦ వాసము సల్పనఁ జిక్కినందు నో
హరి! యణువంత లాభ మిట ♦ హత్తదు గావున వేగ నేగుమా! ౬౩౦

క॥ అనవుడు శ్రీహరి విని యా,మె నికుంజములోన దూఱి ♦ మిన్నకయుంటన్
గనుఁగొను శ్రీదాముఁడు రా,ధను గని యిట్లనియె నధిక ♦ తామసబుద్ధిన్.

క॥ తల్లీ! గోలోకేశుని, ఫుల్లసరోజాక్షు సకల ♦ భువనేశ్వరు, లీ
లోల్లాసుని భగవానుని, నల్లరిగా నల్లసంబు ♦ లాడుట దగునే? ౬౩౨

సీ॥ నిస్సార సంసార ♦ దుస్సహరోగముల్, బాపెడి వైద్యుండు ♦ పతియ కాఁడె
యార్థిక వైదిక ♦ యౌగిక నైతిక, ఫక్కిఁదెల్పెడివాఁడు ♦ పతియ కాఁడె
ధర్మార్థ కామ సం ♦ తాన సాధనములన్, వాసికెక్కినకర్త ♦ పతియ కాఁడె
యెట్టిచింతలనైన ♦ నెట్టివంతలనైనఁ, బాపెడి నేర్పరి ♦ పతియ కాఁడె

తే॥ సకలవాంఛలనెరవేర్చి♦సౌఖ్యమిచ్చు,ప్రభువు పతి కాఁడెచుట్టాల♦కభయమొసఁగి
కరుణఁ గనువాఁడు పతి కాఁడె♦కమలనేత్ర!, యట్టి నీపతిన్ దూఱుట♦న్యాయమగునె?

మ॥ జననీ! పెన్మిటి రూపహీనుఁడయినన్ ♦ సౌశీల్య సౌజన్య స
ద్ఘనతా పుష్కలతా గరిష్ఠకవితా ♦ దాక్షిణ్య కారుణ్య ధ
ర్మ నయ ద్రవ్య విహీనుఁడైనఁ దమితో ♦ మన్నించి ప్రేమించు స
ద్వనితాసంఘముఁగాంచి వేల్పులెపుడున్ ♦ వర్ణించి కాపాడరే. ౬౩౪

తే॥ అఖిలవిధముల ననుకూలుఁ♦డగుచు నిన్ను, బ్రేమతోఁ డాయు మాకృష్ణు♦విధముగనక
ధూర్తవై యిట్లు నాప్రామోలఁ♦దూలనాడఁ, దగునె? చెప్పుము తరుణీమ♦తల్లి! తల్లి!

చ॥ మఱి నినుఁబోలు శక్తులతి ♦ మాత్రముగా సృజియించు దివ్యచా
తురిని గడించియున్న హరి ♦ తోనటు దూలఁగ మాటలాడెదే?
సరిసరి కోపమున్ విడిచి ♦ శాంతము నెందు మనంగ రాధికా
తరుణియు వించుఁ గిన్కను ద్రా ♦ తంబుగ నిట్లనె వానికో విభూ! ౬౩౬

చ॥ జనకు నుతించుచున్ జనని ♦ శాపము లాడితి వోరి శుంఠ! వే
దనుజుఁడవై ధరిత్రిని వ్య ♦ థాజలధిన్ బడి పీడఁ జెందుమా!
ఘనమగు గోజగంబు క్షణ ♦ కాలములోపల వీడి యేగుమా!
యనవుడు శౌరి మిత్రుఁడు త ♦ దంబకుఁ గ్రమ్మఱ నిట్లు వాకొనెన్. ౬౩౭

క॥ అనుకూలుండగు హరిపైఁ, గినియుటచే నీవు ధరను ♦ గృష్ణుని విడి బా
ధను నూఱేడులు దాఁకను, గనుచుందువు తప్పదిద్ది ♦ కాంతామణిరో! ౬౩౮

తే॥ ఇటుల నొండొరుల్ శాపము♦లిచ్చికొనియుఁ,
గుందుచుండుటఁ జూచి గో ♦ విందుఁ డెలమి
స్వయముగా వారియెదుటకు ♦ వచ్చి తొలుత
రాధ కిట్టులఁ బల్కె ధ ♦ రాతలేంద్ర! ౬౩౯

తే॥ మద్వచన మబద్ధము సల్ప ♦ మంచినేర్పు, కలదు గాని భక్తోక్తులఁ ♦ గల్లఁ జేయు
శక్తి పరమాణు వంతయు♦సరిగ లేమి, నీకు నొకవర మిచ్చెద ♦ నెలఁత! వినుము.

క॥ వారాహకల్పమందున, ధారుణి భారంబుఁ బాప ♦ దైత్యుల మాపన్
ధీరులకును దర్శన మిడఁ, బేరిమి నీతోడఁ గలిసి ♦ వెడలెద ధరకున్. ౬౪౧

తే॥ నీ విరహకాలమందున♦నెలకు నెలకు, నేను దర్శన మిచ్చెద♦మాను మార్తి
యనుచు భార్యను నోదార్చి♦యనుచరుండు, బలుఁడునైన శ్రీదామునిఁ♦బలికె నిట్లు.

క॥ నీ యంశముతో రక్కసివై యవనిన్ బుట్టి యట్టి ♦ వైవస్వతమ
న్వాయతకాలమునన్ నేఁ, బాయక రాసములఁ జేయు ♦ పట్టున నీవున్. ౬౪౩

చ॥ అరమున నన్ను జేరి పరి ♦ హాసములం బొనరింతు వందునన్
మరలక నీవు నావలన ♦ మందెద వప్డై సవిగ్రహుండవై
మరల యథాప్రకార మస ♦ మానరుచిన్ దగియుందువయ్య యీ
పరమును బ్రీతిఁ గైకొనుచు ♦ భావమునందలి చింత మానుమా! ౬౪౪

తే॥ అనఁగ నతఁ డట్లు స్వాంశతో ♦ నసురుఁడగుచు
సుధను గృహమునన్ దగి శంఖ ♦ చూడుఁ డనెడి
పేరుఁగని బలియాచుఁగు ♦ బేరు మిత్రుఁ
డగుచు హరిహితుఁడై దివ్యుఁ ♦ డయ్యె నయ్య! ౬౪౫

తే॥ అద్వయుండయి యందఱి♦యందునుండి, సర్వకార్యంబు లొనరించు♦జాణ కిదియు
చిత్రమానొక్కొ ? యాకృష్ణుఁ♦జేర నుతుల, సలిపి సాగిలి మ్రొక్కెద♦జనకరాజ !

తే॥ కల్మషులును బృందావన♦ఖండ మిద్ది, భక్తి వినినచో నాశంచ♦పాతకములు
ద్రెళ్ళిపోవ జన ధన సుత ♦ వృద్ధిఁబొంది, దండిగోలోకమందున ♦ నుండఁ గలరు.

తే॥ జనక! మఱియేమి సత్కథ♦వినవలతువొ, తెలుపుమా యన నాతఁడో♦దేవమౌని!
బాలుఁడగు హరి యెట్లు గో♦వర్ధనగిరిఁ, జేత నెత్తెనొ యాకథ♦జెప్పు మనుడు.

ఉ॥ శ్రీకమలానివాస ! ముని ♦ శేఖర మానసవాస ! నిర్మల
ప్రాకటసత్యభాష ! బహు ♦ రమ్యసువర్ణవిభూష ! దేవతో
షా ! కమనీయవేష ! శర ♦ ణాగతసాధుసుపోష ! ఖండితా
స్తోకసమస్తదోష ! యదు ♦ శుద్ధకులాంబుధిపూర్ణచంద్రమా ! ౭౪౯

ఉత్సాహావృత్తము॥ గోపికాసమేత ! రాస ♦ కుర్దనప్రణేత ! సం
తాపపాపజేత ! దుష్ట ♦ దైత్యకరిమృగాధిపా !
గోపతీ ! హరీ! మనోజ ♦ కోటిదివ్యవిగ్రహా !
భూపదీప్రసగంచితాంగ ! ♦ భూసురాగ్రణి ప్రియా ! ౭౫౦

గద్యము:- ఇది శ్రీమత్పరమపవిత్రాపస్తంబసూత్ర, భారద్వాజసగోత్ర, చివుకుల
కులజలధికళానిధి, కోటమాంబాకామయ తనయ, లక్ష్మీదేవీ
సుబ్రహ్మణ్య దత్తపుత్ర, శ్రీకృష్ణప్రసాదాసాదిత కవిత్వ
నిశ్చయ, సుజనవిధేయ, శ్రీనివాసాపరనామధే
యాప్పయశాస్త్రిచే నాంధ్రీకృతంబైన
శ్రీగర్గభాగవతం బందలి
బృందావనఖండము
సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ
హరిః ఓంతత్సత్
శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః.

శ్రీ గర్గ భాగవతము.

గిరిరాజఖండము.

శ్రీయమునారుచిరాంగా!
తోయరుహాసమానహస్త! ♦ తోయజనాభా!
తోయరుహాగృహాధర! నా
రాయణ! రాసప్రవీణ ♦ రాధాకృష్ణా! ౧

శ్రీకృష్ణుండు తండ్రిని నిందప్రూజనుగూర్చి ప్రశ్నించి గోవర్ధనగిరిని బ్రశంసించుట.

వ॥ అక్కథకుండు జనకవిభున కిట్లు చెప్పందొడంగె. దేవా! జనులు జనపాలకునకు వార్షికంబగు కప్పంబుఁ గట్టినట్లు కృషీవలురగు గోపకు లందఱా పురందరునకుఁ బ్రతివత్సరంబందుఁ బ్రావృట్కాలంబునఁ బూజాపురస్సరంబుగా బలిని సమర్పించుచుంట బ్రహ్మాండనాయకుండగు శ్రీకృష్ణుం డొక్కతఱి నవలోకించి సకలగోపకదీపితంబగు సభాస్థలినున్న నిజజనకుండగు నందునిం గని నాయనా! ప్రత్యబ్దంబున నయ్యింద్రున కిట్లు బలిని సమర్పించుచుంటిరి. దీన మీకేమి ఫలంబు గలదు? లౌకికమా? పారలౌకికమా? యేదియో యానతిండని ప్రార్థింప నందుం డందుల కియ్యకొని నిజనందనునకు నిట్లనియె. ౨

ఆ॥ ఇది సురేంద్రపూజ♦యెడఁదఁ దలంపఁగ, భుక్తిముక్తికరముఁ♦బుణ్యతమము
దీని విడినవాఁడు ♦ దీనుఁడై తిరిగెడిఁ, గాని సుఖయుతుండు ♦ గాఁడు గాఁడు. 3

క॥ అనవుడు భగవానుం డల్లన నగి తండ్రీ! యిదేమి ♦ లక్షణ మిపుడే
ఘనుఁడు వచించెను మీరిది, యనుమానము మాని విడుట ♦ యర్థప్రదమౌ.

ఉ॥ కారణ మేమనన్ వినుఁ డ ♦ ఖండపురాకృతకర్మరీతి బృం
దారకులున్ సురేంద్రుఁడు య ♦ థావిధి స్వర్గసుఖంబు వొంది యే
వారమునన్ స్వపుణ్యమితి ♦ పారము సెందునో నాఁటగోలె నీ
ధారుణి జన్మమెత్తి సుకృ ♦ తంబును దుష్కృతిఁ జేయుచుండరే. ౫

క॥ కావున వారును మనతో, నే విశయము లేనియట్లు ♦ లీలై యుంటన్
జీవన్ముక్తి ఘటిల్లక, జీవితముల్ వ్యర్థ మగును ♦ సేవించినచోన్. ౬

సీ॥ సురతతికంటెఁ దన్నముచి ♦ సూదనుఁ డా దివిజేశుకంటె సుం
దరి చతురాస్యయుక్తవిధి ♦ తద్విధికంటె హిరణ్యగర్భుఁడా
పరపరమేష్ఠికంటె గుణ ♦ భాసురమాయయు దానికంటె నా
పరమగుణం బనశ్వరము ♦ బ్రహ్మ ముపాస్య మటం చెఱుంగుమా! ౭

చ॥ అదియు జగన్నిదానమయి ♦ యాగమ గో సుర వహ్ని ధర్మ సం
పదలకు మూలమై సకల ♦ భాగ్యమహానిధియై వెలుంగు న
య్యది విడి వేఱుదాని మన ♦ మందున నమ్మి భజించు నట్టి దు
ర్హృదయునకు ముక్తి సేకురునె? ♦ యాప్సితముల్ నెఱవేఱుచుండునే. ౮

క॥ కావున నింద్రుని పూజల, నావలఁ బోఁద్రోసి మీర ♦ లటు లర్చల నా
శ్రీవిభువక్షోజంబగు, గోవర్ధనగిరికి సల్పి ♦ కోర్కెలఁ గొనుఁడీ! ౯

ఉ॥ తద్గిరి యో పులస్త్యుని య ♦ దాత్తబలంబున నీస్థలంబునన్
సద్గతిదాయకం బగుచుఁ ♦ జక్కఁగఁ జొచ్చెను గాన బ్రహ్మవ
ద్భోద్గత భూమిదేవులకు ♦ నొయ్యన నాలకుఁ, బూజ సల్పి సం
పద్గతపారితోషికము ♦ బాధముగా నిడ నౌను దానికిన్. ౧౦

ఉ॥ నంద! యొనర్పఁగా నటుల ♦ నాకుఁ బ్రియంబగు నన్నఁ దత్సభన్
జెందుచు నాలకించెడి సు ♦ శీలుర యందున వృద్ధుఁడైన స
న్నందనుఁడు కృష్ణవాక్యము మ ♦ నంబునఁ బూర్తిగ మెచ్చి నాయనా!
నందసుతా! వచింపుము ప్ర ♦ ణామతిఁ దన్నగపూజ యెట్టిదో? ౧౧

గోవర్ధన పూజావిధి.

వ॥ అంత రాధికాకాంతుండు స్వాంతంబున సంతసించి సన్నందున కిట్లనియె. గోపవృద్ధా! తద్గోవర్ధన ధరాధర వరంబు నందలి క్రింది ప్రదేశంబున గోమయంబున నలికి నిగ్గగు ముగ్గులఁ బెట్టి పూజాసంభారంబులం గొని జితేంద్రియుండై బ్రాహ్మణులతోఁ గూడి పరమభక్తినిఁ దదచలంబును ధ్యానించి యావాహనంబు సల్పి యర్ఘ్యం బొసంగి పాద్యమిచ్చి యాచమనం బిడి గంగాయమునోదకంబుల సహస్రశీర్షా యనెడు మంత్రంబున నభిషేకించి పంచామృతంబుల స్నానంబుఁ జేయించి దివ్యవసనంబును యజ్ఞోపవీతంబును సమర్పించి చందనాది సుగంధద్రవ్యంబుల నలందిఁ కమనీయంబులగు సుమంబుల నర్చించి నానాదివ్యగంధభాసురంబగు ధూపంబును, జగజ్జ్యోతిభాతి వెలుంగు దీపంబు నర్పించి భక్ష్యభోజ్యలేహ్యచోష్య పదార్థంబుల నివేదించి చతుష్షష్టికచోలంబుల నైదుపంక్తులుగా నమర్చి యామ్రపత్రంబుల గంగాయమునాజలంబుల నించి యందుఁదులసీదళంబు లిడి యొక్కొక్క

దానికి షట్పంచాశద్విధంబులగు సామగ్రుల భోగంబులు గలుగునట్లు సేవించి సుర భూసురాగ్ని గోబృందంబుల షోడశోపచారంబుల సంతుష్టిపఱచి ద్విజనంబులకు మృష్టాన్నం బిడి తదితరులకు సైతం బన్నదానం బొనర్చి గోపీ గోపాలయుక్తంబుగాఁ దానును సాపడి కాంస్యఘంటాదిచతుర్విధ వాద్యంబుల మొఱయించి కర్పూర నీరాజనం బెత్తి వేదాహామేత మ్మనెడుమంత్రంబునఁ బుష్పాంజలి యర్పించి సాష్టాంగ దండప్రణామంబు లాచరించి వినుతించి జయశబ్దంబులం గావించుచు నాట్యం బొనరించి గోవర్ధనగిరిరాజోత్సవంబుఁ జేయందగు. ౧౦

తే॥ ఎందు గోవర్ధనాచల ♦ మొందలేదొ, యందు గోమయంబున దాని ♦ యంతయెత్తు
బొడవు వెడలుపు ఘటియించి ♦ పుష్పవల్లి, భూరుహాదులఁ గూర్చినఁ ♦ బూజ్య మగును

తే॥ అట్టి గోవర్ధనాచల ♦ మందునుండి, శిలను దత్తుల్యకనకము ♦ జేర్చికొన్నఁ
బుణ్యుఁడగు నిట్లు చేయని ♦ పూరుషుండు, గరము రౌరవనామక ♦ నరక మొందు

శా॥ సాలగ్రామసురార్చనంబుఁ బ్రతిఘ ♦ ప్రసంబందునన్ జేయు ధీ
శాలిన్ బాపము లంట వప్పు జలభా ♦ స్వత్పద్మ మట్లిందునన్
గోలోకంబుననుండి వచ్చి తగు నా ♦ గోవర్ధనాద్రీశు నే
రేలోపంబులు లేక ప్రమొక్కెదరొ వా ♦ రిష్టంబులం బొందరే? ౧౧

తే॥ అనఁగ నందసన్నందులు ♦ సఖిల గోప, కులులును విని యద్భుతంబునఁ ♦ జెలఁగి నాఁడు
కగ నొనర్పు నింద్రుని పూజ ♦ దిగఁగ విడిచి, శైలవిభుఁ గొల్వఁదలఁచిరో ♦ జనప రాజ!

గోవర్ధన పూజా మహోత్సవము.

చ॥ అచల గిరిప్రభూత్సవము ♦ నంతటఁ జాటియు గర్గరామ కే
శవుల యశోదఁ గూడుచు గ ♦ జంబున నెక్కియు గోపగోపికా
నివహము గోగణంబులును ♦ నెయ్యముతోఁ జనుదేర గోత్రరా
ట్సవిధమునందుఁ జొచ్చెను వ్ర ♦ జప్రభుఁ డాసమయంబునందునన్. ౧౨

ఉ॥ స్వాంతమునందు నంతసమె ♦ సంగ జయంత శచీ సమేతుఁడై
దంతివరంబు నెక్కి సుర ♦ తండముతోఁ బ్రమదావనాంతర
ప్రాంతము జేరు వజ్రివలె ♦ భాసిలె నాయుపనందనందు లా
వంతున నార్యులైన వృష ♦ భానులు వచ్చిరి దారయుక్తులై. ౧౩

చ॥ మఱియు సహస్ర బాలరవి ♦ మండలభాసురమైన పల్లకిన్
సురపతిపత్నిబోలె మణి ♦ శోభిత భూషణముల్ ధరించి చె
చ్చెర భ్రమరీ సమాకుల వి ♦ చిత్ర చకోరి విధానఁ జేటికో
త్కరయుత యాచు నెక్కి గిరి ♦ కాంతునిఁ జేరెను రాధ వేడ్కతోన్. ౧౪

చ॥ అటు గిరినాయకాంతికము ♦ నందిన మీఁదట రాధ డోలికన్
దటుకున డిగ్గి కోటివని ♦ తావృతయై లలితా విశాఖలున్

జటుల మనోజ్ఞ చామరలఁ ♦ జక్కఁగఁ బట్టుచు వీవ భక్తులు
త్కటనుతి సల్పుచుండఁదగె ♦ ధారుణినాథ! యనంతరంబునన్. ౨౦

సీ॥ ద్వాత్రింశదధికయూ ♦ థంబులు మిథిలాని, వాసినుల్గోసల ♦ వాసినులును
ధ్రువలోకకాంతలుఁ ♦ దోయధిభామినుల్, శ్రీరమావైకుంఠ ♦ ఉత్రసతులు
నోషధీసతులు మ ♦ హోజ్జ్వలద్వీపవా, సినులు జాలంధర ♦ చేటికలును
నూర్ధ్వవైకుంఠమం ♦ దుండెడి నువిదలు, శ్రుతిరూప మునిరూప ♦ సుదతితతులు

తే॥ పృథుల బర్హిష్మతీసతుల్ ♦ విపినవాసి, నులును యజ్ఞసీతాస్త్రీ ల ♦ తలవిలాసి
నులును యూథములనుగూడి ♦ బలులఁగొనుచు, శైలనాయకు సరసకుఁ ♦ జనిగి మఱియు.

చ॥ సరిగ నలంకరించుకొని ♦ జాణతనంబున బాలవృద్ధుల
చ్చరలును రాజయోగులును ♦ శాంతిసమేతమహర్షులున్ ధరా
మరులు సురర్షులున్ జెలులు ♦ మంత్రులుఁ దగ్గిరి రాజపూజకై
కరములఁ బువ్వులం బలులఁ ♦ గైకొని యేగిరి మైథిలేశ్వరా! ౨౧

ఉ॥ ఈరహి గోప్రవర్ధన ♦ గేంద్రమహోత్సవ మాలకించి కా
మారి, భుజంగహారకట ♦ కాంచితుఁడై సిగఁ జక్కఁగూర్చి ధు
త్తూరము భృంగరాజముచు ♦ దూఁకొని తత్ప్రిమథప్రయుక్తుఁడై
ఘోరముగా నుమారమణి ♦ తో సటకుం జనె నందివాహుఁడై. ౨౩

తే॥ చాలదూరమునుండియు ♦ శైలనాయ, కోత్సవంబును జూడఁగా ♦ నుచితవిధుల
జనులు సనుదెంచి రెక్కువ ♦ సంతసమున, నోలి నిసుకను జల్లిన ♦ రాలనట్లు

ఉ॥ అంచిత గోప్రవర్ధన న ♦ గాధిపుఁ డత్తఱిఁ గృష్ణునానతిన్
గాంచన శృంగ సంగతుఁడు ♦ గాంతిపరీవృతరత్నసానుభూ
మ్యంచితుఁ డీప్సితప్రదుఁడు ♦ నాయతకాయుఁడు బుష్పనిర్ఝరా
ఢ్యంచితుఁడున్ ధరారుహాస ♦ మన్వితుఁడై తగియుండె నో విభూ! ౨౪

ఉ॥ మేలిమి రూపులన్ జెలఁగు ♦ మేరుహిమాద్రిముఖాచలంబు లా
కాలమునందుఁ దద్వరన ♦ గంబునకున్ జనుదెంచి భక్తితోఁ
గేలు మొగిడ్చి కానుకలఁ ♦ గించను గాంచక యిచ్చిమెచ్చి రా
శైలవరార్చ నందుఁడు ద్వి ♦ జన్మముఖంబున సల్పి యాదిలోన్. ౨౬

చ॥ హరివచనానుసారముగ ♦ నల్ల ధరామరగోసురార్చనల్
సరిగ నొనర్చి పాయిలకు ♦ సాపడఁజేసి ధనం బొసంగియున్
ద్వర నుపనంద నంద వృష ♦ భానుయుతుండయి శైలపూజలు
ద్ధురముగ నాచరించి బలిఁ ♦ దోరముగా నిడె నంత భక్తితోన్. ౨౭

తే॥ దానవారి యాగిరికిఁ ప్ర ♦ దక్షిణముల, జేసె వేల్పులు పూల వ ♦ ర్షించి రెల్ల
గోపికాగోపులాడుచుఁ ♦ గోకిలస్వ, నమున గానము సల్పి రా ♦ నందమొదవ.

తే॥ అర్చనామల నగవరం ♦ బంతకంత, కన్ని తెన్నులఁ జెన్నొందె ♦ హరియు నందు
వేఱురూపముతోడుత♦వెలిఁగి బలిగ, నిడిన యన్నరాశులఁ గ్రోలి♦యిట్లు నుడివె.

క॥ గోవర్ధనుఁడను నూడుఁడి!, యీవిశ్వమునందునున్న ♦ యెల్లమలలకే
నేవిభుఁడనని యెఱిఁగి సం, భావనలఁ సల్పుఁడిపుడు ♦ ప్రజలార! యనన్. ౩౦

ఉ॥ చూపఱు లా గిరీంద్రమున ♦ శోభలు నల్గడలందుఁ జిందఁ స
ల్లాపముఁజేయు దేవుని సు ♦ లక్షణలక్షితుఁగాంచి దేవ! మా
శ్రీపతి మిమ్ముఁజూపుటను ♦ జెందితి మేము కృతార్థతన్ దయన్
మా పసు లేము బంధుసఖ ♦ మండలి వృద్ధిఁజెలంగఁ బ్రోవుమా! ౩౧

తే॥ నావు డపరంజినగల వి ♦ న్నాణమొంద, దివ్యరూపంబు ధరియించి ♦ తేజరిల్లు
గోప్రవర్ధనుఁ డవ్వారి♦కోరిక లిడి, ప్రేల్మిడిన్ దిరోహితుఁ డయ్యెఁ♦బిదప మరలి.

తే॥ నంద వృషభాను గోపోప♦నందబంధు, గోపికాజనులును మిత్ర ♦ కూటములును
జంద్రమాళినీలాంబరో♦పేంద్రముఖులు, సనిరి సకుటుంబముగ నిజ♦సదనములకు

ఉ॥ ఈదృశగోప్రవర్ధన న ♦ గేంద్రపవిత్రచరిత్ర మిత్తఱిన్
నీదరిఁ జెప్పినట్టు లల ♦ నిర్జరపాలకు మ్రోలఁ బల్కఁగా
నా దివిజాధిపుండు ప్రతి ♦ హాయనమందలి నాదుపూజ వీ
రీదినమందు మాని గిరి ♦ కెట్టుల నర్చల సల్పి రోమునీ! ౩౨

ఇంద్రుఁడు గోకులంబుపై గోపించుట.

ఉ॥ మూర్తములోన వీరలను ♦ బూదినిఁ గల్పెద నంచుఁ గిన్క సం
వర్తకనామమేఘముల ♦ బంధనముల్ వదలించి వారిదా
వార్త నెఱుంగుఁడీ! త్రుటినిఁ ♦ బ్రత్యవహారమునన్ జగంబులన్
బూర్తిగ ముంచివేసినటు ♦ బోయి వ్రజంబును ముంచివేయుఁడీ. ౩౩

చ॥ అని యనుపన్ దదంబుదము ♦ లప్పుడు రోహిత పీత మేచకా
ర్జున బహుచిత్రవర్ణముల ♦ జొత్తిలి యింద్రనిభంబులై కసిన్
ఘనగజహస్తధారలను ♦ గర్జల మించులఁ గూడి యేకరీ
తినిఁ గురిసెన్ భయంకర వి ♦ ధిన్ వ్రజవాసివినాశనార్థమై. ౩౪

క॥ సుడిగాలి వీవఁ దొడఁగెను, దడదడఁ బిడుగులును బడియె♦దరువులు గృహముల్
దడయక కెడసెను గడువడిఁ, బుడమిని గొండలును గూలెఁ ♦ బొడిపొడిగాఁగన్.

ఉ॥ సప్తబిలంబులున్ బృథుల ♦ సప్తజగంబులు మాఱుమ్రోఁగె ది
క్ప్రాప్తగజాష్టకంబును ధ ♦ రాస్థలి భీతిలి కూలెఁ దారలున్
దీప్తుల వీడి నేలఁబడె ♦ దీనత వ్రేతలతోడ వ్రేలు సం
సుప్తుల బిడ్డలన్ గొనుచు ♦ క్షోభిలు చేగిరి నందుకెంకికిన్. ౩౫

తే॥ అటుల వారలు నందుని♦యాలయమున,కఱిగి బలరామయుక్తుఁడౌ♦హరినిఁగాంచి
కరయుగంబుల ముకుళించి♦కట్టెదుటను, నక్కటికము గలుగునట్టు♦లనిరి జనక! ౩౯

మ॥ అకటా! మానుడి నిక్కమంచు మదిలో♦నత్యంతము న్నమ్మి వా
డుకఁగాఁ జేయు సురేంద్రపూజ విడి వి♦ద్దూరంబుగా నొందుకొం
డకు నర్చల్ బొనరించుచుంటిమి గదా!♦డంబంబుకై యిట్టు లూ
రక వాచించుట పాడియే శివశివా!♦రామా! యశోదాత్మజా! ౪౦

చ॥ అల సురనాయకుండు తన♦యర్చను మాని రటంచుఁ గిన్కతో
నల ప్రలయంబునందువలె♦నన్నులు, జిన్నలు, గొడ్డుగోదలే
మలజడు లిట్టులొందఁగ గృ♦హంబులు గూలఁగ సర్వవస్తువుల్
విలయముసెంద బిట్టుఁ గురి♦పించె నవాభ్రముఖంబులన్ బలీ! ౪౧

తే॥ ఇటుల మము బాధపెట్టుచు♦నింట నీవు
సుఖముగా నుంటి విది మాకు♦సోద్దె మయ్యె
నరయఁ బిల్లికిఁ జెరలాట♦మాఖువునకుఁ
బ్రాణసంకట మనునట్లు♦బాలకృష్ణ! ౪౨

ఉ॥ కావున నింద్రకోపము నిఁ♦కన్ సహియింపఁగలేము మమ్ము నీ
వేవిధిఁ గావ నెంచితివొ?♦యేర్పడఁ దెల్పు మనంగఁ జక్రి, గో
పావళులార! మీరు భయ♦మందక వస్తుసమేతులై కుటుం
బావృతులై త్వదర్చిత న♦గాంతికమొందుఁడి! యేను వచ్చెదన్. ౪౩

శ్రీకృష్ణుండు గోవర్ధన పర్వతం బెత్తుట.

చ॥ అని యిటు వారలం బనిపి♦యాహరి సాగ్రజుఁడౌచు గోవ
ర్ధనగిరిఁ జేరి బాలము, త్వ♦రన్ గమలంబును జేతఁగొన్న రీ
తిని దనకేలఁ దన్నగవ♦తిన్ బెకలించి గ్రహించి గోపులా
ర! నడువుఁడీ! యిటన్ జనుఁడి!♦రండు కుటుంబపశుప్రయుక్తులై. ౪౪

తే॥ అట్లు పలుకంగ గోపకు♦లందఱద్భుతమున ముక్కున వ్రేలిడి♦దారపుత్ర
మిత్ర పరివార గో వస్తు♦మిళితులగుచు, నద్రివిభు క్రిందఁ జేరిరో♦యవనినాథ!

ఆ॥ అవల వానవలన♦నరుదెంచు ఝరములు, పర్వతంబు క్రిందఁ♦బాఱఁదొడఁగ
విడిముడిపడలియొడ♦యఁడు గని సుడివాలు, వ్యాళపాలుఁ దలఁచె♦వారిఁగావ.

క॥ తలఁచిన వెంబడిఁ జక్రముఁ, జిలువలయొడయఁడును వచ్చి♦చెంతఁ జెలంగన్
గలిమిచెలిచెలియుఁ గనుఁగొని, జలములఁ దొలఁగించి గిరిని♦సాకుఁడి మీరల్.

క॥ అనిపంపఁగఁ దచ్చక్రము, మును పల వనధుల నగస్త్య♦ముని యానిన రీ
తినిఁ దన్నగావరణగత, వనముల గడగడను ద్రావి♦వఱలుచునుండెన్. ౪౫

ఆ॥ మఱి యనంతుఁ డల్ల ♦ గిరివరుఁగుండలి, యగుచు మోసి యతిశ ♦ యముగఁ బాఱు
చరుగుదెంచు ఝరము ♦ నావలఁద్రోయుచుఁ, గ్రాలె జలధినాపు ♦ వేలఁబోలె.
తే॥ ఏడుదినము లిట్టుల నచ ♦ లేంద్రమెత్తి, తమ్ముఁగాపాడు హరిచంద్రు ♦ నెమ్మితోఁ జ
కోరవిధమునఁ జూచుచు ♦ గోపకులము, హాయిగా నుండె నోమైథి ♦ లాధినాథ!
మ॥ అపు డాజాడ సురేశ్వరుం డెఱిఁగి వే ♦ యైరావతం బెక్కి స్వీ
య పదాతి ద్విప రథ్యయానములు వె ♦ న్నాడంగ నూఱించులో
ప్పపవిం దాలిచి కిన్కతోఁ జని వ్రజం ♦ బుం జూపి తాఁ గన్న యా
యపకీర్తిం దొలఁగింప నెంచి విసరెం ♦ హాహా! యనం గోపకుల్.   ౭౧
ఉ॥ దాని జనార్దనుండు గని ♦ దవ్వుల వజ్రయుతంబుగా హరిం
బ్రమానుపడం బొనర్చెను సు ♦ మా! యపుడా దివిజేంద్రుఁ డభ్రముల్,
సేనలఁ గొంచు సాధ్వసముఁ ♦ జెంది తెగించి హసింపఁ బాఱెఁ బం
చాననతాడితంబగు గ ♦ జంబు విధంబున భూప! యాపయిం.   ౭౨
ఉ॥ వాన లణంగె వెల్లువలు ♦ వాసెఁ బ్రచండసమీరణంబులుం
మానె విపంకమయ్యె ధర ♦ మప్పితమైన జలంబుతో నదుల్
దానముఁ జెందెఁ బక్షు లమి ♦ తంబగు సౌఖ్యముఁ బొందె గోపసం
తానము సంతసించె హరి ♦ దశ్వుఁడు వెల్గె నభంబు భాసిలెం.   ౭౩
క॥ మని రాభీరులు హరి దయఁ, గనిరి ఘనాఘనసమీర ♦ కష్టము లేమిం
వినిరి వనజాక్షసూక్తులఁ, జని రీవల కందునుండి ♦ స్వజనాన్వితులై.   ౭౪
చ॥ చెలులను గాంచి శ్రీహరి వ ♦ చించె నిటుల్ సఖులార! మీరు నా
వలె నిపుడీ నగంబు నొక ♦ పాణిని నెత్తుఁడి! చూతుఁగాక! యం
చల గిరి నర్థభారమునె ♦ యా సహవాసుల కియ్య వారలం
దుల కురరీకరించి మలఁ ♦ దొడ్గఁగఁ బూనుచుఁ గూలి రిద్ధరం.   ౭౫
చ॥ పులిఁగని నక్క, వాతలను ♦ బొందిన యట్టులఁ దన్నుజూచి కొం
డలతలకట్టు నెత్తఁగఁ గ ♦ డంగి ధరం బడి లేవలేని మి
త్రులను రమేశ్వరుండు గని ♦ రోయక నవ్వుచు లేవఁదీయ వా
ర లలరి కృష్ణమిత్రుఁ బరి ♦ రంభణభూషితుఁ జేసి రెంతయుం.   ౭౬
ఉ॥ తమ్ములుఁ దండ్రులుం జెలులుఁ ♦ దాతలు మామలు సోదరీగణం
బమ్మలుఁ బిన్నపెద్దలును ♦ నన్నలు వెండియు నందు నుందు లో
కమ్ములు శ్రీహరీ! భవద ♦ ఖండఘృణాపరిపూర్ణ దివ్యభా
వమ్మున లొగ్గడిం బడక ♦ వర్ధిలుచుంటి మటంచు వేఁడియుం.   ౭౭

శ్రీకృష్ణాభిషేకము.

చ॥ పెరుఁగును బాల నేతులను ♦ బెల్లుగ నిచ్చి సుమాతృతాదులం
హరిపయిఁ జల్లి వందనము ♦ లగ్గలికంబుగ సల్పి స్వీయమం

దిరముల కేగి రంత వసు ♦ దేవసుతుండును బూర్వరీతిఁ ద
ద్గిరివర ముంచి యొంటరిగఁ ♦ దిగ్రెడివేళ బలారి గాంచుచున్. ౫౮

క॥ అమరులఁ దోడ్కొని తద్ధరి, సముఖంబున కేగుదెంచి ♦ సాష్టాంగనతుల్
గ్రమముగ సల్పియు వినయభ,యములను శ్రీహరికి నిట్టు ♦ లనియెన్ జనకా!

సీ॥ శ్రీవాసుదేవాయ ♦ దేవాదిదేవాయ, యంబుజాక్షాయ తు ♦ భ్యం నమోస్తు
గోపాలకేశాయ ♦ గోలోకవాసాయ, యభ్రవర్ణాయ తు ♦ భ్యం నమోస్తు
బ్రహ్మాండమండల♦భాస్వత్స్వరూపాయ, యసురాంతకాయ తు♦భ్యం నమోస్తు
కరుణాసముద్రాయ ♦ పరిపూర్ణజాతాయ, బలసమేతాయ తు ♦ భ్యం నమోస్తు.

తే॥ గోపికాజననాథాయ ♦ గోప్రవర్ధ, నాచలోద్ధారకాయ తు ♦ భ్యం నమోస్తు
పరమయోగీశ్వరాయ తు♦భ్యంనమోస్తు,వరదశావతారాయ తు♦భ్యం నమోస్తు

తే॥ పతితపావన! జగదీశ! ♦పాహి! పాహి!, కంసముఖదుష్టులన్ జంపఁ♦గ్రాలితీవు
విశ్వమోహన! నీమాయ♦వెట్టనైన, నన్ను బుత్రవాత్సల్యము♦నన్ గ్రహింపు.

తే॥ అనుచుఁ గొనియాడఁ బిమ్మట♦నబ్ధిజాత, యైన సురభినామక కామ♦ధేను వట్టి
గోప్రవర్ధననగమునఁ ♦ గుదిరియున్న, శ్రీపతిన్ స్నాతుసల్పె స్వ ♦ క్షీరధార.

క॥ ఆవల నైరావత మా, దేవధునీసలిలములను ♦ దివ్యాకరములన్
శ్రీవిభు నభిషేకించెను, దీవించిరి బ్రహ్మరాజ ♦ దేవమహర్షుల్. ౬౩

క॥ సురలును హరిపైఁ బ్రీతిని, గురిసిరివర పుష్పవృష్టిఁ ♦ గొండాడిరి కి
న్నరచారణగంధర్వులు, నరుసముత్తో నప్సరసలు ♦ నాడిరి తేఁడా! ౬౪

క॥ పదపడి గోవర్ధనగిరిఁ, బ్రిదివేంద్రప్రభృతిసురలు ♦ దేవకిపుత్రున్
ముదమున నభిషేకించిన, పిదపన్ ద్రవరూపమొంది ♦ వేడ్కసెలంగెన్. ౬౫

శా॥ శ్రీకాంతుండు ప్రసన్నుఁడై యల నగ ♦ క్షేత్రంబు హస్తంబుచేఁ
దాఁకెన్ దత్కరచిహ్న మిప్పటికిఁ ద ♦ ద్గ్రావంబునన్ వెల్గు నే
ర్జోకన్ దానిని గాంచుచుండు రల సు ♦ శ్లోకుల్ సుఖంబొంది యా
వైకుంఠంబున నొప్పుచుండు రని నీ ♦ భావంబునన్ నమ్ముమా! ౬౬

చ॥ మఱి యటఁ గృష్ణపాదముల ♦ మచ్చలు గన్పడుచుండుఁ గామధు
గ్సురభిపదాంకముల్ వెలుఁగుఁ ♦ జూచినవారలు పాపదూరులై
పరమముఁగాంత్రు తు వెండియు సు ♦ పర్వధునీవిమలాంబు వందు సం
బరమునఁ బాఱుచుండు నది ♦ "మానసిగంగ" యనంగ నొప్పెడిన్. ౬౭

ఉ॥ అందున నేప్రజల్ జలక ♦ మాడెదరో యలవారు పాపముల్
డిందఁ నొనర్చి పుణ్యము గ ♦ డిందిగఁ గాంతురు కామదోగ్ధ్రి గో
విందుని స్నాతుగా సలుప ♦ వెల్లువ వాఱిన దేశమెల్ల "గో
విందసరోవరం" బనఁగ ♦ విశ్రుతి కెక్కెను విశ్రుత ప్రభూ! ౬౮

ఉ॥ దాసిని గాంచు వారలును ♦ దద్ధరిధామముఁ జెంది యుందురో
మానవనాథ! యంతి సుర ♦ మండలనాథుఁడు దేవయుక్తుఁడై
దానవవైరి మ్రొక్కి బలి ♦ తండ మొసంగి జయధ్వనుల్ దగం
గా నిజపట్టణంబునకుఁ ♦ గ్రమ్మఱి క్రచ్చఱ నేగె నంతటన్. ౬౯

గోపకులు శ్రీకృష్ణుని పరీక్షించి నిస్సందేహులగుట.

చ॥ ఒకపరి వ్రేలు వ్రేతలును ♦ నొద్దికగా గుమిగూడి నందు ని
క్కకుఁ జని నందరాజున క ♦ కల్మషబుద్ధి వచించి రిట్లు గో
పకవర! నీవె ధన్యుఁడవు ♦ పంకజనాభుని బోలియుండు పు
త్రకు నిటు లేరు గాంచి ప్రమ ♦ దంబును బొంది యశంబుఁ జెందిరే? ౭౦

తే॥ పుట్టగొడుగులఁ బెకలించు♦బుడుతలవలెఁ, దామరసమును బీకెడి♦దంతిమాడ్కి
నాయతంబగు కాయంబు♦నందియున్న, గిరిని నొక కేల నెత్తె నీ♦కృష్ణమూర్తి.

తే॥ ఎచట నేడేండ్ల బాలకుఁ ♦ డెచట నేడు, ప్రొద్దు లా గోవ్రవర్ధన ♦ భూధరంబు
నొక్కచేతను ధరియించి♦యుండు టిద్ది, చిత్రములలోనఁ జిత్రమై♦ చెలఁగె నంద!

వ॥ అదియునుం గాక తల్లి యగు నీ యశోదయుఁ, దండ్రివగు నీవును దెల్లనివారుగా నుంటిరి. మీకు జనించిన పిల్లఁడు మాత్రము నల్లనివాఁడై మన చంద్రవంశంబున విలక్షణుండై యుండె. గతంబేమి? ఇతని యన్నయగు బలభద్రుండు గౌరవర్ణుండగుటవలన సందేహాస్పదుండు గానేరఁడయ్యె. చూడంజూడ నీ కృష్ణుండు క్షత్రియసంభూతుండని తోఁచెడి. ఇయ్యది మనకులంబునకుఁ గళంకం బాపాదించెడి, వెనుదీయక సత్యంబుఁ బల్కుము. లేనిచో గోపకులకుఁ బరస్పరంబు వివాదంబు సంభవించుట ధ్రువం బన యశోదాసహితుం డగు తన్నందుండు భయభీతుండై సవినయంబుగా నయ్యలారా! మున్ని కృష్ణవిషయంబున మన పురోహితుండగు గర్గమహర్షి వలన వినిన సూక్తులు మీరడిగినవానికిఁ బ్రత్యుత్తరంబు నీఁజాలును. కాన నాపైఁ గోపమాపి యాకర్ణింపుఁడు. పూర్ణావతారులగు కమలాకాంతుండును, రాముండును, శ్వేతద్వీపాధిపతియగు హరియు నరసింహుండును నక్షరుండును నరనారాయణమహర్షులు వర్ణక్రమంబుగా లీనమై యుందురను విషయంబు వ్యక్తం బొనరించు "కృష్ణ"యను నామంబున వ్యవహరింపఁబడుచు వేదగుహ్యంబులగు వాసుదేవాద్యనంతనామంబులం దాల్చి ద్వాపరాంతంబును, గలియుగారంభంబు నగు కాలంబునఁ గంసాది దుష్టశిక్షణంబును, శిష్టరక్షణంబు నొనర్ప సకలబ్రహ్మాండనాయకుండగు పరమేశ్వరుండు పరిపూర్ణతమావతారుండై పుట్టి నీకుఁ బట్టియై పరిఢవిల్లుచున్నవాఁడు. ఇతఁడు వృషభాను గృహంబున జన్మించిన రాధావనితామతల్లికకు విభుండగు. ఇతనియందే సకల స్థావరజంగమంబులు విలసిల్లు. ఈతఁడు యుగక్రమంబున శ్వేతారుణ కృష్ణ పీత

వర్ణంబులం బొంది యుద్ధరణి నుద్భవిల్లు. మఱియుఁ గ్రమక్రమంబుగా నీతని లీలలు పరమాద్భుతకరంబులై ప్రవర్తిల్లునని యెఱింగి యాతనిపై మోహంబుఁ బొందకు మని వాక్రుచ్చె. ఇద్ధర నెల్లరకు బ్రాహ్మణవాక్యంబు బ్రహ్మవాక్యంబు గదా యని వారెల్ల నాలకించి గోపకులు మెచ్చక నందుని కిట్లనిరి. ౭౩

ఉ॥ ఈవనురీతి గర్గముని ♦ యిచ్చటికిన్ జనుదెంచినన్ మము
న్నీవపు డేలఁ బిల్వవొకో? ♦ నిక్కమె యియ్యది? చాలుఁ జాల్లయా
భావవచస్సులెందుల క ♦ బద్ధము లాడకు మింకఁ గార్యముల్
నీవొకరుండవే సలిపి ♦ నెమ్మదిఁ జెందుచు నుండుమో ప్రభూ! ౭౪

తే॥ పలికి యిట్టుల వారు త♦ద్వల్లవేంద్రుడు, లోగిలిన్ విడి యొకత్రుటి♦లోపల వృష
భానువరు దరి కరుదెంచి♦ప్రణతిఁ జేసి, సేమమడిగి యీచొప్పునఁ♦జెప్పి రయ్య!

ఆ॥ తొలుత మేము పలుకు ♦ పలుకుల నాలించి, నందుచుట్టఱికము ♦ నట్టులేక
విడిచి మనకులంబు ♦ విమలంబు జేయుమా, వల్లవకులకువల ♦ బంధుచంద్ర!

చ॥ అనవుడు తద్విభుండు విని ♦ యచ్చెరువొందుచు ఘోషులార! గో
పనికరనాథనందవరు ♦ బంధముఁ దెంపుమటంచు నాకుఁ గి
న్కను బలుకంగ సాగితిరి ♦ కారణమేమి? వచింపుఁడీ! యదే
మనమునకుం బ్రియంబయిన ♦ మానక మీ రనిన ట్లొనర్చెదన్. ౭౭

ఉ॥ నందుఁడొ కీర్తిశాలి నవ ♦ నందవిభుండును సర్వగోపకా
నందవిధాయకుండు ముని ♦ నాథనుతుండును మత్సఖుండు గో
విందుని తండ్రియై జగతి ♦ విశ్వజనీనుఁడుగాఁ జెలంగునే?
యెందుల కట్టివాని మన ♦ మిత్తఱి వీడుట మీరు సెప్పుఁడీ! ౭౮

తే॥ తప్పు లేనట్టి వస్తువు ♦ ధరణిలేదు, గానఁ దగినంత దోషంబుఁ ♦ గనఁబఱచుఁడి!
నాకు నచ్చినన్ విడుతు మా ♦ నందవిభుని, సందియంబిందు వలదోయి ♦ సరసులార!

ఆ॥ అంత వార లయ్య! ♦ యా నందవిభునకుఁ, గుల విరుద్ధుఁడైన ♦ కొడుకు పుట్టె
నతని పలుకుఁ బనులు ♦ నాకృతి యబ్రమా, నింతకంటె దోష ♦ మేమనవలె?

క॥ ఈదోషము వరుసఁగ మీ, మీఁదికి రాకుండ ముందు ♦ మేము వచింపన్
మీదరిఁ జేరితి మిష్టము, లేదా యిఁక మీకు మాకు ♦ లేవు ప్రియంబుల్. ౮౧

ఆ॥ అదియుఁగాక నీకు♦నాత్మజ యొక్కర్తు, గలదు సరిగ మదిని♦దలఁపుమయ్య!
యంచుఁ జెప్ప నాతఁ ♦ డానాఁడు నేవిన్న, గర్గసూక్తి వినుఁడు♦కనుఁడు నిజము.

చ॥ సకల జగన్నివాసుఁడును ♦ స్రష్టయు భర్తయు హర్త భర్తర
క్షకుఁడును నా పరేశుఁడు ర ♦ సాతలభారము దీసివేయఁగా
వికటమదం బణంపఁగను ♦ వేధ నుతింపఁగ నొప్పి నందపు
త్రకుఁడయి గోకులంబున వి ♦ రాజిలుచుండెను కృష్ణనాముఁడై. ౮౩

తే॥ త్వన్నికేతన మందు ను ♦ ద్భవము గన్న, రాధ గోలోకవాసిని ♦ రమ్యరూపి
ణియగు పరమేశ్వరిగ నెంచి♦నీవు మోహ, మందకుండుము వృషభాను♦బృందనాథ!

తే॥ మఱియు నీకుమారికకు నా♦హరికిఁ బెండ్లి, ధాతయే వచ్చి యమునకు♦దాపునందు
నెగడు బృందావనంబున♦నిర్జనముగఁ, గ్రాలుభాండీరవనిఁ జేయఁ♦గలఁడు ముందు.

తే॥ నీ కుమారిక కోర్కెచే ♦ నిఖిలగోప, చయము, గోవర్ధనాహ్వయ♦శైలవరము
గోవితతులును యమున బృం♦దావనంబు, పరమగోలోకమునునుండి♦వచ్చె నిటకు.

ఉ॥ ఈరహిఁ బల్కె గర్గముని ♦ యేగను తత్ప్రభృతిన్ మనంబునం
దారమణిన్ గుఱించి విశ ♦ యంబులఁ జెందక భక్తిఁ జూతు నా
ధీరసుధీరులార! ధర ♦ విప్రవరోక్తియు వేదవాక్యమై
తీరుపుఁ జెప్పఁగాదె మది ♦ దీర్ఘముగాఁ బరికింపుఁడీ యనన్. ౮౮

తే॥ ఆలకించిన గోపకు ♦ లబ్బురంబుఁ, జెంది క్రమ్మఱ వృషభాను ♦ శేఖరునకు
యుక్తియుక్తముగా నిట్టు♦లుచితరీతిఁ, బల్కెఁదోడఁ గిరి బహులాశ్వ♦పార్థివేంద్ర!

చ॥ సరిగనె యున్న వీవనిన ♦ సంగతులన్నియుఁ జూడి పంట బం
గరు రజతంబు రత్నములుఁ ♦ గాంచననిర్మితహర్మ్యముల్ మనో
హరమగు నారెముల్ బలము ♦ నర్థము సంపదకీర్తి గోవులున్
వఱలుచు నుండె నీకుఁ బలు ♦ భంగులఁ గంసుఁడు వోంగు భంగిగన్. ౮౯

ఉ॥ కాని త్వదుక్తరీతి వ్రజ ♦ కాంతుఁడు కాంచనరమ్యవేశ్మముల్
గాని సువర్ణభూషణని ♦ కాయముగాని యశోబలంబులన్
గాని మనోజ్ఞగోవులను ♦ గాని వదాన్యతఁ గాని యింకనె
ద్దానిని గాని నీకెనఁగఁ ♦ దార్కొననేరఁడు గాఁడె చూడఁగన్. ౯౦

క॥ ఎయ్యెడ నెయ్యంబునకున్, గయ్యమునకు వియ్యమునకుఁ ♦ గావలె సామ్యం
బియ్యెడ నది సూనుమ మా, కయ్యని విని నంకులోడి ♦ కూర్మిని విడుమా! ౯౧

తే॥ అతనిసంబంధమున్ విడి♦యెలబిలుని, సరణి ధనియును గాన్యకు♦ఖాపురపతి
యధిక బలియౌ బలందను♦నల్లునిగను, జేసికొనినచో లెస్సయౌ♦చెలఁగుఁగాదె.

ఉ॥ అంతియకాని కష్టముల ♦ నన్నితెఱంగులఁ బొందుచున్ గృషిన్
సంతత మాచరించెడి వ్ర ♦ జస్థితనందుని యాత్మజాతు నీ
చెంతకుఁ జేర్పవ ల్దతని ♦ చిన్నిసుతుండె పరేశుఁడైన మే
మంత గనుంగొనంగ వ్రజ ♦ మం దిపు డీవు పరీక్షఁ జేయుమా! ౯౩

చ॥ పలుకఁగ నిట్టులట్టి వృష ♦ భానువరుండును నాలకించి గో
కులపతి వైభవంబును న ♦ కుంఠితరీతిఁ బరీక్షసేయఁగాఁ
దలఁచి క్రియాళిసంఘటన ♦ దక్షులు యోగ్యులు భాగ్యవంతులు
జ్జ్వలులును నా వృణానుల వె ♦ సన్ బిలిపించె విదేహనాయకా! ౯౪

ఉ॥ ఆపయి నాతఁడా బుధుల ♦ నందఱు జూడఁగఁ గోట్లకొల్ది ర
త్నాపితతారహారముల ♦ నామలకాభవిశేషదివ్య ము
క్తాపటలంబులన్ మణిక ♦ దంబము మూడలు బళ్ళెరంబులం
దోపిక నింపి యిచ్చి యుచి ♦ తోక్తులఁ గొన్నివచించి పంపెఁగా. ౯౫

ఉ॥ అంతట తద్వ్రజానులును ♦ నావ్రజనాయకు గోష్ఠిఁ జొచ్చి నే
త్రాంతములన్ ప్రమోదజల ♦ మగ్గలికన్ గురియంగ భక్తి న
త్యంతము మ్రొక్కి కానుకల ♦ నన్నిటి నాదృతి నిచ్చి నమ్రులై
శాంతవచస్సులన్ బలుక ♦ సాగిరి నందుని కిట్లు భూవరా! ౯౬

ఉ॥ ఆవృషభానుఁ డాత్మజన ♦ యాకరపీడన మాచరింపఁగా
భావమునం దలంచి మముఁ ♦ బంపె నిటుల్ వరనిశ్చయార్థమై
కావున నొప్పి నీ సుతునిఁ ♦ గైకొని పెండ్లికిఁ దర్లి రండు క
న్యావరణార్థ మొండు నగ ♦ నర్మిలి మా కిడి యంపుఁడో ప్రభూ! ౯౭

చ॥ అనవుడు నందరాజు విని ♦ యల్ల యుపాయనముల్ గ్రహించి యో
జన సలుపన్ యశస్వినియు ♦ సాధ్వియునైన యశోద చెంతకున్
జని వృషభానుదత్తమణి ♦ సంతతిమౌక్తిక తారహారకాం
చనములఁ జూపి తల్లపిత ♦ జాలము దెల్లము జేసె నల్లనన్. ౯౮

తే॥ శ్రీయశోదయుఁ దనభర్త ♦ సెప్పినట్టి, హరివివాహ మహోత్సవం ♦ బాలకించి
యల్ల వృషభానుఁ డంపిన ♦ యాణిముత్తి,యములఁ గన్గొని నందుని ♦ కనియె నిట్లు.

ఉ॥ శౌరివివాహవార్త విన ♦ సంతస మయ్యెడిఁగాని యిత్తఱిన్
వారు వరార్థమై మణులు ♦ బంగరుసొమ్ములు మౌక్తికంబు ల
వ్వారిగ నిట్టులన్ మనకుఁ ♦ బంపిరి గ్రమ్మఱఁ దద్విధంబునన్
వారికి నంపినన్ మిగుల ♦ బాగుగ నుండును గాని యారయన్. ౧౦౦

చ॥ ధనము సువర్ణభూషలును ♦ దారములున్ వరహారముల్ మణుల్
ఘనముగ నే నొసంగఁ గలఁ ♦ గాని తదాకృతి నొప్పు మౌక్తికం
బు నొకటి యేని లేమి నిడు ♦ పూనిక లేదిఁక నేమొనర్తు? వా
నిని నిడకున్నచో యశము ♦ నీలిమ సెందదె? ప్రాణనాయకా! ౧౦౧

తే॥ కానఁ గర్తవ్యమేమొ ప ♦ ల్కంగఁదగు న, నంగ నందుఁడు సరియని ♦ నందనపరి
ణయము నిట్టి ముత్తెంబులు ♦ నాకుదొరకి, నపుడొనర్తు నం చెంచి యే ♦ మనక యుండె.

తే॥ ఇట్టి జాడ సర్వజ్ఞుఁడౌ ♦ కృష్ణుఁ డెఱిఁగి, యల్ల ముత్యాల నురువుగా ♦ నగుపడునవి
శతము దొంగిలి చని బహి ♦ స్థ్సలమునందు, నాఁటెఁ గృషికుఁడు బీజముల్ ♦ నాటినట్లు.

చ॥ పదపడి నందరాజు వృష ♦ భానుఁడు పంపిన మౌక్తికంబుల
న్గొదకొని లెక్కసేయ నొక ♦ నూ టెటొ తగ్గుటఁ గాంచి యేమిరా!

యిది! బలి యాటకై కొనెను ♦ కృష్ణుఁడు గైకొనెనో మఱెవ్వ రి
య్యది యెటు లాచరించిరొకొ? ♦ యంచు విచారణసేయ నెంచుచున్. ౧౦౪

చ॥ తొలుతను గృష్ణసన్నిధికి ♦ దూఁకుడుగాఁ జని యిద్దియేమిరా!
చిలిపిపనుల్ త్యజింపవుగ ♦ ఛీ యిపు డిచ్చట నున్న ముత్తియం
బులఁ గొనియుంటివే యిటకుఁ ♦ జోకిరు లెవ్వరు వచ్చినట్లు నేఁ
దలఁపను నీవుగంటివె? య♦థార్థముఁ దాఁపక చెప్పుమో సుతా! ౧౦౫

క॥ అప్పురుషోత్తముఁ డపుడో, యప్పా! శతమౌక్తికముల ♦ నంది వెలుపలన్
గొప్పఁగ నాటితిఁ గృషికుల, చొప్పునఁ దప్పేనఁ గొట్టు! ♦ చుల్కనఁగనుచున్.

చ॥ అనవుడు నందుఁ డోరితులు ♦ వా! యెటు లిప్డు హాంచి యెట్టి నే
లను వెదజల్లియుంటివొ వి ♦ లంబము సేయక వచ్చిచూపుమా!
యని హరితోడఁ దా నరిగి ♦ హాగను బంగరు కొమ్మలాకులన్
ఘనమగు చెట్టులం దసిరి ♦ కాయలఁ బోలిన ముత్తెము ల్గనెన్. ౧౦౬

తే॥ కాంచి యాతండు వెన్నుని♦గాఁగిలించి, ముద్దులాడియు నాయనా!♦మొదల వృథగ
మొఱటుగ నిను దండించితి♦బుద్ధి సఖియు, నీవు పరమాత్మవని తోఁచె♦నిశ్చయముగ.

తే॥ కొడుకు కొడుకన్న నందఱు ♦ గొడుకు లగుదు
రొకొ? యీఘక్కఁ దలిదండ్రు ♦ లబ్బినట్లు
మంచిపనులను సల్పు కొ ♦ మరుఁడె కాక
యహహా! యద్భుతానందంబు ♦ లబ్బె నేఁడు. ౧౦౯

ఉ॥ వాకొని యిట్లు రిక్కలు న ♦ భంబునఁ బర్విన మాడ్కిఁ జెట్లపైఁ
బ్రాకిన మౌక్తికంబులను ♦ బండ్లను గోటి గ్రహించి యవ్విశో
భాకర హైమపాత్రముల ♦ యం దిడి కంకణ కాంచికింకిణుల్
గోకలు హారముల్ మణులు ♦ కోట్లకొలందిగఁ గూర్చి కూర్మితోన్. ౧౧౦

ఉ॥ సత్తములౌ వృషానులకుఁ ♦ జక్కఁగ నిచ్చి సుహృదులార! మీ
రెత్తఱిఁ బెండ్లిమూర్తమని ♦ యిచ్చటికిన్ మఱి యేగుదెంతురో
యత్తఱి వేడ్క నెల్లరము ♦ నచ్యుతుతోఁ జనుదెంతు మిప్పుడీ
యుత్తమపారితోషికము ♦ లుగ్మలికై యిడియుంటి మేగుఁడీ! ౧౧౧

చ॥ అని యనుపన్ వృషానులు మ ♦ హాద్భుతహర్షము లొంది వాని వీ
డ్కొని వృషభానువర్యసభ ♦ కుం జని నేతకు వందనంబులన్
బొనరిచి గోకులేశ్వరుఁడు ♦ బుద్ధిమదగ్రణి యైన నందుఁ డం
పిన కరదంబు లిచ్చి సర ♦ విన్ బలుకాడఁ దొడంగి రిట్లులన్. ౧౧౨

తే॥ దేవ! మీయాజ్ఞఁ గైకొని♦దివ్యమైన, వ్రజమునకుఁ బోయి నందుని♦భవనమునకు
నేగి బహుమానముల నిచ్చి♦యీర లనిన, పలుకు లాడితి మాతని♦ఫణితి వినుమ!

మ॥ పలుకా తేనియలొల్కు ధనమా ♦ పౌలస్త్యకోశాభమున్
బలమా శత్రుభయంకరంబు గృహమా ♦ స్వారాడ్గృహశాత్కృష్టమున్
జెలియా పూతచరిత్ర సుతులా ♦ శ్రేష్ఠుల్ సుహృల్లోకులా
యలఘుల్ గోవులు కామధేనువులు సూ! ♦ యా నందభూనేతకున్. ౧౧౪

తే॥ సిరియు సంపత్తు రెండును ♦ సరిగ వఱలు
విలువగల రతనంబులు ♦ వెల్లివిరియు
దివ్యముక్తాతరుప్రత ♦ తియుఁ జెలంగు
నందసుందరమందిరం ♦ బందు దేవ! ౧౧౫

క॥ మీరలు పల్కినభావము, లూరీకృతమగుడు గోప ♦ కోత్తముఁడు వెసన్
గోరికఁ గన్యార్థముగ న, పారముగాఁ గాన్క లిటులఁ ♦ బంపెను గనుమా!

క॥ నందుఁడు కేవలకృషి సే, యందముగాఁ జేయుననెడి ♦ మాటను గర్గం
బందునఁ బడనీయకుమీ, యందఱిని మించినాఁడ ♦ టంచుఁ దలఁపుమీ!

ఉ॥ ఆవల గోపు లాపలుకు ♦ లన్నిటిఁ దిన్నఁగ నాలకించి యా
హా! వృషభాను వాక్యములె ♦ యక్షరరీతి యథార్థమయ్యె రా
ధావనజాక్షి యాహరికి ♦ దారయు నామెకు నట్టి కృష్ణుఁడే
జీవితనాయకుం డగుచు ♦ శ్రీహరియే పరమాత్ముఁడౌఁ జుమీ. ౧౧౮

చ॥ మఱి వ్రజనాయకుం డధిక ♦ మాన్యుఁడు దక్షుఁడు భాగ్యవంతుఁడున్
సరసుఁ డటంచుఁ దోఁచెడిని ♦ సాంతముగా మన పల్కులెల్ల ద
బ్బర లగుచుండె నంచు వృష ♦ భానునకున్ నతులం బొనర్చి పో
యి రతఁడు సంతసించె జను ♦ లెల్లరు హర్షముఁ బొంది రో విభూ! ౧౧౯

క॥ శక్తిని నెచ్చట శ్రీహరి, ముక్తాక్షేపంబుఁ జేసె ♦ ముచ్చట నచ్చో
ముక్తాసరసియగును నట, మౌక్తిక మిడు నరుఁడు ముక్తి ♦ నలయును జనకా!

తే॥ అనఁగ జనకుండు ముదమున ♦ నమరమునికిఁ, బ్రణమిలిఁ బల్కె నిట్టులో ♦ తాపసురేంద్ర!
గోవర్ధనగిరి నెన్ని ♦ గొప్పతీర్థ, ములు సెలంగునో తత్సితిఁ ♦ దెలుపుమయ్య!

ఉ॥ నావుడు మైథిలేశునకు ♦ నారదుఁ డిట్లను గోవర్ధన
గ్రావము సర్వతీర్థ తిల ♦ కం బతిరమ్యము గోపగోపికా
గోవితతివ్యథాహరణ ♦ కోవిదతావిదితంబు వెండి బృందా
దావన మెల్లక్షేత్రములఁ ♦ దద్దయుఁ బెద్దద టంచు నెంచుమా! ౧౨౨

వ॥ మఱియు నగ్గిరివరం బింద్రయాగం బధఃకరించి యఖిలాండకోటిబ్రహ్మాండ నాయకుండును భగవానుండును బరాత్పరుండును బరిపూర్ణతమావతారుండును గోలోకేశ్వరుండును స్వయంభువుండునగు శ్రీకృష్ణునిచే మంత్రతంత్రయంత్రసమన్విత పూజాపురస్కారంబులం బొంది యఘనాశనియగు మానసీగంగను శుభ్రంబును

శుభప్రదంబును శుద్ధంబును నగు చంద్రసరోవరంబును గుసుమాకరసరోవరంబును గోవిందకుండంబును రాధాకుండంబును గృష్ణకుండంబును లలితాకుండంబును గోపాలకుండంబును గలిగి కృష్ణప్రియంబై పూర్ణబ్రహ్మాతపత్రంబై గోలోకముకుటంబై విలసిల్లు. అం దర్భకసహితంబుగా దేవకీగర్భసంభూతవిశ్వగర్భుండు క్రీడలాడె. వెండియు నక్కొండ యందలి శ్రీకృష్ణశీర్షస్పర్శసంజనితలాంఛనాంచితశిల మౌలిశిల యనంబరఁగె. అందు గోవిందుఁడెందుఁగందుకఖేలనం బొనరించెనో యాస్థలంబు కందుకక్షేత్రంబన వన్నెకెక్కె. ఏయశ్మంబునం జిత్రంబు లొనర్చెనో యది చిత్రశిల యని వ్యవహృతంబయ్యె. ఏపాషాణంబున నాహృషీకేశుండు క్రీడారతుండై వాగ్వాదం బాచరించెనో యది వాదని యనం బ్రసిద్ధంబయ్యె. ఏ నేల గోపాలబాలుండు బాలకసహితంబుగా వ్రేల యుష్ణీషంబుల దొంగిలించెనో యద్ది యాష్ణీషతీర్థంబని విదితంబయ్యె. ఎవ్వ రా మలఁగల పూర్వోక్తపుణ్యతీర్థంబులను శ్రద్ధాభక్తులం గని యందగపడు శక్రపదంబులం గాంచి బ్రహ్మపదంబుల నెఱిఁగి కృష్ణపదంబుల సంచరింతురో యవ్వారు పంచమహాపాతకులైనను పావనులై యైహికసుఖంబులను సమగ్రంబుగా ననుభవించి యవసానంబున విష్ణుపదంబుఁ జెందఁగలరు. తన్నగప్రభావం బభివర్ణింపఁ జతుర్ముఖ పంచముఖ షణ్ముఖ సహస్రముఖప్రముఖులును శక్తులు గానేర రనిన నాబోంట్లకలవి గాదని పల్కవలయునే యని మఱల నిట్లనియె. ౧౨౩

దధిహరణ లీల.

తే॥ ఒక్కయెడ హరి తద్గిరి ♦ నోష్ఠనుండు, మురళిఁ దాల్చి యూఁదుచు ♦ నరుగుతఱిని
బెరుఁగు నమ్మ వ్రేతలఁ గాంచి ♦ పేముతోడ, నడ్డి కేలిడి యిట్లనె ♦ సడ్డలేక.

క॥ అలుగఁకుడీ! చెలులారా!, తొలఁగకుఁడీ యిందునుండి ♦ దూఁకుడుమాటల్
బలుకకుఁడీ పెడభావము, దెలుపకుఁడీ గోపికాస ♦ తీమణులారా! ౧౨౪

క॥ అందుఁడు నా కరకమలముఁ, బొందుఁడు మనసార సౌఖ్య ♦ ముల నాతోడన్
జెందుఁడు దమి విహరింపఁగ, నొందుఁడు రమణీయవనుల ♦ నుగ్మలులారా!

తే॥ సుందరీమణులార! యీ ♦ యందగాఁడు, మీకు నిఁక సంభవించునే? ♦ మెలఁగిచిత్త
మందు మీరు యోజించుఁడీ ♦ యదనుదప్పఁ, బదనుదప్పను గాదె యో ♦ పడఁతులార!

ఆ॥ పలుక నటుల నల్ల ♦ వల్లవఫుల్లాబ్జ, నయన లల్ల వికచ ♦ నలిననేత్రు
కరసరోజము దొలఁ ♦ గంగ జేయుచు నిట్లు, పలుకఁ దొడఁగి రయ్య ♦ పార్థివేంద్ర!

శా॥ పో పో పోకిరి! త్రోవలోన నిటు మ ♦ మ్ముం బట్టుటల్ పాడియే?
నీపోకిళ్ళఁగారిపోను దలఁపన్ ♦ నీతల్లిదండ్రుల్ జెఱన్
భూపాలాజ్ఞను గట్టమొందరొకో? నీ ♦ వో పెర్గుపాలెప్పుడున్
గోపాగారములందు దొంగిలివె యో ♦ గోపాల చాల్ జాలురా! ౧౨౫

తే॥ అనఁగ వినినట్టి హరి, హరి♦కి నియె నిట్టు, ప్రబలుఁడైనట్టి కంసు స♦బాంధవముగఁ
జంపి యిటకేను దెత్తు నా♦శక్తిఁ గనుఁడు, పెండ్లియాడుఁడు నన్నిప్డు♦ వెలఁదులార!
క॥ అనవుడు వ్రేతలు దానికి, ననుమతి జూపక వచింప ♦ హరి విని వేత్రం
బునఁ దచ్ఛీర్షస్థిత దధి, ఘన భాండములెల్లఁ బగులఁ ♦ గాఁ బ్రహరించెన్. ౧౩౧
ఆ॥ అద్ది గాంచి యల్ల ♦ యాభీరనారులో, పంకజాక్ష! పెరుఁగు ♦ భాండములను
బగులఁగొట్టితివిగ ♦ బళిర మీ తలిదండ్రు, లకు వచింతు మంచ♦ లయక చనిరి.
ఉ॥ ఆపయి నచ్యుతుండు ముద ♦ మందుచు సందిదె యంచు మిత్రులన్
దాపునఁ జేర్చి తృప్తిపడఁ ♦ దద్దధి నీపపలాశదివ్య ప
ర్ణాపితమైన దొన్నెలను ♦ హాయిగఁ బోయుచుఁ గ్రోలె నాస్థలం
బోపతి! "ద్రోణతీర్థ"మన ♦ నొప్పు నఘాచలవజ్రకల్పమై. ౧౩౩
ఆ॥ అందుఁ జెట్ల కొమ్మ ♦ లాకులు దొప్పల, వలెఁ జెలంగు నింత ♦ వఱకు నెవఁడు
పెరుఁగు దాన మిచ్చి ♦ యొరిగిలఁ జేయునో, వాఁడు గోజగతిని ♦ వఱలు స్థిరత.

గిరిరాజ విభూతి వర్ణనము

తే॥ ఏస్థలంబునఁ గమలాక్షుఁ ♦ డీక్షణాక్షుల, మూసి చెలులతో దాఁగిలి♦మూఁతలాడె
నద్ది పుడమి లౌకికతీర్థ ♦ మనఁగ నొప్పి, పాపరాశులఁ ద్రోలెడిఁ ♦ బట్టుఁబట్టి.
తే॥ ఎందు వెన్నుఁడు సఖులతో ♦ నిటుల నటుల, నింబుగాఁ దిర్గె నద్ది క ♦ దంబఖండ
తీర్థ మన నొప్పి తన్ను భ ♦ క్తిని నుతించు, నరుని నారాయణుం జేయు ♦ నట్టులేక.
తే ఎచట శ్రీహరి రాధతో ♦ నెసఁగి రాస, ఖేలనంబున శృంగార ♦ మోలిఁ గాంచె
నద్ది శృంగార మండలం ♦ బనఁగ నొప్పి, యల్ల గోవర్ధనాద్రియం ♦ దతిశయిల్లు.
తే॥ ఎట్టి రూపముతోడుతఁ ♦ గృష్ణమూర్తి, గోప్రవర్ధనగిరి నెత్తి ♦ గోపకులను
గాచె నారూప మిప్పుడున్ ♦ గాంచఁబడెడి, నట్టి శృంగారమండలం ♦ బందు జనక!
తే॥ రమణమీఱెడి కలియుగా ♦ రంభకాల, మందు నాల్గువేలెనిమిది ♦ వందలేడు
లరుగ శృంగారమండలం♦బందు నచల, బిలము నడుమను హరిరూపు♦ వెడలఁగలదు
శా॥ ఆరీతిన్ దగు చక్రి దేవదమనా ♦ ఖ్యన్ బిల్వ నెల్లప్పుడున్
ధీరుల్ సన్నుతిసేయు లీలలను నెం ♦ తేన్ జేయు నవ్వాని నె
వ్వారల్ భక్తిని వేదశాస్త్ర విధులన్ ♦ బ్రార్థింతురో వారు పా
పారణ్యంబును దాఁటి పుణ్యపురికిన్ ♦ హర్షంబుతోఁ బోవరే. ౧౪౦
తే॥ భరత వర్షంబునం దొక ♦ ప్రక్కయందు, ద్వారకానాథుఁ డొకదెసన్ ♦ బదరినాథుఁ
డొక్కమూల జగన్నాథుఁ ♦ డొక్కచక్కి, రంగనాథుండు నొప్పున ♦ భంగభంగి.
తే॥ ఇటుల నల్వురా నాథుల♦ నెటఁగి నడుమ, గోప్రవర్ధననాథుఁడు♦ గుదురుకొనియె
నాథపంచక మీక్షించు ♦ సాధుబృంద, మవ్యయంబగు గోలోక ♦ మందు నుండు

తే॥ యాత్రఁజేసెడి మానవు ♦ లఖిలనాథు, లను గనుంగొని గోవర్ధ ♦ ననగనాథుఁ
గాంచరో వారు యాత్రచేఁ ♦ గలుగు ఫలము, సెందఁజాలరు శంక కిం ♦ చిత్తు లేదు

తే॥ పంచనాథుల ప్రోలను ♦ బాధితులకు, శరణమగు ధర్మమండప ♦ స్తంభములును
గలవు వానిని నెవ్వఁడు ♦ గనునొ యట్టి, నరుఁడు నారాయణుండయి ♦ వఱలు మఱియు

తే॥ నడచి యాత్రలఁజేయని ♦ నరులు నల్వు, రైన నాథులఁ జూడని ♦ మానవులును
గోప్రవర్ధన గిరినాథుఁ ♦ గోర్కెఁ గనిన, సర్వఫలములఁ గాంతురో ♦ జనకరాజ!

తే॥ మఱియునైరావతాహ్వయ ♦ కరిపదాంక, ములును దేవేంద్రపదచిహ్న ♦ ములునువిష్ణు
పాణి పద లాంఛనంబులా ♦ పర్వతమునఁ, దనరు నవి గాంచు మానిసుల్ ♦ ధన్యతములు.

తే॥ పైనిఁ జెప్పిన చొప్పున ♦ బహుళపుణ్య, తీర్థముల్ గోప్రవర్ధనా ♦ ద్రివరమునకు
నవయవంబులుగా నుండు ♦ నమలచరిత!, యింక నెయ్యది వినెదవో ♦ యెఱుఁగఁ జెపుమ!

తే॥ అనఁగ జనకుఁ డేతీర్థము ♦ లే యవయవ, ములుగఁ దద్గిరి కయ్యెనో ♦ తెలుపుమయ్య!
జ్ఞానివర! యన్నఁ దన్నాక ♦ మానివర్యుఁ, డిట్లు వత్సలతఁ బచి ♦ యింపఁ గడఁగె.

వ॥ భూపా! సకల భూతంబుల సర్వాంగంబులందుఁ బొందుపడియున్న బ్రహ్మంబున కవయవవిభాగం బేర్పరచుట దుర్ఘటంబగు నట్లి గోవర్ధననాథునకు నానుపూర్విగా నంగంబుల నిష్కర్షించుట దుష్కరంబని యెఱుంగుము. ఐనను ప్రసిద్ధంబులైన యంగంబు లేయే తీర్థంబులుగాఁ జెలంగెనో యది నాయెఱింగిన కొలఁది విన్నవించెద. వినుము. ఎచ్చోట గోకులవాసులు పూజాపురస్సరంబుగా నన్నకూటంబు సమర్పించిరో యెద్దానికి శృంగారమండలం బుపరిభాగంబున నుండునో యా రమ్యస్థలం బచలనాథునకు ముఖంబును, మానసీగంగ నేత్రంబులును, జంద్రసరోవరంబు నాసికమును, గోవిందకుండం బధరంబును, గృష్ణకుండంబు చిబుకంబును, రాధాకుండంబు రసనయు, లలితాకుండంబు కపోలంబులును, గోపాలకుండంబు కర్ణంబులును, గుసుమాకర సరోవరంబు కర్ణాంతంబులును, మాలిశిల లలాటంబును, జిత్రశిల శిరంబును, వాదినీశిల కంఠంబును, గందుకక్షేత్రంబు పార్శ్వంబులును, నాష్ణీషకుండంబు కటియును, ద్రోణతీర్థంబు పృష్ఠంబును, లౌకిక తీర్థం బుదరంబును, గదంబఖండతీర్థం బురంబును, శృంగారమండలంబు జీవంబును, శ్రీకృష్ణ పదలాంఛనంబులు మనంబును, దధ్ధస్తచిహ్నంబులు బుద్ధియును, నైరావతాంకంబులు పదంబులును, బుచ్ఛకుండంబు వాలంబును, గామధేను పాదపాళులు బాహువులును, వత్సకుండంబు బలంబును, రుద్రకుండంబు రౌద్రంబును, శక్రకుండంబు కామంబును, గుబేరతీర్థం బుద్యోగంబును, బ్రహ్మతీర్థం బనుగ్రహంబును, యమతీర్థం బహంకారంబును నై విరాజిల్లు నని పెద్దలు వక్కాణించిరి. ఇట్టి గిరివరంబు హరి యురంబునఁ బ్రాదుర్భవించి పులస్త్య తేజఃపుంజంబున నచ్చటికి వచ్చి సర్వపాపంబుల గచ్ఛువిచ్ఛొనరించుచు సాటిలేనిదై మించె. ఏతన్నగవిభూతికథాశ్రవణతత్పరు

లఘురంహితులై పునర్జన్మంబుఁ గాంచక గోలోకమం దానందం బనుభవింతురని గుర్గరుండు మన విని బహులాశ్వుండు మునివరున కిట్లనియె.

మ॥ గిరిరాడ్భూతిని నాకుఁ దెల్పితివి కో ♦ ర్కిన్ వింటిఁ దచ్చైలమా
హారి వక్షంబున నెట్లు పుట్టినది వ ♦ ల్లాడంగ నే వేఁడెదన్
సరసజ్ఞానధురీణ! నా మునియు రా ♦ జా! యల్ల గోలోక భూ
సుర గోవర్ధనజన్మగాథ విను మం ♦ చున్ జెప్పఁ దొడ్గెన్ జుమీ. ౧౫౦

గిరిరాజోత్పత్తి వర్ణనము.

ఉ॥ సత్యుఁ డనంతుఁడున్ బరుఁడు ♦ జ్ఞాని విశుద్ధుఁడు నైజసిద్ధుఁడున్
నిత్యుఁ డనన్యుఁ డవ్యయుఁడు ♦ నిర్గుణుఁడున్ బ్రమదస్వరూపుఁడున్
బ్రత్యవహారభాసురుఁడు ♦ భర్తయు హర్తయు గర్తయున్ ముని
స్తుత్యుఁడు కాలరూపుఁ డఘ ♦ దూరుఁడు పూర్ణుఁడు కృష్ణుఁ డొప్పఁగా. ౧౫౧

ఉ॥ ఆతని వీడి మానస మ ♦ హంకృతి చిత్తము బుద్ధియున్ మహా
భూతములున్ మహత్తులు వి ♦ భుండు బలుండు గుణత్రయంబు బ్ర
ద్యోతనుఁడున్ గళానిధియు ♦ నుర్వియు నూర్ధ్వము దిగ్వ్రయంబు జీ
మూతము నిర్వవం చెలుఁగు ♦ భూవర! యాహరి యిచ్చ నాదిలోన్. ౧౫౨

శా॥ వాలాయంబుగ శేషుఁడై బిసరుచిన్ ♦ భాసిల్లి యూరుస్థలిన్
లీలాలోలతమంబు మానవచతు ♦ ర్లిప్సాప్రదంబైన శ్రీ
గోలోకంబు సృజించి పాదమున ది ♦ క్కూలంకషోర్మిచ్ఛటా
వ్యాలీఢత్రిపథప్రసారచతురన్ ♦ భాగీరథిన్ గాంచియున్. ౧౫౩

సీ॥ వామాంసమందున ♦ వాహినీవరయైన, కాళిందినిం గుతు ♦ కమునఁ గాంచెఁ
జీలమండను గడు ♦ జెన్నువహించెడి, రాసమండలమును ♦ రాణఁ గాంచె
జానుపులందున ♦ సర్వ వనంబుల, నింబగు బృందావ ♦ నంబుఁ గాంచె
నూరువులందున ♦ నుత్తమోత్తమమైన, లీలా సరోవరం ♦ బోలిఁ గాంచెఁ

తే॥ గటిని నవరత్నఖచితమౌ ♦ కనకభూమిఁ, గాంచె నుదరరోమావళిన్ ♦ గ్రమమాధ
వీలతలఁ గాంచె నాభిని ♦ వేలకొలఁది, వివిధవర్ణాంచితాబ్జముల్ ♦ వేడ్కఁ గాంచె.

చ॥ మఱియును జక్రిజంఘముల ♦ మాధవమాధురిసాధువున్ సరో
వర రుచిరంబు భృంగరుతి ♦ భాసురమున్ సుమనోమనోజ్ఞమున్
సరస విహంగ సంగతము ♦ చత్వరహర్మ్యసభాసమేతమున్
గురుతర భాస్వరంబయిన ♦ కుంజముఁ గాంచె మహోల్లసంబునన్. ౧౫౫

తే॥ జత్రుదేశంబులందు వి ♦ చిత్రములగు, ద్వారకా మధురాపురుల్ ♦ పరిఢవిల్లె
భుజములందున శ్రీదామ ♦ ముఖులు నష్ట, పార్షదుల్ బుట్టిరా పీత ♦ పటున కింక.

మ॥ త్రివళిప్రాంతములన్ సుగంధయుతమా ♦ దివ్యానిలం బొయ్య ను
ద్భవమయ్యెన్ మణిబంధయుగ్మమున నం ♦ దచ్ఛ్రేణి జన్మించె రో
మ వితానంబున గోపవంశము జ ♦ న్మం బొందె బుద్ధిన్ లతా
నివహంబుల్ తృణగుల్మముల్ గలిగె ని ♦ శ్ఛిద్రప్రతాపోదయా! ౧౫౭

వ॥ వెండియు నా బ్రహ్మాండనాయకునకు ౧౫౮

చ॥ మనమున గిబ్బ గిడ్డలు స ♦ మంజసరీతిఁ దగెన్ గరాగ్రమం
దున నుపనందులున్ దగిరి ♦ దోర్యుగమూలములందుఁ బొందికన్
ఘన వృషభాను షట్కమును ♦ గన్పడె దాపల మూఁపునందు గౌ
రనిబిడకాంతిపుంజము వి ♦ రాజిలె రాజ! యనంతరంబునన్. ౧౫౯

తే॥ దానినుండి లీలయు, సిరి ♦ ధాత్రి విరజ, లనెడి వనితామణులు వెల్గి ♦ రందు లీల
యను లతాంగిని శ్రీరాధి ♦ కాఖ్యఁ బిలుతు, రామె హరిసతులందు ము ♦ ఖ్యగఁ జెలంగు

ఉ॥ ఆయమ దివ్యబాహుయుగ ♦ మందుఁ దనర్చెన్ లలితావిశాఖలన్
దోయలు లిర్వు రొప్పిరిఁకఁ ♦ దోయజలోచనలైన గోపికల్
బాయక యామె కేశముల ♦ భాసిలి రిట్టుల గోజగంబు భా
గ్యాయతనంబుగా సలిపె ♦ నా కమలాలలనేశుఁ డంతటన్. ౧౬౧

ఉ॥ దేవుఁడు దేవపోషకుఁడు ♦ దేవనుతుండును వాసుదేవుఁడున్
భావజకోటిమోహనుఁడు ♦ భక్తవశుండు పరాత్పరుండు శి
ష్టావనతత్పరుండు నగు ♦ నచ్యుతుఁ డగ్గలమైన వేడ్క రా
ధావనజాక్షితోఁ గలిసి ♦ తత్పృథు గోజగమందు నొప్పగన్. ౧౬౨

చ॥ ఒకపరి వేణుగానరవ ♦ యుక్తము భామినినూపురధ్వని
ప్రకటితమున్ సువర్ణగృహ ♦ వప్రసభాంగణ హార్మ్యరమ్యమున్
సకల లతాప్రసూనఫల ♦ సంయుతమున్ జననేత్రరామణీ
యకమగు రాసమండలము ♦ నందున రాధిక, భర్త కిట్లనెన్. ౧౬౩

తే॥ జీవితేశ్వర! నాపైని ♦ జెలిమి నిశ్చ,యముగ నున్నచో నీతోడ ♦ నంతరంగ
మందు నుండెడి భావంబు ♦ నఱమఱలను, విడిచి నుడివెద నావుడు ♦ వెన్నుఁడపుడు.

ఉ॥ దాని వచోవిలాసమును ♦ దాని సుధాకరతుల్యవక్త్రమున్
దాని మదేభయానమును ♦ దాని లసన్మధురాధరంబునున్
దాని శరీరసౌష్ఠవము ♦ దాని మనోజ్ఞవిభావహావముల్
దాని కటాక్షముల్గని ము ♦ దంబును బొందుచు నామె కిట్లనెన్. ౧౬౪

తే॥ నీదు భావమునందున ♦ నిలిచియున్న, యాశయంబును దెలుపుము! ♦ యద్ది యొసఁగఁ
దగనిదైనను నీపైని ♦ తమకమునను, నిడుదు స్పష్టీకరింపుమో ♦ యొమ్మెలాఁడి!

క॥ అనవుడు రాధిక యిట్లను, వనజాక్షా! యమునతటిని ♦ వఱలెడి బృందా
వని గుంజముదరి గూఢమ,యిన దేశము రాసమునకు♦నేర్పరచు మనక్. ౧౬౭

చ॥ హరి శ్రవణంబులార విని ♦ యట్టులె యంచు రసంబుతోడ న
చ్చెరువును గొల్పు భామిని ర ♦ చింపఁగ నెంచి సమస్తలోకముల్
గరముఁ బరీక్ష సల్పి యెటఁ ♦ గన్గొనఁజాలక స్వీయనేత్రతా
మరసములన్ స్వవక్షము న ♦ మందముగాఁ గనె నంతమాత్రనే. ౧౬౮

శా॥ గోపీ వ్యూహము చూచుచుండ నల వై♦కుంఠోరువక్షంబునం
దాపేక్షన్ సజలప్రభాపటల మ ♦ త్యంతంబుఁ దోఁతెంచి క్రీ
డాపాత్రంబగు రాసభూమిఁ బడి గు ♦ ట్టంబోలు రూపంబుతోఁ
బాపధ్వంస కృతిప్రశస్త మగుచున్ ♦ భాసిల్లె నంతంతటన్. ౧౬౯

సీ॥ శ్రీఫలమన్మథ ♦ చిత్రకవకుళక, దంబ రంభాముఖ ♦ తరువరముల
మల్లికా మాలతీ ♦ మాధవీ చంపక, పారిజాతాది పు ♦ ష్పనిచయములఁ
గీరపారావత ♦ శారికాపరభృత, సారస భృంగాది ♦ సరసరుతుల
స్నానపానోచిత ♦ స్వాదూదకోల్లస, న్నీరజవ్యావృత ♦ నిర్ఝరములఁ
తే॥ వెలఁగి శతకోటి యోజన♦ములను ప్రాలు, శేషుఁబోలిన లంబంబు♦నొంది లక్ష
యోజనంబుల వెడలుపు♦ నొంది యొప్ప,పదులకోట్లామడల యెత్తు♦వఱలి ప్రబలె

తే॥ స్వర్ణకలశోజ్జ్వలత్సౌధ ♦ సరణి నద్రి, కోటియోజన విస్తృత ♦ కూటశతక
ములను వెలుఁగు గోవర్ధనా♦చలమని శత,శృంగమని దానిఁ బిలిచెద♦రిలను జనులు

ఉ॥ అత్తఱి గోజగజ్జనము ♦ లర్ఝురె! యొక్కక్షణంబులోన నీ
యెత్తు, విశాల, మాయతము ♦ లీ మల కెక్కడనుండి నేవిధిన్
హత్తెనొ యంతకంత కిది ♦ యంతయుఁ గ్రమ్ముచుఁ బెర్గుచుండె హా
చిత్తము దత్తరిల్లెడిని ♦ జేయుట కేమియుఁ దోఁప దక్కటా!

తే॥ అద్ది గనుఁగొని వనజాక్షుఁ♦డద్రిఁ జేతఁ, జఱచి యేల గోవర్ధనా♦చల! యిదేమి
జగముఁ గ్రమ్ముచుఁ బెరిగెద♦వింగను నిలువు,మంచు శాసింప నాగుట్ట♦యట్టె యాగె.

ఆ॥ అంత వెన్నుని చెలి ♦ యైన త ద్రాధిక, నయనపర్వ మిడెడు ♦ నగవరంబు
నందు గూఢమైన ♦ యనుఁగుచోటును గాంచి, శౌరితోడఁ గూడి ♦ చేరె ధీర!

ఉ॥ ఆవల నగ్గిరీంద్ర మల ♦ యచ్యుతు నానతి సర్వపుణ్యతీ
ర్థావృతమున్ దిరస్కృత ఘ ♦ నాసితకాంతియుతంబు నాది తే
యావళి హర్షదాయకము ♦ నై యల ద్రోణుసతిన్ జనించి మో
దావహమైన గోకులము ♦ నందుఁ జెలంగెఁ బులస్త్యనీతమై. ౧౭౪

ఉ॥ ఎట్టులఁ దత్పులస్త్యముని ♦ యెందుల కాగిరిఁ దెచ్చి యిచ్చటన్
బెట్టెనొ యట్టివార్త విని ♦ పించితి మున్నిఁకఁ దన్మునీంద్రుఁ డా

గుట్టల మేలుబంతి కల ♦ గోజగమందున హెచ్చినట్టిటన్
బిట్టుగఁ బెర్గునే మొ యను ♦ భీతిని శాపమిడెన్ క్షుధార్థమె. ౧౭౬

క॥ అనెడి సమాచారంబును, మును సెప్పితిఁ గాదె! యిట్టి ♦ భూధరజన్మం
బును విన్నవార లందఱు, గనరే గోలోక బహుసు ♦ ఖంబుల జనకా! ౧౭౭

గిరిరాజ మాహాత్మ్యము.

క॥ ఏతద్గిరిమహిమంబున, నైతిహ్యము వినుము విజయుఁ ♦ డను బాపఁడు త
ద్గౌతమి తీరం బందున, భూతలజనవంద్యుఁ డగుచుఁ ♦ బొలుపారవలెన్. ౧౭౮

చ॥ అతఁడు ఋణంబు గైకొనఁగ ♦ నామధురాపురి కేగి స్వీయమా
కృతి నెఱవేర్చి తిర్గి తన ♦ యింటికిఁ బోవుచు త్రోవలోన న
ద్భుతమగు రూపమున్ గలిగి ♦ పొల్పువహించిన తన్నగంబునం
దతిశయవర్తులం బయిన ♦ యశ్మము నొండు గ్రహించి వేడుకన్. ౧౭౯

చ॥ వరుసఁగ గోకులంబు విడి ♦ పైనిఁ బ్రయాణము సల్పుపట్టున
న్గరములు మూఁడు, హస్తనిభ ♦ నాస, మురస్థ్సముఖంబు, వక్రమై
నరదనపంక్తి, రక్తనయ ♦ నంబులు, నాల్కలు నాల్గు, చేతులే
డు, రువగు ముండ్లఁబోలిన న ♦ ఖోత్కరము, ల్గల రాక్షసు న్గనెన్. ౧౮౦

ఉ॥ ఆదనుజుండు వోయెడి ధ ♦ రామరవర్యునిఁ గాంచి యాఁకటన్
రోదసి భేదిలన్ బహువి ♦ రుద్ధవిధంబున ఘుర్ఘురాభమా
నాద మొనర్చి వాని నయ ♦ నంబుల ముంగల నిల్వ బ్రాహ్మణుం
డాదను గేలనున్న గిరి ♦ యశ్మమునం బ్రహరించె భూవరా! ౧౮౧

ఉ॥ అంతట యాతుధానుఁడు న ♦ ఘౌఘనివారణశీల శైలరా
డంతరనీతపూతశిల ♦ స్పర్శనంబునఁ బడ్డ దుష్కృతా
క్రాంతనిశాచరత్వము న ♦ రంబున వీడి మనోజరూపుఁడై
చింత దొలంగి బ్రాహ్మణునిఁ ♦ జేరి నమస్కృతి సల్పి యిట్లనెన్. ౧౮౨

ఉ॥ భూసురవర్య! నీవె బహు ♦ పుణ్యతముండవు లోకరక్షణా
భ్యాసమహాశయుండ వొక ♦ వర్తులమా శిలఁ గొంచు నాపయిన్
వేసి నిశాటరూపమును ♦ వీడ నొనర్చియు నిట్టిరూప మీ
వేస మొసంగి నాకుఁ గడు ♦ వేడుకఁ గూర్చితి విద్ది యల్పమే? ౧౮౩

ఉ॥ క్రమ్మఱ బ్రాహ్మణుండు వలు ♦ కంగఁ దొడంగెను సిద్ధపూరుషా!
యిమ్మెయి నేను మిమ్ము నఘ ♦ హీనునిగా నొనరింపలేదు స
త్యమ్ముసుమీ మదశ్మమున ♦ కట్టి మహత్త్వ మెలంగునంచు లే
శమ్ము నెఱుంగఁజాల నిక ♦ సర్వము నీవె వచింపఁగాఁ దగున్. ౧౮౪

క॥ అనవుడు సిద్ధుం డిట్లను, వినుమా గోవర్ధనాద్రి ♦ విభు మహిమంబుల్
మును పెద్దలు వల్కిన రీతిని జెప్పెద నీకు విజయ! ♦ ధీరసుగేయా! ౧౮౫

సీ॥ మంచిమాటలఁ జెప్పి ♦ మాయలఁ గావించి, కొంపలఁ గాఁజేయు ♦ కొంటెవాండ్రు
వేదశాస్త్రములకుఁ ♦ బెడయర్థముల్ సల్పి, కుమతంబులన్నిల్పు ♦ కుత్సితులును
బవ లమ్మ యని రేయిఁ ♦ బడకకుఁ బడఁతిరో!, రమ్మని పిల్చెడి ♦ రాక్షసులును
నుపకారములఁ బొంది ♦ యపకారములఁ జేసి, ధన్యులమని నిక్కు ♦ తక్కరులును

తే॥ దేవ భూదేవతల దూఱు ♦ దృప్తులు మఱి, "యాత్మవత్సర్వభూతాని" ♦ యంచు నన్య
దార ధనముల నర్థించు ♦ వార లేని, నల్ల గిరిని గాంచిన ధన్యు ♦ లగుదు రయ్య!

సీ॥ గంధమాదనయాత్రఁ ♦ గలుగు ఫలంబును, మించు పుణ్యంబు సి ♦ ద్ధించుచుండు
వృషభాద్రిశైలక ♦ ఋశ్యమూకాద్రి యా, త్రలఁ గల్గు ధన్యత ♦ దనరుచుండు
మంగళగిరియాత్ర ♦ జంగరుణ భక్తి నో, సంగిన సుకృతంబు ♦ సంభవించుఁ
గేదారమందున ♦ నైదువేలేండ్లు త, పంబును సల్పిన ♦ ఫలము గలుగు

తే॥ కూటశాద్రిని నపరంజి ♦ కొమ్ములున్న, గోవులను దానమిచ్చిన ♦ గొప్పఫలము
సేకుఱు నల గోవర్ధన ♦ చిత్రగిరిని, గన్నులారంగ గనిన ని ♦ ష్కల్మషులకు. ౧౮౭

సీ॥ మలయాచలంబున ♦ మణుఁగుల కొలఁదిని, స్వర్ణమిచ్చినఁగూడ ♦ ఫలములేదు
దేవగిరిన్ భూమి ♦ దేవతలకుఁ బంచ, భక్ష్యాన్నమిడినను ♦ ఫలములేదు
సహ్యపర్వతమందు ♦ శాస్త్రోక్తరీతి ను, ర్వర నొసంగినగూడ ♦ ఫలములేదు
వేంకటాచలమందు ♦ వింధ్యాద్రియందు స, వంబుల సల్పిన ♦ ఫలములేదు

తే॥ వారిధారమహేంద్ర ప ♦ ర్వతములందు, నశ్వమేధసహస్రంబు ♦ నధికభక్తి
నాచరించిన ఫలము లే ♦ దట్టి గోవ, ర్ధనంబును గననట్టి ♦ వారి కనఘ!

తే॥ అట్టి శ్రీశైలమందు వి ♦ ద్యాధరాఖ్యఁ, జెలఁగుకొలఁకునఁ బదియబ్ద ♦ ములను జలక
మాడు పుణ్యంబుగలుగు నీ ♦ యద్రినున్న, పుచ్ఛకుండంబునం దొక ♦ పూఁట మునుఁగ

వ॥ మఱియు శ్రీరామనవమిని జిత్రకూటంబాదలి పయస్వినీనదిని, నక్ష తృతీయను బారియాత్రగోత్రంబునను, సప్తమిని నింద్రకీలశైలంబునను, వ్యాస పూర్ణిమను గుకురగిరియందును, మథన ద్వాదశిని నీలాద్రియందును, స్నానదాన తపంబులం జేసిన పుణ్యం బీగోవర్ధనాచలం బందలి మానసీగంగను మునింగిన సిద్ధించు. వెండియు సురగురుండు సింహరాశిగతుం డగుచుండ గోదావరీ ప్రవాహిని యందును, వాచస్పతి కుంభరాశిం బ్రవేశింప మాయాపురం బనంబరఁగు హరిద్వారంబునను, ఋష్యమీనక్షత్రమందుఁ బుష్కరతీర్థంబునను, సూర్య గ్రహణంబునం గురుక్షేత్రంబునందును, జంద్రగ్రహణంబున వారణాసియందును, ఫాల్గునంబున నైమిశక్షేత్రంబునను, నేకాదశీతిథిని శూకరక్షేత్రమందును, గార్తిక మాసంబునందు గణముక్తిదక్షేత్రంబునను, గార్తికపూర్ణిమయందు వటేశ్వర

క్షేత్రంబునను, శ్రీకృష్ణజన్మాష్టమిని మధురాపురమందును, ద్వాదశీదినంబునందు ఖాండవవనంబునను, నర్కుండు మకరగతుం డగుడు బర్హిష్మతీపురంబునను, మాఘశివరాత్రిని వైజనాథవనంబునను, సోమవతియగు నమావాస్యను గంగాసాగరసంగమస్థలంబునను, దశమిని రామేశ్వరంబందలి సేతుబంధంబునను రథసప్తమిని శ్రీరంగక్షేత్రంబందును దర్శించి యవగాహనం బొనర్చి యథాశక్తిదానంబులొసంగి సవంబులం గావించి జపతపస్స్వాధ్యాయంబుల నాచరించిన వారెట్టి ఫలంబులొందెదరో యట్టి యగణ్యపుణ్యం బీ గోవర్ధనాద్రి నొకమాఱైన సందర్శించి గోవిందకుండంబునఁ దానంబు సల్పి దానంబు లనూనంబు గావించిన సేకూఱు నని గుత్తెరుంగుము. ఇంకఁ జాంద్రాయణాదివ్రతంబుల సల్పిన పుణ్యంబుకంటెఁ గోటిగుణితఫలంబు లభించు క్షేత్రంబులలో క్షేత్రరాజంబై పర్వతంబులం బర్వతశ్రేష్ఠంబై దర్శనీయంబులను సందర్శనీయంబై వెలుంగు నగ్గిరివరంబుతో సమంబగు క్షేత్రంబును బర్వతంబును దర్శనీయంబును బుణ్యప్రదంబును త్రికాలంబులను లేవని తెలిసికొనుము. తాదృశమహామహిమామనోహరంబగు నగ్గోవర్ధనంబందలి పాషాణంబున నన్నుఁ బ్రహరించితివి. తచ్ఛిలాస్పర్శంబున మత్కలుషంబులు లులితంబులయ్యె. రాక్షసత్వంబు వాసె. రమణీయరమారమణరూపంబు నాకు సిద్ధించె. కానఁ దద్గిరిదర్శనస్పర్శనంబుల నాచరించిన నీవె కృతార్థుండవుగాదె యని నుడివిన నప్పుడమివేల్పు విని హర్షాశ్చర్యంబులం బొంది సిద్ధున కిట్లనియె.

ఉ॥ సిద్ధ! మహానుభావ! బుధ ♦ శేఖర! నీ యనుకంప నిత్తఱిన్
శ్రద్ధగ గోప్రవర్ధనధ ♦ రాధరదివ్యమహత్తు వింటిఁ ద్వ
చ్ఛుద్ధశరీరముం గనులఁ ♦ జూచితి నమ్మితిఁ బ్రాగ్భవాన నీ
పద్ధతి యెట్టిదో యెఱుఁగఁ ♦ బల్కుమ నావుడు సిద్ధుఁ డిట్లనెన్. ౧౯౧

ఉ॥ కాశ్యపిదేవ! పూర్వజనిఁ ♦ గల్మషయుక్తుఁడనై పవిత్రమౌ
వైశ్యకులంబునందుఁ బ్రభ ♦ వంబును బొంది ధనోద్ధతుండనై
వేశ్యలఁగూడితిన్ సురను ♦ వేమఱు ద్రావితి జూదమాడి య
స్పృశ్యుఁడనైతి జాతి పిత ♦ భార్యయుఁ దల్లియు బిట్టు దిట్టఁగన్. ౧౯౨

ఉ॥ కోపము వచ్చి యొక్కతఱిఁ ♦ గొబ్బరికాయలఁ గొట్టినట్లు నా
తాపము దీర భార్య తలి ♦ దండ్రుల నెత్తులపైనిఁ గత్తితోఁ
బాపభయానుకంపలను ♦ భావమునం జొరనీక కొట్ట వా
రీ పృథివిన్ ద్యజించి పర ♦ మేగి రనంతరమందు వేడుకన్. ౧౯౩

ఉ॥ నేనును హారివిత్తమును ♦ నిమ్కముఁ గైకొని వేశ్యతోడ నీ
శానసుమిత్రదిక్కునకుఁ ♦ జక్కఁగ నేగి ధనంబు వెచ్చమ

న్మాన్యన మొనర్చి డబ్బుకయి ♦ నూఱులకొల్దిఁగఁ జంపి లోకులన్
మానపరాభవంబులను ♦ మాని చరించుచు నుంటి భూసురా! ౧౯౪

ఉ॥ చేసిన బ్రహ్మహత్యలును ♦ జేసిన క్షత్రియ హత్యలున్ మఱిన్
జేసిన వైశ్యహత్యలును ♦ జేసిన పాదజహత్య లింక నేఁ
జేసిన భ్రూణహత్యలును ♦ జేసిన మానిని రత్నహత్యలున్
నీ సవిధంబునన్ బలుక ♦ నేర్తునె? యిన్నియటంచుఁ గోవిదా! ౧౯౫

క॥ ఒకపరి మృగమాంసార్థము, సుకముగ నొకవనముఁ జేరి ♦ చూచెడితఱి నం
దొక భుజగం బేతెంచియు, స్వకపాదములంటఁ గఱవఁ♦జచ్చితి నంతన్. ౧౯౬

క॥ చీఁకటి ద్రాఁకుల గుమినలెఁ, గైకొని కశపాశములను ♦ గన్నుల నిప్పుల్
దూఁకఁగఁ బండ్లను గొఱకుచు, భీకరయమభటులు వచ్చి ♦ వెరఁగుపడఁ గసిన్.

క॥ త్రాడుల గుత్తముగా న,న్నాడని రహిఁ గట్టి ముద్గ ♦ రోత్కరములతోఁ
దాడించి యాపుడమిపై, నీడుచుకొని సంయమినికి ♦ నేగిన మీఁదన్. ౧౯౮

తే॥ కాలునాజ్ఞఁ గుంభీపాక♦ఘన నరకము, నందు మన్వంతరం బుంచి♦యమితహింస
సల్పి తప్తోర్మినరకానఁ ♦ గల్పమొందు, పెక్కుబాములఁ బెట్టిరో♦విప్రవర్య!

క॥ ఎనుబదినాలుగు లక్షల, పెను నరకములందు నన్నుఁ ♦ బెట్టుచు వేర్వే
రను నొక్కొక యేడును వ్యథ,లను బెల్లుగఁ బెట్టి రావ♦లన్ శమనేచ్ఛన్. ౨౦౦

క॥ భారత ధారణిలోఁ బడి, సారులు సూకరముగాను, ♦ శతజన్మములన్
దారుణ శార్దూలంబుగ, నూఱుజనుల నుష్ట్రముగను ♦ నూల్కొంటి మఱిన్.

తే॥ మహిష జన్మము నేనూఱు♦మాఱులెత్తి,యుంటి సర్పజన్మంబుల♦నొక్కవంద
సారులెత్తి దుష్టులచేతఁ ♦ జంపఁబడితి, నింకఁ బదివేల యేండ్లిటు♦లేగె జనుల.

క॥ అంతట నిర్జలమైన వ,నాంతరమం దిట్టి రాక్ష ♦ సాకారముతో
వింతగ వికిరాలాఖ్య దు,రంతాపత్కరుఁడనగుచు ♦ నలరుచు నెంతో. ౨౦౩

తే॥ ఒక్క శూద్రుని మొడలున♦నొయ్యనెక్కి, గోకులంబున కేగఁగా♦గోపకులును
గృష్ణపార్షదులు నగు న♦హీన బలులు, గాంచి కఱ్ఱల నను గొట్టఁ♦గడఁగి రంత.

తే॥ వారి తన్నుల కాగక♦వ్రజము విడిచి, కాల్కలందిగఁ బాఱి యా♦కరణి క్షుధను
నిర్దయాత్ముండనై యిప్డు ♦ నిన్ను మ్రింగ, వచ్చియుంటిని నింతలో♦పలను నీవు.

క॥ భీతి మనంబును గలఁచఁగ, నాతత గోవర్ధనాద్రి ♦ యశ్మముతోడన్
ఘాత మొనర్చితి దానన్, బూతుఁడనై కృష్ణకృపను ♦ బొందితి శుభముల్.

ఉ॥ ఈకరణిన్ ధరామరున ♦ కెంతయు వాకొను లోన నట్టి గో
లోకమునుండి భూషణము ♦ లున్ హయముల్ బదివేలుఁ గోటి సూ
ర్యాకృతి తుల్యకాంతు లను ♦ యాయులు లక్ష సహస్రచక్రముల్
దూఁకొను నొందు తేరటకుఁ ♦ దోడనె వచ్చియు నిల్చె ముంగలన్. ౨౦౭

క॥ దానిని సిద్ధుఁడు విప్రుఁడు. పూనికఁ గని హర్ష మొంది ♦ మ్రొక్కి పిదపన్
దానిని నెక్కుచు సిద్ధుఁడు, మానిత గోలోకమున క ♦ మందగతిఁ జనెన్. ౨౧౫

తే॥ పిదప బ్రాహ్మణవర్యుఁడు ♦ వెనుక మరలి, విమలభక్తి గోవర్ధన ♦ సముఖమునకుఁ
జని ప్రదక్షిణముల్ జేసి ♦ సంస్తవంబు, సలిపి ప్రణమిల్లి యరిగెను ♦ స్వగృహమునకు

ఉ॥ ఈరహి గోప్రవర్ధన న ♦ గేంద్రకథాసుధఁ గ్రోలువారలా
శ్రీరమణస్వరూపమును ♦ జెంది మనోహరతత్త్వలంబునన్
జేరి సుఖంత్రు గాని పితృ ♦ శేఖరదండము గాంచ రిద్ధిము
క్కారుల నిక్క మయ్య జన ♦ కా! యని ప్రీతి వచించె శౌనకా! ౨౧౬

తే॥ మఱియు గోపరాణ్ణవకేళి ♦ సరిగ విన్న, వారు దేవరాజును బోలి ♦ పరమసుఖము
లనుభవించియుఁ బరమున ♦ నట్టి నంద, రాజు కైవడి శాంతులై ♦ రాజిలుదురు.

క॥ అనవుడు శౌనకుఁ డిట్లను, మునివర!, జనకుండు మఱి వి ♦ బుధమానిని నే
మని పృచ్ఛించెనొ యయ్యది, వినఁగోరుచునుంటి బ్రహ్మ ♦ విద్వరగర్గా! ౨౧౭

తే॥ అవల గర్గబుధేంద్రుఁడు ♦ ననియె నిట్లు, నారదా! యింతమాత్రన ♦ నాకుఁ దృప్తి
గలుగ దయ్యెను గానఁ బ ♦ ల్కుంగవలయు, రాధికాధవ! మాధుర్య ♦ గాథ లనుడు.

క॥ కువలయ సంరక్షణరత!, కువలయపతితిలక! గోప ♦ కులజలధిందూ!
కువలయమనోజ్ఞవర్ణా!, కువలయమిత్రార్కనేత్ర! కువలయనాథా! ౨౧౮

ఉత్సాహవృత్తము॥ దేవదేవ! వాసుదేవ! ♦ దేవకీసతీభవా
దేవమానినుత్యజీవ ♦ దేవభోగిరాడ్ధవా!
గోవివర్ధనాహ్వయోరు ♦ గోత్రభారభారకా
దేవదమననామధేయ ♦ దృప్తవంశవారకా! ౨౧౯

గద్యము:- ఇది శ్రీమత్పరమపవిత్రాపస్తంబసూత్ర, భారద్వాజసగోత్ర, చివుకుల కులజలధికళానిధి, కోటమాంబా కామయ తనయ, లక్ష్మీదేవీ సుబ్రహ్మణ్య దత్తపుత్ర, శ్రీకృష్ణప్రసాదాసాదిత కవిత్వ నిశ్చయ, సుజనవిధేయ, శ్రీనివాసాపరనామధేయ యప్పయశాస్త్రిచే నాంధ్రీకృతంబైన శ్రీగర్గభాగవతంబందలి గిరిరాజఖండము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

హరిః ఓం తత్సత్

శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః

శ్రీ గర్గ భాగవతము.

మాధుర్యఖండము.

మంజులనామా! రామా!
మంజీర కిరీటహార! ♦ మణిగణతేజః
పుంజసమంజస! గోపీ
రంజక! మురళీవినోద! ♦ రాధాకృష్ణా! ౧

శ్రుతిగోపికోపాఖ్యానము.

చ॥ దివిజమహర్షి యిట్లనె వి ♦ దేహధరాపతి కార్యవర్య! కే
శవుని వరంబుచే నల ప్ర ♦ జస్థలిలో శ్రుతిరూప గోపికా
నివహము సత్కులంబున జ ♦ నించియు నందకుమార రూపవై
భవములఁ గాంచి యిష్టపడి ♦ భర్తగఁ గైకొన నెంచి భక్తితోన్. ౨

క॥ బృందావనమున కరిగియు, బృందావననాథ యైన ♦ బృందాదేవిన్
సుందరమండప మందున, నందముగా వేదవిధుల ♦ నారాధింపన్.

ఉ॥ ఆమె ప్రసన్నయై వరము ♦ లడిగినమాడ్కి నొసంగఁ దద్వధూ
స్తోమము భక్తవత్సలుఁడు ♦ తోయజలోచనుఁడైన కృష్ణుతో
ధామములందుఁ బ్రత్యహము ♦ దప్పక కూడుచు రాసకేళులన్
బ్రేముడిఁ బాడుచున్ మిగుల ♦ వేడ్కను జేయుచునుండె నింతలోన్. ౪

మ॥ ఒక ఘస్రంబున నర్ధరాత్రము సనన్ ♦ యోగీశ్వరుండున్ వలా
హకవర్ణాభుఁడు నైన కృష్ణుఁడు తదీ ♦ యాగారముల్ జేరుటన్
వికలత్వంబును బొంది గోపికలు త ♦ త్పీతాంబరున్ భక్తిపూ
ర్వకసాష్టాంగనతుల్ బొనర్చి యిటులన్ ♦ వాచించిరో భూవరా! ౫

క॥ తోయజలోచన! యెపుడు, చ్ఛాయమహిమ గన్న నిన్ను ♦ జంద్రచకోర
న్యాయముగాఁ గనుచుండెడి, మాయెడ కిందనుక రాక ♦ మసలితి వేలా? ౬

ఉ॥ నావుడు దమ్మికంటియు న ◆ నర్గ సమకట్టు నిటుల్ లతాంగులా
రా! వినుఁ డెవ్వఁ డేరి హృద ◆ యంబున నుండునొ వాఁడు దర్పణం
బోవిన దాసి చూచినటు ◆ లుండు నభోమణి భూమినున్న రా
జీవచయంబుఁ గాంచి విక ◆ సింప నొనర్చిన యట్లు చెల్మితోఁ. ౭

తే॥ కాన దరినున్న దర్పణ ◆ గాలుచున్నఁ, గాంచుచుందును మిమ్ము నో ◆ కాంతలార!
మద్గురుఁడగు దుర్వాసుఁడ ◆ మానివర్యుఁ, డిపుడు భాండీరవనమున ◆ కేగుదెంచె.

తే॥ అల యుదంతంబు నాలించి ◆ యధికభక్తి, శక్తి కొలఁదిని సేవల ◆ సలుపఁ దలఁచి
యతనికడ కేను వోతినో ◆ యతివలార!, దానఁ గాలయాపనమయ్యె ◆ గాని కనఁగ.

క॥ గురువే బ్రహ్మయు గురువే, హరియున్ గురువే శివుండు ◆ నఖిలామరులున్
గురువే పరమగు బ్రహ్మము, గురు వగుటం బట్టి యతని ◆ గొలుచుట యొప్పున్.

క॥ అజ్ఞానతమోంధుని కా, ప్రజ్ఞాంజన శలాక ◆ భవనాశకమౌ
సుజ్ఞాన నేత్ర మిచ్చెను, ప్రాజ్ఞుని సద్గురుని నెఱిఁగి ◆ భక్తి నుతింతున్. ౧౧

క॥ గురువును గాంచని దుష్టుఁడు, గురువున్ నిందించుచుండు ◆ కుత్సితజనుఁడున్
గురువును దలఁపని లేకియు, నరకమునన్ బీడఁబడఁడె? ◆ నానావిధులన్. ౧౨

క॥ అకారణమున నేనును, నెక్కాని నాగురుని కెఱిఁగి ◆ నిశ్చలమతితోఁ
జక్కని సేవల సలిపియు, నిక్కడి కేతెంచితిఁ గమ ◆ లేక్షణలారా! ౧౩

క॥ అనవుడు గోపిక లెల్లరు, మనమున నాశ్చర్యమొంది ◆ మాధవు నెంతో
వినుతులఁ జేసియు మ్రొక్కియు, వినయమునన్ వక్ష్యమాణ ◆ విధి ననిరి విభూ!

తే॥ దేవ! పరిపూర్ణతముఁడవు ◆ దివ్యభువన, కోటినాయకుఁడవు జగ ◆ ద్గురుఁడ వక్షు
రుఁడవు నీకును మొక్క గు ◆ రుండు గలఁడె?, వానిఁ గాంచంగ మామది ◆ వరుగు లిడెడి.

ఉ॥ ఎట్టుల నీ నిశీథము ల ◆ ఝుంచి యహర్ముఖ మెప్పుడౌనొ? మే
మెట్టులఁ ద్వద్గురు ప్రవరు ◆ నీక్షణపర్వముగాఁగఁ జూతుమో
యెట్టులఁ గొప్పదైన నడుమ ◆ నడ్డ మొనర్చు కళిందజానదిన్
దిట్టుతరింపఁ జాలుదుమొ? ◆ వేడితి మీవు వచింప శ్రీహరీ! ౧౬

క॥ అనవుడు వనజాక్షుండును, వినుఁడీ నామాట నీర ◆ జేక్షణలారా!
చనుఁడీ తన్నది యడ్డిన, ననుఁడీ నేఁ జెప్పినట్టు ◆ లఱలేనిమదిన్ ౧౭

ఆ॥ గోపగోపికాళి ◆ గోవినోదుండైన, హరి యథార్థబాల ◆ యతియయేని
నతని నమ్మువార ◆ మైతిమేని యమునరో!, త్రోవ నిచ్చి మమ్ముఁ ◆ గావవమ్మ!

తే॥ ఇట్లనుడిపిన యమున హ ◆ ర్షించి మీకు, దారి నిడునంత మీరది ◆ దాఁటియల్ల
మద్గురూత్తముఁ గాంతురో ◆ మడఁతులార!, యన్న నాయన్నుమిన్నల ◆ హర్షముఖమున

క॥ గురు రాజ వధూ సుర భూ, సుర సన్నిధికిన్ ఫలంబొ ◆ సూనమొ జలమో
సురుచిర పత్రమొ యేదో, యరుసమునన్ గొనుచు భక్తి ◆ నరుగవలెఁగదా.

తే॥ కాన మనముయథాశక్తిని గాన్కలఁగొని, యతనిసన్నిధానమునకు నరుగుదమని
వేఱువేఱుగ నేఁబది యూఱుపాత్ర, ములను భక్ష్యాన్నముల నించి పోవఁ దొడఁగి
తే॥ క్రమముగా నల నదిఁజేరి కట్టినేస్త, కాఁడు వచియించినట్లు స్వకంధరముల
వంచి వాచించి పథినిడఁగ వడినిదాఁటి, పరమ ఖాండీరవనమున కరిగి యందు. ౨౨
ఉ॥ వ్యాస మొనర్చి యెల్లపుడ పార తపం బొనరించుచుండు దు
ర్వాసుని గన్నులారఁ గని భక్తిభయప్రమదంబు లొప్పఁగాఁ
జేసి ప్రదక్షిణంబులను జేతులు మోడ్చి నుతించి యార్య! మీ
కోసము దెచ్చినట్టి యివి గొంచు గ్రసించియు మమ్ముఁ గావుమా! ౨౩
క॥ ఏవం విధిఁ బ్రార్థింపఁగ, నా విమలమునీశ్వరుండు నాలించి వివా
దావహపద్ధతిఁ గన్గొని, యీవిధి వచియించె వారి కిద్ధచరిత్రా! ౨౪
మ॥ సతులారా! యరయంగ నేఁ బరమ హంసస్థిత్యుండఁగన్ జుమీ
మతిలో మీ రొనరించు సేవలకు సమ్మానక్రియాశ్రేణికి
స్థగితుఁగం బొందితిఁ గాన మీ రిపుడు నా నోటన్ దద్వాదినీత భో
గతలిన్ బెట్టుఁడి మెక్కెదన్ గనుఁడి మీ కాంక్షల్ దమిన్ దెల్పుఁడీ! ౨౫
ఉ॥ ఆ ముని పల్కులన్ వినిన యాసతు లందఱు వేఱువేఱుగాఁ
బ్రేముడి వానిఁ గొంచు ఋషి విస్తృత వక్త్రమునందుఁ బెట్టఁగా
నాముని కోట్లకొల్దిగల యన్న క్షుధాతురరీతిఁ బాత్రలం
దేమియు లేనటుల్ మెసవె నింతులు వింతలఁ జెంద భూవరా! ౨౬
ఉ॥ పిమ్మట వ్రేత లా మునిని వేఁడి రిటుల్ మునివర్య! యిత్తఱిన్
మిమ్ము శుభేచ్ఛతోడఁ గన మేము దలంచి తదబ్జనాభవా
క్యమ్మున దుస్తరంబయిన యా యమునాధుని దాఁటియుంటి మిం
కిమ్మెయిఁ దన్నదిన్ మరల నెట్లుతరింతుము మాకుఁ దెల్పుమా! ౨౭
ఆ॥ అనఁగ మునివరుండు నాలించి సతులార!, యిచటనుండి లేచి యెప్పు డట్టి
యమునఁ జేరఁగలరొ యా సమయంబున, నిట్టు లనుఁడు మీర లెనక మెసఁగ
క॥ సర్వారి నిరన్నుఁడు వ్రతి, దూర్వారసపాయి దోష దూరుఁడునై యీ
యుర్వర వెలుఁగుచునుండెడి, దుర్వాసుని నమ్ము మాకుఁ ద్రోవను నిమ్మా!
మ॥ అని ప్రార్థించిన మీకు నాయమునయున్ హర్షంబుతో మధ్యమం
బున మార్గంబు నొసంగుఁ గాన జనుఁడీ పూఁబోఁడులారా! యనన్
వనజాస్యల్ ముని సెప్పినట్లరిగి యా పాపాపహంబున్ ఘనం
బును నా తద్ధునిఁ దాఁటి కృష్ణనికటంబున్ జేరిరో యేలికా! ౩౦
తే॥ అంత శ్రుతిరూపగోపిక లంద ఱట్టి, రాధికేశ్వరు తోడుత రాసమందుఁ
దుష్టిఁజెందియు మనమునఁ దోఁచినట్టి, సంశయంబుల నడిగిరో జనకరాజ! ౩౧

తే॥ ఏము దుర్వాసు దర్శనం♦బిపుడు సల్పి, వచ్చియుంటిమి కాని మీ♦వాక్యములను
సంశయంబులు గలిగె మా♦స్వాంతములను, గావ వ్యక్తీకరింతుమో♦కమలనాథ!

మ॥ మము నెల్లప్పుడు సేరఁజీరి తమితో ♦ మాతోడఁ గ్రీడింపవే?
మమతన్ వచ్చుచు వెన్న పాలు పెరుఁగుల్ ♦ మాయిండ్లఁ గాఁజేయువే?
యమునాహ్రదినిలో సతీయుతుఁడవై ♦ యాటాడవే బాలసం
యమి నేనందు వచింతు వేల యిపుడో ♦ యంభోజపత్రేక్షణా! 33

తే॥ మఱియు నీయొజ్జ దుర్వాసుఁ♦డఱమఱవిడి, మేము గొంపోయినట్టి యు♦మేయభోగ
ములను బూర్తిగా మెక్కి మ♦రలను దూర్వారసము గ్రోలుదునని దబ్బ♦ఱలవచించె.

క॥ అరయఁగ నీవలె గురువును, గరముఁగ నన్నృతంబులాడు♦ కఠినుఁడని మా
కఱమఱ గల్గెడిఁ గావునఁ, దర్వఁ బ్రత్యుత్తరముఁ జెప్పి♦ తనుపుము కృష్ణా! 3౫

వ॥ అనవుడు జనార్దనుం డిట్లనియె. మానినులారా! యేను నిరాధారుండను, నిరాకారుండను, నిరాహారుండను, నిరామయుండను, నిరంజనుండను, నిరహంకారుండను, నిర్గుణుండను, నిష్క్రియుండను, నిర్వికల్పుండను, నిర్మలుండను, వైషమ్యరహితుండను, సర్వసమానుండను, సర్వాధారుండను, సర్వాంతర్యామిని నైన మాట ధ్రువంబ. ఇందున సందియము లేదు. ఐన నుదకంబునందలి పద్మపత్రంబు వలె విషంబులోని క్రిమివోలె సంసారంబునందుఁ జరించువారు తత్కృత్యంబులం దసక్తులై రాగద్వేషంబుల మాని సదాచారప్రవర్తకులై కామ సంకల్పంబుల వర్జించి బ్రహ్మార్పణంబుగా వర్ణాశ్రమవిహితంబులగు కర్మంబులను సల్పి జ్ఞానులై నన్ను భజించు భక్తుల కోరికల ననుసరించి నామరూపంబులం దాల్చి సంచరింతు. నాకుఁ బరంబనుమాట లేదని యెఱుంగుఁడు! ఇఁక మానావమానంబులఁ గీర్త్యపకీర్తులఁ గష్టసుఖంబుల గోఖర బ్రాహ్మణచండాలుల సమదర్శియై నిరశనుండును, నియతాత్ముండును, బరిత్యక్తపరిగ్రహుండును నై జ్ఞానాగ్నిని సర్వకర్మముల దహించి లోకసంగ్రహార్థంబు వాని నాచరించువాఁడు విద్వాంసుఁ డనంబరఁగు. అట్టివాఁడు పుణ్యపాపంబు లంటక మోక్షార్హుండగు నేతాదృశుం డా దుర్వాసుం డౌట దూర్వారసమితాశనుండైనను మీభక్తికి మెచ్చి యిమ్మాడ్కి మీరిచ్చిన యన్నరాశులం బరిగ్రహించి మిమ్ములను ధన్యలఁ గావించెనని తెలిసికొనుం డన నాశ్రుతిరూప గోపిక లాశ్చర్యమొంది సంశయంబుల వీడి జ్ఞానమయులైరి. మఱియు నిట్లే కృష్ణభక్తివివర్ధనంబును, బాపహారంబును నగు ఋషిరూపగోపికాచరిత్రం బాకర్ణింపుమని నారదుండు జనకున కిట్లనియె. 3౬

ఋషిగోపికోపాఖ్యానము

తే॥ వంగదేశంబునందున♦మంగళుఁడను, గోపకుం డొప్పు నవలకు♦గోప్రభుండు
నధికధని దార పంచ స♦హస్రవిభుఁడు, శాస్త్రవిదుఁడు సల్లక్షణ♦సంయుతుండు.

చ॥ ఒకపరి దైనయోగమున ♦ నుండిన ద్రవ్యము మాయమాయెఁ జో
రకులము గొన్ని యాలను ధ ♦ రాపతి బల్మిని గొన్నియాలఁ దీ
సికొనియె వీతిహోత్రుఁడు వ ♦ సింనెడి గేము దహించె మొక్క న
న్నకటముఁ గట్ట జీర్ణవస ♦ నంబు వసింపక పోయె వానికిన్. ౩౮

ఉ॥ దాన ననంత చింతలను ♦ దైన్యముఁ బొందెడి వానిభార్యలన్
బూనిక దండకాటవిని ♦ ముచ్చటగాఁ జరియించు మానిసం
తానము రామునాజ్ఞ వని ♦ తావరరూపముఁ దాల్చి పుట్టె నా
మానినులన్ గనుంగొనుచు ♦ మంగళుఁ డిట్లు దలంచె నాత్మలోన్. ౩౯

ఉ॥ ఇప్పుడు పాడిపంటలును ♦ నిష్టులు విత్తము గేము నామునన్
జొప్పడకుండె నే నెచటఁ ♦ జొచ్చుదు నేమి యొనర్తు నాను? నా
కిప్పగిదిన్ గుమారికల ♦ హీనముగా జనియించి రయ్యొ! యీ
ముప్పటు దప్పు? వీరికెటు ♦ బూన్కి వివాహము లౌనొ? దైవమా! ౪౦

శా॥ ఆధివ్యాధిసమాకులుండ నయితిన్ ♦ హర్షంబు వోనాడితిన్
సాధుశ్రేణివిదూరగుండ నయితిన్ ♦ శాంతంబు మాయించితిన్
మేధాహీనుఁడనైతి దీనజనతా ♦ మిశ్రుండనైతి క్షు
ద్బాధా దగ్ధుఁడనైతి గర్హ్యమగు నీ ♦ దారిద్ర్యదోషంబునన్. ౪౧

తే॥ ధనము గలిగినన్ బరుఁ డాత్మ ♦ జనుఁడె యగును
ధనములేనిచో స్వజనుం డి♦తరుఁడు గాఁడె!
పేదనగు నాతనయల నే ♦ విత్తవంతుఁ
డైన బంధువు సేకొన ♦ నరుగుదెంచు. ౪౨

క॥ ధని వీరిని గొన నేతెం,చనిచో వీరెల్ల రాత్మ ♦ జనులు సెలఁగుదాఁ
కను తత్కష్టములొందుచు, నను దూఱుచునుందు రెట్లు ♦ నాగతియగునో. ౪౩

ఆ॥ సుతులు గలఁగుచోట♦సొమ్ము సెలంగదు, సొమ్ము గలుగుచోట♦సుతులు లేరు
రెండు గలుగుచోట♦దండి శేముషి లేదు, మూఁడు గలుగుతావు♦భువిని నరుదు.

తే॥ దైవవశమున దారిద్ర్య ♦ దశఘటిల్లఁ, గుందుచుండెడి నాకిప్డు♦కూఁతులిట్లు
కాకతాలీయరీతినిఁ ♦ గలిగి రకట! చింతహెచ్చెడి నైననేఁ ♦ జేసెద నిటు. ౪౫

చ॥ ధని బలికీర్తిశాలి శ్రుతి ♦ ధర్మవిదగ్రణియైన యొక్కనే
తను గని వీరినెల్లఁ గర ♦ దంబుగ నిచ్చుటె మంచిదంచుఁ దా
ననుకొనులోనఁ దీర్ఘతతి ♦ యాయియు వృద్ధుఁడు యోగ్యుఁడౌ జయుం
డను నొక గోపకుం డతని ♦ యందికకుం జనుదెంచి యిట్లనెన్. ౪౬

తే॥ మంగళాహ్వయ! నీవు నా♦మాటవినుము, నీకుమారికామణులను♦నెమ్మి నల్ల
నందరాజునకిచ్చి యా♦నందమందు, మట్లుసేయఁ బిల్లలు సుఖ♦మందఁ గలరు. ౪౭

ఉ॥ అందుల కాతేఁ డొప్పుకొని ♦ యా వ్రజభాసురనందనేతకున్
గుందుచు నియ్యెలేక యిడేఁ ♦ గూఁతుల నందఱ నంత నందు నా
సుందరమందయానలును ♦ శుక్లసుధాంశుని బోలి వృద్ధినిం
బొందిరి సక్రమంబుగ న ♦ పూర్వకళావిభవాభిరామలై. ౮౮

చ॥ పదపడి నొక్కకాలమున ♦ వారలు తద్వ్రజనాథు నింటిలో
మదనమనోహరాకృతి స ♦ మంచితుఁడై చెలువారు శౌరినిన్
ముదమునఁ గాంచి పెన్మిటిగఁ ♦ బొందుట కెంచి కళిందజాభిధా
నదిని గుఱించి నిశ్చల మ ♦ నంబున ధ్యానము సేసి రెంతయున్. ౮౯

ఉ॥ ఆయెడఁ దన్నదీమణి ద ♦ యన్ దరివెల్గుచుఁ గోర్కులిచ్చి తా
నేయెడకో చనన్ బిదప ♦ సిద్ధమునీశ్వరరూపగోపుల
త్యాయత బృందకాటవిని ♦ నచ్యుతు తోడుత రాసకేళులన్
జేయఁదొడంగి రో మనుజ ♦ శేఖర! కార్తికశుద్ధ పూర్ణిమన్. ౯౦

తే॥ మఱియు మైథిల గోపికా♦మహితచరిత, మాలకింపుము మైథిలే♦శా! దశాశ్వ
మేధములఁ జేసి నంత య♦మేయఫలము,లొంది గోలోకసౌఖ్యంబుఁ♦జెంద గలవు.

మిథిలాగోపికోపాఖ్యానము.

క॥ అల రఘురాముని వరమునఁ, జెలులౌ మిథిలా నగరికిఁ ♦ జెందిన వనితా
తిలకము లానవనందుల, నెలవుల జనియించి వృద్ధి ♦ నిం గని రవలన్. ౯౨

మ॥ ఒక ఘస్రంబున నందగేహమున దృ ♦ గ్యుగ్మంబునన్ జక్రిరూ
పకళావైభవరీతిఁ జూచి పతిగా ♦ భావించి తత్సిద్ధికై
సకలార్థప్రదమైన మార్గశిర మా ♦ సంబం దతిశ్రద్ధఁ గొం
కక కాత్యాయని నోము సల్పిరిటు త ♦ త్కన్యల్ మహాభక్తితోన్. ౯౩

ఉ॥ ప్రొద్దున లేచి తత్సతులు ♦ వోదము రమ్మని యొండొరుల్దమిన్
దద్దయుఁ బిల్చుకొంచుఁ గర ♦ తాళమృదంగవిపంచికాస్వనం
బుద్దవిడిన్ జెలంగఁగఁ బ ♦ యోరుహనాభగుణప్రభావముల్
విద్దెలముద్దుగుమ్మవలె ♦ వేమఱుఁ గోకిలవాణిఁ బాడుచున్. ౯౪

తే॥ యమునలో దిగి స్నానంబు♦నాచరించి, శుభ్రవస్త్రంబులం దాల్చి♦శుద్ధమగు ని
సుమునఁ గాత్యాయనీ సురూ♦పము రచించి,షోడశోపచారంబుల♦సొరిదిఁ జేసి. ౯౫

మ॥ జననీ! స్థావరజంగమంబులు భవ ♦ చ్ఛక్తిన్ జరించున్ విరిం
చన లక్ష్మీపతి చంద్రమౌళి దివిష ♦ జ్జంభారికుంభోద్భవా
దినియాధుల్ నిను గొల్చి కోరికల నెం ♦ తేన్ బొందరే నందనం
దనునిన్ బెన్మిటిఁ జేసి మాకిపుడు మో ♦ దంబిమ్ము కాత్యాయనీ! ౯౬

ఆ॥ ఇట్లు నిత్యము నుతి ♦ యించి తద్వ్రితరాజ, మట్టి మార్గశీర్ష ♦ మగుపఱకును
జేసి రందు నొక్క ♦ వాసరంబందున, నొక్క చిత్రమయ్యె ♦ వక్కణింతు. ౫౭

క॥ చెలువలు దమతమ దువ్వలు, వల గట్టునఁ బెట్టి భక్తిఁ ♦ బాడుచు హరినిఁ
మొలలోఁతు నీళ్ళలోనికిఁ, జలములఁ జని జలకమాడు ♦ సమయమునందున్.

క॥ తమకక జంకక కొంకక, కమలాక్షుం డెజేఁగి యెట్లొ ♦ కాళిందీ తీ
రము నల్లల్లనఁ జని యా, కమలముఖుల యంబరములఁ ♦ గాఁజేసి వెసన్. ౫౮

ఆ॥ సంబరంబుతోడఁ ♦ జనుచు నర్భకుభంగి, వాఁకమీఁది చల్ల ♦ పయర విసర
నధికతాపమార్చు ♦ నట్టి హాలిప్రియ, వృక్షమెక్క సుదతు ♦ లిట్టు లనిరి. ౬౦

తోటకవృత్తము॥ కోకలఁ దాఁకఁగఁ ♦ గూడదు కృష్ణా!
పోకుము పోకుము ♦ పోకిరివీఁకన్
నీకిది యెవ్వఁడు ♦ నేర్పెన్ జెప్పెన్
మాకెటు దక్కును ♦ మానము మామా! ౬౧

సీ॥ గండరగండలఁ ♦ గారింపవలెఁగాని, యబలలన్ నొవ్వఁ జే ♦ యంగఁ దగునె?
ముగ్ధకర్బురులను ♦ బోకార్పవలెఁగాని, ముగ్ధలన్ విపదబ్ధి ♦ ముంపఁదగునె?
భూకంటకుల సిరుల్ ♦ గైకొనవలెఁగాని, ముగ్ధాంబరములఁ గొం ♦ పోవఁదగునె?
శత్రభిమానంబు ♦ సమయింపవలెఁగాని, సతుల మానము దీయు ♦ సరణి దగునె?

తే॥ నిన్ను హాసియించువారలఁ ♦ దన్ని గోల, సలుపవలెఁగాని నిరపరా ♦ ధలను మమ్ము
గోలఁజేయుట దగునె? యో ♦ ఖలనాతి,లోల! లీలావిలోల! గో ♦ పాలబాల! ౬౨

సీ॥ చిన్నవాఁడ వటంచుఁ ♦ జిత్తమం దెంతుమా, చిన్నవారికిఁ గాని ♦ చేఁతలుండెఁ
బెద్దవాఁడ వటంచుఁ ♦ దద్దయు నెంతుమా, చిన్నతనంబింకఁ ♦ జెలఁగుచుండెఁ
బోకిరివే యని ♦ బుద్ధియం దెంతుమా, బుద్ధిమత్కార్యముల్ ♦ బొందియుండె
బుద్ధిమంతుఁడవని ♦ పూనిక నెంతుమా, పోరానిపోకడల్ ♦ పొలయుచుండెఁ

తే॥ దెలిసియిటు జేయుచుంటివో ♦ తెలియకయిది, సలుపుచుంటివో మాకేది ♦ దెలియదకట
నీపనుల్ వింతగొల్పెడి ♦ నెమ్మితోడ, మా పటంబుల నిడి మమ్ము ♦ మనుపు కృష్ణ!

మ॥ ఘనవాహాజ్ఞ మహాగ్రహంబునఁ దటి ♦ ద్గర్జాశనిశ్రేణితో
ఘనపంక్తుల్ వ్రజనాశనార్థమయి రాఁ ♦ గా వేగ నీవేగి త
ద్ఘనశైలంబును నెత్తి మొత్తి ఘనముల్ ♦ తద్గోకులం బెల్లఁగా
చిన నీకియ్యది యెట్టి గొప్పతన మి ♦ చ్చెన్ జెప్పవే శ్రీహరీ! ౬౪

క॥ లెమ్మా! యిఁకఁ గొమ్మను డిగి, రమ్మా! కరుణించి యంబ ♦ రమ్ములఁదెమ్మా!
కొమ్మా! చేసెడి జోతల, నిమ్మాడ్కిని సలిపి నగెద ♦ వేలా కృష్ణా! ౬౫

చ॥ కులముల నుద్ధరించుటయొ ♦ గోసురభూసురులందు భక్తిగా
మెలఁగుటొ కల్మివిద్దియల ♦ మేలు గడించుటొ గొప్పరాజులన్

గలనున గెల్చుటో తగును ♦ గాని యిటుల్ మముఁ జేరవచ్చి మా
వలువల దొంగిలించుట ల ♦ వం బుచితంబుగ లేదు నందజా! ౬౮

తే॥ కాన మాపైని దయయుంచి ♦ కమలనేత్ర!, కట్టుకోకల నిడి మమ్ముఁ ♦ గావవయ్య!
యంచుఁ బ్రార్థింప నాతండు ♦ నల్లన నగి, వారి కందఱ కిట్టులఁ ♦ బలుకఁ దొడఁగె.

క॥ ఓ వనజాననలారా!, యీవలువల నేవియేవి ♦ యెవరివెవరివో
భావింపలేను గావున, నీవైపున కీరె వచ్చి ♦ యేతి కొనుండీ! ౬౯

ఆ॥ లేనియెడల నిప్పు ♦ డేనివి గైకొని, యింటి కరుగఁగలను ♦ నింతులార!
యనఁగ వారలు విని ♦ యాననంబుల వంచి, నగుచుఁ బలికి రిటుల ♦ నాననతోడ.

మ॥ జలజాక్షా! పలుమాటలేల పరిహా ♦ సంబేల మాతోడుతన్?
జలికాలం బిది యాగలేము వణఁకన్ ♦ జాలింపు సయ్యాటముల్
జలమం దుంటిమి వస్త్ర మె ట్లటకు ల ♦ జ్జ వీడి శ్రీకృష్ణ! మా
వలువల్ మాకు నొసంగి ప్రోవుమ! దయా ♦ వారాంనిధీ! ధీనిధీ! ౭౦

ఆ॥ గోకులంబునందుఁ ♦ గొంకని జంకని, రసికమణివి గుణివి ♦ వ్రజపజుఁడవు
శ్యామసుందరుఁడవు ♦ సరసుండవును వన,మాలి వీవు గావె ♦ మదిని దలఁప. ౭౧

తే॥ అయ్య! నీ బానిసలము మే ♦ మందఱమును
మమ్ముఁ బాములఁ బెట్టుట ♦ మంచిదౌనొక్కొ?
మంచి చెడుగులఁ గాంచి కా ♦ వించుమయ్య!
యోగ్యుల ప్రతిష్ఠకు జంకు ♦ చంద్రుడుగాదె. ౭౨

క॥ నీయెద నభల లటం చే,లా యెంచెదవయ్య! "దుర్బ ♦ లస్యబలం రా
జా" యన వినవే వలువల, నీయనిచో రాజునకు వ ♦ చింతుము కృష్ణా! ౭౩

క॥ అనవుడు వనజాక్షుఁడు విని, వనజేక్షణలార! కంస ♦ పతి కిది వల్కన్
జనుటకు సిబ్బితిలేదా?, నను జేరుట కిపుడు మీకు ♦ నాన గలిగెనా? ౭౪

మ॥ చలియంచున్ జలికాలమంచు నిలువన్ ♦ శక్యంబు గాదంచు మీర్
పలుకన్ సాగితి రిద్ది నిక్కమమయేన్ ♦ వైళంబ యందుండి నీ
వల కేతెంచుఁడు నన్ను డాయుఁ డివిగో ♦ వస్త్రంబులం బొందుఁడీ!
లలిగాఁ జేసిన యెల్ల కష్టములు వా ♦ లాయంబుగాఁ దీరెడిన్. ౭౫

ఆ॥ బానిసలమటంచుఁ ♦ బల్కుఁగా దొడఁగితి, రట్టులైన మీర ♦ లనినయటు
సల్పవలయుఁగాని ♦ చలమునఁ బలుకుట, పాడిగాదు రండు ♦ పడఁతులార! ౭౬

క॥ లేదా యింటికిఁ బోయెద, మీఁదన్ మీయిష్టమన్న ♦ మెలఁతలు విని దా
మోదర! తగునే మానము, వోదా నీదారి నీవు ♦ వోవన్ మాకున్. ౭౭

తే॥ అహహ! మేము వివస్త్రల ♦ మగుచు జలక, మాడినందుల కెంతయు ♦ నర్హమైన
పాచితముఁ జేసి చక్కని ♦ పథము జూపి, ననుపుమంటివి నవ్వుచున్ ♦ నలిననేత్ర!

ఆ॥ అనుచుఁ గొంద ఱటకు ♦ నరిగెదమందురు, గొంద ఱటకు నేగఁ ♦ గూడ దండ్రు
గొందఱు మన మొఱను ♦ గుందుఁడే కరుణించి, తెచ్చి యిచ్చునండ్రు ♦ దివ్యచరిత!

ఉ॥ ఆద నిటుల్ వచించుచుఁ ద ♦ దంగన లూరక చూచి యాహరి
న్లేదు ఫలం బటంచుఁ దుద ♦ నిర్మలకోమలహస్తపద్మసం
ఛాదితమారగేహలయి ♦ సాగి జలంబులనుండి నల్ల దా
మోదరు మ్రోలఁ జేరి తమ ♦ పుట్టము లిమ్మని కోరి రో ప్రభూ! ౮౦

మ॥ అవలన్ పీతపటుండు నవ్వి సతులా ♦ రా! మీకు సిగ్గేల? నా
సవిధం బందిపు డీరు నిల్చుటకుఁ గాం ♦ చన్ బాల్యమందుండి రే
బవలున్ మిమ్ములఁ గూడుచున్ బెరఁగనో ♦ పాఱాడనో యాడనో
యెవి మీకున్నవొ నే నెఱుంగనివి వే? ♦ యీక్షించి వాచింపుడీ! ౮౧

ఆ॥ మీరు మానవతులె? ♦ దూరదేశస్థిత
నదికి వచ్చితి రెటు? ♦ నగ్నత నెటు
నులుకు విడిచి మునుఁగఁ ♦ దలఁచితిరే రహిన్
నోము గొఱతఁగాదొ? ♦ నుడువుఁ డిపుడు. ౮౨

తే॥ కాన నేవేగ నపరాధ ♦ మైన దనుచు, నొక్కపరిఁ జేతు లెత్తుచు ♦ నోరిగల నిడి
యీరు మీ మీ పటంబుల ♦ నేఱికొనుఁడి, వ్రతఫలంబును బొందుఁడీ ♦ రమణులార!

కం॥ తరువాత నాసుదతులున్, గరముల జోడించి కృష్ణ! ♦ కావుమ నీవే
వరదుఁడవు మోహనుండవు, కరుణాభరణుండ వనుచుఁ ♦ గైకొని వలువల్. ౮౪

కం॥ కనుఱెప్పల వాల్పక యా, వనజాక్షుం గాంచి వలచి ♦ వఱలుచు నుంటన్
వనమాలి విలోకించుచు, నన నిటు దరహాసితవదనుఁ ♦ డగుచున్ జనకా! ౮౫

ఆ॥ అతివలార! మీర ♦ లాగ్రహాయణిక మా, సమున నన్ను గూర్చి ♦ శాస్త్రవిధులఁ
గ్రమమండపమునఁ ♦ గాత్యాయనీవ్రత, మాచరించితిరిగ ♦ యధికభక్తి. ౮౬

ఉ॥ దానఁ బ్రియంబుఁ జెందితి య ♦ థార్థ మెఱింగితి మీ ప్రియంబులన్
నే నెఱవేర్తు నెల్లికడ ♦ నిశ్చయ మిద్ది యనంగ వారల
న్మాన్యనముదంబుఁ బొంది తమ ♦ యున్కల కేగిరి మైథిలేశ్వరా!
యీ నెఱిఁ గౌసలాంగనల ♦ వృత్తముఁ జెప్పెద నాలకింపుమా! ౮౭

కౌసల గోపికోపాఖ్యానము.

కం॥ శ్రీరామోక్తినిఁ గౌసల, నారీమణులా నవోప ♦ నందసతులకున్
శ్రీరామా రుచి సుగుణా, కారాదులతో జనించి ♦ క్రమముగ నిలలోన్. ౮౮

సీ॥ అభ్రచయంబులో ♦ యంధకారంబులో, సారసమధుమత్త ♦ షట్పదములొ
రాజబింబంబులో ♦ రత్నదర్పణములో, భవ్యమందిరములో ♦ పంకజములొ

యంబుజన్మంబులో ♦ యంగజతూపులో, కాటుక పిట్టలో ♦ కండుమీలో
జలజకోశంబులో ♦ చక్రవాకంబులో, బంగారు గిండులో ♦ బొంగరాలో
తే॥ మారునారియె యలిచాలో ♦ కారుత్రాచో
యనటికంబాలో తాబేళ్లో ♦ యంబుజములో
పల్లవంబులో కపురంబో ♦ పసిడి లతలో
గ్రొమ్మెఱుంగులో యంచు న ♦ రుల్ దలంప. ౫౯
చ॥ పెరిఁగిరి శుక్లచంద్రు సర ♦ విన్ మణిహేమవిభూషణంబులన్
మెఱసిరి మేల్మి వల్వలను ♦ మించి రుదంచిత పద్మినీస్త్రియన్
వఱలిరి ద్రవ్యవంతులగు ♦ వల్లవవర్యులఁ బెండ్లియాడి వే
వెలిచిరి నాల్గుదిక్కుల న ♦ పారయశంబు ననంతరంబునన్. ౬౦
క॥ అల ననఁబోఁడులు లలితున్, గలుముల జవరాలి మగనిఁ ♦ గన్నవ కింపున్
గొలిపెడివానిని దొడవుల, జెలువారెడి కృష్ణుఁ గాంచి ♦ చెంది విరాళిన్. ౬౧
సీ॥ తీరునే యీమన ♦ దేహతాపంబులు, కృష్ణసేవామృత ♦ వృష్టి లేక
చూడునే యీమన ♦ చూడ్కులు శోకంబు, కృష్ణముఖాబ్జమీ ♦ క్షింపకుండ
చేయునే యీమన ♦ చేతులు పరకృతుల్, కృష్ణహస్తముల గ్ర ♦ హింపకుండ
వినునె యీ మనచెవుల్ ♦ వెఱవారికతలను, గృష్ణ వేణురవ మా ♦ లింపకుండ
తే॥ నడచునే యిప్పుడీ మన ♦ యడుగు లితర, దేశములలోన శ్రీకృష్ణ ♦ ధిష్ణ్యములకు
జనక ! మనసు దీరునె యిట్టి ♦ మనకు నన్య, భూతిఁ గృష్ణసంభోగ వి ♦ భూతి లేక.
మ॥ అని చింతించుచు నొక్కనాఁడు మధురా ♦ ఖ్యాపట్టణస్థోరు వీ
థిని కృష్ణా ! జగదేకసుందర ! హరీ ! ♦ దీనావన ప్రాపకా !
వనమాలీ ! వనజాత దివ్యనయనా ! ♦ ధర్మాంబర భ్రాజితా !
యని పాలున్ బెరుఁ గమ్ముచుందురు తద ♦ బ్జాక్షప్రియాసక్తలై. ౬౩
ఆ॥ మఱియు నిటుల వారు ♦ మాధవుం డెందెందు, సంచరించునట్టి ♦ స్థలములందు
నరిగి తిరుగుచుండి ♦ యాహరి గుణములఁ, దమ మనముల మిగులఁ ♦ దలఁచి తలఁచి.
చ॥ జలమున నగ్నిఁ దేజమున ♦ క్ష్మాతలమందున నంబరంబునన్
నలుగడలందు మానవ గ ♦ ణంబునఁ జెట్టుల గుట్టలందునన్
బులినములందునన్ యమున ♦ పొంతల నెల్లెడఁ జక్రి చక్కఁగాఁ
జెలఁగుటఁ గాంచి మోహమును ♦ జెందుచుఁ దన్మయలైరి భూవరా ! ౬౪
తే॥ అత్తఱిన్ వారు కృష్ణ హృ ♦ దాంతరంగ, లగుచు సాత్త్విక భావాష్ట ♦ కాన్వితలయి
చేతనాచేతనంబుల ♦ రీతి నెఱుఁగ, లేక పిచ్చివారలవలె ♦ వాగొనుదురు.
తే॥ సర్వవాంఛల విడనాడి ♦ సత్యమైన, బ్రహ్మమందు లయించెడి ♦ పరమహంస
విధిని నితర కార్యంబుల ♦ వీడి యట్టి, కృష్ణునందున వారెదన్ ♦ గీలుకొలిపి. ౬౫

చ॥ బలిమిని హస్తయుగ్మమున ♦ బాటల ప్రీడను పీడి సత్కళా
లలితసుధాకరేందుముఖ ♦ లక్ష్యముగాఁ బొలుపారు కృష్ణు ము
ద్దులమొగముం గ్రహించి పరి ♦ తోషముతోడుతఁ జుంబనంబుల
న్నలిఁ గొనిరా వధూజప ఘ ♦ నస్థితి యేమనవచ్చు? భూవరా! ౯౮

చ॥ పదపడి తద్వ్రజాంగనలు ♦ పంకజనాభుని దోర్యుగంబుపై
ముదమున స్వీయబాహువులఁ ♦ బొందికగా నిడి రాసకేళులన్
జెదరని చెల్మి సల్పి రల ♦ చేడెల భాగ్యవిధంబు వేయినో
ళ్లొదవిన శేషుఁడున్, నలువ ♦ యున్ బలుకంగ సమర్థు లౌదురే? ౯౯

ఉ॥ దోషములన్ హరించు శ్రుతి ♦ ధోరణి సత్కృతిసాంఖ్యయోగవై
శేషికతర్కతత్త్వపరి ♦ శీలనధన్యులు దేనిఁ జెంది సం
తోషముఁ గాంతురో యది వి ♦ ధూతనిభంబగు భక్తిచే డనా
శేషశయానునిం గొలుచు ♦ శిష్టులకున్ వడిఁజిక్కుఁ బార్థివా! ౧౦౦

తే॥ భక్తివలనను పరమాత్మ ♦ వశ్యుఁడగు నటంచుఁ బల్కఁగ సాంఖ్యయో ♦ గాదివిధుల
సల్పునట్టి యాగోపికా ♦ సముదయంబ, సర్వవిధముల సాక్షియగా ♦ జనకరాజ!

తే॥ మఱియుఁ బురుషార్థదంబును ♦ బరమము హరి,దర్శనప్రదమును నయో ♦ ధ్యానివాసి
నులగు చెలువల చరితంబుఁ ♦ బలుకుచుంటి, సావధానంబుగా విను ♦ మార్యవర్య!

అయోధ్యావాసినీ గోపికోపాఖ్యానము.

చ॥ చెలఁగుఁగదా సువర్ణమణి ♦ చిత్రిత భిత్తి కవాటజాలవే
దిలలితహర్మ్యకోటివన ♦ దివ్యసభాపరిఖాంగణాది సం
కలితము ధార్మిక ప్రవర ♦ క్రమతరంబగు చంపకాపురం
బిల కొక భూషణంబుగ బు ♦ ధేంద్రనుతంబయి సింధుభూమిలోన్. ౧౦౩

ఉ॥ ఆదృతి ధర్మరాజు ధన ♦ మందున నైలబిలుండు భోగమం
దా దివిజేశ్వరుండు నయ ♦ మందున శుక్రుఁడు రూపునందు దా
మోదరుపట్టి తేజమునఁ ♦ బూషుఁడు డీవి దధీచి భక్తిఁ బ్ర
హ్లాదుఁడు మేరుధీరుఁడును ♦ నా విమలాహ్వయుఁ డద్ది యేలెడిన్. ౧౦౪

ఉ॥ ఆతఁడు తత్పురంబు నన ♦ యంబు నయంబున నేలుచున్ రతిన్
నాతుల నాఱువేలను ఘ ♦ నంబుగఁ బెండిలియాడి దండిగా
శాతసుమాస్త్రతాపములు ♦ సల్లపడన్ రతులందుఁ దేలి యా
నాతులు గొడ్డురాం డ్రగుట ♦ గుందఁ దొడంగె నిటుల్ నరేశ్వరా! ౧౦౫

సీ॥ రవిలేని దివమును ♦ రాజులేని తమిస్ర, సారసములు లేని ♦ సరసివరము
శీలములేనట్టి ♦ శృంగారవతియును, దానములేనట్టి ♦ దంతిమణియు

దానములేనట్టి ♦ ద్రవ్యవంతుండును, వాఙ్నియమము లేని ♦ పౌరుషంబు
ధర్మంబులేనట్టి ♦ తత్త్రిలోకంబులు, హరిని నుతింపని ♦ యాననంబు
తే॥ బుధులు పర్వని గోష్ఠియుఁ ♦ బూర్ణతుష్టిఁ, గనని బ్రాహ్మణుం డధిపతి ♦ తనరనట్టి
పృథుల రాజ్యంబు వరసుతుం ♦ డెసఁగనట్టి, వంగసంబును వాసికి ♦ వచ్చునొక్కొ?

ఉ॥ ఎన్నఁడు నాకుఁ బుత్రులు జ ♦ నించెడి మంచి యదృష్ట మబ్బునో
యెన్నఁడు వానియాటల మ ♦ దీక్షణ పర్వముగాఁగఁ జూతునో
యెన్నఁడు వాఁడు నాయురము ♦ నెక్కఁగ ముద్దులఁ బెట్టుకొందునో
యెన్నఁడు నన్ను ధన్యగ న ♦ హీనవిధంబుగ వాఁ డొనర్చునో. ౧౦౭

తే॥ వరసుతుల్ బుట్టి పున్నామ ♦ నరకమందుఁ, బడెడి బాధలఁ దప్పించి ♦ పరమగతికి
నేగునటు జేసెదరు గాదె ♦ యేమొనర్తు, ననుచుఁ జింతిలుచుండె నో ♦ యవనినాథ!

ఉ॥ అమ్మెయి యాజ్ఞవల్క్యుఁడను ♦ నాగమనైగమవేది యొక్క ఘు
ద్రమ్మున నమ్మహీశ్వరుని ♦ సన్నిధికిన్ జనుదెంచి యర్చఁ బూ
ర్ణమ్ముగఁ బొంది సమ్ముఖము ♦ నన్ వసియించిన తన్నరేంద్రు వ
క్త్రమ్మును గాంచి యిట్టు లను ♦ గన్ దొడఁగెన్ గరుణార్ద్రవాణితోన్ ౧౦౯

ఉ॥ సేమమె నీ కుటుంబమున ♦ సేమమె నీపరిపాలనంబునన్
సేమమె బంధులోకమున ♦ సేమమె మిత్రసమూహమందునన్
సేమమె యెల్లచోటుల సు ♦ శీల! త్వదానన సుందరాంబుజా
బీమొయిఁ జిన్నవోయెడి న ♦ దేదియొ యిత్తఱి నాకుఁ దెల్పుమా! ౧౧౦

తే॥ అనఁగ విమలుండు విని ముని! ♦ యఖిలవేది, వైననీ వెఱుంగనిపొక్కు ♦ నమరునొక్కొ?
యైన మీవాక్యగురుతఁ బ ♦ ల్కాడుచుంటి, సుతులు లేనట్టివారికి ♦ గతులుగలవె?

ఉ॥ మానివరేణ్య! మత్సతుల ♦ మానిని యొక్కతె గూడ గర్భమున్
బూనక పోవుటన్ మిగులఁ ♦ బొక్కుతిఁ జిక్కుతిఁ దిక్కుగొంటి ని
ద్దానికి నేపనుల్ సలిపి ♦ తద్వ్యధలన్ ద్యజియింప నేర్తునో
మానక దివ్యదృష్టిఁ గని ♦ మా కెఱిగింపుము! చింతదీర్పుమా! ౧౧౨

ఉ॥ నావుడు యాజ్ఞవల్క్యుఁడును ♦ నందనుఁ డీజని నీకుఁ గల్గఁడో
భూవర! కోట్లకొల్దిగ ను ♦ పుత్రికలే జనియింతు రంకిలిన్
నీవు పరిత్యజించి సుఖ ♦ నీరధిఁ దేలు మనంగ నాతఁడో
భూవిబుధేంద్ర! యంచుఁ దల ♦ భూమినిసోఁకఁగ మ్రొక్కియిట్లనెన్. ౧౧౩

తే॥ దేవముని పితౄణంబులఁ ♦ దీర్తు నెట్టు, లెట్లు మజ్జీవితము వాసి ♦ కెక్కఁగలదొ
నాసమస్తకష్టములెట్లు ♦ నాశమగునొ, పల్కుమా! నాకుఁ గొమరుండు ♦ వఱలనపుడు.

చ॥ కొమరుఁడు లేని మానవుఁడు ♦ గొంపను దంపులఁ బెంపుజేయు డెం
దమున విచారమొందు శ్రుతి ♦ ధర్మములన్ నిరసించి మాను ద్ర

వ్యమును గడింపకుండఁ బర ♦ మార్థము వ్యర్థమటంచుఁ బల్కు లో
కమునకు నింద్యుఁడౌనుగద ♦ కావున నాగతి యెట్లొ చెప్పుమా! ౧౧౫

చ॥ అనవుడు యాజ్ఞవల్క్యముని ♦ యాతని కిట్లనె మేదినీశ! నీ
మనమున నుండు భావము స ♦ మగ్రముగా వినియుంటి నీవిఁకన్
విను మిటు మాఘమందుఁ బ్రభ ♦ వింపఁగఁబోయెడి కూఁతులన్ జనా
ర్దనునకు దాయలన్ గలిసి ♦ దాన మిడన్ నెరవేరుఁ గోరికల్. ౧౧౬

చ॥ మఱియు ఋణత్రయంబు నిడి ♦ మానవగేయుఁడవై పరంబు నీ
వఱగొంటలేక కాంతు వహా ♦ హా! యన నా విమలుండు మెచ్చి క్ర
చ్చఱ నిటు బల్కె మానివర! ♦ సంతసమయ్యెను గాని యట్టి శ్రీ
హరి యెపు డేకులాన జని ♦ నందును యద్ది దయన్ వచింపుమా! ౧౧౭

వ॥ అంత నమ్మునికాంతుండు సంతసించి భూకాంతా! యీ ద్వాపర యుగాంతంబున మధురాపురాంతరంబున యదుకులంబునందు రోహిణీ నక్షత్రంబును, హర్షనామయోగంబును, బవకరణంబును, సౌమ్యవారంబును గలిసిన భాద్రపద కృష్ణాష్టమియం దర్ధరాత్రంబునం దంధకారబంధురంబగు సమయంబున శ్రీవత్సాంకుండును, మేఘవర్ణుండును, బీతాంబరుండును, బద్మనేత్రుండును, జతుర్భుజుండును, జగన్మోహనాకారుండును వనమాలియు నగు శ్రీకృష్ణుం డరణియం దగ్నివిధంబున దేవకీదేవియం దుద్భవించి వృద్ధిజెందుచుండు. అతం డవతరించు నబ్దంబునకు నీప్రభుత్వం బికను నూటపదునేను సంవత్సరంబులు శేషింపఁగలదని యెఱుంగుము. అత్తఱి నక్కుమారునకు నీ కుమారికల నిడి ధన్యుండవగుమని నుడివి చనినమీఁద ౧౧౮

చ॥ విమలధరాధిపుండు మది ♦ వేడుకఁ జెందుచునుండె నంత యాజ్ఞవ
ల్క్యముని వచించినట్లు శుభ ♦ కాలము వచ్చుట తద్వధూటులన్
గ్రమముగ రామచంద్రుని వ ♦ రాన నయోధ్యవసించు భామినుల్
గొమరితలై జనించి రను ♦ కూలములౌ గుణరూపరేఖలన్. ౧౧౯

ఉ॥ ఆసుత లొయ్యనన్ బరిణ ♦ యార్హవయోన్వితలౌటఁ గాంచి యా
కోసలనాయకుం డెద న ♦ కుంఠిత మానివచస్సు యోజనన్
జేసి సమర్థదూత నొక ♦ నిం బిలిపించియు వానితోడఁ దా
నీసరణిన్ వచించె జగ ♦ దీశ్వరతద్దరిమార్గణార్థమై. ౧౨౦

తే॥ ఈవు మధురాపురంబున ♦ కేగి శౌరి, మందిరంబున వసుదేవ ♦ నందను ఘన
వర్ణునిం జతుర్భుజుని శ్రీ ♦ వత్సయుక్తు, సుందరాకారు శ్రీకృష్ణుఁ ♦ జూచి రమ్ము.

ఉ॥ వచ్చిన నీవు మత్సుతల ♦ బాంధవదాయయుతుండ నొచు నా
పచ్చని పట్టుపుట్టముల ♦ భాసిలు సామికి శాస్త్రరీతిగా

నిచ్చట నిచ్చయంబు సుమి ♦ యేగుమ! వేగ నసంగ నాతఁడున్
గ్రచ్చఱ సాగి చేరి మధు ♦ రాపురవాసుల నడ్గె నిట్టులన్. ౧౨౨

ఆ॥ ఆర్యులార! మీర♦లా వసుదేవుని, నెఱుఁగుదురొకొ యీ న♦గరిని గలఁడె?
యతని కొడుకు లెచట♦నధివసించుచునుండ్రొ, విశదముగ నుడువుఁడు♦వేగ నాగ!

తే॥ మాధురులు విని యాదవ♦నాథకంస, భీతి మెల్లని మాటల♦బిలిచి యతని
చెవిని స్వీయవక్త్రంబుల♦జేర్చి యిటుల,బల్కెఁ దొడఁగిరి శ్రీకృష్ణ♦భక్తవర్య!

ఉ॥ పుట్టిరిగాని పుత్రకు ల ♦ మోఘబలుల్ గుణరూపకాంతు లా
దిట్టల నందఱం గసి ను ♦ దీర్ణబలుం డగు కంసరాజు చే
పట్టి వధించె నొక్క సుత ♦ బాల్యమునన్ దివికేగె దాన ని
ట్టట్టనరాని ఖేదము జ ♦ నింపఁగ నా వసుదేవుఁ డుండెడిన్. ౧౨౫

చ॥ ఇది యతిగూఢ మించుకయు ♦ నెయ్యెడఁ జెప్పకుమయ్య చెప్పినన్
యదుపతి పీడఁబెట్టఁగలఁ ♦ డంచు నెఱుంగు మనంగ నాతఁ డ
య్యది విని తత్పురిన్ విడిచి ♦ యా విమలాఖ్యుని చంపకాపురిన్
గదిసియుఁ గన్నవార్త లల ♦ యాప్తులనేతకు నిల్లు వాకొనెన్

క॥ అయ్యా! మధురకు నేగితి, నయ్యానకదుందుభి ప్రి ♦ యాత్మజులను వే
యయ్యాదవభూపాలుం, డయ్యారే యన వధించె ♦ నఁట! యయ్యయ్యో! ౧౨౮

చ॥ అల వసుదేవుఁ డాత్మజ చ ♦ యంబు లయంబటు జెందుటన్ లలిన్
గలఁగుచుఁ దన్మహాపురిని ♦ గ్రాలెనటంచును వింటి నంతఁ ద
త్స్థలమును వీడి మీదరికి ♦ సాగియు వచ్చుచు బృందకాటవి
న్గలఁగెడి నొక్క చిన్ని సుతు ♦ నిం దిలకించితి నెట్టివాఁ డనన్. ౧౨౯

సీ॥ పీతాంబరుండును ♦ వేత్రవంశీధరుం, డభ్రవర్ణుఁడు పంక ♦ జాననుండు
శ్రీవత్సయుక్తుండు ♦ భావజరూపుండు, నమృత నిష్యందివ ♦ చోన్వితుండు
గంజనేత్రుండు జ ♦ గన్మోహనుండును, బహ్వలంకార వి ♦ భ్రాజితుండు
గోపక పుత్రుండుఁ ♦ గోమల దేహుండు, వనమాలి పీవర ♦ ఘనభుజుండు

తే॥ ఖేలనాలోలుఁ డతుల వి♦శాలకీర్తి,శాలి బుద్ధిశాలియు శీలి ♦ సత్యభాషి
పాశుపాల్యప్రవీణుండు ♦ వల్లవాంగ, నాజనాంతర భాసుఁ డ ♦ నన్యఘనుఁడు.

ఉ॥ కాని చతుర్భుజుం డతఁడు ♦ గాక ద్విబాహుసమేతుఁ డౌటచే
నేను త్వదుక్త పుత్రుఁ డితఁ ♦ డింతయుఁ గాఁడని వీడి వచ్చితిన్
మానవనాథ! యట్టి ముని ♦ మాట యబద్ధముగాదు కాన న
న్మానక పంపు మెందయిన ♦ మానసమందుఁ దలంచి నట్టులన్. ౧౩౦

ఉ॥ అంతటఁ దద్ధరాధిపతి ♦ యందుల కద్భుత మొంది దానినిన్
స్వాంతమునందు మంతనము ♦ సల్పెడి పట్టున హస్తినాపుర

ప్రాంతమునుండి భీష్ముఁడను ♦ రాజు సమర్థత సింధుదేశ మ
త్యంతము గెల్చి వచ్చినపు ♦ డా విమలుండును మ్రొక్కి యిట్లనెన్. ౧౩౧

మ॥ కురువంశోత్తమ! యాజ్ఞవల్క్యముని నా ♦ కున్ మున్ను గూర్మిన్ ధరా
భరమున్ బాపఁగ వేదధర్మముల ని ♦ ల్పన్ దేవకీదేవకిన్
హరి పుట్టం గలఁడంచుఁ బల్కె నది స ♦ త్యంబౌచు నేనెంచి యా
యిరువందున్ వెదకింపఁగా నతఁడు లేఁ ♦ డేమీ! దయన్ దెల్పుమా! ౧౩౨

కం॥ కూఁతుల నతని కిచుటకే, సీతలు సేయంగ వలెనొ ♦ చెప్పుము! బలులన్
ప్రీతిని గొమ్మా! యీనా, జోతలఁ గొని శంకఁ బాపి ♦ చూడుము దయతోన్.

చ॥ విమలుఁ డిటుల్ నుతింప నల ♦ భీష్ముఁ డిటుల్ వచియించె భూప! యీ
సమయమునందు నడ్డిన ప్ర ♦ శస్తరమేశచరిత్ర గాథగా
థ మయిన దైన నీనుతి దృ ♦ ఢంబుగ మెచ్చి వచింతు నాలకిం
పుము! మధురాపురాన హరి ♦ పుట్టిన మాట నిజం బిఁకేమనన్

మ॥ వసుదేవుండు నిజాత్మజాళి యదు భూ ♦ పాలుండు కంసుండు బల్
కసితోఁ జంపిన మీఁద ఖేదపడి శ్రీ ♦ కాంతుండు పుట్టన్ వెసన్
ససిఁగొంచున్ జని యాయశోమతి సతీ ♦ శయ్యన్ బరుండంగ నుం
చి సమూఢంబగు యోగమాయఁగొని తాఁ ♦ జేరెన్ నిజాగారమున్. ౧౩౫

ఉ॥ ఆకమలేశ్వరుండు వ్రజ ♦ మందున వృద్ధిని బొంది యా
శ్రీకర బృందకుం జని వి ♦ చిత్రములన్ గనుఁగొంచు గోపికా
గోకుల గోపులంగలిసి ♦ కూరిమితోఁ బదునొక్కఁడేండ్లు వాఁ
డైకరమున్ జరించెడి న ♦ హా! యన దీని నెఱుంగ రెవ్వరున్. ౧౩౬

కం॥ దుష్టులఁ జంపుట కొఱకును, శిష్టులఁ గాపాడు కొఱకు ♦ శ్రీహరి జన్మం
బిష్టముతో నెత్తెను నిఁకఁ, గష్టపరంపరలు సనును ♦ గలఁతల విడుమా! ౧౩౭

ఉ॥ దానవుఁడైన కంసుని హ ♦ తం బొనరించినపైఁ బ్రకాశుఁడౌఁ
గానఁ దదంతరంబుననె ♦ కాంచిన కూఁతుల గూఢరీతిగా
దానమొసంగి యాహరికి ♦ ధన్యుఁడవై పరమొందు మోధరా
జాని! శరీర ధర్మములు ♦ చంచలము ల్గద జాగు మానుమా! ౧౩౮

ఉ॥ శాంతనవుం డిటుల్ పలిక ♦ స్వస్థలముం జనెఁ బిమ్మటన్ ధరా
కాంతుఁడు తిర్గి దూతఁ దమ ♦ కింబునఁ బిల్చి ప్రియోక్తితోడ నీ
వింతకు మున్ను నాకు వచి ♦ యించిన కుఱ్ఱఁడె కృష్ణుఁడయ్యె! య
త్యంతజవంబుచే నరిగి ♦ యాఘనుఁ దోడ్కొని రమ్ము ధీనిధీ! ౧౩౯

తే॥ రాయబారి బయలుదేరి ♦ యాయమునకు, దాపునందున నున్న బృం ♦ దావనమున
శీతవాతము హాయిగాఁ ♦ జెలఁగుచుండ, సంచరించు కృష్ణుని రహ ♦ స్యమునఁ గాంచి

చ॥ హరి! యరవిందనేత్ర! యభ♦ యప్రద! దోషవినాశకా! మహే
శ్వరుఁడ వజుండ వాద్యుఁడవు♦ బ్రహ్మవు బ్రహ్మముఖాదివంద్య స
చ్చరితుఁడ వప్రమేయుఁడవు♦ సామ్యవిహీనఘనుండవయ్య! నిన్
గుఱిచి నుతింపఁ జాలుదునె? ♦ కొమ్మవిగో నతులో దయోదయా! ౧౪౧

ఉ॥ ఎవ్వఁడు కర్ణహీనుఁడయి♦ యెల్లయుదంతము లాలకించునో
యెవ్వఁడు నేత్రహీనుఁడయి♦ యెల్లజగంబులఁ జూచుచుండునో
యెవ్వఁడు రూపహీనుఁడయి♦ యిష్టుల కన్గవ గోచరించునో
యెవ్వఁడు దేవదేవుఁడయి♦ హెచ్చెనొ యా నిను భక్తి మ్రొక్కెదన్. ౧౪౨

ఉ॥ ధన్యము నంద గోకులము♦ ధన్యము శ్రీమధురాపురంబునున్
ధన్యము గోపికా జనము♦ ధన్యము గోపకవంశ మంతయున్
ధన్యము బృందకాటవియు♦ ధన్యులు నీ తలిదండ్రు లింక నే
ధన్యుఁడ నైతి మీ శుభద♦ దర్శనమాట సరోజలోచనా! ౧౪౩

ఉ॥ కంసముఖాది దానవుల♦ కంఠములం దెగటార్చ భూమివా
హింసల మాన్ప గోశ్రుతిమ♦ హీసుర సాధులఁ బ్రోవ సేవకో
త్తంసమనోరథంబుల య♦ థావిధిఁ దీర్పఁగ జన్మమెత్తి యా
శంసిత నందసౌధమున♦ శౌక్ల్యసుధాంశుని మాడ్కిఁ బెర్గవే? ౧౪౪

ఉ॥ నీ యశమే కదా శశిని♦ నిర్మలుగాఁ బొనరించి దిక్కులం
దాయత చంద్రికల్ బఱపి♦ హర్షముగూర్చెడి దద్దియే కదా
యాయమరాపగాధరుని♦ యద్రిని దెల్లని గొప్పకొండగా
హాయిగఁ జేయఁజాలెడిది♦ యద్ది లవంబు నుతింప శక్యమే? ౧౪౫

చ॥ ఎవ రెఱుఁగంగ రాదనుచు♦ నిచ్చట నుంటివి కాని నీ యశం
బవఘుళ మొంది యెల్లెడల♦ నందఱకున్ దెలియంగఁ జాలెఁగా
దె? వరద! పరాత్పరా! వరమ♦తీ! మృగనాభిపటీరకేతకీ
నివహ సువాసనల్ బరణి♦ నెట్టన డాఁచిన డాఁగునేమొకో? ౧౪౬

శా॥ క్షేత్రజ్ఞుండవు కర్మసాక్షివిగదా♦ శ్రీరాధికానాయకా!
ధాత్రిన్ నీ వెఱుఁగంగఁజాలనివి సే♦తల్ గానరా వైన నో
సుత్రామాదిసుపర్వవంద్యచరణా! ♦ చూపించి కారుణ్య మీ
మాత్రన్ దాత్యము గన్న నా వచనముల్♦ మన్నించి యాలింపుమా! ౧౪౭

తే॥ సింధుదేశమునందుఁ బ్ర♦సిద్ధిగన్న, చంపకాహ్వాయపురవర♦ జనపతి యగు
విమలుఁ డనువాఁడు త్వత్పద♦విమల పద్మ, ములను మిక్కిలి నెద నమ్మి♦పలికె నిట్లు.

చ॥ జప మఖలవ్రతంబులను♦ శ్రౌతసవంబులఁ దీర్థయాత్రలన్
దపమును సర్వదానములఁ♦ దద్దయుఁ దావక దర్శనార్థమై

యెపుడును సల్పి నిన్ను నుతి ◆ యించుచు నుంటిని నమ్మియుంటి నా
కిపు డొకమాట గన్గొనుమ ! ◆ యాత్మనపర్వముగాఁగ శ్రీధరా ! ౧౪౯

చ॥ మఱి నిను భర్తగా నెపుడు ◆ మానసమందు నుతించువారు తా
మరసదళాయతేక్షణలు ◆ మన్మథదారసమానరూపిణుల్
వరనియమవ్రతస్థలును ◆ స్వర్ణవిభూషణయుక్తలైన మ
త్సురుచిర కన్యకామణుల ◆ సొంపుగ నీవు పరిగ్రహింపుమా ! ౧౫౦

శా॥ దేవా ! యీవిధిఁ జెప్పమంచు ననిపెన్ ◆ దివ్యానుకంపన్ నన్నున్
రావే ప్రాకటచంపకాపురికి నీ ◆ ప్రార్థించు నానేత కీ
వీవే దర్శన మానరేంద్రు సుతలన్ ◆ హెచ్చిల్లి చేపట్టి పో
లేవే మమ్ముల ధన్యులన్ సలుపఁగా ◆ లేవే వివేకప్రియా ! ౧౫౧

తే॥ ఇట్లు వినుతింప నరియంచుఁ ◆ గృష్ణుఁ డొప్పి, రాయబారిని దోడ్కొని ◆ వాయువేగ
మునఁ దదధికారి యింటికిఁ ◆ బోవ నతఁడు, గద్దియన్ డిగ్గి యెదురేగి ◆ గాఢ భక్తి.

శా॥ శ్రీవత్సాంకుని హేమచేలరుచిరున్ ◆ స్మేరాననున్ రమ్యరా
జీవాక్షున్ వనమాలి వంశిధరునిన్ ◆ జీమూతవర్ణాంచితున్
దేవస్తుత్యుని గోపికాజనధవున్ ◆ దీనావనఖ్యాతు శ్రీ
గోవిందున్ స్వగృహాగతున్ గనుచు బ్రెమొ ◆ క్కుల్సల్పి యిట్లాడెన్. ౧౫౩

చ॥ కొను మిదె సింహపీఠికను ◆ గూర్చుని నే నిడు పూజలెల్లఁ గై
కొనుమని యర్ఘ్యలన్ సలిపి ◆ కొంకక దోసిలి యొగ్గి సమ్ముఖం
బున నివసించెఁ దత్సుతలు ◆ ముచ్చట నా హరి జాలరంధ్రపం
క్తిని గనసాగి రంత నల ◆ కృష్ణుఁడు తత్పతి కిట్లు వాకొనెన్. ౧౫౪

క॥ విమలా ! యిత్తఱి సంతో, షము గల్గెను యాజ్ఞవల్క్య ◆ సద్వరమున నీ
కమిత శివంకర దర్శన, మమలదయ నిడితి వరము ◆ లడుగుము ! యిత్తున్. ౧౫౫

క॥ అనవుడు విమలుం డిట్లనె, యనఘా ! ధన్యుండ నైతి ◆ ననిశము నీపా
దనలినయుగసుధ నానెడి, ఘనమత్పదముగ రచించి ◆ కావుమ ! కృష్ణా. ౧౫౬

క॥ ధీరుఁడవు సర్వవిద్యా, పారగుఁడవు బ్రహ్మవాది ◆ వంద్యుఁడవు మహా
వీరుఁడవు వేదపథసం, చారచణుఁడ వంతకంటె ◆ సద్వరమున్నె ? ౧౫౭

తే॥ భక్తవత్సల ! యది విడి ◆ పరవరంబుఁ, గోరుటల్ జూడఁ దియ్యని ◆ కొబ్బెర విడి
చిప్ప వేఁడెడి వీఁడేఁడి ◆ చొప్పుఁగాదె, జలజనాభ ! యన్యవరంబు ◆ వలదు వలదు.

ఉ॥ ఆవల దాని కంబుజ ద ◆ ళాయతలోచనుఁ డొప్పు నాతఁడున్
మావులఁ దేరులన్ గరుల ◆ మాడలు మాడువు లర్థరాశు లా
దేవున కిచ్చి కూఁతుల ప్రభు ◆ తిస్థితపంక్తి నొసంగఁగా జయా
రావము నిండె వేల్పులు గ ◆ రంబుగఁ బూలను జల్లి రో విభూ ! ౧౫౯

ఉ॥ అసమయాన నా విమలుఁ ♦ డర్కశతప్రతిమానమూర్తియై
భాసిలి వైనతేయుపయి ♦ భార్యలతోడుత నెక్కి యచ్యుతా
వాసముఁ జెందె నంత నల ♦ వారిజలోచనుఁ డా లతాంగులన్
రాసములందుఁ దేల్చె నను ♦ రాగము మీఱ వ్రజస్థలంబునన్. ౧౬౦

తే॥ మఱియుఁ గామవనమున నా ♦ మానినులను
గూడి శ్రీహరి విహరించెఁ ♦ గోర్కిమీఱఁ
దన్ను భజియించు వారికి ♦ వెన్నుఁ డెలమి
నిచ్చలను దీర్చు ముక్తిని ♦ నియ్యఁ డొక్కొ? ౧౬౧

చ॥ విమల కుమారి ముజ్జలము ♦ వెల్లిగఁ బాఱుట నందు దానికిన్
విమలసరోవరం బనెడి ♦ పేరు ఘటిల్లెను దానియందు నె
ట్టి మనుజుఁడైన దానము గ ♦ డిందిగ సల్పినఁ బాపమేగుఁ బు
ణ్యము లభియించు నిట్టి కథ ♦ నాస్థను విన్న జనుండు ధన్యుఁడౌ. ౧౬౨

యజ్ఞసీతోపాఖ్యానము.

తే॥ కనకభూవర! వెండియు♦శౌరిభక్తి,వర్ధకంబును సుఖదంబు♦బాపహరము
నైన యజ్ఞసీతాకథ♦నాలకింపు, మనుచు నిట్లనె నారద♦మునివరుండు. ౧౬౩

తే॥ మున్ను దక్షిణదిగ్భాగ♦మున ననేక, రుచిరుచిరతరు సుమఫల♦నిచయకలిత
వనులతో మంచిపసులతో♦స్వస్తికాది, భవనములతో నుశీనరా♦వని చెలంగు.

చ॥ వరపరమప్రమాణ విధి ♦ వర్థిత వేదపురాణశాస్త్రసూ
త్రరమణసార్థకార్థబహు ♦ ధర్మ సుకర్మ కృతిస్ఫురత్ప్రభా
కరసమదీప్తి దీప్తిమిర ♦ కర్తనకీర్తితమూర్తులాఢ్యులున్
సరసులు సుందరీమణులు ♦ చాలఁ జెలంగుదు రందుఁ బొందికన్. ౧౬౪

తే॥ అట్టిదేశంబునం దొక్క♦యవసరమున, వరుసగాఁ బదియేడులు♦వానలేక
యతిశయక్షామడాంబరా♦ద్యఖిల రుజలు, గ్రాలుటన్ జనులెల్లరు♦దాళలేక.

క॥ పుత్రకళత్రాదులతోఁ, దత్రత్యులతోడఁ గూడి ♦ తన్నందు వ్రజం
బాత్రముగాఁ జేరి యచటఁ, జిత్రగృహంబులను గట్టి ♦ చేసిరి వసతుల్. ౧౬౫

చ॥ అటుపయి వారిగేహముల ♦ నారఘురాము వరంబుచేత ను
త్కటముగ యజ్ఞసీతలను ♦ కాంతలు పుట్టి క్రమక్రమంబుగాఁ
జటులవయస్సమేతలయి ♦ సంయమికిన్ రతిగొల్పు రూపమున్
దిటముగఁ బొంది భూషలను ♦ దేహము నిండ ధరించి వేడ్కతోన్. ౧౬౬

ఉ॥ అందముగా విహారముల ♦ నందున సల్పెడి కాలమందు నా
సుందరనందనందనునిఁ ♦ జూచి విరాళిని సైపలేక త

న్నందసుతుం డుదారుఁడును ♦ నవ్యమనోభవరూపుఁడున్ మహా
నందమయుం డనామయుఁ డ ♦ నాథవిభుండు ప్రసన్నుఁ డౌటకై. ౧౬౯

క॥ రాధాకేళీలోలుఁడు, రాధాప్రాణప్రియుండు ♦ రాధాత్ముండున్
రాధాభక్తవరదుఁడున్, రాధాధీనుం డటంచు ♦ రాధను జనుచున్. ౧౭౦

క॥ జననీ! మా మొఱవినుమా, విన నీచరితంబు విశ్వ ♦ విదితము తల్లీ!
కన నీ రూపము వంద్యము, కొన నీ మావందనములఁ ♦ గోరితి మమ్మా! ౧౭౧

తే॥ అమ్మ! వృషభాను పుత్రికా! ♦ యబ్జనయన! దేవదుర్లభుఁడగు హరి ♦ నీవశమున
నుండెఁ దత్ప్రసన్నార్థమై ♦ యొండువ్రతముఁ, దెల్ప వేఁడితి మిప్పు డ ♦ స్వల్పచరిత!

క॥ అనవుడు రాధిక యిట్లనె, వినుఁడీ! యేకాదశీ ప ♦ విత్రవ్రతమున్
ఘనముగ సల్పిన హరి ద, ర్శనమిడి శుభమిచ్చు నద్ది ♦ సత్య మనంగన్. ౧౭౩

ఉ॥ వారలు రాధ కిట్లనిరి ♦ భామరో! యీవ్రత మెట్లు పుట్టెనో
యేరిది సల్పిరో తొలుత ♦ నెన్ని యభిఖ్యలు దీనికున్నవో
యేరహి నోమగావలెనొ ♦ యీదృశసంగతులన్ వచించి మా
కూఱట గూర్పవమ్మ! భువ ♦ నోద్ధురభారక భామినీమణీ! ౧౭౪

ఏకాదశీ వ్రతవర్ణనము.

వ॥ అనవుడు రాధికాసుందరీమణి యందుల కురరీకరించి గోపికలారా! యీ యేకాదశి యసురల వధార్థంబై మార్గశిరకృష్ణపక్షంబం దామహావిష్ణు దేహంబునం దుద్భవించె. తత్ప్రభృతిఁ బ్రతిమాసంబునఁ బూర్వాపరపక్షంబుల రెంటను వచ్చెడి. తద్విధి నొక యబ్దంబులో నేతెంచు నిరువదినాలు గేకాదశులకుఁ గ్రమంబుగా నుత్పన్నా, మోక్షా, సఫలా, పుత్రదా, షట్తిలా, జయా, విజయా౽మలకీ, పాపమోచనీ, కామదా, వరూధినీ, మోహినీ, స్యపరా, నిర్జలా, యోగినీ, దేవశయనీ, కామినీ, పవిత్రా౽జా పద్మేందిరాపాశాంకుశారమాప్రబోధినులను నామంబులును, మలమాసంబున వచ్చెడి రెండేకాదశులకును సంపత్ప్రద యను నభిధేయంబులు గలిగె. ఈ షడ్వింశతినామశ్రవణం బొనర్చు వారి కేకాదశీ వ్రతాచరణఫలంబు చిక్కు. ఇఁక వ్రతాచరణం బెట్లనిన పూర్వదినంబగు దశమిని నుషఃకాలంబున లేచి కాల్యంబులం దీర్చి శుభ్రవస్త్రంబులం దాల్చి యేకభుక్తం బొనర్చి మఱల నొకమాఱుమాత్ర ముదకంబు గ్రోలి జితేంద్రియుండై భూమిమీఁద హరిని సంస్మరించుచు శయనింపందగు. మఱునాఁ డేకాదశిని బ్రాహ్మ్యముహూర్తంబున మేల్కాంచి భగవద్ధ్యానంబు సల్పి కాలకృత్యంబుల నెఱవేర్చి యనుత్తమంబగు మహానదీస్నానంబుగాని, యుత్తమంబగు తటాకస్నానంబుగాని మధ్యమంబగు వాపీస్నానంబుగాని, యధమంబగు కూపావగాహనంబుగాని యాచరించి క్రోధలోభవివర్జితుండై బ్రాహ్మణనిందకనీచదురాచారమిథ్యావాదిపరద్రవ్యాంగనావు

పారణాసక్తాగమ్యాగమనరతసంభాషణంబు మాని కేశవుని ధ్యానావాహనాది విధులఁ బూజించి ధూపదీపంబులఁ జూపి నైవేద్యంబు సల్పి నీరాజనం బొసంగి మంత్రపుష్పం బిడి ప్రదక్షిణంబులఁ గావించి నమస్కరించి తద్వ్రతకథఁ బురోహితునివలన విని, యయ్యాచార్యునకు వందనపూర్వకంబుగా యథాశక్తి దక్షిణతోఁ గూడిన తాంబూలం బిచ్చి నిష్కలుషీకృతంబగు మనంబున రేయిని గృష్ణనామ సంకీర్తనం బొనర్చుచు జాగరణంబు జేయందగు. మఱియు దశమిని గాంస్యపాత్ర భోజన, మాంస, మసూర, కోద్రవ, పారిమంధక, శాక, మధు, పరాన్న, మైథున, పునర్భోజనంబులను బదింటిని వర్జించి యేకాదశిని ద్యూత, క్రీడా, నిద్రా, తాంబూల, దంతధావన, పరనిందా, పైశున్య, స్తేయ, హింసా, రతి, క్రోధాసత్యంబు లను బదునొకండును బరిత్యజించి ద్వాదశిని గాంస్యపాత్ర, పలల, క్షౌద్ర, తైల, మంగళ్యక, పిష్టి, మష్టిక, కామ, క్రోధాసత్యపరాన్నమైథునంబు లను బండ్రెండును వీడి యేకాదశీవ్రతంబు ముగించి ద్వాదశిపారణంబు బ్రాహ్మణ యుక్తుండై సాత్వికాహారంబు గొనందగు. వృద్ధిగనుండునేకాదశికాక శేషించిన యేకాదశీదినంబె యుపవాసయోగ్యం బగు మదిరాబిందుపాతంబున గంగా ఘటంబు త్యాజ్యంబగునట్లు దశమీవేధబాధితంబగు నేకాదశీదివసంబు వర్జ్యంబగు నని యెఱుంగుము. ఇఁక నేకాదశీవ్రతాచరణ ఫలం బెట్టిదనిన, ౧౭౫

శా॥ అష్టాశీతి సహస్రభూసుర సుధీ ♦ రాన్నప్రదానంబు జ్యో
తిష్టోమాది మహామఖాచరణముల్ ♦ దీర్ఘాటనంబుల్ శ్రుతి
స్పష్టామేయ సుకర్మధర్మకృతియుఙ్ ♦ వాప్యాదిసంస్థాపనం
బష్టాత్మార్చలు గూడ దీని కెనయా ♦ నా ? బిట్టు చర్చింపఁగాన్. ౧౭౬

సీ॥ సకల శుభప్రద ♦ సర్వవ్రతంబుల, శ్రేష్ఠమా నేకాద♦శీవ్రతంబు
సంసార బాధలన్ ♦ సమయించు సేతలన్, శ్రేష్ఠమా నేకాద♦శీవ్రతంబు
నారోగ్య భాగ్యంబు ♦ నమరుచు మందులన్, శ్రేష్ఠమా నేకాద♦శీవ్రతంబు
హరిభక్తి నొడఁగూర్చు ♦ నతిశయయుక్తులన్, శ్రేష్ఠమా నేకాద♦శీవ్రతంబు

తే॥ ప్రళయ రౌద్రాకృతిం దాల్చి♦ప్రాణిచయము,బట్టి బాధించు కాలునిన్♦నెట్టఁజాలు
చెయువులను శ్రేష్ఠ మేకాద♦శీవ్రతంబు,గాదె పంకజేక్షణలార!♦కాంతలార!

క॥ ఏకుటిలాత్ముండైనను, నేకాదశియందు నుపవ♦సించినచో న
స్తోకాఘధరాధరముల, నేకక్షణమందుఁ గూల్చి ♦ కృష్ణునిఁ జేరున్. ౧౭౭

క॥ ద్వాదశ్యేకాదశులను, శ్రీదయితున్ దులసి నర్చఁ ♦ జేసిన జనుఁడా
వేదోదితసవఫలముల, మోదముతోఁ బొంది కృష్ణు♦మ్రోలకుఁ జేరున్. ౧౭౮

తే॥ ఈ వ్రతంబును సల్పిన ♦ యెల్లజనులు, మాతృపక్షంబునం బది♦మందిఁ దండ్రి
ప్రక్కఁ బదిమందినిన్ భార్య♦వైపునఁ బది,మంది నుద్ధరించునుగాదె♦మడఁతులార!

తే॥ శుక్లకృష్ణమాహేయులు సారిదిఁ బిదుకు, పాలయందున భేదంబు వఱలనట్లు
శుక్లకృష్ణపక్షైకాద శులును మార్చు, లేక యొకరీతి ఫలమిచ్చు లేమలార!
తే॥ నూఱుజన్మంబులందలి మేరుమంద, రసమపాపంబులఁ దూల రాశిఁగాల్చు
వహ్నిఁబోలె నేకాదశీ వ్రతతిలకము, వడి దహించును వైకుంఠ పదవి నిచ్చు.
క॥ విధినో యవిధినో కొలఁదిగ, బుధులకు ద్వాదశిని దాన ము నిడ నదే మే
రుధరాధరతుల్యంబై, మధురిపువాసమునఁ జేర్చు మానినులారా! ౧౮౩
సీ॥ చిలువల యందున శేషుని కైవడిఁ, బక్షులందు గరుడ పక్షివోలె
దేవత లందున శ్రీవిష్ణువిధమున, వర్ణంబు లందున బాపల వలె
వనరుహంబుల నశ్వత్థతరువిధి, నాకులందుఁ దులసి యాకు మాడ్కి
మాసంబులందున మార్గశీర్షమురీతి, వేదంబులఁ సామ వేదమువలె
తే॥ వ్రతములందు నేకాదశీ వ్రతము మిగుల, వన్నెకెక్కును బదివేల వత్సరములు
తపముఁ జేసిన ఫలమిచ్చి ధన్యచరితుఁ, జేయుఁ గావున మీరది సేయుఁడాస్థ.
ఆ॥ అంత వారు రాధ కని రిటుల్ దేవిరో!, మున్ను దీని నెవరు మొదలుపెట్టి
ధన్యచరితులైరో తత్కథ దయతోడఁ, జెప్పు మనుచు నామె చెప్పె నిట్లు.
చ॥ తొలుతను వేల్పు లీవ్రతము దూలిన రాజ్యము దిర్గి గల్గ దై
త్యులను నశింపఁజేయఁగ మ హాద్భుతభక్తిని సల్పి రాత్మదా
యల వలనఁ ద్యజింపఁ బడి యంకిలిఁ బొందిన లుంపకాఖ్యుఁడుఁ
సలిపి నిజప్రభుత్వమును జక్కజయించి ముదంబుఁ జెందెఁగా. ౧౮౪
తే॥ భూతలంబున మేటియా కేతుమంతుఁ, డనెడి భూపుఁడు పుత్రలా భార్థ మీవ్ర
తంబు సల్పె వైశంతుఁడే తద్వ్రతమున, శ్రాద్ధదేవలోకస్థిత జనకుఁ గాచె.
తే॥ దేవపత్నులు బ్రాహ్మణ స్త్రీకి నిట్టి, వ్రతము దెల్పఁగ నదిజేసి యా బ్రాహ్మణియును
ధనము ధాన్యము మాన్యత లెనయు లలర, స్వర్గసౌఖ్యంబు బొందెనో చానలార!
సీ॥ మఱిఁ బుష్పదంతియు మాల్యవంతుఁడు పిశా, చత వీడ నద్దాని సల్పినారొ
శ్రీరామచంద్రుండు సేతుబంధము రావ, ణాంతార్థ మెద్దాని నాచరించెఁ
బ్రలయాంతమందు సు పర్వగణంబు స,కల శుభార్థము దేని సలిపియుండె
నప్సరస్సు ప్లిష్టిదో షాంతార్థమై భక్తి, మేధావి యెద్దాని మిగులఁ జేసె
తే॥ లలితనామక గంధర్వ కులతిలకుఁడు, శాపమునఁ గన్న దయ్యపు రూపుమాయఁ
జేసె నెది యది యేకాద శీవ్రతంబు, గాదె వివిధవిధాగత కలుషహరము. ౧౮౯
చ॥ భవుఁడును దీని సల్పి యల బ్రహ్మకపాలము వీడె ధుందుమా
రవిభుఁడు నంబరీష సగ రప్రముఖప్రభు లిద్ది జేసి మా
ధవుని నివాసమొందిరి గ దా యొక వైశ్యుఁడు జ్ఞాతిదూరుఁడై
యవగుణముల్ జెలంగి యది హాయిగ సల్పి కృతార్థతఁ దగెఁ. ౧౯౦

ఉ॥ భంగము లెన్ని వచ్చినను ♦ బట్టును వీడక భక్తితోడ రు
క్మాంగదుఁ డిట్టి సద్వ్రతము ♦ నాచరణం బొనరించి శ్రీహరి
ప్రాంగణ మొందె నైలబిల ♦ పార్థివశాపముచేతఁ గుష్ఠమా
త్మాంగను హేమమాలి యిది ♦ దాల్మి నొనర్చి కృతార్థతన్ గనెన్. ౧౯౧

తే॥ మఱి హరిశ్చంద్ర మాంధాతృ♦మానవేశ్వ,రులును నేకాదశీవ్రత♦మలఘువిధిని
నాచరించి యీ పృథివికి♦నధిపు లగుచు, నెలి వైకుంఠవాసులై♦క్రాలిరయ్య!

తే॥ మఱియు ముచుకుందు నల్లుఁడై ♦ వఱలు శోభ
నాహ్వయుండును నీవ్రత ♦ మాచరించి
చంద్రభాగయన్ భార్యతో ♦ సకలపృథివి
ధనదు బోలి పాలించు నీ ♦ క్షణము వఱకు ౧౯౩

తే॥ కానఁ దిథిరాజమున్ భక్తి♦కల్పకంబు,నయిన యేకాదశీదినం♦బల్పమనుచు
నెదఁ దలంపక చేయుఁడీ! ♦ యింతులార!,దానితోడీటుగా నే వ్ర♦తంబు రాదు.

చ॥ అనవుడు యజ్ఞసీతలును ♦ నచ్యుతలాలస లౌచుఁ దద్వ్రతం
బును విధిచోదితంబుగ న ♦ మోఘవిధంబునఁ జేయఁ గృష్ణుఁడున్
నెనరున మార్గపూర్ణిమను ♦ నివ్వెఱ జెందఁ బ్రసన్నుఁడై తదం
గనలను గూడి రాసము ల ♦ ఖర్వముగా నొనరించె దేవరా! ౧౯౪

పుళిందినీ గోపికోపాఖ్యానము.

తే॥ మఱియు సర్వాఘహరము న ♦ మానుషంబు
కృష్ణభక్తివర్ధకమును ♦ గీర్తనీయ
ము నగు శ్రీపుళిందజవధూ ♦ పుణ్యగాథఁ
బలుకుచుంటిని వినుమయ్య! ♦ యలఘుచరిత! ౧౯౫

తే॥ జనకరాజ! పుళిందులు♦చాలమంది,యుక్కడీండ్రయి వింధ్యాచ♦లోపవనము
నందు నివసించి దీనుల♦యర్థము విడి,తేని ధనమును గసిఁ దస్క♦రింపఁ దొడఁగ,

ఉ॥ ఆహవకేళి ధీరుఁడు మ ♦ హాబలుఁ డాఢ్యుఁడు వింధ్యభూమిని
ర్వాహకుఁ డాకతాయులయి ♦ రైని హరించెడి వారిఁ గాంచి ద్వాశ
తాహిణు లొప్ప నడ్డి శర ♦ చాపకృపాణగదాదిహేతులన్
సాహసభూషణుం డగుచు ♦ సల్పె రణంబు ననంతరంబునన్. ౧౯౭

ఉ॥ వారలు గొన్ని ఘస్రము ల ♦ పారబలంబున నోర్చి నేర్పుతోఁ
బోరి సహింపలేక యదు ♦ భూవరకంసుని కొక్కజాబునం
దీ రణకేళిగాథ లిఖ ♦ యించియు నంపిరి వానిఁ గన్న యా
వీరవరుండు నొప్పి పిలి ♦ పించి ప్రలంబుని నన్యశూరులన్. ౧౯౯

తే॥ జాబు నందలి సంగతుల్ ♦ జక్కఁ దెలిపి, పొందనంగఁ బ్రలంబాద్య ♦ ఖండబలులు
శత్రుభీకరవేషముల్ ♦ సరగఁ దాల్చి, భండనాంగణమొందిరి రా ♦ పట్టునందు.

సీ॥ కాఱుమబ్బులఁ బోలి ♦ కరముభయంకర, మైనట్టి నల్లని ♦ మేనుతోడ
బహుభారసముపేత ♦ పటుతరాయోమయ, కాలపాశసమశ్రం ♦ ఖలలతోడఁ
బ్రత్తికాయల మాడ్కిఁ ♦ బరగుచు నెఱనిప్పు, కుంపటులను బోలు ♦ గ్రుడ్లతోడఁ
బగతుఱ గుండియల్ ♦ బ్రద్దలౌనట్లుగఁ, దగిన యఘోరము ♦ ద్గరముతోడ
తే॥ మకుట కుండల ఫణిహార ♦ మండలంబు, తోడ వ్రేలాడు నాల్కల ♦ తోడ నొప్పి
యోజనద్వయోచ్చాంగంబు ♦ నొంది జగము, వడఁకఁ జేయు ప్రలంబు నా ♦ ప్రభువు గాంచి.

ఉ॥ బెగ్గిలి వింతతోఁ గరముఁ ♦ బేరు టురంబున వైచి యీ యనిన్
నగ్గి జయింపఁ జాల నని ♦ నెంజిలి బొంది చమూసమేతుఁడై
యుగ్గరముం ద్యజించి రథ ♦ ముల్ వడి నెక్కి మనోజవంబుతో
నగ్గిసముగ్గిసల్ బడుచు ♦ సాగె హరింగను నేన్గుచాడ్పునన్. ౧౦౨

ఉ॥ ఆవిధి నట్టి వింధ్యపతి ♦ యాశుగఁ బాఱఁ బ్రలంబుఁ దాపులిం
దావళితోడఁ గూడుకొని ♦ యామధురాపురి కేగె నంత ర
క్షోవిభుఁడైన కంసుఁడును ♦ జూచి ముదంబున వారి నందఱన్
సేవక వర్గముం దునిచెఁ ♦ జెప్పిన చొప్పునఁ జేయునట్లుగాన్. ౧౦౩

చ॥ పదపడి వారు కామగిరి ♦ పై సకుటుంబముగా వసించి రీ
యదనున రామచంద్రవర ♦ మండలి శక్తిఁ బుళిందినీసతు
ల్లుదవసథంబులన్ గలిగి ♦ లక్ష్మినిఁ బోలుచు వృద్ధిఁజెందు చా
మదనసమానరూపుఁ డగు ♦ మాధవునిం గని కన్నులారఁగాన్. ౧౦౪

తే॥ ప్రేమవిహ్వలలై తారు ♦ కామరోగ, పీడితలయి యహర్నిశల్ ♦ విష్ణుమూర్తి
సన్నుతించుచు నుంట నా ♦ శౌరి మెచ్చి, రాసకేళుల వారి సం ♦ తోస పఱచె.

ఆ॥ ఎట్టివారలకును ♦ నీక్షింపఁగారాని, కృష్ణమూర్తి వారి ♦ కెటుల దరిసె
నంబు నిచ్చి కోర్కి ♦ నట్టులు లేకుండ, నిడెను వారిభాగ్య ♦ మేమనవలె? ౧౦౫

ఉ॥ ఆరయ భక్తు లెప్పు డల ♦ యచ్యుత పాదసరోజధూళియే
కోరుదు రంతెకాని సుర ♦ కోటివిభుత్వనరప్రభుత్వ సం
సారసుఖార్థరాశిదృఢ ♦ సత్వమహత్త్వమనోభవోపమా
కారముల న్సమీహలను ♦ గావలె మాకని కోర రోవిభూ ! ౧౦౬

రమాసఖ్యాది గోపికోపాఖ్యానము.

ఆ॥ అట్టి భక్తజనుల ♦ నాధిక్యముల్ గన్న, యన్యగోపికా జ ♦ నామలకథ
విన్నవింతుఁ గాన ♦ వినుమయ్య! బహులాశ్వ!, మును గోకులంబు ♦ నందు వేన్క.

వ॥ నీతివి న్మార్గద, శుక్ల, పతంగ, దివ్యవాహన, గోపేష్టు లను నాల్వురు వృషభానులు జనించిరి. అవ్వారల బిడారులందు శ్రీరమారమణవరంబుచే రమావైకుంఠమందలి మందయానలును, సూర్గ్యవైకుంఠమందలి యువిదలును, శ్రీలోకాచలమందలి చెలువలును, శ్వేతద్వీపంబునందలి సుందరులును, సముద్రజలగు జలజేక్షణలును, మఱియు శ్రీలక్ష్మికి సఖురాండ్రై జనపదంబుల నివసించు సతులును జనించి దినక్రమంబున వర్థిల్లి జగన్మోహినులై రేయింబవలును శ్రీనందనందన చరణారవిందంబులను ధ్యానించుచుఁ దద్దర్శనకుతూహలలై మాఘమాసవ్రతం బాచరింప నద్దేవుండు మెచ్చి వసంతపంచమీదినంబున నా గోపికాజనంబు బరిత్రు జేయం దలంచి, ౨౦౯

మ॥ పులితోల్గట్టి శిరంబునన్ బెనుజడల్ ♦ బొల్పార మౌనీంద్రుఁడై
లలిభస్మంబును బూసి దేహమున ను ♦ ల్లాసంబుగా వంశితో
నిలపైనున్న జనంబు లెల్లరును మో ♦ హింపంగ బల్ పాడు చా
జలజాతాక్షుల వాడలందుఁ దిరుగన్ ♦ సాగెన్ విదేహప్రభూ ! ౨౧౦

క॥ అత్తఱి నత్తొయ్యలులున్, దత్తామరసాక్షుఁ గాంచి ♦ తమి హెచ్చిల్లన్
హత్తించి నాస ద్రేళ్లను, జిత్తరువుల మాడ్కి నిల్చి ♦ చింతించి రిటుల్. ౨౧౧

సీ॥ ఎవ్వఁడో యీబాలుఁ ♦ డిందుఁడా కాఁడాతిఁ, డంకంబు పీడింప ♦ నడఁగుచుండు
కంతుఁడా యీతండు ♦ కాఁడా మనోభవుం, డంగహీనుండయి ♦ క్రుంగుచుండు
నింద్రుఁడా యీఘనుం ♦ డెన్నటికిం గాఁడు, బ్రహ్మహత్యలఁ బాఁడు ♦ వగచుచుండు
కనకగర్భుఁడ వీఁడు ♦ కాఁడు విచారింప, నాతింపు తానయై ♦ యదిరుచుండు

తే॥ నీకఁ దలంప వీఁడెవ్వఁడో ♦ యెఱుకపడదు, గాని మీరు యోజింపుఁడీ ♦ కాంతలార!
యన్న నాసతులం గొంద ♦ అన్నుమిన్న, లెన్ని తిన్నగఁ దలఁపు వ ♦ చించి రిట్లు.

తే॥ మేము నెఱుఁగము కాని యో ♦ మెలఁతలార !
యితఁడు సతుల కాఱులచేత ♦ నడఁద పిఱుగి
నిల్లు విడిచి సంయమివలె ♦ నిట్లు దిరుగు
చుండె నని తోఁచుచుండె మా ♦ యుల్లములను. ౨౧౩

సీ॥ కానిచో నీతని ♦ యాననచంద్రుంను, మిగులఁ దపింపఁగాఁ ♦ దగునె చెపుము !
కానిచో నీతని ♦ కరకమలంబులు, తత్కుండలంబుఁ బట్టఁ ♦ దగునె చెపుము !
కానిచో నితని వ ♦ క్షఃకవాటంబు రు, ద్రాక్షాదులను బొల్పఁ ♦ దగునె చెపుము !
కానిచో నీతని ♦ ఘననిభదేహంబు, తద్ద బూదిస బూయఁ ♦ దగునె చెపుము !

తే॥ కానిచో వీని ప్రాయంబ ♦ నూనరీతిఁ, బ్రాయముల మాటిమాటికిఁ ♦ జేయఁదగునె
చెపుము ! కానిచో నిట్టి సు ♦ శీలు నడుగు, దమ్ముల డవుల నడువంగ ♦ వగునె చెపుము!

తే॥ ఇట్టి కుత్తుని విడిచియు♦నెటులఁ దల్లి, దండ్రియున్ జెల్లె లన్నలు♦దమ్ము లెలమి
బ్రతుకుచుండిరో తెలియదీ♦పట్టిగన్న, పరులు విడుతురే విడి వారు♦బ్రతుకఁగలరె ?

తే॥ అందఱము చేరి మెల్లన ♦ నతనికడకుఁ, జేరి యడిగిన సరసమౌఁ♦జెలువలార !
యనఁగ నందఱు సమ్మతి♦మంది యతని, చెంతకుం జేరి యిట్లు పృ♦చ్ఛించి రాస్థ.

చ॥ యతివర ! యేరు మీరు ? భవ ♦ దాహ్వాయ మెయ్యది ? యేకులంబు ? మీ
స్థితి యెట ? వృత్తియెద్ది ? మఱి ♦ సిద్ధిని నెందునఁ జెందియుంటిరో ?
వితతముగా వచింపుఁ డని ♦ వేఁ(మ)ఱు వేఁడితి మన్న నాతఁ డ
ద్భుతమగు వాక్యధోరణిని ♦ ముగ్ధల కిట్టులఁ బల్కె భూవరా ! ౨౧౮

సీ॥ నా నివాసంబు మా ♦ నసరోవరముననే, యాహారముల్లేని ♦ యమివరుండ
నాఖ్యయా నారు స్వ ♦ యంప్రకాశుం డల, పరమహంసదశకుఁ ♦ బరగువాఁడ
వర్తమానంబును ♦ భవ్యంబు భూతంబు, దప్పక చెప్పెడి ♦ గొప్పవాఁడ
స్తంభనమోహనో ♦ చ్చాటన మారణ, మంత్రవిద్యాసిద్ధి ♦ మరఁగినాఁడ

తే॥ మఱియు సర్వవిద్యలయం ద♦మానుషమగు, నేర్పు గలిగినవాఁడనో♦నెలఁతలార !
మీర లడిగిన దాని సా♦ధారణముగఁ, జెప్పఁగలను సంశయమిందుఁ♦జెందవలదు.

చ॥ అనవుడు తద్వ్రజాంగనలు♦నాయతి కిట్లని రట్టులైన మా
మనముల నున్న సంగతు ల ♦ మందముగా వివరింపుఁడీ యనన్
విని యతఁ డించుకంత దన ♦ వీక్షణమూర్ధ్వమునందు వైచి యి
ట్లనియెను దల్లతాంగులకు ♦ నాదరభావసుబద్ధ బుద్ధియై. ౨౧౯

తే॥ మీ మనంబులనుండిన♦కామ మధిక, గూఢమౌటను జెవిచెంతఁ♦గోర్కి దీఱఁ
జెప్పఁగాఁదగుఁ గాదేని♦సెలవుమీర, లిడినఁ జేసెద వెల్లడి♦నింతులార ! ౨౨౦

తే॥ అనుచు సాభినయంబుగా ♦ నట్టి వార్తఁ
గొలఁది సూచించె నటుమీఁదఁ ♦ గోమలులును
మెచ్చి యోగీశ ! యెపుడు మా ♦ యిచ్ఛ కాఁడు
రాగలఁడొ యిట కయ్యది ♦ వేగ జెపుమ ! ౨౨౧

ఉ॥ నావుడు సిద్ధుఁ డిట్లనియె ♦ నవ్యసరోరుహనేత్రలార ! మీ
భావము నే నెఱింగితిని ♦ బాగుగ నున్నది మీర లందఱా
శ్రీవిభు సంస్మరించుచున్ గొలఁది ♦ సేపు కనుంగవ మూయుఁ డిప్పుడే
యా వసుదేవపుత్రుఁ డిట ♦ కాగతుఁ డయ్యెడి నన్న వారలున్. ౨౨౨

చ॥ సరియని యొప్పి శ్రీహరి న ♦ చంచలభక్తిఁ దలంచుచున్ గనుల్
సరగున మూసి రంత నల ♦ సారసనేత్రుఁడు వారి ప్రేమ యు
ద్ధురతను జూచి మెచ్చి దయ ♦ తో యతిరూపము వీడి తోడ్త సుం
దరుఁ డగు నందపుత్రుఁ డయి ♦ తద్వనితాసముఖంబునం దగన్. ౨౨౩

ఉ॥ పెన్నిధిఁగన్న పేదవలె ♦ వేడ్కఁ గనుంగొని వారు వేఁడి రా
వెన్నుఁడు మాఘసువ్రతము ♦ వేమఱుఁ జేయుచుఁ దన్నుఁగోరు నా
యన్నులమిన్నలం గలిసి ♦ యబ్రముగొల్పెడి రాసకేళులన్
గ్రన్ననఁ దేలి తృప్తిపడెఁ ♦ గౌఁగిళులన్ మఱిఁ జుంబనంబులన్. ౧౨౮

తే॥ ఇటుల నమరాంగనలతోడ ♦ నెల్లసురలు, క్రీడలాడిన మాడ్కి నా ♦ చేడియలను
గూడి బృందావనిన్ హరి ♦ యాడినకతఁ, జెప్పితిని నింక విను వ్రజ ♦ స్త్రీలకథల.

దివ్యాత్రిగుణవృత్తి గోపికోపాఖ్యానము.

తే॥ శాంతి పీతిమోహ్యాత్రాగ్నిభు ♦ క్తాంబు పావన, సశ్రుత శ్రీకర వ్రజ ♦ నాథ గోప
తులను నుపనందు లా వ్రజ ♦ స్థలిఁ బుట్టి, బలయశోధనసుతశీల ♦ కలితులైరి.

తే॥ వారి భవనంబులందు శ్రీ ♦ పరమపురుష, వరముచే దివ్యలును నది ♦ వ్యలును భూమి
గోపికలును ద్రిగుణ వృత్తి ♦ గోపికలును, బుట్టిరో మిథిలేశ్వర ! ♦ పుణ్యపురుష !

క॥ రాధాసమరూపంబును, రాధాగుణ వేషములను ♦ రాధావృత్తిన్
రాధానాథ ప్రేమయు, రాధాస్నేహంబు గలిగి ♦ ప్రబలిరి వారల్. ౧౨౯

ఆ॥ ఒక్కదినమునందుఁ ♦ నక్కీర్తిసుందరీ, తనయ యైన రాధ, ♦ వనజనయను
పైని ప్రణయ కోప ♦ మూని యారాసేశు, రాసరంగమందుఁ ♦ బాసి యేగె.

తే॥ అంత శ్రీకాంతుఁ డదిగని ♦ యామె కోప, మార్ప మానవతీ హృద ♦ యాపహారి
హాలికోచిత వేషంబు ♦ గ్రాలఁ దోట, కేగె వారది గని రాధ ♦ కిటు లనిరి.

మ॥ కరభోరూ ! వ్రజసుందరీమణి ! జగ ♦ త్కల్యాణసంధాయినీ !
సరసుం డంబుజలోచనుం డమృతని ♦ ష్యందాస్యుఁడున్ బాలభా
స్కరసామ్యాంగదమౌళికుండల పృథు ♦ గ్రైవేయకావాపకో
ద్ధురుఁడున్ హేమపటుండు నా హరి యదే ♦ తోతెంచె వీక్షింపుమా ! ౧౩౦

శా॥ ఆభీరాగరుకుంకుమాదిరసలి ♦ ప్తాకారుఁడై రాసకే
ళీభాగ్యావధిలాలసుండు నయి చె ♦ ల్మిన్ హాలికోద్ధర్షమం
దాభోగంబును జెంద నాతఁ డల యు ♦ ద్యానంబునన్ వంశితో
నాభాషాసతి మెచ్చఁ బాడెడి నహో ♦ యావైపునం జూడుమా ! ౧౩౧

ఉ॥ నల్లని ముంగురుల్గలిగి ♦ నవ్యవయోన్మదఘూర్ణితాత్ముఁడై
నల్లని రూపునన్ వెలిఁగి ♦ నాతుల ప్రీతికి మూలబంధమై
యుల్లస ముల్లమం దలర ♦ నొప్పిన యప్పరమేశుఁ గాంచుమా !
నల్లలితాను రాగమునఁ ♦ జయ్యన నాతని పొంత కేగుమా ! ౧౩౩

ఉ॥ లెమ్ము ద్రుతంబునం జనుము ♦ లేమలచేతఁ ద్వదీయరమ్య దే
హమ్ము నలంకరించు మల ♦ యత్తరు గంధము పుష్పహారులన్

ఘుమ్మను నట్లు జేయుమిఁక ♦ గోపను వీఁకు మ కృష్ణచంద్రు మో
దమ్మునఁ గూడి రాసములఁ ♦ దద్దయు జేయుము రాధికాంబరో! ౧౩౪

ఉ॥ ఈసమయంబు మంచిదని ♦ యెంచుచు క్రమ్మఱ నిద్ది రాదు సం
తోసముతోడ నుండు మనఁ ♦ దోయజలోచనయైన రాధ చే
టీసముదాయముం గలిసి ♦ లెక్కకు నవ్వలి మహంబుఁగఁ గొంచు పే
రాసను లేచి కిన్కవిడి ♦ యావని కేగె ననంతరంబునన్. ౧౩౫

వ॥ పూర్ణోత్సవములును, దత్పరిపాలాసములును, గుంకుమసంకుముదగోరోచనా హరిద్రాగరుకస్తూరీశ్రీఖండాది రసపూరితదృతిసమేతలును, నగు నా వ్రజాంగన లంగదపాదాంగదకాంచీకంకణతాటంకహారతారాద్యాభరణంబులం దాల్చి పచ్చని వలువల ధరించి స్వీయకోమలశోణహస్తంబుల నాభీరారుణచూర్ణమ్ములు గైకొని భూనభోభాగంబులు సంధ్యారాగంబు విడంబించున ట్లెలెడఁ జల్లి కోకిలస్వనంబులో హాలికాగీతంబుల గానం బొనర్చుచు ఫుల్లసరోజలోచనుండగు వల్లవకులజలధి హల్లకప్రియుఁపై వసంతంబుఁ బోసి కుంకుమకటీరాగరుచూర్ణములను బలుమాఱు విసరి మొకసక్కియమాడుచుఁ జనపుటాఱు డాయుచు నడుమనడుమ భయంపడుచు నాతని నగుమొగంబును ముద్దుగొనుచు యథేష్టంబుగా విహరింపుచుండ నక్కమ లాక్షుండును మిక్కిలి సంతసించి యా సతీమణుల కందఱ కన్నిరూపులతో నై వారి మానసంబుల తీర్చి దమలని యుగళంబుగ నగ్రింప రాధాదేవితోడం గూడి తెనుత్స వంబు సంపూర్ణంబుగా నడిపించి తద స్తృతాకనేత్రుండై స్వకీయంబగు నుత్తరీ యంబును గుఱుతుగా నా సిరిఁబోడుల కొసంగి యటనుండి వెడలి నందభవనంబున కేగె. వెండియుఁ జతుర్ముదార్ఘ్యప్రదంబగు దేవకన్యాగోపికాచరితంబు వినిపించెద వినుమని యిట్లు చెప్పందొడంగె. ౧౩౬

దేవకన్యాగోపికోపాఖ్యానము.

ఉ॥ ప్రాంబుఁగదా కుబేరసమ ♦ దైరుచిరుండు వజ్రప్రభుండు గో
పాలుఁడు కీర్తివంతుఁడు ది ♦ వస్పతినామక వీరుఁ డొక్క వే
గోలలఁ బెండ్లియాడి బుధ ♦ కోటులు మెచ్చఁగ ధర్మపద్ధతిన్
మాలవదేశ మేలుచు స ♦ మస్తసుఖంబులఁ బొందుచున్ ప్రభూ! ౧౩౭

తే॥ అతఁడు సంసారజనితపా ♦ పబ్ధి నీఁదఁ, జాలినది మజ్జగంబులన్ ♦ సజ్జనసహ
వాస నౌకయ యొక్కటి ♦ వఱలెనంచు, విజ్ఞుడగు బ్రాహ్మణులచేత ♦ విని కడంక.

తే॥ అఖిల భార్యలఁ దోడ్కొని ♦ యాత్మగృహము
నుండి వెడలి క్రమంబుగా ♦ దండియైన
తీర్థములఁ గాంచి సేవించి ♦ దివ్యమధుర
కేగి యందలి వింత లీ ♦ క్షించి యచట. ౧౩౮

తే॥ గోకులంబున బుధుఁడు యోగ్యుండు నైన, నందభూపుఁడు గలఁడని నాగరకుల
వలన విని యా యశోదేశు పజ్జకరిగి, కనియు బృందావన శ్రీనిఁ గాంచి యవల.

క॥ నందుని యానతిఁ గొని యా, నందముతో రమ్యయోజ నద్వయదేశం
బొందుచు బృందావనిలో, మందిర మొక్కండుఁ గట్టి మసికి నొనర్చెన్. ౨౮౧

క॥ బృందిష్ఠంబగు గోష్ఠం, బందముగా నొకటి గట్టి యాతఁడు దివిష
త్సందోహాధిపువలె నా, నందముతో నుండ నిజ జనంబులతోడన్. ౨౮౨

క॥ దేవలవాక్యము చొప్పున, దేవాంగన లాత్మజలుగ దివ్యాకార
వ్యావృతలై పుట్టియు సిత, జైవాతృకు పగిదిఁ బెరుఁగు సమయంబందున్.

క॥ మోహనరూపుండగు నా, శ్రీహరినిం గాంచి మరులుఁ జెంది వివశలై
యా హరినిం గూడుట క, వ్యాహతవిధి మాఘమాస మందలి వ్రతమున్.

ఉ॥ మోదముతో నొనర్చుటకుఁ బ్రొద్దున నిద్దుర లేచి భాస్కరా
రోదయవేళ నా యమున యొద్దకుఁ బోయి మునింగి యందు దా
మోదర చిత్రలీలల నెహో యన నుచ్చరియుచు భక్తి గానవి
ద్యాదయితామతల్లికయు హర్షము చెందఁగఁ బాడి రయ్యెడన్. ౨౮౫

తే॥ తమ్మికంటి ప్రసన్నుఁడై తద్వ్రజాంగ, నలను జేరియు నిట్లనెఁ జెలువలార!
యీరు కోరెడి వరమేదొ యెఱుఁగఁ జెపుడి, యేనొసంగెద నెంతటిదైనఁ గాని.

చ॥ హరి నుడి విన్న యా సతులు హర్షముఁ బొంది మహాత్మ! యారయన్
బరుఁడ వజుండ వాద్యుఁడవు బ్రహ్మవు మన్మథ మన్మథుండ వ
క్షరుఁడవు మాన్యలభ్యుఁడవు కారుణికుండవు భూమిభారసం
హరుఁడవు సర్వనాయకుఁడ వైన నినుం గను భాగ్య మబ్బెఁగా. ౨౮౭

చ॥ జలరుహనేత్ర! మాపయిని జక్కని యక్కటికంబె యున్నచో
జలజము బెత్తమున్ మురళి సంఘటిలన్ నవహాటకాంబరం
బులు దగ మోమునన్ నగవు మొల్కలనెత్తఁగఁ బింఛ మొప్ప భూ
షలు సెలువార సన్నటుని చందమునన్ గనిపించుచుండుమీ. ౨౮౮

తే॥ ఇంతకంటెను బరవరం బెదియువలదు, శ్రీకరా! యన్న నాతఁ డంగీకరించి
హర్షమిడుచుండె సాంఖ్యాదులందలేని, శౌరి భక్తవశుఁడయి చెన్నారఁడొక్కొ?

జాలంధరీగోపికోపాఖ్యానము.

క॥ మఱియును జాలంధరులగు, తరుణుల చరితంబు నుడివెదన్ దీని వినన్
బురుషార్థంబులు గలుగును, బరమును జేకూరునయ్య! బహులాశ్వవిభూ!

తే॥ సప్తశైవలినీతీర సముపగతము, సర్వసంపద్యుతంబు యోజనయుగాన్వి
తంబు సర్వకల్యాణప్రదంబు నైన, రంగనామకపురము వెలుంగుచుండు.

క॥ ధనధాన్యసమృద్ధులతో, ఘనుఁడౌ రంగోజినామ ♦ కప్రభుఁ డా ప
 త్తనమును బరిపాలించుచుఁ, దనయులు మనుమలును గల్గి♦ తనరు నరేంద్రా!

తే॥ ఆతఁడు హస్తినాపట్టణ ♦ పతికి వార్షి,కంబుగా నూఱుకోట్లర్థ్య ♦ దంబులైన
హొరహరిలఁగట్టుచుండును ♦ సాహసాంక, జనకభూవర! వాఁడొక్క ♦ సమయమందు.

తే॥ వార్షికంబగు పన్ను గ♦ర్వంబుఁ జెంది, ప్రభువరుండగు ధృతరాష్ట్ర♦పతికిఁ గట్ట
కుండె దీకొని యాతని♦ దండకుఁ జని, కలిసి మాటాడకుండె న♦కారణమున.

తే॥ హస్తినాపురనేతయు ♦ నాగ్రహించి, శూరవరులైన పదివేల ♦ జోదుల నల
గోపనాయకుండైన రం♦గోజిచెడకుఁ, బన్ను గొనిరండు పొండని♦ పంప వారు.

చ॥ నగరునకుం జొరంబడి నృపాలుఁ ♦ డబ్బతిచేతులకుం దగిల్చియుం
గరముగఁ ద్రాళ్ళతో నతనిఁ ♦ గట్టి నరేంద్రపురంబుఁ జేర్చి వే
చెలఁగ బసనైన పిట్టెరి శ ♦ నిన్ బ్రహరించిరి కాని యాతఁ డా
కరినగమూర్థిశీత కొంక ♦ గన్వాయు నియ్యఁ డదెట్టిదండియో. ౧౧౬

ఉ॥ ఇట్టులఁ గొంతకాలము గ ♦ తింపఁగ నొక్క నిశీథమందు నా
డిట్టి మహాభయంకరము ♦ దీర్ఘము నా కాలిసాలనుండి తా
నెట్టులొ పాఱిపోయి తన ♦ యింటికిఁ జేరెను ధారుణీశ్వరా!
వెట్టలొనర్చు చేఁతలను ♦ శేషుఁడునైన మెఱుంగ శక్తుఁడే? ౧౧౭

తే॥ పిదప ధృతరాష్ట్రుఁ డావార్త ♦ వినియు మరల
నాతనిం గట్టి తెచ్చుట ♦ కతిశయబల
సంయుతాక్షౌహిణీత్రయు ♦ సైన్యముం పె
నంత నది యొక్కగడియలో ♦ నటకు నరిగి. ౧౧౮

క॥ రంగపురాధీశ్వరుఁడౌ, రంగోజిని ముట్టడించు ♦ రాఁగా నతఁడున్
గ్రుంగక యక్షౌహిణితోఁ, బొంగుచుఁ దద్రిపులతోడఁ ♦ బోరఁగఁ జనుచున్.

మత్తకోకిల॥ శాతహేతికృపాణముద్గర ♦ సంచయంబును వైరిపా
దాతికావళిపైని వేయఁగఁ ♦ దత్క్షణంబున వారు త
త్స్వాతరధ్వజతాంగకేతన ♦ శూరులన్ ప్రతిలోన ని
ర్భీతిగాఁ దెగటార్చి గోపకుఁ ♦ బట్టుకట్టఁ దలంచుటన్. ౧౨౦

ఆ॥ రంగపురవిభుఁడగు ♦ రంగోజి కనుఁగొని, యుద్ధరంగము విడి ♦ యునికి కేగి
లేని చలము బలము ♦ బూనుచుఁ గ్రమ్మఱఁ, గొలఁది దినము లాజి♦ సలిపి యవల.

ఉ॥ నాకు బలంబు లేదు మఱి ♦ నమ్మటకుం దగినట్టి సైనికా
నీకము గూడ లేదిలను ♦ నేనిఁకఁ దక్క నటంచుఁ దోడ్తనే
కాంకలమొందు చేసిఁగొని ♦ కగ్గిన వార్తల వ్రాసి దూతతోఁ
బ్రాకట దిగ్విజేత యదు ♦ రాజగు కంసుని కంపె నావలన్. ౧౨౧

ఉ॥ దూత మనోజవంబున య ♦ దుప్రభుసన్నిధి కేగి భక్తితో
జోతల సల్పి యిట్లనియె ♦ శూరవరా! యొక జాబు వ్రాసి మీ
చేతికి నిమ్మటంచు రిపు ♦ సేనలచే వెతఁజెంది మీదు చే
యూఁతను గోరు రంగనగ ♦ రోత్తమనాయకుఁ డంపె నన్నిటుల్. ౨౬౩

ఉ॥ కావున నిట్టి జాబు గొని ♦ గాలివలెన్ జనుదెంచి మా విభున్
బ్రోవుము జాగు మానుము వి ♦ రోధిభయంకరవీర! నీవు దీ
నావనతత్పరుండవు గ ♦ దా యమరాసురమానవాళి ని
ర్జీవముగా నొనర్పవొకొ? ♦ చెప్పఁగలాఁడనె నీ సమర్థతల్. ౨౬౪

ఉ॥ ఆఁకటఁ బీడజెందు నరుఁ ♦ డన్నము జూచెడి మాడ్కి దప్పిచే
నాకులమొందుచుండు జనుఁ ♦ డంబువు గాంచెడిభంగి స్తోకకా
స్తోకము శారదాభ్రము ♦ జూచెడిరీతిఁ జకోరకంబు దో
షాకరుఁ గాంచు నట్లతఁ డ ♦ జస్రము జూచెడి మీదు రాకకై. ౨౬౫

ఉ॥ మీరటు కేగుదెంతురను ♦ మేలిమి వార్తను నాలకించినన్
సూరునిఁ జూచి పద్మములు ♦ శోభను బొందు ముదంబుగాంచిన
ట్లారమణుండు సారెకును ♦ హర్షము జెందఁడె? కంసభూవరా!
శూరవరాగ్రణీ! యనుచు ♦ జోతములం బొనరింప నాతఁడున్. ౨౬౬

తే॥ మానసంబున యోజించి♦మనుజభర్త, కులగురు కోటిదాసప్పాజితోఁ♦గూడికొనుచు
రంగపట్టణపతి యుద్ధ♦రంగమునకు, నేగి రంగోజిఁ గాచెదఁ♦నే నటంచు. ౨౬౭

సీ॥ గోమూత్రసిందూర ♦ గోరోచనా మృగ,నాభిపత్రాంచితా ♦ ననముతోడ
విశ్వభయంకర♦వింధ్యమహీధ్రసా, మ్యాయతోచ్ఛ్రాయ దే♦హాంబుతోడ
నభ్రభారవానుకా ♦ ర్యద్భుత శృంఖలా, క్రమబద్ధ దీర్ఘపా ♦ దములతోడ
శత్రునాశంకర ♦ చాణూరముష్టిక, శలకూటముఖ నిజ ♦ సఖులతోడ

తే॥ భీకరంబగు కువలయా♦పీడకరిని, నెక్కి మదధారలున్ నేల ♦ యెఱ్ఱగాగ
గండపుటముల వెంబడిఁ♦గాఱ వెడలి, రంగపురి కేగె రిపులతోఁ♦రణము జేయ.

క॥ పదపడి యదుకురువీరులు, మదమునఁ గుంతత్రిశూల ♦ మార్గణశస్త్రిం
శదళములను బలుభంగులఁ, గదనంబును సల్పిరి జన♦కధరాధరా! ౨౬౮

ఉ॥ అత్తతి బాణసంతమస ♦ మావహ భూమిని గ్రమ్మఁ గంసుఁడున్
గత్తళమొందు వేసికొని ♦ కాఱడవిన్ జను చిచ్చువోలెఁ బే
రెత్తిన ముద్గరంబు గొని ♦ యేడ్తెఱఁ గౌరవసేనఁ జొచ్చి ప
ల్లుత్తునియల్ బొనర్చెఁ బవి♦తో హరి కొండలఁ గొట్టినట్టులన్. ౨౭౦

క॥ యదుకపి పదపడి పదముల, నెదురుల యరదములఁ గూల్చి యిభములఁ దనదా
మదకరిచేఁ ద్రొక్కించియు, సదమదముం జేసి తురగ ♦ జాలముఁ దోడ్తోన్. ౨౭౧

ఆ॥ వె॥ వైరివరుల దివికిఁ ♦ బాఱవైచియుఁ దిరి
గొనుచుఁ బరిహసించి ♦ గొడుగు లెక్కు-
యముల ఛత్రచామ ♦ రముల, నరాతుల
మూఁపులందుఁ బెట్టి ♦ మోయు మనియె. ౨౭౨

సీ॥ ఘంటికానిస్వన ♦ క్రసుగజంబుల, గోటమీటెడి వ్యోమ ♦ కుత్సితుండు
పశ్చిమాంఘ్రిద్వయ♦బలమున మాఁపులన్, ఘుటలఁ ద్రోయును కేశి♦కర్బురుండు
సాళ్వరథంబులన్♦హస్తంబులనుబట్టి, యట్టిటుల్ ద్రిప్పు వృ♦షాసురుండు
ముష్టిబలంబున ♦ మొనకాండ్రతలలపై, మొట్టికాయలవేయు♦ముష్టికుండు
తే॥ మఱియు నానావిధంబులన్ ♦ మనుజభక్ష
కులగు దైత్యులు చెలరేగి ♦ కలనులోన
జంపుచుండుట మిగిలిన ♦ శత్రుసైని
కులు గనుంగొని పరుగిడి ♦ రులుకుఁ జెంది. ౨౭౩

ఉ॥ ఆజి భయంకరుండయిన ♦ యా యదువీరుఁడు శత్రుసేన లా
యోజఁ బరుంగిడన్ సలిపి ♦ యుద్ధము మాని స్వకీయసైన్యవి
భ్రాజితుఁడౌచు దుందుభులు ♦ బల్మఱు మ్రోయఁ గుటుంబయుక్తరం
గోజినిఁ గొంచు నామధుర ♦ కుం జనె మిత్రులు మెచ్చ నిచ్చలున్. ౨౭౪

చ॥ అల ధృతరాష్ట్రభూమివిభుఁ ♦ డాత్మపరాజయ మాలకించి యో
ధుల నిసుమంతె దూఱి రిపు ♦ దుర్భర దోర్బల గర్వభంగమున్
సలుపఁగ నిశ్చయించుకొని ♦ చక్కని కాలము గుత్తెఱుంగఁగాఁ
బలుమఱు వేగులన్ బనిపి ♦ వార్తలెఱుంగుచునుండె భూవరా! ౨౭౫

తే॥ అంతఁ గంసుండు గోకులం♦బందు బర్హి,షదమనెడిపురి రంగోజి♦యదువిభునకు
నిడఁగ నాతండు గైకొని♦యెలమితోడ, వాసమును జేసె నిజకుటుం♦బమునుగూడి.
తే॥ ఈరహిన్ గొన్ని దివసంబు♦లేగ నతని, లలనలందున జాలంధ♦రులును హరి వ
రమునఁబుట్టి మనోజ్ఞలై ♦విమలమతుల, గోపకులఁ బెండ్లియాడియుఁ♦గోర్కితోడ
తే॥ జారధర్మంబుఁ జేపట్టి♦చక్రపాణి, తోడ స్నేహించి రద్దానఁ♦దోయజాక్షుఁ
డట్టి బృందావనంబున♦నాసతులను, రాసములఁ దేల్చెఁ జైత్రిక♦మాసమందు.

సముద్రకన్యకాది గోపికోపాఖ్యానము.

వ॥ మఱియు నాగోకులంబునందు శోణపురాధీశ్వరుండును, శ్రీమంతుండును, ధీమంతుండును, నీతిమంతుండును, సర్ధవంతుండును, బలవంతుండు నగు నందుండను గోపకుండైదువేల యతివలం బెండ్లాడి యింద్రభోగంబు లనుభవించుచుండ నతని సతులయందు శ్రీమత్స్యమూర్తి వరంబున నపాంపతి సముద్భవలగు ముగుదలును, బృథ్వీదోహనంబునఁ జిత్రవిచిత్రౌషధులును, బృథువరంబున బర్హి

వ్మతీపురభామినులును, నరనారాయణమహామునివరంబున నచ్చరలును, వామను ముని వరంబున సుతలనివాసినులగు విలాసినులును, శేషుని వరంబున నాగకన్యక లుద్భవిల్లిరి. అవ్వారలకు మహాయోగిపుంగవుం డగు దుర్వాసుం డత్యద్భుత మహిమోపేతంబును, వాంఛాప్రదంబును నగు యమునాపంచాంగం బను మహామంత్రంబు నుపదేశింపం దల్లతాంగులు శ్రీకృష్ణప్రీత్యర్థంబై నిశ్చలభక్తిని నందనందనమహిషియగు నా కళిందనందనను బూజించి యామంత్రం బుపాసింపం దద్ధునీశ్వరి ప్రసన్నయై యడిగిన వరంబుల వారి కొసంగె. తదనంతరము సుదనమోహనుండగు నా శ్రీకృష్ణుండు మాలతీమల్లికాపారిజాతకేతకీపద్మాదినానావిధకుసుమపరిమళభరితంబును, కోకిలపుంస్కోకిలకోకకేకిశుకపికముఖవిహంగాలిస్వనమనోహరంబును, మధుపధ్వనిమధురంబును, కాళిందీజలకల్లోలకోలాహలసమాకులంబును, వసంతలతికామనోహరంబును, జగత్పవిత్రంబును, బవిత్రంబును గల్యాణకరంబు నగు బృందావనంబందు మలయమారుతంబు వీచుచుండ నవ కల్పవృక్షాంతికంబునం జెలంగు కదంబతరుమూలంబున నానాటికిం బ్రవర్ధమానం బగు మధుమాసంబునందు మోహపాశబద్ధంబును, గోపికామనోరథాయమానంబు నగు కేళికోత్సవం బారంభించె. అంత నాయింతులా యనంతునితోఁ దత్కేళిని బొందినవారై సంతుష్టాంతరంగలైరి. అత్తఱి రాధాసహితుండగు కృష్ణుండు గోపికాగణాహంకారమును బాపుటకై తిరస్కరించుచుం దేజరిల్లె. మఱియు నా నాగకన్యకలు బంధప్రముక్తలై పుణ్యం డగు హరినింగూడి తదుత్సవంబు దివిజనేత్రపర్వంబుగాఁ గావించె. మునుపు జనించినదియగు దేవరాజబ్రహ్మర్షివరేణ్యాదులకు దుర్లభుండగు నాభగవానునిగూడు చేసినయట్టి మహిమ యిం తింతయని చెప్పంగలమే? భూపా! పాపహరంబగు గోపికలచరితంబు వింటివి. ఇంక నీవేమి వినవలతువో తెల్పుమని యడుగ నారదునకు జనకుం డిట్లనియె.

తే॥ నారదా! యట్టి గోపీజ♦నమున కల్ల, యనఘుండైన దుర్వాసుం డత్యంత కరుణ
యమసహోదరీపంచాంగ♦మమలబుద్ధి, నిచ్చెనని చెప్పితిని దాని ♦ నిపుడు వినుము.

యమునాపంచాంగము.

మ॥ సదయాంతఃకరణుండ వౌచు యమునా ♦ సౌభాగ్య పంచాంగమున్
య్యదియో దానినెటుల్ జపింపవలెనో ♦ యద్దానిచే నేఫలం
బాదవుం మున్నిది యేరుసల్పిరను స♦ర్వోదంతమున్ బల్కెద
మది యానందమహాసుధాజలధిలో ♦ మగ్నంబుగా నారదా! ౫౦

మ॥ శ్రుతులారన్ విని నారదుం డిటుల వా♦క్రుచ్చెన్ దయన్ దీనిఁ గొం
డితిహాసంబు వచించెదన్ వినుము భూ♦మీశా! యయోధ్యాపురీ
పతియున్ రాజవరుండు దివ్యధనయుక్♦ బాహాబలాఢ్యుండు న
న్మతిమంతుండును సత్ప్రవర్తకుండు నౌ♦ మాంధాత నా నొప్పెడిన్. ౫౧

ఉ॥ ఆ యనఘుండు వేటకయి ♦ యాత్మగృహంబును వీడి కాననుఁ
జాయఁగఁ జేరి తిర్గ వల ♦ సౌభరినామక మౌని యాశ్రమం
బాయతబృందకావనము ♦ నందుఁ జెలంగుట గాంచి మెల్లఁగా
నాయెడ కేగి యల్లుఁడగు ♦ నామునికిన్ నతిజేసి యిట్లనెన్. ౨౮౩

శా॥ మౌనీ! నీవు పరావరజ్ఞుఁడ వనా ♦ మాన్యుండ వార్యుండ వ
జ్ఞానాంధాన్విత లోకభాస్కరుఁడవో ♦ జామాత! యీవిప్పు డె
ద్దానన్ రాజ్యసుఖంబులన్ జెలఁగి యీ ♦ దైత్యారి సారూప్యమున్
సానందంబుగఁ జెందఁ జాలుదునొ నా ♦ కద్దాని వాక్రువ్వుమా! ౨౮౪

క॥ అనవుడు సౌరభి యిట్లను, వినతారక లెంతకాల ♦ మెసఁగెడినో యం
దనుకను రాజ్యంబిడి తుద, వనమాలినిఁ జేర్చు యమున ♦ పంచాంగంబే.

క॥ వివరించెద నని వినుమా, స్తవ పటల సహస్రనామ ♦ సరణి కవచముల్
గవిసిన నది పంచాంగ మ,ని విబుధు లనుచుందురు తర ♦ ణికులశశాంకా!

తే॥ అనఁగ మాంధాత క్రమ్మఱి ♦ నడిగె నిట్లు, సౌభరీ! యమునా కవ ♦ చంబుఁ దెలుపు
మది యనుష్ఠింతు భక్తితో ♦ ననఁగ మునియు, మఱియు నిట్లనె నతనికో ♦ మానవేంద్ర!

తే॥ సర్వరక్షాకరంబును ♦ సకలశుభద, మైన కాళింది కవచంబు ♦ ననెద వినుమ!
యాగ్రజుండు చతుర్భుజ ♦ పబ్జనయన, స్యందనస్థను శ్యామను ♦ యమునఁ దలఁచి.

తే॥ శ్రీ వలిసి యందు వేకువన్ ♦ జలక మాడి, సిగను ముడిచియుఁ బూర్వది ♦ క్కుగఁగు శాస
నమునఁ గూర్చుండి సంధ్య స ♦ క్రమముగాను, సల్పి యమునాకవచమిద్ది ♦ చదువనగును

యమునా కవచము

సీ॥ మా యమునా స్రవంతి శీ ♦ ర్షము రక్షించుత, కృష్ణ కన్నులను ర ♦ క్షించుఁగాత
శ్యామయు భ్రూదేశ ♦ మోముత నాసికన్, స్వర్గవాసినియుఁ గా ♦ పాడుఁగాత
గాపల రక్షించు ♦ తన్ మోదరూపిణి, హృది మహానదియు ర ♦ క్షించుఁగాత
జక్రివామాంసజ ♦ శ్రవణముల్ ప్రోచుత, గాళింది యధరముల్ ♦ గాచుఁగాత
రవిసుత చిబుకంబు ♦ రక్షించుతన్ యమ, భగిని కంధరము గా ♦ పాడుఁగాత
కృష్ణ ప్రియాంగన ♦ పృష్ఠంబు ప్రోచుతన్, భుజముల్ దటినియుఁ ♦ బ్రోచుఁగాత
నూరుపుల్ రంభోరు ♦ వోముతన్ జానువుల్, పాదభేదినియుఁ గా ♦ పాడుఁగాత
ఘుటికలన్ బ్రోచుత ♦ గోకులేశ్వరి, కలుషహారిణి కాళ్లఁ ♦ గాచుఁగాత
నంతర్బహిరూర్ధ్వ ♦ మాదిమపదికలన్ బ్ర, పూర్ణతమప్రియ ♦ ప్రోచుఁగాత

తే॥ సర్వదా సర్వథా సర్వ ♦ సమయములను, జక్కఁగాఁ బ్రోచుగావుత ♦ సకలలోక
మాత మాతల్లి మాకిట్ల ♦ ప్రీతితోఁ బ్ర,సన్నయై ప్రమోదంబు లం గొని ♦ సాకుగాత.

క॥ ఇది యమునాకవచంబును, బదిమాఱులుఁ బరమభక్తిఁ ♦ బఠియించిన య
ట్టి నరుఁడు పలు ధనము ప,గిది ధనియై వఱలి కడకుఁ ♦ గేవలముందున్. ౨౮౫

తే॥ బలియు బుద్ధిమంతుఁడు నైన ♦ బ్రహ్మచారి
నియతితో మితాశనుఁడయి ♦ నెలలు మూఁడు
జరుగునందాఁక దీనిని ♦ జదువ నాతఁ
డఖిల రాజ్యాధిపత్యంబు ♦ నందఁ గలఁడు. ౨౯౨

తే॥ మూఁడు నెలలలో నిశ్చల♦బుద్ధి నిద్ధి, నూటపదితడవలు నుంచి♦చోటునందుఁ
జేరి చదివిన వారికి ♦ సిద్ధిగాని,విషయ మేదియు నుండదో ♦ విమలచరిత! ౨౯3

తే॥ ఎవఁడు ప్రొద్దున మేల్కాంచి ♦ కృష్ణదర్శ,నాదికారణమగు దీని ♦ నధికభక్తిఁ
జదువునో యాతఁ డైహిక♦సౌఖ్యములను, జెంది గోలోకమున కేగి♦చెన్నమీఱు.

తే॥ అనఁగ మాంధాత యిట్లనె ♦ యమునయొక్క
సర్వసిద్ధికరంబగు ♦ స్తవముఁ బలుకు
సౌభరీ! యన్న నాతఁడా ♦ జన విభునకు
స్తవము నుడువంగఁ దొడఁగెనో ♦ జనకరాజ! ౨౯౫

యమునాస్తోత్రము.

తే॥ పద్మనాభవామాంససం♦భవకుఁ గొల్చు, కృష్ణకాంతకుజోతంబు శ్రీ♦కృష్ణరూపి
ణికి జోహారున్న కాళింది ♦ నిర్గరిణికి, జాగిలిఁ భక్తిఁ గోదుత ♦ సల్పుచుంటి.

క॥ నిలుగు సుజనులకుఁ గూర్చెడి, తులువలు కాముకులునైన ♦ గుష్టులు స్వేచ్ఛ
క్తులుగానైరేఁ వారిని, సలలితమతి సాకు నీకు ♦ సల్పెదఁ బ్రణతుల్. ౨౯౭

తే॥కృష్ణ! కృష్ణస్వరూపవు♦పృథుతరంగ, ములను గూర్మినతారుఁడు♦నెలఁగుచుండుఁ
బ్రబలయమునమత్స్యమూర్తివై ♦నిలుతువు ప్రతి,బిందువందుగోవిందుఁడు♦వెలుఁగుచుండు

శా॥ అమ్మా! దేవపురుల్ యథాయథలుగా ♦ నబ్జోద్భవాండంబు ఖం
డమ్ముల్ గాఁగ గిరీంద్రభూమిరుహాకు ♦ ద్యశ్రేణిదుర్గోరుకూ
లమ్ముల్ గూల జవంబునన్ విరజ ను ♦ ల్లంఘించి లోకమ్ముఁ బూ
తమ్మున్ సల్పుచుఁ బాఱుచుంటివి వినె జో ♦ తల్ నీకు లీలావతీ! ౨౯౯

శా॥ ఫుల్లాబ్జాయతనేత్ర వామభుజసం ♦ భూతా! విభూతీశ్వరీ!
తల్లీ! గోపకగోపికాసురభివ ♦ త్సశ్రేణిసంరక్షణా
భ్యుల్లాసా! యరవిందమిత్ర తనయా! ♦ పూతా! జగన్మోహినీ!
కల్లోలాకర! మేఘవర్ణరుచిరా! ♦ కావింతు నీకంజలుల్. 300

ఉ॥ జీవనజోత్పలాది బహు ♦ చిత్రసుమంబులఁ జూత నారికే
ళావనిజంబులన్ మిగుల ♦ హర్షము గూర్చెడి తీవెలన్ బ్రమో
దావహమైన కుంజముల ♦ నందముఁ జెందెడి బృందకావనిన్
శ్రీవిఁ దలిర్పఁ జేరుచుఁ గ ♦ డిందిగ మెచ్చెడి నిన్నుఁ గొల్చెదన్. 30౧

సీ॥ కోవిదసన్నుత! ♦ గోలోకమున నీవె, యుత్తమపై సత ♦ ముందువమ్మ!
భూధారంబులో ♦ పాపాఖువ్రులకెల్ల, దర్వీకరంబవై ♦ తనరితమ్మ!
గోవిందసంగత ♦ గోపకగోపికా, కుర్దనకలితవై ♦ కుదిరితమ్మ!
జలతోలకల్లోల! ♦ సంచయ కోలాహ,లాంచితవై లలి ♦ నలరితమ్మ!
ఆ॥ సకలజగములందు ♦ సౌందర్యవతివమ్మ!, సుమతివినుతవమ్మ! ♦ విమలరూప
సమ్మ! యాదిదేవు ♦ నర్ధాంగివో యమ్మ!, నిన్ను నమ్మియుంటి ♦ నన్నుఁ బ్రోచు.
కం॥ యమునా నామముఁ దాల్చిన, నమరులు మీపేరుఁ దలఁచి ♦ యఘవగములఁ జూ
ర్ణము గావి తురు తల్లీ!, యమభగినీ! భక్తి నిన్ను ♦ నారాధింతున్. ౩౦౩
ఆ॥ నీను సన్నమైన ♦ యా కృతాంతుండును, నిన్ను దలఁపనట్టి ♦ నీచజనుల
సగిఁ గొట్టగ ప్రబ ♦ చండనాముండయి, దండముఁ గొని పురిని ♦ మెండు దిరుగు.
తే॥ విషయభోగముల బడి ♦ వెతలఁ గుడిచి, వేమఱున్ విసువొందెడి ♦ వెఱ్ఱుల పయి
నీ కటాక్షరజ్జువు బద్ధ ♦ నిముసముననె, లేచి వారు కేవలమును ♦ జూచుచుండ్రు.
తే॥ శ్రీవిరాణ్మూర్తి విస్తృత ♦ శీర్షమందు, వేణిరూపకమాలగా ♦ వెలుఁగుచుంటి
వమ్మ! నీగుణముందు నా ♦ వంతయేని, శేషుఁడున్ వర్ణనంబును ♦ జేయఁగలఁడె?
తే॥ ఇట్టి నీప్రభావమతి ♦ నెచట నెచటఁ, బాడుచుందురో యందందు ♦ వఱలు నరుల
భాగ్యమేమని చెప్పనౌ ♦ భానుతనయ!, మోదములొసరింతుఁ గైకొని ♦ ప్రోవవమ్మ!
తే॥ ఇట్టి యమునాస్తవంబును ♦ నేజనుండు, వేకువను లేచి పూర్వోక్త ♦ విధిగ భక్తి
జపము నొనరించు జగతికి ♦ సౌఖ్యమొసఁగి, భోగములఁ బొంది గోలోక ♦ మునకు నరుగు.

యమునా పటల పద్ధతులు.

వ॥ అనవుడు మాంధాత యానందించి మహాత్మా! యనుగ్రహించి కామ ప్రదంబులగు కాళిందీపటల పద్ధతులను బోధింపవేఁడితి నన నమ్మునివరుండు వినిజనవరా! తద్యమునాపటలంబున కాదియందుఁ బ్రణవంబును జేర్చి మాయాబీజం బుద్ధరించి రమాబీజం బనుసంధించి కాళిందీదేవి యనుదానిని జతుర్థ్యంతంబుగాఁ జేసి దానికి నమశ్శబ్దంబు గూర్చిన మహామంత్రంబగు. తన్మంత్రం బేకాదశలక్షావృత్తులు జపించిన సిద్ధించి వాంఛాప్రదంబగు శుభకరంబగు నొక్క సింహాసనంబున షోడశదళపద్మంబును వేసి మధ్యభాగంబునఁ గర్ణికను జిత్రించి యమునాసహితుండగు శ్రీకృష్ణుని మనోహరంబుగా లిఖించి పూర్వోక్తకమలంబునందలి షోడశదళంబులందు గంగా, విరజా, కృష్ణా, చంద్రభాగా, సరస్వతీ, గోమతీ, కౌశికీ, వేణీ, సింధు, గోదావరీ, వేదస్మృతీ, వేత్రవతీ, శతద్రు, సరయూ, ఋషికుల్యా, కకుద్మిను లను నదులను వేఱువేఱుగాఁ దత్తన్నామమంత్రంబులతో షోడశోపచారంబుల నర్చించి క్రమంబుగా దిక్చతుష్టయంబునను బృందావన, గోవర్ధన, బృందా, తులసీ, దేవతలను స్థాపించి, యా మంత్రనామంబులతోఁ

బూజించి భగవతియుఁ గళిందనందినియు, సూర్యసంజాతయు, యమభగినియు, శ్రీకృష్ణ ప్రియయు, యూధీభూతయు నగు యమునకొఱకని మాటిమాటికి నుచ్చరించుచు నావాహనాద్యుపచారంబులం గావించి పైనిఁ దెలిపిన మహామంత్రంబు జపింపందగు. ఇఁకఁ దత్పద్ధతి యెట్టిదనిన తన్మంత్రపురశ్చరణంబు సిద్ధించునందాఁక బ్రహ్మచారియై మౌనంబుఁ దాల్చి యవభోజియుఁగాని పర్ణాశనుండుగాని యై నేలఁ బరుండి యింద్రియంబులను జయించి కామక్రోధాదులఁ దూరీకరించి సమర్థుండగు దేశికుని నేర్పాటుజేసికొని తదాజ్ఞానుసారంబుగా బ్రాహ్మ్యముహూర్తంబున మేల్కాంచి యమునను సన్నుతించి కాల్యంబులం దీర్చి యరుణోదయంబున నద్యాదులందు స్నానం బొనరించి నిత్యంబులగు జపతపంబులఁ నిర్వర్తించి తన్మంత్రం బనుష్ఠింపందగు. మధ్యాహ్నంబగుడు సంధ్యావందనం బొనర్చి నియమపూర్వకంబుగా నుండందగు. తన్మంత్రపురశ్చరణసమాప్తి సమయంబునం బుత్రవంతులగు దశలక్షబ్రాహ్మణులను గంధపుష్పాక్షతాదులతోఁ బూజించి షడ్రసోపేతంబగు మధురాన్నం బిడి జాంబూనదపాత్రాంబరాభరణ దక్షిణల నొసంగి సంతుష్టులం జేయందగు. ఇట్లాచరించిన నామంత్రంబు సిద్ధించి బుద్ధిగతాభీష్టంబులను సిద్ధింపఁ జేయు. సందియ మావంతయు లేదు. నీవు ననుష్ఠించి సర్వసుఖంబులఁ బొందు మని యుపదేశింప నారాజవరుండు, ౩౦౯

ఆ॥ అరుసమొంది ధీర! ♦ యమునా సహస్రనా, మనుతిగూడఁ జెప్పి ♦ మనముఁ బొంగఁ
జేయ వేఁడితి నన ♦ నాయోగి వర్యుండు, వలుకఁ దొడఁగె నిట్లు ♦ పార్థివేంద్ర!

వ॥ భూరమణా! యీమంత్రంబునకు సౌభరిమహర్షియు, యమునదేవతయు ననుష్టుప్ఛందంబును, మాయాబీజము కీలకంబును, రమాబీజంబు శక్తియుగలదు. ఈనామస్తోత్రంబుఁ బఠించుటకు ముందుగా "శ్యామామంభోజనేత్రాం" అను దానితో ధ్యానంబొనరించి "కాళింది" యను నామంబు మొదలు "సర్వతీర్థాధిదేవత" యను నామంబువఱకుంగల వేయినామంబులఁ సక్రమంబుగాఁ జదువనగు. ఇట్టి స్తోత్రం బొకమాఱు సల్పినవాని గృహంబునందుఁ జౌర్యంబును, రెండుసారులు జదివిన వాని కెట్టి ప్రదేశంబున నైనను జోరవ్యాఘ్రాదిభయంబులు గలుగనేరవు. శుద్ధద్వితీయయం దిద్దానిని బ్రారంభించి పూర్ణిమలోపలఁ బదితడవలు పఠించిన రోగి రోగంబునుండియు, బద్ధుఁడు బంధనంబునుండియు విముక్తు లగుదురు. గర్భిణి సుకుమారునిం గాంచు. విద్యార్థి సకలవిద్యలందుఁ గుశలియగు. మోహనస్తంభనోచ్చాటనఘాతనశోషణదీపనోన్మాదనతాపననిధిదర్శనవశీకరణంబులందు నేర్పును మనోగతంబులగు నిష్టంబులను సిద్ధింపఁ జేయు. దీనిని విధివిధానంబుగాఁ బారాయణం బొనరించిన బ్రాహ్మణుండు బ్రహ్మవర్చస్వియు, రాజన్యుండు సర్వరాజ్యాధిపతియు, వైశ్యుండు ధనాధిపతియు నగు. ఇది బ్రాహ్మణముఖంబుగాఁ దన్మహి

మంబు వినిన శూద్రుండును నిర్మలుండై మోక్షార్హుండగు. నిత్యంబును భగవత్పూజాకాలంబున నిద్ది చదివినవాఁ డుదకంబునం దరవిందంబు వొందియు నీరంటనట్లు సంసారమం దుండియుఁ దజ్జనితపాపంబు నంటఁడు. ఇది యొక సంవత్సరంబువఱకు నూరుమాఱులు ప్రత్యహంబుఁ జదివిన సప్తద్వీపవలయితంబగు నిమ్మేదిని నేకచ్ఛత్రాధిపతియై పరిపాలించుననుట కనుమానంబులేదు. నిష్కామియై యెవఁడిది చదువునో వాఁడు పురుషార్థంబులంబొంది జగతిం బేర్వొంది జీవన్ముక్తుండగు. మఱియు నిది సావధానంబుగాఁ జదివినవా రఖిలసుఖంబులం గాంచి యంతిమంబున గోలోకంబున కరుగఁగలరని పలుక నా మాంధాత యాలించి యలరి మునికి నతులిడి నిజరాజధాని యగు నయోధ్యాపురంబున కేగెఁ గాదె! యింకను నీవేమి వినవలతువో తెలుపుమని యడుగ జనకుండు నారదున కిట్లనియె. ౩౧౧

తే॥ పుణ్యవశమున గోకులం ♦ బున జనించి, నట్టి సుదతుల గాథల ♦ నల్ల యర్క
పుత్రి పంచాంగముఁగ విం టి ♦ భూసుర! మఱి, కృష్ణుఁ డందేమి సేసెనో ♦ యెఱుఁగఁ జెపుము!

ప్రలంబాసుర వధ.

ఉ॥ నారదుఁ డద్ది వించు జన ♦ నాథున కిట్లను నొక్కవేళలో
శ్రీరమణుండు భ్రాతయగు ♦ సీరిని గూడుచు గోసమూహముల్
బారులు గట్టి నేత్రయుగ ♦ పర్వముగాఁ జనఁ ద్రోలు చల్ల భాం
డీర వనంబుఁ జేరి యట ♦ నివిగనుండెడి నొక్కచోటునన్. ౩౧౩

తే॥ గోవులను మేయఁ ద్రోలియుఁ ♦ గోఁడెకాండ్రఁ
గలసి వాహ్యావాహక రూప ♦ లలితకేళి
నాడుచుండెను కంసుచే ♦ నంపఁబడిన
యల ప్రలంబ నిశాచరుఁ ♦ డట్టితఱిని. ౩౧౪

ఉ॥ గోపకబాలకుం డగుచుఁ ♦ గుర్గనలాలసుఁడైన వారితో
శ్రీపతి చూచుచుండఁగనె ♦ చేరి ముదంబున నాడుచుండె నీ
రూపల గోపబాలకులె ♦ ఱుంగక పోయి రనంతరంబునం
దా పురుషోత్తముండు గని ♦ యందఱ కయ్యది దెల్పె నత్తఱిన్. ౩౧౫

ఆ॥ ఆటలందుగెల్చి ♦ నట్టి నీలాంబరు, నోడినట్టి కుఱ్ఱఁ ♦ డొకఁడు గూడఁ
బందెమేసికొన్న ♦ భంగి మోయఁగలేక, యుంటఁగను ప్రలంబుఁ ♦ డొప్పికడఁక.

ఉ॥ సీరిని స్వాంసలాంసమునఁ ♦ జేకొని పైనమొనర్చి యట్టి భాం
డీర వనంబు నుండియు వ ♦ డిన్ యమునాతటినీతటంబునన్
జేరిచి యందునుండి మఱిఁ ♦ జెల్వగు శ్రీమధురాపురంబునన్
జేరుట కుద్యమించు తఱి ♦ సీరి గనుంగొని యాక్షణంబునన్. ౩౧౭

చ॥ ఘనసమమైన రూపమది ♦ కంబుగఁ దాల్చి ధరాధరేంద్రు మా
డ్కిని బహుదుర్గముండయి త ♦ టిత్సహితాభ్ర గత ప్రపూర్ణచం
ద్రునివలె దైత్యపృష్ఠమునఁ ♦ దోఁచి వెలుంగఁ దొడంగె దీప్తి దీ
ప్తనవమణి ప్రకాశిత సు ♦ వర్ణమయాభరణంబులన్ మఱిన్. ౩౧౮

ఉ॥ చండపరాక్రముం డయిన ♦ చక్రి సహోదరుఁ డా ప్రలంబుఁ డు
ద్దండభయంకరుం డగుటఁ ♦ దాఁ గని వేగము వానిఁ బట్టి యా
కొండలఁగొట్టు నింద్రువలె ♦ గ్రుద్ది శిరంబును జెండివైచె బ
ల్దండిగఁ బూలవాన విబు ♦ ధప్రతతుల్ గురియంగ భూవరా! ౩౧౯

ఉ॥ అంతట వాని జోతియును ♦ నా బలరామునిలోఁ లయించె న
త్యంత జయధ్వనుల్ దివిని ♦ ధాత్రిని నిండె నరేంద్ర! యన్న భూ
కాంతుఁడు దిర్గి యిట్లు పలు ♦ కం దొడఁగెన్ మఱి వాని పూర్వ జ
న్మాంతర పుణ్యగాథను ద ♦ యామతి నాకు వచింపవే సుధీ! ౩౨౦

ప్రలంబాసుర పూర్వజన్మ వృత్తాంతము.

చ॥ సురముని దిర్గి యిట్లనె య ♦ శోధన! తొల్లిఁ గుబేరుఁ డిందు శే
ఖర పదపద్మపూజకు స్వ ♦ కంబగు చైత్రరథంబు నందునన్
విరులను రక్షసేయఁగఁ బ్ర ♦ వీణతఁ గాంచిన యక్షవర్యులన్
వఱలఁ నొనర్చి నాభటులు ♦ భద్రముగా గనుచుండ రింతలోన్. ౩౨౧

తే॥ ఒక్క దినమందు నేర్పరి ♦ హూహువనెడి, వానికొడుకును శ్రీహరి ♦ భక్తవర్యుఁ
డు నగు విజయుఁడన్ గంధర్వ ♦ జనుఁడు హరిని, వేణువీణాగళంబులన్ ♦ వీధి వీధి.

ఉ॥ స్తోత్రముఁ జేయుచున్ ధనదు ♦ తోఁటను నెవ్వరెఱుంగ నట్లుగా
నాత్రముతోడఁ జొచ్చి విరు ♦ లన్నిటిఁ దిన్నగఁ గోసికొంచు నే
మాత్రపు సద్దులేని యటు ♦ మంచివడిన్ జనె నంతఁదాని నా
చైత్రరథేశ్వరుండు గని ♦ చాల విచారముఁబొంది కిన్కతోన్. ౩౨౩

చ॥ అరరె! యిటుల్ మదీయ వన ♦ మందునఁ జేరి సుమంబు లన్నిటిన్
బొరిఁ బొరిఁ గోసి కైకొనుచుఁ ♦ బోయె నెటో యల తెక్కరీఁడు త
న్నర సుర యక్ష కిన్నర గ ♦ ణస్థితుఁడైన ఘనుండునైన ను
ద్ధురమగు నాదు శాపమునఁ ♦ దోడ్తన రక్కసుఁ డౌచుఁ బుట్టుతన్. ౩౨౪

చ॥ అని శపియించెఁ దద్విధిని ♦ నా విజయుండు నిశాట రూపమున్
దనకు ఘటిల్లుచుండుట న ♦ దాటునఁ గాంచి యకృత్యమెంచి తో
డ్తన యల గుహ్యకేశ్వరుని ♦ దాపునకుం జని తత్పదంబులన్
వినయ విధేయతల్ గలిగి ♦ వేమఱు మ్రొక్కి నుతించి యిట్లనెన్. ౩౨౫

తే॥ తప్పుఁ బొరపాటుచే నిప్పు ♦ తావకోప, వనము నందునఁ జేసితి ♦ ధనద! నేను
రాక్షసాకృతితో ధరఁ ♦ బ్రతుకఁజాలఁ, గాన మన్నించి బ్రోవుమ ♦ కరుణతోడ

తే॥ అనఁగ నా నరవాహనుఁ ♦ డభిమతించి, ద్వాపరాంతము నందున ♦ వాసుదేవు
నన్నయౌ బలభద్రుని ♦ హస్తములను, శాపముక్తుఁడ వగుదువో ♦ సరసహృదయ!

తే॥ అనుచుఁ గరుణించెఁ దత్సూక్తి ♦ నా విజయుఁడు,
దైత్యుఁడై ప్రలంబాఖ్యతోఁ ♦ ధరణిఁబుట్టి
యచ్యుతాగ్రజ హస్త సం ♦ హతుల శాప
ముక్తుఁడై పరమొందె నో ♦ పుణ్యపురుష! ౩౨౯

కృష్ణుండు దావాగ్నిని మ్రింగి గోపకులను రక్షించుట.

తే॥ పిదపఁ గొల్లలాలసులగు ♦ పిల్లవాండ్రు, ఘాస లోభంబునఁ ముంజ ♦ కాననమున
కరిగి మేసెడి నాత్మీయ ♦ సురభి తతుల, ద్రోలుకొని రాఁగఁ దెరువ ♦ తోడఁజేగి.

సీ॥ మన్మథ దేవుని ♦ మన్ననఁ గల్పు ము, క్కంటిదౌ మూఁడవ ♦ కన్ను నంగ
భగ్గుభగ్గనమండి ♦ మొగ్గుల మిక్కిలి, కలిగించెడి బడబా ♦ నల మనంగ
నంభోధిమంథన ♦ మందు నొక్కుమ్మడి, బైలుదేరిన విష ♦ జ్వాల లనఁగ
సర్వలోకంబుల ♦ క్షణములోన దహించు, ప్రళయ కాలాభీల ♦ వహ్ని యనఁగ

తే॥ ఘోర భీకర మైనట్టి ♦ కారుచిచ్చు, పుట్టి తన్మహారణ్యంబుఁ ♦ జుట్టుముట్టి
కాల్చుచుండుటఁ గనుఁగొని ♦ కాతరులయి, యేమితోఁచక యెలుగెత్తి ♦ యిటుల ననిరి.

మ॥ అదిగో దావము చిట్పటార్భటులతో ♦ నంతంతకున్ మమ్ములన్
గదియన్ సాగె ధృతోరుకౌస్తుభమణీ! ♦ క్ష్మారాజచూడామణీ!
త్రిదివేశేశ్వరరక్షణప్రియమణీ! ♦ దీనాళి చింతామణీ!
స్వదయార్ద్రాఘభుజంగగారుడమణీ! ♦ చక్రాదిపాణీ! గుణీ! ౩౩౧

తే॥ కృష్ణ! కృష్ణ! కృపాకరా! ♦ కీర్తనీయ! మమ్ము దావాగ్ని కసితోడ ♦ మంటఁ గలుప
వచ్చెడిని నిన్ను శరణంబుఁ ♦ జొచ్చుచుంటి, మయ్య! చయ్యన రక్షింపు ♦ మియ్యెదనుకన.

చ॥ అనఁ గరుణాళువం డయిన ♦ యచ్యుతుఁ డిట్లనె నన్నలార! మీ
మనముల భీతి వీడి యొక ♦ మాఱు కనుంగవ మూయుఁడీ! యన
న్వని యల గోపబాలురు స్వ ♦ నేత్ర యుగంబును మూసి రంత నా
వనజదళాయతేక్షణుఁడు ♦ వహ్ని దహించెడి చోటు జేరుచున్. ౩౩౩

చ॥ జలమును గ్రోలు పోలికను ♦ సాదపు ముద్దను మ్రింగు భంగిగా
నలయుముగా దహించెడి ద ♦ వంబు గుటుక్కున మ్రింగె నింగి వే
ల్పులు దమ్మవేళ్ల నాసికల ♦ నూపి విచిత్రముఁ బొందుచుండ మి
త్రులు నులు కాత్మలన్ విడిచి ♦ తోషముఁబొంద బలుండు మెచ్చఁగాన్. ౩౩౪

మ॥ తరువాతన్ మునివర్యుఁడైన హరి యా ♦ దానంబుఁ బోకార్చి త
త్సురభిప్యాహారగోపబాలకులతో ♦ సూర్యాత్మజాతీరభా
సురభాండీరమహావనస్థపృథులా ♦ శోకాటవిం జేరి సం
బరమొందెన్ జనకా! మహాత్ములకు నే ♦ భావంబు సిద్ధింపదే? ౩౩౭

ఉ॥ అంతన గోపబాలకులు ♦ నాఁకట దప్పిని బీడఁ బొంది బ
ల్డింది బలాన్వితాచ్యుతుని ♦ తెన్నుగ వందనముల్ బొనర్చి తా
రందరు జేరి వేఁడి రిటు ♦ లక్కటా! దూపను తుత్తుచే వ్యథల్
జెంది నశింపనుంటి మిఁకఁ ♦ జెచ్చెరఁ బ్రోవుము! నందనందనా! ౩౩౮

తే॥ అంత సోకుమారాలఁగొంగ ♦ యుంచుల కుర, రీకరించియు వారికీ ♦ రీతిఁ బల్కె-
మాధురులగు బాపలతోడ ♦ మఖము నంగి, రసుఁ డొనర్చెడి నీచెంత ♦ రయమునఁ జోడ.

ఉ॥ అచ్చటి కేగి బ్రాహ్మణుల ♦ కందఱకున్ గిడిగిప్ప భక్తితోఁ
గ్రచ్చఱ సల్పి యన్న ముద ♦ కంబుల నడ్గుము పొందనంగ వా
రచ్చట నుండి పైనముయి ♦ యా మునివర్యుని యజ్ఞవాటికన్
జొచ్చి విధేయులై మిగుల ♦ జోత లొనర్చి వచించి రిట్టులన్. ౩౩౯

ఆ॥ విప్రవర్యులార! ♦ యప్రమేయుండగు, గోకులేశసుతుఁడు ♦ గోపబాల
కులను గూడి గోత ♦ తులఁ దమిఁ ద్రోలు చ, శోకవునడి నకి ♦ సొరిది వచ్చె

క॥ అతఁడు నాతని భ్రాతయు, నాతనితోఁ దిరుగు ♦ లాండ్డెసీ మిత్ర
వ్రాతము లన్నోదకముల, నాతురులై బంధువలన ♦ నవి మీరిగుఁడీ! ౩౪౦

ఉ॥ వారల కుయ్యినిన్ విని స ♦ వక్రియలన్ నెరవేర్చు భూసురుల్
వారికి నిట్లు వాకొనిరి ♦ బాలకులార! ముదంబుతో నిటన్
వారిని గాని యోదనము ♦ పట్టెడుగాని యొసంగు వీలు మా
కేరహిఁ గల్గలేదని వ ♦ చింపఁగఁ జింతిలుచుంటి మక్కటా! ౩౪౧

శా॥ అంతన్ వారు నిరాశులై యల సరో ♦ జాక్షున్ మఱిన్ జేరుచున్
జింతాక్రాంతమనస్కులై యనిరిటుల్ ♦ శ్రీకృష్ణ! నీ యానతి
న్జింతాకంతయు దాఁటకుండ మఖమున్ ♦ నేమంబుతోఁ జేయు వే
దాంతార్థప్రథితాగ్రజన్ములను మే ♦ మర్థింప నన్నాంబువుల్. ౩౪౨

క॥ ఏమియు లేవని వాకొని, రామీఁదట మీకు దరికి ♦ నసుదెంచితి మిం
కేమెటు బ్రతుకంగలమో, యీమెయి నుడువంగవలయుఁ ♦ దృష్ణన్ గృష్ణా!

క॥ నావుడు వారికి నిట్లనె, శ్రీవిభుఁడో బాలులార! ♦ చెచ్చెర నలభూ
దేవుల భార్యల చెంతకు, నీవేళన పోయి యడిగి ♦ యిచ్చెలఁ గనుఁడీ! ౩౪౪

క॥ ఈతడవకు నామాటను, బ్రీతిగ విని పొందనంగఁ ♦ బిల్లలు మతి యు
త్పాతోన్మూలనపటుసవ, మాతతముగఁ జేయు నక్క ♦ రంగియు నంమన్.

చ॥ చెలఁగెడి ధాత్రిదేవతల ♦ చెల్వల మ్రొక్కుచు నమ్మలార! గో
కులపతిపుత్త్రకుండు నవ ♦ కోటిసుధాకరసుందరాస్యుఁడుఁ
జలదనిభుండు పుష్పశర ♦ సామ్యమనోహరవిగ్రహుండు నా
జలజదళాయతాక్షుఁడు వ్ర ♦ జస్థలినుండి వయస్యయుక్తుఁడై. ౩౪౭

ఉ॥ గోవులఁ ద్రోలుకొంచు ఖగ ♦ గుల్మలతాపరిపూర్ణమౌ యశో
కావనిజాభిరామవని ♦ కాగతుఁ డయ్యెను నందునున్న మి
త్త్రావళితోడ క్షుత్తృషల ♦ నక్కలిఁ బొందెడి దాన మీరు మా
కేపిధనైన జలాన్నముల ♦ నిండిఁకఁ ద్రోయకుఁ డన్నదుక్తులన్. ౩౪౮

మ॥ అని వేఁడన్ ధరణీసురాంగనలు దా ♦ మాలించి యాకుఱ్ఱలన్
గని యో బాలకులార! మీరిపుడిటన్ ♦ గాంక్షించు నన్నాంబువుల్
గొనుఁడీ! యట్టి మహామహుం గనుటకై ♦ కోర్కుల్ ఫలింపంగ మే
మును రానెంచితి మంచు వారి కిడి ర ♦ ప్యంబువ్వ లవ్వారిగాన్. ౩౪౯

చ॥ పదపడి బాలకుల్ సనిరి ♦ బ్రాహ్మణభార్యలు బైలుదేరి స
మ్మదమునఁ దన్మహాటవిని ♦ మన్మథమన్మథు సాగ్రజన్ముఁ గృ
ష్ణుఁ దసివి లీల విన్నవిధిఁ ♦ జూచితిమం చరుసంబుఁ బొంది త
త్పదములకున్ నమస్కృతుల ♦ భక్తిని బల్మ యొనర్చియుండుడున్. ౩౫౦

తే॥ తెమ్మికంటియుఁ గన్గొని ♦ తన్వులార!, మీర లిటకు నేతెంచుటల్ ♦ మేలుసుమ్మి
వల్లభులతోడఁగూడి ప్రా♦పంచిక సుఖ,ములను జెంది గోలోకంబుఁ♦బొందఁగలరు

క॥ అని వరమిడ నతులిడి వా,రు నశోకవనమ్మునుండి ♦ త్రుటిలో నాత్మీ
యనిలయములకున్ జనుదెం, చినఁ గని తత్ప్రియులు నెదలఁ ♦ జింతిలి రిట్టుల్.

తే॥ సరసిజాక్షునిఁ గనిన మా♦తరుణిమణుల,జన్మములె సార్థకంబులు♦సత్య మల్ల
కంసభయమున శౌరినిన్♦గనని మాదు, జన్మ మేటికిఁ గాల్పనే♦జగతియందు.

ఉ॥ పిమ్మట నందనందనుఁడు ♦ పిల్లలు దెచ్చి యొసంగు నన్నతో
యమ్ముల మిత్త్రసోదరస ♦ మన్వితుఁడై భుజియించి గోసమూ
హమ్ములఁ ద్రోలుకొంచు హృద ♦ యంగమమౌ నల బృందకాటవిన్
కమ్ముగఁ జేరె నో యుపని ♦ షద్విపులార్థవిదగ్రణీ! గుణీ! ౩౫౩

శ్రీకృష్ణుండు గోపకులకు వైకుంఠలోకంబు జూపుట.

సీ॥ పాపహారమగు మఱి యొండు ♦ శ్రీపతికథఁ
జెప్పుచుంటిని విను మార్య! ♦ శ్రీకరంబు
నఘహారంబును బరమంబు ♦ నఖిల శుభద
మైన యేకాదశీవ్రత ♦ మాస్థతోడ. ౩౫౪

ఉ॥ గోకులనాథుఁ డొక్కతఱిఁ ♦ గోర్కి ఫలింపఁగఁ జేసి ద్వాదశిన్
వేకువలేచి గోపవరి ♦ వేష్టితుఁడై యమునా ధునీమణిన్
వీఁకను జొచ్చి క్రుంకులిడు ♦ వేళను నప్పతిసేవకుం డు గ
ద్గోకులనాథు రజ్జువుల ♦ తోఁ బిగఁగట్టె మహాజవంబునన్. ౩౫౬

తే॥ వరుణలోకంబునకుఁ గొని♦పాఱె నవల, గోపకులను గోలాహల♦మాపఁజాల
నట్టు లయ్యెను బిమ్మట♦నచ్యుతుండు, వారి నూరార్చి ముట్టె యా♦వరుణపురిని. ౩౫౭

చ॥ పరువమతిన్ మదేభముల ♦ వాజులఁ దేరులఁ గేతనంబులన్
బరిఖల దుర్గవప్రములఁ ♦ బత్తుల భర్మమయోరుహర్మ్యముల్
బొరిఁబొరి బూదిలోఁ గలిపి ♦ మూలను డాఁగిన పాఱఁబట్టగా
నరిగెడివేళ నా వరుణుఁ ♦ డంజలులన్ ఘటియించి యిట్లనెన్. ౩౫౮

ఉ॥ కోపము మానుమయ్య! యను ♦ కూలపథంబున నుండుమయ్య! మా
రూపినయంత మీ మొద న ♦ నుత్తమరీతి వసింతుమయ్య! మే
మోపరిఁ జేయు తప్పులను ♦ నెంతయు నీవు క్షమింపుమయ్య! యో
శ్రీపతి! నీ పదంబులకు ♦ శీర్షములో నతులం బొనర్చెదన్. ౩౫౯

క॥ గోపీకుచాలచోరా!, గోపీకేళీవిలోల! ♦ గోపీనాథా!
గోపకరాజకుమారక!, గోపకవంశాబ్ధిచంద్ర! ♦ గోపాలమణీ! ౩౬౦

మత్తకోకిల॥ శిష్టరక్షక! దుష్టశిక్షక! ♦ చిత్రఖేలనలోలుపా!
యష్టదారమనోహరా! పృథు ♦ లాదితేయగణప్రియా!
యష్టమూర్తినుతప్రభావ! య ♦ హస్కరార్బుదతుల్య! మా
కష్టముల్ దొలఁగంగఁ జల్లగఁ ♦ గావుమా! కమలేశ్వరా! ౩౬౧

శా॥ బ్రహ్మాండేశ్వరు బ్రహ్మనాథు ననఘున్ ♦ వందారు మందారునిన్
బ్రాహ్మణ్యాంఘ్రిసరోజరాజివినతి ♦ ప్రారంభ ధన్యాత్మునిన్
బ్రహ్మానందమయున్ నిరామయుని శ్రీ ♦ రాధామనోచోరుఁ ద
ద్బ్రహ్మానిర్వచనీయుఁ గృష్ణుని నినున్ ♦ బ్రార్థింతు విశ్వంభరా! ౩౬౨

చ॥ అని పొగడంగఁ జక్రధరుఁ ♦ డాగ్రహమున్ విడి సుప్రసన్నుఁడై
మనమున భీతి మానుము సు ♦ మాళముగా మను మోయి పాశి! యీ
పనులిఁకఁ జేయకుండుమని ♦ పల్కుచు నందుని త్రాళ్ళు విప్పి తో
డ్కొని యమునాతటిన్ వెలుఁగు♦గోపకసన్నిధిఁ జేర్చె నంతటన్. ౩౬౩

ఉ॥ నందముఖంబునన్ వనజ ♦ నాభు ప్రభావము గోపకుల్ మహా
నందము గల్గఁగా వినియు ♦ నమ్మఁగఁజాలక నందనందనున్
దొందరతోడ డాయుచు మ ♦ ధుస్రవదుక్తులఁ బల్కి రిట్లు గో
విందపదారవిందయుగ ♦ వేష్టన జృంభితబంభరోపమా! ౩౬౩

తే॥ నీరజాతాయతేక్షణా! ♦ నిశ్చయముగ, నీవు భగవంతుఁడవె? యైన ♦ నీకు డెంకి
యైన వైకుంఠలోకంబు ♦ నఱమరలను, విడిచి చూపింప వినుతిఁ గా ♦ వింతు మిపుడు.

క॥ అంత ననంతశయానుఁడు, సంతసమునం గని సగోప ♦ జనుఁడై వైకుం
ఠాంతరదేశంబున కత్యంతంబగు శీఘ్రగతిని ♦ నరిగియు నటఁ దాఁ. ౩౬౫

సీ॥ వేయి శిరంబులు ♦ వేయి పాదంబులు, వేయి భుజంబులు ♦ వెలుఁగుచుండ
శంఖంబుఁ జక్రంబు ♦ శార్ఙ్గంబు గదయును, బద్మంబు వనమాల ♦ పరిఢవిల్ల
చామరాందోళికా ♦ చ్ఛత్రకిరీటకేయూరాది భూషలు ♦ నొప్పుచుండ
సర్వశక్తేశుల్లు ♦ జక్కఁగాఁ గావించు, పార్షదుల్ పెక్కురు ♦ వరగుచుండ

తే॥ పెక్కుసూర్యుల కాంతులు ♦ పెరుఁగుచుండ
సుమహారాదులు మ్రొక్కి సం ♦ స్తుతులు సల్ప
జ్యోతిరుమండలంబున ♦ నొప్పు సింహ
పీఠమున నున్న శేషుపై ♦ వెలిఁగె నపుడు. ౩౬౬

తే॥ గోకులమునుండి వచ్చిన ♦ గోపకులతి, భయమునఁ గుసగుసలాడి ♦ వఱలుచుంటఁ
గాంచి పార్షదులెల్లరు ♦ కనలి దవ్వ, నందు వారిని గూర్చుండ ♦ నాజ్ఞ చేసి.

ఉ॥ ఎత్తఱినైన విష్ణుసభ ♦ నిరలు గాంచితిరో కొ? యిట్టులు
స్తుతులు పొక్కి వాగాటుక ♦ నాటకమో? యీ యెడ నాల్గువేదముల్
మొత్తముగాఁ బరేశ్వరుని ♦ ముచ్చట సెప్ప లెఱుంగరో కొ? నో
త్రైత్తక యిట్టి భక్తినల ♦ కృష్ణుని గొల్వుఁడి! ముక్తిఁబొందుఁడీ! ౩౬౭

తే॥ అని వచింపఁగ గోపకుల్ ♦ హర్షమొంది
మానసులను బూని తను తను ♦ మానసముల
కిట్లు బోధించుకొని రీర ♦ మేశ్వరుంతు
దివ్యసింహాసనంబునఁ ♦ దేజరిల్లి. ౩౬౮

చ॥ మనల నధఃకరించి యొక ♦ మాటయునే న్మనతోడఁ బల్కఁ డం
దున శతధా ప్రజస్థలమొ ♦ తుష్టికరంబు సుఖప్రదంబు గా
వున నిట లేచి యుచ్చటికిఁ ♦ బోవఁగ నౌనని యెంచు వారిఁ దో
డ్కొని వడితో రమేశ్వరుఁడు ♦ గోకులమేగె ననంతరంబునఁ. ౩౭౦

సుదర్శనోపాఖ్యానము.

సీ॥ మఱియొకవేళను ♦ మఱిగణాన్వాన్వితఁ, శకటముల్ గొంచు గో ♦ పకనికరము
ననందవరులుప ♦ నందులు వడ్వృష, భానువులుఁ దమ ♦ వసతినుండి
నక్షిపర్వంబైన ♦ యంబికావనమున, కరిగి సభృత్యులై ♦ యందు విడిసి
యందు మహావిద్య ♦ యను పేరఁ బరగెడి, భద్రకాళీదేవిఁ ♦ బార్వతీశు

తే. భక్తితోడఁ బూజించి ♦ పాపతాప
హారమగు శ్రీసరస్వతీ ♦ ప్రాదినీత
టమున భూదేవతలకు దా ♦ నముల నొసఁగి
ప్రొక్కి మృష్టాన్నము భుజించి ♦ ముచ్చటాడి. ౩౨౧

క. అందంబగు నొకచోటున, నందఱు నిదురించి రంత ♦ నజగర మొండా
నందుని పాదము గఱవఁగ, నందుఁ డులికిపడుచు లేచి ♦ నలఁగుచు వఱచున్.

ఆ. పాహి! పాహి! కృష్ణ! ♦ పంకజలోచనా!
యేదొ కఱచె నన్ను ♦ నీవు గనుమ!
యంచు నెలుఁగునెత్తి ♦ యార్వ నిద్రించిన
వారు లేచి యటకుఁ ♦ బాఱి చేరి. ౩౨౩

క. కలుచెడి యురగముఁ గనుఁగొని, కొఱకొఱలాడుచును గఱ్ఱఁ ♦ గొట్టినఁగానీ
శిరమునఁగలమణి వీడని, తెఱఁగున నది యడుఁగు విడక ♦ తిరుగుచు నుండెన్.

క. అత్తఱిఁ గాళియమర్దనుఁ, డత్తెఱఁగును గాంచి కసి ని ♦ జాంఘ్రిని దన్నన్
దత్తఱిలి యది తదాకృతి, బొత్తుగ విడి పొంది పూర్వ ♦ పుణ్యాకృతినిన్. ౩౨౫

వ. శ్రీహరినిం జేరి సాష్టాంగప్రణామంబు లాచరించి ముకుళిత కరారవిందుండై స్వామీ! భక్తవత్సలా! యేను సుదర్శనుం డను పేరంబరగు విద్యాధరుండను. ఒక్కసమయంబున నష్టావక్రమహామునీశ్వరుం గాంచి పరిహాసించితిని. దాన నామహామహుండు కనలి సర్పంబు గమ్మని నాకు శాపం బిడె. అక్కతన నిందనుకఁ దద్భోగిరూపంబున నుండి పతితపావనేత్యాదిబిరుదాంచితభవత్పదపద్మమకరందరజఃకణస్పర్శనంబునఁ దచ్ఛాపంబు సమాప్తంబై తొల్లింటి రూపు నాకుఁ జేకూఱె ధన్యుండ నైతింగాదె? ఇట్టి లోకశంకరుండవగు నిన్ను సన్నుతింప సమర్థుండనే? మన్నించి నన్ను రక్షింపు మని ప్రార్థించి సర్వోపద్రవరహితంబగు వైకుంఠలోకంబున కేగె. అంత నందులకా నందాదిగోపకు లంద అధికాశ్చర్యానందంబులం బొంది యాతండు భగవంతుండే యని నిశ్చయించి పొగడుచు మరలి వ్రజమండలంబున కేతెంచిరి. ౩౨౬

తే. వెండి యీవేమి వినదవో ♦ వేగఁ జెపుమ, యనఁగ జనకుండు మోదిల్లి ♦ యావ్రజమున
వనరుహాక్షుఁ డేలీలల ♦ నొనరిచెనొకొ? తెలుపుమా! యనఁగ మునిమణి ♦ వలికె నిట్లు.

తే. పసిఁడిపుట్టముతాల్పొక్క ♦ పట్టునందు, నన్నతోఁగూడి స్వీయగృ ♦ హంబునుండి
వెడలి యచలభాగములందుఁ ♦ బిల్లవాండ్రఁ, గూడి డాఁగురుమూఁత ♦ లాడఁదొడఁగె

శ్రీకృష్ణుండు వ్యోమారిష్టాసురులను వధించుట.

తే. అట్టిపట్టున దిట్ట మ ♦ యాత్మజుండు, బలియు నగు వ్యోమదైత్యుండు ♦ బైలుదేరి
గోపరూపంబు దాల్చి త ♦ త్కర్దనరతు, లైన గోపకబాలుర ♦ నపహరించి.

తే॥ కొండబండల క్రిందుగాఁ ♦ జండగతిని, సారెసారెకు వచ్చుచుఁ ♦ జనుచు నున్న
తాద్రిసానువులందున ♦ భద్రపఱచు, చుంట సోకుమూకలగొంగ ♦ యొయ్యఁజూచి.

ఉ॥ రక్కసునిం గరంబులఁ గ ♦ రంబుగఁ బట్టి ధరాస్థలంబుపై
నుక్కున నొక్కపెట్టున జ ♦ యోక్తులు నిండఁగఁ బుష్పవర్షముల్
జక్కఁగ దేవత ల్గురియ ♦ సంగడికాండ్రును మెచ్చ నవ్వు ల
మ్మక్క ! యనంగఁ గొట్ట నతఁ ♦ డానిముసంబున నీల్గె భూవరా ! ౩౮౧

ఆ॥ అంత వాని జోతి ♦ యఖిలదిక్కులయందు, వెలిఁగి చక్రిలోన ♦ విలయమొందె
ననఁగ జనకుఁడోము ♦ హార్షి ! తత్పూర్తన, జన్మచరిత మెఱుఁగ ♦ స్పష్టపఱచు.

క॥ నావుడు ముని యనె నాతఁడు, భూవర ! భీమరథనామ ♦ భూపితుఁడుర మే
ధావియు, యజ్వయు, ధని బలి, శ్రీవిభు భక్తుండు నగుచుఁ ♦ జెలఁగెను గారీ.

ఉ॥ ఆతఁడు రాజ్యపాలనము ♦ నందఱు నౌనని మెచ్చఁ జేసి ని
ర్భీతిని బట్టభద్రునిగఁ ♦ బ్రెగ్గడయైన కుమారు సల్పి వృ
షౌతిత దివ్యమైన మల ♦ యాద్రికి నేగియు లక్షవర్షముల్
బ్రాఁతిగ నిల్పి శ్రీధరుఁ ద ♦ పం బొనరించెను తత్క్షణంబునన్. ౩౮౨

తే॥ మునివరుఁడగు పులస్త్యుఁడు ♦ ముచ్చటపడి, ఛాత్రబృందంబుతోఁగూడి ♦ చనఁగనట్టి
భీమరథరాజు లేవక ♦ వినతులిడక, గర్వియై యుంటఁ గనుఁగొని ♦ కరము గనలి.

క॥ దనుజుఁడవగుమని శాపం,బు నొసంగెను నంత నట్టి ♦ భూమీధవుఁడా
మునిపదములపైఁ బడి శరణును జెందఁ బులస్త్యముని క ♦ నుంగొని దయతోన్.

తే॥ ద్వాపరాంతమునందున ♦ వ్రజములోనఁ, జక్రి యుదయించుఁ దద్భుజ ♦ శక్తిచేత
శాపముక్తుఁడవై నీవు ♦ శౌరియందు, లీనమయ్యెద వో సుధీ ♦ మాననీయ !

తే॥ అని వచించెను బిమ్మట ♦ నాతఁ డట్లు, మయనిశాచరపుత్రుఁడై ♦ మహినిబుట్టి
వ్రజమునందున శ్రీహరి ♦ బాహుశక్తి,చేత గిట్టి పరేశ్వరుఁ ♦ జేరె జనక !

ఉ॥ వెండియు నిట్లు యొక్కతఱి ♦ విశ్వభయంకరుఁ డాయతాంగుఁడున్
జండపరాక్రముండు దను ♦ జప్రముఖుం డతికుత్సితుం డరి
ష్టుండనువాఁడు గోపకళి ♦ శుప్రకరంబునఁ జేరి రోదసిన్
నిండి ప్రతిధ్వనింపఁగ న ♦ నేకవిధంబుల బొబ్బరించుచున్. ౩౮౯

తే॥ శృంగములతోడ గిరుల మ ♦ హీస్థలమునఁ, గూల్చి తరువుల నన్నిటిన్ ♦ గోడుపఱచు
చుంట గో గోపగోపిక ♦ లోర్వలేక, భయమునన్ గాల్కొలందిగఁ ♦ బాఱె రవల.

చ॥ సభయుల నాత్మమిత్రులను ♦ శౌరి కనుంగొని భీతి వీడుఁ డం
చభయ మొసంగి యట్టి వృష ♦ భాకృతినుండిన దైత్యుఁ డ్రోయ వాఁ
డు భళి యనంగ మాధవుఁ డ ♦ టుత్వమునం గొని దచ్చికోసులన్
రభసముతో ధరన్ బడఁ గ ♦ రంబుగ నెట్టెను కృష్ణుఁ డంతటన్. ౩౯౧

ఉ॥ బాలుఁడు చెంబు బండపయి ♦ బ్రద్దలుగాఁ బడవైచినట్లు గా
లీలఁగ వాని వాలము ల ♦ లిం గొని గిఱ్ఱునఁ ద్రిప్పి త్రిప్పి యా
నేలను గొట్టె నంత నల ♦ నిర్జరవైరియు లేచి యొక్క పెఁ
శైలముఁ గొమ్ములఁ బెకికి ♦ చక్రిశిరంబున వేసె నార్చుచున్. ౩౯౨

ఉ॥ అయ్యది కాంచి కిన్క మరు ♦ నయ్యయు నయ్యచలంబు నయ్యెడ
న్జయ్యనఁ గొంచు నయ్యసుర ♦ నాథు తలన్ బడవైచె దానిచే
నయ్యసురుండు కొంతవడి ♦ వ్యాకులుఁడై మఱిలేచి కొమ్ములన్
గయ్యము గోరి యుర్వినుడ ♦ కంబు జనించెడిలాగు గ్రుమ్మచున్. ౩౯౩

చ॥ కమలదళాక్షుపై నుఱుకఁ ♦ గాఁ గని చక్రి తదీయదీర్ఘశృం
గములను బట్టి వాతహతిఁ ♦ గంజము త్రిగ్గిన యట్లు త్రిప్పి రో
షమున ధరిత్రిఁ గొట్టఁగ ని ♦ శాటుఁడు రక్కసి రూపువీడి భూ
మ్యమరశరీర మూని యల ♦ యంబుజనాభుని మ్రొక్కి యిట్లనెన్. ౩౯౪

సీ॥ నీరమణీయాంఘ్రి ♦ నీరజంబునఁ గదా, తుంగవీచీ సంగ ♦ గంగ వొంగె
నీమనోహరనాభి ♦ నీరజజనిఁ గదా, పృథుమాయ బిడ్డలఁ ♦ బెట్టియుంట
నీ కమనీయాస్య ♦ నీరజంబునఁ గదా, భూసురవర్యులు ♦ బుట్టియుంట
నీదివ్యలోచన ♦ నీరజంబులఁ గదా, నీరజమిత్రుండు ♦ నెగడియుంట

తే॥ నీమనంబునఁ గద చంద్రుఁ ♦ డామతిలుట,నీదు సంకల్పమునఁ గదా♦నిఖిలభువన
ములును బుట్టుట గిట్టుట ♦ యలరియుంట, పాశుపాల్యప్రవీణ ! గో♦పాలబాల !

మ॥ కరుణాంభోనిధి ! నందపుత్ర ! నిజ భ ♦ క్తశ్రేణికల్పద్రుమా !
వరతంత్వాఖ్యుఁడ బ్రహ్మచారిని సురో ♦ పాధ్యాయశిష్యుండ భూ
సురుఁడన్ నేఁ బొరపాటుచే గురుదరిన్ ♦ జొచ్చిల్లి పాదంబులన్
గరముల్ జాపి తిరస్కరింప గురుఁడున్ ♦ గాఢవ్యథావంబునన్. ౩౯౬

తే॥ ఎద్దువగుమని నను శపి♦యించెఁగృష్ణ!, దాన వంగదేశములందు ♦నేను వృషభ
రూపమును దాల్చితి సురవి♦రోధిమైత్రి, వలన రాక్షసత్వంబును♦గలిగె నాకు.

తే॥ నీయనుగ్రహంబున నేను♦నేఁడు వేడ్క, శాపముక్తుండనైతి రా♦క్షసత విడిచి
యుంటి నీరేడుజగముల♦కొడయఁడవగు, నీకు మ్రొక్కెద శ్రీకృష్ణ!♦నిర్మలాత్మ !

తే॥ అనుచు మ్రొక్కి విమానంబు♦నందునెక్కి, దివ్యతేజంబుతో వాఁడు♦దివముఁ జేరె
నిపుడు పాపహారంబు న♦భీష్టదంబు, నైన మాధుర్యఖండంబు♦నంటి జనక !

ఉ॥ ఆపదధీనదీనకరు ♦ ణార్ద్రకటాక్ష ! విపక్షశిక్షకా !
గోపరిపాలనప్రియ ! య ♦ ఘోరసుదర్శనచక్రపాణి ! ల
క్ష్మీపతి ! శౌర్య ధైర్యబల ♦ శేవధి ! ధీనిధి ! యాదవాన్వయా
ద్దీపక ! సూర్యకోటిసమ ♦ దీప్తివిభాసుర ! భూమనోహరా ! ౪౦౦

ఉత్సాహ। నిత్యసత్య శుద్ధబుద్ధ ♦ నిర్వికల్ప చిన్మయా!
స్తుత్య వేదరాశిగమ్య ♦ దోషదూర! శ్రీకరా!
ప్రత్యయార్హ! విశ్వరూప! ♦ పద్మనాభ! కేవలా!
ప్రత్యనీకభీకరాంగ! ♦ బహుళలోకనాయకా! ౪౦౧

గద్యము:- ఇది శ్రీమత్పరమపవిత్రాపస్తంబసూత్ర, భారద్వాజసగోత్ర, చివుకుల
కులజలధికళానిధి, కోటమాంబాకామయ తనయ, లక్ష్మీదేవీ
సుబ్రహ్మణ్య దత్తపుత్ర, శ్రీకృష్ణప్రసాదాసాదిత కవిత్వ
నిశ్చయ, సుజనవిధేయ, శ్రీనివాసాపరనామధే
యాప్పయశాస్త్రిచే నాంధ్రీకృతంబైన
శ్రీగర్గభాగవతంబందలి
మాధుర్యఖండము
సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ
హరిః ఓం తత్సత్
శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః

శ్రీ గర్గభాగవతము

మధురా ఖండము.

మధురానాథా! శ్రీధర!
మధుదైత్యవినాశకృతిస ♦ మర్థా! లక్ష్మీ
మధురాధరపానప్రియ!
ప్రథనాధిక విక్రమసామర్థ్య! ♦ రాధాకృష్ణా! ౧

వ॥ అనవుడు జనకుం డమ్మునీంద్రున కిట్లనియె. మునివరా! రాధామాధవ కథావిధానకథనప్రథితసుధీనిధివగు నీ వనుగ్రహించి సకలజనమనోభిరామంబగు నమ్మధురాపురవరంబున నా మధురిపుం డేయే కార్యంబు లెట్లెట్లొనరించెనో దుర్భరంబగు దోర్బలంబున నిక్కడ నమార్గుడై నొక్కుమ్మడిం ద్రొక్కంగ జాలిన యుక్కడీడగు నక్కంసుని ధ్వంసం బెట్లు గావించెనో విశదీకరింపు మని ప్రార్థింప నా కయ్యాపుఁ దిండి యయ్యునవీంద్రున కిట్లనియె. ౨

కంసుండు శ్రీకృష్ణ వధార్థంబై సన్నాహంబులం బన్నుట.

క॥ ఒకతఱి మధురానగరికి, సకలాత్మజ విపులసంప ♦ ద్విధనోద్యమమున్
త్రికరణశుద్ధిగఁ గోరి కుతూహలమున నే నరిగి యుంటి ♦ దోషవిదూరా! 3

చ॥ చనిచని కాంచితిన్ మనుజ ♦ చారణ కిన్నర సిద్ధ యక్ష రా
ద్ధనుజ సురాప్సరోజనయు ♦ తంబు శతాంగమదేభ వాజిరా
జినిభృతమున్ బలిష్ఠ యదు ♦ శేఖరయుక్తము నూత్నరత్నజా
తినివృత వేదికాన్వితము ♦ దివ్యము కంససభాప్రదేశమున్. ౪

ఉ॥ అందున నల్గడల్ జయజ ♦ యధ్వను లొప్పఁగ సింహపీఠిక౯
జెందిన దుష్టుఁ గంసు యదు ♦ శేఖరుఁ గాంచితి నంత నాతఁ డా
నందముతోడ ఛందనము ♦ న౯ మును పింద్రునినుండి గొన్న యా
సుందరచామరాది పరి ♦ శోభితపీఠ మొసంగి భక్తితో౯. ౫

ఉ॥ నాకు సమర్చఁ జేయఁగ ఘ ♦ నంబుగ నుబ్బి యిటు ల్వచించితి౯
భీకరవైరిదారణవి ♦ వేక కృతార్థ! యశోద నెమ్మితో
గోకులమందుఁ గన్న పసి ♦ కూన భవత్కరముం ద్యజించి వే
యాకసమొందినట్టి కథ ♦ యంత యెఱుంగుదు వీవు దేవరా! ౬

ఉ॥ భూవర! పూర్వపుణ్యమునఁ ♦ బుట్టిన యీ వసుదేవుఁ డాస్థతో
దేవకియందుఁ గృష్ణు, బల ♦ దేవుని రోహిణియందుఁ గాంచియు౯
నీవలన౯ భయంపడుచు ♦ నెచ్చెలియా వ్రజనాథు చేతిలో
దీవిగఁ బెంచుమా! యని యి ♦ డె౯ దదనంతరమందు వారలు౯. ౭

ఆ॥ శుక్లపక్షచంద్రు♦శోభను బెఱుఁగుచుఁ, బూతనయును నసురి♦మొదలుకొనియు
నల యరిష్టుఁ డనెడి ♦ నసురువఱకుఁగల, రక్కసులను జంపి ♦ నిక్కరయ్య! ౮

చ॥ ఇరువురు వీరు వైరులని ♦ యీ వెద నమ్మి మెలంగుమా! యన౯
సరగ బలిష్ఠకంసుఁడు న ♦ సాధ్య దురాగ్రహాకంపితాంగుఁడై
కరమున శాతఖడ్గమును ♦ గైకొని యా వసుదేవుఁ దత్సభ౯
నఱుకఁగఁ బోయి నాదు వచ ♦ నంబున నాగియు నెట్టకేలకు౯. ౯

తే॥ ఆలితోఁగూడ నాతని ♦ హస్తములకు, సంకెలల వేసి వెసఁ జెఱ♦సాలఁ బెట్టె
నంత నటనుండి నేఁబోతి♦నవల నతఁడు, రామకృష్ణవినాశనా♦రంభ మరసి. ౧౦

తే॥ దనుజవరుఁడగు కేశిని౯ ♦ దానె పిలిచి
రామకృష్ణులఁ ద్రుంపఁగా ♦ వ్రజము జనుము!
యంచు నంపి చాణూరము ♦ ఖాసురులను,
మంత్రులన్, నిజకరిమహా ♦ మంత్రిఁ జీరి. ౧౧

ఉ॥ వీరవరిష్ఠులార! సర ♦ వి౯ వినుఁడీ! మునివర్యుఁడైన యా
నారదుఁ డిట్టి నన్ను నల ♦ నందగృహస్థిత రామకృష్ణులే
పోరునఁ జంప నుండిరని ♦ పూర్తిగఁ దెల్పెను గాన వారల౯
మీరిట మల్లయుద్ధమున ♦ మిత్తికొసంగుఁడి! గెల్పుఁ బెట్టుఁడీ! ౧౨

ఉత్సాహ॥ మల్లభూమి శుభకరముగ ♦ నుసలకుండఁ జేయుఁడీ!
యుల్లమున్మదాంబుధార ♦ నుబ్బు నా గజంబుచే
నల్ల నల్లి ద్రొక్కునట్లు ♦ నణఁగ ద్రొక్కఁ జేసి వా
రెల్లకాల మాపుఁడీ! ♦ చేయుమింక! చయ్యన౯. ౧౩

క॥ అమవసపవలున మల్లర, ణమగుఁ దత్పూర్వదినము ♦ నఁ గార్ముకయ
జ్ఞమును బ్రశాంతము కొలిచెఁ, క్రమముగ జరిపింతుఁగాన ♦ రండటకీరల. ౧౪

ఉ॥ వారికి నీ రహిఁ బలికి ♦ పంపి రహస్యముగా మనీషి న
క్రూరుని నంతరంగు నను ♦ కూలుని మంత్రిని బిల్చి యిట్లనెఁ
బోరను రామకృష్ణులను ♦ పోఁటిలు నన్దగటార్తు రంచు నా
నారదమౌని యిత్తఱిని ♦ నాకు నెఱుంగఁగఁ జెప్పెఁ గావునఁ. ౧౫

కంసుం డక్రూరుని గోకులంబున కంపుట.

తే॥ ఎల్లి వేకువ గోకుల ♦ మేగి యందు, నున్న నందునిగీమున ♦ వెన్నుఁడతని
యున్నయుండిన నీవార్త ♦ లన్ని జెప్పి, యమృతమొల్కెడి పల్కుల ♦ నాడి వేఁడి.

క॥ పృథులోపాయన భరితులఁ, బ్రథితుల నందాదిగోప ♦ రాజుల మథురా
విధసందర్శన మిషచే, రథముల నెక్కించుకొనియు ♦ రమ్మక్రూరా! ౧౬

మహాస్రగ్ధర॥ వినుమాదిఁ రామకృష్ణుల్ ♦ విదితకువలయా♦పీడనాగంబుచేఁగా
ని నిరాఘాటంబుగా నా ♦ నిరతిశయబల ♦ స్నిగ్ధమల్లాళిచేఁగా
ని నిమేషంబందుఁ జావఁ ♦ నిరుపమ విధులఁ ♦ నేనార్తుఁ బ్రవేశను
న్వెనుకఁ సీల్గఁ బొనర్తుఁ♦ నెన రెద విడి యో♦స్నేహితాశ్యాగ్రగణ్యా!

తే॥ పైని నావృషభాసుని ♦ భంగపరతుఁ, బిదప నందోపనందుల ♦ పీఁచమడఁతు
నంత నానకదుందుభిఁ ♦ హతమొనర్తు, వానిసఖుఁడగు దేవకు ♦ వధమొనర్తు.

తే॥ మాఱియు రాజ్యసముత్సుకు ♦ విరసు నుగ్ర, సేనుఁబరిమార్తుయాదవ♦సేన నంత
నంతమొనరింతు సంశయ ♦ మందవలదు, వీరు ప్రాగ్జనిఁ సురలని ♦ విశ్వసించు.

సీ॥ భూత భేతాళాది ♦ నేతయు వీరసం, స్తవ్యుండు భూతసం ♦ తాపనుండు,
కింకయేవచ్చిన ♦ శంకరునైతము, సంకటపడఁ జేయు ♦ సంకరుండు
పట్టుబట్టిన నట్టి ♦ ప్రలయకాలునిఁ గూడ, నణఁపఁజాలినద్వివి ♦ దాభిసుండు
ముక్కంటినింగూడ ♦ మొగసాల కాపరి, గా నల్పినట్టి బా ♦ ణాసురుండు

తే॥ వృకనిశాట, హరిశ్మశ్రు ♦ హృష్ట నరక, కాలనాభ, మహానాభ,♦కర్బురులును
మిత్రులౌచు మదర్థమై ♦ మేడమందుఁ, బ్రాణముల నియ్య సిద్ధులై♦వఱలిరయ్య!

క॥ ధనియును ధన్వియు బలియును, దనుజామరమనుజవరులఁ ♦ దనమాటకు లొం
గిన వారినిగాఁ జేయుచు, మనెడి జరాసంధుఁడరయ ♦ మామయకాడే. ౨౨

ఉ॥ ఆరయ నేను యీజగతి ♦ యందలి గండరగండలఁ గరం
బూరును బేరులేని యటు ♦ లుగ్రతనాశమొనర్చి యీ యకూ
పారవృతావనీస్థలము ♦ పాలనసేయుచు నుంటి సర్వ బృం
దారకులఁ బిడౌజు ముఖ్యుల ♦ ద్రాళ్ళను గట్టి జయించితిఁ గదా. ౨౩

తే॥ వెండియుఁ ద్రవ్యపతినిఁ గు♦బేరు మేరు, గిరిగుహామహాదుర్గమం♦దడఁచుచుండఁ
ద్రోసియుంటిని త్రైలోక్య♦భాసమాన, రాజ్యలక్ష్మిని గైకొంటిఁ♦బ్రణుతచరిత!

క॥ అక్రూరోద్భవుఁడను జుమీ, యిఁక నాకును నాచెలులకు ♦ నెది యవలంబై
సుకరములఁ గూర్పఁగ జాలదొ?, ప్రకటింపుము కొఱఁతలేని ♦ రహి నక్రూరా!

తే॥ కవిజనములఁ యాం దీవె♦కవివరుఁడవు, చతురమతులందు నా బృహ♦స్పతివినీవు
గాన నెదిచేయఁదగు? నన ♦దానఁ లితుఁ,డైన యక్రూరుఁడతనికి♦ననియె నిట్లు.

తే॥ మీరు పలికిన పలుకులు♦మేలుగూర్చు, నవిగ నున్నవి కాని యి♦య్యదిదలంప
దైవయత్నము చేతఁ♦గాఁ దగునుగాని, మనప్రయత్నముచేత♦గాఁ దనఁగ వినుము.

శా॥ కంసుం డిట్లు వచించె దానలలితా! ♦ కావింపినఁ యత్నము
త్రంసుల్ మెచ్చఁ గ్రియానసుల్ సఫలమై ♦ దైవారవే దైవమే
శంసార్హంబని నమ్మి పౌరుషబల ♦ స్థైర్యాదులఁ వీడినన్
హింసల్లగ్గవె? మిన్నకుండిన గదల్ ♦ హెచ్చిల్లి వేధింపవే? ౨౮

ఉ॥ కాలము దైవరూపమని ♦ గట్టిగ నమ్మిన కర్మయోగి యే
మూలనొ యుంపుగాత బల ♦ ముఁ జలముఁ మతిలేని వెంగలుల్
వీలుగ దైవమే పరము ♦ విశ్వసనీయ మటంచుఁ జెప్పఁగాఁ
జాలుచు నుండ్రుగాత దృఢ ♦ శక్తిసమేతుఁడు దాసనొప్పునే. ౨౯

ఉ॥ కావున రేపు గోకులము ♦ కంజహితోదయపూర్వవేళలో
నీవు బిరాన సాగుమని ♦ యెప్పున నొక్క వచించి పంపి యా
సేవకజాలముఁ బనిపి ♦ చీదఱవడ్డ మనంబుతో డుర
త్నావృత పీఠికన్ విడిచి ♦ యంతిపురంబున కేగె భూవరా! ౩౦

వాసుదేవుండు కేశినిశాచరుం ద్రుంచుట.

చ॥ పదపడి కంసునానతి జ ♦ వంబున నేగిన కేశిదైత్యుఁడున్
మదమున నశ్వరూపమును ♦ మానుగఁ దాల్చి వ్రజంబు జొచ్చి యం
బుదము విధాన బొబ్బలిడి ♦ పుచ్ఛహతిన్ ఘనపంక్తి నింగి యం
దదవదలౌనటుల్ సలిపి ♦ యంఘ్రిహతిన్ ధరఁగూల్చెఁ జెట్లులన్. ౩౧

ఉ॥ ఆసమయంబునందు వ్రజ ♦ మందు నివాసముఁ జేయు గోప గో
పీసముదాయ మాయసురు ♦ భీకర చర్యలఁ గాంచి బాంధులం
దాసల వీడి మాధవుని ♦ యండకుఁ జేరుచు దిక్కు నమ్మవం
గా సరి యంచు నొప్పికొని ♦ కంజదళేక్షణుఁ డూరడించుచున్. ౩౨

పంచచామరము॥ లెటాలునన్ గటిన్ బటంబుఁ దద్దఁగట్టి దైత్యుపై
హుటాహుటిన్ జనంగ నా న ♦ రోదనుండు శ్రీహరిన్

బటుత్వయుక్త దీర్ఘ వామ • పాదఘాత బాధితుఁ
బ్రదుటఁ బోనర్చి యార్చి నింగి • బ్రమోఁగ భూమిప్రవయ్యఁగా.

మ॥ అటుపై శ్రీధరుఁడాగ్రహించి నిజహ • స్తాగ్రంబుచే వానినిఁ
వికటాటంబుగఁ బట్టి త్రిప్పియు వియ • ద్వీధిఁ జతుః క్రోశముల్
ద్రటిలో దాఁట గిరాటు వేసె నవలఁ • దోషాచరోత్తంసుఁడు
త్కటకోపంబునఁ దిర్గి వచ్చి తనతోఁ • కఁ మోఁదె దామోదరుఁ. ౩౮

వ॥ అంతనాదైత్యాంతకుండు ప్రలయాంతకు భంగిం గనలి యా కేఁద్రిమ్మరీని వాలంబుఁ గేలం దాలిచి గిరగిరం ద్రిప్పి యప్పురవీధియందు వందయోజనంబులపైఁ బడునట్లు విసర నయ్యసురుం డసుకుసురై క్రమ్మఱ లేచి ధారాధరంబు కరణి నార్చి పేర్చి జూలును, రోమస్తోమంబును విదలించుకొని కార్చిచ్చు ద్రింగిన యక్కమలాక్షు సమక్షంబునఁ బాదంబులఁ మేదినిం ద్రవ్వుచు నా బాలకృష్ణుం గొని విహంగంబు భంగి నింగి కెగయుచు దిగుచుఁ దిరుగుచు మిగుల బాధింపం దొడంగె. అంత శిష్టరక్షకుండగు నా శ్రీహరి యాస్పష్టపుష్టినష్టకరంబగు నొక ముష్టితో నా దుష్టనిశాటుం బ్రహరింప నతండు రెండుగడియల కాలంబు గడబట్టి తిరుగఁ దెరలి యా హరిని దన కంధరంబునఁ దగిలించుకొని చదలున కెగసి లక్ష యోజనంబు లుల్లంఘించె. అపు డందు గోవిందుఁ డా దుండగీని పాదసటాపుచ్ఛ ఖురంబులతో నఖండంబగు భండనంబు రెండుజాములొనర్చి నిజభుజంబుల నవ్వానిం గైకొని యుయ్యెల నూఁచినపగిది నట్టిట్టూఁపి యటనుండి క్రిందఁ బడవైచి యొక బుజంబు తదాస్యంబందుఁ జొప్పించె. అంత నది యుపేక్షించిన యామయంబు విధంబునఁ గ్రమక్రమంబుగాఁ బెరుఁగుచు నా యసురోదరంబును బ్రవేశించి కలంచఁ గని తగినట్లా రక్కసుండు తన కుక్షిం బ్రబలంబుగా నొనర్పం గడంగ ఖండితోదరుండై మృతుండయ్యె. అయ్యవసరంబున నయ్యశ్వశరీరంబునుండి కిరీటహారకేయూరకంకణకింకిణీకాంచీసమంచితంబగు దివ్యరూపంబు ధరించిన యొండు పురుషుండు నిర్గతుండై యా భక్తవత్సలునికిం బ్రణమిల్లి సాంజలియై యిట్లనియె.

కేశిపూర్వజన్మవృత్తాంతము.

తే॥ దేవ! శక్రానుచరుఁడను • దివ్యరూప, ధరుఁడ, దేజస్వి వర్చస్వి • దత్త్వవిదుఁడఁ
గుముదనామకుఁడఁ నేను • గొడుగుబట్టి, యింద్రుమెప్పించిజీవింతుఁ • గృష్ణ! తొల్లి

తే॥ అపుడుదేవేంద్రుఁడట్లువృ • త్రాసురవధ, సల్పితద్బ్రహ్మహత్యాది • శాంతికొఱకు
సర్వసవనోత్తమంబును • స్వస్తిదంబు, నైన యశ్వమేధంబు స • మాచరింప

తే॥ శ్యామ కర్ణాంచితము మనో • జవయుతంబు,
శుభ్రవర్ణ సంయుతమును • శుభకరంబు

నైన హయమును విడువంగ ♦ దానిఁదస్క
రించుకొని యెక్కి తలమున ♦ కేగియుంటి. ౩౮

ఉ॥ అత్తఱి నింద్రుఁడుం దివిష ♦ దావళితోఁ జనుదెంచి నెత్తిపై
మొత్తుచుఁ ద్రాళ్ళఁగట్టి హయ ♦ ముం గొని దుర్మతి! తేజిరూపుతో
హత్తు పిశాచరుండవగు ♦ మూంమనుయుగ్మ మటంచు శాపముం
జిత్తమునం దయారసముఁ ♦ జేర్పక నాకిడె నబ్జలోచనా! ౩౯

ఉ॥ దాన హయస్వరూపవృత ♦ దైత్యుఁడనై చరియించుచుంటి నో
దానవవైరి! నీదయను ♦ దత్కృతనాయకశాప మిత్తఱిన్
నేను విడంగఁ జాలితిని ♦ నిశ్చయ మియ్యది భక్తవత్సలా!
దీనశరణ్య! దేవనుత! ♦ దేవ! నతుల్ బొనరింతు భక్తితోన్. ౪౦

చ॥ అని ప్రణమిల్లి నల్గడల ♦ నద్భుతరోచులఁ బర్వచున్ మహా
ఘనమగు విష్ణులోకమును ♦ గాంతిసమన్వితమౌ విమాన మం
దున వెసనెక్కి చేరెను వి ♦ ధూతరిపూత్కర! తత్పరంబునన్
దనరిన సంగతుల్ వలికె ♦ దన్ వినుమో బహులాశ్వభూవరా! ౪౧

అక్రూరుండు గోకులంబున కరుగుట.

తే॥ కంసునాజ్ఞ నక్రూరుండు ♦ ఘనరథంబు, నెక్కి గోకులంబునకేగు ♦ చక్కఁజమగు
గిరుల దరుల సరస్సులఁ ♦ దరుల విరులఁ, గాంచు చలరుచుఁ జను చిచ్చ ♦ నెంచె నిట్లు,

క॥ నయముననో భయముననో, ప్రియముననో వైరముననొ ♦ విష్ణుని బలునిన్
రయమునఁ దోడ్కొని రమ్మని, నియమించిన యట్టికంసు ♦ నిత్యముఁగొలుతున్

ఉ॥ ఏమితపంబుఁ జేసితినొ ♦ యే మహనీయునిఁ గొల్చియుంటినో
యేమిజపంబొనర్చితినొ ♦ యెట్టి వ్రతంబుల నోచియుంటినో
యేమిసుఖంబు ధాత్రికి ఘ ♦ టించితినో కద! యీదినంబునం
దా మధువైరి నా స్వభువు ♦ నా హరినిం గను భాగ్యమబ్బెఁగా. ౪౪

ఉ॥ కాని మదాగమంబు విని ♦ కంసుని పంపున వీఁడు వచ్చె న
ద్దాన నితండు వధ్యుఁడని ♦ దానవహంత సమీకరంతయై
మానసమందు నెంచి పరి ♦ మార్చునొ? చెల్మిని గద్దెనిచ్చి స
మ్మానముఁ జేయునో మఱియు ♦ మద్విధి యెవ్విధి నివ్వటిల్లునో. ౪౫

ఉ॥ ఎట్టులనైన నేఁడు కమ ♦ లేశుఁ గనుంగొను భాగ్య మబ్బె నా
యట్టి కృతార్థుఁ డీ జగతి ♦ యందుఁ జెలంగునె? పట్టుపుట్టముల్
గట్టెడిజేజె యే నరుల ♦ కన్నుల గోచరుఁ డౌనొ వారు బ
ల్లెట్టులు నైన ధన్యులయి ♦ శ్రీధరుఁ జేరరె? యంతరంగమా! ౪౬

ఉ॥ ఈరహిం శౌరినిం గుఱచి ♦ యెంచుచు సచ్ఛకునంబుఁగాంచి య
క్రూరుఁడు గాందినీసుతుఁడు ♦ గోకుల మర్కుఁడు గ్రుంకువేళలోఁ
జేరి యవాంకుశాంబుజ వి ♦ శిష్టజనార్దన పాదచిహ్నయు
గ్ధారణిఁగాంచి డిగ్గన ర ♦ థంబును డిగ్గి మనోరథంబునన్. ౪౮

తే॥ పొరలి యానందబాష్పము ♦ లొప్పరల విడిచి
నందు మన్కికి నరుగంగ ♦ నందునుండి
బలునిఁ గూడిన కృష్ణుండు ♦ వచ్చుచుంటఁ
గన్నులారఁగఁ గనుఁగొని ♦ గాఢభక్తి. ౪౯

సీ॥ పురుషోత్తములను నం ♦ భోజలోచనులను, శ్యామలగౌరవ ♦ ర్ణాంచితులను
లీలాపరులఁ బీత ♦ నీలాంబరధరుల, బాలుర గోజాల ♦ పాలకులను
మకుటలలంతికా ♦ మంజీరకంకణ, హారకేయూర స ♦ మన్వితులను
యోగిరాడ్దేవరా ♦ డురగరాణ్ణుతులఁ బు, రాణుల భక్తసం ♦ త్రాణరతుల
తే॥ నిర్జితానంగరూపుల♦దుర్జనగణ, తర్జనాత్మార్జిత బలుల ♦ దుర్జయులను
నార్జవార్జిత యశులను♦హరి బలులను,డాసి పదములంబడి నతుల్♦జేసె నవల.

క॥ శౌరియు రోమాంచితునిన్, వీరుని నానందబాష్ప ♦ విలసన్ముఖు న
క్రూరుని నక్రూరునిఁ గని, కారుణికత్వార్ద్రి నయన ♦ కమలుండగుచున్. ౫౦

చ॥ పదములనుండి హస్తములఁ ♦ బట్టుచు లేవఁగఁదీసి యింటికిన్
ముదమునఁదోడుకొంచుఁజని ♦ ముద్దగు గద్దియ నిచ్చి మంచిగాఁ
గుదిరిన భక్ష్యభోజ్యముల ♦ గోవుముఖంబునఁ బెట్టె భూవరా!
పదపడి గాందినీతనయు ♦ ప్రక్కకు నందుఁడు సేరి యిట్లనెన్. ౫౧

ఉ॥ సిగ్గును వీడి భోజపతి ♦ చిన్నల నల్లురఁజంపెఁ జెల్లఁబో !
యెగ్గులుఁగూర్చెఁ జెల్లెలకు ♦ నేమియెఱుంగని వారినిం జెఱన్
బగ్గను బెట్టె న్యాయము ల ♦ వంబు దలంపక యింక నెవ్వరిన్
నుగ్గొనరింపఁ జూచెడినొ ♦ న్యూనత లేని యటుల్ వచింపుమా ! ౫౨

తే॥ అట్టిచెట్టరాజ్యమునందు♦నెట్టులీవు, బ్రతుకుచుంటివో యక్రూర!♦పలుకుమయ్య!
యనుచు గేహములోనికి ♦ నరిగెఁ బిదప, హరియు గాందినీపుత్రకు♦నడిగెనిట్లు.

ఉ॥ సేమమె మీకు మీపురినిఁ ♦ జిన్నలుఁ బెద్దలు స్త్రీలు పూరుషుల్
సేమమె ? నీవె సాగుతటెఁ ♦ జీరుచు నాతలిదండ్రు లాదటో
నేమి వచించి రాత్మజన ♦ మేవెతలన్ బడకుండెనో కొ౭ ? యిం
కేమిదలంచెఁ గంసుఁడిపు ♦ డెల్లజగంబులు క్షోభఁజెందఁగాన్. ౫౪

ఉ॥ నావుడు గాందినీసుతుఁడ ♦ నందొడఁగెన్ బరమాత్మ ! మొన్న భో
జావనిజాని, మానమున ♦ నాసభయందుఁ గృపాణపాణియై

యావసుదేవుఁ జంపుటకు ♦ యత్నముఁ జేయుటఁ జూచి వెంటనే
దేవమునీంద్రుఁ డాపె వసు ♦ దేవకుమారక ! వైరిమారకా ! ౫౫

ఉ॥ దాన నశేషయాదవులు ♦ ధార్మికవర్యులు దద్దరిల్లి త
త్స్థానమునుండి లేచి పెఱ ♦ తావులకుం జని రంతఁ గంసుఁడా
దీనుల యాదవోత్తముల ♦ దేవతలం బరిమార్ప యత్నమ
న్యూన్యనముగా నొనర్చెడిని ♦ యుక్త మయుక్తము లేక శ్రీకరా ! ౫౬

క॥ అక్రూతమున నామథురకుఁ, జక్కఁగఁ జనుదెంచి కంసుఁ ♦ జంపియుఁ బ్రజకుం
జిక్కులఁ బాపుచు సుఖముల, గ్రక్కునఁ గలిగింపుమయ్య ♦ కరుణాభరణా !

క॥ అనవుడు సబలుండగు హరి, తన పెంపుడు తండ్రిదౌ య ♦ ధార్థాశయుమున్
గాని కార్యకరుల వేలను, నెనగునఁ బిలిపించి యిట్లు ♦ నెను బహులాశ్వా! ౫౮

క॥ నేనును నందులు షడ్వృష, భానువు లుపనందు లింక ♦ బలిగోపక సం
తానము వృద్ధులు మథురకుఁ, బైనము కాఁగలరు వేకు ♦ వను నద్దానన్. ౫౯

క॥ అరుణోదయకాలమునన్, బురిగల నెయిపాలు పెరుఁగుఁ ♦ బ్రోఁగుఁగఁగొని మీ
కరదంబులతో సయితం, బరదంబులఁ బెట్టి యిచట ♦ కరుదెంచవలెన్. ౬౦

ఉ॥ ఆతరువాతఁ గార్యకరు ♦ లాహరి యాజ్ఞఁదలన్ వహించి యా
వ్రేతల యిండ్లకుం దిరిగి ♦ పెద్దలు బిన్నలు నాలకింపఁ ద
త్ప్రీతకటోదితోక్తులను ♦ వెల్లడిఁ జేయుచుఁ జిడ్డుపెర్గు పా
ల్నేతులు ప్రోఁగుగా నొకటఁ ♦ నేర్పునఁ జేర్పఁదొడంగి రింతలోన్ ౬౧

చ॥ విడిముడి బోఁటియేడుగడ ♦ వెన్నుఁడు పైనమొనర్చు వార్త యా
పిడుగువలెన్ వ్రజాంగనల ♦ వీనులలోఁ బడఁగొందఱంగనల్
గుడిచెడి యన్నముం విడిచి ♦ గోలను బెట్టిరి కొందఱున్న లీ
తఁడు మనలందృజించి యెటు ♦ దర్లు? నటంచుఁదలంచి రెంతయున్. ౬౨

ఉ॥ కొందఱు గండదేశములఁ ♦ గోమల హస్తములుంచి బెంగతోఁ
గుందిరి కుందుఁడే చనినఁ ♦ గొంప మునుంగదె యంచు గోపికల్
గొందఱు వల్కిరామథుర ♦ కుం హరియేగుట ప్రస్తుతంబు నం
దెందులకంచుఁ గొందఱని ♦ రీశ్వర ! మేశ్వర బద్ధశేముషీ ! ౬౩

మ॥ మఱి యా రాధిక, కృష్ణు నెమ్మొగమునున్ ♦ మందస్మితంబున్ సుకం
ధరమున్ నాస నురంబు నారు పరహ ♦ స్తంబుల్ పదంబుల్ శరీ
రరుచుల్ మాటలు నీటులున్ బ్రణయవై ♦ రంబుల్ మహావాద్యాన సం
చరణాసక్తిని రాసముల్ దలఁచుచున్ ♦ శశ్వత్తు రోదించెడిన్. ౬౪

చ॥ ఇంకను గొందఱుగ్మలులు ♦ కృష్ణుని వీడఁగ లేక యించుకేన్
జంకక యొక్కయొక్కనొక ♦ జట్టుగఁ గూడియు రాయబారిదా

వంకకుఁ బోయి యోయనఘ! ♦ పాడియె? మమ్ములఁ బాపి శ్రీపతిన్
బెంకెతనానఁ దోడుకొని ♦ వెళ్ళుట చెప్పుమ! గాందినీసుతా! ౧౫

క॥ అక్రూరుండవు గావని, సక్రమముగ నాడితిమిగ! ♦ చక్కనరయ నీ
వాక్రూరుండవు జుమ్మీ, చక్రివియోగంబు మాకు ♦ సంధించుటచేన్. ౧౬

మ॥ మురళీగాన వినోద కార్యకలనా ♦ పూర్వప్రభావాఢ్య! యీ
తరుణంబందుఁ జిరంతనంబయిన మా ♦ సంబంధమన్ వల్లరిన్
గరముం ద్రెంపి యదృచ్ఛగాఁ జనెదవే! ♦ కారుణ్య మావంతయున్
సరిగా నుండిన యట్లు తోఁపదహహా! ♦ శౌరీ! మురారీ! హరీ! ౧౭

సీ॥ రాసకేళులయందు ♦ రతినిగావించిన, చెలిమి యావంతయున్ ♦ దలఁపవేల?
మాయిండ్లలోఁబడి ♦ మంచిపాల్పెరుఁగు నేతులు గ్రోలినట్టిమేల్ ♦ దలఁపవేల?
యలజలక్రీడల ♦ యందొనరించిన, స్నేహంబు నాత్మలోఁ ♦ జేర్పవేల?
బృందకారణ్యంబు ♦ నందలి మాతోడి, క్రీడలు మదిని లె ♦ క్కింపవేల?
తే॥ గోవర్ధన శైలంబు ♦ గొటనెత్తి, వ్రజ నివాసులఁ గాచిన ♦ పరమకరుణ
నల్పమైనను మాపైని ♦ దాల్పవేల?, మధురకరిగెదవే కృష్ణ! ♦ మమ్ము విడిచి.

సీ॥ సీతామహాదేవి ♦ శ్రీరాముతోఁగూడ, వనటచెందుట ప్రేమ ♦ వలనఁగాదె
చంద్రమతియు హరి ♦ శ్చంద్రునితోఁగూడ, వనటచెందుట ప్రేమ ♦ వలనఁగాదె
యింద్రాణి యట్టి దే ♦ వేంద్రునితోఁగూడ, వనటచెందుట ప్రేమ ♦ వలనఁగాదె
హైమవతీసతి ♦ హరుతోడ మిక్కిలి, వనటచెందుట ప్రేమ ♦ వలనఁగాదె
తే॥ మఱిఁ బతివ్రత లను వాసి ♦ మహినిగన్న, వారలెల్లరు భక్తితో ♦ వనటకనుట
ప్రేమవలనని కావునన్ ♦ మేముగూడఁ, గష్టసుఖముల నీవలెన్ ♦ గాంతుమయ్య!

మ॥ చెలులారా! యలనాఁడు రాసమున నీ ♦ శ్రీకృష్ణచంద్రుండు తె
నెలు వర్షించు స్వరాన నేమిపలికెన్ ♦ నేఁడేమి చేయంగఁదాఁ
జెలరేగెన్ గనుఁడీ యిదేమి నయమో ♦ చిత్తంబు స్థైర్యంబుగా
నిలుపన్ లేని మహానుభావు దయయున్ ♦ నిర్మూలమూలంబగున్. ౨౦

క॥ కావున లాభము లేదిఁక, నేవనితో యేమనికినో ♦ యేగెదమో రా
జీవాక్షులార! కర్మం, బీవిధి యేడ్పించుచుండె ♦ నదిచేయనగున్? ౨౧

క॥ అనిహేరాళమగు విరహ, మునవగచి స్వసద్మములకుఁ ♦ బోయెడి వారిన్
వనమాలి కాంచి యిట్టుల,నని నందఱి కన్ని రూపు ♦ లందుచుఁ దాల్మిన్ ౨౨

శ్రీకృష్ణుండు అక్రూరసహితుండై యరుగుచు రాధాదుల నూఱడించుట.

క॥ గోపికలారా! మీర్పరి,తాపంబును మానుఁడేను ♦ దప్పక త్వరలోన్
మీపొంతకు వచ్చెద సుమి, మీపెరిమను జేసినట్టి ♦ మేలు మఱతునే. ౨౩

వ॥ అని చెప్పి యటనుండి సాగి వృషభానుతనూజాత యగు శ్రీరాధాదేవి సుందరమందిరంబునకుం జని యందుఁ దనవియోగంబునఁ బరవశయై యొంటిగా శోకమునం బడి యున్న రాధికం జూచి తత్సఖీజనంబు దన్నుఁజుట్టుముట్టుచుండ సకల లోకమనోహరంబగు మురళీగానం బొనరింప నాలించి యప్పద్మిని పద్మినీమనోహరోదయంబును గాంచి సంతసించిన పద్మిని విధంబున నిజనయనపద్మంబుల విప్పి శ్రీకృష్ణపద్మబాంధవుం గని యలరారి సింహాసనం బిడి సత్కరించె. అంత నమ్మాధవుండు దీనయు, నశ్రుపూర్ణముఖియు, విరహావిహ్వలయు నగు నాసుందరిని జూసి మేఘగంభీరంబగు గళంబున. ౭౮

శా॥ ఈ నామాటలఁ దాలిమిన్ వినవె యో ♦ యేణాక్షి! యీవేళలోఁ
బోనా యీమధురాపురంబునకు తే ♦ పో మాపో యందుండి రా
లేనా సత్వరులఁ జంపి శిష్టులను పా ♦ లిన్ గాచి తత్ప్రీతుఁడన్
నానా ... యుండఁ జాలుదునె? యో ♦ కాంతామణీ! పల్కవే! ౭౯

ఆ॥ నేను ... ♦ నెంజిలి విడిచి భ్రూమలను దాల్చి హాయిఁ ♦ జెలులతోడ
... కొంచుఁ ♦ బాలు పారుచుండుమా!, యంచు నూఱడించె ♦ నవనినాథ!

క॥ ... దన చెవులకు, ములుకులుగాఁ దోఁప రాధ ♦ మూర్ఛిలి మతిన్
... దావదగ్ధము,గు లత విధంబునఁ దపించి ♦ కౌతుకపడుమదిన్. ౮౭

క॥ ... నాథా!, యగచాట్లను నన్ను బెట్ట ♦ ననిశము నిన్నున్
... స్నేహించెడి నను, దిగవిడిచియు నిచట నెటకో ♦ తెగఁబోయెదవే?

ఉ॥ ... చేయఁగలఁ ♦ బొల్తుక పుట్టువు గాదె బూదినై
... నెటుల ♦ మూఁడెను గీడులు నాకు నక్కటా!
... న ♦ హించితినే? కలనైన నిట్లు నా
... చొప్పదు న ♦ టంచుఁ దలంచితినే! మనోహరా! ౮౯

క॥ ... సనుఁగను, లాకో! యనిరెండుతడవ ♦ లన్ నుడువ జగ
త్ప్రాణ ... కారుణ్యాక, ట్రాణంబు నిగుడ్చి యిట్టు ♦ డాఁపక పలికెన్. ౯౦

మ॥ ... సంతతము భ ♦ క్తశ్రేణి యిష్టంబులన్
ఫలి ... బొనరింతుఁ గాని యెపుడున్ ♦ వ్యర్థంబుగావింపనే!
యిల ... నిన్ను భర్తృవిరహం ♦ బబ్బంగ నూఱేండ్లు బల్
... శపించె గోజగమునన్ ♦ జింతింప లాభించునే? ౯౧

ఆ॥ ... ♦ మరుదెంచె నిప్పుడే, బిట్టు దాని ననుభ ♦ వింపవలయు
... రాశి ♦ సాధారణంబుగాఁ, జనునె? యెంతగొప్ప ♦ జనునకైన. ౯౨

చ॥ గిరిజ ... బంధనము ♦ గాదొకో? యయ్యది చింతచేయుటల్
మతి ... నాథుఁడు ♦ మత్సఖుఁడే కద యైన నీవు నా

సతివగుటఁ దమిఁ విడువఁ ♦ జాలక నేఁ బ్రతిమాసమందు నీ
స్థితి గని వేడ్కఁ గూర్చుటకు ♦ స్నేహమొనర్తు సఖీవతంసమా ! ౮౩

తే॥ కాన శోకంబు మానుమో ♦ కమలనేత్ర!, యన్న నామె చేయుటకు నే ♦ య్యాదియు లేక
దేవ! నీవు వచించిన ♦ ట్టివి మాస, మాసమున దర్శనం బిచ్చి ♦ మనుచు వయ్య ! ౮౪

ఆ॥ అటులఁ గాని యెడల ♦ హాటకసన్నిభ, మనుశిరీషమృదుల ♦ మనుఘనంబు
దివ్యమునగునాదు ♦ దేహంబు దాహంబు, సలుపఁగలనటంచుఁ ♦ దెలియుమయ్య !

చ॥ జలరుహనేత్రుఁ డద్దివిని ♦ సత్యము నానుడులెల్ల ధర్మవుఁ
జలరుహబాంధవేందువులు ♦ సంధ్య యముండును నంతరాత్మ ప్రా
బలుకులు శాస్త్రజాలము బ ♦ వల్ నిశి సాక్షులు గాగ నాదుగో
పులపయి నొట్టుపెట్టికొని ♦ పూర్తిగఁ జెప్పినమాట నమ్ముమా ! ౮౬

క॥ చేతస్స్ఫూర్తిగ నేర్చి, స్తోత్రుకముగఁ జెలిమిఁ జేసి ♦ యొగ్గుల్ లగ్గుల్
ప్రాఁతిగఁ దెలుపునో వాఁడే, భూతలమున ధన్యతముఁడు ♦ పుణ్యుఁడుగదా. ౮౭

క॥ చేతస్సునందు విషమిడి, ప్రీతిగ స్నేహించు నరుఁడో ♦ విషపుమ్మొగుఁ
హేతుపటుఁడు లంపటుఁడును, ఘాతుకుఁడును నైన నటుసి ♦ కరణి నధముఁడో. ౮౮

క॥ ఈయెడ నీ యెడఁ జేసిన, నేయమొ టకఁగొంకుగాదు ♦ నెఱి నమ్ముము! యో
తోయరుహాయతనేత్రా!, పోయెద సెలవిమ్ము త్వరగఁ ♦ బోలతులనిమిత్త! ౮౯

తే॥ కర్ణకరణంబులకు రస ♦ ఘనత దెలియ, నటులఁ గోర్కెలఁ గాంక్షింప ♦ ననన్ని మునుల
కెద్ది దెలియరాదో యెద్ది ♦ యేమిగోర, నట్టిమునులకుం జిక్కనో ♦ యద్ది నేను.

తే॥ పాలకును బాలఁగలతెల్పు ♦ డాలునకును, దారతమ్యంబు లేసి ని ♦ ధనన నీకు
నాకు భేదములేదని ♦ నమ్మి మునులు, సతము ధ్యానించుచుందురో ♦ సరసిజాక్షి !

క॥ నాకును నీకును భేదం, బేకరణిని కూర్చి యెవ్వ ♦ రెద జపింత్రో
యాకొంటెలు నరకమునం, దాకమలార్కంబు భమముగ ♦ నత్తునుగుసఖి ! ౯౧

తే॥ నీవు మేదిని నన్విడి ♦ నిలువలేవు, కాని నిన్విడి యేమనఁ ♦ గలనె ? చెపుము !
కానఁ దప్పక నెలనెలఁ ♦ గనుపడెదను, బొత్తుగాఁ జింతమానుము ♦ పువ్వుబోఁడి !

ఆ॥ అంచు నూఱడించి ♦ యంగీకరింపఁగా, సలిపి యింటికేగె ♦ సరగ నవల
నందముఖులు బలులఁ ♦ బొంది రథము లెక్క, కల్యమందు లేచి ♦ కదలిరయ్య!

తే॥ అంత నక్రూరుఁడా రమా ♦ కాంతబలులఁ, దన యరదమందు నెక్కించి ♦ తాను నెక్క
మధుర కేగెడివేళలో ♦ మార్గములను, గోల్లకోలఁదిగ గోపికల్ ♦ గుమిగలిసి. ౯౫

మ॥ అదె యక్రూరుఁడు క్రూరుఁడై యరదమం ♦ దారామహేమాంబగుల్
గుదురం జేసి సమీరతుల్యగతితోఁ ♦ గోల్కొంచుఁ దోతెంచెడిఁ
గద! వీక్షించుఁడి! యడ్డగించుఁడి! కసిఁ ♦ గారించుఁడీ! దంచుఁడీ!
చెదరంగొట్టుఁడి! నెట్టుఁడీ! కొఱకుఁడీ ♦ ఛేదించుడీ మించుఁడీ ! ౯౬

ఉ॥ ఒండొరు లిట్లు పల్కుకొని ♦ యుగ్మలు లారథ మధ్రపంక్తి మా
ర్తాండుని గప్పనై వడిని ♦ దద్దయు జుట్టును ముట్టి దండిగా
దండములన్ గ్రహించుచు ర ♦ థంబును జూర్ణమొనర్చి సారథిన్
రెండగు వ్రేళ్ళఁబట్టికొని ♦ ఱివ్వనఁ గ్రిందికి లాగివైచియున్. ౯౭

ఉ॥ దద్దులు గట్టునట్టులుగఁ ♦ దత్తురగంబుల వేత్రపంక్తితోఁ
దద్దయుఁగొట్టి నెట్టన ర ♦ థస్థుల యుక్కడగింప సాగఁగా
గ్రద్దన మాధవుండు గని ♦ కంజదళేక్షణలార! తిర్గి నేఁ
బ్రొద్దది గ్రుంకులోపలనె ♦ రూఢిగ వచ్చెద నిండ్లకేగుఁడీ! ౯౮

చ॥ అనియిటు పల్కిగోపికల ♦ నావల కంపి స్వభక్తు గాందినీ
తనయునిఁ బ్రోచి తేరును ద్రు ♦ తంబునఁ జక్కఁగఁజేసి రథ్యముల్
మనమున భీతినిన్ విడి సు ♦ మాళము నొందగ మూఁపులందుఁ జే
తను గడుఁదట్టి కట్టియుఁ బ ♦ తాకను నెత్తి వసింపవేడ్కతోన్. ౯౯

తే॥ గాందినీపుత్రకుండును ♦ గాంచి యలరి, సజ్జితమగు నారథమును ♦ సరగనెక్క
రామకృష్ణులు దనవెంట ♦ రాజిలంగఁ, ద్రోల సాగెను మధురపు ♦ త్రోవయందు.

ఉ॥ ఆరథకేతు వెందనుక ♦ నక్షుల కప్పుడు గోచరించెనో
యా రథవాజిసంతతిఖు ♦ రాహత ధూళులు నెంతదాఁక దై
నాటెనొ యంతదాఁకఁ గని ♦ పంకజనాభుని పల్కులెంచి శృం
గారవతుల్ విచిత్రముగఁ ♦ గాంచుచు నిల్చిరి బొమ్మలో యనన్. ౧౦౧

క॥ క్రమముగఁ గృష్ణుం డక్రూ, రముసలియుతుఁడై యల మధు ♦ రాపురిఁ గల బా
హ్యామహోద్యానవనికి హ, ర్షముతోఁ జని రథము డిగ్గి ♦ సత్వరగతితోన్.

ఉ॥ అన్నను రాముఁగూడి యము ♦ నాపగ కేగియు దాహ మారఁగాఁ
దిన్నగ నీరుఁద్రావి మఱిఁ ♦ దేరును నెక్కను గాందినీజుఁడున్
గ్రన్నన రామకేశవులఁ ♦ గాంచి తదాజ్ఞను బొంది తద్ధునీ
సన్నిధిఁజేరి కాల్యములఁ ♦ జక్కఁగఁ దీర్చి యనంతరంబునన్. ౧౦౩

అక్రూరుండు యమునానదిని రామకృష్ణులం దర్శించుట.

తే॥ నిత్యనైమిత్తికంబులన్ ♦ నిష్ఠతోడఁ, జేయ జలములోనికిఁ బ్రవే ♦ శించె నందుఁ
గరము నుడులతోఁ జెలఁగియ ♦ గాధమైన, యొక్కయెడ రామమాధవు ♦ లొప్పఁగనియె

తే॥ కనియు ముక్కున వ్రేలిడి ♦ గట్టునెక్కి, రథమునందుననున్నఁ యా ♦ రామహరులఁ
గాంచి క్రమ్మఱ నదిలోనఁ ♦ గనఁగ వార, లిర్వురొప్పుట గనిఁయెద ♦ నెంచెనిట్లు

మ॥ కలయో మాయయొ సత్యమో భ్రమయొ నా ♦ కందోయి వైచిత్య్రమో
జలజాతాయతపత్రనేత్ర కృతియో ♦ జాలంబొ యింకేదియో

పలుకం జాలను గాని యేమి యిది యా ♦ పద్మాక్షునీలాంబరుల్
జలమందుం రథమందు నొప్పి రొకకా ♦ లంబం దభేదంబుగన్. ౧౦౬
కం॥ ఏవంవిధి ననుకొని తా, భావమునం దలరి మఱియు ♦ వారలలోనే
కేవఁగఁజూడఁగ సాగెను, నావేళను గాంచినిజుఁ ♦ డాకాళిందిన్. ౧౦౭
సీ॥ వేయిపడగలతో ♦, వెలిఁగెడి శేషునిఁ, గుండలీభూతునిఁ ♦ గూర్మిఁగాంచి
యాతని యుత్సంగ ♦ మం దద్భుతం బైన, గోలోకచిత్రముల్ ♦ గోర్కెఁగాంచి
గోపకాళ్యవనాను ♦ కూలగోత్రేశ్వరం, బైనట్టి గోవర్ధ ♦ నాద్రిఁగాంచి
బృందకారామ కా ♦ ళిందీ ధునీమణి, సౌందర్యమంతయుఁ ♦ జక్కఁగాంచి
తే॥ కోటిమన్మథలావణ్యుఁ ♦ గోటిభాస్క, రోజ్వలాంగుని రాసేశు ♦ నూర్జితయశుఁ
గృష్ణు రాధికాయుతుఁ బ్రభుఁ ♦ దృష్ణతోడఁ, గాంచి బ్రహ్మయటంచు ను ♦ తించె నిటుల
సీ॥ ఎవనిచే జగము జ ♦ నించునో యెవ్వని, చే నిది వృద్ధిఁ ♦ జెందుచుండు
నెవనిచే నిది గిట్టు ♦ నెవనిలో నిది యుండు, నెవ్వఁ డిద్దానిలో ♦ నెసఁగుచుండు
నాది మధ్యలయంబు ♦ లంటవో యెవనికి, నెవనికిఁ గల్మషం ♦ బెదియు లేదొ
నామరూపగుణాదు ♦ లేమాత్ర మెవనికి, లేవొ యెవ్వఁ డఖిల ♦ దేవదేవుఁ
తే॥ డట్టి శాశ్వతుఁడవగు నీ ♦ యద్భుతమగు, మాయ నిర్జరభూసుర ♦ మాని వరులు
దెలిసి కొననప్పు డెఱుఁగంగఁ ♦ గలనె? చెపుము! నన్ననుగ్రహింపుము కృష్ణ! ♦ నందపుత్ర!
శా॥ పద్మాక్షా! హరి! పద్మవైరికులజా! ♦ పద్మోదరా! మానిహృ
త్పద్మేందిందిర! పద్మబాణజనకా! ♦ పద్మాలయానాయకా!
పద్మాళిప్రియకోటిరుక్మరుచీ! ♦ పద్మోద్భవాదిస్తుతా!
పద్మవ్యూహసమర్థమాతుల! భవ ♦ త్పత్పద్మముల్ గొల్చెదన్. ౧౧౦
ఉ॥ చేతులు నీదు పూజలను ♦ జేయుట కంఘ్రులు రెండునున్ భవ
త్ప్రాతని కేతనంబులకుఁ ♦ బోవుటకున్ శ్రవముల్ భవత్కథల్
బ్రాఁతిఁగ నాలకింపఁగ శి ♦ రంబు కరంబుగ నిన్ను మ్రొక్కఁగాఁ
జేతము నిన్దలంచుటకు ♦ సిద్ధ మొనర్పుము నందనందనా! ౧౧౧
తే॥ దేవకీపుత్ర! బ్రహ్మాండ ♦ దేవ! శరణు
నన్ను మన్నించి రక్షింపుమో ♦ నలిననేత్ర!
యనుచు ననులోనఁ గృష్ణుండు ♦ నఖిలలోక
సహితుఁడై తిరోహితుఁ డౌట ♦ సరిగ నెఱిఁగి. ౧౧౨
తే॥ మఱల నతులిడి సంధ్యాది ♦ మహితకర్మ, లాచరించి తీరమునకు ♦ నరుగుదెంచి
తిరిగి వెనుకకుఁ గనుచు న ♦ చ్చెరువుఁ బొంది, హరి పరబ్రహ్మయని నిశ్చ ♦ యంబొనర్చి.
చ॥ అలరుచుఁ దేరునెక్కి యసి ♦ తాంబరనందకుమారయుక్తుఁడై
జలజహితుండు గ్రుంకుతఱిఁ ♦ జక్కఁగఁ దన్మధురాసమీపమం

దలరు వనంబుఁ జేరె నట ♦ నా వ్రజరాణ్ముఖ గోపకుల్ వడిన్
బిలపిలమూఁగిరా పిదప ♦ వెన్నుఁడు, నందుఁడు దొట్టివారలన్. ౧౧౪

చ॥ కని యల గాందినీతనయుఁ ♦ గాంచి ప్రియంబున నిట్లు పల్కె నో
ఘనచరితా! భవద్రథముఁ ♦ గైకొని ముందుగ వీడు లోనికిన్
జను మటుపైన మేమును వె ♦ సన్ జనుదెంతుము పొమ్మనంగ వాఁ
డును భయభక్తులన్ గనుఁగ ♦ దున్ గిడిగిళ్ళు బొనర్చి యిట్లనెన్. ౧౧౫

తే॥ పతితపావన! జగదీశ! ♦ పరమపురుష!, సోదరాభీరయుతముగా ♦ భేదము విడి
నా గృహంబునకేతెంచి ♦ నలినవామ్య, పాదధూళిఁ బావనము స ♦ ల్పన్ నుతింతు.

కం॥ నిన్ను విడనాడి యింటికి ♦ నేను బోను, జూవె! యని పల్కవిని యా య ♦ శోదపట్టి
యిట్లు వాకొనె నక్రూర! ♦ యేను కంస, ముఖవిరోధుల నందఱఁ ♦ బొడిచి యడఁచి.

ఆ॥ నీవు గోరినట్లు ♦ నీలాంబరాభీర, సహితుండ నగు నేను ♦ సత్వరముగ
నీమనికికి వత్తు ♦ నీ వాలసింపక, లెమ్ము రథముగొమ్ము ♦ పొమ్ము పొమ్ము. ౧౧౮

శ్రీకృష్ణుండు మధురకుఁ జేరుట.

వ॥ అంత నక్రూరుం డద్దానికి నొప్పి యుషఃకాలంబున మేల్కాంచి తదను మతిం గొని తన యరదం బెక్కి కంసుని సదనముం జొచ్చి యతనికి రామకృష్ణాగమనంబు వినిపించి నిజగృహంబున కరిగె. తదనంతరంబున నపరాహ్ణంబగుడు సాగ్రజుండగు కృష్ణుండు తత్పురీదర్శనలాలసుండై ప్రయాణసన్నాహం బొనర్చుట నందుం డాలోకించి నాయనా! యిది సుహాసుఖకరంబగు గోకులంబు గాక యతిభయంకరంబగు కంసుని ముఖ్యపట్టణంబని యెఱింగి యార్జవంబు ముందిడుకొని యప్రమత్తుండవై సంచరింపుము. నాను నీ నురువకుమని హెచ్చరింప నతం డందుల కూరీకరించి నందప్రణోదితగోపక బాలవృద్ధసహితంబుగా నాపురిలోనికి నడుగిడి నల్లశలం దలరెడి దుర్గంబులను బరిఖలను వప్రంబులను భర్మమయరమ్యహర్మ్యంబులను శృంగాటకంబులను శృంగారోద్యానవనంబులను విపణులను నచ్చరలనుబోలి మనుని చేతికటారులనం దగు మిటారులను యమునాతటినీతటవిలసన్మణిమయసోపానంబులను వెండియు నానావిచిత్రంబులను విలోకింపం దొడంగె. అమ్మెయిఁ జిరంతనమ్ముగ విని శ్రీకృష్ణుని రాకకై చంద్రచకోరన్యాయంబుగా నిరీక్షించెడి నమ్మాధురసుందరీమణు లమ్మాధవాగమనమ్ము విని స్వకృత్యములం ద్యజించి ప్రాసాదంబుల నెక్కియుఁ గవాటంబుల నక్కియు గవాక్షంబుల నుండియు నా దీనపయోనిధినిఁ గాంచి హృష్టాంతరంగలై, ౧౧౯

సీ॥ వీడఁటే గోపక ♦ విభు యశోదా తపః,ఫలపుంజమని యెన్నఁ ♦ బరగు సుగుణి
ఁ వీడఁటే పూతన ♦ విలయంబుఁ బొందఁగా, జనుబాలఁ ద్రావిన ♦ ఘనసుతుండు

వీఁడఁటే మందలో ♦ వెన్నపాల్పెరుఁగులఁ, గాఁజేసి మ్రింగిన ♦ గట్టిదొంగ
వీఁడఁటే చిటికెన ♦ వ్రేలున గిరినెత్తి, వ్రేపల్లెఁ గాచిన ♦ విదిత బలుఁడు
తే॥ వీఁడఁటే గోపికాంబర ♦ వితతిఁగొనుచు, భూరుహంబెక్కి చతురత ♦ ముచ్చటాడి
డెందములను హరించిన ♦ సుందరుండు, జలజలోచనలార! యో ♦ సకియలార!

సీ॥ వీక్షింపవే! వాని ♦ భృంగ ఘనాఘనో, త్కరమునుమీఱు ముం ♦ గురుల హొయలు
జూడవే! యాతని ♦ శుద్ధరాకాచంద్రుఁ, బోలెడి గుండ్రని ♦ ముద్దుమొగము
గాంచవే! యాతని ♦ కమనీయ పద్మనీ, కాశంబులైనట్టి ♦ కనులసొంపు
గనుఁగొనవే! వాని ♦ ఘనకవాటప్రతీ, కాశమై తనరు వ ♦ క్షంబు విధము
తే॥ కనవె! యాతని మదమత్త ♦ గజసమాన, యానరమ్య మీక్షింపవే! ♦ హస్తిహస్త
శస్తమైన యాజాను భు ♦ జములతీరు, జలజలోచనలార! యో ♦ సకియలార!

ఆ॥ ఇతఁడు తిరిగినట్టి ♦ బృందావనంబును, నితనిఁ జూచినట్టి ♦ యెల్లవ్రేలు
రాసకేళి నిట్టి ♦ రసికుతోఁ గూడిన, చేడెలే సుకృతముఁ ♦ జేసినారొ? ౧౨౨

ఆ॥ ఈమహాత్మ్ముఁ గనిన ♦ యేము ధన్యలమైతి, మంచుఁ బొగడుచుండ ♦ నచ్యుతుండు
రాచబాటఁ జనుచు ♦ రజకుఁ డొక్కఁడు తన, కెదురుగాగ నిటు న ♦ డించె జనక!

❦ { రామాది సహితుండగు కృష్ణుండు రజకునిం జంపి వాయక సుదాములను ననుగ్రహించుట. } ❦

క॥ ఓరీ! యెవ్వండవురా, రారా! నాకడకు నాకు ♦ రమ్యాంబరముల్
దేరా! మాటాడకురా, పోరా! నామాట వినర ♦ పొందర సుఖముల్. ౧౨౪

ఆ॥ అంతనాతఁ డవ్వి ♦ యాత్మకోపాగ్నికా, జ్యాహుతులుగ నుండి ♦ యనియె నిట్టు
లరరె! యెవ్వఁడిట్టు ♦ లనలేదు నన్నెప్డు, గాని యీతఁడెవఁడొ ♦ కనెదఁగాక.

క॥ నీతాతయు ముత్తాతయు, నీతండ్రియు నీవుగాని ♦ నేత్రంబుల నీ
రీతిగ నుండెడి వలువల, నేతఱి నే గంటిరొక్క ? ♦ యెంగిలికాయా! ౧౨౬

ఉ॥ కావున నోర్మెదల్పక యిఁ ♦ కన్ జను మియ్యవి వీరవీరుఁడై
దేవమనుష్యరాక్షసుల ♦ దిట్టముగాఁ బ్రహరించి లోకముల్
జేవఁగ నేలు కంసవిభు ♦ చేలము లంచు గ్రహించు మాప్రభుం
డీ విషయం బెఱింగిన స ♦ హింపక నిన్జెఱఁ బెట్టు దుర్మతీ! ౧౨౭

ఉ॥ ఇట్టులఁబల్కు నారజకుఁ ♦ గృష్ణుఁడు గాంచి యరే యిదేమిరా!
తిట్టుచు మాటలాడెదవు ♦ దేహమెఱుంగవె? యేరువత్తురో
యెట్టుల నిన్నుఁ గాచెదరొ? ♦ యేఁదిలకించెద నంచుఁ గూకటిం
బట్టి శిరంబు ద్రుంచెఁ దన ♦ వారలపారముదంబుఁ జెందఁగాన్. ౧౨౮

ఉ॥ అంతట వానిజోతి యల ♦ యచ్యుతులోన లయించె నట్టి వృ
త్తాంతముగన్న తత్సఖులు ♦ తగ్గి కరంబులనున్న దుస్తులన్

దొంతిగఁ జక్రి ముంగలకుఁ ♦ ద్రోసి శరత్సమయాన మబ్బుల
త్యంతము బాఱినట్లుగ య ♦ ధాంఘ్రిబలంబుగఁ బాఱిరో విభూ ! ౧౨౯

తే॥ అవల వారలు వదలిన ♦ యంబరముల, నంబుజాక్షుండు తొల్తొల్త ♦ నాత్మకిష్ట
మైన వానిఁ ధరియించె♦హరియుఁగూడ, మంచివస్త్రంబులందాల్చె♦మనసుదీర.

క॥ గోపకబాలురు సైతం, బోపికతో నేఱికొనుచు ♦ యుక్తపటంబుల్
జేపట్టి కట్టఁదొడఁగిరి, శ్రీపతిబలరాములును వి ♦ చిత్రముగఁగనర్. ౧౩౧

తే॥ మఱియు మిగిలిన వస్త్రముల్ ♦ మాధురులును
గొని ధరించి రీచిత్రంబు ♦ గనులఁగన్న
యొక్క వాయకుం డంబుకు ♦ హొబాదరహాలి
గోపసన్నిధి కేతెంచి ♦ కోర్కిఁగాంచి. ౧౩౨

క॥ నిస్తుల పటముల న స్త్ర,వ్య స్తముగా వీరుగట్టె ♦ రని వారలకుర్
శస్త్రవిధంబునఁగట్టెను, స్వస్తియశశ్శ్రీలుఁ బరముఁ ♦ జక్రి యొసంగర్. ౧౩౩

ఆ॥ అచటనుండి కృష్ణుఁ ♦ డగ్రజ గోపక, సహితుఁడగుచు లేచి ♦ చతురమతిని
బుష్పహారములను♦బొలుపుగాఁ గూర్చు సు,దాముసదనమునకుఁ♦దరలిచనఁగ.

చ॥ అతఁడల రామకృష్ణులను ♦ హర్షమునన్ గని హేమరత్నచి
త్రితపృథుసింహపీఠములఁ ♦ దేజరిలం బొనరించి భక్తితో
శ్రుతిహితసత్కృతుల్ సలిపి ♦ క్షోణితలంబు శిరంబు సోకఁగాన్
నతులిడి వాఙ్మనఃక్రియల ♦ నమ్మి వినమ్రత శౌరి కిట్లనెన్. ౧౩౫

తే॥ భక్తసందోహమందార ! ♦ బలినిగూడి, నీవు నాయిల్లుజొచ్చుట ♦ నేను ధన్య
తముఁడ నా యన్వయంబును♦ధన్యమయ్యె,నాగృహంబు పవిత్రమై♦నాణెమొందె.

తే॥ మఱియు నాతల్లివంక నా♦మగువవంక, దండ్రివంకనుండిన యేడు♦తరములఁదగు
పితరులెల్లరు నిత్తఱి ♦ విష్ణులోక, మునకు నేగి రటంచెంతు♦వనజనాభ ! ౧౩౭

క॥ సాధుజనరక్షణార్థ మ,సాధువధార్థంబు జగతి ♦ జన్మించితిరో
శ్రీధర ! నీకివె మ్రొక్కులు, బాధలఁ బోఁద్రోచి యిమ్మ ♦ పరమసుఖంబుల్.

చ॥ అని కొనియాడుచున్ మధులి ♦ దన్వితవాసిత దివ్యపుష్పముల్
గొని బలరామకేశవుల ♦ గోరుమొదల్ దల దాఁక యోగ్యమై
ననెఱి నలంకరించియుఁ బ్ర ♦ ణామములన్ మఱిఁజేయ వారలున్
మనమున నుబ్బి రావల ర♦మాపతి యాతని కిట్లు వాకొనెన్. ౧౩౯

పంచచామరము॥ సుదామ ! నీదుసేవలెల్ల ♦ సొంపుగాఁ జెలంగుటన్
ముదంబుగల్గె మాకు నిష్టె ♦ పుణ్యభక్త మైత్రియున్
మదాది శత్రుషట్కహీన ♦ మానసంబు భక్తియున్
సదా ఘటిల్లుఁగాక నీకు ♦ సంశయంబు లేనటుల్. ౧౪౦

క॥ ఆయెడ బలరాముండుఁ, నేయముతో నిట్లుపలికె ♦ నీకు సుదామా!
యాయుర్వృద్ధియు బలమును, శ్రీయును విఖ్యాతి సతము ♦ నెలఁగుఁగాతఁ. ౧౮౧

క॥ వరముల నీరహి నొసఁగియు, నిరువురు నటనుండి లేచి ♦ యింకొకవీథిఁ
దిరుగుచుఁ గని యొక తరుణిని, సరసిజనయనఁ బటీర ♦ సహితఁ గుబ్జఁ. ౧౮౨

శ్రీరామకృష్ణులు కుబ్జతో సంభాషించుట.

చ॥ పదపడి రామకృష్ణు లల ♦ భామిని నిట్టుల నడ్గసాగిరో
సుదతి! త్వదీయ వంశమెది? ♦ సూత్రము గట్టినవాఁ డెవండు? పే
రెది? యెట కీ పటీర రస ♦ మెవ్వనికై కొనిపోవుచుంటివో?
యిది యొకకొంత మాకు నిపు ♦ డిచ్చెదవే? యన నద్ది యిట్లనెఁ. ౧౮౩

చ॥ నరవరులార! భూతలము ♦ నఁ ననుఁ బిల్తురు కుబ్జయంచు నే
వరవుడు నిప్డు కంసునకు ♦ బానిసకత్తెగ నుండి గంధముఁ
గరముగఁ బూయఁబోయెదను ♦ గందముఁగోరిన మీరె యెల్లెడఁ
బురుషవరేణ్యు లౌట నిదె ♦ పూసెద హస్తము లిట్లు చాఁచుఁడీ! ౧౮౪

చ॥ ఇటుల వచించి చందనముఁ ♦ గృష్ణునకుఁ యమునావిభేదనో
త్కటపటురామమూర్తికిని ♦ దద్దయు రాచి వ్రజార్భకాళికిఁ
జటులముగా నలంది పలు ♦ జాఁగిలులం బొనరింప వారలా
దటఁబడి రంతఁ జక్రి యల ♦ తన్విని గన్గొని యుత్సహించుచుఁ. ౧౮౫

ఉత్సాహ॥ గూను నడ్డి కుంటుటలను ♦ గోలుపడిన దేహముఁ
మానుగా నొనర్పఁ దలఁచి ♦ మగువకాళ్ళ వ్రేళ్లపైఁ
బూనఁజేసి తనపదముల ♦ ముగుదగౌదఁ దనదు రెం
డైన వ్రేళ్ళఁబట్టి పైకి ♦ నట్టె సాగఁదీయుటఁ. ౧౮౬

క॥ వంకర టింకరలు విడ శ,శాంకసతిఁ రతిని రంభ ♦ శచి మించిన బ
ల్పొంకపు దేహము కుబ్జకు, నంకము లేనట్టు లమరె ♦ హరిపదభీనా! ౧౮౭

క॥ సుందరి యగు కుబ్జయు నా, నందంబును బొంది నంద ♦ నందనుఁ గని గో
విందా! సుందర! దయ నా,మందిరమున కేగుదెంచు ♦ మా! యీవేళఁ. ౧౮౮

తే॥ మఱి రసజ్ఞ! సర్వజ్ఞ! యభిజ్ఞ! నే ♦ మారుబారి, కాగజాలనామనమునీ ♦ యందచిక్కి
నిన్ను విడలేను రారమ్ము ♦ పెన్నదొంగ!, యంచు నగవుతో లాగె నా ♦ యవసరమున.

తే॥ గోపబాలురు చప్పట్లు ♦ గొట్టి నవ్వ, పెద్దవాఁడైన ముసలియు ♦ నొద్దనుండి
చూచుచుండ నీకుబ్జ య ♦ కోదపట్టి, నెంతపనిజేసె నారార! ♦ యేమియేమి!

తే॥ నలువకైనను వేనోళ్ల ♦ చిలువకైన, నంగనాసాహసం బెన్న ♦ నలవియగునె?
తగునె నీకిది వీథిలోఁ ♦ దలిరుఁబోఁడి, యైన నీకులమున కద్ది ♦ యనువుగాదె?

ఉ॥ ఆరహించఁబల్కువారు చెప్పు ♦ లార విన౯ హారి, యట్టికుబ్జ కీ
ధోరణిఁ జెప్పె నో రమణి! ♦ త్రోవ నెఱుంగని వారికి౯ నిజా
గారములందు విందులిడి ♦ గౌరవముల్ బొనరింతు రౌర! యీ
యూరఁ దెలుంగు వారి దగు ♦ యోగ్యతఁ జెప్పఁ గలాఁడనే యహా! ౧౫౨

చ॥ నెలఁతరో! పోవె యీ పురిని ♦ నేను సుమిత్రులఁగూడి కాంచి నీ
నెలవున కిఁగుదెంచెదను ♦ నిశ్చయ మంచు నిజోత్తరీయము౯
జిలిబిలిపల్కులాడి కొని ♦ చెచ్చెర వీడ్కొని రాజవీథిలోఁ
గల ధనధాన్యవృద్ధులను ♦ గన్గొని వైశ్యకులాబ్ధిచంద్రుల౯. ౧౫౩

ఉ॥ కాంచినతోడ నూరుజులుఁ ♦ గంజదళాక్షున కిచ్చి గద్దెన
భ్యంచితపౌష్పవారులను, ♦ బాల జలమ్ములఁ దమ్మలమ్ముల౯
మంచి ఫలమ్ముల౯ విరుల ♦ మన్ననలం బొనరించి శీర్షము౯
వంచి నమస్కృతుల్ సలిపి ♦ పల్కిరిటుల్ ముకుళించి హస్తముల్. ౧౫౪

ఉ॥ శ్రీపతి! భావికాలమునఁ ♦ జిత్రతరంబుగ నీవె యిచ్చుట౯
భూపవరుండ వైన మము ♦ బుద్ధిని రోయక సర్వకాలముల్
జ్ఞాపక ముంచుకొమ్మదఁ ద ♦ లంపఁ ద్వదీయుల మేము కామె? నీ
పాపల మాడ్కిఁ బ్రోవు మని ♦ పల్మఱు వేఁడి రనంతరంబున౯. ౧౫౫

క॥ ముసిముసినగవులు నగి సంతసమున నా కోమటులను ♦ దైత్యారిపుం డి
ట్టి సరణి నడిగె ధనుస్థ్సల, మునులగు నటు జూపుఁ డిప్డు ♦ దూరుజులారా!

చ॥ అనవుడు వైశ్యులందఱు త ♦ దద్భుతచాపవిభంగభీతి దా
నిని వచియింప రై రవల ♦ నీరజనాభు శరీరసౌష్ఠవం
బునను గుణంబుల౯ మిగుల ♦ మోహముఁ జెందు తదన్యులెల్ల రో
తనయ! ధనుస్థ్సలం బిపుడు ♦ తప్పక చూపెదమయ్య! రమ్మిటుల్. ౧౫౬

తే॥ అనుచు వారలు చూపిన ♦ యధ్వమందు, నడచు చాత్మీయసఖులతో ♦ నవ్వుటాల
మాటలాడుచుఁ జక్రి సు ♦ మాళిముగను, గ్రమముగాఁ దద్ధనుస్థ్సలి ♦ కడకుఁ జేరి.

శ్రీకృష్ణుండు ధనుర్భంగంబు గావించుట.

సీ॥ స్వర్ణమయంబును ♦ సప్తతాలకయుక్త, మష్టధాతుసహిత ♦ మలఘుతమము
లక్షభారయుతంబు ♦ దక్షపంచసహస్ర, మనుజానయోచిత ♦ మహితభరము
నైంద్రాధికంబును ♦ నరిభయంకరమును, వలయాకృతోరగ ♦ ప్రభుసమంబు
పార్థివ నాశక ♦ భార్గవదత్తంబు, కంసగృహీతంబుఁ ♦ గాంతికాంత

తే॥ మఖిల పౌరార్చితంబును ♦ యజ్ఞమండ, లరుచిరంబును నా చాప ♦ వరము నరులు
వలను వల దనుచున్నను ♦ వలఁతిఁగ నగి, కేలఁగొని లీల మౌర్వి నె ♦ క్కించి మించి

తే॥ ఇక్షుఖండంబుఁ గ్రొవ్విన♦యిభము సులువు,గా విఱిచినట్టులా త్రిమ్మ♦కరబలమునఁ
గర్ణపర్యంతముగ లాగి♦క్షణములోన, రెంటుతుంటెములౌనటుల్♦చెండి వైచె.

ఉ॥ చెండినతోడనే రయిక వి♦శేషరవంబు ఘనస్వనంబటుల్
దండిగఁ బుట్టె దాన సఖి♦ తండము మెచ్చెను దిఙ్మదేభముల్
బండెఁ బ్రపంచముల్ పగిలె♦ బాహుబలాఢ్యులు మెచ్చి రన్యులుగ
గండరగండఁ డంచనిరి♦ కంసుని గుండియ చెండఁగాఁ బడెన్. ౧౬౧

క॥ కావలివా రది గనుఁగొని, యేవిధినే న్వీని దఱిమి♦ యేలిక మెచ్చం
గా విగతప్రాణునిగా, నీవేళ నొనర్తుమంచు♦ నేగఁగ నటకున్. ౧౬౨

క॥ ఉగ్రమున రామహరు లల, యుగ్రధనుశ్శకలముల మ♦హోద్ధతిఁ గొని యా
యుగ్రాస్త్రధరుల వారి స,మగ్రముగాఁ గొట్టి రా స♦మయమందుననే.

తే॥ భిన్నపాదములు గొందఱు♦భిన్నబాహు,వులును గొందఱు భిన్నశీ♦ర్షులును గొంద
ఱగుచు నైదువే లుక్కరు♦లవనిఁ బడిరి, పౌరు లదిగని పాఱిరి♦స్వగృహములకు.

క॥ మఱిఁ గోలాహలములు త,త్పురిఁ గరముగఁ బుట్టెఁ గంస♦ భూపచ్ఛత్రం
బరుదుగఁ బేరోలగమున, ధరఁబడె నకస్మాత్తుగా న♦దరిపడ సభ్యుల్. ౧౬౩

సూర్యాస్తమయ వర్ణనము.

ఉ॥ ఈ సమయంబునందుఁ గమ♦లేక్షణ! నీవొనరించు సేఁత నీ
వేసము రోస మీహులను♦ వీక్షణజేసితి దీనిఁ జూచు నీ
యే సననుంటెఁ గాన నిఁక♦ నీవిలుఁ జేరుము కుఱ్ఱవాట నిగ
మోసమొనర్తు రల్పులని♦ పోయెడి నా రవి గ్రుంకె నయ్యెడన్. ౧౬౪

సీ॥ పడమరపడఁతుక♦ నడికట్టు సడలించెఁ, బడమరదొర కక్క♦ నడరఁ దొడఁగె
నెత్తమ్మిముత్తైద♦ మొత్తుకో మొదలిడెఁ, దొగవగకత్తియ♦ సొగసుఁ జేసెఁ
బగలను నత్తగా♦ ప్పతన మంతయుఁ దగ్గె, రేఁగోడలిపొగరు♦ రెట్టిముగ్గె
లిబ్బుల దొరలెల్లఁ♦ దబ్బిబ్బుఁ జెందిరి, ప్రముచ్చులు హెచ్చుగ♦ మెచ్చిరిచ్చ

తే॥ జక్కవలజేని దొరతన♦మక్కలిఁబడెఁ, జక్కవల గొంగ దొరతన♦మెక్కువయ్యె
నరయ నొక్కరు బాముల♦నందుచుండ, నొకరు సుకములఁ బొందుచు♦నుండ్రుగాదె

సీ॥ శాకినీ ఢాకినీ♦ హాకినీ ప్రముఖ భూ,తవిహార భావుకో♦ ద్యానవనమొ
యతికృష్ణవర్ణవ♦ర్ణితమత్తగజసామ్య, చండమహిషవాహ♦ దండధరుఁడొ
వేదశాస్త్రపురాణ♦ విశ్వవిశ్రుతకృష్ణ, వీర్యనాశోద్యోగి♦ దుర్యశంబొ
వర్ణసంకరహేతు♦ దుర్నయ నిర్ణయో,ద్యోగి సంపాదిత♦ దుష్కృతంబొ

తే॥ తామసీ సతీకుముఖ వ♦స్త్రంబొ యనఁగఁ, గటికచీఁకటు లెల్లెడఁ♦గ్రమ్మెఁ దొడఁగ
భీతుఁడైనట్టి నరువలె♦ వెన్నుఁడన్నఁ, జెలులఁ గూడి యానందుని♦ చెంత కేగ.

మధురాపుర పురంధ్రీ విరహ వర్ణనము.

క॥ పదపడి మధురా వధువులు, మదనజనకు రూపుఁ గాంచి ♦ మన్మథగదచేఁ
జెదరిన మది గలవారై, వదలఁ బటము లొండొరులును ♦ బల్కొని రిటుల్.

ఉ॥ అంగనలార! యీపురిని ♦ నంగజకోటి రుచుల్ హరించి శ్రీ
సంగుఁడు నేఁడు వేడుకఁగ ♦ జాలఁ జరించెను వాఁడె మాదు స
ర్వాంగముల దనంగమధు ♦ రాకృతితోడఁ జెలంగి గోచరిం
పంగఁ దొడంగెఁ జూడుఁడని ♦ పల్కఁగ నందలి ప్రౌఢ లెల్లరున్. ౧౭౦

మ॥ విని యిట్టుల్ బలుకాడఁగాఁ దొడఁగిరో ♦ బింబోష్ఠులారా! జనా
ర్దనుఁ డీయూరను నల్గడల్ దిరిగి తా ♦ త్పర్యంబునన్ జూచి మి
మ్మును మమ్ముంగని వీరె మిన్నలనుచున్ ♦ మోహించి సర్వాంగముల్
గని చిత్తంబులు గొప్పవంచుఁ గొని వే ♦ గంబోయెఁ జోరాభుఁడై. ౧౭౧

క॥ వనమాలి యితం డింకను, మనలన్ విడలేక యిపుడు ♦ మన యంగములం
దున వెలుఁగుచు నుండెడి, నని యెఱుఁగుఁడి? మీరలెవల ♦ నరయఁగ మఱియున్.

సీ॥ కమలేశుఁ గననట్టి ♦ కన్నులు కన్నులే, సర్పముల్ జొచ్చు బె ♦ జ్జములుగాక
యజ్ఞాత్ముఁ దాఁకని ♦ హస్తంబు హస్తమే, మడ్డిగానుండెడి ♦ త్రెడ్డుగాక
గోవిందు మోపని ♦ గుబ్బయు గుబ్బయే, దిక్కుమాలిన పెంట ♦ దిబ్బగాక
విష్ణూక్తుల వినని ♦ వీనులు వీనులే, గ్రావసంగతవివ ♦ రములుగాక

తే॥ నీరజోదరుఁ బొగడని ♦ నోరునోరె, చాలఁగా మ్రోఁగుచుండెడి ♦ డోలుగాక
హేమచేలుని కూడిక ♦ నెఱుఁగనట్టి, ముద్దులాడి ముద్దియయె? పెన్ ♦ మొద్దుగాక.

సీ॥ కాయంబుతోడుతఁ ♦ గాయంబు దివ్యమా, నధరంబుతోడ ది ♦ వ్యాధరంబు
మోముతో మోమును ♦ భుజములన్ బుజములఁ, గరతలంబులతోడఁ ♦ గరతలముల
బొమ్మతో బొమ్మ ల ♦ గ్నమ్ముతో లగ్నము, నూరుయుగ్మముతోడ ♦ నూరుయుగము
ఘ్రాణానిలంబుతో ♦ ఘ్రాణానిలంబును, బాదయుగంబుతోఁ ♦ బదయుగంబుఁ

తే॥ జేర్చి సందులేనట్టి యా ♦ శ్లేషములను, గూర్మిఁ గొలఁదిఁ జేసికొనుచుఁ ♦ గుతుక మొందు
చున్నడో గద యా కృష్ణుఁ ♦ డట్టులేగ, నోగదా యేమి చేయనౌ ♦ నువిదలార!

సీ॥ కోటిమన్మథులను ♦ దాటిన రూపేల, యీకృష్ణమూర్తికే ♦ యొసఁగ మొసఁగె
నొసఁగెఁబో యాహరి ♦ యేల తద్గోకుల, మందు నుండక యిట ♦ కరుగుదెంచె
నరుదెంచెఁబో నాతఁ ♦ డరుదుగా నేటికి, వీథివీథుల వెంట ♦ వెడలవలసె
వెడలెఁబో యేల యా ♦ తఁడు ప్రస్తుతంబున, నొంటిగా నిట మన ♦ కంటఁబడుట

తే॥ కంటఁబడుగాక యతనిపైఁ ♦ గరముఁ గూర్మి, మనకు నేటికిఁ దనరెను ♦ దనరుఁగాక
యిట్లు కారించుటలకో ♦ యింతులార!, చెప్పుఁడీ యెట్టికార్యముల్ ♦ జేయనగునె?

క॥ ఒకసారిఁ జూచినంతనె, యకలంక ప్రేమ మనకు ♦ నాహరియందే
సుకముగఁ గలిగెను దాన న,ధికపు మనోవ్యాధిపుట్టెఁ ♦ దీఱనియట్టుల్. ౧౭౬
తే॥ ఇంతమాత్రమునకు మన ♦ కిట్టులుండఁ, జాలకాలము నుండి వ్ర ♦ జంబు నందు
రాసమండల మందున ♦ రతులఁ దేలి, నట్టి సతులెట్లు మరతు రా ♦ యంబుజాక్షు?
క॥ అని యిటు పరిపరి తెఱఁగులఁ, గనుఁగొనలను నీరు గాఱఁ♦గాఁ గమలేశుఁ
మనములఁ దలఁచుచుఁ బడకకుఁ, జనసాగిరి సక్రమముగ ♦ జనకనరేంద్రా!
క॥ ఆ రామకృష్ణు లానిశి, నా రమణీయోపవనము ♦ నందున సకలా
భీర సహితులై రుచిర, క్షీరాన్నము మెసవి తెలివి ♦ చే నుండి రటఁ. ౧౭౯

వ॥ భోజభూపతియగు నక్కంసుండును శ్రీరామకృష్ణు లానర్చిన రజకశిరచ్ఛేదంబును శరాసనవరసంరక్షణదక్షవధంబును, ధనుర్భంగంబును విని దిగులుపడి యశుభసూచకంబులగు వామాంగస్ఫురణంబులం దత్తఱపాటుతోఁ గని శయనించి కనుమూసినంతనే తైలం బొడలయందుఁ బూసికొని సిగవిరియం బోసికొని రక్తపుష్పమాలికలఁ వేసికొని వాసముల నూడం దీసికొని కాసరంబున నాసీనుండై ప్రేతలతోడం గూడి దక్షిణదిగ్యానం బొనర్చినట్లు కలం గాంచి యులికిపడి దిగ్గనలేచి చింతించుచున్నంత, ౧౮౦

సూర్యోదయ వర్ణనము.

ఉ॥ కొక్కురు కొక్కురో యనుచుఁ ♦ గోడులు గూసెను నంబరంబునన్
రిక్కలు మాసెఁ దెంట్ల రొద ♦ రేగ నిశాకరుఁడేగెఁ జక్కవల్
నిక్క విహంగనాదములు ♦ నెక్కొనె మారుని తూపులేఁపులున్
జిక్కఁ దమంబు లెల్లెడలఁ ♦ జెల్లెను దెల్లని డాలు నెక్కడిన్. ౧౮౧

సీ॥ చటులకపటులను ♦ నటినట విటివిట, చోరులం బరిమార్చు ♦ శూరుఁ డనఁగ
మార్తురఁజంపి శ్య ♦ మంతకమణిఁ దాల్చి, యరుదేరు కౌస్తుభ ♦ ధరుఁ డనంగ
సకలరోగంబుల ♦ సమయించి సౌఖ్యముల్, నరులకుం గూర్చు ధ ♦ న్వంతరి యన
బ్రహ్మవర్చస్వులౌ ♦ బ్రాహ్మణ జనులచే, మ్రొక్కులందెడి వేద ♦ మూర్తి యనఁగఁ
తే॥ దమ్ములను ప్రియురాండ్రఁ బ్రే ♦ మమ్ముచేతఁ
బొందుఁజేసెడి ప్రియుఁ డనఁ ♦ బూషణుఁడు
వేయిచేతుల తోడుత ♦ వెడలి కడల
వెలుఁగఁజేయుచు నుదయించె ♦ లలితరీతి. ౧౮౨

కంసుండు మల్లరంగంబు నిర్మింపం జేయుట.

ఆ॥ ఆసమయమునందు ♦ నా భోజభూపతి, పడక విడిచి లేచి ♦ భటవరులను
గార్యభారకరులఁ ♦ గ్రమముగా రావించి, యాజ్ఞచేసె నిట్టు ♦ లవనినాథ!

వ॥ కార్యసాధకులారా! మీరు వేవేగ జాంబూనదస్తంభవిరాజితంబును విపులాంగణసంగతంబును నగు మత్సభామండపంబున కగ్రభాగంబందలి ప్రదేశంబున మల్లక్రీడారంగంబు హంగుగా నయనపర్వం బగునట్లు గావింపుఁడన్న వారలాపలుకు తొడలఁ దాల్చి తత్స్థలంబున సిమోన్నతంబుల సమంబుగాఁ జేసి హేమసోపానసమంచితమంచంబులను రచించి చుట్టును నుంచి ముక్తాహారంబులు వ్రేలాడుచుండు బంగారుడాలుఁ బోలిన మేలుకట్టు గట్టి యతిమృదులంబగు తలగడతో వెలిఁగెడి వేకనులవాని గద్దెనద్ద వజ్రంబు లమర్చిన పొన్నులుగల చామరంబులను మరాళసన్నిభంబులగు సితవ్యజనంబులను బూర్ణచంద్రమండలరుచిరంబగు శ్వేతచ్ఛత్రంబునను నమూల్యంబులగు నవరత్నంబులను విరాజిల్లి కనులపండువొనర్చునొండు మంచంబుఁ బదిమూరలెత్తునఁ దను మేలికకై నిర్మించి యతిచతురంబుగా మల్లరంగంబు సిద్ధంబు సల్ప నయ్యదువీరుం డేతెంచి కాంచి సంతసించి మంగళతూర్యంబులు మ్రోఁగుచుండ వారాంగన లాడుచుండఁ బాటకాండ్రు పాడుచుండఁ దనకై యేర్పాటుజేసిన మంచెపై నాసీనుండయ్యె. అంతఁ గంసాహూతులగు బాణాసురనరకాసురప్రముఖదనుజవరేణ్యులును జరాసంధప్రభృతిబంధురత్నంబులును నందాదులైన గోపగ్రామణులును శంబరాసురప్రభృతులగు నాత్మసఖులును సామంతులును మండలేశులును పౌరులును జానపదులు నేతెంచి నమ్రులై పారితోషికంబులను గప్పంబులను సమర్పించి నియమితంబులగు తమయాసనంబుల నధిష్ఠించిరి. తత్సమయంబునఁ జాణూరముష్టికకూటశలతోశలప్రముఖప్రధానమల్లు లుల్లాసంబున నామల్లరంగంబుఁ బ్రవేశించి యవ్యాహతవ్యాయామం బొండొరులు ముద్గరాద్యాయుధంబులతోఁ జేయుచున్న యవసరంబున ౧౮౪

శ్రీరామకృష్ణులు కువలయాపీడగజంబు వధించుట.

ఆ॥ రామహరులు మల్ల ♦ రణకేళిఁ జూడంగ, నరుగుదెంచి మోస ♦ లందు మిగులఁ
గ్రొవ్వి తిరుగులాడు ♦ కువలయాపీడమున్, ద్విరదవరముఁ గాంచి ♦ సరభసమున.

చ॥ తొలఁగి మదేభచోదకుని ♦ తో హరి యిట్లను మావటీఁడ! యీ
కలభము నీవు ప్రక్కకటు ♦ గైకొని మార్గము మాకొసంగు మి
ట్టుల నొనరింపవేని నిను ♦ డొక్కలు చీలిచి యేనుగతోడఁ గు
క్కల కిపుడేను వేసెదను ♦ గాచికొనం గమకింపుమా! యనన్. ౧౮౬

ఆ॥ మావటీఁడు మెండు ♦ మండిపడుచుఁ దన్మ, దేభవరముఁ ద్రోచెఁ ♦ గృష్ణుపైని
నంత నదియుఁగూడ ♦ నామృత్యుదేవత, యనఁగఁ జెలఁగి మిగుల ♦ నాగ్రహించి. ౧౮౭

శా॥ శీత్కారంబులు సర్వదిక్కరులకున్ ♦ జేద్పాటు సంధిల్లఁగా
నుత్కర్షంబుగఁ జేసి శత్రుకులనా ♦ శోత్తీర్ణతుండంబుతోఁ

గుత్కలాధిపధారినిన్ హరిని గై ♦ కొం చెత్తె నా కృష్ణుఁ డున్
దత్కాలంబున దానినుండి నెటులోఁ ♦ దప్పించుకొం చేగుటన్. ౧౪౮

శా॥ కుంభిశ్రేష్ఠము సూచి క్రమ్మఱ లలిన్ ♦ గోపించి కుప్పించి త
జ్జంభారాతి సహోదరున్ గరముతోఁ ♦ జక్కంగఁ జేపట్టి వే
స్తంభంబుల్ బురుడించు పాదముల క్రిం ♦ దన్ వేయుచున్ ద్రొక్కి బల్
జృంభింపంగఁ జతుర్భుజుం డభయుఁడై ♦ చిత్రంబుగాఁ జూచి తాన్. ౧౪౯

శా॥ బృందారణ్య నికుంజపుంజములలో ♦ వృక్షంబులం ద్రోయు రీ
తిం దన్నాగపదంబు లట్టు లిటులన్ ♦ దిట్టంబుగా నెట్టి వె
న్కం దైవారి మదేభ మడ్డముగ వే ♦ గం దిర్గి శ్రీకృష్ణు ని
స్పందేహంబుగఁ బట్టి కొట్టఁ గడఁగెన్ ♦ సవ్యాపసవ్యంబులన్. ౧౫౦

మ॥ అటుపై దానవవైరి వైరికరిసిం ♦ హంబై చుఁ, దద్దంష్ట్రిలు
త్కటరోమంబునఁ బట్టి యూఁపి కసి మో ♦ కారించి కారించి యు
ద్భటరీతిన్ బ్రహరించి మించి పురికిన్ ♦ బాఱంగ మత్తేభమున్
బటుదర్పంబున వెంటనంటె నగరిన్ ♦ బర్వంగఁ గోలాహలాల్. ౧౫౧

శా॥ పాపధ్వంసకుఁడైన దానవకుల ♦ ప్రధ్వంసకుం డాగజం
బేఁపన్ గ్రమ్మఱివచ్చి నద్ది హరితో ♦ నేతెంచువేళన్ బలుం
డాపాతంబుగ దానితోఁక నల స ♦ ర్వారాతి సర్పంబులన్
మాపన్ లాగిన లాగు లాగెఁ బృథులా ♦ మర్షంబునన్ భూవరా! ౧౫౨

క॥ ఆపై శ్రీపతి కని నగి, కూపపుచేఁత్రాడులాగు ♦ కొనిన ట్లరిని
ర్వాపణచణమైన కువల, యాపీడకరంబు లాగ ♦ నారంభించెన్. ౧౫౩

క॥ ఇరువురుఁ దుదమొదలీరహి, వఱలుచుఁ గరపుచ్ఛములను ♦ బటుభుజములతోఁ
బెఱకఁగడఁగ నాగజము పొగరు విడి నిశ్చేష్టమయ్యెఁ ♦ గలుషవిదూరా!

శా॥ దానిం గాంచి దురాగ్రహోగ్రనిభులై ♦ దర్పించి తచ్చోదకుల్
మానుల్ ధీనిధు లేద్వు రుద్దవిడి త ♦ న్మత్తద్విపం బెక్కి య
ద్దానిం ద్రోలఁగసాగి రంకుశముతో ♦ దైత్యారిపై నింకఁ గ్రో
ధానూనానిలమూర్తులైన పెఱవా ర ♦ త్యార్భటుల్ సేయుచున్. ౧౫౫

తే॥ మూఁడువందలకరులపై ♦ మొనసి యెక్కి, యంకుశాస్ఫాలనంబులన్ ♦ హరిహరులను
జంప వానిని ద్రోలి రా ♦ సమయమందు, గువలయాపీడమను కరి ♦ కోపగించి.

ఉ॥ చండపరాక్రముం డయిన ♦ చక్రధరున్ హరియింపఁ బోవ నా
తం డలదాని తొండమును ♦ ధైర్యముగా బిగఁబట్టి యన్న యం
దుండి కనుంగొనన్ జను లొ ♦ హోయనఁ ద్రిప్పుచుఁ బోదె ధాత్రిపైఁ
గొండికవాఁడు గిండిఁగొని ♦ కొట్టినయట్టుల ధారుణీశ్వరా! ౧౫౭

ఆ॥ అంత నద్ది గిట్టి నవలఁ దజ్జ్యోతియుఁ, గృష్ణమూర్తిలోఁ ల యించె జక్రి
దాని దంతములను దక్షణంబునఁ బీకి, యెవ్వారైన మావటీండ్రఁ జదిపె.
తే॥ మఱియు సీరి శేషించిన మత్తకరులఁ, బట్టి కొట్టెను దత్రత్యబలులు గాంచి
వర్షకాలము జనినట్టి పద్ధతిఁ గని, వారిదములు బాఱినయట్లు వాఱి రవల.
క॥ గోపకబాలకయుతుఁడగు, శ్రీపతి బలరాముఁ గూడి చిత్రమ్ముగముల్
మాపిన పంచాస్యమువలె, నేపునఁ దగి జయరవంబు లెల్లెడ నిండన్. ౨౦౦
తే॥ ఆస్యకాంతి యనూరుని నపహసింప, శ్రమజలంబులు కాల్వలై చనఁగ దంతి
దంతముల్ మూఁపులందునఁ దనరుచుండఁ, జిచ్చుహెచ్చిడి ననిలంబుస్థితిని వెడలి.

రామకృష్ణులు చాణూర ముష్టికాద్యసురుల వధించుట

తే॥ శిల్పిముఖశిల్పచిత్రవిచిత్రితంబు, సర్వభూపసుహృద్భృత్యసంగతంబు
సంగపాటవాదర్శనాస్థాంగణంబు, కంసకల్పిత మల్లరంగంబుకడకు. ౨౦౧
సీ॥ పూఁబోఁడులందఱు పుష్పబాణుండన, జెట్టులెల్లరు జగజెట్టి యనఁగ
గోపకులెల్లరు గోకుల విభుఁడన, దుష్టులు వైవస్వతుం డనంగఁ
బరమయోగీంద్రులు పరమతత్త్వంబన, సురజాలములు విరాట్పురుషుఁ డనఁగఁ
నందరాజస్వకీయ నందనుండని యుబ్బ, రాజన్యులును రాజరాజనంగఁ
తే॥ గంసుఁ డాత్మీయ మృత్యువుగాఁ దలంప
మఱియు నితరులు దమ తమ మానసముల
నున్నరీతుల నెన్నఁగా నొయ్యనరిగి
నలుగడల్ శోభ సెందఁగ నిలిచె నపుడు. ౨౦౩
తే॥ భోజభూపుండు వచ్చిన పుండరీక, నయను బలులను జచ్చిన నాగవరముఁ
గాంచి యబ్బురముం బొంది కలఁతఁ జెంది, యేమితోఁచక మొద్దుర హీని వసించె.
చ॥ మఱి యల మంచి మంచముల మానుగ నున్న సుధీమణుల్ నిశా
కరునిఁ జకోరవారములు గాంచి ముదంబును బొందినట్టు లా
హరిఁ గని సంతసించి రికనన్యులు నీ వసుదేవపుత్రు లి
ర్వరును బరాత్పరుల్ గుణులు పుణ్యులటంచుఁ దలంచి యెంతయున్.
ఉ॥ ఈహరి పుట్టినట్టి స్థల మీ హరి తిర్గిన తావు నీజగ
న్మోహనుఁ గన్నవారలు వి నోద మొనర్చెడి వీని మిత్రసం
దోహము వీనిఁ గన్న విబుధుల్ మన మీ పురవాసులెట్టి సం
దేహములేక ధన్యతను దేఱిరె? యంచు వచించి రయ్యెడన్. ౨౦౪
శా॥ వీణాదుందుభి కాహళీ పటహముల్ వేమాఱు మ్రోయంగ నా
చాణూరుం డల శౌరి సీరులను బ్రశ్నన్ జేసె నీరీతి మీ

ర్జాణల్ శూరులు గాన లెందు మృధమ ♦ స్మద్రాణ్మనః ప్రీతికై
త్రాణన్ జేయుట యొప్పదే ? మనకిటన్ ♦ దైవారవే భద్రముల్. ౨౦౭

ఉ॥ నాపుడు రామకృష్ణులును ♦ నవ్వి యిటుల్ పలుకాడిరో బలీ !
చేవను నీడు వాడుకలఁ ♦ జేఁతల రీతుల నీకు సాటి మే
మేవిధినైన రాఁగలమె? ♦ యిద్ది యధర్మము గాదె? దీని నీ
భూవరుఁడేని నొప్పునొకొ ? ♦ బొట్టె లటంచు మముం దృజింపఁడే ? ౨౦౮

క॥ అనవుడు చాణూరుండును, విని యిట్లనె నయ్యలార ! ♦ వేయేన్గులచే
వనుదగు కంసుని గజవర, మును జంపుట మీరు నాకుఁ ♦ బోలరె? ప్రతిగాన్.

ఉ॥ మీరలు వీరవీరులని ♦ మేము దలంతుము కాని యర్భకుల్
సారము లేనివారనుచు ♦ స్వాంతమునందు గణింపమన్నఁ జా
ణూరునితోడ భార్గవిమ ♦ నోహరుఁడున్ హలి ముష్టికాఖ్యుతోఁ
బోరఁ గడంగి రుత్సుకతఁ ♦ బుష్కరమం దమరాళి గన్గొనన్. ౨౧౦

వ॥ అమ్మెయి నమ్మల్లు లొక్కుమ్మడి భుజదండమ్ములతో నాకర్షణనోద నాదులం గావించుచుఁ గనుబొమలు ముళ్లుపడ నేత్రంబులు ప్రలయాగ్నినిభంబులుగాఁ గరి కరితోఁ దాఁకు పోఁకను గిరి గిరితోఁ బోరుతీరునను హరి హరితో డీకొను జోకను బదాపదిం బాహాబాహిం గచాకచిన్ ముష్టాముష్టులను బోరాడు నవసరంబున శ్రీహరి నిజకరంబులఁ జాణూరశరీరం బట్టి యుత్తమ్మిచూలి పుష్పమ్ముల ప్రోవుం దూఁచి నట్లు తద్దేహభారంబుఁ దూఁచి త్రోచి వేఁచ నాచపలుం డను చూచి యనాయాసంబుగా నొకకరంబునఁ గందుకం బెత్తుపొందికను నాదిశేషుం డీభూఖండంబు దాల్చిన ట్లాచక్రధరు నెత్తియెత్తి యుత్తరంబునఁ బడవేయ నాయచ్యుతుం డాకపటు కటికంధరంబులం బట్టి యెత్తి యట్టిట్టాడించి డించి గిఱ్ఱునం ద్రిప్పి భూతలంబున గిరాటువేయ నాయసురుం డాగ్రహంబున నుగ్రంపఱ్యాదై నిగ్రహించుటయుఁ దత్సభాంగణమండలి గవాక్షంబుననుండి విలోకించుచున్న యన్నుమిన్న లాయాస సంజనితాంబుసీకంబులగు శ్రీరామకృష్ణుల దేహంబులం గాంచి నిట్టూర్పుపుచ్చి. ౨౧౧

మ॥ అరరే! కుఱ్ఱల నీబలాచ్యుతులఁ బు ♦ ష్పాభాంగులన్ గ్రూరులన్
విరసుల్ వజ్రకఠోర దేహు లమర ♦ ద్వేషాఢ్యు లాముష్టికా
సురచాణూరులతో నియుద్ధము దయన్ ♦ సూదంతయున్ లేక భూ
వరుఁడీ కంసుఁడు సేయఁజేసెఁగద! యీ ♦ పాపంబు సామాన్యమే? ౨౧౨

క॥ అక్కట! యిక్కుఱ్ఱల నిటు, సుక్కించెడి కంసుఁ ద్రుంచు ♦ శూరవరేణ్యుం
డొక్కం డిక్కడ లేఁడే?, లెక్కింపక కనెడి వీరు ♦ లేకులు గారే? ౨౧౩

ఆ॥ సభకుఁ జనుట తప్పు ♦ సనినప్డు సభ్యుల, తప్పు నెఱుఁగకుంట ♦ దప్పు తెలిసి
యూరకుంట దప్పు ♦ దాఱుమాఱుగ నందు, బల్కుచుంట దప్పు ♦ ప్రాజ్ఞనకును.

సీ॥ అంభోజములకైన ♦ నంభోజనేత్రుండు, హస్తంబులం గొని ♦ యాదరించుఁ
బిల్లఁగ్రోవుల కైన ♦ వెన్నుండు గమ్మని, యధరామృతం బిచ్చి ♦ హర్ష మొసఁగు
నెమలిపురుల కైనఁ ♦ గమలామనోహరుం, డుత్తమాంగంబునం ♦ దూని మెచ్చుఁ
గడప చెట్టులకైనఁ ♦ గరుడధ్వజుం డొప్పి, సరససల్లాపముల్ ♦ సలుపుచుండు
తే॥ స్వర్ణవర చేలముల కైన ♦ సకల భువన, మోహనుం డంసమందునఁ ♦ బూనితీరు
నిటులు సలుపఁగ నేనోము ♦ లేలరావొ, యెట్లు జీవింతుమో యమ్మ! ♦ యింక మనము.

మ॥ మన మా గోకులమందు ప్రేతలుగ జ ♦ న్మం బెత్తినన్ సూర్యచం
ద్రనిలింపేశశివేశపావకమునీం ♦ ద్రబ్రహ్మధాత్రీమరు
ద్వినుతుండై తగు వీని సద్గుణములన్ ♦ వేషంబు రూపాదులన్
గనమా! మ్రొక్కము! కౌఁగిలించుకొనమా! ♦ కామించి క్రీడింపమా!
తే॥ ఈ మహామహుఁ గనుఁగొన ♦ నేమి యేమి, నోములను వ్రజవాసులు ♦ నోచినారొ
యితనితోఁగూడి యాడి హ ♦ ర్షించు గోపికల యదృష్టమింత దటంచుఁ ♦ బలుకఁ గలమె?

క॥ గడచిన దానికి దుఃఖము, పడుటొప్పదు నేఁడు మనకు ♦ భాగ్యవశమునన్
విడిముడియొడయని దరిసెన, మడరిన యందులకు మనము ♦ హర్షింపవలెన్.
తే॥ కాని యక్రమయుద్ధంబు ♦ గలిగె నిచట, సింగులకుఁ జింత గలిగెడి ♦ నిందునిట్టి
చిట్టివారె జయంబును ♦ జెంది జగతి, వృద్ధిఁగనెదరు గాక న ♦ హీనకీర్తి.

వ॥ అని ప్రీతిమీఱఁ బల్కుచుండుటయు నందుండు గుందుటయుఁ గాంచి యా శ్రీవత్సలాంఛనుండు రిపుభయంకరుండై దోర్బలంబున నాకర్బురనాయకుం బట్టి వాతంబు సరోజాతంబును బెఱికివైచినట్లు వియత్తలంబునఁ బాఱవేయ నాయా యతకాయుండు దివినుండు నక్షత్రం బధోముఖంబుగా రాలులీల నేలంగూలి క్రమ్మఱ నుత్థితుండై తనబలంబుకొలఁదిని నాకృష్ణుం బ్రహరింప నాహరి వెనుకంజవేయక యోర్చి నిజభుజదండంబున నాదుండగీఁ గైకొని నేలం గూల్ప నాయాల్పుండు భిన్న దంతుండయ్యు ననల్పబలాగ్రహావేశసంభ్రమంబులచేఁ బరవశుండై ముష్టిద్వయంబున నాయష్టమూర్తి మిత్రుం బొదివె. పిమ్మట నమ్మాధవుం డుమ్మలింపక యమ్మనుజ భక్షకుఁ దత్కాంసనమ్ముఖమ్మున నతిరభసమ్మునఁ ద్రిప్పిత్రిప్పి యందఱు పరికించు చుండ నీక్షోణిం బడవైవ నాకంసభటుండు రుధిరంబు ముక్కుమొగంబులనుండి మెండుగా వెడలంగ్రక్కి విగతప్రాణుండయ్యె. వెండియు. ౨౨౦

మ॥ బలరాముండును ముష్టికాసురుఁడు శుం ♦ భద్బాహు దర్పంబులన్
బ్రబలయాగ్నులవోలెఁ బోరి రంత హలి త ♦ ద్రాత్రించరుం బట్టి బల్
నలగం గొట్టి పదద్వయంబుఁ గొని త ♦ న్నాగారి పైనుండి పా
ములఁ గ్రిందన్ బడవైచినట్లు వడితో ♦ భూమిన్ బడన్ వైవఁగాన్. ౨౨౧

తే॥ ముష్టికుండును నెత్తురు♦ముఖమునుండి, గ్రక్కి గ్రుక్కి కట్టకడకుఁ♦గాలమయ్యె
నద్దిగని యెదిరించు కూ♦టాఖ్యముష్టిఁ, గొట్టె హలి; హరి గిరిఁబవిఁ♦గొట్టినట్లు.

తే॥ అవల డీకొను శలదైత్యు♦నబ్జనాభుఁ, డాగ్రహించి విలోకించి♦నిగ్రహించి
యొక్కలత్తతో ఖండించెఁ♦బక్కితేఁకు, తుండమున సర్పముం బట్టి♦చెండినట్లు.

తే॥ మఱియు శ్రీహరి తోశల♦మనుజభక్షకు నవలీలఁగఁ జీల్చి కం♦సుని సమీప
ముందుఁ బడవైచెఁ గ్రొవ్విన♦హస్తివరము, తరుపు ఖండించి వైచిన♦కరణి జనక!

ఉత్సాహ॥ మల్లరంగమందు నిట్లు ♦ మల్లవరుల నందఱన్
వల్లపులును బిల్లలు నగు ♦ పద్మనాభసీరులే
డొల్లఁజేయ వార లప్పు♦డు మడసి రది గాంచి త
న్మల్లసఖులు లాతివారు ♦ మనఁగఁ బాఱి రరమునన్. ౨౨౭

తే॥ అవలఁ బ్రేక్షకులెల్ల రా ♦ హా! యనంగ
హరిని మృతమల్లవిద్యుతుల్ ♦ వరుసఁ గలిసె
నంత శ్రీదామముఖసుహృ ♦ దాళితోడఁ
గూడి యనిఁజేయఁ గడగి రా ♦ కుంద బలులు. ౨౨౮

మ॥ తరువాతన్ బురవాసులెల్లరు క ♦ నద్రత్నాంచితాలంకృతుల్
వరపింఛంబును బట్టుపుట్టముల శుం ♦ భద్వంశినేత్రంబులన్
సరవిం దాల్చి మృగేంద్రసామ్యులయి స్వ ♦ చ్ఛందంబుగాఁ దిర్గు నా
హరితాలాంకులఁ జూచి దుందుభులు మ్రో ♦ యన్ సంతసం బొందుచున్.

తే॥ కుఱ్ఱలయ్యు వీరెంతెంత♦గొప్పపనుల, సులువుగాఁ జేసిరనుచుఁ గం♦సుండు దప్ప
మేలు మేలని పొగడిరో♦మేదినీశ!, యీర్ష్య పరబలమొప్పునే? ♦ యెచటనైన.

శా॥ అంతన్ గంసుఁడు స్వీయమానపజయం ♦ బాలించి క్రోధభ్రమా
క్రాంతుండై రొదఁజేయు తూర్యముల వే ♦ గన్ నిల్పి యోష్ఠంబుల
త్యంతం బల్లలనాడ భృత్యులకు నే ♦ తద్రీతి శాసించె నా
చెంతన్ నిల్చి వచించినట్లు పనులన్ ♦ సిద్ధింపఁగాఁ జేయుఁడీ! ౨౨౯

చ॥ మఱి వసుదేవ రూపమును ♦ మాపుఁడి! తండ్రిగాక శత్రువై
కరముగ నాకు బాధలను ♦ గల్పనఁ జేసెడి నుగ్రసేనునిన్
నఱకుఁడి! నిర్జరాంశల ఘ ♦ నంబుగఁ బుట్టిన యాదవావళిన్
ద్వరగ వధింపుఁడీ! కరుణఁ ♦ దాల్పకుఁడీ! యని పల్కు కోపలన్. ౨౩౦

శ్రీకృష్ణుండు కంసుని వధించుట.

శా॥ అంభోజేక్షణుఁ డాఁకటన్ దిరుగు పం ♦ చాస్యంబు దానోల్లస
త్కుంభీంద్రంబును జూచి దూఁకునటు శా ♦ ర్దూలంబు మాఁహేయి సం

రంభస్ఫూర్తిని బట్టఁబోవు కరణిన్ ♦ రత్నోజ్జ్వలత్పీఠిపై
దంభంబొప్పఁ జెలంగు కంసవిభుపైఁ ♦ దా దూఁకె రుద్రాభుఁడై. ౨౩౦

ఉ॥ పిమ్మట భోజభూవిభుఁడు ♦ భీతిలి మిత్తియె వచ్చె నంచు చెదర్
సమ్మి తెగించి మంచె విడి ♦ నవ్యకృపాణముఁ గేలఁ దాల్చి గ
ర్వమ్మున సెలంగ మాధవుని ♦ పై నరుగన్ గని శౌరి వాని దై
ర్ఘమ్మునఁ బట్టెఁ దార్క్ష్యుఁడు మ ♦ హాఫణి నుక్కునఁ బట్టినట్టులన్. ౨౩౧

తే॥ కానఁ డంతటఁ బుండరీ♦కమును పాము, విహగపతి నోటనుండి త♦ప్పించుకొనిన
రహిని నెప్పలో కృష్ణుక♦రములనుండి, తప్పుకొని చక్రధరుపై ని♦దారసిల్లె.

శా॥ కంసుండంతఁ మధుహింసకుండు నిటులన్ ♦ గ్రావంబుపై సింహముల్
రెంటాపాత్రతముగాఁగఁ బోరినటులన్ ♦ లక్షించి యన్యోన్యమున్
హింసల్ బొందుచు మంచెఁ బోరి రల భో ♦ జేశానుఁ డజ్జాతునిన్
హింసింపన్ శతహస్తుఁడై దివికి వే ♦ యెగంగ శ్రీకృష్ణుఁడున్. ౨౩౪

తే॥ డేగ డేగను వెంటనం♦టిన విధమున, వాని వెంబడిఁ బాఱుచు♦బాహువులను
ముజ్జగంబులఁగలబల్మి♦మొనసిపట్టి,త్రిప్పి పైనుండి మంచెమీఁ♦దికిని ద్రోసె.

తే॥ తెగుపరంబు తటిత్ప్రపా ♦ తంబువలన, భగ్నమైనట్లు కంసప్ర ♦ పాతమునను,
మంచ దండము విఱుగుటఁ♦గాంచి యట్టి,వజ్రసముకాయుఁడగు భోజ♦పార్థివుండు.

ఉ॥ ఇంచుక వ్యాకులాత్ముఁ డయి ♦ యేడ్తెఱ నుత్థితుఁ డౌచు బిట్టు కో
పించి కృపాణపాణి యయి ♦ వెన్నుఁ డనాది మహానుభావుఁ డం
చెంచక పోరుచుంటఁ గని ♦ కృష్ణుఁడు వానిని దిర్గి మంచెపై
నుంచి యురంబు నెక్కి శిర ♦ ముద్ధతిఁ బట్టి కరద్వయంబునన్. ౨౩౭

చ॥ సిగ బిగియంగఁ బట్టుకొని ♦ చెచ్చెర మంచమునుండి క్రిందికిన్
వగవఁగ నెట్టె గండశిలఁ ♦ బర్వతశృంగమునుండి నేలకున్
మిగుల బిఱానఁ ద్రోసినటు ♦ మేదినినాథ! యనంతవిక్రముం
డగు హరి వానిపైఁబడె నవ ♦ యంబుగఁ దన్మృతిశోధనార్థమై. ౨౩౮

తే॥ పిరలిద్దఱు నిహి ♦ విపులపైనఁ, గూలియుండుట నిద్దర ♦ క్రుంగి స్థాలి
భాతి నొక్క ముహూర్తంబు♦పట్టలేని, ఫక్కిఁ దుకతుకలాడె నో♦వసుమతీశ!

శా॥ సింహంబేనుఁగు పీనుఁగున్ ధరణిపైఁ ♦ జిత్రంబుగా నీడ్చిన
ట్లంహోనాశకుఁడున్ బలాత్పరుఁడు నా ♦ నజ్జాతుఁ డా కంసునిన్
సంహారం బొనరించి చిత్రగతి నా ♦ సంస్ఫోటరంగంబునన్
రంహస్ఫూర్తిని నీడ్చెఁ బర్వులిడఁగన్ ♦ రాజుల్ మహాభీతితోన్. ౨౪౦

తే॥ పిదప వైరభావంబుతో ♦ విగతజీవుఁడైన కంసుండు వెన్నుని ♦ వఖినుతించి
యోగిగా నలవాని సా♦రూప్యమొందె, భ్రమరకీటకన్యాయంబు♦వలెను జనక!

శ్రీకృష్ణ బలరాములచేఁ గంసానుజాష్టకంబు హతంబగుట.

వ॥ ఆ తరువాత నాతని కనిష్ఠభ్రాతలగు సునాముఁడు, సుహ్రూవు, సృష్టియుఁ దుష్టిమంతుండును, రాష్ట్రపాలకుండును, గంకుండును, శంకుండును, న్యగ్రోధుండును నవ్విధంబునఁ జివ్వను నవ్వనరుహనాభునిచేఁ గూలియున్న తమ యన్నం గని కన్నులందు విస్ఫులింగంబు లభంగురంబుగాఁ గురియంగఁ గోపించి రూపించి తెగించి విక్రమించి మించి యఘోరంబుగా రవళించి నిశాతహేతిభల్లవ్రాతంబు ధరించి సంగరరంగంబుఁ బ్రవేశించి నరహరిశిరఃకర్తనం బొనరింప నరుగుదెంచుట దూరంబునుండి రౌహిణేయుం డారసి మృగంబులం గని జంకుగొంకులు లేక గర్జించు సింగంబుభంగి నహంకారంబున హుంకరింప నాపరిపంథు లదరిపడి గడగడవడఁకి గగ్గోలుపడి దండఘాతంబులచేఁ జూతంబులనుండి ఫలంబులు జలజలరాలులీల నిజపాణులనుండి కృపాణబాణములు వడ నడలునఁ బుడమినిఁ గూలఁబడి వడి లేచి విడివడి వడముడి గురుఁడగు నత్తాటిపడగవాని మేనుం బిడికిళ్ళతోఁ గరీంద్రంబులు శుండాదండంబులతో గిరివరంబు గ్రుమ్మినట్లు బొడువ నమ్మధుసూదనాగ్రజుండు కనలి ముద్గరంబుతో సృష్టిసునాములం గొట్టి దక్షిణభుజంబున న్యగ్రోధుం బరిమార్చి వామహస్తంబునం గంకునిం డింకవేయించె. మఱియు నా రమారమణుండు వామపాదంబున శంకుని, సుహ్రూనిఁ, దుష్టిమంతుని, నష్టంబు సల్పి దక్షిణపాదంబున రాష్ట్రపాలకుని రూపుమాపె. ఇట్లు కంసానుజాష్టకంబు వాతసంఘాతఘాతంబుచేత ధరాజాతజాతంబు పాతంబుజెంది హతంబైనరీతిఁ బీతాంబర నీలాంబరులచే హతంబై కరుణాభరణుండగు నా పరమునియందు లీనంబైన సమయంబున, ౨౮౨

సీ॥ బృందారకేంద్రులు ♦ విరుల వర్షించిరి, కాంచిరి ముదము సం ♦ గాతకాంక్షు
రంభాముఖాప్సరో♦రమణులు నాడిరి, పాడిరి గంధర్వ ♦ భామినులును
జయజయధ్వానముల్ ♦ సర్వదిక్కుల నొప్పెఁ, దప్పెను శిష్టసం ♦ తాపమెల్ల
నందాదిఘోషు లా ♦ నందంబుఁ జెందిరి, వొందిరి భీతినిఁ ♦ బూర్వసురలు

తే॥ విశ్వసృణ్ముఖసురతతి ♦ వినుతిఁ జేసె
మ్రోసె దుందుభికాహళ ♦ ముఖరతూర్య
ములును మునులును దీవెనల్ ♦ సలిపి రరరె!
హరియు హలియు శోభిల్లి రా ♦ యవసరమున. ౨౮౩

కంసుని భార్యలు విలపించుట.

క॥ అస్తి ప్రాస్తు లను సతులు, నిస్తుల బలుఁడైన మగని ♦ నిధనము విని వే
హస్తములఁ హృచ్ఛిరములఁ, గస్తిని బ్రహరించుకొనుచుఁ ♦ గన్నీరొల్కన్.

తే॥ భండనాంగణమందు వేఁ♦దండశవము, పగిది బడి యున్న కంసుని♦ప్రక్కఁ జొచ్చి
సేదు మాత్రాభ్ర్యదెగ నంచుఁ♦బోఁడిమి విడి, కాకిగోలగ నిట్టుట్టుఁ♦గాఁ దొడఁగిరి.

తే॥ హా మనోనాథ! హా దేవ! ♦ హా మహాత్మ! హా సురాసురాధికబల! ♦ హా నరేంద్ర!
హా మహావీర! హా యాద ♦ వాధినాథ! హా జరాసంధనుతతేజ! ♦ రాజరాజ!

శా॥ అయ్యో! యక్కట! చెల్లబో! కటకటా! ♦ హా నాథ! యీరీతి మా
కుయ్యాలింపక యేగుచుంటి వెటకో ♦ కోర్కిన్ మముం గాంచుమా!
కయ్యం బాడి త్రిలోకసంపదను సా ♦ కల్యంబుగాఁ గొన్న నీ
వియ్యాజిన్ బడియుంటి వట్టి బల మి ♦ ష్టేమయ్యె భోజేశ్వరా! ౨౪౮

తే॥ అరయఁగా నరులను గాని ♦ యమరులందుఁ, గాని కర్బురులనుగాని ♦ కలనులోనఁ
గసిని నిన్నుఁ డీకొను వారు ♦ గలరె చెపుమ? యట్టి నీ కెటు మృతియేల ♦ హా త్రైనొక్షా?

ఉ॥ ఆరయ నీవు నీభగిని ♦ యందు జనించిన పుత్రకాళి ని
ష్కారణరీతిఁ జంపితివి ♦ శత్రువులైనను గాక పోయినన్
బౌరుషమే ప్రధానమని ♦ భావమునందుఁ దలంచి దిట్టవై
మారణ మాచరించితి వ ♦ మాయికులన్ యదువంశజాతులన్. ౨౪౯

క॥ తత్కారణముననే నీ, వుత్కట బలివయ్యు మృతిని ♦ నొందితి వంచే
ముత్కర్షముగఁ దలఁతు మ,త్యుత్కటపుణ్యాఘసంఘ ♦ మూలిక చనునే?

తే॥ కాన వగచిన ఫల మేమి ♦ గలదు మాకు, నుదుటి వ్రాతలు కొంచెమేన్ ♦ జెదరఁగలవె?
మే మనాథలమై యిట్లు ♦ మెలఁగ వలసె, నెవఁడు తప్పింప గలఁడయ్య! ♦ యిద్ధచరిత!

తే॥ మఱియుఁ గృష్ణుఁడు మృతుఁడైన ♦ మాతులునకు, నంతికంబున దైవారి ♦ యాగమవిధిఁ
బారలౌకికక్రియలను ♦ బూరితిగను, నాచరింపఁగఁ జేసియు ♦ నతిశయించి.

ఉ॥ ప్రేతుకపాళిఁ గూరిచి గ ♦ భీర గళంబున నిట్లుపల్కె నీ
రాక్షసనాయకుండు మధు ♦ రాపురనాథుఁడునైన కంసుఁడా
పక్షులపోల్కి నొంటరిగ ♦ వర్తిలు పేదలసాధులన్ గసిన్
శిక్షయొనర్చె నందున న ♦ శించెను నిక్కము మీరెఱుంగుఁడీ! ౨౫౩

తే॥ కాన మీరింకఁ దెలివితోఁ ♦ గ్రాలవలయు, నంచు వచియించి తత్కంసు ♦ నంగనలను
నూఱడించి కళిందజా ♦ తీరమందుఁ, జందనాంచితచితులను ♦ జక్కఁ గూర్చి.

ఆ॥ పతికి మఱియు మృతికిఁ ♦ బాల్యవృద్ధవారికి, దహనముఖకృతులను ♦ దద్దఁ జేయఁ
జేసి బలునిఁగూడి ♦ వాసుదేవుఁడు వసు,దేవు దేవకీస ♦ తినిఁ గనంగ. ౨౫౫

రామకృష్ణులు దేవకీవసుదేవుల చెఱమాన్పి యుగ్రసేనునిఁ బట్టాభిషిక్తుం జేయుట.

చ॥ యదుకులజాతులం గలిసి ♦ యా తలిదండ్రులు గల్గు బంధనం
బుదరికి నేగఁగా ఖగవి ♦ భుం డరుదేరఁగ నాగపాశముల్
వదలినమాడ్కి గుత్తమునఁ ♦ బాణులఁ గట్టిన వారి సంకెలల్
వదలఁ[illegible]యు వీరు భగ ♦ వంతు లటంచు నెఱుఁగు లోపలన్. ౨౫౬

తే॥ చక్ర సంభవస్థితిలయ ♦ సాధనమును, మోహకారియును నగుమాయఁ ♦ బుమ్కలముగ
నలముకొనఁజేయ వారలు ♦ దెలివిఁ దప్పి, రామకృష్ణులు సుతులని ♦ ప్రేమతోడ

ఉ॥ కష్టము లిట్లు చెందితిమి ♦ గాదె యటంచు వచించునట్టు లా
విష్టపనాథులన్ దరికిఁ ♦ బిల్చి కవుంగిళులం బొనర్చ నా
దుష్టనిశాటహంతకులు ♦ తోడన మ్రొక్కి క్షమాపణంబు సు
స్పష్టముగా వచించి తమిఁ ♦ బల్కిరి తల్లికిఁ దండ్రి కిట్టులన్. ౨౫౮

శా॥ తల్లిం దండ్రిఁ బితామహిన్ గురుని దా ♦ తన్ జ్యేష్ఠు నభ్యాగతున్
గల్లల్ బల్కనివాని భక్తు నతిథిన్ ♦ గాంతన్ సఖున్ భూసురున్
సల్లాపాదుల సంతసంబు గలుగన్ ♦ సాగించు నాతండు హా
చ్చిల్లున్ యోగ్యులలోన నింకఁ బరుఁడో ♦ జీవన్మృతుండే కదా ? ౨౫౯

క॥ తల్లికి దండ్రికి నరుసముఁ, గొల్లలుగాఁ గూర్చువాఁడె ♦ కొడుకగుఁగాదే ?
తల్లిని దండ్రినిఁ జెల్లుగ, నల్లరి నొనరించు తులువొ ♦ యాత్మజుఁ డగునే? ౨౬౦

శా॥ అమ్మా! నాయన! మాకుఁగా నిటులఁ గా ♦ రాగార మందుండి క
ష్టమ్ముల్ పెక్కిటిఁ బొంది యుంటిరి మిా ♦ రస్మాకస్యమే యాస్థితిన్
వమ్మున్ సల్ప సమర్థతల్ గలిగియున్ ♦ బాపంగ రానట్టి యా
మమ్మున్ గుఱ్ఱలటంచు నెంచి దయతో ♦ మన్నించి రక్షింపుఁడీ! ౨౬౧

క॥ ధర్మార్థకామముక్తులు, మర్మము విడి యొడఁబడఁ గట్టి ♦ మైనొసఁగిన మి
మ్మర్మిలిఁ జూడని యామముఁ, గూర్మిని సైరించి నతులఁ ♦ గొనుఁడీ! కనుఁడీ!

చ॥ మలినము జెందనీదు గుణ ♦ మండలి వీడదు స్నేహముల్ విడన్
దలఁపదు దివ్యపాత్రమును ♦ దాపము జెందఁగనీదు ద్రవ్యమున్
దొలఁగడివేళ సంచలతఁ ♦ దూకొన దార! సుపుత్రదీప మే
కులగృహమందునేన్ మఱొక ♦ గొప్ప ప్రదీపము గల్గనేర్చునే ? ౨౬౩

తే॥ దేవకీవసుదేవులు ♦ తేనెలొలుకు, వారి పలుకుల కానంద ♦ పరవశులయి
రామకృష్ణాఖ్య సుతులఁ గ ♦ రముఁ గొంచు, ముద్దులాడుచు నుండిరో ♦ పుణ్యపురుష!

ఉ॥ శ్రీమహిళాధవుం డవల ♦ స్నేహితసంవృతుఁడౌచు స్వీయ మా
తామహు నుగ్రసేనవిభుఁ ♦ దత్క్షణమందునఁ బిల్చి తాత! నీ
వీమెయి రాజ్యపీఠమున ♦ నెక్కుము ధర్మయుతంబుగా ధరన్
క్షేమ దలిర్ప నేలు మెట ♦ వేదవిరుద్ధకుబోధ లేనటుల్. ౨౬౫

మ॥ అని వాక్రుచ్చి వియచ్చరుల్ పొగడఁగా ♦ నాత్మీయు లామోదముం
గనఁగా నున్నత రాజ్యపీఠమున నె ♦ క్కన్ జేసి యామిాఁదఁ గం
సుని క్షితిన్ బరదేశమేగిన యదు ♦ స్తోమంబు రావించి చ
క్కని ప్రీతిన్ మధురాపురాన వసతిన్ ♦ గావింపఁగా సల్పె తాన్. ౨౬౬

ఉ॥ నందుఁడు గోకులంబును జ ♦ నం గమకించుటఁ గాంచి వేగఁ గా
ళిందివిభేదియుక్తుఁడయి ♦ లెస్సఁగ జోతలసల్పి నాయనా!
యిందున నున్న యెల్లరకు ♦ నెల్లసుఖంబులఁ గూర్చి యంత మే
మందముగా సగోపకుల ♦ మై చనుదెంతుము మీదు మన్కికిన్. ౨౬౯

తే॥ తల్లి యెవ్వతయో మఱిఁ ♦ దండ్రి యెవఁడొ, కాని నిన్ను యశోదను ♦ గన్నతండ్రి
తల్లుల విధానఁ గనుచు మీ ♦ దయను నిట్టు,లింత వారల మైతిమే ♦ మిది మఱతుమె?

క॥ కాంచిన తలి దండ్రులకున్, బెంచిన తలి దండ్రులకును ♦ భేదం బెది గా
న్పించదు కావున వారిని, వంచించెడి వార లరయ ♦ బాపులు గారే?

చ॥ అని వినయంబుగాఁ బలికి ♦ యర్హవిధంబున సత్కరించి ప్రీ
తిని బహుపంగ నందుఁడు ను ♦ దీర్ణతరప్రణయావశాత్ముఁడై
వనరుహనాభు ముద్దిడి య ♦ వారణ పద్ధతిఁ గౌఁగిలించి తాఁ
జనియె సగోపకుండయి ప్ర ♦ జంబున కో బహులాశ్వభూవరా! ౨౭౦

క॥ ఆ వసుదేవుం డావల, శ్రీవిభు జన్మర్క్షమందు ♦ క్షితిదేవులకున్
గోవులఁ బదివే లిడె రా,ధావిభు డావిర్భవించు ♦ తఱి నదినట్లుల్. ౨౭౧

క॥ దుర్గతి వినాశక శ్రుతి, వర్గార్థకృతార్థు యాద ♦ వకులాచార్యున్
గర్గుని బ్రహ్మణ్యుఁగవి న,నర్గళ మర్యాదఁ బిలిచి ♦ యర్చించి యొగిన్. ౨౭౨

తే॥ గురువరా! రామకృష్ణుల ♦ కు నుభయులకు
వడుగు జేయంగ మిమ్ములఁ ♦ బ్రార్థనంబుఁ
జేయుచుంటిని నావుడు ♦ క్షితిసురుండు
నొప్పి శుభముహూర్తమున చే ♦ దో ర్తకరీతి. ౨౭౩

తే॥ తొలుత సల్పంగఁదగినఁ కృ♦తుల నొనర్చి, సకలపురుషార్థ కరకార్య♦సాధనమగు
పూత యజ్ఞోపవీతంబుఁ ♦ బ్రీతితోడ, వేసి వడుగు ముగించెడి ♦ వేళయందు.

శా॥ కుక్షిన్ లోకములన్ ఘటించి విబుధుల్ ♦ కోరన్ సమస్తేష్టముల్
దక్షత్వంబున నిచ్చు రామహరి లే ♦ తన్మధురూక్తిన్ "భవాన్
భిక్షాం దేహి" యటంచుఁ గొంగుఁగొని యా ♦ భీరాది సామాన్యులన్
భిక్షం బెత్తిరిగాదె తద్వినయమున్ ♦ జెప్పంగ సామాన్యమే? ౨౭౪

ఉ॥ ఆపయి రామకేశవుల ♦ నానకదుందుభి విద్యనేర్ప సాం
దీపనిపజ్జకుం బరుప ♦ ధీరత వారలు నేగి తత్సుసే
వాపరులై విధేయతఁ బ్ర ♦ వర్తిలుచున్ సహపాఠియుక్తులై
యోపికతోడ విద్దెల నొ ♦ హో! యన నేర్వఁ గడంగి రెంతయున్. ౨౭౬

క॥ అఱువదినాలుగు విద్దెల, నఱువదినాల్గైన కళల ♦ యందలి సారం
బఱువది నాల్గు దినములన, యఱుగొఱ లెవిలేని యట్టు ♦ లందిరి జనకా! ౨౭౭

చ॥ హరిహలు లిట్లు విద్దియల ♦ నన్నిటి నేరిచి భక్తితోడఁ ద
ద్గురువరు చెంతకేగి యిల ♦ కుఁ దలలంట నమస్కరించి యో
గురుసమ! మీరు దక్షిణను ♦ గోరుఁడు మే మిపుడిత్తు మద్ది దు
ష్కరమగుఁ గాక సౌఖ్యకర ♦ సాధనమే యగుఁగాక కోవిదా! ౨౪౮

క॥ అనవుడు సాందీపనియుఁ, మనమునఁ దా నిట్లు తలఁచె ♦ మనుజులె వీరల్?
ఘనవిద్యల నన్నింటిని, గనుమూసెడిలోనఁ జదువఁ ♦ గలిగిరి దానఁ. ౨౪౯

శా॥ మాయామానుషజన్మముల్ ధర సుఖీ ♦ మచ్ఛ్రేణిసిం బ్రోవఁగా
మాయావిగ్రహతతిఁ హరింపఁగను ని ♦ మ్మాడ్కిఁ దయఁ గొన్న యా
మాయాతీతుఁడు సర్వలోకవిభుఁడుఁ ♦ మౌనీంద్రహృద్వాసియుఁ
ధ్యేయుం డాద్యుఁడు నై చెలంగు పరముం ♦ డే యంచు సోత్సాహుఁడై. ౨౫౦

చ॥ మృతుఁడగు నాదు పుత్రకు ని ♦ మేషములం గొనిరం డటంచు నా
చతురులఁ గోర వారలును ♦ సంతసమంది సువర్ణకుంభచా
రుతరరథంబు నెక్కియు ము ♦ రుద్గతితోడఁ బ్రభాసతీర్థసం
యుతజలధిప్రదేశమున ♦ కుద్ధతిగాఁ జని కాలరుద్రులై. ౨౫౧

ఉ॥ బాణము నెక్కుపెట్టుచు న ♦ పాంపతిపై నిడులోన నాతఁడుఁ
నాణెములైన ముత్తెముల ♦ నవ్యమణుల్గొని తెచ్చి యట్టి గీ
ర్వాణతతిప్రమోదకర ♦ రామరమేశుల కిచ్చి మ్రొక్కి నా
ప్రాణములేల తీసెదరు? ♦ బద్ధుఁడ మీనుడికో కృపాళువుల్.

క॥ అనవుడు కృష్ణుం డిట్లనె, వనధీ! యటులైన నీవు ♦ పటువీచికలఁ
గొని యున్న మద్గురూత్తము, తనయునిఁ గొనితెచ్చి నాకుఁ ♦ దప్పక యిమ్మా!

ఉ॥ ఆవల సాగరుండును భ ♦ యాతురుఁడై హరికిట్లు పల్కె దీ
నావనబద్ధకంకణఘు ♦ నా! ఘనవర్ణ మనోభిరామ! రా
మావరజా! భవద్గురుని ♦ యాత్మజు నేఁ గొనలేదు శంఖరూ
పావృతదానవుం డొకఁ డ ♦ హంకృతితో హరియించె శ్రీహరీ! ౨౫౪

ఉ॥ ఆతఁడొ యెప్డు నాయుదర ♦ మందు బలుండయి యెల్లవేల్పులు
న్భీతిని జెంద నుండు నిఁక ♦ నీవె బలంబున నట్టి దానవుఁ
ఘాత మొనర్పఁగాఁ దగును ♦ గావునఁ దత్కృతిసల్పవే జగ
జ్జేతవు గమ్మనంగ హరి ♦ శీర్షము నూఁచి సరే యటంచుఁ దాఁ. ౨౫౫

తే॥ కనకచేలంబులఁ గటిఁ ♦ గట్టిగాను, గట్టి ముజ్జగంబులు వణఁ ♦ కంగ నబ్ధి
వజ్రకూటాద్రిపాతంబు ♦ వలనఁ గలుగు, భయము జెందఁగ నుదధిలో ♦ వడిగఁబడియె.

ఉ॥ తద్ధరిపాతఘాతమున ♦ దానవుఁ డంబుధినుండి వెంటనే
క్రుద్ధత లేచి యుద్ధమును ♦ గోరి రమేశుని పైని శూలముఁ

శ్రద్ధగ వైవ శౌరియుఁ గ ♦ రంబున నయ్యది పట్టి దానితో
నుద్ధతి వానినిఁ బొడిచె ♦ నుర్విని సొమ్మసిలంగ భూవరా! ౨౮౮

ఉ॥ అంతటఁ బూర్వదేవుఁ డిసు ♦ మంతగ జింతను బొంది లేచి యా
యంతకసన్నిభుం డగుచు ♦ నచ్యుతునిన్ దన నెత్తితోడ న
త్యంతము గ్రుమ్మె సర్పవర ♦ మాత్మ ఫణంబునఁ గిన్కతో గరు
త్మంతునిఁ గొట్టినట్టులుగ ♦ మైథిలనాథ! యనంతరంబునన్. ౨౮౯

తే॥ కైటభారాతియున్ లయ ♦ కాలరుద్రుఁ, డగుచు నాతని తలపైన ♦ నాత్మముష్టి
తోడఁ బొడిచెను దద్ధతి♦తోడ వాఁడు, కాలమయ్యెను దజ్జ్యోతి♦కలిసె హరిని.

ఆ॥ లీల హరియు మృత క ♦ ళేబరమందున, నెమకి గురుని పుత్రు ♦ నేత్రములను
గనక యందు వెలుఁగు ♦ శంబువుఁ గైకొని, యబ్ధినుండి వచ్చి ♦ యరదమెక్కి.

చ॥ యమపురిలోన నాగురుని ♦ యాత్మజుఁ డుండునటంచు నెంచి పా
ర్థ్యముగఁ బ్రలంబవైరి తగ ♦ వాయుజవంబున దీర్ఘమైన సం
యమిని పురంబుఁ జేరి ప్రల ♦ యార్భరవంబునఁ బాంచజన్య శం
ఖము లలి నూఁదఁగాఁ దొడఁగెఁ ♦ గాలుని పాలిటి కాలుఁడో యనన్. ౨౯౧

ఉ॥ తద్రవ మాలకించి విభు ♦ ధప్రకరం బడలెన్ గృతాంతుఁడున్
నిద్రను గన్నవానివలె ♦ నేలపయిన్ గడఁబట్టె గొప్పవౌ
నద్రులు మాఱుమ్రోఁగె నిఖ ♦ లాబ్ధులు క్షోభను బొందె దిక్కులన్
భద్రగజంబులున్ బెదరెఁ ♦ బాడుచు నాడితి నేను నింగిపై. ౨౯౨

చ॥ ఎనుబదినాల్గు లక్షలకు ♦ హెచ్చిన యా నరకంబు లందునన్
దనరిన పాపులం దెవరు ♦ తద్ధ్వనిఁ జెందిరో వారు ముక్తినిం
గని రటుపైన నాజముఁడు ♦ కానుకలం గొని తెచ్చి యిచ్చి యా
వనరుహనాభు పాదముల ♦ పైఁబడి గద్గదవాణి నిట్లనెన్. ౨౯౩

ఉత్సాహ॥ రామ! రామ! కృష్ణ! కృష్ణ! ♦ రాధికామనోహరా!
యేమి యేమి యిద్ది యేల? ♦ యిట్లు సల్పుచుంటిరో
ప్రేమతోడఁ దెల్పుఁడిపుడు ♦ వేగ దానిఁ జేసెదన్
మీమహత్త్వఁ దెలిసికొనెడి ♦ మేటిగాను ధీనిధీ! ౨౯౪

మ॥ కమలాక్షుండు మదుక్తులన్ విని యుఁ బ ♦ ల్కన్ సాగె నీరీతి నో
సమవర్తీ! యటులేని మద్గురు సుతున్ ♦ శంకల్ విడంగా నిమే
షమునన్ దోడ్కొని వచ్చి నాకొసఁగి ప్రా ♦ జ్యంబైన యీ రాజ్యమున్
గ్రమమౌ పద్ధతి నేలుకొమ్మనఁగ నా ♦ కాలుండు నాలించి వే. ౨౯౫

తే॥ గురు కుమారునిఁ గొనితెచ్చి ♦ సరసఁ బెట్టి
వార లర్ఘ్యాలునిం గొని ♦ వడి నవంతి

కాపురిం గల యొజ్జకా ♦ పాప నిడిరి
గురుఁడు దమ్ముఁ దీవింపంగఁ ♦ గోర్కి కొలఁది. ౨౯౬

వ॥ అంత నాహరిహలు లాత్మగురువరేణ్యున కానందభయభక్తులతో నమస్కరించి వీడ్కొని క్రచ్చఱ సకలాలంకారాలంకృతంబగు శతాంగం బెక్కి మనోజవంబున మధురాపురికిం జనుదెంచి యదుకులప్రేమాస్పదులై ప్రవర్తిల్లు చుండిరి. ఇట్లుండ నొక్కనాఁ డగ్రజసహితుండై కృష్ణుండు బాంధవ్య, భక్తి, బలంబులచేఁ దన మనంబును సంగ్రహించుకొనియున్న యా పాండవులను సంస్మరించుచుఁ నిజభక్తుండగు నక్రూరుని సదనంబున కేగ నతఁడు ప్రత్యుత్థానం బొనర్చి షోడశోపచారంబులం బూజించి సాష్టాంగప్రణామంబు లాచరించి యానంద బాష్పోత్ఫుల్ల నయనవనరుహుండై దయాళువులారా! మీ రానాఁ డా మార్గంబున వాగ్దానం బొనర్చినకరణిని, నాగృహంబున కేతెంచితిరి. నే ధన్యుండనైతి. నాకులంబు పవిత్రం బయ్యె. గోవిప్రసాధు శ్రుతిధర్మ దేవసంరక్షణార్థంబును, గంసాదిదుష్టశిక్షణార్థంబును, సకలబ్రహ్మాండనాయకులును, బురాణపురుషులును, నాదిమధ్యాంతరహితులును, నప్రమేయులును, నక్షరులును, వేదాంతవేద్యులును, బరిపూర్ణతములును, బరాత్పరులును, నగు మీరీ లీలఁ జరించుచుంటిరి గదా. మిమ్ముఁ గొండాడ నేనెంతవాఁడ. నా నేరముల మన్నించి రక్షింప వేఁడుచుంటినని మ్రొక్కి నక్కమలాక్షుం డక్కటికంబుతో సంభాషించి మఱియు నిట్లనియె. ౨౯౭

ఉ॥ పాండవ వర్తమానములు ♦ బాగుగ నున్నవొ లేవొ చుట్టమొ
క్కండును రాఁడు సెప్పఁడు మృ ♦ గంబులకున్ నెలవైన కాన ము
న్నుండి సమస్తకష్టముల ♦ నొందిరి నొచ్చిరి హెచ్చుగాను నే
నుండియుగూడ లాభమెది ♦ యున్ గనుపింపదు వారి కియ్యెడన్. ౨౯౮

ఉ॥ వారిని నేను జూచి బహు ♦ వర్షములయ్యె నిఁకేమొనర్తు? నే
వారని వారు నేననియు ♦ వర్తిలుచుండిన మాకు సాంప్రతం
బీరహి దూరమయ్యెఁగద ♦ హెచ్చెడి దుఃఖము చిత్తమందు న
క్రూరుఁడ! వారి నారసి మ ♦ రుద్గతితో మఱి యేగుదెంచుమా! ౨౯౯

చ॥ అని వచియించి యా యనఘు ♦ నంపి బలాన్వితుఁడై స్వకీయమా
మనికికి నేగె నా పిదప ♦ మాధవు నానతి గాందినీసతీ
తనయుఁడు హస్తినాపురికిఁ ♦ దాల్మిని బోయి పృథాకుమారులన్
గని హరి పల్కులన్ వినిచి ♦ కాంచి తదీయసుఖంబుఁ బ్రీతితోన్. ౩౦౦

తే॥ మఱలఁ బాండవుల్ చెప్పిన ♦ మాటల విని
త్వరగ నటనుండి వీడ్కొని ♦ వాయుగతిని

నట్టి మధురకుఁ జనుదెంచి ♦ హరినిఁ గాంచి
పాండవోదంతముల్ దెల్పి ♦ పలికె నిట్లు. ౩౦౧

మ॥ కమలాక్షా! "కురురాజపుత్రకులచేఁ ♦ గష్టంబులం బొందు నీ
మముఁ బోషింపఁగ భావికాలమున నా ♦ మానాయకుం జెప్పి కా
లము జేసెం గద మాదు తండ్రియని యా ♦ లాపించి యా పాండవుల్
మిము ధ్యానింతురు మిమ్ము నమ్మి మదిలో ♦ మేటిల్లుచుం దెప్పుడున్. ౩౦౨

క॥ కూటికి గుడ్డకునున్ బలు, పాటులఁ బడినట్లు తోఁచె ♦ బహుదుఃఖ మెదన్
నాటెను నాకును మీతో, డ్పాటే ఘటియించెనేనిఁ ♦ బ్రబలరె? వారల్. ౩౦౩

ఉ॥ ఇట్టులఁ బల్కఁగా విని వ ♦ కృష్ణుఁడు కన్నుల నశ్రు లొల్కఁగా
నట్టి కురుక్షితీంద్రుపయి ♦ నాగ్రహముం జనియింప వెంటనే
మెట్టి కరీంద్రపత్తనము ♦ మేడ మొనర్చి జయించి వానిచే
నట్టి పృథాకుమారులకు ♦ నర్ధధరిత్రి నిడన్ బొనర్చె తాన్. ౩౦౪

క॥ అలరుచు మధురకుఁ జని ముకు, పలికిన నుడి ననుసరించి ♦ వడి నుద్ధవసం
కలితుండై మంగళదము, లలితము కుబ్జావధూని ♦ లయమున కరిగెన్. ౩౦౫

ఉ॥ దూరమునుండి మారుసతి ♦ తోఁ దులఁదూఁగఁగఁ జాలినట్టి కు
బ్జారమణీలలామ యల ♦ చక్రినిఁ గాంచి మహాప్రియంబుతో
నీరు సువర్ణకుంభమున ♦ నింపుచుఁ బాద్యము లిచ్చి పూజలన్
గోరికదీఱ సల్పి మణి ♦ గుంఫితపీఠమొసంగి మ్రొక్కఁగాన్ ౩౦౬

తే॥ మదనజనకుండు మెచ్చి యా ♦ మదవతిమిన్నఁ, గూడి కూర్చుండి భాసిల్లెఁ ♦ గోటిమన్మ
థాంగుఁడగు తాన యుజ్జ్వల ♦ దాసనమున, శ్రీసతీమణితోడ భా ♦ సిల్లినట్లు. ౩౦౭

వ॥ అట్లు కుబ్జామందిరంబునందు నెనిమిది ప్రొద్దులు వైకుంఠుండు వైకుం
ఠంబునఁ గాలంబు గడపినట్లు గడిపి నిజసదనంబునకుం జనె. ౩౦౮

తే॥ జనక! యాకుబ్జ తపమెన్న ♦ శక్యమగునె?, మానివర్యు లనేక జ ♦ న్మంబు లెత్తి
తపమొనర్చియుఁ గననట్టి ♦ దానవారి, దర్శనంబయ్యెఁగాదె? త ♦ త్తన్వి కటులు.

తే॥ పాపహరమును శ్రీహరి ♦ ప్రాప్తికరముఁ, బుణ్యదమునగు నాచక్రి ♦ పూతగాథఁ
జెప్పియుంటిని మఱియేమి ♦ చెప్పవలెనొ, యానతిందు మహారాజ! ♦ యన్ననతఁడు.

రజక పూర్వజన్మ వృత్తాంతము.

మ॥ బుధమానీంద్ర! భవన్ముఖాబ్జమున నే ♦ భృంగాయమానుండనై
స్వభుచారిత్రమరంద మానితి సుర ♦ ప్రత్యర్థి కేశ్యాది పూ
ర్వభవోదంతము కంసగాథ తెలిసెన్ ♦ వ్యక్తంబు కానట్టి కం
సభటుండౌ నల చాకివానికత మీ ♦ ర్చక్కంగ బోధింపుడీ! ౩౧౧

క॥ దగఁగొను జను మనమెటు లిం,పగు నీరును నభిలషించు ♦ నటు నా మనమా
సొగసగు కథనే విన వే, చ్చుగ నాకాంక్షించుచుండె ♦ సురమునివర్యా! ౩౧౨

ఉ॥ ఆయెడ నిట్టులన్ బలికె ♦ నబ్జజజాతుఁడు రాజవర్య! త్రే
తాయుగమం దయోధ్యను స ♦ ధర్ముఁడు రామవిభుండు రాజ్యమున్
హాయిగ నేలునప్పు డొక ♦ యర్ధనిశిన్ రజకుం డొకండు కో
పాయత రక్తనేత్రుఁడయి ♦ యాత్మసతిన్ బ్రహరించి యిట్లనెన్. ౩౧౩

శా॥ ఓసీ! బానిస! సిగ్గులేదె? యిఁక నిం ♦ దున్నావె? ఛీ పొమ్ము నీ
మోసం బిచ్చట సాగునే? కదలవే? ♦ పోవే? కులంబెల్ల నీ
కోసం బెప్పుడు గుందెడిన్ బరునిదా ♦ కొంపన్ నెలల్ కొల్దిగా
వాసంబున్ దమిసల్పినట్టి సతి కేల్ ♦ వట్టంగ రాముండనే? ౩౧౪

చ॥ అది వినినట్టి చారులు గృ ♦ హస్థులు భూవరుతోడఁ జెప్పిరా
యదనున రామచంద్రుఁడు క ♦ టా! యని ఖిన్నతఁ బొంది దైవమా!
యిది యపకీర్తి యెట్లుమరె? ♦ నిట్టిది పోవు నటంచుఁ గీర్తికై
తుదకొక కాన కంపెఁ దన ♦ దోషవిదూరను ధర్మపత్నినిన్. ౩౧౫

తే॥ పాపరహితులౌ వారు లో ♦ కాపవాద,మునకు భయపడి పై యట్లు ♦ బుద్ధిపూర్వ
కముగ నొనరింత్రు కాని త ♦ త్కలుషమట్టి, యప్రతిష్ఠఁ బన్నినవాఁడె ♦ యనుభవించు.

తే॥ అందువలననె యా చాకి ♦ యా కలుషము,ననుభవింప మఱల ద్వాప ♦ రాంతమందు
నశుచులకు మూలమౌ రజ ♦ కాన్వయమున, జన్మమెత్తి కంసుని సేవ ♦ సల్పుచుండె.

క॥ ఈసమయంబున స్వయముగ, నా సీతావిభుఁడు పుట్టి ♦ యపనిందలఁ దన్
జేసిన వానిని జంపియు, దోసములం బాపి కరుణ ♦ తోఁ బరమిచ్చెన్. ౩౧౬

క॥ వాఁడే వీఁడని యెఱుఁగుమ!, తాఁడా యుపకారి కుపక ♦ రించి పరంబా
జాడ నిడిన శ్రీవిష్ణుని, పోఁడిమి గుర్తెఱుఁగ మనకుఁ ♦ బోలునె చెపుమా! ౩౧౭

వాయకసుదాముల పూర్వజన్మ వృత్తాంతము.

క॥ అనవుడు భూవరుఁ డిట్లనె, మునివర! వనమాలిచేత ♦ మోక్షంబును బొం
దిన వాయకు తొలిచరితం,బును జెప్పఁగ మీకు జోత ♦ ములఁ బొనరింతున్.

తే॥ అనఁగ నారదుఁ డిట్లనె ♦ నధిప! మున్ను దశరథాత్మజరాఘవో ♦ ద్వాహకాల
మందు నీ మిధిలాపురి ♦ యందు నొక్క, వాయకుండు సీరధ్వజ ♦ ప్రభునియాజ్ఞ.

తే॥ రామలక్ష్మణులకొఱకు ♦ హేమచేల,ములను జిత్రరీతులఁ గూర్చి ♦ భూపునకిడ
నతఁడు జామాతలకు నియ్య ♦ నాయుభయులు,నేయమునఁ గట్టి రప్పుఁడా ♦ వాయకుండు.

ఉ॥ కన్నులపండువౌ నటులఁ ♦ గాంచి బళీ యని వారికీర్తిఁ దా
నెన్నుచు రామలక్ష్మణుల ♦ కెన్నఁడు సన్నని పట్టుపుట్టముల్

మన్నన నిట్టు లిచ్చెదనొ ♦ మంచిగ వారి నలంకరించి యిం
కెన్నఁడు హర్ష మొందెదనొ ♦ యేమొ యటం చెదనెంచు సంగతిన్. 3౨3

కం॥ రాముఁడు కరుణాధాముఁడు, ప్రేమను గని ద్వాపరాంత ♦ వేళను నిదియా
నో ముఖ్యభక్త! యని వర, మామోదమున నిడె వాయ ♦ కాఖ్యుని కిచ్చన్.

ఉ॥ ఆవల వాయకుండు మిహి ♦ రాన్వయసాగరచంద్రుఁడైన సీ
తావని తేశు సత్కృపను ♦ ద్వాపరపుం దుదఁబుట్టి నెమ్మితో
నావిధి రామకృష్ణుల క ♦ నర్ఘ్యపటంబు లలంకరించి తాఁ
గేవలమొందె ధాన్యధన ♦ కీర్తులఁ బూర్తిగఁ బొంది భూమిపై. 3౨౫

కం॥ అంతట మిథిలాకాంతుఁడు, సంతసమున నిట్టు లడిగె ♦ స్రష్టృసుతా! శ్రీ
కాంతుం డేల సుదాముని, శాంతమునకు నేగె నట్టి ♦ సంగతిఁ జెపుమా! 3౨౬

కం॥ అనవుడు సురముని యిట్లనె, జననాయక! మున్ను ధనదు ♦ చైత్రరథవనం
బున సుమవటుకుం డగు నొక, ఘనుఁడుండును హేమమాలి♦కమనీయాఖ్యన్.

ఉ॥ ఆతఁడు న్యాయశీలుఁడు మ ♦ హాత్మవిధేయుఁడు స్వీయభామినీ
ప్రీతికరుండు నస్యజన ♦ విత్తసతీవిముఖుండు ధీవరుం
డాశ్రితదానశీలుఁడు త ♦ దచ్యుత పాదసరోజబంభరీ
భూతుఁడునై చెలంగెడిని ♦ భూవర! యాతఁ డనంత రంబునన్. 3౨౭

కం॥ హరి దర్శనంబుఁ గోరుచుఁ, బరిమళభరితాంబుజాత ♦ పంచసహస్రాల్
ధరణీ శంకరుఁడగు శం,కరునకు నర్పించె నాత్మ ♦ కరములతోడన్. 3౨౮

ఉ॥ అంతఁ బ్రసన్నుఁడై గిరిశుఁ ♦ డా ప్రియభక్తున కిట్లుపల్కె నీ
వింతగ నాకుఁ బూజలను ♦ నేల యొనర్చుచుంటి వట్టి వృ
త్తాంతముఁ జెప్పు మిప్పు డది ♦ దప్పక యిచ్చెదఁ గోరుమా! యనన్
సంతస మొంది యాతఁ డిటుఁ ♦ జక్కఁగ వేఁడె ననన్య భక్తితోన్. 330

కం॥ చంద్రాననార్ధదేహా!, చంద్రకిరణ ధవళవర్ణ ♦ చంచద్గాత్రా!
చంద్రార్కానలనయనా!, చంద్రార్ధమనోజ్ఞశీర్ష! ♦ సాంద్రానందా! 33౧

తే॥ వామదేవ! మహాదేవ! ♦ వందనములు, విశ్వనాయకుఁడైన యా♦విష్ణుమూర్తి
మద్గృహంబున కేతెంచి♦మన్ననలను, గొని చనెడి వరంబియ్యఁ♦గోరుచుంటి.

ఆ॥ అనుట మిత్తిగొంగ♦యాలించి మేలని, ద్వాపరాంతమందుఁ♦దప్పకుండ
నీవడిగిన వరము♦నెఱవేఱునని పల్కె,నంత నతఁడు ద్వాప♦రాంతమందు. 333

కం॥ పుట్టి సుదాముండన, నట్టి మధురయందుఁ జెలఁగ ♦ నా వలమురితా
ల్పట్టుల నాతని సద్మము, మెట్టి తదర్చలను బొంది♦మేలు లొసంగెన్. 33౪

కం॥ మఱియెయ్యది వినవలతువొ, సరిగా వచియింపుమన్న♦జనకుఁ డిటులనెన్
దురితహారంబగు కుబ్జా, చరితంబును దెల్ప నతుల♦సల్పెద మౌనీ! 33౫

కుబ్జా పూర్వజన్మ వృత్తాంతము.

ఉ॥ నావుడు నారదుం డిటు ల ♦ నం దొడఁగెన్ ధరణీంద్ర! మున్ను సీ
తావిభుఁ డట్టి పంచవటిఁ ♦ దమ్ముఁడు భార్యయు వెంట నుండ నా
రావణు తోడఁబుట్టువు సు ♦ రప్రకరప్రతికూల ఘోరరూ
పావృతమైన శూర్పణఖ! ♦ యచ్చటకేగి మహాజవంబునన్. 33౬

ఉ॥ రాముని గోటిపుష్పశర ♦ రమ్యశరీరుని నేకపత్నితో
నేమముగాఁ జెలంగు ఘను ♦ నిం గని మోహముఁబొంది దుష్టయై
రామసతిన్ ధరాసుత న ♦ రంబున మ్రింగఁగఁ బోవుటన్ సుమి
త్రామహిళాసుతుండు కని ♦ తత్క్షణమందునఁ బట్టి దానినిన్. 33౭

తే॥ కత్తితోడుత నాసికా ♦ కర్ణములను, గోసి పంప నా రాక్షసి ♦ గోడుఁజెంది
యన్నయా రావణునితోడ ♦ నది వచించి, పుష్కరమను తీర్థమునకుఁ ♦ బోయి యచట.

క॥ పది వేలేడులు శ్రద్ధగ, మదనరిపుండైన హరుని ♦ మదినెంచి తపం
బదవదలేనటు సల్పెను, బదపడి తత్శంకరుండు ♦ ప్రత్యక్షుండై. 33౯

క॥ వరమేమి నీవు గోరెదో, త్వరగా వచియింపుమన్నఁ ♦ దత్సతి దేవా!
స్మరసమ రాముఁడు హృదయేశ్వరుఁడౌ నటు వరము నా కొ♦సంగు మనంగన్.

క॥ భూతేశుం డను నిటు నీ, చేతస్సున నున్న కోర్కి ♦ సిద్ధించెడి నో
నాతీ! ద్వాపరకాలా, తీతసమయమందు వాసు ♦ దేవముఖమునన్. 3౪౧

చ॥ పదపడి నట్టి శూర్పణఖ ♦ ద్వాపరపుంగొనఁ గుబ్జనాఁగఁ దా
నుదయము జెందియుండ హరి, ♦ యుగ్రు వచస్సు ఫలంబు సల్పఁగా
యదుకులమందుఁ బుట్టి యటు ♦ లాసతి యింటికి నేగి భర్తయై
ముదమును బొంది కొన్ని దిన ♦ ముల్ వసియించె నటం చెఱుంగుమా! 3౪౨

కువలయాపీడగజ పూర్వజన్మ వృత్తాంతము.

వ॥ వెండియు నీవేమి వినెదవో తెలుపుమన నాబహులాశ్వుఁ డో మునివరా! కువలయాగజం బాగరుడధ్వజునిలోన నెట్లు లీనంబైనదియు దాని పూర్వచరితం బెట్టిదో వినిపింపుఁ డన నాయోగిపుంగవుండు దేవా! తొల్లి బలిపుత్రుండును నాయతకాయుండును, సర్వశాస్త్రార్థప్రవీణుండును, మహాబలుండు నగు మందగతి యను దైత్యుం డొకం డొకసమయంబున శ్రీరంగయాత్రకై బయలువెడలి మదద్వీపంబునకై వడిఁ బధికులం బడఁద్రోయుచుఁ బోవుచుండ వృద్ధుండును, బలహీనుండును నగు త్రితుండను మహాముని నేలపై నెత్తురువఱదలై పాఱఁబడి ఓరీ! దుర్మతీ! మదోన్మత్తుండవై మత్తేభంబుమాడ్కి సంచరించుచు నిష్కారణంబుగ నన్ను బడఁద్రోసితివి! కాన గజత్వంబును బొందుమని శపింప నతం డా త్రితమునికి నమ్రులిడి దయాకరా! యీశాపం బేను భరింపఁజాలఁ; నాగజత్వంబున [illegible] మీచేతి

మహాత్ములకునైతం బట్టి యాగ్రహంబు దగునే? మీరు నిగ్రహానుగ్రహసమర్థులు గదా! రక్షింపుఁ డని ప్రార్థించుడు నమ్ముని శాంతించి నావచనంబు రిత్తగాదు. ఐనను నీభక్తికి మెచ్చితిఁగాన ద్వాపరాంతమందు మధురాపురిని సంచరించు శ్రీకృష్ణుని హస్తంబున గజరూపంబున నున్న నీకు ముక్తి కలుగునట్లు వరం బిచ్చితి. ఇద్ది గైకొని శోకింపకుమని పల్కె. అంత నామందగతి యారీతిని నయుతద్విరద బలంబు గలిగి కువలయాపీడమను పేరుతో వింధ్యాద్రియం దుద్భవించియుండ మాగధేంద్రుండు లక్షగజంబులతోఁ జని దానిని స్వాధీనంబు జేసికొని కంసునికిఁ బారిబర్హంబుగా నిడె. ఇట్లు కంసనికటంబున నుండి శాపావసానం బేతెంచుడు తద్ధరి హస్తంబున నిహతంబై యతనిలోన లీనంబయ్యె. ఇదియ తచ్చరితంబు. మఱియేమి వినవలతువో తెల్పుమన జనకుం డానందించి మునీంద్రా! యనంతబలుండగు శ్రీకృష్ణునితో మల్లయుద్ధం బొనర్చిన చాణూరముష్టికాదిమల్లుల చరితంబు విన నిచ్చఁ గలదని ప్రార్థింప నారదుండు ధారుణీంద్రునితో నిట్లనియె. ౩౮౩

చాణూరాది మల్ల పూర్వజన్మ వృత్తాంతము.

క॥ అమరావతిపురమున మును, విమలుఁడగు నుతథ్యమౌని ♦ వెలయు నతనికిన్
గ్రమముగ సుతులైదుగు రుద,యముఁ జెందిరి పుష్పశర స♦మాకృతు లగుచున్.

ఉ॥ వారు దినక్రమంబునఁ బ్ర ♦ వర్ధన మొందుచుఁ దల్లితండ్రులన్
మీఱి యథేచ్ఛగా శ్రుతి స ♦ మీహితమౌ నిజజాతిధర్మముల్
దూఱి సతంబు విద్యవిడి ♦ తోమరముద్గరకుంతపంక్తి దై
వాఱఁగ నేర్పలంబునకొ ♦ పాటి నియుద్ధము నేర్చుచుండుటన్. ౩౮౪

తే॥ కన్న తండ్రి గనుంగొని♦కనులకొనల,నుండి నీరు వెల్లిగఁ బాఱు♦చుండ మిగుల
వ్యసనముం బొంది మిక్కిలి♦యలుక గలుగ,భ్రష్టులై తనసుతులకుఁ♦బలికె నిట్లు

తే॥ ఆర్జవము శమమునుదమం♦బాస్తికతయు, క్షాంతి శౌచము జ్ఞానవి♦జ్ఞానములును
దపము ననునివి దొమ్మిది♦ధాత్రి దేవ,తలకు నియతధర్మము లంద్రు♦ధర్మవిదులు.

క॥ శౌర్యం బీశ్వర భక్తియు, ధైర్యము దానంబు ప్రతిభ ♦ దయయును యుద్ధ
స్థైర్యము తేజము బుజుగతి, యార్యార్చయు క్షత్రియులకు ♦ నగు ధర్మంబుల్.

తే॥ పశుపాల్యంబు కృషియును ♦ బ్రాహ్మణ సుర
భక్తి వాణిజ్య మనునివి ♦ వైశ్యులకును
నిర్జరాగ్రజ సేవయు ♦ నిజకులోచి
తక్రియయు శూద్రులకు నౌను ♦ ధర్మములుగ. ౩౮౫

ఉ॥ పుత్రమిమ్మన్ జనించి పలు ♦ పోకలఁ బోవుచు ధర్మదూరులై
రాత్రిష్ఠురంబొనెనన్నుఁ గ ♦ రంబుగ బాధలఁ బెట్టుచుంట మీ
రాఱు.

రక్షత్రుపులైతి రంతియు ర ♦ సాతలదేవులె ? మీరు ? మీ కృతుల్
క్షత్రియజాతి ధర్మములు ♦ గావొకొ ? కుత్సితులార ! తెల్పుఁడీ ! ౩౫౦

తే॥ వేయుమాటలు సెప్పినఁ ♦ విసక మీరు, స్వేచ్ఛగాఁ దిరుగుటను మీకు ♦ వేగ నసుర
కులభవంబును నసురుని ♦ కూడిక దగ, మల్లవిద్యాప్రసంగంబు ♦ సెల్లుగాక.

క॥ అని శపియింపఁగ వారలు, దనుజకులమునందుఁ బుట్టి ♦ దానవమైత్రిన్
దనరి నియుద్ధకృతార్థతఁ, గని యటు హరిచేతఁ జచ్చి ♦ కాంచిరి ముక్తిన్.

తే॥ వార లైదుగు రట్టి చా ♦ ణూరముష్టి,క శల తోశల కూటులు ♦ గాదె యన్న
ముదముఁ జెందిన బహులాశ్వ ♦ భూవరుండు, కంసు తమ్ముల కథఁ దెల్పఁ ♦ గా నుతింతు.

కంసానుజాష్టక పూర్వజన్మ వృత్తాంతము.

తే॥ అనఁగ నా ముని యిట్లనె ♦ నలక యనెడు
పురినిఁ దొలి దేవయక్షుఁడన్ ♦ సరసుఁ డొకఁడు
జ్ఞానపరుఁడును జ్ఞాని య ♦ శకులజుండు
ఖండపరశుపూజకుఁడు నై ♦ క్రాలుచుండు. ౩౫౪

వ॥ అవ్వానికిఁ గాలక్రమంబున దేవకూట, మహాగిరి, గండ, దండ, ప్రచండ, ఖండా ఖండ పృథుపులను నెనమండ్రు కుమారు లుద్భవిల్లిరి. వార లొయ్యనొయ్యఁ బెరిఁగి యొకనాఁడు జనకుని యాజ్ఞను మానసరోవరంబునకుం జని మధుపధ్వనిసంభృతంబులగు సహస్రారవిందంబులం గైకొని వాసనాలోలుభులై యాఘ్రాణించి యవ్వానినే తెచ్చి నిజపితకొసంగిరి. అవ్వి ముక్కంటికిం బూజింపఁబడినను దదుచ్ఛిష్టీకృతదోషం బాకుమారాష్టకంబున కాపాదించె. దాన నవ్వార లసురజన్మంబుల మున్మొత్తి పిదప న్యగ్రోధాది నామంబులతోఁ గంసానుజులై పుట్టి లోకశంకరులగు శ్రీకృష్ణబలరాములచే నిహతులై ముక్తులైరిగదా ! మఱియుఁ దత్సాందీపనిపుత్రుని హరించిన శంఖరూపావృతపంచజనుని పూర్వజన్మవృత్తాంతంబు వినుమని యిట్లనియె. ౩౫౫

పంచజన పూర్వజన్మ వృత్తాంతము.

తే॥ అధిప ! మున్ను చక్రాదు లా ♦ యంబుజాక్షు
నకు నుపాంగములుగ నుండి ♦ నాఁటి మొందె
నందుఁ బాంచజన్యము శంఖ ♦ మధికమైన
హరిముఖంబును బొంది యి ♦ ట్లాత్మ నెంచె. ౩౫౬

ఉ॥ ఆర్తజనప్రియుం డగున ♦ యచ్యుతుఁ డీ ననుఁ గొంచు దక్షిణా
వర్తము గెల్వఁజాలెను న ♦ సాంపతి పుత్రి కసాధ్యముల్ సుధా
పూర్తము రుచ్యమైన హరి ♦ మోవిని రాజమరాళకాంతితోఁ
బూర్తిగ నానుచుంటి ననుఁ ♦ బోలుదురే ? [illegible]

చ॥ ఆడుచు సఖుర్వగర్వమున ♦ నాడుకొనంగఁ దదీయవక్షమం
దున వసియించు లక్ష్మి, చెవి ♦ తో విని వెంటనె దానిఁ జూచి యి
ట్లో మెను శంఖమా! త్వరఁగ ♦ నాసురజన్మముఁ జెందుమో కుధీ!
సన్నుఁ బెలివారి దూఱుదువె? ♦ న్యాయమె? యాచు శపింప నద్దియుఁ.

ఉ॥ పాంచజన్యాఖ్యశ్శోఁ దగి య ♦ పాంపతియందు నిశాటజన్మముఁ
గాంచి వసింపఁగాఁ దొడఁగి ♦ కంజదళాక్షుని యొజ్జ కుక్షి బా
ధించి హరించి శ్రీపతిహ ♦ తిఁ మృతమై హరికేల శంఖరూ
పాంచితదేహముఁ వెలుఁగ ♦ నాత్మయు నా హరియాత్మఁ జేరఁగాఁ. ౩౫౯

తే॥ ముక్తిఁ బొందెను నిద్ది య ♦ ద్భుతముగాదె?
మనుజనాయక! యింకేమి ♦ వినవలతువొ?
నా కుమారా! యన్న రాజవ ♦ రుఁడును సంత
సించి భక్తియుక్తుఁ డయి పృ ♦ చ్ఛించె నిట్లు. ౩౬౦

శ్రీకృష్ణుం డుద్ధవుని గోకులంబునకుఁ బంపుట.

ఉ॥ నారద! శౌరి యూ మథుర ♦ నవ్యముగా మఱి యేమి చేసెనో
కూరిమిమిత్రుతోడఁ జెప్పు మని ♦ కోరఁగఁ దన్ముని యిట్లు పల్కె నో
భూరమణా! జనార్దనుఁడు ♦ బుద్ధిఁ దలంచెను నొక్కవేళ నా
భీరవధూలలామసుర ♦ భిప్రకరాన్విత గోకులంబునుఁ. ౩౬౧

చ॥ తలఁచి యటుల్ మహామహుఁడు ♦ తత్క్షణమందు రహస్యరీతి నె
చ్చెలిని స్వకీయభక్తుని సు ♦ శీలుని నేర్పరి ధీరు నుద్ధవుఁ
బిలిచి యొసంగి జాబులను ♦ బ్రీతిని నిట్లనె మిత్రవర్య! గో
కులమున కేగుమయ్య! మన ♦ కోరిక లీరిక లెత్త నిత్తఱిఁ. ౩౬౨

చ॥ చని యొక జాబు నందున కొ ♦ సంగుము రెండవదైన యుత్తరం
బు నల యశోద కిమ్ము మఱి ♦ మూఁడవ కమ్మను రాధ కిమ్ము న
న్ననయము గూడు నెచ్చెలుల ♦ కారసి నాల్గవ దిమ్ము నెమ్మనం
బున నెనరుంచి తక్కినవి ♦ ముగ్ధల కిమ్ము సుమిత్రచంద్రమా! ౩౬౩

సీ॥ అనయంబు నాతోడ ♦ నాడుచుఁ బాడుచు, బుజగించు పితకు ♦ మ్రొక్కు లనుము
పవలును రేయియుఁ ♦ బరమప్రియంబునఁ, బోషించు తల్లికి ♦ మ్రొక్కు లనుము
సతతంబు నాతోడ ♦ సల్లాపములఁ జేసి, ముద్దాడు రాధకు ♦ ముద్దు లనుము
సంగాతమొనరించి ♦ సర్వచమత్కృతుల్, చూపిన సఖులకు ♦ సుకమె యనుము

తే॥ మద్వియోగంబునై పని ♦ మానినులను, మదుదితోక్తుల లాలింపు ♦ మా వ్రజంబు
నందు నుండు నింగకు న ♦ నల్పకాల,మునవె తప్పక రాఁగలఁ ♦ డనుము కూర్మి.

తే॥ మఱియు నక్రూరుతోఁ గూడి ♦ మావ్రజంబు
విడిచి చనుదెంచు మార్గంబు ♦ వేగ నడ్డ
గించి నన్నిల్లు గోపికా ♦ సంచయమున
కల్పకాలములో వత్తు ♦ నను మిత్ర! ౩౧౭

తే॥ మఱియు నాకయి దేహముల్ ♦ మంటఁ గలుప
సిద్ధముగ నున్న చెలులకు ♦ బుద్ధిచెప్పి
ప్రీతి సమకూర్పుమో హిత ♦ వ్రాతముఖ్య!
పంపుచుంటిని నమ్మి నే ♦ ర్పరివటంచు. ౩౧౮

ఉ॥ నా చెలివంచు వారు నిను ♦ నమ్ముటకై యిపు డానవాలుగా
నా చెవిసొమ్ముఁ గౌస్తుభము ♦ నవ్యహరిత్స్ఫుటపద్మమాలలున్
జాఁచిన వేయిరేకులను ♦ జక్కఁగ నొప్పెడు పంకజంబుఁ బు
ష్పాచిత యష్టియున్ మురళి ♦ యంగదముల్ మకుటంబుఁ బొందితయున్. ౩౧౯

తే॥ నావలెన్ నీవు వేషంబు ♦ నాకొనుగను
వేసి మచ్ఛతాంగంబు ♦ వేగ నెక్కి
పోయి యాకనుల్ సాధింపు ♦ మోయి మిత్ర!
యని సుగంధాదుల నొసంగి ♦ యంప నతఁడు. ౩౨౦

తే॥ చక్రికిన్ బ్రదక్షిణములు ♦ సల్పి మ్రొక్కి, వీడుకొని హరి రథమెక్కి ♦ విష్ణువేష
మును ధరించి గోపకగోస ♦ మూహగోపి, కా జనాన్విత వ్రజమున ♦ కోజ నరుగ.

ఆ॥ మోహనాదిరాగ ♦ ములను శ్రీకృష్ణుని, సన్నుతించు చాలఁ ♦ జక్కఁగాచు
గోపగణముసూచి ♦ కొంతదవ్వననుండి, పెలుచ నొండొరులును ♦ బలుకుకొనిరి.

ఉ॥ గోపకులార! మిత్రుఁడు ము ♦ కుందుఁ డిటుల్ సనుదెంచుచుండె నా
శ్రీపతియౌనొ కాదొ యని ♦ చిత్తమునన్ విశయంబు లేల? మా
లాపరిధాన కౌస్తుభచ ♦ లద్యుతిమాళిసహస్రపత్రసం
దీపితపంకజాశ్వతతి ♦ దివ్యరథాదులు చక్రివే సుమీ! ౩౨౦

ఉ॥ చాల దినంబు లయ్యె మన ♦ సంగడికానిని జూచి యంచు వే
యాలుడితో సుదామముఖు ♦ లా హరిమిత్రులు కృష్ణవేషుఁ గు
తీఁలధరాపు నుద్ధవు న ♦ తిప్రమదంబున డాసి యిచ్చటన్
నీలపటుండు లేఁ డితఁడో ♦ నెచ్చెలిఁ బోలెడి నీతఁ డెవ్వఁడో! ౩౨౧

క॥ అని శంకించెడితఱి నా, యన యల శ్రీదామముఖుల ♦ నచ్యుతసఖులన్
గని హరి పంపిన యుత్తర, మును నియ్యంగ వారు దాని ♦ ముదమునఁ గొనుచున్.

తే॥ చదివి చదివి యందలి యెల్ల ♦ సంగతులను
దెలిసికొని కనుఁగవ నశ్రు ♦ లొలుకుచుండ

నుద్ధవున కిట్లు బల్కిరో ♦ మద్ధితాభి
లాషి! మాచెలి యిటు రాఁద ♦ లంచె నొక్కొ? ౩౨౪

ఆ॥ క్షణము యుగముగ నొక ♦ గడియ మన్వంతర
ముగను జాము కల్ప ♦ ముగను దినము
బ్రహ్మకాలముగను ♦ బద్మనాభుని వీడి
గడుపుచుంటి మేము ♦ కాల మిపుడు. ౩౨౫

ఉ॥ ఆతఁడు లేని జీవితము ♦ నర్థము ధాన్యము వైభవంబులున్
వ్రేతల కింతమాత్రమును ♦ బ్రీతికరంబులు గావటంచు నీ
చేతమునందు నమ్ము మిఁక ♦ స్నేహ మొనర్చెడి మా యవస్థ యా
ధాతయుఁ జెప్పఁలేఁడని యె ♦ దన్ దలపోయుము! యోయి యుద్ధవా!

చ॥ అని నుడువంగ నుద్ధవుఁడు ♦ నాడె నిటుల్ సఖులార! నేను త
ద్వనరుహనాభదాసుఁడను ♦ దత్ప్రియమిత్రుఁడఁ దద్రహస్కరుం
డనుజామి నన్నుఁ గృష్ణుఁడు త ♦ టాలున గోకులమేగి మీసుఖం
బును గని రమ్మటం చనిపెఁ ♦ బూర్తిగ మీర్వినుఁడీ! మదుక్తులన్. ౩౨౬

చ॥ మఱువక మిమ్ము మాచెలిమి ♦ మాధవు చెంతకు నేగి వేగ మీ
విరహము మీ యభీష్టమును ♦ విన్నపముం బొనరించి మ్రొక్కి త
ద్ధరిసహితుండనై మఱలఁ ♦ దప్పక మీకడ కేగుదెంతు నా
యఱగొఱలేని పంతమిది ♦ యం ఇద నమ్ముఁడి! చింతమానుఁడీ! ౩౨౭

తే॥ ఇట్లు శ్రీదామముఖసుహృ ♦ ద్బృంద మూఱ
డించి యాత్మరథమున నె ♦ క్కించుకొనియు
నర్కుఁ డస్తమించెడి వేళ ♦ యందు నంద
నగరమునఁ జొచ్చెఁ దద్వార్త ♦ నందుఁడు విని. ౩౨౮

శా॥ ప్రత్యుత్థాన మొనర్చి యుద్ధవుఁ బరి ♦ రంభమ్ములన్ దేల్చి సం
స్తుత్యార్చల్ బొనరించి స్వాద్యజలజ ♦ గ్ధుల్ ప్రీతితో నిచ్చి యా
దిత్యాశానమనోజ్ఞతల్పసమమై ♦ తేజొందు తల్పంబు స
న్నుత్యప్రజ్ఞ నొసంగి యడ్గె నిటుల ♦ న్బుత్రప్రవృత్త్యర్థియై. ౩౩౦

ఉ॥ నాయన! దేవకీపతికి ♦ నందన యుత్తముగా సుఖంబె? లో
కాయతకంటకుండును న ♦ ఘాకరుఁడౌ యదుభూపుఁ డంతమై
పోయినమీఁద యాదవులు ♦ పూర్తిగ సౌఖ్యముఁ బొందుచుండ్రె? య
బ్బాయికి మాకుమారునకు ♦ భద్రమె? నీకిక సేమమే కదా! ౩౩౧

సీ॥ మనసారఁ బెంచిన ♦ జనని యశోదను, నెపుడేని నెద సంస్మరించునొక్కొ?
ధనవ [illegible] డేయని నమ్మి, యలరు నన్నెపుడేనిఁ ♦ దలఁచునొక్కో?

యాత్మీయ సఖులతో ♦ నాడిన పాడిన, బృందావన మెపుడే ♦ నెంచునొక్కొ?
బలభద్రుతోఁగూడి ♦ బాగుగాఁ గాచిన, యీయూల నెపుడేని ♦ నెత్తునొక్కొ?
తే॥ గోపికా గోపకావళి ♦ గోప్రవర్ధ,నాద్రి యమునోరుపులిన వ్ర ♦ జాంగణముల
నెప్పుడైనఁ దలఁచునొక్కొ?♦యింది రేశ్వ,రుఁడును నాకుఅజ్ఞయునకు కృ♦ష్ణుఁడు సుమిత్ర!

ఉ॥ దైవమ! ప్రాణతుల్యుఁడయి ♦ దాపున నుండిన నాకుమారు నే
ల్రేవకొ నెట్టి యిట్లు విప ♦ రీతముగా వగపొందుచుంటి నా
జీవనజాతలోచను వి ♦ చిత్ర విలాసవినోదు శూరు బృం
దావనసంచరిష్ణుని స ♦ ధర్ముని గృష్ణునిఁ జూచు టెన్నఁడో. 3౮3

ఉ॥ ఎందులకీ శతాంగము లిఁ ♦ కెందులకీ తురగంబు లేటికీ
సుందరమందిరంబులు య ♦ శోధనధాన్యసువర్ణ ధేను గో
బృందము లివ్వి యెందులకు ♦ నెందులకీ పరిపాలనంబు నా
నందనుఁ డిందులేనియెడ ♦ నమ్మ్మమ! యుద్ధవ! వ్యర్థుఁడఁ జుమీ. 3౮౪

తే॥ ఆర్యవర్య! చకోరమా ♦ యమృతకరుని, విడిచి పుడమిని బ్రతికిన ♦ విధిని నేను
మదనకోటి సుందరుఁడును♦గదన భీముఁ,డు నగు కృష్ణుని విడి యిట్లు♦మనుచునుంటి.

తే॥ భూమిభాగంబుఁ బాపంగఁ ♦ బుణ్యనరులఁ, బ్రోవఁ బుట్టిన జగదేక♦పూర్ణుఁడైన
కేవలుండని యెంతు నా♦కృష్ణమూర్తి, బలయుతుఁడ వాని విడి యెట్లు♦బ్రతుకఁగలను

క॥ అని పుత్రకమోహముచే, ఘనముగ శోకంబుఁ బొంది ♦ కన్నీ రొల్కఁ
దన పలుపునఁగల తలగడ, నునిచి తలఁ మిన్నకుండె ♦ నుర్వీనాథా! 3౮౭

చ॥ అవల యశోద యాపగవి ♦ యాగమనంబును నాలకించి పు
త్రవిహితమోహబద్ధయయి ♦ ద్వారము చెంతకు వచ్చి నిల్చి క
న్నవను స్రవించు తోయమును ♦ గట్టిన చేలముచేత నద్ది యు
ద్ధవునకు బంధుమోదములఁ ♦ దద్దయు నడ్గి యిటు ల్వచించెడిఁ. 3౮౮

ఉ॥ నందునిగాని నన్ను నుప ♦ నందులఁగాని వ్రజంబుగాని స
న్నందునిగాని స్వప్రియగ ♦ ణంబునుగాని మనోజ్ఞమైన కా
ళిందినిగాని బాల్యగత ♦ లీలలఁగాని విహారయోగ్యమౌ
బృందనుగాని కృష్ణుఁడు స్మ ♦ రించునె? యెత్తఱినైన నుద్ధవా! 3౮౯

ఉ॥ నాకొక పుత్రకుండు మఱి ♦ నల్వురు లేరుగదా కటా! కటా!
యాకొమరుండె నన్నిటు ద ♦ యారహితుండయి యిందువీడి తా
నేకడ కేగెనోకద యిఁ ♦ కెట్టుల నే బ్రదుకంగనేర్తు నా
శోక మిదెట్లు పోవు నెటు ♦ జూచినఁ జక్కనిబాట సిక్కదే? 3౯0

శా॥ అమ్మా! చిక్కని మంచి పాలొసఁగవే? ♦ హైయంగవీనంబుఁ దే
లెమ్మా! బిడ్డకు గడ్డపెర్గు నిడవే? ♦ దివ్యాన్నపూప౦ బెటున

దిమ్మాడ్కిఁ బలుకాడు నాకొమరుఁడౌ ♦ ట్లీవేళఁ దా మెక్కడనో
యమ్మా! గోపకగోపికాజనుల ప్రా ♦ ణాధారుఁ డీ కృష్ణుఁడే. ౩౯౧

ఉ॥ పాలనలాలనంబులను ♦ వత్సరమొండు క్షణంబుకైవడిన్
గాలము మేము పుచ్చితిమి ♦ గాదె? తదంబుజలోచనుం డిటన్
గ్రాలకపోవుటన్ క్షణము ♦ కల్పముగా నిపు డేగుచుండె మా
జాలమునం దితండె సిరి ♦ సంపదలో యదుపుత్రరత్నమా! ౩౯౨

మ॥ అరరే! యెంతటి క్రూరురాలను గదా! ♦ యానాఁడు నాకూన భీ
కరకోపంబునఁ బెర్గుకుండఁ బగులం ♦ గాఁ గొట్టినం జేను స
త్వరనై ఱోటను ద్రాటఁగట్టి మిగులన్ ♦ బాధించితిన్ వానిఁ ద
స్కరుఁ డంచున్ మఱి యొక్కనాఁడు నెఱిగా ♦ శాపించితిన్ జెల్లఁబో! ౩౯౩

సీ॥ ఏవీటికిని నేగ ♦ నేవాడకును బోవ, నేఁడి కృష్ణుఁడని పృ ♦ చ్ఛించు వారె
యేపల్లె కేగిన ♦ నేయింటి కేగిన, నేఁడి కృష్ణుఁడని పృ ♦ చ్ఛించు వారె
యేతోట కేగిన ♦ నేచోటికిన్ జన, నేఁడి కృష్ణుఁడని పృ ♦ చ్ఛించు వారె
యెవ్వానిఁ జూచిన ♦ నెద్దానిఁ గాంచిన, నేఁడి కృష్ణుఁడని పృ ♦ చ్ఛించు వారె

తే॥ ఆలఁ గాంచిన నవ్వియు ♦ నబ్జనాభుఁ, డేఁడి యేఁడియం చఱచెడి ♦ నేమొనర్తు?
వాఁడు లేని నాజన్మంబు ♦ వ్యర్థముగద!, యేల యీవైభవములు? ప ♦ రేంగితజ్ఞ!

చ॥ అని విలపింప నాపగవి ♦ యుబ్బముఁ బొంది వచించె నిట్లు నా
తనువున నెన్నిరోమములు ♦ దారొకనియున్నవో? యన్ని నాలుకల్
గొనియు నుతింపలేను మిముఁ ♦ గూర్మిని గూడిన భక్తి మీకుఁ గృ
ష్ణునిపయి నుండె నిట్టి దెటఁ ♦ జూడను జంపతులార! యింతగాన్. ౩౯౪

తే॥ తీర్థయాత్రా తపోదాన ♦ దివ్యయోగ, సాంఖ్యదుర్లభమును బహు ♦ శాశ్వతమును
ప్రేమపూర్వకమగు భక్తి ♦ మీమనముల, యందు నెక్కొని యియ్యది ♦ యల్పమొక్కొ?

ఉ॥ చింతల మాని మీసుతుఁడు ♦ చేత లిఖించిన జాబులోంది వృ
త్తాంతము లెల్లఁజూచుకొని ♦ ధైర్యము దెచ్చుకొనుండు కృష్ణుఁడున్
సంతస మా పురస్థులకుఁ ♦ జక్కఁగఁ గూర్చుచు నన్నతోడ న
త్యంత ముదంబుఁ జెందెడిని ♦ దన్మథురాపురమందు నిత్తఱిన్. ౩౯౫

తే॥ స్వల్పకాలంబులోన నా ♦ చక్రపాణి, సాగ్రజుండయి యిచ్చట ♦ కరుగుదెంచు
దుష్టజనశిక్షణార్థంబు ♦ శిష్టరక్షణార్థముగ జనించిన పరుఁ ♦ డతఁడె సుమ్ము. ౩౯౬

వ॥ కావుననే పూతనాప్రాణహరణంబును, శకటాసుర నిపాతనంబును, తృణా
వర్తపాతంబును, యమళార్జునభంజనంబును, విశ్వరూపసందర్శనంబును, బృందావన
విహారంబును, గోపాలనంబును, బకవత్సాఘధేనుకాసురహింసనంబును, గాళియ
మర్దనంబును, దావాగ్నిపానంబును, గోవర్ధనోద్ధరణంబును, శంఖచూడామణి

సంగ్రహణంబును, నరిష్టకేశివ్యోమాసుర వినాశంబును, గావించి ప్రపలంబాంతకుండగు నన్నతోఁ గూడి యక్రూరముఖంబున వచ్చిన కంసాహ్వానంబుఁ బురస్కరించుకొని మధురాపురి కరిగి దండధరు దండంబుమాడ్కి నుండు ప్రచండంబగు నొండు కోదండంబును వేదండం బిక్షుఖండంబు విఱిచినట్లు రెండుతుండెంబులుగా ఖండించి కువలయాపీడనామకకంసకుంభీంద్రంబు శుండాదండంబుఁ బట్టుకొని నేలం గూల్చి చాణూరముష్టికకూటశలతోశలులను మల్లుల నోడించి లక్షగజసమబలుండునను, మదోత్కటుండు నగు కంసుని సిగ బిగియం బట్టుకొని మంచంబునుండి గ్రిందికిం బడవైచి కరీంద్రంబుపై నారోహించిన పంచాస్యంబు మాడ్కిఁ జెలంగి వధించి కంసానుజాష్టకంబును, మృగంబులను మృగేంద్రంబువగిది నష్టం బొనర్చి పంచజనుం బంచత్వంబు బొందించి యమునితోఁ బోరాడి గురుపుత్రుం గైకొని దక్షిణగా గురువునకు సమర్పించి నిజభక్తులం బ్రోవం జాలె. ఇట్టి మహత్తరకార్యంబులు వీరు దక్కఁ దక్కినవారు సేయంగలరే? కానఁ దచ్చారిత్రంబు సమగ్రంబుగా వినిపింప సమర్థుండను గానని పలుకుచు నా యశోదా నందులతో నారేయి నొక నిమేషంబుగాఁ గడపె నంత. ౩౯౯

తే॥ వేకువను లేచి గోపికల్ ♦ విహితకృత్య, ములను సల్పి దీపంబుల ♦ వెలుఁగఁజేసి
పిచ్ఛిలంబగు పెరుఁగును ♦ బెద్దకడవ, లందుఁ జిలుకగడంగి రా ♦ యవసరమున.

ఉ॥ కంకణకింకిణుల్ లయఁగ ♦ గ్రమవిధంబున మ్రోయ వారు భూ
శంకరకార్యశూర హరి ♦ చక్రికథాత్మకగీతులన్ నిరా
తంకముగా సుగానమును ♦ దద్దయుఁ జేయఁ దొడంగి రించుకే
జంకని కింకిరాత శుక ♦ సారససామ్యమృదుస్వరంబులన్. ౪౦౧

తే॥ ఉద్ధవుఁడు కళిపుప్పు విడి ♦ యుచిత కృత్య, ములను దీరిచి నదిలోన ♦ జలకమాడ
స్వకరథంబెక్కి నడచుచు ♦ వాడ వాడ, లందు గోపికాకృతగాన ♦ మాలకించి.

ఆ॥ విస్మయంబుఁ బొంది ♦ వ్రేలును ముక్కుపై, వేసి యిట్టి నందు ♦ వీట నెంత
కృష్ణచంద్ర భక్తి ♦ యెసఁగె నహా! యోహో! యనుచు నదికిఁ బోయె ♦ నవల వారు.

ఉ॥ దూరము నుండి వాయుగతి ♦ తోఁ జను నుద్ధవుఁ గాంచి యీతఁ డ
క్రూరుఁడ నంచు వచ్చి మును ♦ కొంపల ముంచిన క్రూరుఁడా? మఱే
శౌరివియోగబాధల న ♦ జస్రము గుందెడి మాకుఁ గష్టముల్
గూరుపఁ గంసమిత్రుఁడగు ♦ కొంటెయొ? కానియెడన్ మఱెవ్వఁడే? ౪౦౪

తే॥ నిరపరాధలోకంబును ♦ నిర్నిమిత్త, ముగ వధంపంగఁ గ్రుదువ ♦ మున్ను భోగులను సృజించిన యట్లు గాం ♦ దినియు మమ్ముఁ, గాసిఁబెట్టఁగ నక్రూరుఁ ♦ గనెనుగాదె?

ఉ॥ ఆతఁడె తిర్గివచ్చెనొకొ? ♦ యం చధికాగ్రహవృత్తితో మరు
ద్రీతిగఁ బాఱి నీల్గునటు ♦ తేరున నుండిన రాతుఁ గొట్టి యి

ప్రీతిఁ దెవండొ చెప్పు ? పచి ♦ యింపనిచోఁ బ్రహరింతు మియ్యెదే
సూత! యటంచుఁ దన్ముఖముఁ ♦ జూపుడు వ్రేలునఁ గ్రుచ్చి పల్కఁగాన్. ౪౦౬

ఉ॥ సారథి భీతిఁ బొంది యల ♦ చానల కిట్టులఁ జెప్పసాగె నో
సారసనేత్రలార ! సుమ ♦ సాయకసామ్యమనోజ్ఞరూపుఁడై
శౌరిని బోలు నీఘనుఁడు ♦ చక్రి సఖుండని యెంచుఁడీ ! యనన్
వారలు మెచ్చి యాతనికి ♦ వందనముల్ బొనరించి వేడ్కతోన్. ౪౦౭

తే॥ కృష్ణసందేశ మిప్పుడు గు ♦ త్తెఱుఁగఁ గలమ
టంచు నొయ్యనొయ్యన నద్ధ ♦ వాంతికమున
కేగి యాతనిఁ దోడ్కొని ♦ కృష్ణవార్త
లడుగఁ గదళీవనంబునఁ ♦ కరిగి యుండు. ౪౦౮

ఉ॥ చల్లని పిల్లవాయువులు ♦ సక్కఁగ వీవఁ గళిందజోర్మికా
వెల్లన జాతశీకరము ♦ వేండ్రము నార్పఁగ దివ్యవృక్షముల్
సల్లలితప్రసూనములుఁ ♦ జల్లదనంబును గూర్పఁ జక్రికై
మల్లడిఁ జెంది బొంది గొఱ ♦ మాలినదం చను రాధ యింటికిన్. ౪౦౯

ఉ॥ చేరి రనంతరంబున సు ♦ శీల పరేశ్వరియైన రాధ యా
శౌరి సుమిత్రు రాక విని ♦ చక్కని పూజ సఖీజనంబుచేఁ
గోరికఁ జేయ సల్పియు ము ♦ కుందకథాశ్రవణం బొనర్ప దై
వాఱఁ దదుద్ధవుండు గని ♦ భక్తిని మ్రొక్కుచు నామె కిట్లనెన్. ౪౧౦

తే॥ దేవి! యేల కృశింతు వే? ♦ తేటపఱచు, మీవు బ్రహ్మాండ నాయకు ♦ నింతివయ్యుఁ
జింత నెందుట తగునొకో? ♦ చిత్రముగద, నీమహత్త్వ విచారింప ♦ నెమ్మనమున

కం॥ కృతనిత్యలీలుఁడై యతి, చతురతఁ గృష్ణుండు పుట్టు ♦ సమయంబందే
కృతనిత్యలీలవై యతి,చతురత లీలావతివిగ ♦ జన్మింతువుగా ! ౪౧౨

క॥ హరి పరిపూర్ణతముండై, వఱలును యాయవసరమునఁ ♦ బాయక నీవున్
బరిపూర్ణతమవుగా ధర, వఱలెదవో భగవతి ! వృష ♦ భాను కుమారీ ! ౪౧౩

ఉ॥ ఎత్తఱిఁ జక్రి భూముఁడయి ♦ యిద్ధరఁ బుట్టునొ యప్పు లక్ష్మివై
హత్తితివమ్మ! యెత్తఱిఁ ద ♦ దంబుజనాభుఁడు బ్రహ్మయౌనొ నీ
వత్తఱి వాణివౌదు వెపు ♦ డంబురుహాయతనేత్రుఁ డుగ్రుఁడై
యత్తునొ యప్డు నీవు శివ ♦ వౌదు వహా! జననీ ! పరేశ్వరీ ! ౪౧౪

తే॥ ఘన సనకసనందన సనా ♦ తనసనత్కు, మార మునిరూప మెత్తఱి ♦ మాధవుండు
నెందునో యప్డు జ్ఞాన మా ♦ నందములను, నిచ్చు నాదిదేవతవయి ♦ యొసఁగెదవుగ.

తే॥ ఎపుడు శ్రీహరి విష్ణువై ♦ యొసఁగు నపుడు, వైష్ణవిగఁ బుట్టెదవుగదా ♦ పాయలేక
యెపుడు యజ్ఞవరాహుఁడౌ ♦ [illegible]మూర్తి,యలరునో యప్డు పుడమివై ♦ చెలఁగెదవుగ.

తే॥ ఏసమయమునఁ గాంతుతో ♦ వాసుదేవుఁ, డమరమునివర్యుఁడగునో యు ♦ ద్ధతనిచేత
నలరు మహతియనా వీణవై ♦ చెలఁగెదవుగ, తలఁతు నిన్నద సాధ్వీమ ♦ తల్లి! తల్లి!

క॥ మఱి నరనారాయణులుగ, ధర హరి జన్మించినపుడు ♦ ధాత్రికి సుఖముల్
గరముగఁ గూర్చెడి శాంతిగ, సరసముగాఁ బుట్టెదవుగ ♦ సాధ్వీమణిరో!

వ॥ మఱియు శ్రీకృష్ణుండు కపిలుండైనపుడు సిద్ధసేవితంబగు సిద్ధివిగను, దత్తాత్రేయుండవైనపుడు జ్ఞానమయంబగు సిద్ధివిగను, యజ్ఞంబైనపుడు దక్షిణగను, నురుక్రముండైనపుడు జయంతివిగను, పృథుచక్రవర్తివైనపు డర్చివిగను, మత్స్యావతారం బెత్తినపుడు శ్రుతిరూపవుగను, కూర్మంబైనపుడు సర్వస్వరూపిణివిగను, ధన్వంతరియైనపుడు సంజీవనీనామకభేషజంబుగను, మోహినియైనపుడు జగన్మోహినివిగను, నృసింహుండైనపుడు భక్తవత్సలతాత్మకలీలారూపిణివిగను, వామనుండైనపుడు కీర్తివిగను, బరశురాముండైనపుడు పరశువుగను, శ్రీరాముండైనపుడు సీతవుగను, వ్యాసుండైనపుడు వేదాంతవాణివిగను, బలరాముండైనతఱి రేవతీదేవివిగను, బుద్ధుండైనపుడు బుద్ధివిగను, కల్కియైనతఱిఁ గృతివిగను, జంద్రుండైనపుడు చంద్రికవుగను, నర్కుండైనపు డాతపంబవుగను, నింద్రుండైనపుడు శచివిగను, హిరణ్యరేతసుండైనపుడు హిరణ్యమయివిగను, గుబేరుండైనపట్టున నిధివిగను, క్షీరాబ్ధిశయనించు హరియైనపుడు సూక్ష్మసితతరంగిణివిగను, జన్మించి జగంబుల నుద్ధరించి పోషింతువుగాదె మఱియు మహామహుండగు నా శ్రీకృష్ణుండే సాంప్రతంబున వ్రజరాజనందనుండై వెలుఁగ వృషభానుపుత్రికామణివై రాధయను నభిధానంబుతోఁ జెలఁగుచుంటివి. మఱియు నత్తమ్మికంటి యెప్పుడెప్పు డేయేరూపంబులం బూని యేయేకార్యంబు లొనర్పం గడంగునో యప్పుడప్పు డుచితభంగుల జన్మంబు లెత్తి యాయాకార్యంబుల నెగ్గించెదవుగాదె యని వాక్రుచ్చి మఱియు నిట్లనియె. ౨౧౯

తే॥ సర్వదేవస్వరూపుఁ డా ♦ చక్రపాణి, యఖిలదేవతారూపిణి ♦ వమ్మ నీవు
పరుఁడు భగవంతుఁ డాతండు ♦ ప్రకృతివీవె, యెనుపది సేయుచుంటి మీ ♦ కధికభక్తి.

తే॥ అట్టి భక్తవత్సలుఁ డంపి ♦ నట్టి యుత్తరమిది దయతోడఁ జేకొని ♦ యమలమతిని
జదువుకొన వేఁడుచుంటి నీ ♦ స్వాంతమందుఁ, గలఁతఁ జెందకుమని చెప్పి ♦ కమ్మనొసఁగి.

ఆ॥ అవలి గోపికలను ♦ నామంత్రణముచేసి, వందమించినట్టి ♦ పత్రికలను
మీప్రియుండు వంపె ♦ మేలుగా నివి యంచు, వారికాదరమున ♦ వరుస నిచ్చె.

చ॥ పదపడి రాధ, శ్రీధరుఁడు ♦ వంపిన జాబును గండ్లకద్ది నె
మ్మదిని దదంఘ్రులన్ దలఁచి ♦ మానసపద్మము విప్ప నెమ్మదిన్
జదువుకొనం గడంగి యొక ♦ సారి నగున్ మఱి యొక్కతేప బల్
బెదరిపడున్ మఱొక్కపరిఁ ♦ బ్రీతిని జూపుఁ బఠించి క్రమ్మఱన్. ౨౨౩

చ॥ సరియని శీర్షమూఁచి యల ♦ శౌరి వియోగము దుస్సహంబుగా
ధరపయి వ్రాలె నా పిదపఁ ♦ దత్సఖులెల్లరు వచ్చి చూచి పు
ష్పరసపటీరసారము ల ♦ పారముగా నొడలందుఁ జల్లి చా
మరముల వీవ నాసతి ♦ క్రమంబుగఁ దెప్పిఱెఁ దత్పరంబునన్. ౪౨౪

ఉ॥ గోపిక లుద్ధవుందును ము ♦ కుందవియోగపయోధిమగ్నయై
తాపముఁ జెందు రాధఁ గని ♦ తాళక తాము నులోచనంబులం
దేపున నీరు నించి రది ♦ యెచ్చట వెల్లిగఁ బాఱె నందుఁ బ
ద్మాంకితమైన యొందు కొల ♦ నయ్యెను లీల యనంగ దానిలోన్. ౪౨౫

తే॥ సాధనదానాదులన్ భక్తి ♦ సల్పువారు, దుష్టులయ్యును బూతులౌ ♦ దురుగ రాధ
మనసునందున దుఃఖంబు ♦ మఱుఁగుపఱచి, యాత్మవిభువార్త లాతని ♦ నడిగె నిట్లు.

ఉ॥ మస్మృతుల మా విహారముల ♦ మానసమం దెపుడేన్ స్మరించునే?
యస్మదినాథు నా హరిని ♦ నా కమలాక్షుని నా మనోహరున్
నెమ్మనమందు నే మరతు ♦ నే? యిఁక వాఁడిట కేగుదెంచఁడే?
యిప్పుడు మధురానివాసమె సు ♦ ఖాస్పదమయ్యెనె? వానికో సుధీ! ౪౨౬

ఉ॥ సోమునకై చకోరములు ♦ సూచెడికైవడిఁ గృష్ణమూర్తికై
యేమమును గాంచుచుంటి నుతిఁ ♦ డే యిటనుండినయప్పు మాకుఁ బ్రొ
ద్దేమియుఁ జాలలేదుగద! ♦ యెన్నిపనుల్ బొనరించినన్ క్షణం
బేమియుఁ బోవఁజాల దిది ♦ యే గ్రహచారమొ కాని యుద్ధవా! ౪౨౭

ఉ॥ ఈవఱ కాంజనేయుఁ డెటు ♦ లేగి యయోనిజ స్వస్థఁ జేసెనో
నీవటువచ్చి నెమ్మదిని ♦ నెమ్మదిఁ గూర్చితి విప్డు వానికై
ధీవర! యెట్లొ యుందనుక ♦ దేహము నిల్పితి మింక దీని మే
మేవిధి నాపలేము వెస ♦ నేగి మఱిన్ హరితోడ రమ్మిటుల్. ౪౨౮

తే॥ ఇదుగో వచ్చితినని మాకు ♦ నెంతో యాశ, పెట్టి నిజమోహధన మిట ♦ విడిచిపెట్టి
మధుర కేగి తాఁ బలికిన ♦ మాటఁ దప్పి, చెలఁగు నతని జాబిది విశ్వ ♦ సించు టెట్లు?

ఉద్ధవుండు రాధా గోపికల నూఱడించుట.

తే॥ కాన దయయుంచి తిప్పక ♦ కమలనాభుఁ, దోడుకొని యిచ్చటికి రమ్ము ♦ తొందరగనె
యని వచింపఁగ నుద్ధవుం ♦ డాలకించి, యాశ్వసించి యారాధకు ♦ ననియె నిట్లు.

తే॥ భగవతీ! భగవంతుఁడు ♦ స్వల్పకాల, ముననె వచ్చును లేసచోఁ ♦ బూని నేను
మీయవస్థల నేఁజెప్పి స ♦ మీరగతిని, హరిని దోడ్కొని వచ్చెద ♦ నమ్మ! నమ్ము.

తే॥ అని శపథముగఁ బల్కఁగా ♦ నామె యలరి, ఛత్రచామరాందోళికా ♦ చంద్రదత్త
చంద్రకాంతియుగసహస్ర ♦ చారుపత్ర, భాసురారవిందయుగముల్ ♦ బరగ నిచ్చి.

ఆ॥ శంఖు మహానిహంతఁ ♦ జక్రి నారించిన, మణి నొసంగి వత్స ♦ మాణవిధిని
బలికె నిందుపర్ణ! ♦ వైకుంఠునకు మాకు, సంఘటనము నీవు ♦ సల్పుమయ్య!

క॥ శాశ్వత నిర్గుణ భక్తియు, నైశ్వర్యము జ్ఞాన సుఖము ♦ లాయువు గలుగన్
విశ్వజనీనుఁడవై యీ, విశ్వమునన్ బ్రతుకుమయ్య! ♦ విశ్వాస్యసుధీ! ౪౩౫

ఆ॥ అంత బ్రేమ లెల్ల ♦ రాభరణంబుల, నిడిరి వాని నింది ♦ రేశసఖుఁడు
గొనియె రాధికయు ము♦కుందసఖోక్తుల, నరుస మొందెఁ బిదప♦నాపగవియు.

ఉ॥ ఆయమ యానతిం గొనుచు ♦ నందలి కొల్వునఁ జేరి గద్దెపై
హాయిగఁ గూరుచుండెను బ్ర♦జాంగన లంతట మెల్లమెల్లఁగా
నాయనఁ జుట్టుముట్టి యిటు ♦ లడ్గిరి మత్ప్రియతుల్యవిగ్రహా!
యా యరవిందనేత్రుఁ డెటు ♦ లాడెనొ మాకిపు డీవు దెల్పుమా! ౪౩౬

చ॥ అనవుడు నుద్ధవుండు వలు ♦ కాడఁ దొడంగె నిటుల్ లతాంగులా
ర! నను దదబ్జనేత్రుఁడు క ♦ రంబున నొంటిగఁ బిల్చి మిమ్ములన్
మనమున నెంచి కన్గవను ♦ మాటికి మాటికి నీరునించు చి
ట్లనియె వినందొడంగుఁ డిఁక ♦ నవ్వి వచించెద సక్రమంబుగన్. ౪౩౭

చ॥ గొనములయందు మానసము ♦ గూకినచో భవబంధనంబునన్
దనరుచునుండు నయ్యదియె ♦ తత్పరమాత్మను లీనమైన ము
క్తిని గను నట్టి రెంటికి న ♦ దే ఘనకారణమయ్యెఁ గానఁ ద
న్మనము జయించి కామముల ♦ మాని చరింపఁగ నాను భూస్థలిన్. ౪౩౮

తే॥ ఎవరు నన్ను బ్రహ్మంబుగ ♦ నెల్లచోట్ల,లందు నున్నవానిగను న ♦ ధ్యాత్మవిద్య
నెఱుఁగుచుందురొ యాఘను♦లెడఁదఁ జెలఁగు,కలుషభావంబుఁ ద్రోతురో♦ కాంతలార!

ఆ॥ కన్ను లెంతవఱకు ♦ ఘనము తనుస్థితం, బగ్గమగుచు నుండు ♦ నంతవఱకు
నక్కఁ జూడఁజాల♦నటు జనుఁడున్ మాయ,వదలనంతనఱకుఁ♦బరవుఁ [illegible].

తే॥ స్థూలమార్గమునం జూడ ♦ దూరగుఁడను, గాని తత్త్వార్థంబునఁ ♦ [illegible] గాన
మన సమాగమమందున♦మడఁతులార!, సాధనముగ నా విరహంబు♦సల్పు [illegible]నుఁడు.

తే॥ అట్లు సల్పిన సాంఖ్యయో♦గాదివిధుల, సంభవించు నా కూడిక♦సత్వరమున
మీకుఁ జేకూరఁగలదని♦మెలఁతలార!, భావమున నమ్ముఁడని మీకుఁ♦బల్కుమనియె.

గోపికాగీతలు.

తే॥ అవల గోలోకవాసిను♦లాతని కని, రిట్లు ప్రియలను విడి కృష్ణుఁ♦డిచటనుండి
యితరదేశమునకుఁ బోయి♦యెదొ లిఖించె, దలఁప నిద్ది నిర్మోహతా♦బల[illegible]గాదె?

తే॥ మఱియు ద్వారపాలికలును♦మాటలాడి,రిట్లు ప్రేమించు మము వీడి♦కృష్ణుఁ డేగ
భాస్కరాంబుదాబ్దేందువుల్ ♦ పద్మచాత,కాళిచాకోరముల వీడి ♦ యరిగినట్లు.

తే॥ అవల శృంగారకారిక♦లాడిరిట్లు, నెలకు వెన్నెలపులుఁగు నె♦చ్చెలియగాదె
యేల దానికి శశిరశ్మి ♦ కీలయయ్యె?, ధాత వ్రాసిన వ్రాతలు ♦ దప్పవయ్య!

ఉ॥ శయ్యను వేయు తొయ్యలులు ♦ చక్కఁగఁ బల్కి రిటుల్ మృగంబులన్
బ్రయ్యఁగఁ గొట్టి కాల్కలఁదిఁ ♦ బాఱిన బోయవలెన్ జనార్దనుం

డియ్యెడ నోరచూపులను ♦ నెంతయు మమ్ములఁ గొట్టి యేడకో
చయ్యన నేగి క్రమ్మఱను ♦ స్వాంతమునందుఁ దలంపఁ డుద్ధవా! ౪౪౭

తే॥ అవల పార్షద లని రిటు ♦ లంబుజాక్ష!
విరహబాధలు గడు మాకె ♦ వేద్యములగు
నొకని యంజను జీకుము ♦ ల్లొత్తుకొనఁగ
మఱియొకండు తద్బాధల ♦ నెఱుఁగఁ గలఁడె? ౪౪౮

మ॥ ఘనబృందావనపాలికామణు లిటుల్ ♦ కారుణ్యభావంబుతో
నని రే హేతువులేని ప్రేమ మహిమ ♦ త్మారామాది పొందుర్ సుమీ
సనిమిత్తుంచు గ్రహింపలేఁ డది రసా ♦ స్వాద్యామ్లతిక్తాదుల్
గనఁగా శక్తము లౌనె? చేతులు గనుల్ ♦ కర్ణాదులో యుద్ధవా! ౪౪౯

తే॥ గోప్రవర్ధన వాసినుల్ ♦ గూడి యిట్లు, పలికి రల విలాసవతుల ♦ వలచి వారి
కొదయుఁడైనట్టి శ్రీకృష్ణుఁ ♦ డున్నతాద్రిఁ, జెలఁగు మమ్మేలచూచు నెం ♦ దులకుఁ దలఁచు?

తే॥ అంతఁ గుంజవిథాయిక ♦ లాడి రిట్లు, లతులమాధవీకుంజపుం ♦ జాంతరములఁ
గృష్ణవిరహాగాథలె యాల ♦ కింపఁబడెడిఁ, బ్రస్తుతంబున మాధవ ♦ ప్రాణమిత్ర!

చ॥ మఱియు నికుంజవాసిను ల ♦ మందగతిన్ బలుకాడి రిట్టు లా
వరయమునాధునీతటిని ♦ భాసిలుచుండెడి బృందకాటవిన్
వఱలు కదంబవృక్షముల ♦ పార్శ్వమునన్ విహరించు నా మనో
హరు సురభీవృతున్ సబలు ♦ నాహరిఁ బొందుట యెప్పుడో గదా. ౪౫౧

మ॥ యమునాయూధము లంతవచ్చి యిటు ప ♦ ల్కాడెన్ హృషీకేశసం
గము కుబ్జామల కెట్టు లిచ్చినమునన్ ♦ గాఁజాలె నట్లే భవి
ష్యమునం దీ మనకున్ ఘటించు సతులా ♦ రా! నమ్మఁడీ మీరు భా
వమునందున్ దిరమే జయాపజయముల్ ♦ భావింప నే మేటికిన్? ౪౫౩

చ॥ గిరగిరగిర్రగిర్రగిర ♦ గిర్రనఁ గాలము, చక్రముం బలెన్
దిరుగుచునుండుఁ గాదె సువ ♦ తీమణులార! సుకీరు లాత్మలోఁ
గరముగఁ గష్టసౌఖ్యములు ♦ గావటికుండల టంచు నెంచి సం
బరమున నుంద్రు చింతవిడి ♦ పాపుఁడి! నెమ్మదినుండి తాపమున్. ౪౫౪

మ॥ కరుణాశూన్యుఁడు భారతీవిభుఁడు త ♦ త్కర్మానుసారంబు స్థా
వరముల్ జంగమముల్ సృజించి యొకచో ♦ బాధల్ సుఖం బొక్కచో
వఱలం జేసి క్షణాన కొక్క రహిగా ♦ బాలుండు క్రీడించి సం
బరముం జెందినలీలఁ బొందు ముదమున్ ♦ బద్మాక్షులారా! కటా! ౪౫౫

వ॥ తత్కారణంబుననే కదా కురూపిణియు, దాసీకులసంభూతయు, దుష్ట
పరిచారికయు నగు కుబ్జ సురూపిణియై కులీనయై పరమేశ్వరప్రాణసఖయై విరాజిల్లి

తన యిష్టసిద్ధియైనదని దుందుభితోఁ జాటింప సమర్థురాలయ్యె నన్న వాక్యాన నంత
విరజాయూథంబు లేతెంచి యిట్లనియె. ౪౫౬

ఉ॥ ఎవ్వనికైన సంతతము ♦ నింతులకూడిక యుండ దెప్పుడున్
జవ్వన ముండ దెప్పుడు వ ♦ సంతుఁడు నుండఁడు స్వర్గపాలనం
బవ్విబుధేంద్రుఁడే యనిశ ♦ మక్కట సల్పఁడు నాల్గుప్రొద్దు లి
ట్లెవ్విధిగాని మిగ్గడపుఁ ♦ డీ! మనకష్టము దీరిపోయెడిన్. ౪౫౭

మ॥ లలితాయూథము లేగుదెంచుచు నిటు ♦ లావ్రుచ్చె రామాభిషే
కలసత్కాలమునందు మంథర యనం ♦ గా నుండు కైకేయితో
త్తు లఘిష్ఠాత్మ తదుత్సవంబునకుఁ బ్ర ♦ త్యూహంబు గల్గించె ము
న్నలతొత్తే తగెఁ గుబ్జ నాగ నది హా ♦ యం దేకృతుల్ జేయునో? ౪౫౮

చ॥ మఱియు విశాఖయూథము స ♦ మంజస ఫక్కిని నిట్లుపల్కె నా
మురళి ముఖంబునం దలర ♦ భూషణముల్ మెయివెల్గ వేత్రమున్
గరమునఁ బట్టి గోవులను ♦ గాచి స్వపట్టణ మేగఁ దోడిబా
లుర లలిఁ బిల్చు కుర్దన వి ♦ లోలు హరిన్ మఱువంగ లేమహా! ౪౫౯

శా॥ మాయాయూథము లిట్లుపల్కె నిఱుకౌ ♦ మార్గంబులన్ బల్మిచే
నా యాభీరసతీపటంబులను భీ ♦ హర్షంబులన్ గొంచు వే
స్వీయోరస్థలమందు నుంచుకొని యా ♦ శ్లేషించి పోనెంచు దై
తేయారిన్ హరి నప్డు గీములకుఁ బ్రీ ♦ తిన్ మేము దోడ్తెత్తుమా. ౪౬౦

తే॥ అష్టసఖులును నని రిట్టు ♦ లంగ సుందరుఁడును గోకులవిభుకుమా ♦ రుఁడును నైన
హరినిఁ జూచిన యాకన్ను ♦ లతని విడిచి యవనిఁ గననొల్ల వని శౌరి ♦ కనుము ధీర!

ఆ॥ అట్లు షోడశసఖు ♦ లాడిరి బృందావ నమునఁ జక్రి వేణు ♦ నాదసుధను
జవిని గొన్న యట్టి ♦ శ్రవణ యుగ్మము విశ్వ గీతుల విన నిచ్చ ♦ గింపదయ్య!

వ॥ అంత ద్వాత్రింశత్కాంత లేతెంచి యిట్లనిరి. ౪౬౩

సీ॥ గురుఁడు కోపించినన్ ♦ గోటి దండంబులన్, బెట్టి యావిబుధు మె ♦ ప్పింపవచ్చు
బాపఁ డుగ్రుండైనఁ ♦ బరమాన్నముం బెట్టి, ప్రీత్యుక్తి నతని మె ♦ ప్పింపవచ్చు
రసికుండు గనలినన్ ♦ రసముల నెల్లఁ జూపించి యాసరసు మె ♦ ప్పింపవచ్చు
బిసినారి గినిసినన్ ♦ విడిముడిఁ గడుఁగడు, నిడి యట్టివాని మె ♦ ప్పింపవచ్చు

తే॥ స్నేహితుం డాగ్రహించిన ♦ నిర్మలమగు, ప్రియమొనర్చి యవ్వాని మె ♦ ప్పింపవచ్చు
నెదిరి యెదిరినన్ లొంగి మె ♦ ప్పింపవచ్చుఁ, గాని నిర్మోహు మెప్పింపఁ ♦ గలడె విధియు.

చ॥ మఱి శ్రుతిరూప లిట్లని ర ♦ మాయికవృత్తి గుణాశ్రయంబునన్
ధరకు నిదానమయ్యె నెది ♦ తన్మహదింద్రియదేవతౌఘముల్

సార వెట జాగ్రదాదులకు ♦ సుంతయు హేతువుకాదో యేది యా
హరిమయ తేజముగా గొలుతు ♦ మగ్నిఁ గృశానుకణంబు లట్లుగన్. ౪౧౭

చ॥ అవల ఋషిస్వరూపిణులు ♦ నాఁడిటులన్ మునియోగిదుర్లభుం
డెవఁడో సమస్త వేదముల ♦ కెట్లును జిక్కని వాఁ డెవండొ మా
య విడిచి మేటియౌ నెవఁడొ ♦ యాద్యుఁ డెవండొ ప్రపూర్ణుఁ డెవ్వఁడో
మెవఁడు పరేశ్వరుండొ యల ♦ కృష్ణున కియ్యవె జోతముల్ సుధీ. ౪౧౮

తే॥ అమరసతు లిట్లు పల్కఁ రం ♦ శాంశకాంశ, పూర్ణ సత్కళావేశ సం ♦ పూర్ణ నామ
మద్భుతావతారము లెత్తి ♦ సంభవస్థి, తిలయకారకుఁడౌ హరిఁ ♦ గొలుతు మిపుడు.

ఆ॥ యజ్ఞసీతలిటు ♦ లని రిట్టి హరి గాదె, లోకనాయకుండు ♦ గోకులపతి
రాసరంగవిభుఁడు ♦ రాధికాహృత్కంఠ, భూషణుండు నగుచు ♦ మురియుచుండు.

మ॥ పరమప్రీతి వచించి రిట్లల రమా ♦ వైకుంఠకాంతామణుల్
ధరణిక్షేమముఁ గోరి యాదవులలో ♦ దైవాతి యాభీరసుం
దరులన్ గూడి నిజాంఘ్రిధూళులను బృం ♦ దాభూమి గోవర్ధనో
ద్ధరశైలంబుల వెల్గఁజేయు హరికీ ♦ దోసిళ్ళు కృష్ణప్రియా! ౪౧౯

చ॥ మఱిఁ దెలిదీవిలోఁ జెలఁగు ♦ మానిను లిట్టులఁ బల్కరర్భకుం
డరిగి శిలీంధ్రమున్ బెఱికి ♦ నట్లు గజంబు స్వపుష్కరానఁ బు
ష్కరమును ద్రుంచు మాడ్కి బలు ♦ గండరగండలు మోయలేని య
గ్గిరి నొక కేల నెత్తి తగు ♦ కృష్ణు నెదన్ మరువంగలే దహా! ౪౨౦

తే॥ చేరి యూర్ధ్వవైకుంఠవా ♦ సిను లని రిటు
నలుపుతో వెల్గు మాకనుల్ ♦ నలుపు గలుగు
నిలను గనుఁగదా ద్వైతమే ♦ యెఱుఁగనట్టి
మాకు యోగాదు లేలకో? ♦ మాధవాప్త! ౪౨౧

తే॥ అని రిటుల్ లోకగిరిసతుల్ ♦ హరిని విడువ
లేక ప్రేమపాశంబును ♦ వీడఁ ద్రెంప
మైతి మాతండొ యహిపాశ ♦ మండజపతి
నఱికినటుఁ ద్రుటి నద్దాని ♦ నఱికి యరిగె. ౪౨౨

తే॥ అజితపాదాశ్రితాంగన ♦ లాడి రిట్లు, పద్మలగ్నాళి దమ్మికై ♦ పదిదెసలను
దిరిగి కననట్లు మావి శ్రీ ♦ హరివిలగ్న, దృష్టులా హరికై చని ♦ యెఱుఁగకుండె.

చ॥ ఉసులుగ శ్రీసతీసఖులు ♦ నొయ్యన వచ్చి వచించి రిట్టులన్
బిసినితనంబునన్ యశము ♦ వీడును గోపముచేత యోగ్యతల్
వెసఁ జనుచుండు దంభమున ♦ వృద్ధినిజెందిన మైత్రి పాడగున్
వ్యసనములన్ ధనంబు వ్యయ ♦ మౌను గదా జనపాళికో సుధీ! ౪౨౪

చ॥ అనిరిటు మైథిలాంగన ల ♦ హా! యెవఁడేని ధరాతలంబునన్
ధనము నొసంగి దేహము య ♦ థావిధిఁ గాచుకొనంగ నాను ద
త్తనువున మానరక్షణము ♦ దద్దయుఁ జేసికొనంగ నాను ద
ద్ధనతనుమానశక్తు లిడి ♦ తప్పక మిత్రునిఁ బ్రోవనౌఁ గదా. ౪౭౫

ఉ॥ తిన్నగఁ గోసలాబలలు ♦ దియ్యని పల్కుల నాడి రిట్టులో
యన్న! యెవండు మాదు విర ♦ హవ్యథఁ గాంచఁగలండు? దైవమా!
యెన్నఁడు మారుఘోరశిఖు ♦ లీ హృది నాటుట మానునో మఱిం
కెన్నఁడు వెన్నునిం గలిసి ♦ యేము సుఖింతుమొ సంతసంబునన్? ౪౭౬

వ॥ అంత నయోధ్యావాసినులేతెంచి తమ విభుం గూర్చి యిట్లనిరి. ౪౭౭

చ॥ తొలుత నిరాశఁ గూర్చి తమి ♦ తో వడిగాఁ జనుదెంచి మాకు నా
శలఁ గడుఁ బెట్టి వీడ్కొని వె ♦ సన్ మధురాపురి కేగి రాక యీ
లలిఁ దనవైన యోగకుశ ♦ లంబులు గల్గిన జాబు లిట్లు మా
నిలవుల కంపెఁ జూడ నిది ♦ నిష్క్రియ వృత్తముగాదె వింతగాన్. ౪౭౮

వ॥ అంత పుళిందమందయాన లరుగుదెంచి యిట్లనిరి. ౪౭౯

ఉ॥ ఇంతకు మున్ను శూర్పణఖ ♦ యేగి వనంబున కీమహాత్మునిన్
గాంతునిగా వరింపఁ దను ♦ గన్గొని తమ్మునిచేతఁ గర్ణ నా
సాంతముదాఁకఁ గోయునటు ♦ లాజ్ఞను సల్పెను నట్టివానికి
యంతరమందు మాయెడల ♦ నక్కటికం బెటువచ్చు? నుద్ధవా! ౪౮౦

ఉ॥ జాలిగఁ బల్కరా సుతల ♦ సాధ్వు లిటుల్ మన శౌరి విప్రురూ
పోలిఁగఁ దాల్చి మోసమున ♦ నుర్వరఁ గైకొని తిన్నయింటిలో
దూలము లూడఁబీకు నరు ♦ తో జతయౌచు వదాన్యుఁడౌ బలిన్
జాలఁగఁ గొట్టి మట్టె నల ♦ చక్రికి నేమి యొనర్ప నేమగున్? ౪౮౧

వ॥ పిమ్మట జాలంధరీ మణు లేతెంచి యిట్లు వాక్రుచ్చిరి. ౪౮౨

ఉ॥ ఈ దనుజాంతకున్ మదిని ♦ నెంతయు నమ్ముట బట్టికాదె ప్ర
హ్లాదుఁడు సర్వకష్టముల ♦ నంది మనోవ్యథఁ బొంది కోర నీ
శ్రీదయితుండు నెమ్మదిగఁ ♦ జేరక భీకరమైనరూపుతో
నాదట వెగ్గెఁ దొల్త నిపు ♦ డట్టి కఠోరుఁడు ప్రోచు మమ్మెటుల్? ౪౮౩

ఉ॥ పిమ్మటఁ బల్క రిట్లు పృథి ♦ వీవనితల్ మది నొంపు వెట్టి వా
క్యమ్ములు వేఱుగాఁ బలికి ♦ యాచరణంబున లాఁతిరీతిఁ గా
ర్యమ్ములఁ జేయు పూరుషుని ♦ దా నడతన్ బరమేశ్వరుండు లే
శమ్ము నెఱుంగ లేఁడె? యిఁక ♦ శక్తులమే? మన మింపు నుద్ధవా! ౪౮౪

తే॥ అవల బర్హిష్మతీసతు ♦ లాడి రిట్లు
ప్రళయమందున దయను వ ♦ రాహజన్మ
మెత్తి యిలఁ బ్రోచి తొల్తొల్తఁ ♦ బృథువిభుఁడయి
యిలను బాలించె నా ఘనుఁ ♦ డితఁడ కాఁడె? ౪౮౫

ఉ॥ అంత లతాంగనల్ నుడివి ♦ రాస్థ నిటుల్ సుధఁజేతఁగొంచు ధ
న్వంతరి నాగ వే వెడలి ♦ వైరమొనర్చు సురాసురాళి న
త్యంతము గాంచి వేల్పులకె ♦ యా యమృతం బిడి రాక్షసాళికిన్
గాంతగఁ దోఁచి మోహ మధి ♦ కంబుగఁ గూర్చిన వాఁ డితం డెకా! ౪౮౬

తే॥ అవల నాగేంద్ర కన్యక ♦ లాడిరిట్లు, పతిగ నీహరిం గోరి శూ ♦ ర్పణఖ సనఁగఁ
గరుణ విడిచి కురూపిణి ♦ గాగ సల్పె, నామె యంత కీ డితని కే♦మాచరించె?

చ॥ మఱియు సముద్రకన్య లను ♦ మానము మాని వచించి రిట్టులన్
నరులకుఁ గల్మిలేముల తె ♦ ఱంబున శోక్యవిధానఁ గూర్చి బల్
హరుసము దుఃఖముల్ గొలిపి ♦ యాఱడిగాఁ దిరుగాడు భార్గవీ
వరసతిఁ గొన్న మాతఁ డెటు ♦ బాదుకొనం గలఁడింకఁ బూర్తిగాన్? ౪౮౮

చ॥ పదపడి యప్సరోంగనలు ♦ పల్కిరిటుల్ ముని పీ ఘనుండు తన్
ముదమున గన్నఁ శూర్పణఖ ♦ ముక్కుచెవుల్ దెగఁగోసెగాదె? యీ
యదనునఁ గోరు మమ్ములను ♦ నట్టులఁ గోయక వీడె దీనికై
మదుల నుతించి వానికి న ♦ మస్కృతులన్ బొనరింతు మెన్నియేన్. ౪౮౯

ఉ॥ దివ్య లనం దొడంగి రిటు ♦ దేవవిభుండగు నీమహాత్ముఁడా
దివ్యచరిత్రుఁడా బలికి ♦ దేవపదంబు నొసంగ నెంచి స
త్సేవ్యనిజాంఘ్రితో నదిమి ♦ చిత్రవిధిన్ సుతలానఁ జేర్చె నా
భవ్యచరిత్రు కృత్యములు ♦ పల్కఁగ శక్యమె? ధాతతాతకున్. ౪౯౦

ఉ॥ దంభము వీడి పల్కిరిటు ♦ తాల్మి నదివ్యలు భార్యతోడ స్వా
యంభువు శాంతిగల్గి తప ♦ మక్కఱ సల్పెడివేళ విఘ్నముల్
సంభవిలంగఁ జేసెడి ని ♦ శాటుల నూటిగఁ గొట్టి వాని నీ
జంభవిభేదితమ్ముఁడొగి ♦ సాకఁడె? మమ్మిపు డట్లు ప్రోవఁడే. ౪౯౧

తే॥ పలికి రిట్టుల సత్త్వవృ♦త్తలకు సుదతు, లెన్ని యిడుములువచ్చినన్ ♦దన్నుఁగొలుచు
నట్టి ప్రహ్లాదునిన్ ప్రభు♦నధికదయను, బ్రోవఁడే యితఁడటు మమ్ముఁ♦గావఁడొక్కొ?

తే॥ మఱి రజోవృత్త కాంత లీ♦సరణి నాడి, రల హరిశ్చంద్ర రుక్మాంగ♦దాంబరీషు
లను బరీక్షించి సౌఖ్యంబు♦లను ఘటించి,నట్టి యితఁడట్లు మముఁగని♦యలర జేయు

తే॥ అంతటన్ దమోవృత్తలు♦నాడి రిట్టు,లిట్టి మాయావి మిమన యి♦క్కట్టులొంది
సుఖము గన్న బృందా బలి♦క్షోణినాథ,కుబ్జలను బోలి సుఖములఁ♦గనమొ? మనము.

చ॥ కసికరమన్న నీహరిదె కాంచుమి? యొక్కెడ దెసన్ గృపాణియై
చెనఁటుల రూపుమాపు చొక చెంతను నేగు త్రివక్రయైన కు
బ్జను గని నిర్నిమిత్తపయిఁ బట్టి త్రిభంగులఁ జక్కఁజేసి దా
నిని గొనెఁ గాదె యా యితఁడు నిర్దయుఁ ద్రోయునె? మమ్ము నిమ్మెయిన్.

తే॥ చూవ అవ్వామనాంఘ్రిపి క్షేపపాక, సమయమ్ముం గనసట్టుల శౌరిరాక
కవధి దోఁపదు మాయెడలందు నిపుడు, కన్నులార నెప్పుడు వానిఁ గాంచఁగలము?

ఉ॥ అమ్మకచెల్ల! యట్టి హరి యా కరుణాకరుఁ డిందు లేమి మా
నెమ్మది నిమ్మళంబుగను నిల్వదె! దేహము పాలిపోయెనే!
యమ్మయ మయ్యెనే కనులు! హస్తము లాడవె! నోర్మెదల్పదే!
సొమ్ములు భారమయ్యె! నిటు చూడుము! యేమి యొనర్పమందువో? ౯౯

సీ॥ గోపాలకులతోడఁ గూడి క్రీడించెడి, కృష్ణునే మెప్పుడీక్షింపఁగలము?
బృందావనమున గోబృందంబుఁ గాచెడి, కృష్ణునే మెప్పుడీక్షింపఁగలము?
తల్లిదండ్రుల కెంతొ యుల్లాసమునుగూర్చు, కృష్ణునే మెప్పుడీక్షింపఁగలము?
రాధికాచరిత్ర ప్రసాధనములఁ బొందు, కృష్ణునే మెప్పుడీక్షింపఁగలము?

తే॥ మోహనాంగుని లోకనిర్వాహపటు సుశీలు భూపాలు భక్తాలవాలు బాలు
జిష్ణుఁ బ్రభవిష్ణు రోచిష్ణు! విష్ణుఁ గృష్ణుఁ, దృష్ణదీఱ నే మెప్పుడీక్షింపఁగలము?

తే॥ ప్రేమకోలఁదిని యిట్లు గోపికలు మిగులఁ, గృష్ణుఁ జింతించి చింతించి యెట్టకేల
కిలను వ్రాలిరి దేహంబు తెలియఁగనట్లు, మైథిలేశ్వర! బహులాశ్వ! మఱియు వినుమ!

ఉద్ధవుండు గోకులంబునుండి మథురకు వచ్చుట.

వ॥ అంత నుద్ధవుం డట్లు మూర్ఛితలై పడియున్న రాధాగోపికలం జూచి విచారించి వేఱువేఱుగా సంబోధించి నయవినయభయవచనంబులతో నోదార్చి ప్రత్యుత్తరంబును వ్రాసి యిమ్మని రాధాదేవినిం బ్రార్థింప నాదేవి లేఖినిం గైకొని మషిని ముంచి కమ్మపై వ్రాయఁబోవునంతలోన నశ్రుజలంబులు కనులనుండి జలజల రాలఁ దత్కాకలం బార్ద్రీకృతంబయ్యె. ఇట్లెన్నిపత్త్రంబులం దెచ్చి వ్రాయ మొదలిడినను నన్నియుఁ గన్నీటం దడిసి వ్యర్థంబులగుట నుద్ధవుం డుపలక్షించి

క॥ అమ్మా! శోకింపకుమా!, కమ్మ నెటుల వ్రాయఁగలవు కన్నీరొల్కన్
నమ్ముమ! నామాటల నీ, విమ్మెయి నాజోతలను గ్రహింపుము! తల్లీ! ౧౦౧

క॥ అని పలికి గోపికార్చలఁ, గొని యా రాధికను వీడుకొని యా సాయం
బున రథమెక్కి వ్రజాధిపు, ఘనగృహమున కేగి వసతిఁ గావించి నిశిన్. ౧౦౨

క॥ అరుణోదయకాలమునన్, హరిఁ బొగడుచు మేలుకాంచి యభివాదనముల్
శిరమున నంద యశోదల, కరుసము గలుగంగఁ జేసి యనుమతిగొనియున్.

సీ॥ నందోపనందుల ♦ మందిరంబులకును, వృషభానుల ♦ సదనములకు
నరిగి వారికి మ్రొక్కి ♦ యనుమతిం గొని యచ్యుతసఖులైనట్టి శ్రీ ♦ దామముఖుల
కేగివత్తు నటంచు ♦ నెఱిఁగించి గోకుల, వాసులకుం జెప్పి ♦ వారు వనుపఁ
జక్కని తేరెక్కి ♦ సకలకళాకర, మధురాపురమున క ♦ మందగతిని
తే॥ జేరి యమునాధునీమణీ ♦ తీరమందు, నలరు నక్షయ వటమూల ♦ మందు నొంటి
గా వసించిన కృష్ణు ముం ♦ గలకుఁ బోయి, సలిపి సాష్టాంగనతుల నం ♦ జలిఘటించి.

మందాక్రాంతవృత్తము.

లోకాధారా! నిగమనిలయా! ♦ లోకరాజా! మహేశా!
లోకస్తుత్యా! సకలవరదా! ♦ లోభరాగాదిశూన్యా!
రాకాపూర్ణేందురుచిరరుచీ! ♦ రాధికాప్రాణనాథా!
శ్రీకృష్ణా! యాదవకులమణీ ♦ చిన్మయా! సత్యరూపా! ౧౦౫

మ॥ భవదాజ్ఞం గొని గోకులంబుఁ జని మీ ♦ పత్రంబులన్ మీ విరా
ళి వెతల్ గుందెడి ప్రేలకున్ జెలులకున్ ♦ లీలావతీపంక్తికిన్
శివముం జెప్పి యొసంగి ప్రేముడినిఁ ద ♦ చ్చింతల్ త్యజింపంగఁ బ
ల్కి వడిన్ గ్రమ్మఱి యేగుదెంచితిని గే ♦ లీలోల! లోకేశ్వరా! ౧౦౬

తే॥ కాని నీవిరహంబునఁ ♦ గష్టపడెడి, ప్రేతలన్ జూచి తాళక ♦ వేగిరముగ
హరిని దోడ్కొని యిచ్చట ♦ కరుగుదెంతు, నంచు వాగ్దానమిచ్చితి ♦ నందువలన.

తే॥ ల్లల యంబరీష విభీష ♦ ణాది భక్తు, లందు నను నొక్కనిగ జేసి ♦ యట్టి నాదు
పలుకు సఫలంబుఁ జేయ గో ♦ కులమున కిపు, డరుగుదెంచుము నాతోడ ♦ నంబుజాక్ష!

శ్రీకృష్ణం డుద్ధవ సహితంబుగా గోకులంబున కరుగుట.

క॥ అని పలు తెఱఁగుల వేఁడఁగ, విని కృష్ణుఁడు గోకులముఁ బ్ర ♦ వేశించుటకున్
మనమునఁ దలంచి మధురను, నొనరుపఁ దగు పనులఁ దెల్పి ♦ యుంచి ముసలినిన్

ఆ॥ ఉద్ధవాన్వితుఁడయి ♦ యురుశతాంగం బెక్కి, యేగ సాగి బాట ♦ నెసఁగు బృంద
కావనిఁ బులినముల ♦ గోవర్ధనాద్రిని, గోసహస్రములను ♦ గోర్కెఁ గాంచె.

ఉ॥ దూరమునుండి నాలు వడి ♦ తోఁ జనుదెంచెడి కృష్ణచంద్రునిన్
సారెకుఁ జూచి మోములఁ దృ ♦ ణంబులు భాసిలఁ బాలు సన్నులన్
బూరితిగాఁ జెలంగి శ్రుతి ♦ పుచ్ఛములన్ బయికెత్తి వత్సముల్
గూరిమితోడఁ దోడ్కొని మొ ♦ గుళ్ళల సూర్యునిఁ గప్ప చొప్పునన్. ౧౧౧

క॥ హంభా యని యఱచుచు వి,శ్వంభరు నరదంబుఁ జుట్ట ♦ సంతసమున నా
యంభోజాక్షుఁడు వానిని, సంభావన జేసినట్లు ♦ చఱచెను కేలన్. ౧౧౨

తే॥ అంత బసువులఁ గాచుచు ♦ నాడుచుండు, నట్టి శ్రీదామముఖు లట్టు ♦ లావు లేగి
స్యందనముఁ జుట్టియుండుట ♦ సరగఁ గాంచి, యబ్బురముఁ జెంది యొండొరు ♦ లనుకొనిరిటు

ఉ॥ కనుఁడు శతాశ్వకల్పితము ♦ కాంస్యసుపత్త్రరవప్రయుక్తమున్
ఘనకలశధ్వజాంచిత మ ♦ ఖండశతాంగరుచిప్రకాశితం
బు నయి సమీరవేగమునఁ ♦ బోవు రథం బెటు బోవు లద్దగిం
చినవొ సుమిత్రులార! పరి ♦ శీలనఁ జేయుఁడి! మాకుఁ దెల్పుఁడీ! ౫౧౪

ఉ॥ అందునఁ గొంద ఱాడిరిటు ♦ లాబుధుఁ డెవ్వఁడొకాని యాల కా
నందము గూర్చువాఁడని మ ♦ నంబునఁ దోఁచెడి దక్షిణాంగముల్
స్పందముఁ జెందుచుండె నల ♦ శౌరియె సర్వజనంబు మెచ్చఁగా
నిందుల కేగుదెంచెనొకొ? ♦ యీరును మేమును జూడనా నిదే. ౫౧౫

తే॥ అవల నరయుంగ వారంద ♦ ఱట్టితేరు, దఱిని దాసి శ్రీధరుఁడని ♦ యరుసమొందు
చుండఁ గని హరి ముజ్జల ♦ మొలుకఁ గనుల, రథము డిగ్గి వేర్వర భ ♦ ద్రంబు లడిగి.

మ॥ పరమప్రీతిని గౌఁగిలించుకొని సం ♦ భాషింప నవ్వారలా
యరవిందాక్షువియోగబాధ లెదలం ♦ దావృత్తుగా జ్ఞప్తికిన్
నరిగా రా విలపింప శౌరి తమి నా ♦ శ్వాసించి గోష్ఠంబునం
దెలిఁగింపన్ దనరాక నుద్ధవుసఖున్ ♦ హేజీబుఁ బంపెన్ జుమీ. ౫౧౬

చ॥ అనుపఁగ నట్టి యాపగవి ♦ యా హరిమిత్రులఁగూడి చయ్యనన్
జని పృథుగోకులంబునకు ♦ సంబరమందుచు నందుఁ దొట్టి వా
రిని గని మాధవాగమన ♦ రీతి వచింపఁగ వారు ప్రేమతో
విని యల కృష్ణుఁ బిల్చికొని ♦ వే యిలుఁ జేరఁగ నెంచి వెంటనే. ౫౧౭

సీ॥ భేరీమృదంగాది ♦ వివిధవాద్యములతో, వారిసంపూర్ణకుం ♦ భములతోడ
విప్రపఠితకృత ♦ వేదనాదములతోఁ, గమనీయచందనా ♦ క్షతలతోడ
వాసనావాసిత ♦ ప్రసవహారములతో, శ్రీసతీసమసువా ♦ సినులతోడ
నేత్రపర్వప్రజా ♦ నీరాజనములతో, దాసదాసీజన ♦ తతులతోడ

తే॥ శ్రీయశోమతీసతితోడఁ ♦ జిన్నవాండ్ర,తోడ జయజయారవముల ♦ తోడ నుద్ధ
వాది గోపాలకులతోడ ♦ స్యందనముల,తోడ వెడలిరి చూపఱు ♦ తుష్టిపడఁగ.

తే॥ అవల వృషభానువర్యుఁ డ ♦ ర్యమునిఁ బోలి
యాలియగు కలావతితోడ ♦ హైమశృంఖ
లాన్వితంబు సిందూర పు ♦ ష్పాంచితంబు
నైన మదకరి ముందుంచి ♦ యరుగఁ దొడఁగె. ౫౨౦

క॥ నందోపనందగోపక, బృందము వృషభానువులును ♦ వృద్ధులుఁ బ్రోడల్
సుందరగతితో బహ్వానందముగాఁ జనిరి నంద ♦ నందనుఁ గనఁగాన్. ౫౨౧

చ॥ మఱియును రాధికారమణి ♦ మాధవురాక సఖుల్ వచింపఁగాఁ
గరముగ నాలకించి నవ ♦ కంజము సూర్యునిఁ జూచి వాసనల్

బరగ నొసంగినట్లు తన ♦ భర్మమయాభరణంబులన్ని యా
తరుణుల కిచ్చి యిచ్చను మ ♦ దంబును బొందెను సుప్రసన్నయై. గీ. ౨౨

తే॥ అష్టసఖులును ద్వాత్రింశ ♦ దంగనలును, షోడశాబ్జేక్షణలు య ♦ శోదకొడుకు
రాక నాలించి హర్షించి ♦ రాధమనికి, కేగుదెంచిరి హరిని నీ ♦ క్షింపఁదలఁచి. గీ. ౨౩

తే॥ అంత శ్రీరాధికాదేవి ♦ యంతికమున, కరుగుదెంచిన సతులతో ♦ నలరి దివ్య
శిబిక యందెక్కి చక్రి వ ♦ సించి నట్టి, స్థానమునకేగె నుచిత వే ♦ షంబుతోడ

ఆ॥ గోకులమున నుండు ♦ గోపికలందఱు, కృష్ణురాక వినుచు ♦ గృహకృతులను
విడిచి యంబరములు ♦ దొడవులు దాలుచు, వడ జని రసురవి ♦ రోధిఁగాంచ

ఉ॥ పిమ్మట వాసుదేవుఁడటు ♦ బిన్నలుఁ బెద్దలు స్త్రీలుఁ బూరుషుల్
నెమ్మి వ్రజంబునుండి బహు ♦ నిస్వనముల్ సెలఁగ వాఱ దివ్య నా
ట్యమ్ము లొనర్పఁ దన్పొగడు ♦ చుండకు వచ్చుటఁ జూచి భక్తితో
నమ్మ యశోమతీసతిని ♦ నయ్యను నందుని మ్రొక్కె నాదిలోఁ. గీ. ౨౬

వ॥ అంతఁ దద్యశోదానందులు చిరాగతుండగు తమ ముద్దుబిడ్డను గన్నులారం గాంచి చేతులారం జేరం దీసి కౌఁగిటం గ్రుచ్చి మనసార జెక్కిళ్ళు నివ్వి ముద్దిడుకొని యంకంబులఁ బొంకంబుగాఁ గుదిర్చి యానందబాష్పంబులచే స్నాతుగా నొనర్చి భూషణాంబరహారంబులతో నలంకృతుం జేయ నాకత్తినెచ్చెలి మెచ్చి భూసురులకును నందోపనందవృషభానువులకును, సన్నందాదిగోపవృద్ధులకును వందనంబు లొనర్చి తత్కృతాశీర్యై నిజమిత్రులతో హస్తగ్రహణంబులం గావించి క్షేమ మూరసి పౌరదత్తపారితోషికంబులం గొని యశోదానందుల నొక్కగంధసింధురంబున నెక్కించి తా నుద్ధవసహితంబుగా నిజరథం బెక్కి నందోపనందవృషభాను గోపికాగోపయుక్తుండై నారీమణులు లాజాక్షతలు సల్లి మంగళారతులెత్తి పాడుచుండ నిలింపులు పూలవానలు గురియుచుండ జయజయశబ్దంబులు నిగుడ బ్రాహ్మణాశీర్వాదంబు లినుమడింప గోకులాంతర్భాతనందనగరంబునఁ బ్రవేశించె. అంత గోపకాంతలు సమ్ముఖమ్మున కేతెంచి ప్రాణవల్లభా! నీసుమిత్రుండగు నుద్ధవుని యనుగ్రహంబున నిన్ను సందర్శింపఁజాలితిమి. నీ వేకదా మాకందఱ కాధారభూతుండవని వాక్రుచ్చిరిగాదె. బహులాశ్వా! మఱి యేమి వినవలతువో పలుకు మన నతం డాశ్రీహరి యే యే పనులం జేసె యారాధికాదుల కానందంబు గూర్చెనో క్రమ్మఱి మధురాపురి కెమ్మాడ్కిఁ జనెనో యను విషయమ్ముల విస్తరింపఁ బ్రార్థించెద నన విని మునివరుం డాజనకున కిట్లనియె. గీ. ౨౭

తే॥ అట్లు గోకులమున నున్న ♦ యంబుజాక్షు,నర్కుఁడస్తమింపెడి వేళ ♦ యందు రాధ
పిలువ నా వలమురితాల్పు ♦ వెడలి కదలి,వనమునకు వచ్చెఁ బ్రముదిత ♦ స్వాంతుడగుచు.

శ్రీకృష్ణుండు రాధతో సంభాషించుట.

ఆ॥ అంత రాధ, దరికి ♦ నాతండు వచ్చిన, సంగతి విని స్వీయ ♦ సఖులఁ గూడి
యర్ఘ్యపాద్యము లిడి♦యఖిలోపచారముల్, సలిపి కుశల మడిగి♦సంతసమున.

ఉ॥ ఆతని కేలుఁ బట్టుకొని ♦ యాయతమౌ గదళీధరాగుహో
పేతముఁ జందనాదితరు ♦ విస్తృతమౌ యమునాతరంగిణీ
శీతలవాతశీకరవి ♦ శిష్టము దివ్యసుధాగభస్తిని
ర్యాతసుధార్ద్రిమౌ స్వకము ♦ నైన ఘనాలయ మొంది యందునన్. ౯౩౦

తే॥ భర్మమణిమయాసనమున♦వఱలఁ జేసి, తత్ప్రివాసంబు మొదలు త♦ద్దర్శనంబు
దాఁక దివ్యాన్నశయనచం♦దనవిహార, వీటులను మాని యున్న తా♦విభునిఁ జూచి

క॥ అంబరములచే సుమహా, రంబులచే భూషణనిక ♦ రంబులచేఁ దా
రంబులచే డంబగు పగ, డంబులచే నందముగ నొ♦డల నొనరించెన్. ౯౩౧

క॥ సింగారించి స్వదేహముఁ, బొంగుచు గోపీశతయూధ♦ములు గొలువఁగ శ్రీ
సంగున కారాధిక యీ, భంగిని డగ్గఱి కవడఁ♦బలికెను బ్రీతిన్. ౯౩౩

చ॥ యదుకులచంద్రమా! యెచట ♦ నా మధురాపురముండు? నేటికీ
యదనున మమ్ము వీడితివె? ♦ యర్హమె? చాలదినంబులైన మీ
దు దరిసెనంబు లేదె మిము ♦ స్తోకక మభ్రముఁ జూచుకైవడిన్
గొదకొని సోముఁ గాంచెడి చ ♦ కోరము మాడ్కిని జూచుచుంటిమే! ౯౩౪

తే॥ మునుపు సౌదాస నల రామ ♦ వనితలు మద
యంతి దమయంతి విశ్వంభ ♦ రాత్మజలకు
భర్తృవిరహోరుబాధ సం ♦ భవిలెఁ గాని
యింతబాధలు మావలె ♦ నెసఁగవయ్య!

తే॥ నా సపత్నులౌ గోపికల్♦నమ్మి మిమ్ము, నెమ్మిఁజలదమ్ముఁగనుభంగి♦నెమ్మిఁగనుచుఁ
దమదు నెంజిలుల్ మీ సన్ని♦ధానమందుఁ, జెప్పఁజాలక యుండిరో♦జీవితేశ!

తే॥ ప్రాణవల్లభ! నీవు వి♦శ్వంభరుఁడవ, శేష సాక్షివి గావొకో ♦ శేషశయన!
యట్టి నీకిట్టి మావెత♦లవగతములు, గావె? యైనచో దయ మముఁ♦గావవేల?

ఉ॥ నీచెలియైన యాపగవి ♦ నీవిరహంబునఁ జావనున్న మ
మ్మాఁచెడి నీయుదంతముల ♦ నన్నిటి వాకొని యూఱడించి వే
లేచి మఱిన్ ద్వదంతికము ♦ లీలఁగఁ జేరి పచించి మాగతుల్
ఘూచెడిలోన మిమ్ముఁగొని ♦ చొచ్చె నిటన్ బురుపార్థి యీతఁడే. ౯౩౫

చ॥ అని కనులన్ బ్రవాహముగ ♦ నశ్రులు గాఱుచునుండఁ బల్కు రా
ధను గని లోకనాథుఁడగు ♦ దానవహంతకుఁ డాదరోక్తులన్
దనిపి యనంగసాగె నిటు ♦ తామరసాక్షి! యశేషసాక్షినై
యనయముఁ జూచుచుంటిఁగద ♦ యద్ది యెఱింగియు నేడ్తు వేలకో? ౯౩౬

తే॥ పాలకును నందుఁగల తెలి♦డాలునకును, దారతమ్యము లేని వి♦ధమున నీకు
నాకు భేదంబు లేనప్డు ♦ నావియోగ, మెట్లు సిద్ధించె దానికై ♦ యేల వగపు.

క॥ నేనో పూర్ణబ్రహ్మము, నానందాత్మక తటస్థ ♦ వగుచు భువనసం
తానవిదానవు గావే, జ్ఞానముతో నొక్కతేవఁ ♦ గనుమా! దానిన్. ౯౮౧

తే॥ ఇట్టి మన కిద్దఱకు నిప్డు♦బిట్టు దుఃఖ, ములను గూర్చెడి విరహంబు♦పుట్టుటెట్టు?
లెచట నేనున్న నీవందు ♦ నెసఁగుచుందు, వెందు నీవున్న నేనందు ♦ నుండునుగద.

తే॥ పంచభూతంబు లెట్టులు♦వ్యాప్తిఁజెంది, స్థూలసూక్ష్మరూపంబుల♦తోడ నిత్య
మయ్యెనో యట్లు మనము ని♦త్యతను జెంది, భువనముల నేలుచుందుమో♦ముద్దుగుమ్మ!

తే॥ విమలతోయంబు మాదిరి♦వికృతి రహితుఁ, డనగు నేఁ ద్రిగుణంబులఁ♦దనరుచుంటి
నీ సదానంద భావంబు ♦ నెఱిఁగి యీవ, హం మమేతి భావంబుల ♦ నంటవలదు

క॥ ఎత్తఱి నీవని నేనని, చిత్తమునన్ వేఱుసల్పి ♦ చింతించెదవో
యత్తఱి నీమానసమున్, దత్తరముం బొందు దానఁ ♦ దాపము పుట్టున్. ౯౮౨

చ॥ కను లల ద్రిమ్మరెందనుకఁ ♦ గప్పునొ యందనుకన్ దివాకరున్
గన వెపు డభ్రసంతతులు ♦ గ్రమ్మవొ యప్డినుఁజూచునట్టు లెం
దనుక గుణంబులన్ మనము ♦ దాల్చునొ యందనుకన్ స్వరూపమున్
గన దెపు డా గుణంబులను ♦ గ్రాలదొ యత్తఱి స్వాత్మఁగాంచెడిన్. ౯౮౩

ఉ॥ సంగముచేతఁ గామములు ♦ సంభవ మయ్యెడి దానఁ గ్రోధము
ప్పొంగెడి దాన మోహమును ♦ బుట్టెడి దాన స్మృతిభ్రమంబు గ
ల్గుంగద దాన బుద్ధినెసి ♦ క్రుంగును గావున నెవ్వఁడైన ని
స్సంగుఁడుగాఁ జెలంగవలె ♦ సత్యము తథ్యము పథ్యమో సఖీ! ౯౮౪

తే॥ మానినీమణీ! యెఱుఁగుమా♦మానసంబ, ముక్తికిని బంధనమునకు♦మూలమంచు
నంతులేనట్టి తలఁపుల ♦ నందవలదు, నన్ను జేరు మనన్యప్ర ♦ ణయముతోడ.

క॥ అని నుడువఁగ రాధికయున్, విని మనమున సంతసించి ♦ ప్రేతలఁదగి పూ
జనముల వనరుహనయనున, కొనరించెను శ్రద్ధతోడ ♦ నొడయఁడ! యవలన్.

ఉ॥ ఆర్తజనావనప్రియుఁ డ♦ ఘాద్రివిభంజనవజ్రి వజ్రసం
పూర్తసువర్ణభూషణవి♦భూషితమూర్తి త్రిమూర్తిరూపకుం
డార్తవహారశోభితుఁడు ♦ నైన సరోరుహనేత్రుఁ డింబుగాఁ
గార్తికమందు బృందయను ♦ కానకు నేగె సతీసమేతుఁడై. ౯౯౦

చ॥ చని మురళీనినాదములఁ ♦ జక్రి యొనర్చి నిశాంతరంబునన్
ఘనుఁడు తృణాగ్రపర్ణ దగిన ♦ కైవడి నింద్రుఁడు భార్యతోడఁ గూ
డినవిధి మారుఁ డాలినిఁ గ ♦ డిందిగఁ బొందినమాడ్కి రాధతో
డను దగి రాసమండలము ♦ డాబుగ నిర్మితిఁజేసి యత్తఱిన్. ౯౯౧

మ॥ నటవేషంబు ధరించి యొంద అచటన్ ♦ నాతుల్ విరాజిల్లిరో
చటులత్వంబున నన్నిరూపములతో ♦ సంతుష్టచిత్తంబునన్
నటనంబట్టి మహానటుండు మఱి ద♦న్నాకాంగనల్ మెచ్చను
త్కటరీతిన్ బొనరించి రాసములఁ ద♦త్కాంతావళిన్ దేర్చె తాన్. ౧౧౨

ఉ॥ తల్లలనావితానసహి ♦ తంబుగఁ జేరి కళిందజాతటిన్
బెల్లుగ నుండు నారెముల ♦ విస్తృతమౌ పులినంబులన్ విరా
జిల్లు నికుంజపుంజములఁ ♦ జన్నిసరస్సుల గోప్రవర్ధనం
బల్లన డాసి యందుఁగల ♦ యద్భుతముల్ గనుచుండె నత్తఱిన్. ౧౧3

తే॥ గోపికాశతయూథముల్♦కోపపడుట, హరి విలోకించి రాధికా♦తరుణితోడఁ
గూడి యంతర్హితుండౌచు♦గోప్రవర్ధ,నాద్రికిన్ యోజనత్రయ♦మందు నున్న.

ఆ॥ చందనావనిరుహ ♦ సుందరరోహిత, గిరికి నరిగి యందు ♦ వఱలు విరులఁ
దరుల దరుల లతల♦వరుసఁగాఁ గాంచెను, నాలితోడ ముచ్చ♦టాడుకొనుచు.

తే॥ అంత హరి రాధతోఁగూడ♦నందు స్వర్ణ,మయలతల వెల్గుచోటునన్♦మనికిఁ జేసె
నచట బద్రినాయకకృత♦మాయతంబు, నైన యొండు దేవసరసి♦యతిశయిల్లు.

తే॥ అద్ది పాఠీనకూర్మన ♦ క్రాదివివిధ, జలచరాంచితంబును సహ ♦ స్రదళపద్మ
మండితము హంససారస ♦ మధులిడాది, దివ్యనినదాన్వితంబయి ♦ తేజరిల్లు.

ఆ॥ అట్టి రమ్యమైన ♦ హ్రదము తీరంబునఁ, బాకజాతుఁ డొక్క ♦ పట్టునందు
సౌరభయుతమలయ ♦ మారుతములు వీవఁ, గోరి రాధతోడఁ ♦ గూరుచుండె.

శ్రీకృష్ణుండు ఋభుమునిని జీవన్ముక్తుం జేయుట.

ఆ॥ అచట నిర్జలత ని ♦ రశనత శాంతత, నఱువదాఱువేల ♦ హాయనముల
నుండి తపము నిశ్చ♦లుండయి యేకాంఘ్రి,యందు నిలిచి సలుపు♦నట్టి ఋభుని.

ఆ॥ కమలలోచనుండు♦గని యద్భుతానంద,ములను నవ్వ రాధ♦మోముఁ గాంచి
యిట్లు బలికెఁ జెలిరో!♦యీభక్తునిం జూడు, మనము ప్రోవనౌను♦ఘునుని వీని.

ఆ॥ అటు లని దయఁ జక్రి ♦ యా మునిన్ "హే ఋభో"
యంచుఁ బిలువ నాతఁ ♦ డత్తఱిన్ స
మాధి నుంట మఱల ♦ మాటాడమిన్ హరి
చూచి యతని యెడఁదఁ ♦ జొచ్చె నంత. ౧౨౧

ఆ॥ ఋభుఁడు ధ్యానమందు ♦ నభయవరప్రదా
నుఁడగు హరినిఁ జూచి ♦ కడు ముదంబుఁ
జెంది కనులఁ దెఱచి ♦ శ్రీకృష్ణు రాధికా
సహితు దేవదేవు ♦ సరసఁ గాంచి. ౧౨౨

క॥ భక్తిని రక్తినిఁ బ్రణతుల, శక్తికొలందిగ నొనర్చి ♦ సర్వవిధములన్
ముక్తిని గోరుచు మనమున, యుక్తముగా నిట్లు వేఁడె ♦ నుర్వీనాథా! ౧౬౩
సీ॥ పరిపూర్ణతమకును ♦ బరిపూర్ణతమునకు, శ్యామకు నవఘన ♦ శ్యామునకును
రాసవల్లభకును ♦ రాసవల్లభునకు, నీశ్వరికిన్ జగ ♦ దీశ్వరునకు
నిందుబింబాస్యకు ♦ నిందువంశ్యునకును, లీలావతికిఁ గేళి ♦ లోలునకును
దేవతాదేవికి ♦ దేవదేవునకు శ్రీమతియగు రాధకు ♦ మాధవునకు
తే॥ కృష్ణకును గృష్ణునకు మీకు ♦ నిరువురకును
వందనము లివ్వె కొనుఁడంచు ♦ వారి పాద
ములను వ్రాలియు హరిని ని ♦ శ్చలతఁ దలఁచి
ప్రాణముల వీడె నంత నా ♦ ప్రాజ్ఞజ్యోతి. ౧౬౪
క॥ ఊర్జితయశుఁడును ఘనుఁడును, దుర్జన భర్జనుఁడు నాత్మ♦తోయదనిభుఁడున్
దుర్జయుఁడును నగు హరిలో, నిర్జరు లౌరా! యనంగ♦ నతఁడు లయించెన్. ౧౬౫
క॥ అంత ననంతుఁడు తన్మునిఁ, గాంతుని ప్రియపూర్వభక్తిఁ ♦ గని ముజ్జలమున్
సుంతగఁ గాఱ్చుచు నాతని, సంతసమున రమ్మటంచుఁ ♦ జక్కఁగఁ బిలిచెన్.
క॥ పిమ్మట నమ్మునిఁ, గ్రమ్మఱ, నమ్మాధవు నడుగుదమ్ము♦లం దచ్యుతరూ
పమ్మును గోటిమదనసా, మ్యమ్ముగఁ బొలుపార వంచి♦మస్తముఁ బెట్టెన్.
చ॥ అవలఁ గృపాకరుం డయిన ♦ యంబుజనేత్రుఁడు తన్మునీంద్రునిన్
గవుఁగిటఁ గ్రుచ్చి సాదరము ♦ గా నని యూఱటఁ బుచ్చి మెచ్చుచున్
శివకరమౌ స్వహస్తమునఁ ♦ జిన్నగ దువ్వెడుఁ దద్రుభుండు మా
ధవునకు రాధకున్ దమిఁ బ్ర ♦ దక్షిణముల్ నతులన్ బొనర్చె తాన్. ౧౬౮
తే॥ దివ్యరథ మెక్కి దశదిశల్ ♦ దేజు దాల్ప, నట్టి గోలోకమున కేగె ♦ నద్ది గాంచి
రాధకాదేవి లలి నబ్బు♦రంబు బొంది, పెనిమిటికి నిట్టు లనియెడిఁ ♦ బ్రేమతోడ.
తే॥ ప్రాణవల్లభ! కనుము నీ ♦ భక్తుఁ డైన
యిట్టి ఋభుఁ డెట్లు గోలోక ♦ మేగె నహహ!
యితని దేహంబు దహనంబు ♦ నీవె చేయఁ
దగిన దిది తపశ్శుద్ధమై ♦ తగను గాదె? ౧౭౦
క॥ అని నుడివెడి తడవుగఁ దన్ముని దేహము కొలఁకుగ నల ♦ భూధరమునఁ బా
పనికరనాశంకరమై, తనరెను బహుశంకరముగ ♦ ధాత్రీనాథా! ౧౭౧
తే॥ అద్ది రాధిక కని విస్మ♦యంబు నొంది, హరికి నిట్టుల నుడివెనో♦యంబుజాక్ష!
యతని యపఘనం బెటు కొల♦నైన వార్త, విస్తరింపుమనఁగ నిట్లు♦ వెన్నుఁ డనియె.
చ॥ మకరపతాకసుందరిస ♦ మానమనోహరరూప! ప్రేమపూ
ర్ణకమగు భక్తితోఁ దగి వ ♦ రప్రదుఁ ద్వద్యుతు నన్నుఁగాంచి కొ

తుకమతిత్రో సరస్సుగ వి ♦ ధూతమలుండయి పాతె నాతఁ డిం
తకుమును నేఁ బ్రవాహముగ ♦ దద్దయుఁ బాడినయట్లు నావుడున్. ౫౭౩

❧ శ్రీకృష్ణుండు రాధికకు నారదోపాఖ్యానంబుఁ జెప్పుట. ❧

తే॥ కీర్తినందిని యలరి యా ♦ కృష్ణుఁ జూచి, యిట్లు నుడివెను దేవరా! ♦ యీవుగూడ
సలిలమైతివె? యెట్లది ♦ సరిగఁ దెల్పు, మనవు డా కత్తినెచ్చెలి ♦ యనియె నిట్లు.

చ॥ సరసిజలోచనా! దురిత ♦ జాలవిభేదసమర్ధ మర్ధదం
బరిపురదావమైన యితి ♦ హాస మొకండు వచింతుఁ దీని కా
పరముని నాభిపద్మమున ♦ బ్రహ్మ జనించి ప్రపంచమిద్ది యే
ర్పఱచి నిజోరువందు ముని ♦ వర్యుని నారదుఁ గాంచె నాదిలోన్. ౫౭౪

ఉ॥ నారదుఁ డట్లు పుట్టి స్వమ ♦ నంబున నన్ను సతంబు నమ్మి నా
కీరితి నా గుణంబులను ♦ గీర్తనఁ జేసి యనర్గళంబుగా
ధారుణిలో భ్రమించుటను ♦ దద్విధిఁ గన్గొని యేమిరా సుతా!
యీ రహిమాని సంతు గని ♦ యెల్లసుఖంబులఁ బొందుమా! యనన్. ౫౭౫

చ॥ అమరమునీంద్రుఁ డిట్లనియె ♦ నయ్య! భవద్వచనంబు వింటి స
క్రమముగఁ గాని యీ భవము ♦ కల్మషదుఃఖమయంబు గాన దా
ని మదిఁ దలంప బిడ్డలను ♦ నేఁ గనఁజాల నిఁకేమనన్ ద్రవి
క్రముపయి భక్తి నిల్పెద న ♦ ఖండతదీయయశంబుఁ బాడుచున్. ౫౭౬

క॥ కావున నీవును బ్రజలను, నావలె సృష్టింపకుండ ♦ నలిననయనునిన్
శ్రీవిభు బ్రహ్మాండేశ్వరు, భావమునన్ నమ్మి మనుమ! ♦ పంకజయోనీ!

ఆ॥ అనుచు బుద్ధి గఱుప ♦ నబ్జాసనాసీనుఁ, డాకళించి కనలి ♦ వ్యర్థచరిత!
గానపరుఁడవౌచు ♦ గంధర్వునకుఁ బుట్టి, తిరుగుమొక్క కల్ప ♦ మరుగువఱకు.

తే॥ అని శపింపగ నాతఁ డా ♦ యమరలోక, మందు నుపబర్హణాఖ్యతో ♦ నతిశయిల్లు
చుండు గంధర్వవిభుఁడయి ♦ యొక్కతెటిని, వనితలన్ గూడి విధిలోక ♦ మునకు నరిగి.

తే॥ నలువ కభినాదనంబుల ♦ సలిపి స్వీయ, భామినీమోహవశుఁడయి ♦ స్వరలయాది
శాస్త్రవిధులను దాటి స్వ ♦ చ్ఛందరీతిఁ, బాడె నద్దాని వినిన యా ♦ పద్మభవుఁడు.

తే॥ మరల నిట్టుల శపియించెఁ ♦ బరమనీచ!, గానవిధుల నుల్లంఘించి ♦ గానమిట్లు
సలిపితివి చెల్లఁబో! శూద్ర ♦ జన్మమెత్తి, ధాత్రిలోఁ జరింతువుగాక ♦ తరలుమింక.

ఉ॥ దాన నతండు కల్పము గ ♦ తంబగుదున్ గలరూపు వీడి వే
పూని జఘన్యజన్మమును ♦ మున్నటి సజ్జనమైత్రిశక్తిచే
దా నల శూద్రజాతి విడి ♦ ధాతకుఁ గ్రమ్మఱఁ బుట్టి నన్ను న
న్యూనగమముగా నుతించు చిల ♦ నుండఁ దొడంగెను నారదాఖ్యుఁడై. ౫౮౩

వ॥ అట్లు విధూతపాపుండైన నారదుండు క్రమంబుగా మునీంద్రులలో మహామునియై గాయకులలో మేటియై వైష్ణవులలో శ్రేష్ఠుండై భాగవతులం దుత్తముండై జ్ఞానులలో భాస్కరుండై మత్ప్రీతికాస్పదుండై వెలయుచు మన్నా నో మయుండయ్యె. ఇట్టి మునీంద్రుండు మద్గుణసంకీర్తనంబు గావించు చెల్లలోకంబులను విలోకించి యిలావృతనామకఖండంబునకుం జని జంబూఫలరసంబున జనించి నదియు జాంబూనదంబను స్వర్ణంబును గాంచునదియు నగు జంబూనదిచే విరాజిల్లు దేశంబున భద్రమణిమయహర్మ్యాదివినిర్మితంబును, దివ్యనారీనరపరివృతంబును నగు వేదనగరంబుం బ్రవేశించి యందుఁ గూనివాండ్రను, గుడ్డివాండ్రను, మరుగుజ్జువాండ్రను, దొడ్డికాళ్ళవాండ్రను, విజంఘులను, జఘనవ్యంగులను, విశ్లథదంతులను, నతాననులను, గృశోరువులను, దుందిలోదరులను, సూక్ష్మకంధరులను, వికటజానువులను, బాదరహితులను, స్త్రీపురుషులలోఁ గాంచి దుఃఖించి యా పౌరులలోని గొందఱ నాలోకించి సరసులారా! వాదిత్రసహితులును, గానపరాయణులును, దివ్యదేహులును, బద్మముఖులును, శుభ్రాంబరధారులును నగు మీకీచందంబున సంగభంగంబులు నానాభంగులుగాఁ జెలంగుటకుం గతం బేమయ్యెనో స్పష్టీకరింపుఁడని ప్రార్థింప నవ్వారు మునివరా! మేము వేద నగరవాస్తవ్యులమగు రాగనామకులము బ్రహ్మపుత్రుండగు నారదుండు ప్రేమోన్మత్తుండై యొకాలంబున ధ్రువపదంబులను స్వరతాళవర్జితంబుగా నిమ్మోదిని స్వేచ్ఛగాఁ బరుగుచు గానం బొనర్చుట నాలోకించి యీ రహిగా నంగభంగంబులతో మానభంగమ్ములు గలుగంగ దుఃఖించుచుంటిమని యనుఁడు చిత్రంబు జెంది గర్వవర్జితుండై నైలత్యస్మితం బొనర్చి తద్రాగంబులనుం గని మీ పలుకులు లెస్సయే కాని యిందులకా నారదుం డేమి యొనర్చి తత్కాలతాలస్వరాది విజ్ఞానంబు సంపాదింపఁగలఁడో నుడువుఁడని యడుగ నాలించి యవ్వారో యోగివరా! ఇయ్యది దుర్లభంబుగానఁ బరమేశ్వరప్రాణసఖియగు వాగ్దేవికడకే చని శిక్షం బొందినఁ దజ్జ్ఞానం బామహాముని కబ్బఁగలదని వాక్రువ్వ నవ్విబుధశ్రేష్ఠుండు సంతసించి సరస్వతీప్రసాదసంపాదనార్థంబై యమలంబగు నొక్కమల కరిగి యందు దివ్యశతవర్షంబులు నిర్జలాహారుఁడై తపం బొనరించె. అట్లాచరించినది మొదలు తద్గిరి నారదగిరి యను పేరం బరగు. అంత నా పలుకుల వెలఁది యా ముని తపంబునకు మెచ్చి చెంగట వెలుంగ నతండు హర్షోత్కర్షమనస్వియై ప్రత్యుత్థానం బొనర్చి నతాననుండై నమస్కరించి దోసిలి యొగ్గి యిట్లు వినుతింపం దొడంగె. గీరకం

సీ॥ ఐరావత మరాళ ♦ హీరముక్తావర్ణ, భాసుర పటయుతా! ♦ వందనములు
నవభాస్కరోజ్వల ♦ నవరత్న చిత్రిత, స్వర్ణభూషాంచితా! ♦ వందనములు

స్ఫటికమాలాంబుజ ♦ వల్లకీవరకనత్పాణి విభ్రాజితా! ♦ వందనములు
ఘనసార చందన ♦ కస్తూరి కుంకుమ, వాసనావాసితా! ♦ వందనములు
తే॥ పరమకల్యాణదాయినీ!♦వందనములు, ప్రకృతిగుణగణోల్లాసినీ!♦వందనములు
పతితసముదాయపావనీ!♦వందనములు, వాణి! శ్రీకృష్ణు తొలిరాణి!♦వందనములు
చ॥ చరణయుగంబు ఛందములు ♦ జంఘలు రెండు శ్రుతుల్ యజుస్సునో
రురుభుజముల్ శ్రుతిస్మృతు ల ♦ నుత్తమసామము కుక్షి ఋక్కు కం
ధరమును శిక్ష మధ్యమము ♦ దర్క మురోజము లాస్యముల్ గృతుల్
వర నిగమాంత మకుటలుగ ♦ భాసిలు నిన్ను నుతింతు భారతీ! ౧౮౯
తే॥ అంబ! జగదంబ! భాషాంబ!♦యంబికాది, సతి కదంబసమర్చిత♦చరణయుగళ!
సరళమానస! పోషిత♦స్వప్రియచయ! భద్రగజయాన! నీకివే♦వందనములు.
సీ॥ ఏ యంబ పాదంబు ♦ లాయంబుజాసనా,ద్యమర ప్రణుతుల క ♦ ర్హంబులయ్యె
నే యంబ చరితంబు ♦ లాయమరాచార్య, చతురోక్తులకును ను ♦ చ్ఛ్రితములయ్యె
నే యంబ వర్తనం ♦ బాయంబికాముఖ, సద్వృత్తి మార్గద ♦ ర్శకమునయ్యె
నే యంబ యాగ్రహం ♦ బా యసురశ్రేణి, హింసకు నత్యంత ♦ హేతువయ్యె
తే॥ మఱియు నేయంబ కరుణయు♦సరసకవిత, కాది కారణ మయ్యె నే♦యంబ పలుకు
సకలకళలకు బీజమై ♦ సఫలమయ్యె, నట్టి నాతల్లి నిన్ను నే ♦ నాశ్రయింతు.
తే॥ అమ్మ! కాలతాలస్వరా ♦ ద్యఖిలగాన, విధిదృఢజ్ఞాన మీవిచ్చి ♦ వేగ బ్రోవు
మమ్మ! సాష్టాంగనతులను♦నాచరింతు, నమ్మ! నమ్మితి నిన్ను నే♦నెమ్మనమున.
చ॥ అని యిటులన్ నుతింప జగ ♦ దంబ సరస్వతి సుప్రసన్నయై
నెనరున దేవదత్తమును ♦ నిస్తులమున్ స్వరధాతృభూషితం
బును శ్రుతిపేయనాదపరి ♦ పోషితమున్ వరతంత్రిభాసురం
బు నగు విపంచికన్ముని క ♦ మూల్య మటం చిడి శ్రద్ధతోడుతన్. ౧౯౦

వ॥ అసంఖ్యాకంబులగు నంతర్భేదంబులతోఁ జెన్నారు షట్పంచాశత్కోటి భేదంబులతో రాగంబులను రాగిణులను దత్పుత్రులను మూర్ఛనావాదిత్రసహితంబులగు గ్రామనృత్యంబులతోడను, స్వరగమ్యంబులును, స్వతస్సిద్ధంబులు నగు పదంబులతోడను, దేశకాలభేదంబు లనుసరించి తాలమానస్వరయుతంబుగా నమ్మహామునిచే బఠింపించి యద్వితీయరాగకర్తగా నొనర్చి రాసమండలంబున గాయకనాయకుం డౌనట్లు వరంబిడి సనాథయై మునిని వీడ్కొని వైకుంఠపురంబున కరిగె. అంత.

మ॥ చెలిరో! నారదుఁ డట్లు గానకళలో ♦ శ్రేష్ఠత్వ మార్జించి ని
స్తులసంతుష్టిని బొంది గుహ్యమును సం ♦ తోషప్రదంబైన త

తక్కక నర్హుండగు వానికిఁ దలఁచి యా ♦ గంధర్వదేశంబునన్
బలుమాఱుల్ గని తుంబురుండను ఘనున్ ♦ స్వచ్ఛాత్రుగా సల్పి తాన్.

తే॥ సక్రమంబుగ సర్వరా ♦ గములఁ గాల, తాలముఖవిధియుతముగాఁ ♦ దద్ద నేర్పి
మద్గుణంబుల నన్నిఁటి ♦ మఱువకుండఁ, జక్కఁగాఁ జెప్పి యుల్లంచె ♦ స్వాంతమందు.

ఉ॥ నేర్చితి భారతీదయ న ♦ నేకవిధంబుల నుండు రాగముల్
గూర్చితిఁ గ్రొత్తరాగములఁ ♦ గోట్లకొలందిగ నున్నవానినిన్
మార్చితి మేలు చాలునను ♦ మార్గణముం బొనరించి వీనినిన్
దీర్చితిఁ గాయకోత్తముగ ♦ దీని వినందగు వార లెవ్వరో? ౧౯౪

చ॥ విని తమి మంచిచెడ్డలను ♦ వేమఱుఁ దెల్పెడి వాఁ డెవం డటం
చనుకొని శిష్యుతోఁ గలిసి ♦ యా మఘవంతుఁడు యోగ్యుఁడంచు నా
తని దరి కేగి మన్కిని న ♦ తండు వసింపమిఁ జూచి సాగి యా
వనజహితాలయంబునకు ♦ వచ్చెను దత్సమయంబునందునన్. ౧౯౫

చ॥ తరణి స్వకీయమైన యర ♦ దంబున నెక్కియుఁ బాఱుచుండు మా
దిరి గని వీలు గాదనుచు ♦ దిర్గి శివంకరు ప్రోల కేగె న
త్తటి నల భూతనేత పర ♦ తత్త్వవిచారనిమగ్నుఁడై కనుల్
బోరిఁ బోరి మూసియుంట గ్రతు ♦ భుజ్ముని గన్గొని శిష్యయుక్తుఁడై. ౧౯౬

ఆ॥ బ్రహ్మలోకమునకు ♦ వచ్చి విలోకింప, నట్టి వేల్పుపెద్ద ♦ యఖిల సృష్టి
కార్యతత్పరతను ♦ క్షణమేని దీరమి, సరిగ లేదటంచు ♦ సాగి వేగ. ౧౯౭

క॥ వైకుంఠమునకుఁ జనె నల, వైకుంఠుఁడు కరుణతోడ ♦ భక్తార్థంబై
యే కడ కేగెనొ కానీ, యాకాలమునందు నందు ♦ నగుపడకుండెన్. ౧౯౮

ఉ॥ దానిని గాంచి తుంబురుయు ♦ తంబుగ నంబుజజాతసూతి త
త్స్థానము వీడిపోయె నహా! ♦ జ్ఞానుల పోకలు ముజ్జగంబులన్
లోన బహిస్థలంబున న ♦ నూకగ కర్మముఁ ద్రోసి స్వేచ్ఛగా
నేనెలవేనిఁ బొందుటకు ♦ నేగవె? యోవృషభాను పుత్రికా! ౧౯౯

తే॥ అంత నామానివర్యుఁ డ ♦ నంతకోటి, లోకములఁ దాటి పరమ గో ♦ లోకమునకు
నరిగి యరమునఁ గల్లోల ♦ భరితమైన, విరజ యను ధునిన్ గనుఁగొని ♦ వెడలి యచట

శా॥ అందంబైన సదావసంతయుతబృం ♦ దారణ్యముం గాంచి యా
నందం బిచ్చెడి గోప్రవర్ధనగిరిన్ ♦ నల్లిక్కులం జూచి యా
మందారాదిసమస్తకల్పవిలస ♦ న్మత్కుంజముం జొచ్చి యం
దందున్ జెందిన చిత్రముల్ గని మొదన్ ♦ హర్షించు కాలంబులోన్. ౨౦౧

ఉ॥ ఎవ్వరు మీర లెందులకు ♦ నిక్కడి కాగతులైతిరంచు నా
మవ్వపు ద్వారపాలికలు ♦ మన్ననతో నడుగంగ వార లే

మ వ్విబుధర్షి తుంబురుల ♦ మద్భుత గాన కళా విశేషముల్
నివ్విఱిఁజెందఁ జూపఁగల ♦ నేర్పు గడించినవార మందునన్. ౬౦౨

తే॥ మాదు విద్యాసమర్థతల్ ♦ మాధవునకు, జూపవచ్చితి మిచటికో ♦ సుదతులార!
కాన నీవార్త యారమా ♦ జాని కిపుడు, చెప్పవలెనని పలుక నా ♦ చేడియలును

ఉ॥ లోనికి వచ్చి వారిమొఱ ♦ లోపములేనటు నాకుఁ జెప్పఁగా
నే నురరీకరించితిని ♦ నెచ్చెలు లయ్యది తీర్చిపోయి యా
గానకళాప్రవీణులను ♦ గన్గొని తెల్ప ననల్పమోద మా
మానులు బొంది లోపల క ♦ మందగతిన్ జనుదెంచి వింతగాన్. ౬౦౪

తే॥ భానుకోటిప్రకాశ వి ♦ భాసురంబు, నసమముక్తాఫలసమన్వి ♦ తాతపత్ర
చామరయుతంబు కౌస్తుభ ♦ సంయుతంబు, గోటిసతివృతమగు నా ని ♦ కుంజమందు.

తే॥ వేయిరేకులతమ్మిపై ♦ హాయిగాను, నిన్నుఁగూడి భాసిల్లెడి ♦ నన్నుఁగాంచి
చుట్టివచ్చి నమస్కృతుల్ ♦ సారిదిజేసి, సెలవుగొని పీఠమందు నా ♦ సీనులైరి.

చ॥ పదపడి నాదితేయముని ♦ వర్యుఁడు తుంబురుయుక్తుఁడౌచు స
మ్మదమున దేవదత్తమును ♦ మంజులనాదసుధామయంబు స్వ
స్తిదము విపంచికామణిని ♦ జేకొని శ్రావ్యగభీరవాణితో
గొదకొని మద్గుణంబులును ♦ గూడఁగ బాడెను రాగమాలికల్. ౬౦౫

ఉ॥ అంతట నట్టి గాత్రముల ♦ నా మహతీనినదంబు నట్టినై
కాంతరయుక్తరాగముల ♦ నా నటనస్వరకాలతాలముల్
బంతుగఁజూచి సంతస మ ♦ పారముగాఁ దల నూఁచి యూఁచు నే
నంతమునందుఁ దన్మయత ♦ నంది జలత్వము బాసితిన్ ధరన్. ౬౦౭

తే॥ రాధ! యేవారి నా శరీ ♦ రంబునుండి, భవము గనె నద్ది బ్రహ్మద్ర ♦ వం బటంచు
నెఱుఁగు మందుఁ గోట్లకొలంది ♦ నెలరుచుండు, నండములలి దొరలుచు ♦ నుండు నదియె

ఆ॥ పృశ్ని గర్భనామ ♦ విదితమా బ్రహ్మాండ, మిద్ది నానెలవని ♦ యెఱుగుమిపుడు
రాధ! యట్టి బ్రహ్మ ♦ రస మీజగంబు భే, దించుకొనుచు వచ్చి ♦ దివ్యగతుల

తే॥ దివిని స్వర్ధుని యనఁగను ♦ నవనితలము, నందు భాగీరథి యనంగఁ ♦ గ్రింది లోక
మందు భోగవతి యనంగ ♦ నద్దులేక, పాఱుదొడగెను సర్వపా ♦ పహారమగుచు

తే॥ అట్టి గంగాతరంగిణి ♦ యందు జలక, మాడిన బుధుండు రాజసూ ♦ యాధ్వరములఁ
జేసినంత ఫలంబును ♦ జెంది యఘ వి,ముక్తుఁడగు నంచు నెంచుమో ♦ పూవుఁబోఁడి!

క॥ గంగా గంగా యని లలి, గంగకు శతయోజనములఁ ♦ గ్రాలెడి వాఁడేన్
బొంగుచుఁ దలఁచిన నఘములు, ద్రుంగగ వైకుంఠ మొందుఁ ♦ దోయజనేత్రా!

ఉ॥ జన్మశతాఘముల్ దొలఁగు ♦ జాహ్నవిఁ జక్కఁగ గాంచువానికి
న్జన్మశతద్వయాగములు ♦ నాశము నొందుఁ దదంబుపాయికిన్

జన్మసహస్రదోషములు ♦ స్నానము నానది సల్పువాని కో
మన్మథభామినీమణిస ♦ మాన! లయించునుగాదె? యీకలిన్. ౬౧౪

తే॥ ఎవ్వరా మిన్నువాఁకకు ♦ నేగి కనరొ, వారి జన్మంబు వ్యర్థ మె ♦ వ్వారుదానిఁ
గాంతురో వారి జన్మంబు ♦ కలుషహీన, మగుచు ముక్తిపాత్రంబగు ♦ నబ్జవదన!

తే॥ విరజ నీభీతి నెటు నది ♦ విరజ కొడుకు, లబ్ధు లెక్కిరి వేణి యె ♦ ట్లయ్యె శివుఁడు
నచ్చరల్ గండకీ నదిగ ♦ నైరి బ్రహ్మ, యెటు కకుద్మిని నా గంగ ♦ యయ్యెనట్లు.

తే॥ మఱియు విష్ణుపు కృష్ణగా ♦ వఱలె నెట్లు, లట్టు లిట్టి బుభుందును ♦ నధికమైన
ప్రేమపూర్వకభక్తిచే ♦ వినుల వారి, యయ్యెనని యెంచు మనుమాన ♦ మందవలదు.

క॥ ఈ కథ విను వారందరు, ప్రాకట కలుషంబు లుడిగి ♦ పావనతములై
లోకము లెల్లఁ గడవ గో, లోకమునకుఁ జేరఁగలరు ♦ లోలన్నయనా! ౬౧౫

చ॥ అని యిటు జెప్పి స్వప్రియకు ♦ నచ్యుతుఁ డా బుభుమౌని యాశ్రమం
బును విడి రాధతోఁ గలసి ♦ భూనుహవల్లరి రమ్యమాలతీ
వనమున కేగి గోపికల ♦ వందు రెరింగి కృపాళుఁడై శుభా
యనపులినంబు జేరె నట ♦ కష్టల వ్రేతలు వచ్చి రాస్థతోన్. ౬౧౯

ఉ॥ వచ్చినవెంట వారు హరిఁ ♦ బల్మరు జూచుచుఁ గోప దుఃఖముల్
బుచ్చి ఘనంబుతో మెఱపు ♦ వొందిన కైవడి గూడి రంత నా
లచ్చిమగండు గ్రచ్చఱి స ♦ లక్షణమౌ నల బృందకాటవిన్
జొచ్చి సగోపకుండయి వి ♦ నోదముగాఁ గడుఁబాడె వంశితోన్. ౬౨౦

ఉ॥ ఆ మురళీనినాదమున ♦ నందిరి మూర్ఛను గోపకన్యకల్
భూమిజముల్ జలత్వమును ♦ బొందెఁ బ్రపంచము నిద్రఁ జెందె ది
క్సామజముల్ విచిత్రపడె ♦ స్తంభత వేల్పులు బొంది రండజ
స్తోమము వీడె దిగ్గుట న ♦ దుల్ పడి మానెను మైథిలేశ్వరా! ౬౨౧

తే॥ ఇట్లు రాధ గోపికలను ♦ కృష్ణుఁడెలమిఁ, గూడి రాసములం దేల్చి ♦ కోడి కూయ
వేకువను లేచి వారికి ♦ వీడ్కొని యల, నందమందిరమున కేగె ♦ నరవరేణ్య!

తే॥ అంత రాధికాదేవియు ♦ నఖిలగోపి,కాసహితయౌచు ముదమునఁ ♦ గదలి స్వీయ
జనకగృహమున కరిగె నా ♦ చక్రపాణి, కొన్నిదివసంబు లటనుండి ♦ కోర్కెతోడ.

వ॥ ఆ గోకులంబున నున్నవారి కందరకు దర్శనంబిడి యమ్మధురాపురంబునకుఁ బోనెంచి నందోపనందవృషభానుగోపికాగోపకగోగణంబులతోఁ గలసి వారి సెలవుఁ గైకొని వృషభానువీరుని యగారంబునకు నరిగి తన పైనంబు హెచ్చరించి యశోదానందులకును దన ప్రయాణం బెఱింగించి వాయువేగంబునఁ జను ఘోటకంబులచే బద్ధంబైన తన దివ్యరథం బెక్కి వ్రజంబునుండి సాగిపోవు సమయంబున వ్రజవాసులగు గోపకులు తద్విరహంబు సైపలేక వెంటనంటి

శ్రీకృష్ణా! తొందరగా మరలి రమ్ము. నిన్ను విడి మేము మనఁజాలము యశోదానందానందసంధాయకుండవు వ్రజజీవధనంబవు యదుకులరత్నదీపంబవు మునివరేణ్యమోహనుండవు నగు నీ దర్శనంబు మాకు నిదాఘదగ్ధునకు వర్షంబుగను శీతార్తునకు గ్రీష్మవర్తనగను జ్వరపీడితున కౌషధంబుగను మృతునకు జీవనప్రదంబగు సంజీవినిగను నుండు. నిన్నుఁ గనెడి మా పూర్వపుణ్యంబు సమాప్తంబు గాకుండ నొనర్పుము. మఱియుఁ బ్రకృతిపరుండవును నిర్గుణుండవును నగు నీవు భక్తార్థంబై సగుణుండవై తివిగాదె. శివబ్రహ్మాదిరామరేంద్రాదులు నిరపేక్షతో నీకు భక్తులై నిన్ను సేవించుచుందురుగదా! కావున భక్తుల మగు మాపైని ననుగ్రహం బుంచి యల్పకాలమ్ములోనే రమ్మని ప్రార్థించుచు దుఃఖింప నా భక్తవత్సలుం డానందాశ్రువు లొలుకుచుండఁ బ్రేమవిహ్వలులగు నవ్వారినిం గాంచి గోపకులారా! మీరలందరు నా ప్రాణంబులు దేహం బన్యత్ర సంచరించుచున్నను నా హృదయంబుమాత్రము మీయందె యుండును. తత్త్వమార్గంబునం జూచిన మీకు నే దూరగుండనుంగాక సమీపస్థుండ నాదు. ఐన నొక నెలలోపల యిటకు రాఁగలనని విశ్వసించుఁడు. చింతిల్లకుఁడు. జరాసంధుం డనెడివాఁ డిపుడు మధురాపురిపై దాడివెడలియున్నవాఁడు. దాన యదుసహాయార్థంబై పోవుచుంటి. అడ్డగింపకుఁడు పోందు. పోందని యనేకవిధంబులఁ బలికి పలుమాఱు మరల్చి యన్యస్యందనంబున యశోదానందుల నారోహింపఁజేసి శ్రీదామాది మిత్రవరులం దోడ్కొని సోద్ధవుండై గంధవహాజవమ్మునఁ జని తన్మధురాపురవాసులు గని యెదుర్కొనఁ దత్పురంబుఁ బ్రవేశించె నని చెప్ప నబ్బహులాశ్వుం డామోదంబుఁ జెంది క్రమ్మఱ నా నారదమునీంద్రునితో నిట్లనియె. ౬౨౮

క। మధురానగరంబునకా, మధురిపుఁడేతెంచి యచట ♦ మను పౌరులకుఁ
మధురంబగు దర్శన మా,విధి నిడి యేపనులఁజేసె ♦ వివరింపు మునీ! ౬౨౯

బలరాముండు కోలనిశాచరుం ద్రుంచుట.

చ। అనవుడు నారదుం డిటుల ♦ నాడెను దేవర! సాగ్రజన్ముఁడై
వనరుహలోచనుం డచటఁ ♦ బద్దున సల్పిన కార్యముల్ నచిం
తును విను సావధానముగ ♦ దుష్టకృతిప్రియుఁడైన కోలుఁడన్
దనుజుఁడు మాంసలోలుభత ♦ ధాత్రినిఁ దిర్గుచు సంతిమంబునన్. ౬౩౦

క। కౌశాంబీపురమున కా,వేశముతో వచ్చి జనులఁ ♦ బీడించుటచే
నాశువుగాఁ దత్పౌరులు, స్వాశయములఁ దెల్ప మధుర ♦ కరిగిరి భూపా!

ఉ। అత్తఱి సీరపాణి మృగ ♦ యార్థము దివ్యతురంగ మెక్కి పో
నెత్తుగడన్ జెలంగుటను ♦ నేత్తఱిఁ గన్గొని వాసు డాసి యో

సత్తమ! గోలదానవుఁ డ ♦ జస్రము బాధలఁ బెట్టుచుంట మే
మిత్తటి నీవె దిక్కనుచు ♦ నీడకు వచ్చితిమో బలీ! హలీ! ౬౨౯

క॥ ఆరక్కసి, ప్రభువగు కౌ, శారవినిం గెల్చి మాకు ♦ శాసకుఁడయ్యెన్
సీరీ! తద్భీతిని మా, భూరమణుఁడు జహ్నుతనయ ♦ పొంతకు నేగెన్.

ఉ॥ ఏగి జితేంద్రియుం డగుచు ♦ హెచ్చుగఁ గోరి నిజప్రభుత్వ మీ
వే గతియంచు నిన్ను నుతి ♦ యించు, విచారణజేయ నా విభుం
డే గిలిలేని యట్లు తన ♦ యెత్తుడు బిడ్డలపోల్కి మాదు బా
గోగులఁ జూచి ప్రోచెఁగద ♦ యూర్జితసత్త్వమహత్త్వభాసురా! ౬౩౦

ఉ॥ కావున మాదు కుయ్యి విని ♦ క్రౌర్యమునన్ వెలగొల్పు కోలు ని
ర్జ్వృగ సల్పి మా విభుఁడె ♦ చేరి యథాస్థితిగాఁ బ్రభుత్వమున్
గవి నొనర్పఁజేసియు గ ♦ డింది ముదంబును గూర్చి సాకు మో
దేవర! దేవదేవ! వసు ♦ దేవకుమార! దయాపయోధివై. ౬౩౧

తే॥ దుర్జయుండైన కంసుని ♦ దోర్బలంబు, ధ్వంసమొనరించితివి కాని ♦ ఫలములేదు
కంససఖుఁడును గార్శ్యపీ ♦ కంటకుఁడును, నైన గోలదైత్యునిఁ జంపు ♦ నంతవఱకు

ఆ॥ దుష్టశిక్షణమును ♦ శిష్టరక్షణమును, జేయ నగుణుఁడవుగ ♦ జెలఁగి తీవు
గోలదైత్యుఁ డింకఁ ♦ గుంభిని బ్రతికిన, ముజ్జగంబులకును ♦ మూడుఁ గీడు.

క॥ అని యిటు బద్ధాంజలులై, వినుతింపఁగ సీరపాణి ♦ విని తద్గంగా
ధునియమునానద్యంతర, మునఁ గల కౌశాంబినామ ♦ పురమున కరిగెన్. ౬౩౪

మ॥ అటుపైఁ గోలనిశాచరుండు తనతో ♦ నా రాముఁడాజిం బొన
ర్పుటకై వచ్చె నటంచు వించరద మా ♦ రోహించి రోషంబుతో
జటులాక్షౌహిణులన్ బదింటిఁగొని త ♦ త్సంఖ్యంబుఁ జేయుంగ ను
త్కటవేగంబున నేగుదెంచె నవలన్ ద ♦ ద్రౌహిణేయుం డాగెన్. ౬౩౫

తే॥ చంచలతురంగవీచికా ♦ ప్రాంచితంబు
స్యందనేభతిమింగల ♦ సంయుతంబు
ప్రలయజలధిధ్వనియుతమౌ ♦ వాహినివలె
జెలఁగు వాని వాహినిఁ గాంచి ♦ హలముఁ గొనుచు. ౬౩౬

ఉ॥ కట్టగ వేసి యా ముసల ♦ కాండముఁ గైకొని యొక్కమాఱు బ
ల్గట్టిగఁ గొట్ట నా ధ్వజినిఁ ♦ గ్రాలిన కొందఱు నేలఁ గూలి రి
ట్టట్టనరాని గాయముల ♦ నేడ్చుచు నేగిరి కొంద ఱాతనిన్
ముట్టగలేక నక్కిరికిఁ ♦ బోయిరి గొందఱు ప్రావాలె రథ్యముల్. ౬౩౭

తే॥ పిదపఁ గోలనిశాటుండు ♦ స్వీయసేన, నష్టమైన శోకింపక ♦ శిష్టరక్ష
కుఁడగు బలభద్రు వధియింపఁ ♦ గడఁగి కార్ముకముల ధరియించి నిప్పులు ♦ కనులరాల.

శా॥ పాటీరాదిసుపత్త్రయుక్తము నద ♦ ద్వారిప్రదాభంబు ఘం
టాటంకారవిభీషణంబు రిపుకాం ♦ డప్రాణహారంబు స
చ్ఛాటీబద్ధకటిప్రయుక్తము చతు ♦ ర్దంతాంచితంబున్ హరి
ద్వాటీనాగసమంబు నైన నిజమా ♦ తంగంబునం దెక్కె తాన్. ౬౭౯

క॥ జంకెక కొంకెక పదనగు, నంకుశమున్ గేలఁ బూని ♦ యా గజ మా తా
లాంకుని మీఁదికిఁ దోలిన, సంకిల గల్లనఁగ నద్ది ♦ చనియెను బిరబిన్. ౬౮౦

చ॥ ముసలియుఁ గాంచి రోషమున ♦ ముంగలకున్ జనుదెంచు దానినిన్
బసగల వజ్రి వజ్రమునఁ ♦ బర్వతమున్ బ్రహరించినట్లు త
న్ముసలముతోడఁ గొట్ట నల ♦ పోటున నా కరి చూర్ణమయ్యెఁగా!
యసులునఁ గత్తిదెబ్బ ఘట ♦ మోడయినట్లు లనంతరంబునన్. ౬౮౧

ఉ॥ కోలుఁడు దంతినుండి యిలఁ ♦ గ్రోడముఖుండును రక్తనేత్రుఁడై
శూలియు శూల మా బలినిఁ ♦ గూల్పఁగ వైవ నతం డయోగ్రమున్
దాలిచి ముక్కముక్కలుగ ♦ దానిని జెండెను గాచపాత్రమున్
బాలుఁడు కఱ్ఱతో నుసిగ ♦ బాఁదిన మాదిరి మేదినీధవా! ౬౮౨

తే॥ వేయిమణుఁగుల బరువున ♦ వెలుఁగు గొప్ప
గదను గొని కోలుఁ డా బలు ♦ హృదయమందుఁ
గొట్టె ప్రలయాంబుదము మాడ్కిఁ ♦ గూకలిడుట
కాటిపడగ వాఁడును ♦ దారసిల్లి. ౬౮౩

ఆ॥ కజ్జలంబువోలెఁ ♦ గాలిన కోలుని,మూర్ధమందు స్వీయ ♦ ముసలహేతి
చేత మర్దనంబు ♦ జేయు నా రక్కసి, కూలి మరల లేచి ♦ కోపగించి. ౬౮౪

చ॥ కడువడి గ్రుద్ది యా హలికిఁ ♦ గన్పడకుండ దివంబుఁజేరి బ
ల్పిడుగులుఁ దీవ్రవాతములు ♦ భీమఘనంబులుఁ గాఱుచీకటుల్
బడయఁగఁ గ్రమ్మి యంతట జ ♦ పాసుమభాసురరక్తబిందువుల్
దడదడ రాల్చి యోర్వని వి ♦ ధంబునఁజేసి రణాంగణంబునన్. ౬౮౫

తే॥ పూయమేదోస్థిమాంసవి ♦ ణ్మూత్రమధుయు
తమగు ధారాధరంబులుఁ ♦ దద్దఁ గురియు
నటులఁ జేయఁగ నారా! య ♦ టంచు హలియుఁ
దత్కృతమగు టక్కుని యెంచి ♦ తత్క్షణమున. ౬౮౬

తే॥ పరచమూధ్వంసకంబును ♦ బ్రలయవహ్ని
సమము శతయోజనాయత ♦ సంయుతంబు
సర్వశస్త్రఘాతుకమును ♦ స్వచ్ఛ మష్ట
ధాతుమయమగు ముసలంబుఁ ♦ జేతఁ గొనుచు. ౬౮౭

ఉ॥ వానిని సంహరించుటకు ♦ వైవఁగ వద్ది దశాశలందు న
న్యూన్యనముగా వెలింగి దివి ♦ నున్న ఘనాఘనసంచయంబు నా
భానుఁడు దట్టమౌ హిమము ♦ భంగముఁ జేసిన భంగిఁ గ్రుంగఁగాఁ
బూనికతోడఁ గొట్టి యటఁ ♦ బొందికగాఁ దగియుంట వెంటనే. ౬౪౮

చ॥ కనియుఁ బ్రలంబవైరి తమ ♦ కంబున స్వీయహలంబుతోడ వా
నిని నవలీల లాగికొని ♦ నిర్గతవంచనుఁ గోలదైత్యునిన్
దన ఘనబాహుదండముల ♦ ధైర్యముతోఁ గొని యేకుఁ ద్రిప్పు భా
తిని సుకరంబుగా మిగులఁ ♦ ద్రిప్పియు నేలను గూల్చెఁ బెల్చనన్. ౬౪౯

ఉ॥ తద్దనుజప్రపాతజని ♦ తంబగు శబ్దముచేఁ బ్రపంచమున్
దద్దరిలెన్ దదాసురుఁడు ♦ దంతము లెల్లను రాలఁ గన్నులున్
దద్దభ్రమింప నష్టనిధ ♦ నంబును జెందెను వజ్రహేతిచే
గ్రద్దన వృత్రుఁ డంతమును ♦ గాంచినకైవడి నట్టివేళలోన్. ౬౫౦

చ॥ కురిసెను బుష్పవర్షమను ♦ కూలముగా సురబృందదుందుభుల్
బరువడి మ్రోసెఁ గిన్నరులు ♦ పాడిరి చారణు లాడిరా బలుం
డురవడి నిట్లు గోలుఁ బ్రతి ♦ కూలుని జంపి దయాళుఁ డౌచు నీ
వలి కల పట్టణంబుఁ బరి ♦ పాలన జేసెడి తేనిఁ బిల్చియున్. ౬౫౧

క॥ పట్టాభిషేక మొనరిచి, పట్టిన కౌశాంబిపురిని ♦ వడి నిడి తనకుం
బట్టిన యఘములు సనుటకు, బట్టున గర్గాదివిబుధ ♦ పటలసహితుఁడై.

క॥ భాగీరథికిం జేరియు, నా గర్గప్రభృతివిప్రు ♦ లామ్నాయోక్తుల్
బాగుగఁ జెప్పఁగ స్నానము, "హేగంగే పాహి"యనుచు♦నెలమిని సలిపెన్.

తే॥ అవల ... గ్గణుండు ధ♦రామరులకు, లక్షమత్తేభముల్ రెండు♦లక్షల రథ
ములను ...టివాయయంబు లా♦వులును నర్బుదంబు భక్తితో నిచ్చియుఁ♦దనివికాక.

తే॥ స్వర్ణ...లెకకార్బుదభార ♦ సహిత దివ్య
రత్నముల బహుప్రణతిపూ ♦ ర్వకముగాను
దాన మిచ్చి యా మధురకుఁ ♦ దరలి చేర
నరయ నిది ప్రపంచార్థమై ♦ జరిగెఁ గాదె? ౬౫౫

తే॥ అట్లు రాముండు మునిఁగిన ♦ యట్టిచోటు
రామతీర్థం బటం చిలఁ ♦ బ్రథతి కెక్కె
నందు జలకమాడిన వార ♦ లఖిలదోష
ములను బాసి పుణ్యంబులఁ ♦ బొందఁగలరు. ౬౫౬

తే॥ కృత్తికాభాంచితమగు పూ ♦ ర్ణిమను గార్తి
కమున రామతీర్థమునఁ దా ♦ నమును జేయు

నట్టివాఁడు హరిద్వార ♦ మందు మునిఁగి
న ఫలమును మించు ఫల మొందు ♦ నట్టులేక. ౬౫౭

తే॥ అని వచింపఁగ భూపతి ♦ యాడె నిటుల, నట్టి కౌశాంబినగరికి ♦ నిట్టి రామ
తీర్థ మెంత దూరమునందుఁ ♦ దేజరిల్లు, నద్ది నుడువు మనుటయు ని ♦ ట్లనియె మౌని.

వ॥ భూపా! యీ రామతీర్థంబున కీశాన్యభాగంబునఁ జతుర్యోజనపరిమితం బగు దూరంబున నా కౌశాంబియను నగరియు, వాయవ్యభాగంబున నంత దూరంబుననే సూకరక్షేత్రంబును, నాగ్నేయదిక్కునం దాఱుకోసులలోఁ గర్ణక్షేత్రంబును, పంచక్రోశంబుల నలక్షేత్రంబును, బూర్వభాగంబునందు మూఁడు క్రోశంబులలో వృద్ధికేశి సిద్ధిపీఠ బిల్వకేశ వనంబులు నుండు. ఇందుననే దృఢాశ్వుం డను వంగరాజొకఁ డుండు. అతఁ డొండొకవేళఁ గురూపియగు లోమశమహాముని఼ గాంచి పరిహసించి కురూపంబుగల క్రోడముఖంబుతో రాక్షసజన్మం బెత్తుమని తన్మునిచే శప్తుండై భూతలంబునఁ గోలుండను పేర నిశాటజన్మం బెత్తి సంచరించి యిట్లు బలరామునిచే నిహతుండై ముక్తుం డయ్యెనని యెఱుంగుము. అంత నా సంకర్షణుం డుద్ధవాదిమంత్రిసమన్వితుండై పుణ్యప్రదంబును, దక్షశ్రుతి విదితంబు నగు జాహ్నవీతీర్థంబున కరిగి యందు జలకమాడి పుష్కరులను బుడమివేల్పుల కిడి పాండవప్రియంబైన యాహారస్థాననామకస్థానంబున కేగి యందు మునిఁగి ద్విజాతులకు సభక్తికంబుగా దక్షిణ లొసఁగి దివ్యాన్నం బిడి యారేయి వసించి యుషఃకాలంబున లేచి భగవత్కృపాప్తికై యేకపాదంబున నిలిచి నిర్వాతదీపంబుభాతి నిశ్చలంబుగాఁ దపం బొనరించెడి మాండూకనామకుం డగు స్వప్రియభక్తునిం గృతార్థుం జేయం దలంచి యోజనదూరంబున నున్న యమ్ముని కడకుం జని కరంబుగా నతని శిరంబునఁ గరం బునిచి వరం బడుగు మని నుడువ నా యోగివరేణ్యుండు హృదయగతుండగు భగవానుండు తన ముంగటఁ జెలంగుటం గని యంతరంగంబునం బొంగి యిట్లు ప్రార్థించె. ౬౫౮

తే॥ భక్తవత్సల! రామ! శ్రీ ♦ వత్సలాంఛ, నాగ్రజా! దానవాంతక! ♦ యాదవాన్వ
యాబ్ధిచంద్రమ! నీలాంబ ♦ రా! మహాత్మ!, చేతనాచేతనాత్మక! ♦ జోత లివిగో.

తే॥ నిశ్చయంబుగ నా పైని ♦ నీకుఁ గరుణ, యున్నచో కలిహారణం బ ♦ నుత్తమంబు
భాగవతమును శుకయోగి ♦ వక్త్రజనిత, మునగు సంహితామృత మిడు ♦ ముసలపాణి!

క॥ అనవుడు బలుఁ డిట్లనె నో, యనఘా! యుద్ధవముఖమున ♦ నయ్యది నీక
బ్బునని యెఱుంగుము నావుడు, విని మాండూకుఁడును నిట్లు ♦ వేఁడెను బలునిన్.

క॥ ఓ భగవానుండా! నీ, వా భాగవతార్థ్వాత యల ♦ యాపగవి కెటుల్
లాభముగా నిడితివో మఱి, యా భక్తుం డెపుడు నాకు ♦ నగుపడఁ గలఁడో?

చ॥ అనవుడు నీలచేలుఁ డిటు ♦ లాడె రహస్యముఁ బుణ్యదంబునన్
ఘన మఘనాశనం బయిన ♦ గాథఁ దదీయము నే వచింతు నో
మునివర! సంహితామయుగ ♦ బోధకుగా నియమింపఁబడ్డ యా
యనఘుఁడె యుద్ధవుం డితఁడ ♦ నర్గళవృత్తినిఁ జూడు మిత్తఱిన్. ౬౬౪

ఉ॥ కాని దయార్ద్రపూర్ణుఁడు న ♦ కల్మషుఁ డైన యితండు తీర్థయా
త్రానిరతిన్ జెలంగుటను ♦ ద్వత్ప్రియతత్త్వము సాంప్రతంబునన్
బూని వచింపనేరఁడని ♦ బుద్ధి నెఱుంగుము తాదృశ వ్రజ
స్థానగగోపపత్తిక ము ♦ దంబును గూర్చినవాఁ డితం డెకా. ౬౬౫

తే॥ రాధికాముఖభామినీ ♦ బాధ లెల్ల
నపనయించుట కితఁడే ♦ యర్హుఁడంచుఁ
దనకు మాఱుగఁ బరమాత్ముఁ ♦ డును మహాత్ముఁ
డు నగు కృష్ణుఁ డీ యుద్ధవుఁ ♦ బనిపె మౌని! ౬౬౬

క॥ పరికరసంపాదనమున, సరసత గుణరూపములను ♦ సర్వవిధములన్
హరికిని నీతనికిని నం,తర మేమియు లేదటంచుఁ ♦ దలఁపుము యోగీ! ౬౬౭

సీ॥ భువనంబులందున ♦ ముద్రాధికారియు, నేర్పరులను మంచి ♦ నేర్పరియును
ధార్మికవరులలో ♦ ధర్మనిర్ణేతయు, గవులయందున భవ్య ♦ కావ్యకర్త
భాగవతులయందుఁ ♦ బరమభాగవతుండుఁ, దత్త్వవక్తలలో వ ♦ దావదుండు
మంత్రిసత్తములలో ♦ మంత్రవిదుండును, బురుషులలోఁ బుణ్య ♦ పూరుషుండు

తే॥ వనరుహాయతనేత్రుని ♦ ప్రతినిధియును, నాకుఁ గుడిభుజంబును సద్గు ♦ ణాకరుండు
నైన యీ యుద్ధవుఁడు దల ♦ లోనినాల్క,వలెను సంచరించెడి ధరా ♦ తలమునందు.

ఉ॥ మాధవుఁ డీతనిం గలిసి ♦ మానుగ గోకులమేగి యందునన్
మాధవమందు గ్రీష్మమున ♦ మంజులభాషల నాడుచుండి త
ద్రాధ నందరాజునకుఁ ♦ దత్సతికిన్ మఱిఁ దక్కువారికిన్
బాధలఁ బాపి సంతస మ ♦ పారముగా ఘటియించె నో మునీ! ౬౬౮

ఉ॥ ఎత్తఱి మేము భూమి విడి ♦ యేగెదమో యపుఁ డీ ఘనుండు తా
నత్తి ధరామరశ్రుతి వి ♦ దగ్రజ గోపరిపాలనంబులో
కోత్తరపద్ధతిన్ నలుపు ♦ చుండును నీ యధికార మెల్ల మా
చిత్తము బట్టి యీతనికిఁ ♦ జెందు నటంచు నెఱుంగుమో సుధీ! ౬౭౦

తే॥ ఎపుడు బదరికాశ్రమమందు ♦ నేము వఱల
కుందుమో యపు డీయన ♦ యందుఁ జేరి
స్వీయతేజంబుచే దిశల్ ♦ వెలుఁగఁ జేసి
యొప్పుచుండును మాండూక! ♦ యొప్ప జగము ౬౭౧

చ॥ హరి విరహార్తిదగ్ధ నిజ ♦ యాత్మవధూతతి నూఱడించి సం
బర మిడ నుద్ధవాఖ్యు, నిజ ♦ పౌత్రసతీగణబాధ మాన్ప మా
ధురవిభు వజ్రనాభుని య ♦ దుప్రభు నింకఁ బరీక్షిదాఖ్యుఁ ద
త్కురుకులమందు సౌఖ్య మిడఁ ♦ గొంకక యేర్పఱిచెన్ మునీశ్వరా! ౬౭౨

తే॥ కురుకులమున జనించిన ♦ ధరణినాథుఁ
డగు పరీక్షిత్తునకు నొక్క ♦ యాత్మజాతుఁ
డమితరుచిఁ గల్గి జనమేజ ♦ యాఖ్యతోడఁ
బుట్టి జనకారిహరణంబు ♦ బుద్ధిఁ దలఁచి. ౬౭౩

తే॥ సర్పయాగంబు సల్పెడి ♦ సమయమందుఁ
దద్విధానసామగ్రు లు ♦ ద్ధృవివలన
నెఱిఁగి బర్హిర్ముఖాచార్యు ♦ కరుణ నది ని
వృత్తముగఁ జేయు మాండూక! ♦ యిద్ధచరిత! ౬౭౪

తే॥ తదహియాగస్థలంబునఁ ♦ దప్పకుండ, గౌరవంశోద్భవంబు న ♦ కల్మషంబు
నైన చైతన్యకులమున ♦ కధికఫలము,గా మహాభాగవతము బ ♦ ల్కంగఁబడును.

చ॥ మఱి జనమేజయుండు సవ ♦ మంత్రవిదగ్రణులైన ధారణీ
సురులకు నూఱుగ్రామముల ♦ జోతల నర్చల సల్పి యిచ్చి స
దురువగు వేల్పుటొజ్జ పలు ♦ కుం దలఁ దాలిచి మానసమొందు సూ
కరమను తీర్థరాజమునఁ ♦ గ్రాలి యొనర్చి యనేకదానముల్. ౬౭౬

తే॥ మద్రసాంచితమైనట్టి ♦ సాద మగ్రజులకుఁ బెట్టి గజాశ్వగో ♦ వులను రత్న
ముల నొసంగి తత్స్థలినుండి ♦ పుణ్యగంగ, దరులగల తీర్థములఁ జూచి ♦ గురునిఁ గూడి.

చ॥ వడిగ శయానమన్ బురికిఁ ♦ బార్ష్ణ దయుక్తముగాను జేరి యా
నొడయుని యాజ్ఞ నచ్చటనె ♦ యుండి ససాధనవస్తుజాలుఁడై
బుడమిఁ గెల్చి భూభుజస ♦ మూహ విభుండయి యశ్వమేధ మొ
క్కుడుగ నొనర్చి స్వీయ గురు ♦ కుంజరునిన్ శరణంబుఁ గోరియున్. ౬౭౮

తే॥ అమరనదికిఁ బూర్వదిశను ♦ నైదుకోసులను జెలంగెడిచోటున ♦ నధివసించి
భక్తి నేకాంతసేవను ♦ యుక్తరీతి, సల్పఁగలఁడు మాండూక! యా ♦ స్థానమందు.

ఉ॥ సంసృతిరోగహింసకము ♦ సార్థకమున్ బరమార్థదంబు స
త్ప్రంసితమైన భాగవత ♦ ధర్మవిచారముఁ బుణ్యపూరుషో
త్తంసులు సేరి సల్పుదురు ♦ తత్సమయంబున నీవు నుండి త
ద్ధంసవిశేషముల్ విని మ ♦ హాపద మొందెద వో మునీశ్వరా! ౬౮౦

క॥ డెందమునందున సందియ, మిందులకుం జెందవల ద ♦ హీనతపము రా
త్రిందివమును సల్పుట నీ,కుం దెలియ నుడివితి నిది ♦ కోవిదవర్యా! ౬౮౧

చ॥ అని యిటుఁ బల్కి వేడ్క వర ♦ మాతని కిచ్చి తదచ్యుతాగ్రజుం
డనుగవిశిష్టుఁడై వెడలి ♦ యాయతమైన శయానపట్టణం
బునకు శివాశి నుండునది ♦ పుష్పవతీపురి కంతకాశిఁ బొం
దినదియుఁ గంటకస్థలి కు ♦ దీచిని నుండిన మంచిచోటునన్. ౬౮౨

తే॥ వాసమొనరించి పదివేల ♦ వాజు లొక్క
వంద రథములు బదివేల ♦ పాలుఁ బితుకు
మంచి యావుల నొకవేయి ♦ మత్తకరుల
భూసురులకు నొసంగెఁ ద ♦ త్సమయమందు. ౬౮౩

ఉ॥ దేవతలున్ ద్విజన్ములును ♦ దివ్యతపోధను లేగుదెంచి యిం
ద్రావరజాగ్రజున్ గని త ♦ దంఘ్రిసరోజములందు వ్రాలి పు
ష్పావళిచందనాదులను ♦ నర్చన సల్పియుఁ "గోలఘాతినే
దైవతపోషకాయ వర ♦ దాయ నమోనమ"యంచు వేడుకన్. ౬౮౪

చ॥ హలి కని భావమం దలరి ♦ యార్యతపోధనదేవులార! ని
స్తులముగ నన్నుతించితిరి ♦ తూర్ణముగా వరమేమి మీకుఁ గా
వలయునొ తెల్పుఁడీ! యనఁగ ♦ వారిటు లడ్గిరి మీర లెప్పుడే
సిలుఁగులు మాకుఁ గల్గినను ♦ జెందఁబడందఁ జేయుఁ డత్తఱిన్. ౬౮౫

ఉ॥ పిమ్మట రేవతీశుఁ డిటు ♦ ప్రీతి వచించెను నయ్యలార! భా
వమ్ముల మీరు నన్ దలచు ♦ పట్టుల మీదరి కేను వచ్చి క
ష్టమ్ములఁ బాపి పూర్ణముగ ♦ సౌఖ్యము గల్గ నొనర్చి పోయెదన్
నమ్ముఁడు దీని మానసము ♦ నన్ శపథంబు మదీయ మియ్యదే ౬౮౬

తే॥ ఈర లందఱీ తావున ♦ కేగుదెంచి, భక్తితో నాకుఁ బూజల ♦ బరగఁజేసి
యుంటి రందున నియ్యది ♦ యుర్విఁ బ్రథితి, నందె సంకర్షణస్థాన ♦ మనఁగ ననఘ!

ఉ॥ మానవు లిందుఁ గల్గెడి న ♦ మర్త్యధునీమణియందు వేకువన్
స్నాన మొనర్చిరేన్ వ్రతము ♦ సల్పిన వేల్పులఁ బూజచేసినన్
దానము లిచ్చినన్ హరిని ♦ నమ్మి భజించిన ధన్యులై ఘన
స్థానముఁ జెందనేర్తు రిది ♦ తథ్యము బథ్య మటంచుఁ బల్కియున్. ౬౮౮

తే॥ స్వపుర మైనట్టి మధురకు ♦ సకలమిత్ర, సహితముగ నేగె నీ కోల ♦ సంభ్రమధన
రామపూజలు గల కథ ♦ యేమఱిలక, యవధరించినవా ర్ధన్యు ♦ లౌదు రనఘ!

తే॥ అనఁగ బహులాశ్వుఁ డిట్లనె ♦ నమరమౌని!
సీరి యొకసారి చనినంత ♦ క్షేత్ర మయ్యె
ననుచు వినిచితి నీక నన ♦ యంబు మధుర
నునికిఁ జేసెడి నది యెంత ♦ యుత్తమంబొ. ౬౯౦

మధురాపురీమాహాత్మ్యము.

మ॥ మఱియున్ దన్మధురాభిధాపురమునన్ ♦ మాహాత్మ్య మేముండు ? నే
పరమాత్ముండు వసించు ? నే నరపతుల్ ♦ పాలింతు ? రద్దాని నే
పరమక్షేత్రమునందు నద్ది తగు ? నీ ♦ వార్తల్ ప్రశంసింపఁగా
గరముం వేఁడెద నారదా ! యనఁగఁ బ ♦ ల్కెన్ సాగ నాతం డిటుల్. ౬౯౧

ఉ॥ శ్రీరమణీమనోహరుఁడు ♦ చిత్తజరూపుఁ డనుత్తముండు సం
సారగతార్తిహంతకుఁడు ♦ సర్వకులేంద్రదశయానుఁ డాద్యుఁడున్
వీరుఁడు దేవకీసుతుఁడు ♦ విశ్వవిభుండుఁ బ్రపూర్ణుఁడున్ సిశా
టారియు నైన శ్రీహరియె ♦ యా మధురాపుర మేలు మేలుగాన్. ౬౯౨

సీ॥ భగవత్కరుణచేత ♦ బ్రాహ్మణవరుఁడగు, కపిలున కే మహా ♦ ఘనుఁడు పుట్టె
దత్కపిలాభిధుం ♦ డుత్కటామోదియై, బృందారకేంద్రున ♦ కెవని నిచ్చె
నా విబుధుల గెల్చి ♦ రావణుండును లంకఁ, బొగడి యెవ్వానికిఁ ♦ బూజసల్పె
నా లంకను జయించి ♦ యవనిజాపతి యయోధ్యాపురి నెవరికి ♦ నర్పఁజేసె

తే॥ నట్టి శ్రీరాము భజియించి ♦ యిట్టి మధుర
యందు శత్రుఘ్నుఁ డెవ్వాని ♦ కంజలులను
గూర్చె నా మాధురుల సేవఁ ♦ గొనును యెవ్వఁ
డల కపిలవరాహుఁడె మంత్రి ♦ యయ్యె నయ్య ! ౬౯౩

క॥ భూతేశ్వరుఁడగు శంకరుఁ, డాతతయష్టిని ధరించి ♦ యధములు సెడఁగాన్
బ్రీతిన్ జెందఁగ భక్తులు, బ్రాఁతిగ నట క్షేత్ర యయ్యె ♦ బహులాశ్వవిభూ !

తే॥ సింగమందునఁ గూర్చుండి ♦ సిలుఁగులెల్ల, బొల్లునడఁజేసి మంగళ ♦ ముల్ సెలంగ
సల్పి సతము మహావిద్య ♦ చండికాంబ, గ్రామదేవతగా నుండెఁ ♦ గరుణ నచట

క॥ నేనో తత్పురిచారుఁడ, నానేతకుఁ బౌరులకును ♦ నఖిలజగములన్
మానక జరిగెడి వార్తలఁ, బూనికతో నుడువుచుందుఁ ♦ బుణ్యచరిత్రా ! ౬౯౪

చ॥ అల మధురాపురాంతరము ♦ నందున శ్రీమధురాంబ యుండి నెం
జిలులను బాపి సర్వులకు ♦ శ్రీ ఘనతా ధన శౌరతాయుపు
ల్బలముగ నిచ్చు నాహరిస ♦ లక్షణదేహమునుండి తత్పుర
స్థలము జనించె దానిఁ గను ♦ సజ్జనుఁ డొందుఁ బరంబు భూవరా ! ౬౯౫

తే॥ జలధరాకారభాసురుల్ ♦ నలుబుజములు, గలుగు వారలు నగు రమా ♦ కాంతపార్ష
దులు విమానములందు మృ ♦ తులను జేర్చి, పరమపదవికిఁ దోడ్కొని ♦ యరిగెదరట.

తే॥ మును స్వాయంభువు శతవర్ష ♦ ములు తపంబు
నట్టి మధురాపురమున ని ♦ రన్నుఁ డగుచుఁ

జేసి స్వాయంభువ మనువుఁ ♦ శ్రీధరదయఁ
బుత్రునిగఁ గాంచె మైథిల ♦ భూవరేణ్య ! ౧౯౯

వ॥ వెండియు దేవవరుండును సతీపతియు నగు భూతేశ్వరుండు ప్రతిదై దివ్యవర్ష శతకంబు తపం బా మధువనంబునం బొనరించి శ్రీకృష్ణప్రసాదంబుఁ బొంది తన్మధురాపురద్వారపాలకత్వం బార్జించె. నేనును దదనుగ్రహంబుననే తన్నగరంబునకు దూతగాఁ బోఁజాలితి. దుర్గాదేవియు నట కరిగి శ్రీకృష్ణుని కూడిగముఁ జేయుచుండె. తద్వనంబుననే యింద్రుండు మహేంద్రపదంబును, నినుండు మనువును, ధనదుండు నిత్యనిధిని, వాణి పాశంబును, ధ్రువుండు ధ్రువపదంబును, నియమంబుగాఁ దపం బొనరించి సంపాదించిరి. శ్రీరాముండు లవణాసుర పరాజయంబును, నంబరీషుండు ముక్తిని, రఘుచిత్రకేతులు కార్యసిద్ధిని బొందిరి. తన్మధువనంబుననే మాధవమాసంబున నమ్మధుసూదనుం డమ్మధునామకనిశాటుని డీకొని డింకవేయించె. సప్తమహర్షులు నన్యమునులు నందుననే తపించి జపించి యిష్టసిద్ధినిం బడసిరి. గోకర్ణనామకుం డగు వైశ్యుండును మహానిధిని నందుననే పొందె.. లోకరావణుం డగు రావణుండు తద్వనంబున నధికనిష్ఠతోఁ దపం బొనరించి గరిష్ఠులును ద్రఢిష్ఠులును నగు బర్హిర్ముఖుల నోడించి దేవానాంప్రియులగు పూర్వదేవులను గూడి యమరావతీపురంబును బురుడింపంజాలు లంకానగరం బకలంకంబుగా నిర్మింపంజాలె. అందుననే శంతనుమహారాజును దపం బొనర్చి తత్వార్థసాగరుండును గుణరత్నాకరుండును నగు భీష్మునిం గుమారునిగాఁ బడయనేర్చెం గాదె యని వాకొన బహులాశ్వుం డాకర్ణించి సంతోషించి శిరంబు వంచి చేతులు ముకుళించి స్వామీ ! యట్టి మధురానగరతిలకంబున వాసంబు జేసిన వారల కేఫలంబు గల్గునో వాక్రువ్వు మనుటయు సురర్షి యిట్లనియె. ౨౦౦

చ॥ తొలుత వరాహుఁ డీ ధరణి ♦ తోయధిలో మునుగంగఁ గోఱలన్
గలభము తమ్మిఁ దుండమునఁ ♦ గైకొనినట్టుల లేవనెత్తి యా
యిల మధురాపురిన్ నిలిపి ♦ యెల్లవిధంబులఁ గాచె నంచుఁ బె
ద్దలు వచియింప నేను విని ♦ తన్మహిమంబును నీకుఁ జెప్పితిన్. ౨౦౧

చ॥ మధురయటంచుఁ బల్కినల ♦ మాధవు నామము నాడినట్లగున్
మధురను దాఁకినంత నల ♦ మాధవుభక్తులఁ గూడినట్లగున్
మధురను విన్నమాత్ర నల ♦ మాధవుగాథను గ్రోలినట్లగున్
మధురను గన్నమాత్ర నల ♦ మాధవు గాంచిన యట్టులౌ విభూ ! ౨౦౨

తే॥ మధుర మూర్కొనినంత నా ♦ మాధవప్రి
యమగు తులసి నాఘ్రాణించి ♦ నట్టు లగును

మధురలో భుజించినమాత్ర ♦ మాపతికి మా
హానివేదనమును బెట్టి ♦ నట్టు లగును. ౨౦౩

క॥ మధురను దిరిగెడివాఁడును, మధురిపు కృపఁగోరి తీర్థ ♦ మండలియాత్రల్
వ్యథవిడి చేసెడి ఫలమును, విధిగాఁ దా ననుభవించుఁ ♦ బృథ్వీనాథా! ౨౦౪

ఆ॥ మధురఁ గామములకు ♦ మరఁగిన వాండ్రును, శ్రీరమేశు పూజఁ ♦ జేసినంత
ఫలముఁ జెందఁగలరు ♦ పరమపాతకియును, దత్పురమున నున్న ♦ ధన్యుఁ డగును.

క॥ స్త్రీఘ్నులు గోఘ్నులు నిజగో,త్రఘ్నులు రాజఘ్ను లాత్మ ♦ తాతఘ్నులు బ్ర
హ్మఘ్నులు మాతృఘ్నులును గృ,తఘ్ను లచటనున్న ధన్య ♦ తను గాంతురుగా.

క॥ అలపురి నడువని యడుగులు, నలఁతియు గననట్టి కనులు ♦ నాలింపని వీ
నులు నర్చింపని చేతులు, బిలువని కంఠంబు నేతి ♦ బీఱలు గావే. ౨౦౭

క॥ అందలి సందుల గొందుల, నందములగు రాజవీథు ♦ లందున ముక్తిన్
జెందఁగఁ జేసెడి వార్తలె, పొందికగా జరుగుచుండు ♦ భూభుజవర్యా! ౨౦౮

క॥ ఆనగరంబున మనుజుఁడు స్నానమ్మును సల్ప వార ♦ ణాసిగయాది
స్నాన మొనర్చిన ఫలములు, మానక యందంగఁ గలఁడు ♦ మానవనాథా!

సీ॥ ఏ పురమందున ♦ నెల్లదోషంబుల, నణఁగఁ ద్రొక్కఁగఁ జాలు ♦ పని నెలంగు
నెట్టి పురంబున ♦ నట్టి వనంబులు, పసునాల్గు కోటులు ♦ బరగుచుండు
నే నగరంబున ♦ స్నానపానాదులం, జేసినచో ముక్తి ♦ సిద్ధి యగును
నే పత్తనముఁ గన్న ♦ నెల్లతీర్థంబులఁ, గాంచిన ఫలములు ♦ గలుగఁ గలవు.

ఆ॥ మఱియు నేపురి విన్నచో ♦ ధరణినున్న, యెల్ల పట్టణముల వింత ♦ లెఱిఁగినట్టు
లగునొ యామధురాపురి ♦ కధిక భక్తి, మ్రొక్కు గాంటిని నాకదే ♦ దిక్కటంచు

తే॥ అఖిల భువననాథుండును ♦ నవ్యయుండు, నప్రమేయు నాదిమ ♦ ధ్యాంతరహితుఁ
డచలుఁ డామ్యుఁ డనంతుఁడు ♦ నైన కృష్ణుఁ,డేలు నామధురాపురి ♦ కేఁగుచుంటి.

క॥ వరదయు మోక్షద ధర్మా, కరయును దీర్ఘేశ్వరియును ♦ గాళిందీని
ర్ఝరిణీతటభాసుర శ్రీ, హరిపురియా మధురఁ దలఁతు ♦ ననుము లణంగన్.

తే॥ ఎవ్వ రీ కథ విందురో ♦ యవ్వరిష్ఠు, లాత్మజన్మమునందలి ♦ యధికమైన
దురితముల నెల్లఁ బోకార్చి ♦ పరమమైన, హరిపదంబును గాంతురో ♦ ధరణినాథ!

వ॥ మఱియు నెవ్వం డీమధురాఖండం బఖండభక్తితోఁ గామియై చదువునో వినునో యన్వాఁ డేడుమూఁడుల జన్మంబులందనుక నుత్తమజన్మం బెత్తి కరితురగాశ్వరథపదాతులు దనతోరణంబునఁ బొలుపాఱుచుండ నవనిధినాథుండై పుత్రపౌత్రాదులం గలిగి కీర్తిం జెందంగలండు. ఇది వి ప్ర గొహ్వాయ డ విద్వాంసుండగు క్షత్రియుండు ఖండీకృతశత్రుమండలుండగు. వైశ్యుండు ధనాధకుం డగు. ఇంకను నామూఁడువర్ణంబులవారిముఖంబున నాలకించిన శూద్రుండును నిర్మలుం

డగు. వెండియు నెవండీ ఖండంబు నిష్కాముఁడై పఠించునో యావిభుం డైహిక సుఖంబులం బోఁద్రోసి స్వర్గలోకాదులను దూరీకరించి యత్యుత్తమంబగు గోలోకంబునకుం బోయి బ్రహ్మానందంబు బొందఁగలండని యెఱుంగుమని బహుళాశ్వునకుం జెప్పెనని గర్గాచార్యుం డనువదింప నాకర్ణించుకొనిన శౌనకాదిమహర్షు లలరి క్రమ్మఱ నిట్లని ప్రార్థించిరి. ౨౧౪

శా॥ వత్సాసురత్వవిపక్షశిక్షణకృతీ! ♦ వర్ణాశ్రమాధార! శ్రీ
వత్సాంకా! కనదభ్రవర్ణరుచిరా! ♦ బాణాసురధ్వంసకా!
సత్సంగత్యసుగమ్యరూపధర! కు ♦ బ్జాకామదాయీ! దయా
ప్రోత్సాహార్ణవ! యుత్సవాంచిత! హరీ! ♦ యుర్వీధవా! మాధవా! ౨౧౫

మాలిని.

అనుపమగుణశాలీ! ♦ యద్భుతాపీతకేలీ!
వనరుహదళనేత్రా! ♦ బ్రహ్మపూజాదిపాత్రా!
మునిహృదయవిలోలా! ♦ పుణ్యసంత్రాణశీలా!
యనుగతరుచిపూర్తీ! ♦ యాగమధ్యేయకీర్తీ! ౨౧౬

గద్యము:- ఇది శ్రీమత్పరమపవిత్రాపస్తంబసూత్ర, భారద్వాజసగోత్ర, చివుకుల
కులజలధికళానిధి, కోటమాంబాకామయ తనయ, లక్ష్మీదేవీ
సుబ్రహ్మణ్య దత్తపుత్ర, శ్రీకృష్ణప్రసాదాసాదిత కవిత్వ
నిశ్చయ, సుజనవిధేయ, శ్రీనివాసాపరనామధే
యాప్పయశాస్త్రిచే నాంధ్రీకృతంబైన
శ్రీగర్గభాగవతం బందలి
మధురాఖండము
సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ
హరిః ఓం తత్సత్
శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః

శ్రీ గర్గ భాగవతము.

ద్వారకాఖండము.

అంభోజాసనజనకా!
యంభోజదళాయతాక్ష! యంభోదాభా!
యంభోధిశయన! సుకృతా
రంభా! సంరంభరహిత! రాధాకృష్ణా! ౧

వ॥ బ్రహ్మర్షివరేణ్యా! సురర్షివర్యుండగు నారదమునిచే హర్షప్రదంబగు సమ్మధురాఖండంబు శ్రవణమధురంబుగాఁ గ్రోలిన యా బహులాశ్వభూపాలకుం డావల నా విబుధమౌనీంద్రు నేమని పృచ్ఛించెనో పలుకుమనుటయు గర్గాచార్యుం డిట్లనియె. ౨

క॥ నారద! మధురాఖండం, బారహి వచియించి యెదుగు నఖిలాఘములన్
దూరీకరణ మొనర్చితి, ధీర కద పరార్థపరు లహీనయశస్వీ! ౩

తే॥ మఱియు శ్రీకృష్ణపరమాత్మ మధుర విడిచి, ద్వారకాపురికేలకో తరలె? నందు
నేమిచేసె వివాహము లెన్ని యతని, కాత్మజాతు లెందరు గల రవి వచింపు. ౪

కంసుని భార్యలు జరాసంధునిమ్రోలకు వచ్చి విలపించుట.

ఆ॥ అనఁగ నారదుండు నాడె నీవిధముగా, నటులఁ గంసుఁ డంత మైన పిదప
నతని భార్యలైన యస్తియుఁ బ్రాప్తియు, మొత్తుకొనుచుఁ దండ్రి మ్రోల కేగి.

శా॥ కష్టా! యెట్టుల నిట్టి దుఃఖ మొదవెన్ గారానికాలంబు మా
కిట్టుల్ సేకురె? నట్టి వీరులును దండ్రీ! యా హృషీకేశునిన్
మట్టన్ జేరుగదా! యయో! శివశివా! మాకిట్టి యాపత్తులో
దిట్టల్ మీరు సెలంగియున్ ఫలములే దే! యో జరాపుత్రకా! ౬

తే॥ సకలలోకంబులన్ గెల్చి చక్రవర్తి, వగుచుఁ గప్పంబులం గొని యలరు నీవె
సపరివారానుజుండవై చక్రిచేత, మడిసితివి నాథ! దుష్కాలమహిమ గాదె?
క॥ అని కూఁతులు విలపింపఁగ, వినిన జరాసంధుఁ డుగ్ర భీషణదృష్టిన్
గని యిటులన్ వాక్రుచ్చెను, మనుజామరకిన్నరులును మల్లటపడఁగన్. ౮

శ్రీకృష్ణునిపై జరాసంధుఁడు దండయాత్రఁ జేయుట.

పంచచామరము॥ భయంబు భక్తి లేక యాదవ ప్రభూగ్రసేనజున్
లయంబు జేసినా వరే! య నామకా! యదూద్భవా!
రయంబునన్ జగంబు వీర రాజిసాళి మెచ్చఁగా
నయాదవంబుగా నొనర్తు నంచు నెంచు మాత్మలోన్. ౯

తే॥ ఇటుల శపథంబుఁ జేసి దుహితల నాశ్వసించి యాత్మీయ సఖులకుఁ జేసినట్టి
ప్రతిన తెలుపంగ భటవర్యు బనిచి ఘోర, సమరసన్నాహముల్ సల్పి సరభసముగ.
క॥ ప్రాంశుబలిష్ఠమగు త్రయోవింశత్యక్షౌహిణులకుఁ బెరిగిన సేనన్
సంశయములేక కొని యాదువంశముఁ గూల్పంగ వెడలెఁ బటుదర్పమునన్.
సీ॥ తద్రోషఘోరాగ్ని దావానలముభంగి, మధురాపురంబుపై మలయఁ దొడఁగ
దత్సైన్యపాదఘాతంబులు కుంభినిన్, కులగోత్రములతోడఁ గ్రుంగఁ జేసె
దద్రణభేరి శబ్దంబులు సప్తస, ముద్రముహార్భటుల్ నిద్రబుచ్చె
దత్కరి హయ బృంహిత హేషలద్దివి, గ్భద్రనాగంబుల బధిర పరచె
తే॥ దత్ప్రతిజ్ఞయు మానవదానవాళి, రాహివిద్యాధరోప్సరో వ్యూహములకు
వింత గలిగించె మఱియుఁ ద్రిదివిక్రమ బల, భద్రములకుఁ గిన్కఁ బుట్టించెఁ బార్థివేంద్ర!
తే॥ ఇంతలో మధురాపురి నెలమి నున్న, ప్రజ జరాసంధు శపనంబు రాక లెఱిఁగి
కలఁత పడఁ జొచ్చె నప్పుడా కమలనాథుఁ, డగ్రజుండగు సీరి కనయె నిట్లు. ౧౩
ఉ॥ అగ్రజ! యీ యహంబున జరాత్మజుఁ డాజి నొనర్ప సేనతో
నుగ్రయమాభుఁడై యిటకు నుబ్బుచు వచ్చెడి వానిఁ జూచి పౌ
రాగ్రణు లక్కలిన్ బడి భయంబున నుండిరి కావ వేగ నీ
వుగ్రుసిఁబోలి వాని చము వుక్కడఁగింపుము నేను మెచ్చఁగన్. ౧౪
ఉ॥ కాని జరాతనూభవుని కంఠము ద్రెళ్ళఁగఁ గొట్టఁగూడ ద
వ్వానికిఁ గా మఱొక్క పృథు బాహుబలప్రథితుండు గ్రాలెడిన్
వీని చమూసమూహముల భిన్నమొనర్చిన లోకమెల్ల య
న్యూనమిదంబు నెందఁగల దో ముసలీ! యరినాగకేసరీ! ౧౫
ఉ॥ చంపెద వీని బందుగులఁ జావఁగఁ గొట్టెద వీని రథ్యముల్
ద్రెంపెద వీని టెక్కెములఁ ద్రెళ్ళ నొనర్చెద వీని సేనలన్

నింపెద నేన్గుపీన్గు లని ♦ నెట్టెద వీని సహాయకారులన్
నింపెద హర్ష మీ భువికి ♦ నెమ్మినిఁ గూర్చెద సాధుపంక్తికిన్. ౧౬

మ॥ వనజాక్షుం డిటు పల్కుచుండుతఱి నా ♦ వైకుంఠలోకంబునుం
డి నిరాతంకముగా రథద్వయము కో ♦ టీరాస్త్రశస్త్రాంచితం
బు నలంకారసమన్వితంబు నయాసం ♦ బూర్ణప్రభారాశితోఁ
జనుదెంచెన్ గద వారిముంగలకుఁ గాం ♦ చన్ సభ్యు లబ్రంబుగాన్. ౧౭

ఉ॥ వచ్చిన స్యందనంబులను ♦ బద్మదళాక్షుఁడు గాంచి యన్నకున్
గ్రచ్చుఱఁ గేలఁ జూపి బల ♦ రామ! యివే జయలక్ష్మిఁ గూర్చి పే
రిచ్చ నొనర్పఁగాన వడి ♦ నెక్కి జరాసుత సైన్యధాన్యమున్
గచ్చియ నాఁగ నోటఁబడఁ ♦ గన్ నుసిఁజేయు మహోగ్రహేతితోన్. ౧౮

మ॥ ఇటులన్ బల్కి మహాగ్రహోగ్రసఖులై ♦ హేరాళ ధారాళ స
ద్భటఘోటద్విపకోటిపాటవపట ♦ ద్బాహామహోద్దండులై
పటుశస్త్రాస్త్రసమేతులై కవచశుం ♦ భద్దేహులై ధీరులై
త్రుటి నా తేరుల నెక్కి కృష్ణముసలుల్ ♦ దోతెంచి రాజ్యర్థులై. ౧౯

క॥ అంతం గంసాంతకుఁ డత్యంతోత్సాహంబు పుట్ట ♦ నాత్మచమువులన్
సంతాపము గలుగఁగ నరి, సంతతులకుఁ బాంచజన్య ♦ శంఖం బూఁదెన్. ౨౦

ఆ॥ ఇట్టిపట్టునందు ♦ నింద్రాదిదేవత, లంబరమున నిల్చి ♦ యబ్బురముగ
ననిమిషత్వ మంతొ ♦ యన్వర్థకముగాఁగ, జూడఁదొడఁగిరో య ♦ శోధనాఢ్య! ౨౧

శా॥ అంతన్ మాగధనాథుఁ డానగధరున్ ♦ హంకారహుంకారవి
క్రాంతిక్రాంతనితాంతసైన్యయుతుఁడై ♦ కాలంబు జేయింప భా
స్వంతున్ మేఘము గప్పుచొప్పున సమా ♦ చ్ఛాదించి సోల్లుంఠ మ
త్యంతం బాడెను వక్ష్యమాణవిధిఁ ద ♦ ద్దౌష్ట్యంబు స్పష్టంబుగాన్. ౨౨

జరాసంధుండు శ్రీకృష్ణునిఁ బరిహాసోక్తులాడుట

శా॥ గోపాలార్భక! పొమ్ము పొమ్ములఁతియా ♦ గోశ్రేణులన్ గాచుటో
గోపీగోపక బాలకావళులతోఁ ♦ గోలాటముల్ వేయుటో
సాపాటుల్ గడు జేయుటో మధురగ ♦ వ్యాదుల్ త్రుటిన్ ద్రావుటో
నీ పంతంబున కర్హమా నిఁక నిదో ♦ నీచేతగాదో కుధీ! ౨౩

సీ॥ అబలను జంపుట ♦ నధికుండ నైతి నే,నంచు నీవాత్మ మ ♦ దించినావొ
ప్రాతబండినిఁ దన్ని ♦ బలశాలినైతి నే,నంచు నీవాత్మ యో ♦ జించినావొ
దేబె నొక్కనిఁ గొట్టి ♦ దిట్టనైతిని నేన,టంచు నీవాత్మ గ ♦ ర్వించినావొ
రెండుచెట్టులఁ గూల్చి ♦ దండివాఁడను నేన,టంచు నీవాత్మలో ♦ నెంచినావొ

గీ॥ రెండుచిఱుబండలుండెడి ♦ నొండుకొండ, నెత్తి గండఁడ నేనంచు ♦ నెంచినావొ
యీ జరాసంధుశూరత ♦ లెఱుఁగ వహహా!, తొలఁగిపోకున్న నిచట నీ ♦ తల తొలంగు.

సీ॥ బృందావనము గాదు ♦ విహరింప నియ్యది, పూర్ణభయదయుద్ధ ♦ భూమి గాని
గోపాలకులు గారు ♦ కూడి యాడఁగ వీరు, ప్రళయకాలసమాన ♦ భటులు గాని
మురళిసరళి గాదు ♦ ముచ్చటపడ నిద్ది, బహుఘోరరణభేరి ♦ ఢక్క గాని
హైమవేత్రంబు గా ♦ దాలఁదోలఁగ నిద్ది, చాప గదా దండ ♦ సమితి గాని

గీ॥ మంజులాలాపములు గావు ♦ మాటలాడ, నివ్వి ప్రాణములందీయు ♦ నెదిరి కఱకు
నుడులు గాని కావున నీవు ♦ మదుకువిడిచి, బ్రతికి శుభములఁ బడయుమో ♦ బాల! చనుమ!

మ॥ కులగోత్రంబులు వన్నెవాసు లెవి వా ♦ క్రువ్వంగ వీల్గాని గొ
ల్లలలోఁ బుట్టి ఘనుండ నంచు నలవిన్ ♦ లక్షింపకే యీ రహిన్
గలనుం జేయఁగ సిద్ధమైతి వధమా! ♦ కయ్యంబు నీతోడ నే
సలుపన్ బూనుట లజ్జ యయ్యెడిని ఛీ ♦ చాల్జాలు పో బాలకా! ౨౮

శ్రీకృష్ణుఁడు జరాసంధునితో డీకొనుట

ఉ॥ పల్కఁగ నిట్లు మాగధుఁడు ♦ పంకజలోచనుఁ డాలకించి తా
నుల్కలు బైలుదేరఁగ ని ♦ జోగ్రమహోగ్రహావహ్నిలో నిటుల్
బల్కె జరాకుమారునకుఁ ♦ బాపి! మదీయమహత్త్వతత్త్వము
ల్బల్కకపోయినన్ దెలియ ♦ వా? వృథగా ననుఁ దూలనాడెదే? ౨౯

కం॥ తెలియక వాఁగితి వందునఁ, బలికెద నొక కొంత నాది ♦ బాహాబలమున్
దెలిసికొని కలను సలుపుము, పలుకులకుం బ్రథనమునకు ♦ బహుదూరముగా.

సీ॥ ఎవ్వాఁడు చివ్వలో ♦ నెల్లలోకంబుల జయలక్ష్మిఁ గైకొనన్ ♦ జాలియుండె
నెవ్వాఁడు గండున ♦ నెట్టిజెట్టులనైన, జిటికలో వశులుగాఁ ♦ జేసికొనియె
నెవ్వాఁడు నర దివి ♦ జేశ్వరాసురులచేఁ, గప్పంబులం గొని ♦ గర్వపడియె
నెవ్వాఁడు మధురాపు ♦ రీశుఁడై సకలభోగంబులం బొంది సు ♦ ఖంబుఁ జెందె

గీ॥ నవ్వఁడీదృశోత్ప్రాసము ♦ లిపుడు పలికి, వీరవీరుఁడనంచు గ ♦ ర్వించు నీదు
మెప్పుఁ జేకొన నలమాగ ♦ ధోర్విపతిని, గంసు హింసించితిని నో నృ ♦ శంస! వినుము.

ఉ॥ చించితి నింక నట్టి జగ ♦ జెట్టులఁ బట్టి నియుద్ధమందునన్
ద్రుంచితి సాధుభూరమణ ♦ తుందిలకృత్ప్రభసముచ్చయాటవిన్
మంచితి వేడ్కతో దురభి ♦ మానవిహీనమదీయభక్తులన్
దించితిఁ గొంత భూభరము ♦ దింతు మదిన్ ద్వదఖర్వగర్వమున్. ౩౦

కం॥ ఊరుం బేరును లేదని, సారెకు నాజాతిఁ గూర్చి ♦ జల్పింతు వరే!
యేఁకి నీకూఁతుల నిడి, సారెలఁ జేసితివొ దాని ♦ జ్ఞప్తికిఁ దెమ్మా! ౩౧

క॥ ఎగదిగఁ జూచెదవేలా?, మొగతాళి నునర్తువేల? ♦ యిపుడే యనికిన్
మగతనము గల్గెనేని స,రిగ మొల్లత్రాడున్న నీక♦రే! రా రమ్మా! ౩౨

వ॥ అనిన మదోన్మదుం డగు జరాసంధుం డుద్దండదండధరుని మాడ్కి-
నఖండరోషోద్ధురుండై ప్రలయాకాలానలుంబోలె రూక్షరక్తవక్త్రుండై యచలధరా
ధరనిచయంబు విధంబున సుస్థిరుండై భ్రుకుటి వికటంబుగా నయనంబులు విషమంబు
లుగాఁ గరంబులు శరపరంపరాగ్రహణచణంబులుగా దేహంబు దృఢకవచాచ్ఛా
దితంబుగా యాదవమూలనిర్మూలనాభీష్టార్థియై యఖర్వగర్వంబున నంధీభూతచేత
స్కుండై యుక్తాయుక్తంబులు త్యక్తంబు గావించి భక్తవత్సలుండును, దయాక
రుండును, శ్రీకరుండును, దుర్జనభర్జనుండును, నర్జునసఖుండును, జగన్నాథుండు నగు
మాధవునితో నాయోధనం బొనర్ప హరితో హరియును, మహీధ్రంబుతో మహీ
ధ్రంబును, సముద్రంబుతో సముద్రంబును, డీకొను వీఁకఁదాఁక నాయనిరుద్ధుండు
ప్రలయరుద్రునిమాడ్కిఁ గ్రుద్ధుండై సర్వసన్నద్ధుండై యా యుద్ధరంగంబునం బ్రతిఘటింప
నుభయసైన్యంబు లనన్యశౌర్యధైర్యంబులతోఁ బరస్పరంబు జయం బభ్యర్థించుచుఁ
డమరు మడ్డు డిండిమ ఝర్ఝర మర్దల పణవ భేరీ కాహళ పటహ ఢక్కా భాంకార
టంకార క్రేంకారంబులు సంకులంబుగా బహుళదరీపరీవృతగిరులం బ్రతిధ్వనించునట్లు
మొఱయ ముసల ముద్గర శరతోమర కరవాల శూలగదా పట్టిస పరిఘా కుంత సంత
తులం బోరిఁబోరిఁ గసిమెయి వెసవెస విసరివేసికొనుచు నడుమనడుమ బాహా
బాహిం గచాగచిం గేశాకేశిన్ మత్సరంబునన్ బోరాడుచు మాఱాడుచు బాఱా
డవెన్నాడుచు నార్చుచుఁ బేర్చుచుఁ దమతమ మూఁకలం బేర్చుకొనుచు నేర్చిన కర
ణిని మార్చిమార్చి నేర్పున బృందారకసందోహంబు లౌరా! యనం జిత్రతరంబును,
రోమహర్షణంబు నగు తుములయుద్ధంబుఁ గావించు పట్టున. ౩౩

మ॥ ధృతరాష్ట్రాత్మజుఁడౌ సుయోధనుఁడు దు♦ర్ధికుంఘు తన్మాగధా
నతుఁడౌటం దగు సాయముల్ సలుప మా♦నస్థైర్యధైర్యాంచితం
బతులాశ్వేభరథాన్వితంబు నగు పం♦చాక్షౌహిణీసైన్య మ
ద్భుతధాటిన్ జనుదెంచ యాదవులతోఁ♦ బోరాడ వచ్చెన్ జుమీ! ౩౪

ఉ॥ వచ్చి నిలింపు లౌర! యనఁ♦ బౌరుషముల్ వెలుగంగ మాగధుల్
హెచ్చ యదూద్భవుల్ బెగడ♦ నేపునఁ దూపు లపారధారగా
గ్రచ్చఱ వేసి యాదవతు♦రంగమదద్విపయోధయూధముల్
వ్రచ్చునటుల్ బొనర్చెను జ♦రాసుతుఁ డెచ్చుగ మెచ్చ నిచ్చలోన్. ౩౫

శా॥ సంధ్యారాగముఁ బోలు మోమున జరా♦సంధాత్మతుష్ట్యర్థమై
వింధ్యాధీశుఁడు తద్వశుండును ధను♦ర్విద్యానవద్యుండు వే

యాంధ్యం బింతయు లేసికై వడిని బం ♦ చాక్షౌహిణీసేనతో
సంధ్యాలాపము లాడు వాజి సలుపన్ ♦ సాగెన్ రిపుల్ భీతిలన్. 3౬

క॥ త్ర్యక్షౌహిణిసైన్యముతో, దక్షుండగు వంగవిభుఁడు ♦ ధారాళముగాఁ
బ్రక్షయముగాఁగ యాదవ,పక్షము తా నేగుదెంచెఁ ♦ బ్రధనస్థలికిన్. 3౭

చ॥ మఱియును దజ్జరాతనయు ♦ మాటకు లోఁగిన యన్యరాజులున్
కరిరథరథ్యయుక్తులయి ♦ కత్తిశముల్ ధరియించి వాహినుల్
బరువడి సాగఁ బోరునకు ♦ వచ్చిరి వీరరసాతిరేకులై
యరినికరం బరే యనుచు ♦ నార్వ సుపర్వులు వింత నొందఁగాన్. 3౮

మ॥ ఇటు లేతెంచి తదీయసైన్యములు శ్రీ ♦ కృష్ణాయుతానీకమున్
బటునారాచపరంపరార్భటులతో ♦ వైరించి పోరాడఁగా
విటతాటంబుగ యాదవుల్ జెదరి వే ♦ వీతాసిశస్త్రాస్త్రులై
చటులప్రక్రియఁ బాఱఁగా దొడఁగి రా ♦ సంగ్రామరంగంబునన్. 3౯

క॥ అరదములు నేలఁగూలెను, విరిగెను టెక్కెంబు లెల్ల ♦ బిద్దెను హరులున్
ద్విరదములు వ్రాలె నతిమతి,నొరిగెను బాదాతమును ప ♦ యోజాక్షుమొనన్.

గీ॥ ఇటులఁ దజ్జరాసంధుని ♦ చటులసేన, యాదవులమూఁకలన్నింటి ♦ హతము సల్పఁ
గసి నసంఖ్యాతబాణముల్ ♦ విసరె నప్పు, డంధకారమ్ము గ్రమ్మె ర ♦ ణాంగణమున.

శా॥ వైకుంఠుం డటుపై నకుంఠితగతిన్ ♦ స్వవ్యూహసందోహముల్
జీకాకౌటను గాంచి మించి కసితో ♦ స్వీయంబు శార్ఙ్గంబు భూ
మ్యాకాశంబులఁ బర్వ దిగ్గజములా ♦ హా! యంచు లక్షింపగా
సాకల్యంబుగ నెక్కుపెట్టెఁ దనదా ♦ సైన్యంబు మాన్యంబుగాన్. ౪౧

ఉ॥ ప్రెగ్గడ లగ్గలంబుగను ♦ బెగ్గిలసాగిరి జెట్టిజట్టులున్
బగ్గెను వీడి రశ్వములు ♦ పైకెగురంగడఁగెన్ భయంబునన్
నగ్గకపోయె నాగములు ♦ నీరసమయ్యెను విండ్లు సారథుల్
దగ్గిరి శార్ఙ్గటంకృతివి ♦ తానముచే మగధేశుసేనలోన్. ౪౩

శా॥ ఇంకన్ దత్సమయంబునందు యదువం ♦ శేశాన సేనానులున్
శంకాతంకవిహీనులై డమరు వీ ♦ ణా మడ్డు ఢక్కానక
క్రేంకారంబులు భాంకృతుల్ సమరభే ♦ రీరావముల్ శింజినీ
టంకారంబులు సల్పి రొక్కమొగిఁ గా ♦ టం బౌనటుల్ భూవరా! ౪౪

వ॥ అంతన్ వైరివారవారణకరణకరణరచనాధురంధరుండగు నగ్గరుడధ్వజానలుండు బలభద్రానిలుండు బాసటగా శిఖావళీపింఛం బుల్కఁగాఁ గరవీరంబులు రసనంబులుగా శార్ఙ్గచక్రాద్యాయుధంబులు గరంబులుగా హేమచేలద్వయంబు తేజఃపుంజంబుగాఁ బ్రచండమార్తాండుండు ప్రతాపంబుగా వీణావేణు

ఢక్కానకాద్యనేకవాద్యంబులు స్వాహేతిశబ్దంబులుగా సాశ్వరథం బజవాహనం బుగా వెడలి పుడమిఁబడి వడివడి వ్రచ్చుకొని చొచ్చెడి పిడుగు కడంకఁ గడలు గడ గడ వడంక దుర్మదాంధంబును దుర్నిరీక్ష్యంబును నగు విపక్షపాక్షికమహారణ్యం బులోఁ జొరఁబడి ప్రళయకాలాభీలజాజ్జ్వల్యమానజ్వాలను విధంబునఁ బెచ్చుహెచ్చిల్లి వియచ్చరమానీంద్రుండు మెచ్చి తాండవలీలాలోలుండుగా దహింపం గడంగె. అతని నరాతిపదాతివ్రాతంబు లాజ్యాహుతులై భస్మీభూతంబులయ్యె. వెండియుఁ దత్పి తాంబరశాతాంబకఘాతంబుల శతాంగంబులు హతరథిరథ్యసంగతంబులై చక్రం బులు చూర్ణంబులుగా నేలం గూలె. మత్తేభంబు లొకటిపై నొకటి వ్రాలె. కొంద ఱరివీరు లధోముఖులును గొంద ఱూర్ధ్వాననులును గొందఱు భిన్నాంగులును గొందఱు భిన్నకంధరులును గొందఱు సంఛిన్నపాదులును గొందఱు విశీర్ణతను త్రాణులును గొందఱు వ్యత్యస్తహస్తులును నై నానాప్రకారంబుల భాండవ్యూ హంబు భాతి హతులైరి. తత్క్షణంబునందు ద్వీపంబులు గ్రాహంబులుగా నుష్ట్రఖరక బాధాములు కచ్ఛపంబులుగా రథంబులు శింశుమారంబులుగాఁ గేశంబులు శైవా లంబులుగా భుజంబులు భుజంగంబులుగాఁ గరంబులు మీనంబులుగాఁ దారహార హీరకుండలశిరోరత్నంబులు శర్కరిలంబుగా శస్త్రంబులు శుక్తులుగా శంఖచ్ఛత్ర చామరంబులు సైకతంబులుగా రథాంగంబు లావర్తంబులుగా సేనాద్వయం బుభయతటంబులుగా శతయోజనవిస్తీర్ణభ్రాజమానంబగు వైతరణీతరంగిణి కరణి నొండు రుధిరస్రవంతిని భీకరంబుగాఁ బ్రాదుర్భవించి నూఱామడలవఱకుం బ్రవహింపం దొడంగె. మఱియు నానిర్ఝరిణియందు భైరవభూతభేతాళయోగినీ గణంబులు చనుదెంచి కాంచి కేకరించి కేరించి కేకిసలం గొట్టుచు నొండొరులు బిల్చికొనుచు బ్రళయమేఘనిర్ఘోషంబులవలెఁ బొబ్బలఁ బెట్టుచు మహాకాల కపాల మాలార్థంబుగాఁ బృథులంబగు తద్రుధిరంబం దడఁగియున్న శిరంబులం గెల్లగించి పేర్చి యార్చి గ్రహించి తచ్ఛోణితం బసకృత్తుగాఁ జప్పరించి వికావిక నవ్వి గ్రోలుచుఁ ద్రేపుచు మెచ్చుచు హెచ్చి చెరలాటమాడుచు నృత్యం బొనర్చుచుండ భద్రకాళి రౌద్రమూర్తియై సింహం బెక్కి రంహస్స్ఫూర్తిని డాకినీశతంబు వెన్నాడ నామొగ్గరంబున కేతెంచి పెల్గడ లడలఁ బరికించి యిచ్చకొలంది నుష్ణంబగు రక్తంబు కడుపారఁ ద్రావి యౌ నౌ నని తలపంకించి వికారంబుగా భీకరాట్టహాసంబులం గావించుచుండె. ఇంతఁ దత్సమయమందు స్వర్గవాసంబు జేసెడి విద్యాధరీగంధర్వ్యప్స రోజనంబులు తత్తద్ధర్మాచ్యుతులై బృందారకరూపంబులం బొంది తోతెంచు వీరవరుల నహమహమికచే ననురూపులగు వారిని వరించుచుండిరి సంగర రంగంబున నభంగురంబుగా ధర్మంబుతోఁ బోరాడిన శూరులు గొందఱు మార్తాండమండలంబు భేదించుకొని విష్ణుపదంబున కేగుచుండిరి. అంతటఁ బ్రబలం

బాంతకుండు హలాయుధంబున మిగత పగమూఁకలను సమాకర్షించి త్రైలోక్యబల ధారకుండై యొక్కమాఱిక్కుంభినిం ద్రొక్కం జాలు ముక్కంటి నెక్కసక్కెమాడు రౌద్రంబున ముసలంబుచే మసలక నుసిజేసి యెసలాఱుచుండఁ గురు వంగ విద్యాధి నాథు లనాథులై భయంబునం జిక్కినదే త్రోవయని పాఱి రట్టిపట్టున ౮౫

శా॥ మాతంగాయుతదోర్బలుండు మగధ ♦ క్ష్మాపాలకుం డాత్మసే
నాతం డానల మంబుజాక్షశితబా ♦ ణ శ్రేణివర్షంబులన్
బ్రాఁతిన్ ద్రుంగి వినాశమౌటఁ గని దీ ♦ వ్యత్స్యందనారూఢుఁడై
హేతుల్ దాలిచి సీరి ముంగలకుఁ దా ♦ నేతెంచె యుద్ధాగ్రహై. ౮౬

క॥ వచ్చిన మాగధు నరదము, లచ్చిమగనియన్న సూచి ♦ లాంగలమున వే
వెచ్చుగ లాగి ముసలమునఁ, జచ్చునటుల్ సూతహయుల ♦ జదిపెం బిదపన్. ౮౭

క॥ హతసారథిరథహయుఁడయి, వెతబడక జరాత్మజుండు ♦ స్వీయాస్త్రములన్
ద్రుతముగ విడి దోర్యుగమున, ధృతితో బలుఁబట్టి కొనియె ♦ నెదిరించి కసిన్.

వ॥ ఇట్టులం బట్టుకొనం దిట్టయగు నానల్లపట్టుపుట్టంబులతాల్పు పట్టుబట్టి తట్టాడి యా జెట్టిపట్టు తప్పించుకొని యుప్పరవీనికిం గుప్పించి యెగసి కంఠీరవంబుపైఁ గంఠీరవంబును, శార్దూలంబుపై శార్దూలంబును గుంభిపైఁ గుంభియును దూఁకు వీఁక నాకట్టిడినానిపై దూఁకి తట్టసబుజంబులం దట్టి యిట్టట్టుసరాని యట్టుల గట్టిగాఁ బట్టి పిడికిళ్ళం బొడిచియుఁ గాళ్ళం దన్నియు వ్రేళ్ళన్ మొట్టియు మోకాలించి కారింప నా క్రూరుం డయారె యని మెచ్చి యగ్గరుడధ్వజాగ్రజుం డగ్గలి పగ్గ లగ్గలంబుగ నుగ్గడించి యుగ్గెత్తుగా నుగ్గాడ హుమ్మని భుజయుగ్మమ్మునం ద్రోసియుఁ గాసరంబుభాతి శిరంబునం బొడిచియు ఖరంబువిధంబునం బృష్ఠపాదంబులం బ్రహరించియుఁ బొంచి చెంగున విహంగంబుభంగి పైకెగసి కసిని నుదుగణంబు పుడమిఁ బడు బెడఁగున నాతాటిపడగవానిపైఁ బడి బెదురుగాఁ బీడింపం దొడంగం దడయక బలుం డఖండబలుండై పాదంబులం బాదంబులును, హస్తంబులన్ హస్తంబులును, నురంబునం దురంబును, శిరంబునన్ శిరంబును, భుజంబులన్ భుజంబులును గీలించి నేల త్రొక్కుచుం బెట్టస్థాలిఁ బోలి ఘటికాద్వయంబు చలింపం బిగి బిగి పట్టుకొని సముద్రగ్రాహ హరోగ్రవిగ్రహుండై పెల్చునం గూల్చ ఘోరంబగు ముసలంబుఁ గైకొని యా పగతుం దెగటార్పఁ దమపట్టిస్థితుండుగా దీనవత్సలుండును, బరిపూర్ణకామావతారుండును, మహాత్ముండును నగు నా శ్రీకృష్ణుం డధికరభసంబున బలభద్రుని కడ కరిగి విడు విడు మని యతిసాంత్వంత మాన్పి జరాసంధున కిట్లనియె. ౮౮

శ్రీకృష్ణుండు బలరామునికిం జిక్కిన జరాసంధుని విడిపించుట.

చ॥ వగచెదవేల ? పొమ్ము రిపు ♦ పక్షముఁగూల్ప ననల్పసేనతోఁ
దగి మఱి యిందు రమ్ము మగ ♦ ధా ! యభిమానధనుండ వీవిటుల్
నొగులకుమా ! నిలింపులు మ ♦ నుష్యులు మెచ్చగ నాడినట్టి నీ
మగఁటిమి నిల్పుకొమ్ము చను ♦ మా ! యనుమానము మానుమా ! యెదన్.

మ॥ పరిహాసంబుగ నిట్లు బల్కి విడిపిం ♦ పన్ దజ్జరాసంధుఁడున్
శిరమున్ సిగ్గున వంచి యిప్పు డెదియేఁ ♦ జేయంగ వీలౌనొ కా
ని రయానన్ జని నిర్జనస్థలమునన్ ♦ నిష్ఠం దపం బాచరిం
చి రణంబందున నీహరిం దునిమి వా ♦ సిం దెత్తు నం చాదతోన్. ౫౧

తే॥ మంత్రులను బలాయితులైన ♦ మనుజవిభులఁ
దోడుకొని మధురాపురిన్ ♦ వీడి తనదు
పురమునకుఁ బోయి యందున ♦ నరివినాశ
కృతిసమారంభములఁ జేయు ♦ చెసరుచుండె. ౫౨

చ॥ హరిహలు లట్లు లట్టి మగ ♦ ధాధిపు గెల్వ సురల్ సుమంబులన్
గురిసిరి వందిమాగధులు ♦ గోర్కి మహోన్నతసన్నుతుల్ పఠిం
చిరి రణవీరు లబ్బురముఁ ♦ జెందిరి కాహళశంఖదుందుభుల్
మొఱసెను యాదవధ్వజిని ♦ మోదము గాంచె ననంతరంబునన్. ౫౩

క॥ తురమున నరినికరంబులు, బరువడి విడినట్టి దివ్య ♦ వాజిద్విపచా
మరశరమణిమకుటంబుల, హరిపాక్షికచయము గొనిన ♦ యంతట వేడ్కన్.

సీ॥ వేదవేదాంగప్ర ♦ వీణులౌ బ్రాహ్మణుల్, క్షేమంబుగల్గ నా ♦ శీర్వదింప
నలఘుచరిత్రలౌ ♦ కులసతుల్ సుమలాజ, చందనాక్షతలను ♦ జల్లుచుండ
రంభాభలైన వా ♦ రస్త్రీలు గానాభి,నయవిశేషములతో ♦ నాట్యమాడఁ
బౌరనాయకులైన ♦ భాగ్యవంతులు పూర్ణ,కుంభనీరాజనాల్ ♦ గొంచునియ్య
తే॥ సకలవాద్యంబులున్ మ్రోయ♦జయముఁగొన్న, శౌరి సీరిసమేతుఁడై♦సర్వయాద
వులును జనుదేర వచ్చె నా♦పూర్తిగా న,లంకరించిన మనికికి ♦ శంకదక్కి. ౫౫

ఉత్సాహ॥ అంత మాధవుండు యాద ♦ వాధిపోగ్రసేనునిన్
సంతసమునఁ గాంచి మ్రొక్కి ♦ సమితిఁగొన్న ద్రవ్యముల్
సుంత మిగులకుండ నిచ్చి ♦ సుఖముగల్గ భూమి న
త్యంతముగను నేలు మంచు ♦ నాడె తేఁడ ! పిమ్మటన్. ౫౬

క॥ ఇరువదిమూఁ డక్షౌహిణు, లరుదేరఁగ వెంట భీక ♦ రార్భటితోడన్
మఱల జరాసంధుఁడు శ్రీ,హరినిం దెగటార్ప మధుర ♦ కాగతుఁ డయ్యెన్.

ఉ॥ ఆగతుఁడైన మాగధుని ♦ నా హరి గాంచి బలప్రయుక్తుఁడై
వేగ తదీయసైన్యమును ♦ స్వీయశితాస్త్రకృపాణధారలన్
రేగి హతం బొనర్చి తృణ ♦ రీతి నరాతినిఁ బాఱఁద్రోల నా
మాగధనాయకుండు నవ ♦ మానపరీతమనస్వియై చనెన్. ౫౮

తే॥ మధురలోనున్న జన మల ♦ మాధవు కృప
ధనకనకవస్తువాహన ♦ ధాన్యపుత్ర
పౌత్రదీర్ఘాయురారోగ్య ♦ భాగ్యయోగ్య
తలు విశేషముగాఁ గల్గఁ ♦ దనరుచుండె. ౫౯

తే॥ చని సహింపక తజ్జరా ♦ సంధుఁ డంబు
జేక్షణుం గెడపఁగఁ బను ♦ నేడుమాఱు
లేగి యోడి తిరుగఁ బను ♦ నెనిమిదవత
డవఁ దురముఁ జేయ యత్నించు ♦ నవసరమున. ౬౦

కాలయవనుండు నారదప్రేరితుండై కృష్ణునిమీఁద దాడివెడలుట.

చ॥ కలహమె విందుగాఁ దలఁచి ♦ గౌరవమొందెడి నేను పూని మ్లే
చ్ఛుల కధినాథుఁడై ప్రథిత ♦ శూరులలో గణనీయుఁడై ధరన్
బలుఁడయి ప్రాలు కాలయవ ♦ నప్రభు డాసి తమిన్ దదాగ్రహా
నల మనిలంబుకై వడి ఘు ♦ నంబుగ రేపుచు నిట్లు పల్కితిన్. ౬౧

మ॥ యవనా! సప్తసముద్రముద్రితపృథు ♦ జ్యానాగలోకాది లో
కవిరాజద్బలశాలురన్ గెలిచి త ♦ త్కాంతానికాంతార్ధర
త్నవితానాశ్వమదేభధేనుమకుట ♦ ప్రాభృత్యరాజ్యంబులన్
స్వవశంబౌ నటు గొన్న నీవొక బలున్ ♦ సాధింతువా? కాంతువా? ౬౨

చ॥ అతఁ డెటువంటివాఁ డనిన ♦ నాగమగమ్యుఁ డనాదిపూరుషుం
డతులబలుం డమేయగుణుఁ ♦ డర్జునమిత్రుఁడు సర్జునాంబరుం
డతిరథుఁ డబ్జనేత్రుఁ డసు ♦ రాంతకుఁ డాశ్రితపోషకుండు దు
ర్మతరతనాశకుండు నయి ♦ రాజిలుఁ గృష్ణుఁ డనంగఁ బోటరీ! ౬౩

తే॥ మధురయను పురమందునఁ ♦ బ్రథిత యాదవులు నుతింపగ వాసంబు ♦ సల్పుచుండు
నతనిఁ బట్టుమ బలమున్న ♦ నపుడె నిన్న, లోకవీరుఁడవని మేము ♦ వాకొనెదము.

తే॥ అనినతోడనే యవనుం డ ♦ హంకరించి, హుంకరించి పెంగింకతో ♦ నూరు విడిచి
ప్రబలచతురంగబలముతో ♦ బయలుదేరి, మధురచుట్టును విడిసె నో ♦ మానవేంద్ర!

ఉ॥ ముట్టడిసల్పు మాధురులు ♦ పూర్తిగ భీతినిఁబొంది కుంది మే
మెట్టుల నిందు నుండఁగల ♦ మే రహి నిల్చెడి మాదుప్రాణముల్?

గట్టకటా! కటా! యకట! ♦ కంజదళేక్షణ! సంతతంబు నిర్
గట్టిగ నమ్మియున్న మముఁ ♦ గావవె వైరులఁ బాఱఁద్రోలవే. ౬౮

తే॥ అనుచుఁ వేఁడి చాతకము వ♦ర్షాగమంబుఁ, జూచుకైవడి హరికృపఁ♦జూచుచుండి
రవల నసురాంతకుండు ని♦జాగ్రజన్ముఁ, జేరి యిట్టుల వాక్రువ్వెఁ ♦ జింతజేసి.

శా॥ అన్నా! యెన్నఁగరాని శస్త్రములతో ♦ హస్త్యశ్వజాలంబుతో
విన్నాణంబగు స్యందనావళులతో ♦ భేరీరవస్ఫూర్తితో
విన్నం గన్నను గుండె జల్లుమను ను♦ద్వృత్తోద్భటశ్రేణితో
నెన్నం డెందున రాని కాలయవనుం ♦ డేతెంచెఁ బోరాడఁగన్. ౬౯

తే॥ కొలఁది కాలంబు గడచినం♦గొంపముంపఁ, దజ్జరాసంధుఁడున్ మఱి♦దాడివెడలు
నప్పు డుభయులుఁ గలిసి యీ♦యాదవులను,హతము జేయుట ధ్రువమని♦యాత్మ నెంచు

శ్రీకృష్ణుం డర్ణవమధ్యంబున ద్వారకాపురంబుఁ గట్టించుట.

మ॥ అనఘా! వారిని నేక కాలమున సం ♦ హారంబుఁ గావించుటల్
గనఁగా దుష్కరమయ్యెడిన్ మన కనిన్ ♦ గానన్ బురంబొండు త
ద్వనధిన్ మార్తురు సేరరాని కరణిన్ ♦ బల్ గూఢమౌనట్లు నే
ర్పున నిర్మింపఁగ నౌను యాదవ జనం ♦ బుల్ వాసమున్ సల్పఁగాన్. ౭౦

ఆ॥ అనఁగ నీలచేలుఁ ♦ డంగీకరింపఁగా, లోకపాలకాది ♦ లోకనుత్యు
విశ్వకర్ముఁ బిలిచి ♦ విపులాంబుధిం బురిఁ, గట్టుమంచు జెప్పెఁ ♦ గరుడవిభుఁడు

ఆ॥ అవల విశ్వకర్మ యారేయిఁ ♦ బురమొండు, కట్టె దానికేది ♦ కాదు సాటి
యనిన నింద్రవరుణ ♦ ధనదపితామహ, శమననగరముల ప్ర ♦ శంస యేల?

క॥ వెండియు మోక్షముఁగోరు న,ఖండులు వైకుంఠమంచుఁ♦గాంచుదు రది కృ
ష్ణుం డెది చేయించిన నది, దండిదియై చెల్లుగాదె ♦ ధరణీరమణా! ౭౩

పృథ్వీవృత్తము॥ అనంతరమునన్ రమారమణుఁ డట్టి ♦ యంభోధిలో
ననన్యఘణితిన్ విశాలముగ నున్న ♦ యా ద్వారకన్
ఘనంబగు స్వయోగశక్తి యదుపుత్ర ♦ కశ్రేణిఁ దో
డ్తనన్ దయను జేర్చి యా మధుర కేగి ♦ ధాత్రీవిభూ! ౭౪

క॥ అరిగి యసహాయుఁడును నిశ్శ్రుఁడను హరి పురమునుండి♦చనె వెలుపలకున్
హరి గుహ విడి వడి వచ్చెడి, కరణిని సరగున నెఱిగను♦క్ష్మాతలనేతా! ౭౫

ఉ॥ అంతఁ దురుష్కసైన్యవిభుఁ ♦ డా హరిఁ గన్గొని చిత్తమం దిటుల్
జింతనచేసె నే నిట వ♦సించుట గాంచియుఁ గించలేక నా
చెంతకు వచ్చె వీఁ డెవఁడొ ♦ శ్రీధరుఁడో మఱిఁ గాఁడొ యైన శ్రీ
కాంతుఁ డటంచుఁ దోఁచుఁ గనఁ♦గా నలనాఁటి సురర్షిసూక్తులన్ ౭౬

❀ కాలయవనుండు శ్రీకృష్ణుని వెంబడించి పాఱుట. ❀

చ॥ తలఁచి యటుల్ తురుష్కవసు ♦ ధాపతి దాల్పక యెట్టిహేతిఁ గా
ల్బలమును వీడి యొంటరిగ ♦ వాహన మెక్కక బంటుచాడ్పునన్
సలిలజనేత్రుఁ బట్టికొని ♦ చంపఁగఁ బైకరుదేర శౌరి యా
బలికిఁ బరాఙ్ముఖుం డగుచుఁ ♦ బాఱఁ గడంగె నభంగసంగతిన్. ౭౭

చ॥ పఱుగిడఁ గాంచి తద్యవన ♦ పార్థివుఁ డీతఁడు పాఱుబోతరే!
యెఱుఁగకపోతి వీరుఁడని ♦ యే విని యిందుల కేగుదెంచితిన్
సరిసరి వీనిఁ బట్టుట సు ♦ సాధ్యమటంచుఁ దలంచి నవ్వి స
త్వరగతితోడ వెంటఁబడి ♦ పాఱెడిఁ దత్సమయంబునందునన్. ౭౮

క॥ అక్కమలాక్షుఁడు సక్కఁగ, నక్కపటికిఁ జిక్కినట్టు ♦ లగుపడు మఱలన్
జిక్కక పఱుగిడు మునులకుఁ, జిక్కని వాఁడెటు లతనికిఁ ♦ జిక్కు? నరేంద్రా!

చ॥ మఱి హరి, దుర్గమంబులను ♦ మానవశూన్యములౌ నరణ్యముల్
బురములు పక్కణంబులును ♦ బుణ్యనదీనదసాగరంబులున్
సరసర తిర్గి తద్యవన ♦ సన్నిధి నిల్చి హసించి పిల్చి పో
టరి! బలమున్న? యుండినఁ ద ♦ టాలునఁ బట్టుమటంచు రేపెడిన్. ౮౦

శా॥ మారీచుండు సఖోదితుం డగుచు మున్ ♦ మాయాసువర్ణైణియై
శ్రీరామున్ బరువెత్తఁజేసినటు లీ ♦ శ్రీకృష్ణుఁ డా కాలునిన్
బాఱం జేయుచు శ్యామలాద్రిగుహలోఁ ♦ బాతాళ కోణంబునన్
జేరెన్ దద్యవనేంద్రుఁడున్ జొరఁబడెన్ ♦ జృంభించి దంభంబుగాన్. ౮౧

తే॥ అట్టి బిలమందు ముచుకుందుఁ ♦ డనెడి నాతఁ
డొడలు దెలియనిభంగినిఁ ♦ బుడమిపైని
గిరి ప్రతిధ్వనించెడిరీతి ♦ గుఱక లిడుచు
నిదురఁ బోవుచునుండె నో ♦ నిర్మలాత్మ! ౮౨

క॥ అంతన్ దత్కాలుండు త,దంతరమున్ సొచ్చి కనఁగ ♦ నంధం బౌటన్
సుంతయు జూడఁగఁ జాలక, కొంతవడికిఁ బండిన ముచు ♦ కుందుం గాంచెన్.

చ॥ కని హరి యంచు భ్రాంతిపడి ♦ కయ్యముఁ జేయఁగ లేక లేకి! త
జ్జనపదపట్టణాబ్ధివన ♦ శైలము లన్నియు దాఁటఁ బాఱి ద
వ్వునఁగల యీ బిలంబునకుఁ ♦ బోకిరివై చనుదెంచి నిద్ర వో
యిన నరుమాడ్కి నుండెదవె? ♦ యే నికఁ జంపక పోవ నిత్తునే. ౮౪

తే॥ అంచు నట్టహాసంబు గా ♦ వించి మించి
యశనిసదృశపాదంబున ♦ నతనిఁ దన్ని

యన్నగము మాఱుమ్రోయఁగా ♦ నఱచి కరత
లముల బుజములఁ జఱచి చె ♦ లంగుచుండ. ౮౫

చ॥ అల ముచుకుందుఁడున్ నిదుర ♦ కడ్డు ఘటిల్లుట లేచి చూచి ముం
గలఁ గల కాలుఁ గీలివలెఁ ♦ గ్రాలెడి కంటఁ గనం దదంగజా
నలము బహిర్గతంబయి తీ ♦ ఱంబున వాని దహింప భస్మమై
లలి నిలపైని వ్రాలె మిథి ♦ లాపరిపాలనధర్మలోలుపా! ౮౬

తే॥ అవల బహులాశ్వుఁ డిట్లనె ♦ నమరమునికిఁ
బలికె నారద! యా గొప్ప ♦ వాఁడెవండొ
కాలయవనుండు వానిచేఁ ♦ గాల్పఁబడుట
కేమి కారణమో కృప ♦ నెఱుఁగఁ జెపుమ! ౮౭

ముచుకుందవృత్తాంతము.

వ॥ అన విని మునివరుండు జనకున కిట్లనియె. భూవరా! మున్ను ముచుకుందుండు మాంధాతృపుత్రుఁడై యఖండభూమండలపాలకుండై యేలుచు నొండెడ నిశాటులు నిర్జరగణంబును దౌర్జన్యంబున నిర్జించి తర్జించుచుండం గని యిది కర్జంబుగాదని చని యా దుర్జనులఁ భర్జించి సంరక్షించిన నా బృందారకబృందంబానందంబుఁ బొంది సందియంబులఁ మాని డాసి రాజపుంగవా! మమ్మాకర్బురులవలనఁ గలుగు దుర్భరబాధల రూపుమాపి సంరక్షించితివి. కాన నీకుఁ గావలసిన వరంబు లొసంగ వచ్చితిమి. తెలుపు మని పృచ్ఛింప నా సచ్చరితుండు మెచ్చి వియచ్చరులారా! భవత్సంరక్షణకార్యమం దహోరాత్రములు నిద్రమాని యప్రమత్తుండనై పాటుపడితిని. దాన నిపుడు బహుబాధలు గల్గుచుండెం గాన గాఢనిద్ర యలవడునట్లును, దన్నిద్రావసానంబునందు సుందరనందనందనసందర్శనంబు ఘటిల్లునట్లును, దద్దర్శనంబునకు మున్నె నా నిదురకు భంగంబు గల్పించిన దుస్సంగుండు భంగీభూతుండగునట్లును, వరంబియ్యఁ బ్రార్థించితి నన వారలిచ్చి స్వధామములకుం జనిరి. తద్వరప్రభావంబున నాతం డా శ్యామలాచలగుహాలోఁ గృతయుగంబునం బ్రవేశించి గాఢంబుగా నిద్రించుచుండ నక్కాలయవనుం డేతెంచి యచ్యుతదర్శనంబు గాకమున్నె యతని శయనంబున కంతరాయంబు గల్గించి ధ్వంసంబయ్యె. ఇట్లు కాలుండు చూర్ణీభూతుండైన పిదప నా యచల బిలమం దొకమూలనున్న శ్రీకృష్ణుండు జగన్మోహనాకారుండై కోటిమార్తాండమండలప్రతీకాశతేజఃపుంజవిభ్రాజమానుండై నానాభూషణభూషితుండై ప్రసన్నవదనారవిందుండై దయాసముద్రుండై యా ముచుకుందు కురంగటం జెలంగినం గాంచి యాతండు ప్రత్యుత్థానం బొనరించి సంతోషించి నమస్కరించి యిట్లు భక్త్యంచితుండై వినుతించె. ౮౮

సీ॥ తమ్మింట్లు మొదలైన♦సొమ్ములు గలవానిఁ, దమ్మిచూలినిఁ గాంచి♦తనియువానిఁ
దమ్మికనులవానిఁ♦దమ్మిఁ దాల్చినవానిఁ, దమ్మికంటులతోడఁ♦దగులువానిఁ
దమ్మియింటిచెలి మో♦దమునఁ జెలంగెడివానిఁ, దమ్మితూపరిరూపుఁ♦దనరువానిఁ
దమ్మిపగతునింటఁ♦దద్దఁబుట్టినవానిఁ, దమ్మిమొగ్గరమునఁ♦దరలువానిఁ
తే॥ దమ్మిపొక్కిలిగలవానిఁ♦దమ్ములదొర, యందు వెలిగెడివానిని♦నందముగల
మబ్బుచాయనుదగువాని♦మంచివరిఁ, బ్రోచువానిని నిన్నిదే♦మ్రొక్కుచుంటి.

ధ్రువకోకిల॥ అభయలోకశరణ్య! మాధవ! ♦ శంఖచక్రగదాధరా!
ప్రభువరేణ్య! యగణ్యపుణ్య! వి♦పాటితాసురవాహినీ!
యభవమిత్ర! యనాదిపూరుష! ♦ యాదితేయనమస్కృతా!
యభయమిచ్చి కృతార్థతంగను ♦ నట్లు ప్రోవుము! యిత్తఱిన్. ౯౦

మత్తకోకిల॥ వాసుదేవ! త్రివిక్రమా! వ్రజ ♦ పాలకాత్మజ! కేశవా!
దాసపోషక! గోప్రవర్ధన ♦ ధారణోద్ధుర! మహాఘనా!
రాసమండలకూర్దనోత్సుక! ♦ రాధికేశ్వర! శాశ్వతా!
భాసురాఖిలలోకనాయక! ♦ వందనంబులఁ జేసెదన్. ౯౧

తే॥ వేయికనుల్ వెయిశిరముల ♦ వెయిబుజముల
వెయ్యిరూపుల వెయిపేళ్ళ ♦ వెయియురముల
వెయిపదంబుల వెయ్యికో ♦ టియుగములను
బూనినట్టి యనంతుని ♦ న్మ్రొక్కుచుంటి. ౯౨

క॥ శౌరీ! హరీ! యారయ, ధారణి నావంటి పాపి ♦ దైవాఱఁడు దై
త్యారీ! నీవంటి దురితహారియు నగుపడఁడు గాన ♦ నలరం గనుమా! ౯౩

చ॥ అని వినుతింపఁ గృష్ణుఁడును ♦ హర్షముఁ బొంది యిటు ల్వచించె నో
యనఘ! త్వదాత్మ నిర్మలమ ♦ హంకృతిశూన్యము ధన్య మీవునున్
ఘనుఁడవు నా నుడుల్వినుచు ♦ నా వసియించెడి బాదరిస్థలం
బున కిపుడేగి దివ్యతప ♦ ముం బొనరింపు మదాశ్రయంబుగాన్. ౯౪

చ॥ తప మొనరించినన్ నిఖిల ♦ ధర్మములం బొనరింప నర్హమై
యపగతపాపమై వెలయు ♦ నగ్రజవంశమునందు నీవు నా
కృపఁ దలకట్టుగాను జని ♦ యింతువు తప్పక ప్రేమరూపభ
క్తిపరుఁడ వౌచు మత్పదవి ♦ కిన్ జనుదెంతువు తిర్గి రానటుల్. ౯౫

క॥ అని యాజ్ఞాపించినఁ ద,జ్జనపతి ముచుకుందుఁ డట్టి ♦ చక్రికి నతులం
బొనరిచి విడఁజాలక వీ,డ్కొని బాదర్యాశ్రమమున ♦ కుఁ జనెడి వేళన్. ౯౬

తే॥ ద్వాపరంబందుఁ గల నరుల్ ♦ స్వల్పు లౌట
దాళశతమహోచ్ఛ్రితుఁడైన ♦ తజ్జనవిభుఁ

గని భయంబునఁ దిరుగాడఁ ♦ గాంచి యతఁడు
వెఱవకుఁ డటంచు నేఁగెఁ గు ♦ బేరదిశకు. ౯౭

చ॥ ఇటు ముచుకుందభూపతికి ♦ నిచ్చి వరంబు సరోజనేత్రుఁ డం
తట మధురాపురంబునకు ♦ ధైర్యమునం జనుదెంచి యందు మి
క్కుటముగ నున్న తద్యవన ♦ కుంజరసేనలఁ దుక్కుభూళులౌ
నటు ప్రహరించె యాదవులు ♦ హర్షపయోధిని మగ్నులౌనటుల్. ౯౮

క॥ ఏతత్సమయమున నల జ,రాతనయుఁడు జగడమాడ ♦ రానెంచి యశో
స్ఫీతజ్యోతిషికుల నుగ,ధాతత వాసులను బిలిచె ♦ నవనీసురులన్. ౯౯

ఆ॥ పిలిచి యిట్టులనియెఁ ♦ బృథ్వీత్రిదశులార !, వాసుదేవుఁడనెడి ♦ బలుని గెలువఁ
దలఁచి మధుర కరిగె ♦ దన్ గాన మూర్తంబు, మంచి దొకటిఁ బెట్టి ♦ పంచుఁడాస్థ

తే॥ ఆముహూర్త బలమున జ♦యంబు నాకుఁ, గల్గినన్ మిమ్ముసారెకు♦గౌరవమున
సర్వవిధములఁ బూజించి ♦ సంతతంబు,సౌఖ్యముగ నేలుచుందు ద్వి ♦ జన్ములార!

ఆ॥ లేనియెడల నట్టి ♦ దానవఘాతకు,, డోర్చి నన్నుఁ జెఱను ♦ నుంచెనేని
నపజయమ్ము గల్గ ♦ నవమానమున్ సల్పి, పంపెనేని మిమ్ముఁ ♦ జంపివేతు.

వ॥ అనవుడు తద్వసుంధరాబృందారకేంద్రు లా జరాసంధవాక్యబృందంబు డెందంబు దమందంబుగ నాలోచించి యధార్థం బెఱింగి పృచ్ఛకుండు తుచ్ఛుం డగుట హెచ్చుగ ముచ్చటింపంజాలక దైవంబుపై భారం బునిచి తజ్జరాసంధ జయంబునే యభిలషించు యొక్కముహూర్తంబు నిర్ణయించి యతని కిట్లనిరి.

తే॥ ఓ జరాసంధ ! నీమాట ♦ నొప్పి యిప్డు, డొక్క లగ్నము పెట్టితి ♦ ముచితరీతి
రణముఁ జేయఁగ జనుమ ! ప♦రాజయంబు, నీకుఁ జేకూర దియ్యది♦నిక్కువంబు

క॥ అని చెప్పఁగ నట్టి జరా, తనయుఁడు దైత్యారిపైని ♦ దాడికి వెడలెన్
గునిలింపోక్తుల నమ్ముచు, ననఁగఁగఁ దిగ రెండు పదుల ♦ యక్షౌహిణులన్

చ॥ వెడలి కడల్ గదున్ వడఁక ♦ వీరరసం బెగపొంగ సంద్రముల్
జెడఁబడ నార్వఁ ద్రేళ్ళుకు లి ♦ సీయని రోయ సమస్తవాద్యముల్
దడబడ మ్రోయ సల్పి నిశి ♦ తస్వగదాస్త్రకృపాణసంతతిన్
విడివడఁ దత్పురిన్ విడిసె ♦ వెన్నునిఁ గొట్టనతండు దండితోన్. ౧౦౭

తే॥ దేవకీనందనుండును భూ♦దేవనాగ,ముఖసమస్తలోకములకు♦మూల మగుటఁ
దజ్జరాసంధరణయాత్ర ♦ ధరణిదేవు, లనిన పల్కుల నెఱిఁగి యి ♦ ట్లాత్మ నెంచె.

సీ॥ వీరి మూలముననే ♦ క్రూరులు సెఱదిరన్, వేదంబు లిందాఁక ♦ వెలయుచుంట
వీరి మూలముననే ♦ విశ్వోపయోగమౌ, సవనాదు లిందాఁక ♦ జరుగుచుంట
వీరి మూలముననే ♦ విపులసద్గుణములు, వ్యక్తమై యిందాఁకఁ ♦ బ్రబలుచుంట
వీరి మూలముననే ♦ విద్యాకళలు గూడ, విలువగా నిందాఁక ♦ నిలిచియుంట

తే॥ వీరి మూలంబునంగదా పితృమహర్షి, విబుధులుఁ దృప్తిఁ జెందుట వీరిమూల
మునె నా ముఖ మానంద పూర్ణ మగుచుఁ, బొగడఁబడుటయు శ్రద్ధతో బుద్ధిఁ దలఁప.

తే॥ ఇట్టి విప్రుల సూక్తుల నెట్లు రిత్త, పుత్తుఁ? బుచ్చినఁ భువనముల్ బూదిగావె
యంచు స్వప్రతిజ్ఞను గూడ నవలఁ ద్రోసి, భూసురోక్తులే నిజముగా వాసినెంచి

మ॥ బలుఁ డేతెంచఁగ వెంటఁ గాలినడకన్ బ్రహ్మాండనాథుండు నై
లలిఁ దాదృఙ్మధురాపురంబు విడి యుల్లంఘించి తద్ద్వారి నా
వల దైవాఖుదు భీరువౌ నరువలెన్ బాటాడ నాతండు క
న్నులతోఁ గాంచి హసించి యిట్లు పలికెన్ మోదం బనల్పంబుగాన్. ౧౧౦

చ॥ నిలు నిలు మోయి తోయరుహ నేత్ర! యిటుల్ పరువెత్తఁ బాడియే?
బలిపని నిక్కనీల్గితివి భండన మీ వొనరింపఁజాలవే?
చలము నశించెనే? మునుపు సాగినలాగున నిప్డు సాగునే?
తులువ! యిఁకెట్లు పోయెదవొ? త్రొక్కనె? నా కసిదీఱ నెందునేన్. ౧౧౧

వ॥ అని ప్రతిజ్ఞాలాపంబు లాడుచు నతులధృతియుతపతాకినీసహితుండై వెన్నాడి పాటాడ మాటాడక యా రామరమారమణులు గాల్కలందిని యామ్య దిగ్భాగంబునం బోయిపోయి యంతికంబున ౧౧౨

సీ॥ తాలహింతాల రసాలశాఖాలకుం, దార మందారాది భూరుహగము
గండభేరుండఖడ్గగవయశార్దూల, మృగరాజముఖజంతు మిశ్రితంబు
మాలతీమల్లికా మాధవీయూథికా, మరువకకురువక మానితంబు
కీరపారావత శారికాపరభృత, స్తోకాదికలరవ శోభితంబు

తే॥ మత్తమత్పదఝంకృతి మంజులంబు, కమలకల్హారభూషిత విమలబహుళ
పల్వలప్రాంచితంబు శుభప్రదంబు, నగుచుఁ జెన్నారెడిఁ బ్రవర్షణాచలంబు.

తే॥ అద్రి పదునొకండామడ లాయతంబు, నంత వెడలుపుఁ జెలఁగెడి నందు మిగుల
శబరులెల్లరు విహరింత్రు సర్వరోగ, నాశకరమగు నోషధుల్ నాటుకొనెడి.

క॥ అల గిరిశృంగాగ్రంబున, సులువుగ నెక్కి మగధుండు సూడమి వారిన్
మల మొదలఁ జిచ్చుఁబెట్టను, హాలిహరినాశంబుఁ గోరి యవనిపరేణ్యా!

ఉ॥ పెట్టినతోడ ధూమములు భీతికరంబయి బైలుదేరఁగా
బిట్టుగ రాఁజి గాడ్పులును వీవఁగ, భగ్గునఁ జిచ్చుమండి యా
గుట్టఁ జెలంగు చెట్టులును గుంజనికుంజములున్ గుటీరముల్
గుట్టిమముల్ సమస్తమును గొట్టుపడన్ దహియించె నంతటన్. ౧౧౩

మ॥ బలకృష్ణుల్ తదనుక్షణంబునఁ బ్రతి ద్వ్యంద్వీకృతాదృశ్యులై
మల శృంగాగ్రమునుండి పత్రికులన ప్రాక్రీతిగా సాగి యా

వలఁ జెన్నారెడి ద్వారకాపురములోఁ ♦ బాళంబుగాడంబుగాఁ
జెలులానందము నొందఁ జేరిరి సుధీ! ♦ శ్రీమైథిలాధీశ్వరా! ౧౧౭

క॥ అంత జరాసంధుఁడు శ్రీ,కాంతుండుఁ దద్గ్రజుండుఁ ♦ గాలిరి గిరిలోఁ
బంతము నేఁటికిఁ దీఱెను, స్వాంతమునన్ సంతసంబు ♦ సక్కఁగఁ గలిగెన్.

క॥ అని నెమ్మనమున నెంచుచుఁ, దన సైన్యముతోడఁ గూడి ♦ తాద్యగ్గోత్రం
బును విడి నిజపురమునకున్,జన నభిముఖుఁడయ్యె జయముఁ ♦ జాటుచు ధక్కన్

తే॥ బ్రహ్మవాక్యంబు బ్రాహ్మణ♦వాక్యమొక్క, రీతి ఫలమిచ్చునని భావి♦భూతవర్త
మానకాలజ్ఞు లెల్లరు ♦ మాటిమాటి, కాడుదురు వారి నమ్మిన ♦ వాఁడు సెడునె?

క॥ లోకక్షేమముఁ గోరుచు, శ్రీకరమౌ కృతుల నెల్లఁ ♦ జేయుచునుంటన్
నాకులు దైత్యులు నరులు ల,స్తోకముగా వేఁడుచుంద్రు ♦ క్షోణీసురులన్. ౧౨౧

సీ॥ పృథుచక్రవర్తినిన్ ♦ విశ్వవిఖ్యాతుగా, సల్పిన దీ విప్ర♦శక్తికాదె
యిక్కట్టులన్ జిక్కు ♦ నింద్రుండు సుఖకాఁగ, సల్పిన దీ విప్ర♦శక్తిఁగాదె
మృతులైన వారి జీ♦వితులుగా నొనరింపఁ, జాలిన దీ విప్ర♦శక్తికాదె
భగవంతుఁ డిజ్జగం ♦ బగచాట్లు లేనట్లు, సాకుట యీ విప్ర♦శక్తిఁగాదె

తే॥ సప్తసాగరములఁగ్రోలి ♦ సమ్మతమున, మఱల ధరణిపైఁ బాఱఁగ ♦ సరగ విడిచి
నట్టి దీ విప్రశక్తిమ ♦ హాద్భుతంబు, నైన దీ విప్రశక్తిఁ గొం ♦ డాడఁ గలనె?

క॥ తత్కారణముగదా బలి,కుత్కీలధరులు పయోధిఁ ♦ గుదిరిన పురిలో
నుత్కటముగ దాఁగుట మఱి, యుత్కర్ష జయంబు లరికి ♦ నొనఁగూడుయున్.

తే॥ ధీర! నీరజనేత్రుఁడా ♦ ద్వారకాపు,రంబునం దుండుటకుఁ గార ♦ ణంబు నీకుఁ
జెప్పియుంటిని వెండియు ♦ నప్పురముని పరిణయంబులఁ గూరిచి ♦ పలుకఁగలను

బలరామ వివాహమహోత్సవము.

క॥ ఇయ్యది సెప్పుట కాదిని, నెయ్యముతో సీరిపెండ్లి♦నిం గూర్చిచి నే
నియ్యెడఁ జెప్పెద వినినన్, జయ్యనఁ బురుషార్థసమితి ♦ సంసిద్ధియగున్. ౧౨౫

తే॥ భీకరార్భటియుత్తర♦త్నాకరంబు, నందు నానర్తుఁడన్ భూపుఁ♦డాత్మనామ
మునఁ జెలంగెడి దేశంబుఁ♦బోషణంబు, ధర్మముగఁ జేయుచుండు నా♦ధార్మికునకు.

చ॥ కలఁడుగదా సుతుం డొకఁడు ♦ గాఁదగువారల మేలుబంతి యో
గ్యులఁ దలకట్టు దిట్టలను ♦ నుక్కరి దిక్కఁడువారికెల్ల ది
క్కులఘుచరిత్రులం దలఘుఁ ♦ డందఱకున్ దలలోనినాల్క బీ
దలకును బెట్టుఁజెట్టు వసు ♦ ధాపతులం బెద రైవతుం డనన్. ౧౨౭

చ॥ అతఁడు నిపానఖాతపరి ♦ ఖాప్రసరోహ్రదకూపదీర్ఘికా
దితలకిగోపురావరణ ♦ ధిష్ణ్యసభామఠవప్రమండురా

వృతివిశిఖాప్రపావిపణి ♦ వీధిచతుష్పథధర్మహర్మ్యసం
గతముగ నద్భుతస్థితిని ♦ గట్టెఁ గుశస్థలియన్ మహాపురిన్. ౧౨౮

క. ఆపురిఁ గాపుర ముండుచు, నేపున ధర్మముగ రాజ్య ♦ మేలుచు వేడ్కన్
శ్రీపతికరుణను రైవత, భూపతి శతపుత్రకులను ♦ బుణ్యులఁ గాంచెన్. ౧౨౯

తే. మఱియు మారుమిటారిని ♦ మరువఁజేయు
నంత సర్వాంగసుందరి ♦ యైన రేవ
తి యను కన్నెను గనె నా క్షి ♦ తిప్రభుండు
మెండు గారాబముగఁ బెంచు ♦ చుండ నామె. ౧౩౦

తే. ప్రాప్తయౌవన యౌటచు వి ♦ వాహయోగ్య
యగుట వీక్షించి మిగుల ని ♦ జాంతరంగ
మందు నిట్లు యోజించె నీ ♦ యబల నెవని
కిచ్చినన్ లెస్సయౌ ? నది ♦ యెఱుఁగఁబడదు. ౧౩౧

క. తెలియక యే ముదుసలికో, చలమరికో లేకికో కు ♦ జనునకో గడికో
కలవాఁడని యీరతిసము, నెలనాగను గట్టిపెట్ట ♦ నేఁగానుగదా. ౧౩౨

తే. కులము శీలంబు ప్రాయంబు ♦ గలిమి బలిమి
బాంధవంబును రూపంబు ♦ భద్రలక్ష
ణంబులం గల్గి వెలఁగెడి ♦ నరవరేణ్యుఁ
డెందుఁ గలఁడొక్కొ యెవరు వ ♦ చింపఁగలరొ. ౧౩౩

ఉ. హృదయమునం దిటుల్ దలఁచి ♦ యెల్లజగంబుల సృష్టిసల్పు నా
సదయుఁడు బ్రహ్మ చెప్పుటకు ♦ శక్తుఁడటంచు సువర్ణరత్నముల్
పొదిపిన స్యందనంబున స్వ ♦ పుత్రిని రేవతి నెక్కఁజేసి స
మ్మదమున బ్రహ్మలోకము న ♦ మందగతిం జని యోగశక్తితోన్. ౧౩౪

వ. ఇట్లు చని యవ్విరించనుం గాంచి నమస్కరించి యం దాసమయమం దాతండా యింద్రాదు లేతెంచి స్వాభిప్రాయ సంచయంబు విన్నవించుకొనుటయు వసిష్ఠవామదేవకశ్యపాత్రి భరద్వాజశాండిల్యమాండవ్యమరీచ్యాది యోగిపుంగవులు పరివేష్టించి యుండుటయుఁ గిన్నరకింపురుషవిద్యాధరచారణ గంధర్వాప్సరోజనంబులు నాట్యం బొనరించుటయు విలోకించి తరుణం బిది గాదని యెంచి యించుక కాలంబు తూష్ణీంభావంబు వహించి యుక్తావసరం బాలోకించి సంతసించి క్రమ్మఱ నప్పరమేష్ఠిం డగ్గఱి యొరిగలిడి డగ్గుత్తికతోఁ జెవి యొగ్గుమని యగ్గలంబుగ నగ్గించి యిట్లుగ్గడించె. ౧౩౫

క. జననస్థితిలయములకున్, ఘనకారణుఁడవు పలుకుల ♦ కలికిమగఁడ వ
నిరికామాధారుండవు, వనజాసనుఁడవు నిలింప ♦ వర్యుండ వహా! ౧౩౬

క॥ ఆనందాకారుండవు, మానివితతిసన్నుతుఁడవు ♦ మాధవజుఁడవో
దీనదయాజలధీ! నా, యీ నతులం గొనుచు నన్ను ♦ నేలుమ! పరమా!

చ॥ మనువు మనీష యంగము ల ♦ మర్త్యులు వేదము లుత్తమాంగముల్
దనుజులు పాదముల్ విమల ♦ ధర్మము వక్షము వీపధర్మముల్
దనువు సమస్తసృష్టిగను ♦ దద్ద ఘటిల్ల వెలుంగు నీకు వం
దనములఁ జేయుచుంటిని బి ♦ తామహా! పూర్ణపురాణపూరుషా! ౧౩౮

క॥ అలఘుజగంబును హస్తా, మలకముగా సృష్టిఁ జేసి ♦ మనిపి ప్రవృద్ధిన్
సులువుగ లూతావిధమున, లలిగ్రసియించి ముదమునఁ జె♦లంగవె యీశా!

విద్యున్మాలావృత్తము॥ తాతా! తండ్రీ! ♦ ధాతా! విద్వ
జ్జేతా! నేతా! ♦ శిష్టప్రష్టా!
భూతప్రీణ ♦ ప్రోహాగ్రణ్యా!
జోతల్ గొమ్మా ♦ సూరిప్రాప్యా! ౧౪౦

చ॥ వినుము మహానుభావ! యొక ♦ విన్నప మిత్తఱి నెట్టి స్త్రీల క
ట్టినరుల కేవిధంబున ఘ ♦ టింతువొ యే మెఱుఁగంగలేము గా
ని నయగుణుండు శూరుఁ డతి ♦ నిర్మలుఁడున్ జిరజీవియైన వా
ని నొకని మత్కుమారికకు ♦ నిర్ణయముం బొనరించి చెప్పుమా! ౧౪౧

క॥ నీవె సమర్థుఁడవని యిట, కీవిధి నే వచ్చియుంటి ♦ నీక్షింపఁగ నీ
రేవతియొ రతితుల్యయు, కావునఁ దగువరునిఁ జూచి ♦ కరుణను ననుమా!

చ॥ పొగడుచు నగ్గ భారతివి ♦ భుండు ప్రసన్నచతుర్ముఖంబులన్
నగుచిటు బల్కె రైవత! క్ష ♦ ణం బిఁక యాపనమైనచో బలం
బగు నల కాలమం దిరువ ♦ దాఱు నొకండగు కల్పముల్ సనన్
జగము మనువ్యయుక్తమయి ♦ సాగెడిఁ దత్కలికాలమందునన్. ౧౪౩

క॥ నీ పుత్రులు నీ పౌత్రులు, నీ పెండ్లము నీదు చెలులు ♦ నీ బందుగులున్
భూపతి! యుండఁగఁజాలరు, నా పలుకుల్ విని వడి భవ ♦ నమునకుఁ జనుమా!

మ॥ చని తాలాంకుఁడు నీలచేలుఁడు మహా ♦ సౌశీల్యసంపన్నుఁడున్
వనజాతాయతలోచనాగ్రజుఁడు వి ♦ భ్రాజత్సితాంగుండు స
జ్జనసంరక్షకుఁ డాహవోగ్రుఁడు హలా ♦ స్త్రప్రాంచితుండున్ సుధీ
ఖనియా రామున కిచ్చి నీదు తనయన్ ♦ గావింపుమా! పెండిలిన్. ౧౪౫

క॥ మఱి సుమబాణాకారుఁడు, చిరజీవియు యాదవకుల ♦ శేఖరుఁ డతఁ డీ
తరుణికిఁ దగినవరుండని, కరముగ నేఁ బలుకుచుంటిఁ ♦ గాన నలుపుమా!

క॥ ద్వారకలో నా హరి యీ, సీరియు భూభార మణఁపఁ ♦ జెలఁగుదురు మహా
వీరులు వసుదేవజులును, ధీరులు బ్రహ్మాండభర్త ♦ దేవవిభులునై. ౧౪౭

ఆ॥ బ్రహ్మ యిట్లు పల్క ♦ రైవతభూపతి, మ్రొక్కి యందు వెడలి ♦ పూర్ణవృద్ధి
వృద్ధమగుచు మిగుల ♦ వెలిఁగెడి ద్వారకా, పురికి నేగుదెంచె ♦ పుత్రితోడ.

ఆ॥ వచ్చి విడిదిఁ జేసి ♦ వసుదేవునకు నా యు, దంత మెఱుఁగఁజేసి ♦ సంతసమున
స్వజనములనుగూడఁ ♦ జక్కగా రావించి, యంచితముగ సత్క ♦ రించి యంత.

తే॥ సర్వకల్యాణకరమును ♦ సారభాగ్య, తంబు పుష్పాంచితంబు నై ♦ డంబు మీఱు
నొండు కల్యాణమండప ♦ ముచితరీతి, నేర్పరచి వధూవరుల వ ♦ సింపఁజేసి.

సీ॥ యాదవనాయకు ♦ లరుదెంచి యియ్యాదే, యుక్తవివాహము ♦ చక్కఁగడింప
సకలసామంతులుఁ ♦ జనుదెంచి ధన కన, కాదిబహూకృతు ♦ లందనియ్య
నంబరమందలి ♦ యమరులు విరులను, గరముగఁ బోరిఁబోరిఁ ♦ గురియుచుండఁ
గల్యాణకరములై ♦ కర్ణపేయంబులై, వివిధవాద్యములు శ ♦ బ్దించుచుండ

తే॥ నుర్విదేవతలెల్ల రా ♦ శీర్వదింప, మంత్రతంత్రయుతంబుగా ♦ మానవతిని
రేవతిఁ గూఁతు నట్టి సీ ♦ రికరమందుఁ, బెట్టి దానంబు సల్పెఁ బె ♦ న్వేడ్కగాగ.

తే॥ మఱియు నాతిండుహాలికి డెఁ ♦ గరదములుగ, బ్రహ్మదత్తరత్నంబుల ♦ వస్త్రములను
హయసహస్రాంచితము యోజ ♦ నావృతంబు, విశ్వకర్మనిర్మితము నొ ♦ విపులరథము.

తే॥ ఇట్లు రైవతభూవరుఁ ♦ డెలమి స్వీయ, పుత్రికా వివాహోత్సవ ♦ ముంబొనర్చి
తపము సల్పఁగ బాదర ♦ స్థలికి నేగె, నిద్ది వినువారు సద్గతి ♦ నెనఁగఁ గలరు.

శ్రీరుక్మిణీకల్యాణకథాప్రారంభము.

క॥ మిథిలాపురనాయక! శ్రీ, మధుమధనవివాహకథల ♦ మాటాడెద నీ
కథలను విను సజ్జనునకు, వ్యథలు సనఁ సర్వపూరు ♦ షార్థము లొదవుఁ.

వ॥ ఈ యఖండభూమండలంబునం బరబ్రహ్మంబువిధంబున సత్యజ్ఞానానంద మయంబై సత్యలోకంబు పగిది దివ్యభాషాబ్రహ్మవిభాసురంబై వైకుంఠంబువై ఖరి శ్రీపుండరీకాక్షమండితంబై కైలాసంబుకైవడి రాజశేఖరసర్వమంగళాస్పదంబై యమరావతిచందంబున విబుధగణవిభ్రాజమానంబై తేజోవతీనగరంబుకరణి శుచి నిచయసముచితంబై సంయమినీపురంబుచాడ్పున సమవర్తియుక్తంబై నైరృతిస్థానీయంబులాగునఁ బుణ్యజనసమాకీర్ణంబై వరుణపురంబుసరణి ఘనకరవిరాజమానంబై యనిలుని నిలయంబునెఱిసి నానాసుగంధబంధురంబై యలకాపురంబు చొప్పున ధనదసముదాయసమున్నతంబై భోగవతిసొబగున మహాభోగియోగ్యంబై గోలోకంబులీల గోగోపకాళిరమ్యంబై గంధర్వలోకంబురీతిఁ జిత్రరథాదివిచిత్రంబై గ్రహమండలియట్లు మిత్రరాజబుధగురుకవిముఖభూషితంబై హస్తినాపురంబుఠీవి ధృతరాష్ట్రనివాసంబై యింద్రప్రస్థపత్తనంబుభాతి నధిగతధర్మజాతంబై వారణాశీపురంబుతేవఁ గాలభైరవశూలపాణిపరివృతంబై సుజనచరితంబుమాడ్కి నిష్కళంకంబై విమలకమలకమనీయకమలకల్హారమరాళిరాజరాజివిరాజితంబులై మాన

సరోవరంబుఁ బురుడించు దివ్యసరసులును, సరసజనమనోరథానుకూలంబులై చైత్రరథనందనంబులం బోలు నుద్యానంబులును, నుద్యానరతహృద్యంబులై సురపురరథ్యలం బోలిన రాజమార్గంబులును, రాజమార్గోభయపార్శ్వవిభాసురంబులై సురసాలంబులవలెఁ బ్రాలు సురసాలాదిసాలంబులును, సాలజాలప్రభవవాసనావాసితంబులై మలయమారుతంబును మరపించు శీతవాతంబులును, శీతవాతభీతలై రతిరంభాదిసతులను బోలి లతాతన్వీతరుమనోహరు నాశ్లేషించుమాడ్కిఁ దమతమ ప్రియులం గౌఁగిలించుకొను సుందరులును, సుందరసుందరీసుందరంబులై సంక్రందనమందిరంబును బ్రేణించు మణిఘటితభర్మమయరమ్యహర్మ్యంబులును, గలిగి భూరివికారవస్తుప్రశస్తంబయ్యు నభూరివికారవస్తుప్రశస్తంబై లాలాటికజాలవిలసితంబయ్యు నలాలాటికజాలవిలసితంబై యర్థిజనావనసమర్థరమణీయంబయ్యు ననర్థిజనావనసమర్థరమణీయంబై సర్వవిధసామరస్యంబై సమస్తసంపత్సారస్యంబై సకలజనానందకరంబై విదర్భదేశాంతర్భూతంబై కుండినపురవరం బొంపు చెన్నారుచుండు

ఉ॥ ఉండుఁగదా యొకం డచట ♦ నుర్వసుపర్వసుపర్వభ క్తియు
క్తుండు తదాధిపత్యసహి ♦ తుండు వదాన్యుఁడు సద్గుణుండు దిగ్
మండలఖండనోత్సవుఁడు ♦ నైతిక వైదికలౌకికార్థికో
ద్దండకృతిప్రవీణుఁడు ని ♦ శాంతయశుండును భీష్మకుం డనన్. ౧౫౬

ఆ॥ రుక్మి రుక్మరథుఁడు ♦ రుక్మబాహుండును, రుక్మకేశి యింక ♦ రుక్మనేత్రుఁ
డనెడి తనయులేవు ♦ రా ధరాధిపునకుఁ, గల్గి రంతఁ గొంత ♦ కాల మరుగ. ౧౫౭

మ॥ జనియించెన్ గమలాంశతో నమృతని ♦ ష్యందోద్యానాబ్జంబుతో
వనజాతాయతపత్రనేత్రపదసం ♦ బద్ధాంతరంగంబుతో
ఘనరుక్మద్యుతిభాసమానప్రముఖాం ♦ గశ్రేణితో రుక్మిణీ
వనితారత్నము పుణ్యరాశి యనఁ ద ♦ ద్భార్యామణిన్ మైథిలా! ౧౫౮

క॥ ఆపాపదినక్రమమున, నేపారుచు శుక్లతార ♦ కేళవిధమునన్
భూపతి కాటలఁ బాటలఁ, దేపకుఁ దేపకును గూర్చి ♦ తృప్తి ముదంబుల్. ౧౫౯

సీ॥ ఒకపరిఁ జెలులతో ♦ నోమనగుంటల, నాడును జేకడి ♦ యంబులాడ
నొకతేప నెచ్చెలు ♦ లుండ వీణాదులన్, వాయించుఁ దోడవ్రులు ♦ వాదులాడ
నొకసారి సకియలన్ ♦ సుకముగా రావించి, బంతులాడును బలు ♦ వింతలొదవ
నొకమాఱు సఖులతో ♦ నొంటిగా ముచ్చట, లాడుఁ జెలుల్ వరి ♦ హాసమాడ

తే॥ నొక్కతడవను జేటుల ♦ నొయ్యఁ బిలిచి, బొమ్మలకుఁ బెండ్లి యొనరించి ♦ సమ్మదమున
మంచి గుజ్జెనగూళ్ళ వ ♦ డ్డించి మించు, స్వకులరూపశీలంబులు ♦ జగతి మించ.

ఆ॥ ఆమె యతిథులకును ♦ నభ్యాగతులకును, మ్రొక్కి సత్కథలను ♦ ముచ్చటింప
నాలకించుచుండు ♦ నాసమయంబున, నేను గూడఁ బోయి ♦ యెలమితోడ.

క॥ కృష్ణు మహత్త్వము సత్త్వము, విష్ణుత్వము సర్వలోక ♦ విజయిత్వము రో
చిష్ణుత్వము బ్రహ్మాండచ, రిష్ణుత్వముఁ దత్త్వమంటి ♦ రెట్టింపు నుసుల్. ౧౬౨

ఆ॥ ఇట్టులాడ నామె ♦ యిందిరావిభుఁడె నా, ప్రాణనాథుఁడంచు ♦ భావమందు
నిశ్చయించి యతని ♦ నిర్మలగుణములన్, గీర్తనంబుఁ జేసి ♦ కేరి వరుస. ౧౬౩

సీ॥ పెద్దలవద్దకు ♦ నుద్దవిడిన్ వచ్చి, మాటాడు వాడుక ♦ మానఁదొడఁగె
నిమ్మపండులఁ బోలి ♦ నెమ్మది నుబ్బెడి, గబ్బిగుబ్బలఁ బైటఁ ♦ గప్పఁగడఁగెఁ
జెలికత్తియలతోడఁ ♦ జేరి యేకతముగా, ముచ్చటలాడుట ♦ మొదలు పెట్టెఁ
దల్లికిఁ గొలఁదిగాఁ ♦ దనయిచ్చ వెలిగాఁగ, గటివేల్పు గొప్పఁ బ ♦ ల్కంగఁగడఁగె

తే॥ చిన్ని వెన్నుని వన్నెలఁ ♦ జిన్నలెన్ని, యెన్నఁడెన్నఁడు సన్నని ♦ యిన్నడుమును
నొప్పఁ జెప్పఁగాఁ జాలుదు ♦ నొక్కొ? యంచు, మిగుల నువ్విళ్లలూరునో ♦ మేదినీశ!

తే॥ మఱియు నొకపరి శ్రీహరి ♦ దరికి నరిగి, రుక్మిణీకులసౌశీల్య ♦ రూపగుణము
లేను వర్ణింప నాతఁడా ♦ యింతి తనకుఁ, దగిన సతియని యెంచెనో ♦ ధాత్రినాథ!

వ॥ అంత నయ్యనంతాకాంతుం డాత్మీయబంధుసంతానంబుతో నేకాంతంబున మంతనం బొనరించి యనంతకల్యాణగుణగణాకాంతుండును, దైత్యాంతకుండును, భగవంతుండు నగు నిందిరాకాంతునకుం గోటిపూర్ణేందుప్రతీకాశ యగు తన కూఁతునిడి వివాహం బొనర్చునట్లు నిశ్చయించి యుండ యావ రాజ్యాభిషిక్తుం డగు రుక్మి యను జ్యేష్ఠపుత్రుండు భీష్మకుం జూచి తండ్రీ! నీవు నిర్ధారించిన విషయం బన్యాయంబై నాకు వేంద్రంబు దీంద్రంబుగాఁ గల్గించెడి.

సీ॥ ఆకార మెంతుమా ♦ యఖిలజనాసహ్య, కరకృష్ణరూపంబు ♦ గలుగనయ్యె
నన్వయం బెంతుమా ♦ యా యయాతిప్రభు, శప్తగోపాలవం ♦ శంబునయ్యె
సౌశీల్య మెంతుమా ♦ సర్వదూష్యంబైన, తిస్కరించుటయె ప్ర ♦ ధానమయ్యె
వాహనం బెంతుమా ♦ వ జిగజాదులు, గాక ముసలిబొల్లి ♦ గ్రద్దయయ్యె

తే॥ ఆధిపత్యంబు నెంతుమా! ♦ యాల దొరత, నంబె యయ్యె నీ లేకికి ♦ నా చెలియలఁ
త్రిపురసుందరి నీ వెట్లు ♦ కృపను మాని, యిడఁ దలంచితివో యయ్య! ♦ యెఱుఁగఁ జెపుము!

సీ॥ గండు సెలంగని ♦ తిండిపోతే కాక, నీతిమాలిన పాఱుఁ ♦ బోతువాఁడు
కాలకూటధరు సం ♦ గాతకాఁడే కాక, విషధరంబులపైని ♦ వెలుఁగువాఁడు
పుణ్యజనాళి క ♦ పూజనీయుఁడె కాక, యెల్లవారలకును ♦ నల్లిదుండు
గోకులం బందలి ♦ క్రుమ్మరీఁడే కాక, యెల్లచోటులఁ దిర్గు ♦ చిల్లగొండి

తే॥ యైన వీనికి నా సతి ♦ నా సరోజ, నయన నా దివ్యగాత్ర నా ♦ నవ్యచరిత
నా మహాభాగ్యవతి నెట్లు ♦ ప్రేమవిడిచి, యిడఁదలంచితివో యయ్య! ♦ యెఱుఁగఁ జెపుము!

వ॥ అట్టి దిక్కుమాలినవాఁడే యనురూపుండగు వరుండయ్యెనే? ఇఁక వేఱొండు దిక్కులేదే? అక్కటికవాని కిచ్చి పరిణయం బొనరించుటకన్న నన్యంబగు పాతకం బుండునే? కాన నద్దాని మాని చేదిధరాధీశుండును, నవక్రపరాక్రమవిక్రమక్రముండును, మదనరూపుండును, నభిజాతుండును నగు శిశుపాలభూపాలున కిచ్చి పెండ్లి నొనరించి యైహికాముష్మికసుఖంబులం జెందుట సెల్లుం గాదే యని పలుసారులు నెక్కివక్కాణించి యెట్టకేల కాతని నొడంబఱిచె. అవల తద్భీష్మకాదులు తత్పరిణయారంభతత్పరులై యుండుట నక్కన్నియ యెఱింగి తన మనోరథంబు వృథయయ్యెనని వందురుచు నిట్లు చింతించె. ౧౬౯

ఉ॥ ఎన్నిదినాలనుండియొ యుపేంద్రుఁడు భద్రగుణుండు నైన యా
వెన్నుఁడు ప్రాణనాథుఁడని వేమఱుఁ జెందెడి నాదువేడ్కఁ బె
ద్దన్నయ పానకంబునకు నడ్డగు పుల్లవిధాన నడ్డఁ గాఁ
డన్న యితండు దున్నయని యందును సందియమేమి లేనటుల్. ౧౭౦

క॥ ఇంతకు నా ప్రారబ్ధమె, సొంతముగా హేతువగుచు నగుపడుఁ గానీ
యింతట నియ్యది యా శ్రీ,కాంతున కెఱిఁగించువారు గలరే? యిలలోన.

రుక్మిణి బ్రాహ్మణుని ద్వారకకుఁ బంపుట.

మ॥ అని చింతించెడికాలమందుఁ గులధాత్ర్యామర్త్యుఁ డేతెంచ నా
వనితారత్నము గాంచి మ్రొక్కి యిటులన్ బల్కెన్ ధరానిర్జరా!
యనఘా! సర్వవిధంబులన్ హృదయ మా యబ్జాక్షుపై నిల్చెఁ గా
వున నా ద్వారకనుండి యా హరి నిటన్ బొందింప నీవేఁడెదన్. ౧౭౨

క॥ శ్రీపతిపాదారాధక!, యీపనికిం దగినవాఁడ వీవే యని బల్
తోఁపఁగఁ బంపించుటకే, నీపగిదిం గడఁగుచుంటి నేగుమ! వేగన్. ౧౭౩

ఆ॥ అనియుఁ జెప్పఁదగు ర హస్యోక్తు లొకకొన్ని
నుడివి యంపె నంతఁ బుడమివేల్పు
పద్మనాభుఁ జూచు భాగ్యమబ్బె నటంచు
ద్వారకానగరికి వడిగఁ జేరి. ౧౭౪

చ॥ చనిచని కాంచె దీప్తివిల సన్నవరత్నవిరాజమానకాం
చనమయరమ్యహర్మ్యముసు జాలచతుష్పథచత్వరప్రపా
దినిభృతమున్ మదేభరథ దివ్యతురంగమనోజ్ఞమున్ మహో
పవనసహితంబు గోపకవి భాసురమున్ గమలేశవాసమున్. ౧౭౫

ఆ॥ అవల నట్టి విప్రుఁ డచ్యుతు దర్శించి, యర్చఁగొని భుజించి యడిగి కుశల
మొసఁగి దీవెనలను నూరక యుండుటఁ, గనుచు [illegible]

వ॥ దేవా! యీ వసుంధరను విదర్భనామక దేశంబున కధినాథుండై భీష్మకుండను నామంబున నొకఁడుండు. అతనికి రుక్మిణి యనంబరగు నొక కూఁతు రైదుగురుకుఁ జెలియలై కలదు. త్రిపురసుందరి యగు నక్కన్యకామణి యనన్యలావణ్యతారుణ్యపుణ్యచరిత్రాగ్రగణ్యుండవగు నీయందు బద్ధానురాగయై పాణిగ్రహణమహోత్సవప్రశస్తవాచికం బొందు సవినయంబుగా వాచింపుమని నన్నుం బంపించెంగాన విన్నవించెద వినుము. ౧౭౭

శా॥ నిత్యానందమహోదధీ! గుణనిధీ! ♦ నిర్ధూతదంభత్రుధీ!
స్తుత్యామ్నాయసమూహమార్గగపధీ ♦ శూల్యాదిసంస్తవ్యధీ!
దైత్యారాతివితానరక్షణసుధీ! ♦ త్వద్భక్తరాట్ప్రవధీ!
నిత్యంబుగ శుభమబ్బఁగాఁత గొనుమీ! ♦ నేఁజేయు జోహారులన్. ౧౭౮

క॥ నారదమునిచే మును నీ, చారిత్రము వాలకింప ♦ సంపూర్ణముగాఁ
గారణకారణుఁడ వనుచుఁ, బూరితిగాఁ దోఁచఁబడెను ♦ భువనచరిష్ణూ!

క॥ ఇచ్చట నంతయు క్షేమం, బచ్చటి క్షేమాతిశయము ♦ లరుదుగఁ దెలుపన్
హెచ్చుగ వేఁడెద సర్వం, బచ్చుగ నెఱుఁగుదువు కృష్ణ! ♦ యైనను వినుమా!

ఉ॥ నీ మృదుభావ నీ నటన ♦ నీ సుగుణంబులు నీ చరిత్రముల్
నీ మహిమంబు నీ బలము ♦ నీ ఘటనాఘటనప్రసక్తియున్
నీ మహనీయరూపమును ♦ నీ కులగోత్రయశంబు లన్నియున్
క్షేమకరంబు లౌట నిను ♦ జీవితనాథుగఁ గోరితిన్ హరీ! ౧౮౧

ఉ॥ ఓ నరసింహ! సింహమున ♦ కూర్జితమైనటువంటి సొమ్మొదన్
నాన యొకింత లేక యొక ♦ నక్క దురాశను గోరినట్లు బల్
హీనగుణుండు చేదిధర ♦ ణీశ్వరుఁడీ భవదర్థమౌ నను
బూనికఁ బెండ్లిఁ జేసికొని ♦ పోవఁదలంచెడి దాన శ్రీధరా! ౧౮౨

ఉ॥ రమ్మనిఁ జేదినాయకజ ♦ రాతనయప్రముఖారివార మం
తమ్మునరించి రాక్షసవి ♦ ధానముగాఁ గొనిపోయి నన్ను యు
క్తమ్ముగఁ బెండ్లియాడి మఱిఁ ♦ దావకభర్మవికారచారుహ
ర్మ్యమ్ముల సర్వసౌఖ్యముల ♦ రంజిలఁజేయు మనన్యధన్యఁగాన్. ౧౮౩

తే॥ అంతిపురమందు నుంట నీ ♦ యబల నాకుఁ,జిక్కదని సందియంబును ♦ జెందవలదు.
దాని కొక యుపాయం బెదఁ ♦ దలఁచియుంటి,నద్ది వలికెద శ్రీహరీ! ♦ యవధరింపు.

ఉ॥ ఎల్లి యనన్ వివాహమహ ♦ మేఁ గులదైవతయాత్రఁ జేసి రం
జిల్లుచు నూరిబైట నివ ♦ సించు భవాని కొనర్తుఁ బూజ న
ప్డల్లన నీవు వచ్చి మన ♦ సారఁగ నన్ గొనిపొమ్ము వచ్చొదన్
ఫుల్లసరోజలోచన! య ♦ మోఘపరాక్రమవిక్రమక్రమా! ౧౮౪

క॥ రమ్మా! త్వర ననుఁగొన ర,రమ్మా! జగడంబు దుష్క ♦ రమ్మా! బహు దూ
రమ్మా! తత్సమయము వై,రమ్మా! నాథయిని నీకు ♦ రాజీవాక్షా! ౧౮౬

శ్రీకృష్ణుండు రథారూఢుండై కుండినపురికిఁ జనుట.

మ॥ అని యా రుక్మిణిభావ మాద్విజవరుం ♦ డాడంగ శ్రీకృష్ణుఁ డ
ల్లన దిక్కుల్ వెలుఁగంగ నవ్వుచు నిటు ♦ ల్వాక్రుచ్చె నీ పల్కులన్
వినియుంటిన్ జెవులార నా లలనపైఁ ♦ బ్రేమంబు నాకెక్కుడా
టను నిద్రించుటగూడ లేదు నిశలన్ ♦ డక్కుందు లేదో బుధా! ౧౮౭

క॥ కావున నీవడిగినపని, కేవనునొనరింతు నంచుఁ ♦ డెక్కన రథమున్
శ్రీవిని సిద్ధ మొనర్పఁగ, నావేళను దారుకునకు ♦ నాజ్ఞాపింపన్. ౧౮౮

సీ॥ ఘణఘణాత్కారోరు ♦ ఘంటికాయుక్తంబు, రత్నరాజిప్రభా ♦ రాజితంబు
స్వర్ణకుంభత్కుంభ ♦ సంచయరుచిరంబుఁ, బుష్పమాలాపాళి ♦ భూషితంబు
శస్త్రాస్త్రకరవాల ♦ జాలసంపన్నంబు, వరుణసహస్రదీ ♦ వ్యద్భుతంబు
భక్తలోకావాస ♦ వైకుంఠనిర్మితం, బుత్తమోత్తమము మ ♦ హోచ్ఛ్రితంబు

తే॥ శైబ్యసుగ్రీవమేఘపు ♦ ష్పకవలాహ, కాశ్వబద్ధంబు శుద్ధంబు ♦ వార్షదంబు
ఛత్రచామరయుతముగా ♦ స్యందనంబు, దెచ్చి నిలిపె దారుకుఁడు త ♦ ద్దేవు నెదుట. ౧౮౯

చ॥ నిలిచిన తేరుఁగాంచి హరి ♦ నెక్కొని సారథిమూఁపునందు ని
ర్మలనిజపాదపద్మములు ♦ రాజిల నెక్కి స్వహస్తమిచ్చి డా
పల ద్విజు నెక్కఁజేసి నిశ ♦ పారము ముట్టకకాలమందుఁ జం
చలగతితోఁ జనం గడఁగె ♦ సాహసధైర్యనిబద్ధబుద్ధియై. ౧౯౦

ఆ॥ అంత రేవతీశుఁ ♦ డచ్యుతుఁ డొంటిగాఁ, గన్యకార్థ మేగు ♦ గమనిక విని
కలివిశంకితుఁడయి ♦ బలమైన సేనతో, నరిగెఁ గృష్ణువెంట ♦ నరుల నణఁచ. ౧౯౧

తే॥ అటుల వెడలి రమేశ్వరుఁ ♦ డబ్ధిశైల, నగరజనపదవనములు ♦ దిగువగాగ
వచ్చి యా విదర్భాంతర ♦ భాసమాన, కుండినోపవనంబున ♦ కు వరుదెంచి. ౧౯౨

వ॥ పంచాశద్ధస్తమానాధికోన్నతప్రశస్తంబగు ప్రాకారంబును, ధనుశ్శత సహితంబును, విస్తృతంబును, దుర్లంఘ్యంబును, దుర్గమంబును నై చాతుర్మాస్య తరంగిణీకరణిం బయఃపరిపూర్ణంబునై యున్న ఖేయంబును, గూజద్వనప్రియశోక మరాళశారికాకీరపారావతాది విచిత్రవిహంగపతనానుకూలహేమకుంభధ్వజతోరణం బులును గలధౌతమయసౌధరాజంబులును, సప్తదశయోజనపరిమితంబగు వర్తులంబునుం గల్గి వెల్గు కుండినపురవరంబును గాంచుచు సహాసీనుండగు నద్ధరామరుం బనిచి యంత ౧౯౩

క॥ కాంతాసంగ్రహణాత్మక, చింతకు ననువైన యొక్క ♦ చింతకు దిగువన్
సంతసమున విడి హయముల, మంతనముం జేయుచుండె ♦ మనమున జనకా!

ఆ॥ పిదప భీష్మకుండు ♦ స్వీయసుతఁ శిశు,పాలున కిడుదు నని ♦ పలికి పట్ట
ణంబు నంత మండ ♦ నం బొనరింపఁగా, నాజ్ఞ జేసె సేవ ♦ కాళి కపుడు. ౧౯౫

సీ॥ కోటలు పేటలు ♦ గొందులు వాడలు, గోపురకూటంబులు ♦ గోమరుమిగిలె
మిన్ను ముద్దాడెడి ♦ మేడల గోడలు, చిత్తరువులతోడఁ ♦ జెలఁగుచుండె
దట్టంబు లైనట్టి ♦ ద్వారబంధంములు, తోరణంబుల తోడ ♦ సొరుమీఱెఁ
దకతకధిమిధిమిం ♦ ధైతక్క యను వార,భామల యాటల ♦ వారిఁబ్రబలె

తే॥ మంగళప్రదతూర్యముల్ ♦ మాటి మాటి
కిని మొఱయుచుండెఁ బూరుషు ♦ లును వనితలు
నవపటంబుల భూషల ♦ నవ్యపుష్ప
హారములఁ దేజరిల్లి రా ♦ యూర ధీర! ౧౯౬

వ॥ అంత నక్కన్యకామతల్లికను జిరత్నార్జితామూల్యరత్నంబులచే నిర్మింపఁబడిన కల్యాణమండపంబున మంగళగీతవాద్యంబులు మ్రోఁగుచుండ సిద్ధులు భూదేవిం జుట్టినట్లు సువాసినులు పరివేష్టించి పన్నీట జలకం బాడించి పరిమళద్రవ్యంబుల ధూపంబు లిడి చందనాదులం బూసి పుష్పదామంబుల వేసి దివ్యాంబరాభరణంబుల నలంకరించి తోడ్కొని రా శ్రుతిచతుష్టయపారంగతులగు బ్రాహ్మణవరులు విఘ్నేశ్వరపుణ్యాహవాచనాదిశాంతికర్మంబులం జరిపి రక్షాబంధనముహూర్తంబు గావింపం గన్యాదాత యగు భీష్మకుం డేతెంచి లక్షబారువుల బంగారంబును దద్ద్విగుణంబుగా ముత్యంబులను సహస్రభారవస్త్రంబులను బదివేలతోడవులను నాఱర్బుదంబుల గోవులను నయుతగజంబులను దశలక్షరథంబులను దశకోటితురంగంబులను గుడతిలపర్వతంబులను సహస్రసువర్ణపత్రంబులను నాబ్రాహ్మణపుంగవులకు వందనపూర్వకంబుగా నిడి వరనిరీక్షణంబు గావించునెడ,

క॥ దమఘోషుఁడు తన తనయునిఁ, గ్రమ మొప్పఁగ ధాత్రిసురులు ♦ రక్షను జేయన్
సుమహారాంబరభూషల, నమితముగ నలంకరించి ♦ యాచారవిధిన్. ౧౯౭

ఉ॥ మంగళగీతవాద్యము ల ♦ మందముగా మొఱయన్ లతాంగులు
న్మంగళహారతుల్ గొన ఘ ♦ నంబుగఁ బెండ్లికుమారు సల్పి మా
తంగము నెక్కఁజేసి యమి ♦ తస్వకపౌండ్రజరాసుతాదిసే
నాంగసుసంగతుండయి ప్ర ♦ యాణ మొనర్చె విదర్భకో విభూ! ౧౯౮

ఆ॥ అట్లు పోవునప్పు ♦ డా శిశుపాలుని, నెచ్చెలులగు ♦ క్షోణినేత లెట్లొ
కృష్ణయత్న మాల ♦ కించి స్వమిత్రునిఁ, గావఁ జనిరి మొనలఁ ♦ గలిగి యవల.

మ॥ వరబంధ్వాప్తులతో సువాసినులతో ♦ వారాంగనాశ్రేణితో
ధరణీదేవులతో గజావళులతో ♦ ద్రాఘిష్ఠసైన్యంబుతో

శరసంతానముతో రథాశ్వములతో ♦ సామంతలోకంబుతో
నరుదానట్లు వరుండు వచ్చుట విద ♦ ర్భాధీశుఁ డాలించి తాఁ. ౨౦౧

క॥ ఘనముగఁ బ్రత్యుత్థానముఁ, బొనరిచి పూజించి వస్త్ర ♦ ముల నిడి వరువా
రిని శుభకరగృహములలో, నునికిని సల్పంగఁ జేసె ♦ నుర్వీనాథా! ౨౦౨

ఆ॥ ఇట్టికాలమందు ♦ నట్టిరుక్మిణియును, గాంచి యచ్యుతుండు ♦ గదియఁ డంచుఁ
గరము శంకితయయి ♦ కమలాక్షుపదముల, నిలిపి యిట్టులెంచె ♦ నెమ్మనమున.

రుక్మిణి కృష్ణునికై నిరీక్షించి చింతించుట.

శా॥ మూర్తం బెల్లి కరగ్రహంబు గదిసెఁ ♦ భూదేవతల్ వచ్చి రా
యార్తత్రాణపరాయణుండు హరి యే ♦ లా యిందు రాఁడో? మనం
బార్తిఁ గుందెడి మన్మనోరథతతుల్ ♦ వ్యర్థంబు లౌనో? ఫల
స్ఫూర్తిం జెందునొ? యిట్టివేళ విధి యే ♦ బుద్ధిఁ గటాక్షించునో? ౨౦౩

మ॥ ధరణీదేవుఁడు సాగెనో? పథమునన్ ♦ దైవాఱెనో? చేరెనో?
హరి దర్శించెను? యీపనిన్ దెలిపెనో? ♦ యాలించి యా కృష్ణుఁడున్
సరిగాదంచుఁ దలంచెనో? యిటకుఁ గాం ♦ క్షన్ వచ్చెనో? కాళియున్
కరుణన్ బర్వెనొ? లేదొ నాదయిన భా ♦ గ్యంబెన్న నెట్లున్నదో? ౨౦౪

మ॥ శిశుపాలుండు తదీయసైన్యములతోఁ ♦ జేరెంగదా వీటిలో
విశయాభావమనస్కులై జనకుఁడున్ ♦ బెద్దన్న యవ్వానికే
వశఁగాఁ బెండ్లి నొనర్చిలీరుదురుగా ♦ పద్మాక్షుఁ డేతెంచఁడే?
యశుభంబో శుభమో యెదో నుడువు ధీ ♦ రాగ్రేసరుల్ లేరుగా! ౨౦౫

మ॥ ప్రతికూలించెను నంతరాయగిరిరా ♦ ట్పాదాగ్రభవిఘ్నేశుఁడున్
బ్రతికూలించెను లోకశంకరకృతి ♦ ప్రష్ఠుండు గౌరీశుఁడున్
బ్రతికూలించెను సర్వలోకసృజన ♦ ప్రాజ్ఞుండు వాణీశుఁడున్
బ్రతికూలించెను గోధరామరతతుల్ ♦ ప్రారబ్ధ మిట్లుండెఁగా. ౨౦౬

క॥ ఏదిచేయను? నెదిమానను?, నెది దిక్కటుపోవనగును?♦యెందుండఁదగున్?
సదయుం డభయప్రదుఁడును, విదితుఁడునగు చక్రి యిటకు♦వే రాఁడుగదా.

క॥ అని చింతించుచు బలుమఱు, వనజాక్షుఁడు వచ్చెననుచు ♦ భవనాట్టము నె
క్కను గనుఁ గ్రమ్మఱుఁ గ్రుమ్మఱుఁ, జను వచ్చును మిన్నకుండు ♦ సైపక వగచున్.

ఉ॥ కట్టదు మేల్మిచీరఁ బాడఁ ♦ గట్టదు తల్లికిఁ దండ్రికిం దలన్
గట్టదు మంచిపూల్ నడుముఁ ♦ గట్టదు మేలిమిరాంచిచేఁ జెవిం
బెట్టదు కీరనాదములఁ ♦ బెట్టదు నోటను బట్టడన్నమున్
బెట్టదు కస్తురిన్ నొసలఁ ♦ బెట్టదు స్వర్ణవికారభూషలన్. ౨౧౦

ఉ॥ చూడదు దర్పణంబు సరి ♦ చూడదు నెచ్చెలురాండ్ర మోములన్
జూడదు పెండ్లివింతలను ♦ జూడదు స్వీయశరీరసౌఖ్యముల్
బాడదు దివ్యగాత్రమునఁ ♦ బాడదు వల్లకిపూర్వకంబుగా
నాడదు మాటలేవియును ♦ నాహరిపైఁగల కూర్మి యెట్టిదో. ౨౧౧

తే॥ ఇటులఁ గృష్ణురాకను నిరీ♦క్షించు భీష్మ,కాత్మజకుఁ బ్రతిభామణం♦బాడ ననఁగ
వామపార్శ్వంబు కంపింప ♦ భైష్మి యలరి,తిరుగుచుండఁగ నావిప్రుఁ ♦ డరుగుదెంచి.

ఉ॥ అమ్మ! ఫలించె నీతలఁపు ♦ లాహరి నాకనులారఁ గాంచితో
గ్యమ్మగు పూజలొంది మన ♦ సారఁగ నీ శుభవాచికమ్ము స
ర్వమ్మును జెప్పి నీసుగుణ ♦ రాజిని వర్ణనజేయ నాతఁడున్
సమ్మదమొంది యీపురికి ♦ సాగి త్రుటిం జనుదెంచె రుక్మిణీ! ౨౧౩

చ॥ అనవుడురుక్మిణీతరుణి ♦ యగ్రజవర్య! మదీయసూక్తులన్
విని చని ద్వారకాపురికి ♦ వెన్నుని దోడ్కొని వచ్చియుంటి వీ
పని కుపకారమున్ దగిన ♦ పాటిది యేదియు లేదు గాన వం
దనము లొనర్తుఁ గైకొనుమి! ♦ ధన్యచరిత్రను నైతి నీకృపన్. ౨౧౪

వ॥ అంత నద్ధరామరుండు సంతుష్టహృదయంబుతో నిట్లనియె. ౨౧౫

మ॥ తరళాక్షీ! ధనధాన్యహేమమణిసౌ ♦ ధజ్యాదులన్ మించి త
త్పరమేష్ఠిప్రమథాధిపేంద్రముఖదే ♦ వశ్రేణియోగీంద్రదు
ష్కరమై సౌఖ్యదమై యఘౌఘగిరివ ♦ జ్రంబై శుభంబైన త
ద్ధరిసందర్శనభాషణాదిధన మి ♦ ష్టబ్బెన్ గదా నీపనిన్. ౨౧౬

ఆ॥ ఇంతకంటె నాకు ♦ నేమి గావలె నమ్మ!, స్వర్ణముఖపదార్థ ♦ చయము దిరమె?
స్థిరను సంబరమున ♦ దీర్ఘసుమంగలి, వగుచు మనుమ! మరువ ♦ కమ్మ! నన్ను.

ఉ॥ ఆవల భీష్మకుండు నుప ♦ యామముఁ జూడఁగ రామకృష్ణులన్
దేవులు వచ్చిరం చవని ♦ దేవముఖంబున వించు నర్ఘ్యపూ
జావిహితార్థసంచయము ♦ జక్కని కానికలం గ్రహించి తూ
ర్యావళి మ్రోయ విందులు న♦యంబున వెన్కొనఁ జేరి వారిని̂న్. ౨౧౮

తే॥ అర్ఘ్యపాద్యము లిడి ♦ యర్చించి రత్నాంబ, రాభరణము లిచ్చి ♦ యరరె! వీని
"శామె నిడక పోతి" ♦ నంచు నానంద వ, నమున విడిదిఁ జూపి ♦ నతులిడి చనె.

వ॥ అంతఁ గర్ణాకర్ణికగాఁ బౌరజనం బా శౌరి చేరిక విని యానందవనంబున కరిగి యా నందనందనసుందరవదనారవిందామృతంబు నమందంబుగా నిజనయనాంజలులతోఁ గ్రోలుచుఁ బరమానందంబుఁ బొంది యిట్లనిరి. ౨౨౦

చ॥ తగిన మనోహరుం డితఁడు ♦ తాదృశరుక్మిణి కామె భార్యగాఁ
దగినది యీ మహాత్మునకు ♦ దంపతిభావము వీరి నిద్దఱిం

దగుల్లఁగఁ జేయఁ బూర్వసుకృ ♦ తంబుల ధాతకు ధార పోతు మీ
జగమ్మున నిట్టి రూపసియు ♦ సద్గుణి యుండునె ? తిర్గి చూచినన్. ౨౨౧

ఉ॥ ఎప్పుడు మావిదర్భధర ♦ ణీశునఁ కీపుసుఁ డల్లుఁడౌనో యిం
కెప్పుడు తద్గృహాంబునకు ♦ నీ కమలేక్షణుఁ డేగుదెంచునో
యెప్పుడు కన్నులార నట ♦ నీ కమలావ్యాదయేశుఁ గాంతుమో
యప్పుడుగాదె మా జనులు ♦ సార్థకమౌ వృథయౌను గానిచోన్. ౨౨౨

వ॥ ఇట్లు పరస్పరం బాడుకొను సమయంబున. ౨౨౩

రుక్మిణి కులదేవతాపూజకై బయలుదేరుట.

సీ॥ వందిమాగధులు కై ♦ వారంబులం జేయ, వివిధతూర్యంబులు ♦ దవిలి మ్రోయఁ
గమనీయరాగముల్ ♦ గాయకులుఁ బాడ, వారాంగనామణుల్ ♦ బలిసియాడ
నర్జునచ్ఛత్రాదు ♦ లనుజీవులుం బట్టఁ, జుట్టముల్ ప్రీతితోఁ ♦ జుట్టుముట్ట
మంగళారతులతో ♦ మానినుల్ సనుదెంచ, నాత్మీయచేటిక ♦ లరుగుదెంచ

తే॥ నలుగడల జయశబ్దముల్ ♦ సెలఁగ ద్విరద, తురగరథరథియోధులు ♦ దూరముగను
భద్రముగఁ జూడ నగరున ♦ భైష్మి వెడలి, గిరిజ నర్చింప నేతెంచె ♦ హరిహృతమతి.

ఆ॥ అతుల నామె వచ్చి ♦ యాలయస్థితదేవి, పాదపద్మములకు ♦ బాఢభక్తి
శిరము ధరణినంటఁ ♦ జేసి నమస్కృతు, లిటుల వేఁడఁదొడఁగె ♦ నెలమియెసఁగ.

ఉ॥ అంబ ! మదంబ ! సర్వజగ ♦ దంబ ! గజాస్యషడాననాంబ ! త
ర్యంబరవైరివైరికుల ♦ సాధ్వమణీ ! భవరోగహారిణీ !
కంబుగళా ! భవాని ! యధి ♦ కంబుగ నమ్మిచు మ్రొక్కుచుంటి హ
ర్షంబు ఘటిల్ల నన్ను హరి ♦ రాణిగఁ జేయు మభీష్టదాయినీ ! ౨౨౬

వ॥ అని ప్రార్థించుట సకియ లాలించి చెలీ ! యా కృష్ణనామంబుఁ బలుక వలదు. శిశుపాలుం డుద్దిష్టుండగు వరుండు. కాన నతని నామం బుచ్చారణార్హం బని వక్కాణింప ధిక్కరించి యక్కన్యకాలలామ నెక్కొని క్రమ్మఱ నక్కమలాక్షుండే భర్త యగు నట్లు కావింపుమని యా శర్వాణిం బ్రార్థించి గంధాక్షత పుష్పధూపదీపాపూపతాంబూలనీరాజనాదు లొసంగి యర్చించి భూషణంబు లర్పించి భూసురతరుణీమణులకును, దక్కంగల సాధ్వులకును బూజించి మ్రొక్క నవ్వార లిట్లు దీవించిరి. ౨౨౭

సీ॥ శతరూపఁబోలిన ♦ సౌందర్యమమరుత, జానకివలె నోర్పు ♦ సంఘటిలుత
వాణితోఁ దీటగు ♦ వాణియు గల్గుత, శివవలె శీలంబుఁ ♦ జెలఁగుఁగాక
వనమాలిభక్తాభ ♦ పతిభక్తి యలరుత, శచివలె భోగముల్ ♦ సంభవిలుత
లక్ష్మినిబోలి క ♦ ళానిధివగుఁగాత, దక్షిణఁబోలు ము ♦ త్తైదు వగుత

తే॥ మఱి యరుంధతికోడ సమానమైన, భర్తృశుశ్రూషణాసక్తి ప్రబలుఁగాత
గోర్కెలీరికలెత్తఁగా నొప్పువాసి, గలుగ మనుమమ్మ! రుక్మిణీ! లలితచరిత!

చ॥ పిదప విదర్భరాజసుత వీడి మునివ్రత మార్గఁ గ్రమ్మఱన్
సదయకు నీశ్వరప్రియకుఁ జాఁగిలి మ్రొక్కి ధరామరాంగనా
పదములకున్ నతుల్ సలిపి బంధుసఖీపరివారపంక్తితోఁ
గదలెను దద్గృహంబు విడి గంధగజేంద్రసమానయానయై. ౨౨౯

తే॥ కోటిచంద్రప్రతీకాశకుందరదన, బద్మనయనను భైష్మిఁ డబ్బాటుగాను
సునిధి నిర్ధనుల్ గనినట్లు శూరులైన, కరిహయారోహకరథులుఁ గాంచి యపుడు.

చ॥ అడలిరి సూచినందులకు హర్షముఁ జెందిరి నెమ్మనంబులం
దుడిగిరి సర్వచేష్టలను నూడ్చిరి మానగభీరిమాధృతుల్
విడిచిరి సేతిశూపులను వీడిరి రథ్యకనద్రథాలఁ గ
న్పడిరి కరమ్ము గోడపయి వ్రాసిన బొమ్మలకైవడిన్ విభూ! ౨౩౦

తే॥ మఱియు స్వీయదేహంబును మరచి నేల, వ్రాలి రట్టి వైదర్భి రూపప్రకాశ
హాసన లజ్జా కటాక్షంబు లనెడి కామ, బాణములచేత దెబ్బలఁ బడుచు వారు.

తే॥ ఇట్టు లిల వ్రాలు రాజుల నట్టి భీష్మకసుత క్రీగంటఁ జూచుచుఁ గాలినడక
నల్లనల్లన నడచుచు నాత్మచిత్త, గతమనోరథప్రాప్తంబు గలుగుచుండ.

శా॥ వీక్షన్ గాంచెను గౌస్తుభోజ్జ్వలితునిన్ బీతాంబరున్ వీరునిన్
శ్రీకారుణ్యపయోధినిన్ గుణనిధిన్ శీలిన్ జగన్మోహనున్
రాకాపూర్ణసుధాకరాస్యరుచిరున్ రాజీవపత్రేక్షణున్
శ్రీకృష్ణున్ బహుభూషణాన్వితు లస జ్జీమూతవర్ణాభునిన్. ౨౩౪

తే॥ కాంచి తద్రూపరుచిచమత్కార శూర
తా గభీరిమాప్రాయముల్ దలఁచి యామె
యిప్పుడా హరి ననుఁగొని యేగినఁ గడు
బాగుగా నుండునని యెంచు చట్టునందు. ౨౩౫

శ్రీకృష్ణ విజయము.

వ॥ ఘంటామంజీరమంజులనాదసమన్వితంబును, మంగళకరోత్తుంగసంగతంబు నగు నరదంబును, వాయువేగంబుతో సారథి యగు దారుకుండు ద్రోలఁ బార్థసారథి నిజయోధయూధసంఘట్టనంబునఁ బరిపంథులగు జరాసంధాదివసుంధరాధినాథుల వరూధినులను ఝుంఝూమారుతంబు నీరజవనంబును భంగంబు గావించినట్లు భేదించుచు విహగేంద్రుం డమరావతిస్థితనందనవనంబున కరిగి యమృతంబుఁ గొని చనుదెంచి నట్లా స్త్రీకదంబంబునం జొరఁబడి పసగల పసిడిపసిమిని మిసమిస

లాడు నా సుందరిని సంగ్రహించుకొని ప్రతిద్వంద్వికర్ణకఠోరం బగు శార్ఙ్గంబుఁ డంకారం బెడనెడఁ గావించి దేవదుందుభిబృందంబు శబ్దింప యదుదుందుభులు మ్రోయఁ గిన్నరకింపురుషచారణవిద్యాధరగంధర్వాప్సరోజనంబులు లాస్యంబు సల్పి పూలవానం గురియ జయజయారావంబులు దశదిశలం జెలరేగఁ దవస్యందనంబున నిడికొని సృగాలజాలమధ్యంబునుండి సింహం బాహారంబుఁ గొనివచ్చిన భంగిం జనుదెంచి యాదవధ్వజిని ముందు నడువ బలభద్రుండు తోడుగా రా ద్వారకాపురమార్గంబుఁ బట్టి యరిగె. అంత నాస్థలంబునఁ గోలాహలం బుప్పతిల్లుట జరాసంధాదిరాజు లాలించి యోర్వజాలక ౧౩౬

ఉ॥ క్షుద్రసృగాలజాతి నని ♦ గొప్పమృగేంద్రుఁడు కీర్తిఁగొంచు బల్
భద్రముఁ జెందినట్లు యదు ♦ వంశజు లీ మనవాసిఁ గోడ న
చ్ఛిద్రముగా విదర్భసుతఁ ♦ జేకొనిపోయి రిఁకేల జన్మముల్
నిద్రలఁ బోతిమో బలము ♦ నీరసమయ్యెనొ విండ్లు గాల్పనో. ౧౩౭

వ॥ అని పరస్పరం బుద్బోధించుకొని యాఁడెడి నామురులవీడి క్రోధపరులై శస్త్రాస్త్రంబులం దాల్చి తనుత్రాణంబులను ధరించి రథంబుల నధిష్ఠించి చతురంగ బలంబులంగూడి యాదవులతో యుద్ధం బొనరింప సన్నద్ధులై యుద్ధతిం జని పౌండ్రకుండు రెం డక్షౌహిణులవాహినితోడను, విదూరథుండు మూఁ డక్షౌహిణుల దండుతోడను, దంతవక్త్రుం డేనక్షౌహిణుల మొనతోడను, శాల్వుండు మూఁ డక్షౌహిణులమూఁకతోడను, జరాసంధుండు పదియక్షౌహిణుల పౌఁజుతోడను, మఱియుఁ దక్కుంగల రాజులు దమకుఁ దగిన సైన్యంబులతో హరిసమ్ముఖంబున కరిగి యహంకారంబున హుంకరించి ధిక్కరించి నిలు నిలుఁ డని హెచ్చరించి నిజచాపంబులను మాటిమాటికిఁ డంకరించి సంగరరంగం బంధకారబంధురంబుగాఁ బ్రయోగింప నయ్యాదవు లా[illegible]యరాతిబలప్రళయజలధిం దరింప దివ్యపోతప్రాయులై చనుదెంచి తృణీకరించి రండు పోరాడుఁడని కొల్లలఁ జేసి మార్కొను సమయంబున నా చంచలాక్షి గాంచి భీతమృగేక్షణయై నిబ్బితిప్రబ్బుకొన నిబ్బరించుకొనుచు నబ్బలానుజానానంబు విలోకింప నా మహామహుండు ౧౩౮

క॥ చెలిరో ! యడలెద వేలా ?, యలఘుతరాభీరబలము ♦ లదిగో శస్త్రా
దులతోఁ బౌరుషములతోఁ, దలపడె నీక ప్రమందఁగలవు ♦ తదరిధ్వజినుల్.

వ॥ అని భయంబుదీర్చి విలాసంబుగఁ జూచుచుండ బలభద్రుండు ప్రళయరుద్రుమాడ్కిం గ్రుద్ధుండై హలముసలగదాద్యాయుధంబులం దాల్చి సేనానియై ప్రోవ యాదవబలంబు లహంకరించి హుంకరించి భేరీభాంకారశంఖసీటంకారపస్వాణ ధణధణాత్కార శతాంగనేమిపటపటాత్కార కుంభిఘీంకారాభరణఝుణఝుణాత్కార కింకిణీకిణకిణాత్కార రథ్యఘంటాఘణఘణాత్కార వివిధక్రేంకారంబులతో నుత్స

హించి యెదిరించి మత్సరగ్రస్తులగు నరాతిసైన్యపదాతివ్రాతంబుల నమ్ములం
గ్రుమ్మియు విండ్లను వేసియు గదలం బాఁదియు ముద్గరంబుల మోఁదియు
ముసలంబులం జదుపుచుఁ గత్తులం జించుచు శూలంబులఁ వంచించుచు
నడిదంబుల నడఁచుచుఁ గుఠారంబుల భేదించుచుఁ గుంతంబులఁ గ్రుచ్చుచు సురియల
నఱకుచుఁ బట్టిసంబులం బ్రద్దలు సేయుచుఁ బరిఘులం జిమ్ముచు ముష్టులను మొట్టుచుఁ
గాళ్ళం దన్నుచుఁ జేతులం ద్రిప్పుచు రథరథ్యసమరపరికరసహితంబుగా ధ్వంసం
బొనరించుచుండ బ్రహ్మాండనాయకుండగు శ్రీకృష్ణుండు వైరివీరమహారణ్యంబున
దావవిధంబునం జొరఁబడి బాణకృపాణచక్రగదాద్యాయుధంబులతో విభిన్నంబుగా
నూరువులు వేఱువేఱుగాఁ జేతులు చిందరవందరగాఁ బార్శ్వంబులు పాడుగా దంతం
బులు విశ్లథంబులుగాఁ గవచంబులు విశీర్ణంబులుగా వక్త్రంబులు వక్రంబులుగా
నంగంబులు వికలంబులుగా దేహంబులు రక్తమయంబులుగా రథంబులు చూర్ణంబు
లుగా రథ్యంబులం గూల్చి రథికుల నుఱుమాడి పతాకలం జించి పరివారంబులం
బలాయితులం జేసి యుల్లంబునం బెల్లుగ నుల్లాసంబు నిండ జగదేకవీరుండని బృందా
రకు లగ్గింపఁ బ్రవర్తిల్లుచున్న సమయంబున మహాబలుండగు శాల్వుండు కని కినిసి
యనిమొనకుం జని నిజగదావిద్యాధన్యతఁ జూపఱ కద్భుతంబుగా గదతో నగ్గదినిం
బ్రహరింప నా గదాగ్రజుండు తద్గదావిద్ధుండై మూర్ఛిల్లియుఁ గ్రమ్మఱ లేచి
ధనుర్యుద్ధం బాపి లక్షభారసమన్వితంబును, గౌమోదకీసమంబును మహత్తరంబు
నగు గదను నిజాగ్రజన్ముం డందఁ జేయ గ్రహించి జంభభేది జృంభించి దంభోళితో
మహీధ్రంబులం గొట్టినట్లా శాల్వునిం బ్రహరింప నతండు తత్ప్రహారబాధితుండై
శస్త్రహతంబైన వృక్షంబుమాడ్కి నేలం గూలుట బౌండ్రకజరాసంధదంతవక్ర
విదూరథులను నలువురు వీరు లేతెంచి పోరాడం గడంగి రందుఁ బౌండ్రకుండు
కువాక్యంబులచే మైత్రి నశింపఁ జేసినట్లు దశవిశిఖమ్ములఁ దద్గరుడధ్వజంబుఁ ద్రుంచె.
దంతవక్రుండు నిజగదాఘాతంబునఁ గఱ్ఱతో ఘటంబుల భంగంబు జేసినట్లు తద్రథం
బును జూర్ణం బొనరించె. జరాసంధుండు తత్తురంగంబులం గూల్చె. విదూరథుండు
తత్సారథిం బ్రహరించె. అంత రేవతీకాంతుం డాగతుండై కల్పాంతకృతాంత
సన్నిభుండై ముసలంబుంగొని హేరాళకరాళవక్త్రవిశాలుండగు దంతవక్త్రుని
మూర్ధంబునం బాఁది యాతండు వక్రంబగు మొగంబుతోఁ బాటు దంతంబులు వంక
రగా నిజానుజన్ముండు రుక్మిణీసహితంబుగా హసింప నేలంగూలం జేసి జరాసంధ
విదూరథపౌండ్రకులను విరామంబు లేనిమాడ్కి ముసలంబునం గసిదీఱ మోఁద
నమ్మువ్వురు నొచ్చి రక్తసిక్తాంగులై సొమ్మసిల్లిరి. వెండియుఁ దత్సైన్యంబు లేతేర
బలుండు గాంచి యాగ్రహించి హలంబున నొక్కమా ఱాకర్షించి ముసలంబునం
దశయోజనపర్యంతంబును రథిరథకరితురగపదాతిచ్ఛత్రచామరంబులు హతంబులై

నిండం బ్రహరించి జగజ్జేగీయమానుండయ్యె. అంత జరాసంధాదిరాజులు మూర్ఛ
దేఱి నష్టోత్సవులగుటయకాక మరణావశిష్టులై నోట నురువులు గ్రమ్మ వరదలై
పాఱ రోజుచు నాలిం గోలుపోయినవానిలీలను, బెన్నిధిం బోఁగొట్టుకొన్న
మానిసిచందంబునను, నేలకు మొగంబు వేసికొని యమితంబుగా విచారపడుచుండు
శిశుపాలుం గాంచి శత్రుహతుండవుకాక బ్రతికితివిగదా యని సంతోషించి
యతని కిట్లు పల్కఁ దొడంగిరి. ౨౪౦

తే॥ పురుషశార్దూల! కలుషంబుఁ బొందవలదు, బ్రతికియుండినఁ బెక్కురు సతులు నీకు
గాఁగలరు మఱి మనకిది కష్టకాల, మందునం గాల మొకకొంత యరుగఁదగును.

క॥ చేపే ద్వారక కరుగుచుఁ, గోపంబున సర్వగోప కుల నల సీరి
గోపాలకృష్ణుఁ జంపెదఁ, దాపం బడఁగంగ నీకు ధైర్యము గొమ్మా! ౨౪౨

తే॥ అట్లు మిత్రసంబోధితుఁ డగుచుఁ జైద్యుఁ
డాత్మచంద్రికాపురమున కరిగె నంతఁ
బౌండ్రకాదులు దమతమ వాసములకుఁ
జనిరి చావఁగ మిగిలిన చమువుఁ గూడి. ౨౪౩

రుక్మి కృష్ణుని వెంబడించి పోరుట.

చ॥ చెలియల సంగ్రహించుటయు స్నిహితబంధుపరాభవంబుఁ జా
రులవలనన్ జెవిం బడఁగ రుక్మి యనంబడు భీష్మకాత్మజుం
డలఘుబలుండు క్రుద్ధుఁడయి యా యని మీసలఁ ద్రిప్పి యిట్టులన్
బలికెను భూభుజుల్ సఖులు బందుగులున్ వినుచుండ భూపతీ! ౨౪౪

తే॥ సమరమందున శ్రీకృష్ణుఁ జంపి నాదు, చెలియలగు రుక్మిణిన్ గొని చేరనేని
సకలభోగాస్పదంబును సౌఖ్యకరము, నైన యీకుండినపురికి నేను రాను.

వ॥ అని శపథం బొనరించి దివ్యంబగు వర్మంబును, ఘనంబు నంబుదనిర్మి
తంబు సింధుదేశజనితంబు నగు శిరస్త్రాణంబు సౌవీరదేశభవంబగు చాపంబును,
కాళిలాటదేశసంజనితం బగు నిషుధిద్వయంబును, మ్లేచ్ఛదేశసమార్జితం బగు
ఖడ్గంబును, గౌటజంబగు చర్మంబును నేరరీయం బగు మహాశక్తిని ఘూర్జరరాష్ట్రో
ద్భవంబగు గదను, వంగజం బగు పరిఘంబును, గొంకణాం బగు హస్తత్రాణ
గోధాంగుళిత్రాణంబులను ధరించి కిరీటాంగదకుండలాదిభూషణంబులం దాల్చి
జైత్రం బగు రథం బెక్కి యక్షౌహిణీద్వయపరిమితసైన్యంబుఁ దోడ్కొని వెన్నుని
పిఱుందనం బఱుగిడుచుఁ బోరాడఁబోవునంతలో బలరాముండు సూచి నిజచమూ
సమన్వితుండై తత్సైన్యంబు నుఱుమాడుచుండినను నతివేగంబుగా శతాంగంబుఁ
బ్రోలించి హరినిన్ డాసి యిట్లనియె. ౨౪౬

చ॥ యదుకులనాయకా! నిలువు ♦ రా! యొటకేగెద? వోర! నాస్వసన్
విదళితమత్తవైరికులు ♦ భీష్మకపుత్రికు నంగరాజు నన్
హృదయమునన్ గణింపక య ♦థేచ్ఛ హరించి గమించుచుంటివే?
యిది దగునే? త్యజించి సతి ♦ నేగుము! చచ్చెద వట్లు లేనిచోన్. ౨౮౭

క॥ తుచ్ఛా! గోపాలుఁడవయి, యుచ్ఛ్రిష్టము మెక్కుచుందు ♦ వుఱక వె? మును ద
న్మ్లేచ్ఛధరానాథునకు బ,లోచ్ఛ్రానజరాత్మజునకు ♦ నోర్వక మొనలోన్. ౨౮౮

తే॥ మఱి యయాతిశాపంబునఁ ♦ గరము భ్రష్టుఁ
డవయి చనలేదె? చెట్లైన ♦ దప్పులేదె?
యిట్టివాఁడవు మాతోడ ♦ నెన యగుదువె?
విడువు రుక్మిణి లేనిచోఁ ♦ బఱెద నవని. ౨౮౯

చ॥ పలికి యటుల్ కఠోరముగ ♦ వైరిబలంబును జూడకుండ న
మ్ములపొదినుండి బిల్లొకటిఁ ♦ బొంది చెవిం దగులంగ లాగి ముం
గలఁగల కృష్ణుపై విసరఁ ♦ గాంచి యతం డొక శాతహేతితోఁ
జలువను బక్షినాయకుఁడు ♦ సెండిసకై వడిఁ ద్రుంచె వ్రేల్మిడిన్ ౨౯౦

చ॥ అటుపయి రుక్మి వేఱొకటి ♦ హైమగుణాంచితచాప మూని వే
పటుదశసాయకంబులను ♦ భద్రముగా జతజేసి శౌరి ను
త్కటముగఁ గొట్టె నాతఁడును ♦ దత్త్వమునన్ గుణయుక్తసంస్కృతిన్
దిటముగ మాపెనట్లు లోని ♦ దివ్యశిఖిం గొని చెండి వెండియున్. ౨౯౧

తే॥ వేయు తీవ్రబాణంబునన్ ♦ భీష్మసుతు, ధనువు రెండుగా విఱిచి మ♦ధ్యమునవంద
భల్లముల వేసె రుక్మిపైఁ ♦ బౌరుషమున, నంత వైదర్భుఁడున్ గాంచి ♦ యాగ్రహించి.

తే॥ ఓరి గొల్లఁడ! యిపుడు నీ ♦ యుసురు లేగుఁ, గాచికొమ్మని దీప్తప్ర♦కాశమాన
శక్తినిం బ్రయోగించెను ♦ జక్రిఁ దనుమ, నద్ది గని గదాగ్రజుఁడును ♦ జిద్దుతోడ.

చ॥ మదవదశేషశత్రుకుల ♦ మారణకర్మకృతార్థతాలస
ద్గదఁగొని వేయ నద్ది దృఢ ♦ తావిదితంబగు వాని శక్తినిం
జదిమియు రెండు తునకలుగ ♦ సారథి గీటణఁగించి తేరుపై
గొదకొని వ్రాలి చూర్ణముగఁ ♦ గొట్టె గిరిన్ బవి కొట్టినట్లుగన్. ౨౯౨

తే॥ భైష్మకుం డంత స్వక గదన్ ♦ బద్మనాభుఁ, గొట్ట నతఁడు చక్రంబుతోఁ ♦ గొట్టె నుసిగ
వెనుక రుక్మి వంగజ పరి♦ఘను రమేశ్వ, రాంసమున బాఁది యార్చె భీ♦మాభ్రరీతి

వ॥ అంత శ్రీకాంతుండు తత్పరిఘాఘాతంబునం బుష్పమాలాఘాతంబు
పడిన మాతంగేంద్రంబు భంగిం దైవాఱి దానితోడనే యారుక్మిం జక్రం బ్రహ
రింప నవ్వాఁ డించుక నొవ్విపడిన మనంబుతో శౌరిం దూఱుచు నసిచర్మంబునకు
లోనుజేయ నా యంబుజాక్షుం డాలోకించి సులువుగా స్వఖడ్గచర్మమున నద్దానిం

జేర్చి కృపాణపాణియై సమీపించు నవ్వాని శిరస్త్రాణంబును దనుత్రాణంబును హస్తాంగుళిత్రాణంబులను విదారించి ధారణిపై భుజదండంబులతో నలసిం బడవైచి మృగంబుపై మృగేంద్రం బెక్కిన చక్కని నారోహించి మిక్కిలి పదనుగల తన నందకం బను కత్తితోఁ గసిదీఱఁ దత్కంధరంబును నఱుక నుద్యుక్తుం డగుట రుక్మిణి వీక్షించి భ్రాతృవధకు ఖిన్నయై వగచుచు శ్రీహరిచరణారవిందంబులపై వ్రాలి వినయభయంబులతో నిట్లు ప్రార్థించె. ౨౧౬

ధ్రువకోకిల॥ భువననాయక ! పుణ్యపూరుష ! ♦ పూతజీవితభావితా !
భవగదాళిభిషగ్వరా ! భవ ♦ పద్మయోనిసురేశ్వర
స్తవనపాత్ర ! యమిత్రభంజక ! ♦ జ్ఞానరూప ! దయానిధీ !
యవనిభారహృదగ్రగణ్యా ! ర ♦ మాదిసాధ్వీమనోహరా ! ౨౧౭

తే॥ నీవు యోగీశ్వరాగమ్య ♦ దేవుఁడవుగ, నీమహిమము నెఱింగెడి ♦ నేర్పు లేక
ప్రతిఘటించిన నా యన్న ♦ బాహుశాలి, సాలభుజు న్యాలకునిఁ జంపఁ ♦ జనదు నీకు

చ॥ అని వినుతింపఁ గట్టిచెలి ♦ యన్నకునై మొఱవెట్టుదానిఁ గ
గనులను నీరు నీరధిఁగఁ ♦ గాఱ్చు పరిత్రను రుక్మిణిన్ స్వభా
ర్యను గని చింత మానుము త్వ ♦ దగ్రజుఁడో బ్రతుకంగలం డటం
చు నుడివి తత్క్రియన్ విడిచి ♦ చుల్కనఁ జేయఁ దలంచి నవ్వుచున్. ౨౧౮

శా॥ బావా ! రమ్మని తత్కటిస్థలము బ ♦ ల్బంధించి గద్దించి ధా
రావిభ్రాజితఖడ్గముం గొనుచు న ♦ క్రోశన్మ్రశుకేశంబులన్
జేపన్ క్షౌర మొనర్చె నొక్కదెసనే ♦ సీరాయుధుం డప్పుడే
యా వైదర్భునిసేనఁ జంపి తమితో ♦ నచ్చోటి కేతెంచియున్. ౨౨౦

బలరాముండు సహోదరఖిన్నయగు రుక్మిణి నూఱడించుట.

ఉ॥ కాంచి విదర్భరాట్సుతు మొ ♦ గంబు దయామతి వాని కట్లుఁ ద
ద్రెంచి యిదెంతచెడ్డపనిఁ ♦ దేరఁగఁ జేసితివోరి కృష్ణ ! హిం
సించుట యింతకంటెఁ గడు ♦ క్షేమముఁ గూర్చెడి సేఁతగాదె యో
జించుమ ! పాడియౌనొకో ? యి ♦ సీ యనరే ! మనలోకులెల్లరున్. ౨౨౧

తే॥ మనకు బావయు రుక్మిణీ ♦ వనిత కన్న, పూజనీయుఁడు నగు రుక్మి ♦ భూమిధవున
కిట్టి మానభంగంబు ఘ ♦ టింపఁదగునె?, యాఁడి ఖిన్నయౌ భైష్మికి ♦ ననియె నిట్లు.

వ॥ కల్యాణీ ! నీ ప్రత్యక్షంబునం గృష్ణకృతంబగు సహోదరమానభంగంబునకు సహింపుము. వగవకుము. నా వాక్యంబు లాకర్ణింపుము. ప్రియంబుగాని యప్రియంబుగాని కాలాధీనంబులై యుండు. తత్కాలంబు చక్రంబువిధంబునం బరిభ్రమించుచుండు. జీమూతంబులు మారుతంబునకు వశంబైనట్లు జగంబు కాలంబున కధీనంబై యుండు. అయ్యది భగవత్స్వరూపంబు. తత్కారణంబుననే

యది, యనుల్లంఘ్యంబు. అహంమమేతిభావంబు జగద్బంధకారణంబు తదన్యంబు మోక్షంబు. సుఖదుఃఖంబులు పురుషాత్మవిభ్రమంబులుగాని యితరంబులుగావు. మిత్రుండనియు, నమిత్రుండనియు, నధికారియనియు, దాసుండనియుఁ దలంచుట సంసారఘోరతమంబున సంభవంబైనదని తెలిసికొనుము. కాన ననంతంబగు చింతను మాని స్వస్థంబగు మనంబుతో సుఖంపుమని యనేకవిధంబుల నూఱడించి పరాజితుండగు రుక్మికిం బూర్వోక్తంబుగా బోధింప నాతండు వారిని వీడ్కొని విఫలమనోరథుం డగుట తత్కృతస్వాకారవికారంబునకుఁ జింతించుచుఁ దపం బొనరింప సంకల్పించి వనంబునకుం జన నుద్యమించి మంత్రివరులచే నాగి కుండిన పురప్రవేశంబు సేయక భోజకటకం బను పురంబున కరిగి వాసంబుఁ గావించె. అంత

తే॥ భైష్మి వై మనస్యంబును ♦ బాఱఁద్రోలి
యలరు హరి జయదుందుభుల్ ♦ సెలఁగ రామ
సహితుఁడై రుక్మిణిం గూడి ♦ సకల యాద
వులును వెన్నాడ ద్వారకా ♦ పురికి నరిగె. ౨౬౮

శ్రీకృష్ణుండు ద్వారకాపురంబున రుక్మిణిం బెండ్లాడుట.

వ॥ అంతఁ దన్నాగరులు రుక్మిణీకాంతాతత్కాంతాగమనంబు విని తమ దివ్యసదనంబులం బన్నీట నలికి సుగంధద్రవ్యంబులం జిలికి కర్పూరంబుల ముగ్గులం బెట్టి పరిమళత్పుష్పహారంబులతోఁ దోరణంబులందుఁ దోరణంబులం గట్టి నవ్యాంబరాభరణంబులం దాల్చి నీరాజనంబులం బట్టి బంధుమిత్రపరివారసహితంబుగా వీణావేణుమృదంగపణవఢక్కాదిసకలమంగళవాద్యంబులు మ్రోఁగుచుండ వారాంగన లభినయపూర్వకంబుగా నాడుచుండ గురుకవిబుధు లాశీర్వదించుచుండ నెదుర్కొని సర్వవిధాలంకృతిసమలంకృతంబై యమరావతీపురోపమంబై భూమండలమండనాయమానంబై కరితురగరథరథికదాతిరాజివిరాజితంబై సర్వభూకాంతసంతాననిషేవితంబై సకలకళాకరంబై నరఖేచరసన్నుతంబై యాదవనివాసంబై చెన్నుమీఱు ద్వారకాపురంబునం దూరేగించి తన్నందనందన సుందరమందిరంబునకుం జేర్చి యంత మార్గశిరమాసంబందు శుభతిథినక్షత్రయోగకరణవిశిష్టంబగు సుముహూర్తంబునఁ బరిమళత్పుష్పహారాభిరామంబును, వివాహసంభారసంభరితంబును, క్రముకకదళికాప్రవాళనారికేళాదిబద్ధంబును, భూసురబంధుమిత్రబంధురంబును, మంగళవాద్యహృద్యంబును, సువాసినీశోభితంబునగు కల్యాణమండపంబునం బ్రవేశించి. ౨౬౯

మ॥ వనజాక్షుండు వివాహమాడె విలస ♦ ద్ధర్మార్థసద్రూపిణిన్
ఘనతాపావనతానుశీలగుణితా ♦ గంభీరతాధారిణిన్

ధనధాన్యస్థితికారిణిన్ దురితక ♦ ద్దారిద్ర్యసంహారిణిన్
వనజాక్షీమణి రుక్మిణిన్ నిజమనః ♦ ప్రాప్తోరుసంచారిణిన్. ౨౬౬

తే॥ హితులు సామంతులున్ ధరా ♦ పతులు బంధు
వులును జీనిచీనాంబర ♦ భూషణకరి
తురగరథములు మొదలగు ♦ కరదములను
రుక్మిణీకృష్ణుల కిడిరి ♦ ప్రేమ లెసఁగి. ౨౬౭

క॥ అందఱుఁ దన్నగరంబున, నందునినందను వివాహ ♦ నవమహమున నా
నందముఁ బొందిరి ఘనఫల, బృందము ఘటియించు దీని ♦ వినిన జనులకున్.

తే॥ రుక్మిణీవివాహంబును ♦ రుచిరఫణితి, నాడియుంటిని మఱి హరి ♦ కైన యితర
పరిణయంబులఁ గూరిచి ♦ పలికెద నివి, సావధానంబుగా విను ♦ మయ్య జనక!

శ్రీకృష్ణుండు సత్యభామాదిసతులం బెండ్లాడుట.

క॥ సరసుఁడు సత్రాజితుఁడా, యరుణునిచే దచ్చి మణుఁగు ♦ లపరంజిని వా
సరవాసరమున నీనుచు, నెఱి మెఱయు స్యమంతకమణి ♦ నిం గొనె భక్తిన్.

ఉ॥ అయ్యది రాజధార్యముగ ♦ నాత్మకుఁ దోఁచుట జక్రపాణి యా
యయ్యను నుగ్రసేనునకు ♦ నాదృతిగా నిడుమన్న నాతఁడున్
గొయ్యతనంబునన్ ధనమె ♦ గొప్ప యటంచుఁ దలంచి నెమ్మితో
నియ్యకపోయె నయ్యదుకు ♦ లేశునకున్ హరికో నరేశ్వరా! ౨౭౧

తే॥ అట్టి సత్రాజిదాఖ్యున ♦ కనుఁగుఁ దమ్ముఁడగు ప్రసేనుఁడు తన్మణి ♦ నట్టున నిడి
సైంధవంబగు నశ్వంబు ♦ సరగ నెక్కి, వేఁటఁ జేయంగఁ జని నొక్క ♦ విపినమునకు.

తే॥ చనిన యాతనిన్ సింహంబు ♦ చంపి మణిని, సంగ్రహించి గమింపెడి ♦ సమయమందు
జాంబవంతుండు దానినిన్ ♦ జంపి మణినిఁ, గొంచుఁ జెంతను గల తన ♦ గుహను దూరె.

క॥ అంతట సత్రాజితుఁడు స్యమంతకమణిఁ దాల్చి చనిన ♦ మాని ప్రసేనుం
డెంతో కాల మరిగిన ని, శ్శాంతిమునకు రామిఁ గాంచి ♦ సభ నిటుఁ బలికెన్.

తే॥ తోడులేక నాతమ్ముఁడు ♦ దొడ్డవనికి, మణిని ధరియించి యేగె నా ♦ మానిఁ దఱిగి
దానిపైఁ గన్నువేసిన ♦ తద్ధరి యది, సంగ్రహించె నిదెంత మో ♦ సంబొ కనుఁడి!

వ॥ అంతట భగవంతుండా వృత్తాంతం బంతయు శ్రవణతాడితంబుగాఁ దన కాపాదించిన యపనిందం బోఁగొట్టుకొనం దలంచి నగరజనంబుతోఁ గూడ ద్వారకాపురినుండి వెడలి యెల్ల యెడలఁ దిరిగి యన్వేషించి యెట్టకేల కాయడవి కేగి ప్రసేనాశ్వసింహకళేబరంబులు పడియుంటం జూచి కాలిజాడలం బట్టి యా జాంబవంతుగుహలోనికొంటిగాఁ బ్రవేశించి యవ్వానితో నిరువదెనిమిది దినంబులు విరామంబులేనిపగిది యుద్ధం బొనరించి జయింప నాభల్లూకవల్లభుం డాతని రూపప్రజ్ఞాభిజ్ఞతావిజ్ఞతారంభజయంబుల కుల్లంబునం బెల్లు సంతసిల్లి

భగవంతుండే యని నిరూపించి తన్మణిసహితంబుగా గుణవతియుఁ గోమలాంగియు నగు జాంబవతి యను తన తనయను బారితోషికంబుగా నిడి ధన్యునిఁగా జేయు మని ప్రార్థించుచు మ్రొక్కి నక్కమలాక్షుం డక్కుటీకంబున నాతని మన్నించి మణికన్యాకామణిసహితంబుగా ద్వారకాపురంబున కేతెంచి యపశ్రుతి మోపిన సత్రాజిత్తుం బిలిపించి కొమ్మని యా మణి నొసంగి నిష్కళంకుం డయ్యె. అంత నతండు వ్రీడితుండై యా గోపాలుపాలికిం బోఁజాలక తదాగ్రహప్రశమ నార్థంబై యాశ్యమంతకమణి నిడి నిరుపమానలావణ్యయు నిజపుత్రియు నగు సత్యభామ యను భామినీలలామంబు నాతనికిం బాణిగృహీతిగా నొసంగి చరితార్థుండయ్యె. వెండియు ౧౭౬

కం॥ అండజవాహనుఁ డొకపరిఁ, బాండవులను జూచి తోడ ♦ పడుటకుఁ గరుణా
ఖండయి యింద్రప్రస్థము, ఖండగతిం జేరి యేను ♦ గడపియు నచటన్.

మ॥ నరుతోఁగూడ శతాంగ మెక్కి మధురా ♦ న్నభ్రాజదానాహభా
స్కరపుత్రీతటమందు వేఁట సలుపం ♦ గాఁ బోయి యచ్చోట దు
ష్కరమైనట్టి తపంబుఁ జేసి వరముం ♦ గాంక్షించు కాళిందినిం
గరుణన్ గాంచి సఖుండు సూడఁగొని యే ♦ గన్ సాగె స్వస్థానమున్. ౧౭౮

తే॥ అట్లు ద్వారకాపురిఁ జేరి ♦ యచ్యుతుండు, విధివిధానంబుగాఁ దమిఁ ♦ బెండ్లియాడ
భైష్మిని గొన్నయట్టుల ♦ వంతికాంతు, పట్టి మిత్రవిందఁగొని వి ♦ వాహ మాడె

తే॥ అవల నగ్నజిదాత్మజ ♦ యైన సత్య, సప్తగోవృషంబులఁ ద్రిప్పి ♦ శాస్త్రరీతిఁ
బరిణయం బయ్యెఁ గృష్ణుఁడు ♦ సురలు నరులు, జుట్టములు మిత్రులును జేరి ♦ చూచుచుండ

తే॥ పిదప శ్రీహరి కైకేయు ♦ బిడ్డ పూర్ణ, చంద్రబింబాభముఖబింబఁ ♦ జతురమతిని
భద్రయన్ గన్నెఁ గాళింది ♦ వలె గ్రహించి, పెండ్లియాడెను వేదోక్త ♦ విధిగ జనక!

ఉ॥ ఆ నరమిత్రుఁ డావల స్వ ♦ యంవరమందున మత్స్యయంత్ర మ
న్నాన్యనబలానఁ గొట్టి పగ ♦ నుక్కరులన్ దెగటార్చి వే బృహ
త్సేనుని పుత్రికామణి సు ♦ శీల సులక్షణయుక్త లక్ష్మణన్
బూనికఁ బెండ్లియాడె శ్రుతి ♦ బోధితరీతి మహోత్సవంబుగాన్. ౧౮౧

చ॥ మఱియుఁ బదాఱువేలు గల ♦ మానినులన్ మృధరంగమందునన్
నరకనిశాచరున్ వధ మొ ♦ నర్చి గ్రహించిన వందమందినిన్
దరుణుల రాజపుత్రికల ♦ దద్దనుజాయతబంధముక్తలన్
బరిణయమాడె వెన్నుఁడొక ♦ పట్టుననే తగి పెక్కురూపులన్. ౧౮౩

తే॥ మఱియు శౌరి యా సతులకు ♦ మందిరముల, వేఱువేఱుగ గట్టించి ♦ స్వీయమాయఁ
బెక్కుతెఱఁగుల విహరింప ♦ దక్కొనెఁ గద, యాతనికి దుష్కరంబైన ♦ సేఁతగలదె?

చ॥ పదపడి కృష్ణమూర్తి కల ♦ భామల నెక్కొకదానియందునన్
బదుగురు పుత్రరత్నములు ♦ బాహుబలుల్ కరుణాగుణాకరుల్
గొదకొని కల్గి రందఱు ము ♦ కుందునిఁ బోలుచునుందు రాకృతిన్
మదిమది కివిశేవలను ♦ మాటల నీటునఁ బాటవంబునన్. ౧౮౫

తే॥ మొట్టమొదటను రుక్మిణిన్ ♦ బుష్పబాణుఁ
డవతరించెను బ్రద్యుమ్నుఁ ♦ డనెడి పేర
నతఁడు సర్వలక్షణములన్ ♦ హరినిఁ బోలి
ముజ్జగముల రూపసియయి ♦ పొల్పుఁగాంచె. ౧౮౬

వ॥ ఇట్టితరుణంబున శంబరుండను నొక యసురుం డా బాలకుండు తనకు మారకుండని యితరులచే విని కామరూపియై యా పురుటింటిలోనికిం జని యా శిశువును సంగ్రహించుకొని వచ్చి సముద్రంబునం బడవైవ నా చిఱుత యొక్క మహామీనంబుచే మ్రింగఁబడినను మృతుండుగాకయుండె. అంత సమ్మోహనాంగి యగు రతీదేవి నిజమనోవిభూదంతంబు నెల్లో యెఱింగి నిరీక్షించి దైవవశంబున నమ్మీనగర్భంబునుండి వెల్వడిన మగనిం గని కొని పోషింప నతండు దినక్రమంబున నారూఢయావనుండై జగన్మోహనుండై చెన్నారుచుఁ దత్శంబరకృతదుష్టకృత్యం బెఱింగి కినిసి యా దనుజుం జంపి మాయావతియను పేరంబరగు తన సతియగు రతితోఁగూడ ద్వారకాపురి కేతెంచి తలిదండ్రులగు రుక్మిణీకృష్ణులకు నమస్కరింప నవ్వార లత్యాశ్చర్యానందంబులం బొందిరి. వెండియు నా మన్మథుండు భోజకట పురంబునం జరుగు స్వయంవరంబున కరిగి భీష్మకపుత్రుఁడగు రుక్మి పుత్రికామణిని వరించి యథావిధిగాఁ బెండ్లాడి యయుతగజబలుండును, శారదేందీవరసన్నిభుండును నగు ననిరుద్ధుం గాంచె. ఇతండు బ్రహ్మయని యెఱుంగుము. దేవరా! సంపత్ప్రదంబులును, సర్వపాపహరంబులును, బుణ్యకరంబులు నగు శ్రీకృష్ణుని వివాహ వృత్తాంతంబులు సాంతంబుగా వినిపించితి. మఱియు నేమి విన మనసుగలదో తెలుపుమనిన నాబహులాశ్వుం డలరి యిట్లనియె. ౧౮౭

నారదుండు ద్వారకాపురాగమనహేతువులఁ జెప్పుట.

మ॥ జగదీశుండు పరాత్పరుండు హరి యి ♦ చ్ఛన్ జేరి తద్ద్వారకా
నగరిన్ బాలనజేసె నార! యహాహా! ♦ నాబుద్ధి కాగ్రామమే
జగదాద్యంతవిరాజితాఖిలపురీ ♦ సారస్యమై ధన్యమై
తగె నం చెంతయుఁ దోఁచెడిన్ విధిసుతా! ♦ దైవర్షిచూడామణీ! ౧౮౮

తే॥ నారదా! యట్టి ద్వారక ♦ శౌరి దేహ,జనితమంచు నాలించితిన్ ♦ శ్రవములార
నేటి కది యిటకేతెంచె? ♦ నెప్డువచ్చె, నద్ది నొడువుమ! యన ముని ♦ యాడె నిట్లు.

ఉ॥ భూతలనాథ! యిత్తఱిని ♦ ముచ్చట జేసిన ప్రశ్న యోగ్యముల్
పాతకనాశకం బఖిల ♦ భావుకదంబును గాన విన్ము శ
ర్యాతి యనన్ మనూద్భవుఁడు ♦ రాజిలి రాజ్యము సార్వభౌముఁడై
ప్రీతిగ నేలె నేండ్లు పది ♦ వేలగు దాఁక ననర్గళంబుగాన్ ౨౯౦

తే॥ నలిగ నుత్తానబర్హి యాఁనర్తఘనుఁడు, మఱియు భూరిషేణుండు నాఁవరకుమారు
లాతనికిఁ బుట్టి రంత నాఁనేత యొక్క, తఱిని నిట్లనెఁ బుత్రులఁ దరికిఁ బిలిచి.

తే॥ ప్రథమసుత! నీవు ప్రాగ్దిక్కుఁ ♦ బాలనంబు
సలుపుకొను మోయి యానర్త! ♦ శమనదిశను
నేలుకొను! భూరిషేణ! పా ♦ లించుకొమ్ము!
పశ్చిమస్థితదేశంబు ♦ వాసితోడ. ౨౯౨

ఉ॥ పుత్రకులార! వారినిధి ♦ ముద్రితముల్ వరరత్నగర్భయున్
స్తోత్రసమర్థముల్ నగర ♦ దుర్గవనాచలయుక్తమైన యీ
ధాత్రిఁ జిరంతనంబుగను ♦ దద్ద గడించితిఁ జక్రవర్తినై
క్షత్రియనీతి నేలితిని ♦ గావున మీరలు నట్లు లేలుఁడీ! ౨౯౩

తే॥ నావుడు ద్వితీయపుత్రుఁ డా ♦ నర్తవిజ్ఞుఁ, డాత్మజనకవాక్యంబుల ♦ నాలకించి
నగడి నరుఁబోలె జెలఁగి జ్ఞాఁనమయమైన, పలుకు లిట్లాడె ధీరుఁడై ♦ పార్థివేంద్ర!

ఉ॥ నీయది గాదు ధాత్రి యిదె ♦ నీవిది యేలఁగ లేదొకప్పుడున్
నీ యలఘుప్రవీణతను ♦ నిల్వఁగ లేదిది నీ బలంబుచే
నీయది గెల్వఁగాబడ దిఁ ♦ కెంతుల కిట్టులఁ జీటిమాటికిన్
నాయది నాదియం చనెదు? ♦ నాయన! కాని గ్రహింపు మీనుడుల్. ౨౯౪

ఉ॥ కృష్ణుని దీ ధరాతలము ♦ కృష్ణుఁడు దీనిని నేలు నెప్పుడున్
గృష్ణు బలాన నిల్చె నిది ♦ కృష్ణుఁడు దీని గడించెఁ దేజనన్
గృష్ణుఁడె విశ్వమంతయు సృ ♦ జించును బ్రోచును సంహరించు నా
కృష్ణునితోడఁ బోలుటకు ♦ నెవ్వఁడు రాఁగలఁడోయి నాయనా! ౨౯౫

సీ॥ ఎవఁడు భూతంబుల ♦ నెలసి యాశ్రయుఁడయ్యె, నాతఁడె విశ్వరూ ♦ పాధియజ్ఞుఁ
డెవని భయంబున ♦ నినుఁడు వెల్గుచునుండు, నతఁడె సంపూర్ణత ♦ మావతారుఁ
డెవని భీతిఁ ♦ వాతము వీచెడి, నాతఁడె గోలోక ♦ నేతృతేజ్యుఁ
డెవని వెఱపుఁ ♦ నింద్రుఁడు వర్షించు, నాతఁడె కాలత్ర ♦ యస్వరూపుఁ
తే॥ డెవఁడచేతనములకును ♦ చేతనుఁడయ్యె, నతఁడె వసుదేవపుత్రకుఁ ♦ డయ్యె నెవఁడు
భక్తవత్సలుఁ డాతఁడే ♦ బ్రహ్మమల్లు, కృష్ణుఁగొల్వు! మహాంకృతి ♦ నెత్తివేసి.

తే॥ అతనిఁ గొల్చిన నాముష్మి ♦ కైహికములు, గల్గితీరెడిఁ గావునఁ ♦ గదలకుండ
మనము బిగబట్టి సేవింపుమా! మఱొండు, మాటలాడకుమో తండ్రి! ♦ మానవేశ!

తే॥ అంత శర్యాతి సుతవాక్య ♦ రాహతుండయి
జ్ఞానియయ్యును దోఁకఁ ♦ ద్రొక్కఁగఁబడిన
పామువలె లేచి కిన్కతోఁ ♦ బ్రస్ఫురదధ
రుఁడయి యానర్తసుతునకు ♦ నుడివె నిట్లు. ౨౯౯

చ॥ మొఱఁగెదవేల యొజ్జవలె? ♦ బుద్ధి యొకింతయులేదె నీ కిసీ!
తొరఁగఁ దొలంగు మావలకు ♦ దుష్ట! యితఃపరమందు నీవు నా
ధరణి వసింపఁ గూడదు య ♦ థావిధిగా నిఁక నట్టికృష్ణునిన్
మురిపెముతో నుతింపు మల ♦ బుద్ధిమదగ్రణి యిచ్చు సర్వమున్. ౩౦౦

తే॥ అనవు డానర్తుఁడున్ మఱి ♦ యనియె నిట్లు
జనక! నీదగుధరను వా ♦ సంబు నాకుఁ
గల్గకుండుత యని యటఁ ♦ గదలి కడలిఁ
జేరి నీటిలోఁ దపమును ♦ జేయుచుండె. ౩౦౧

వ॥ ఇట్లు పదివేలవర్షంబులు గడవ నాకడలియల్లుం డాతని ప్రేమలక్షణం బగు భక్తికి మెచ్చి ప్రసన్నుండై వరంబుఁ గోరుమని యడుగ నాభూపుండు ముకుళితకరారవిందుండై లేచి తచ్చరణసరసిజంబులపై వ్రాలి పులకితగాత్రుండై

పంచచామరము॥ అనాథనాథ! రాధికాధ ♦ వా! ధరాధరోద్ధరా!
జనార్దనా! మహానుభావ! ♦ శంఖచక్రభాసురా!
ఘనాఘనాభ! లోకనాథ! ♦ కాంచనాంబరాంచితా!
యనంతమధ్యమాది! యవ్య ♦ యా! దమోదమోదయా! ౩౦౨

తే॥ వాసుదేవ! మజ్జనకని ♦ ష్కాసితుండ, నగుచు నిన్ను సేవించితి ♦ నన్యమేమి
వెఱవులేదు దయానిధీ! ♦ విపులరాజ్య, మొసఁగి రక్షింపుమో కృష్ణ! ♦ యసమచరిత!

తే॥ అనఁగ దీనసంరక్షకుఁ ♦ డతని వినయ, నయభయంబుల కలరి యా ♦ నర్త! నీదు
తండ్రికిం గాని రాజ్యంబు ♦ ధాత్రిలేదె, మైన నీ ప్రార్థనంబున ♦ నరసి నేను.

క॥ వైకుంఠమునుండియు లక్ష్మీకరశతయోజనపరి ♦ మితదేశంబున్
నీకై పంపెదఁ గొనుమీ!, చీకాకీకరణి నీవు ♦ సెందుటయేలా? ౩౦౩

వ॥ అని చని తనలోకంబునుండి నూఱామడలచోటును బెల్లగించుకొని వచ్చి కల్లోలకోలాహలభరితంబగు సముద్రంబునందు సుదర్శనచక్రధారిమై నిలిపి యాతని కియ్య నయ్యానర్తుం డానందంబుఁ బొంది లక్షవత్సరంబులు గడచునందాక

చ॥ కరముగ నేలె నాయవని ♦ గాఢయశోధనధాన్యపుత్రపౌ
త్రరుచిరధర్మకృత్యతిథి ♦ తత్పరతాకవితాప్రగల్భతా
పరమపదార్థతాఘటన ♦ పద్ధతిసిద్ధ్యనుకూలవిజ్ఞతా
భరకృతకృత్యసత్యబుధ ♦ వాక్సమవృష్టిసుపుష్టమానటుల్. ౩౦౪

తే॥ ఇట్టిసంగతి శర్యాతి ♦ క్రమముగ విని
సొమ్ముబోఁదుకొనెఁ జింతఁ ♦ బిమ్మట నల
యవని యానర్తసంచిత ♦ మగుటచేతఁ
బ్రథితి గలిగెను "నానర్త ♦ రాజ్య" మంచు. ౩౦౯

తే॥ ఆతనికిఁ గల్గె రైవతుఁ ♦ డనెడి తనయుఁ
డతఁడు శ్రీశైలతనయుని ♦ ద్రుతముతోడఁ
బెట్టి యానర్తధరఁ బడ ♦ వేసె దాన
నద్రి "రైవతగిరి" యని ♦ ఖ్యాతికెక్కె. ౩౧౦

క॥ ఈ రైవతుఁడె కుశస్థలి, చారుపురిన్ జక్కనేలెఁ ♦ జతురాస్యదరిం
జేరియు నడిగియు నిజసుత, నారేవతినిన్ బలునకిచ్చి ♦ నట్టిఁ డితండే. ౩౧౧

క॥ ఈ సంగతి మున్నాడితి, నీ సమయంబందు నింక ♦ నేమి వినెదవో
వాసిగఁ దెలియంబలుకుము!, వీసంబేన్ విడువకుండ ♦ వేడ్క వచింతున్. ౩౧౨

ఉ॥ నావుడు తేఁ డిటుల్ నుడివె ♦ నారద! యిత్తఱి ద్వారకాగమం
బీవు సకారణంబుగ వ ♦ చించితి వయ్యది వ్యక్తమయ్యె ద్వా
రావతి నున్న తీర్థనిక ♦ రంబొ యెఱుంగకపోతి లేశమేన్
గావున వానినిం గుఱిచి ♦ క్రమతరంబుగఁ జెప్పుమా! యనన్. ౩౧౩

గోమతీనదీమాహాత్మ్యము.

ఉ॥ నారదుఁ డాడె నిట్లనని ♦ నాయక! విన్ము ప్రభాసతీర్థరా
ట్తీరవిరాజమానమయి ♦ దివ్యమునై శతయోజనంబు లిం
పారెడి ద్వారకాపురిని ♦ నాడినఁ బాడిన విన్నఁ గన్నఁ బ్రొ
ల్పారినఁ బ్రాణముల్ విడిన ♦ నవ్యయమోక్షముఁ జెందు నట్టిఁడేన్. ౩౧౪

క॥ శ్రీవిభుఁ డొకపరి భక్తుని, రైవతునిం బ్రీతిమోద ♦ రాజతుఁ గని సం
భావితదర్శన మిడి, శివిని ముజ్జలము లిడెఁగ ♦ డిందినిఁ గనులన్. ౩౧౫

తే॥ అట్టి నీటిఁబొట్టులు వడి ♦ యచట "గోమతి"యను పృథునది జనియించె ♦ దివ్యధాటి
నద్ది సూచినమాత్రనే ♦ యంతరించు, బ్రహ్మహత్యాదిపాతక ♦ పంచకంబు.

తే॥ గోమతీతీరజము రజం ♦ బేమనుజుఁడు
శిరమునం దాల్చునో యట్టి ♦ నరుఁడు నూఱు
బాములను జేసిన సకల ♦ పాపములను
విడుచు నిందున సంశయ ♦ పడఁగవలదు. ౩౧౬

క॥ గిమునసో చెఱువుననో, యేమూలనో స్నానమాచ ♦ రించిన వేళన్
"గోమతి" యని పలికినచో, గోమతి మునిఁగిన ఫలంబుఁ ♦ గొనఁగలఁ డవఁడేన్

చ॥ రవి మకరంబునందుఁ గుడు ♦ రన్ దమి మాఘమునం బ్రయాగమున్
దవిలి మునుంగువారలకుఁ ♦ దప్పక కల్గు శతాశ్వమేధసం
భవఫల మంతకంటె నల ♦ పావనగోమతిలోన మున్గు మా
నవులకు వేయిరెట్టులుగ ♦ నవ్యఫలంబు ఘటించు భూవరా! 3౧౯

చక్రతీర్థమాహాత్మ్యము.

వ॥ గోమతీధునీమణియందునం జక్రతీర్థంబను నొండు గలదు. అందుఁ బాషాణంబులు చక్రత్వంబును బొంది పూజనీయంబులగు. అట్టి చక్రచిహ్నకరంబగు చక్రతీర్థంబున నెవ్వండు ద్వాదశిని జలకమాడునో యానరుండు చక్రపాణి దివ్యపదంబుఁ జెందంగలఁడు. పతితుండేనిఁ బాతకుండేనిఁ దత్తీరతీరవిరాజమానసోపానంబుపై నడుగిడినంతఁ గోటిజన్మదురితంబులచే విముక్తుండై జీవన్ముక్తిం బొందునని వాక్రువ్వ నాబహులాశ్వుం డలరి మునివరా! తచ్చక్రతీర్థంబు తాదృక్ఫలప్రదంబై తద్గోమతీతీరంబున నెట్లు ప్రాదుర్భవించెనో యానతిండని వేఁడ నామౌనివర్యుం డిందుల కొండు పురాతనేతిహాసంబుఁ దెల్పెద నవధరింపు మని యిట్లనె. 3౨౦

తే॥ నవనిధీశుఁడు గుహ్యక♦నాయకుండు, రాజరా జలకేశుఁడు ♦ త్ర్యంబకసఖుఁ
డగు కుబేరుఁడు వైష్ణవం♦బగు సవంబు, రజతగిరి కుత్తరధర నా♦రంభమిడెను.

తే॥ మఖమహోత్సవమునకు నా♦మంత్రణంబుఁ, జేయ నారాయణుండును♦ జెచ్చెరఁ దన
దండి వైకుంఠధామంబు ♦ నుండి వెడలి, యజ్ఞవాటిక కేతెంచె ♦ నతనివెంట,

చ॥ రవి శశి భౌమ సౌమ్య గురు ♦ రాక్షససద్గురు మంద రాహు కే
తు విబుధ జంభభేది విధి ♦ ధూర్జటి చారణ సిద్ధసాధ్య ది
గ్ధవ సురమౌని విప్రఋషి ♦ ధాత్రికుబేరసుతాదిధీరు లా
సవమున కేగుదెంచిరి వె♦సన్ స్వకలోకసమేతులై విభూ! 3౨3

తే॥ వీరభద్రుఁ డా యజ్ఞము♦ వేయికనులఁ, గాచుచుండెను దత్సేవ♦ గజముఖుండు
సలుపుచుండెఁ దత్పరివేష ♦ ముల నొనర్పఁ,గా మరుద్గణములు నొప్పెఁ ♦ గాశ్యపీశ!

తే॥ బాహులేయుండు ధర్మత♦త్పరత సభను, సముచితంబుగ భక్తితో♦ సత్కరింప
బయలుదేర ఘంటానాద♦పార్శ్వమౌళు,లను కుబేరమంత్రులు దాత♦లైరి ధీర!

తే॥ మఱియుఁ గార్యనిర్వాహకుల్ ♦ మాటరాని
పగిదిఁ జూడంగ యజ్ఞంబు ♦ ముగియ ధనదుఁ
డవబృధముఁ జేసి దక్షిణ ♦ లగ్రజులకుఁ
బరమభాగంబు సురలకుఁ ♦ గర మొసంగె.

ఉ॥ ఈసమయంబునన్ గినుక ♦ నింధనపత్రమృగాజినోరుద
ర్భాసనకుండిదండముల ♦ నంది పదంబులఁ దాల్చి పాదుకల్

మీసలఁ ద్రిప్పుచుం గొడుగు ♦ మీఁద వెలుంగ జడల్ సెలంగ దు
ర్వాసుఁడు తన్ముఖస్థలికి ♦ వచ్చెఁ గృశుండు గృశోదరుండునై. ౩౨౮

తే॥ అట్లు వచ్చిన దుర్వాసు♦నెలబిలుఁడు,గాంచి యెదురేగి భక్తి న♦ర్ఘ్యంబుఁ బాద్య
ము నిడి పూజించి భయభీత♦మనముతోడ, బద్ధహస్తారవిందుడై ♦ పలికె నిట్లు.

మ॥ ఫలితంబయ్యె మదీయజన్మ మిపుడే ♦ ప్రాజ్యంబు మద్రాజ్యముం
ఫలితం బయ్యెను నాదు యాగమును ధ♦న్యంబయ్యె నిచ్చోటి కీ
రలు దోతెంచుట నా నతుల్గొనుచు దు♦ర్వాసా! మునీంద్రా! తమో
విలయప్రౌఢ! మహానుభావ! దయతో ♦ వీక్షించి రక్షింపుమా! ౩౨౯

క॥ అని వినయంబున వేఁడగ, మునివరుఁ డానందమొంది ♦ పుణ్యజనేశా
నున కిటు బలికెను దన మో, మునఁ జిఱునగ వొప్పుచుండ ♦ భూభుజవర్యా!

చ॥ నరవరవాహనుండవు ఘ♦న ప్రతిభాప్రథితుండ వర్థసం
భరితుఁడ వగ్రజన్మబహు ♦ భక్తియుతుండవు రాజరాజ వు
ద్ధురతరదానశౌండుఁడవు ♦ ధూర్జటిమిత్రుఁడ వీవు శ్రద్ధ ని
త్తితి హరి మెచ్చు జన్మము య♦థావిధిగా నొనరించి యుండవే! ౩౩౧

ఉ॥ ఏవిషయంబునం దెదియు ♦ నీవఱ కడ్గి యెఱుంగఁ గొమ్మటం
చీవయినం దృణంబయిన ♦ నిచ్చి యెఱుంగవు నాకుఁ గావునం
నీవె వినుత్యదాతవని ♦ నెమ్మది నమ్మియు నిన్ను యాచనం
కీవిగఁ జేయుచుంటిని గ ♦ డిందిగ దీని నొసంగుమో సుధీ! ౩౩౨

తే॥ ఇడినచో నీకు వరముల ♦ నియ్యఁగలను, నిడనిచో నిగ్రహించి శ♦పించి నిన్ను
బూది సల్పెద నీభావ♦మునఁ దలంచు,కొని యొనర్పుము! కనుమ! నా♦కోర్కి వినుమ!

చ॥ నవనిధు లిట్టి నీదు సద♦నంబున నుండెనుగాదె వానిని
బ్రవిమలబుద్ధితో నొసఁగి ♦ భద్రముఁ బొందుము! వానిఁజెంద నీ
సవిధముఁజేరి యుంటిఁగద! ♦ సాంబసఖా! యన నయ్యుదారుఁ డ
య్యవి యిడ నొప్పితిం మునివ♦రా! యని యిచ్చుట కుద్యతుండుగాం. ౩౩౪

క॥ దానాధ్యక్షులయిన ఘం,టానాదుఁడు పార్శ్వమాలి ♦ దక్షుని ధనదుం
మానిపి ధనమోహితులై, యీ నెఱి వచియించిరో ర♦మేశ్వరభక్తా! ౩౩౫

శా॥ ఆలుంబిడ్డలులేని యీపిసినికే ♦ మయ్యా! నిధిశ్రేణి ని
ట్లేలా యిచ్చెద వద్ది మాకుఁ జెపుమా! ♦ యీ మాని కీవేళలోఁ
జాలం లక్షధనం బొసంగి యిఁకఁ ద♦జ్జన్మంబు సాంతంబుగాఁ
బౌలస్త్యా! కొఱతేనియట్టులుగ నే♦వం గాంచి పోషింపుమా! ౩౩౬

చ॥ అటు పరుషంబుగాఁ బలుక ♦ నా ముని యాగ్రహవిగ్రహోగ్రుఁడై
కుటిలముగాఁగ భ్రూకుటి న♦కుంఠితరీతి నొనర్చి కన్నులు

త్కటముగ నెత్తిబాఱఁ గనఁ ♦ గా నిమిషద్వయ మెల్లలోకముల్
దటతట స్థాలికై వడిని ♦ దద్దఁ జలించె నుతించె యక్షుఁడుల్. ౩౩౭

తే॥ అంతఁ దన్మునినాయకుఁ ♦ డా కుబేరుఁ
డటుల నభివాదనాదుల ♦ నాచరించు
చుంటఁ గని తలయూఁచి యా ♦ తంటలాడు
సచివులఁ శపియించె నీ ♦ సరణి జనక! ౩౩౮

క॥ తులువా! ఘంటానాదా!, పలుఁగాకి! యలంజ! పిసిని! ♦ పాపమతీ! నీ
వలఘుగ్రాహమువలె ధనములను గ్రహించెదవు దాన ♦ మొసలివి గమ్మా!

ఆ॥ పార్శ్వమౌళి! నీవు ♦ పరమనీచుఁడ వయి, ధనమదంబుచేత ♦ ధర్మమువిడి
ద్విపముబోలె మిగులఁ ♦ బ్రేరేపణముసర్తు, నందువలన వేగ ♦ హస్తివగుత.

ఉ॥ ఈసరణిన్ గుబేరసచి ♦ వేంద్రుల బిట్టు శపించి యట్టి దు
ర్వాసుఁడు నమ్మునిఁడౌ మనుజ ♦ ధర్మునిచే నిధులెల్లఁగొంచు సం
తోసముచేత నాతనికిఁ ♦ దోడనె తద్ద్విగుణంబుగా నిధుల్
భాసిలఁ జేసి యేగెఁ గను ♦ బ్రాహ్మణతైజసశక్తి యెంతదో! ౩౪౧

ఉ॥ ఈ రహిఁ మౌనిశాపహతి ♦ నిర్వురు తత్సచివుల్ మనంబునన్
భూరివిచారదగ్ధులయి ♦ ప్రోచెడివాఁ డలకృష్ణుఁడే యటం
చారసి వాని కాళ్ళఁబడి ♦ యాశ్రితులన్ మముఁ గావుమన్న నా
శౌరియు నొప్పి చెప్పె నిటు ♦ సాంత్వనకారకదివ్యసూక్తులన్. ౩౪౨

ఆ॥ సచివులార! నాదు ♦ సముఖంబునన్ మీరు, విప్రశాపహతిని ♦ వెతలఁబడుచు
వచ్చియుంటి రట్టి ♦ బ్రాహ్మణవాక్యంబు, వ్యర్థపుచ్చఁజాల ♦ నైన వినుఁడు. ౩౪౩

ఆ॥ బ్రాహ్మణోక్తిరీతి ♦ గ్రాహద్విపములుగాఁ, బుట్టి పిదప నొకటి ♦ మొనసి యెప్పు
డాల మాడఁగలరొ ♦ యపుడు నా కరుణచే, స్వీయమైన రూపుఁ ♦ జెందఁగలరు.

వ॥ అట్ల గ్గరుడధ్వజునిచే నుగ్గడింపఁబడిన యా ప్రెగ్గడ లిరువురును జాతిస్మరణసంయుతంబుగా మకర కరి జన్మంబు లెత్తిరి. అందు నక్రజన్మంబుఁ గాంచిన ఘంటానాదుండు రౌద్రంబును, భయంకరంబును, వికరాలంబునగు శరీరంబుతోఁ దగి తద్గోమతీశైవలినిం బ్రవేశించి విహరించుచు, వర్థిల్లుచుండె, గజేంద్రుండై పుట్టిన పార్శ్వమౌళియుఁ దదాన ర్తదేశవిభాసమానరైవతాచలవనంబునఁ జతుర్దంతంబులు గల్గి ధనుశ్శతపరిమితప్రోచ్చపృష్ఠభాగంబునం జెన్నాఱి కజ్జలంబుతోఁ దుల్యంబగు వర్ణంబు సెలంగ వకుళవంజులప్రవాళకురవకకుందమందారకోవిదారాసనార్జునబదరవేణుపాటలాశోకప్రియామ్రమాతకామ్రక్రముకపున్నాగనాగరంగమాతులుంగలవంగచంపకచందనజాతి పనసోదుంబరాశ్వత్థఖర్జూరభూర్జమన్మథతిలకమాలతీమాధవీగిరిమల్లికాద్యామోదితనికుంజకుంజపుంజంబులలో యథేష్టంబుగాఁ గరిణీ

సమూహంబులో సంచరించుచు వైశాఖమాసంబునం దొకనాఁడు గోమతీధుని
లోన నవగాహనం బొనర్ప సంకల్పించి చని తన్నదిలోనికిం దిగి యగాధప్రదే
శంబుఁ జొచ్చి చిరకాలంబు స్నానంబుఁజేసి శుండాదండంబున నీళ్ళతోఁ జెలులాట
లాడి యాత్మవల్లభలను జలకమాడించి దరికి రానెంచు తరుణంబున ౩౮౮

క॥ ఆగ్రాహము విధివశమయి, యాగ్రహమున నచట నెప్పి ♦ యాడు గజేంద్రున్
వ్యగ్రుఁడుగాఁ బట్టఁగ సముదగ్రబలుఁడు వాఁడొనర్చి ♦ యతిఘీంకృతులన్.

క॥ చుఱచుఱనాలోకించును, గరమునఁ బ్రహరించు మకరి ♦ గట్టిక్కుట్టకై
మఱిమఱిఁ దలఁచును బోరిఁబోరిఁ, జరణంబును గుంజికొనును ♦ శక్తింజూపున్.

క॥ నక్రం బద్దానిని నిర్వక్రంబగు విక్రమమునఁ ♦ ద్వరగతి గలుగన్
వక్రించి నిజవసతికి నవక్రగతిని లాగికొనుచు ♦ వచ్చెను బిదపన్. ౩౮౯

ఆ॥ కరిపుఁజుట్టియున్న ♦ కరిణులుఁ గలభముల్, విక్రమించి మొసలి ♦ వేగఁబట్టి
దండితొండములను ♦ దద్దయుఁ గొట్టియు గజవరేణ్యు సుంత ♦ గావవయ్యె.

క॥ కరిమకరంబులు పిదప న్నొకరి నొకరును నీడ్చుకొనుచుఁ ♦ గయ్యంబాడన్
జరిగెను నేఁబదియైదేండ్లరుదుగఁ జూపఱు గనంగ ♦ నవనీనాథా! ౩౯౦

ఆ॥ అంతమందు నట్టి ♦ హస్తీంద్రుఁడే బహుబాధఁజెంది పూర్వ ♦ భవవిధంబుఁ
దలఁచి ప్రేమలతకు♦ణలలితభక్తితో, విష్ణుమూర్తి నిట్లు ♦ వేఁడఁదొడఁగె. ౩౯౧

మ॥ కరుణాసాగర! సాగరాత్మతనయా ♦ క్రాంతాత్మ! యాత్మేశ్వరా!
ధరణీభారనివారణవ్రతధరా! ♦ ధారాధరాభోజ్జ్వలా!
నరమిత్రా! శతపత్రనేత్రరుచిరా! ♦ నవ్యశ్రుతిధ్యేయ! యో
పరమేశా! జగదీశ! యోవరద! నీ ♦ పాదంబులం గొల్చెదన్. ౩౯౨

మ॥ ధనముల్ ధాన్యము ధర్మముల్ సవములున్ ♦ దంత్రంబు మంత్రంబు భూ
జనముల్ దేశము కాలముల్ దివిజులున్ ♦ సత్యంబు జ్ఞానంబు వే
దనికాయంబును శాస్త్రముల్ పృథుసము ♦ ద్రంబుల్ మహాశైలముల్
వనముల్ సర్వము నీవె కాదె! దయరా ♦ వా! నన్ను రక్షింపవా! ౩౯౩

తే॥ సాధుబృందావనాసక్త! ♦ చాఁగిలింత, సత్యభామామనోహరా! ♦ చాఁగిలింత
శంఖచక్రగదాధరా! ♦ చాఁగిలింత, లోకనాథ! నామొఱ విని ♦ సాఁకరావె!

ఉ॥ శైవులు సాంబమూర్తి యని ♦ సౌరులు సూర్యుఁ డటంచు వైష్ణవుల్
శ్రీవిభుఁడంచు శాక్తులును ♦ శ్రీశివశక్తియటంచుఁ గార్మికుల్
భావుకకర్తయంచు శ్రుతి ♦ పారగవారము బ్రహ్మమంచు బౌ
ద్ధావళి బుద్ధుఁడంచు నిను ♦ వర్ణనఁ జేయురె దీనరక్షకా! ౩౯౪

ఉ॥ లావురవంతలేదు కను ♦ లా కనరావు బలంబు సున్నగా
కావులఁ దప్పెఁ బ్రాణములు ♦ డస్సితి లెస్సగ నీ సరస్సునన్

దేవ! కటాలునం గనవె! ♦ దిక్కెవ రింకను రావె! ప్రోవవే!
యీవె జగత్కుటుంబివయి ♦ యేలవె? యే కొఱఁతలేసటుల్ హరీ! ౩౯౬

తే॥ కృష్ణుఁడేఁ జేయు నీమొఱా♦లించుఁగాక! కాంచుఁగాక యిచ్చట కరు♦దెంచుఁగాక!
మించు నాపాపపాశంబుఁ♦ద్రెంచుఁగాక! యెంచి యభయవరముల నా♦కిచ్చుఁగాక!

వ॥ అని ప్రార్థింప నయ్యిందిరాకాంతుండు తన్ను ధ్యానించుచు శరణాగతుండైన మాతంగేంద్రుని మొఱ నాలకించి కేవలభక్తత్రాణపరాయణుండై నిజవల్లభలతోడి సరససల్లాపంబుల వీడి చివ్వన లేచి సంసిద్ధుండై యున్న విహంగనాథు నెక్కి తివ్వనం జని తద్గోమతీనదీస్థితగజస్థితిం గని కనికరించి యగ్గరుడుఁ డిగ్గి దగ్గఱి తేజోవిరాజితంబగు సుదర్శనచక్రంబుఁ దన్నక్రంబు ద్రుంపం బ్రయోగించె. దానఁ దైన్యంబు ప్రాప్తంబగుటకుఁ బూర్వంబు ధనంబు నాశంబైనట్లు తద్గ్రాహదేహంబు భిన్నం బగుటకు ముందు తదద్భుతకరశిరంబు ఖండీకృతంబయ్యె. పిమ్మట నచ్చక్రంబుచ్చైర్నాదంబుతో నజ్జలంబున మ్రోయుచు నందలి పాషాణంబులపైఁ బడి చక్రాకారంబులుగా నొనర్చుటచేఁ దత్క్షేత్రంబున కదిమొదలు చక్రతీర్థంబను నామంబు గల్గె. తచ్చక్రసంఘర్షసంభవచక్రతీర్థదర్శనస్పర్శనంబులు బ్రహ్మహత్యాదినివారకంబులని యెఱుంగుము. మఱియు నాశ్రీకృష్ణుని యనుగ్రహంబున నాగజేంద్రుండును స్వీయ మున్నరూపు వీడె. అట్లు కరిమకరరూపంబులం బరిత్యజించిన యాయిరువురును బూర్వాకారంబులం దాల్చి బద్ధాంజలులై హరిం జుట్టివచ్చి నుతించి నమస్కరించి సెలవుగొని యలకాపురి కేగి కుబేరమంత్రిపదంబుల నధిష్ఠించి యథాప్రకారంబుగా నుండిరి. ప్రసన్నుండైన శ్రీకృష్ణునకును సురలు విరులం గురియ దద్దుందుభులు మ్రోయఁ బ్రకృతిపరంబగు నిజధామంబున కేగె. ఈచక్రతీర్థోత్పత్తివృత్తాంతంబును, గజేంద్రమోక్షణంబును విన్న యన్నరులన్నిసుఖంబులఁబొంది దుస్స్వప్నదుష్టఫలంబులఁ బోఁద్రోసి సుస్వప్నలాభంబులం బొరయంగలరని నుడివి శంఖోద్ధారతీర్థమాహాత్మ్యం బిట్లభివర్ణింపం గడంగె. ౩౯౭

శంఖోద్ధారతీర్థమాహాత్మ్యము.

ఆ॥ అఖిలపాపనాశ ♦ మైన శంఖోద్ధార, తీర్థమందు నెవఁడు ♦ దీర్ఘభక్తిఁ
గనకమిడునొ వాఁడు ♦ కలుషంబులఁ వీడి, వాంఛలొంది పరమ ♦ పదవిఁ జేరు.

క॥ హరిభక్తుఁడు శాంతాత్ముఁడు, సరసుఁడు ప్రీతుఁడనెడివాని♦శార్దూలుఁడు మున్
వరతీర్థంబుల యాత్రను, జరుపుచు నానర్తధరకుఁ ♦ జనుదెంచి యటన్.

ఆ॥ మంచికాలఁకు నొందు ♦ గాంచి యథావిధి, జలకమాడి భక్తి ♦ సరసిజాక్షుఁ
బురుషసూక్తవిధిగఁ ♦ బూజించి ధ్యానించి, శిరము వంచి నతులఁ♦జేసి నపుడు.

క॥ కక్షీవంతుండను తృప్తిక్షితుఁ డాత్రితునిపూజఁ ♦ జెలువాఱు మహాలక్షణయుతశంఖంబెటో, కక్షను నిటకించె జోర ♦ కార్యచణుండై. ౩౬౧

క॥ అటుపయిఁ ద్రితుఁ డది గనమిని, గటకటఁబడి యిట్లు దూఱెఁ ♦ గంబు వెవం డి
చ్చటఁ గాఁజేసెనొ తన్నరుఁ, డిటుపయిఁ దత్సంఖరూప ♦ మెత్తుంగాతన్. 3౬3

క॥ అది విని తచ్ఛాత్రుఁడు కడు, నదరుచుఁ దత్త్రితునిపదము ♦ లందునఁ బడి గ
ద్గదకంఠంబున నిట్టులఁ, గొదకొని ప్రార్థింపఁ దొడఁగె ♦ క్షోణీనాథా! 3౬౪

చ॥ ఎఱుఁగక మీ సుశంఖ మిపు ♦ డేను హరించితిఁ దప్పుఁజేసితిన్
గురువర! నన్ క్షమింపు మటు ♦ కుంభిని జన్మమునెత్తితే నెదన్
గరుణను నింపి చూడు మధి ♦ కంబుగ నమ్మితి మిమ్ము నిమ్మెయిన్
శిరమున మ్రొక్కుచుంటిఁ బరి ♦ శీలనఁ జేయుము గావుమో బుధా! 3౬౫

చ॥ అనవుడు తత్త్రితుండు హృద ♦ యంబున శాంతముఁ జెంది నాయనా!
కనులను మూసియుం దెఱచు ♦ కాలములోపల నెంతసేఁత నీ
వొనరిచియుంటి వింతపని ♦ యొప్పునె? స్తేయకృతాఘ మిట్లు నీ
కనుభవమైన మేల్గలుగు ♦ నా హరిఁ గొల్చిన ముక్తిసేకుఱున్. 3౬౬

తే॥ గురు విటుల్ బల్కు చన నాతఁ ♦ డఱగొఱవిడి
శంఖరూపముఁ దాల్చి యా ♦ సరసునందుఁ
గృష్ణ! కృష్ణ! యటంచు వా ♦ చించుచుఁ బడి
వర్ష శతకంబు నుండె నా ♦ పట్టునందు. 3౬౭

మ॥ పరిపూర్ణుండు పరాత్పరుండు సకల ♦ బ్రహ్మాండనాథుండు నా
హరి యేతెంచి భయంబు వీడు మనఁగా ♦ నా శిష్యవర్యుండు న
బ్బురమై మేఘగభీరమై యభయమై ♦ మోదప్రదంబై మనో
హరమై యున్నతదుక్తి వించు సిటులన్ ♦ ధ్యానించె నవ్వారిగాన్. 3౬౮

తే॥ దీనవత్సల! దీనేశ! ♦ దేవదేవ!, వాసుదేవ! మహాదేవ! ♦ పరమపురుష
నందనందన! గోవింద! ♦ సుందరాస్య!, శంఖచక్రగదాధరా! ♦ శరణుశరణు!

తే॥ ధ్రువునికిన్ ధ్రువపదమును ♦ రూఢినిడితి
వట్టి ప్రహ్లాదుబాధల ♦ నణఁగఁద్రొక్కి
తివల గజరాజునుం గాచి ♦ తివి బలి బల
మెఱిఁగితివి గాదె శ్రీధరా! ♦ యివిగో నతులు. 3౭0

ఉ॥ కౌరవు లార్యబంధుగురు ♦ కాండసమేతమహాసభన్ గుధీ
పూరితు లాచు ద్రౌపదిని ♦ బుణ్యవతిన్ నిలుచుండఁబెట్టి త
చ్చీరల విప్పసాగఁ బరి ♦ శీలనజేసి యపారచీరలన్
దూరిచి యామెఁ గావవొకొ? ♦ ఘాతనిశాచరకోటిపాటవా! 3౭౧

తే॥ లక్కయిక్కరగిలినకా ♦ లంబునందు, విషముఁ బొట్టనిండఁగఁబెట్టు ♦ వేళయందు
భయదవనమునఁ దిరిగెడి ♦ పట్టునందుఁ, బాండవుల నీవు గావవే! ♦ పరమకరుణ.

మ॥ గురుమాతృద్విజవర్యపుత్రకుల నై ♦ కుంతా! వెసం దెచ్చి త
త్కరపద్మంబులఁ బెట్టి తుష్టిగలుగం ♦ గాఁ జేయవే యాదవో
త్కరదార్ఢ్యంబున కాశ్రయుండవుగదా ♦ కారుణ్యరత్నాకరా!
గిరిభద్భీతి తొలంగ గోపకుల ర ♦ క్షింపంగ లేదే ప్రభూ! ౩౨౩

ఉ॥ ఓ యనిరుద్ధ! యో వరద! ♦ యో మురనాశక! యో దయోదయా!
యో యమునేశ! యో సుగుణి! ♦ యో కమలాహృదయేశ! యంబుజా
తాయతపత్రలోచన! య ♦ హార్యధరా! ధరణీమనోహరా!
నా యభివాదనంబు గరు ♦ ణం గొని ప్రోవుము! నన్ను దీనునిన్. ౩౨౪

ఉ॥ తల్లివి నీవె యీవె చెలి ♦ తండ్రివి నీవె విభుండ వీవె నా
చెల్లెల వీవె యీవె గురు ♦ శేవధి వీవె గురుండ వీవె వి
ద్యోల్లసితాత్మ వీవె నిగ ♦ మోదితదివ్యపరాత్మ వీవె భా
సిల్లెడి సర్వలోకములు ♦ శ్రీకమలాలలనామనోహరా! ౩౨౫

తే॥ కృష్ణ! నృగధరావిభు నుద్ధ ♦ రించితివి సు
దాము దైన్యంబుఁ బోఁగొట్టి ♦ తగిలి వల జ
రాత్మజుని భీతిఁ గుందిన ♦ యవనిధవులఁ
బ్రోచితివిగాదె! యల నిన్ను ♦ మ్రొక్కుచుంటి. ౩౨౬

క॥ ప్రద్యుమ్నా! ప్రతిభాంచిత!, సద్యస్కాలంబునందు ♦ శాపహతుని నర్
హృద్యచతుర్వ్యూహాయుతా!, సద్యశము నీకు హెచ్చ ♦ సాఁకుము! దేవా!

మ॥ అనివేఁడన్ హరి శేషభోగసమదీ ♦ వ్యద్బాహుదండంబుతో
ఘనశంఖాభశరీరు దీను నిజభ ♦ క్తశ్రేష్ఠు నాగేంద్రుఁబో
ల్కని నుద్ధారముఁ జేయఁగా నతఁడు హా ♦ లిన్ వీడి శంఖాకృతిన్
గొని దివ్యంబగురూపు నాహరికి మ్రొ ♦ క్కుల్ జేసి కొండాడియున్. ౩౨౭

తే॥ సూర్యశతసమానప్రభా ♦ శోభిత మధ, యంబునగు విమానంబున ♦ నధివసించి
దశదిశల వెల్గఁజేయుచుఁ ♦ దరలి వైష్ణ, వమగు లోకమ్మునకు నేగె ♦ నమలహృదయ!

శా॥ శంఖోద్ధారము శౌరిచేసె నెటఁద ♦ త్స్థానంబు లోకంబునన్
శంఖోద్ధారమనం జెలంగె జనక ♦ న్యాపాలకా! యెవ్వఁడీ
శంఖోద్ధారకథావిధిన్ వినును యా ♦ సత్పూరుషుం డాస్థద
త్శంఖోద్ధారసరోవగాహనఫల ♦ స్ఫాతిం గనున్ సన్మతీ! ౩౩౦

ప్రభాసతీర్థమాహాత్మ్యము.

తే॥ పరమమధురోదకయుత ప్ర ♦ భాసతీర్థ, మును గుఱించి వచించెద ♦ వినినజనులు
కొండలను బోలియుండెడి ♦ దండి దోస, ములను జూర్ణీకరింతురు ♦ బలుసులువుగ.

సీ॥ గురుఁడు సింహంబునం ♦ గుదుర గోదావరిఁ, స్నానదానంబులు ♦ సల్పుఫలము
గురుఁడు కుంభమున నె♦క్కొన హరక్షేత్రాన, స్నానదానంబులు♦సల్పుఫలము
భానుగ్రహణమున ♦ వరకురుక్షేత్రాన, స్నానదానంబులు ♦ సల్పుఫలము
చంద్రగ్రహణమునఁ ♦ జక్కఁగాఁ గాశిలో, స్నానదానంబులు ♦ సల్పుఫలము
తే॥ గలుగుటయుకాక వంద రె♦ట్లులుగఫలము, ప్రాప్తమయ్యెడి నట్టి ప్ర♦భాసతీర్థ
మందు నీరాడి పుడుకుల ♦ నమలభక్తి, సద్ద్విజులకు నిడువారికి ♦ నహరహంబు.
తే॥ దక్షశాపంబునఁ గళల్ ♦ దఱుగుచుండ, క్షయగదాపీడితుండైన ♦ శశిని మఱల
శాపమోక్షంబు నిడి కళల్ ♦ సంభవిల్లఁ, దనరఁజేసినదిట్టి తీ♦ర్థంబకాదె.

సరస్వతీ తీర్థమాహాత్మ్యము.

తే॥ పావనంబును బశ్చిమ♦వాహినియును, ఘనము నగు సరస్వతి యను♦నునియొకండు
సెలఁగుఁదత్ప్రాంతమునసంధుఁ♦జేరి మునుఁగు, పాపి బ్రహ్మస్వరూపుఁడై ♦ వఱలఁగలఁడు
తే॥ వెండి తత్తీరమున బోధి♦పిప్పలమును, నొండు నది యుండు నందుఁ బ♦యోజనేత్రుఁ
డుద్ధవునకు భాగవతంబు♦నుత్తమవిధి, నుడివియుండెఁ బూర్వంబునఁ♦బుడమిఱేఁడ!
ఉ॥ ఏకుటిలుండుగాని యట ♦ కేగి నమస్కృతిఁజేసి దానిని
దాఁకినఁ బూజసల్పినను ♦ దానమొనర్చిన దానమిచ్చినన్
శ్లోకమునో తదర్ధమునొ ♦ సొంపగు భాగవతంబునందు సు
శ్రీకులు సెప్పఁగా వినినఁ ♦ జేతికి విష్ణుపదంబు సిక్కెడిన్. ౩౮౬
తే॥ భాద్రపద శుద్ధ పూర్ణిమన్ ♦ భాగవతము, హేమసింహాసనమున ♦ నెసఁగఁజేసి
దాన మిచ్చిన యాతండు ♦ తత్త్వవేది, యగుచుఁ బరమపదంబున ♦ నధివసించు.
తే॥ ధరణియందున నివసించు♦నరులు తమకు, జన్మముల నొకపరియైన♦సర్వశుభద
భాగవతమును విననిచో ♦ వారి జనులు, గ్రుడ్డిగవ్వకుఁ గొఱగావు ♦ కుంభినీశ!
చ॥ ఎవఁడు చరాచరంబులకు ♦ నీశ్వరుఁడౌ హరిఁ బూజఁజేయరో
యెవరల దివ్యభాగవత ♦ మెచ్చిన భక్తిని నాలకింపరో
యెవరు ధరామరాగ్రణుల ♦ కిష్టముగా భుజియింప నల్పరో
యెవరు హరిం దలంప రల ♦ హీనులు భారముగాదె భూమికిన్. ౩౮౭

గోమతీ సింధుసంగమ మాహాత్మ్యము.

తే॥ ద్వారకాపురిఁ గోమతీ ♦ వార్ధిసంగ, మస్థలంబుసెలఁగు నందు ♦ మానవుండు
గ్రుంకులిడినచో నట్టివై ♦ కుంఠపదవి, కరిగి యానందమంతయు ♦ ననుభవించు
తే॥ అమరనద్యబ్ధిసంగమం ♦ బశ్వమేధ, శతమొనర్చిన ఫలమిడఁ ♦ జాలు నింక
గోమతీసింధుసంగమ♦ధామమో యొ, సఁగును దశసహస్రగుణిత♦ముగ నరేంద్ర!
క॥ ఇందుల కొండితిహాసం, బందముగా నుడువుచుంటి ♦ నాలించిన వా
రందఱు పాపాఘముల, న్డిందుపఱచి తీరుదు రవ ♦ నీరమణీంద్రా! ౩౮౮

చ॥ ధనదసమార్థవంతుఁడును ♦ ధర్మపరిచ్యుతుఁ డార్యనిందకుం
డనుచితకార్యశూరుఁడు వి ♦ టావళిగోష్ఠివిశారదుండు ద్యూ
తనిరతుఁడున్ మదోన్మదుఁడు ♦ దాష్ట్యయుతుండగు నొక్కయూరుజుం
డనయము హస్తినాపురము ♦ నందు నివాసమొనర్చుచుండెడిన్. ౩౯౩

ఉ॥ ఆతఁడు తల్లిదండ్రులకు ♦ నాలికిఁ బాపల కొక్కతేపయున్
బ్రీతిగ మృష్టభోజనముఁ ♦ బెట్టఁడు వారవధూచయంబుతో
రాతిరియుం బవల్ గడుపు ♦ రాఁడు గృహంబున కెప్డసత్యముల్
బ్రాఁతిగఁ బల్కుచుండుఁ దన ♦ వారల కీఁడొక చిల్లిగవ్వనేన్. ౩౯౪

చ॥ హరికథయో చెవిన్ బడిన ♦ యంతన వీనుల మూయుచుండు స్వీ
యరమణి వీడి వేఱగుచు ♦ నాటవెలందులఁ గూడి రొక్కమం
దరను వ్యయంబొనర్చె మఱి ♦ యాతని దగ్గరనున్న డబ్బుఁ ద
స్కరులు ద్రుటిన్ హరించుకొని ♦ సాగిరి సర్వము వోయె నట్టులన్. ౩౯౫

తే॥ పుణ్యమున లక్ష్మి వృద్ధినిం ♦ బొందుచుండుఁ
బాపమున లక్ష్మి చిటికలోఁ ♦ బాడువడును
దానఁ దద్వైశ్యుఁ డఘములఁ ♦ దద్దఁ జేసి
నిర్ధనుం డయ్యె వేశ్యల ♦ నెఱిఁగ విడక. ౩౯౬

చ॥ అల కరిపట్టణాంతరమున ♦ నందున దొంగతనంబుఁ జేయుచున్
మలయుచునుండ నొక్కపరి ♦ మానవనాథుఁడు శంతనుండు దొం
గిలు నల వైశ్యుఁ బట్టికొని ♦ క్రేణినిఁ గొట్టి పురంబునుండి వె
ల్వలఁ దఱుమన్ దదూరుజుఁడు ♦ హాటి వనంబునఁ జేరి సారెకున్. ౩౯౭

తే॥ సంచరించుచు జీవహిం♦సల నొనర్చి, ద్వాదశసహస్రనవవర్ష♦పరిమితమగు
కాలముం గడపె నట దు♦ష్కాలమగుట, నచటనుండి ప్రతీచికి♦నరిగె జనక!

తే॥ అవల నాయూరుజుండు సిం ♦ హంబుయొక్క
తలహాతిం బడి డమ్మనెఁ ♦ దక్షిణమున
నంజనాచలనిభులును నా ♦ యతశరీరు
లునగు యమకింకరులు వచ్చి ♦ కినుకతోడ. ౩౯౯

చ॥ అల విశుఁ బట్టి మోఁకులఁ ద ♦ దాస్యము క్రిందికిఁగాఁగఁ గట్టి చే
తులఁ జబుకుల్ గ్రహించి కసి ♦ తో మెయిఁ దద్దయుఁ గట్ల దద్దురుల్
లలిఁ బ్రహరించి ముష్టులఁ ద ♦ లం గడు మొట్టి వెసన్ బరేతరా
ట్పథమున కీడ్చుకొంచుఁ జన ♦ సాగిరి తత్సమయంబునందునన్. ౪౦౦

తే॥ ఒక్క పెద్దగద్ద యరిగి త ♦ దూరుజభుజ
మాంసమును గొని వడిని వ్యో ♦ మమున కెగిరి

స్వీయచంచూపుటమున గ్ర ♦ సించుచుండె
నట్టితఱిని శేషించిన ♦ యండజములు. ౮౧

వ॥ ఆహారంబు లేక తన్మాంసంబు గైకొనందలంచి యుద్రేకించి దానిని వెంబడించి నిరోధించి పోరాడ నది యవ్వాని ధిక్కరించి చనుచుండె. ఇట్లవ్వాని కన్యోన్యంబున శంఖచిహ్నాదితుల్యంబులగు గాయంబులతోఁ గోలాహలంబుగాఁ గలహం బయ్యె. అప్పు డను దగ్ధగృధ్రంబు తన వాతనుండి తత్పలలంబును వదలక పశ్చిమదిశకుం జనె. అంతఁ దత్సమంబగు మఱియొండు మహాగృధ్రంబు తోతెంచి యద్దానితోఁ బోరాడి నిజచంచుపునం బొడువ నది యడలి తన మొగంబునుండి తదామిషంబును విడిచె. అవలఁ దత్ఖండంబు మహాపుణ్యాకరంబగు గోమతీసింధుసంగమంబునం బడి మునిఁగె. తావన్మాత్రంబుననే యా వైశ్యుండు పాపవిముక్తుండై తత్కింకరు లాలోకించుచుండ జంకుగొంకుల మాని స్వయంబుగా యమపాశంబులం ద్రెంచి చతుర్భుజసమన్వితంబగు సుందరరూపంబు ధరించి వైకుంఠంబునుండి విష్ణుదూతలు తోడ్కొని వచ్చిన దివ్యవిమానం బెక్కి దశదిశల వెలిఁగించుచుఁ బరమపదంబున కరిగెం గాదె. ఇట్టి గోమతీసాగరసంగమప్రభావవర్ణనం బొనర్ప నెవ్వండు శక్తుండగు? ఏతత్కథాశ్రోతలు సర్వకిల్బిషంబులు దూరీకరించి యంతిమంబునఁ బరమపదంబునకేగఁ గలరని యెఱుంగుము. మఱియుఁ దద్ద్వారకాపురీ విరాజమానసాగరమాహాత్మ్యంబు సైత మాకర్ణింపుమని యిట్లనియె. ౮౨

సాగర మాహాత్మ్యము.

క॥ వైశాఖ శుద్ధ పూర్ణిమ, నాశైవలినీశులేశు ♦ నందు మునిఁగి పూ
జాశంసనముల నొనరిచి, రాశిగ మణు లియ్యఁ దగును ♦ రాజవరేణ్యా! ౮౩

తే॥ అట్లుచేసిన మానవు ♦ నఘసమున, బ్రహ్మవిష్ణుమహేశ్వరుల్ ♦ వఱలఁగలరు
వానిఁ గనుమాత్ర ధన్యత ♦ వఱలువానిఁ, దాఁక బ్రహ్మహత్యాదులుఁ ♦ త్వరఁదొలంగు.

తే॥ ఇంక నాయంబుధిస్నాత ♦ యెచట నడుగు,లిడునొ యచ్చట వర్షముల్ ♦ బడును సరిగ
సర్వరోగముల్ నశియించు ♦ సంతు సిరియుఁ, గలుగు ననుచిత కార్యముల్ ♦ గలుగవయ్య!

క॥ జగమును నాశ మొనర్చెడి, తెగ దారియు వానిఁ గనినఁ ♦ దీక్ష్ణాఘములన్
దెగఁగొట్టి పరమపదమునఁ, దగఁగలఁడని యెఱుఁగుమయ్య! ♦ ధరణీనాథా!

రైవతాచల మాహాత్మ్యము.

క॥ రైవతగిరిమాహాత్మ్యము, భూవర! వచియింతు వినుమ! ♦ భుక్తి ముక్తి
సేవ నొసంగును ఘన దో,షావళి నశియింపఁ జేయు ♦ నది నిక్కముగాన్. ౮౪

ఆ॥ గౌతమాత్మజుండు ♦ ఘనుఁడు మేధావినా,మకుఁడు వైష్ణవుండు ♦ మౌనివరుఁడు
వింధ్యయనెడి గిరిని ♦ వెలిఁగి లక్షాబ్దముల్, తపముఁ జేసె నపుడు ♦ ధారుణీంద్ర!

తే॥ తన్మునిఁ గన నపాంతర♦తమమునీంద్రుఁ,డరుగుదెంచెను దత్సమా♦యంబునందు
నట్టి మేధావి భక్తి నా♦త్మాసనంబు, నుండి లేవకుండుటఁగాంచి♦మండి యలఁదు

ఉ॥ అల్ప! తపోభిమాన మిటు ♦ లగ్గలమయ్యెనె? నీకుఁ బెద్దలన్
స్వల్పులఁజేసి యుంచుకయు ♦ శైలముబోలెఁ జలింపకుందువే?
తాల్పవె నమ్రభావ మిఁక ♦ దాన నరంబున నీవు గొండవై
తెల్పుఁడులేనిశైవడి షి ♦ తిన్ దగుమంచు శపించి యేగఁగాన్. ౪౧౦

క॥ అల మేధావియు వెంటనె, మలయై శ్రీశైలమునకు ♦ మవ్వాపుబిడగాఁ
గలుములచెలిచెలి బత్తిని, దొలిబాముసు మరువకుండఁ ♦ దోతెంచెఁ జుమీ.

చ॥ ఒకపరిఁ దన్మునీశ్వరుఁడు ♦ యుక్తవిధంబున మన్ముఖంబునన్
సకలము ద్వారకాపురల ♦ సన్మహిమంబుల నాలకించి నన్
ముకుళితహస్తపద్ముఁడయి ♦ మ్రొక్కియు నిట్టులఁబల్కె బ్రహ్మపు
త్రకవర! నామొఱన్ వినియు ♦ ధన్యుఁగఁజేయుము! యద్ది యేదనన్. ౪౧౨

మ॥ అల ద్వారావతినున్న రైవతధరే ♦ శాంతస్థ్సలం బొంది యా
దలతో జోతలసల్పి యిట్టులనుమా! ♦ ధాత్రీశ! మేధావి నీ
బలమే నమ్మి వసించెఁగాన నతనిన్ ♦ భద్రంబుగాఁబోయి త
త్స్థలి పీడం గొనితెచ్చి నీపురమునన్ ♦ స్థాపింపుమం చోముసీ! ౪౧౩

చ॥ అనవుడు భక్తతాపహర ♦ ణాత్మకకార్యరతుండనైన నే
విని యది సమ్మతించి వడి ♦ వేడ్కగ ద్వారకనున్న రైవతే
శుని దరికేగి వాని మన ♦ సున్ దెలుపంగ నతండు దానికి
స్ఘనముగ నొప్పి యిట్లనియె ♦ నాకు మనోహరసూక్తులన్ విభూ! ౪౧౪

ఉ॥ నారద! వింటె నన్ను శర ♦ ణంబును జెందినవానిఁ గాచుటే
సారముగల్గు కార్యమని ♦ చక్రనెఱింగితి నట్టిశైల మీ
ద్వారకయందు లే దదిక ♦ తంబునఁ దద్గిరినాథు మద్భుజా
సారముతోడఁబీకి యిట ♦ స్థాపనఁజేసెద నట్టులేనటుల్. ౪౧౫

తే॥ అంత నటనుండి నేఁబోతి ♦ నతఁడుగూడఁ,దద్గిరిని దీసికొనిరాఁగఁ ♦ దలఁచి తగిన
యత్నమందుండ నింతలో ♦ నాయచలముఁ,గనిన శ్రీగిరిదరికి నేఁ ♦ జని ముదమున

వ॥ కలహంబును బుట్టించునట్టిమాటలతోఁ తత్సుతసంగ్రహణాత్మకరైవతో
ద్యోగంబును వినిపింప నా శ్రీశైలంబు పుత్రమోహసంహతుండై యుత్పన్నానర్థ
ప్రతీకారంబుకంటె ననర్థోత్పత్తిప్రతిబంధంబే వరంబని యెంచి గిరిరాజులగు మేరు
హిమవంతుల చెంతకుం జని వినతుండై వారి ప్రాపుం గోరి యిట్లనియె. ౪౧౭

ఉ॥ దైవము పుత్రు నొక్కనిగ ♦ దా యిడె నాకలవాని త్రేపా మా
పో వడి రైవతుం డనెడి ♦ భూపతి నాదరి కేగుదెంచి బల్

చేవను సంగ్రహించుకొని ♦ స్వీయపురంబున కేగునంత నా
జీవము తల్లడిల్లు నదొ ♦ చెప్పఁడు! ప్రోవఁడు! నన్ను నా సుతుల్. ౪౧౮

చ॥ కొడుకును వీడి నే క్షణము ♦ గూడ వసింపఁగలేను దాన మీ
యడుగులపైని వ్రాలి శర ♦ ణంటిని వైళము యట్టి రైవతున్
గడపి మదాత్మజున్ నిలిపి ♦ కీర్తినిఁ జెందుఁడి! పొందుఁడీ! నతుల్
విడువకుఁ డిట్టి దీనుఁ బృథి ♦ వీధరనాయకులార! నావుడున్. ౪౧౯

చ॥ సరియని తన్నగేశ్వరు ల ♦ సాధ్యధరాధరలక్షయుక్తులై
శరణను గోరు శ్రీగిరిని ♦ సైతముఁ దోడ్కొని తత్స్థలంబునన్
ద్వరగతిఁ జేరి రైవతుఁడు ♦ వచ్చి తదద్రిని నాంజనేయుమా
దిరిగ భుజంబులందు నిడి ♦ తేకువ నేగుటఁ గాంచి కిన్కతోన్. ౪౨౦

తే॥ శస్త్రముల నస్త్రముల ఖడ్గ ♦ సమితిఁ దాల్చి
యతఁడు పోయెడి నధ్వము ♦ నడ్డగించి
తలపడన్ రైవతుండు ప ♦ తత్తటిత్తు
నరణి శబ్దింప నట్టహా ♦ సంబుఁ జేసె. ౪౨౧

క॥ తద్రవమున బ్రహ్మాండము, భద్రము విడి మాఱుమ్రోఁగె ♦ బహుభయమున ది
గ్భద్రేభంబులు భ్రాంతిలె, నద్రిగతాయుధములు దమ ♦ యంతట రాలెన్.

తే॥ అవలఁ దన్నగేశ్వరులు ని ♦ రాయుధులయి
సరకుసేయక సరగ శ్రీ ♦ శైలసుతుని
దీసికొనిపోవుచుండు ను ♦ దీర్ణబలుని
రైవతుని వెంటనంటి క ♦ రముగ నార్చి. ౪౨౩

ఉ॥ తిట్టిరి మానభంగకర ♦ తీవ్రవచఃప్రచయంబుతో మొయిం
గొట్టిరి రక్తనిర్ఝరిణి ♦ కోటులు భూమినిఁ బాఱఁగాఁ దలన్
మొట్టిరి చేతిమ్రేళ్ళఁ గడు ♦ మోఁదిరి జానువులన్ మహార్భటిన్
నెట్టిరి నేలఁగూలునటు ♦ నేటుగ బాటను జాటిపోటులన్. ౪౨౪

తే॥ మున్ను శ్రీహనుమంతుఁ డ ♦ మోఘబలులు
పెక్కుమంది వేధించినన్ ♦ విడక గిరిని
నరిగినట్టుల రైవతుం ♦ డచలవరులు
బాధపెట్టిన నాగిరిన్ ♦ వదలకుండె. ౪౨౫

తే॥ ఇట్టి తరుణంబునందున ♦ నేను పోయి, హరికి శ్రీశైలపుత్రకు ♦ నభిమతంబు
రైవతోద్యోగ మద్రీశ్వ ♦ రప్రవృత్తి, యంత నుడివితి దాని కా ♦ హరియు నొప్పి

క॥ తన భక్తునిఁ బ్రోవుటకై, వినుతెన్నున నచట కరిగి ♦ వే నిజతేజ
స్సున దద్రైవతునకు భయ, మును బాపుచు నిచ్చి చనియె ♦ భూపుం డవలన్.

మ॥ భగవత్తేజముతోడ మీఱి యల గ్రా♦వం బొందు హస్తంబుతో
మిగులం బట్టుచు వజ్రితుల్యుఁడగు త♦న్మోర్వద్రి దంభోళి కీ
డగు ముష్టిం బ్రహరించి శీతగిరి న♦య్యారే! యనంగూల్చె మెం
డుగ నన్యాద్రులఁ గాళ్లఁ దన్నె నటఁ డా♦ టోటమి లేనట్టులన్. ౪౨౮

ఉ॥ మేరునగంబు విహ్వలత♦ మిన్నక యుండె హిమాద్రి నొచ్చె నా
శ్వేరము వీడి పాఱె నల♦ వింధ్యము మున్నగు కొండలెల్ల సొం
పారెను రైవతాస్య మల♦ యద్రిసుతుండును మెచ్చె నిచ్చ నిం
డారె జయారవంబులును♦ నావిభుఁడా యనినుండి క్రమ్మఱెన్. ౪౨౯

ఆ॥ ఇట్టు లచట వెడలి♦ యాగిరి నానర్త, భవ్యదేశమందుఁ♦ బడఁగవైచె
నద్రిసుతఁ దదద్రి♦ హరిభక్తుఁడై రైవ, తకగిరీంద్రుఁడనఁగ♦ ద్వారకఁ దగు.

ఉ॥ దానిని జూచు మానవక♦దంబము వాయును బ్రహ్మహత్యలన్
దానిని దాఁకువారు సవ♦నంబుల వంద యొసంగు పుణ్యముల్
మానక కాంత్రు దానికొక♦ మాఱు ప్రదక్షిణ మాచరించినన్
బూనిక తీర్థయాత్రలకుఁ♦ బోయిన సత్ఫల మబ్బు నేరికిన్. ౪౩౧

తే॥ మఱియు నా మలయం దెట్టి♦మనుజుఁడైన, నొక్క బ్రాహ్మణునకు నేని♦నొక్కతడవ
భోజనముఁ బెట్టి నట్టైన♦ భువననాథుఁ, డైన శ్రీహరి పదవికి♦ నరుగఁగలఁడు.

యజ్ఞతీర్థ కపిటంకాది తీర్థమాహాత్మ్యము.

వ॥ వెండియు నారైవతగిరియందొక యజ్ఞం బొనర్చినఁ గోటిఫలంబు లిడం జాలిన యజ్ఞతీర్థం బను నొకదాని నారైవతుండు ద్రవ్వించెంగాదె. అద్దాని కనతి దూరంబునఁ గపిపాతసముద్భూతంబును, సర్వపాపప్రణాశనంబు నగు కపిటంక నామకతీర్థం బొండుగలదు. అందు భౌమాసురసఖుండును దుష్టుండునగు ద్విజుండను వానరుం డుద్దండబలుండగు బలరాముని యశనిసదృశంబగు ముష్టిని నిహతుండై ముక్తిం జెందె. మహాత్ముల నిగ్రహంబును సద్గతిమూలకంబు గాదె. ఆతీర్థంబునకుఁ బ్రత్యహం బమరులు స్నానార్థంబై యేగుదెంతురు కలవిలంకయాత్ర యొనర్చిన వారికిఁ గోటిగోదానఫలంబును, దద్ద్విగుణంబుగా దండకారణ్యసంచారులకును, దత్త్రిగుణంబుగా సైంధవవననివాసులకును, దత్పంచగుణంబుగా జంబుమార్గస్థులలకును, దద్దశగుణంబుగాఁ బుష్కరాటవివిహారులకుఁ దద్దశగుణంబుగా నుత్పలావర్తయాత్రికులకును, దద్దశగుణంబుగా నైమిశారణ్యాభాసురులకును, దత్శతగుణంబుగాఁ బుణ్యం బీతత్కపిటంకతీర్థసేవకులకు లభించితీరు. మఱియు ౪౩౩

క॥ నృగకూపంబను తీర్థము, తగియుండెను గొప్పదనఁగ♦ ద్వారకలోఁ దా
నిఁ గనెడివారలు బ్రాహ్మణుఁ, డెగఁగొట్టిన దోసమైనఁ♦ దెగవేతురుగా. ౪౩౪

తే॥ నృగుఁడు దెలియక యొక మేది ♦ నీసురసుర, భిమఱింగొని మఱియొక్క ♦ విప్రున కిడ
దానఁ గృకలాసదేహంబుఁ ♦ దాల్చి యతఁడు, ద్వారకాస్థకూపంబునఁ ♦ దనరుచుండె.

ఉ॥ ఆతఁడు వాతలందుఁ జెద ♦ యయ్యుఁ జతుర్యుగకాలమానమా
నూతి వసించుటం గని య ♦ నుగ్రహసాగరుఁడైన శ్రీధరుం
డాతని నుద్ధరించెను ద ♦ యన్ "నృగకూప" మటంచు నద్ది వి
ఖ్యాతినిఁ బొందె నాఁటిసుత ♦ కల్మషపర్వతవజ్రతుల్యమై. ౪౩౬

తే॥ ఊర్జపూర్ణిమ నట్టి తీ ♦ ర్థోదకమున, మునిఁగినం గోటిజనిపాప ♦ ములు నశించు
నందు నొకగోవు నిచ్చిన ♦ నాలకోటి, దానమిచ్చిన ఫలమబ్బు ♦ ధారణీంద్ర!

గోపీభూమిమాహాత్త్మ్యము.

తే॥ మఱియు గోపికామేదినీ ♦ మహిమ నీకు, విస్తరంబుగ వినిపింతుఁ ♦ బృథివినాథ!
యద్ది వినువారు పాపంబు ♦ లవలఁ ద్రోసి, యవ్యయమగు సత్పదవికి ♦ నరుగఁగలరు.

శా॥ పాపారణ్యకుఠారనుం జెది బహు ♦ ప్రఖ్యాతినిం గాంచెనో
గోపీచందన మెస్థలిం గలిగెనో ♦ గోష్యంగరాగంబుల
న్గోపీరత్నము లేమహాస్థలమున ♦ న్శోభిల్లెనో యద్దియే
గోపీభూమి యనన్ వినోదకరమై ♦ క్షోణిం బ్రతిష్ఠం గనెన్. ౪౩౯

క॥ ఘనమగు నాగోపీచం, దనమెవ్వఁడు పూసికొనునో ♦ తన్నరుఁడు మరు
ద్ధునిలో మునిఁగిన పుణ్యం, బును జెందఁగలఁడు విదేహ ♦ భూభుజవర్యా! ౪౪౦

చ॥ అనిశము గోపిచందనము ♦ హస్తరముద్రల నొప్పువాఁడు తీ
ర్థనికరసేవనవ్రతివి ♦ తానమఖప్రకరాశ్వమేధవే
దనిహరరాజసూయవర ♦ దానసమార్జితపుణ్యరాశులన్
దినదినమున్ గ్రహించెడి సు ♦ ధీనగుఁడై చరితార్థుఁడౌ విభూ! ౪౪౧

తే॥ విష్ణుపదినిష్ఠుతు కంటెను ♦ ద్విగుణ పుణ్య, మిచ్చుఁ జిత్రకూటజరజం ♦ బిచ్చుఁ దద్ద
శగుణఫలమిచ్చుఁ బంచవ ♦ టిగరజంబు, తచ్ఛతగుణఫల మిచ్చుఁ ద ♦ చ్చందనంబు

క॥ గోపీచందన మలఁదినఁ, బాపియు యమకింకరులకుఁ ♦ బట్టువడక యో
భూపతి! ప్రకృతిపరంబగు, గోపృథివికిఁ జేరగల ర ♦ కుంఠితగతితోన్. ౪౪౩

ఉ॥ భారతవర్షమందు మును ♦ బాపియుఁ బాపిసహస్రసంగుఁడున్
వారసతీనృతుం డనృత ♦ వాది పరార్థపరుండు సింధుసౌ
వీరమణుండు నార్యపృథి ♦ వీసురశత్రుఁడు దీర్ఘబాహుఁడన్
వీరుఁడొకండు గ్రాలు నవి ♦ వేకిశిరోమణి యాచు భూమిపా! ౪౪౪

క॥ నిర్భయమున నా దుష్టుఁడు, గర్భవతీదశకము వర ♦ కపిలాసురభిన్
నిర్భరయోగాంచితమణి, గర్భామరశతము హతము ♦ గావించి మఱిన్.

చ॥ ఒకపరి సైంధవాశ్వమున ♦ నుద్ధతి నెక్కి నిశాతహేతికా
ర్ముకపరిఘాగదాదిరుచి ♦ రుండయి కానకు నేగి వేటఁ గో
రికి నొనరించి క్రమ్మఱుత ♦ ఱిం గని తత్సచివుండు వాని కు
త్తుక నొఱనుండి వాలు వడి ♦ దూసి వధించెఁ బ్రభుత్వలుబ్ధుఁడై. ౨౨౭

తే॥ నఱికినంతనె కాలకిం ♦ కరులు వచ్చి, చచ్చిపడియున్న వానిని ♦ జక్కఁజూచి
కట్టి మోఁకుల జాటులఁ ♦ గొట్టి నగుచు, జమునిమునికికిఁ దోడ్కొని ♦ చనిరి పిదప.

చ॥ యముఁడతనిం గనుంగొని ర ♦ యంబునఁ బిల్చియుఁ జిత్రగుప్తునిన్
గ్రమముగ నిట్టులడ్గె గణ ♦ కా! యితఁడెవ్వఁడొ? వీనికున్న పా
పములెవొ? యింక నే నరక ♦ బాధల కీఖలుఁ డర్హుఁడౌను? యీ
సమయమునన్ వచింపు మన ♦ సద్దగ నాతఁడు నల్కి నీరసోక్తిన్. ౨౨౮

తే॥ ధర్మరాజ! మహారాజ! ♦ దండధర! కృ
తాంత! సమవర్తి! పితృపతీ! ♦ ధాత్రియందు
నితఁడు దీర్ఘబాహ్వభిధాన ♦ యుతుఁడు వీఁడు
చేసినట్టిపాపములు హె ♦ చ్చిల్లియుండె. ౨౨౯

వ॥ దేవా! తపనావీచిరౌరవమహారౌరవసంఘాతకాలసూత్రాదినరకం
బులును దప్తకుండంబును క్షౌరకుండంబును పిట్కుండంబును మూత్రకుండంబును
శ్లేష్మకుండంబును వహ్నికుండంబును వసాకుండంబును దూషికాకుండంబును
శుక్రకుండంబును నసృక్కుండంబును మజ్జాకుండంబును మాంసకుండంబును క్షౌర
కుండంబును గర్ణవిట్కుండంబును నఖకుండంబును లోమకుండంబును కేశకుండం
బును నస్థికుండంబును దామ్రకుండంబును లోహకుండంబును తప్తసురాకుండంబును
బ్రతప్తకుండంబును బ్రతప్తతైలకుండంబును దీక్ష్ణకంటకకుండంబును విషకుండంబును
దంతకుండంబును గ్రిమికుండంబును బూయకుండంబును సర్పకుండంబును మశకకుం
డంబును దంశకుండంబును వజ్రదంష్ట్రికుండంబును వృశ్చికకుండంబును శరకుండం
బును శూలకుండంబును ఖడ్గకుండంబును గోళకుండంబును నక్రకుండంబును గాక
కుండంబును సంచానకుండంబును వాజకుండంబును దప్తపాషాణకుండంబును శాత
పాషాణకుండంబును లాలాకుండంబును జ్వాలాకుండంబును గాత్రమలకుండంబును
దప్తశూర్మ్యంబును సూచీముఖమును గోధాముఖంబును నక్రముఖంబును గజదం
శంబును గుంభీపాకంబును నరుంతుదంబగు వటోదంబును శాంసుభోజనంబును
పాశవేష్టంబును శూలప్రోతంబును బ్రకంపనంబును నుల్కాముఖంబును నంధకూపం
బును వేధనంబును దండతాడనంబును జాలబద్ధంబును దేహచూర్ణంబును దళనంబును
శోషణంబును కషంబును సర్పజ్వాలాముఖంబును సర్పజిహ్వాముఖంబును ధూమాం
ధంబును నాగవేష్టనంబు లోనుగాగల భయంకరంబులును దుస్సహంబులు నగు

చతురశీతిలక్షమహానరకంబులు దమయేలుబడిలో గలవు. వీని యన్నిటియందు నితండు సమగ్రంబుగా బాధింపం దగినవాఁడు సంశయంబులేదు. వినుఁడు. ౪౫౦

ఉ॥ పాపము లవ్వి యేవనిన ♦ బ్రాహ్మణగర్భవతీవధంబులున్
బాపల వేల్పులన్ గురులఁ ♦ బల్మఱు దూఱుచునుంటఁ దేవరన్
దేప కసత్యమాడుటయు ♦ నిక్కటయున్ గపిలావధంబు రా
పాడుచు సాధుజంతువుల ♦ నంతమొనర్చుట లోనుసేఁతలే. ౪౫౧

చ॥ పలుకఁగ నిట్లు లేఖకుఁ డ ♦ వాచిదిగీశ్వరు నాజ్ఞఁ గింకరుల్
దలపడి వానిఁ బట్టుకొని ♦ ధారణి నీడ్చుచు వెఱ్ఱియామడల్
గలిగి భయంకరంబును న ♦ గాధము నై తగు కుంభియందునన్
సలసలఁ గ్రాఁగు నూనెను వె ♦ సన్ బడవేసిరి జాలిమాలియున్. ౪౫౨

తే॥ అల మహాపాపి పడినంతఁ ♦ బ్రలయపావ
కాభతప్తాకవహ్ని న ♦ ల్లాఱెఁ బ్రమటిపి
దొల్లి బ్రహ్మాదుఁ డగ్నిలో ♦ దూఁక నద్ది
శీతలతఁ గాంచినట్టుల ♦ భూతలేశ ! ౪౫౩

తే॥ అట్టి సంగతి యమదూత ♦ లాత్మపతికిఁ
జెప్పి రంత నాశమనుండు ♦ చిత్రగుప్తు
మఱలఁ బిలిచి యీ దుష్టుఁడు ♦ మంచిసేఁత
యెదియుఁ జేయఁడె ? యిదియేమి ? ♦ యెఱుఁగఁ జెపుమ ! ౪౫౪

క॥ అని యడుగుచుఁ జింతించుచుఁ, దన కెడికాలంబునందుఁ ♦ దన సభ కేతెం
చిన ధర్మజ్ఞుని వ్యాసుని, ఘనుఁ గని యిట్లనియె బద్ధ ♦ కరకముఖుండై. ౪౫౫

మ॥ అనఘా ! యీతఁడు భూతలంబున సుకా ♦ ర్యంబెద్దియున్ జేయలే
దనయంబున్ సురభూసురార్యవిబుధ ♦ న్యక్కారముల్ గర్భిణీ
వనితాబ్రాహ్మణధేనుసన్మృగచయ ♦ ప్రాణాపహారంబుఁ జే
సినవాఁ డాటను వీనిఁ దెచ్చి యిటకీ ♦ చిత్రోక్తి నాలించియే. ౪౫౬

క॥ వడిఁ గుంభీపాకమునన్, బడవేయఁగ నాజ్ఞ యిడితిఁ ♦ బడినంతనె యీ
తఁడు తజ్జ్వాలనుఁడు నల్లం,బడె నియ్యది వింతగాదె ♦ పరమమునీంద్రా ! ౪౫౭

క॥ ఇందుల కేకారణమో, డెందమునం దరసి యిపుడు ♦ దీవిం జెప్పన్
వందనము లొనర్తు నెడఁద, గుందుచుఁ గొట్టుకొను మాని ♦ కోటిసుత్యా !

వ॥ అనవుడు పారాశర్యుం డిట్లాడె. ధర్మరాజా ! పాపపుణ్యంబులకు స్థూల సూక్ష్మంబులను రెండుదశలు గలవు. అందీతండు భూతలంబున నేసత్కార్యం బొనరింపకపోయినను దైవవశంబున నిర్ధనుం డర్ధరాశింగాంచి నట్లొకమహాత్ముని కరాగ్రంబునుండి రాలిన గోపీచందనంబునఁ బూర్ణంబైన ప్రదేశంబుం గాంచి

యందుఁ బ్రాణంబుల విడిచినవాఁడయ్యె. తత్ప్రభావంబునఁ దత్ప్రపాతంబగుచుఁ దత్కుంభీపాకాగ్ని యట్లు నిర్వాపణంబుఁ జెందె. నరుఁడు తద్గోపీచందనలిప్తాంగుండైనను దద్దర్శనం బాచరించినను బ్రహ్మహత్యాదివిముక్తుండై నారాయణుండగుఁ గాదే యని బోధింప నా సమవర్తి తత్కీర్తిపిదుండై యాతని నా తైలంబు నుండి తీసి మన్ననతోఁ దోడ్కొనివచ్చి దివ్యవిమానంబున నెక్కించి ప్రకృతిపరంబగు వైకుంఠలోకంబున కంపె. ఏతద్గోపీచందనమాహాత్మ్యం బాలించిన జనులు దురితంబుల దూరీకరించి హరిం జేరఁగలరని యెఱుంగుము. మఱియు నా ద్వారకాపురీవిరాజమానసిద్ధాశ్రమమహిమంబు నుడివెద నాకర్ణింపుమని యిట్లనియె. ౪౫౯

సిద్ధాశ్రమమాహాత్మ్యము.

క॥ ఎద్దాని స్పృశించినచో, నద్దనుజారాతి కరుణ ♦ నగుపడి సతతం
బొద్దను బాయక చెలఁగునొ, యద్దియె సిద్ధాశ్రమమని ♦ యందురు పెద్దల్.

క॥ కన నట సాలోక్యము దాఁకినచో సామీప్యము మునిఁ♦గిన సారూప్యం
బును వసతిని సాయుజ్యము, మనుజులు వొందంగఁగలరు ♦ మైథిలనాథా!

చ॥ హరి విరహవ్యథాకులహృ ♦ దన్విత, యిందునిభాస్య, రాధికా
తరుణి, స్వకీయచేటిక య ♦ థాక్రమ మొప్పఁ దదాశ్రమప్రభా
వరుచిరసంగతుల్ దనకుఁ ♦ బల్కఁ దమిన్ విని రాధమాసభా
సురతరణిగ్రహంబునఁ బ్రది ♦ శుద్ధిగ నెంచె నటన్ మునుంగఁగాన్. ౪౬౨

వ॥ అంత నా రాధికాకాంతామణి శ్రీకృష్ణసఖుండగు శ్రీదాముండు హరివిరహప్రదంబగు శాపంబుఁ దన కిచ్చి శతాబ్దంబులు గడచుచున్నసమయంబునం గదళీవనంబునుండి లేచి శతయూథసమన్వితయై నిర్గమించి గోపకగణంబులు పరివేష్టించి నడువ సుందరీమణులు ఛత్రచామరంబులం గొని కొలువ నందంబగు నందలం బెక్కి యానర్తదేశవిరాజమానతత్సిద్ధాశ్రమతీర్థరాజంబున కరిగె. అట్టిపట్టున ౪౬౩

తే॥ యాదవోత్తమపరిమండి ♦ తాచ్యుతుఁడును
షోడశసహస్రగోపికా ♦ శోభితుఁడయి
యట్టి సిద్ధాశ్రమోత్తమ ♦ యాత్రఁ జేయ
వచ్చి యుండె ముదమునఁ ద ♦ త్పరగమునందు. ౪౬౪

సీ॥ శస్త్రంబులం దాల్చి♦చబుకులం గరములఁ, బట్టిన భటులు న♦ల్ప్రక్కలు గన
మగవారు సొరరాని♦మాడ్కిని గొందఱు, గోపకవీరులు♦గూడి చూడఁ
బండ్లగంపను జుట్టు♦పద్ధతి నెచ్చెలుల్, సుట్టుముట్టుచు నెఱిఁ♦జూచుచుండఁ
గావలసిన వస్తు♦కాండముఁ బరిచార, కావళి యొడపక♦యంద నియ్య

తే॥ శాస్త్రవిధిగ సిద్ధాశ్రమ♦సలిలమందు, రాధ నీరాడి దివ్యాంబ♦రములఁ దాల్చి
సర్వవిధదానముల భక్తి♦జగతిసురుల, కిడి నమస్కృతిఁ జేసి నో♦పుడమితేఁడ!

తే॥ అటకు నీరాడవచ్చిన♦యట్టి ద్వార, కాపురీవ్రజ రాధికా♦కాంత భటుల
బెత్తముల దెబ్బలం బడి♦బెదరి కనుచు, నొక్క యొక్కను నిలిచె నా♦యుచితవేళ.

క॥ వనజాక్షుని సతులందఱు, వనమాలిసమేతలగుచు ♦ భక్తిని స్నానం
బొనరింపఁగఁ దజ్జనులకు, వెనుకనె చని వారి నచటి ♦ విభవముఁ గనుచున్.

చ॥ అడిగి రిటుల్ స్వకీయవిభు ♦ నచ్యుత! యీస్థలమందు నెందఱో
పడఁతులు సుట్టుముట్ట యదు ♦ వర్యులు నల్గడలందుఁ గావ ని
క్కడు జలకంబులాడియు న ♦ మోఘముగాఁ బుడుకుల్ బొనర్చు నీ
పడఁతుక యేయమో యెఱుఁగఁ ♦ బల్కవె? సర్వవిదుండ వీవగా. ౪౬౮

ఉ॥ నావుడు దేవకీసుతుఁ డ ♦ నన్ సమకట్టు నిటుల్ లతాంగులా
రా! వినుఁ డీపె నా నెలఁత ♦ రాధిక నాఁ దగి వారి రాసఖే
లావిధి ముఖ్యయై బహువి ♦ లాసవిలోలయు నై శుభాంగియై
శ్రీవృషభానుపుత్త్రియయి ♦ శ్రీమతియై పరయై చెలంగెడిన్. ౪౬౯

తే॥ ఈవ్రజేశ్వరి నీరాడ ♦ నిచ్చ చేత, వ్రజమునుండి ప్రయాణమై ♦ పాపనాశ
మైన యిట్టి సిద్ధాశ్రమ♦మాత్మగోపి, కాసహిత యాచుఁ జేరె ని♦మ్మలుమబుద్ధి.

వ॥ మఱియు నీ జగన్మోహిని యిమ్మహాశ్రమంబున జలకంబాడి పుడుకులఁ
బెక్కింటిని బుడమివేల్పుల కొసంగి ప్రకాశించుచుండె. అద్భుతంబగు నీ మహా
వైభవం బంతయుఁ దదీయంబని యెఱుంగు మన నయ్యిందిరాకాంతుని కాంతలలో
సత్యభామ యను భామినీలలామంబు రూపయౌవనగర్వితయై యల్లన నిజసపత్ను
లతో నిట్లనియె. ౪౭౧

క॥ హరి కర మీపెను బొగడెడి, ధర నీయమ రూపవతియొ? ♦ ధైర్యవతియొ స
త్కరుణావతియొ గుణవతియొ, యరయఁగ నన్ మించఁగలదె? ♦ యంగనలారా!

ఉ॥ కాని కడంగి రూపసిని ♦ గాను దయామతిఁగానొ ధీరనుం
గానొ విభూతులున్న సతి ♦ గానొ యుదారను గానొ యోగ్యనేఁ
గాను మఱెట్టి భామినిని ♦ గానొ వచింపుఁడి! నాదుతండ్రి ము
న్నీ నను నెందఱో ఇబుధు ♦ లిమ్మని వేఁడుట మీ రెఱుంగరే? ౪౭౩

సీ॥ శతధన్వుఁడనువాఁడు ♦ మృతుఁడయిపోవుట, లలితమ ద్రూపమూ ♦ లమునఁగాదె
యక్రూరకృతవర్మ ♦ లటు పాఱిపోవుట, లలితమ ద్రూపమూ ♦ [illegible]మునఁగాదె
శక్రుతో నీచక్రి ♦ శత్రువై పోరుట, లలితమ ద్రూపమూ[illegible]గాదె
హరితోడ ననికంబు ♦ గరుడగామిని నాట, లలితమ[illegible]నఁగాదె

తే॥ దేవమాతకుఁ గమ్మలన్ ♦ దేవనాయ,కునకు ఛత్రమీ యసురాంత♦కుం డిడుటయు
లలితమద్రూపగౌరవ ♦ ములను గాదె, భామినీమణులార! స ♦ పత్నులార!

క॥ సరసిజముఖులారా! యీ,హారి కీరలు పత్నులౌట ♦ కధికనిదానం
బరయుఁడి! యెఱుఁగుఁడి! యీ నా,కరుణయె కారణమటంచుఁ ♦ గలఁగక యెదలన్.

క॥ అల ప్రాగ్జ్యోతిషపురి, నలఘుండౌ భౌమనిర్జ ♦ రారియు హరియున్
గలహించుటెటిని ధీరతఁ, బలుసాయము పతికిఁ జేసి ♦ వఱలితిఁ గాదే. ౪౭౬

సీ॥ అహరహంబును మంచి ♦ యపరంజి నెన్మిది, బారువులం గాంచి ♦ మీఱు నెద్ది
క్షామడాంబరగర ♦ శామయసర్పాగ్ని, మారీభయంబులన్ ♦ మాపు నెద్ది
జారచోరాప్రవయో ♦ జకవంచకాబలు, లుండనట్టులఁ జేసి ♦ యొప్పు నెద్ది
సిరిసంపదలఁగూర్చి ♦ నరులకు సౌఖ్యముల్, గలిగించి వాసితోఁ ♦ జెలఁగు నెద్ది

తే॥ దివ్యమార్తాండుకై వడిఁ ♦ గేజరిల్లు, నెద్ది యాస్యమంతకమణి ♦ నెలమిఁ గాన్క
గ నిడి నాతండ్రి నన్నిట్టి ♦ వనజలోచ, నునకు కిచ్చె నావైభవం ♦ బును గనుఁ డిఁక.

క॥ నామాట యనినతోడన, యీమాధవువలన నుంచి ♦ వెన్నోరథముల్
సామజములు నురగంబులు, భౌమాసురు సిరియు వచ్చి ♦ పడె నాయింటన్. ౪౭౮

క॥ అప్పటి కప్పటి కాయా, గొప్పవయిన కోరికలను ♦ గొంకక తమితోఁ
దప్పక యిడి నావాకిట, నెప్పుడు దగుఁ బారిజాత ♦ వృక్షేంద్ర మహా! ౪౭౯

క॥ భూతవ్రాతవిభుండును, భూతికరుఁడు నైన కృష్ణ ♦ మూర్తి యెపుడు నా
చేతికి వశుఁడై తగ నా, పాతివ్రత్యంబుఁ బల్క ♦ వలెనా? యిఁకన్. ౪౮౦

క॥ నారీమణులారా! యా, నారదునకు నాదు మగని ♦ నయభయముల సం
భారములెల్లను జేర్చి యు,దారమతి నిడితి నల్ప ♦ దానమె? చెపుఁడీ! ౪౮౧

చ॥ ధరఁగల భామలన్ మణిచిఁ ♦ దధ్యము గాదొకో? యీకె నాకేటుల్
సరియగు? నిట్టులుంచుఁ డిది ♦ చంద్రముఖీ! సఖీ! యోసి రుక్మిణీ!
యరయఁగఁ గావె రూపవతి? ♦ వంబుజలోచనలార! మీరు భూ
వరసుత లాపె గొల్లదని ♦ భావనజేయుఁడి మిమ్ముఁ బోలునే? ౪౮౨

క॥ కరుణామయులును గుణవతు, లరవిందేక్షణలుఁ బూర్ణ ♦ మాజ్జాస్యలు శ్రీ
ధరలగు మిమ్మును రాధకు, సరిగూర్చుట తగదు నన్ను ♦ క్షమియింపవలెన్.

క॥ అని లేనిపోని మాటల, నని యుబ్బింపఁగను భీష్మ ♦ కాత్మజమొదలౌ
నెనమండ్రురాణు లన్వయ, ఘనతాగుణకౌశలాది ♦ గర్విత లగుచున్. ౪౮౪

తే॥ సత్యభామోక్తిపంజర ♦ స్థశుకములయి, సంతతంబును రాధికా ♦ సతిని మెచ్చు
దేవకీనందనుం జేరి ♦ దివ్యపక్షిఁ, బలికె రిట్టుల బహులాశ్వ! ♦ పార్థివేంద్ర!

శా॥ దేవా! నీ యెడబాటునన్ బొగిలి భ ♦ క్తిన్ స్నానదానంబు లీ
తావుం జేరి యొనర్చి పూతయగు రా ♦ ధన్ నీ ప్రియన్ జూపుమా!

యావిశ్వంబునలేని రూపవతియో ♦ యేహ్యాంగియో యెట్టిదో
యీవేళన్ గమనించి చూచెదము శ్రీ ♦ కృష్ణా! జగద్రక్షణా! ౪౮౬

క॥ అనవుడు వనమాలియు నా, పనికొప్పి పదాఱువేల ♦ పడఁతులు మఱి యా
యెనమండ్రు రాణులతిముఱి, వెనుకొనఁ జనసాగె రాధ ♦ వెలిఁగెడి స్థలికిన్.

ఉ॥ చక్కని పెక్కు టెక్కెములఁ ♦ జందురు రూపును బోలు డాలులన్
మిక్కిలి మేలుకట్టులను ♦ మేలిమిబంగరుకట్టుపాటునన్
జక్కనిదై శుభంబులను ♦ సారెకుసారె కొసంగఁజాలి యా
యిక్క గుడారమొండు దగె ♦ నిట్టిదటంచు నుతింప శక్యమే. ౪౮౮

ఉ॥ అందున సౌరభంబు లఖి ♦ లాశలఁ బర్వుచునుండు మాలతీ
బృందమరందముల్ సెలఁగు ♦ భృంగములున్ శ్రుతిపేయనాదము
ల్దందడిసల్పు ముత్తియము ♦ లన్ దగియున్న తెరల్ పటంబులున్
బొందికనుండుఁ బీఠికయుఁ ♦ బొల్చునుగాదె తదాసనంబునన్. ౪౮౯

సీ॥ హంసనిభంబులౌ ♦ వ్యజనంబులంబట్టి, స్వీయసఖీజనుల్ ♦ విసరుచుండ
ఛత్రచామరములన్ ♦ వేత్రంబుఁ దాలిచి, గోపిక లటులిటుఁ ♦ గూడి తిరుగ
బాలభానునిమాడ్కి ♦ భాసిల్లుచుండెడి, కమ్మలు వీనులన్ ♦ గ్రాలుచుండఁ
గోటిచంద్రులకును ♦ దీటగునిజదేహ, కాంతులు నల్గడల్ ♦ గ్రమ్ముచుండఁ

తే॥ గోమలాంగియుఁ దన్వియుఁ ♦ గుందరదన, కృష్ణహృతమానసయునగు ♦ కీర్తిపుత్రి
యొప్పి యటనుండి నడుగుల ♦ నొయ్యనిడుచుఁ, బువ్వవనమున కల్లనఁ ♦ బోవుచుండె.

ఉ॥ అత్తఱి నట్టికృష్ణసతు ♦ లందరు దవ్వునఁగాంచి యాయమన్
దత్తరణిప్రకాశమునఁ ♦ దారలు తేజము బాసినట్లుగాఁ
దత్తరుణీమణీరుచిహృ ♦ త్ప్రభలై నిజరూపగర్వసం
పత్తులఁబుచ్చి యొండొరులు ♦ బల్కుకొనన్ సమకట్టి రిట్టులన్. ౪౯౧

ఉ॥ ఇట్టి మనోహరాకృతి ధ ♦ రించిన సుందరి నెందుఁజూడ మే
మెట్టుల నీయమం గుఱిచి ♦ యీవర కీహరి నోటవింటిమో
యట్టుల నిప్డు గాంచితి మ ♦ హా! యనుకొంచు స్వనాథుమార్గముం
బట్టి తదంతికంబున వి ♦ భాసిలఁబోయిరి భూప! యావలన్. ౪౯౨

తే॥ రాచకన్నెల కన్నులు ♦ రాధ నెచ్చె, లులగు వ్రేతలకనులును ♦ గలిసి చెలఁగెఁ
బట్టరాజ్ఞీసహితహరి ♦ వచ్చుటఁగని, సల్పి రాభీరమానినుల్ ♦ జయరవముల.

చ॥ మఱియును రాధికారమణి ♦ మాధవురాకను గాంచి గద్దియన్
సరగున డిగ్గి పద్మసదృ ♦ శస్వకనేత్రములన్ ముదశ్రువుల్
బొరిబొరి వ్రాల్చి యాతనికి ♦ బూజల సల్పి ప్రదక్షిణంబులన్
గరముగఁజేసి స్వీయకర ♦ కంజములన్ ముకుళించి మ్రొక్కియున్. ౪౯౪

వ॥ స్యమంతకమణిఖచితపాదంబులను, జింతామణిమండితతటంబును, బద్మరాగభాసురమధ్యంబును, జంద్రమండలవర్తులంబును, గౌస్తుభోద్భాసితాధఃప్రదేశంబునుం గలిగి కుండలమండలమండితంబును, పీయూషస్రవత్పారిజాతవిభ్రాజితంబును, ఛత్రచామరసమన్వితంబును, విశాలంబును నగు సింహాసనం బొసంగి యందు సమాసీనుం గావించి యానందంబు సుందరాస్యంబున నందంబు గొల్ప నిట్లనియె.

క॥ సఫలం బయ్యెను జన్మము, సఫలం బయ్యెను దపంబు ♦ సల్పిన నోముల్
సఫలం బయ్యెను ధర్మము, సఫలం బయ్యె హరి! నీవు ♦ సనుదెంచుటచేఁ.

తే॥ భక్తులకు సాయపడెదను నీ♦పై నిభక్తిఁ, జూపఁజాలని దుష్ట న♦శుద్ధబుద్ధి
నైన నన్నిప్పుడిట్టి సి♦ద్ధాశ్రమావ, గాహనము ధన్యగాఁజేసెఁ ♦ గద! మహాత్మ!

ఉ॥ నాబల మూతగాఁగొని ర♦ణంబున వైరుల రూపుమాపవే!
నాబలమైన కారణము ♦ నన్ గిరినెత్తి వ్రజంబుఁ గావవే
నాబిగినెమ్మి గోకులము ♦ నన్ విభవంబును నాకుఁ జూపవే
నాబలిమిన్ క్షణంబున మొ♦నన్ హతుఁజేయవె శంఖచూడునిన్. ౯౯

తే॥ మఱి జగజ్జేతయా కంస ♦ మానవపతి, యడలఁడే? నీబలమున ♦ కమరవిభుఁడు
గర్వమును వీడి తిరుగఁడే? ♦ కమలనాభ!, నీదుచరితంబు నేను వ♦ర్ణింపఁగలనె?

ఉ॥ రాసమునందు గోపిక ల♦రంబున నీదరి కేగుదెంచి సం
తోసముఁబొంది కౌఁగిళుల ♦ తో మృదుభాషలతోడ మన్నన
న్జేసి వశం బొనర్చుకొని ♦ నిక్కుచునుండ మెలంగవా కొ? నీ
వీసరణిన్ బొనర్చుట మ♦హీగతనారవిడంబనం బగున్. ౧౦౦

క॥ తన విభుఁగూరిచి యీరహి, ననుచుండెడి కీర్తిపుత్రి ♦ యావల వడితోఁ
దనచెలియగు చంద్రానన, యనుమతి మన్నించె నట్టు ♦ లాహరిసతులన్.

ఉ॥ భామను సత్య జాంబవతి ♦ భద్రఁ గళిందకుమారి లక్ష్మణా
భామిని మిత్రవింద మఱి ♦ భైష్మిని దాయుచు వేఱువేఱుగాఁ
బ్రేమను గౌఁగిలించుకొని ♦ ప్రీతిపురస్సరసూక్తులాడి త
త్క్షేమ మెఱింగి స్వస్థితు ల♦తిప్రమదంబునఁదెల్పి యొయ్యనన్ ౧౦౧

తే॥ షోడశసహస్రగోపికా ♦ సుందరులను, జేరి తమిమీఱ బుజముల నా ♦ శ్లేషములను
సల్పుకొని యుచితంబగు ♦ సరణిఁ బలికి, సత్కరించియు మఱిఁ బల్క♦సాగె నిటుల.

ఉ॥ చందురుఁ డొక్కఁ డుద్భవిల ♦ సాగినతోడ్తఁ జకోరవారము
ల్డిందడి మూఁగినట్లు కమ♦లప్రియుఁడొక్కఁడు వచ్చినంత దృ
గ్బృందము మెండు గ్రాలినటు ♦ లీభగవంతుఁడొకండు ప్రేమతో
నిందున నొప్పుచుండ మన ♦ మెల్లరముంటిమి గాదె భక్తితోన్. ౧౦౪

సీ॥ పద్మప్రభావంబు ♦ భ్రమరముఖ్యంబును, గావ్యప్రభావంబుఁ ♦ గవివరుండు
రత్నప్రభావంబు ♦ రత్నపరీక్షితు, విద్యాప్రభావంబు ♦ విబుధవరుఁడు
గానప్రభావంబు ♦ గాయకశ్రేష్ఠుండు, రసమహిమంబును ♦ రసవిదుండు
నౌషధీమహిమంబు ♦ నుత్తమవైద్యుండు, శిల్పచాతుర్యం బ ♦ నల్పశిల్పి
తే॥ మాత్రమెఱిఁగిన యట్టులే ♦ మరుగులేక, భక్తుఁడొక్కఁడు మాత్రమీ ♦ పరముఁడైన
కమలనాభు ప్రభావంబుఁ ♦ గాంచఁగలుగు, నంబుజేక్షణలార! యో ♦ యక్కలార!

✽ రుక్మిణి మొదలగువారు రాధను బ్రశంసించి సత్కరించుట. ✽

చ॥ అవల విదర్భరాజసుత ♦ యాయమ పల్కుల నాలకించియుం
సవతులఁగూడి యిట్లనియె ♦ సాధ్విరో! యో వృషభానునందినీ!
యువనిని నీవె ధన్యవని ♦ యందును నీదగుభక్తి కీరమా
ధవుఁ డిటు లొంగె నిట్టి నిను ♦ దజ్ఞులు మెచ్చక యూరకుందురే? ౫౦౮

తే॥ ఏమహామహుచరితంబు ♦ నెల్లజగము, లెపుడు పొగడునో యాజగ ♦ దీశ్వరుండె
నీదుచరితంబుఁ గీర్తించు ♦ నెమ్మినెపుడు, నింతకంటెఁ గృతార్థత ♦ యేమిగలదు?
క॥ ఇమ్మాధవుఁ డెటు బల్కెనొ, యమ్మాడ్కిని నిన్నుఁజూచి ♦ యలరితిమమ్మా!
యిమ్మెయి నెమ్మిని మా శిబిరమ్మున కేతెంచ మిగులఁ ♦ బ్రార్థింతుఁజుమీ!

వ॥ అని వినయమ్ముగా వాక్రుచ్చి యవలంబంబుగా సాదరంబున నిజకరార
విందం బిచ్చి శతయూథసమన్వితయగు నా రాధికాలలనాలలామమును మహాత్ముం
డగు శ్రీకృష్ణునితోడఁ బద్మకింజల్కవాసితంబును, సర్వతోభద్రంబును, హైమం
బును నగు నాత్మశిబిరమ్మునకుఁ దోడ్కొనివచ్చి యందు శిరీషమృదులంబగు సోప
బర్హణపర్యంకంబును వేసి యందవ్వారిని సమాసీనులం గావించి సపత్నీసహితయై
వస్త్రమాలాభరణాదులం జక్కఁగాఁ బూజించి గోపీశతయూథంబును సైతము వేఱు
వేఱుగా నర్చించి నిజవిభునితో సముచితంబుగా బహువిధంబులుగా సంభాషించి
నిద్రఁబుచ్చి యా కీర్తిపుత్రింగూడ నిద్రబోవం బనిచి కృష్ణభార్యలందఱు దమ
తమ గుడారంబులకుం జనిరి. అంత రుక్మిణీతరుణీమణియు నిజవాసమ్మున కేతెంచు
నట్టున శ్రీకృష్ణుండు తల్పంబునఁ మేల్కొని కూర్చుండుటం గాంచి యల్లన డాసి
దేవా! యర్ధరాత్రంబైనను నిద్రింపకుండుటకు గతంబేమో తెలుపుమని సవినయయై
వేఁడ నా భగవంతుం డిట్లనియె. ౫౦౯

చ॥ తరుణిరో! యట్టి రాధికకుఁ ♦ దత్పరతన్ విధిపద్ధతిన్ నమ
స్కరణము లర్చలున్ నుతులు ♦ స్వాగతమిచ్చి మహోపచారముల్
బోరిఁబోరి నీవు సేసితివి ♦ వొందెను సంతస మామె కాని ని
ద్దుర తొలిఝుంను వాడుకగ ♦ దుగ్ధము గ్రోలును బ్రత్యహంబునన్. ౫౧౦

తే॥ అద్ది యీాదిన మిచ్చట ♦ నమరలేదు, దాన రాధిక నిద్దుర ♦ మాని గాన
నాకుసైతము స్వాపంబు ♦ రాకయుండె, నాలసింపక క్షీరంబు ♦ లామె కిమ్ము.

చ॥ అనవుడు భీష్మనందిని య ♦ హా! యటులా! యని యొప్పి వెంటనే
తనదు సపత్నులం గలిసి ♦ తక్కఱకానివి పంచదార గ
ల్పినవి మహోష్ణమైన వగు ♦ క్షీరము బంగరుగిండిఁ బోసి రా
ధను గదుపారఁ గ్రోలెడివి ♦ ధంబున నల్పి విడెం బొసంగియున్. ౫౧౨

తే॥ సత్యభామాదులన్ గూడి ♦ శౌరిదరికిఁ
జని సుకృతమంచుఁ దత్పద ♦ సరసిజముల
స్వమృదుకరపల్లవంబులఁ ♦ జక్కనొత్తు
చందు బొబ్బలన్ గని యిట్టు ♦ లనియె వింత, ౫౧3

క॥ అరవిందనాభ! యేలా?, యరవిందసమానతావ ♦ కాంఘ్రియుగమునన్
బొరిఁబొరి బొబ్బలు దగెని, త్తఱిఁ గారణమేమి చెపుమ ♦ తద్విశయముపోన్.

చ॥ పలుకఁగ నిట్లు చక్రి తన ♦ పై నల రాధికకున్న ప్రేముడిన్
దెలుపఁ బ్రసన్నచిత్తుఁడయి ♦ తియ్యనిపల్కుల ప్రేతలున్ స్వభా
ర్యలు వినుచుండ నీరహిని ♦ నాడె విదర్భనరేంద్రపుత్రికా
తిలకమ! యట్లె చెప్పెదను ♦ దిన్నగ దానిని నాలకింపుమా! ౫౧౫

ఉ॥ దేవి! జగత్సుతుస్తసుద ♦ తీనుతజీవితరాధికాత్మరా
జీవమునన్ మదంఘ్రిసర ♦ సీరుహాయుగ్మము స్నేహాభక్తిపా
శావృతమాచు నుండి యిసు ♦ మంతయు నీవఱకున్ జలింపలే
దావృషభానుపుత్రి కెన ♦ యా నొకో? యెట్టి మహానుహుంమనున్. ౫౧౬

తే॥ ఇట్టి సమయంబునందున ♦ నీవు రాధ,కిడిన పా ల్వేడియాటచే ♦ నిట్లడుగులఁ
బుట్టె బొబ్బలు గనుఁడి! పూఁ♦బోఁడులార!,యనఁగ రుక్మిణీముఖసర్వ♦వనితలు విని.

చ॥ అల హరి యద్భుదమ్ముల మ ♦ హాదృతితో సరిజేసి యిల్లెదన్
దలఁచిరి చాగురే! యహహా! ♦ తద్వ్రిజనాయిక కీ ప్రవేశుపైఁ
గల తమి యింతయంచు ననఁ ♦ గా నగునే? యెవ రీమె కీడురాఁ
గలరొకో? యద్వితీయపర ♦ గా నుతియింపఁగనౌను సర్వథా. ౫౧౮

తే॥ మఱియు గోపికామణులకు ♦ మాధవుపయిఁ
గల ప్రియుం బెఱుఁగుచు వింతఁ ♦ గనులమూసి
యహహా! యని విప్పి శ్రీహరి ♦ నడిగి రిట్లు
రాసకేళులఁ గాంచు పే ♦ రాసతోడ. ౫౧౯

మ॥ మురళీగానవినోదబద్ధసుమతీ! ♦ ముల్లోకముల్ మెచ్చ నుం
దరబృందావనమందు గోపికలతోఁ ♦ దద్రాధికాభామతో

సరుదామాదిరి రాసముఁ జలుపవే ♦ యద్దాన వారెల్లరుం
జరితార్థుల్ గద తత్తపోబలము లెం ♦ చన్ శక్యమే? యేరికిన్. ౫౧౦

తే॥ కాని యారాసకేళివి ♦ ధానచిత్ర,ములను వినుటయే కాని క ♦ న్నులకుఁబండు
వగను గాంచలే దోహరి! ♦ ప్రస్తుతమున,నవ్వి కరుణను మాకిట ♦ నగుపఱచుము!

క॥ కల రిట గోపికలందఱు, గలదుగదా రాధికయును ♦ గ్రమస్థలముం
గల దన్నియు గలవీవిఁక, సలుపుము! యారాసకేళి ♦ సరభుల దేవా! ౫౧౧

క॥ చేర్పుము! ప్రేతల రాధను, గూర్పుము! తచ్చిత్రరాస ♦ కుర్దనవిధులన్
నేర్పుము! మాకును దద్గతిఁ, దీర్పుము! మాకోర్కి సర్వ ♦ దేవస్తుత్యా! ౫౧౩

ఉ॥ రాసముఁజేయ నీయవస ♦ రం బుచితంబని చెప్పుచుంటిమో
శ్రీసుదతీప్రియా! యనఁగ ♦ శ్రీహరియుం ముదమంది పల్కె ని
ట్లో సతులార! మీ మొదల ♦ నున్నతలంపులు మంచి విన్వ యా
రాసవిధాననాయిక క ♦ రంబుగ నొప్పిన చో ఫలించుఁగా. ౫౧౪

ఉ॥ కావున రాధికామనము ♦ గట్టిగ వేఁడి ప్రసన్నమానటుల్
ఠవిగసల్పుఁ డత్తఱిఁ గ ♦ డింది గ నయ్యెడి రాసకేళు లో
భూవరపుత్రులార! యన ♦ ముచ్చటఁజెంది తదష్టభార్య లా
శ్రీవృషభానుపుత్రికను ♦ జేరిరి సూచిరి గోరి కీరహీన్. ౫౧౫

శా॥ తల్లీ! భక్తసమూహరక్షణపరా! ♦ తద్రాసరంగేశ్వరీ!
ఫుల్లాబ్జాక్షి! పరేశ్వరీ! భగవతీ! ♦ పూర్ణేందుబింబాననా!
యుల్లాసాన్వితగోపికాజనమణీ! ♦ యుక్తాంగి! కీర్త్యాత్మజా!
యుల్లం బారఁగ మ్రొక్కుచుంటి మిఁక మా ♦ యుక్తుల్ జెవిన్ బెట్టుమా!

చ॥ రసదుఁడు రాసనాయకుఁడు ♦ రంజిలు నిందున రాసముఖ్యవి
వెసఁగుచునుంటి విచ్చటనె ♦ యీస్థలి నుండెడి గోపికాజనుల్
రసమును గోరు మేము నిటఁ ♦ గ్రాలితి మందున రాసకేళులన్
బస పొసఁగన్ రచించుచు న ♦ పారముదంబును గూర్పుమో సఖీ! ౫౧౬

ఉ॥ అంతట విన్నరాధికయు ♦ నాడె నిటుల్ చెలులార! యట్టి శ్రీ
కాంతుఁడు నొప్పినప్పుడ య ♦ ఖండభవత్ప్రియమాను గాన మీ
రింతటనైనఁ బోయి హరి ♦ నెట్లొ ప్రసన్నునిఁ జేయుఁడీ! యనన్
గాంతలు వార లామెకు జ ♦ గత్పతి యొప్పిన చొప్పుఁ జెప్పఁగాన్. ౫౧౭

తే॥ ఆమె యురరీకరించియు ♦ నట్టులౌను, గాతమంచుఁ బ్రసన్నయై ♦ ప్రేతలగుమి
గోడఁగూడియుఁ బాడుచుఁ ♦ గ్రీడఁజేయ, సర్వసన్నద్ధయై యుండె ♦ జనకరాజ!

శ్రీకృష్ణుండు రాధాష్టభార్యాదులంగూడి రాసక్రీడం గావించుట.

వ॥ అంత శ్రీకృష్ణుం డనుత్తమంబగు నుత్తమాంగంబునం దాపింఛాభంబగు బర్హాపింఛం బంచితంబుగ లగించి మణిగణరచితముక్తాదామంబులం జుట్టి రాకాపూర్ణసుధాకరబింబసదృశంబగు సుందరముఖంబున దృష్టిదోషపరిహారంబుగాఁ దిలకంబిడి శ్రీకారాకారానుకారంబులగు శ్రవణంబులకు మండనంబులగునట్లు కుండలంబుల ధరించి తిలపుష్పనిభంబగు నాసికంబు లలితంబుగా సింగారించి కంబుతుల్యంబగు గళంబునం దారహారంబులు మనోహరంబుగా వేసి శ్రీవత్సలాంఛనాంచితంబును, కవాటవిశాలంబును, నగు వక్షస్స్థలంబునం గౌస్తుభం బలంకరించి తిరస్కృతదిక్కరటికరంబులును, సర్వరక్షాకరంబులునగు కరంబులను గంకణాంబులం బెట్టి పంచాస్యమధ్యప్రశస్తంబగు లగ్నంబునం దళతళలాడు వలివంపుహాటకంబట్టుపుట్టంబులం గట్టి సనకసనందనాదిమునిబృందవందితంబులును, సకలభువనరక్షాకరణకరణంబులును నగు చరణంబులందు మంజులధ్వనిమనోజ్ఞమంజీరంబులంగూర్చి బింబతులితంబును, దాంబూలచర్వణారుణితంబును నగు మధురాధరంబునఁ దరళంబుగాని కోకిలతో సరళశబ్దసరసంబగు మురళిం దాల్చి పల్లవంబుల నుల్లసంబాడు చేతివ్రేళ్ళం బట్టి తద్వివరంబులం బూరించి వెన్నెలఁబోలి చిర్నగవు నల్గడలఁ బర్వ నలరుచుఁ బ్రీతిమెయి నాప్రేతలం జేరం దీసి సాలంకారయు జగన్మోహినియు నగు రాధికను వామకరంబునం గైకొని రుక్మిణ్యాద్యష్టపట్టమహిషులం గూడి సర్వసిద్ధికరంబును భువనప్రసిద్ధంబును నగు సిద్ధాశ్రమంబునకు శ్రద్ధమెయి నేగి మాధవమాసంబందలి పూర్ణిమాతిథియం దానందసంధాయకంబగు చంద్రోదయసమయంబున నృత్తవిద్యానవద్యంబై సర్వజనహృద్యంబై తనరారు రాసమండలంబులఁ గల్పించి యందెందఱు సుందరీమణులు గలరో యందఱకన్నిరూపంబులం దాల్చి తన యిరుప్రక్కల భూషణభూషితలై పొలుపారు యోషామణులు గావించు వీణావేణుమృదంగాదిగానంబుల కనుకూలంబుగఁ బాదవిక్షేపంబు లిడుచు నాడుచుఁ బాడుచు నుత్సహించుచుఁ దానును వల్లవపల్లవాధరలును సత్యభామాద్యష్టభామినీమణులును, శంఖపద్మవజ్రకందుకచతుర్ముఖచక్రవాళచతుర్భద్రసౌభద్రనాగనంద్యావర్తకుండలీకరణఖురరీబంధప్రముఖంబులైన బంధవిశేషంబులకుం బ్రవేశించి మించి యేకపాదసమపాదవినివర్తితగతాగతవలితవైశాఖమండలత్రిభంగిప్రముఖంబులైన తానకంబులం దనూనంబుగ నిలిచి ఘటితాఘటితమర్దితపార్శ్వసమగ్రప్రముఖంబులైన పాదకర్మవిశేషంబులం జూపి సమపాదశకటవదనమతల్లీసుప్తిముఖంబులైన పార్థివచారిభేదంబులను గనుపఱచి యపక్రాంతడోలాపాదసూచీప్రముఖంబులైన వ్యోమచారివిశేషంబులును, గపిద్థకటకాముఖశుకతుండార్ధచంద్రలాంగూలపతాకపద్మకోశముఖంబులైన స్వస్వభావ

వివిధవిధకరభావంబులం జేసి యాస్కందితభ్రమణకటాసనాదులైన జానుమండల భేదతండంబును దండలాతాలాతలలితవిచిత్రప్రభృతులైన దైవమండలంబుల దండిగ నాచరించి మీలనోన్మీలనకుంచితవికాసప్రముఖంబులైన దృష్టివిశేషంబుల నగు పఱచి నికుంచితాకుంచితకంపితాకంపితపరావృత్తపరివాహితప్రముఖంబులైన శిరోభావంబులం గనుపఱచుచుఁ గోటిచంద్రప్రతీకాశుండై మన్మథమన్మథుండై జగన్మోహనుండై సుందరీమణితారావారమధ్యగతజైవాతృకుండై వెలుంగుచుండె. అప్పుడా రాసరంగంబు గంధర్వలోకంబుకరణి గానానందంబై నందనవనంబువిధంబున సుమనోమనోహరంబై హరినిలయంబునుబోలె సర్వమంగళాకరంబై కళాకరమండలంబునుబోలెఁ గువలయాభిరామంబై రామాయణంబురీతి రామాభ్యుదయంబై దయాళుహృదయంబువిధంబున భూతరక్షాకరణసమర్థంబై సమర్థకవివిలాసంబులీల ననేకప్రబంధబంధురంబై చెన్నుమీఱె. అందా గోవిందుండా రతితోఁ గూడిన మదనుని సొబగునను, సౌదామినిగూడిన జీమూతునిరీతిని, రోహిణితోఁ గూడిన సుధాకరుని సొంపునను, శచితోఁగూడిన శక్రునిసరణిని నా రాధికాసతీమతల్లికతోఁగూడి యొప్పె. మఱియు ౧౩౦

తే॥ రుక్మిణీ ముఖకాంతలు ♦ రుక్మవర్ణ,భాసమానలు నృపసుతల్ ♦ రాసములను
సలిపి తన్నిశ లస్ఫటి♦క్షణముబోలెఁ, గడపి హరితోడ నిటు కట్ట♦కడకు ననిరి.

కం॥ ఓ నందనందనా! వ్రజ,మానినులను గూడి రాస ♦ మండలమున నీ
వానందప్రదవాద్యము, లానెఱిగా మొఱయ సల్పి ♦ హర్షం బిడవే! ౧౩౧

శా॥ నీ వేషంబును భాష నీకు తళుకుల్ ♦ నీబెళ్కు నీ కుల్కులున్
నీ విన్నాణము నీ దరస్మితములున్ ♦ నీ యాట్లు నీ నాట్యముల్
నీ వైదగ్ధ్యము నీ మనోహరగతుల్ ♦ నీ వేణుగానంబులో
దేవా! యీదృశరాసకేళిఁ గనఁగా ♦ ధీరుల్ దిదృక్షాపరుల్. ౧౩౩

కం॥ మును పల బృందావనమునఁ,జని గోపీసతులతోడ ♦ జరిపితి వీ రా
సనికర మిప్పుడో భూవర, తనయుల మగు మమ్ముఁగూడి ♦ తద్ద జరుపవే? ౧౩౪

కం॥ కావున నిటు రాసము లే,త్రావున నొనరింపలేదు ♦ తథ్యము గానన్
దేవా! ధన్యత నీకృప, నీవేళను గల్గె మాకుఁ ♦ గృష్ణాగ్రమణీ! ౧౩౫

తే॥ ఇట్టి శ్రేష్ఠుని మేమెందు♦నెపుడు గనము,నిన్నుఁ బొగడంగఁ దరమౌనె?♦నిర్మలాక్ష!
మాదు జన్మము లిప్డు ని♦ర్మలములయ్యె,మోహనాకార! వినుమయ్య!♦ముఖ్యులివిగో

కం॥ డెందమునందున ముని యా,నందమయుని నిన్నుఁగొల్చి ♦ నవనవగతులన్
జెందెడి నానందము మా,కందఱకును గూర్చియుంటి ♦ వహహా! కృష్ణా!

మ॥ శ్రుతివిత్సన్నుతమూర్తి! యీస్థలమునన్ ♦ శోభిల్లెడిన్ గోపికా
శతయూథంబులు రాధ షోడశసహ ♦ స్రప్రేయసీరత్నముల్

రతిరూపాంచితచేటికావృతభవ ♦ ద్రాక్షాస్వమృష్టకం బందుచే
నతిరేకించెడి నేటిరాస మల బృం ♦ దారణ్యరాసస్థితిన్. ౫౩౮

చ॥ అనవుడు శౌరి నవ్వి యిటు ♦ లాడెను నోసతులార ! బృందయన్
వనమున నేను ప్రేముడిని ♦ బల్మఱుఁ జేసిన రాసకేళు లీ
దినమున నైన రాసముల ♦ తీరున కీడుగ రావటంచు మీ
రనెదరు కాని రాధ నిపు ♦ డడ్గుఁడి ! దీనిని గొంకులేనటుల్. ౫౩౯

ఉ॥ నావుడు వారలెల్లరును ♦ న్యాయపురస్సరవాక్ప్రవీణలై
యావృషభానుపుత్రి కిటు ♦ లాడిరి పూర్వమునందు నట్టి బృం
దావసి నైన రాసములు ♦ తెల్యముఁ జెందునె ? నేఁటి రాసఖే
లావిధి కిద్ది దెల్పుము స ♦ లక్షణపద్ధతి భామినీమణీ ! ౫౪౦

చ॥ అని యభిమానయుక్తలయి ♦ యాడఁగ నాయమ నవ్వి యిట్లనెన్
వనరుహనేత్రలార ! బహు ♦ భామలతో నిట రాసముల్ రచిం
చిన నల బృందకాటవినిఁ ♦ జేసిన రాసముతోడఁ బోలునే ?
ఘన మిదియౌనె ? యెన్నటికిఁ ♦ గాదని నమ్ముఁడి ! నెమ్మనమ్మునన్. ౫౪౧

తే॥ కారణం బేమనన్ బృంద ♦ కావనంబు
దివ్యతరుసమూహములము ను ♦ దీర్ణమైత్రి
భారనతలతమును మధు ♦ ప్రతియుతంబు
గలదె ? దృక్పర్వముగ నిటఁ ♦ గాంతలార ! ౫౪౨

ఉ॥ ఎయ్యది పుష్పగుచ్ఛముల ♦ నెంతయు నొప్పెనొ మాళిఁ బూనిన
ట్లెయ్యది రత్నతీరముల ♦ హెచ్చుగ ముద్రితమయ్యెనో మఱిం
కెయ్యది పద్మహంసవిహ ♦ గేంద్రబకాదిమనోజ్ఞ మయ్యెనో
యయ్యమునాస్రవంతి యిట ♦ హర్షశుభాస్పదయౌచు నున్నదే ? ౫౪౩

ఉ॥ అక్కడి చందనావనిరు ♦ హంబులు నక్కడి భృంగరాత్రుతిం
బక్కడి మాధవీలతలు ♦ నక్కడి కుంజనికుంజమండలం
బక్కడి దివ్యసైకతము ♦ లక్కడి సుందరమందిరోత్కరం
బిక్కడ నక్కలార ! యొక ♦ టేనియు మచ్చునకైన నున్నదే ? ౫౪౪

తే॥ రత్నసానుసమేతంబు ♦ రామణీయకమును భూరుహవల్లరీ ♦ సుమఫలాన్వి
తంబు ఘనమును బుణ్యతీర్థసహితంబు, నచలవరము గోవర్ధనం ♦ బిచటఁగలదె?

చ॥ అల వనినైన మందముల ♦ యానిలముల్ సుమసౌరభంబులన్
జెలఁగుచుఁ జల్లగా విసరఁ ♦ జిత్రపతత్రికలస్వనంబులున్
లలితముగా జనింప లత ♦ లన్ విరులన్ దగుసైకతంబులన్
గల వనమాలిసొంపు లిటఁ ♦ గాంచితినే ? చెలులార ! చెప్పుఁడీ ! ౫౪౬

ఉ॥ ఆమురళీవినోది మధు ♦ రారవ మా కుటిలాలకోజ్జ్వల
స్తోమసువక్త్ర పల్లవల య ♦ శోదకిశోరు కిశోరతాకృతి
స్తోమము నామనోహరుని ♦ చూడ్కు లోయారపురకాల్నడల్ నవుల్
ప్రేమను గాంతలార ! చెవి ♦ వింటిరె ? కంటను గంటిరే ? యిటన్. ౧౪౮

ఉ॥ ఆహరితోడఁ గూడుటయు ♦ నాడుట పాడుట డాఁగుడేఁగుటల్
మోహవశంబునన్ సలుపు ♦ ముచ్చటలున్ బొదరింట నుంట న
వ్యాహతకామకేళులను ♦ నాగుట నూఁగుట హస్తకర్షణో
త్సాహము హస్తవర్జనవి ♦ ధానము నాకిట సంభవించెనే ? ౧౪౯

ఆ॥ కోకిలంబు గొనుచు ని ♦ కుంజమందు, దాఁగినట్టి యతని ♦ దద్దవెదకి
పట్టికొన్న సుదము ♦ వంశవేత్రముల నేఁ,గొనియుఁ జనినవేడ్క ♦ దనరె నొక్క ?

వ॥ మఱియు సుందరంబగు నాబృందావనం బందలి కృత్యంబు లసంఖ్యాకంబులై యనవద్యంబులై యప్రమేయంబులై పొలుపారు నట్టి పీస్థలంబున మందున కైనను నున్నవే? పరాంతరంబున నొండురొండులీలలు గోపాలకృష్ణునిచే నొనర్పఁబడినవని యొప్పుకొన్నను నవి బృందావనరాజం బిందు లేమిని మనఃప్రియంబులు గాకపోయె. ఏస్థలంబున నేలీలలు చేయఁదగినవో యవి యొనరించిన మనోజ్ఞంబుగా నుండునని పలుక నాసత్యభామాద్యష్టపట్టమహిషులు నిజగర్వంబులం బుచ్చి యచ్చెరువొంది ముచ్చటఁపడఁజొచ్చిరి. అంత నాయనంతుండు పూర్వోక్తంబుగా నాసిద్ధాశ్రమంబున రాసంబులం జేసి సర్వగోపీగణంబులను దోడ్కొని రాధికాసహితుండై నిజధర్మపత్నులు తోడుగా నడువ ద్వారకానగరంబుఁ బ్రవేశించి యత్యుత్తమంబులగు హర్మ్యంబులనుగట్టించి యందు రాసేశ్వరిని వసింపఁజేసి యితరంబులగు దివ్యసౌధంబుల నాప్రవేత లుండునట్లుసల్పి సుఖంబుగాఁ గాలంబు గడపం దొడఁగెఁగాదె. సర్వపాపహరంబును మోక్షప్రదంబును నగు సిద్ధాశ్రమకథామాహాత్మ్యంబులు కథితంబులయ్యెనని నారదుచ్చి క్రమ్మఱ ద్వారకాపురిని బ్రశంసించుచు నిట్లనియె. ౧౫౦

ద్వారకాపురీ వర్ణనము.

తే॥ పార్థివేశ్వర ! ద్వారకా ♦ పట్టణంబు, వందయామడల్ వెడలుపుఁ ♦ జెందెఁ జుట్టు
కొలత నాల్గువందల యామ ♦ డలు సెలంగుఁ, దత్పురీవిషయంబులఁ ♦ దమిని వినుమ !

క॥ అనఘా ! దత్పురి నడుమను వనమాలివినిర్మితంబు ♦ భాపురదంబున్
ఘనము వరము ద్వాదశ యోజనపరిమితదుర్గ మొందు ♦ సక్కఁగ నుండున్.

తే॥ మఱియు నా పీటి వెలుపల ♦ హరిరచితము
నద్భుతంబును నవయోజ ♦ నాన్వితమును

సకలజననేత్రపర్వము ♦ సర్వసిద్ధి
కరము నా దుర్గ మొండెడిఁ ♦ గార్యపీంద్ర ! ౧౧౩

ఉ॥ సత్తమ ! యాపురిన్ మఱియు ♦ సర్వకళాస్పద మద్భుతంబు లో
కోత్తరమున్ రమారమని ♦ యోజనయుగ్మము గల్గి పేరుపే
రెత్తిన దర్పవంతమును ♦ హేమమణీసముదాయవిస్ఫుర
ద్భిత్తికవాటసౌధముల ♦ వెల్గెడి మూఁడవ దుర్గ మొప్పెడిన్. ౧౧౪

క॥ ఆ దుర్గములఁ దొలిది దా,మోదరునిది దానియందు ♦ మోక్షప్రదముల్
శ్రీ దనుజాంతక గృహములు, మోదదములు గ్రాలు నాఱు ♦ మూఁడునులక్షల్.

శా॥ ఆలోనన్ వృషభానుపర్యతనుజా ♦ త్యైశ్వర్యదాగారమున్
గ్రాలంగా గాదె తదీయమై చెలఁగు ద్వా ♦ రంబాదు బృందిష్టమై
గోలోకాగతమై యఘౌఘహరమై ♦ గోవిందనుత్యంబునై
లీలాధామమునై వెలింగెడిగదా ♦ లీలాసరోరత్నమున్. ౧౧౫

క॥ అట స్నానంబును సల్పిన, కటికయును నటసుటీఁడు ♦ గర్కోటకుఁడేన్
జటులంబగు పాపంబుల, జిటికెఁదుటూరించి పరముఁ ♦ జేరున్ మిత్రాఱున్. ౧౧౬

ఉ॥ అందున నెట్టివాఁ డయిన ♦ నష్టమి మున్గి సమాహితాత్ముఁ డా
త్రిందివవంద్యు నుతించి సవి ♦ ధిన్ నతిసల్పి వ్రతంబుఁ జేసి మే
లుకుండదు మించు కేసిడినఁ ♦ గొంకక జంకక కోటిజాములం
దొంటిన పాపముల్ జదిపి ♦ యుత్తమకీర్తినిఁ బొందు నెట్టనన్. ౧౧౭

క॥ తమిఁద న్గాని చన గోలోకమునుండియు వచ్చినట్టి ♦ ఘనరథమం దె
ల్ల మునులు గని పొగడంగా, నమలాకృతి నెక్కి యతిశ ♦ యానందమునన్.

మ॥ సుమరత్నాపితహారతారములతో ♦ సూనాస్త్రరూపంబుతో
విమలాదిత్యసహస్రతుల్యరుచితోఁ ♦ బీతాంబరశ్రేణితో
భ్రమదీశం దగి పార్షదుల్ జయజయ ♦ ధ్యానంబు లొప్పన్ ఘనుల్
దమి వింజామరలన్ గ్రహించి విసరన్ ♦ దాఁ జేరు గోలోకమున్. ౧౫౦

వ॥ అని పలికి వెండియు నిట్లనియె. మైథిలేశ్వరా ! తన్నగరంబునం బదాఱు వేల నూటయెనిమిది పుణ్యతీర్థంబులును, శ్రీకృష్ణాష్టభార్యామణుల మందిరంబులును, గలవు. అవ్వాని కెవ్వరైనను వేయువేలుగాఁ బ్రదక్షిణంబు లొనరించి పునఃపునః ప్రణామంబు లాచరించెదరు. అందు జ్ఞానతీర్థం బనునది యొండు గలదు. తత్తీర్థంబున స్నానంబు సల్పి యటఁగల పారిజాతవృక్షంబును స్పృశించినవారికిఁ దత్క్షణంబున భక్తిజ్ఞానవైరాగ్యంబులు నిస్సంశయంబుగాఁ గలుగు. మఱియు నవ్వారల హృదయకుహరమం దాముకుందుం డానందమయుండై యెల్లప్పుడు నివసించి రక్షించుచుండు. స్వయంబుగా నా మహాత్మ్యాని సమృద్ధిసిద్ధులు వరింపం

గలవు. ఎవ్వం డా స్వర్గంబందుం గల నందనందను సుందరమందిరం బానందంబునం గాంచునో యవ్వాఁడే భూతభవిష్యద్వర్తమానంబులందు జీవన్ముక్తుం డనియుఁ, గృతార్థుం డనియు, నిరుపమానవైష్ణవుం డనియుఁ జెప్పందగువాఁడని గుర్తెఱుంగుము. పంచయోజనవిస్తారితంబగు తద్భగవన్మందిరంబునకు ధనుశ్శతమాత్రపరిమిత దూరంబునం గృష్ణతేజస్సముద్భవంబై కృష్ణకుండనామకసరోవరం బొండు ప్రవహించుచుండు. జాంబవతీసుతుండగు సాంబుం డందు స్నానంబు సల్పి శ్రీకృష్ణుని యనుగ్రహంబున ముక్తుండైనట్లు తత్సరసిని స్నాతుండైనవాఁడు జీవన్ముక్తుండు గాఁగలఁడు. మహాబలుండగు బలరాముండు భూప్రదక్షిణం బాచరించి యభిజ్ఞ నత్యంబగు యజ్ఞం బొనరించి రేవతీసహితుండై యెచ్చోట విరాజిల్లెనో యందుత్కృష్టంబగు బలభద్రసరోవరంబు వెలుంగు. అద్ది పూర్వోక్తకృష్ణకుండంబునకు నష్టాదశపదపరిమితదూరంబునం దూర్పుదెసం గలదు. ౫౬౧

తే॥ అందు మునిఁగినవానికి ♦ సఖ్యపాలి
కములు నశియించుఁ బుణ్యముల్ ♦ గలుగు వైష్ణ
వముగు లోకంబు సిద్ధించు ♦ బహువిధసుఖము
లందుఁ బొందును సందియ ♦ మందవలదు. ౫౬౨

చ॥ మును పల రుక్మిణీతరుణి ♦ పుత్రకుఁడౌ సుమబాణు నెందునన్
గనుఁగొనలేనియప్డు గణ ♦ నాథుని కిర్పల నేస్థలిం బొన
ర్చెనొ యది యిప్డు శ్రీహరి వి ♦ చిత్రగృహంబున కంతకాశ వే
ధనువుల దవ్వునం గలదొ ♦ తత్స్థలి నొప్పు గజాస్యకుండమున్. ౫౬౩

క॥ ధాత్రీశా! యిట మునిఁగిన, పాత్రుఁడు పొన్నడిన పుత్ర ♦ ఫలమొందును ద
త్పుత్రుఁడు సువంశము సిరిన, పుత్రవిభూషమాద్యభి వృద్ధిఁ ♦ గాంచుచు వరుసన్. ౫౬౪

సీ॥ శ్రీకృష్ణు దర్శనం ♦ జేసి దానంబుల, నెల్లప్పు డీవుల ♦ నిచ్చు నిసుమ
యెది కొల్దిబంగరు ♦ నిచ్చిన దానికి, నిబ్బడి ఫలముల ♦ నియ్యఁగలదొ
యెది కొల్దిరజతంబు ♦ నిచ్చిన దానికి, నిడఁ జతుర్గుణఫల ♦ మేరుపడెను
యెది యొకఫల మేని ♦ నిచ్చిన దానికి, శతగుణలాభముల్ ♦ జక్కనిడును

తే॥ హరిగృహంబునకెడ పశ్చి ♦ మాశ ద్విశత, చాపపరిమితదూరమం ♦ దేపుమీఱె
నద్ది తీర్థరాజంబని ♦ యిద్ధమయ్యె, నదియె దానసరోవరం ♦ బండ్రు బుధులు.

చ॥ అట మొహరీల, రత్నముల ♦ నాద్యృతి నిచ్చిన పుణ్యరాశి కు
త్కటశత రాజసూయము ల ♦ ఖండసహస్రమహాశ్వమేధముల్
దిటముగఁ జేసి పొందు బహు ♦ దివ్యఫలంబులు షోడశాంశమేఁ
బటుగతిఁ దూఁగఁ జాలవని ♦ బాగుగ నమ్ముము! ధారణీశ్వరా! ౫౬౬

తే॥ బదరికాశ్రమయాత్రచే • వచ్చు ఫలము, మేషరాశిని మిహిరుండు • మెలఁగుచుండ
సైంధవాహ్వయవనయాత్ర • సల్పుఫలము, దనుకు "దానతీర్థ"స్నాన • తత్పరులకు.
ఆ॥ తరణి వృషభమందుఁ • దగ నుత్సలావర్త, మున మునింగి దాన • ముల నిడిన ఫ
లంబుకంటెఁ గలుగు • లక్షగుణఫలంబు, "దానతీర్థ" రాజ • దర్శకులకు. గీ॥
తే॥ అంతకంటెను కోటిగు • ణాధికఫల, మబ్బుఁ గలదని యెఱుఁగుమా • యట్టి దాన
తీర్థ మందొక మాసంబు • దివ్యభక్తి, మునుఁగుచుండెడి జనులకు • జనవరేణ్య!
తే॥ అశ్వదానము దానము • లందుమేటి, దానికంటెను మంచిది • దంతిదాన
మంతకంటెను యోగ్యమా • నరదమిచ్చు, నంతకంటెను భూదాన • మధికమండ్రు.

వ॥ సర్వసస్యసంపత్ప్రదంబగు సర్వసుంధరాదానంబుకంటెను నన్నదానంబు మహాదానంబని వక్కాణింపంబడు. ఈ యన్నంబే దేవపితృభూతంబులకుం దృప్తిం గలుగంజేయు. ఇద్దాని వలననే జగంబు విస్తారంబగు. పంచకోశంబుల నీయన్నకోశంబే ప్రథమగణ్యంబైనది. సమస్త జంతువుల కిదియే జీవనాధారంబు ప్రాణంబునం దిది ప్రతిష్ఠితంబైనది. సకలలోకంబుల నేగంజేయుట కిదియే యనుత్తమాగదంబు. ఇది లేని ప్రపంచంబు నశియించుటకు సందియంబు లేదు. కావుననే యీ యన్నంబును బర్బ్రహ్మస్వరూపంబని యాజ్ఞ్య లోకము మొగి ఘోషించిరి. ఇతరదానంబు లిద్దానివలెఁ దనివిం గూర్పంజాలవు. పతిద్దానంబుతో సమానంబగునది త్రికాలంబులందును లేదని యెఱుంగుము. ఇట్టి యన్నంబును దద్దానతీర్థంబునం దానం బొనరించి దానం బాచరించిన మానవుని పుణ్యంబును, చతుర్ముఖుండుగాని షణ్ముఖుండుగాని సహస్రముఖుండుగాని వర్ణింపశక్తుండగునే? అవ్విధము బున్నాత్రయంబుఁ దీర్చికొని పరమపదంబు జెందఁగలండు. మఱియుఁ దాదృశదానతీర్థంబున స్నాతుండై పూతుండై దానిమగు వాని సుకృతంబు తత్పితృపక్షంబునం బదుగురకుఁ దన్మాతృపక్షంబునం బదుగురకుఁ దద్భార్యాపక్షంబునం బదుగురకును నరకంబుఁ బాపి దివ్యరూపంబును జతుర్భుజంబులం గల్పించి పీతాంబరంబులం గట్టించి హారాదిభూషణంబు సింగారింపఁ జేసి జయజయ ధ్వనులతోఁ గౌర్ధదులు వెంటనంట దివ్యరథంబునం దారూఢులం గావించి గోలోకసుఖంబులం గూర్ప సమర్థంబై యుండుం గాదె. మఱియుఁ దద్భగవన్మందిరంబునకుఁ దగ్భాగంబున నరకోసు దవ్వున మాయాతీర్థంబు మనోహరంబై విరాజిల్లు. అందు సింహారూఢయుఁ జండముండనిషూదనియు భద్రప్రదయు దుర్గతివినాశనియునగు దుర్గ యానయుంబు వెలుంగుచుండు. దేవకీదేవి తన కుమారుండగు శౌరి యపవాదాపనోదార్థంబై శ్యమంతకంబు సంపాదింప జాంబవంతుని బిలంబునకుం జనిన కాలంబున సత్ఫలంబు లనన్యభక్తితోఁ దద్దుర్గం బూజించి జాంబవతీనామకప్రియాశ్యమంతమణివిభ్రాజమాన

శ్రీకృష్ణుండు మరలి వచ్చుటం గని పరమానందంబుఁ బొందె. అట్టి మాయా
తీర్థంబు ఫలప్రదంబని వేఱుగా నొక్కి చెప్పవలయునే? యెవ్వరా తీర్థంబునం
జలకం బాడి యా మాయాదేవిం బూజింతురో యవ్వారు జననోరథంబులు
ఫలింపఁ గైవల్యంబున కరుగంగలరు. ఇఁకఁ దద్ద్వారావతీపురీవిరాజమానద్వితీయ
దుర్గవిశేషంబులను వినుమని యిట్లనియె. ౪౭౧

ద్వారకా ద్వితీయ దుర్గవర్ణనము.

క॥ రెండవదుర్గమునకు నా, ఖండలదిశ నింద్రనామ ♦ కసరోవర మొ
ప్పుండును గామప్రద ముద్దండాఘవినాశకంబు ♦ ధర్మమయమునై. ౪౭౨

క॥ ఆతీర్థంబున మునిఁగినఁ, బూతుఁడయి చంద్రవిభవ ♦ ముం గని జంభా
రాతిపదంబునకుం జని, యాతతసౌఖ్యంబు లొందు♦నధమాధముఁడేఁ. ౪౭౩

తే॥ దానికిం గుడివైపునఁ ♦ దరణికుండ, ముండు నిచట సత్రాజితుం ♦ డుష్ణరశ్మి
కర్చసల్పి స్యమంతక♦మనెడి మణిని, భూషితుండయ్యె బూర్వమో♦భూతలేశ!

క॥ జనుఁడెవఁడేనియు నందున, మునిఁగియు నొకపద్మరాగ ♦ ము నొసంగినచో
నినతుల్యవిమానంబున, నినలోకముఁ జేరి మీఱు ♦ నినవిభరుచిఁతోఁ. ౪౭౪

ఆ॥ దానికిం బ్రతీచి ♦ ధాత్రీతీర్థం బుండు, నచట జలకమాడి ♦ హైమపాత్ర
మందుఁ బాయస మిడి ♦ యతిశయభక్తితో, నిడిన వారిఫలము ♦ లీవ్వినుము!

ఆ॥ పంచపాతకములు ♦ ధ్వంసమైపోవును, బ్రహ్మహత్యలెల్లఁ ♦ బాఱిపోవు
ననృతజనితదోష ♦ మడుగంటి తీరెడి, నిచటఁ గలఫలము వ ♦ చింపనగునె?

చ॥ మఱిఁ దలిదండ్రులఁ గురుల ♦ మానవనాథుల నాలఁ జంపున
ట్టిరు నట భక్తి మున్గిన త్రు ♦ టిఁ శుచులై దివిజేంద్రలోకముం
దరుసముతో స్వపాద మిడి ♦ యా కమలాసనరూప మొప్పఁగా
నరిగెద రబ్జజస్థలికి ♦ నా శశిసామ్యవిమాన మెక్కుచుఁ. ౪౭౫

తే॥ దాని కుత్తరదిక్కునఁ ♦ దనరుచుండు, "నీలలోహితతీర్థంబు" ♦ నీలలోహి
తుండు శ్రీమహాదేవుం డ♦ఖండదీప్తి, సతత మచ్చోట వెలుఁగు ర♦సాతలేంద్ర!

తే॥ మఱి మరుద్గణసత్తర్షి ♦ మాని దేవ,తలును దత్థ్సలి నం ము రా ♦ స్థలమునఁగల
నీలలోహితలింగంబు♦నిశ్చలమతి, నర్చ సల్పి యా రావణుం♦డందెఁ బ్రభుత.

క॥ ఆ లింగంబును భక్తిని, నాలోకించిన జనుండ ♦ నాయాసముగాఁ
గైలాసయాత్రఁ గలిగెడి, మేలును శతగుణము లెచ్చు ♦ మేలును బొందుఁ.

క॥ స్నానము దివసత్రయమును, నా "నీలగ్రీవకుండ" ♦ మందున మునుఁగం
గా నా శ్రీగళులోకం, బానందముతోడఁ బొందు ♦ నఘమయజనుఁడేఁ. ౪౫౨

ఉ॥ భద్రదముఁ మనోహరము ♦ పాపవినాశకమైన "సప్తసా
ముద్రక" నామతీర్థ మటఁ ♦ బొందెడి నందునఁ దానమాడు వాఁ

దద్రిదినిఁబోలు పాపము ర • యంబునఁ గూలిచి శస్తనప్తసా
ముద్రకయాత్రఁగల్గు ఫల • ముల్ గనఁగాదె విదేహభూవరా ! ౫౮౩

తే॥ బ్రహ్మవిష్ణుమహాదేవ • వాయుసూర్య, చంద్ర దేవేంద్రపార్థభూ • జలధిధనద
వహ్నిముఖసురల్ దత్తీర్థ • పార్శ్వములను, వెలుఁగుచుందురు సతతంబు • వినుతచరిత!

క॥ మఱి యీ బ్రహ్మాండంబున, వఱలుఁగదా సప్తకోటి • వరతీర్థము లా
సరసులు సర్వంబందున, వరదములై కలిసియుండుఁ • బాహితబుద్ధీ. ౫౮౫

తే॥ అట్టి తీర్థంబు నందు నీ • రాడి చుట్టి, వచ్చు దిట్టలె ద్వారకా • భవ్యయాత్రఁ
గన్నఫలము సఫలముగాఁ • గంద్రుగాని, యన్యథాకరించిన నద్ది • వ్యర్థమగును.

తే॥ వెండి యా తీర్థరాజంబు • విష్ణురూప, మంచు వేల్పులు వచియుంతు • రట్టి ద్వార
కఁగల మూఁడవ దుర్గము • నఁగల సంగ, తులను జెప్పెద విను మింక • నలఘుచరిత!

ద్వారకాతృతీయ దుర్గప్రశంస.

చ॥ వినుత చరిత్రుఁడుర్ బ్రథిత • వీరుఁ డుదారుఁడు ధీరుఁడుర్ పిక
ర్తన వరశిష్యుఁడుర్ దశర • థప్రియపుత్రకదాసుఁ డంజనీ
తనయుఁడు గాలి మెల్లపుడు • తత్పృథుదుర్గము దూఁగ్పఁ బ్రోచు నా
ఘనుఁ గనువాఁడు భక్తుఁడగుఁ • గాదె తదంజనిపుత్రుకైవడిర్. ౫౮౮

చ॥ అరయఁగ నట్టి దుర్గమున • కంతకదిక్కున సంతతంబు శ్రీ
హరిగతమానసంబు వర • మైన సుదర్శన మోము దాని నె
వ్వరు గనుచుంద్రొ వారు నల • పంకజనాభుని భక్తులై తము
ద్ధురతరచక్రరక్షణము • త్రోదుగ నొప్పుదు రయ్య భూవరా ! ౫౮౯

ఉ॥ దానికిఁ బశ్చిమాశ నతి • ధైర్యసమేతుఁడు ఋక్షనాథుఁడుర్
మానదుఁడుర్ మహాబలుఁడు • మాధవభక్తుఁడు జాంబవంతుఁడ
న్యూన్యనముగాఁ జెలంగి సత • మోమును తద్ఘనుఁ జూచువాఁడు శ్రీ
జానికి ముఖ్యభక్తుఁడగుఁ • జక్కఁ జిరాయువుతోడ నొప్పెడిర్. ౫౯౦

క॥ దాని కుదగ్దిశ విష్వ, క్సేనుఁడు ఘనబలుఁడు ప్రోచుఁ • గీడ్పడు వాఁడేర్
వానింగనినర్ శ్రీహరి, మానసమే ధన్యుఁ జేసి • మంచిర్ మంచుర్. ౫౯౧

వ॥ వెండియుఁ దద్బహిర్దుర్గంబున కనతిదూరంబునం దర్థసిద్ధిప్రాయద్వారంబులవలెఁ జెలంగు రైవతాద్రి సముద్రంబుల నడుమను బిండారక నామక్షేత్రంబు సర్వతీర్థోత్తమంబై సకలప్రభావసంపన్నంబై మహాపుణ్యప్రదంబై చెన్నుమీఱు. మున్నిక్షేత్రంబునం బరిపూర్ణతముండగు శ్రీకృష్ణుని యానతిని యదుప్రభుండగు నుగ్రసేనుండు క్రతురాజం బగు రాజసూయం బొనర్చె. అందు బ్రహ్మాండగతసర్వతీర్థంబులును సమాహూతంబులై స్థిరనివాసం బొనర్చునట్లు పిండీకృతంబయ్యె. తత్ప్రభృతి నాస్థలంబునకుం బిండారకక్షేత్రం బని ప్రసిద్ధి

ఘటిల్లె. అచట జలకం బాడిన వాఁడు రాజసూయఫలం బనుభవించు. దినత్రయంబు నీరాడి వ్రతియై బ్రాహ్మణులకు స్వర్ణదానాదులం గావించి మ్రొక్కిన జనుండు ప్రత్యహం బవిచ్ఛిన్నంబుగా వందిమాగధ స్తోత్రపాఠంబులను వినుచు భూషణ విభూషితలును, రాకేందువదనలును, క్షౌమవస్త్రధారిణులునగు విలాసినులచే సేవితుండై హృష్టుండై పుష్టుండై వీణావేణుపటహఢక్కాదుందుభికాహళాది వాద్యంబులు మొగిళ్లు మొఱసినసరణి మ్రోయం గరీంద్రబృంహితంబులు నశ్వహేషలును సంకులంబుగా మాండలేశ్వరులు మంచిచెడ్డల విన్నవించుకొనుటకు మందిరబహిర్ద్వారంబున వేచియుండ రాజసంఘంబు నిటలతటఘటితకరపుటంబై పరివేష్టింప రత్నప్రభచిద్భ్రమమనోరమ్యహర్మ్యంబులు విజయధ్వజంబులతోఁ బొల్పార మత్తకుంజరకర్ణతాడితంబులగు భృంగమండలంబు మంజులధ్వనిం జేయ జగజ్జేగీయమానుండై నరలోకశేఖరుండై వెలుంగుచుండు. అతండు మహాత్ముం డని వచించుట కనుమానింపఁ దగదు. ఐహిక సుఖంబు లనుభవించి యంతిమంబునఁ గైవల్యంబుఁ బొందఁగలరు. మఱియు నెవ్వండైనను, గ॥ ౨

మ॥ అల పిండారక తీర్థముల్ గనక రా ♦ జ్యంబెట్టులన్ బొందు? నె
ట్లల పిండారకమందునన్ మునుఁగకే ♦ యాత్మీయ సర్వాఘముల్
దలఁగా మోక్షముఁ జెందు? నిద్దిసెపుమా! ♦ ధర్మంబు వర్మంబు ని
ర్మలకర్మంబు ముదంబు దీని విడినన్ ♦ రాజిల్లునే? మేలుగాన్. గ॥ ౩

ఉ॥ యోగి సుయోగియౌ నతఁడ ♦ నుత్తమ తత్సరసిన్ మునింగినన్
భోగి సుభోగియౌ నతఁడు ♦ పుణ్యదతత్సరసిన్ మునింగినన్
రోగి నిరోగియౌ నతఁడు ♦ రూఢిగఁ దత్సరసిన్ మునింగినన్
రాగి విరాగియౌ నతఁడ ♦ రంబునఁ దత్సరసిన్ మునింగినన్. గ॥ ౪

తే॥ ద్వారకాపురమునకుఁ బ్ర ♦ దక్షిణములఁ, రాధమాసంబునం జేసి ♦ ప్రణతు లిడిన
వారిచేతులనైహిక ♦ పారమార్థిక సుఖములు గలవని యెఱుఁ ♦ గంగఁదగును.

శా॥ తత్తీర్థప్లుతుఁడై యనాశనుఁడునై ♦ ధర్మిష్ఠుఁడై కేశవా
యత్తాత్ముండయి మేదినీశయనుఁడై ♦ యాహ్లాదియై మానియై
విత్తద్వారక యాత్రఁ జైత్రి మొదలా ♦ విఖ్యాత వైశాఖి బల్
హాత్తుందాఁక నొనర్చునట్టి జను పు ♦ ణ్యం బెన్న సామాన్యమే! గ॥ ౬.

తే॥ అట్టి శ్రీకృష్ణపురయాత్ర ♦ నమరునట్టి, ఫలము లెన్నుట పదుచుండు ♦ వానచినుకు
లెన్నుటయుఁ గాక శక్యమే? ♦ యెట్టి వేద, మయ చతుర్ముఖధాతకున్ ♦ మనుజనాథ!

సీ॥ ఘస్రంబులందు నే♦కాదశి కైనడి ♦ జలువలంమున నాది ♦ శేషుఁబోలె
బక్షిసంఘంబులఁ ♦ వైనతేయుని రీతి, శ్రుతపురాణముల భా♦రతమువిధము
సంద్రంబులఁ క్షీర ♦ జలనిధిసరణిని, దారలయందు సు♦ధాకరు విధి
దేవతలందున ♦ దేవదేవుని భాతి, నఖిలజంతువులందు ♦ నరవిధమున

తే॥ శ్రేష్ఠమైన కరణి నెల్ల♦ క్షేత్రములను, ద్వారకాపురీక్షేత్రంబు♦వరము నిజము
దానిమహిమను వర్ణింపఁ♦దరమె? నీకు, నాకుఁ దాతకు నాతని♦నాయకునకు.

తే॥ ఆకసంబున మేఘముల్ ♦ హరిదినములను, గాలులీలను వైకుంఠ ♦ లీలలఁదగు
ద్వారకాపురి యాదవ♦పటలిఁగూడి, ధరకుఁదొడవయి ధన్యతఁ♦దనరె సహహా!

ఆ॥ ఆపురంబు నెవ్వ ♦ డమరి చతుర్వ్యూహ,ములను భాలనంబు ♦ సలిపి వెతల
నుత్తలపడుచుండు ♦ నుగ్రసేనన కిచ్చి, సుఖగఁ జేయుహరికి ♦ జోత లిడుదు.

చ॥ ఎపుడు స్వకీయలోకమున ♦ కేగుట కబ్జభవాత్మజుండు చనో
యపు డల ద్వారకాపురము ♦ నర్ణవమందున ముంచివేయు వి
శ్వప! యుంటైన నచ్చట స్వ ♦ సద్మము భాసిలకున్న వాసమె
ల్లపుడును నల్పు నాస్థలిఁ జె♦లంగెడి నాతని ప్రీతి మెట్టిదో. ౬౦౧

క॥ ఏతత్క్షణపర్యంతం, బా తోయధియందుఁ గృష్ణుఁ ♦ డాడెడి నుడుపుల్
బ్రాతిగ వినఁబడుఁగాదే, భూతలపరిపాలకా! య ♦ మోఘారంభా! ౬౦౨

తే॥ వెండి శౌరి యాజలధిలో♦విజ్ఞుఁడైన, నజ్ఞుఁడైనను బ్రాహ్మణుం ♦ డతిశయముగ
మామకాత్మయ యని పల్కు♦మాటకరయ, విప్రపక్షపాతియగాఁడె?♦విష్ణుమూర్తి.

ఉ॥ బాడబుఁడైన మానవుఁడు ♦ వార్థితటంబున కేగి లోతుఁగాఁ
గూడినచోటుఁ జేరి యు ♦ గోపతిసత్ప్రతిమఁ గ్రహించి బ
ల్వేడుకఁగట్టి యిల్లొకటి ♦ విజ్ఞులుమెచ్చఁ బ్రతిష్ఠజేయు న
వ్వాఁడు ప్రభాకరుండనిమె ♦ భావమునందుఁదలంపనా విభూ! ౬౦౪

తే॥ ఇదియద్వారకాఖండంబు ♦ నెవరుదీని,
వినెదరో పఠియింత్రో యా ♦ యనఘుల కల
పరమహరిపాదములుగాంచు ♦ భాగ్యమబ్బుఁ
గలదు నిజమిది మైథిల ♦ క్ష్మాతలేంద్ర! ౬౦౫

తే॥ అని జనకునకు నారద♦ముని నుడివిన, సరణి గర్గమునీంద్రుఁడు ♦ శౌనకునకుఁ
బల్కె నంతటఁ దన్ముని ♦ పరమభక్తి, గర్గయోగిని బ్రశ్నింపఁ ♦ గడఁగె నిట్లు.

ఉ॥ భూసురదేవ! దేవమణి ♦ భూషణభూషిత వాసుదేవ! గో
పీసహితా! హితప్రకర ♦ భీతివినాశరతా! రతీశ్వరో

ల్లాసకరా! వినుత్యసుక ♦ లా ! కరినాయకహారి హారి! శ్రీ
వాస! కుశస్థలీపురని ♦ వాస! వలాహకనీలభాసురా! ౬౦౭

మాలిని.

మగధవిభువిజేతా! ♦ మానిరాడ్గమ్యనేతా!
నిగమగదితరూపా! ♦ నిర్జితారాతిభూపా!
సుగుణనిచయయుక్తా! ♦ శుద్ధభక్తాళిరక్తా!
యగమతిలకధారీ! ♦ జ్యాజశాపాంతకారీ! ౬౦౮

గద్యము:- ఇది శ్రీమత్పరమపవిత్రాపస్తంబసూత్ర, భారద్వాజసగోత్ర, చివుకుల
కులజలధికళానిధి, కోటమాంబా కామయ తనయ, లక్ష్మీదేవీ
సుబ్రహ్మణ్య దత్తపుత్ర, శ్రీకృష్ణప్రసాదాసాదిత కవిత్వ
నిశ్చయ, సుజనవిధేయ, శ్రీనివాసాపరనామధే
యాప్పయశాస్త్రిచే నాంధ్రీకృతంబైన
శ్రీ గర్గభాగవతం బందలి
ద్వారకాఖండము
సంపూర్ణము

శ్రీ శ్రీ శ్రీ
హరిః ఓం తత్సత్
శ్రీకృష్ణార్పణమస్తు

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః.

శ్రీ గర్గభాగవతము.

విశ్వజిత్ఖండము.



అతసీసుమసంకాశా!
ప్రతతిప్రతతిప్రయుక్త ♦ భవననివాసా!
రతిపతిజనకా! రాసని
రత! యతితతిసన్నుతాత్మ! ♦ రాధాకృష్ణా! ౧

తే॥ అవల నేమని బహులాశ్వుఁ ♦ డమరమునిని, నడిగెనో యది యిపుడు నా ♦ కానతీయు
మనుటయుఁ గర్గమౌనియు ♦ నట్టి శౌన, కునకు వినుమని యీరహి ♦ ననఁగఁ దొడఁగె.

ఆ॥ ఎవ్వఁ డుగ్రసేనుఁ ♦ డెంబుల యదుప్రభుం, డాతఁడయ్యె నేల ♦ యాతని కటు
శౌరి సాయపడెనొ? ♦ యారహి యంతయు, ముచ్చటింపు మమర ♦ మునివరేణ్య!

మరుతోపాఖ్యానము.

క॥ అనవుడు నారదముని యి, ట్లనియెను గృతయుగమునందు ♦ నతఁ డినకులమం
దున మరుత్తుండను పేరున, జనియించిన చక్రవర్తి ♦ జననుతచరితా! ౨

ఆ॥ అట్టిచక్రవర్తి ♦ యఘహరవిశ్వజి, దధ్వరోత్తమంబు ♦ నఖిలవేద
శాస్త్రసమ్మతముగ ♦ సల్పెను దక్షిణ, మెట్టిదంటివన వ♦చింతు వినుమ! ౩

వ॥ అమ్మహాధ్వరంబును హిమాచలంబున కుత్తరప్రాంతంబునం దివ్యప్రదేశంబుం గాంచి మునిశార్దూలుండగు సంవర్తుని నాచా[illegible] నొనరించి తదాజ్ఞానుసారంబుగాఁ బంచయోజనవిస్తారంబుగ . హేమా[illegible]ండం బొందును

యోజనవిస్తీర్ణంబుగ బ్రహ్మకుండంబును గవ్యూతివిశాలంబులగు పంచకుండంబులను నిర్మించి మేఖలాగర్తవిస్తారంబులుగ పదివేదికలను ఘటించి సహస్రహస్తోచ్ఛ్రియంబగు యూపంబును స్థాపించి వింశద్యోజనవిస్తీర్ణంబుగా సువర్ణమయంబగు యజ్ఞమండపంబు కదళీస్తంభతోరణాదిప్రకాశమానం బగునట్లు రచించి బ్రహ్మరుద్రాద్యఖిలబర్హిర్ముఖులను మహర్షివరేణ్యులను, మునీంద్రులను సవినయంబుగా నాహ్వానించి రావించి సంతసించి ౬

సీ॥ శాస్త్రోచితంబుగా ♦ సకలక్రియల సల్పు, దశలక్షహోతృతా ♦ ధనులతోడ
నఖిలాధ్వరంబులం ♦ దాటితేటినయట్టి, పంచలక్షౌధ్వర్య ♦ వరులతోడఁ
బ్రాచితంబులు లేని ♦ పగిదిఁ బనుల్ జేయు, పంచలక్షోద్గాతృ ♦ వరులతోడ
వెతగలిగిన్ దీక్ష ♦ విడువక ఘనతభాసిలు దశలక్షదీ ♦ క్షితులతోడ

తే॥ విదితులైన చతుర్వేద ♦ విదులతోడ, సర్వశాస్త్రార్థతత్వజ్ఞ ♦ సమితితోడ
స్వకసమస్తపాపక్షయ ♦ ద్వారముగను, శ్రీహరిప్రీతికై యాచ ♦ రించె నందు.

క॥ నిరతం బగ్నిని హోమము, గరిశుండాభాజ్యధారఁ ♦ గావించుటచేఁ
గర మాతనికి నజీర్ణము, దొరకొనె నిది యబ్బురముగఁ ♦ దోఁపదు గాదే! ౮

తే॥ మఱియు మరుతుండు స్వయముగా ♦ మఖమునందుఁ, దవిలి సభను విశ్వేదేవు ♦ లెవరి కేవ్వ
రికిని భాగము లివ్వను ప్రీతితోడఁ ♦ జెప్పిరో, యటు వారికిఁ ♦ దప్పకయిడె. ౯

ఆ॥ ఎల్లదేవతలును ♦ నెల్ల మహాత్ములును, నెల్ల ఋషివరేణ్యు ♦ లెల్ల యోగు
లెల్లజంతువులును నెల్లభూసురులును, జెంది తనివి మఱి య ♦ జీర్తి గనిరి. ౧౦

క॥ అత్తఱి ముజ్జగములలో, నెత్తావున నొక్కజీవ ♦ మే నాకలితో
గత్తర జెందుట లేదని, చిత్తమున న్నమ్ము మయ్య! ♦ శ్రీబహులాశ్వా! ౧౧

తే॥ మరుతుఁ డాజన్నపుం దుద ♦ నరసి డాసి, నిజగురుఁడగు సంవర్తము ♦ నితిలకునకు
శాస్త్రరీతినిఁ బూజించి ♦ చక్కఁ మ్రొక్కి, దక్షిణగఁ జతుర్దశనియు ♦ తకరులింక.

క॥ జంబూద్వీపప్రభుతయు, జాంబూనదభరచతుర్ద ♦ శనియుతములు ర
మ్యంబగు మణికోటుల నశ్వంబులు నూరర్బుదములు భ ♦ క్తి నొసంగెన్. ౧౩

తే॥ వాజులైదువే లిభములు ♦ వందనూఱు, బారువలపొన్ను నొక్కొక్క ♦ బ్రాహ్మణునకు
వేలువేలుగ నిడి నమ ♦ స్కారములను, సల్పె నతని యీవికి నిల ♦ సాటి గలదె?

తే॥ తినిన త్రాగిన పాత్రముల్ ♦ గనకమయము, లైన విప్రులు సంతుష్టి ♦ నంది కొనక
యరిగి రవి శతయోజన ♦ స్ఫురితగిరిగ, మంచుమలపొంతఁ దగ నది ♦ మించునిపుడు.

క॥ పలుపలుకులు మన కేలా?, యిలలో నాసవమువంటి ♦ యిద్ధమఖంబుల్
గలుగదనియు నాతని కెన, గల యోగ్యుఁడు గాఁడనియు ♦ ఖ్యాతి ఘటించెన్.

క॥ అంతట విష్ణువు సవకుం, డాంతరమున నుద్భవించి ♦ యామరుతోర్వీ
కాంతునకు నాత్మరూపము, సంతోషముతోడఁ జూపి ♦ సన్నిధి నిలిచెన్. ౧౭

చ॥ నిలిచినతోడ నామకుత ♦ నేత ముదంబును బొంది యేమియుం
బలుకఁగలేక తన్నిహిత ♦ భక్తివశుండయి తత్పదంబులన్
సులువుగ వ్రాలె నంతట య ♦ శోదకిశోరుఁడు తద్ధరేశుఁ జే
తులఁగొని లేవఁదీసి బహు ♦ తుష్టిదసూక్తుల నిట్లు వాకొనెన్. ౧౮

మ॥ ధరణీనాయక! నీమఖంబునకు హ్లా ♦ దం బొంది నే వచ్చితిన్
మఱి నీ భక్తికి మెచ్చితిం గనుక వే ♦ ర్మార్గంబు బోకుండ నే
వరమున్ గోరెదొ యద్ది స్వల్పమయినన్ ♦ భారంబుగా నుండినన్
గరుణన్ నీకు నొసంగెదన్ జుమి యనన్ ♦ క్ష్మానాయకుం డంతటన్. ౧౯

చ॥ మరల శిరంబిలన్ దగుల ♦ మాపతికిన్ నతిసల్పి పూజలం
బరువడిజేసి యిట్లనియెఁ ♦ బంకజనాభ! యశేషదోషముల్
సరగునఁబోవఁ గోరికలఁ ♦ జక్కఁగ నిచ్చెడి నీపదాబ్జముల్
బొరిఁబొరిఁ గొల్చుభాగ్యము గు ♦ బుద్ధికి నాకిఁకయుంటిదో ప్రభూ! ౨౦

తే॥ ఇంతకంటెను మేలిమంచి ♦ యీప్సితంబు, గలదటంచు వాంఛించుట ♦ గంగదరిని
దగను నాపుటకని బావిఁ ♦ ద్రవ్వు మార్గ,మట్టులే నాదు శ్రీధరా! ♦ యైన వినుము!

కం॥ నీమాటలపైఁగల గా,రామున నే నడుగుచుంటి ♦ రాజీవాక్షా!
నామదితామర నీపద, తామరసము విడనిరీతి ♦ దయచేయగదే! ౨౨

తే॥ అదియ ధర్మార్థకామమో ♦ క్షాదికార,ణంబుగద భక్తవత్సలా! ♦ నావుడు హరి
వీనులారఁగ నాలించి ♦ ప్రీతితోడ, నలిని కిట్టులఁ బల్కెనో ♦ యార్యవర్య! ౨౩

తే॥ తృషను వరముల నడుగక ♦ దివ్యమతిని, జూపియుంటివి దానికి ♦ సుఖముగంటి
నైన భక్తుఁడు ఫలయుతం ♦ బైన కోర్కె,గోరకుండిన నాయెద ♦ కుమురపడను

కం॥ కావున నను మానింపక, భూవర! మఱియొక్క వరము ♦ బొందుము నాచే
నావుడు తన్మరుతాధిపుఁ, డా విష్ణువుతోడ నిట్టు ♦ లనియెను నతుఁడై. ౨౫

కం॥ నీ పదపంకజపూజయు, నీ పదపూజకులతోడి ♦ నెయ్యముఁదగ ను
ద్దీపితవైకుంఠము నం, దేపాను విధం బనుగ్ర ♦ హింపవె దేవా! ౨౬

మ॥ అని వేడన్ మురవైరి యిట్లనియె భూ ♦ పాగ్రేసరా! యీవరం
బును నీకిచ్చితిఁ గాని యొక్క విషయం ♦ బున్ విన్ము సౌఖ్యాకరం
బును నాశ్చర్యకరంబునైన త్రిదివం ♦ బుంబొంది మోదంబు నె
మ్మనమందొందుచు నుండి క్రమ్మఱను నీ ♦ మన్వంతరంబందునన్. ౨౭

కం॥ ఇఱువదెనిమిదవ ఘనయుగ, మరిగెడి తఱి ధరను బుట్టి ♦ యలమారాలకుఁ గా
పరియా నాతో మైత్రిని, నెఱపుచు మద్ధామమందు ♦ నిలుతువు మరుతా! ౨౮

కం॥ అని వరమిడి చనెఁ దద్విధి, జనియించెఁ దదుగ్రసేన ♦ సదభిధ నతఁడా
వనరుహాలోచను ననుమతి, నొనరించెను రాజసూయ ♦ మొం దందముగాన్. ౨౯

క॥ ఇది మరుత్తోపాఖ్యానము, జదివిన వ్రాసినను వినిన ♦ సకలార్థంబుల్
గొదకొను హరిభక్తుల కై, య్యది యబ్బదొ? ముజ్జగముల ♦ నవనివరేణ్యా!

తే॥ అవల బహులాశ్వుఁ డిట్లనె ♦ నమరమునికి
మౌనివర! చెప్పుమా యుగ్ర ♦ సేనవిభుఁడు
రాజసూయాధ్వరవర మా ♦ రంభ మెటుల
సల్పె నెటుదాని కా హరి ♦ సాయపడెనొ? ౩౦

నారదముని బహులాశ్వునకు రాజసూయవృత్తాంతంబు చెప్పుట.

క॥ అనవుడు నారదుఁ డిట్లనె, జనకా! యాయుగ్రసేన ♦ నరసుఁడు కీర్తిఁ
దనరుచు మనుతతి నొకపరి, వనమాలినిఁ బూజచేసి ♦ ప్రశ్నించె నిటుల్. ౩౨

ఉ॥ దేవర! దేవమౌనివర ♦ దివ్యముఖంబున రాజసూయమేఁ
బావనదాధ్వరం బనుచు ♦ బల్మఱు వింటిని దత్క్రతూత్తమం
బేవిధిఁ జేయఁగావలెనొ? ♦ యేయధిదేవతయౌనొ? దానికిం
కేవిబుధాళి రావలెనొ? ♦ యేఫలమో? వచియింపు మియ్యెడన్. ౩౩

చ॥ జగమున నెందఱో నృపులు ♦ సారససామ్యభవత్పదంబులన్
మిగుల భజించి యెల్లపుడు ♦ మిక్కిలి చిక్కుల గల్గఁజేయు నీ
జగతిఁ దృణీకరించి నిజ ♦ సర్వమనోరథకంథ నీఁదరే
యగయుగశాపమోచనప ♦ రా! విదితాగధరా! పరాత్పరా! ౩౪

వ॥ అని సుప్రశ్రయంబుగాఁ బలుక నవ్వలమురితా ల్పలరి యాయేలిక కిట్లు వక్కాణించె. యాదవేశ్వరా! లెస్సగా నాలోచించి చక్కని విషయంబు దేటపరచితివి. తత్సవోత్తమంబు జగత్త్రియప్రతిష్ఠాకరంబు. నీసంకల్పం బమోఘంబును, నిర్మలంబును నై నాకును సమ్మతంబయ్యె. తన్ముఖకృత్యంబు యమప్రభుండవగు నీకొనర్పందగినదియు. వేఱొండు విచారింపక యారంభింపుము. అందులకుం దొల్దొల్త సర్వయాదవుల నామంత్రణంబు సేసి మహాసభం గావించి తాంబూలవీటికం గరంబునం గ్రహించి తదధ్వరవిషయకప్రతిజ్ఞను వ్యక్తీకరించిన నవ్వారు మదంశసంభూతులును, లోకద్వయవిజిగీషులగుటం బట్టి యద్దాని కంగీకరించి నల్లడలంగెల్చి యందుండు రాజమార్తాండులనుండి కప్పంబులం గొనితెచ్చి నీకిచ్చి సంపూర్ణంబు సేయింపం గలరు. కాన విష్ణుప్రీతిగా విధివిధానంబునం దడయక యా జన్నం బాచరింపుము. నేనును కాసటగా నుండెదనని సుప్రియంబుగా నుడువ నా యుగ్రసేనుండు మెచ్చి యదువృష్ణిభోజాంధకాదులగు యాదవులను సమాహ్వానించి గారవించి సుధర్మం గావించి తా నింద్రసింహాసనాసీనుండై చేతం దాంబూలవీటికం ధరించి. ౩౫

చ॥ తలఁచితి రాజసూయము య ♦ థావిధిగా నొనరింప మిమ్ములం
బిలిచితి నిద్ది తెల్ప మొన ♦ నేరెడుదీవిని నున్న రాజులన్
గెలిచి కరంబులంగొని సు ♦ కీర్తి గడించియు వచ్చు వీరుఁ డీ
స్థలిఁ గలఁడేని లేచి యిది ♦ చక్కఁ గ్రహించి గ్రసించు నిమ్మెడన్. ౩౯

క॥ అని గంభీరగళంబున, ననఁగా విని యాదవులును ♦ "హరి శివ" యనకే
చనసాగిరి తత్సమయంబునఁ బ్రద్యుమ్నుండు భీష్మి ♦ పుత్రుఁడు కడఁకన్.

తే॥ పలికె నిట్లు జంబూద్వీప ♦ భాసమాన, విభుల నందఱ నాజికిఁ ♦ బిలిచి గెలిచి
బలులఁ గైకొని వాసితో ♦ వచ్చి రాజ,సూయసవము సంపూర్ణంబుఁ ♦ జేయఁగలను.

తే॥ ఇట్టి దిగ్విజయంబును ♦ నేను జేయ, నే నగమ్యాగమనగురు ♦ ధేను బభ్రు
భూసురాది హత్యాకృతుల్ ♦ జేసినంత,దురితముల్ నాకుఁగల్గుత ♦ సరసులార!

క॥ అని శపథోక్తుల నాడుచు, వినయముతో నుగ్రసేన ♦ విభునకు నతులన్
బొనరిచి తద్వీటికఁ గై,కొనెఁ జూపఱు లబ్రమొంద ♦ క్షోణీనాథా! ౪౦

{ యాదవులు దిగ్విజయార్థంబై వెడలు ప్రద్యుమ్ను నభిషేకించి బహుమతు లిడుట. }

తే॥ అంత యదుకులాచార్యుఁడ ♦ నఖిలవేద,శాస్త్రవిదుఁడగు గర్గుఁడు ♦ సన్ముహూర్త
మందు వేదసూక్తులతోడ ♦ నాతని కభి,షేక మొనరింపఁ జేసియా ♦ శీర్వదించె.

ఆ॥ ఉగ్రసేనుఁ డతని ♦ కుచితతిలకమును, బెట్టె నంత గోప ♦ విభులుగూడ
నాత్మశక్తి కొలఁది ♦ నవనతులై బలుల్, దెచ్చి యిచ్చి యిచ్చ ♦ మెచ్చి రవల. ౪౧

క॥ వనమాలి స్వశార్ఙ్గమునన్, ధను వక్షయసాయకమయి ♦ తగు నిషుధియుగం
బును దన యమ్ములపొదులన్, జనియింపఁగఁ జేసియిచ్చె ♦ స్వకుమారునకున్.

సీ॥ ఉగ్రసేనుండైన ♦ యుగ్రసేనుఁడు మ,హాశితఖడ్గంబు ♦ నందనిచ్చె
నక్రూరమతియైన ♦ యక్రూరుఁడున్ దక్ష,నావర్తశంఖంబు ♦ నందనిచ్చె
బలశాలియై హెచ్చు ♦ బలరాముఁడున్ దృఢ,మైన వర్మంబును ♦ నందనిచ్చె
వసుధావరుండైన ♦ వసుదేవుఁడుశత చం,ద్రాఖ్యాకృపాణంబు ♦ నందనిచ్చె

తే॥ నుత్తములకెల్ల ధవుఁడైన ♦ యుద్ధవుండు, కేసరోల్లసన్మాలిక ♦ వాసినిచ్చె
దుర్గతుల్ బాపఁజాలిన ♦ గర్గమునియుఁ, గృష్ణకవచయంత్రంబుల ♦ నిచ్చనిచ్చె.

తే॥ బుద్ధిమంతులన్ వృద్ధుండు ♦ వృద్ధుఁడునగు, శూరసేనుండు సత్కీర్తి ♦ మీఱు ఛత్ర
చామరాంబరకుండల ♦ సత్కిరీట,ముల నొసంగె శంబరవైరి ♦ కలఘుమతిని.

ఆ॥ హరిదధీశ్వరాన్వి ♦ తాఖండలుండును, విబుధమానిసహిత ♦ విధిశివులును
వచ్చి రందు బ్రహ్మ ♦ పద్మరాగము శంక,రుఁడు త్రిశూల మల మ ♦ రునకు నిడిరి.

తే॥ పాశి పాశంబు ననిలుండు ♦ వ్యజనయుగము
యముఁడు దండంబు భాస్కరుం ♦ డధికభార

రాజితగదఁ గుబేరుండు ♦ రత్నమాలఁ
జంద్రకాంతంబుఁ జంద్రుండు ♦ సరగ నిడిరి. ౪౭

తే॥ వీతిహోత్రుండు బరిఘంబు ♦ భూతలంబు
యోగమయపాదుకాయుగం ♦ బుత్తమముగ
కుంతమును భద్రకాళియు ♦ గోర్కిమీఱ
నట్టి కందర్పునకు నిచ్చి ♦ రాయదనున. ౪౮

సీ॥ అంగుగా సింగార ♦ ముంగాఱు చెత్తైన, బంగారు శృంగముల్ ♦ బరఁగినదియు
ఘనరవంబులఁ బోలు ♦ ఘంటికాటంకార, కింకిణీశబ్దముల్ ♦ గెరలునదియు
మారుతశీఘ్రంబు ♦ మానసవేగంబు, మించిన లఘుగతిం ♦ గాంచినదియు
బ్రహ్మాండమందు వె ♦ ల్పలనులోపలఁ బోవఁ, జాలిన నేర్పుతోఁ ♦ గ్రాలినదియు
తే॥ వెయ్యిబాబాలు జెండాలు ♦ వెయ్యి వెయ్యి, చక్రములుగలిగినదిరత్న ♦ చయముతోడఁ
జెలఁగునది విశ్వకర్మచేఁ ♦ జేయఁబడిన, దియగు జైత్రరథం బిడె ♦ దేవవిభుఁడు.

క॥ అరిసంహారణకరణచణ, వరశక్తిఁ శక్తిధరుఁడు ♦ వచ్చి యతనికిఁ
గరముగఁ గరదంబుగ నిడె, హరికరుణం గన్నవారి ♦ కల్లిడు టరుదే? ౫౦

ఉ॥ అత్తఱి శంఖదుందుభిమృ ♦ దంగఘనానక వేణువల్లకీ
సత్తమవేదనాదములు ♦ జాలఁ జెలంగఁగ లాజలక్షతల్
ముత్తెములుం విరుల్ గురియఁ ♦ బుష్పశరుండు బలాచ్యుతేశగ
ర్గోత్తములం నతింద నిపి ♦ యొందె తదాజి మహోల్లసంబునం. ౫౧

తే॥ విజయశబ్దంబు లెలెడ ♦ వెల్లి విరియ, దివ్యమగు శతాంగంబునం ♦ దేజమీఱ
నెక్కి యక్కుశస్థలినుండి ♦ యేగఁదొడఁగెఁ, జూపఱుల్ జోద్యమందుచుఁ ♦ జూచుచుండ.

తే॥ అతని వెంటనె చనిరి గ ♦ దాదిబలులు, సాంబముఖులును మిత్రాత్మ ♦ జాతయోధ
పత్తిరథగజహయయుతుల్ ♦ బద్మనాభ, మోదితుల్ మహారథులు న ♦ మోఘబలులు.

తే॥ మఱియు శస్త్రాస్త్రములు బ ♦ ట్టి హరులుగరుల, దేజగల్గు దశార్హక ♦ భోజవృష్ణి
శూరసేనమధ్వంధక ♦ వీరముఖ్యు, లుద్ధవాదియాదవులేగి ♦ రుచితరీతి. ౫౪

తే॥ ఇంక నతని వెంటను మండ ♦ లేశ్వరులును, సకలశస్త్రాస్త్రభూ ♦ షలను దాల్చి
యరదముల నెక్కి చతురంగ ♦ పరివృతులయి, బయలుదేరిరిగా దె ♦ త్తోడ్పాటుపడఁగ.

వ॥ అత్తఱిఁ దత్పురినుండి గుండనంపు మొగ్గ లమర్పంబడిన వింతవింత మొగంబులతోడను, మిగుల మ్రోఁగు ఘంటాకింకిణులతోడను, నరిభయంకరులగు జోదులతోడను, నయనపర్వంబగు నరుణాంబరంబులతోడను విరాజిల్లుచు దిగ్గజంబులం బోలుచు నీలాచలంబులభాతి భాసిల్లుచు మందగమనంబున మత్తమాతంగేంద్రంబులు గోట్లకొలంది నిర్గమింపం దొడంగె. అందుం గొన్ని భద్రంబులును, గొన్ని భద్రమృగంబులును, గొన్ని వింధ్యాచలభవంబులును, గొన్ని హిమా

లయసంభవంబులను, గొన్ని మలయప్రభవంబులును, గొన్ని మారంగోద్భవంబులును, గొన్ని కాశ్మీరజాతంబులును, గొన్ని కైలాసవనజంబులును, నైరావతజనితంబులై చతుర్దంతంబులు గలిగినవి కొన్నియు, నూర్ధ్వంబుగాఁ ద్రిశుండంబులు గ్రాల భూమ్యంతరిక్షంబులందు సంచరింపంజాలినవి కొన్నియు, నీలాంబరవిరాజితంబులై యంబారిని వీరులు జెన్నారం గాఱుమొగులుచందంబున ఘీంకృతుల నిశ్శంకంబుగాఁ జేయుచుం జరించునవి కొన్నియు, నిజశుండాదండంబునం గుల్యాద్రులం బెల్లగించి యర్కమండలమం దుంచుచుఁ బాదంబులతో మేదిని నదిలించుచు మదధారలతో నచలాకులం దడపుచుఁ దిరుగాడునవికొన్నియు, శిరంబులతో దుర్గాద్రిగండశైలాదులంగూల్చి వైరివారంబులం జీల్పంజాలి పెల్చన నిల్చినవి కొన్నియు దుందుభిపతాకాసంయుతంబులై యబ్ధియందు మకరరాజంబులపగిది విహరించునవి గున్నయేనుఁగులు కొన్నియు నొప్పారు. వెండియు నంగవంగకళింగకాశ్మీరభోజకాంభోజ సౌవీరసౌరాష్ట్రమహారాష్ట్రమగధమాళవనేపాళకేరళచోళపాంచాళగౌళమళయాళ సింహళ సింధు ద్రవిడకర్ణాటపుళిందాంధ్రదశార్ణకుక్కురు గాంధారబాహ్లికబర్బరకేకయ కోసల కుంతల కిరాతటంకణకొంకణమత్స్యశ్వేతద్వీపవైకుంఠరమావైకుంఠోర్ధ్వవైకుంఠాజితపాదాదిస్థలసంభవంబులగు దివ్యహయంబులును, గోట్లకొలంది నానాభూషణభూషితంబులై నిర్గమింపం బొడంగె. అం దపక్వసూత్రంబులమీఁదను,బుద్బుదంబులమీఁదను, వాయుమనోవేగంబులతో నడచుచు వింత గల్గించునవి కొన్నితురగంబులును, మేడలను మాడువులను, కోటలను,గోడలను వాఁగులను, వాఁకలను, మిట్టములను, బల్లములను సులువుగా దాఁటఁజాలునవి కొన్నితురంగంబులును, మయూరీతిత్తిరిక్రౌంచీహంసీఖంజనీదివ్యగతులం బలుమాఱు మీఱుచు నాడునవి కొన్నితురంగమంబులును, శ్యామకర్ణంబులను శుభాంగంబులను, పీతపుచ్ఛంబులను ధవళవర్ణంబులను భాసిల్లి పక్షంబులతోఁ జెన్నారునవి కొన్ని తుఖారంబులును, నుచ్చైశ్శ్రవకులోద్భవంబులు గొన్నియు వరుణప్రయోజితంబులై యశ్వినీసుతవిద్యానవద్యంబులైనవి కొన్నియు, సప్తాశ్వాశ్వసంభవంబులు గొన్నియు, నశ్వినీపుష్పతుల్యంబులుగొన్నియుఁ గల్పతరుసంకాశంబులు గొన్నియు, మేలిమిబంగారురంగుగలవి కొన్నియు, సాలెపట్టుపైఁ బాఱు పారదంబువిధంబున సిరాధారంబుగా వారులయందుఁ బాఱందీరినవి కొన్నిహయంబులును,మనోహరంబుగానుండె. రథిసారథియోధశస్త్రాస్త్రసంపన్నంబులైన శతాంగంబులు తత్సైన్యంబునం జెలంగు. మఱియు నందుఁ ద్రిశూలాసిగదాపట్టిసపరిఘాముద్గరతోమరకుంతధర్మపాశంబులం దాల్చి దిగిభాభులై ప్రలయాంబుధినిభులై ఘోరసంగ్రామంబులం దరినికరగర్వ మడంచి వాసికెక్కిన శూరులు నొప్పారుచుండిరి. పూర్వోక్తంబుగా సర్వసులక్షణలక్షితుండై ప్రద్యుమ్నుండు సచతురంగంబుగాఁ గుశ

స్థలిపురినుండి వీడ్కొనుట సురాసురు లాలోకించి చిత్రపడుచుండ నుగ్రసేనుండు
సార్థరామకృష్ణుండై డాసి ధానుష్కవరుండగు నా కందర్పునితోడ నిట్లనియె. ౫౬

తే॥ కృష్ణపుత్రక ! బుధవరా ! ♦ కృష్ణకృపను, సకలభూపతులం గెల్చి ♦ సత్వరముగ
నిట్టి ద్వారకాపురికి నీ♦ వేగుదెంచ, గలవు నిక్కమ్ము కాని యీ♦పలుకు వినుమ !

క॥ మత్తుని నిద్రితు బాలుఁ బ్రమత్తుని జడు విరథు భీతు ♦ మానిని మఱి ను
న్మత్తుఁ బ్రపన్నుని నెదిరిని, మొత్తరు నయవేత్త లనిని ♦ ముక్కాలములన్. ౫౮

క॥ ఆర్తుల యార్తినిఁ బాపఁగఁ, బూర్తిగఁ గదనంబునందుఁ ♦ బోరుట బహుదు
ర్వర్తనవధయును విభులకుఁ, గీర్తిదధర్మములు గావె ♦ కృష్ణాత్మభవా ! ౫౯

క॥ మానినిగాని పురుషుఁడు, గానీ యధముండుగాని ♦ కానీ షండుం
డైనను బ్రాణులపైఁ గసిఁ, బూనినచోఁ జంపనౌను ♦ బొంద వధుంబుల్. ౬౦

ఉ॥ ఎవ్వఁడు దివ్వెలోఁ దనరి ♦ యుద్ధమహాబలయుక్తవైరులన్
జివ్వున రూపుమాపు నల ♦ శేముషి యాజగదేకదోర్బలుం
డివ్వసుధాస్థలిన్ యశ మ ♦ హీనవిధంబునఁ బొంది యంతమం
దవ్వసుదేవనందనమ ♦ హాలయ మొందఁడె ? కృష్ణఁగృష్ణజా ! ౬౧

క॥ గెలిచిన గెలువకపోయినఁ, గలఁగక యల కలనునందుఁ ♦ గాలూది తమిన్
నిలిచిన నేర్పరి నీల్గినఁ, గలువలపగయిక్కదాఁటి ♦ కనఁడే సుగతిన్. ౬౨

ఉ॥ క్షత్రియజాతి కుద్భవిలి ♦ కాంచి యవక్రపరాక్రమంబు వే
దత్రయసూక్తభూపతియ ♦ ధార్థనయంబును గుత్తెలుంగుచున్
శత్రులఁ బోరఁ జంపుటకు ♦ సాగి భయంబునఁ బాఱువార లీ
ధాత్రిని నింద్యులై తుదను ♦ దప్పక నొత్తురు రౌరవంబునన్. ౬౩

క॥ సేనలు మానవనాయకు, మానవనాథుండు సేన ♦ మనుపఁగవలయున్
ధీనిధి సారథ రథికుని, నానెఱి సారథిని రథియు ♦ హ్లాదింపవలెన్. ౬౪

తే॥ ఈవిధంబునఁ దొల్లి మ♦హీశ్వరుండు, నఖిలధర్మవిదుఁడగు స్వా♦యంభువమను
వనియెఁ గావున నీవిష ♦ యంబునందు, నేమరిల్లకు మోకార్ష్ణి ! ♦ యెల్ల యెడల.

ఉ॥ యాదవు లీరలందఱు మ ♦ హాబలులున్ వివిధాస్త్రశస్త్రసం
పాదకులున్ యశోన్వితులు ♦ బట్టునఁ గార్ష్ణిని మీరు బ్రోవుఁడీ !
యాదవులార ! మిమ్ములను ♦ నాతఁడు బ్రోచెడి వారి వీరిని
వేదసురావనీసురులు ♦ విజ్ఞలు బ్రోతురు తప్పకుండఁగన్. ౬౬

చ॥ హరికి నుడుల్ శ్రుతిత్రయము ♦ నంగములున్ సుర లాస్య మగ్రజుల్
సురభులు దేహమున్ మును ల ♦ సుప్రకరంబుగఁ జెప్పుచుండుటన్
నరులకు మోక్షకాంక్షుల క ♦ నారత మయ్యవి సేవ్యమాను శ్రీ
హరిని సెవందు నిల్పునె సి ♦ జాత్మను వాఁడె జయించు నన్నిటన్. ౬౭

క॥ అంతట యాదవు లందఱు, సంతసపడి యుగ్రసేన ♦ శాసనముఁ దలఁ
దాల్చి సంతసపడి యుగ్రసేను ♦ శాసనమున్ దలన్
సుంతను విడువక కొని యత్యంతముగ నుతించి మ్రొక్కి ♦ రటుపై మరుఁడున్.

క॥ గురువరునకు గర్గునకున్, హరికిని బలరామునకును ♦ నధిపునకు నతుల్
బోరిఁబోరి నొనరిచి యాదల, హరిదాళిజయార్థి యగుచు ♦ నరుగఁ గడంగెన్.

ఆ॥ అంత నుగ్రసేనుఁ ♦ డల హాలి హరులతో, నిజనివాసమునకు ♦ నెమ్మిఁజనియెఁ
బ్రేక్షకులును స్వీయ ♦ వేశ్మములకు నేగి, రవనిపాలక! తద♦నంతరమున. ౭౦

వ॥ అగ్రభాగంబున వాహినీసహితుండై మహాబలుండగు కృతవర్మయుఁ బశ్చాద్భాగంబునం బతాకినీయుతుండై ధనుష్మద్వరుండగు నక్రూరుండును, వాని వెనుకం బ్రతిమాపంచాంచితుండును, మంత్రికులతిలకుండును నగు నుద్ధవుండును, దత్పృష్ఠభాగంబునం దనేకాక్షౌహిణీసమేతులై ప్రద్యుమ్నానిరుద్ధ దీప్తిమ ద్భాను బృహద్భాను చిత్రభాను విచిత్రభాను వృక సాంబారుణ మధుపుష్కరదేవ వాహ శ్రుతదేవ సునందన విరూప కవి న్యగ్రోధులను కృష్ణపుత్రకులు పదునెనుమండ్రు మహారథులును, భోజవృష్ణ్యంధకాదిసర్వయాదవులును బయలుదేరిరి. తత్సైన్యస్థిత యాదవులు మాత్రం బేఁబదియాఱుకోట్లమందిగలరు. ఇఁక నా మూఁక మొత్తంబుం దెల్ప నెవండు శక్తుండగు? వీరి శిబిరంబులచే నాలుగామడలచో టాక్రమింపం బడియె. ఇట్టి విజయధ్వజిని బయలుదేరుతఱుణంబున ధణధణాత్కారంబులును, గిణ కిణాత్కారంబులును, బటపటాత్కారంబును, జటచటాత్కారంబులును టంకార ఝంకారభాంకారఘీంకారక్రేంకారంబులు సంకులంబుగా జనించి మేఘగర్జంబుల విడంబించుచు దిగ్గజంబులం జెవుడుపరచుచు నాదికూర్మంబు లేమి కింక గల్గెనో యని ధావనము బొనర్చున ట్లొనర్చుచు దైవమా! నాకేమి యుపద్రవంబు సంభ వింపఁ జేసితివని భూదేవి యడలునట్లు సల్పుచు హెచ్చం దొడంగెనని వార్తయుచ్చ టయు బహుళాశ్చర్యంబు నారదమహర్షితో సవినయంబుగా నిట్లనియె. ౭౧

క॥ ఆయన యేయేస్థలముల, కాయెడఁ జనెనో మఱెట్టు ♦ లరులను గనెనో
యేయేరీతుల గెలిచెను, యీయెడ దయ నాకుఁ జెప్పు ♦ మీవు సురర్షీ! ౭౨

తే॥ అరరె! యేమేమి! యా శౌరి♦కాత్మభక్తు,లందుఁ గలిగిన కారుణ్య♦మాడఁగలమె
యద్ది పాపినిఁ గులముతో ♦ నమలచరితు,నిగ నొనర్పదె! నాపుడా ♦ నిర్జరర్షి!

ఆ॥ ఇట్టులాడ తేఁడ! ♦ యీవు బల్కినదిప్పు, బాగు బాగు బాగు ♦ పద్మనాభ
భక్తజీవితములు ♦ బహుళశోకంబులన్, బక్కఁజేయుటరుదె ♦ సరిగ వినుమ!

క॥ రవి కననివి కనఁజాలెడి, కవిమణి ఘనబిందువులను ♦ క్ష్మారజములనున్
దవిలి గణించునుగానీ, భవికదహరిగుణము లెన్న ♦ బద్ధేంద్రుఁడుగా. ౭౫

తే॥ నాలుగామడల్ దాఁక ఘ ♦ నంబుగాను
నీడనిడువెల్లగొడుగుచే ♦ నేత్రములకుఁ

బందువౌనట్లు భైష్మీపు ♦ త్రుండు మరుఁడు
నైన ప్రద్యుమ్నుఁ డెంతో ప్ర ♦ ల్వారఁ దొడఁగె. ౪౮

❀ ప్రద్యుమ్నుండు సేనాసహితంబుగాఁ గచ్ఛాది దేశంబుల కరుగుట. ❀

మ॥ అటులన్ యాదవవాహినీసహితుఁడై ♦ యైంద్రంబు దేరెక్కి యు
త్కటసంతోషముతోఁ దదంగజుఁడు త ♦ త్కచ్ఛాభిధాదేశముల్
జటులప్రక్రియగా జయింపఁ జనె మున్ ♦ శంభుండు జృంభించి యు
ద్భటతాదృక్త్రిపురంబులన్ గెలువఁగా ♦ బైల్దేరినట్టుల్ విభూ! ౪౯

తే॥ అట్టిపట్టునం గచ్ఛదే ♦ శాధిపుండు, శుభ్రుఁడనువాఁడు వేఁట క ♦ దభ్రగతిని
జనుచు నరుదెంచుసైన్యంబు ♦ గని వెనుకకు, మరలి యాత్మహాలావ్యాయ ♦ పురికి వచ్చె.

తే॥ అతని మూఁకలు తత్స్థలి ♦ కరిగినంత, ద్విరదచరణసంహతులచేఁ ♦ దరునికరము
గూలి నుసియయ్యె రేగిన ♦ ధూళు లాక ♦ సంబు నంధమయంబుగా ♦ సంతరించె.

క॥ దానిం గాంచిన పౌరవితానము భయపడెను మిగుల ♦ తద్భూవరుఁ డా
మీనధ్వజునకుఁ బ్రత్యుత్థానంబును జేసి మ్రొక్కి ♦ తత్పరమతితోన్. ౫౦

తే॥ హేమమాలల నొప్పారు ♦ నిభము లైదు
వంద లయుతంబు హయములు ♦ స్వచ్ఛమైన
స్వర్ణమిరువదిమణుఁగులు ♦ బలిగ నొసఁగి
పుష్పహారబద్ధాంజలిన్ ♦ మ్రొక్కెనంత. ౫౧

క॥ ప్రద్యుమ్నుఁడు తన కయ్యది, హృద్యముగా నుంట నతని ♦ కిడి రత్నస్ర
క్ఛద్యతనార్వాచీనులు, జోద్యము గన నతని ప్రభుత ♦ సుస్థిరుఁ జేసెన్. ౫౨

ఉ॥ అంతఁ గళింగదేశముఁ ద ♦ దంగభవుండు జయింపఁ దత్తటి
త్వంతులగూడి యేగు మఘ ♦ వంతుని పోలిక బైలుదేరి త
త్ప్రాంతముఁ జేరె నంత నల ♦ పార్థివుఁడున్ స్వబలప్రయుక్తుఁడై
చింతభయంబులన్ విడి క ♦ సిన్ బ్రతిరోధము జేసె నాతనిన్. ౫౩

క॥ అది కని ధన్వివరుండగు, మదనసుతుం డొంటిగానె ♦ మసలని యట్లా
కదనమునన్ శరశిఖులను, బొదివి కళింగేశుపైనిఁ ♦ బూర్ణరుషాత్మన్. ౫౪

క॥ భటవరరథమదకరులను, గటకటబడఁగా శితాశు ♦ గదశత్రయమున్
ద్రుటిఁబఱపియుఁ డంకృతులన్, జటులంబుగఁ జేసె స్వీయ ♦ సైన్యము పొంగన్.

క॥ అత్తఱి ననిరుద్ధుం డా, చిత్తజుఁడును జూచుచుండ ♦ శితబాణములన్
దత్తీక్ష్ణారిబలంబున, మొత్తముగా వైచె జనక ♦ భూభుజవర్యా! ౫౬

చ॥ అతని శితాశుగప్రహార ♦ మంది కళింగమహీశువాహినుల్
హతరథముల్ వ్యథాకృతమ ♦ హాధ్వజముల్ హతిమత్తనాగముల్

హతభటులుఁ హతేశులు హ ♦ తాశ్వయచోదకజాలముఁ మఱిన్
హతరథిసారథివ్రతతి ♦ యై కనవయ్యె ననంతరంబునన్. ౮౭

క॥ ఆకాళింగేశుఁడు తన, మూఁకలఁ గని మేనఁజెడిన ♦ బొందళము దగన్
వీఁక గజారూఢుండై, యాకట్టగ నతనిఁ బోర ♦ నాగ్రహమతితోన్. ౮౮

తే॥ నూటనలుబదిమణుగుల ♦ వాటమైన, గదను గొని యనిరుద్ధుపైఁ ♦ గంటగిలగ
వైచి నిజకరిచే వీర ♦ వరులఁ ద్రొక్కఁ, సల్పి గర్జించె జలదంబు ♦ సరణిఁ గరము.

ఉ॥ అట్టులఁ దద్గదాహతిని ♦ జ్యాభయిఁబడ్డ యుషామనోహరున్
జుట్టిన యాదవోద్భటులు ♦ జూచి మహాగ్రహావృత్తిఁ దద్రిపున్
బట్టి శితాస్త్రశస్త్రములఁ ♦ బాఁదిరిగా కురరంబు స్యేనము
న్బట్టి ఫలంబు మెక్కఁగ ఘు ♦ నంబగు ముక్కునఁ గ్రుమ్మినట్టులన్. ౯౦

చ॥ పిదపఁ గళింగనాయకుఁడు ♦ వెంటనె నారినిగూర్చి చాపమున్
మద ముబుకంగఁ డంకృతుల ♦ మాటి కొనర్చి తదీయబాణముల్
జదియఁగఁ గొట్టె నంత బల ♦ శాలి బలానుజుఁడౌ గదుండు స్వో
ద్గదగొని వామహస్తమునఁ ♦ దద్గజముం బ్రహరించె నెంతయున్. ౯౧

తే॥ తత్ప్రహారమునన్ వాని ♦ దంతి పడియె
నింద్రదంభోళిహతిచే మ ♦ హీధరంబు
పడినయట్లు కాళింగుఁడున్ ♦ బడియెఁ బుడమి
నంతఁ దిరిగి యా కాళింగుఁ ♦ డాగ్రహమున. ౯౨

చ॥ గదఁగొని లేచి తద్గదుని ♦ గాటముగాఁ బ్రహరింప నాతఁడున్
గద నతనిన్ సుమాళముగ ♦ గాశ్యపిపైఁ బడద్రొబ్బి కొట్టె నా
పిదపఁ గళింగరాజు తన ♦ వీర్యము హెచ్చిల లేచి వానిన
మ్మద మణఁగంగ బాఁదె నిటు ♦ లయ్యెను ఘోరరణంబు వీరికిన్. ౯౩

ఆ॥ వీరిగదలు రెండు ♦ విస్ఫులింగంబులఁ, బఱపి పోరి తుదకుఁ ♦ గరము నుసిగ
మాఱె గదుఁడు ♦ వాని ధారణిఁబడఁద్రోసి, యీడ్చె ఫణిని గరుడి ♦ యీడ్చినట్లు.

తే॥ అట్టి సంహతిసంచూర్ణి ♦ తాస్థి బాధ, తుండునగు కళింగేశుఁడు ♦ త్రోఁదులేమి
నీమనోభవుశరణంబు ♦ నడుగ బలిని, శక్తికోలఁదిని నిడి యున ♦ సాగె నిట్లు.

క॥ దండము దండము దైవత, తండవిభుండవు పరేశ! ♦ దాన లయమునన్
మండెడి దండధరునిగతి, నుండిన నిన్నెవఁడు నూచి ♦ యోర్చునో చెపుమా!

చ॥ అనవుడు మెచ్చి కృష్ణతన ♦ యాగ్రణి తత్థ్సలి వీడి నీటిపైఁ
జను నవలంబుకై వడిని ♦ స్వధ్వజినీసచివేంద్రయుక్తుఁడై

ఘనమరుధన్వదేశపతిఁ ♦ గాంచి జయింపఁగ నెంచి ముందుగాఁ
బనిపెను నుద్ధవాఖ్యుఁ దన ♦ పైనము చొప్పును జెప్ప వానికిన్. ౯౭

క॥ శ్రద్ధను బుద్ధిమదగ్రణి, యుద్ధవుఁ డా మరుని యాజ్ఞ ♦ నొందియు జేరెన్
దద్ధన్వాధిపధానికిఁ, దద్ధరణీధ్రోరుదుర్గ ♦ తండము గడవన్. ౯౮

వ॥ అట్లా రాజధాని కాతండు సేరి తదధిపుండగు గయుని సభాభవనంబునం గాంచి మహారాజా! యాదవేశ్వరుండగు నుగ్రసేనుండు జంబూద్వీపవిరాజమాన భూపతులనుండి కప్పంబులం గొని రాజసూయాధ్వరం బొనర్పంగలండు. ఇద్దాని కసంఖ్యబ్రహ్మాండవిభుండును, బరిపూర్ణతముండును, భగవంతుండు నగు శ్రీకృష్ణుండు సచివుండై చెన్నారె. అమ్మహాత్మునిచే ధన్వివరుండును, మహాబలుండునగు నీప్రద్యుమ్నుండు ప్రేషితుండయ్యెం గాన గులకౌశలార్థంబుగాఁ గరంబునం గరదంబులవ్వానికి సమర్పింపుమని సవినయంబుగాఁ జెప్ప నా గయుం డీషత్ప్రకుపితుండై వీర్యశౌర్యంబులు ధైర్యస్థైర్యంబులతోఁ బెనఁగొన నఖర్వగర్వంబున నిట్లు వక్కాణించె. ౯౯

తే॥ ఉద్ధవా! నీవు మీపతి♦కొత్తి యిట్లు, పలుకవలయును గయరాజు♦భండనంబు
సలుపకుండఁ గప్పముల నీఁ♦దలఁచుకొనఁగ, లేదటంచు ముమ్మాటికి ♦ లేదటంచు

తే॥ అబ్బ! యెల్లలా నీబోటి ♦ యాదవులకు, నింత స్వల్పకాలంబులో♦నింత బుద్ధి
హద్దుమీటి జనించెనే♦యౌర! యరరె!, భండనంబును సల్పక♦బలుల నిడను

మ॥ పిదపన్ దగ్గయు నుద్ధవుండు విడి వే♦వే సేరి ప్రద్యుమ్ను నో
మదనా! యంచు యదూద్భవుల్ వినఁగఁ ద♦ తన్నేత వాక్యంబులన్
జనువన్ బూసను గ్రుచ్చినట్లు, మరుఁడున్ ♦ సంగ్రామముం జేయ నె
మ్మది యూహించి స్వసైన్యయుక్తుఁడయి ర ♦ మ్మా! యంచు నేగెన్ గసిన్.

తే॥ అట్లు చని యతఁడా గయు♦నద్రి దుర్గ,ఖేయ వనరమ్య హర్మ్యముల్♦గింకిరిపడఁ
గొట్టి యెదిరించు నరిసేన♦ముట్టి మట్టి, బిట్టుదిట్టగనొప్పె న♦ప్పట్టు నందు.

మ॥ గయుఁ డక్షౌహిణి యుగ్మముంగొని మహో ♦ గ్రంపశ్యుఁడై ధీరుఁడై
హయదంతావళిపాదసంహతులకున్ ♦ జ్యాదేవి కంపింపఁగా
రయమొప్పం జని తన్మనోభవునితో ♦ రా! రమ్మ! రమ్మంచు ని
ర్భయవృత్తిన్ జెలరేగి డీకొనె దివిన్ ♦ బర్హిర్ముఖుల్ మెచ్చఁగాన్. ౧౦౪

సీ॥ మత్తేభములతోడ ♦ మత్తగజంబులు, దుక్షారములతోడఁ ♦ దురగములును
రథికవరులతోడ ♦ రథికరత్నంబులు, సారథితతితోడ ♦ సారథులును,
యోధపుంగవులతో ♦ యోధపుంగవులును, మల్లవర్యులతోడ ♦ మల్లవరులు
వైమానికులతోడ ♦ వైమానికాగ్రణుల్, శస్త్రాస్త్రములతోడ ♦ శస్త్రములును

తే॥ దాఁకి వీఁకఁ బరస్పర ♦ మాకులంబు, గాఁగ ఘోరయుద్ధంబయ్యెఁ ♦ గడకు గయుని
వీరు లెల్లరు భయపడి ♦ తేరుల విడి, తత్క్షణంబునఁ బాఱిరి ♦ దశదిశలకు. ౧౦౬

ఆ॥ అవల గయుఁడు పాఱు ♦ నాత్మసైన్యంబును, గాంచి యొంటిగానె ♦ కయ్యమాడ
ధనువు టంకృతులను ♦ దద్దసల్పుచు నేగెఁ, బిదపఁ బంచశరుఁడు ♦ గదిసి కసిసి

ఉ॥ పంచశిలీముఖంబులను ♦ వర్మముఁ జించి శతాశుగంబులన్
ద్రుంచి శరం బిషుద్వయము ♦ తోఁ బెదటెక్కెముఁ గూల్చి సూతు హిం
సించి మహోగ్రబాణమునఁ ♦ జెండి హయంబుల నాల్గుతూపులన్
వంచి రథంబు నిర్వ్రదగు ♦ భల్లములన్ మృధమందు మించఁగాన్. ౧౦౭

క॥ గయుఁడును గని పెఱధనువును, రయమునఁ గొని దీప్తిమంతు ♦ రతికాంతుని ని
ర్భయమున నిర్వదితూపుల, లయమానఁబువేసి మొగులు ♦ లాగున నఱచెన్.

క॥ ఆయేటుకుఁ బ్రద్యుమ్నుం, డాయని చింతించి యధిక ♦ భాస్వత్శక్తిన్
దీయుచు డాయుచుఁ బాయక, యాయధిపుని మీఁదనైచె ♦ హాహా! యనఁగన్.

క॥ ఆశక్తియుఁ దద్హృది నా, వేశముతోఁ జీల్చి నెత్రు ♦ వెఱవిగఁ గొని బల్
కాశి దగన్ గ్రోలెను ధర, ణీశుండగు గయుఁడు మూర్ఛ ♦ నిద్ధరఁ గూలెన్.

క॥ వెంటనె తద్బహుధనువులు, గంటునఁ దద్గయుని దివ్య ♦ కంఠము లాగెన్
మింటను దిరిగెడి గరుఁడుడు, గంటను గని పాములాగు ♦ కరణిని దేవా! ౧౧౧

చ॥ సురనరదుందుభుల్ మొఱసెఁ ♦ జూపఱు నబ్రముసెంది రెంతయున్
గురిసెను బూలవానలును ♦ గుంభిని విప్పె మొగంబు నింతలో
ధరపయిఁబడ్డ తద్గయుఁడు ♦ తాల్మిని సొమ్మను దేఱి లేచి యా
మరుని పదంబులన్ శరణు ♦ మాకగు! మంచుఁ బడెన్ నరేశ్వరా! ౧౧౨

క॥ పదపడి మదనుఁడు సుంకము, ముదమునఁగొని యచటసాగి ♦ పోయె నవంతీ
శు దరికి బంగరుకర్ణిక, మదమునఁజను షట్పదంబు ♦ మాదిరిఁ బిదపన్. ౧౧౩

ఉ॥ మాలవభూవిభుండు మతి ♦ మంతుఁడునా జయసేనుఁడా ప్రజా
పాలకు నాగమంబు విని ♦ బంధుపురోహితవృద్ధపుత్రమి
త్రాలిని గూడి భక్తిమెయి ♦ నర్చలొనర్చి కరంబు లిచ్చి వే
ప్రాలెఁ దదంఘ్రిపద్మముల ♦ పై నటుపై నల పుష్పబాణుఁడున్. ౧౧౪

ఆ॥ కారణాంతరమునఁ ♦ గనినట్టి వృద్ధులా, తల్లిదండ్రులకును ♦ దండ్రి స్వసకు
నందముగను మ్రొక్కి ♦ పిందానువిందుల, వారిసుతులఁ బ్రీతి ♦ గారవించి.

తే॥ మాలవోద్భవజనులతో ♦ మలసి యాద, వాళి గొలువ మాహిష్మతి ♦ యనెడు పురికి
నరిగె; యాదవ బలముతో ♦ దరిని వఱలు, నర్మదా నదిఁగాంచె వి ♦ న్నాణముగను

వ॥ అనఘా! యానర్మదాతరంగిణీరత్నంబు శృంగారతిలకంబు నుదుటం
బెట్టిన చందంబునం గల్లోలభరితంబగు తుంగతరంగనికరంబుచే భాసిలి మకుటం

బును మౌళిభాగంబున ధరించినకరణిం బుష్పగుచ్ఛంబులతో విరాజిల్లి దేవతానిచయంబులు మూర్తీభవించి ప్రకాశించినవిధంబునం గోరకిత పల్లవిత పుష్పిత ఫలితంబులగు వేతసీవేణుచూతామ్రమాలతికాదితరునికరంబులతో శోభిల్లి మఱియు సకలవిధంబులను మందాకినీప్రవాహిని మాదిరి వెలుంగుట నాప్రద్యుమ్నుండు గని మనమందలరి తన డేరాలు వేయుట కనువగు ప్రదేశంబని స్థిరీకరించి రమ్యంబుగా వేయించి సురనికరమధ్యంబున వెలుంగు మహేంద్రుని సరణి యాదవాదిబలమధ్యంబునం బ్రకాశించుచుంటఁ దన్మాహిష్మతీపురవిభుండగు నింద్రనీలుండు గని నిజదూతం బిలిచి హస్తినాపురనాథుండును ధీమంతుండును బలవంతుండు నగు ధృతరాష్ట్రునిచే నీదేశంబునకు రాజుగా నిర్ణీతుండనైతిని కాన నిటనుండి యీ భూవరునకుఁదప్ప కప్పంబు లన్యుల కొప్పంజెప్పంబడవు. సాహసించి రణమొనరించినను నిందు విఫలంబగునని యే గుర్తెఱింగి చనుమని చెప్పి నిజభటుం బంప నాతండా యాదవనేతకడకుం జని నమస్కరించి తద్గదితోక్తులను విన్నవింప నప్పావింటివాఁడాలించి యాగ్రహించి కానిమ్ము మాయుగ్రసేనమహారాజునుగాని తద్బలంబును గాని మమ్ములఁ గాని యీమొనగాఁ డెఱుంగఁడుగాఁబోలు నితఃపూర్వం బిట్లే మమ్ముల ధిక్కరించిన గయకళింగరాజులకుంబట్టిన యధోగతియే యితనికిం బట్టునని యెఱుంగు మన నతివేగంబునం దన యొడయనికడ కరిగి ప్రద్యుమ్నకథితంబగు సంగతి సభాసదులు వినుచుండం బలుక నాయింద్రనీలుండు విని యూర్ధ్వదృష్టిం గొలఁది విచారించి యాదవబలంబును గూర్చి చింతించి శిరఃకంపం బొనర్చి పంచసహస్రగజంబులును, నియుతహయంబులును, నియుతరథంబులును, గైకొని వినయభయంబులతో నాప్రద్యుమ్నున కర్పించి నమస్కరించి రక్షింపుమని ప్రార్థింప నతండు సంతోషంబుతో నవి గ్రహించి చమూసమన్వితుండై యటనుండి కదలి గుర్జరదేశంబున కేగి యదలించి స్వబలంబుఁ జూపించి జయించి కరదంబులం గ్రహించి చేదిదేశంబునకుం జనియె. తద్రాజ్యంబునకుం బాలకుండుగా. ౧౧౮

ప్రద్యుమ్నుఁడు చేదిదేశంబు గెలుచుట.

క॥ ఆనకదుందుభిభగినీ, మానసహరుండు బుద్ధి ♦ మన్మాన్యుండుఁ
ధీనిధి శిశుపాలుని పిత,యై నెగడొకఁడు దమఘోషుఁ ♦ డను నామముతోఁ.

క॥ ఆతని చెంతకు మరుఁడుఁ, దూతగ నుద్ధవుని బనిపెఁ ♦ దోడ్త నతండా
నేతను గని కొలువున నీ,రీతిని నతులిడి వచించె ♦ శ్రీహరిభక్తా! ౧౧౯

మ॥ దమఘోషా! మన యుగ్రసేనధరణీ ♦ దారుం డకూపారబ
ద్ధమహీభ్రాజితసర్వరాజుల నిజో ♦ ద్దామప్రతాపాదులఁ
గ్రమమానట్లు జయించి వారివలనం ♦ గప్పంబులం బొంది ది
వ్యమునీంద్రుల్ దగ రాజసూయకృతి స ♦ ల్పంగాఁ దలంచెంగదా. ౧౨౦

క॥ అందుల కీ ప్రద్యుమ్నుని, సుందరు భానుమ్కవరుని ♦ శూరుని ధర రా
  డ్బృందము గెలువఁగ బలులను, జెందగ మున్నిట్లు బంపె ♦ చేదిధరేశా! ౧౨౧

క॥ కావున నీవును మనలక, యా వీరునకు బలులిచ్చి ♦ యనుపుమ యధిపా!
  నావుడు శిశుపాలుఁడు విని, పావకసమనయనుఁడగుచు ♦ వచియించె నిటుల్.

శా॥ ఔరా! కాలగతుల్ దురత్యయములై ♦ యాశ్చర్యముం గొల్పు న
  ఝ్ఝారే! స్రష్టను గాలరూపు గుణి వి ♦ జ్ఞానప్రదున్ భారతీ
  దారున్ బ్రహ్మనుగూడ నేఁడు కలియే ♦ దౌష్ట్యంబుతో నేలఁగాఁ
  బ్రారంభించెను నోడ బండి మఱియున్ ♦ బండ్లోడలయ్యెం గదా! ౧౨౩

ఆ॥ ఎచట రాజహంస ♦ మెచ్చట కాకంబు, మూర్ఖుఁ డెచట నెచట ♦ బుధవరుండు?
  కాని నేఁడు బంటు ♦ కాలగతిన్ సార్వ, భౌముఁ గెల్వఁగడఁగెఁ ♦ బలుకఁ గలమె!

తే॥ అల యయాతిశాపంబున ♦ యాదవకుల, మెల్ల భ్రష్టరాజ్యపదమై ♦ యేవగింపఁ
బడదె! యది యిప్డు రాజ్యంబు ♦ స్వల్పమైన, నెగసిపడు మగ్గ నదియయి ♦ యెగసినట్లు.

ఉ॥ తుచ్ఛకులోద్భవుం డఖిల ♦ తోయధివేష్టితరాజ్యపాలనన్
  స్వచ్ఛయశంబుఁ గాంచిన న ♦ పండితపుత్రుఁ డఖండపాండితిన్
  గచ్ఛపమాదిపెన్నిధులఁ ♦ గన్న దరిద్రుఁడు ద్రవ్యవంతుఁడై
  యచ్ఛబహూకృతుల్ గనిన ♦ నాపఁగఁ బోలునె? పగ్గమేసియున్. ౧౨౬

క॥ వారిధరఁద్రుణమువలెన్, ధీరతఁగని యెక్కి నిక్కి ♦ దివిపైఁ జుక్కల్
  దీరుగ మేమే యిత్తఱి, దీరిచితిమని యనుదు రిది ♦ తీరే? చెపుమా! ౧౨౭

తే॥ కొలఁది ప్రొద్దుల క్రిందట ♦ నలఁతిరాజ్య
  ముగ్రసేనుండు వొందెనో ♦ యొందలేదో
  యపుడె యెంతటి వాఁడయ్యె ♦ నహహా! యతని
  కట్టి వాసుదేవుఁడు మంత్రి ♦ యంట కాని. ౧౨౮

క॥ అతఁడు జరాసంధునిచే, మతిచెడి తన మధురవిడిచి ♦ మనుటకు జలధిన్
  ద్రుతగతి నక్కను వాఁడే, సతతము దధ్విభునిఁ గొల్చు ♦ స్వబలాన్వితుఁడై.

క॥ మఱి యా మంతిరి జని సం, కర మల వసుదేవగోప ♦ కప్రభువరు లి
  ద్దఱు నా కొడుకని కొడుకని, తురమును బొనరింతు రెంతొ ♦ తూఁథూయనఁగాన్.

క॥ తెల్లనితండ్రి గాంచిన, తెల్లని వసుదేవునందు ♦ ధీరులు దెగడన్
  నల్లగ నీ హరి వుట్టెను, దెల్లమయిన వార్త యిద్ది ♦ త్రిజగములందున్. ౧౩౧

తే॥ ఉద్ధవా! నీవు పల్కిన ♦ బుద్ధిమంతుఁ
  డతిబలుఁడగు ప్రద్యుమ్నుఁడే ♦ యట్టి సంక
  రునకుఁ బుట్టిన నీచుండు ♦ గనుక వీని
  కేమి కప్పముల్ గట్టుట ♦ యేటిమాట? ౧౩౨

క॥ మాటాడక పోరాడఁగ, నీరాజును రమ్మటంచు ♦ నెట్టనఁ జెపుమా !
పోరా ! పోరఁగ రారా!, ద్వారావతి నేఁడుగెల్తు ♦ వైరులు డిందన్. ౧౩౩
తే॥ అని ప్రతిజ్ఞల సల్పి శ ♦ స్త్రాస్త్రశస్త్ర
ములను గైకొని ద్వారకే ♦ బోవుచుంటి
నాయనా! సభాసదులార ! ♦ నమ్ముఁడంచు
నరుగుతఱి నడ్డి దమఘోషుఁ ♦ డనియె నిట్లు. ౧౩౪

తలిదండ్రులు శిశుపాలునకు హితోపదేశం బొనర్చుట.

ఉ॥ చాలును జాలు సాహసము ♦ చక్కఁగ నోయి కుమార ! వైరినిన్
గాలము దేశముం దొలుతఁ ♦ గాంచుము మించుము మూఁడుశక్తులన్
మేలగునో సిలుంగగునొ ? ♦ మిట్టిపడన్ ఫలమేమి ? నెమ్మదిన్
జాలఁగ యోజనన్ సలిపి ♦ సాగుము వేగ యమోఘపద్ధతిన్. ౧౩౫
క॥ చేసెడికార్యము మంచిదొ, దోసమొ యెదొ యరయనాను♦దుడు కొప్పదు సూ
వాసిని గోరెడివారలు, గాసంతయు దుడుకులేక ♦ కననా శమమున్. ౧౩౬
క॥ శమమే కలహము లాపెడి, శమమే చెదిరిన మనంబుఁ ♦ జక్కఁగఁ జేయున్
శమమే మేలులఁ గూర్చెడి, శమమే తపమని వచించు ♦ సకలశ్రుతులున్.
క॥ కినుకను మోహము దానన్, దనరెడి స్మృతివిభ్రమంబు ♦ దానను మతి నా
శనమును గల్గెడి మతి దా,న నశించెడిఁ గానఁ బ్రజ గ ♦ నందగు శమమున్.
క॥ పురుషార్థంబుల కోర్కె, కరమగు సాధనమటంచు ♦ ఘనులందు రిటన్
ద్వారితము గూడదు గనుక సు,కరముగ సామంబె సల్పఁ ♦ గాఁదగు బుత్రా ! ౧౩౯
ఉ॥ దానముచేత సామమును ♦ దానము సత్క్రియచేత నద్దియున్
ధీనిధినుత్యయోగ్యతనుఁ ♦ దీప్తివహించును వెండిఁ జేదిభూ
జానులు యాదవాళి యొక ♦ జాతికిఁ జెందినవారు గాన నా
మానస మొప్పకున్న దని ♦ మార్గ్యని పోరుట కీరు వారలున్. ౧౪౦
క॥ ఆతఁడు సల్పెడి నీతియొ, పూతము బురుషార్థదంబు ♦ బుధనుత్యము నా
చేతనయినవఱి కేదియొ, ప్రీతిగఁ జని యిడెద నీవు ♦ వెంబడి రమ్మా ! ౧౪౧
క॥ అని యుచితంబుగఁ జెప్పఁగ, విని యల శిశుపాలుఁ డందు♦ భేదితుఁడయ్యెన్.
దన నోరెత్తకయుండెను, జనకులు పుత్రకుల నిట్లు ♦ శాసింపఁదగున్. ౧౪౨
తే॥ ఇంతలో శ్రుతిశ్రవ యను ♦ నింతిమిన్న, చేదిపతిరాణి వసుదేవు ♦ చెల్లెలటకు
వచ్చి వినయావనతయయి♦పలికెనిట్లు, లాత్రగాఁడును ఖలుఁడైన♦పుత్రకునకు.
మ॥ తనయా ! దుఃఖముగూర్పఁబోకు మనమున్ ♦ దద్యాదవుల్ బోరుటల్
జన దా యానకదుందుభిప్రభువు నీ ♦ సౌఖ్యార్థియా మాతులుం

దనియున్ దత్సుతుఁడైన శ్రీహరిని నీ ♦ యాధిక్యముం గోరు బా
వనుగా భావమునం దెఱింగి విను మ ♦ బ్బా! పట్టు పోగొట్టురా. ౧౪౪

ఉ॥ ప్రస్తుతమందు నిందులకు ♦ వచ్చినవారలు కృష్ణు నాత్మజుల్
నిస్తులశౌర్యధైర్యబల ♦ నిర్మలభావయుతుల్ మహాత్ములున్
శస్త్రశరీరు లందునఁ బ్ర ♦ శంస్యులు బూజ్యులు నాకు మీకునున్
గస్తి ఘటించు భండనము ♦ కై తలఁపన్ వలదయ్య! పుత్రకా! ౧౪౫

చ॥ అదియునుగాక విన్నలిసి ♦ యాగతులై నటువంటి వారి నా
మదనముఖప్రభూతముల ♦ మాటలఁ బూజల లోటు లేనటుల్
ముదమున గారవించి బల ♦ మున్ గొలువంగను దోడుకొంచు నా
సదనముఁ జేర్ప నే నిపుడు ♦ చాలఁగఁ గోరుచునుంటి నాత్మజా! ౧౪౬

క॥ చిరకాలమయ్యె వారిని, మురిపెముతోఁ జూడ నిపుడు ♦ ముచ్చటపడెదన్
ద్వరగా మాతో రమ్మిఁక, దొరకదు సుత! యిట్టివేళ ♦ స్తుతవీరవరా! ౧౪౭

క॥ తలిదండ్రులు తద్దీతిని, బలికిరి శిశుపాలుఁ డద్ది ♦ పాటింపక యి
ట్టుల మఱి తన వారలకున్, బలికెను జెట్టులు హితోక్తి ♦ బాటింతురొకో?

శిశుపాలుఁడు ప్రద్యుమ్నునిపై దండెత్తుట.

శా॥ అమ్మా! నాకలరామకృష్ణులు సతం ♦ బాగర్భశత్రుల్ గదా
యామ్నాయాప్తులు యాదవుల్ పగను నా ♦ కాయాసముల్ గూర్పరో
యమ్మాడ్కిన్ మన కుండినాహ్వయపురం ♦ బందందఱున్ జేరి పూ
ర్ణమ్మైనట్టి పరాభవంబు గలుగన్ ♦ నాపెండ్లి నాపింపరో. ౧౪౯

క॥ వీరలతో నేయంబే, నేరీతిని జేయవలెనొ ♦ యేమేమి? యహా!
వీరిని భండనవహ్నిని, మారణహోమం బొనర్తు ♦ మనవా రలరన్. ౧౫౦

తే॥ అమ్మ! మీరిర్వురుం గూడ ♦ నరులపశు, మైతిరేకి మిమ్ముఁజెఱసాల ♦ యందుఁ బెట్టి
కష్టపెట్టెదఁ గంసుండు ♦ కన్నవారి, జెఱను బెట్టి వేధించిన ♦ కరణి నిజము.

వ॥ అని కఠినంబుగాఁ బలుక నాతలితండ్రు లిర్వురు ఖిన్నులై. ౧౫౧

తే॥ అరయ నజాతమృతమూర్ఖు ♦ లైనసుతుల, నాద్యులిర్వురు మంచివా ♦ రంతిముఁడటు
గాఁడుగద యాద్యులో సకృ ♦ త్కష్టదులిఁకఁ, జివరవాఁడ సకృద్వ్యథన్ ♦ దవులఁ జేయు.

ఉ॥ ఎవ్వఁడు మంచిచేఁతల ర ♦ చించి పితన్ దనియంగఁ జేయునో
యవ్వినతుండె పుత్రకుఁడ ♦ హా! పతికిన్ బ్రతిలేక సంతతం
బెవ్వతె తత్సుఖం బఖిల ♦ మించునొ యాసతి భార్య నేఁ
డెవ్విధినేని సుఖవ్యథల ♦ నెంతయు నుండునొ వాఁడె మిత్రుఁడౌ. ౧౫౪

చ॥ ఘనుఁ డటువంటిపుత్రకుఁడు ♦ గల్లఁడుగా యని మిన్నకుండిరో
జనవర! యుద్ధవుం డవల ♦ సాగి యటన్ నిజనేతచెంతకున్

జని శిశుపాలసూక్తులఁ దు ♦ చాలును దప్పనియట్లు చెప్పె నం
త నలమహాఖలుండు తన ♦ దాయల భస్మమొనర్ప నేర్పునన్. ౧౫౫

క॥ వాహిని ధ్వజినియుఁ బృతనా,క్షౌహిణులను నల్దెఱగులఁ ♦ గ్రాలెడి చము వు
త్సాహముచే నాయుధముల,చే హావణించి మును నడువ♦సిద్ధమొనర్చెన్. ౧౫౬

తే॥ అవల బహులాశ్వ్వఁడిట్లనె♦నమరమునికి, నెంతసైన్యమాతఁడు గొని♦యేగెదాని
లెక్కలన్ నాకుఁ జక్కఁగా♦వక్కణించు, మీరు కాలత్రయజ్ఞులు♦ధీర! యనఁగ.

వ॥ రాజా! యవధరింపుమని యిట్లని చెప్పంగడంగె. వందయేనుఁగులును, బదివేల గుఱ్ఱంబులును, లక్షకాల్బలంబును, బదునొకండువందలమంది రథులును, గలిగినది సేన యనియు నేతద్ద్విగుణంబుగా మీఱు సేన చతురంగిణియనియు, జతుశ్శతద్విపంబులును, నయుతరథంబులును, జతుర్లక్షతురంగంబులును, శస్త్రాస్త్రబలవాహనసంపన్నులును, లోహకంచుకాంచితులును, ధనుర్వేదపారీణులును సమర్థులు నగు గోటిపదాతులును, విరాజిల్లునది వాహిని యనియు, దీని కిబ్బడిగా నున్నది ధ్వజిని యనియు, దీని కినుమడిగా భాసిల్లునది పృతనయనియు, నిద్దాని కిమ్మడిగాఁ గన్పడుమొన యక్షౌహిణియనియు దీనికి నాయకుండైనవాఁడు సాహసుండనియు, శూరుండనియు, నిట్టి శూరులను నూఱుగురును భరించువాఁడు సామంతుండనియు, నేతాదృక్సామంతశతంబును నిర్వహించువాఁడు గజియనియు సారథిరథవాజులం గాపాడి యుద్ధమొనర్చువాఁడు రథియనియు, నీదృక్లక్షణంబులు గలిగి సేనలం బ్రోచువాఁడు మహారథియనియు పూర్వోక్తకార్యంబులు నెరవేర్చుటయేకాక శత్రుసైన్యంబులను ధ్వంసంబొనర్చువాఁడతిరథుండనియుఁ దెలిసికొనుమని వెండియు నిట్లనియె. ౧౫౮

తే॥ అట్లు సేనల శిశుపాలుఁ♦డమరిచికొని, వాహినీధ్వజినులనెడి♦బలగములకు
సరగ సేనానులుగ ద్యుమ♦చ్ఛక్తులనెడి,వారి నతిబలిష్ఠులను నే♦ర్పాటుజేసి.

క॥ పృతనాక్షౌహిణ్యాహ్వయ, వితతచమువులకును రంగ ♦ పింగాభిధులన్
బతులుగ నొనరిచి మంత్రిస,హితుఁడై రతిపతిని గెల్వ ♦ నేగన్ సాగెన్. ౧౬౦

ఉ॥ కాహళదుందుభుల్ మొఱసె ♦ ఖంగున ఘంటలు మ్రోఁగెఁ గార్ష్ణి
ర్వాహకపంక్తి కత్తులఁ గ ♦ రంబులఁ దాల్చి వెంటనంటెఁ ద
త్శ్రీహరిపుత్రసేన యరి ♦ సేనలు నా జలధిం దరింప ను
త్సాహములో నిరీక్షణము ♦ సల్పుచు నుండె ననంతరంబునన్. ౧౬౧

ద్యుమచ్ఛక్తులు యాదవసేనతోఁ బోరి సాత్యకికృతవర్మలచే నీల్గుట.

ఆ॥ అటు లుభయుల ఫౌజు ♦ లాజిరంగంబున, గలిసికయ్యమాడఁ ♦ గడఁగెనందుఁ
దొలుత వాహిని యను♦బలగంబుతోద్యుమం,తుండుచైద్యునాజ్ఞఁ♦ద్రోఁచి బగల.

క॥ అదరక యటు శిశుపాలుని, పెదమొన తలపడుటఁ గాంచి ♦ భీతిలక జగ
ద్విదితులు బలులగు యాదవు, లదిరా! యనఁ బ్రతిఘటించి♦రస్త్రాదులతోన్.

తే॥ ఉభయసైన్యబాణంబుల♦నుద్ధరముగ, నంధకారమ్ము గ్రమ్మె ర♦ణాంగణమున
నుభయహయపద్రజంబుల♦నభము మిగుల,గప్పఁబడియెను బ్రేక్షకుల్♦గాంచి యదల.

క॥ అందలి వాజులు పఱుగిడి, సందియము విడిచి రిపుల ♦ సామజములపై
సందడి జేయును మఱిఁగరి, బృందంబో కాళ్ళనరుల♦నెక్కిడి త్రొక్కన్. ౧౬౭

ఉ॥ బాణగదాస్త్ర శస్త్ర వర ♦ పట్టిసశక్తి కృపాణశూలముల్
బాణులఁ దాల్చి త్రాణఁగసి ♦ వారలు వీరల వీరు వారలన్
బ్రాణములం దెగించి పడ ♦ బాఁదుకొనం దుద నందుఁ బాదముల్
బాణులు నంగముల్ దెగిన ♦ బంటులు కన్పడసాగి రోవిభూ! ౧౬౮

సీ॥ అతిజవంబున నేగు ♦ నశ్వంబులన్ రెండు, తుండెములుగ జేయు♦నొండుగండఁ
డతిబలంబున మించు ♦ హస్తిదంతంబులం, బట్టి కుంభంబులం ♦ బఱుగునొక్కఁ
డిభ వాహమంత్రులన్ ♦ మృగరాజువలెఁ బట్టి, పట్టిపల్లార్చెడి♦భటుఁడొకండు
పరసైనికులనెల్ల ♦ గరవాలమునఁ జీల్చి, నఱువలె దిరుగాఁడు ♦ భటుఁడొకండు

తే॥ విహగరీతినిఁ జెంగున ♦ విన్నుదాఁకి, పీఁకమార్తుర పైదూఁకు ♦ వీరుఁడొక్కఁ
డుండియుండని యట్లుండి♦భండనంబు,జరుపుదళవాయి యొక్కఁడు♦వఱలు నందు.

మ॥ అవలన్ జైద్యబలోల్లసద్ధ్రితము లా ♦ యక్రూరుఁడీక్షించి బా
ణవితానంబుల గుప్పె నంత రిపుసే♦నల్ వానకాలంబునన్
రవినిన్ మబ్బులు గప్పినట్లు గసిఁదీ ♦ ప్రంబైన విల్లమ్ములన్
నవయన్ వానిని గప్పెఁ జేదిధరణీ ♦ నాథోక్తులన్ బొంగుచున్. ౧౬౯

ఉ॥ అంతట గాందినీతనయుఁ ♦ డాగ్రహమూర్తి యనంగ నొప్పి ప్రా
ణాంతము సల్పు రిష్టిఁగొని ♦ యారిపులేసెడి బాణసంతతిన్
సాంతముగా జయించి స్వామ ♦ హత్తరశక్తినిఁ దద్ద్యుమంతు న
భ్యంతర మింతలే నటు ల♦ యారె! యనం బ్రహరించె దేవరా! ౧౭౦

తే॥ తత్ప్రహారంబునన్ వాఁడు♦ధరణిపైన, రెండుగడియలు దాఁక మూ♦ర్ఛిల్లి మరల
లేచి లక్షభారభరక♦ల్పితను గదను,గొట్టి వాని లోమ్మున మేఘు♦మట్టు లఱచె.

తే॥ వాని దెబ్బ నక్రూరుండు ♦ వ్యాకులాత్ముఁ
డగుట యుయుధానుఁ డీక్షించి ♦ యతిరయమున
గాలరుద్రుని మాద్రిని ♦ గవిసి తద్ద్యుఁ
మంతునకుఁ దిరస్కృతి బలు ♦ మాటలాడి. ౧౭౧

ఉ॥ చీటికిమాటికిన్ విలు వి ♦ శేషవిధంబులఁ డంకరించి వా
చాట! త్వదుత్తమాంగము వె ♦ సన్ హరియించెడి దీనిఁగాచికొ

మ్మా! టకటొంకులాపు మిఁక ♦ నంచొక తూపును వేయ నద్దియా
పోటరి గొంతుకన్ నఱికి ♦ భూమినిఁ గూల్చె ననంతరంబునన్. ౧౭౨

తే. తద్ద్యుమంతుని వీరులున్ ♦ దాళఁజాల, మంచు గాల్కొలందిని బాఱి ♦ రవల శక్తుఁ
డనెడి ధ్వజినీప్రభుఁడు వచ్చి ♦ యట్లువారు, పరుగిడుటఁగాంచి కోపించి ♦ పరితపించి.

మ. అరరే! నే నిట నుండఁగానె యిటు ల ♦ న్యాయంబుగా సాగె నే
మిర! మా వీరులు బాఱఁగాఁ దొడఁగిరే ♦ మీ! యాదవుల్ రేగిరే!
సరియే నే నిఁక నూఱకొంట దగునా? ♦ చాల్జాలు నం చుద్ధతిన్
వరశూలం బల సాత్యకిన్ దునుమఁగా ♦ వైచెంజుమీ పిమ్మటన్. ౧౭౪

ఉ. సాత్యకి వానిదెబ్బ నిము ♦ సంబు రసన్ గడబెట్టి నంతఁ ద
త్ప్రీత్యయపాత్రుఁడైన కృత ♦ వర్మ రయంబున నేగుదెంచి త
న్నృత్యహయోజ్జ్వలద్రథము ♦ నూకఁగ నల్ప ననల్పశక్తుఁడున్
వ్యత్యయమయ్యె నంచు నధి ♦ కాగ్రహముం గొని దువ్వె మీసముల్. ౧౭౫

చ. కసిఁ బస దివ్యముద్గరముఁ ♦ గైకొని తత్కృతవర్మ తేరు బ
ల్మసిగ నొనర్చె నావల బ ♦ లుండగు నాతఁడు స్యందనంబు వీ
డి సరగ నట్టి శత్రునిఁ గ ♦ డిందిగఁబట్టి భుజా యుగంబునన్
వెస రసఁగూల్చి నెట్టె నొక ♦ విస్తృతయోజన మేగునట్లుగాన్. ౧౭౬

కం. అది కని తచ్ఛిశుపాలుం, డదరియు నల రంగపింగు ♦ లను ప్రెగ్గడలన్
మదపూరితులను హితులను, నెదిరుల నెదిరింపుఁ డంచు ♦ నేడ్తెఱిఁ బంచెన్.

రంగపింగులు యాదవబలంబుతోఁ దలపడి భానునిచే హతులగుట.

చ. అనిమిషమీఁద వారిరువు ♦ రగ్నిసమీరులు వచ్చినట్లుగాఁ
జని శితబాణవర్షము ల ♦ సాధ్యముగాఁ నొనరించి మించి బ
ల్కినుకను దంతిరథ్యములఁ ♦ గేతనముల్ రథులన్ రథంబులన్
మొనతలకట్టులన్ మిగుల ♦ మోఁదిరి దేవ! యనంతరంబునన్. ౧౭౮

కం. ప్రద్యుమ్నుఁడు రిపుబల మన,వద్య మధిక మనుచుఁ గాంచి ♦ బాపురే! మనవార్
సద్యస్కాలమున మొనన్, సద్యశమున్ గడనఁజేయఁ ♦ జాలరు కట్టా! ౧౭౯

కం. అను చిటు యాదవులందఱు, ఘనసభగాఁ గూర్చి యిట్లు ♦ గంభీరగళం
బున యాదవులారా! యటు, గనుఁడీ యరు లెటుల మనలఁ ♦ గారించెదరో?

కం. కావుననే మన మొనమొన, నీ వేళనుజొచ్చి శత్రు ♦ బృందమ్మును వీ
రావేశముతోడుత నల, వైవస్వతపురికి నంపి ♦ వచ్చెద మెచ్చన్. ౧౮౧

తే. లేనిచో రంగపింగసే ♦ నాను లింక, మన పతాకిను లన్నిటి ♦ మడియఁ జేయఁ
గలరు కావునఁ బోమొద ♦ నలఘుశక్తి, మీరు సైతము రండిప్డు ♦ మేదమునకు. ౧౮౨

వ॥ ఇట్లు శపథంబులాడుట శ్రీకృష్ణపుత్రకులలో నొక్కరుండును, సుక్కరియునగు భానుండనువాఁడు తత్సభాగ్రమందు నిలిచి సభాసదు లాలకింప మేఘగంభీరభాషణంబులతో నగ్రజాగ్రణీ! తమ యాగ్రహంబున కిది యదనుగాదు. ముల్లోకంబు లొక్కమొగి నెత్తటి నెదుర్కొనఁ దలంచునో యత్తటి భవదుగ్రధనుష్టంకారంబున కవసరంబు గలుగునేమో కాని సామాన్యులగు నీ రంగపింగుల శిరంబులం దురంబునం డొల్లఁజేయుట కలఁతియగు నా కృపాణంబు చాలదే? కళింగరాజును జయించినపగిది నివ్వారినిం గెల్చి సంతోషంబు గూర్పం గలనని పగ్గించి తత్ప్రయత్నంబాపి ఖడ్గధరుండై పదాతిభాతి నరాతిపతాకినిలో వనగజంబు వనంబునం బ్రవేశించు చాడ్పునం జొచ్చి హయంబులం ద్రుంచి పతాకలం జించి యదలించి యెదిరుల మదంబు సదమదంబుగావించియు బుజంబులం గొట్టియుఁ బెడతొక్కులుగాఁ గట్టియు దుత్తునియలగునట్టుల మట్టియు నెట్టియు క్షీణపుణ్యంబులగు తారకంబులు బుడమింబడెడివడువున ముత్తెంబులు రాలుచుండ గుంభికుంభములం బగిల్చి ద్వితీయఖడ్గంబునం దత్సైన్యంబంతయు నంతంబుసల్పి నీహారపటలంబు భేదించుచుం బ్రకాశించెడి ప్రభాకరుని చందంబున వెలుంగుచు శ్రీకృష్ణదత్తంబగు కరవాలంబునం దద్రంగపింగశతాంగంబులం భంగంబు గావించి తురగంబులం దుఱుమాడి సూతులం ఘాతించి తన ఖడ్గంబును భేదింపవచ్చు తదుభయచంద్రహాసంబులను నాశంబు సల్పి తద్రంగపింగోత్తమాంగంబులకుం గుఱియగునట్లు సముదగ్రాగ్రహవ్యగ్రుండై యసివరం బొందు వైవ నా యిరువురిశిరంబు లేకకాలంబునం దెగి ధరణింబడి దొరలుచుండ నబ్భానుం డానందించి యవి సంగ్రహించుకొని, ౧౮౩

చ॥ జయజయరావముల్ సెలఁగఁ ♦ జారణులుం గొనియాడ స్వీయులున్
భయమును వీడి సంతసిల ♦ వైరులు బాటఁగఁ బూలవాన ల
వ్యయముగ వేల్పులుం గురియ ♦ వాద్యములున్ మొఱయంగ నమ్మొచె
ల్ల! యనఁగఁ జూపఱున్ బహువి ♦ లాసముగా నిడె మారుచెంగటన్. ౧౮౪

మ॥ తరువాతన్ శిశుపాలుఁ డా యిరువు రం ♦ తం బొందుటం గాంచి వీ
రరసం బుబ్బ శితాస్త్రముల్ బవనశీ ♦ ఘ్రవ్యాయతాశ్వీయబ
ద్ధరథశ్రేష్ఠములున్ విమానసమముల్ ♦ దంతుల్మదోదగ్రోత్తము
ల్వరవిద్యాధరతుల్యులున్ భటులు గ్రా ♦ లంబోయెఁ బోరాడఁగన్. ౧౮౫

తే॥ అటు వసుంధర మాఱుమ్రో ♦ యంగ సల్పు
తూర్యములతోడ రథమెక్కి ♦ తురమొనర్పఁ
జేదినాథుఁడు వచ్చుట ♦ జిత్తజుండు
గాంచి యోజించి రోషించి ♦ మించి తొలుత. ౧౮౬

క॥ పురుహూతదత్తరథికుం, డురవడితో నెక్కి శంఖ ♦ మూఁదెను దానన్
ధరణియు నభమును మొఱసెను, బరచిత్తములఁ గలగుండు ♦ పడియెను సుగుణీ!

ప్రద్యుమ్నుండు శిశుపాలునితోఁ బోరి యోడించుట.

క॥ అవలన్ దర్పకుం దర్పం, డవిరళశిశుపాలసైన్య ♦ మను మేడకు శా
తవిశిఖముల మొట్లుగఁ గూర్చె విబుధులెల్లరును వినుతి ♦ సేయఁగ వీఁకన్.

శా॥ సత్తాఖ్యాతుఁడు చేదినాథుఁ డవలన్ ♦ శౌర్యాత్మజారంభముల్
మొత్తన్ మాటికిఁ జాపటంకృతుల నా ♦ మూలంబు గావించి త
ద్దత్తాత్రేయసుశిక్షితంబు దృఢమౌ ♦ ధాత్రస్త్రముం వేయ నా
చిత్తోద్భూతుఁడు దత్తజిల్లకయు శో ♦ చిష్కేశతుల్యాత్ముఁడై. ౧౮౯

తే॥ అతని యస్త్రప్రభావంబు ♦ నాక్షణంబు, నందు నవలీల మరల బ్ర ♦ హ్మాస్త్రమేసి
సంహరించెను దానికా ♦ శౌర్యధనుఁడు, చైద్యుఁడగు శిశుపాలుఁడు ♦ సాహసమున.

క॥ అంగజభంగమొనర్పఁగ, నంగారాస్త్రంబు భార్గ ♦ వాంతఃకరణా
భంగురలబ్ధము వేయఁగ, నంగారంబులు జనించి ♦ యడజడులిడఁగన్. ౧౯౧

క॥ అర్జునమిత్రసుపుత్రుఁడు, పర్జన్యాస్త్రంబు వేసి ♦ వాని శరంబున్
భర్జించి సుఖముఁ గూర్పఁగ, దుర్జనుఁడౌ చైద్యుఁ డలక ♦ తో నాత్రుటిలోన్.

మ॥ మలయాద్రిన్ మును గుంభసంభవుఁ డసా ♦ మాన్యంబుగా దివ్యశి
క్షలఁ గావించిన దర్ధవంతము గజా ♦ స్త్రం బేయఁగా నందు నే
న్గులు దీర్ఘంబులు నుద్భటాన్వితములై ♦ కోటానఁగోటుల్ జనిం
చి లివన్ మారునిసేనపై దుమికి హీం ♦ సింపం గడంగెన్ జుమీ! ౧౯౩

క॥ అంతట హాహాకారము, లంతట జనియించె మరుఁడు ♦ యాదవసేనల్
జింతిలుటఁగాంచి తద్వైర్యంతకరము నారసింహ ♦ మస్త్రము బఱపెన్. ౧౯౪

ఉ॥ అందు సటాచ్ఛటాశితన ♦ ఖాయతలాంగలభీషణాకృతుల్
బొందిన శ్రీనృసింహుఁడను ♦ పూరుషుఁ డొక్కఁడు బుట్టి బిట్టువె
ల్గొంది తదస్త్రనిర్గతమ ♦ దోత్కటహస్తిసమూహకుంభముల్
జిందఱసల్పి హుంకృతులఁ ♦ జేసి గ్రసించి తిరోహితుండుగాన్. ౧౯౫

క॥ దమఘోషుని తనయుఁడు నిరుపమపరిఘంబును గిరాటు ♦ వైచెను బిదపన్
సుమబాణుఁడు తద్ధేతిని, యమదండము చేతఁ జెండె ♦ నాసమయమునన్. ౧౯౬

ఆ॥ కనలి చేదివిభుఁడు ♦ ఖడ్గచర్మములతో, మంట నుఱుకు మిడుత ♦ మాడ్కి మరుని
మీఁది కుఱుక నతఁడు ♦ మెలకువ యమదండ, వరముచేత నవ్వి ♦ పాడుచేసి. ౧౯౭

ఆ॥ పాశిదత్తమైన ♦ పాశంబులంగొని, కసిని వానిఁబట్టి ♦ కట్టి పదను
కత్తితోడ నఱకఁ ♦ గడఁగ గదుండను, హరికుమారుఁ డడ్డి ♦ యనియె నిట్లు.

మ॥ పరిపూర్ణుండు పరాత్పరుండు విమల ♦ బ్రహ్మం బుపాస్యుండునౌ
హరిచే నీతఁడు వధ్యుఁడంచు వినమా! ♦ యావాక్యముల్ వ్యర్థమౌ
కరణిన్ సల్పకుమన్న! లేనియెడలన్ ♦ గారానికార్యంబు లి
త్తఱిఁ గావించిన దోషివయ్యెదవు గా ♦ దా! నీవు యోజింపుమా! ౧౯౯

తే॥ పిదప నీ వార్త శిశుపాల♦పితకుఁ దెలియ, నతఁడు నవరత్నహారది♦వ్యాంబరములఁ
గొని యథాశక్తిఁగప్పముల్♦గొంచు నపరి, వారముగవచ్చెఁ బ్రద్యుమ్ను♦పాలికపుడు.

చ॥ మనసిజుఁ డాగ్రహంబు విడి ♦ మన్నన లా దమఘోషనేతకున్
బొనరిచి మ్రొక్క నమ్రుఁడయి ♦ మ్రోలను నిల్వ నతండు మెచ్చి నా
యన! యిపుడీవె ధన్యుఁడ వ ♦ హా! యెటువంటి పనుల్ బొనర్పఁ బ
గ్గెను నొనరించి సల్పితివి ♦ కీర్తికరంబని పల్కి ప్రీతితోన్. ౨౦౧

క॥ తెచ్చిన కానుక లన్నిటి, నిచ్చి కరంబుల నొసంగి ♦ యీ శిశుపాలున్
గ్రచ్చఱఁ బ్రోవుము! యీతని, మచ్చరమున కర్హ్వాకృతి క్ర ♦ మంబుగ నయ్యెన్.

ఉ॥ కావున నింతటన్ విడిచి ♦ కావుము మా నెఱసుల్ క్షమింపుమీ
దేవ! యనాథరక్షణను ♦ ధీ! యని వేఁడ మనుండు భూవరా!
యీ విపరీతకార్యతతి ♦ హేతువు నీ సుతుఁ డేముగాము కా
లావగుణంబె కారణమ ♦ టంచు మనంబునఁ దోఁచుఁ బూర్తిగాన్. ౨౦౩

తే॥ అని సముచితంబుగా బల్కి ♦ యతని సుతునిఁ
బాశముల విప్పిపుచ్చ న ♦ పారముదముఁ
బొంది యా దమఘోషుఁడు ♦ పుత్రుతోడ
స్వీయచంద్రికానగరంబుఁ ♦ జేరె జనక! ౨౦౪

తే॥ అవలఁ దచ్చైద్యసామంతు ♦ లందఱు తమ
ప్రభుని గతిగని యెదరక ♦ బలుల నిచ్చి
రంతఁ గంతుఁ డటన్ సాగి ♦ యాదవాన్వి
తముగ మనుతీర్థమున జల ♦ కముల నాడి. ౨౦౫

ప్రద్యుమ్నుండు కొంకణదేశాదులం గెలుచుట.

క॥ కొంకక జంకక లఘుగతిఁ, గొంకణదేశంబు సొచ్చి ♦ క్షమఁ దనరాకన్
గింకరుచేఁ దెల్పఁగఁ, దత్కొంకణపతి వచ్చి మరుని ♦ కడ కిట్లనియెన్. ౨౦౬

ఉ॥ దేవ! గదాధరోత్తముఁడ ♦ దివ్యకులప్రభవుండ దిట్ట మే
ధావి యటంచు నన్నిలువ ♦ ధాత్రిని నేలెడివాఁడఁ గావునన్
నీవు గదారణం బిపుడు ♦ నెమ్మినొనర్చి జయించి నాకు సే
నావళి రూపుమాపుమని ♦ యాడగ నిట్లనెఁ బచ్చవిల్తుఁడున్. ౨౦౭

తే॥ పెక్కుమందిమి విఖ్యాత♦వీరవరుల, మేము చెలఁగితి మరియు నీ♦వేకకుఁడవు
గావె యిద్ది యధర్మము♦గాదె కనుకఁ, ద్వరఁగఁజని కప్పముల్ గొని♦తమిని నిమ్ము.

క॥ అనవుడు మేధావియు ని,ట్లనియెను నటుకానియెడ మ ♦ దంఘ్రిని దీనిన్
గొని కదలించుఁడి! చూతము, ఘనవీరులు గారె చెప్పుడి! ♦ గట్టిగ ననఁగన్.

క॥ దానికి యాదవు లందఱు, మానముతో మండిపడిరి ♦ మఱిఁ దత్తాలాం
కానుజుఁ డధికబలుం డభి,మానియునౌ గదుఁడు వాని ♦ మదము నణంపన్.

చ॥ గదను గ్రహించి నిల్వ నల ♦ కొంకణనాయకుఁ డాగ్రహంబునన్
గదఁగొని వానిపై విసరఁ ♦ గాంచి గదుండు గదన్ దదీయమౌ
గద నుసిఁజేసి రోసమునఁ ♦ గాడుపడన్ బ్రహారింప నట్టి బె
ట్టిదుఁడు వసుంధరన్ బడి క ♦ డిందిగ నోటను గ్రక్కె నెత్తురుల్. ౨౧౧

తే॥ మరల యుద్ధమొనర్పఁగ ♦ మనసుపడక, గొబ్బునం గప్పముల్గొని ♦ కోరి శరణు
సపరివారంబుగాఁ జని ♦ శాంతమూర్తి, కట్టి ప్రద్యుమ్నునకు నిచ్చి ♦ యభినుతించి.

ఉ॥ పామరుఁడన్ మహాత్మ! భగ ♦ వంతుఁడ వీవు పరీక్షసేయఁగా
నీమెయిఁ గయ్యమాడితిని ♦ నీ నెఱసున్ క్షమియించి నా నతుల్
బ్రేముడితో గ్రహింపుమని ♦ వేఁడి స్వకీయపురంబుఁ జేరె నా
పై మదనుండు తత్స్థలముఁ ♦ బాసి చనెన్ గుటకప్రదేశమున్. ౨౧౩

వ॥ అట్లు చనెడిసమయంబున మృగయార్థంబై బయలువెడలిన తత్కుటకదేశాధీశుండగు మాలిం గాంచిన జాంబవతీసుతుండగు సాంబుం డా రాజువలన బలులం గొనితెచ్చి యప్పచ్చవిల్తున కీయ నతం డందికొని యటఁగదలి మహాభయంకరంబగు దండకారణ్యంబు ప్రవేశించి మునీంద్రుల యాశ్రమంబులం దిలకించి నిర్వింధ్యాపయోష్ణితాపీతీర్థంబులలో సైన్యసమన్వితంబుగా స్నానంబు సల్పి శూర్పారకక్షేత్రంబున కరిగి యటనుండి నడచి ద్వైపాయనీహ్రదంబున కేతెంచి కాంచి యంత ఋశ్యమూకంబునకుం జని విలోకించి రాత్రిందివములు పర్జన్యుండు వర్షించెడి ప్రవర్షణాచలంబునకుం బోయి యానందించి శివక్షేత్రంబగు గోకర్ణంబును దర్శించి యట నిర్గమించి త్రిగర్తదేశనాథుని కరంబు లందికొని కేరళదేశంబు ప్రవేశించి యుండుట మన్ముఖంబునం దదధిపతియగు నంబష్ఠుండు విని పారితోషికంబులు కందర్పున కొసంగ నాతండు గైకొని కృష్ణవేణీతరంగిణినిం దాఁటి తైలింగదేశంబున కరుదెంచె. అత్తఱిఁ దత్పురోపవనంబునం బురంధ్రీలలామములతో మృదంగాదిమధురధ్వనిసమేతంబుగా నింద్రుం డప్సరలతోడ విహరించెడి వడువునఁ గ్రీడించు తత్తైలింగవిభుండగు విశాలాక్షుని పట్టపురాణియగు మందారమాలిని రజఃపుంజవ్యాప్తంబగు నభంబును గాంచి వెఱచి మనోహరా! కామాంధుండవై యేకార్యంబును గనలేకుంటివి. నేనో భవన్ముఖాలకాలిభ్రమరంబుగా నుండి యీవఱకెట్టి దుఃఖంబు నెఱుంగకుంటి. యాదవేశ్వరుండగు నుగ్రసేనుండు రాజసూయంబుఁ జేయందలంచి దిగ్విజయార్థంబై ప్రద్యుమ్నుని యాదవబలోపేతునిగాఁ బంపెనని

శ్రుతంబయ్యె. అతఁడే కాఁబోలు ప్రస్తుతంబున నా శిశుపాలాదిభూపాలకులం గెల్చి దుందుభిసందోహధుంకారంబులతోడను, గోదండటంకారంబులతోడను, మత్తేభశీత్కారఘూత్కారంబులతోడను, నిన్నుంగెల్వవచ్చినట్లున్నది. కాన జాగుమాని కప్పంబు లతనికప్పనంబుసేసిరమ్మని హెచ్చరింప నావిశాలాక్షుండు నిజబలసహితంబుగా బలులం గొని యప్పార్థివిల్తున కర్పించి నమస్కరించి యథాప్రకారంబుగా నిజోద్యానవనంబునకుం జనియె. అంత నారతీకాంతుండా చోటువీడి పంపాసరోవరంబున కరిగి యందవగాహనంబు సల్పి మహారాష్ట్రదేశంబునకుం బోయి తద్విభునిచేఁ గానికలం గొని యటసాగి కర్ణాటదేశంబు సొచ్చి తదధినాథుండగు సహస్రజిత్తుచేఁ బూజలతోఁ గూడిన కప్పంబుఁ బరిగ్రహించి యతని వీడ్కొని దేహాజంబులగు వికారంబులం జయించుట కేగు యోగీంద్రులాగునం గమూష దేశంబును గెల్వ్బ కరిగె. అందు రాజధానియగు మహారంగపురంబునం దద్వసుదేవుని మఱియొక చెలియలగు శ్రుతదేవ యను దాని భర్త వృద్ధశర్మ, దంతవక్త్రుండను తనయునితోఁగూడి పాలకుండుగా నుండు. ౨౧౪

ఆ॥ అట్టి వృద్ధశర్మ ♦ యాత్మజుఁడౌ దంత,వక్త్రుఁ డంబుజాక్షు ♦ వైరియగుచు
నట్టి చైద్యుఁబోలె ♦ నమ్మయబ్బల మాట, దాఁటి కినుక నిట్లు ♦ లోటులేక. ౨౧౫

దంతవక్త్రుఁడు ప్రద్యుమ్నునితోఁ బోరి యోడుట.

ఉ॥ ఈదినమందు యాదవుల ♦ నెల్లర జల్లన డొల్లనేసి యా
మోదముతోడ వత్తునని ♦ ముజ్జగముల్ వణఁకఁగ వచించి క్ర
వ్యాదభయాకృతిక్రియల ♦ నక్కజుఁడై పలువిండ్లఁ బట్టి దా
మోదరపుత్రుపై దుమికె ♦ మోఁదుటకై యసహాయశూరుఁడై. ౨౧౬

వ॥ అంతం గందర్పుండు దర్పంబునం దమమీఁదికి నేతెంచు. ౨౧౭

సీ॥ కనులఁ ద్రిప్పఁగఁజాలు ♦ కాటుకమలఁబోలు, నల్లనిరంగుతోఁ ♦ జెల్లువాని
నిప్పులం గ్రక్కుచు ♦ నివ్వెఱబడఁ జేయుఁ, ద్రేలాడు నాల్కతో ♦ వీఁగువాని
గుండె బ్రద్దలౌనర్పు ♦ దండిమబ్బులఁబోలి, పలుమాఱు బడబడఁ ♦ వాగువానిఁ
దద్దయు నిడుపైన ♦ దశతాళవృక్షంబు, లంతయున్నతమున ♦ నమరువాని
తే॥ మకుటకుండలహైమ వ♦ర్మకటకాది, భూషలఁ వెలుగువానిని, భూమి వణఁకఁ
దరుల గిరులను ద్రోయుచుఁ ♦ దిరుగువాని, లక్షభారాంచితగదఁ జె♦లంగువాని.
తే॥ కాంచి యాతనితోడుతఁ ♦ గయ్యమాడ, దివ్యశస్త్రాస్త్రముల్ దాల్చి ♦ త్రిజగములను
గెల్చి పెల్చన నిల్చెడి ♦ కీర్తిఁ గనెడి, స్వబల మంపె నష్టాదశా ♦ క్షౌహిణులను.
మ॥ పిదపన్ దద్బల మస్త్రశస్త్రముల నా ♦ వీరున్ మదోన్మత్తుఁబన్
జెదుకంగాఁ బ్రహరించె నాగ్రహముతో ♦ శృంగుల్ మహాగ్రావముల్

జదియం బ్రగుమ్మినయట్లు లాయసురుఁడుఁ ♦ గాలాగ్నిరుద్రాభుఁడై
గదఁ గైకొంచు వియచ్చరుల్ వెఱపుతోఁ ♦ గాంచన్ విజృంభించుచున్. ౨౨౦

ఉ॥ కొన్నిఁటి కుంభికుంభములఁ ♦ గుంభినిఁ గూలిచి తన్ని కొన్నిఁటిన్
గొన్నిఁటి వందయానుడల ♦ కుం బడనెట్టి వియన్థ్సలంబునం
గొన్నిఁటిఁగొమ్ములం బెటికి ♦ కోడిగముం బొనరించి కొన్నిఁటిం
దన్నుకొనంగ మొత్తియొనఁ ♦ దద్రిపుసైన్యముఁనందు వెండియున్. ౨౨౧

చ॥ అరదము లెత్తి తుత్తునియ ♦ లౌనటులన్ బడవేసి వెంటనే
హరులగళంబులన్ నఱికి ♦ యాకసమంటెడు నెల్ల టెక్కెముల్
బఱపఱఁజించి త్రుంచి దృఢ ♦ వర్మములం దెగటార్చి రౌతులన్
బఱుగు బదాతిజాతము ల ♦ వారిగఁ దీయఁగ మోఁది యాదటన్. ౨౨౨

తే॥ రాలిపాటునఁ జెలరేగి ♦ రాజసుతుల, బలుల భూషణభూషితాం ♦ గులను శస్త్ర
యుతుల భిన్న దేహాధోముఖోర్ధ్వముఖులు,గానుబరిమార్చియార్చె త♦ద్ఘనముమాడ్కి.

క॥ అత్తఱి నచ్చిత్తజుఁడొన, హత్తిన శస్త్రాస్త్రమణిచ ♦ యాన్విత యోధుల్
నెత్తురుఁ గ్రక్కుచు రిక్కల, మొత్తమువలె నేలవ్రాల ♦ మొదలిడి రయ్యా! ౨౨౪

తే॥ వెండియున్ దంతివక్త్రుండు ♦ భీమగదను, రిపుబలంబుఁ గలంచె ని ♦ ర్జిద్రదశక్తిఁ
బ్రలయజలధిన్ వరాహంబు ♦ పంటఁబట్టి, పల్లటిలఁ జేసినట్టులఁ♦బార్థివేంద్ర!

తే॥ అట్టి పట్టున నప్పాద ♦ శాంబుజేశు, గాత్మభవులు మహారథు ♦ లట్టిదనుజు
సతుతునిఁ జేయ వాఁడు ప్ర ♦ సాద మతుల, రాకుఁదగినట్లు రాజిల్లె ♦ రక్తధార.

తే॥ కాని తద్ధతి నసురుండు ♦ కళవళపడ,కుంటఁ బరికించి కృతవర్మ ♦ మంట ముందు
శరచయమున నక్రూరుండు♦శక్తినసిప,రమున యుయుధానుఁడున్ గొట్టె♦రమితధాటి

తే॥ రోహిణీపుత్రకుండును ♦ రోషవిగ్రహుండు నగు సారణుండును ♦ దండిదైన
గొడ్డలిం గొని వానినిం ♦ గొట్ట తెలుపు, మఱపు బొందెడిలాగున ♦ మనుజనాథ!

ఉ॥ అంతట దంతివక్త్రుఁడు గ ♦ దన్ యుయుధానునిఁ గొట్టె కాళ్ళతో
నెంతయు గాండివీతనయు ♦ నేఁచి కసిన్ గృతవర్మఁజేతులన్
బంతము మీఱ మొట్టె నిజ ♦ బాహుబలంబున మోఁది సారణున్
వంతల నొవ్వఁజేసెను న ♦ వారణబాణకృపాణపాణియై. ౨౨౯

క॥ సారణయుయుధానులు నక్రూరుఁడు గృతవర్మ వాని ♦ ఘోరహతులచే
ధారణి మూర్ఛిల్లిరి ధాత్రీరుహములు గాలి గూలు ♦ తీరునఁ బిదపన్. ౨౩౦

ఉ॥ జాంబవతీతనూభవుఁడు ♦ సాంబుఁడు గైకొని ముద్గరంబు నా
దాంబికు ముద్గలంబును ద ♦ టాలునఁ జెండఁగ వైచి వెండియున్
డంబుగ దానితోన నక ♦ టా! వికటంబుగఁ గొట్ట నాతఁడా
సాంబునిఁబట్టి బాహువుల ♦ తన్మతలమందునఁ గూల్చెఁ బెల్చనన్. ౨౩౧

ఆ॥ సాంబుఁ డంతలేచి ♦ సరగునఁ దద్దంత,వక్త్రిపాదములను ♦ బట్టి యిలను
బడఁగవైచె నద్ది ♦ కడువింతగాఁ దోఁచె, సర్వజనులకో ర ♦ సాతలేంద్ర!

ఆ॥ అపుడు దంతవక్త్రుఁ ♦ డవలీలగా లేచి, యఖిలభువనములును ♦ నార్వ నట్ట
హాస మాచరించి ♦ యాశ్శంబరారితో, బలుకఁ దొడఁగె నిట్లు ♦ పరుషరీతి.

మ॥ మదనా! మీరు యయాతిశప్తులును సా ♦ మాన్యుల్ బరాస్కందులు
న్మదనప్రాంగణభీరువుల్ ఖలులు నా ♦ నాగోత్రసంజాతదు
ర్మదమత్తాంధకయాదవప్రభృతులై ♦ మాయంతవార్లేరటం
చెదలో సిగ్గును వీడి వచ్చితివిరా! ♦ యీనాఁటి కీరీతిగాఁ. ౨౩౪

క॥ వచ్చితివి పొమ్ము మీరిపు, డిచ్చటఁ బదిమంది గలిసి ♦ యేకాకిని నన్
విచ్చలవిడి బాధింతురె?, మచ్చరి ధర్మంబె వేయి ♦ మాటలిఁకేలా? ౨౩౫

తే॥ అయిన నిన్నన్నచో దోష ♦ మత్తుఁగాని, నిన్నుఁగన్నట్టి తండ్రిని ♦ నీకులంబు
నిందఁజేసిన దోషంబుఁ♦జెందదందు, వెయ్యిహేతువుల్ గల వవ్వి♦వినుము దుష్ట!

సీ॥ ఎవఁడు జరాసంధు ♦ నెపుడ కోపక,కూపారమును జేరి ♦ ప్రాపుగోరె
నెవఁడు మహాకాల ♦ యవనునిఘాటికి, భయమినుడింపగాఁ ♦ బాతిపోయె
నెవ్వఁడు వ్రేతల ♦ యిండ్లలోఁ జొరఁబడి, దధినవనీతముల్ ♦ దస్కరించె
నెవ్వఁడు వేదశా ♦ స్త్రోరితధర్మముల్, దాఁటిన బాటల ♦ మాటలాడె

తే॥ నెవఁడు గోపికాబాలుల♦యిండ్లకరిగి, కూనరాగంబులం దీసి♦కొంటెయయ్యె
నెవఁడు టక్కులం డెక్కుల ♦ నేసరేఁగె, నెవ్వఁడేసగింపులకును ♦ నేవపడఁడొ.

ఉ॥ ఎవ్వఁడు గోపికాంగనల ♦ యెంగిలికూడు భుజించి మెచ్చునో
యెవ్వఁడు రాసమండలుల ♦ నెబ్బెటికంబుగ నాటలాడునో
యెవ్వఁడు నందుగోపులను ♦ నెల్లపుడుఁ దమిఁ గాచుచుండునో
యవ్విటుండు కృష్ణుఁడుగ ♦ దా నినుఁ గాంచిన తండ్రి దుర్మతీ! ౨౩౬

తే॥ అట్టి నీచుండు నీ తండ్రి ♦ యల్పరాజ్య
మును గడించి ప్రభుండయ్యెఁ ♦ బుష్పబాణ!
యతని దయ నుగ్రసేనుఁడా ♦ యలఁతి దొరత
నంబుఁ గైకొని యాదవ ♦ నాథుఁడయ్యె. ౨౩౭

తే॥ అంతమాత్రన రాజసూ♦యం బతం డొ,నర్పఁదలపడె క్షుద్రమా♦నక్క సింహ
పంచనఖములతోఁ గల♦హించునట్లు, లబ్బురమగుఁ గాలగతి దు♦రత్యయంబు.

చ॥ అనవుడు దంతవక్త్రునకు ♦ నంగభవుం డిటు పల్కెసాగె నో
దనుజకులాధమా! మునుపు ♦ తాదృశకుండినపట్టణంబునం
దునఁ గడు జూపియుండిన య ♦ దుప్రభుయోధబలప్రతాపముల్
విని కని యుండ వక్కతన ♦ విన్మ మఱేఁ గనుమోరి తుంటరీ! ౨౪౧

క॥ నే నీ సంబంధినినని, మానసమున నెఱిఁగి మృధము ♦ మాలోఁజేయఁ
బూనితివి ధార్మికుల కిది, దానవకులనాశకా! య ♦ ధర్మముగాదే! ౨౪౨

వ॥ వెండియు ద్రోణుండను వసు విప్రవసుంధరను నందుండను నామంబునం జన్మంబెత్తి గోపాలకులకుం బాలకుండై యెసఁగుననియు, దద్గోకులంబున వసించు గోపికాగోపకులు శ్రీరాధామాధవతనూరుహోద్భవులగు గోలోకవాసులనియు, నవఁడు లోకాభిరాముండనియుఁ బరంధాముండనియు నసంఖ్య బ్రహ్మాండవిభుం డనియు, గోలోకేశ్వరుండనియు భగవంతుండనియుఁ బరాత్పరుండనియు వేదాంత విదులచేఁ గొనియాడఁబడునో యే మహామహుండు స్వతేజంబున సర్వచరాచర తేజంబులు లీనంబుగాఁ బ్రకాశించునో యా పరమేశ్వరుండే దుష్టశిక్షణార్థంబును శిష్టరక్షణార్థంబును శ్రీకృష్ణనామధేయంబునం గోకులంబునం బరిపూర్ణతమావ తారంబెత్తెననియు మరుత్తుండను పార్థివేంద్రుండె యా కృష్ణవరంబుచే నుగ్రసేనుం డను పేరం జనించి యాదవేశ్వరుండై నిరంకుశంబుగా రాష్ట్రంబుఁ బరిపాలించు చుండెననియుఁ బై వార లందఱును బూర్వజన్మార్జితాగణ్యపుణ్యంబులచే జన్మించి రనియు గుర్తెఱుంగుము. ఇట్టి మహాత్ములం దూలనాడుట పాడిగాదు కీడులకుం దోడగు. అట్లు నిందించినను జంబుకారవంబు లక్ష్యంబు జేయని సింగంబుభంగిని శ్వానధ్వానంబులను వినని మత్తమాతంగంబువిధంబునను, బెడచెవిం బెట్టదఁ గాన శూరుండవైన మిన్నక కదనమ్మునకుం గదలిరమ్మన నద్దనుజేంద్రుండు రోషా వేశపరవశుండై ౨౪౩

తే॥ గదను లక్షభారాంచితఁ ♦ గరమునఁ గొని
మరుని యరదంబుపై వైవ ♦ హరిసహస్ర
మిలను గూలియు సకిలించి ♦ నలుఁగడలకు
వెఱపుతోఁ బాఱఁదొడఁగెను ♦ ధరణినాథ! ౨౪౪

ఉ॥ పిమ్మట నమ్మరుండు దృఢ ♦ విస్తృతమౌ గదఁ దాల్చి దైత్యువ
క్షమ్మునఁ గొట్ట వాఁ డలఁతి ♦ గాసిని జెందె ననంతరమ్మునం
దమ్మనుజాశనాంగజుల ♦ కద్భుతమైన గదాహవమ్ము ఘో
రమ్ముగ నయ్యె కొండ మృగ ♦ రాజులు బోటిగఁ బోరినట్లుగన్. ౨౪౫

ఆ॥ అంత దంతవక్త్రుఁ ♦ డాత్మీయభుజదండ
ములను గృష్ణపుత్రుఁ ♦ బుష్పబాణు
మృగవిభుండు బల్మి ♦ మృగరాజునుంబట్టి
క్షోణిఁ గూల్చినట్లు ♦ గూల్చె నవల. ౨౪౬

చ॥ మదనుఁడు లేచి కర్బురు న ♦ మందముగాఁ గొని త్రిప్పి బాదఁ వాఁ
డదటుగఁ గ్రక్కె నెత్తురుల ♦ నస్థులు చూర్ణముగా ఖలాంగుఁడై

యదవదఁజెంది ప్రహాదిని న • హార్యము గూలినమాడ్కి సౌమ్యతో
న్నదనమునంబడెఁ భువి వ • ణంకెఁ జలించె జగంబు సర్వముఁ. ౨౪౬

ఉ॥ అంతట వాని తండ్రియు మ • హావిబుధుండును బుద్ధిశాలియుఁ
శాంతుఁ డుదారచిత్తుఁడు ర • సజ్ఞవరుండగు వృద్ధశర్మ ని
శ్చింతగ సంధిఁగోరుచు స్వ • సేనలఁగూడి సతీసమేతుఁడై
కంతుని చెంతకుం జని ము • ఖంబున దోసిలిఁగూర్చి యిట్లనెఁ. ౨౪౭

ఉ॥ దీనశరణ్య! వృద్ధులము • దీనులమౌ మముఁజూచి నీతినిఁ
మాని శ్రుతిస్థధర్మమును • మంటను గల్పుచు దుర్మదాంధుఁడై
పూనిక నిన్ను డీకొనిన • పోకిరి నా సుతు సత్కృపామతిఁ
మానక కావవేఁడెదను • మన్మథ! యాదవవంశదీపకా! ౨౪౮

ఆ॥ అట్లు వేఁడి బలుల • నంగజునకు నిచ్చి, యాదవప్రవరుల • యర్చఁబడసి
యాత్మకీయమౌ మ•హారంగపట్టణ,మునకు మరలఁ జేరె • భూవరేణ్య! ౨౫౦

తే॥ అవలఁ బంచబాణుఁడు దక్షి • ణార్ణవమున
స్వబలములతోడ భక్తితో • జలకమాడి
కోట్లకొలఁదిని గోవులుఁ • గోపకులును
సంచరించు నుశీనర • స్థలికిఁ జేరి. ౨౫౧

క॥ పౌరులు భయభక్తుల నిడు, క్షీరంబును బెరుగు వెన్నఁ • జేగొని యర్చల్
భూరిగఁగొని గజహయరథ, హారాంబరమణులఁ బొంది • హర్షముఁ జెందెఁ.

మన్మథుఁడు విదర్భాదిదేశంబులం గెలుచుట.

వ॥ పదపడి నమ్మదనుండు గదలి మణిరత్నమయంబై సర్పంబులతో భోగవతీపురంబు వోల్పారునట్లు రాజన్యులతో నొప్పారు చంపావతీపురి కరిగి తదధిపుండగు హేమాంగదునిచేఁ బూజితుండై కరంబులం బరిగ్రహించి నమస్కారంబులం గొని సంతుష్టుండై యా భూపలలామునకుఁ గింజల్కసముపేతంబగు హారంబును, సహస్రదళంబులతో శోభిల్లు దివ్యపద్మంబు నొసంగి సపరివారంబుగా వీడ్కొని పలుమారు దుందుభులు మ్రోఁగించుచు విదర్భదేశంబుల కరుగఁ దద్రాజధాని యగు కుండినపట్టణంబునందుం జెలంగు భీష్మకుండను రాజవర్యలరాజురాక విని సంతోషించి చని యాతనిని సదనంబునకుం దోడ్కొనివచ్చి పూజించి దివ్యాంబరాభరణంబు లొసంగి ముక్తాహారాదుల సమర్పించి యభిముఖుండుగా నాకందర్పుం డామోదంబు జెంది మాతామహుండగు నమ్మహారాజునకుఁ బ్రణామంబు లాచరించి సైన్యసమేతుండై కుంతదరదదేశంబుల కేగి, ౨౫౩

మన్మథుం డగస్త్యమహామునిం గాంచి జ్ఞానోపదేశంబు బొందుట.

తే॥ మలయభూధరపాటీర ♦ మారుతములు, సల్లగా వీచుచుండఁగ ♦ జందనతరు
కేతకీపుష్పవాసనో ♦ పేతమలయ,గిరి నగస్త్యుఁ బీతాబ్ధి వీ ♦ క్షించి భక్తి.

చ॥ కరముల మోడ్చి కీర్తిబల ♦ కౌతుకసంపద లిచ్చుదీవెనల్
గరము గ్రహించి మౌని నదు ♦ గన్ సమకట్టి నిటుల్ నతాంగుఁడై
యరయ జగంబు దృశ్యమగు ♦ నర్ధ మసత్యముగాదె యెట్లిఁకన్
వఱలుచు నుండె సత్యముగఁ ? ♦ బల్కుము! యోగికులావతంసమా! ౨౫౭

తే॥ వెండి జీవుండు బ్రహ్మాంశ ♦ కుండు ముక్తుఁ,డునుగదాయాతఁ డెట్లిఁక ♦ గొనములగుమి
బద్ధుఁడయ్యెడి ? బ్రహ్మవి ♦ ద్వర్య ! చెపుము,కుంభసంభవ! దివ్యచ ♦ క్షూ ! మహాత్మ!

చ॥ అనఁగ నగస్త్యుఁ డిట్లనియె ♦ నంగజ ! నీవల కృష్ణుపట్టివై
యనఘుఁడవై మహాత్ముఁడవు ♦ నై యిటు లడ్గుట లీలయై జగం
బునకు శుభంబునెక్కొలుప ♦ మూలమగున్ హరివోలె నీవిలన్
జననముఁ జెంది మానవుల ♦ సాఁకఁగఁ బ్రిమ్మరుచుంటివో ప్రభూ ! ౨౫౮

తే॥ సత్యరవి ప్రతిబింబము ♦ సలిలమందు, సత్యముగఁదోఁచినట్టులన్ ♦ సకలవిధుల
తత్త్వమునకును మఱియుఁ బ్ర ♦ ధానమునకుఁ, జూడఁదగినది శ్రీకృష్ణ ♦ సూనువర్య!

ఉ॥ ఎట్టుల నద్దమందు మొగ ♦ మెట్టుల సైకతమందు జీవనం
బెట్టులఁద్రాట సర్పము న ♦ హీనముగా నిజమౌచుఁదోఁచునో
యట్టుల నీజగం బనృత ♦ మైనను నిక్కువ మట్లు దోఁచు నిం
కట్టుల నిట్టి జీవుఁడు త ♦ దంగగుణంబుల బద్ధుఁడౌఁ జుమీ ! ౨౫౯

చ॥ అనఁగ ననంగుఁ డిట్లనె మ ♦ హామునినాయక ! జీవుఁ డేవిర
క్తిని గుణపాళిఁ జిక్కుపడి ♦ త్రిమ్మట నెందఁడో ? యేయుపాయపం
థను గుణరాజిఁ జిక్కుపడి ♦ తల్లడమొందఁడో ? యట్టి సంగతుల్
గనికరమున్ ఘటించి పలు ♦ కన్వలె బ్రహ్మవిదగ్రణీ ! గుణీ ! ౨౬౦

ఉ॥ నావు డగస్త్యుఁ డిట్లనె న ♦ నంతశయానకుమారరత్నమా !
యేవిశుఁ డవ్వివేకము గ్ర ♦ హించి జగంబు మనోమయం బటం
చావులవీడి యుండెడినొ ♦ యావిబుధుండు సనాతనంబు సౌ
ఖ్యావహమైన బ్రహ్మపద ♦ మందఁగలండు నిరర్గళంబుగాన్. ౨౬౧

ఉ॥ భావుకభీతిజన్మమృతి ♦ బాధలు నాధులు వ్యాధులున్ క్షుధల్
యౌవనబాల్యవృద్ధత ల ♦ హంకృతులున్ మమకారముల్ రతుల్
గావరముల్ విమోహములు ♦ గష్టసుఖంబులు మంచిచెడ్డలు
న్దేవర ! యాత్మ కంటవని ♦ నెమ్మదినమ్ముము ! కొంకులేనటుల్. ౨౬౨

మ. నిరహంకారము నిష్కళంబుఁ బరముం ♦ నిర్దేహముం బుద్ధము
ద్ధురముం శుద్ధము సర్వతోముఖము సం ♦ తోషస్వరూపంబు శ్రీ
కరముం బూర్ణ మనాదిమధ్యలయముం ♦ కాలాత్మకంబుం గుణా
కరముం బ్రహ్మమటంచెఱుంగునెవఁడా ♦ గాఢజ్ఞుఁడే ముక్తుఁడే. ౨౬౩

చ. ఎవఁడు ప్రపంచమంత శయ ♦ నించెడి కాలమునందు మేలుకొం
చవితథతత్త్వముం గనుచు ♦ హాయిగనుండునొ యామహాత్ము నీ
భువనముగాని మానవస ♦ మూహముగాని మఱేదిగాని యె
ట్టివిధినిఁ జూడలేదని శ ♦ డిందిగ డెందమునందు నమ్ముమా! ౨౬౪

వ. మఱియు గగనానలానిలంబులు గోష్ఠకాష్ఠరేణువులకుం జిక్కువడక మెలంగుభంగిని, స్వచ్ఛంబగు స్ఫటికంబు పీతారుణకృష్ణవర్ణంబులతో సంక్రమింపనిసరణిని గుణంబులచేఁ గట్టువడక లౌకికోక్తులచేఁగాని లక్షణాధ్వనివ్యంగ్యంబులచేఁగాని తెలియఁబడక ప్రత్యక్షానుమానసిగమాత్మజ్ఞానంబులతోఁ గొందఱచేఁ గర్మమనియు గొందఱచేఁ గర్తయనియుం గొందఱచేఁ గాలంబనియుఁ గొందఱచేఁ యోగంబనియుఁ గొందఱచే సాంఖ్యంబనియుఁ గొందఱచే వాసుదేవుండనియు, గొందఱచే బరమాత్మయనియుఁ గొనియాడఁబడుచు వెలుంగు నాబ్రహ్మంబు శ్రవణమననిదిధ్యాసంబుల విచారించు పుంగవుండు నిస్సంగుండై సుఖియై విరాజిల్లు ప్రచలదుదకంబువలనఁ బాదపంబులు చలించినపగిదినిఁ దిరుగుడుకండ్లకు ధరణి తిరిగాడితీరునను, గుణంబులచే భ్రమించు మనంబున కాత్మయందు జననమరణాది దుఃఖంబులున్నట్లు తోఁచుచుండు. భ్రాంతులగువారలు కరంబుచేఁ దిరిగాడి కొఱవి కరణిని జేసితిని జేయఁగలను, జేయుచున్నాను, నీవు సుఖివి. నేను దుఃఖిని. నిది నాది యది నీది యని యజ్ఞానంబునం బలుమాఱు బలుకుచుఁ బరిభ్రమించుచుందురు. సత్త్వరజస్తమోగుణంబులు మాయాగుణంబులుగాని యాత్మగుణంబులు గావు. ఈగుణంబులతోడనే తంతువులతోఁ బటం బేర్పడినట్లు జగం బేర్పడియె. ఇందు సాత్త్వికు లూర్ధ్వలోకంబునకు, రాజసులు మధ్యలోకంబునకును, దామసు లధోలోకంబునకుం జనుచుందురు. అంధకారంబున రజ్జువుం గాంచి సర్పంబను బుద్ధి జనించినట్లును, దూరంబునుండి మరీచికలం జూచి జలంబను ప్రజ్ఞ కలిగినట్లును, గుణత్రయ భూయిష్ఠంబగు నీజగంబు మిథ్యాస్వరూపంబైనను సత్యంబను భావంబు వొడము. వృద్ధరాజులు గతించినతోడనే కుమారరాజులు పట్టాభిషిక్తులై రాజ్యసుఖం బనుభవించినట్లును, నరకవాసులు పాపంబులు క్షయంబుగా మరలివచ్చి సుఖం బొందినట్లును, మానవులకు సుఖదుఃఖంబులు గలుగుచుఁ దొలఁగుచుండును. మేఘంబులును, దేహగుణంబులును, నహోరాత్రంబులును మొదలగునవి నియతంబుగా నుండక మాఱుచుండును గాదె? అట్లీజగద్దేహంబులకు సైతం బెఱుంగునది.

అందుఁ దారతమ్యం బెద్దియు లేదు. ఱెక్కలువచ్చిన తరుణంబునం బక్షులకు నీడం బుతోఁ బ్రయోజనంబులేనిభంగిని, నొడ్డెక్కిన తరుణంబున నుడుపంబుతో లాభంబు లేనివిధంబునను, జ్ఞానంబు గలినవాని కీసంసారంబువలన ఫలంబు గానరాదు. వెండియుఁ జక్కని మార్గం బన్వేషించి యవలంబించి సమదృష్టితో నెల్లెడల సంచరించెడి సంయమీంద్రునకు దర్పణంబుతో నుపయోగం బుండునే? ఎట్లిందుం డుదకపాత్రంబుల నానారూపంబులఁ జెలంగుచుండునో యెట్లగ్ని యింధనంబుల నానా రూపములఁ బ్రకాశించుచుండునో యట్లే యద్వితీయుండును, భగవంతుండును నగు నాపరమాత్మయు స్వకృతంబులగు దేహాదులయందు ఘటమఠాకాశబాహ్యాభ్యంతరంబులందును నానారూపములతో విరాజిల్లు. ఇట్లు చెలంగుచున్నను స్ఫటికం బితర వర్ణంబులతో లిప్తంబుకానిచాడ్పున బ్రహ్మంబు తద్గుణంబుల నంటకుండు. శాంతాత్ముండును, కృష్ణభక్తుండును, జ్ఞాననిష్ఠుండును, విరాగియు నగు మహామహుని బూరోత్కర్షగుణంబులు స్పృశింపనేరవు. ఎవఁడు సదానందమయుండై బాలోన్మత్తపిశాచంబుల విధంబున సంచరించునో వాఁడే జ్ఞానియని యెఱుంగుము. సూర్యోదయంబున ధ్వాంతంబు ధ్వంసంబై గృహంబున సర్వపదార్థంబు లగుపడినట్లు జ్ఞానోదయంబున నజ్ఞానంబు నశించి సిరతిశయంబగు తత్వంబు గనుపడుచుండు. ఏకపదార్థంబె పృథగ్ద్వారంబులగు నింద్రియంబులచే బహుగుణాశ్రయంబైనట్లు శాస్త్రానుసారంబులగు వేదాంతవాక్యంబులచే బ్రహ్మపదార్థంబు బహుప్రకారంబులుగా వర్ణింపంబడుచుండు. కొందఱదానిని బరమపదంబనియు గొందఱు విష్ణులోకంబనియు, గొందఱు వ్యాప్యంబగు వైకుంఠంబనియు, గొందఱుఁ గైవల్యంబనియుం గొందఱు ప్రకృతిపరంబగు గోలోకంబనియు గొందఱుఁ విశదంబగు పరమనికుంజంబనియు వచింతురు. జ్ఞానవైరాగ్యభక్తిభావసంభరితులగువారే తత్పదంబున కర్హులగుదురు. శ్రీకృష్ణునికి భక్తుఁడగువాఁడు కైవల్యనాథుండును, బరాత్పరుండును బురుషోత్తముండునునైన యాతని పదంబుఁ జెంది పునర్జన్మం బెత్తక యానంద మనుభవించునని తెలిసికొనుమన నా కుసుమశరుండు పులకితగాత్రుండై యమ్మహామునికిఁ బూజించి నమస్కరించి కృతాంజలియై తదాజ్ఞఁ గైకొని సపరివారంబుగా వీడ్కొని.

తే॥ తామ్రపర్ణినిఁ గృతమాలఁ * దానమాడి, రాజపురమున కరుగఁ ద * ద్రాజు సాళ్వ
నామధేయుండు నాచేతఁ * గామఁడాడి, యాదవులరాక విని కని * యాతిరయమున.

ఉ॥ వానరనాథుఁడో ద్వివిదు * పాలికిఁ బోయి స్వకీయసంగతిఁ
బూని వచింపఁగా నతఁ డ * మోఘముగాఁ జెలికి సహాయ మ
య్యానమొనర్పఁగాఁదలఁచి * యుగ్రత నుర్విఁ జలింపఁ జేయు చా
మీనపతాకు మూఁకలను * మేమెయిఁ దాకె విదేహభూమిపా! ౨౬౭

మ॥ ద్వివిదుం డట్టులఁ దాఁకి దంతములతోఁ ♦ దీక్ష్ణంబులౌ గోళ్ళతో
సవిచిత్రంబుల స్వర్ణభూషితములన్ ♦ సంస్తవ్యముద్రావితా
నవరోచ్ఛ్రాయమహాధ్వజంబులను నా ♦ నారీతులం జించి య
శ్వవితానం బరదంబులున్ జెడునటుల్ ♦ సాగించి జృంభింపఁగాన్. ౧౬౮

ఉ॥ అంగదపుత్రుఁడు గన్గొని ర ♦ యంబున స్యందన మెక్కి శ్రోత్రముల్
గింగురనంగఁ డంకృతులఁ ♦ గేరుచు సల్పఁగ వాఁడు స్వీయమా
తంగమునుండి మూర్ఛని ర ♦ థంబుపయిం బడి దీర్ఘమైన తోఁ
కం గొని సాతిపత్రతుర ♦ గం బరదంబుఁ గదల్చె భూవరా! ౧౬౯

క॥ అవల ననంగుఁడు శరములు, ద్వివిదుని మెడవైచి లాగఁ ♦ బిమ్మట నాతం
డవితథరీతిని జేతో,భవపుని మర్దించె వజ్ర ♦ బహుదృఢముష్టిన్. ౧౭౦

క॥ అంతట నంతకసిభుఁడగు, కంతుఁడు విలునెక్కుపెట్టి ♦ కౌశలమునఁ గ
ర్ణాంతము సంటగ లాగుచుఁ, బంతముతో వానిపైని ♦ బఱపె ధరేశా! ౧౭౧

చ॥ పఱపిన నమ్మహాశరము ♦ వానరనాయకు వానిఁబట్టి యం
బరమునఁ ద్రిప్పి యంతమున ♦ బాధలు పెక్కులు గల్గ లంకయున్
బురి శతయోజనంబులను ♦ బోయిపడన్ విసరెన్ దదంగజుం
డఱిముఱి సాళ్వయోధులగు ♦ నాసురులం దునుమాడి గంటలోన్. ౧౭౨

చ॥ జయమును బొంది దుంధుభులఁ ♦ జక్కఁగ మ్రోయనొనర్చి తద్బలుల్
రయమునఁ గొంచవాచిని వి ♦ రాజిలు శ్రీమధురాపురంబు ని
ర్భయముగఁ గాంచి మంగళక ♦ రంబుఁ ద్రికూటము నెక్కి లంకనుం
డి యల కపీంద్రుఁడున్ గడువ ♦ డిన్ దదహార్యముఁ జేరి వెంటనే. ౧౭౩

తే॥అచట వీథ్కాని ప్రనాక♦మనెడి గిరికిఁ, జేరి యటనుండి వెడలి యా♦సింహళమున
కరిగి యటనుండి భారత♦ధరణిఁజొచ్చి, యచటనుండియు శితాద్రి♦కరుగుదెంచి.

క॥ మఱి యచ్చటనుండియు శర,వరయుతము వినోదకరము ♦ ప్రాగ్జ్యోతిషమున్
పురమున కరిగెను ధరణీ,వర! మాసం బందునుండి ♦ పైనం బగుచున్. ౧౭౪

క॥ ఉత్సాహాన్వితమతితో, మత్సారస్థలికి నేగి ♦ మానవనాథా!
సత్సంగతిరతహితతతి, పత్సలమగు "రామకృష్ణ ♦ వరధర" కరిగెన్. ౧౭౫

తే॥ అరిగి యచ్చట శతయోజ ♦ నాయతమును
గ్రాహగృహము సముద్రంబుఁ ♦ గాంచి దాని
వేలఁజేరి సాంబాదులఁ ♦ బిలిచి సభను
సలిపి యందు నుద్ధవునకుఁ ♦ బలికె నిట్లు. ౧౭౬

తే॥ కర్బురశ్రేణివిభుఁడు లం ♦ కాప్రభుండు, సద్ధబలుఁడు విభీషణుఁ ♦ డిట్టిద్వీప
మునకుఁ బఱియుఁట! యాతండు♦మనకు బలుల,నియ్యకుండినఁ జేసెడి♦దేమొ? చెపుమ!

చ॥ అనఘ నతం డిటుల్ బలికె ♦ యాదవవీరవరా! రతీశ్వరా!
యనఘుఁడవై సురాధిపతి ♦ వై యపరాంబుజలోచనుండవై
ఘనచరితుండవై సుగుణ ♦ కాంతుఁడవై పతివై యిలం జూబో
లెను నను నడ్గుచుంటివా బ ♦ లీ! పెదవారికిఁ గూడ మాయయే? ౨౬౯

తే॥ స్వామి! మీయాజ్ఞ బ్రహ్మేంద్ర ♦ శంకరముఖ
దైవతంబులు శిరములన్ ♦ దాల్చుచుంద్రు
నేను దాసానుదాసుండ ♦ నీకుఁ జెప్ప
నంతవాఁడనె? నానతు ♦ లందికొనుమ! ౨౭౦

క॥ పదపడి భగవంతుండును, యదుకులముఖ్యుండు శంబ ♦ రారి రతీశుం
డు దయాళుఁడు ఘనబలుఁడో, మదనుం డొక కాకిలంబు ♦ మంచిది గొంచున్.

చ॥ దనుజవరేణ్యా! దర్పకుఁడుఁ ♦ ద్వద్ధరఁ జేరితిఁ గాన భోజభూ
పున కిపు డీవు కానికల ♦ మొత్తమొసంగుము లేనిచో మదీ
యనిశితకార్ముకోద్గతమ ♦ హాశుగధారలతోడ మిమ్ము భం
డనమున సేవలం దగి హ ♦ టాహుటిఁ ద్రుంచెదనంచు వ్రాసియున్. ౨౭౧

ఉ॥ విల్లునఁగూర్చి నల్గడలు ♦ భీతిఁ బ్రతిధ్వనిసేయఁ డంకృతుల్
బెల్లుగ నాచరించియు వి ♦ భీషణనేత్రసభాస్థలిన్ విరా
జిల్లువిధంబునం బఱప ♦ శీఘ్రముగా నది దివ్యకాంతి భా
సిల్లుచుఁ దన్నిశాటపతి ♦ చెంతఁబడెన్ బెదరన్ సభాసదుల్. ౨౭౩

చ॥ పడిన శరంబునుండి నర ♦ భక్షకముఖ్యుఁడు పత్ర మొక్కటిన్
వడిఁగొని దానిని జదివి ♦ బాపురె! చాగురె! యంచు వింతలన్
బడి సభనున్న భార్గవుని ♦ భక్తినిఁ బూజలొనర్చి భోజభూ
పుఁ డెవఁడో? బాణమేరిదిది? ♦ బూసనుఁ గ్రుచ్చినయట్లు చెప్పుమా! ౨౭౪

క॥ అనుగఁగ నటులు కవి మఱియనఁ, గడఁగెను ముని దీనికొక్క ♦ కథ దగు దానిన్
గడువినువారికిఁ బాపము, లడఁగును ఫలమబ్బు వినుమ! యాసురవర్యా! ౨౭౫

తే॥ పూర్వమందున బ్రహ్మకుఁ ♦ బుత్రులైన, సనకముఖులు యదృచ్ఛగా ♦ స్వర్గమువిడి
విష్టపత్రయమును దిర్గి ♦ విష్ణులోక, మునకు నేగిరి తద్విష్ణు ♦ మూర్తినిఁ గన.

తే॥ అంత నంతఃపురద్వార ♦ మందునున్న, జయవిజయులు దిగంబరుల్ ♦ బాలకులయి
వచ్చినట్టి యామునుల లో ♦ పలకుఁబోవ, నడ్డగించిరి బెత్తంబు ♦ లొడ్డి దేవ!

ఉ॥ ఆవల నమ్మహర్షులు మ ♦ హాగ్రహమొంది కుబుద్ధులార! యా
శ్రీవిభునిన్ విలోకనముఁ ♦ జేయఁగఁ బోయెడి మమ్ము నడ్డి బ
ల్కావర మిట్లుజూపితిరి ♦ గానఁ ద్విజన్ములన్ నిశాటులై
భావముఁ జెంది యీరలటు ♦ పైఁ బరిశుద్ధులు గందు మెందుగాన్. ౨౭౭

వ॥ అని శపియించిన యనుక్షణంబునం దా జయవిజయు లానందసంధాయకంబగు తద్భవనంబునుండి యధఃపతితులై దితిగర్భంబునందు హిరణ్యాక్ష హిరణ్యకశిపులను నామంబులతో జన్మించి దైత్యదానవపూజితులగుచు లోకంబులం జీకాకుపరచుచుండం బరాత్పరుండు యజ్ఞవరాహావతారం బెత్తి జలంబునుండి యుద్ధర నుద్ధరించుచు నాహిరణ్యాక్షుని నొక్కముష్టితో నష్టపరచి తిరిగి నృసింహావతారం బెత్తి హిరణ్యకశిపుం జీల్చి సుఖంబులం గల్పించె. ద్వితీయజన్మంబునం దాద్వారపాలకులు కేశినీగర్భమందు విశ్రవునకు రావణకుంభకర్ణులను నామధేయంబులతోఁ బుట్టి జగత్కంటకు లగుచుండం బరమేశ్వరుండు గని కనికరించి శ్రీరామనామంబుతోఁ గౌసల్యకుం జనించి క్రమంబుగా లంక కరిగి భండనంబున నా గండల నిర్వురను ఖండించె వెండియు నీ మూఁడవ జన్మంబునందు క్షత్రియవంశంబులందు శిశుపాలదంతవక్త్రులను నభిధేయంబులతో నుద్భవించి వర్తమానంబునం జెలంగుచున్నారు. అవ్వారిని వధించుటకై పరిపూర్ణతముండును నసంఖ్యబ్రహ్మాండవిభుండును గోలోకప్రభుండును నగు నా భగవంతుండు యదుకులంబున శ్రీకృష్ణనామంబుతో నుద్భవిల్లి లీలోల్లాసపరుండై ద్వారకాపురంబున విరాజిల్లు. ఈ మహామహునిచే నా శిశుపాలదంతవక్త్రులు ధర్మరాజ రాజసూయాధ్వరంబునం జరుగు సాళ్వయుద్ధంబున నిహతులు గాఁగలరు. తద్దరి కామగుం డీమరుండనియు, నిపుడు కోదండనిర్గతంబై యతిజవంబున దశదిశలం బ్రకాశింపం జేయుచుఁ దటిత్స్వనంబుతో వచ్చిన బాణం బాతనిదే యనియు భోజభూపుం డుగ్రసేనుండనియు నాతండు రాజసూయంబుఁ జేయందలంచి దిగ్విజయార్థంబై యీ కృష్ణకుమారునిం బుత్తెంచె ననియు గుర్తెఱుంగుచున శ్రీరామభక్తుండగు నవ్విభీషణుం డా శ్రీరామచంద్రుండే యీ శ్రీకృష్ణచంద్రుండని తెలిసికొని పుణ్యజనసందోహసమన్వితుండై బలులం గొని యంబరమార్గంబునం బుష్పబాణు బలం బాలోకించుచు నతనిం జేరి ప్రదక్షిణంబు లాచరించి సాష్టాంగదండప్రణామంబులం గావించి తదభిముఖుండై దోసిలియొగ్గుచు నిట్లు వినుతించె. ౨౮౯

మ॥ అరవిందాయతలోచనాయ మహతే ♦ యంగప్రభూతాయ తే
ధరణీభారనివారకాయ గురవే ♦ ధర్మావతారాయ శ్రీ
హరిపుత్రాయ మహాత్మనే భగవతే ♦ యార్తప్రజారక్షణో
ద్ధురదీక్షాసహితాయ దేవమతయే ♦ దుష్టప్రహర్త్రే నమః. ౨౯౦

తే॥ మత్స్య! కచ్ఛప! వారాహ! ♦ మనుజసింహ!
వామనా! రామ! శ్రీరామ! ♦ రామ! బుద్ధ!
కల్కి! శ్రీవాసుదేవ! సం ♦ కర్షణా! ర
తీశ! జగతీశ! నన్ను ర ♦ క్షింపుమంచు. ౨౯౧

తే॥ షోడశోపచారముల న♦ స్తోకరీతిఁ, బూజఁజేయు సంతుష్టుఁడై ♦ పుష్పశరుఁడు
జ్ఞానభక్తివైరాగ్యముల్ ♦ గరుణతోడ, నొసఁగి మఱి యాదరించి స♦ముచితభక్తి.

ఆ॥ బ్రహ్మదత్తపద్మ ♦ రాగశిరోమణి, చంద్రదత్తకాంత ♦ చంద్రకాంత
భవ్యవస్త్రములను ♦ బాలస్త్రదత్తమౌ, రత్నమాల నిచ్చె ♦ రక్తితోడ. ౨౯౩

తే॥ అంతటన్ విభీషణుఁడు మ♦హాముదమున
శంబరారికి బలులను ♦ జక్క నిచ్చి
మ్రొక్కి స్వీయమౌ లంకయన్ ♦ పురవరమున
కరిగె ధరణీశ! బహులాశ్వ! ♦ యవల వినుము! ౨౯౪

తే॥ రతివిభుఁడు ఋషభాద్రి, శ్రీ♦రంగపురముఁ, గాంచి కన్గొని ప్రాగ్దిశఁ♦గల సరస్వ
తీనదిం జూచి కావేరిఁ ♦ దివిరి దాఁటి, సహ్యగిరిదేశమున కేగు ♦ సమయమందు.

ఉ॥ పిల్లలు సేరి చప్పటల ♦ వేయుచుఁ బాడుచు వెక్కిరించుచున్
జెల్లుగ నల్లరుల్ సలిపి ♦ పీకినఁ దాఁకినఁ గూడ నుల్లమం
దుల్లసమాని స్వాంతికము ♦ నొందు దిగంబరు ముక్తకేశుఁ బ్ర
ఫుల్లసదంగు భిక్షుఁగని ♦ యుద్ధవు నిట్టులఁ బృచ్ఛజేసిడిన్. ౨౯౬

క॥ సత్తమ! బాలపిశాచో,న్మత్తులవలెఁ దిరుగుచు నవ ♦ మానించిన నో
రిత్తక వచ్చెడి నీ సము, చిత్తం బెవ్వండొ నాకుఁ ♦ జెప్పుమనంగన్. ౨౯౭

శా॥ చిత్తోద్భూతున కుద్ధవుం డిటుల వా♦చింపం గడంగెన్ దపో
విత్తుం డచ్యుతసత్కళాకలితుఁడున్ ♦ వేదాంతవిద్వర్యుఁడున్
సత్తాఖ్యాతుఁడు గామకోపమదమా♦త్సర్యాదిహీనుండు నా
దత్తాత్రేయమునీశ్వరుం డతఁడు కం♦దర్పా! యటు ల్గాంచుమా! ౨౯౮

క॥ ఇతని ప్రసాదంబున భూ,పతులు సహస్రార్జునాది ♦ వరములు యదుసం
తతులును సిద్ధులఁ బొందిరి, రతిపతి! యన నాలకించి♦ ప్రద్యుమ్నుండున్. ౨౯౯

క॥ తనశిబిరంబున కేతెంచిన దత్తాత్రేయమునికిఁ ♦ జేసి సపర్యల్
ఘన సింహాసన మిడి యి,ట్లనియె వినయపూర్వకముగ ♦ నంజలితోడన్. 300

తే॥ పరమహంస! దత్తాత్రేయ! ♦ బ్రహ్మభువన,గతులఁ దత్త్వమార్గమున న♦వితథభక్తిఁ
జెప్పి నా సంశయముల న♦శింపఁజేయు, మనఁగఁ దన్మునివర్యుండు♦ ననియె నిట్లు.

వ॥ వస్త్వభావంబునం దులాగ్ర ప్రయోజనంబును, దద్భావంబునం దత్ప్రయోజనాభావంబును జెలంగిన ట్లంతవఱకుఁ దత్త్వం బజ్ఞాతంబై యుండునో తావత్పర్యంతం బీజగంబు సత్యంబుగాఁ దోఁచి ప్రయోజనకరంబుగా నుండు. ఎత్తఱిఁ దత్త్వంబు తెలియంబడునో యత్తఱి నద్దానితో ఫలంబు గానరాదు. శరీరంబునకుఁగాని లాఁతిదానికిఁగాని ముకురంబునం బ్రతిబింబంబు గన్పడక ముఖంబునకు మాత్ర మగుపడినట్లు ప్రధానార్థంబునందు జీవుం డాపరాత్పరుండని తెలియంబడక

జ్ఞానంబునమాత్రము తెలియంబడునని వక్కాణింప నప్పక్కిడాల్వేల్పుపట్టి యమ్మునికి నమస్కారమ్ములం గావించి పిదప ద్రవిడదేశంబునం జెన్నారు వైకుంఠాచలంబున కరిగి సత్యవ్రతుండును రాజర్షివర్యుండును, ధర్మజ్ఞుండును సత్యవాఙ్మామాంకితుండు నగు తద్ద్రవిడవిభునిచేఁ బూజాదులం గైకొని, ౩౦౨

ఉ॥ శ్రీలకుఁ దల్లియిల్లగుచు ♦ శృంగములం బొలుపాఱుచుండు శ్రీ
శైలముఁ గాంచి యందుఁ దగు ♦ శంకరుఁ గన్గొని కాంచి భ్రామరి
న్బాలు షడాననుం గని వి ♦ నాయకునిం దిలకించి వీచికా
జాలయుతంబు పంప యను ♦ సత్సరసిన్ గనులారఁ జూచియున్. ౩౦౩

క॥ గోదావరి భీమరథీ, ప్రాదిని హరితీర్థములఁగని ♦ యానందదమున్
మేదురము మహేంద్రాద్రికి, నాదటఁ జని పరశురాము ♦ నాలోకించెన్. ౩౦౪

ప్రద్యుమ్నుఁడు పరశురాముని దర్శించుట.

చ॥ కని యతఁ డమ్మహామునికిఁ ♦ గాశ్యపి నొడల దాఁక మ్రొక్కి యో
యనఘ! మహానుభావ! నిగ ♦ మార్థవిదగ్రణి! క్షత్రియాంతకా!
మునికులసింధుపూర్ణశశి! ♦ భూసురకేసరి! జామదగ్న్య! నా
వినతివితాన మందికొని ♦ ప్రీతిని బ్రోవుము భక్తవత్సలా! ౩౦౫

తే॥ నావుడా మునివర్యుఁ డా ♦ నందమొంది, దిగ్విజయమును గూర్చెడి ♦ దీవెనలను
సలిపి తచ్చతురంగముల్ ♦ సంతసంబు, గాంచునటు గౌరవించి యో ♦ గమహిమమున.

సీ॥ మా॥ అన్నంబు, సూపంబు ♦ నవలేహ్య, లేహ్యము, లమృతకుండలు లెచ్చు ♦ నప్పడములు
బూరి పాల్పూరీలు, ♦ బూరెలు గారెలు, బోళీలు, బొబ్బట్లు ♦ మోదకములు
గర్పూరనాడులు ♦ గాయలు గూరలు, నట్లు బొంగరములు ♦ నావువడలు
బజ్జీలు, మణుఁగుఁబూ, ♦ లక్కజ్జముల్ చేగోళ్ళు, శతపత్రముల్, ♦ బూర్ణచంద్రకలలు,
గోధూమపరిఖలు, ♦ గోక్షీర, మండక, దధి, ఘృతనవనీత ♦ తక్రములును,
లసికలు రుచికలున్ ♦ లడ్డులు బెడదలు, బటకముల్, గూపికల్ ♦ బర్పటములు
జక్రాభముల్ బాల ♦ చక్షుఖేరిణి, మధు, శీర్షికలును వర ♦ శిఖరిణులును
నాజ్యపూరంబులు ♦ నవిలపూరంబులు, జక్కిలంబులు, దివ్య ♦ శక్తికలును.

తే॥ హరిమద్రసమిశ్రితా ♦ హార ముద్భవిల్లఁ జేసి వారల కిడి ♦ ప్రీతిఁ గూర్చ
మరుఁడు విస్మయానందముల్ ♦ బరగ సబల, కలితుఁడై యామునికి మ్రొక్కి ♦ పలికెనిట్లు.

తే॥ దేవ! త్వద్దత్తభోజనం ♦ బీవిధమగు, లోటులేకుండ తృప్తి గ ♦ లుగ నొనర్చె
శ్రీరమేశ్వరభక్తులన్ ♦ శ్రేష్ఠుఁ డెవఁడొ, యెవ్వఁ డాహరి కిష్టుఁడో ♦ యెఱుఁగఁ జెపుమ!

ఆ॥ అనఁగఁ బరశురాముఁ ♦ డంగజ! నీకంటె, నెవరి కేదియైన ♦ నేమి తెలియు?
నిపుడు నీవు నన్ను ♦ బృచ్ఛించుటల్ లోక, సంగ్రహార్థమనినఁ ♦ జనెడి నైన.

సీ॥ ఎవ్వాఁడీ భువనంబుఁ ♦ దృణముగా భావించి, యఖిలభోగంబుల ♦ నవలఁద్రోయు
నెవ్వఁడు శ్రీహరి ♦ యితిహాసములనెల్ల, వినుటకు ననుటకు ♦ వేగిరపడు
నెవ్వాఁడు శ్రీరాధి ♦ కేశ్వరరూపాబ్ధి, మగ్నచిత్తుండయి ♦ మహినిఁదిరుగు
నెవ్వఁడు శ్రీగోకు ♦ లేశానపదపద్మ,ముల నలిలీలను ♦ వెలుఁగుచుండు
తే॥ నెవఁడు శాంతుఁడో దాంతుఁడో ♦ యెవఁడు సకల,భూతవత్సలుఁడో యెవ్వఁ ♦ డాతిథిత్వ
వాదయామయుఁడాగుణి ♦ యాసుహృత్తు, కృష్ణునకు ముఖ్యభక్తుఁడో ♦ కృష్ణపుత్ర!

కం॥ అలభక్తుఁడు నిజపదరజ,ముల భువనంబులను శుద్ధ ♦ ముగ సల్పి శుభం
బులఁగూర్చునటంచెఱుఁగుమ,! కలుములజవరాలిచూలి! ♦ కామా! భూమా!

ఉ॥ కోరక పారమేష్ఠ్యమును ♦ గోరక నిర్జరనాథధిష్ణ్యముం
గోరక భూతలప్రభుతఁ ♦ గోరక యోగిమునీంద్రసిద్ధులం
గోరక తిర్గి పుట్టుటయుఁ ♦ గోరుచు నా హరి పాదధూళి నే
సూరిసెలంగునో యతఁడె ♦ శుద్ధుఁడు శ్రీహరిభక్తుఁడో ప్రభూ! ౩౧౨

ఆ॥ ఎంతమంచికార్య ♦ మేని క్షణంబునఁ, దనువు ధనము మనము ♦ ధారవోసి
చేసి తత్ఫలంబు ♦ చిత్తంబునంగూడఁ, దలఁప రట్టి భక్తు ♦ లలఘుచరిత! ౩౧౩

ఉ॥ వారె తదంబుజాక్షునకుఁ ♦ బ్రాణసముల్ ప్రియు లన్యభూపతుల్
గారు సురర్షివర్యులును ♦ గారు బలుండును గాఁడు యోగులుం
గారు పురందరాదులును ♦ గారల శంకరపద్మయోనులుం
గారు రమాదిజాయలును ♦ గారని నీవెఱుగంగ నా విభూ! ౩౧౪

ఆ॥ భక్తవత్సలుండు ♦ వారిజాక్షుం డల, భక్తవరుల వెంటఁ ♦ బడి తిరుగుచుఁ
బూతులుగ నొసర్చి ♦ ముక్తి కొసంగును, గాని భక్తి నిడఁడు ♦ సూనబాణ!

మన్మథుఁ డంగవంగాదిదేశంబుల కరుగుట.

కం॥ అన విని మదనుండును నతిఁ, బొనరిచి యమ్మునికిఁ దూర్పు ♦ మొగమున గంగా
వననిధిసంగమమున కరి,గెను శ్రీబహులాశ్వ! విశ్వ ♦ గీతసుకీర్తీ! ౩౧౬.

ఉ॥ ధీరుఁడు మారుఁ డా రహిని ♦ దిగ్విజయోరుమిషన్ వసుంధరా
భారనివారణార్థమయి ♦ పర్యటనం బొనరింప నెంచి త
త్తీరమునుండి యంగవిభు ♦ దేశముఁ జేరి తదీయసత్కృతుల్
భూరిగఁ బొంది కప్పముల ♦ ముత్తముఁ గైకొని సత్వరంబుగన్. ౩౧౭

తే॥ ఆప్రదేశంబువిడి యుడ్డ ♦ యనెడి దేశ
మునకు ముఖ్యపట్టణమును ♦ ఘనమునైనఁ
డామరాహ్వయపురి కేగి ♦ ఢంకఁగొట్టి
బలుల నిమ్మన నా బృహ ♦ ద్బాహువందు. ౩౧౮

చ॥ దొరయగుటన్ మదాంధుఁడయి ♦ దూరపుయోజనలేక యిట్టి పో
కిరికిఁ గరంబు లిచ్చెదన? ♦ కీర్తికరంబొకొ? యిత్య సంచు ధి
క్కరణమొనర్ప మున్మరుఁడు ♦ గన్గొని జాంబవతీకుమారు హే
చ్చరికను జేయ నా బలుఁడు ♦ సాంబుఁ డవక్రపరాక్రమంబునన్. ౩౬౯

చ॥ ఇననిభమైన స్యందనము ♦ నెక్కి శిఖుల్గొని యద్వితీయుఁడై
ఘనము తుషారజాలముల ♦ గ్రావవరంబును గప్పుచొప్పునన్
జని యల డామరాహ్వయావి ♦ శాలపురంబును విండ్లతోడఁ గ
ప్పెను బిదపన్ దదీశ్వరుఁడు ♦ భీతిలి చేతులమోడ్చి యాదలన్. ౩౭౦

తే॥ బలుల నా మరునకు నిడి ♦ ప్రస్తుతించె, నప్పు డక్షౌహిణీయుతుఁ ♦ డైన వంగ
దేశనాథుండు బలశాలి ♦ తివిరి భావ,భవునితోఁ బోర నెదుటకు ♦ వచ్చెనవల.

మ॥ హరిపుత్రుండగు చంద్రభానుఁ డతిరం ♦ హస్ఫూర్తితోఁ బోయి యా
మరుఁడున్ జూచుచునుండ వానిబలముల్ ♦ ప్రమందించె దుర్భావలన్
వరమైత్రిన్ జెడగొట్టి నట్టు లపుడా ♦ పాదాతిహాస్తిధ్వజా
శ్వరథిస్యందనముల్ నశించె గుముదుల్ ♦ బాడౌనటుల్ పార్థివా! ౩౭౧

తే॥ పడినకరులశిరంబుల ♦ వఱలు మౌక్తికములఁ గదనరంగంబొప్పె ♦ గగనతలము
చుక్కలన్ వెల్గినట్టుల; ♦ శూరవర్యు, లరుసమొందంగ భీరువు ♦ లదలనెదల.

చ॥ అట నొక రక్తశైవలిని ♦ యయ్యెను భూతపిశాచభైరవో
త్కటమదవిప్రరాక్షసులు ♦ గన్గొని నెత్తురు ద్రాగి పుర్రెలన్
దటుకునఁ బొంది పేగులుగఁ ♦ దప్పక కూర్చి ధరించి దంతముల్
బటపట గీటుచున్ నగుచుఁ ♦ బాడుచు నాడుచుఁ గూడి రంతటన్. ౩౭౪

తే॥ తద్విభుఁడు వీరధన్వుఁడు ♦ తన చదలము, భగ్నమౌటనుగనుఁగొని ♦ వజ్రకల్ప
గదను దచ్చంద్రభానునిఁ ♦ గదిసికొట్టెఁ,గాని యతఁడు చలింపక ♦ కనలి మరల.

ఆ॥ గదను వీరధన్వు ♦ హృదయంబునం గొట్ట, నతఁడు జెట్టువోలె ♦ నవనిమీఁద
శోణితంబుఁ గ్రక్కు ♦ చున్ వడి మూర్ఛతోఁ, గూలి తిరుగ లేచి ♦ కొంతవడికి.

క॥ తెలివిని బలులను లలిఁగొని, కలుములచెలిబిడ్డ కిచ్చి ♦ కావించి జోహా
రులఁ దన నగరికి నరిగె న,వల నా ప్రద్యుమ్నుఁడాత్మ ♦ బలకలితుండై. ౩౭౭

ఆ॥ అచటనుండి వెడలి ♦ యమలజలాన్విత, బ్రహ్మపుత్రనదము ♦ వడిగ దాఁటి
యమితబలయుతుఁడగు ♦ నాశీమపతి బింబు,చెతి బలులఁబొంది ♦ ప్రీతిఁ జెంది.

ఆ॥ కదలి యందునుండి ♦ కామరూపముఁ జేరి. నింద్రజాలచతురుఁ ♦ డిద్ధబలుఁడు
పుండుఁడనెడినచటి ♦ భూపుఁడు గప్పముల్, గట్ట నొప్పకొనక ♦ కయ్యమాడ.

చ॥ తలఁచిచమూసమేతుఁడయి ♦ తత్స్మరుముంగల కేగి యుద్ధతిన్
దలపడె నంత యాదవులు ♦ దాఁకిరి బాణకృపాణశూలశ

క్షులను నఘోరఘోరణిని ♦ దూసిరి ద్రోసిరి వీర లాస వా
రల మఱివారు వీరిని సు ♦ రప్రకరంబులు జోద్యమొందఁగాఁ. ౩౩౦

వ॥ అప్పు డప్పాండుని యింద్రజాలప్రభావంబునం జేసి పిశితాశనులగు పిశాచంబులు గోట్లకొలంది బయలుదేరి రణాంగణంబునం దట్టుటులం జరించుచుఁ బాఱుచు నఱచుచు నంగారంబులం బలుమాఱులు రిపుసైన్యంబుల విసరుచుండిరి. వానివెంటనె సర్పంబు లనేకంబు లుద్భవిల్లి ముఖంబునుండి గరళంబును గ్రక్కుచు బుస్సలు గొట్టుచుఁ బగతుఱఁ గఱచుచు సంచరింపం గడంగె. వాని వెంబడి లలజ్జిహ్వులును, దంతవక్త్రులును భయంకరులును, నగురక్కసు లొక్కుమ్మడి ఖరారూఢులై నిర్గమించి మార్తుర హింసించుచుం బరిభ్రమించుచుండిరి. వారిననుసరించి యక్షులు గొందఱు సింహవదనంబులతోడను గొందఱు యక్షులు మాతంగ ముఖంబులతోడను శూలంబులం దాల్చి చెలరేగి ఛేదించుఁడు భేదించుఁడని చీటిమాటికి జల్పించుచుఁ దిరుగుచుండిరి. వారివరుసన గంధర్వులును బయలుదేరి పరిభ్రమించుచుండిరి. ఇత్తెఱంగునను విఘూర్ణితలం బత్తటిత్వంతంబులతోఁ గప్పంబడియె. సుడిగాలి వీవ నేలయు రజోవ్యాప్తంబై యంధకారబంధురంబయ్యె. ఇదియంతయు భోజవృష్ణ్యంధకమధుశూరసేనదశార్హజులగు యాదవులు విలోకించి కింకర్తవ్యతామూఢులై దిక్కులు సూచుచుండ నక్కందర్పుం డాలోకించి యాలోచించి శ్రీకృష్ణదత్తంబగు కార్ముకంబుఁగొని సత్వాత్మికయగు వైష్ణవీవిద్యఁ బ్రయోగించి యాయింద్రజాలంబును జెడఁగొట్టి వివిధంబులగు మహాబాణంబులతో నా పిశాచసర్పయక్షరక్షోగంధర్వాంధకారాభ్రంబులను మార్తాండుండు చండకిరణంబులతో ధారాధరంబులను యథాయథలు గావించినట్లు భేదించి రథవాహనాతపత్రధ్వజాదిసహితంబుగా నాప్పుండునిసైత మంబరంబున ఘటికాద్వయం బెత్తి నిలిపి త్రిప్పి త్రిమ్మటఁబెట్టి త్రోయం బవనంబునం బద్మంబు పడిన కైవడి వ్రాలి కొంతతడవున కుత్థితుండై భయపడుచు శరణుఁ గోరుచు ననేకోపాయనంబులను లక్షహయంబులను నయుతగజంబుల నొసంగి నమస్కరింప నామోదించిన దర్పకుండు సబలుండై యటనుండి కదలి విపాశానామకనదిని దాఁటి కైకయదేశ రాజధానియగు శోణనదపురంబున కరిగి తదధిపుండును, వసుదేవుని మఱియొక చెల్లెలగు శ్రుతకీర్తి యనుసతికిఁ బతియును, మహాత్ముండును నగు ధృతకేతువునిం గనుంగొన నతండు శ్రీకృష్ణప్రభావం బెఱింగిన వాఁడగుట నతని పుత్రుండగు నమ్మరుని సపరివారంబుగా గౌరవించి కరంబులిచ్చి కరంబులు ముకుళింప నప్పావ్విలుతుం డలరి యచట వీడ్కొని దుందుభులు మ్రోఁగించుచు. ౩౩౧

మన్మథుఁడు మిథిలాదేశంబున కేగుట.

తే॥ మీరు పరిపాలనముఁ జేయ ♦ మీయునదియు, స్థిరసుఖదమగు మైథిల ♦ దేశమునకు
నరిగి దవ్వులఁ దన్ముఖ్య ♦ పురవిచిత్ర, మెఱిఁగి యుద్ధవుతోడుత ♦ నిట్టులనియె. 33౩

తే॥ కనకకుంభంబులన్ వెల్గి ♦ గగనతలముఁ, జుంబనముఁజేయు మేడలన్ ♦ శోభఁజెంది
భోగవతివలె నొప్పు నీ ♦ పురమెవరిదొ, మంత్రిముఖ్య! వచింపుమా! ♦ మాకనంగ.

చ॥ వినుమని యాతఁ డిట్లనియె ♦ విజ్ఞ! యిదే మిథిలాపురంబు దీ
నిని ధృతినామకుండు దమి ♦ నిం బరిపాలనసేయుచుండు నీ
ఘనుఁడొ యుదారచిత్తుఁడు న ♦ ఖండయశస్వి మనస్వి జ్ఞాని ధ
ర్మనిరతుఁ డుత్తమోత్తముఁడు ♦ మానదుఁడంచు నెఱుంగుమో ప్రభూ! 33౪

క॥ అతని కొక సుతుఁడుండెడి, పీతాంబరభక్తవరుఁడు ♦ విజ్ఞాని ఘనుం
డాతతగుణవంతుఁడు వి,ఖ్యాతుఁడు బహులాశ్వుఁ డనఁగఁ ♦ గమలదళాక్షా!

క॥ హరి తనభక్తున కతనకి, దరిసెనము భవిష్యమందుఁ ♦ దప్పక యిడి యీ
పురి నాతని ధన్యునిగాఁ, గరముగఁ జేయంగలండు ♦ కైటభజిజ్జా! 33౫

ఉ॥ ఇప్పటి కచ్యుతుండు తన ♦ యిక్కను నీబహులాశ్వు నిట్టులే
యెప్పుడు భక్తిఁ దన్ను నుతి ♦ యించెడి శ్రీ శ్రుతదేవభూసురున్
దప్పక మెచ్చుచుం దలఁచి ♦ ధన్యులుగా నొనరింప సిద్ధుఁడౌ
నిప్పగిదిన్ మఱెవ్వరు ర ♦ మేశున కిష్టులు లేరు దేవరా! 33౬

ఉ॥ మాని ధృతిప్రభుండును ర ♦ మావిభుపైన్ దృఢభక్తితోడ స్వా
ధీనునిగా నొనర్చుకొన ♦ దేవవితానముగాని మానవుల్
గాని మఱెట్టివారలును ♦ గాని జయింపఁగఁ జాల రీ పురిన్
గానఁ ద్వదిష్టమార్గమునఁ ♦ గార్యము సల్పుము! దేవ! నావుకున్. 33౭

ఉ॥ తద్ధరిపుత్రకుం డెదను ♦ దద్దయు యోజనజేసి వర్ణియె
యుద్ధవునిన్ స్వశిష్యునిగ ♦ యుక్తవిధిన్ బొనరించి భక్తుఁడౌ
తద్ధృతినిం బరీక్షను య ♦ థావిధిగా నొనరింప నెంచి బ
ల్సిద్ధిఁజనం గడంగె మిథి ♦ లాపురికో బహులాశ్వభూవరా! 33౮

ఉ॥ అత్తఱిఁ జర్మశస్త్రధరు ♦ లై తిలకంబులఁ బుష్పమాలికల్
బెత్తములం ధరించి పుర ♦ వీరులు విష్ణుసహస్రనామముల్
జిత్తములందునన్ జపము ♦ జేయుచునుండుట బ్రహ్మచారియా
చిత్తభవుండు గన్గొని వి ♦ శేషముదంబును బొంది వెండియున్! 3౪౦

సీ॥ గేహగేహంబునం ♦ గృష్ణుని గానంబుఁ, జేయుచునుంట వీ ♦ క్షించెఁగాదె
దేహళీదేహళిన్ ♦ శ్రీహరినామముల్, జెక్కింపఁబడుట వీ ♦ క్షించెఁగాదె

కుడ్యకుడ్యంబునం ♦ గోవిందలీలలుఁ, జిత్రింపఁబడుట వీ ♦ క్షించెఁగాదె
జాలజాలంబునన్ ♦ జక్రిదశావతా,రాంచితచిత్ర మీ ♦ క్షించెఁగాదె
తే॥ వనవనంబునందుఁ దులసీ♦వనము కనుల,పండువగ నుంట వీక్షించి♦బయలుదేరి
క్రమముగా మిథిలాఖ్యపు♦రంబులోని,కరిగి చూచెడిఁగాదె మ♦హాత్మ! యిట్లు.

శా॥ గోపీచందనముద్రికాంచితులు వై♦ కుంఠాలయాసక్తులున్
బాపధ్వంసకు లూర్ధ్వపుండ్రధరులున్ ♦ వర్ణాశ్రమాచారధ
ర్మాపాయోన్మథనక్రియాచతురులున్ ♦ జ్యాదేవులౌ విప్రులన్
గోపాలాత్మభవుండు గాంచి తమిమ్రొ ♦ క్కుల్ జేసి యామీఁదటన్. ౩౪౨

చ॥ కుదుర గదోర్ధ్వముల్ నుదుటఁ ♦ గూర్మరఘూపాంబుజశంఖచక్రము
లదియ భుజంబులందు ముస ♦ లంబు హలంబును నందకంబునున్
హృదిఁదగ శీర్షమందు శర ♦ మెక్కఁగ నొప్పెడి గొప్పవారినిన్
సదయుల భక్తవర్యులను ♦ జక్కఁగఁ గాంచి యనంతరంబునన్. ౩౪౩

తే॥ ద్వాదశాఖ్యతిలకయుత♦భక్తవరుల, మాలికాజాలసముపేత ♦ మానవులను
భాగవతపురాణాదిశ్ర♦వణరతులను, నైతిహాసికశ్రేష్ఠులం♦బ్రీతిఁ గాంచి. ౩౪౪

సీ॥ బ్రాహ్మ్యంబుఁబాద్మంబు♦వైష్ణవశైవ మా,ర్కండేయలైంగముల్♦గారుడమును
నాగ్నేయమున్ భవి♦ష్యంబును బ్రహ్మవై, వర్తంబుస్కాందంబు♦భాగవతము
బ్రహ్మాండ మాత్స్యకౌ♦ర్మవరాహనారద, వామనములు దివ్య♦భారతమును
శ్రుతులను స్మృతులను♦సూత్రములన్ బరా,శరగర్గముఖసర్వ♦సంహితలను
తే॥ జదువువారిని వినువారి♦శాస్త్రవిదుల, గాయనీగాయకులఁగాంచి♦క్రమముగ నల
భూవరద్వారమును జేరి♦సావధాన,ముగ సభాస్థలంబున నొప్పు♦భూపుఁ గాంచె.

వ॥ అప్పుడు తత్సభాస్థలంబున వేదవ్యాసశుకాత్రివసిష్ఠబృహస్పతిగౌతమ ప్రముఖులగు సర్వమునులును నేనును ధర్మవిచారణంబులం గావించుచుండ నాధృతి ప్రభుండు శ్రద్ధాభక్తులతో బలదేవుని పాదుకలఁ బూజించుచు ముక్తికరంబగు శ్రీరామకృష్ణనామంబు జపించుచుండ నకస్మాత్తుగా నేతెంచిన శిష్యసహితుండును నాబ్రహ్మచారిని విలోకించి నమస్కరించి యెదుర్కొని పాద్యాదులం బూజించి ముకుళీకృతకరారవిందుండై తదగ్రభాగంబునందు నిలిచి. ౩౪౬

తే॥ స్వామి! నాజన్మమిప్పుడు♦సఫలమయ్యె, మందిరము నిర్మలంబయ్యె♦మాపితరులు
తుష్టిఁజెందిరి సురలు సం♦తుష్టిబొంది, రనఘులును సాధువులగు మీ♦యాగమమున

{ బ్రహ్మచారివేషంబున నున్న ప్రద్యుమ్నుండు ధృతిచేసిన సత్కారంబులకు మెచ్చి నిజరూపంబుతోఁ బ్రసన్నుండగుట. }

తే॥ అరయ మీకోటి పెద్దలీ♦యవని సంచ,రించుటలు గేస్తులకు ము♦క్తినిడుటకుఁగద
యని నుతింపఁగ బ్రహ్మచా♦ర్యగ్రణియును, సాదరమున నాజనకున♦కనియె నిట్లు.

ఉ॥ ధన్యుఁడ వీవు నీకులము ♦ ధన్యము నీ మిథిలాపురంబునున్
ధన్యము నీ ప్రజల్ సఖులు ♦ ధన్యులు ద్వత్కృతసత్క్రియాతతుల్
ధన్యముగాదె యేపురినిఁ ♦ దద్ధరిసత్కథ లిట్టులున్నవే
మాన్యచరిత్ర! యిట్టి ప్రజ ♦ మాకనులం గనలేదు మున్ననన్. 3౪౯

చ॥ జనకుఁడు వర్ణి కిట్లనియె ♦ సత్తమ! యీమిథిలాపురీప్రజా
కనకకళత్రమిత్రధన ♦ కార్యకలాపము లేవి నావి గా
వనియు సమస్తమున్ హరిమ ♦ యంబని యెంచుచు సర్వకార్యముల్
బొనరిచి తత్సమర్పణ మ ♦ మోఘముగా నొనరించెదర్ జుమీ. 3౫౦

చ॥ పలుకఁగ నట్లు తద్ధృతికి ♦ వర్ణి వచించె నిటుల్ ధరేశ! యా
వలమురిహొల్పు నీదయిన ♦ భక్తికిఁ దుష్టిని బొంది యైక్యమీఁ
గలఁడని చెప్ప విన్నధృతి ♦ కారణవర్జితభక్తి నాకుఁ గా
వలయునుగాని యైక్యము ల ♦ వంబు నవశ్యములేదు సద్వ్రతీ! 3౫౧

ఆ॥ అనఁగ బ్రహ్మచారి ♦ యాపతి కిట్లనె, హేతువర్జితమును ♦ ప్రీతికరము
నవసులక్షణయుత ♦ ము విమలమగు భక్తి,నిదు నతండునీకుఁ ♦ గృష్ణభక్త.

ఉ॥ మారుఁడు దిగ్జయార్థ మను ♦ మానము మాని స్వయంబుగాని బై
ల్దేరెనుగాని యిప్పటికి ♦ దేవరవారగు మీ సమీపముం
జేరఁడు కారణం బెదో వ ♦ చింపుమ! నాకిట సందియంబు దై
వారెడి జ్ఞానివర్య! హరి ♦ భక్తవరా! యన నాతఁ డిట్లనెన్. 3౫3

క॥ శాంతుఁడు భగవంతుఁడు సర్వాంతర్యామియుఁ బరేశుఁ ♦ డఖిలవిభుండున్
గంతుఁడుగద యెటు లేక నా, చెంతను లేకుండనుండుఁ ♦ జెప్పు? మనంగన్.

చ॥ వడుగిటులన్ వచించె నల ♦ పార్థివవర్యునకో మహాత్మ! మీ
నొడుగులు సూక్ష్మదృష్టిఁ గన ♦ నుత్యములౌ మఱి స్థూలదృష్టితో
నుడివిన నవ్వి వ్యర్థమని ♦ నూటికి నమ్ముమ! కానిచో నిటన్
వశి నల దానవాత్మజుని ♦ భాతి ననన్యజుఁ జూపు మిప్పుడే. 3౫౫

తే॥ అంత నాధృతిపతియును ♦ హర్షబాష్ప,భూషితేక్షణుండై నిజ ♦ బుద్ధియందు
శ్రీరమేశపదాబ్జముల్ ♦ జేర్చి యిటులఁ, బ్రార్థనముఁజేసి యిట్లనె ♦ భక్తితోడ.

ఉ॥ శ్రీ సుదతీమనోహరు వి ♦ శేషముగాఁ గొనియాడియుంటినే
దాసజనప్రియుండయిన ♦ తామరసాక్షుని దాస్య మెంతయున్
జేసితినేనిఁ దత్కథల ♦ చిత్రములన్ వినియుంటినేని నా
శ్రీసుమబాణుఁ డుద్భవము ♦ నెందుముగాత! మదగ్రమునన్. 3౫౬

తే॥ అటులఁ బల్కెడి కాలము♦నందు సభ్య,వరులు జూ... ♦ బార్థివుందు
గనుచునుండ స్వచ్ఛాత్రుఁడు♦గాంచఁ బంచ,శరుఁడు వర్ణియా ... ముఁ♦జయ్యనవిశి.

శా॥ రాజీవాయతపత్రనేత్రములతో ♦ రాజీవవక్త్రంబుతో
రాజత్పీతపటంబుతో నగవుతో ♦ రమ్యాభ్రవర్ణంబుతోఁ
దేజఃపుంజముతో సుదోర్యుగముతో ♦ దివ్యత్కిరీటంబుతో
భ్రాజిల్లెన్ జగదేకమోహనుఁ డనం ♦ బ్రద్యుమ్ననామంబునన్. ౩౫౯

క॥ జనకుం డంతట గనుఁగొని, యనఘు నతనిఁ జుట్టివచ్చి ♦ సాష్టాంగనతుల్
బొనరిచి బద్ధాంజలియై, వినయముతో నీవిధాన ♦ వేఁడెను ఱేఁడా! ౩౬౦

క॥ ఈదినమే సుదినంబని, మోదముతోఁ జెప్పఁగలను ♦ బుష్పశరున్ దా
మోదరసుతు నినుఁ గను ఫల, మీదీనునకున్ లభించెఁ ♦ గృతినైతినన్. ౩౬౧

ఉ॥ మెచ్చిన పచ్చవిల్తుఁ డను ♦ మేలు! బళీ! యని యిట్లనెన్ ధృతీ!
వచ్చితి నిష్ఠభక్తిగత ♦ భావపరీక్ష నొనర్ప నాకును
న్నచ్చెఁ ద్వదీయభక్తియు న ♦ నంతయశోదృఢతాయురర్థసం
పచ్చయు మిత్తుఁ దీన్ గొనుచుఁ ♦ బార్థివ! మత్సమరూపమొందుమా! ౩౬౨

క॥ పలుకఁగ నటు నీ పిత ధృతి, యలఘుతరసపర్యఁ జేసి ♦ యభివాదనముల్
సలుపగ యదువరుఁడగు పుష్పాయుధుం డట సాఁగి నిజశి ♦ బిరముల కరిగెన్.

ప్రద్యుమ్నుఁడు మగధదేశంబునకు జని
జరాసంధుతోఁ బోరి యోడించుట.

తే॥ అంతఁ బ్రద్యుమ్నుఁ డటనుండి ♦ యాత్మసైన్య
సహితుఁడై సాఁగి మగధరా ♦ జ్యంబు గెలువఁ
బురవరమగు గిరివ్రజ ♦ మునకు స్వీయ
సకలదుందుభుల్ మ్రోయఁగాఁ ♦ జనియె జనక! ౩౬౪

మ॥ చనఁగాఁ దన్మగధేశ్వరుండగు జరా ♦ సంధుండు కోపాంధుఁడై
యనె నిట్టుల్ మతిలేక యేవిధముగా ♦ నాయాదవుల్ నాస్థలం
బునకేతెంచిరొ? యెట్టి ధైర్యమున నన్ ♦ బోరం బ్రయత్నించిరో
కన "మొండుల్ బతికంబె దండులను" వా ♦ క్యంబే నిజంబయ్యెడిన్. ౩౬౫

చ॥ ఖలుఁడగు వీని తండ్రి మును ♦ గాఁడని నేవిని దాడిచేయఁగా
నులుకును జెందితన్మధుర ♦ నొక్కత్రుటిన్ విడి పాఱిపోయి యా
జలనిధి దాఁగె వెండియొక ♦ సారి ప్రవర్షణమందుఁ గృష్ణరా
ములను దహింప వారు మిముఁ ♦ బోవరె? చేరరె? ద్వారకాపురిన్. ౩౬౬

తే॥ ఇట్టి దేబెలు దిశల జ ♦ యింపనేఁడు, బయలుదేరుటె కాక నన్ ♦ భండనమున
గెల్చి బలులనుగైకొన ♦ నిల్చెఁ గహహా!, తులువ కవమానమానముల్ ♦ గలవె? యైన.

తే॥ పిదపసర్పంబునైనను ♦ బెద్దకఱ్ఱఁ, గొట్టవలెఁగాని విడరాదు ♦ దిట్టలంచుఁ
బలికెదరు గావునన్ నేను ♦ నలఁతులైన, యాదవులనెల్లఁ జావఁగా ♦ మోఁది మీఁద.

క॥ సులువుగ ద్వారకకేఁ జని, బలకృష్ణుల నుగ్రసేన ♦ పార్థివసంయు
క్తులుగాఁ గట్టియుఁ దెచ్చెద, నిలను నయాదవి నొనర్తు ♦ నిత్తఱి నంచున్.

క॥ కరిహరిరథిరథశస్త్రా,స్త్రరుచిరము భయంకరంబు ♦ జతురతరంబౌ
నిరువదిమూఁడక్షౌహిణు, లరుదుగఁ గొని భేరులు మొరయ ♦ యఁగ దండెత్తెన్.

క॥ అత్తఱి యాదవు లదిగని, తత్తఱిలుటఁ జూచి మరుఁడు ♦ దక్షిణ యను స
ర్వోత్తమశంఖం బొత్తెను, గత్తరలేదంచు నభయ ♦ కౌతుక మిడుచున్. ౩౭౧

క॥ అంతట జాంబవతీసుతుఁ, డంతకనిభుఁ డగుచుఁ గంతుఁ ♦ డాలోకింపన్
బంతమున దశాక్షౌహిణు, లంతికమున నుండఁబోరె ♦ నామాగధుతోన్. ౩౭౨

క॥ హరితో హరినిం గరితోఁ, గరినిన్ రథితోడ రథిని ♦ గంటునిగంటుం
బోరిఁబోరి మాగధయాదవు, లరరే! యని చూడ దొమ్ము ♦ లాడిరి మఱియున్.

వ॥ యాదవబలంబున నశ్వారూఢులై కొందఱును, గజారూఢులై కొందఱును జెలరేగి భల్లంబులతో నరాతివర్గంబును మర్దింపం గడంగిరి. కొందఱు తటిద్వర్ణసంకాశంబులగు శక్తులంగొని విసర నవి రిపుబలము రూపుమాపి ధారణిం జేరె. కొందఱు వీరు లార్చుచు నిల్చి పెల్చన నమిత్రరథాంగంబులంబట్టి నేలం గొట్టిరి. కొందఱు భిందిపాలంబులతోడను, గొందఱు ముద్గరంబులతోడను, గొందఱు కుంతంబులతోడను, గొందఱు కుఠారంబులతోడను గొందఱు పరిఘంబులతోడను, గొందఱు పట్టిసంబులతోడను గొందఱు తోమరంబులతోడను, గొందఱు గదలతోడను, గొందఱు నిస్త్రింశంబులతోడను గొందఱు బాణంబులతోడను, దన్మాగధసైన్యంబుల నుఱుమాడ గుఱ్ఱంబులపై గుఱ్ఱంబులును, మత్తేభంబులపై మత్తేభంబులును, వీరులపై వీరులును, గాళ్ళు దెగియు గరంబులు బోయియు శిరంబులు నఱకబడియు, నుదరంబులు బగిలియు, నాసికంబులు గోయంబడియు, గర్ణంబులు ఛేదింపంబడియు, గవచంబులు చించంబడియు, రక్తంబులు ప్రవాహంబులుగా ఖడ్గంబులు చ్యుతంబులుగా భూషణంబులు జెల్లాచెదరుగాఁ బుడమింబడి యవి విస్మయకరంబై భయంకరంబయ్యె. అంత విద్యాధరగంధర్వాంగన లారణరంగంబునకేతెంచి సదృశులగు వీరుల వరించి కొంపోవం దొడంగిరి. క్షత్రధర్మపరులై చలింపక వెనుక కడుగిడక నీతిని విడువక పోరినవీరులు మార్తాండమండలంబు భేదించుకొని పరమపదంబొందిరి. ఇట్లు సాంబుండు మొదలగు యాదవవీరులచేఁ దద్బలంబు హతంబగుట వీక్షించిన హతశేషులు శ్రీకృష్ణభక్తిం గని యమంగళంబులు పలుగిడినట్లు కాల్కొలందిని బాఱిరి. అట్లు నిజసైన్యంబు పలాయమానంబగుట జరాసంధుండు గాంచి ధనుష్టంకారంబులం గావించి సంబోధించి. ౩౭౪

చ॥ నిలునిలుఁ డీరలంద ఱిట ♦ నిల్వకపోయిన లాభమున్నదే?
సులువుగ నిల్లు పాఱుటలు ♦ శూరుల ధర్మమె? చెప్పఁడే నిటన్

మెలఁగితిఁగాదె యేది యిఁక ♦ మీకు నసాధ్యములేదు గావున
న్దలఁగకుఁడంచు నంకుశము ♦ నన్ గరి రేఁపిన యట్లు రేఁపుచున్. ౩౭౫

చ. బలగముతోడఁ గూడుకొని ♦ వైరులపైఁ దుముకంగ సాంబుఁడున్
గలయఁగవచ్చి తన్మగధ ♦ కాంతునిపై నిజచాపనిర్గతం
బులగు దశాశుగంబులను ♦ బూర్తిగవైచి దశాంబకంబులన్
జలధితరంగభీమరవ ♦ సంయుతకార్ముకమౌర్విఁ ద్రుంపఁగాన్. ౩౭౬

తే. తజ్జరాసంధుఁ డింకొక♦ధనువుఁ దాల్చి,దశశరంబులఁ దత్సాంబు♦ధనువుఁ ద్రుంచి
యొక్కటన్ సాది రెంటను♦టెక్కియంబు,రథము మూట నాల్గింట గు♦ఱ్ఱములఁగూల్చ

క. విరథుఁడు భిన్నశరుఁడు హత,తురగుఁడు హతసాది యగుచుఁ ♦ దొర సాంబుం డ
న్యరథం బెక్కుచు జాపముఁ, గరమునఁగొని టంకరించి ♦ గాసిల వైరుల్.

మ. శతబాణంబుల వాని తేరు నుసిగా ♦ సల్పన్ జరాసంధుఁడున్
ద్రుతరీతిం గజమెక్కి యింద్రునివలెన్ ♦ దోఁతెంచి కాలాభుఁడై
యతితీక్ష్ణాంకుశహేతితోఁ బొడిచి సాం ♦ బాంతార్థమై త్రోల శీ
త్కృతులన్ఁ బర్వుచు నడ్డులేక యల మ ♦ త్తేభేంద్ర మేతెంచియున్. ౩౭౯

క. సరథుని సాంబుని యాదవ, పరుఁగొని నవయోజనముల ♦ వైవఁగ నత్యు
ద్ధురకోలాహలముల్, జరిగెను దత్సాంబపృథుల ♦ సైన్యములందున్.

క. పదపడి మదనుఁదరిగల, గదుఁ డుదయాచలమునుండి ♦ గాఢాంధంబున్
బెదరంగొట్టుచు నేతెంచు దినమణివిధాన వచ్చి ♦ చుఱచుఱఁ గనుచున్. ౩౮౧

తే. వజ్రి పవి దరిభృద్గిరిన్ ♦ బాఁదినట్లు, లోకమ్ముష్టిని గొట్టఁగా ♦ నక్కరీంద్ర
మాకులంబొంది ధరఁబడి♦యంతమొందె,నది మహాద్భుతంబయ్యె న♦య్యాహవమున.

క. అట్టి జరాసంధుండున్, జట్టన ధరనుండి లేచి ♦ శౌర్యోద్ధురుఁడై
బెట్టిదపుంగద నాగదుఁ, గొట్టియు గర్జింప నతఁడు ♦ గొంకక కింకన్. ౩౮౩

తే. గదను లక్షభారాంచితన్ ♦గరమునఁగొని, తజ్జరాసంధుఁ బ్రహరించి♦దశదిశలును
బెదర సింహనాదంబు గా♦వించె దాన, నాబృహద్రథపుత్రుండు♦వ్యథితుఁడగుచు

చ. సగదు గదన్ గరంబున వె♦సన్ గొనుచున్ శతయోజనంబులన్
గగనమునం బడన్ విసరఁ♦గా నతఁ డుద్ధతిఁ దజ్జరాత్మజా
తుఁగొనుచు వెయ్యియామడలఁ ♦ ద్రోయ బృహద్రథపుత్రుఁ డాతఁ డా
గగనమునుండి వింధ్యమను ♦ గ్రావముపైఁబడి తిర్గి లేచియున్. ౩౮౫

క. హోరాహోరిగ గదుతోఁ, బోరఁగఁ జని సాంబుఁ డతనిఁ ♦ బూనుచుఁ జేతన్
ధారణిఁ ద్రిప్పియుఁ గొట్టెను, ధీరత హరి హరినిఁ గొట్టు ♦ తీరున ధీరా! ౩౮౬

తే. అవలఁ దజ్జరాసంధుఁడు♦దవిలి కసిని, నొక్కముష్టితో గదుని మ♦ఱొక్కముష్టి
సాంబునిం గొట్ట వారలు♦తొమ్మతలమున, మూర్ఛఁబడి రది గన్గొని♦పుష్పశరుఁడు.

ఆ। ఆగ్రహంబుతోడ ♦ నక్షౌహిణీయుక్తుఁ, డగుచుఁ బెద్దపెక్కి ♦ యమున వెలుఁగు
నరదమెక్కి యుభయ ♦ మాత్మీయులకుఁ దెల్పి, వానితోడఁ బోరఁ ♦ బూనుకొనఁగ.

చ। మగధధరేశుఁడో “మదన! ♦ మా సరివారని మీరు వత్తురే?
పొగ రడఁగించెద న్గనుఁడు! ♦ పోకిరి”! యం చొక లక్షమదుల న్
దగు గదగొం చరణ్యమున ♦ దావము సొచ్చినయట్లు వారిలో
నఁ గలిసి పత్తియోధరథ ♦ నాగహయంబులఁ జెండె వెండియు న్. ౩౮౯

తే। ఆజరాసంధసైన్యంబు ♦ లరుగుదెంచి
యదుబలంబు హతంబుగా ♦ నాచరింప
నిర్భయమునఁ బ్రద్యుమ్నుండు ♦ దుర్భరముగ
ధనువుఁ డంకృతుల్ సలిపి య ♦ ధాక్రమముగ. ౩౯౦

చ। శరముల వైరివర్గములఁ ♦ జంపెడికాలమునందు ద్వారకా
పురతిలకంబునుండి తమ ♦ ముఖ్యుల వ్రేళ్ళిడి యెల్లవార ల
చ్చెరువునఁ జూడ నా మురుని ♦ ముంగలఁ దద్బలరాముఁ డొప్పిచి
చ్చఱపిడుగట్లు మండిపడి ♦ సాహసమూర్తి యనంగ నుద్ధతి న్. ౩౯౧

ఉ। మాగధనాథసైన్యము న ♦ మాంతముగా స్వహలాయుధంబున న్
లాఁగి యయోగ్రహేతిఁగొని ♦ లాఁతుగ మర్దనముం బొనర్ప నా
మాగధయోధరథ్యరథ ♦ మత్తకరుల్ శతయోజనంబులం
దోగును జెంది కూలిపడ ♦ నొప్పె నరామరదుందుభిధ్వనుల్. ౩౯౨

తే। సురలు బలిపైన సుమవృష్టి ♦ గురిసిరంగ, జముఖయాదవుల్ మ్రొక్కిరి ♦ జయజయరవ
ములు సెలంగను ముసలియుఁ ♦ బోయె స్వీయ, పురికి నంత జరాత్మజ ♦ పుత్రుఁడైన.

తే। అమలమతి సహదేవుఁడ ♦ ర్వార్బుదమును, రెండులక్షలు గజములు ♦ దండిపైన
రథము లఱువదివేలను ♦ రతిపతికిడి, యొరిగలన్ జేసి నిజపురి ♦ కరిగె జనక!

వ। అవ్వల నవ్వలజేఁదు బలగంబులతోడఁ గూడుకొని గయాపురంబున కేగి ఫల్గునదిలో స్నానం బొనరించి తత్పరిసరంబులందుండు దేశంబులం గెలువం బ్రస్థానంబుగాఁ దత్రత్యులును రాజులందఱు జరాసంధపరాజయం బాలించి భీతిలి బలులం గైకొని యాతని కిడి శరణుం బొందిరి, ససైనికుండగు మదనుం డటనుండి వీడ్కొని గౌతమీసరయూపుణ్యతరంగిణీతటంబుల నాలోకించి భాగీరథీతీరమందలి కాశీపట్టణంబున కరుగఁ దద్భూపుండగు పార్ష్ణిగ్రాహుండు మృగయార్థంబై చనియుఁ జారులచే విని చనుదెంచి కరదంబు లామరునకర్పింప నతం డటనుండి సాఁగి కోసలదేశ విభానురాయోధ్యాపురి కనతిదూరంబుననుండు నందిగ్రామంబున నివసించి తత్పాలకుండగు నగ్నిజిత్తుచే హాటకరిరథధనాదులను బూజాపురస్సరంబుగా నందికొని యుత్తరేశుండగు దీపతమునిచేతను, నయపాల పాలకుండగు గజునిచేతను, విశాలేశుండగు

బర్హిణునిచేతను, హరిభక్తుండగు నైమిషాధిపునిచేతను గప్పంబులం గైకొని తీర్థరాజంబగు ప్రయాగక్షేత్రంబునకుం జని తత్ప్రభావంబెఱింగి త్రివేణిలో జలకం బాడి యిరువదివేలకరులను, దశలక్షతురంగంబులను, జతుర్లక్షరథాంగంబులను, దశార్బుదధేనువులను, స్వర్ణహారంబును, జాంబూనదాంబరంబులను దశభారసువర్ణంబును లక్షముక్తాఫలంబులను, లక్షనవరత్నములను, దశలక్షవస్త్రంబులను ద్విలక్షకాశ్మీరకంబళంబులను, ద్విలక్షనవకంబళంబులను వేదవేదాంగాదిపారంగతులగు భూసురుల కభివాదనపూర్వకంబుగా నిడి యుండఁ గరూషదేశశాసకుండగు పౌండ్రుం డనువాఁడు శ్రీకృష్ణశత్రుండైనను దప్పనిపనిగా నెంచి కప్పంబులం గొని తెచ్చి యప్ప్రద్యుమ్నున కిచ్చి నమస్కరింప నతం డందునుండి లేచి పాంచాలకన్యాకుబ్జాదిదేశంబులం జేరఁ దదధిపతులగు వారలందరు భయార్తులై కుందుచుండిరి. అందుం గొందఱు దుర్గంబులను దేశంబులను విడనాడి పాఱిపోయిరి. మఱికొందఱా కృష్ణనందనుని శరణుం గోరిరి. బిందుదేశాధీశుండగు దీర్ఘబాహువుమాత్రమాతనితోఁ సంధిఁజేసికొనందలంచి యతనికడకుం జని కృతాంజలియై. ౩౯౭

ఉ. మీరలు యాదవేశ్వరులు ♦ మేదురకీర్తులు నార్తరక్షకుల్
వీరులు దిగ్విజేతలును ♦ విజ్ఞులు శాంతులు దాంతు లుద్ధురో
దారులు నాదుభాగ్యమునఁ ♦ దద్దయుఁ జేరితి రిందుఁగాన నా
కోరికఁ దీర్పఁ వేఁడెదను ♦ గొంకక నాతమి నాలకింపుఁడీ! ౩౯౮

తే. సజలకాచపాత్రంబునఁ ♦ శరము వేయ, బిందువొకటియు నటనుండి ♦ చిందఁగూడ
దాశరం బందు నుండనౌ ♦ నద్దిపగుల, వలదు దానిలోఁ గరలాఘవ ♦ మమరవలె.

తే. ఇట్లొనర్చిన వానికే ♦ యేను నాదు, త్రిపురసుందరులైన పుత్రికలనిడెద
నారదుఁడు ధనుర్విద్యావి ♦ శారదులని, వినుతి మిమ్ములఁ జేయఁగ ♦ వింటి మునుపు.

ఆ. అనఁగ మదనుఁ డొప్పి ♦ యందఱ నాలోకింప, దీర్ఘవంశమొండు ♦ దెచ్చి నిలిపి.
లోనఁ ద్రాడుఁ జుట్టి ♦ దానిపై సోదక, కాచకుంభ మంటఁ ♦ గట్టి త్రాట. ౩౯౯

చ. ధనువు గ్రహించి టంకృతి య ♦ థావిధిఁ జేసి శరంబు నొక్కటిం
గొని కరలాఘవంబున న ♦ కుంఠితరీతిని వేయ నద్ది వే
చనుచు శిరంబు భిన్నముగ ♦ సల్పియుఁ బాత్రమునందుఁ జొచ్చి త
ద్ఘనమున ద్వాదశాత్ముని ప్ర ♦ కాశము వెల్గిన యట్టు లొప్పఁగన్. ౪౦౦

క. అదరక చెదరక పగులక, కదలక యొకబిందువేని ♦ కార్చని కడవన్
గదనస్థితవీరులు గని, మదులందునఁ జిత్రపడిరి ♦ మానవనాథా! ౪౦౧

క. మఱియొక బాణముచే నీ, వఱకుఁ బ్రయోగించినట్టి ♦ బాణముఁ గొని యా
మరుఁడు యథాస్థితిగా, వఱలెన్ దదనంతరమునఁ ♦ బౌరుషలీలన్. ౪౦౨

క॥ జాంబవతీపుత్రుండగు, సాంబుం డా గాజుకుండఁ ♦ జక్కఁగఁ గని పం
చాంబకముల వేసియుఁ జిత్రంబును గల్పించె మరుని♦రహిఁ దరువాతన్. ౪౦౩

తే॥ తమిని యుయుధానుఁ డుర్క వచ్చి ♦ ధనువుఁ దాల్చి
బాణ మొక్కటి వేయఁ ద ♦ త్పాత్రము పడి
భగ్న మయ్యె నయ్యది గని ♦ పరచమువులు
యాదవులు పకాపక నవ్వి ♦ యాడి రిట్లు. ౪౦౪

మ॥ అరరే! యేమి! మహానుభావుఁడవు చా ♦ పాచార్యవర్యుండవో!
భరతాఖ్యుండవొ! శంతనూద్భవుఁడవో! ♦ పార్థుండవో! ద్రోణివో!
పురవిధ్వంసివొ! కార్తవీర్యుఁడవొ! యా ♦ భూపుత్రికాభర్తవో!
ధరణీభర్తవొ! కాక నీవరయ నే ♦ తన్మాత్రవీరుండవే! ౪౦౫

వ॥ అంత షోడశకాచపాత్రంబు వేతెం డనిరుద్ధుండు గొనితెచ్చి యుద్దానిపై నుంచి దానిం దిగువంగాంచి యొక్క శరంబును హస్తలాఘవంబుతో వేయ నద్ది యొకబిందు వేనియు బడనివకుండునఁ దత్తలంబును భేదించుకొని లోన మెల్లనఁ దాటి ప్రకాశించి తత్పాత్రంబున నుపరిభాగంబున నైదుమూరలంతదూరమున నొండుపాషాణంబుందునట్లు ప్రేక్షకు లాశ్చర్యంబు బొందఁజేసి తిరిగి యుతనిం జేరె. వెండియు దీప్తిమంతుండను వాఁడేతెంచి ధనువుం బరిగ్రహించి యేకాంబకంబుం బ్రయోగింప నాబాణం బాతీరుననే యొకనీటిబొట్టేనియు రాలనీలేఁ దత్తలంబును భేదించి తదూర్ధ్వస్థితశిలను రాల్చి లోనం బ్రవేశించి ప్రకాశించి మరలి యేతెంచె తదుపరిఁ జంద్రభానుండు నరుగుదెంచి మిక్కిలి లాఘవంబుతో నొక్కయాశుగంబును వేసి తత్పాత్రంబు నూర్ధ్వముఖంబునుండి యధోముఖంబునకును నధోముఖంబునుండి యూర్ధ్వముఖంబునకును బలుమాఱులు మార్చిమార్చి యందునుండి యొక జలబిందువును జిందనీయక కారనీయక దానిని బగులనీయక మెల్లన నంచుఁ జొచ్చి మీఱుటం జూపఱు లాలోకించి విస్మయం బొంది బాగుబాగని కొనియాడిరి. ఏతద్విధంబుననే శ్రీకృష్ణపుత్రులగు ప్రద్యుమ్నుండు మొదలగు పదునెనుమండుగురు మహారథులును సోత్సాహంబుతోఁ దమతమ నేర్పులకొలందిఁ దత్కాచపాత్రంబుపై శరంబుల వైచుటఁ గాంచి తద్దీర్ఘబాహుండు సంతోషించి మహాబలులనియు ధనుర్విద్యావిశారదులనియు నిశ్చయించుకొని శంఖభేరీమృదంగాదిసకలవాద్యంబులు మ్రోఁగుచుండ సురలు విరులం గురియుచు నానావిధంబులం గొనియాడుచుండఁ దన కూఁతులఁ బదునెనుమండుగురిని నవ్వారల కిడి పరిణయంబొనరించి షష్టిసహస్రగజంబులును, హయార్బుదంబును, దశలక్షస్యందనంబులను, లక్షదాసీజనంబును జతుర్లక్షశిబికంబులను, బారితోషికంబుగా నొసంగ నా ప్రద్యుమ్నుం డామోదించి గ్రహించి. ౪౦౬.

క॥ నారీమణులగు వారల, ద్వారావతి కంపి దీర్ఘ ♦ బాహుపుత్రోద్ధా
భూరిగ నాలోచించియు, జేరెను మధావనీశు ♦ చెంతకు నంతన్. ౪౦౭

తే॥ సేనజిత్తను నాతఁడు ♦ కానుకలను, నట్టి ప్రద్యుమ్నునకు నిచ్చి ♦ యభినుతించె
నట్లు భద్రదేశాధిపుఁ ♦ డబ్జనాభ, భక్తుఁడా బృహత్సేనుఁడు ♦ బలులనొసఁగె.

తే॥ మారుఁ డంతట మాధుర ♦ శూరసేన, దేశముల కేగి వారిచే ♦ దివ్యపూజ
లందికొని వనయుతమధు ♦ రాహ్వయపురిఁ, జుట్టివచ్చి తత్రత్యులఁ ♦ జూచి మఱియు.

తే॥ గోపికాగోపకులఁ గాంచి ♦ గోకులేశు, నందరాజును నందోప ♦ నందుల వృష
భానులన్ యశోదాదేవి ♦ భక్తిమ్రొక్కి, నందరాజునకుం గాన్క ♦ లందనిచ్చి.

క॥ త్వరగతి నుత్సాహముతో, వఱలుచు నటనుండి సాఁగి ♦ భద్రాకరమౌ
కురుదేశంబుల కరిగెను, బరివారముతోడఁగూడి ♦ బాఁదుచు ఢంకల్. ౪౧౧

ప్రద్యుమ్నుండు కురుదేశంబులం గెల్చుట.

ఉ॥ తత్కురురాజధాని వసు ♦ ధాతిలకంబు ననేకచిత్రప
ణ్యోత్కరభోగ్యముల్ హయమ ♦ దోత్కటసాదిభటాదియుక్తముల్
సత్కులజప్రపాలితము ♦ సత్కవినుత్యము హస్తినాపురం
బుత్కటలక్షణంబులను ♦ నొప్పు సురేంద్రపురోత్తమం బనన్. ౪౧౨

ఉ॥ అప్పురిఁబైటఁ బుష్పశరుఁ ♦ డామడలిర్వదినిండ స్వీయమౌ
గొప్పబలంబులన్ నిలిపి ♦ కొంకక యోజనపంచకంబునం
జప్పరముల్ ఘటించి వరు ♦ సన్ బదియామడలందుఁ డెక్కెముల్
జొప్పడఁజేసి తద్బలుల ♦ సుష్ఠుగఁ గైకొన నెంచె నింతలోన్. ౪౧౩

క॥ అచ్చటి జనములు భయపడి, గ్రచ్చుఱఁ దలుపులను వేసి ♦ గడెలిడి యెటకో
విచ్చలవిడిగాఁ బాఱిరి, హెచ్చుగఁ గోలాహలంబు ♦ లెసఁగెను దేవా! ౪౧౪

క॥ అత్తఱి శౌర్యబలోపేతోత్తంసులు జక్రవర్తు ♦ లూర్జితవిత్తో
న్మత్తులు గౌరవు లదిగని, చిత్తములన్ మిగుల శంకఁ ♦ జేయుచునుండన్. ౪౧౫

క॥ బుద్ధిమదగ్రణి సద్గుణి, యుద్ధవుఁ డామీనకేత ♦ నోక్తుల విని య
త్యుద్ధురవేగముతోడుతఁ ♦ దద్ధస్తిపురేశుకడకుఁ ♦ దరలి కడంకన్. ౪౧౬

చ॥ శకునిసుయోధనాంగపతి ♦ సైంధవలక్ష్మణయజ్ఞకేతుబా
హ్లికగురుభీష్మమాద్రధర ♦ ణీశ్వరసంజయసోమదత్తధౌ
మ్యకృపకృపీసుతాదివృతుఁ ♦ డా ధృతరాష్ట్రునిఁ గాంచి మ్రొక్కియున్
ముకుళితహస్తుఁడై పలికె ♦ మోదకరంబగు నోలగంబునన్. ౪౧౭

తే॥ ఉగ్రసేనుఁడు రాజసూ ♦ యోత్తమంబు, సల్పఁదలఁచి జంబూద్వీప ♦ సంస్థితులగు
భూపతుల నందఱను గెల్వఁ ♦ బుష్పశరుని, బలయుతంబుగఁ బంపెనో ♦ పార్థివేంద్ర!

చ॥ పనుప నతండు వేగి శిశు ♦ పాలజరాసుతదంతవక్త్రసా
ల్వరవరాదులం గెలిచి ♦ వచ్చెను మీావరి కిప్డు గాన జా
గును విడి కౌరవుల్ బలులఁ ♦ గొంచల జేతను నిచ్చి వారు మీా
రును మఱిజుట్టముల్ గలిసి ♦ రూఢిఁ జెలంగుఁడు సర్వరీతులన్. ౪౧౯

తే॥ కానిచో మీాకువారును ♦ గలహమూనఁ, గలరటంచు వచించు మం ♦ చలమరుండు
నన్నుఁ బంపెను దద్విధి ♦ నన్ని చెప్పి, యుంటి నిది దూతపనిగద! ♦ యుర్వరేశ!

ఉ॥ కౌరవు లంతఁ గ్రుద్ధులయి ♦ కాలగతుల్ విపరీతముల్ గదా
భూరివనంబునన్ మృగవి ♦ భుల్ గని దూఱెడి భూరిమాయురున్
దీరున గొల్లలీదినము ♦ తెంపున మాపయి దూఁకుచుండిరే
యారా! యెునర్తురంట! నృపు ♦ లందఱ గెల్చియు రాజసూయమున్. ౪౨౧

ఉ॥ మాదరి నుండి పోషణ మ ♦ మందతఁ జెందినవారుగారొకో?
మా దయ రాజ్యపాలనము ♦ మన్ననలొందినవారు గారొకో?
మాదె గదా తదీయమగు ♦ మంచియుఁ జెడ్డయునెల్ల నెట్టులా
యాదవు లంద రిప్పినము ♦ నంతఁ గనిన్ మము బోరవచ్చిరో! ౪౨౨

తే॥ ఏము వారికిఁ జేసిన ♦ దెల్ల యిప్పుడు, పాముసకుఁ బాలుపోసెడి ♦ పగిది నయ్యె
మేలు మరచిన తుంటరుల్ ♦ మేర లేని, పాపములఁ జేయఁజాలరే? ♦ పాడి వీడి.

సీ॥ ఎఱుఁగఁడే? నృపులు ము ♦ య్యేడుమార్లొక్కొన, భార్గవున్ డీకొన్న ♦ బలుని భీష్ము
నెఱుఁగఁడే? జగముల ♦ సిద్ధచాపాచార్యుఁ, డను పేరు వడసిన ♦ యులఘు ద్రోణు
నెఱుఁగఁడే? గదతోడ ♦ నెవిరెడివారలఁ, దలకిట్టుయిన సుయో ♦ ధనుని ఘనుని
నెఱుఁగఁడే? శూరుఁడై ♦ పరుఁడయి శస్త్రాస్త్ర, ములఁగన్న కర్ణు న ♦ మోఘదాత

తే॥ మఱియు దుశ్శాసనాదుల ♦ మహితబలుల
నెఱుఁగఁడే? యుగ్రసేనుఁడ ♦ య్యారె! యెఱింగి
యిట్లొనర్చెను? బ్రమకంగ ♦ నిచ్చయున్న
మాపురిన్ విడిపొండని ♦ మంత్రి! చెపుము! ౪౨౪

క॥ అని చెప్పఁగ నుద్ధవుఁడున్, విని యచ్చట కదలి మరుని ♦ వే చేరి తను
త్తనికరము యథోచితముగ, వినిపింపఁగ మన్మథుండు ♦ భీమాభుండై. ౪౨౫

చ॥ కరమునఁబట్టి శార్ఙ్గము న ♦ ఖర్వమదోన్మదులైన కౌరవే
శ్వరులు దలంప నాకుఁ బ్రియ ♦ బంధువులైనను వాఁడితూపులన్
దఱిమెద రోగి నేమముల ♦ దైహికరోగము లాపినట్లు నా
రరరె! మదీయదోర్బలబ ♦ లాఢ్యతసంపద గుత్తెఱుంగరే? ౪౨౬

తే॥ కాని యాదవులార! నిశ్చయముగ మీారు, తల్లికిం దండ్రికిం బుట్టి ♦ తిప్పునిమెన
గౌరవులచేతఁ గష్టముల్ ♦ గైకొనఁగల, రంచు నెంచెద ముమ్మాటి ♦ కనియె జనక!

యాదవ కౌరవ యుద్ధవర్ణనము.

తే॥ అంత సంజాతకోపులై యాదవులును, సకలశస్త్రాస్త్రములఁ దాల్చి సత్వరగతి
హాస్తినాపురిఁ జొచ్చిరా యవసరమునఁ, గౌరవులు రోషమూర్తులై క్షణములోన.

వ॥ రత్నకంబళవిజయధ్వజసువర్ణశృంఖలావిభాసురషష్టిసహస్రగజంబులతోడను, ప్రలయాంబోధిమహావర్తసంఘర్షరవానుకారిసుందుభిప్రయుక్తమాతంగంబులతోడను, లోహకంచుకాంచితులగు మల్లులతోడను, రణోపలబ్ధకీర్తులును, నుష్ణీషభూషాభూషితులును, గజారూఢులు నగు ద్విలక్షవీరవరులతోడను, సింహధ్వజవిరాజమానంబులును, విమానసమానంబులు నగు రథంబులతోడను, చిత్రవిచిత్రవర్ణవిభూషణాంబరకవచశిరస్త్రాణాంగుళిత్రాణాదులం దాల్చి యంగవంగసింధుదేశసంజనితంబులగు హయంబుల నెక్కిన పెక్కుపోటరులతోడను, యాదవులతోఁ బోరఁ బ్రద్యుమ్నుని సముఖంబున కేతెంచిరి. ఇంద్రప్రస్థపురినుండి కౌరవసహాయార్థంబుగాఁ బాండవప్రేషితంబగు పృతనాపరిమితసైన్యం బేతెంచె. ఇట్లు కౌరవబలంబంతయుఁ బదాఱక్షౌహిణులపఱకు నటఁ జేరినదని యెఱుంగుము. అత్తఱిఁ బంచాననేంద్రపతాకాంచితంబును, శుక్లతురగవిరాజితంబు వజ్రదండమండితవ్యజనచామరచారుతరంబును, జతుర్యోజనపరిమితంబును, జంద్రమండలసంకాశంబునగు ఛత్రంబుతోఁగూడిన యరదంబును, దుర్యోధనుం డెక్కి బాహ్లీకసోమదత్తశకునిశల్యకర్ణవికర్ణలక్ష్మణగురుకృపాశ్వత్థామభీష్మయజ్ఞకేతుధౌమ్యదుశ్శాసనాదివీరుల నడుమ మరుద్గణమధ్యమంబున మఘవంతుండుబోలె వెలింగిన నొప్పి భేరీమృదంగపటహానకదుందుభిధ్వనులు మ్రోయుచుండ వందిమాగధులు గౌరవగౌరవంబు గానం బొనర్చుచుండ నా ప్రద్యుమ్నబలంబులతోఁ దలపడె. అత్తఱిణంబున నుభయబలంబులు జెలరేగి దొమ్మియుద్ధం బాచరింప, ౪౨౯

చ॥ పుడమి వడంకె ధూళి దివిఁ బూర్తిగఁ గప్పె నినుండు రిక్కలై
పడెదగ దిగ్గజాలఱచె వార్ధులు మ్రోఁగెను గ్రమ్మెఁ జీకటుల్
బడిరి భయంబు దేవతలు పన్నగనేత చలించెఁ గొంచె మె
క్కుడుమెకముల్ ధరఁబడియెఁ గూలె హయంబులు రాలెఁ జుక్కముల్.

క॥ భటులును గడఁబట్టుచు మఱిఁ, గటకటపడసాగి రపుడు కౌరవయదుసే
నాభటులును గని కటకటబడి, పటులాస్త్రాదుల ధరించి శమనసములునై. ౪౩౧

వ॥ ధన్వివరుండగు ప్రద్యుమ్నుండు దుర్యోధనునితోడను, ననిరుద్ధుండు భీష్మునితోడను, ధీమంతుండు కృపునితోడను, భానుండు ద్రోణునితోడను, సాంబుండు బాహ్లీకునితోడను, బృహద్భానుండు శల్యునితోడను, చిత్రభానుండు సోమదత్తునితోడను వృకుం డశ్వత్థామతోడను, నరుణుండు ధౌమ్యునితోడను, పుష్కరుండు లక్ష్మణునితోడను, వేదబాహువు శకునితోడను, శ్రుతదేవుండు దుశ్శాసనునితోడను

సునందుండు సంజయునితోడను, గదుండు విదురునితోడను, కృతవర్మ భూరిశ్రవుని తోడను, నక్రూరుండు యజ్ఞకేతువుతోడను, సింహంబులు సింహంబులతోఁ బోరాడి నట్లు బాణకృపాణకుంతపట్టిసగదాముసలముద్గరశక్తిచక్రశతఘ్నిభిండిపాలభుశుండీ కుఠారంబులతో నాయోధనం బొనర్చిరి. తత్సమయంబున శ్రీవత్సాంకివత్సుండు దుర్యోధనబలంబు మహత్తరంబుగానుండుట విలోకించి వరాహంబు గోళులఁ బ్రబల యార్ణవంబు క్షోభింపం జేసినట్లు బాణసంఘాతంబునం ఘాతపఱిచె. తద్ధతులఁగరికుం భంబులనుండి ముత్యంబులు రాలి రాత్రియందుఁ దారాగణం బంబరంబునఁ బ్రకా శమానంబైన ట్లాకదనరంగంబున విరాజమానంబయ్యె. రథంబులు జూర్ణంబులయ్యె. రథులు మొదలగు వారు బుడమిం బడిరి ఇట్లగుట దుర్యోధనుం డాలోకించి యమర్షోత్కర్ష మనస్విఁడై. ౪౩౧

ఆ॥ విల్లుఁ డంకరించి ♦ వేమాఱుఁ బ్రద్యుమ్నుఁ, బదిశరములఁ గొట్టఁ ♦ బిదప నతఁడు
వానిఁ ద్రుంపఁ గూర ♦ వజ్రప్రభు వతని క,వచమును దశశిఖుల ♦ వైచి చించి.

తే॥ శరసహస్రము వేసి య ♦ శ్వములవేయి, నఱికి బాణశతంబున ♦ విఱిచెఁ జాప
మవల మదనుఁ డుద్దవిడి వే ♦ యరద మెక్కి, కృష్ణదత్తకోదండముఁ ♦ గేలఁ దాల్చి.

శా॥ ఆకర్ణంబును లాఁగి టంకృతుల ♦ బహ్వావృత్తులఁ జల్పి ది
వ్యైకాజిహ్మగ మేయ నద్ది ధృతరా ♦ ష్ట్రాత్మోద్భవస్యందనం
బాకాశంబునఁ ద్రిప్పి రెండుగడియల్ ♦ హాహా! యనన్ గుజ్జుబ
ల్లోకల్ గిండిగిరాటువేసినటు లీ ♦ క్షోణిన్ బడంద్రోసినన్. ౪౩౪

తే॥ ఆయరదము తుత్తునియలై ♦ పోయెఁ దురగ,ములును సూతులుబంచత ♦ బొందిరవలఁ
గౌరవేశుఁడు మఱియొక ♦ తేరు నెక్కి, పదిశరంబులఁ బ్రద్యుమ్నుఁ ♦ బాఁదె మిగుల.

తే॥ దానమాలాహతంబగు ♦ దంతిఁబోలెఁ, దనరుమదనుని హాదిదత్త ♦ ధనువునుండి
యంబకం బొండు సనుదెంచి ♦ యలసుయోధ,ను రథమునుగొని నింగికి ♦ నరుగులోన.

క॥ రెండవబాణము చని యు,ద్దండముగన్ బట్టి యారథంబును మింటన్
మెండుగ దిరుగఁగ మాఁడవ, చండతరాశుగవరంబుఁ ♦ జని యద్దానిన్. ౪౩౭

చ॥ గొని పెనుగాలి తామరస ♦ కోశము వ్రాల్చినమాడ్కి నాసుయో
ధనసదనంబునం దెలుఁగు ♦ తద్ధృతరాష్ట్రి సమీపమందునన్
దనరఁగఁగూల్చి తిర్గి యల ♦ దర్పకు ప్రోలకు వచ్చె నట్టి పా
తనమునఁ దేరు గోల్పడియెఁ ♦ దత్పతి గ్రక్కునఁ జస్పృహన్ మూర్ఛిలెన్. ౪౩౮

తే॥ అట్లుపడిన దుర్యోధను ♦ నందఱుఁగని, యబ్రమొందిరి దిక్కేది ♦ యంచు నాఁడి
రప్పుడు భార్గవు నెదిరించి ♦ యధికుఁడంచు, సన్నుతింగాంచి మించిన ♦ శాంతనవుఁడు.

ఉ॥ వాఁడిధనుస్సుఁ గైకొని ద ♦ వంబుదహింపఁ జెడి వీతిహోత్రునిఁ
బోఁడిమి నొప్పి టంకృతుల ♦ బోరున సల్పి ప్రవృద్ధుఁడయ్యె నా

షోడశవర్గముల్ గలుగు ♦ చూలివలెన్ జెలరేగి సూడులన్
బూడిదఁజేయఁ జెక్కు శర ♦ ముల్విసరెన్ మిథిలాధరేశ్వరా! ౪౪౧

క॥ అత్తఱి ననిరుద్ధుని మొనఁ, బత్తులు రథిసాదితురగ ♦ భద్రేభతతుల్
నెత్తురుఁ గ్రక్కుచుఁ గొన్నియు, నత్తమిలెన్ గొన్ని తెగియు ♦ నంతంబొందెన్.

తే॥ మఱియుఁ గొండఱు యోధులు ♦ మకుటకవచ, కటకహారాదిభూషలఁ ♦ గలిగి కూల
సమరరంగంబు హాతతను ♦ సమితితోడ, జెలఁగు నట్టియరణ్యంబు ♦ వలె వెలింగె.

చ॥ అరదములెల్ల యంగములు ♦ హస్తులు గుబ్బలు విండ్లు దంతముల్
శరములు కేశజాలము ధ్వ ♦ జంబులు గోకలు గాఁగ మారి యా
కరణి జనించి మించె ననఁ ♦ గన్పడెఁ దత్స్థలి వెండి రక్తని
ర్ఝరిణియుఁ బాఱె వైతరణి ♦ చందమునన్ బహుభీకరంబుగాన్. ౪౪౪

తే॥ భూతభేతాళకూష్మాండ ♦ ముఖపిశాచ, సమితి సనుదెంచి భైరవ ♦ స్వనమొనర్చి
గిరిశమాలార్థముగ వీర ♦ శిరములఁ గొని, చనియె ననిరుద్ధుఁ డాస్థితిం ♦ గనుచుఁ గనలి.

తే॥ అతిశయధ్వజయుతరథ ♦ మందుఁ నెక్కి, డాసి గాంగేయు నొకశిఖ ♦ వేసి యతనిఁ
గత్తెఱను గొల్పు చాపంబు నుత్తరించె, గరుడి ముక్కునఁ బన్నగిన్ ♦ గొఱికినటుల.

క॥ అంతట శాంతనవుండు కృ, తాంతసభుండగుచు నన్య ♦ ధనువును గొని య
త్యంతముగఁ డంకరించుచు, బంతంబును బూనివేసె ♦ బ్రహ్మాస్త్రంబున్. ౪౪౭

క॥ అప్పుడు తత్కార్ష్ణి యుదగ్రన్, జప్పునఁ దద్దీప్తిఁ గాంచి ♦ స్వబలముఁ బ్రోవన్
గొప్పది బ్రహ్మాస్త్రముఁ గొని, యప్పా! యనఁ బ్రేతుకాళి ♦ యనుసంధింపన్

క॥ రెండును బ్రహ్మాస్త్రంబులు, మండుచుఁ దద్ద్వాదశార్య ♦ మసమానముగా
దండిగఁ బోరాడియు బ్రహ్మాండంబులఁ దగులఁబెట్ట ♦ నారంభింపన్. ౪౪౯

క॥ అనిరుద్ధుండున్ గనుఁగొని, వెనుకకు మరలించి వాని ♦ భీష్ముని చాపం
బును శరములఁ ద్రుంచెను రవి, ఘనరశ్ముల హిమముఁ జెండు ♦ కరణిన్ బిదపన్.

మ॥ కురువృద్ధుం డనిరుద్ధపద్ధతులకుం ♦ గోపించి లక్షించి ము
ద్గరమున్ దిట్టము లక్షభారయుతమున్ ♦ గైకొంచు నవ్వానిపై
బఱపన్ దద్బలి వామహస్తమున స ♦ ర్పశ్రేష్ఠమున్ బట్టు తా
ర్క్ష్యరహిన్ బట్టి గదన్ దదీయహృదిపైఁ ♦ గొట్టెన్ విదేహాధిపా! ౪౫౧

క॥ ఆదెబ్బకు గాంగేయుం, డాదిత్యుఁడు దివమునుండి ♦ హాహా! యనఁగన్.
మేదినియందునఁ గూలిన, మాదిరి మూర్ఛిల్లె యుద్ధ ♦ మండలమందున్. ౪౫౨

క॥ అదిగన్న కృపాచార్యుఁ డుషా, హృదయేశునిపైని శక్తి ♦ నేయఁగ నసితో
గొదకొని ధీమంతుం డ, య్యాదిసెడెను గూర్తిఁ జెలిమి ♦ హారియించినటుల్.

తే॥ పర్వతాస్త్రంబు ద్రోణుండు ♦ భానునిపయి
వైవ నందుసుండియుఁ జెక్కు ♦ పర్వతములు

బయలుదేరి ద్విడ్బలములఁ ♦ బాడుజేయ
గడఁగ నపుడు హాహాకృతు ♦ లెలిగె నవల. ౪౫౪

ఉ॥ భానుఁడు మారుతాస్త్రమును ♦ వైచి తదభ్రములఁ ద్రోలె బాహ్లికుం
డానిముసంబునందు నన ♦ లాస్త్రము వేసెను దాన సాంబసే
నానికరంబు లగ్నుల వ ♦ నంబులు గాలినమాడ్కిఁ గాఁగా
శ్రీనిధియైన సాంబుఁడును ♦ దేఁకువతో ధను వెక్కుపెట్టుచున్. ౪౫౫

క॥ పార్జన్యంబేయఁగ నది, భర్జించెను బావకాస్త్ర ♦ బాధను విద్యున్
దుర్జయమైన యహంకృతి, సర్జించినకైవడి ధర ♦ శ్రీరమణేంద్రా! ౪౫౬

తే॥ అవల మధువుతోఁ బోరాడు ♦ నట్టికర్ణుఁ, డతనిఁ విడి బాణవింశతి ♦ నల్లనాఁటుఁ
గొట్ట సరథుఁడై నాతఁడు ♦ గోసుదాఁకఁ, గిరిగి ఘటికాద్వయంబు చి ♦ వరకుఁ గూలి.

ఉ॥ కొంచెము సేపు చింతపడి ♦ కోపముతో విడి తేరు వేగరన్
గొంచరుదెంచి కర్ణుఁ గడు ♦ గొట్టి ధరన్ గడఁబట్టఁ జేసి ప్రమోఁ
గించి ధనుస్సు ద్రిగ్గి రథ ♦ మెక్కుచు సూలుని బాణవింశతిన్
నొంచియు సోమదత్తుఁ గని ♦ నొంచెను బంచశతాంబకంబులన్. ౪౫౭

రామకృష్ణులు వచ్చి యాదవ కౌరవులకు సఖ్యంబు గూర్చుట.

వ॥ వెండియుఁ దత్సాంబుండు దశాశుగంబుల నశ్వత్థామను షోడశమార్గణంబుల ధౌమ్యుని దశపృషత్కంబుల లక్ష్మణుని పంచఖగంబుల శకునిని వింశతిసాయకంబుల దుశ్శాసనుని వింశతిశరంబుల సంజయుని శతబాణంబుల భూరిశ్రవుని శతకలంబంబుల యజ్ఞకేతువును హింసించి ఘనంబు విధంబునం గర్జించి పదిపదిబాణంబులతో సారథులను, నొక్కొక్కసాయకంబుతో గజంబులను హయంబులను నైదైదు రోపంబులతో వీరులను మాపునాపుట స్వపరసైనికులాలోకించి విస్మయంబుఁ బొందెడిసమయంబున భీష్ముండు దత్తిత్తుండై యేతెంచి యుత్తమంబగు చాపంబు ధరించి దశాంబకంబులతో సాంబకోదండంబు ఖండనంబు గావించె, మఱియు వీరావేశపరవశులై కుంభసంభవగాంగేయరాధేయులును దశాక్షౌహిణీసమేతదుర్యోధనుండు నేగుదెంచి పెక్కుసాయకంబుల వైచి యాదవబలంబును నతివిచిత్రంబుగా హతంబు గావించెడి సమయంబునం బరమేశ్వరులును, దాలగరుడధ్వజవిరాజమానులును నగు శ్రీరామకృష్ణులు త్రింశత్కోటిదేవసహితంబుగా జయజయధ్వను లొప్పుచుండ భేరీమృదంగాదులు మొరయుచుండ సురగంధర్వాద్యంగనలు గీర్తించి లాజపుష్పాక్షతలం జల్లుచుండ నారణాంగణంబునన్ వెలుంగఁదొడంగిరి. తదవసరంబున యాదవులు నమస్కరించినమీఁద దుర్యోధనాది కౌరవులును దమతమశస్త్రాస్త్రంబు లొక మూలఁ బెట్టి నమస్కరించి బలుల సమ

ర్పించి కృతాంజలులై ప్రసన్నంబుగా నుండుట నా యదూత్తము లిరువురును వీక్షించి మదోద్ధతులును, స్వకుమారులునగు ప్రద్యుమ్నాదులను వాగ్బాణంబులతోఁ దర్జించి నిర్జరాపగాత్మజాదికురువృద్ధులకుఁ బ్రణమిల్లి యా సుయోధనున కిట్లనిరి.

ఉ॥ బాగుగ లేదు మా మదికి ♦ భండనమిట్లు లొనర్చుటల్ మహా
భాగ! తలంపఁగా మనము ♦ బాంధవముఖ్యులమే గదా! యిఁకన్
జోగులు వీరు మా సుతులు ♦ సూడక మంచియుఁ జెడ్డ గర్వులై
యీగతిఁ బోరినందుకు ♦ మీరు క్షమింపుఁడు! నిర్మలాత్ములై. ౪౬౦

తే॥ ఒక్క కంచమునం దెప్డు ♦ డోగిరంబు
గుడిచి యొక్కప్రక్కను బండు ♦ కొనెడి మనము
పూర్వమిట్లు పోరితిమొకో? ♦ భూవరేణ్య!
పరువమూడిన మా వారిఁ ♦ గరుణఁ గనుమ! ౪౬౧

ఉ॥ నావుడు కౌరవేశ్వరుఁడు ♦ నమ్రతఁ బూజలఁ జేయఁ వార లా
భూవరు బుజ్జగించి యమ ♦ పుత్రముఖాదులఁ బాండవేయులన్
ధీవరులం గనం దలఁచి ♦ ధీరులు తమ్ములు ధార్తరాష్ట్రులున్
గ్రేవల నొప్పుచున్ నడువఁ ♦ బ్రేముడిఁ బోవఁగడంగి రింతలోన్ ౪౬౨

క॥ ఇంద్రప్రస్థము నుండి నరేంద్రుఁడు తద్ధర్మపుత్రుఁ ♦ డిష్టముఖముగా
నింద్రావరజబలాగమ, సాంద్రోదంతంబు వినుచుఁ ♦ జని బహుభక్తిన్. ౪౬౩

ఉ॥ తమ్ములతోడఁ గూడి వసు ♦ ధావిబుధుల్ బఠియింపఁగాఁ ద్రివే
దమ్ముల శంఖదుందుభులు ♦ దద్దయు మ్రోయుచునుండఁ బౌరజా
తమ్ములు పుష్పముల్ గురియఁ ♦ దద్బలకృష్ణుల స్వీయహర్మ్యరా
జమ్మునఁ జొచ్చి కౌఁగిలిడి ♦ సంతసమందెఁ మునీంద్ర కైవడిన్. ౪౬౪

ఉ॥ అంతట మన్మథప్రముఖ ♦ యాదవు లట్టి యజాతవైరి క
త్యంతము మ్రొక్కి దీవెనల ♦ నందిరి తత్పరమంబునన్ రమా
కాంతుఁడు ధర్మ భీమునిని ♦ గవ్వడిపిన్ గవలన్ స్వయంబుగాఁ
జెంతకుఁ జేరి కౌఁగిలిడి ♦ క్షేమము నడ్గె మహాదరంబుగాన్. ౪౬౫

చ॥ అటుతరువాత ధర్మసుతుఁ ♦ డాఘనమూర్తుల కర్చఁ జేసెఁ బి
మ్మట నల రామకృష్ణులును ♦ మారముఖాదుల కెల్ల దేశముల్
ద్రటిఁ జని గెల్చి వచ్చుటకుఁ ♦ దోడ్త ననుజ్ఞ యొసంగి విక్రమో
త్కటులగు తమ్ములన్ దగిన ♦ ధర్మజుతోఁ జని రాత్మధామమున్. ౪౬౬

తే॥ అనఁగ బహులాశ్వుఁ డిట్లనె ♦ నమరమునికిఁ
గృష్ణుఁ డట్లరిగిన మీఁదఁ ♦ గృష్ణపుత్రుఁ

డేమిచేసెనో చెప్పుడీ! కృష్ణగాథ
పాపహరము సర్వేప్సిత ప్రదమనంగ. ౪౬౭

తే॥ అవధరింపుము హరిదాస! యంచు నిట్టు, లనియె ధర్మజుం డట్టుల హరినిఁ గలిసి
చనెడితఱిఁ నిజానుజుని విజయునిఁ దనకుఁ, బాసటగఁ బంపఁ దోడ్కొని పంచశరుఁడు.

ప్రద్యుమ్నుండు త్రిగర్తాది దేశంబుల జయించుట.

ఉ॥ అచ్చటనుండి యాదవబ లాన్వితుఁ డేచుఁ ద్రిగర్తదేశముం
జొచ్చి సుశర్ముఁ డత్ప్రభుఁడు జూచి గ్రహించి బలుల్ విరాటుచే
హెచ్చుగఁ బొంది పూజల నహీనసఘురీవిలసత్సరస్వతీ
మెచ్చి మునింగి దానము లమేయముగా నిడి సాఁగ యచ్చటన్. ౪౬౯

తే॥ విమలమగు కురుక్షేత్రముం బిందుసార
మును "బృథూదక, త్రితకూప" ముల సుదర్శ
నమును గాంచి సారస్వత నాథుఁడగు కు
శాంబుఁ డియ్యమి బలులను సాహసమున. ౪౭౦

వ॥ చారుదేష్ణ, సుదేష్ణ, చారుదేహ, చారుగుప్త, చారుచంద్ర, చారు, సుచారు, విచారు, భద్రచారునామక రుక్మిణీనందనులతోఁ దత్కౌశాంబీనగరంబును ముట్టడించె. అత్తఱి నా రుక్మిణీపుత్రులు పదుగురును సైంధవారూఢులై సకలశస్త్రాస్త్రంబులం దాల్చి యా రిపుబలంబులతోఁ బోరాడి కరితురగరథిరథపతాకాదులను ఖండించి తత్పురంబును వానరులు లంకాపట్టణంబును ధ్వంసంబొనరించినట్లు నాశంబును సల్ప నా భూపతి వెఱచి పారితోషికంబులం గైకొని తెచ్చి యప్పచ్చవిల్తున కిచ్చి నమస్కరించి యాత్మదేశంబును రక్షించుకొనియె. అంత నా కార్ష్ణి దుర్యోధనాజ్ఞావశులగు సాపి, రాభీర, కాశ్మీర, సింధు, జాంగల, లక్షు గాంధార దేశాధీశులగు సుదేవ, విచిత్ర, మహారాజ, శ్చిత్రాంగద, సుమేరు, ధర్మపతి, బిడౌజులచే నుగ్రమంబుగా నుపాయనంబు లందికొని సేనాసహితంబుగా నటనుండి దలి,

తే॥ అర్బుదమ్లేచ్ఛదేశము లతిరయమున, గెలువఁ గల్కిమాదిరి నేగె నల యనవధ
రేశ్వరుఁడు కాలపుత్రుకుఁ డిద్ధబలుఁడు, నైన చందుఁడు వని కృష్ణసూనురాక.

ఉ॥ వచ్చెనొకో మదీయపితఁ బాఱి నశింపఁగఁ జేసినట్టి పె
న్మ్రిచ్చునిపట్టి యిచ్చటికి మూర్ఖుని వీనిని నీ దినంబునం
గ్రుచ్చి శరంబులన్ జముని కొంపకు నంపి పితౄణమెంతయుం
గ్రచ్చఱఁ దీర్చి ధన్యతను గాంచెద నంచుఁ దలంచి నెమ్మదిన్. ౪౭౩

క॥ ఘనము శతానీకిరులను, నెసిన మొనఁ దోడికొంచు నెఱకన్నులుగాన్
గొని శస్త్రాస్త్రములను మద,ముగ గాత్స్రేడి దంతినెక్కి పోయెను బోరన్.

చ॥ చనినక్షణంబునం గునుకు ♦ సాయకుఁ డా యవనేంద్రు వానిసే
నను గని స్వీయులం బిలిచి ♦ నా చెలులార! యెవండు శూరతన్
మనపయిఁ జెక్కుతూపులను ♦ మాటికి మాటికి వేసి వచ్చు నీ
మొనను జయించునో యతఁడు ♦ వొందును మద్ధ్వజినీపతిత్వమున్. ౪౭౫

క॥ అని గంభీరగళంబునఁ, బనఁగా వినినట్టి సభ్యు ♦ లందు విజయుఁడున్
ఘనబలుఁడగు పార్థుఁడు నే,నని లేచెను బౌరుషంబు ♦ హర్షంబొప్పన్. ౪౭౬

ఉ॥ ఆవల సర్వసైన్యము ల ♦ హా! యన వైరులసేనతోడ గాం
డీవి సహాయశూన్యుఁడయి ♦ డీకొని చాపముఁ దంకరించి గాం
డీవవిముక్తబాణములఁ ♦ డెక్కెములన్ రథులన్ రథంబులన్
మావటివాండ్ర నేనుఁగుల ♦ మావుల రౌతులఁ జెండె భూవరా! ౪౭౭

తే॥ అపుడు హతరథిసాదిక ♦ ర్యశ్వభటులు, శంకులన్ బడినట్టి కూ ♦ ష్మాండశకల
ములవలెన్ వెల్గిరా రణ ♦ భూమి నంత, మ్లేచ్ఛులెల్లరు వాజిరో ♦ మేదినీశ!

తే॥ అవల నిభమెక్కినట్టి మ్లే ♦ చ్ఛాధిపుండు, చండుఁ డాత్మశక్తింగొని ♦ చక్కఁ ద్రిప్పి
నరునిపై వేసి సింహాస్వ ♦ నంబుఁ జేసె, నంత విజయుఁ డయ్యది సెండ ♦ నంబకముల.

క॥ చండుఁడు విలుఁగొని వెంటనె, గాండీవవిముక్తశిఖులఁ ♦ గవ్వడి దానిన్
ఖండింపఁగఁ జండబలి,ష్ఠుండగు చండుండు గినుకఁ ♦ జుఱచుఱఁ గనుచున్. ౪౮౦

ఉ॥ రెండవ దివ్యచాపము ధ ♦ రించి భయంకరమైన వానికో
దండముఁ ద్రుంచెఁ బన్నగముఁ ♦ దార్క్ష్యుడు ద్రుంచినమాడ్కి నంతఁ బా
ర్థుండు త్వగన్వితాసిఁ గొని ♦ దుశ్చ్యవనుండు బవిన్ గిరీంద్రమున్
జెండినలీలఁ దద్వరద ♦ శేఖరకుంభముఁ గొట్టె నట్టనన్. ౪౮౧

ఉ॥ తద్ధతిఁ గుంభమంబు బగులఁ ♦ దత్కరి నొచ్చుచుఁ గూలె మూర్ఛతోఁ
దద్ధరణీంద్రుఁ డద్దిగని ♦ తత్క్షణమందునఁ దాల్చి ఖడ్గమున్
దద్ధరి మిత్రునిం బొడువఁ ♦ దద్బలుఁ డా యసి లాగి చర్మతో
నిద్ధరఁ దచ్ఛిరంబుఁ బడ ♦ నేసె స్వకీయమహాకృపాణమున్. ౪౮౨

ఆ॥ తిరిగి యర్జునుండు ♦ తీవ్రబాణంబున, వానిశిరము లాగి ♦ పంచశరుని
యెదుటఁ బడఁగవైవ ♦ నెల్లదుందుభులును, మొరసెఁ గురిసె దేవ ♦ పుష్పవృష్టి.

క॥ అప్పచ్చవిల్తుఁ డప్పుడు, గొప్పఁగఁ గొండాడి సైన్య ♦ కోటికిఁ బతిగా
నప్పార్థుని నొనరించెను, దప్పక ఛత్రాదుల యదు ♦ తండము గొలువన్.

తే॥ పిదప నర్బుదావనిపతి ♦ వేగవంతుఁ, డాతురుష్కేంద్రుగతిఁ గని ♦ యాదరి యధిక
బలులఁగొని తెచ్చి యప్పచ్చ ♦ విలుఁతునకిడి, శరణుఁగోరుచు మ్రొక్కుచు ♦ సంస్తుతించె.

ఆ॥ అవల మంగదహసుఁ ♦ డనెడు మారంగదే,శాధిపుండు దప [illegible] ముల
మనుప కిచ్చె నిఖిల ♦ ధరణిఖండము గెల్చి, యతఁడు ప్రాగ్విజయ [illegible] నపుడు.

క॥ నదులును నదములు జలధులు, బెదరుచుఁ దత్తేజమునకు ♦ వే సేనల కా
మదనున కశ్వాదులకును, గొదకొని మార్గంబు లిచ్చెఁ ♦ గొంకక జనకా!

ఉ॥ ఆ సుమబాణుఁ డా వరుస ♦ నర్గి సమస్తమునీంద్రపూజ్యకై
లాసగిరీంద్రపార్శ్వమున ♦ లక్షణయుక్తముగాఁ జెలంగు బా
ణాసురశోణితాహ్వయపు ♦ రాంతిక మొందెను సేనతోడ నా
యాసురుఁ డట్టి యాదవుల ♦ నందటఁ గాంచి దురాగ్రహంబునన్. ౪౮౮

క॥ పంద్రెం డక్షౌహిణులన్, గండ్రలు దళవరులఁగూడి ♦ కందర్పునిపైఁ
దీంద్రింజడి బలగంబుగ, గంద్రికలా నట్లు సేయఁ ♦ గడఁగెడిలోనన్. ౪౮౯

తే॥ సర్వమంగళాయుక్తుండు ♦ శంకరుండు, నందివాహనారూఢుండు ♦ నాకవిభుఁడు
శూలహస్తుఁ డా బాణుని ♦ ప్రోలకేగుఁ, దెంచి యాతని కిట్లనె ♦ మంచి నెంచి.

మ॥ భగవంతుండు పరాత్పరుండు నిఖిల ♦ బ్రహ్మాండనాథుండు గో
జగతీనాయకుఁడున్ బ్రపూర్ణతముఁడున్ ♦ సచ్చిత్ప్రమోదస్వరూ
పకుఁడౌ కృష్ణుని యంశ ముప్పురముఁ ద ♦ ద్బ్రహ్మాదినామంబులన్
దగి మేమిట్టులఁ బుట్టియుంటిమి గదా ♦ దైత్యాన్వయోద్దీపకా! ౪౯౧

చ॥ మఱియుఁ దదచ్యుతాజ్ఞలను ♦ మౌళిధరించి క్రియాకలాపముల్
గరముగఁ జేయుచుందు మనఁ ♦ గా నిఁకఁ ద్వాదృశు లెట్లొనర్ప రీ
వఱకుఁ ద్వదీయబాహువులఁ ♦ బాపిన సంగతి గుఱుతుంగవే
మఱతువె? బద్ధుఁడైన తన ♦ మన్మని నా యనిరుద్ధు విప్పటల్. ౪౯౨

తే॥ కాన మీ దానవులకెల్ల ♦ మాననీయుఁ
డాతఁడంచు నెఱుఁగుమా! ♦ యదియుఁగాక
యతని పౌత్రుఁడౌ ననిరుద్ధుఁ ♦ డల్లుఁడుగద
పూజ వారికిఁ జేయుమా! ♦ పోరు విడిచి. ౪౯౩

తే॥ అటుల హరబోధితుండయి ♦ నట్టి బాణుఁ
డాత్మజామాత ననిరుద్ధు ♦ నాహ్వ సల్పి
యర్చలం జేసి పారిబ ♦ ర్హంబు లొసఁగి
సైన్యయుతుఁడగు మన్మథున్ ♦ సత్కరించి. ౪౯౪

తే॥ కోటిరథములు బదివేలు ♦ కుంభులైదు, లక్ష లశ్వముల్ గానిక ♦ లను సమర్ప
ణంబు చేయఁగ నాతండు ♦ సంబరంబు, నంది సేనలతోడుత ♦ నచటఁ గదలి.

ప్రద్యుమ్నుం డలకాపట్టణమున కరుగుట.

సీ॥ నందాలకానంద ♦ లందముగా నే న,గరమణికిన్ దివ్య ♦ పరిఖ యమ్యో
రత్నసోపానవి ♦ భ్రాజితప్రాదము లే, పుర బాహ్యవనములఁ ♦ బొల్పుఁ గాంచు

గిన్నరగుహ్యక ♦ కింపురుషాదు లే,పట్టణంబందున ♦ వఱలుచుండ్రు
సకలకళాకర ♦ సౌధరాజమ్ము లే,నగరంబునందున ♦ మిగుల వెలుఁగు
తే॥ నాగకన్యలచే నొప్పు ♦ భోగవతివి,ధమున నే పురి రాజిల్లు ♦ ధనదపాలి
తనరి యావీడు భాసిల్లు ♦ తత్పురమున,నలక కరిగి కష్టంబుల ♦ నడిగె నంత.

చ॥ ధనదుఁడు దానవాంతకుప ♦ ధైర్యబలప్రతిభాప్రభావముల్
గనియు నఖర్వగర్వమునఁ ♦ గయ్యముఁ జేయఁదలంచె స్వల్పుఁడై
ధనియు, మహాత్ములన్ దృణవి ♦ ధంబునఁ జూచెడి నింక నాప్రభుం
డు నవనిధిప్రపాలకుఁడ ♦ టుల్ గరువంబుననుంట వింతయే? ౪౯౭

క॥ అంతట గుహ్యకకాంతుం, డెంతయు వాచించి దిట్ట ♦ హేమమకుటు నా
కంతుని దరి కంపఁగ ధీ,మంతుఁ డతం డతనిఁ జేరి ♦ మాటాడె నిటుల్. ౪౯౮

తే॥ మదన! యాదవనాయకా! ♦ మావిభుండు, నన్ను దూతగఁ బంపె మీ ♦ సన్నిధికిని
గాన నేఁ జెప్పు సంగతుల్ ♦ వీనులార, వినఁగ వేఁడెద నసియిట్టు ♦ లనియె జనక!

ఉ॥ ఎట్టుల దేవలోకమున ♦ నెల్లసురల్ సురరాజటంచు ని
ట్టట్టన రాసిపూజల మ ♦ హేంద్రు సుతుష్టుఁ జేసి మొత్తురో
యట్టుల నీధరాతలము ♦ నందు నృపుల్ నను రాజరాజ టం
చట్టె యొనర్చి యర్చలను ♦ హర్షముఁ గూర్తురటం చెఱుంగుమా! ౫౦౦

క॥ అలకను బరిపాలించెడి, నలఘుఁడ నవనిధుల కేనె ♦ యధిపుఁడ శివుతోఁ
జెలిమిని జేసినవాఁడను, బలుఁడను నగు నాకు మీరు ♦ బలు లియ్యఁదగున్.

తే॥ కాని మీ యుగ్రసేనుఁడున్ ♦ మానవుఁ డకు, నేను గప్పంబు లియ్యన ♦ టులె మరల
నడిగినం గయ్య మాడెద ♦ నంచు నంది,యుంబుపలదని చెప్పెనో ♦ శంబరారి!

క॥ అనవుడు ప్రద్యుమ్నుండును, విని యిపుడీ రాజరాజు ♦ విశ్వఖ్యాతున్
ఘను రారాజులమేల్బం,తిని బలు మా యుగ్రసేను ♦ ధీరుఁ గనెనే? ౫౦౩

సీ॥ ఇంద్రాదిపూజల ♦ హెచ్చుగాఁ గైకొన్న, కృష్ణుని నీయతఁడు ♦ డెఱుఁగఁడో కొ
వ్రజి సుధర్మను ♦ బారిజాతము హరి, కిచ్చుట నీయతఁడు ♦ డెఱుఁగఁడో కొ
పాశి నీలాశ్వముల్ ♦ ప్రణమిల్లి యాశౌరి, కిట్టయు నీయతఁడు ♦ డెఱుఁగఁడో కొ
సకలలోకంబులన్ ♦ జక్కఁగా రక్షించు, కృష్ణుని నీయతఁడు ♦ డెఱుఁగఁడో కొ

తే॥ మఱియు మాయుగ్రసేనుని ♦ మహితసభను, నిట్టి కృష్ణుఁడు వెల్గుట ♦ యెఱుఁగఁడో కొ
యానియుఁ దత్ప్రేషితుఁడ నేను ♦ ధనదునకి దె, యిషుబలులనిత్తునని ధను ♦ వెక్కుపెట్టె.

తే॥ బిలసమేతలోకంబులు ♦ లలిని వ్రమోఁగ, దిగ్గజములు చలించెను ♦ స్థిరయువణఁకెఁ
దారకంబులు ప్రాలెను ♦ దత్స్మరుండు, బాణమొక్కటి ధనదుపైఁ ♦ బఱుప నదియు.

ఉ॥ మించెడి ద్వాదశార్యముల ♦ మించిన తేజున దిక్కులెల్ల వె
లించుచుఁ బోయి యాతని శి ♦ ఖన్ గొడుగున్ మఱి జామరంబులన్

ద్రుంచినఁ దద్ధనేశ్వరుఁడు ♦ దోర్బలఁ గన్గొని యట్టివింత రో
షించుచుఁ బుష్పకంబు వడి ♦ నెక్కి రణాభోనరించు పిచ్చ్యశోక. ౯౦౬

కుబేర నలకూబరాదియోధపుంగవులు యాదవులతోఁ బోరుట

వ॥ ఘంటానాదపార్శ్వమౌళినామకమంత్రియుక్తుండై ధ్వజంబు వెంబడి నలకూబర మణిగ్రీవపుత్రులు విరాజిల్లుచుండ భయంకరాకారులును దనుత్రాణశిరస్త్రాణాంగుళిత్రాణధరులును సకలశస్త్రాస్త్రశక్తిసంయుతులును హయవదన పంచాననానన శింశుమారముఖ, నక్రవక్త్రోర్ధ్వపింగార్ధకృష్ణోర్ధ్వకేశులును నగు వేలకొలంది గనున్న యక్షకిన్నరాదులతోడను గజాశ్వరథపత్తిసహితులగు సేనానులతోడం గూడి వందిమాగధులు ప్రశంసించుచుండ శంఖభేరీమృదంగపటహాదులు మ్రోఁగుచుండ నిర్గమించె. తత్సమయంబునం దత్సహాయార్థంబుగా యోగమహామహిమామయంబగు సిద్ధక్షేత్రంబునుండి ప్రమథగణంబులును డాకినీభూతభేతాళకూష్మాండోన్మాదసంయుక్తంబులును సవినాయకంబులును నగు మాతృగణంబులను బ్రలయంబున సంవర్తకమేఘంబు లంబరంబు నాచ్ఛాదించుచుగు నచ్చెడివిధంబున భైరవరవంబు లవిరామంబుగా నొనర్చుచుఁ గోట్లకొలందిగ నేతెంచెడి నిశాచరపిశాచబ్రహ్మరాక్షసభైరవాదులను దోడ్కొని మయూరారూఢుండై కార్తికేయుండును మూషికారూఢుండై హేరంబుండును వీరభద్రసహితంబుగాఁ జనుదెంచిరి. అత్తరుణంబునం దావిత్తేశుని బలంబులకును, జిత్తుజుని సైన్యంబులకు హాహాకారఘోరగద్భుతంబగు తుములయుద్ధంబయ్యె. అయ్యెడఁ బరస్పరప్రయుక్తశస్త్రంబులచేతను దచ్చరణోత్థితరజంబులచేతను సూర్యాంబరధరామండలంబు లాచ్ఛాదింపంబడియె. ఏతత్సమయంబున మణిగ్రీవుం డుగ్రుండై. ౯౦౭

పంచచామరము॥ అరాతులక్ శరంబు లేయ ♦ నవ్వియేగ వారివా
హారిధ్వజేభపత్తిసాదు ♦ లన్నిద్రుంప రాధికా
వరాత్మజాతుఁడైన చంద్ర ♦ భానుఁడైదుతూపులక్
ద్వరక్ దదీయకార్ముకంబుఁ ♦ బాడు జేసి బైసుకక్. ౯౦౮

క॥ తురగయుతంబగు రథమును, వరదశబాణంబు లేసి ♦ వ్రక్కలుగాగక్
ధరఁబడఁగూల్చి పయోదము, నెఱిగాగర్జింప నల మ ♦ ణిగ్రీవుండుక్. ౯౦౯

క॥ అల్కను శక్తిని విసర మ, హోల్కవలెను నడ్డివెల్గు ♦ చుద్ధంజనఁగా
నిల్కడ నతఁడెడచేతను, జుల్కనఁగొని దాని ధనదు ♦ చూలినిఁ గొట్టెక్. ౯౧౦

తే॥ తత్ప్రహారమునకు వాఁడు ♦ ధరను సొమ్మసిలఁగ నలకూబర ప్రేరి ♦ తులును బలులునై నరక్కసుల్ వర్షార్క ♦ నంబుదములు, గప్పినటుఁగప్పి రాతనిఁ ♦ గాండములను.

తే॥ అంత దీప్తిమంతుండు మ ♦ హాగ్రహమున, శాతఖడ్గముఁగొని యక్ష ♦ సైన్యములను
జొచ్చి ఖండించె మంచులక్ ♦ జొచ్చి యినుఁడు, ఖరకరంబులఁ జెండిన ♦ కరణి నవల.

ఉ॥ కొందఱు భిన్నశీర్షులయి ♦ కొందఱు భిన్నపదాంసహస్తులై
కొందఱు భిన్నకర్ణులయి ♦ కొందఱు భిన్నవిశాలవక్షులై
కొందఱు భిన్నవర్ష్మలయి ♦ కూలిరి శేషులు వాఱి రాత్రిత
ద్బృందమునం జసంపఁ గని ♦ యేపునఁ దన్నలకూబరుండునున్. ౧౧౩

చ॥ అభయము సంగి స్వీయులకు ♦ నట్టె గుణధ్వని వింట మాటికిన్
సభయులుగా యదూద్భటులు ♦ సల్పి మహోచ్ఛ్రియకేతనంబుతో
విభవముగాంచు స్యందనము ♦ వే యధిరోహణ మాచరించి భా
వభవచమూపతిన్ విజయు ♦ బాఁదియు వింశతిమార్గణంబులన్. ౧౧౪

క॥ కృతవర్మ నైదుతూపుల, హతినొనరిచి దీప్తిమంతు ♦ నధికబలుని విం
శతిసాయకములఁ గొట్టఁగఁ, గృతవర్మయుఁ బాంచశిఖుల ♦ నేసె నతనిపై. ౧౧౫

క॥ అవి వడి నానలసంబరు, కవచంబును ద్రుంచి దూఱఁ ♦ గాశ్యపిలోనన్
భువి వల్మీకములోనికిఁ, దవిలి చనెడి ఫణులమాడ్కిఁ ♦ దత్సరహాతులన్. ౧౧౬

క॥ పుడమిని నతఁడును సామ్మనుఁ, బడుటను గని హేమమాలి ♦ వడి యరదముపై
నిడుకొని యావల కరిగెను, గడగడలాడిరి ధనేశు ♦ కాల్వురు లవలన్. ౧౧౭

ఉ॥ ఆదను మాని మంత్రులు మ ♦ హాబలశాలురునైన ఘుంటికా
నాదుఁడు భార్గవమాలియు ర ♦ ణంబున కేగి సువర్ణపుంఖముల్
భీదముఖంబులన్ బవన ♦ వేగము గృధ్రసుపక్షముల్ మహా
నాదము గల్గు తూపుల ఘ ♦ నంబుగఁ గొట్టిరి యాదవావళిన్. ౧౧౮

చ॥ పదపడి నర్జునుండు ప్రతి ♦ బాణము వేయఁగ నవ్వి వానితో
నెదురుచు విస్ఫులింగము ల ♦ హీనముగా వెడలంగఁ జెండి యా
చదలునఁ దిర్గ పెంగొఱవి ♦ చందమునన్ భ్రమియించి కోసులె
న్మిదిటికిఁ బైనిఁ ద్రోసె ధ్వజ ♦ మిశ్రతదీయరథంబులన్ ద్రుటిన్. ౧౧౯

ఉ॥ అప్పుడు యక్షులా సచివు ♦ లా నరమార్గణపంజరంబునం
దొప్పి నశించి రయ్యో! యయ ♦ యో! యిఁక నెయ్యది దిక్కటంచు బ
ల్జెప్పుచు యుద్ధరంగముఁ ద్య ♦ జించి పదంబుకొలందిఁ బాఱఁగాఁ
దెప్పున భూతజాత మరు ♦ దెంచెను గోట్లకొలంది భూవరా! ౧౨౦

తే॥ అటుల సనుదెంచి యయ్యవి ♦ యాహవమున
నరులఁ దునిమి నెత్తురుఁ ద్రాగి ♦ శిరములఁగొని
కనుచు నఱచుచు నవ్వుచుఁ ♦ గనలు చెగురు
చాడుచున్ బాడుచుండెడి ♦ నవసరమున. ౧౨౧

చ॥ గదుఁడు బలానుజుండు గని ♦ కైకొని భీకరలక్షభారభృ
ద్గదను ఘనంబుకై వడిని ♦ గర్జనొనర్చుచుఁ దద్గణంబులన్

త్రిదశవిభుండు వజ్రమున ♦ దివ్యనగంబులఁ గొట్టినట్లుగాఁ
జదుపఁగఁ గొన్ని సొమ్మగొనఁ ♦ జచ్చెను గొన్నియు బాఱెఁ గొన్నియున్.

ఆ॥ అట్లు భూతగణము ♦ లంతంబు జెందుట, వీరభద్రుఁడు గని ♦ వీరరసము
వొంగ నరుగుదెంచి ♦ ముద్గరంబును వానిపైని విసరి జలదు ♦ పగిదినఱచె.

క॥ అంత గదుఁడు తన గదఁగొని, పంతమునన్ వీరభద్రు ♦ పై విసరఁగ న
త్యంత మవిరెండుఁ బోరుచు, నంతమునన్ జూర్ణ మయ్యె ♦ నావల వారల్.

ఉ॥ జానుభుజాపదంబులను ♦ శైలములన్ బడఁద్రోసి గెల్వనే
మానసమందునం దలఁచి ♦ మల్లరణం బొనరించి రంతటన్
ధీనిధి వీరభద్రుఁడును ♦ దేఁకువతోఁ గదవీరమున్ గిరిన్
బూని పెకల్చి తద్గదుని ♦ మోమున వైచి హసించెఁ బెద్దగాన్. ౧౨౧

ఉ॥ అవ్వల యాదవోద్భటుఁ డ ♦ నంతబలుండు గదుండు తద్గిరిన్
చివ్వన లాగికొం చతని ♦ శీర్షముపైఁ బడవేయ నాతఁడున్
నొవ్వక తద్గదుం గొని వి ♦ నోదముగా నొక లక్షయామడల్
జివ్వన నెట్టెఁ బిమ్మట ధ ♦ రిత్రినిఁ గూలిన తద్గదుండునున్. ౧౨౨

క॥ ఇంచుక చింతించుచు నే, తెంచియుఁ దద్వీరభద్రుఁ ♦ ద్రిప్పుచు దివిపైఁ
బంచె నొక లక్షయామడ, లెంచఁగఁ బ్రద్యుమ్నబలము ♦ లెల్లన్ భూపా!

ఆ॥ వీరభద్రుఁ డంత ♦ వినునుండి కైలాస, శైలశృంగమందుఁ ♦ గూలి సొమ్మ
నొక్కగంటకాల ♦ మొదలను దెలియక, యుండె నవల వినుము ♦ యుర్వరేశ!

వ॥ మహాబాహుండగు కార్తికేయుండు క్రుద్ధుండై యుద్ధురవేగంబుతో యుద్ధరంగంబున కేతెంచి యనిరుద్ధసాంబులం దెగటార్ప శక్తిమంతంబగు నొక్క శక్తిం బ్రయోగింప నయ్యది సత్వరంబునం జని యువ్వీరుల తేజుల నుసిజేసి వేయి గజంబులను సహస్రహయంబులం బోకార్చి లక్షవీరులం బరిమార్చి సాంబుని నొప్పించి దశదిశల వెల్గించుచు బుస్సలుగొట్టుచు వల్మీకంబుఁ బ్రవేశించు పన్నగంబు విధంబున భూతలంబునం జొచ్చె అంత సాంబుండు శింజినీఘోషం బాచరించి యొందుకాండంబు నిషంగంబునుండి కైకొనునంతలో నది దశబాణంబులయ్యె. అవి ధనువున ననుసంధించుతఱిని శతబాణంబులయ్యె. కూర్చినపిదప నా నూరు రోపంబులు వేయి తూపులయ్యె తన్మోక్షణసమయంబునం దవియే లక్షమార్గణంబులై తత్పరంబునం గోటిప్రమితంబులై యనంతరంబునం దసంఖ్యాకంబులగు బాణంబులై చెలరేగి యరాతివీరులఁ గొట్టకొలందిగ ఖండించె. అప్పు డమ్మహాసేనుండు తత్ప్రహారంబున భిన్నాంగుండై యించుక వ్యాకుల పడుచుండ, ౧౨౫

తే॥ సకలశస్త్రాస్త్రసహితుండు ♦ సర్వభూష
ణాంచితుండు చతుర్బాహుండు ♦ నాఖువాహ
నాధిరూఢుండు గార్త్తికే ♦ యాగ్రజుండు
ఫాలచంద్రుండు గజవక్త్రుం ♦ డాలమునకు. ౫౩౦

తే॥ వచ్చి పరశురామునివలెఁ ♦ బరశువునను, బాశమున నంకుశంబున ♦ వైరి వీర
వాజి రథ రథి బలముల♦బగ్గఁగల్చి, సరథు సాంబునిఁ గొని కొట్టె♦సమయమందు.

చ॥ బలములతోడనున్న సుమ ♦ బాణుఁడు గన్గొని వింతఁ జెంది యి
ట్లల యనిరుద్ధనామకసు ♦ తాగ్రణి కాఁడె? సుధీ! యితండొ యా
వలమురితాల్పుపాలున భ ♦ వంబును బొందినవాఁడు వీనినిం
గెలువఁగలేరు వేల్పులిఁక ♦ గెల్తురొకో మనబోటివారిలన్? ౫౩౨

చ॥ ఇతఁడెటనుండు? నందు నను ♦ వేని పరాజయ మొందఁబోదు ము
న్నితిగళగేహమందు నల ♦ శ్రీహరి యిచ్చె వరంబు వీనికా
కతమున గెల్పిటన్ మనకుఁ ♦ గల్గదు కావున నిందునుండి యా
ధృతియుతు నాఖువాహనుని ♦ నెట్లొ తొలంగ నొనర్పఁగావలెన్. ౫౩౩

క॥ అందుల కొక్క యుపాయ ము,నుందల వచియింతుఁ జండ ♦ మార్జారమవై
యెందాఁక నీబలంబుల, ద్రుంచితును యంతదాఁక ♦ మసలక తెఱువా! ౫౩౪

క॥ అప్పుడు తప్పక విజయం, బొప్పును మనకనఁగ నట్టి ♦ యుత్కటబలుఁడౌ
నప్పచ్చవిల్తుబిడ్డఁడు, గొప్పబిడాలముగ మారి ♦ కొంకక కిరకన్. ౫౩౫

తే॥ విష్ణుమాయను గణపతి♦వీక్షణములఁ, బడక భీకరఘూత్కృతుల్♦ప్రాకటముగఁ
జేయు చాఖుసమ్ముఖముసు♦జెంది గోళ్ళఁ, దన్ముఖముఁ జీల్పఁగడఁగెను♦దత్పరమున

క॥ ఉందురు వాలోకించుచు, బొందివిడుచునంత భయముఁ ♦ బొంది విడి యనిన్
వందురుతోఁ గాల్కొలఁదిని, సందులకున్ గొందులకును ♦ జన నోతువునున్.

తే॥ స్థూలరూపమునఁ దఱుమఁ ♦ దొడఁగ నద్ది, దిశలకున్ విదిశలకును ♦ దేవనాగ
భూతలములకుఁ జనె గజ♦ముఖునితోడ, బుప్పశరుఁ డరులను ద్రుంపఁ♦బూనుకొనియె

ఉ॥ అప్పుడు విస్మయంబు ప్రమ ♦ థాదులు వొందిరి పుష్పకంబునం
దొప్పునుతేరుఁడున్ గని యొ ♦ హోయుని గొప్పకి మాయసల్పవే
గొప్పధనుస్సుఁ గొంచుఁ దల ♦ కుంభిని పోక మహేశు ప్రొక్కి బ
ల్మొప్పులఁగన్న మంత్రయుత ♦ మేదురవర్మముఁదాల్చి పెల్చునన్. ౫౩౯

తే॥ బాణసంఘంబు వైరుల ♦ పైని వైవ, నవ్వి సంవర్తకాభ్రము ♦ లాప్రలయము
నందునం దటిత్స్వనముల♦నరుగుదెంచి, క్రమ్ములీలను వ్యోమంబుఁ♦గప్పిమిగుల.

క॥ కరికరనిభబిందువులన్, గురిసెను బాషాణములను ♦ గూడుచుఁ ద్రుటిలో
ధరణి నకూపారంబులు, బఱఁగి భయంకరముగాఁగఁ ♦ బాఱఁదొడంగెన్. ౫౪౧

చ॥ అదియునుగాక జీవసహి ♦ తాద్రులు గన్పడ నందు నత్తఱిఁ
యదువులు ప్రాకృతుల్ ప్రబలయ ♦ మంచుఁ దలంచి భయంబుఁబొంది త
త్కదనము వీడి కార్ష్ణిగని ♦ కాయము వాఱఁగనైచి కృష్ణ! యం
చదనముగా స్మరించి రపు ♦ డా యనువర్యుఁడు మన్మథుండునున్. ౧౪౩

తే॥ గౌహ్యకీమాయ యుదియని ♦ కరముదలఁచి, సర్వమాయోఘమర్దిని ♦ సాత్త్వికియును
నగు స్వవిద్యను ధ్యానించి ♦ యంగజాత, బీజమున్ తూపునదుమను ♦ నోజఁగూర్చి.

క॥ ప్రణుత శ్రీ బీజంబును, బ్రణవము దన్ముఖమునందు ♦ భాసిల వింటన్
గుణమెక్కబెట్టి నారా,యణునిం ధ్యానించివేసె ♦ హాహా యనఁగన్. ౧౪౪

తే॥ దాన గౌహ్యకీమాయ య ♦ థాయథలుగ, నయ్యెఁ రవిచేతఁ జీకఁటు ♦ లరిగినటుల
నద్ది గాంచిన రాజరా ♦ జదరి స్వపుర, మునకు యక్షులతోఁగూడి ♦ పోయె నవల.

క॥ చల్లిరి పూలను దద్రతి,వల్లభుపై నెల్లసురలు ♦ బరమముదముతో
నెల్లరు జయజయరవములఁ, బెల్లుగ నొనరించిరి యదు ♦ వితతులు నవ్వేళ్. ౧౪౫

కుబేరుం డోడి బలులిచ్చి ప్రద్యుమ్నునిఁ బొగడుట.

వ॥ అత్తరుణంబున నవ్విత్తేశుం డుత్కటసంతోషంబుతోఁ జతుర్దంత యుక్తంబులై యచలంబులతో డీకొనంజాలిన ద్విలక్షగజేంద్రంబులను, ముక్తా తోరణభాసురదశలక్షరథంబులను, సూర్యవర్చస్సమన్వితంబులగు శతహయంబులను జంద్రవర్చస్సముపేతంబులగు దశార్బుదాశ్వంబులను, స్వర్ణవర్ణయుతంబులగు శత తురగంబులను, జతుర్లక్షయాప్యయానంబులను, బంజరస్థంబులగు ద్విలక్షశార్దూ లంబులను, కోటిచిత్రమృగంబులను, కోటిగవయమృగంబులను, కోటిమృగయాసార మేయంబులను, గిరశారికామరాళేతరపక్షుల నొక్కొక్కలక్షను, నెనిమిదియోజ నంబు లెత్తును, దొమ్మిదియోజనంబుల వెడల్పును గలిగి లక్షస్వర్ణకుంభంబులతోఁ దేజరిల్లినదియు విశ్వకర్మనిర్మితంబును, గామగంబును, జాంబూనదశృంగభాసురం బును, సహస్రప్రభాకరప్రతీకాశంబును, విష్ణుదత్తాఖ్యంబును నగు విమానంబును, సహస్రకులవృక్షంబులను, శతకామధేనువులను, శతచింతామణులను, స్పర్శచే లోహంబునైనను బంగారుగావించు శతదివ్యాశ్మంబులను ఛత్రచామరసమేత సువర్ణ సింహాసనశతంబును, నమృతపాత్రశతంబును, రత్నఖచితభూషణంబులను, దివ్యాం బరరత్నకంబళంబులను, నానావిధఫలంబులను, నైకవిధశస్త్రాస్త్రంబులను గింజల్కో పేతపద్మమాలికలను మత్తేభంబులమీఁదను, నరులమీఁదను వేసి మోయించుకొని తీసికొనివచ్చి ప్రద్యుమ్నునిం జుట్టివచ్చి యువ్వాసిని సమర్పించి నవనిధులఁగూడ నొసంగి కృతాంజలియై యిట్లు స్తుతించె. ౧౪౬

సుముఖీవృత్తము॥ మనసిజ! మార! ♦ మహాత్మనుతా!
వనరుహనేత్ర! ♦ పరాత్పరా!
జనపతివర్య! ♦ సమస్తవిభూ
వినతులొనర్తు ♦ విధేయుఁడనై. ౧౮౮

తరళ॥ జలజలోచన పుత్రకాగ్రణి ♦ శౌర్యధైర్యసమేతునిన్
బలుని రుక్మవతీమనోహరు ♦ బాహుదాది విభూషితున్
గలశజప్రముఖర్షిపూజితుఁ ♦ గంబుకంఠు రతీశ్వరున్
జలచరధ్వజు లోకజేతను ♦ సంస్తుతించెద భక్తితోన్. ౧౮౯

పంచచామరము॥ అనాదిమధ్యనాశనా! స్వ ♦ యంప్రభాస్వరూప! యో
యనాథనాథ! భక్తవత్స ♦ లా! యనన్యజా! ప్రజా
మనోభిరామ! కామ! భూమ! ♦ మాననీయ! సుందరీ
మనోహరా! పరాత్పరా! ♦ మాళితోడఁ ప్రమొక్కెదన్. ౧౯౦

క॥ చేయుచునుంటిని జేసితిఁ, జేయఁగలను నిద్ది నీకుఁ ♦ జెందిన దదియో
నాయది యీతఁడు మిత్రుం, డాయన యాగర్భశత్రుఁ ♦ డని చెప్పంటయున్.

తే॥ నేను భోగిని దుఃఖిని ♦ నీవనుట యహంకృతిని మమతను గల్గి ♦ నని జనుండు
ప్రకృతికాలాశయాంగజ ♦ ప్రబలగుణమ్ములను సుబద్ధుఁడై చెడుపను ♦ లొనరుచుఁగద.

ఉ॥ కాచమునందు బాలు నిసు ♦ కన్ సలిలంబును ద్రాట సర్పమున్
జూచినచాద్భునం గనుల ♦ శుంఠతఁజూడక మీప్రభావముల్
జూచితి మిమ్ము హేలమెయి ♦ సొంటుల నాయవి వాపి దేవరా!
నీచరణారవిందముల ♦ నిచ్చలుగొల్చెడి భక్తి నీయవే! ౧౯౩

క॥ జ్ఞాననిధిసమాగమమును, జ్ఞానము వైరాగ్యయుతము ♦ సాయుజ్యంబున్
మానకరా! కరుణామతి, దీనుఁడనగు నాకు నిడవె! ♦ దేవ! యనంగన్.

తే॥ అంగభవుఁ డట్టులగుగాత ♦ మంచుఁ బలికి
యుభయమిడి పద్మరాగంబు ♦ హాటకమణి
మయము ఛత్రచామరభాస ♦ మానము నగు
సింహపీఠంబు నొసఁగ నా ♦ శ్రీదుఁడు గొని. ౧౯౫

తే॥ అతనిఁ జుట్టివచ్చి ♦ యనుమతిఁ గైకొని, యాత్మమందిరమున ♦ కరిగె నవల
నితరరాజు లంద ♦ రెరిఁగి తజ్జయమును, బలుల నిడిరి మాని ♦ భండనంబు.

మన్మథుండు కింపురుషఖండంబు గెలుచుట.

ఉ॥ ఆతరువాతఁ బంచశరుఁ ♦ డాత్మబలంబులఁగూడి సాఁగి ప్రా
గ్జ్యోతిషపట్టణంబునకు ♦ శూరులు దల్లడిలంగ దుందుభుల

బ్రాఁతిగ బ్రామాయు నేగ నటు ♦ పైని దదీశుఁడు భౌమదైత్యసం
జాతుఁడు నీలుఁడుర్ బెదరి ♦ శౌరికుమారున కిచ్చెఁ గానుకల్. ౧౬౭

క॥ అవి గొని మరలెడి మరుతో, ద్వివిదకపి మున్ను దెబ్బ ♦ దినిన కినుకచే
జవమునఁ దత్పురివాకిటఁ, గవిసి దళంబులను గోళ్ళఁ ♦ గాడ్పడఁజేసెన్. ౧౬౮

తే॥ మఱియుఁ దత్కపి తోఁకతో ♦ నరదములను, గట్టి లవణాబ్ధి నెట్టి ♦ కరులహరుల
కరములన్ బట్టి నింగికిఁ ♦ బఱపి బలిమి, నగ్గలంబుగ గర్జింప ♦ నా మరుండు. ౧౬౯

చ॥ కనుఁగొని వాఁడు శత్రుఁడని ♦ గట్టిగ నెంచి గ్రహించి శార్ఙ్గమున్
ఘనముగ డంకరించి యొక ♦ కాండము వేయఁగ నద్ది తత్కపిన్
గొని దివిఁ ద్రిప్పి పళ్ళఱను ♦ గొంకక పూర్వవిధిన్ స్వకస్థలం
బునఁ బడునట్లు బంచి మఱి ♦ పుష్పశరేషుధిఁ దూర్చె భూవరా! ౧౭౦

ఆ॥ అంత మదనుఁ డచట ♦ నక్షౌహిణీశత, సహితుఁడగుచు సాఁగి ♦ సాలజాల
వల్లరీసహస్ర ♦ పత్రలసత్సర, కలితదేశములను ♦ గలయఁ గాంచి. ౧౭౧

ఆ॥ యక్షుదిష్టమార్గ ♦ మందునం జని చని, హేమకూటభూధ ♦ రేంద్రమునకుఁ
గ్రిందవెల్గుచున్న ♦ కింపురుషులఖండ, మునకు ముఖ్యమైన ♦ పురికి నరిగె. ౧౭౨

క॥ అంతటఁ గింపురుషులు రతి, కాంతాగమనంబు భటము ♦ ఖంబున విని య
త్యంతముదంబును గని యీ, వంతునఁ బల్కాడి రార్య ♦ బహులాశ్వవిభూ! ౧౭౩

సీ॥ అఖిలాండపతియైన ♦ హరి పుట్టియుంట యా, దవకులంబంతయు ♦ ధన్యమయ్యెఁ
బరమేశ్వరుండైన ♦ హరి చరియించుటన్, దన్మధురాపురి ♦ ధన్యమయ్యె
గోలోకవిభుఁడు ము♦కుందుఁడు దిరుగ బృం, దావనంబును బహు♦ధన్యమయ్యె
హరిదంతభరితత ♦ ద్యశమును గొనియాడి, తత్త్రిలోకంబులు ♦ ధన్యమయ్యె

తే॥ దానమానరాసాది లీ♦లానికరము, కృష్ణుతోఁ గూడి కావించి ♦ యెల్ల గోపి
కలును రాధయు ధన్యులై ♦ రలయమునయుఁ, దద్ధృషీకేశునకుఁ బుట్టి ♦ ధన్యయయ్యె. ౧౭౪

తే॥ మఱియుఁ దద్దర్శనస్పర్శ ♦ మననములను, నెందఱో తపోధనులు న♦హీనమతులు
దీనులును ధన్యులైరిగా ♦ దే! తదబ్జ, నాభు మ్రొక్కుచు నుందు మ♦నారతంబు. ౧౭౫

ఉ॥ ఆ యరవిందలోచనుఁడు ♦ యాదవవర్యుని నుగ్రసేనునిన్
జేయుచు సార్వభౌమునిగ ♦ శ్రేష్ఠతరంబగు రాజసూయమున్
జేయఁగఁ జెప్పి దిగ్జయముఁ ♦ జేయఁగ స్వీయకుమారు మారునిన్
దోయజనేత్రు నీఘనునిఁ ♦ దోయములన్ జతఁజేసి పంచెఁగా. ౧౭౬

ఉ॥ కావున నీబుధుల్ మనము ♦ కన్నులపండువగాఁగఁ గాంచి సం
భావనఁజేసి యుత్తఱి సు ♦ పర్వులకందని ధన్యతన్ గనం
గావలెనంచు నందఱటు ♦ గాన్కలొసంగి నమస్కరించి రా
శ్రీవిభుసూనువర్యుఁడు వ ♦ శీకృతశత్రుఁడు పుష్పబాణుఁడున్. ౧౭౭

తే॥ నిజవిశదయశఃకథలను♦నిర్మలముగు, ముజ్జగంబుల వెల్గించెఁ♦బూర్ణచంద్ర
రశ్మిమిలితదుగ్ధాబ్ధిస్ఫు♦రత్తరంగములను గరి విస్తృతిగ సల్పు♦పోల్కిఁ జనక !

చ॥ నుతియుఁ దదమ్మహాత్మజుఁ డ♦మందనిజామలకీర్తిగానముల్
బోరిఁ బోరి నాలకించి బహు♦మోదముఁ జెందియు నట్టి కిం
పురుషుల కర్ధమాళిమణి♦భూషణకుండలహారబాహుదాం
బరవలయోర్మికాదులఁ గృ♦పామతి నిచ్చి బహూకరింపఁగాఁ. ౫౫౯

ఆ॥ రాజధానియైన♦రంగవల్లిపురి,నుండి తద్విభుండు♦దండివాఁడు
నగు సుబాహుఁడరిగి♦యంగజునిఁ బ్రొక్కి, బలుల నిచ్చి యవల♦పార్థివేంద్ర!

ఉ॥ వారిజనాథసూనుఁడు సు♦బాహునరేంద్రున కిట్లు పల్కెనో
ధీర ! త్వదీయపట్టణము♦దివ్యము దీనికి రంగవల్లి యన్
పేరెటుగల్గెనో? యెవరు♦పెట్టిరొ? యీయభిధేయమంతయున్
మీరలు నాకుఁ జెప్పవలె♦మీ రెఱిఁగియుందురు మున్నె దీనినిన్. ౫౬౧

చ॥ అనఁగ సుబాహు విట్లనియె♦నంగజ! పూర్వము క్షీరవారిధిన్
దనుజులు నిర్జరుల్ గలిసి♦ధైర్యముతో మథియించుకాలమం
దునఁ బదునాల్గురత్నములు♦దోఁచెను వెండియు నందునన్ సుధా
కనదురుకుంభమున్ బొడువఁ♦గా వనజాక్షుఁడు శ్రీరమేశుఁడున్. ౫౬౨

తే॥ కన్నులారఁగఁ గన్గొనఁ♦గౌతుకమున, నలసి కన్నులఁగాఱెడి♦నశ్రుపు లల
కలశమందునఁ బడుటచేఁ♦దులసియనెడి, తిరువు తత్స్థలిన్ జనియించె♦ధరణినాథ!

ఉ॥ ఆరమణీయశాఖి కల♦యంబుజనేత్రుఁడు రంగవల్లి యన్
బేరిడె హేమకూటమును♦పెద్దమహీధ్రముక్రింద నద్ది యొ
ప్పారుచునుండు నిప్పటికి♦నాతరునామమె మత్పురాఖ్యయై
కీరితికెక్కె నీయగము♦కేవలుఁ జూపునటం చెఱుంగుమా! ౫౬౪

చ॥ వినుము మఱొక్కసంగతిని♦వీరవరుండు మహానుభావుఁడున్
దినమణిముఖ్యశిష్యుఁడు సు♦ధీనిధి రామభటుండు నంజనా
తనయుఁడు నిత్యమిచ్చటికి♦దర్శనముం బొనరింప "నార్ష్టిషే
ణు"నిఁగొని వచ్చెడిన్ హరిత♦నూభవ! యంచు వచింప నాతఁడున్. ౫౬౫

వ॥ ఆనందించి తత్స్థలంబున కేగి తద్రంగవల్లీభూరుహవరంబును సందర్శించి ప్రదక్షిణంబు లాచరించి నమస్కరించి యట నిర్గమించి హేమకూటతటీభూతంబును, సింహశరభశార్దూలచిత్రకవన్యేభశివోలూకాది నిర్ఘోషఘోషితంబును, భృంగారిభృంగఝంకారసంకులంబును, కృష్ణాహారితకీవల్లీకీచకాశ్వత్థమందారాది భూరుహబంధురంబును, బహుభయంకరంబు నగు మహారణ్యంబునుండి నడచెడి తరుణంబునం బదియామడల పొడవుగల సర్పం బొండు దారుణగరళమయంబులగు

ఘూత్కారంబులతోఁ జనుదెంచి మత్తేభంబుల మ్రింగుటం గని యాదవులు హాహా కారంబులం గావింప భాను, స్వభాను, స్వర్భాను, ప్రభాను, భానుమ, చ్చంద్ర భాను, బృహద్భాను, రతిభాను, శ్రీభాను, ప్రతిభానువులను సత్యభామాకుమారులు పదుగురు బహుతీక్ష్ణజిహ్వాగంబుల నాజిహ్మగేంద్రంబును బ్రమాదింపఁ దత్కళేబరంబునుండి దివ్యగంధర్వుం డొకండు బయలు వెడలి ప్రద్యుమ్నునకు నమస్కరించి సురలు విరులం గురియుచుండ విమానం బెక్కి దివంబున కేగెనని వచింప బహులాశ్వుం డాగంధర్వుం డెవండో యాతని కాఫణిరూపం బేకతంబున వచ్చెనో తెల్పుమని ప్రార్థింప నారదమహర్షి యారాజర్షి కిట్లనియె. ౧౭౬

తే॥ ఆరిష్టసేనుఁడనెడి ♦ నలఘుగంధర్వుని, సోదరుఁడును దివ్య ♦ సుందరుఁడగు
సుమతి హనుమదరికి ♦ శుద్ధరామాయణంబును బఠింపవచ్చెఁ ♦ బూర్వమందు.

ఉ॥ ఆతతహేమకూటగిరి ♦ యందున నాహనుమంతుఁ డాధరి
త్రీతనుజామనోవిభుని ♦ శ్రీదు సలక్ష్మణు రామచంద్రు వి
ఖ్యాతినిఁ గల్యముల్ మొదలు ♦ యామయుగంబు గతించుదాఁకఁ బూ
జాతతిఁ జేసి సేవలను ♦ సల్పును నిత్యము నట్టివేళలోన్. ౧౭౮

తే॥ అతిభయంకరఘూత్కృతు♦లగ్గలముగ, ఫణివిధంబునఁ జేయుచు♦భక్తిభంగ
మును ఘటించు నా సుమతినిఁ♦గనుచుఁ గసలి, సర్పముగ నీవు గమ్మని♦శాపమిచ్చె.

క॥ అంతట సుమతియు వెత హను,మంతుని పదములను వ్రాలి♦మన్నింపుము నా
మంతువు! భగవంతుండవు, తంతవనన్ హనుమ కదుప్ర ♦ సన్నుం డగుచున్.

చ॥ అరుసముతోడ ద్వాపరయు ♦ గాంతమునందున దిగ్జయార్థమై
యరిగెడి కృష్ణపుత్రులు మ ♦ హాశుగపంక్తినిఁ బాఁపరూపుతో
వఱలెడి నిన్నుఁ జెండెద ర ♦ బద్ధముగా దిది యప్డు నీవు శ్రీ
కరభవదీయరూపమును ♦ గాంచెదవో సుమతీ! యథాస్థితిన్. ౧౮౧

చ॥ అని కరుణింప నాసుమతి ♦ యారహి సర్పముగా జనించి యా
వనరుహలోచనాత్మభవ ♦ బాణపరంపర గిట్టె నెమ్మదిన్
గనఁగ మహాత్మశాపము సు ♦ ఖంబులొసంగు వరంబుగాదె? యో
జనవర! యంత నా కుసుమ ♦ సాయకుఁ డచ్చటనుండి వేడ్కతోన్. ౧౮౨

సీ॥ ఎచ్చట మానవు ♦ లేడులు పదివేలు, ననుదాఁకఁ జక్కగా ♦ మనియుచుందు
రెచ్చటఁ బురుషు ల ♦ హీనగజాయుత, బాధబలంబుతో ♦ వఱలుచుందు
రెచ్చటఁ ద్రేతతో ♦ నెల్లవిషయముల, నీడగుచున్ గాల ♦ మెసఁగుచుండు
నెచ్చట నుదకం బ♦మృతముతోఁ దుల్యమై, స్వచ్ఛతమంబుగాఁ ♦ బాఱుచుండు

తే॥ నెచట నవరత్నముల్ పుట్టు♦నెచట నిత్య,యౌవనవిభూషితలగుచు♦నతివలుందు
రెచట సర్వభూరుహలత♦లెచ్చియుండు, నల్ల చైత్రదేశములకు ♦ నరిగె నవల.

తే॥ తత్స్థలంబునకున్ రాజ ♦ధానియగు "వ, సంతతిలక" యన్ పురినుండి ♦ శౌర్యధనుఁడు
విభుఁడు శృంగారతిలకుఁ డా♦త్మభుపుత్రోడఁ, గలహమాడ నేతెంచె జై♦త్రులనుగూడి

వ॥ అత్తరుణంబున సాంబ, సుమిత్ర పురుజి, శ్రుతజి, శ్రహస్రజి, ద్విజయ చిత్రకేతు, వసుమ, ద్రవిణ, క్రతువులను జాంబవతీతనూభవులు బదుగురు నెదిరించి నారాచంబులం బ్రయోగించి జగం బంధమయంబు గావింప వైరులు గోలాహలంబులం జేయుచుఁ బోరుమాని పాఱఁగడంగుటఁ దదధ్యాపుండు గాంచి రోషించి మించు మత్తేభంబునం దధిష్ఠించి త్రిశూలంబు గ్రహించి సాంబుని వక్షంబును బొడిచి కోదండనిర్గతంబులగు కాండంబులతో నితరవీరులను జెల్లాచెదరుగాఁ జెండి మహారణ్యంబునం బ్రవేశించి దహించు వైశ్వానరుని విధంబున నేకకుండయ్యు విజృంభించుట నాలోకించిన గదుం డేతెంచి మదోత్కటంబగు నమ్మాతంగంబుఁ దొండంబునుబట్టి దూరంబున భూతలంబునం ద్రోయ నాశృంగారతిలకుం డిలఁ గూలి క్రమ్మఱ లేచి భయభీతుండై యర్వదతురగంబులను, లక్షరథంబులను, నయుతేభంబులను దీసికొనివచ్చి యాప్రద్యుమ్నునకు నర్పించి యొరిగలం గావించె. ఇట్లు కింపురుషఖండం బామన్మథుండు జయించి నిషాదదర్శితంబులగు మార్గంబుల నడిచి క్రమముగా సర్వసంపత్కరంబగు హరివర్షనామకఖండంబున కేగె. ౯౮౯

ప్రద్యుమ్నుండు హరివర్షంబును జయించుట.

తే॥ అందు నిషధనామకగిరి♦యమరు నచట, వీరకోదండటంకార ♦ ఘోరరవము
లక్షణంబుగ జనియించె♦ నమితభయముఁ, గలుఁగఁజేయు నొకానొక ♦ కాననుండి.

తే॥ క్రోశమాత్రదేహములతోఁ ♦ గూడు పెద్ద
గ్రద్దలున్ దీక్ష్ణతుండముల్ ♦ గలుగు గరుడు
లరుగుదెంచి క్షుద్బాధతోఁ ♦ గరుల హరుల
సైనికుల మ్రింగఁదొడఁగె నా♦సమయమందు. ౯౮౨

తే॥ గగనతలము ఖగంబులం♦గప్పఁబడుట, యాదవులు భీతిజెంది హా♦హాకృతులను
సల్పుటన్ గని మదనుం డ♦నల్పపన్న, గాశనాస్త్రరాజము వైచె♦నపుడు వడిని.

మ॥ అల బాణంబున వైనతేయుఁడు వి ♦ హంగాధీశ్వరుం డొంది దీ
ప్తులచే వెల్గెడి దీర్ఘపక్షములతో ♦ భూర్యుగ్రకృన్నాసతో
నల దాక్షాయ్యకులింగతార్క్ష్యములు సం ♦ హారంబు గావింపఁగాఁ
బులుఁగుల్ గొన్ని భయమ్ముతో దెసలకున్ ♦ బోయెన్ సఘాతంబులై.

ఉ॥ పిమ్మట నచ్యుతాత్మజుఁడు ♦ స్వీయచమూయుతుఁడై దశార్ణదే
శమ్ముల కేగెఁ దద్విభుఁ డ ♦ సాధ్యబలుండు శుభాంగనాముకుం
డమ్మరు చండపౌరుషము ♦ వ్యాసముఖంబున నాలకించి క
ప్పమ్ములతో దశార్ణగత ♦ భద్రతరంగిణిఁ దాఁటి నమ్రతన్. ౯౯౦

తే॥ మరుని దరిఁ జేరి యా బలుల్ ♦ సరగ నిచ్చి, యెనుపదిజేసె నంత నా ♦ యంగజాతుఁ
డా బలిష్ఠ నిష్క్రాంబ ♦ యనెడి రాజ,ధానినుండి యేతెంచిన ♦ వానిఁ గాంచి.

క॥ ఓయి శుభాంగా! యెట్టుల, మీ యవని దశార్ణమయ్యె ♦ మేధావి యెవం
డీ యభిధానముఁ బెట్టెనొ?, యీయెడ వచియింప నాకు,♦ నేఁ బ్రార్థింతున్.

ఆ॥ అన శుభాంగుఁ డిట్టు ♦ లాడె నృసింహుఁడు
మును హిరణ్యకశిపుఁ ♦ బోరి ద్రుంచి
భక్తు నతనిపుత్రుఁ ♦ బ్రహ్లాదుఁగూడి యి
ట్టి హరి వర్షమునకు ♦ శివి వచ్చి. ౫౯౩

క॥ నిలిచియుఁ బ్రహ్లాదున కిటు,బలికెను శాంతుఁడవు ముఖ్య ♦ భక్తుఁడవగు నీ
యలఘుపితన్ జంపితి నని, కలఁగకుమ! కులక్షయంబు ♦ గావింపనుగా. ౫౯౪

క॥ అని ముదమున నను నరసిం,హుని కన్నులనుండి రాలె ♦ యుదకంబు లటన్
ఘనమంగళకరమైన కొ,లనుగాఁ బాఱంగఁదొడఁగె ♦ లక్ష్మీపుత్రా! ౫౯౫

తే॥ దాని దర్శించి ప్రహ్లాదుఁ ♦ డానృసింహు, నిటుల నడిగెనో నరసింహ! యేను పుట్టి
యమ్మనబ్బను సేవింప ♦ నైతిఁగాదె, యిట్టిదోషంబు లెట్టుల ♦ నేగుఁ జెపుమ!

వ॥ అనవుడు శ్రీనరసింహుండు పుత్రా! నాహర్షబాష్పంబిట మంగళాకరంబై సరోవరంబుగా నుద్భవించెఁగాదె! ఇందు మజ్జనం బాచరించి మాతాపితలయు భార్యా, సంతాన, గురు, సుర, భూసుర, ప్రపన్నర్షి, పితృదేవతలయు ఋణంబులం బదింటిని దీర్చి కృతార్థుఁడ వగుము. ఎవండైనను నిందు స్నాతుండైనచో వాఁ డాదశఋణంబులనుండి విముక్తుం డగునని వచింపఁ బ్రహ్లాదుం డాహ్లాదంబుబొంది యందు నీరాడి యనృణిమై యిప్పటికి నాసిమధాచలంబునుండి యేతెంచి యందు జలకం బాడి పోవుచుండును, తత్ప్రభృతిఁ దత్తీర్థంబునకు దశార్ణమోచనంబనియు, తద్దేశంబునకు దశార్ణదేశంబనియుఁ బ్రసిద్ధి గల్గెనని వక్కాణింప నక్కందర్పుం డక్కువగా సంతోషించి యాతీర్థంబున స్నానం బొనరించి దానంబులం గావించె. ఈదశార్ణదేశచరిత్రంబు వినువా రాపదిఋణంబులం దీర్చి ముక్తిపాత్రు లగుదురని చెప్పి వెండియు నిట్లనియె. ౫౯౬

మరుం డుత్తరకురుఖండంబును జయించుట.

చ॥ ఉరసుఁ డతండు మేరుగిరి ♦ కుత్తరభాగము నందునున్న యు
త్తరకురుభూమి వృద్ధిసహి ♦ తంబును దివ్యము శృంగవద్ధరా
ధరవరపార్శ్వభాసురము ♦ దద్ద జయింపఁ దలంచి సాఁగి శ్రీ
కరమగు గంగలోన నవ ♦ గాహనముం బొనరించి యాస్థతోన్. ౫౯౭

క॥ వారాహీనగరంబును, జేర గుణాకరుఁడు బలుఁడు ♦ శిష్టుఁడు పద్మా
ధారుఁడు సత్రాట్పురుసం,భారామరమానివరులు ♦ భాసిల్లంగన్. ౫౯౮

తే॥ దశమహాయమేధయాగంబు♦దమినిఁ జేయఁ,దలఁచి నీలకర్ణాంచిత♦ధవళతురగ
మును దశాక్షౌహిణీయుతుఁ♦డనయు వీర,ధన్వుఁ దద్రక్షకుగఁ గూర్చి♦తద్దవిడిచె.

వ॥ అప్పుడు వీర చంద్రాశ్వసేన చిత్రగురు వేగవ దామ శంకు
వసు, శ్రీమ త్కుంతులను నాగ్నజితిసుతులు బదుగురు నాలోకించి యాహాయం
బును బట్టి యిది విడిచిన వాఁడెవ్వం? డని పలుకుచు స్వసైన్యంబులం జేరం బ్రద్యు
మ్నుండా యశ్వగళంబందలి పత్రంబుఁగాంచి విస్మయంబుఁ బొంది యాయుధపాణు
లగు యాదవులకుం జూపింప వారు నచ్చెరువొందెడి తరుణంబున. ౬౦౧

ఆ॥ దానిఁగాచుసేన ♦ దత్తురగంబును, వెదకికొనుచు వచ్చి ♦ మదనసైన్య
ధూళి రేగుచుంట♦దూరంబునం జూచి, నిలిచి వింతఁబొంది♦పలికి రిటుల. ౬౦౨

చ॥ సరసుఁడు చండవిక్రముఁడు ♦ సర్వనయజ్ఞుఁడు నా గుణాకరుం
డటిమఱి నేలు రాజ్యమున ♦ నారయఁ జోరులు లేరు జారులున్
వఱలరు గోవులన్నఱకు ♦ వారును లేరు ఖలుల్ వసింపరీ
యరుణునిఁ గ్రమ్ముదుమ్మొచటి ♦ దైనది మాకెఱుఁగంగరాదుగా. ౬౦౩

క॥ ఈతతి వాదిత్రంబులు, నాతతకరిబృంహితములు ♦ హరిఘోషణముల్
శాతధనుష్టంకృతులున్, బ్రాఁతిగవినఁ బడియె నట్టి ♦ పరులకు నవలన్. ౬౦౪

చ॥ మదనునిచేతఁ బంపఁబడి ♦ మంత్రివరుండగు నుద్ధవుండు త
న్మదయుతవీరధన్వు నవి ♦ ధంబున కేగి ధరాతలేంద్ర! యా
యదువరుఁ డుగ్రసేనవిభుఁ ♦ డానృపసూయముఁ జేయనెంచి యీ
మదనుని సర్వదిగ్జయ ము ♦ మందత సల్పఁగఁ బంపె నీతఁడో. ౬౦౫

చ॥ ఘనుడు మహానుభావుఁడు న ♦ ఖండబలుం డరవిందనాభనం
దనుఁడును దుర్జయుండగుట ♦ దప్పక నీవును గాన్కలిచ్చి వం
దనములఁ జేయుఁగాఁ దగును ♦ ధద్విధిసల్పనిచో సమీకముం
బొనరిచి తీసికొఁగలఁడ ♦ మోఘముగాఁగరదంబులన్ బ్రభూ! ౬౦౬

తే॥ భరతఖండంబుగెల్చి కిం♦పురుషఖండ,మును జయించియాహరివర్ష♦మునుజయించి
యిచటికే తెంచెఁగావున♦నీతఁడలఁతి, గండఁడని యెంచఁబోవక♦కరము లిమ్ము!

తే॥ యజ్ఞపశువు వెంబడి నిట్టి♦యంగజుండు, దీసికొనివచ్చె దీనినే♦దిట్ట యపహ
రింపఁగలఁడు? సహాయుఁడై♦కృష్ణుఁడుండ,బలయుతుఁడగు రారాజిడి♦బలుల మ్రొక్క

ఆ॥ అనఁగ వీరధన్వుఁ ♦ డాడె నీవిధంబున, శ్రీకుఁడధికుఁడగు గు♦ణాకరుండు
నల శచీశపూజ♦లందియుండెనుగాదె, యతఁడు బలులనియ్యఁ♦డంగజునకు. ౬౦౭

క॥ వారాహాకారంబున, శ్రీరాజితశృంగవద్గి♦రిని హరి వెలుఁగున్
ధారుణి యతనికిఁ బూజలఁ, గూరిమితో సతముజేయుఁ ♦ గోర్కులొసంగన్.

ఉ॥ ఆ యచలంబునందు నయు ♦ తాబ్దము లట్టి గుణాకరుండు త
త్తోయజనాభునిం గుఱిచి ♦ ఘోరముగాఁ దప మాచరింపఁగా
నాయనఘుండు తుష్టిఁగని ♦ యంతిక మొంది గుణాకరా! వరం
బేయది నీకుఁ గావలెనొ ? ♦ యీ యెడఁ జెప్పుము ! యిచ్చెదం జుమీ !

చ॥ అనఁగ గుణాకరుండు ముద ♦ మంది నమస్కృతులం బొనర్చి తో
వనరుహలోచనా ! విను మ ♦ పారకృపన్ నను నీవుదప్ప నే
ఘనులును గాని యే సురలు ♦ గాని జయింపనిలాగు సల్పవే !
యనఁగఁ "దథాస్తు"టంచుఁ జనె ♦ నా గరుడధ్వజుఁ డోయి యుద్ధవా ! ౬౧౨

క॥ ఆకారణమున మీరా, శ్రీకురుఖండేశుహయముఁ ♦ జెచ్చెర విడుఁడీ !
యీకరణిని సల్పనిచోఁ, దేఁకువతోఁ బోరి దానిఁ ♦ దెప్పింతుఁ జుమీ ! ౬౧౩

వ॥ అంతట నుద్ధవుం డతని వీడ్కొని ప్రద్యుమ్నునకు సభాసదులు వినుచుండ యావద్వృత్తాంతంబు జెప్ప నంగున్న కాళిందీనందనులగు శ్రుతకర్మ, వృష, వీర, సుబాహు, భద్రేకల, శాంతి, దర్శ, పూర్ణమాస, సోమకులను బదుగురును బదియక్షౌహిణులం గొని యాయుధంబుల ధరించి యుత్తరకురుయోధులతోఁ దలపడిరి. ఆయవసరంబున నా యుభయుల కద్భుతంబగు తుములయుద్ధం బయ్యె. అందుత్తరకురుజనులు హతులైరి. తత్స్థలంబున నొండురక్తతరంగిణి జనించె. హతశేషులగువారు శరత్కాలమేఘసంఘాతంబు విచ్చినవిధంగి నలుగడలకుఁ బఱుగిడిరి. ఆకుమారులందుఁ బూర్ణమాసుండను బలుండు వీరధన్వుని స్యందనంబును బాణసంతతితోఁ జూర్ణీకరింప నాతండు విరథుండయ్యు ధనుష్టంకారంబులం గావించి యేకవింశతిమార్గణంబులతోఁ బూర్ణమాసునిం బ్రహరింప నతం డవ్వానిని నడుమనే నిజబాణంబున ఖండింప నా వీరధన్వుం డాతని పూర్వునిఁ గువాక్యంబులచే మిత్రత ఖండించినట్లు ద్రుంచె. తత్సమయంబునఁ బూర్ణమాసుండు పూర్ణరోషంబున లక్షభారభాసురగదం గొని యాతనిం గొట్ట నా వీరధన్వుండు నొచ్చి వడిని పరిఘంబుఁ గొని ప్రహరింప నా పూర్ణమాసుండు పవననామకగిరిం బెకల్చి బల్మిం ద్రిప్పి యతనిపై వేయ నది యా వీరధన్వునిఁ గొనిపోయి తద్వారాహీనగర మందలి యజ్ఞవాటికలోఁ బడవేసె. తత్పురియందు హాహాకారంబు లుప్పతిల్లె. నరామరదుందుభిరవంబులు సెలఁగ సురలు విరు లా పూర్ణమాసుపైఁ గురిసిరి. తజ్జనకుండగు గుణాకరుండు రుధిరంబు గ్రక్కి మూర్ఛితుండై ముంగలనున్న వీరధన్వుం గాంచి క్రుద్ధుండై కోదండంబుఁ గైకొని యుద్ధం బొనరింప నెంచి నిర్గమించుట సర్వజ్ఞుండును దద్యజ్ఞహోతయు నగు వామదేవమహర్షి గని యతని కిట్లనియె. ౬౧౪

క॥ ఎఱుఁగకపోయెద వేలా ? మఱియును నామాట వినుము ♦ మాధ్యము దగునే ?
పరిపూర్ణతముండును శ్రీధరుఁడగు శ్రీకృష్ణుఁ డరులఁ ♦ దనరెడి నతఁడో. ౬౧౫

క॥ ధరణీభారముఁ బాపఁగ, సురలకు నుపకృతులఁ జేయ ♦ శ్రుతిధర్మములన్
స్థిరముగ నిల్పఁగ భక్తులఁ, గరుణన్ రక్షింపఁబుట్టెఁ ♦ గద యాదవులన్.

తే॥ అతఁ డుగ్రసేనునకు స ♦ హాయుఁడగుచు
దిశల గెల్వ ద్వారకనుండి ♦ దివ్యబలుని
స్వసుతుఁ బ్రద్యుమ్ను వీనినిఁ ♦ బంపె నంచు
నెఱుఁగు మనఁగ గుణాకరుఁ ♦ డిట్టు లనియె. ౬౧౭

తే॥ సుముని! కృష్ణుఁడు పరిపూర్ణ ♦ తముఁ డటంచు
నవ్యముగ వింటిఁ దల్లక్ష ♦ ణంబు లెవియొ?
తెల్ప వేఁడెద నన వామ ♦ దేవమౌని
యా గుణాకరునకు నిట్టు ♦ లాడె జనక! ౬౧౮

ఆ॥ ఎవని తేజమందు ♦ నెల్ల తేజంబులు, నరిగి లీనమగును ♦ యట్టి దేవు
నిఁ బరిపూర్ణతముగ ♦ నిఖిలవిద్వాంసులు, బలుకుచుందురయ్య ♦ పార్థివేంద్ర!

తే॥ పూర్వమందున వ్యాసాది ♦ మునులు సేరి, షడ్విధావతారంబుల ♦ శౌరి యెత్తె
నంచు నిశ్చయించిరిగాదె ♦ యందునఁ బరి,పూర్ణతముఁ డధికుండగు ♦ భూవరేణ్య!

క॥ ఆ పరిపూర్ణతముండే, యీ పురుషోత్తముఁ డటంచు ♦ నెఱుఁగుము! యతఁడో
యేపనికో యరుదెంచియు, నోపికతోఁ గోటికృతుల ♦ నొనరిచె భువిలోన్.

చ॥ అనపుడు తద్గుణాకరుఁడు ♦ నట్టి హరిప్రతిభాప్రభావముల్
విని ముదమంది వైరమును ♦ వీడి బలుల్గొని వేగ నేగి యా
మనసిజుఁ గాన్కలిచ్చియు న ♦ మస్కృతులం బొనరించి గద్గద
స్వనమున నిట్టులన్ బలికె ♦ బద్ధకరుం డయి మైథిలేశ్వరా! ౬౨౨

ఉ॥ ధన్యతఁ జెందె నాకులము ♦ ధన్యతఁ బొందెను మత్ప్రభుత్వమే
ధన్యుఁడనైతి మత్సవన ♦ ధర్మము లెల్లను ధన్యమయ్యె నో
మాన్యచరిత్ర! సాధుజన ♦ మైత్రి మతిన్ బరమార్థలక్షణా
నన్యభవత్పదాంబురుహ ♦ నన్యసుభక్తి యొసంగి ప్రోవవే! ౬౨౩

ఉ॥ నావుడు భక్తవత్సలుఁ డ ♦ నాథజనావనతత్పరుండు శ్రీ
దేవకుమారుఁ డా మరుఁడు ♦ తృప్తినిఁ బొంది విరక్తివిద్యలన్
సేవలమైన భక్తియును ♦ గీర్తితపూమకభక్తమైత్రియున్
గాఢతమంచు యజ్ఞతుర ♦ గంబు నొసంగెను వానికో విభూ! ౬౨౪

ప్రద్యుమ్నుండు హిరణ్మయఖండంబు గెలుచుట.

క॥ అంత హిరణ్మయఖండ, ప్రాంతములను గెలువ నల్ల ♦ ప్రద్యుమ్నుం డ
త్యంతజవంబునఁ జని యదు, సంతతులున్ వెంటనడువ ♦ సంతోషముతోన్.

చ॥ అల భువిఁ గాంతికాంతమును ♦ నాయతమా నొక స్రోతనామకా
చలము సెలంగుచుండు నట ♦ శౌరి జనించెను గచ్ఛపాకృతిన్
బొలుచును దర్పముం దనెడి ♦ పూజరి, తద్ధరిమందిరంబునన్
వెలిఁగెడి పుష్పమాల యను ♦ దీప్రపవతీమణి, తత్థ్సలంబునన్. ౬౧౮

తే॥ తన్నదీతీరమందున ♦ దండియడవి, కందమూలఫలాదులఁ ♦ గలిగి వెలుఁగు
నావనంబున నల నీలు♦లనెడి కపులు, రామునాజ్ఞ వసింత్రు స్వ♦ప్రజనుగూడి.

ఆ॥ అవ్వి తన్నదనబ ♦ లారవంబు ల్విని, మిగుల కినుక రేగి ♦ మొగిరపడుచు
వాలములను గోళ్ళఁ♦బండ్లను దత్సైన్య, హయరథేభములను♦హత మొనర్చి.

క॥ విజయధ్వజనాధుండగు, విజయుని యరదంబుఁ దోఁక ♦ బిగిచికొని దివిన్
గజబిజఁదిరుగ నల కపి,ధ్వజాధ్వజమున నున్న హనుమ♦ప్రత్యక్షముగాన్. ౬౧౯

ఆ॥ నిర్గమించి కసిని ♦ నిఖిలవానరులను, దోఁకతోడఁగట్టి ♦ వీఁకభువిని
నెట్ట నట్టికపులు ♦ నెమ్మిక రామకిం,కరుఁడు హనుమ యంచుఁ ♦ గరముదలఁచి.

సీ॥ కొందఱు వానరుల్ ♦ సెంది యానందంబు, భక్తితోఁ జేసిరి ♦ వందనములఁ
గొందఱు వానరుల్ ♦ గొంకకముద్దాడి, యయ్యా! నిన్నని చిర ♦ మయ్యె ననిరి
గొందఱు వానరుల్ ♦ గోర్కె లీరిక లెత్త, గంతుల వేసిరి ♦ సంతసమున
గొందఱువానరు ♦ లందరు గుశలులా?,యంచుఁ దమినిఁ గౌఁగి ♦ లించుకొనిరి

తే॥ మఱియుఁ గొందఱు మనసార♦మాటలాడి,రవల నాంజనేయుఁడునిజ♦హస్తతలము
తోడ నాకపులందఱ ♦ దువ్వి కుశల,మడిగి సంతుష్టిఁగూర్పఁగ ♦ నట్టి కపులు.

ఆ॥ అతనియాజ్ఞఁబొంది ♦ యాత్మచిత్రాటవి, కరుగుదెంచి రల్ల♦ యాంజనేయుఁ
డర్జునుని పతాక ♦ యందు సంతర్ధాన,మయ్యె మైధిలేశ! ♦ యచటనుండి.

క॥ మకరాచలవరభాసుర,మకరావని గెలువఁ బటహ ♦ ముందలి మ్రోయన్
స్వకసైన్యసమేతుండగు, మకరధ్వజుఁడేగె వడిసి ♦ మానవనాథా! ౬౩౩

చ॥ పదపడి నట్టి యచ్యుతుని ♦ పట్టి బలంబులఘోషణంబులన్
దదచలపార్శ్వమందు మధు ♦ ధారలఁ గ్రోలుచు సంచరించు ష
ట్పదములు గోట్లకొల్ది నొక ♦ సారిఁ జివుక్కునలేచి మూఁగి త
న్మదకరిరథ్యయోధుల న ♦ మందముగాఁ గఱవం గడంగుటన్. ౬౩౪

క॥ కని మరుఁడున్ బవనాస్త్రం,బును వేయుచు నవ్వి నాల్గు♦మూలల కేగన్
బొనరించె భూవర! యచ్చటి, జనములు మకరాస్యులంచుఁ♦జక్కనెఱుఁగుమా!

వ॥ అంత రతికాంతుం డటనుండి సాఁగి డిండిమదేశంబున కేగి గజముఖులగు నచ్చటి జనంబులం గాంచి యట నిర్గమించి త్రిశృంగదేశంబుల కరుదెంచి శృంగధారులగు నందలి మనుజాలం జూచి త్రిశృంగగిరిపరిసరభాసురంబును ధర్మహర్మ్యమయంబును, సకలాలంకారాలంకృతంబునునై బంగరురంగున వెలుంగు

పురుషులతోడను మించువలెమించు మెలఁతలతోడను నాగనాగాంగనావృతభోగవతీనగరంబువలె నొప్పారు స్వర్ణచర్చికయను నగరంబున కమరావతీపురంబునకుం జను సురేంద్రునిమార్గాది నరిగె. తద్విభుండగు దేవసఖుండు మన్మథుంబునఁ దత్ప్రద్యుమ్నాగమనబలాదుల నాలకించి బలులఁగొని వచ్చి పూజించి సమర్పించి నమస్కరింప నమ్మరుం డానందంబుఁ బొంది భూవరా! నీకును నీప్రజలకును జంద్రసమంబగు కాంతి యేకతంబున గల్గనో యానతిమ్మని కోర నతండు దేవా! పితృపతియగు నర్యముండు కూర్మరూపధారి యగు హరిపాదంబులం బ్రక్షాళనంబు జేసె. తజ్జలం బిట మహానదియై శ్వేతాచలంబుమీఁదుగాఁ బ్రవహించుచుండు. ఈస్థలంబునం బ్రమేధుండను మనుకుమారుండు నిశీథంబున సింహభ్రాంతిని గపిలఁ జంపి వసిష్ఠమహామునిచే శప్తుండై శూద్రయోనిం బుట్టి కుష్ఠరోగంబుతో నొచ్చుచు సంచరించుచు నొకానొక సమయంబునం దన్మహానదిని స్నానం బొనరించి శాపరోగవిముక్తుండై పూర్ణచంద్రతుల్యస్వచ్ఛశోభతోఁ జెన్నారె. తత్కారణంబున నీనదికిఁ జంద్రకాంత యని నామంబుగల్గె. తత్తరంగిణిని మేమును జలకం బాడుటచేఁ దద్దీతిఁ గాంతి మాకుఁ జేకు[illegible]నని వచింప వినిన మన్మథుం డానందించి యాశైవలిని స్నానం బొనరించి దానంబులం గావించె. ౬౩౬

ప్రద్యుమ్నుండు రమ్యకఖండంబును గెలుచుట.

తే॥ ఇటు హిరణ్మయఖండం బఖండశక్తిఁ, గాముఁడు జయించి దేవలోకంబువోలెఁ
జెలఁగు రమ్యకఖండంబుఁ జేరె నందు, నీలనామకవరగిరి గ్రాలుచుండు ౬౩౭

ఆ॥ దానికుత్తరమునఁ దనరెడికాలదేశంబు దానియంతి కంబునందు
భీమనాదిని యను పెదపులిఁగాలనే,మిసుతుఁడగు కలంకుఁడెసఁగియేలు. ౬౩౮

క॥ ఆరక్కసుండు త్రేతను, శ్రీరాముని దెబ్బ నొచ్చి చెచ్చెరభీతిఁ
బాటి యిచటికరుదెంచి సురారాతులతోడఁగూడి యధివసియించెన్. ౬౩౯

క॥ ప్రద్యుమ్నరాక నాతఁడు, స్వోద్యోగులవలన వినుచు నుగ్రతను ధను
ర్విద్యాపారగులను నన, వద్యబలాయుతనిశాట వర్యులఁ గొనుచున్. ౬౪౦

చ॥ ఖరమున నెక్కి దేహ మురు కాలరుచుల్ బఱపంగఁ జాపము
ద్గరశరశక్తియుక్తుఁడయి తద్యదుసేనలతోడఁ దాఁకె న
త్తతిఁ గడు వారి కిర్వురకు దారుణవిగ్రహమయ్యె వేల్పులం
బరమునఁ జూచి వింతపడి వైచిరి ముక్కల వ్రేళ్ళ భూమిపా! ౬౪౧

వ॥ అత్తరుణంబునఁ బ్రఘోష గాత్రవ న్సింహ బల ప్రబలోర్ధ్వగ సహరాజ మహాశక్తి పరాజితులను లక్ష్మణాకుమారులు బదఁగురును దమమొనకగ్రభాగంబునందు నిలిచి తీక్ష్ణశస్త్రంబులతోఁ బ్రత్యర్థి రథిసారథిరథరథ్యధ్వజంబులం బ్రహరించి ఝుంఝామారుతంబులు ఘనంబులం బారఁద్రోలినవిధంబునఁ

జెల్లాచెదరుగా నొనర్ప నా రక్కసు లక్కసునఁ ద్రిశూలముద్గరాదుల నెదురుల
నెదిరించెడి నదనునఁ గలంకుం జేతెంచి రోషించి, ౬౪౨

క॥ శరముద్గరాసిశక్తుల, నరిరథిసారథిమదేభ ♦ హయవక్త్రములన్
బఱపియు ఘంటాదియుత, ద్విరదములన్ గాళ్ళఁబట్టి ♦ వేసెను దివిపై. ౬౪౩

ఉ॥ అంతఁ బ్రఘోషుఁడన్ వసరు ♦ హాతుని పుత్త్రుఁడు వానరాస్త్రమ
త్యంతబలంబునన్ విసర ♦ నందుఁ గపీశ్వరుఁ డాంజనేయుఁడున్
వింతగఁ బుట్టి వాలమున ♦ ద్వేషులఁ గట్టియు వందయామడల్
బంతముతోడఁ బంచె దివి ♦ వాయువు దూదినిఁ బంచినట్టులన్. ౬౪౪

చ॥ పిదపఁ గలంకదైత్యపతి ♦ వీరుని నాతని నాంజనేయుఁడం
చెదను దలంచి మేఘము ర ♦ హిన్ లలినార్చుచు లక్షభారభృ
ద్గదఁ బ్రహరింప నా కపి గ ♦ దాభువిలోనికి దూఁకి ముష్టితోఁ
జదియగఁ గొట్టి వానిని వె ♦ సన్ హరియించెను దత్కిరీటమున్. ౬౪౫

క॥ అప్పుడు తద్రాక్షసపతి, గొప్ప త్రిశూలంబు వాని ♦ కుత్తుక నఱుకన్
దెప్పున వైచినవెంటనె, యప్పరమకపీశుఁ డెగిరి ♦ యతివేగమునన్. ౬౪౬

తే॥ వాని పృష్ఠదేశంబెక్కి ♦ బాహువులను, బట్టి భువిఁ గూల్చి వైడూర్య ♦ పర్వతంబు
బల్మిఁ బెకలించి వైవ న ♦ బ్బలుఁడు దాన, జర్జరీకృతదేహుఁడై ♦ సమసె నపుడు.

ఆ॥ జయజయస్వనములు ♦ సర్వదిక్కులనయ్యె, శంఖదుందుభులును ♦ జాలమ్రోసె
నంజనీకుమారుఁ ♦ డటనె యంతర్ధాన, మయ్యె విరులఁ గురిసి ర ♦ మరవరులు. ౬౪౭

ప్రద్యుమ్నుండు మానవదేశంబున కేగుట.

క॥ మనసిజుఁ డంతట నిజసేనను గొని యటసాఁగి మనుజ ♦ నాయకయుతమున్
గనకమయంబు మనోజ్ఞంబును నగు మనుష్యలోకంబుఁ ♦ బొందెను నందున్.

సీ॥ కామఫలప్రద ♦ కల్పవృక్షయుతంబు, గల్పవల్లీపంక్తి ♦ గాఢతరము
నామోదవహనశీ ♦ లానిలయుక్తంబు, మాధవీకేతకీ ♦ మండితంబుఁ
బికశారికాముఖ ♦ విహగకూజితమును, షట్పదఝంకార ♦ సంకులంబు
గమలకుశేశయ ♦ క్రమదశసహస్ర, కాసారతిలకప్ర ♦ కాశితంబు

తే॥ సకలసుమఫలవల్లరీ ♦ సముచిత మఖిల, ఋతుపుష్పశోభితము ధి ♦ క్కృతసురేంద్ర
నందనవనంబు వైకుంఠ ♦ సుందరంబు, నైన నైశ్రేయసారణ్య ♦ మతిశయించు.

తే॥ అరుధిపర్వతరీతిని ♦ నైదువంద, లామడలు లంబమును వంద ♦ యామడలును
విస్తృతముగల్గి యాకాశ ♦ వెల్గు దాని, యందమును గాంచి యేతెంచు ♦ నట్టి జనుల.

చ॥ మదనుఁడు సూచి యిట్లడిగె ♦ మానవులార ! యిదేపురంబొ ? యే
రిదొ ? వన మిద్ది యెవ్వరిదొ ? ♦ తెల్పుముగా వచియించుఁడీ ! కనన్
ముదమును గొల్పుచుండె నివి ♦ పూర్తిగ మాకన వారలందఱో
యదువర ! నీవు మాపలుకు ♦ లన్నియు శ్రద్ధగ నాలకింపుమా ! ౬౫౨

క॥ వైవస్వతుఁడను మనువొకఁ, డీవేళ వెలుంగు నాతఁ ♦ డిద్ధము శృంగా
రావృతమానవగిరిఁ జని, భావమునఁ దిల్పి మాత్స్య ♦ వరరూపి హరిన్.

చ॥ సతము దపంబు జేసెడి వి ♦ చారణసల్పిన నీ పురోత్తమం
బతనిది యీ మహావనము ♦ నాతనిదే మఱి యీ ధరాతలో
న్నతతమమానవాద్రులు ఘ ♦ నంబగు విష్ణుజగంబునుండి య
ప్రతిహతరీతిఁ దీసికొని ♦ రాఁబడె మున్ను మహాత్మ! వెండియున్. ౬౫౪

తే॥ సూర్యచంద్రవంశంబుల♦శూరత నిలఁ, బొలుచునట్టి మీరందఱు♦భూరమణులు
నతని వంశంబునందున♦నవతరింప, రొక్కొ? నావుడు ప్రద్యుమ్నుఁ♦డొంది వింత.

సీ॥ మానవదేశస్థ ♦ మానవగిరిపైని, సింహాసనంబునఁ ♦ జెలఁగువాని
యోగీశ్వరులును నో♦హో యనన్ మెచ్చెడి, యోగమ్ములన్ జేసి♦యొప్పువాని
దిగ్దశకంబును ♦ దీపింపఁ జేసెడి, నిజశతరుచులతో ♦ నెసఁగువాని
శుకవసిష్ఠవ్యాస ♦ సురగురుముఖముని, వితతితో హరికీర్తి ♦ వినెడివానిఁ

తే॥ దమకు నందఱకుం బ్రపి♦తామహుండు, నైనవాని వైవస్వత♦మానవేంద్రుఁ
బరమశాంతస్వరూపుని♦భ్రాతృయాదవులకు దోడ్కొని చని కని♦మ్రొక్కె నవల.

క॥ మను వేతెంచిన మదనుని, గనుఁగొని తనగద్దె డిగ్గి ♦ ఘనమగు సింహా
సనమిడి భయభక్తులతోఁ, వినతుల నొనరించి యిట్లు ♦ వేఁడఁదొడంగెన్. ౬౫౭

సీ॥ ప్రద్యుమ్నుఁడవు నీవు ♦ వాసుదేవుఁడ వీవు, సంకర్షణుఁడవీవె ♦ శౌరిపుత్ర!
యనిరుద్ధుఁడవు నీవె ♦ యనంగజాతుఁడవీవ, యలరువిల్తుఁడవీవె ♦ యంబుజాక్ష!
గోపకపతివీవె ♦ గోపాలకుఁడవీవ, గుణరహితుఁడవీవె ప్రణుతచరిత!
బ్రహ్మాండపతి వీవె♦పరమాత్ముఁడవునీవె, శ్రుతిబోధితుఁడ వీవె ♦ సూరిగేయ!

తే॥ ఆదిమధ్యాంతరహితుండ♦వాదిపూరుషుఁడవు శాశ్వతుండవు దివ్య♦సుందరుఁడవు
దేవదేవ! మహాదేవ!♦ దేవవంద్య! సన్నుతించెద మ్రొక్కెద ♦ సతము నిన్ను.

తే॥ గగనపావకవాయువుల్♦గలశకాష్ఠ, పాంసువులఁ జిక్కువడనట్లు♦స్ఫటికమరుణ
కాలపీతవర్ణముల వి♦కారమొందద, నివిధిగుణములఁజిక్కక♦నీవు దగవె? ౬౫౯

తే॥ మాయ స్వవశంబు నొనరించి♦మహితశక్తి, భువనముల్ మాటిమాటికిఁ♦బుట్టఁ బెరుగ
గిట్టఁ జేయవె? ప్రళయమం♦దట్టులుండి, సర్వమును జూచుచుండవె?♦సత్స్వరూప!

వ॥ వ్యంగ్యంబులకుఁగాని లక్షణలకుగాని స్ఫోటపరాయణులకుగాని ధనులకు గుణంబులకుఁగాని జ్ఞానేంద్రియంబులకుగాని తెలియంబడక కాలంబనియుఁ గర్మం బనియుఁ గర్తయనియు సాంఖ్యంబనియు యోగంబనియు బ్రహ్మంబనియు మఱియు నానావిధంబుల నెవ్వండు వర్ణింపఁబడుచుండునో యెవ్వనినుండి శ్రుతిమనోబుద్ధిచిత్తాహంకారాదు లగ్నిం బ్రవేశింపఁజాలక మరలెడి విస్ఫులింగంబులకరణిఁ దిరిగి యేతెంచునో యెవ్వఁడు హిరణ్యగర్భుండను నామంబుతోఁ బరగుచు వాసుదేవుండని కొని

యాడుచుండఁ బరిభ్రమించుచుండునో యట్టినిన్ను గుఱితెలిఁగియే యసంగుండవై సంచరించుచున్నవాఁడనని పలుక నయ్యలరువిల్తుండు మందహాసం బొనరించి మధు రంబులగు భాషణంబులతో మోహింపఁజేయువానివలె నిట్లనియె. ౬౬౧

ఉ॥ మాకు గురుండవై నృపతి ♦ మండలి కాదివిభూత్తముండవై
మాకుఁ బితామహుండవయి ♦ మా నుతిపూజలకర్హమూర్తివై
మా కులవృద్ధువై యిటుల ♦ మమ్ము నుతించుట చిత్రమయ్యెడిన్
మీకరుణాభిలాషులము ♦ మేమగిదా కొనుమా! ప్రణామముల్. ౬౬౨

తే॥ ధర్మమూర్తివి నీదు పు♦త్రకుల మమ్ముఁ,గాంచి ప్రోవుమ! తపమాచ♦రించి నీవు
జగముఁ గాచుటలేదె నీ♦సాటిసాధు,వెవ్వఁడు గలఁడిలఁ జెప్పుమా!♦యెఱుకపడఁగ

తే॥ భాస్కరుఁడు బాహ్యతమమును♦బాపుఁగాని,లోనితమమును బాపఁగాఁ♦బూనఁడట్టి
దాని కీవు పాలినవాఁడ♦వో నుతాత్మ!,యంచు మ్రొక్కి తద్గిరినుండి♦యవతరించె.

తే॥ ఇటుల రమ్యకఖండంబుఁ♦బ్రదుటి జయించి,మన్మథుండు తత్స్థలినుండి♦మరలి మేరు
గిరికిఁ దూర్పున నుండెడి♦కేతుమాల,ఖండమునకేగెఁ బరివార♦కలితుఁ డగుచు.

ప్రద్యుమ్నుండు కేతుమాలఖండంబును జయించుట.

ఆ॥ అచట మాల్యవంత♦మనుగిరి మఱి జతు,ర్నామ్ని యనెడిగంగ♦నవ్యమగుచుఁ
జెలఁగు నట్టికొండ ♦ చెంత మన్మథశాలి,ని యను పురవరంబు ♦ నెగడు నందు.

తే॥ దివ్యపీతాంబరధరలు ♦ నవ్యనిత్య, యౌవనవిభూషితలు పుష్ప ♦ హారకమ్ర
ములువిదలు శరీరపరిమళం♦బొక్కవంద,యామడలఁ దాఁకఁ బర్వుచు♦నధివసింత్రు.

ఆ॥ మారసుందరులును ♦ శారదేందీవర, శ్యాములుత్తములును ♦ సారసాత్వి
లునగు పురుషులుండ్రు ♦ గనుఁగొనఁగా నది, దేవపురమువోలెఁ ♦ దేజరిల్లు.

తే॥ అప్పుడా కేతుమాలఖం♦డాంతరమున, గాపురముఁజేయు జనములా♦కంతురాక
వించుఁబరమముదంబున♦వెడలి వచ్చి, యతనికిఁ మ్రొక్కి భక్తితో♦నాడి రిట్లు.

సీ॥ ఎవ్వఁడగమ్యుఁడో♦యెవ్వఁడచింత్యుఁడో, యెవఁడప్రమేయుఁడో♦యెవఁడుపరుఁడొ
యెవఁడాదిదేవుఁడో♦యెవఁడుచిన్మాత్రుఁడో,యెవఁడు సద్రూపియో♦యెవఁడుఘనుఁడొ
యెవఁడు దయాళుఁడో♦యెవఁడు భూతేశుఁడో,యెవ్వఁ డనంతుఁడో♦యెవఁడుబలుఁడొ
యెవ్వఁడుస్రష్టయో♦యెవఁడు వైకుంఠుఁడో, యెవ్వఁడు రుద్రుఁడో♦యెవఁడు విభుఁడొ

తే॥ యెవఁడు భూభారనాశకుఁ♦డెవఁడు వేద,శాస్త్రవర్ణాశ్రమాచార ♦ సర్వధర్మ
రక్షకుండెవ్వఁడో వాని ♦ రాధికేశుఁ, గృష్ణు మునుకొనుచుంటిమో♦కృష్ణపుత్ర!

సీ॥ జనియించి పితరుల ♦ సంతసింపఁగ జేసి, గోకులంబంతయు ♦ సాఁకలేదె?
దోఁగి యశోద సం♦తోషింపఁగా నల్లి, పూతనాదులఁ జావ♦మోదలేదె?
యాతేండ్లబిడ్డయై ♦ యాడి గోపికలతో, బృందావనిఁ విహ ♦ రింపలేదె?
యచలవరంబును ♦ నంగుళితో నెత్తి, యింద్రుఁగూడను ధిక్క ♦ రింపలేదె?

తే॥ పసులఁగాచుచు నఘధేనుఁ బకముఖాసు,రులను మ్రందింపలేదె? యబ్బలునిఁ గంసు
రూపుమాపఁడె! నీతండ్రి శ్రీపతి యని, యానుపూర్విగ హరియశ మ్మాడి మఱియు.

తే॥ అట్టి యుగ్రసేననృపసూయార్థ మఖిల, దిగ్జయము సల్ప నిజసుతు దేవదేవు
నిన్నుఁ బంపఁడె యాహరి? నీవు సకల,నృపుల గెల్చియే తెంచవే? యిటకు దేవ!

ఆ॥ ఇపుడు మిమ్ముఁజూచి యేము ధన్యులమైతి, మయ్య! యనఁగ మదనుఁ డట్టివారి
కాదరమున మదగజాశ్వకుండలమణి, భూషణముల నిచ్చె భూవరేణ్య!

తే॥ అట్టిరాజధానిని నొక్క యబ్దమొక్క, దినముకై వడి గడపెడి మనసిజునకుఁ
దస్విభుఁడు ప్రజాపతి బలి దండనుఁగొని, వచ్చి యిచ్చియుఁ బ్రణమిల్లె భక్తి నవల.

తే॥ పరులు సొరరానిదియుఁ బ్రజాపతితనయులు, సొరఁగఁదగినది శృంగార సురుచిరంబు
నైన కామవనంబున కరిగె మరుఁడు, యాదవభ్రాతృసైనికు లనుసరింప. ౬౭౫

తే॥ అట్టికామవనంబున సంగజాస్త్ర, తేజముల వెల్గు సుందరుల్ దివ్యగర్భ
మొంది వెంటనే కనదగో యుర్వరేశ!, యిట్టియారామ మెందైన నెఱిఁగితివొకో?

ఆ॥ ఆవనంబునుండి యపరకందర్పుండు, పుష్పచాపవరముఁ బూని పీత
పటముఁగట్టి పంచబాణములను బాల్చి, యేగుదెంచి విల్లు నెక్కుపెట్టె. ౬౭౭

కం॥ ఆరవమును విని యాదవ,వీరవరుల్ మిగుల కామ విహ్వలు లగుచున్
వారణహయములఁదొడఁత, ధారణిపైఁ గూలిరయ్య తత్పురమందున్. ౬౭౮

కం॥ అల రుక్మిణీకుమారుఁడు, లలితాంగుఁడు మన్మథుండు లక్షణయుతుఁడై
వెలిఁగెడి తత్స్త్రీలలోపలఁ, గలిసెను జలమున జలంబు గలిసినభంగిన్. ౬౭౯

కం॥ అత్తఱి యాదవులందఱుఁ, దత్తఱపాటును త్యజించి తత్కృష్ణసుతున్
జిత్తభవుఁ బూర్ణుండని, చిత్తములం దెఱిఁగి వింతఁ జెందిరి పిదపన్. ౬౮౦

ఆ॥ ఈతెఱఁగున మరుఁడు కేతుమాలాహ్వయ, ఖండమును జయించి కదలి యచట
భవ్యయోగమయము భద్రాశ్వఖండంబుఁ, బొందె దుందుభులు మ్రోయ నందు.

ప్రద్యుమ్నుండు భద్రాశ్వఖండంబును గెల్చుట.

సీ॥ కనకపండువఁజేయు గంధమాదన మను, పర్వతం బొక్కటి వఱలుచుండు
భూతాద్యుపద్రవములను ధ్వంసము సల్పు,సీతయన్ గంగయుఁ జెలఁగుచుండు
దివ్యహయగ్రీవ దేవభాసురము వే,దక్షేత్రరాజంబు దనరుచుండు
తద్ధయగ్రీవపాదయుగదాసుఁడు ధర్మ,సుతుఁడు భద్రశ్రవపతి వెలుంగు

తే॥ నల్లగంగాతటంబున యాదవులును, హేమపటమయశిబిరము లిసుకతిన్నె
లందు వేసిరి పిమ్మట నట్టిఖండ,మేలు భద్రశ్రవుఁడు తత్ప్రవృత్తిని విని.

చ॥ బలుల గ్రహించి యామరుని భక్తి నొసంగి శిరంబుతో నతుల్
సలిపి నుతుల్పొనర్చె హరి జా! పరిపూర్ణతమావతార! నీ

విల ఖలశిక్షణార్థమయి ♦ స్వేష్టజనావళిరక్షణార్థమై
కలుఁగవె ? దిక్కులం గెలువఁ ♦ గాఁ దమి నిట్టుల నేఁగుదెంచవే ? ౭౮౩

ఉ॥ ఈవల శంబరాసురు వ ♦ ధింపవొకో ?, శకటస్థు నుత్కచా
ఖ్యావృతుఁ దత్కనీయు ఖలు ♦ నావిరి గోకులమందుఁ ద్రుంపఁడే ?
దేవ ! యిఁకేల దద్గ్రజుఁడు ♦ దీనుల మానుల నాదితేయుల
న్నావఁగ మోఁదుచుండెఁ శకుని ♦ నామము తో దిరుగాడు నిచ్చ్యోడల్. ౭౮౪

తే॥ కాన మీరలు వానిని ♦ గష్టమునక, చంపవలయును నితరులో ♦ చంపఁజాల
రనఁగఁ బ్రద్యుమ్నుఁడో ధర్మ ♦ తనయ ! వాని, నాశబలవసతిస్థితుల్ ♦ బలుకవయ్య !

వ॥ అనవుడు భద్రశ్రవుం డో మహాప్రభూ ! తొల్లి కశ్యపమహర్షికి దితియందు హిరణ్యకశిపుహిరణ్యాక్షులను నిరువురు రాక్షసులు జనించిరి. అందుఁ గనిష్ఠుండగు హిరణ్యాక్షునకు శకుని, శంబర, హృష్ట, భూతసంతాపన, వృక, కాలనాభ మహానాభ, హరిశ్మ, శ్రూత్కచులను దొమ్మండ్రుగురు కుమారులు పుట్టిరి. వీరలు దేవకూటంబునకు దక్షిణంబున జఠరగిరికిఁ గ్రిందనున్న చంద్రావతీపురంబునం దుందురు. శకుని మిగిలిన యెన్మండ్రు తమ్ములతోఁ గూడి తత్పురిని వసించుచు మహర్షులు యజ్ఞంబులఁ బ్రారంభము జేసినపుడెల్ల వచ్చి తద్భంగంబులం గావించి బాధించుచునుచుందురు. వీనియుగ్రత కింద్రాదులును నైతము గుందియుందురు. కాన సృష్టినష్టుండు నీకు వధ్యుండు. నీవు గోబ్రాహ్మణయజ్ఞసాధువిప్రభక్తరక్షణార్థంబై జన్మించితివి గాదె. నా నతులం గ్రహించి నావిన్నప మాలించి యొసఁగుమని ప్రార్థింప నమ్మురుండంగీకరించి యాతని కభయం బిడి సైన్యయుక్తుండై తచ్చంద్రావతీపురంబున కరిగె. అంత నా ప్రద్యుమ్నాగమనబలాదులను దైత్యపుంగవుం డగు శకుని నాచే విని కనలి దానవసభం గావించి యందు శూలమెత్తి సభాసదులకు నిట్లనియె. ౭౮౫

ఉ॥ దానవులార ! నేఁడఖిల ♦ దైత్యులసూదనుడు నాకు వైరియా
సూనశరుండు వచ్చెడిని ♦ జూడుఁడి ! నాయనుజన్ము శంబరా
ఖ్యానిమిహారినిన్ దునిమి ♦ నట్టి బలుం డితఁడే సుమీ తొల్లి
వీనినిఁ జంపి యంత నల ♦ వేల్పులపెద్దను రూపుమాపెదన్. ౭౮౬

క॥ కావున మీరాగ్రహమునఁ, దీవరముగఁబోయి వాని ♦ దీర్ఘబలంబుల్
బోవఁగ నెట్టుఁడి ! కొట్టుఁడి, యేవిధనో యమయాసవమునుగ ♦ నిలఁజేయవలెన్.

వృకుండను కృష్ణపుత్రుండు హృష్టదైత్యునిం గూల్చుట.

చ॥ అనవుడు హృష్టనాముకము ♦ హాసముఁ డన్నఖులంబుఁ దీర్చుకో
రిని నిజదైత్యకోటిఁ గొని ♦ శ్రీవిభుపుత్రకుఁడైన మారుతో
నని నొనరింపఁగాఁ జనియె ♦ నావల నంగజుఁ డాత్మకీయునే
నను ద్రుటిలోన గృధ్రరచ ♦ నం బొనరించె విలాసరీతిగాన్. ౭౮౭

వ॥ తద్గృధ్రవ్యూహచంచుస్థానంబునం ధన్వివరుండగు ననిరుద్ధుండును తద్గ్రీవంబున నర్జునుండును దత్పృష్ఠంబున సాంబుండును దత్పాదంబులను దీప్తిమద్గదులును దదుదరంబునం బార్ష్ణియు దత్పుచ్ఛంబున భానుండును బొల్పారిరి. అంత నా యుభయులకు నబులకబులకుం బోరైనట్లు తుములయుద్ధం బయ్యె. అందు దైత్యులు బాణకృపాణశూలత్రిశూలముసలముద్గరతోమరాద్యాయుధంబులను వారిదంబులు జలబిందువులం గురిసినట్లు వర్షించిరి. ప్రావృట్కాలంబున జలదంబులు జలజాప్తునిఁగప్పిన ట్లాసైన్యరజంబులు సూర్యాకాశమండలంబులం గప్పె ఇట్టిసమయంబున వృక హర్షానిల గృధ్ర వర్ధనోన్నాద మహాశ పావన వహ్ని క్షుదులను మిత్రవిందానందనులు బదుగురు నేతెంచి యరులతోఁ దలపడిరి. అందు వృకుండను హరిసుతుండు సైన్యంబుల కగ్రమందు నిలిచి పలుమాఱు ధనుష్టంకారంబులం గావించి యరిహరికరిరథరథిసారథిపతాకాదులం జెండి చెకపికలాడ నా దైత్యోద్భటులు కొందఱు భిన్నపాదులై హతపాదపంబులభాతిఁ బడిరి. కొందఱు హతభాండంబులవలె నానారీతులం దెగి కూలిరి. మఱియు గజంబులు ఛురికావిద్ధంబులగు కూష్మాండఖండంబులలీల రెండుతుండెములై పడియె. అత్తఱి హృష్టుం డాలోకించి సింహారూఢుండై యేతెంచి రోషించి, ౬౯౦

చ॥ హరిసుతుఁడైన తద్వృకుని ♦ యశ్వములన్ జతురంబకంబులన్
నఱికి రథంబు నిర్వదిట ♦ నాశ మొనర్చి దశాశుగంబులన్
వరకవచంబు ఛిందినిని ♦ బాడొనరించి ధ్వజంబు మూటిచే
ధరణిఁ గూల్చి సారథిని ♦ దంచెను బాణయుగంబునన్ విభూ! ౬౯౧

చ॥ అవల వరిష్ఠుఁడైన వృకుఁ ♦ డన్యరథంబును నెక్కి స్వీయచా
పవరముఁ గిన్కతోఁ గొనెడి ♦ పట్టున దైత్యుఁడు దానిఁ ద్రుంప న
ట్టి వృకుఁడు దివ్యమౌ గదఁగ ♦ డిందిగఁ గొట్టె తదీయసింహమున్
గవియుచు హృష్టదైత్యుని మొ ♦ గంబున మోఁదె ననంతరంబునన్. ౬౯౨

శా॥ సింహం బుత్కటరోషపూర్ణమతితోఁ ♦ జేతాఁకున్ వీఁకతో
రంహస్స్ఫూర్తిని నేగుదెంచి పలుగ ♦ ర్జల్ జేసి యోధావళిన్
సంహారం బొనరించి యా వృకబలున్ ♦ సర్వంసహన్ గూల్చఁగా
నంహోనాశకుఁడైన యా వృకుఁ డనా ♦ యాసంబుగా దానినిన్. ౬౯౩

చ॥ భుజములతోడఁ బట్టుకొని ♦ భూమినిఁ గూల్చుచు జెట్టి జెట్టిపై
గజిబిజిఁ జెంద నెక్కువిధి ♦ గా నధిరోహణ మాచరింప నా
గజరిపు వార్చి నెమ్మదిగఁ ♦ గ్రమ్మఱ లేవఁగఁ డంగ నాతఁడున్
నిజదృఢముష్టితోఁ బొడిచె ♦ నీల్గెను దద్ధతిఁ దన్మృగేంద్రముఁ . ౬౯౪

ఉ॥ అత్తఱి హృష్టదైత్యుఁడు మ ♦ హాగ్రహ మొంది స్వకీయశూలమున్
దత్తఱపాటుతోడఁ గొని ♦ తద్వృకుపైఁ బడవేయ నద్దియున్
గత్తఱిఁగొల్పు నుల్కవిధి ♦ గాఁ జనుదెంచ నతండు దానినిన్
గత్తినిఁ జెండె నాస ఖగ ♦ కాంతుఁడు సర్పముఁ జెండినట్టులన్. ౬౯౬

ఆ॥ అవల హృష్టదైత్యుఁ ♦ డాత్మఖడ్గంబుతో, ధర వణంక వృకుని ♦ తలను గొట్ట
నతఁడు దప్పికొనుచు ♦ శితఖడ్గమున హృష్టు, తలను గూల్చె నట్టి ♦ తరుణమందు.

చ॥ సురనరదుందుభుల్ మొరసెఁ ♦ జూచిరి వింతగఁ గిన్నరాదులున్
గురిసిరి పూల దేవత ల ♦ కుంఠితరీతినిఁ గృష్ణపుత్రుపై
వెఱను నశేషరాక్షసులు ♦ స్వీయపురంబున కాక్షణంబునన్
బఱుగిడి రెల్ల యాదవు ల ♦ పారముదంబును బొందిరో విభూ! ౬౯౭

తే॥ అంత శకునినామకదాన ♦ వాధిపుఁ డల
హృష్టుమరణంబు విని క్రుధ ♦ నిలను మూర్ఛఁ
బడియు దేవభీకరులైన ♦ భ్రాతృవరుల
నంపెఁ బ్రద్యుమ్నుతోఁ బోర ♦ నంతమీఁద. ౬౯౮

సంగ్రామజిత్తు భూతసంతాపనాసురునిం జంపుట.

తే॥ భూతసంతాపనుఁ డనెడి ♦ పొలసుదిండి
గజము వృకుఁడు ఖరంబును ♦ గాలనాభుఁ
డురుకీర్తిన్ మహానాభుఁడు ♦ గఱిఁ దిమింగి
లము హరిశ్మశ్రువును నెక్కి ♦ సమితిఁ జనిరి. ౬౯౯

సీ॥ వేయి యశ్వంబులన్ ♦ వేయి చక్రంబులన్, వేయి కుంభంబులన్ ♦ వెలుఁగునదియు
వందజాబిల్లుల ♦ పాటి తేజంబులన్, వందటెక్కెంబులఁ ♦ జెందినదియు
రత్నభూషణములన్ ♦ నూత్నముక్తాహార, లతులను మిక్కిలి ♦ తనరినదియు
యోజనపంచక ♦ యుక్తవిస్తారంబు, గామసంచారంబు ♦ గలిగినదియు

తే॥ జైత్రమును మయదానవ ♦ సంఘటితము
సర్వమాయామయంబైన ♦ స్యందనంబు
శకుని దానవేంద్రుం డెక్కి ♦ సమరమునకు
ద్వాదశాక్షౌహిణుల్ గొని ♦ బయలుదేరె. ౭౦౦

చ॥ అల పొలదిండిదండు సను ♦ నప్పుడు చాపరథేభరథ్యయో
ధులరవముల్ సెలంగ జల ♦ ధుల్ నెఱి ఘూర్ణిలెఁ గూలె శైలముల్
గలఁగ ధరిత్రి యంత రతి ♦ కాంతుఁడు ధీరుఁడు గృష్ణజుండు త
ద్బలములఁ గాంచి స్వీయయదు ♦ వర్యుల కిట్లనె మైథిలేశ్వరా! ౭౦౧

తే॥ వపువు, కర్మగుణయుతంబు ♦ బాంచభౌతి
కంబు ఫేనసమమని యా ♦ గత గత భువ
నములు గాలవశంబని ♦ సుమతు లర్భ
కుపను లల్లు లెక్కింపరు ♦ కొంచెమేని. ౨౦౨

చ॥ చనెదరు సాత్త్వికుల్ నరులు ♦ సర్వసుఖాశ్రయనాకభూమికిన్
జనెదరు రాజసుల్ ప్రజలు ♦ స్వల్పసుఖాస్పదమధ్యభూమికిన్
జనెదరు తామసుల్ జనులు ♦ సర్వశుగాకరనీచభూమికిన్
జనెదరు వచ్చుచుంద్రు బలు ♦ సారులు వారలు స్వక్రియాతతిన్. ౨౦౩

తే॥ మనము బంధమోక్షములకు ♦ ఘననిదాన
మగును జగము మనోమయం ♦ బగును గాదె
యామనము భీతిఁగన్నచో ♦ నఖిలజగము
భీతికరముగనుండు నో ♦ భ్రాతలార! ౨౦౪

ఉ॥ ఏరహి రాజ్యసౌఖ్యము ధ ♦ రేశులకున్ సతతంబునుండదో
యా రహి నాగలోకసుఖ ♦ మావిధ యజ్ఞఫలం బొనర్పదై
వారెడివారి స్వర్గసుఖ ♦ ఫక్కి తిరంబుగ నుండఁజాలదా
ధీరవిరాగులో తృణవి ♦ ధిన్ దిలకింతురు వాని నన్నిటిన్. ౨౦౫

వ॥ ఎట్లు స్వభావంబుగా నహర్నిశలును ఋతుగుణంబులును దేహగుణంబులును గలుగుచుఁ దొలఁగుచునుండునో యట్లు జనులును బుట్టుచు గిట్టుచుందురు. మార్గమధ్యంబునఁ బథికులకొడి సంగాలంబు సంభవించి చనినయట్లు జీవునకును సతిసుతబాంధవాదులును గన్పడి చనుచుందురు. దృశ్యపదార్థంబెల్ల మంచుమాదిరి త్రుటిలో నశ్యంబని యెఱుంగుము. ఎట్లగ్ని యొక్కండయ్యుఁ గాష్ఠసంచయంబున నానారూపంబులతోఁ బ్రకాశించునో యెట్లిందుం డేకకుండయ్యు నుదకంబుల బహుత్వంబున వెలుంగునో యట్లద్వితీయుఁడగు బరాత్పరుండును నానారీతుల బాహ్యాభ్యంతరదేహాదుల విరాజిల్లుచుండు. పరమతత్త్వంబును గను మహామహుం డుభయలోకంబులవలనఁ బ్రయోజనంబు గానక నిశ్శ్రేయసపదంబును దిలకించుచు నెల్లెడల సంచరించుచుండు బ్రహ్మవిద్వరీయుండు భవనంబునైన వనంబుగాను, వనంబైనను భవనంబుగాను దలఁచుచుండు. పరమచుతి బాలునివలె సుఖియు సదానందమయుండునై దేహాద్యభిమానంబుల వీడి కట్టువస్త్రంబున్నదియు లేనిదియు గుర్తెఱుంగక పరిభ్రమించుచుఁ బరమపదంబుఁ జెందు. ఏకపదార్థం బనేకగుణాశ్రయేంద్రియంబుల ననేకరీతులగా గోచరించిన ట్లాత్రిగుణాశ్రయపరాత్పరుం డొక్కరుండే నానానామరూపగుణవిశేషంబులతో నానాశాస్త్రపారంగతులగు బుధులకువర్ణనీయుండగుచుండు జ్ఞానవైరాగ్యసంపన్నుండును, కృష్ణభక్తుండును నగు

జనుండే బహువిధవర్ణిత శ్రీకృష్ణపదంబుఁ బొందునని యెఱుంగుఁడన యాదవపుంగవు లందఱానందం బొంది నిశ్చయం బెఱింగి దృఢసంకల్పులై శస్త్రాస్త్రంబులం గొని సముద్రతటవిలసల్లంకానగరంబునఁ గపీంద్రులు దానవులతోఁ దలపడినట్లు సీతాగంగాతటంబున నా రక్కసులతోఁ దలపడి తుములయుద్ధం బాచరించిరి. అందు దైత్యమహామాత్య ప్రణోదితంబులై. ౨౦౯

సీ॥ అభ్రడంబరభీక♦రాద్రులవలె మత్తకరివరంబులు గినుక♦ నరుగుదెంచి
గాలునులమోయించి♦బలుశీత్కృతులఁజేసి, బృంహితంబులసల్పి♦యెగసి కవిసి
తురగముల్ గూలిచి♦యరదముల్ వ్రాలిచి,ధ్వజములఁ బుడమిపైఁ♦బడఁగవైచి
సారథిహయయుత♦స్యందనముల్ దండి,తొండములఁ ధాత్రిఁ♦ద్రోసిమెత్తి

తే॥మిన్నుపైనుంచియంఘ్రులఁ♦గొన్నియరద,ములను నుసిజేసి మాతంగ♦ములనుగొట్టి
వీరవరులను ఖండించి♦విస్తరించి, స్వీయనాథు లౌరా! యనం♦జెలఁగె మఱియు.

సీ॥ ఉత్పతత్తురగంబు♦లుద్ధవిడిఁ వచ్చి, నుఱుమాడె దివ్యమా♦కరిరథముల
గజహయారూఢులు♦ గైకొని శక్తుల, నేతెంచి కిన్కఁఖం♦డించి రరుల
నసిధరుల్ గసితోడ♦ నండజంబులభాతి, నగురుచు నఱికిరి♦ పగరగుముల
బలులు గొందఱురేగి♦ పరశువుల్ దాలిచి, ఖండింపఁదొడఁగిరి♦ దండిమగల

తే॥ చక్రములతోడఁ గొందఱు♦సైనికులను, రూపుమాపిరి కొందఱు♦రోషమతిని
బరిఘులఁ గ్రుచ్చి పత్తుల♦నఱికిరయ్య!,యాదవులు నొవ్వఁగడఁగిరా♦యనసరమున.

వ॥ సంగ్రామజి, ద్బృహత్సేన, శూర, ప్రహరణ, విజి, జయ, సుభద్ర, వామ, సత్య, కాశ్వయులను భద్రాకుమారులు బనుగురు నాలోకించి యాగ్రహించి యరుదెంచి యానికాటపర్యులతోఁ బోరాడఁ దొడంగిరి తత్సమయంబున.

తే॥ భూతసంతాపనాసుర♦ పుంగవుండు, గనలి యదుసేన బాణము♦ర్దినముజేసె
నపుడు సంగ్రామజిత్తను♦హరిసుతుండు, వచ్చి శతబాణముల వాని♦పైని విసరె.

తే॥ అపుడు భూతసంతాపనుఁ♦ దల్లడిలయ,కంధిసంఘోషభీమసం♦ఘట్టనాది
నియగు తత్ప్రింజినిం జెండె♦నివ్వెఱపడ, మరల సంగ్రామజిద్వీర♦వరుఁడు గనిని.

ఉ॥ కాంచి శితాన్యచాపమును♦ గైకొని యెక్కిడి యట్టి దైత్యుపైఁ
బంచ శతాంబకంబు లవి♦ వాని శరాసన ముత్తరించి లో
హాంచితవర్మముఁ దునిమి♦ హస్తివరంబును గొట్టి వే ప్రవే
శించెను ధాత్రిలో నవలఁ♦ జింతిలి కొంచెము తన్నికాటుఁడుఁ. ౨౧౨

చ॥ కనలి స్వకీయమత్తకరిఁ♦ గంజదళాక్షుకుమారు మీఁదికిఁ
బనుపఁగ నద్ది కాలయము♦ భాతిని వచ్చుటఁ గృష్ణపుత్రుఁడుఁ
గని కినుకఁ గరంబులను♦ గట్టిగఁబట్టి గ్రహించి ఖడ్గముఁ
దునిమెను నూరువక్కలుగఁ♦ దొండము భూప! యనంతరంబునఁ. ౨౧౩

ఆ॥ అల గజంబు శీర్ణకృ♦తులను హెచ్చుగఁ జేసి, కటమునుండి మదము♦గార్చి తన్ని
శాటు విడిచి వీర♦సమితినిం గూల్చుచు, స్వపురికేగె నద్దు♦పాల్గఁ ద్రోసి.

క॥ అలపురి కాకరియూరహిం, గలను విడిచి వచ్చియుంటఁ ♦ గన్గొని యచటన్
జెలఁగెడి దనుజులు గోలా,హలముల్ గావించి రంతఁ ♦ యవనివరేణ్యా!

చ॥ తురమున నంత నా ఖలుఁడు ♦ దోయజనాభుని పుత్రుఁ ద్రుంప రు
క్స్ఫురుచిరచక్రమున్ బఱపెఁ ♦ జోద్యకరంబుగ నద్ది గ్రీష్మభా
స్కరవిధి దన్నుఁ జేరుటను ♦ గన్గొని దానిఁ గృష్ణసూనుఁడున్
నఱికెను వందతున్కలుగ ♦ నవ్యనిజాద్భుతచక్రధారలన్. ౨౧౬

తే॥ అవల భూతసంతాపనుఁ ♦ డచట నున్న, జఠరగిరిశృంగముం గొని ♦ సాహసమున
నతనిపై వేసె నంత నా ♦ హరితనయుఁడు, దానిఁ గైకొని యాదైత్యుఁ ♦ దద్దఁ గొట్టె.

ఉ॥ పిమ్మటఁ దన్నిశాచరుఁడు ♦ భీకరమౌ జఠరాద్రిఁ బూర్తిగా
హుమ్మని చేతులం గొనుచు ♦ నోఖల! యీగిరి వేసి నిన్ను నం
తమ్మొనరింతు నేనని మృ ♦ ధంబున నిల్వ నతండు దేవకూ
టమ్ముఁ బెకల్చి యీగిరిని ♦ డమ్మనిపింతును నిన్ను దానవా! ౨౧౮

క॥ అని యాతనిముంగల నిలి,చె నవల దైత్యుండు నగము ♦ శ్రీహరిసుతుపై
నునిచెను బడపడి భద్రా,తనయుఁడు దనగిరిని వైచెఁ ♦ దద్దనుజునిపై.

ఉ॥ ఆ మల లట్టె పోరుచుఁ ద ♦ దాసురుపైఁ బడ వాఁడు వెంటనే
యీమహిఁ గూలి సిగ్గెను ధ ♦ రేశ్వర! యంతట వానిజోతి సం
గ్రామజదాత్మలోఁ గలిసెఁ ♦ గన్గొని చల్లిరి పూల వేల్పు లా
కామపతాకినిన్ బటహ ♦ కాండము మ్రోఁగె జయస్వనంబులన్. ౨౨౦

అనిరుద్ధుండు వృకాసురుని వధించుట.

తే॥ అట్లు భూతసంతాపనుఁ ♦ డంతమగుట, వినిన శకుని హరిశ్మశ్రు ♦ వృకులు గాల
నాభుఁడున్ మహానాభుఁడ ♦ నంతరోష,మున రణంబున కేతెంచి ♦ రనఘ! యపుడు.

తే॥ శకునిమన్మథు లనిరుద్ధ ♦ వృకులు గాల,నాభసాంబులు మఱి మహా ♦ నాభదీప్తి
మంతులున్ వెండియున్ హరి ♦ శ్మశ్రుభాను,వులును బోరాడఁ దొడఁగి రా ♦ కలహమందు

మ॥ అనిరుద్ధుండు మహాబలుం డఖిలవీ ♦ రాగ్రంబునన్ నిల్చి వీఁ
కను బాణంబుల నింద్రుఁ డద్రులఁ బవిన్ ♦ ఖండించిన ట్లామహా
దనుజానీకముఁ గొట్టెఁ దద్ధతులచే ♦ దైత్యుల్ విభిన్నాంగులై
ఘనవాతాహతవృక్షరీతిఁ బడి ర ♦ క్తయ్యంబునన్ మూర్ఛతోన్. ౨౨౩

క॥ మఱియును దర్శరహతులను, గరివరములు భిన్నకుంభ ♦ కరరదనములై
యురువజ్రాహతగిరివిధి, ధరఁ బడె రెండుపఱియలుగ ♦ ధరణీనాథా! ౨౨౪

తే॥ మఱియు దద్భిన్నకుంభస్థమౌక్తికతతి, యంబకాంధకారమయమహాహవమున
నిశిని జదలున రిక్కలునెగడినట్లు, వెలుఁగఁదొడఁగెను జూపఱుల్ వింతపడఁగ.

క॥ కొందఱు రథికులు భయపడి, తొందరతో రథముల విడి దొరకినత్రోవన్
బొంనుచు నేసందులనో, చెందిరి మఱిఁ గొంద ఱచటఁ జెల్లిరి జనకా! ౭౨౬

తే॥ ఇటుల దానవచమువుల నెల్లనల్ల, విశ్వకేతువు ద్విరదంబు వెలఁగపండు
మ్రింగినట్టులఁ ద్రుటిలోనఁ ద్రుంగఁజేసె, నౌర! తచ్ఛక్తి వర్ణింపనలవియగునె?

సీ॥ కుంభివరంబులే కుంభీరములుగాఁగ, రథములు శింశుమారములుగాఁగ
నుష్ట్రిఖరాస్యాదులురుకూర్మములుగాఁగ, హస్తంబులెల్ల మత్స్యములుగాఁగ
భుజములు సరిమైన భుజగంబులునుగాఁగ, సొగసైన చక్రముల్ సుడులుగాఁగ
శస్త్రశంఖాదులు సైకతంబులుగాఁగ, మకుటరత్నాదులు మొరమ్ముగాఁగ

తే॥ వాలములు శైవలముగాఁగ బలయుగంబు, తీరయుగ్మముగాఁగ నఘోరరీతి
వందయోజనములుదాఁక వైతరణివిధమున రక్తతరంగిణి దనరె నాజి. ౭౨౮

వ॥ అంత నా రణాంగణంబునకుం బ్రమథభైరవభూతభేతాళయోగినీగణంబులును శతఢాకినీపరివృతయు సింహారూఢయు నగు భద్రకాళియు నరుగుదెంచి యట్టహాసం బొనరించి తద్దైత్యుల భక్షించి తద్రుధిరంబును గడుపారఁ ద్రాగి పాడి యాడి రుద్రముండమాలార్థంబుగాఁ దత్కపాలంబులం గైకొని చనిరి. విద్యాధరీమణులును, గంధర్వీలలామలును, నప్సరసలు నేతెంచి క్షాత్రధర్మపరులై మరణించి దేవరూపంబుఁ బొందిన వీరుల ననురూపులగువారినిం బరస్పరస్పర్థతో వరించి మురిసిరి. మఱియు రాజనీతివిశారదులై పరాఙ్ముఖులుగాక పోరి మృతులైన వీరవరులు మార్తాండమండలంబు భేదించుకొని విష్ణుపదంబున కేగిరి. శేషదైత్యులా యనిరుద్ధుం గాంచి పలాయితులైరి. అత్తఱి వృకనిశాటుం డాలోకించి యేతెంచి రోషించి ధనుష్టంకారంబులం గావించి దశబాణంబులతోఁ దచ్చాపంబును ద్రుంప నా యనిరుద్ధుం డన్యశరాసనం బెక్కుపెట్టి పదిశరంబులతో నా యాసురుని విల్లు ఖండింప నా ఖలుండు లలజ్జిహ్వుండును, బ్రస్ఫురితాధరుండునునై భయంకరంబగు త్రిశూలం బెత్తి యవ్విశ్వకేతువుతో నిట్లనియె. ౭౨౯

శా॥ దుష్టా! క్షత్రియు ధీరు విక్రము నినుఁ ద్రుంతున్ జుమీ, వేల్పులన్
గష్టంబుల్ గలిగించి చెండితగు నా గండల్ చమూసంతతుల్
నష్టం బొనటు సల్పియుంటి వరరే! నా విక్రమోత్సాహముల్
స్పష్టం బయ్యెడి నీకు నీక్షణమునన్ శ్రద్ధన్ విలోకింపుమా! ౭౩౦

మ॥ అనఁగా నా యనిరుద్ధుఁడున్ వినుచు నిట్లాడెన్ నిశాటాధమా!
యనువారల్ బనియేమి సల్పరు సుమీ! యామాట నిక్కంబెగా

కనుమా! మద్బలధైర్యసంపద నిన్ ♦ ఖండింతు నేనట్లు న
ల్పనిచో గోశిశువిప్రహత్యలను ♦ బ్రాప్తంబౌత నాకియ్యెడన్. ౨౩౧

తే॥ ఇటుల వృకుఁడును బల్గించి ♦ చటులమగు త్రిశూలమున ననిరుద్ధుని ♦ శూరుఁబొడువ
నతఁడు వామహస్తమ్మున ♦ నద్దిపట్టి, యట్టి దైత్యునిఁ బ్రహరించె ♦ నగ్గలముగ.

చ॥ పడపడిఁ దద్వృకుండు బహు ♦ భారసమేతగదన్ గ్రహించి యా
మదనకుమారు శేరు నుసి ♦ మాడ్కి నొనర్చ నతండు గత్తితో
నెదురుచుఁ దద్భుజాయుగము ♦ నేర్పుఁ ద్రుంచెను శైలపక్షముల్
భిదురముతోడఁ జెండినటుఁ ♦ బిమ్మట భిన్నభుజుండు దైత్యుఁడున్. ౨౩౩

చ॥ ఇల వణికించు చంఘ్రులను ♦ హెచ్చుగనోరును విప్పి నాలికన్
వెలికిడి దంష్ట్రలం దెఱచి ♦ విన్నను ద్రోలుచు భీకరంబుగా
సుఱువుగ నేగుదెంచి లలిఁ ♦ జూపఱు నబ్బురమొందగాఁ దిమిం
గిలము దిమిన్ గ్రసించినటు ♦ కృష్ణునిమన్నసి బ్రింగె భూవరా! ౨౩౪

ఉ॥ అంతటఁ గార్ష్ణి జుండు గను ♦ లాత్మనుదయన్ దనుజోదరంబునన్
గంతుఁడు మీనకుక్షి నఘు ♦ గర్భమునందున గోపకుల్ శచీ
కాంతుఁడు వృత్రగర్భమునఁ ♦ గంజదళాక్షుఁడు దద్వృకోదరా
ర్భాంతరమందు నుండినటు ♦ లంతముఁ బొందకయుండె వేడ్కతోన్. ౨౩౫

తే॥ అవల యదుసేన భయము మొందె ♦ నపుడు గదుఁడు
గదను దద్దైత్యులఁ గొట్టఁ ♦ గా హతోత్త
మాంగుఁడగువాఁడు రక్తబిం ♦ ద్వాళితోడ
వెల్గె గైరికాప్పుల వెల్లు ♦ వింధ్యమునలె. ౨౩౬

ఆ॥ మఱియు నర్జునుండు ♦ మంచిఖడ్గంబుతో, నట్టి వృకసురారి ♦ యంఘ్రియుగముఁ
జెండ నతఁడు బడియె ♦ భిన్నాంఘ్రియై భిన్న, పక్షమగుచు నగము ♦ వడినయట్లు.

ఉ॥ అమ్మెయి నయ్యుషాపతి మ ♦ హాసినిఁ దద్వృకదానవేంద్రగ
ర్భమ్మును గోసి యావలకు ♦ వచ్చి యనుక్షణమందు వాని శీ
ర్షమ్మును ద్రుంప నిర్జరులు ♦ సల్లిరి పూలను దుందుభుల్ సుపూ
ర్ణమ్ముగ మ్రోయసాఁగె జయ ♦ నాదము లొప్పెను యాదవావళిన్. ౨౩౭

క॥ అనవుడు బహులాశ్వుండి, ట్లనియెను బ్రాద్యుమ్ని యుద్ధ ♦ మానంద మిడెన్
దనుజేశుఁడు వృకుఁడిటు స, చ్చిన మీఁద మతేమియయ్యెఁ ♦ జెపుమ మునీంద్రా!

సాంబుండు కాలనాభరాక్షసునిం బరిమార్చుట.

తే॥ అనఁగ నారదుఁ డిట్లాడె ♦ నవనినాథ!, యట్టివృకదైత్యమరణంబు ♦ నాలకించి
కాలనాభాసురుండు సూ ♦ కరము నెక్కి, యుద్ధరంగమునకువచ్చి ♦ యుగ్రమతిని.

సీ॥ అంబకవింశతి ♦ నక్రూరుపై వేసి, కాండదశకమేసి ♦ గదునిమీఁద
నాశుగవింశతి ♦ ననిరుద్ధునిం గొట్టి, శతశరంబుల వైచి ♦ సాంబుపైనిఁ
బాణశతంబునన్ ♦ బ్రద్యుమ్నుఁ బ్రహరించి, పత్రిదశకముతోఁ ♦ బార్థు మీఁది
ఖగదశకంబుతోఁ ♦ గారించి కృతవర్మ, యుయుధాను బాఁది పం ♦ చోరుశిఖుల
తే॥ దీప్తిమంతుని బలవంతు ♦ తీక్ష్ణపంచ, బాణములతోడఁ బ్రహరింప ♦ వారలెల్ల
రాకులపడిరి ఘటికాద్వ ♦ యంబుదాఁక, దద్ధయాదులు నీల్గెను ♦ దత్పరమున.

చ॥ మదనుఁడు రుక్మిణీసుతుఁ డ ♦ మందబలుం డల కాలనాభపూ
ర్వదివిజు హస్తలాఘవము ♦ బాగుగఁ గన్గొని మంచిమాటలన్
ముదమున సత్కరించి ధను ♦ వుంగొని టంకృతి సల్పి బాణమా
త్రిదశవిరోధిపైని విస ♦ రెన్ బహులాశ్వ! యనంతరంబునన్. ౭౪౫

తే॥ ఆ శరం బేగి యాతని ♦ యధికభయద, సూకరముఁగొని దివిఁద్రిప్పి ♦ వీఁక లక్ష
యోజనంబులపైనుండి ♦ యుత్కటముగ, మ్రోఁగు నుదధిలోఁ బడవైచె ♦ భూవరేణ్య!

క॥ మఱి మరుఁడొక బాణముఁగొని, త్వరగతి నా కాలనాభు ♦ పై విసరఁగ నా
శర మాతనిఁగొని త్రిప్పుచుఁ, బఱపెను జంద్రావతియను ♦ పట్టణమునకున్.

చ॥ పదపడి కాలనాభసుర ♦ వైరి యటుల్ దనయూరఁ గూలి న
మ్మది వెతఁబొంది రోషమున ♦ మందు చఘోరము లక్షభారభృ
ద్గదఁ గొని యాజికేగి యదు ♦ కాండశతాంగగజాశ్వపత్తులన్
జదిపెఁ ద్రుటిన్ బ్రకంపనుఁడు ♦ సాలములన్ దెగటార్చినట్టులన్. ౭౪౬

తే॥ మఱియు నాదానవేంద్రుఁడు ♦ క్రూరులఁగొంద, ఱనుగరంబులఁగొనిదివి ♦ నునుప వారు
ధరను వడగండ్లువడెడివి ♦ ధమునఁబడిరి, తత్సమయమున సాంబుండు ♦ మత్సరమున.

చ॥ గదగొని తన్నిశాచరు మొ ♦ గంబునఁ గొట్టఁగ నాతఁ డా బలున్
గదఁ బ్రహరించె వార లిటు ♦ గంటున సల్పిరి ముద్గరాజి నా
గదలును విస్ఫులింగములఁ ♦ గ్రక్కుచుఁ బోరియుఁజూర్ణమయ్యె నా
యదనున వార లిర్వురును ♦ నన్యగదల్ గొని నిల్చి రయ్యెడన్. ౭౪౭

తే॥ కాలనాభుండు సాంబునిం ♦ గాంచి యిటుల
బలికె నో తుచ్ఛ! యీహతిన్ ♦ బ్రాణములను
గడపెదన్ నావు డా బలి ♦ గాఱులేల?
కలహ మాడుము ముందని ♦ పలుక నతఁడు. ౭౪౮

ఉ॥ జాంబవతీకుమారుఁడును ♦ సాహసికాగ్రణియైన సాంబు శీ
ర్షంబున వాటమౌ గదను ♦ జక్కఁగఁ గొట్ట నతండు వానివ
క్షంబున స్వీయమౌగద వె ♦ సన్ గొని బాఁదఁగ నా ఖలుండు వ
క్త్రంబున నెత్రుఁ గ్రక్కి పవి ♦ ఖండితపర్వతరీతినిం బడెన్. ౭౪౯

తే॥ అమరవరదుందుభులు మ్రోసె ♦ నట్టి సాంబు, సేనవేల్పులు గురిసిరి ♦ సూనవృష్టి
జయజయధ్వనుల్ మిన్నుముట్టె ♦ సంతసమున, నచ్చరలు నాడి ర త్తఱి ♦ నవనినాథ !

దీప్తిమంతుండు మహానాభాసురుం దెగటార్చుట.

తే॥ అటుల గాలనాభాసురుం ♦ డంతమగుట, విని మహానాభుఁడుష్ట్రిమం ♦ దునవసించి
యనికిఁజని స్వీయమాయ ని ♦ జాననమున, నరిభయదవహ్నిఁ బుట్టించె ♦ నవల నద్ది

సీ॥ ఉర్వియందున మండి ♦ యుర్వీజముల మండి, పొగలందున మండి ♦ భటులమండి
కంచుకంబుల మండి ♦ కటిబంధముల మండి, వివిధచిత్రాంబర ♦ వితతి మండి
ఛత్రంబులనె మండి ♦ చామరంబుల మండి, బంగారుసొమ్ములం ♦ బలుగమండి
ధ్వజములనె మండి ర ♦ థంబులందున మండి, హస్తులందున మండి ♦ హరుల మండి

తే॥ మఱియు శస్త్రువస్తువులందు ♦ నెఱిగమండి
మించుచుండుట యాదవుల్ ♦ గాంచి భయము
బొందుటనె దీప్తిమంతుఁడె ♦ పోటరి గని
వేసెఁ బార్జన్య మాయగ్ని ♦ వేగ నార్ప. ౭౫౧

క॥ ఆయంబున సంవర్తక, తోయదనిచయంబువోలెఁ ♦ దోఁతెంచి మొగు
ళ్ళా యనిఁ దోయము గురిసెను, జేయుచు భీకరరవంబు ♦ శ్రీబహులాశ్వా !

వ॥ అయ్యాసారంబున నియ్యల గోకిల పుంస్కోకిల మయూర సారస మండూకాది స్వనంబులును నాకాశంబున నింద్రచాపసౌదామిన్యాదులును గలిగి ప్రావృట్కాలంబుపగిది జెలంగుట గని యమ్మహానాభుండు మండిపడి నిశితశూలం బొందు తద్దీప్తిమంతునిపైఁ బ్రయోగింప నతం డహివిధంబున నేతెంచు నద్దానిని ఖడ్గంబుతో గరుడి యురగంబును జెండినట్లు ఖండించి తన్నుం గొఱకవచ్చెడి తదుష్ట్రవాహనంబును బ్రహరించె. తత్ప్రహారణంబున నా యుష్ట్రంబు హతకంధరంబై యాసురుండు గనుచుండ మృతిం జెందె. అంత నద్దనుజుం డాగ్రహంబున హస్తివరం బెక్కి త్రిశూలంబును దాల్చి యేతెంచ నా దీప్తిమంతుండును సైంధవాశ్వం బెక్కి దివ్యఖడ్గంబుఁ గొని తటిన్నిభుండై చనుదెంచి తద్దైత్యగజకుంభాంతంబు నకు శ్రీకృష్ణుం డద్రిశృంగంబును బొందిన ట్లెగసి సురవరదుందుభులు మ్రోయ జయజయనినదంబు లొప్ప సురలు విరులం గురియం గిన్నరాదులాడఁ దన్మస్తకంబును ఖండించి తత్సైన్యంబు హతంబు గావించె. అత్తఱి మిగిలిన రాక్షసు లా హరిసుతుం గని పలాయితులైరి. సురర్షివరేణ్యులు హర్షించిరి. ప్రపంచమంతయు సంతసిల్లె. ఇట్లు మహానాభుండు మృతుండగుట హరిశ్మశ్రుండను మహాసురుండు విని రోషమూర్తియై తిమింగలం బెక్కి ప్రస్ఫురితాధరుండగుచు ర[illegible]బున కేతెంచి యాదవులతో నిట్లనియె. ౭౫౪

భానుండు హరిశ్మశ్రుదైత్యుని ఖండించుట.

ఉ॥ యాదవు లీరలందఱును ♦ నల్పబలుల్ మనుజుల్ గనుంగొనన్
నాదృఢధైర్యశక్తులకు ♦ నాశముఁ జెందఁగలారు కాన మీ
లోదులలో నెవండయిన ♦ శూరుఁడై యుండిన లేచి వెంటనే
రాఁదగు శస్త్రమేదియు గ ♦ రంబునఁ దాఁకఁగఁగూడ దాతఁడేన్. ౭౫౫

తే॥ శస్త్రములఁబోరువారలు ♦ స్వల్పబలులు, కాని గండలుగారని ♦ మానసమున
విశ్వసించుఁడి! నాతోడఁ ♦ వేగిరముగ, మల్లయుద్ధంబొనర్పుఁడీ! ♦ మనుజులార!

చ॥ అనవుడు యాదవుల్ దదసు ♦ రాధిపవాక్యము లాలకించి యా
తని పెనుమేనుఁగాంచి తమ ♦ దండినిఁజూచి పరస్పరాస్యముల్
గనుఁగొనుచా నిశాచరుఁ బ ♦ గన్ బృథుమల్లరణంబునందు డీ
కొనఁదగమంచు నెంచి మదిఁ ♦ గొంకుచు నోరుమెదల్పరో విభూ! ౭౫౭

తే॥ అపుడు భానుఁడు సత్యభా ♦ మాత్మజుండు, సాహసంబునఁగృష్ణుని ♦ సంస్మరించు
చాత్మకీయశస్త్రంబుల ♦ నవలఁ బెట్టి, యట్టిదైత్యుని యెదుటకు ♦ నరుగుదెంచె.

తే॥ అల హరిశ్మశ్రువున్ దిమ్ము ♦ గిలముడిగ్గి, బాహువులఁదట్టి నిల్వ న ♦ బ్బలు లుభయులు
నటవి రదములన్ బోరాడు ♦ హస్తులవలెఁ, ద్రోసికొనిరి చేతులను జే ♦ తులనుగల్పి.

క॥ అట్టి యెన హరిశ్మశ్రువు, వట్టునఁ దద్భానుఁబట్టి ♦ వందామడలన్
నెట్టెను సింహము సింహముఁ, బట్టుచు భుజవిక్రమమునఁ ♦ బఱపినకరణిన్.

క॥ ఆసమయంబున భానుఁడు, రోసముతో వచ్చి కర్బు ♦ రుని బలవంతున్
మోసమొనర్చెడివానిని, ద్రోసెను వెయ్యామడలకు ♦ దోర్యుగశక్తిన్. ౭౬౧

తే॥ పదపడి నిశాచరుండు త ♦ ద్భానునిమెడ, నొక్కచేఁబట్టి తక్కటి ♦ నొక్కచేతఁ
బట్టి పడవేయ భానుండు ♦ బాహుశక్తి, వెనుకనుండి యరిగివాని ♦ వీపునెక్కె.

ఆ॥ అసురు జంఘలఁగొని ♦ యవనిపైఁగూల్చెఁద, త్పరముని మఱి బలులు ♦ వారులేచి
గరుడఫణులువోలె ♦ ద్వరను భుజంబులఁ, జఱచి కయ్యమాడ ♦ సాఁగి రపుడు.

తే॥ అట్టిదనుజుఁడా భానుని ♦ యంఘ్రులఁగొని, నింగిలక్షయోజనముల ♦ నెట్టనాతఁ
డద్రిపతితుఁడైమనిన ప్ర ♦ హ్లాదుమాడ్కి, నవనిఁగూలియుజీవించి ♦ యచ్యుతదయ.

తే॥ చని హరిశ్మశ్రుదీర్ఘమా ♦ శ్మశ్రువులను, బట్టి బుజముల బల్మితో ♦ వడిఁద్రిప్పి
యాకసంబందునన్ లక్ష ♦ యామడలను, వేయ నతఁడిలఁబడికొల్ది ♦ వెతనుబొంది.

క॥ మొగమునఁగూర్చముఁగూఱిచి, పగతుని నబ్భాను ముష్టిఁ ♦ బ్రహరించెను రెం
డుగడియ లిట్లు బిడికిళులఁ, బొగరునఁ బోరాడి రట్టి ♦ పోటరు లవలన్. ౭౬౬

క॥ దనుజుఁడు పిష్టాంగుండై, కనలుచు నొకపెద్దబండ ♦ గైకొని శ్రీకృ
ష్ణునిసుతుఁడగు భానునిపై, నునిచెను దదనంతరమున ♦ నుక్కరియతఁడున్.

క॥ తరువును గైకొని యాఖలు, శిరమునఁ బడవేయ నతఁడు ♦ సేకొని దాని
ద్వరగతిఁ నాభానుని, శిరమునఁబడ వైచి కినుకఁ ♦ జెలరేగి మఱియున్.

క॥ తనగజతుండముఁ గైకొని, ఘనముగఁ బ్రహరించె నంతఁ ♦ గమలాక్షసుతుం
డును బెళుకరినింకేకొని, చనుదెంచి తదసురవర్యుఁ ♦ జదియఁగఁ గొట్టెన్.

వ॥ అంత నాహరిశ్మశ్రువు తద్దంతి దంతంబుల నూడఁబెఱికి యవ్వానితో నబ్భానుం బ్రహరించె అత్తఱి నాహరిసూనుం డచ్చెరు వొందుచుండ వీరవరా! యీరాక్షసుని ప్రాణంబు లాతని యాస్యంబందలి కూర్చమందున్నవి. అద్ది యపహరింపఁబడనిదే యీతండు మృతుండుగాఁడను నాకాశవాణి దనకు వినఁబడఁ బూర్ణక్రోధమూర్తియై వెంటనంటి బాహుబలంబున నా హరిశ్మశ్రువులం గొని త్రిప్పి బడవేసి తన్ముఖస్థితకూర్చంబును బెఱికికొని ముష్టితో మర్దింప నమ్మహాసురుండు మృతుండయ్యె తత్సమయంబున జయజయనినదంబులతో సురనరదుందుభులు మ్రోఁగె. సురలామరుని సేసలో విరులం గురిసిరి. దేవాంగనలు నృత్యంబులం జేసిరి. ఈరీతిగా మహాద్భుతంబగు శ్రీకృష్ణపుత్రబలంబు వినిపించితి. మఱేమి వినవలతువో వచింపుమన జనకుం డానందమంది యీనారదమహర్షి కిట్లనియె. ౨౨౦

తే॥ అతుల విఖ్యాత బలులగు ♦ దనుజులంద, ఱంతమొందిన తరువాత ♦ నట్టిశకుని
దనుజవరుఁడేమొనర్చెనో ♦ దయను నాకుఁ, జెప్పవేఁడెద నారదా! ♦ తప్పకుండ

శకుని తన తమ్ములు గూలుట విని చింతించి
యాదవులతోఁ బోరుటకేతెంచుట.

తే॥ అనఁగ నారదుఁ డిట్లాడె ♦ నవనిపతికి, జనక! శకుని దైత్యేంద్రుఁడు ♦ సంగరమునఁ
దమ్ము లీల్గుట విని కినుక ♦ సొమ్మసిల్లి, తద్వ్యథఁ బల్కె నిట్లెల్ల ♦ దానవులకు.

ఆ॥ కాలకేయులార! ♦ పౌలోములార! మ,ద్వచనములను వినుఁడి ♦ దైవశక్తి
యెంతగొప్పవాని ♦ నేని హింసించుఁగా, యనుభవమున నాకు ♦ నద్ది దెలిసె. ౨౨౩

తే॥ సరసిజాప్తునిర్జించిన ♦ శంబరుండు, బాలుఁడగు మన్మథునిచేతఁ ♦ బడుట యింద్రు
గెలిచినట్టి యుత్కచుఁడును ♦ గృష్ణశిశువు,వలనఁ బడుటయు దైవదు ♦ర్బలతఁగాదె,

తే॥ భండనంబున బల్మిని ♦ వరుణదేవుఁ,దఱిమి గెలిచిన భూతసం ♦ తాపనుండు
తుచ్ఛులగు యాదవులచేతఁ ♦ ద్రుంపఁబడుట, దైవదుర్బలతనుగాదె ♦ దనుజులార!

సీ॥ కాలునోడించిన ♦ కాలనాభుం డిందు, వ్రాలుట దైవదు ♦ ర్బలతఁగాదె
వహ్నినిం గెల్చిన ♦ బలుఁడు హృష్టుం డిందు, వ్రాలుట దైవదు ♦ ర్బలతఁగాదె
బల్మిని శివనుతిఁ ♦ బడసిన వృకుఁ డిట, వ్రాలుట దైవదు ♦ ర్బలతఁగాదె
యనిలు నెదిరిన మ ♦ హానాభుఁ డిచ్చోట, వ్రాలుట దైవదు ♦ ర్బలతఁగాదె

తే॥ శక్రసుతు జయించిన హరి ♦ శ్మశ్రు విట్టి,కలను వ్రాలుట దైవదు ♦ ర్బలతఁగాదె
యేమిచెప్పుదుఁ జెప్పిన ♦ యెడల నాకు, వ్యసనమంతకంతకు హెచ్చు ♦ నందువలన.

చ॥ పదిలముతోడ నేను శిశు ♦ పాల జరాసుత దంతవక్త్రసా
ళ్వదయితవర్యులన్ గలిసి ♦ త్వాదృశులన్ దగి యాదవాన్వయం
బదబదఁజొందఁ జెండెదను ♦ నంత సురాళి బలిష్ఠబాణపూ
ర్వదివిజవీరులన్ సుతల ♦ వాసులఁ గూడి హతం బొనర్చెదన్. ౭౭౭

క॥ సురభూసురగోశ్రుతి ముని,వరయజ్ఞశ్రాద్ధతీర్థ ♦ పరమక్షములన్
నఱికెద నిం దరయఁగ నల, సురజేత సఖుండు కంస ♦ శూరుఁడ కృతిగా. ౭౭౮

క॥ అట్టి వయస్యుం డిపుడే,పుట్టునఁ గనుపట్టఁడయ్యె ♦ బలులార! యటం
చిట్టులఁ బలుకుచు మదనుని, యెట్టయెదుట కేగి దనుజ♦వృతుఁడై తమితోన్.

చ॥ ఘనమును లక్షభారభృత ♦ కార్ముకమున్ మయదైత్యనిర్మితం
బునుగొని టంకృతిన్ సలుప ♦ భూమి చలించెను గూలె శైలముల్
వనధులు ఘూర్ణిలెన్ భటులు ♦ వ్రాలిరి పాఱిరి రథ్యమత్తహ
స్తినికర మాదతో నెగిరె ♦ దిగ్గజముల్ జెవుడొందె నయ్యెడన్. ౭౮౦

తే॥ ఆత్మచము వకస్మాత్తుగా♦నదరిపడుట,గదుఁడు మొదలైనవారలు♦గాంచి రథము
లెక్కి కదనరంగంబున ♦ కేగుదెంచి, ధనువులం డంకరించిరి ♦ దనుజు లదల.

వ॥ అత్తరుణంబునం దా శకునిదానవేంద్రుండు దశబాణంబులతో నర్జునిం గొట్టి రథసహితంబుగా నాల్గుకోసులదాఁక నెట్టి వింశతిబాణంబులతో గదునిం బీడించి స్యందనసహితంబుగా నభోమండలంబున కనిపి నలుబదిశరంబులతో ననిరుద్ధు నొప్పించి శతాంగయుక్తంబుగాఁ బదాఱుకోసులం ద్రోసి శతపృషత్కంబులతో సాంబునిం బ్రహరించి తేరుతోఁగూడ నంబరంబున ద్వాత్రింశద్యోజనంబులకుఁ బఱపి తత్సమయసమాగతుండగు ప్రద్యుమ్నుం గాంచి యమితరోషంబుతో నసంఖ్యాకంబులగు నంబకంబులతో హింసించి యరదంబుతోఁగూడ ఘటికాద్వయంబు గిరగిరం ద్రిప్పి వ్యోమమండలంబున శతక్రోశంబులందుం బడునట్లొనరించి విజృంభింప యాదవులందఱ లాశ్చర్యపయోధిమగ్నులై మత్తేభంబులు మొత్తంబుగాఁ జేరి యచలంబును దంతంబులతోఁ బ్రహరించినట్లు నానావిధశస్త్రంబులతో నా శకునిం బ్రహరించిరి. ఏతత్సమయంబుననే మరలి గదార్జునానిరుద్ధసాంబు లేతెంచి ధనుష్టంకారంబులం గావించిరి. మఱియు నమ్మరుండును వాయువేగంబుతోఁజను రథం బెక్కి దశశరంబులతో మహాభయంకరంబగు వాని చాపంబును ద్రుంచి వింశతిమార్గణంబులతో సూతుం దెగటార్చి సహస్రాశుగంబులతో సహస్రాశ్వంబులం బడవేయ నద్దైత్యుం డుగ్రుండై రథంబును లేవఁదీసి యన్యునిసారథిగా నేర్పరచి యందారోహించి చాపం బెక్కిడి తూణీరంబునుండి శతశితశరంబులం గూర్చి యాకర్ణంబునులాగి యాహాపురుషికతో నంగజున కిట్లనియె. ౭౮౧

శకుని ప్రద్యుమ్న యుద్ధవర్ణనము.

పంచచామరము. అరే! స్మరా! మదీయశత్రు ♦ లందు నగ్రిముండవౌ
దురాత్మునిన్ మదోత్కటున్ వి ♦ ఘాతమత్స్యహోదరున్
సురానుపోషకున్ బలిష్ఠు ♦ సూనబాణు నిన్నిదే
శరంబులన్ క్షణంబులోనఁ ♦ జంపివేతు నాదిలోన్ ౨౮౩

తే॥ అవల స్వస్థతేజంబుతో ♦ యాదవులను, దదనుచరులను హరులను ♦ మదకరులను
గాలుబలముల వధియింతు ♦ ఘనతఁ గాంతు, నంచు వచియింప మరుఁడువ ♦ చించెనిట్లు

ఉ॥ కాలబలంబు ఛాయవిధి ♦ గాఁదగి దేహికిఁ గష్టసౌఖ్యముల్
జాలఁగఁ గూర్చు నూడ్చుఁ బలు ♦ సారు లటన్ మనశక్తి లేదు మే
ఘాళి మరుద్బలంబునన ♦ యగ్గును నిల్చునుగాదె! నింగిపై
నేల వృథా ప్రలాపముల? ♦ నిట్టులఁ బ్రేలెదవోరి దుర్మతీ! ౨౮౪

తే॥ విత్తనము నాటి పెరిగించి ♦ విమలవారిఁ, గొడవలిం గొని సస్యంబు ♦ గోసి సేద్య
గాని వలెఁ గాలమిట్టి జ ♦ గము సృజించి, పెంచి హరియించు గుణముల ♦ విబుధవైరి!

తే॥ చేసితిన్ జేయుచున్నాను ♦ జేయఁగలన, టంచుఁ బలుకుట మూర్ఖత ♦ నగునుగాదె
నీకునిటు లహంకృతియేల? నిర్జరారి? ♦ యనఁగ శకునియునిట్లనె ♦ నంగజునకు.

తే॥ నీవె చరితార్థతముఁడవు ♦ నృపవతంస!, పలుకులన్ మునులను మించి ♦ పలుకుచుంటి
వైనఁ ద్రిగుణపృథగ్భూత ♦ మానవస్వ, భావమును వీడ నేర్తురే? ♦ ప్రజలు జగతి.

క॥ ఊరహి నొండొరు లనుకొను, చారణరంగంబునందు ♦ నలవృత్రసునా
సీరుల తీరున స్పర్థను, బోరాడిరి నింగిఁ జిత్ర ♦ మునఁ గన సురలున్. ౨౮౫

ఆ॥ అప్పు డంగజాతుఁ ♦ డర్కాంశునిభమైన, శరవరమున నసుర ♦ వరుని ధనువు
జెడ్డ మాటఁ జెలిమిఁ జెడఁ ♦ గొట్టినట్టులఁ, ద్రుంచె నంత నతఁడు ♦ మించికినుక,

తే॥ లక్షభారాన్వితమగు న ♦ లఘుగదఁ గొని, మరుని శిరమందుఁ గొట్టె న ♦ త్తతి నతండు
గుబ్బ కాచపాత్రంబును ♦ గొట్టినట్లు, దద్గదన్ నుసిజేసెను ♦ దత్పరమున. ౨౮౬

ఉ॥ ఆ సురవైరి కిన్కను బ్ర ♦ భాద్భుతమైన త్రిశూలహేతితో
నా సుమబాణు శీర్షమున ♦ నార్చుచుఁ గొట్టఁ దదంగజాతుఁడున్
రోసముతోడ దానిఁ దన ♦ రుగ్జ్వలితంబు త్రిశూలమేసి పోఁ
జేసియు నూరువక్కలుగఁ ♦ జెచ్చెరఁ గుంతము వైచె వానిపై. ౨౮౭

తే॥ తత్ప్రహారంబునన్ నొచ్చి ♦ దైత్యవిభుఁడు, పరిఘనుం గొని హరిపుత్రు ♦ బాఁదె నవల
నంగజుండును యమదండ ♦ మంది యతని, యాయుధంబును నుసిజేసి ♦ యద్భుతముగ.

ఉ॥ స్యందనసూతరథ్యములఁ ♦ జక్కఁగఁ గూల్చి యతండు కోపమున్
బొంది నిశాతఖడ్గమును ♦ బూని తనుం గవియంగ దానిని

స్గుందరథంబు పన్నగము ♦ నోటను ద్రుంచినలీలఁ జెండి బ
ల్తొందరతోఁ దదంసమున ♦ దుఃఖపడన్ బ్రహరించె భూవరా! ౭౯౪

క॥ పిమ్మట శకునియుఁ దద్ధతి, సొమ్మనుబడె నపుడు మరుఁ డ♦సురనాథుని సై
న్యమ్మున వనిఁ జొరఁబడు నన,లమ్మువలెన్ జొచ్చి త్రుంచె♦లయయమనిభుఁడై.

తే॥ అసురు లంతట దమ సేన ♦ నచ్చెరువుగఁ, జెండి చెకపికలాడెడి ♦ చండవిక్ర
ముఁడు కృతాంతనిభుఁడునగు♦పుష్పశరుని, గాంచి భయపడి పాఱిరి♦గలనువీడి.

ఆ॥ శకుని మూర్ఛఁదేఱి ♦ స్వబలముల్ హతమౌటఁ
గాంచి లక్షభార ♦ కలితధనువు
నేపునఁగొని యొక్క ♦ యిషువందు ఘటియించి
మరునితోడ నిట్లు ♦ మాటలాడె. ౭౯౭

ఉ॥ కర్మ మిలన్ బ్రధానమగుఁ ♦ గర్మమె యేలిక కర్మ మీశుఁడున్
గర్మము సద్గురుండు మఱి ♦ గర్మ మొసంగెడి నుచ్చనైచ్యముల్
గర్మమె కూర్చు లోకుల క ♦ ఖండజయంబుఁ బరాజయంబు త
త్కర్మముతో సమం బెదియుఁ ♦ గాదని నీమనమందు నమ్ముమా! ౭౯౮

తే॥ ఎవనిచే నెట్టిపని యాచ ♦ రింపఁబడునో
యద్ది వానినే పొందెడి ♦ నఖిలనరుల
గోసహస్రంబులందునఁ ♦ గోడెదూడ
స్వీయమాత నెఱిఁగి చేరు ♦ విధిని మదన! ౭౯౯

ఉ॥ కావున నిష్ఠ పెక్కు దృఢ ♦ కర్మములం బొనరించి మించు నీ
చేవ నణంచి యేను స్మర ♦ జిత్తను పేరు గడించెదన్ జుమీ
యీ విఁకఁ గాచి కొమ్మనఁగఁ ♦ గృష్ణసుతుం డిటులాడె దానవా!
నీవనినట్టి కర్మములె ♦ నిచ్చలు కాలవశంబు గావొకో! ౮౦౦

వ॥ కర్మంబె ప్రధానంబని నీవు వచించినట్లు కొంద ఱొకానొకప్పుడు సేయంబడిన పాకంబునకు విఘ్నం బేదేని గల్గి నప్పు డద్దానికిఁ గాలంబే కారణంబనియు గొందఱు యుక్తకాలపరికరంబు లుండియుఁ బాకంబు జెడినతఱిఁ గర్తయే కారణంబనియుఁ గొందఱు కాలకర్తృకర్మము లనుకూలంబుగా నుండినను బాకంబున కంతరాయంబు గలిగిన తరుణంబున యోగంబే మూలంబనియు గొందఱు యోగకర్తృకాలకర్మంబులు పరిపూర్ణంబుగా జెలంగుచున్నను నయ్యాది వికారంబు బొందిన కాలంబున సాంఖ్యవిధియే నిదానంబనియు వచింతురు. ఇట్లు యోగకాలకర్మసాంఖ్యవిధులచేఁ జెప్పంబడునది బ్రహ్మంబుగాని వేఱుగాదు. తద్బ్రహ్మంబే యీచరాచరాత్మకజగంబు సృష్టించి పోషించి హరించుననియు నెఱుంగుము. తద్బ్రహ్మంబును, బరిపూర్ణతముండును బరమేశ్వరుండునగు భగవం

తునకేను నమస్కరింతు తద్వ్యతిరిక్తంబుగా నేదియు నీజగంబునఁ గానేరదు గాదే యన నాలించి మాయావియగు నాశకుని దైత్యేంద్రుండా యాదవేంద్రునితో నిట్లనియె. ౮౦౧

తే॥ ఓయి ప్రద్యుమ్న! యదువీర !♦యుర్వియందు, నీవె జ్ఞానశేవధివని♦యెంచుచుంటి
నీదుసందర్శనంబున♦నిఖలపాప, ములు దొలఁగనరుల్ ధన్యతఁ♦జెలఁగఁగలరు.

తే॥ మఱియుఁ ద్వత్సహవాసముల్ ♦ మరగునరుల
గొప్పతనమును నలువయుఁ ♦ జెప్పఁగలఁడె?
యంచు మయుదైత్య శిక్షితం ♦ బైనరౌర
వాస్త్రమును బ్రయోగించె సు ♦ మాస్త్రిపైని. ౮౦౩

క॥ అందున భీకరవిషధర, బృందములుల్ దేళ్ళు బుట్టి ♦ యెదిరులమూఁకల్
డిందఁగఁగుందఁగఁ గఱచి య,మందతఁ దిరుగుటను గాంచి♦మరుఁడుల్ క్రుధతోన్.

క॥ గరుడాస్త్రము వేయఁగ నం, దురుభీకరవివిధపక్షు ♦ లుద్ధురగరుడుల్
ద్వరబైలుదేరి తెల్లను, నురగముల్ మ్రింగి యేగె ♦ నొకనిముసములోన్ ౮౦౪

తే॥ అంత మాయావి శకుని యా ♦ త్యాస్త్రమట్టు
లగుట గనులారఁ గన్గొని ♦ యాగ్రహమున
భీకరమగు పైశాచియల్ ♦ పెద్దమాయ
బగరపైనిఁ బ్రయోగించెఁ ♦ బట్టుపట్టి. ౮౦౫

ఉ॥ ఆమెడఁ గోట్లకొల్దిని భ ♦ యంకరభూతము లెన్నొ ప్రేతముల్
దాయుచు నిప్పులం గురిసి ♦ డాంబరమందున హెచ్చుచుంట నా
తోయజనాభసూతి గని ♦ దూరవిచారణ జేసి తామసీ
మాయ యటం చెఱింగి యది ♦ మాన్పఁగ నెంచి విచిత్రపద్ధతిన్. ౮౦౬

మ॥ పరిశుద్ధంబగు సాత్వికాస్త్రమణినిన్ ♦ వైచెన్ దదస్త్రంబునన్
బరిశుభ్రుల్ హరిపార్షదుల్ గరముగా ♦ భాసిల్లి తన్మాయనున్
ద్వరఁ దాక్షిం దహిఁ ద్రుంచినట్లు నఱకన్ ♦ దైత్యేంద్రుఁడుల్ గొహ్యకీ
వరమాయల్ యదుసేనపైనిఁ బఱపెన్ ♦ స్వచ్ఛందసంచారియై. ౮౦౭

క॥ ఆమాయను మేఘంబులు, భీమంబగు ధ్వనులతోడ ♦ విష్ఠాసృక్ఛ్లే
ష్మామజ్జామూత్రాస్థుల, నామృధమునఁ గురిసె మిగుల ♦ యాదవు లదలన్.

తే॥ మదనుఁ డదిగని గొహ్యకీ ♦ మాయయంచు
నాఱఁగి కోలాస్త్రముల్ వేయఁ ♦ ద్వరను నందు
భయదయజ్ఞవరాహంబు ♦ బైలుదేరి
సడల జాడించి ఘుర్ఘుర ♦ స్వనముతోడ. ౮౧౦

ఆ॥ శాతదంష్ట్రిల నల ♦ జలదసంతతినెల్ల, ద్వీపము వేణువులను ♦ విఱిచినట్లు
జీల్చె నంత శకుని♦చిత్రమౌ గాంధర్వి, యనెడి మాయఁబఱపె♦నపుడు దాన.

సీ॥ హేమమయంబులై ♦ యెన్నంగ వీల్గాని, ప్రాసాదరాజముల్ ♦ పరిఢవించె
మోహనరాగముల్♦ముచ్చటగాఁ బాడు, మోహినీకోటులు♦బొల్పుఁగాంచె
వాదిత్రపరమయి ♦ పాడెడి గంధర్వ,సుందరీబృందంబు ♦ నందగించె
బల్కులఁ జగముల ♦ వంచెడి విద్యాధ,రాంగనాసముదాయ ♦ మతిశయించె

తే॥ మఱియు నిట్టుల నెందఱో ♦ మదఁత లాజిఁ
జెలఁగి యదుసేన మోహంబు ♦ గొలుపుచుంట
దర్పకుఁడు గని యిద్ది గాం ♦ ధర్వియంచు
నెఱిఁగి జ్ఞానాస్త్రముఁ వేసె ♦ నేమఱిలక. ౬౧౨

క॥ ఆనారాచంబున యదు,సేనలు దమి విడిచి తెలివిఁ ♦ జెలఁగుటఁ గని యా
దానవనాథుఁడు చిత్రము, మానసమునఁ జెంది కినుక ♦ మండుచు దండిఁ.

తే॥ భయదరాక్షసీమాయను♦బఱపె నందు, పక్షయుతపర్వతంబులు♦పైలుదేరి
క్షణము లో నభస్స్థలమును♦గప్పె నప్పు, డంధకారంబు లెల్లెడ♦నల్లుకొనియె.

వ॥ మఱియు నప్పర్వతంబులు దగులఁబడెడి వృక్షంబులును బాషాణంబులను నస్థులను గబంధంబులను రక్తంబులను గదాపరిఘాసిముసలాద్యాయుధంబులను రణంబున వర్షించుచు నంబరంబున సంచరింపందొడంగె. వెండియుఁ దన్మాయా బలంబున రక్షోగణంబులును యాతుధానవితానంబులును శూలంబులతోఁ గోట్ల కొలందిగా నిర్గమించి కరిహయంబులను ఖండింప సమకట్టె. సింహవ్యాఘ్ర వరాహఖరంబు లందు విజృంభించి యాదవకరిహరులను ద్రుంప నారంభించె. అంత రతికాంతుం డేతత్స్థితిం గని భయంపడి పరుగిడు నాత్మబలంబులం గాంచి తన్మాయోపశమనార్థంబై నృసింహాస్త్రంబు బ్రయోగింప నందు, ౬౧౩

సీ॥ ధగధగద్ధగధగ ♦ త్తరణికోటిసమాన, భాసమానప్రభా ♦ పటలితోడ
ప్రలయకాలాభీల ♦ పావకజిహ్వావి, శేషభీకరలల ♦ జ్జిహ్వతోడ
శంఖచక్రగదాది ♦ సంస్ఫురచ్ఛందాన, మాంసలాజానుబా ♦ హాళితోడ
దుష్టలోకాంతక ♦ ధూమకేతుసమాన, సంచలద్దీర్ఘపు ♦ చ్ఛంబుతోడ

తే॥ ఆయతోత్కటకంటక♦ప్రాయరోమ, రాజితోడ దంభోళివి♦రాజదురువ
ఖములతోడ నదభ్రాభ్ర♦సమితితులిత, చిత్రరవముతో శ్రీనర♦సింహమూర్తి.

వ॥ జనించి యహంకారంబుతో బ్రహ్మాండభాండంబు బ్రద్దలగునట్లు హుంకరించుచు నాకొండలం గూల్చి రక్షోయాతుధానగణంబులను గొట్టి నెట్టి తత్కరికిరిఖరాదులను నఖంబులతోఁ జీల్చి గగనంబునం బాఱవైచి తద్రాక్షసీమాయ నశింపఁజేసి మఱియు మహేంద్రనామకవిజయశంఖంబుఁ బూరింప

జయధ్వనిసహితదుందుభులు మ్రోయ సురలు విరులం గురియ నంతర్ధానంబయ్యె. అత్తఱిణంబునం దయ్యసురుం డాత్మసైన్యయుక్తంబుగా నచటనే యదృశ్యుండై యమోఘంబగు దైతేయీమాయను బ్రయోగింపఁ దద్బలంబున సంవర్తకాది జీమూతంబు లంబరం బాచ్ఛాదించి వేదండశుండాసమధారతో వర్షించె. తద్వర్షంబున నొక్కత్రుటిలో నీ భూమండలం బంతయు నర్ణవమయంబయ్యె. అత్తఱి యాదవులు భీతిజెంది శ్రీరామకృష్ణనామస్మరణం బొనరించుచు నాత్మబలంబుల మరచి పరాజితులైనట్లు గడగడలాడుచుండఁ బ్రద్యుమ్నుం డాలోకించి నిజచండ కోదండంబున శ్రీకృష్ణనామకాస్త్రం బనుసంధించె. దానినుండి వీరతేజంబు జయించునదియు దశదిశల వెల్గించునదియు నవకోటిసూర్యులతో సాటియైనదియు నగు తేజం బుత్పత్తిల్లె. అమ్మహాతేజంబున, ౮౧౭

సీ॥ స్వర్ణాంబుజపరాగ♦వాసుండు నూతనాభ్ర,వర్ణుండు సత్కరు♦ణార్ణవుండు
శ్రీవత్సరత్నాది♦చిత్రితవక్షుండు, తోయజాక్షుండు చ♦తుర్భుజుండు
ప్రస్ఫురన్మకుటుండు ♦ పాదాంగదాద్యలం,కారయుతుండు ని♦ష్కల్మషుండు
భానుప్రభాభజాం ♦ బూనదకుండలుం, డలఘుబలుఁడు దివ్య♦హారధరుఁడు

తే॥ దేవదేవుండు కృష్ణుండు♦తేజరిలుట, యాదవులుగాంచి యానంద♦మంది మ్రొక్కి
పుష్పములఁ జల్లి రల్లదా♦మోదరుండు,శకుని విలుద్రుంచె శార్ఙ్గజ♦శరముతోడ.

తే॥ అంత ఛిన్నచాపుండగు♦నసురుఁ డాత్మ,హేతిసంహతులంగోని♦యేగుదెంచ
నెంచి జంద్రావతీపురి♦కేగెఁ గృష్ణుఁ, డఖిలయాదవులం బిల్చి♦యనియె నిట్లు,

{ శ్రీకృష్ణాస్త్రనిర్గత శ్రీకృష్ణుండు తద్వధోపాయం బాలోచించి గరుడునకుం జెప్పుట. }

ఉ॥ యాదవులార ! వీఁడు మును ♦ త్ర్యంబకుఁ గూర్చి తపంబు మేరుశై
లోదగనుత్తమస్థలిని ♦ నోదనముఁ విడి చౌయుగంబులుఁ
మోదమునం బొనర్ప నల ♦ భూతవిభుండు ప్రసన్నుఁ డౌచుఁ బూ
ర్వాదివిజుఁ జేరి యిత్తఱి వ♦రంబు లొసంగద నీవు గోరుమా ! ౮౨౦

క॥ అనవుడు శకునియు వినతులఁ, బొనరిచి యానందబాష్ప ♦ పూర్ణాక్షుండై
త్రినయనునిఁ బ్రసన్నుని శం,భుని నిట్టుల వేఁడఁదొడఁగె ♦ మోడ్చి కరంబుల్.

తే॥ ఏన బలులనందఱను జ♦యింపవలయు, నీల్గినఁ ధరాస్పృష్టి జీ♦వింపవలయు
నింగి ఘటికాద్వయము దాఁక ♦ నిల్గఁ గూడ,దీవరంబుల నిడి కావ♦వే! మహాత్మ!

ఉ॥ అత్తఱి శంభుఁ డాతనికి ♦ నట్టి వరంబు లొసంగి గూటిలో
హత్తిన కీరమిచ్చి దను♦జా! యిది జీవసమంబు గాన నీ
వ త్తను గాచికోదగును ♦ సంతత మియ్యది యెప్డుపోవునో
యత్తఱి నీదు జీవములు ♦ నంతముకెందు నటం చెఱుంగుమా ! ౮౨౩

తే॥ ఇటుల వచియించి శంకరుం♦డట నదృశ్యుఁ,డయ్యెఁ దత్కారణంబున♦నాశుకంబు
నీల్గినంగాని శకునియు ♦ నీల్గఁడంచు, వైనతేయునిఁగని యిట్లు♦పలికె నగుచు.
ఆ॥ ధీవరేణ్య! విహగ ♦ దేవ! యోజనశత,విస్తృతంబు నసుర ♦ వృత ముపవన
సౌధరుచిరమైన ♦ చంద్రావతీపురిఁ, బొమ్ము పనులసల్పి♦రమ్ము మరలి. ౫౨౬
క॥ అనవుడు గరుడుండొప్పుచు, దనుజులు దనుఁ గనని కరణిఁ ♦ దనురూపముతోఁ
జని చంద్రావతి కటఁగల ♦ కనదురుహర్మ్యాదిలీలఁ ♦ గాంచుచు వరుసన్.

గరుడుండు శకునిశుకహరణార్థంబై చంద్రద్వీపంబునకుఁ బోవుట.

చ॥ శకుని గృహంబు సేరి దను ♦ జప్రభుజీవముగాఁ జెలంగు నా
శుక మెటనున్నదో యనుచుఁ ♦ జూచుచునుండఁగ క్రోధమూర్తియై
సకలమహాయుధంబుల వె ♦ సన్ గొని క్రమ్మఱఁ నాజికేగు నా
శకుని కరంబుఁ బట్టికొని ♦ సాధ్వి మదాలస యిట్లు పల్కెడిన్. ౫౨౭
తే॥ నీకు ననుకూలురైనట్టి ♦ నేస్తకాండ్రు, చేరఁగాంచిన తమ్ములు ♦ వీరవీరు
లైన దానవోద్భటులు ర♦ణాంగణమునఁ, బగరచేఁ జంపఁబడిరిగా♦ప్రాణనాథ!
మాలినీవృత్తము॥ వలదు వలదు నాథా! ♦ భండనార్థంబుగాఁ బో
వలదు వలదు రాజా! ♦ పంకజాక్షుండు నేఁడా
కలహముఁ బొనరించున్ ♦ గాన నామాట వించున్
బలుల నిడి సుఖంబుల్ ♦ వాసిగాఁ బొందుమయ్యా! ౫౨౮
క॥ అనవుడు తద్దనుజుం డి,ట్లనియెను నబలామణీ! మ ♦ దనుజుల నెల్లన్
గినుకను జెండిన యాదవ,జనముల నీదినము జంపి ♦ సంతోషింతున్. ౫౩౦
తే॥ సాంబవరమున నాకిలన్♦జావులేదు, చంద్రనామకోపద్వీప♦సముధిగతప
తంగగిరి శంఖచూడభు♦జంగరక్షి,తశుకమందు నాప్రాణముల్♦దనరుచుండె.
తే॥ ఇట్టిసంగతి నెవ్వరు♦నెఱుఁగ రట్టి,కారణంబున మృతియెట్లు♦గలుగు నాకుఁ?
జెలిరొ! భయపడవలదని♦చెప్పె నల్ల,చిలుకవార్తను విని ఖగ♦శేఖరుండు ౫౩౧
ఆ॥ అచటనుండి వేగ♦నా యుపద్వీపముఁ, జేరఁదలఁచి యెగిరి♦సింధుతటముఁ
బొంది యట్టి దీవిఁ♦బూర్తిగా వెదకుచు, దిరుగఁదొడఁగె మింట♦ధరణినాథ!

వ॥ అట్లు శతయోజనవిస్తీర్ణంబును భీమనాదంబును గల సముద్రంబుపైఁ జరించుచు క్రమంబుగా నొక్కద్వీపంబున కేగి తత్రత్యులచే సింహళంబని తెలిసికొని యటసాగి లంకాపట్టణంబున కరిగి తత్పరిసరంబందలి త్రికూటాచలంబును దర్శించి యవల పాంచజన్యద్వీపంబునకుం బోయి యందు క్షుద్బాధితుండై సాగర విరాజమానమీనంబులం గడుపార గ్రసించుచుండె. అత్తఱి యోజనద్వయపరిమిత మహానక్రం బొండు గరుడుని పదంబులం బట్టి జలంబులోని కీడ్వ నా వైనతేయుం డద్దానిం గ్రమ్మఱ లాగికొనుచు నీవలకేతెంచె. ఇట్లు రెండుగడియ లారెంటికి దంట

పోరమ్యో. తుట్టతుద నా గరుడుండే తీక్ష్ణతుండంబుతోఁ దత్పృష్ఠభాగంబున యముండు దండంబుతో బాదినట్లు ప్రహరింప నద్ది మరణించి తన్నక్రరూపంబు విడిచి విద్యాధరరూపంబుఁ దాల్చి గరుడునికి నమస్కరించి ప్రసన్నవదనంబుతో దేవా! యేను హేమకుండలుండను విద్యాధరుండను. మున్ను దేవతలతోఁ గూడి స్నానార్థంబై విష్ణుపదికిం బోయి యందు జలకంబాడు కకుత్థనామకమహాముని పాదంబులం బట్టికొని విలాసార్థంబుగా నీటిలోని కేగుట నమ్ముని గని కినిసి మకరం బవు గమ్మని శపించి మత్ప్రార్థనం బాలించి విష్ణురథప్రహారంబున ముక్తుండవు కాఁగలవని యనుగ్రహించె. తద్రీతి నిప్పుడు నీదయ ధన్యుండనైతి నని నుతించుచు స్వర్గంబున కేగె. అంత నాఖగకాంతుం డటచుండి నభోమండలంబున నుడ్డీనుండై క్రమంబుగా హరిణాఖ్యద్వీపంబున కరిగి సంచరించెడిసమయంబున. ౮౩౪

తే॥ అతనిపక్షం బహార్ణిశ ♦ మధికతపము, దమినిసల్పు నపాంతర ♦ తమతపస్వి
యాశ్రమంబునఁ బడె నప్పు♦డమ్ముని గని, పైనిఁ జను పక్షినేతకుఁ♦బలికె నిట్లు.

క॥ గరుడ! యీపక్షము నా,శిరమున నీవుంచి వేగ ♦ స్వేచ్ఛను బొమ్మా!
యనిమఱి జెందరు మనవుకు, గరుడుఁడు సనుదెంచి తెక్కఁ♦గైకొని వేడ్కన్.

క॥ అల మునితలపై నిడి యటఁ, బలుపక్షము లట్టె విందు ♦ భాతిని నుండన్
లలివింతన్ గనుటన్ గని, పలికె నిటు మునివిభుండు ♦ పక్షీంద్రునకున్. ౮౩౫

చ॥ ఎపు డెపు డా పరాత్పరుఁడు ♦ కృష్ణవిభుం డవతారమెత్తునో
యపుడపుడున్ మదీయశిర♦మం దొక తార్క్ష్యని తెక్కరాలెడిన్
సుపతగ! నాశిరంబుపయిఁ ♦ జూడుము పక్షములెన్నియున్నవో
యపహృతదుష్టుఁడైన హరి ♦ కంజలిజేసెద భక్తితోడుతన్. ౮౩౬

చ॥ అనవుడు పన్నగాశనుఁడు ♦ నద్భుతహర్షములొంది శ్రద్ధ నా
ఘనముని మ్రొక్కి వే రమణ ♦ కంబను దీవికిఁ బోయి యందునన్
దనరు విచిత్రలీలలను♦దద్దయుఁ గన్గొని సర్పరాజులి
చ్చిన కరదంబులన్ దమినిఁ ♦ జేకొని వెంటనె సాఁగి యచ్చటన్. ౮౩౭

క॥ ఆవర్తకాఖ్యఁ జెలఁగెడి, దీవి కరిగి యమృతకుండ ♦ దీవ్యత్సుధనున్
ద్రావియు శుక్లద్వీపముఁ, బోవఁదలఁచి యచటఁ గదలె ♦ భూపలలామా!

తే॥ అవల గరుడి శుక్లద్వీప♦మందుఁజేరి,యల్ల చంద్రాహ్వయద్వీప♦మదుగు చచటఁ
దనరు నాచేతఁ దత్సితిన్♦వినుచు నుత్త,రాశకుం జనె శ్రీమైథి♦లాధినాథ! ౮౪౧

వ॥ అంత నాగాంతకుం డా చంద్రద్వీపంబున కరిగి తత్పతంగపర్వతంబందలి జలదుర్గవహ్నిదుర్గంబులం గాంచి చంచూపుటంబున జలదుర్గంబును ధరించి యద్దానిచే నయ్యనలదుర్గంబును జల్లార్చి సానుముఖంబుననున్న లక్షదైతేయులతో రెండుగడియలు ఖండనం బాచరించి పాదంబులతోఁ గొందఱను బక్షంబులతోఁ

కొందఱను నఖంబులతోఁ గొందఱం బరిమార్చి వెంటనంటి మిగతవారిం దఱిమి లోనికిం బ్రవేశించి శుకరక్షకుండగు శంఖచూడసర్పేంద్రునిపై నడుగిడ నది యులికిపడి పంజరసహితంబగు తత్కోటరంబును నీరంబునం బడవైచి పాఱె. అంతట నా ఖగకాంతుండు వెంటనే చని నాసికతో నా చిలుకం గొని యుద్ధభూమికిం బోవనెంచి వ్యోమమండలంబున కెగురుట పలాయితులగు పలాశులాలోకించి శుకం బపహృతంబయ్యె నపహృతంబయ్యెనని మహాకోలాహలంబులం గావించిరి. తద్రవంబు భూనభోమండలంబులందు వ్యాపించె. కర్ణాకర్ణిగా నా శకునియుఁ దన శుకం బండజపతిచే నపహృతంబయ్యె నని విని కనలి శూలహస్తుండై యాత్మపురి నుండి వెడలి యా గరుడునిం డాసి శూలంబుతోఁ బ్రహరించుచు వెంటనంట నాతం డాస్యంబునుండి యా కీరంబును విడక సప్తద్వీపంబులను సప్తసింధువులను దిరిగి తద్దేశిబ్రాతిపీడితుండై తుద కంబరంబున లక్షయోజనంబులేగి యటనుండి కసితో నది మేరుపర్వతశిఖరంబునం బడి నీల్గునట్లు బడవేసి యుద్ధరంగంబునందున్న వెన్నుని సన్నిధికిం జని తత్ప్రశంసావాక్యంబు లందుచుండె. అంతఁ దత్ప్రహారంబున శుకంబు మడియుట దానవేంద్రుండు విలోకించి నొచ్చిన మనంబుతో నాగ్రహించి హతశేషాసురులం దోడ్కొని యుచ్చైశ్శ్రవహయం బెక్కి భయంకరంబుగా ధనువుం డంకరించుచు శ్రీకృష్ణసమ్ముఖంబున కేతెంచె. ౬౪౨

తే॥ అపుడు యాదవులందఱు ♦ నసురవరుఁడు, మరల వాహినితో నని ♦ కరుగుదెంచు
టను విలోకించి హేతులం ♦ గొనుచు నట్టి, దానవులతోడఁ దలపడి ♦ రో నృపాల!

తే॥ అందు శూరులు శూరులు ♦ నహమహమిక
సింహములు సింహములు వోరుఁ ♦ జేయుకరణిఁ
బోరి రిటు రెండుతెగలకు ♦ ఘోరయుద్ధ
మయ్యె శకుని సేనాగ్రము ♦ నందు నిలిచి. ౬౪౪

శకునిదైత్యుండు శ్రీకృష్ణునితోఁ బోరి నీల్గుట.

శా॥ కోదండంబును డంకరించి శరముల్ ♦ కోటానకోట్లేసి యా
చ్ఛాదింపన్ దివి గ్రమ్మెఁ జీకటులు త ♦ చ్చక్రాయుధుండున్ బలుం
డౌ దామోదరుఁ డప్పుడేకశిఖతోఁ ♦ దద్బాణసందోహమున్
ఛేదింపన్ సుకరంబుగా దితిసుత ♦ శ్రేష్ఠుండు రోషంబుతోన్. ౬౪౫

క॥ ధను వెక్కుపెట్టి పూర్తిగ, వనజాక్షుని హృదయమందుఁ ♦ బదిశరముల వే
సిన హరి పదిబాణంబుల, దనుజేశుని ధనువుఁ ద్రుంచెఁ ♦ దత్పరమందున్.

చ॥ శకుని శతస్వరూపుఁడయి ♦ సారసలోచనుతోడ సాంపరా
యికముఁ బొనర్పఁ గాంచి యల ♦ కృష్ణుఁడునున్ వెయిరూపులొంది ప్రే

ఱుకు లదిరా ! యనఁగ దనుజ ♦ కాంతునితోఁ రణమాడ వాఁడు పా
వకసమమౌ త్రిశూలమును ♦ బల్మిని ద్రిప్పియు వైచె శౌరిపై. ౧౪౭

క॥ అంతఁ గృతాంతనిభుఁడు శ్రీ,కాంతుం డద్దానిఁబట్టి ♦ కరమున విఱిచెన్
బంతమున గరుత్మంతుఁడు, వింతగ నాశీవిషంబు ♦ విఱిచినకరణిన్. ౧౪౮

తే॥ మఱియు శ్రీహరి వజ్రస♦మానగదను,హయమునుండి యా దానవుం♦డవనిపైనిఁ
గూలునటు శీర్షమందునఁ♦గొట్టెఁ దత్ప్రహారమున వాఁడు మూర్ఛిల్లె♦ధారుణీశ !

చ॥ క్రమముగ లేచి యా శకుని ♦ కన్నుల నిప్పులు రాలుచుండ స్వీ
యమగు గదన్ గరానఁగొని ♦ యా హరిఁ గొట్టెను నిట్లు ఘోరనా
దములు సెలంగ వారికి గ ♦ దారణమయ్యెను నంతఁ బూరుషో
త్తముగద యట్టి దానవు గ ♦ దన్ నుసిజేసెను నంత నిర్భరున్. ౧౫౦

తే॥ భూధరదరీముఖంబునఁ♦బూసిక రెండు, సింహములు బోరుతీరునఁ♦జిత్రవనము
నందు రెండుమదేభంబు♦లాహవంబు,సలుపు లెఱఁగునఁ గయ్యంబు♦సల్పి రపుడు.

తే॥ శకుని శ్రీకృష్ణుని శతయో ♦ జనములఁ గసిఁ
ద్రోయఁ దోయజాక్షుండును ♦ దోర్బలమున
నతని పిక్కలఁగ బట్టి స ♦ హస్రయోజ
నములఁ గూల్చెను ధరపై న ♦ నంతరమున. ౧౫౨

చ॥ జయజయ యంచు నా శకుని ♦ చారుధిశైలము వైవఁ గృష్ణుపై
రయమున నాతఁ డద్దిగొని ♦ రాక్షసుపైఁ బడవేసె నొండొరుల్
జయజయ యంచు నిట్టులల ♦ శైలముఁ ద్రోసికొనం గడంగి ర
ల్లయచల మంతమం దల ప♦లాశపురంబునఁ గూలెఁ బాడుగాన్. ౧౫౩

తే॥ శకుని యంతట స్వపురంబు ♦ వికృతిగనుట
గాంచి యత్యుద్ధురక్రుద్ధన్ ♦ ఖడ్గచర్మ
ములను గైకొని యా కృష్ణు ♦ మ్రోలకేగ
నపుడు శార్ఙ్గి శార్ఙ్గముఁగొని ♦ యాగ్రహమున. ౧౫౪

ఆ॥ అర్ధచంద్రరూప ♦ కాంబకం బతనిపై, వైవ నద్ది గ్రీష్మ ♦ భానుభాతి
వెలిఁగి దశదిశలను♦వెల్గించి తద్దైత్యు, మస్తకంబుఁ ద్రుంచి♦మహినిఁ జొచ్చె.

ఆ॥ దనుజుఁ డిట్లు గిట్టి ♦ ధాత్రీతలస్పృష్టి, క్షణములోన బ్రతికి ♦ స్వాశిరంబుఁ
బాణినిఁ గొని తన క♦బంధంబునం బెట్టి, మరల హరినిఁ బోర♦నరిగె జనక !

తే॥ అపుడు కృష్ణుఁడు తీవ్రమౌ ♦ నంబకమున
వాని తలఁ ద్రుంచెఁ గ్రమ్మఱ ♦ వాఁడు బ్రతికె
నిటుల నేడుసారులు వాఁడు ♦ కృష్ణుచేతఁ
జచ్చియున్ మనె వింతగా ♦ సర్వులకును. ౧౫౭

ఉ॥ ఇట్టుల రాహుభారి మర ♦ గించి ధరాతల మంటి క్రమ్మరన్
బుట్టెడి దానవేశ్వరుఁ డ ♦ మోఘవిధంబునఁ జిచ్చు కాఱునం
బట్టి దహించుమాడ్కి యదు ♦ పార్థివసేనలఁ జొచ్చి వీరులన్
బట్టుచు లక్షయామడలఁ ♦ బాఱఁగవైచి నభస్స్థలంబునన్. ౨౭౮

ఉ॥ కొన్నిఁటి సేన్యులన్ నొసటఁ ♦ గూరిచి కత్తులఁజేర్చి కొన్నిఁటిన్
గొన్నిఁటి నంసయుగ్మమునఁ ♦ గూర్చి లయానలరుద్రుకైవడిన్
బన్నుచు నొక్కఁడయ్యె యదు ♦ వర్యభటాళిని గాళ్ళఁజేతులం
దన్నుచుఁ జెండ యాదవప ♦ తాకిని క్షోభముఁజెందె నయ్యెడన్. ౨౭౯

ఉ॥ చక్రి యవక్రవిక్రముఁడు ♦ సాధుజనావళిరక్షణార్థమై
వక్రచరిష్ణుఁడౌ శకుని ♦ పైని సుదర్శనహేతి వేయ నా
చక్రము కాలకోటిరవి ♦ సామ్యరుచిన్ జని వాని కంఠమున్
శక్రునిహేతి వృత్రుతల ♦ సంహృతిజేయువిధిన్ హరింపఁగాన్. ౨౮౦

చ॥ హరి సని గిట్టినట్టి దను ♦ జాధిపు హ స్తమునం గ్రహించి యం
బరమునఁ బాఱవైచి యదు ♦ వంశజులార ! ప్రమాదహీనులై
శరములతోడ నిట్టిదను ♦ జప్రభు ధాత్రిని నంటకుండఁగాఁ
గొఱఁతలు లేనియ ట్లెగురఁ ♦ గొట్టుఁడి ! నెట్టుఁడి ! యంచుఁ బల్కఁటన్. ౨౮౧

తే॥ యాదవోద్భటులందఱు ♦ నాలకించి, నింగినుండి ధాత్రింబడు ♦ నిర్జరారిఁ
బెక్కుదివ్యబాణంబులన్ ♦ వేసి మింట, నెగురఁగొట్టిరి సురలు వీ ♦ క్షింప వింత. ౨౮౨

వ॥ అంత నంతరిక్షంబునుండి తిరిగి ధరం బడంబోవు నాపౌలదిండి దీప్తి
మంతుని బాణంబులతో శతయోజనంబులకును, సాంబాంబకంబులతో సహస్రయోజ
నంబులకును నర్జునశరంబుతో నయుతయోజనంబులకును ననిరుద్ధమార్గణంబుతో
లక్షయోజనంబులకును బ్రద్యుమ్నాశుగంబుతో నియుతయోజనంబులకును
యామద్వయంబు గతించుదాఁక నింగికి నెగురఁగొట్టంబడి మరలి క్రిందిభాగంబున
కేతెంచుట శ్రీకృష్ణుండు జూచి యొండు పృషత్కంబు వేసి కోటియోజనంబు లంబ
రంబునం దవ్వానిం బఱపి వెంటనే రెండవశరంబుతో నలుగడలఁ గోటియోజనం
బులవఱకుం ద్రిప్పి తుట్టతుదకు మారుతంబు ఛేదించి నీరజంబును నీరంబునం
బడవేసినట్లు నీరధిం గూల్చె. తత్పతనంబున నా చండబలుండు నిశ్శేషంబుగా
మృతుండయ్యె. ఆసమయంబునం దతనిజోతియు నా శ్రీకృష్ణునిలోన లీనం
బయ్యె. అప్పుడు, ౨౮౩

చ॥ కురిసిరి పుష్పముల్ సురలు ♦ క్షోణి వికాసముగాంచె దుందుభుల్
మొరసె జయధ్వనుల్ సెలఁగ ♦ మోదముసెందిరి కిన్నరాదులున్

సురపతిమున్ను వేల్పులును ♦ జూచి ముదంబున వచ్చి మ్రొక్కి రా
హరికి సమస్తమానితతి ♦ హర్షముఁ బొందె ధరేశ! పిమ్మటన్. ౨౬౪

{ శ్రీకృష్ణుండు చంద్రావతీపురికేగి శరణాగతులైన శకుని భార్యాపుత్రుల కభయదానం బొసంగుట. }

మ॥ హతశేషుల్ దనుజుల్ పలాయితులుగా ♦ నా కృష్ణుఁడున్ యాదవ
ప్రతతిన్ గూడుచు వందిమాగధజనుల్ ♦ వర్ణింప ధక్కాదివా
ద్యతతుల్ మ్రోయఁగఁ జేయుచున్ జయజయ ♦ ధ్వానంబుతో రాక్షసా
వృతచంద్రావతి కేగె సంతసమునన్ ♦ వెన్నంట గీర్వాణులున్. ౨౬౫

తే॥ ఆసమయమందు శకునియ♦ర్ధాంగి భర్తృ, మరణదుఃఖార్త మానినీ♦మణి మదాల
స, నిజసుతుఁగొని శ్రీకృష్ణ♦చరణములను, వ్రాల్చి యశ్రుపూర్ణాస్యయై♦పలికె నిట్లు

మ॥ ధరణీభారముఁ బాపఁగా సుజనసం ♦ తానంబు రక్షింపఁగాఁ
బరమేశా! యనుకంపతోడ యదువ ♦ ద్వంశంబునం బుట్టవే
యరయన్ సృష్టిని బాలనంబు మఱిసం ♦ హారంబునుం జేయునే
ర్పరివీ వేకద! యట్టులయ్యు గుణముల్ ♦ బంధింపవే నిన్నహో! ౨౬౭

సుగంధివృత్తము. దేవదేవ! వాసుదేవ! ♦ దేవరాజపోషకా!
దేవకీసుతా! మహాత్మ! ♦ దేవవైరినాశకా!
దేవవంద్య! రాధికేశ! ♦ దివ్యగోజగత్పతీ!
శ్రీవిభూ! శిరంబుతోడఁ ♦ జేసెదన్ నమస్కృతుల్. ౨౬౯

తే॥ కృష్ణ! నాథర్త నీయెడ♦నేమియేమి, తప్పులొనరించె నయ్యవి♦యొప్పులుగను
దలఁచి మన్నింపుమా! నాదు♦తనయు నీని, బాలుఁ బాలింపుమా! కరు♦ణాలవాల!

చ॥ అనవుడు కృష్ణమూర్తి తన ♦ హస్తములన్ భయభీతుఁడైన త
త్తనయుశిరంబుపైని నిడి ♦ దైన్యము వీడుము కల్పమేగుదాఁ
కను మను మిట్టి రాజ్యమును ♦ గాంచుము జ్ఞానవిరక్తిభక్తులన్
గనుమని స్వీయమాల శిశు ♦ కంఠమునందున వైచె భూమిపా! ౨౭౦

ఉ॥ శ్రీవిభుఁ డంతమున్ను సుర ♦ శేఖరు గెల్చి దివంబునుండి యా
దేవవిరోధియా శకుని,♦ దెచ్చిన ధేనుసురద్రుమాశ్వశో
భావిలసన్మణుల్ దివిజ ♦ వర్యునకిచ్చెఁ గదా యతండు గో
దేవధరామరశ్రుతిసు ♦ ధీజనులన్ దమిఁ బ్రోవఁ బుట్టఁడే? ౨౭౧

తే॥ అనఁగ బహులాశ్వుఁ డిట్లనె♦నమరయోగి, వర! శకుని మొదలైనయా♦సురవిరోధు
లాదిజన్మంబునం దెవ్వ♦రట్లుముక్తి, నొందుటకు హేతువేమి? వ♦చింపుమయ్య!

తే॥ అవల నారదుఁడిట్లాడె♦నవనిపతికి, సంగ్రహించి వచించెద♦జనక! వినుము
తొల్లి బ్రహ్మకల్పంబునం♦దున వసువను, నొకఁడు గంధర్వనాథుఁడై♦యొప్పుచుండు

నారదుండు జనకునకు శకున్యాద్యసుర పూర్వజన్మవృత్తాంతంబుఁ జెప్పుట.

వ॥ అట్టి గంధర్వపతికిం గామరూపులును దివ్యభూషణభూషితులునగు మందార మందర మంద మందహాస మహాబల సుదేవ సుధన సాధ శ్రీభానువులను పేరులతోఁ బరఁగు తొమ్మండుగురు పుత్రులు జనించిరి. అవ్వార లొక్క సమయంబునందు బ్రహ్మలోకంబున కేగి తత్పుత్రికయగు సరస్వతిం గాంచి మోహించి మనంబున హసించిరి. తద్బ్రహ్మాపరాధంబున వారు తమోగుణమయంబగు రాక్షసయోని నాశ్రయించి వరాహకల్పంబున హిరణ్యాక్షునిభార్యయందు శకుని శంబర హృష్ట భూతసంతాపన వృక కాలనాభ మహానాభ హరిశ్మశ్రూత్కచులను నామంబులతోఁ బుట్టి నెగడుచుండ నపాంతరతమనామకమహాముని చనుదెంచె. అమ్మెయి నమ్మహాసురు లభివాదనమ్ము లాచరించి సర్వజ్ఞా! భక్తవత్సలుండగు భగవంతుండు భక్తులకు ముక్తి యిచ్చునుగాదే ? అసురయోనియందుద్భవిల్లిన మాచే నాపరాత్పరునియెడ భక్తిభావం బల్పంబేనిఁ జూపఁబడలేదు. ఇఁక మేమెట్లు కృతార్థులముగాఁగలమో యా యుపాయ మానతీయుమని ప్రార్థింప నాయోగివర్యుం డెవరెవరేయేగుణంబుల నాపరుని భజింతురో వారు వారాయా రీతుల నిశ్శ్రేయసపదంబును బొందగలరు. మున్ను పృశ్నిగర్భసంబంధంబున బ్రహ్మలును, సద్భావంబునం బ్రహ్లాదుండును, స్నేహంబున సుతపమునియు, భయంబున హిరణ్యకశిపుండును, క్రోధంబున మీ తండ్రియగు హిరణ్యాక్షుండును సేవించి యా హరిం జేరిరి. అట్లే మీరేదోవిధంబుగా నిశ్చలంబగు మనంబుతో నాదేవుని భజించి కృతార్థులుగండని చెప్ప నా శకున్యాదు లావిధంబుగా కీటంబు భ్రమరభయంబుచే భ్రమరంబైనట్లు ద్వేషించి క్రమంబుగా నా హరింబొందిరి. ఇట్లు యాదవేశ్వరుండు భద్రాశ్వఖండంబు జయించి సకలసైన్యపరివారసహితంబుగా నందుసాఁగి

ప్రద్యుమ్నుం డిలావృతఖండంబును గెలుచుట.

సీ॥ జంబుభవంబగు ♦ జాంబూనదము స్వాత,స్సిద్ధిభవంబయి ♦ చెలఁగు నెచట
సర్వామయంబులఁ ♦ సమయింపఁజాలిన, "యరుణోద" యను నది ♦ వఱలు నెచట
నన్నాసనాభర ♦ ణాదిఫలంబుల, నిచ్చెడి నదములు ♦ నెసఁగు నెచట
నెల్లకాలంబుల ♦ నీశుండు ప్రియలతోఁ,గూడి సంతసమునఁ ♦ గొదరు నెచట
తే॥ శీతవాతోష్ణవైవర్ణ్య ♦ పూతిగంధ
బాధలఁ బాపెడి ప్రియక ♦ ప్రథవపంచ
మధురమధుధారలఁ ద్రావి ♦ మనుజు లెట సు
ఖంబుఁ గాంతురా యిలావృత ♦ ఖండ మొందె. ౧౭౯

తే॥ అట్టి ఖండంబునందున ♦ సరిగిస నరు,లబల లాదురు సంకర్ష ♦ ణాభిధాన
దేవుఁ డుండును గాశ్మీర ♦ దేవతరువు,లొప్పు నూర్ధ్వ వనము వెల్గు ♦ చుండు మఱియు

ఆ॥ స్వర్ణపద్మములును ♦ వాసంతశీతాని,లములు దగు లవంగ ♦ లతలు దనరు
సంతతంబు సురలు ♦ సంచరించుచు నుంద్రు, మత్తభృంగములును ♦ మాఁ త్తియుండు.

తే॥ పర్వతేంద్రంబు సత్యలో ♦ వాస మవని,గోళకర్ణికాభము శాత ♦ కుంభమయము
రత్నసానురాజితము స్ఫు ♦ రత్ప్రకాశ,ముసయి మేరునామకగిరి ♦ దనరుచుండు.

తే॥ తన్నగంబునకున్ నాల్గు ♦ తట్టులందు,నందమగు మందరము మేరు ♦ మందరము సు
పార్శ్వమున్ గుముదంబను ♦ పర్వతములు, వెలుఁగుఁ బురుషార్థములబోలె ♦ నలఘుచరిత!

తే॥ అవల హరిపద్మరాగర ♦ త్నాంకురములఁ, జెలఁగునచ్చటి భూమి వీ ♦ క్షించి వింత
పడుచుఁ దక్షండపతులచే ♦ బలులఁగొనుచు,మోదమందుచునుండెనో ♦ భూవరేణ్య!

ఆ॥ మున్ను శోభనుఁడను ♦ ముచుకుందునల్లుఁడు, భరతఖండమందుఁ ♦ బరమభక్తి
నుపవసించి పూని ♦ యుత్తమైకాదశీ,వ్రతము సల్పి చక్ర ♦ పాణిదయను. ౮౮౧

క॥ దురితవిదూరుండై నిర్జరవరులన్ గూడి మంద ♦ రగిరిన్ సుగుణా
కరచంద్రభాగతోఁదగి, యిర నేలును ధనదుకరణి ♦ నిప్పటివఱకున్. ౮౮౨

ఉ॥ ఆ సరసప్రభుండు హరి ♦ యండకు నేగి ప్రదక్షిణంబులన్
జేసి నమస్కృతుల్ సలిపి ♦ చేకొని యీ బలులన్ మహాత్మ! న
న్నాసిగఁ బ్రోవుమంచు బహు ♦ భక్తిని వేఁడియుఁ దిర్గి స్వీయమా
వాసముఁబొందె నన్న విని ♦ పార్థివుఁ డా సురమౌని కిట్లనెన్. ౮౮౩

క॥ ధీరుం డా శోభనవిభుఁ, డారహిఁ జనినంత నేమి ♦ యయ్యెను? చెప్పుమా!
నారద! నావుడు మునియును, భూరమణున కిటుల నాను ♦ పూర్విగఁ బలికెన్.

క॥ అలమందరాచలంబునఁ,గల యొకపెదచెఱియయందు ♦ ఘనకాసారం
బలఘుకనకాబ్జలలితము, లలిఁగని పార్థుఁడు హరి కిటు ♦ లన్ బలికె విభూ! ౮౮౫

తే॥ నందనందన! కాంచన ♦ సుందరప్ర,తతిసురుచిరారవిందబృం ♦ దప్రయుక్త
మైన యీకుండ మెవరిదో ♦ యేచువినఁగఁ,గోరుచుంటిని సెపుమ! నా ♦ కోర్కెదీఱ.

మ॥ అన శ్రీకృష్ణుఁ డిటు ల్వచించె విజయా! ♦ యాలింపుమా యీస్థలిన్
మును స్వాయంభువవంశమందుఁ బృథుభూ ♦ పుం డుద్భవంబొంది శ్ర
ద్ధను హెచ్చైనతపంబుఁ జేసెఁగద యే ♦ తద్దివ్యకుండంబొ యా
తనిదే, దీనిజలంబు గ్రోలునరుఁడో ♦ ధన్యుండగున్ రూఢిగాన్. ౮౮౬

తే॥ మఱియు నందున మునిఁగిన ♦ మానవేత,రమగు జంతువుగూడఁ బ ♦ రమపదంబుఁ
జెందునోకవ్వడి! యంచుఁ ♦ జెప్పి యచటఁ,గల తపోభూమికేగ నా ♦ స్థలమునందు.

తే॥ అష్టసిద్ధులు బహుసుంద ♦ రాకృతులను, బాడు చాడుచు నుండుట ♦ భక్తుఁడైన
యుద్ధవుఁడు గాంచి యబ్బురం ♦ బొంది యాద,వేశ్వరుఁడగు శ్రీకృష్ణుఁ బ్ర ♦ శ్నించె నిట్లు.

తే॥ ఈమనోజ్ఞతపోభూమి ♦ యేఘనునిదో?, కనులపండువగానాడు ♦ కమలముఖులు
సుందరులు వీరలెవ్వరో? ♦ నందనంద,నా! వచింపుమా నావుడా ♦ శ్రీవిభుండు.

క॥ తొలిస్వాయంభువమను వీ, స్థలమునఁ దప మాచరించెఁ ♦ దత్త్వజ్ఞా! యీ
స్థలి యాతని దిప్పటికిన్, దెలిసికొనుము సందియములు ♦ దేవల దెదరన్. ౪౯౧
తే॥ అణిమ మొదలైన సిద్ధులీ ♦ యాకృతులను, దాల్చి కలకాల మిచ్చటఁ ♦ దనరుచుండుఁ
దమ మిటన్ సల్పునరుఁడు బ్రం ♦ దారకత్వ, మొందు నజుఁడిద్ది వర్ణింప ♦ నోపలేఁడు.

వ॥ అంత నా రమాకాంతుం డటనుండి వెడలి తొల్లి హిరణ్యకశిపుండు దీర్ఘతపం బొనరించిన ప్రోత్కటదేశంబులను జూచుచుఁ దద్రాజధానియు గాంచన మయంబునగు లీలావతీపురి కేగె. అందు వీతిహోత్రుండు మూర్తిమంతుండై ధర్మంబుగాఁ దద్దేశంబు నేలుచు విరాజిల్లుచుండు. ఆయగ్ని యా శ్రీకృష్ణుని రాకవిని పారితోషికంబులం గైకొని చనుదెంచి యామహాత్మున కర్పించి యుగ్గలంబుగా నగ్గించి చనియె. ఇట్లా హరి యాయిలావృతఖండం బంతయు దర్శించుచు మనో హారంబగు జంబూద్వీపస్థిత వేదనగరంబున కేతెంచె. తన్నగరసభామధ్యమంబున.

శ్రీకృష్ణుండు వేదనగరంబున కేగుట.

సీ॥ బ్రహ్మణి! వల్లకీ ♦ గ్రంథంబులన్ దాల్చి, శ్రీకృష్ణవర్ణనన్ ♦ జేయుచుండు
పూర్వచిత్త్యుర్వశీ ♦ ముఖులైన యచ్చరల్, హావభావాదుల ♦ నాడుచుండ్రు
హ్రస్వదీర్ఘప్లుతా ♦ ద్యష్టాదశవిభేద, ములతోడ శ్రుతులును ♦ బలుకుచుండు
వాదిత్రవల్లకీ ♦ వంశిమృదంగాది, వివిధవాద్యములు శ ♦ బ్దించుచుండు
తే॥ నిగముఁడున్ బ్రభువర్యుఁడై ♦ నెగడుచుండు, మఱియు విశ్వావసుండు చి ♦ త్రరథతుంబు
రులు సుదర్శనుం డేనును ♦ లలితరీతి, గానమును జేయుచుంటిమో ♦ మానవేంద్ర!
ఆ॥ ఇంకనట్టిసభను ♦ హిందోలమేఘమ, ల్లారదీపకములు ♦ భైరవమును
మాలకోశకమును ♦ మఱియు శ్రీరాగంబు, మూర్తిమంతములయి ♦ పొల్పుఁగాంచు.
తే॥ అందు నొక్కొక్కదానికి ♦ నాత్మజాష్ట, కము సతీపంచకంబును ♦ గలదు భైర
వమనురాగంబు పచ్చగా ♦ వఱలు మాల, కంబు శుకద్యుతి నొప్పు న ♦ ఖండరీతి.
తే॥ దీపకము సువర్ణద్యుతిఁ ♦ దేజరిల్లు, మేఘమల్లారమున్ నెమ్మి ♦ మించు వన్నె
నతిశయించు హిందోలము ♦ హంసరుచిని, నెక్కు శ్రీరాగ మరుణిమ ♦ నుండు జనక!
క॥ అనవుడు జనకుం డిట్లనె, మునివర! స్వరతాలనృత్య ♦ ముల గ్రామములన్
దనరెడి భేదములన్ బే, ర్లును జెప్పుము కరుణ నాక ♦ లఘుతరఫక్కిన్. ౪౯౨

నారదుండు జనకునకు రాగతాలనృత్యాది భేదంబులం దెల్పుట.

వ॥ అన విని నారదుం డిట్లనియె. మైథిలేంద్రా! నిషాదర్షభగాంధార షడ్జమధ్యమధైవతపంచమంబులను పేళ్ళతో సప్తస్వరంబులును, రూపక చంచరీక పరమఠ విరాడ కమఠ మల్లక ఝుటి జటలను నామంబులతో నెనిమిది తాళంబులును, రాస తాండవ గాంధర్వ కైన్నర వైద్యాధర గౌహ్య శాక్రూవస హావ

భావానుభావంబులను నామధేయంబులతో దశనృత్యంబులును మాధుర్య గాంధార ధ్రౌవ్యంబులను నభిధేయంబులతో గ్రామత్రయంబు నొప్పు. సా రే గ మ ప ద ని యను పదంబులతో స్వరంబు లొప్పారు. ఇట్లు గాలదేశక్రియాభేదంబులచే జ్ఞానగీతంబు షట్పంచాశత్కోటిభేదంబులుగాఁగలదు. తదంతర్భేదంబు లనంతంబులు. ఆ యానందగీతంబే శబ్దబ్రహ్మమయుండగు హరియని యెఱుంగుము. అందు భైరవరాగంబునకు భైరవీ పింగళా శంకీ లీలావ త్యగారు లను పంచసతులును మహార్షి సమృద్ధ పింగల మాగధ బిలావల వైశాఖ లలిత పంచము లను నెనమండ్రుకొమరులును మేఘమల్లారంబునకు చిత్రా జయజయావంతీ విచిత్రా వృజల్లా మ్యంధకారు లను నైదుగురు వనితలును, శ్యామకార సోరఠ నట్ డాయన కేదార ప్రవజరంహాస్య జలధార విహాగు లను నష్టసుతులును, దీపకంబునకు కంచుకీ మంజరీ టోడీ గుర్జరీ శాబరులను నైదుగురు సుందరులును, గల్యాణ శుభకామ గౌడకల్యాణ కామరూప కాన్హార రామసంజీవన సుఖనామ మందహాసు లను నెనమండ్రు పుత్రులును, మాలకోశరాగంబునకు గాంధారీ వేదగాంధారీ ధనాశ్రీ స్వర్ణిణీ గుణాగరు లను పంచసుదతులును, మేఘ మచల మారుమాచార కౌశిక చంద్రహార ఘుంఘుట విహార నందు లను నెనమండ్రు నందనులును, శ్రీరాగంబునకు వైరాటీ కర్ణాటీ గౌరీ గౌరావటీ చంద్రకళ లను నైదుగురు మనోహారిణులును, సారంగ సాగర గౌర మరుత పంచశర గోవింద హమీార గీర్భరు లను నెనమండ్రు తనయులును, హిండోలంబునకు వసంతియు నైరజియు హేరియుఁ దైలంగియు సుందరియు నను పంచసుందరులును, మంగళ వసంత వినోద కుముద విభాస స్మర మండలు లను మొదలైన నామంబులతో నొప్పారు నెనమండ్రు కొడుకులును గల రని రాగవేత్తలు నిర్ణయించిరిగాదే? యన నాలించి బహులాశ్వుం డా మునీశ్వరు నిట్లడిగె. ౮౯౯

తే॥ మానివర్య! శబ్దబ్రహ్మ ♦ మైన వేద
మయున కచ్యుతునకు రాస ♦ మండలాత్మ
కమగు హిండోలమునకు నం ♦ గంబు లెవియొ?
పలుకుమా! యన ముని యిటు ♦ పలుకఁ దొడఁగె. ౯౦౦

సీ॥ ఆస్యంబు వ్యాకృతి♦హస్తముల్ మీమాంస, విపులపాదంబులు♦పింగళమును
గనులు జ్యోత్యంబునా♦ల్కయును గాంధర్వంబు, పీనవక్షము ధను♦ర్వేదరాశి
మనము వైశేషికం♦బును బుద్ధి సాంఖ్యంబు, ప్రబలపృష్ఠంబును♦వైద్యవిద్య
విమలహృచిత్తంబు♦వేదాంతసారంబు, నతిశయాహంకృతి♦న్యాయశాస్త్ర
తే॥ మంచుఁ బలికిరి పెద్దలా♦యచ్యుతునకు, నిదియ రాగరూపంబని♦యెఱుఁగుమింక
నేమివినదవో? నాకు వ♦చింపు మనఁగ, జనకుఁ డిట్లనె నారద♦మునివరునకు,

తే॥ విబుధమానసేంద్ర! కృష్ణుఁ డా ♦ వేదపురికి
నేగి యేమేమి సల్పెనో? ♦ యేను వినఁగఁ
గోరుచుంటిని నావుడా ♦ నారదుండు
సెప్పె నిట్టుల మైథిల ♦ శేఖరునకు. ౯౦౨

చ॥ సుగుణివతంస! యట్లు మధు ♦ సూదనుఁ డాపురి కేగినంతటన్
నిగముఁడు తత్పురాధిపతి ♦ నమ్ర బలుల్గొని వాక్యభంగితోఁ
దగి స్వరతాలరాగసహి ♦ తంబుగఁ బోయి యెసంగి మ్రొక్కి నా
నిగమవిహారుఁడైన హరి ♦ నెయ్యముతోఁ గని వాని కిట్లనెన్. ౯౦౩

తే॥ నిగమ! నీ భక్తి మెచ్చితి♦నీమనమునఁ, దెలఁగు కోర్కె యేదియో♦చెప్పికొనుము
ముజ్జగంబుల మద్భక్త♦సజ్జనులకు, నేదియును దుర్లభంబుగా♦లేదు గాదె! ౯౦౪

చ॥ అన నిగముం డిటుల్ పలికె ♦ నార్య! ప్రసన్నుఁడవైనచో నటుల్
నెనరున నాదుపార్షదులు ♦ నేత్రములారఁ గనుంగొనన్ ద్వదీ
యనిరుపమస్వరూపముఁ ద ♦ దద్భుతగోజగతీవిభాసురం
బును బృథుబృందకావనస ♦ ముజ్జ్వలరాసగతంబుఁ జూపుమా! ౯౦౫

చ॥ అల నుడి విన్న శౌరి తన ♦ యద్భుతరూపము రాధికాన్వితం
బలఘువిధానఁ జూప నిగ ♦ మానుచరు ల్గని సాత్వికాశయం
బుల స్వతనుస్థితుల్ మరచి ♦ మూర్ఛను బొంది ముదంబుతోడ ని
ట్టుల మును వింటిమో మన మ ♦ టుల్ గనియుంటిమి ప్రస్తుతంబునన్. ౯౦౬

క॥ అనుకొను చిట్టుల నిగముఁడు, మునుఁగల వారా మహాత్మ ♦ భువనేశ్వరు జీ
వనజాక్షుని రాధాకృష్ణు నుతించుచు నాడి రిటులఁ ♦ జూచుచు జనకా! ౯౦౭

వ॥ అం దాదియందు నిగముం డిట్లు స్తుతించె. ౯౦౮

మ॥ సదసజ్జ్ఞానమహత్ప్రధానసమశ ♦ శ్వద్దుర్గమద్రవ్యవి
శ్వదురాధర్ష విభుత్వసత్వమఘువ ♦ ద్బ్రహ్మోష్ణరశ్మ్యాదులే
విదితుండైన మహానుభావురుచితోఁ ♦ బ్రెబ్బ్రొత్తిగా సాటియై
కుదురంజాలరొ యా మహామహు దయా ♦ కూపారు నిన్మ్రొక్కెదన్. ౯౦౯

వ॥ అంత సరస్వతీదేవి యిట్లనె. ౯౧౦

మ॥ జగదీశా! మునివర్యులెల్లరును దే ♦ జఃపుంజమంచున్ నిరున్
మిగులన్ వర్ణనసేయుచుందు రిఁక సా ♦ మీ! భక్తులో దేహయు
క్తుగ వర్ణింతురుగాదె నీ యుభయరీ ♦ తుల్ నాదుదోషాళి పో
నెగురంగొట్టి శుభంబు గూర్చుటకు నే ♦ నెల్లప్పుడున్ మ్రొక్కెదన్. ౯౧౧

వ॥ పిమ్మట గంధర్వు లిట్లు ప్రార్థించిరి. ౯౧౨

మ॥ తలఁపఁగ గౌరవినీలరుగ్రుచిరరా ♦ ధాకృష్ణరూపంబుతో
జలదం బల్లతటిల్లతఁగ దగినటుల్ ♦ సంతోషచిత్రంబులుఁ
గలుగఁగ వెల్గుచునుంటివో గుణమణీ! ♦ కారుణ్యపాథోనిధీ!
జలజాక్షా! కొను మిప్పు డే మిడెడి సా ♦ ష్టాంగప్రణామంబులఁ. ౮౧౩

వ॥ అనంతరంబునం దప్సరస లిట్లు వేడిరి. ౮౧౪

చ॥ ఎటులఁ దమాలభూరుహ మ ♦ హీనవిధంబున స్వర్ణవల్లితో
నెటుల నదభ్రమేఘము న ♦ హీనవిధిఁ దొలుకారుమించుతో
నెటు పృథునీలశైలము న ♦ హీనకషోపలఖాని నొప్పునో
యటులనె రాధతోఁ దగుచు ♦ హర్షముఁ గూర్చెడి నీకివే నతుల్. ౮౧౫

వ॥ అవల గ్రామత్రయం బిట్లు నుతించె. ౮౧

తే॥ శివరమోమాసురావళి ♦ కవులతోడఁ, గలిసి రాధికాదేవి యే ♦ ఘనునిపాద
పంకజముల పరాగంబు ♦ భావమందుఁ, గోరుచుండునో యట్టి నీ ♦ కు నివెనతులు

వ॥ అంతఁ దాళంబు లిట్లు పొగడె. ౮౧౯

తే॥ జగమునందున బలియాసి ♦ స్తవముగన్న, బలిమహారాజు నేబలి ♦ వశము జేసి
కొనియెనో యట్టి నీకిప్పు ♦ వినతులేము, సల్పుచుంటిమి శ్రీకృష్ణ! ♦ జలజనయన!

వ॥ అవల మానంబు లిట్లు గొనియాడె. ౮౨౦

తే॥ జ్ఞాను లంద తేదేవుని ♦ చరణకమల, ములను దిక్కని నమ్ముచుఁ ♦ బొగడి యఖల
దుఃఖభూయిష్ఠసంసృతిఁ ♦ ద్రోసినారొ, యట్టి నిన్నొగ్గి మ్రొక్కుచుంటిమొ ♦ యమరవంద్య!

వ॥ తరువాత స్వరంబు లిట్లు సంస్తుతించె. ౮౨౨

చ॥ అలిమునిసంస్తుతంబులును ♦ నబ్జయవధ్వజవజ్రచిహ్నితం
బులును మనోహరంబులును ♦ మోఘితశారదఫుల్లపద్మశో
భలును సువర్ణనూపురవి ♦ భాసురముల్ భవదంఘ్రిపద్మముల్
దలఁతుము మ్రొక్కుచుందు మదఁ ♦ దాల్చుచునుందుము రాధికేశ్వరా! ౮౨౩

ఆ॥ అంత భైరవాదు ♦ లైనరాగంబులు, వచ్చి యెదుటనున్న ♦ లచ్చిమగనిఁ
గృష్ణుఁజూచి యలరి ♦ యిట్లు వేర్వేరుగా, బొగడఁదొడఁగె జనక ♦ భూవరేణ్య!

వ॥ అందు భైరవరాగం బిట్లగ్గించె. ౮౨౫

తే॥ లక్ష్మి నిజమృదుకరకమ ♦ లములతోడ, స్వాంకమం దిడి భక్తురా ♦ లగుచు నొత్తి
నట్టి త్వజ్జానుయుగ్మంబు ♦ హర్నిశలును, గొలుచుచుందుము శ్రీకృష్ణ! ♦ జలజనేత్ర!

వ॥ వెంటనే మేఘమల్లారం బిట్లభినుతించె. ౮౨౬

మ॥ వరరంభాశకలంబులో పసిఁడికం ♦ బాలో యటం చెంతొ య
బ్బురమొందఁగ జెలువొంది పీతపటముల్ ♦ వొల్పారఁ బీనంబులై

పరిపూర్ణద్యుతితోడ వెల్గెడి భవ♦ద్భవ్యోరుయుగ్మంబునుఁ
నెఱి ధ్యానించుచునుంటినో యదుఘనా! ♦ నీరేజపత్త్రేక్షణా! ౯౨౮

వ॥ తరువాత దీపకరాగం బిట్లు సన్నుతించె. ౯౨౯

తే॥ సకలమంగళకరములు♦స్వర్ణరుచిరు,చిరములుఁ గట్యధస్స్థల♦స్థితము లమర
వంద్యములునైన భవదీయ♦పాదములను, సన్నుతింతుము కృష్ణ! ప్ర♦సన్నవదన!

వ॥ వెండియు మాలకోశం బిట్లు వినుతించె. ౯౩౧

ఆ॥ మందమారుతముల ♦ మఱిమఱిఁ గదలుచు, మానవాళి దృష్టి♦మానముల హ
రించునది సునతము ♦ బుభుమనోజ్ఞము గు నీ, కేశరుచిరకటికిఁ♦గేలుమోడ్తు.

వ॥ మఱియు శ్రీరాగం బిరహి నభినందించె. ౯౩౩

తే॥ కేశసందోహమన్మథా♦క్రీడభాసు,రంబు సువళిత్రయోర్మికా♦రమ్యము నగు
నీదు నాభిసరోవరం ♦ బాద లేగ, మ్రొక్కుచుంటి రాధాకృష్ణ!♦ప్రోవుమయ్య.

వ॥ అంతహిందోలరాగంబిట్లు కీర్తించె. ౯౩౫

ఉ॥ ప్రీతిని మోహముం గొలుపు ♦ పిప్పలపత్త్రగతాళిపంక్తియో
తాతము వింత గూర్చు జల ♦ జస్థితమేచకరేఖయో యటం
చాతతసంశయంబు లిడు ♦ నట్టి భవజ్జఠరస్థరోమసం
ఘాతమనోజ్ఞరేఖను న ♦ ఖండముగా వినుతింతు శ్రీహరీ! ౯౩౬

వ॥ పిదప భైరవనారీమణు లీతీరున వర్ణించిరి. ౯౩౭

తే॥ స్వర్ణకాంతికాంతంబును♦సకలమనుజ, దుఃఖహారమును దేవసం♦తోషకరము
వద్భుతము నింద్రధనురాభ♦మైన నీదు, దివ్యపీతాంబరంబు ను♦తింతుఁగృష్ణ!

వ॥ పిమ్మట భైరవకుమారు లిట్లు భూషించిరి. ౯౩౯

ఉ॥ ఎవ్వి చతుస్సముద్రముల ♦ యేపున విశ్వమునందు నిండెనో
యెవ్వి చతుష్పదార్థముల ♦ యేపున మేలు జగానఁ గూర్చెనో
యెవ్వి చతుఃకకుప్కరుల ♦ యేపున ధాత్రిని మోయునట్టి నీ
యవ్వి చతుర్భుజంబుల న ♦ హర్నిశలుఁ వినుతింతు మోహరీ! ౯౪౦

వ॥ తదనంతరంబున మేఘమల్లారసుదతు లిట్లు శ్లాఘించిరి. ౯౪౧

తే॥ అరుణబింబఫలద్యుతి♦సురుచిరంబు, నవజపాపుష్పలలితం బ♦నంతకోటి
భువనపతిమధురాధరం♦బును సతంబు, చిత్తమా! సన్నుతింపుమా!♦చెదరకుండ.

వ॥ తత్పరంబునం దత్పుత్రు లిట్లు ప్రశంసించిరి. ౯౪౩

క॥ ఘనసార కేతకీచం,దనముక్తామల్లికాప్సు ♦ తకళానిధిహీ
రనిరతిశయ కాంతిని మీ,ఱిన హరిరదనముల సంస్మ♦రింపుము మనమా! ౯౪౪

వ॥ అటుపై దీపకభార్య లిట్లు ప్రస్తుతించిరి. ౯౪౫

చ॥ పరిహృతదేవవృక్షమును ♦ భక్తజనావళిరక్షకంబు ను
ద్ధురబహులక్ష్మలక్షమును ♦ దోయజలోచన పుత్రకోజ్జ్వల
చ్ఛరసుపరీక్షకంబును వి ♦ సర్జనదక్షము సుందరంబు నౌ
హరికరుణాకటాక్ష మన ♦ యంబు నుతింపుము యంతరంగమా! ౯౪౬

వ॥ తరువాత దీపకాత్మజు లిట్లనిరి. ౯౪౭

తే॥ కమలమధ్యమునందు దుఃఖక్షయంబు, నొందఁగూర్చుండు ఖంజనయుగ్మమనఁగ
మదనచాపయుగ్మంబనఁ గొదరుమాధ, వేందుముఖగతభ్రుకుటిను తింతు మెంతొ.

వ॥ పిమ్మట మాలకోశమానినీమణు లిట్లనిరి. ౯౪౯

తే॥ ఘణులు చంద్రమండలమందు భ్రమరములును, భవ్యమకరందనిర్భర పద్మమందు
నాడినటుకృష్ణగండములందురుచుల, నాడు కుండలముల ప్రొముక్కు మా! మనంబ!

వ॥ పిదపఁ దత్తనయు లిట్లు వచించిరి. ౯౫౧

ఆ॥ వ్యోమమండలమున నుదితమౌ సూర్యయుగ్మంబనంగ నీల ♦ ఘనమునందు
మెఱయు మెఱపులనఁగ హరికపోలంబుల, నొసఁగుకుండలయుగ ♦ మెఱఁగు మనమ!

వ॥ అంత శ్రీరాగిణి లిట్లు పల్కిరి. ౯౫౩

ఉ॥ దూరమునుండి వేచసిన ♦ తుమ్మెదలుఁ మఱి ఖంజనమ్ములుఁ
బోరఁగ వాని నెన్నడుమఁ ♦ బూన్కి వరారుణబింబలిప్సతోఁ
జేరిన కీరమో యనఁగ ♦ శ్రీధర! నీ మొఱతమ్మికన్నవ
ర్యూటెడి పాపఁ గొల్చెద మ ♦ మిత్రవితానలతాలవిత్రమా! ౯౫౪

వ॥ అవలఁ దత్పుత్రు లిట్లు స్తోత్రంబు జేసిరి. ౯౫౫

తే॥ పరికరీకృతదృఢపీత ♦ పటుని శిఖ మ,కుటనతీకృతకంధరుఁ ♦ గుండలధరు
లగుడవేణుకకరుఁగమ ♦ లామనోహ,రు నటవేషధరుని గొల్తు ♦ మనిశ మేము

వ॥ పిమ్మట హిండోలకామిని లిట్లు వర్ణించిరి. ౯౫౭

మ॥ యమునాకూలకదంబమధ్యగుఁడు న ♦ వ్యాభీరనారీవిహా
రమహోత్సాహుఁ డుమాసుమాభుఁడు లస ♦ ద్రాజీవపత్రాక్షుఁడుఁ
గమలానాథుఁడు కర్బురాంతకుఁడు స ♦ త్కారుణ్యకూపారుఁడుఁ
విమలుం డావనమాలి మా కొసఁగుతన్ ♦ వేమాఱుఁ గల్యాణముల్. ౯౫౮

వ॥ పదపడి తదాత్మజు లిట్లు వాచించిరి. ౯౫౯

క॥ మావంటి మహాపాపులు, మీవంటి యఘాపహారి ♦ మేదినిఁగలఁడే?
కావున నీవే దిక్కని, భావమునన్నమ్మి మమ్ముఁ ♦ బాలింపుమెటో ౯౬౦

క॥ ఈరాగకృతవినుతి సెప్పు,లారఁగ వినువారికనుల ♦ కా భక్తేశుం
డౌ రాధాకృష్ణుఁడు మమ,కారముతో గోచరుండు ♦ గాగలఁడు ప్రభూ! ౯౬౧

తే॥ ఇటులహరి వారలకు నిజా ♦ కృతిని జూపి, యందఱును జూచుచుండగా ♦ నట నదృశ్యుఁ
డయ్యె నంతట నిగమాదు ♦ లాత్మమందిరముల కేగిరి తదనంత ♦ రంబునందు.

క॥ శ్రీరాజీవాక్షుఁడు స్వకుమారుని మారుని స్వసైన్య ♦ మండలపతిగా
నేరుపడఁ జేసి క్రమముగ, ద్వారావతి కేగె సపరి ♦ వారముగ విభూ! ౯౬౩

ప్రద్యుమ్నుండు గంధర్వదేశంబు గెలుచుట.

క॥ అంతటఁ గంతుఁడు నిజభట, సంతతితోఁ గూడి విజయ ♦ శబ్దము లొప్పన్
పంతమున గామధుఘన, దాంతికమును జేరి విడిసె ♦ నా ప్రాంతమునన్.

సీ॥ ఏలాలవంగల ♦ తాలలితంబును, పారిజాతాద్యగ ♦ భాసురంబు
మత్తషట్పదరావ ♦ మంజులతరమును, శతయోజనాయత ♦ సంయుతంబు
కాంచనమణిమయ ♦ ఘనహర్మ్యరమ్యంబు, రమణీయనిష్కుట ♦ రాజితంబు
వైరిభీకరవీర ♦ వారసమేతంబు, రాజనీతిజ్ఞవి ♦ భ్రాజితంబు

తే॥ భూరిభోగీంద్రభూషిత ♦ భోగవతివి, ధంబునన్ దివ్యగంధర్వ ♦ తతిరుచిర "వ
సంతమాలతీ" నగరంబు ♦ సకలనగర, మండనాయమానంబయి ♦ యుండు జనక!

తే॥ దాని గంధర్వవరుఁడు ప ♦ తంగనాముఁ, డుండు నిర్జరేంద్రునివలె ♦ దండిగం డు
లఁ బరిపాలించు నీతిసె ♦ లంగ నతఁడు, మరుని రాకను విని కిన్క ♦ దుర మొనర్ప.

చ॥ తలఁచి కృపాణముద్గరగ ♦ దాపరిఘాదినిశాతహేతుల
నలిగొని దివ్యరథ్యరథ ♦ నాగములున్ దశకోటిభీమవీ
రులుఁ జనుదెంచ మన్మథుని ♦ ప్రోలకుఁ జేరె ననంతరంబునం
దల యదువీరవర్యులుఁ బ ♦ తంగునియోధులు పోరి రయ్యెడన్. ౯౬౭

తే॥ అనిని బాణాంధకారంబు ♦ లతిశయింపఁ
గ నతిరథుఁడు పతంగుండు ♦ ఘనముమాఢ్కి
నార్చుచున్ విల్లు నెక్కిడి ♦ యాహవంబు
సల్పఁ గడఁగెను భూప! యా ♦ సమయమందు. ౯౬౮

చ॥ గదుఁడు బలానుజుండు గదఁ ♦ గైకొని వజ్రి పవిన్ నగంబులన్
సదనదలౌనటుల్ సలుపు ♦ చందమునన్ రిపుసైన్యమంతయున్
జదియఁగఁ గొట్టె నట్టియెడ ♦ సామజముల్ హతమస్తకంబులున్
బదికు లధోముఖోర్ధ్వముఖ ♦ పాటితబాహువు లైరి భూవరా! ౯౬౯

తే॥ హరులనెక్కిన వీరులు ♦ నాలమందుఁ, బడిరి వెనువెంట గంధర్వ ♦ వరపతంగ
సైన్యమం దొక్క రక్తని ♦ ర్ఝరణి పుట్టె, జూపఱందరు వింతతోఁ ♦ జూచుచుండ.

తే॥ ప్రమథులున్ హారమాలకై ♦ వచ్చి శిరము
లను గొనిరి భద్రకాళియు ♦ ఘనమృగేంద్ర

మెక్కి డాకినీసహితయై ♦ యేగుదెంచి
నెత్తుఁ బుఱ్ఱెలతోఁ ద్రాగి ♦ నెఱిగ నాడె. ౯౭౧

ఆ॥ గదునిచేత నొచ్చి ♦ గంధర్వులందఱు, గాలిఁ గొలఁదిఁబాఱఁ ♦ గనిన లక్ష
గజబలాన్వితుఁడును ♦ గంధర్వనాథుండు, నగు పతంగుఁడు గసి ♦ నరుగుదెంచి.

క॥ గదతో రామానుజుఁడగు, గదుహృదయమునందుఁ గొట్టి ♦ గట్టిగ నఱవన్
గదుఁడు గదతోఁ బతంగుని, హృదయమునన్ బాఁదె మైథి ♦ లేశ్వర జనకా! ౯౭౨

వ॥ ఇట్లు వారిరువురును రెండుగడియలపఱకు గదలతో విస్ఫులింగంబులం బఱపుచుఁ బోరిరి. అంత నా రెండుగదలును జూర్ణీకృతంబులయ్యె అయ్యెడ రణదుర్మదుండగు పతంగుండు లక్షభారభరితంబగు నింకొక గదంగొని యా యాదవ యోధపుంగవుని శిరంబున మోఁద నగ్గదుం డొక్క నిముసంబు మూర్ఛిల్లె. ఇట్టి తరుణంబుననే ౯౭౩

ఉ॥ ద్వారకనుండి కోటిరవి ♦ భాసురతేజము యాదవోత్కరం
బౌర! యనంగవచ్చెఁజుమి ♦ యందున వీరుఁడు గౌరవర్ణుఁడున్
సీరియు భక్తవత్సలుఁడు ♦ చిత్రపవిత్రచరిత్రుఁడున్ బలుం
డౌర! యనన్ జనించి సక ♦ లాయుధముల్ ధరియించి మించుచున్. ౯౭౪

తే॥ లాంగలమున గంధర్వులన్ ♦ లాఁగి ముసల
హేతితోఁ గొట్టి రథ్యప ♦ దాతిజాత
ములను మోఁద సంచూర్ణితో ♦ పలములవలెఁ
బడిరి విరథుఁడయ్యెఁ బతంగుఁ ♦ డడలి యతడు. ౯౭౫

ఆ॥ తనపురమున కేగి ♦ తద్దనాలోచించి, తిరిగి యరులతోడఁ ♦ దురమొనర్ప
నిశ్చయించి యోధ ♦ నివహంబు వ్యూహంబు, గా రచించి వచ్చి ♦ కసినిఁదాఁకె.

వ॥ అట్లు తలపడుట బలభద్రుం డాలోకించి కాలరుద్రుండై యాలసింపక గంధర్వమనోహారంబును, శతయోజనవిస్తీర్ణంబునైన వసంతమాలతీనగరంబును హలంబుతోఁ బెకలించి యాకర్షించి తత్రస్థకామధుఘమహానదంబునం ద్రోయ నుద్యుక్తుం డయ్యె. అయ్యెడ నయ్యంబరంబునుజుంబించు హర్మ్యంబులు గూలం దొడంగ హాహాకారంబు లుప్పతిల్లె. అంతం బతంగుండాత్మనగరంబు తిర్యక్కోతంబురీతి నాఘూర్ణితంబగుట వీక్షించి వెంటనే యీతం డా పరాత్పరుండై యుండునని యెంచి హర్షించి స్వర్ణకుంభతుంభకోటివిరాజమానంబులును, గామగంబులును, పతాకాముక్తాహారాద్యభిరామంబులును, దశయోజనవిస్తీర్ణంబులును నగు రెండు లక్షలవిమానంబులును, నాలుగులక్షలగోవులును, దశార్బుదతురంగంబులును, ననేకంబులగు దివ్యఫలంబులను పుష్పహారంబును, కోట్లకొలంది భాజనంబులను, దాంబూలంబులను గైకొని వచ్చి యిచ్చి కృతాంజలియై, ౯౭౬

మ॥ తలఁపన్ మీ తలపై సమస్తజగముల్ ♦ దైవారె నువ్వంతగాఁ
దెలియన్ లేను మహాత్మ! నీ మహిమముల్ ♦ దేవాదిదేవా! మహా
బల! నీలాంబర! కామపాల! యనుకం ♦ పాసాగరా! దేవరా!
బలరామా! సుగుణాభిరామ! ముసలీ! ♦ భక్తప్రియా! ప్రోవరా. ౯౭౯

క॥ శేషా! నిర్జరసన్నుత, వేషా! యార్తార్తిహరణ ♦ విశ్రుతపృథుస
ద్భాషా! నిర్జితదోషా!, దోషములన్ బాపి కరుణ ♦ తో ననుఁ గనవే!

క॥ అని ప్రణమిల్లఁగ బలుఁడున్, గనికరమున నో వత్సంగ ♦ ఘన! జడియకుమా!
యని మన్మథు యదుసేనకు, ఘనుగా నొనరించి ద్వార ♦ కాపురి కరిగెన్. ౯౮౧

✽ ప్రద్యుమ్నుండు శక్రసఖుని జయించుట. ✽

క॥ అవలఁ బ్రద్యుమ్నుండా, తావును విడి సాగి ధీర ♦ తన్ మఘధారా
శైవలినీతటమును సే, నావృతుఁడై చేరె ధక్కా ♦ నాదము లొప్పన్. ౯౮౨

ఆ॥ అచటనుండి మారుఁ ♦ డామేరుగిరి పరి, సరమునందు నున్న ♦ గిరిశసఖుని
కాంచనతిలకాది ♦ కమనీయవనమును, గాంచి మోదమొంది ♦ కదలి యచట.

వ॥ అమరు లతికష్టంబుగాఁ జొరఁదగినవియు, నసురు లెంతమాత్రము ప్రవేశింపరానివియు, వేత్రవతియను గంగతోఁ గూడినవియు, బంగరున వెలుంగునవియు, నగు కొండలోని పల్లపుఁజోటులకుం జనె. మున్నొకానొకప్పు డాదితేయులు దైతేయులకు భీతిపడి స్వర్గంబునుండి పలాయితులై వచ్చి యందు నివాసంబు గావించుచుండిరి. తద్గోత్రప్రదేశంబందలి యొకపురంబున శక్రసఖుండను మహాబలుం డొకఁడు తద్దేవాధిపత్యంబు వహించి దిక్పాలకాధిపత్యంబును గాపాడుచుఁ జెన్నారుచుండు. అట్టిప్రభువరుని చెంతకు రతికాంతుం డుద్ధవునిం బంపె. ఆతనివలన నాదేవరా జావలరాజు రాక విని యుగ్రుండై విగ్రహం బా గదాగ్రజాత్మజాతునితో నొనర్పం దలంచి యుద్ధవున కిట్లనియె. ౯౮౪

ఆ॥ జరయు మృతియు లేని ♦ సురలు నా కనిశంబు, బూజ లిడుదు రన్న ♦ భూజనంబు
బూజ లిడుదురంచు ♦ ముచ్చటింపఁగవలె, నొక్క? యింద్రుఁబోలె ♦ నుందు నిందు.

ఉ॥ శక్రనిభోద్భటుండను న ♦ సాధ్యమదద్విపలక్షవిస్ఫుర
ద్విక్రముఁడన్ మహాత్ముఁడఁ గు ♦ బేరసమానధనాధినాథుఁడన్
శక్రసఖుండ నెవ్వరికి ♦ స్వల్పబలిన్ సయితం బొసంగనే
యక్రమరీతి నిప్పటుల ♦ యాదవనేతకు నిత్తుఁ? జెప్పుమా! ౯౮౬

తే॥ అష్టదిక్పాలకుల నే న ♦ హర్నిశముల, నేలుచుంటిని గాదొకో? ♦ యీాకతమున
నుగ్రసేనుఁడె కప్పంబు ♦ లొప్పగింప, వలయు నాకిప్పు డుద్ధవా! ♦ పలుకుమిట్లు

తే॥ అనవు డుద్ధవుఁ డిట్లు ప ♦ల్కాడఁదొడఁగె, శక్రసఖ! నీవు మరునకు ♦ పక్రమముగ
బలుల నిడనిచోఁ బూర్తిగా ♦ భంగపడెద, వట్టులైనదిట్టుల విను ♦ మాడుచుంటి.

సీ॥ అలకాపురీశుఁడౌ ♦ నైలబిలుండును, హరివర్ష పతిసు ♦ భాంగబలుఁడు
చిత్రచైత్రేశుఁడౌ ♦ శృంగారతిలకుండు, విదితలంకేశవి ♦ భీషణుండు
సంస్ఫోటభీముఁడౌ ♦ సంవత్సరాఖ్యుండు, భీకరాకారగు ♦ నాకరుండు
చంద్రావతీశులౌ ♦ శకునిముఖాసురుల్, ఖ్యాతవీరుండగు ♦ కేతుమాలుఁ
తే॥ డు మొదలైన వారందఱా ♦ సుమపృషత్కు, చేత నోడింపఁబడి రేను ♦ సెప్పినట్లు
విననిచో నీవు జితుఁడవై ♦ వెతల మిగుల, పడెద వందున బలులిచ్చి ♦ బ్రతుకుమయ్య!

క॥ అనవుడు శక్రసఖుం డిటు, లనె భాగవతావతంస! ♦ యటులైన నుపా
యనముల నెప్పుడు నే నిత్తునొ నీవిట నంతదనుకఁ ♦ దొలఁగక నిలుమా!

ఉ॥ అంతట నుద్ధవుం డిటుల ♦ నాడెను శక్రసఖా! త్వదుక్తికిన్
సంతసమయ్యెఁ గాని యొక ♦ సంగతి విన్మిటు రాజనీతివే
దాంతవిదుల్ మహాబలులు ♦ నాఖ్యులునై యిట దూతనౌచు వృ
త్తాంతముఁ దెల్పినట్టి నను ♦ దండిసి నడ్డుట ధర్మమే మొకో? ౯౯౧

క॥ నరవరులకు జ్ఞానంబును, గరముగ నిడు మంత్రులందు ♦ ఘనుఁడను గానన్
గరువముచే నన్నడ్డిన, సిరిబలములు దొలఁగ నీకుఁ ♦ జేటుగలుంగున్. ౯౯౨

ఉ॥ నాఁవుడు కిన్క శక్రసఖ ♦ నాకవిభుం డటు దృష్టి నిల్పి యా
ధీవరు నడ్డగించెను సు ♦ ధీవర! యంతట మంత్రి రామి కిం
ద్రావరజాత్మజాతముఖ ♦ యాదవు లెల్లరు చింతఁ బొంది నా
నావిధులన్ దలంచుచు ది ♦ నంబులఁ గొన్నిఁటిఁ బుచ్చి రింతలోన్. ౯౯౩

తే॥ నాముఖమున శక్రసఖుం డొ ♦ నర్చినట్టి
పనిని విని మరుం డాతని ♦ భంగపరుపఁ
బురుల గెలువఁబోయెడి రుద్రు ♦ బోలె సేనఁ
గలిసి రత్నసానుగుహము ♦ ఖమున కరిగి ౯౯౪

చ॥ ఘనరణదుందుభిధ్వను ల ♦ ఖండముగా మొరయంగ నశ్వని
స్వనములు మిన్నుముట్ట గజ ♦ సంతతిబృంహితముల్ సెలంగఁగాఁ
దనవిలుఁ డంకరించి నిశి ♦ తంబగు హేతులతోడ దొమ్మిగా
ననిఁ బొనరించె సైన్యరజ ♦ మంబరమున్ నెఱిఁగప్పె మైథిలా! ౯౯౫

తే॥ అపుడు హేమాద్రియందున్న ♦ యమరవరులు
జూచి భయపడుచుంట త ♦ త్సురవిభుఁడగు
శక్రసఖుఁడును గని దశా ♦ క్షౌహిణీప
తాకినిం గొని వారితోఁ ♦ దాఁకె వీఁక. ౯౯౬

క॥ వారికి వీరికి నాయెడ, ఘోరతుములయుద్ధమయ్యె ♦ క్షోణీశానా!
ఘోరప్రలయాబ్ధిధ్వని, తిరున రవ మందుఁ దగె ది ♦ ద్దృత్తువు లదలన్. ౯౯౭

చ॥ తదుపరి సీరపాణిచిన ♦ తమ్ముఁడు శస్త్రధరుండు సర్వది
గ్వదితబలుండు సారణుఁడు ♦ వే చనుదెంచి శరాసనంబునున్
గొదకొని యెక్కుపెట్టి శర ♦ కోటుల వేసి యరాతిసేనలన్
సదమదమౌనటుల్ సలిపె ♦ సంతసమొందఁగ యాదవోద్భటుల్. ౯౯౮

తే॥ అపుడు రణభూమి, ప్రమథ ♦ భూతాదియుక్త
మైన యాక్రీడముగ నయ్యెఁ ♦ ద్ర్యంబకునకు
నమరు లట్టి సారణుని వీ ♦ ర్యమును గాంచి
తాళఁజాలక పాఱిరో ♦ ధరణినాథ! ౯౯౯

క॥ పిమ్మట శక్రసఖుఁడు స్వబలమ్ములు పరుగిడుటఁ గాంచి ♦ లఘుగతిఁ జని చా
పమ్మెక్కుపెట్టి జీమూ ♦ తమ్మువలెన్ బొబ్బరించి ♦ ధైర్యముతోడన్.

చ॥ శతవిశిఖంబులన్ బలుని ♦ సాంబుని బాణశతంబుతో నుషా
పతి దశమార్గణంబులను ♦ బార్థుని వింశతితోడ భానునిన్
శతయుగపత్త్రులన్ గదునిఁ ♦ జక్కఁగఁ గొట్టి సహస్రపత్త్రులన్
ధృతియుతు సారణున్ బొడిచె ♦ దీనత మాన స్వకీయసైన్యముల్. ౧౦౦౧

తే॥ తత్ప్రహారములను ♦ దద్వీరులెల్లరు, యరదములను గూడి ♦ గిరగిరగిర
కుంభకారుసారె ♦ గొదకొని తిరిగెడి, ధరణిఁ దిరిగి రొక్క ♦ గంటసేపు. ౧౦౦౨

క॥ మఱియును దురగము లీల్గెను, నరదములున్ జూర్ణమయ్యె. ♦ యాదవభటులున్
వెఱచిరి సూతులు గడఁబట్టిరి సాంబుం డపుడు గాంచి ♦ డిగ్గనఁ బగ్గెన్. ౧౦౦౩

చ॥ ఇతరరథంబు నెక్కి విలు ♦ నెక్కిడుచున్ దశమార్గణంబులన్
గ్రతుభుగధీశుచాపమును ♦ ఖండ మొనర్చి తురంగపంక్తినిన్
శతవిశిఖంబులన్ నఱికి ♦ సాదిని మోఁది శరద్వయంబుతో
శతదశకాశుగంబులను ♦ స్యందనము న్నుసిఁజేసె వాసిగన్. ౧౦౦౪

ఉ॥ అప్పుడు తత్సురేశుఁడు హ ♦ తాశ్వరథుండును ఛిన్నచాపుఁడై
దెప్పున మత్తనాగమును ♦ ధీరత నెక్కి ధరించి శూలమున్
గొప్పగఁ బోరు సాంబుహృదిఁ ♦ గొట్టెను దద్ధతిచేత నాతఁడున్
నెప్పరియయ్యెఁ గొల్దివెత ♦ నప్పకొనన్ బహులాశ్వ! పిమ్మటన్. ౧౦౦౫

తే॥ యోజనంబంతపదము గ ♦ వ్యాతియంత
పలు చతుర్యోజనములంత ♦ ప్రాంశు వంశ
నాద్రిరుచియు నాల్గామడ ♦ లంత మూఁడు
తొండములు గల్గు తత్కరి ♦ దండి వచ్చి. ౧౦౦౬

చ॥ వెఱపునుగొల్పు శీత్కృతుల ♦ వేమఱు సల్పి యనల్పయాదవో
త్కరమును ద్రొక్కి యెక్కువగఁ ♦ గాడ్పడఁజేసి ధ్వజాశ్వహస్తినూ

తరథములన్ విశేషముగఁ ♦ దల్లయదండధరోపమానమై
సరభసరీతి నిట్టులు ♦ సంగరరంగమునం జరించుటన్. ౧౦౦౭

చ॥ గదుఁడను యాదవోద్భటుఁడు ♦ గర్గొని స్వీయము వజ్రకల్పమౌ
గదఁగొని దాని కుంభమున ♦ గాఢముగాఁ బ్రహరించె దాన నా
మదకరి భిన్నకుంభమయి ♦ క్ష్మాతలమందున ఛిన్నపక్షమై
యదవదఁ గూలు కొండవలె ♦ నార్చుచు వ్రాలె విచిత్రరీతిగన్. ౧౦౦౮

ఉ॥ ఆవల కిన్క శక్రసఖుఁ ♦ డాత్మగదం గొనివచ్చునంతలో
నా విజయాభిలాషి గదుఁ ♦ డట్టి గదన్ దదురంబునందునన్
జేవను గొట్టె దాన సుర ♦ శేఖరుఁ డాత్మ మదద్విపంబుపై
నోపుచు సొమ్మసిల్లెను వి ♦ నోదముగాఁ గన యాదవోత్తముల్. ౧౦౦౯

చ॥ తిరిగి యతండు లేచి గద ♦ దివ్యభుజంబులఁ గొంచుఁ గ్రుద్ధుఁడై
త్వర గదుఁ గొట్టె నీరహిని ♦ వారలు, మల్లులు రంగమందునన్
బోరిఁబోరిఁ బోరుతీరున న ♦ మోఘముగా నటవిన్ వనేభముల్
గరువముతోడ దాఁకి నటు ♦ గాఢగదారణ మాడి రంతటన్. ౧౦౧౦

చ॥ గదుఁడు బలానుజుం డతనిఁ ♦ గైకొని బాహుబలంబుతోడఁ ద
ద్విదితపురంబునందుఁ బడ ♦ వేయ యశఃపటహస్వనంబులా
చదలును ముట్టెఁ జూపఱును ♦ సంస్తుతిఁ జేసిరి సంతసంబునన్
యదుభవు లొంది రప్సరలు ♦ నాడిరి పాడిరి కిన్నరాదులున్. ౧౦౧౧

తే॥ అట్లు స్వపురంబునందు బ♦లానుజుఁడగు, గదునిచేఁగూలి మూర్ఛిల్లి ♦ క్రమ్మఱ భువి
నుండి లేచిన శక్రస♦ఖుండు నొచ్చి, యా మరుండు పరబ్రహ్మ♦యం చెఱింగి.

వ॥ ఐరావతకులోద్భవంబులును ద్రశుండాదండమండితంబులును చతుర్దంతకాంతంబులును ధవళవర్ణవర్ణితంబులు నగు మత్తేభసహస్రంబులను యోజనద్వయాకారచారుతరంబులును మేరుధరాధరప్రభవంబులును దిక్కుంభినిభంబులు నగు ద్విరదకోటులను దివ్యతురగకోటులను హైమంబులగు శతార్బుదాద్భుతరథంబులను యోజనద్వయవిస్తృతంబులగు విమానాయుతంబులను గామధేనునియుతంబును బట్టుసరిగలు గలిసిన దారంబులతోఁ గూర్చిన మంచిముత్తియంబుల తోరణంబులచే వెలుంగు చందువాలతో నొప్పునవియు మల్లికామకరందార్ద్రంబులును శిరీషకుసుమపేశలంబులు సోపబర్హణంబులును పయఃఫేననిభంబులు నగు దివ్యతల్పంబులను చిత్రవిచిత్రముక్తావితానయవనికాళిబికాచ్ఛత్రచామరవ్యజనభూషణామృతద్రోణసహస్రంబులను సహస్రదళపద్మంబులను బద్మరాగార్బుదభారంబులను హారహీరశ్యమంతకాదిమణికోటిభారంబులును కోటిభారహాటకంబులును సుధర్మ యనుసభను నవనిధులను మఱియు నానావిధంబులగు ఫలంబులను గైకొని నిరుద్ధం

దును బుద్ధిసత్తముండునగు నుద్ధవుం డొక్కాని తద్ధరిపుత్రుని సన్నిధి కేతెంచి నమస్కరించి యవి సమర్పించి నా రాజ్యంబునుగూడఁ బరిగ్రహింపుమని వచించుచుఁ గృతాంజలియై రక్షింపుమని ప్రార్థింప నా దర్పకుం డానందంబుఁ బొంది సజ్జనస్వభావం బిట్టిదని తెలుపుటకో యనం బ్రసన్నుండై శక్రసఖా! నీ రాజ్యంబు నీవే యథేచ్ఛగాఁ బాలించుకొనుమని యభయోక్తు లాడి రత్నమాల నొండొసంగి సైన్యసహితంబుగా నతని వీడ్కొని సర్వవిధనుత్యంబులును వరుణోదానదీతట భాసురంబులు నగు నిజశిబిరంబులలోఁ బ్రవేశించె. తత్సమయంబునం దంబరంబు నుండి చమూసమేతంబుగా దుందుభులు మ్రోఁగుచుండ దిగి తమకడకు వచ్చు దేవేంద్రుని యాదవవీరు లాలోకించి యమిత్రుండేమో యని యూహించి శస్త్రంబుల ధరించి యుద్ధసన్నద్ధులై క్రమక్రమంబుగా సమీపించిన యతనిని సురనాథునిగాఁ దెలిసికొని యానందించిరి. అంత ౧౦౧౩

ప్రద్యుమ్నుండు సుందరీ స్వయంవరంబున కేగుట.

ఉ॥ మారుఁడు కొల్వులోపల స ♦ మంజసభక్తి వసింపఁగా సునా
సీరుఁడు వచ్చి యిట్లనియె ♦ శ్రీమకరధ్వజ! సర్వవేత్త వా
కారివి గాదె యైన నొక ♦ కార్యముఁ జెప్పెద నాలకించి నీ
వేరహితైన సల్పి సుఖ ♦ యింపుమ! తెంపు వసింపనట్టులన్. ౧౦౧౪

తే॥ ఇచటనుండిన హేమాద్రి ♦ నెసఁగు సాను
వులను "లీలావతీపురి" ♦ గలదు దాని
బలుఁడు విద్యాధరావళి ♦ ప్రభువరుఁడగు
"సుకృతి" పాలించుచుండును ♦ సుఖము లిడుచు. ౧౦౧౫

క॥ అతనికి సుందరి యను నొక, శతరాకాచంద్రవదన ♦ జనియించెను ద
త్సుతకు స్వయంవరమహ మా,పతి ప్రకటనఁ జేసె జగతిఁ ♦ బ్రస్తుతమందున్.

చ॥ అది సెవులార వించు హృద ♦ యంగమవిగ్రహులైన దిక్పతుల్
త్రిదశులు వేడ్కతో నల పు ♦ రీతిలకంబున కేగుదెంచి రా
సుదతియు యేరివక్త్రమును ♦ జూచినమాత్రన మూర్ఛవచ్చు నా
సదృశవిహీనసుందరుఁడ ♦ చక్కవిభుండగు నాకటం చనున్. ౧౦౧౬

క॥ కావున నీవారలతో, నీవును నాతోడరమ్ము ♦ నీరజనేత్రా!
దేవజనంబుల నచ్చట, కవినిఁ దిలకింపఁగలవు ♦ డిగ్గన రమ్మా! ౧౦౧౭

తే॥ అంతఁ బ్రద్యుమ్నుఁడున్ యాద♦వానుజులను, గూడి నిర్జరనాయకు♦తోడఁ గదలి
యల్లలీలావతీపురి♦కరిగి యట్టి, పట్టణంబందుఁ గల వింత ♦ వరుసఁ జూచి.

సీ॥ విస్తారచత్వర ♦ విభ్రాజితంబును, మౌక్తికతోరణ ♦ మండితంబు
స్వర్ణసింహాసన ♦ చయసమేతంబును, దివ్యరత్నోత్కర ♦ దీపితంబు

చందనాగరుఘన ♦ సారవాసితమును, జందనమృగనాభి ♦ చర్చితంబు
సురమరుద్వసురుద్ర ♦ సూర్యగణాన్వితం, బప్సహారిన్నాయ ♦ కావృతంబు
తే॥ మునివరవ్రజనాథాది ♦ భూషితంబు, నగు స్వయంవరస్థలమున ♦ కరుగుదెంచి
యచలశృంగంబునందు సిం ♦ హంబు గూరు,చుండినటు గద్దెపైఁ గూరు ♦ చుండెఁ బిదప
క॥ ఆ విబుధాదులు వచ్చిన, శ్రీవిభుసుతుఁ బంచశరు సు ♦ శీలునిఁ గనుచున్
భావములందుండిన తమ, వైవాహికవాంఛ విడిచి ♦ వఱలుచునుండన్. ౧౦౨౧
మ॥ రతినిన్ రంభను మించు సౌష్ఠవముతో ♦ రాజిల్లు చా సుందరీ
సతి, యింద్రాణియొ వాణియో కమలయో ♦ ఘ్నాదేవియో నాఁగ మేల్
రతనంబుల్ దగినట్టి దండఁగొని యా ♦ రాజన్యదేవాదిసం
వృతగోష్ఠిస్థలి కేగుదెంచెఁ దమితో ♦ విశ్వంభరాధూర్వహా! ౧౦౨౨
తే॥ అట్లు సుందరి సభఁ జేరి ♦ యంబుదంబు, వెదకు చేగడి చంచల ♦ విధిని నచటి
జనుల మోహింపఁ జేయుచు ♦ సదృశపతిని, గ్రమముగా నెమకుచుఁ బోయి ♦ కట్టకడకు.
చ॥ సరసిజపత్రనేత్రు సుమ ♦ సాయకు మీనపతాకునిన్ సుధీ
వరుని దుకూలధారిని న ♦ పారబలున్ భువనైకమోహనున్
స్మరుఁ గని మూర్ఛతోడఁ బడి ♦ సంజ్ఞను గ్రమ్మఱఁబొంది తత్సుకం
ధరమున రత్నమాలిక స ♦ దస్యులు జూడఁగ వైచె వేడ్కతోన్. ౧౦౨౪
క॥ సుకృతియు నది గని తానును, సుకృతి నయితి నంచుఁ దలఁచి ♦ శ్రుతిహితవిధిగా
స్వకసతిఁ గూడుచు నల మరు,నకు నిజసుత నిచ్చె దివ్య ♦ నాదము లొప్పన్.
ఆ॥ ఆమహోత్సవంబు ♦ నమరు లాలోకించి, యోర్వలేకయతని ♦ నురుఘనములు
ఖరకరుఁడగు సూర్యుఁ ♦ గప్పినచొప్పునఁ, జుట్టుముట్టి రెట్టి ♦ నట్టులేక. ౧౦౨౬
చ॥ జనక! యనంతరంబున రఘు ♦ షధ్వజుఁ డాయమరాదు లట్లు కి
న్కను దను జుట్టుముట్టుటను ♦ గన్గొని కృష్ణదచాప మెక్కుపె
ట్టి నిశితకాండకాండముల ♦ డీకొని కొట్టఁగ వారలున్ వికృ
త్తనరుచి మించు లేగడి వి ♦ ధంబునఁ బాఱిరి భీతభీతులై. ౧౦౨౭
తే॥ ఇట్లిలావృతఖండంబు ♦ గృష్ణసుతుఁడు, గెల్చి స్వబలంబుతోఁ ♦ గూడి సుంద
రీసహితుఁడయి యనుజులు ♦ ప్రీతి వెంట,నంట భరతఖండంబున ♦ కరుగుదెంచి.

ప్రద్యుమ్నుండు దిగ్విజయంబొనర్చి ద్వారకాపురి కరుదెంచుట.

వ॥ బిల్వకదంబన్యగ్రోధకంకోలతక్కోలతాలతూలతమాలహింతాల సురసాల రసాలసాలాగరుతగరువకుళవంజుళచందనహరిచందన రక్తచందననారంగమాతులుంగ లవంగ లుంగ ప్రియంగు పిచుమంద మందార ఖదిరఖర్జూరనాగపున్నాగజంబూజంబీర దేవదారు హార సింగారసిందువారకోవిదారపిప్పలశ్రీఫలసీతాఫలరామఫలపలాశప్లక్ష వంశప్రియావంశగుల్మవంశమదన బాణకర్ణికారసహస్రకందుకాగస్తిసుదర్శనచంద్రక

కపిత్థాశోకామ్రామ్రాతకభల్లాతకకర్ణపుష్పశుకపుష్పదాడిమానుజీరాడుకీపూగీగోస్తనీబదామతూలైలాజాదనమోదినీనేవతీ మాలతీమాధవీయూథికామల్లికాగిరిమల్లికామతల్లికాది దివ్యవృక్షవిభ్రాజమానంబును, వైకుంఠసమాగతశుకపికశారికాపారావృత మయూర మరాళ ఖంజన చటక చక్రవాక బకబలాకకోయష్టికముఖవిహగకృష్ణకృష్ణేతికలధ్వనిమంజులంబును, ఖాతాఖాతవాపీకూపనిపానవిరాజితంబును, కహ్లారకైరవేందీవరమేచకారుణపీతశ్వేతకమలకుశేశయవిస్ఫురత్కాసార సరోవరభాసురంబును, తామ్రరజతమహారజతవినిర్మితదుర్గత్రయవిద్యోతితంబును, దేవతరుమయరైవతాచలరాజితంబును, నానాస్త్రదేశాంతరఖ్యాతంబును, పరిఖాభూతరత్నాకరగోమతీనదీపరివృతంబును, శూరవారచారుతరంబును, ధర్మనిర్మితహర్మ్యరమ్యంబును, సువర్ణాపణధ్వజపతాకాదివిభూషితవైకుంఠశితికంఠపుణ్యమందిరసుందరంబును, విమానకోటివిభాసురంబును, శతశృంగాటకసంపన్నంబును, ననేకరథ్యాభిరామంబును, విశాలశాలాగోవాజిదంతిశాలాసంతతికాంతంబును, రాష్యమార్గరాజితంబును, నవలక్షషోడశసహస్రాష్టోత్తరశతశ్రీకృష్ణోన్నతప్రాసాదప్రకాశమానంబును, శ్రీమన్నారాయణనామపారాయణపరాయణయాదవవీరభటజనసంకీర్ణంబును, పాపనివారకంబును, పుణ్యాకరంబును, సర్వమంగళకరంబును నగు ద్వారకాపురంబును జయజయనినదంబులతో ఢక్కాదివాద్యంబులు వ్యాపింపఁజేసి తత్పురబాహ్యంబునందు నిలిచె. ౧౦౨౯

ఆ॥ తత్పురంబునందు • దర్పకప్రేషితుం,డయిన యుద్ధవుండు • యాదవసభ
నున్నయుగ్రసేను • వెన్నునిఁ బ్రొక్కుచు, సక్రమముగఁ జెప్పె • జయకథలను.

క॥ అల యుగ్రసేనవిభుఁడా,వల శ్రీబలరామకృష్ణ • బాంధవజనవృ
ద్ధులతోడఁ దగి యువ్విరి,విలుతునిఁ దోడ్కొనుచుఁ జేర • వేడుకపడుచున్.

సీ॥ శంఖభేర్యానక • ఝర్ఝరమర్దల, డిండిమడమరువుల్ • మెండుమ్రోయ
నఘహారములు బ్రాహ్మ • ణాననోద్గతములౌ, నామ్నాయరావంబు • లతిశయింప
శ్రవణపేయములు నిర్జరవారకామిను, లింపుగాఁ బాడు గీ • తంబులొప్ప
నుండనమండిత • మత్తేభరత్నంబు, సర్వాగ్రమందున • జానుమీఱ

తే॥ పువ్వులాజముక్తావర్ష • ములను గురియ, చందనాదివస్తూల్లస • త్స్వర్ణకలశ
ములను గైకొని వెడలి యా • యుంగువిలుతు,ముంగలకు నేగుదెంచె నో • భూవరేణ్య!

క॥ అంతటఁ గంతుడు ఖడ్గము, సంతోషముతో ధరించి • స్వబలయుతుండై
వంతుగ భక్తిన్ యాదవ,కాంతుని హరి హలిని బుధుల • గర్గుని మ్రొక్కెన్.

చ॥ పదపడి యుగ్రసేనుఁ డల • బాహుబలాఢ్యుఁడు దిగ్విజేతయౌ
మదను నుతించి పూజ నిగ • మంబులు పల్కినయట్లు సల్పి త

న్మదకరి నెక్కఁజేసి యల ♦ ద్వారకలోనికి వచ్చి వేడ్కలన్
ముదమున సల్పె నెండి యది ♦ భూవర! వింటివా? చెప్పు మియ్యెడన్. ౧౦౩౮

ఉగ్రసేనుండు రాజసూయం బొనర్చుట.

క॥ అనవుడు జనకుం డిట్టుల, ననియెను సురయోగివర్య! ♦ యా నృపసూయం
బును నుగ్రసేనుఁ డెట్టులఁ, బొనరిచెనో? యద్ది నాకుఁ ♦ బూర్తిగఁ జెపుమా!

తే॥ అంత నారదుఁ డిట్లనె ♦ నవనినాథ,! గర్గముఖగురుల్ మంచి ల♦గ్నంబుఁ జూచి
హరిసహాయ మూఁతఁగఁగొని ♦ నట్టి యుగ్ర, సేనునకుఁ దెల్ప నాయదు ♦ శేఖరుండు.

ఆ॥ తగినవారిఁ బిలిచి ♦ ధారుణి నంతటఁ, బిలిచి రం డటంచు ♦ విమలభక్తిఁ
జెప్పి పంప వారు ♦ శీఘ్రముగాఁ బోయి, బంధుసఖులఁ బిల్చి ♦ వచ్చి రవల. ౧౦౩౯

సీ॥ వ్యాసపరాశర ♦ పైలసుమంతదు, ర్వాసోహరితధౌమ్య ♦ భార్గవులును
నత్రిదత్తాత్రేయ ♦ మైత్రేయ జైమిని, కపిలభరద్వాజ ♦ గౌతములును
బ్రాడ్వివాకాసిత ♦ వామదేవవసిష్ఠ, శాండిల్యజీవపి ♦ భాండశుకులు
గాధేయమాండవ్య ♦ కణ్వవైశంపాయ, నాగస్త్యబోధాయ ♦ నాంగిరులును

తే॥ సనకముఖకృపద్రోణాది ♦ సకలమాను, లుగ్రసేనుఁ డొనర్చు క్ర♦తూత్తమమగు
రాజసూయంబునకు శిష్య ♦ రాజిరాజి, తులయి వచ్చిరి ముదమున ♦ లలితచరిత!

సీ॥ అష్టదిక్పాలకు ♦ లజుఁ డష్టమూర్తియు, బ్రద్యోతనాది న♦వగ్రహములు
వసురుద్రగణములు ♦ ద్వాదశాదిత్యులు, సకలవానరసహి ♦ తాంజనేయుఁ
డప్సరోయక్షవి ♦ ద్యాధరగంధర్వ, కిన్నరచారణ ♦ కింపురుషులు
బ్రహ్లాదభక్తుండు ♦ బలిచక్రవర్తియు, నందాదిగోపక ♦ నాయకులును

తే॥ వాసుకియుఁ గౌరవులు బంచ ♦ పాండవులును, దైత్యదానవభూతభే ♦ తాళపతులు
పుత్రపౌత్రసుమిత్రక ♦ ళత్రభృత్య, సహితులై చనుదెంచి రా ♦ సవనమునకు.

వ॥ మఱియు నశ్వినీకుమారులును లంకాధిపుండగు విభీషణుండును సమస్తభల్లూకయుతంబుగా జాంబవంతుండును నిఖిలవిహగసమేతంబుగా గరుత్మంతుండును గోరూపంబును ధరించి కామధేనుసహితంబుగా భూదేవియు యశోదాదిగోపికాదేవులును గోపికాశతయూథంబులను దమఘోషవృద్ధశర్మజయసేనధృతకేతుభీష్మకనాగ్నజిద్బృహత్సేనమైథిలేశకోసలేశ్వరులును దదితరరాజులును జాతుర్వర్ణ్యజనంబులును నచలనిచయంబులతోఁ గూడ హేమాచలహిమాచలంబులును లతాగుల్మతరుసమేతంబుగా నక్షయవటవృక్షంబును దరంగిణీకులంబుతోఁ గూడ గంగాయమునానదులును రత్నోపాయనపాణులై సప్తసముద్రులును సప్తస్వరంబులును గ్రామత్రయంబును నవారణ్యంబులును నవోషరంబులును జతుర్దశగుహ్యంబులును దీర్ఘరాజంబగు ప్రయాగక్షేత్రంబును బదరికాశ్రమంబును దండకాదిమహారణ్యంబు

లును గోవర్ధనగిరీంద్రంబును బృందావనంబును స్వజనపరివారసమేతంబుగా
యేతెంచె. అంత ౧౦౮౦

తే॥ కోటిచేటీవిభాసుర • కుందరదన, దివ్యభూషణభూషిత • భవ్యరూప
యైన శ్రీరాధికాదేవి • యందలంబు, నందుఁ గూర్చుండి యేతెంచె • నటకు మఱియు.

తే॥ అష్టభూతులఁ దగు పర • మాత్మబోలెఁ
బుత్రపౌత్రులతోఁ బరి • పూర్ణతముఁడు
యజ్ఞమూర్తియుఁ బుండరీ • కాక్షుఁడు నగు
కృష్ణుఁ డొప్పెడి నందు రో • చిష్ణుఁ డగుచు. ౧౦౮౧

తే॥ ఉగ్రసేనుఁడు రాజసూ • యోత్తమంబుఁ, గడలికిన్ రైవతాద్రికి • నడుమఁ జెలఁగు
నట్టి పిండారకక్షేత్ర • మందుఁ జేయ, గర్గవాక్యానుసారంబు • గాఁ గడంగి.

వ॥ పంచయోజనవిస్తీర్ణంబుగా యజ్ఞకుండంబును రెండేసికోసుల నైదు గుండంబులును యోజనంబున బ్రహ్మకుండంబును మేఖలాగర్తవిశాలంబులుగా వేదికలను వేసి వెయ్యిమూరల యూపస్తంభంబును నిల్పి రంభాస్తంభతోరణాది చారుతరంబగునట్లు యాగమండపంబును సువర్ణమయంబుగా నైదామడలు నిర్మించి యదువృష్ణ్యంధకమధుశూరసేనదశార్హకులతో దేవతలతో నొప్పు శతమన్యువు మాడ్కి వెలుంగుచు గర్గమహర్షి నాచార్యునిగాఁ జేసికొని దశలక్షహోతల తోడను దశలక్షదీక్షితులతోడను బంచలక్షాధ్వర్యులతోడను బంచలక్షోద్గాతల తోడను గూడి యా రాజసూయం బామ్నాయోక్తంబుగా నాచరించె. అందు

తే॥ హస్తిరత్నశుండాసమా • నాజ్యధార, వ్రేల్చుటన్ వీతిహోత్రుండు • పెదయజీర్తిఁ
గాంచె ముజ్జగంబులను నా • కలినిఁగొన్న, జీవమేదియు లేదు వి • చిత్రముగద.

ఆ॥ అవల నుగ్రసేనుఁ • డారాజసూయాంత, మందు నవభృథంబు • వ్యాసగర్గ
ముఖమునులనుగూడి • పోయి పిండారక, తీర్థమందు సలిపె • దివ్యవిధుల.

తే॥ అపుడు దక్షిణాసతితోడ • నతిశయించు, యజ్ఞవలె రుచిమతియగు శు • భాంగితోడ
వెలుఁగు నుగ్రసేనునిపైని • విబుధవరులు, విరులఁగురిసిరి దుందుభుల్ • నెఱిగ మొరసె.

తే॥ అంత యదుపతి తురగశ • తార్బుదముల, క్షౌమనవరత్నకోటుల • స్వర్ణహార
లలితములగు చతుర్దశ • లక్షకరుల, గర్గముని కిచ్చి గృహపరి • కరయుతముగ.

తే॥ వెయ్యి మత్తేభములఁ బది • వేలహరుల, బంగరురువది బారువుల్ • పరమభక్తి
తోఁ బ్రతిబ్రాహ్మణున కిడి • స్తుతియొనర్చి, వందనంబులఁ జేసె నో • పార్థివేంద్ర !

వ॥ అంతఁ దద్ధరామరులు సంతృప్తులై కనకమయంబులగు నుచ్ఛిష్టపాత్రంబులను మరుత్తునియజ్ఞమునందువలెనే విడిచి స్వస్థానంబులకుం బోయిరి. దేవతలు సక్రమంబుగా హవిర్భాగంబులం బొంది తనివిం జెంది స్వర్గంబున కేగిరి. యక్షరక్షోవిద్యాధరాప్సరో గంధర్వ కిన్నర కింపురుష వానరభల్లూకనాగగోశైలవృక్ష తీర్థ

క్షేత్రారామవనాదులును, వసురుద్రాదులును, బహూకృతులై తృప్తితో స్వగృహంబుల కరిగిరి. నందాదిగోపకులు శ్రీకృష్ణునిచేతను బూజితులై నిజమందిరంబుల కేతెంచిరి. మఱియు నా యాగంబున కెవరెవరాహూతులైరో యా విబుధబుధధరాధపధనితస్త్రీపురుషులందఱు సత్కారంబులం బొంది యాత్మధామంబులకుం జనుదెంచిరి. శ్రీకృష్ణాశ్రితు లెట్టి గొప్పకార్యంబైన నిట్టులే సాధించుకొందురు గాదే! యీ రాజసూయవృత్తాంతంబు వినినను జదివినను సర్వాఘంబులు దూరీకృతంబులుగా సర్వార్థంబులు సఫలంబులుగా సాయుజ్యంబుఁ జెందఁగలరని వక్కాణింప నా బహులాశ్వుండు నారదమహర్షి కిట్లనియె. ౧౦౫౦

చ॥ యదుపతిరాజసూయసుస ♦ హాయ! విహాయసవాహ! వాహినీ
పద! పదచాతురీరుచిర! ♦ వాగ్మివరా! వరదా! వరద్విషే
ట్పద! సదయాంతరంగజల ♦ జా! జలజేక్షణ! శ్రీక్షితిప్రమో
హద! పురుషార్థవర్గద! గ ♦ దాగ్రజ! యుగ్రజవంశరక్షకా! ౧౦౫౧

భుజంగప్రయాతము. చతుర్వ్యూహజన్మా! ప్ర ♦ జారక్షణాస్థా!
చతుర్దివ్యబాహూ! య ♦ సశ్లోకనాథా!
చతుర్వేదబోధ్యా! ప్ర ♦ చండాంశురూపా!
చతుర్వక్త్రవంద్యా! భు ♦ జంగేంద్రశాయీ! ౧౦౫౨

గద్యము:- ఇది శ్రీమత్పరమపవిత్రాపస్తంబసూత్ర, భారద్వాజసగోత్ర, చివుకుల
కులజలధికళానిధి, కోటమాంబాకామయ తనయ, లక్ష్మీదేవీ
సుబ్రహ్మణ్య దత్తపుత్ర, శ్రీకృష్ణప్రసాదాసాదిత కవిత్వ
నిశ్చయ, సుజనవిధేయ, శ్రీనివాసాపరనామధే
యాప్పయశాస్త్రిచే నాంధ్రీకృతంబైన
శ్రీగర్గభాగవతం బందలి
విశ్వజిత్ఖండము
సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ
హరిః ఓం తత్సత్
శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః.

శ్రీ గర్గ భాగవతము.

బలభద్ర ఖండము.

కరధృతగోవర్ధనగిరి !
పరిహృతగోపీనికూల ! ♦ భర్మవికారాం
బర ! గోలోకేశ్వర ! ని
ర్జరనాయకపోషణాఢ్య ! ♦ రాధాకృష్ణా ! ౧

వ॥ నారదా ! సుధాఖండంబును మించి చవులు గలిగించెడి విశ్వజిత్ఖండంబు వీనులార వింటి. శ్రీకృష్ణనందనాదినామరూపప్రతిభాప్రభావాదివిశేషంబులు దెలిసె. ఆహారికి షోడశసహస్రగోపికలయందును భార్యలయందును జనియించిన తనయులును, మనుమలును, మునిమనుమలును గోటానగోటులుగానుండిరిగాదే. కవివరుండు భూమియందలి రేణువుల లెక్కింప బయలుదేరునేమోకాని తద్ధరికులంబును గణింపరానేరఁడు. కాని మహాత్ముండగు బలరామునకు రేవతీసతియందుఁ బుత్రోదయం బేకతంబునఁ గాలేదో సవిస్తరంబుగాఁ బలుకుమని ప్రార్థింప నా దేవముని భూవరున కిట్లనియె. ౨

ప్రాడ్విపాకముని బలరామావతారముంగూర్చి దుర్యోధనునకుం జెప్పుట.

తే॥ చక్కఁగాఁ బల్కియుంటివి ♦ జనక ! వినుము
మున్ను ప్రాడ్విపాకుఁడను ♦ మునివరుండు
హస్తినాపురనాయకుఁ ♦ డాత్మశిష్యుఁ
డగు సుయోధను చెంతకు ♦ నరుగుదెంచె. ౩

చ॥ అపుడు సుయోధనుండు తన ♦ యంతికమొందెడి నొజ్జఁగాంచి లే
చి పరమభక్తి నర్చలను ♦ జేసి ఘనాసన మిచ్చి జోతముల్

నెపములఁ బాపుమో వరము ♦ నీ! యని సల్పి మతిస్థశంక యి
ట్టిపగిదిఁ బృచ్ఛఁజేసెను గ ♦ డిందిగ మైథిలలోకనాయకా! ౪

చ॥ మునుపెవఁ డిట్టి హాస్తిపురిఁ ♦ బూనికతోఁ దలక్రిం దొనర్చె? నే
ఘనబలశాలి నాకును న ♦ ఖండగదాగురు వయ్యెనో యెవం
డనుపమసుందరుండొ యెవఁ ♦ డచ్యుతసోదరుఁ డట్టి రాముఁ డెం
దున ధరఁబుట్టె నెవ్వరు ను ♦ తుల్ బొనరించి రటుల్ జనింపఁగాన్. ౫

తే॥ అంత ప్రాడ్వివాకుం డిట్టు ♦ లాడెను యువరాజ! నీప్రశ్న పాపహా ♦ రంబుగాదె
కాన సక్రమముగఁ జెప్పు ♦ నానుడులను, వినుచునుండుమ! నిశ్చల ♦ విమలబుద్ధి.

ఆ॥ అయ్య! యిట్టి ద్వాప ♦ రాంతమందున ధాత్రి, యసురదుష్టపార్థి ♦ వాళిభార
మును వహింపలేక ♦ పూని గోరూపంబు, బ్రహ్మకడకుఁబోయి ♦ పల్కె స్వగతి.

క॥ అంతట వాణీకాంతుఁడు, చింతింపకుమంచు ధరకుఁ ♦ జెప్పి యపర్ణా
కాంతేంద్రాది దివౌకస్సంతతితోఁ గూడి విష్ణు ♦ సన్నిధి కేగెన్. ౮

వ॥ అట్లు సర్వసుపర్వసహితుండగు పితామహుం డరిగి యా విష్ణుమూర్తికిఁ దన రాకఁ జెప్పి యతనిం బురస్కరించుకొని శ్రీవామనవామపాదాంగుష్ఠనఖనిర్భిన్నోర్ధ్వాండకటాహవివరమార్గంబున నడచి వెలుపలకు వచ్చి మహాద్భుతంబగు బ్రహ్మద్రవంబందుఁ బొల్పారు ననేకలోకంబులం గాంచుచు విరజానదీతీరంబును జేరి దాని కనతిదూరంబున నసంఖ్యకోటిమార్తాండసదృశంబగు తేజఃపుంజంబును గాంచి నుతించి నమస్కరించి గుణలక్షణలక్షితుండును సహస్రవదనుండును సంకర్షణుండును నగు ననంతుని విలోకించి తదుత్సంగంబున బృందావనకాళిందీగోవర్ధనగోపికాగోపకగోకులలతాతరుకుంజనికుంజసంకులంబును సర్వభువననమస్కృతంబును నగు గోలోకంబు నాలోకించి తద్బహిర్ద్వారరక్షకాజ్ఞఁ గైకొని లోనికిం బోయి యనేకబ్రహ్మాండవిభుండును గౌస్తుభాదిదివ్యమణిభూషణభూషితుండును రాధానాథుండును బీతాంబరవనమాలావంశిధరుండును నగు శ్రీకృష్ణుని ముఖారవిందంబును జూచి వందనంబు లొనరించి భూభారవృత్తాంతం బంతయు విన్నవించుకొన నా పరాత్పరుం డాలించి స్వకీయులగు దేవజనులను యథోచితంబుగా నాజ్ఞాపించి యా యనంతునిం బిల్చి యిట్లనియె. ౯

తే॥ నీవు సంకర్షణా! ముందు ♦ దేవకి యనఁ
దనరు వసుదేవు సాధ్వి యు ♦ దరమునందు
నమరి రోహిణీగర్భము ♦ ఖమున ధరను
బుట్టు, దేవకియం దేను ♦ పుట్టఁగలను. ౧౦

క॥ ఆ రహిఁ జెప్ప ననంతుఁ డు, దారమతిన్ సరియటంచుఁ ♦ దన సభలో నొ
ప్పారుచు నుండగఁ గిన్నర, చారణ గంధర్వముఖులు ♦ సల్పిరి నతులన్. ౧౧

క॥ అంత "సుగతి" యను సారధి, వింతగొలుపు తాళపాళి ♦ వెలిఁగెడి రథమా
చెంతకుఁ దోడ్కొనివచ్చె న,నంతుం డదిగని వెయివద ♦ నంబులతోడన్. ౧౨

మ॥ పరసేనాంతసమర్థమౌ ముసలమున్ ♦ బర్హిర్ముఖారాతిసం
హరణప్రౌఢహలంబు బ్రహ్మమయనా ♦ మాంచత్సునర్మంబు సం
బరముల్ బొందుచుఁ గాంచె నప్పుడు రమా ♦ వైకుంఠమందుండి చా
మరముల్ సిద్ధులు వీవ శేషుఁ డరిగెన్ ♦ మార్తాండసామ్యద్యుతిన్. ౧౩

తే॥ అటుల నాతఁడు దివ్యసహస్రవక్త్ర
ముల నుతించి పాణిని పతం ♦ జలిముఖులగు
మునులు వినుతింప నాయనం ♦ తుని లయించె
నందుఁగలవారు చిత్రంబుఁ ♦ జెంద మఱియు. ౧౪

తే॥ అజితవైకుంఠమందుండి ♦ యల యజైక
పాదహిర్బుధ్న్యుఁడున్ మహా ♦ దాదులు దగు
చుండఁ బ్రేతవినాయకు ♦ లొప్పవచ్చి
పొగడి వేనోళ్ళ నా దివ్య ♦ మూర్తిఁ గలిసె. ౧౫

చ॥ మఱిఁ దెలిదీవినుండి వెయి ♦ మంచిఫణంబుల నొప్పు శేషుఁడున్
ద్వర సితశైలకాంతిఁ గుము ♦ దాక్షముఖానుచరాన్వితంబుగాఁ
గఱివలువల్ ధరించి ఘన ♦ కాలకచంబులు నొప్పఁగా భయం
కరముగ వచ్చి తద్ఘనునిఁ ♦ గాంచి నుతించి లయించె వెండియున్. ౧౬

తే॥ అల భవానికి దాసురాం ♦ డ్రైన యర్బు
దాంగనామణులనుగూడి ♦ యా యిలావృ
తంబునుండి శేషుఁడు వచ్చి ♦ తన సహస్ర
వదనముల సన్నుతించి యా ♦ బలునిఁ గలిసె. ౧౭

వ॥ అంతఁ బాతాళలోకంబున కధఃప్రదేశంబున ద్వాత్రింశత్సహస్రయోజనంబులనుండి తామసీకలుండును, సహస్రవదనుండును, మకుటకుండలాదిమండితుండును, వ్యాసపరాశరసనకసనందనసనాతనసనత్కుమారనారదసాంఖ్యాయనపులస్త్యబృహస్పతివిశ్వామిత్రాత్రిదత్తాత్రేయమైత్రేయాది మహర్షిశోభాయమానుండును, వాసుకిమహాశంఖశ్వేతధనంజయధృతరాష్ట్రకుహాకకాలియతక్షకకంబళాశ్వతరదేవదత్తాదినాగేంద్రసేవ్యమానుండును, మృగమదాగరుసంకుమదకుంకుమచందనపంకావలిప్యమాననాగకన్యకాప్రకాశమానుండును, సిద్ధచారణగంధర్వాదిగీయమానుండును, హాటకేశ్వరత్రిపురబలకాలకేయకలినివాతకవచాద్యనుయాయివిరాజమానుండును, గామధేనురుద్రవరుణాదిప్రయాయివిభ్రాజమానుండును, నిజైకఫణాధృతసర్వసర్వంసహామండలుండును, సిద్ధసంకల్పుండును నాగేంద్రాభుండును, నగు ఫణీం

ద్రుండునైన యాబలభద్రసభ కేతెంచి యాసంకర్షణమూర్తిం గని వినుతించి యా దివ్యవిగ్రహంబున లీనంబయ్యె. తత్సమయంబునందుఁ దత్రత్యు లత్యాశ్చర్యంబుఁ బొంది యతండు పరిపూర్ణతముండగు పరమాత్ముండని తెలిసికొని నమస్కరించిరి. అంత నాయనంతుండు నిజపార్షదులగు సిద్ధుల కిట్లనియె. ౧౮

తే। ఏను భూమిభారముఁ బాప ♦ నేగుచుంటి, నందునఁ మీరు యదుకుల ♦ మందు సపరి
వారులై పుట్టుఁడీ! యని ♦ పరమకరుణ, తోడ వాచించి మఱియు ని ♦ ట్లాడఁదొడఁగె.

సీ। సుగతి! రథంబుతో ♦ వగవక యిందుండు, మెపుడుదలంతునో ♦ యపుడురమ్ము
దుర్భేద్యకవచమా! ♦ తొలఁగక యిందుండు, మెపుడు దలంతునో ♦ యపుడురమ్ము
లాంగలమా! నీవు ♦ గ్రుంగక యిందుండు, మెపుడు దలంతునో ♦ యపుడురమ్ము
ముసలమా! నీవును ♦ బొగులక యిందుండు, మెపుడు దలంతునో ♦ యపుడురమ్ము

తే। అమరవసురుద్రవిద్యాధ ♦ రాప్సరోజ, నంబులార! యోమునులార! ♦ నాగులార!
కుముదముఖులార! సఖులార! ♦ గోపులార! దనుజులార! నన్నిలమీరు ♦ గనుచునుండు.

తే। ఇటుల సంకర్షణునిచేత ♦ నెల్లవారు, సెప్పఁబడి నిజగృహములఁ ♦ జేరి రవల
నాగకన్యకలేగక ♦ నతుల సలిపి, యుంట నా యనంతుండు క్రీ ♦ గంటఁ గాంచి. ౨౧

క। ఎఱిఁగితి మీభావము మీ, రరుసము గన యమునదరి వి ♦ హారముమీతో
వఱల నొకప్పుడు రాసము, గరముగ నొనరింతు నాగ ♦ కన్యకలారా! ౨౨

తే॥ అంచు వాక్రుచ్చి వారల ♦ నంపె నంత, నల నివాతకవచపతి ♦ యైన కలియు
జనక యట్టి సంకర్షణు ♦ చరణకమల, ముల విరులఁజల్లి ప్రాలియుఁ ♦ బలికె నిట్లు.

ఉ॥ త్వచ్చరణాంబుజంబుల స ♦ తంబును భక్తినిఁ గొల్చు నన్ను మీ
యిచ్చను బంచుఁ డీర లెట ♦ కేగుట కిత్తఱి నెంచియుంటిరో
యచ్చటి కేగుదెంతు విశ ♦ యంబును మానుచు భక్తవత్సలా!
నిచ్చయమిద్ది మిమ్ముఁబిడి ♦ నేనిచటఁ మనఁజాలఁ జింతతోఁ. ౨౪

చ॥ అనవు డనంతుఁ డిట్లనె ము ♦ హాసురవర్య! ముదంబుఁగంటి నీ
వును ననుదెంచి యట్టి కురు ♦ భూపతియా ధృతరాష్ట్రనామధే
యునకు సుయోధనుండనఁగ ♦ నుద్భవమొందుము చక్రవర్తివై
తనరుము నీకు నప్పుడు గ ♦ దారణమున్ దమినేర్పుదున్ గలీ! ౨౫

తే॥ అంత నాతఁ డానందించి ♦ యాయనంతు, ననుమతింగొని నిజగేహ ♦ మునకు నేగె
నాకలివె నీవు! కృష్ణమా ♦ యాబలమున నెఱుఁగకుంటివి నీస్థితి ♦ నీవు భూప! ౨౬

తే॥ అవల నాయనంతునిసభ ♦ కాతురమున, శారదేందుమండలకోటి ♦ సామ్యకోటి
చేటికావృత స్యందన ♦ శ్రేష్ఠరుచిర, యైన నాగలక్ష్మియు వచ్చి ♦ యనియె నిట్లు.

ఆ॥ ప్రాణనాథ! భూమి ♦ భారంబుఁబాపంగ, బోవుచుంటివేను ♦ భువికి వత్తు
మిమ్ము విడిచి యొక నిమిషమేని మనఁజాల,నం చెఱుంగుమా! సహస్రవదన!
తే॥ అంత నారహిఁ గన్నులనశ్రులొలుకఁ,బలుకు నిజసతిం గని భక్తపాపహరుఁడు
భువనకారణకారణుం డవితథబలుఁ,డగు ననంతుఁ డాదరముతో ననియె నిట్లు.
క॥ మగువరో! సంతోషించితి, వగవకుమా! రేవతియును ♦ భామను లీనం
బగుమా! ధరఁగల నాతోఁ,దగి సుఖముల్ బొందుమా! సతము రంభోరూ!
క॥ అన నాగలక్ష్మి యిట్లనె, ననఘా! యారేవతియను ♦ నబ్జాక్షి యెటుల్
దనరునొ యేధీరునకుఁ, దనయయొ యెఱుఁగంగ నాకు ♦ దయతోఁ జెపుమా!
వ॥ అంత నాయనంతుండు నిజకాంత కిట్లు చెప్పందొడంగె. ౩౨

జ్యోతిష్మత్యుపాఖ్యానము.

ఆ॥ ఆదిసర్గమందు ♦ నల కశ్యపప్రజా,పతికిఁ గద్రువయను ♦ భార్యయందుఁ
బుత్రకుఁడుగ నేను ♦ పుట్టి శ్రీకృష్ణాజ్ఞ, సర్వలోకములకుఁ ♦ జాలక్రింద. ౩౩
తే॥ చేరి సర్వభూమండల ♦ భారములను, మత్తమాతంగవరము క ♦ మండలువును
గరమునం గొనినట్టులో ♦ క్కపడిగమునఁ,దాల్చి ప్రమోయుచునుంటిఁద ♦ త్సమయమందు.
ఉ॥ చక్షునిక్షాడ్కు ద్వీపయుత ♦ సర్వధరాపరిపాలనక్రియా
దక్షుఁడు చండశాసనుఁ ను ♦ దారుఁడు వైరిభయంకరుండు నా
చాక్షుషుఁడన్ మనూత్తముఁడు ♦ సర్వగుణంబులయందు నా సహ
స్రాక్షుని నింద్రుఁగూడ నవ ♦ హాస్యమొనర్చుచు నుండె దండిగన్. ౩౫
క॥ అతనికి సుద్యుమ్నాదులు, సుతులుగలరు మఱియు యజ్ఞ ♦ శుచికుండనము
ద్గతయగు నొకసుత జ్యోతి,ష్మతియను పేరం జెలంగు ♦ సారసనేత్రా! ౩౬
క॥ అంత నొకప్పు డతఁడు దమిఁ, జెంతకుఁ దనసుతను బిలిచి ♦ చెప్పుము! నీకే
కాంతుం డిష్టుఁడొ? నావుడు, సంతసమున నామె యిట్లు ♦ చక్కఁగఁ బలికెన్.
తే॥ ఎల్లభువనంబులందున ♦ నెవఁడు బలుఁడొ, వాఁడె నాకు విభుండగు ♦ బాధ మవల
నతఁడు మొదిల్లి యింద్రుఁడే ♦ యధికబలుఁడ,టంచు నాతనిం బిల్చి సిం ♦ హాసనమిడి.
ఆ॥ సత్యమాడనట్టి ♦ జనుని సర్వంసహ, మోయఁజాలనంచు ♦ మొత్తుకొనదె
కాన నిన్నుమీఱు ♦ ఘనబలుండున్నాఁడ, లేఁడ? నాకుఁ జెపుమ ♦ లేఖవర్య!

వ॥ నావు డింద్రుండు మనూత్తమా! యథార్థంబుగాఁ బలుకుచుంటి. జగ త్ప్రాణుని విడిచి నే నేకార్యంబును జేయఁజాలను. కాన నాతండె నాకంటె బలవంతుండని చెప్ప నతం డంగీకరించి యమ్మారుతుని నామంత్రణంబు సేసి నీకంటె బలుండగు వానిం జేర్కొను మన నతం డాలోచించి నావేగంబునకు సమస్తప్రపంచంబు కంపించును గాని ధరాధరంబులు జలింపవు. అక్కతంబున నవియే ఘనంబులని వక్కాణింప నామనువు మొదిల్లి యాశైలంబుల నాహ్వానించి యథాప్రకా

రంబుగాఁ బ్రశ్నింప నవ్వి మమ్ము భరించునది భూఖండమండలంబు గాన నదియే మాకంటె శ్రేష్ఠంబని స్పష్టీకరింప నాచక్షుషుం డాభూఖండంబును రావించి పూర్వోక్తంబుగా నడుగ నది యోమహాప్రభూ! నేను బలినిగాను. ఆదిదేవుండును వాసుదేవుండును సంకర్షణుండును సహస్రవదనుండును నాగేంద్రసామ్యశరీరుండును కైలాసతుల్యధవళవర్ణుండును గోటికందర్పదర్పహారిలావణ్యవిభ్రాజమానుండును, గోటిసూర్యప్రతీకాశభాసుండును కమలపత్రనేత్రుండును కమలకర్ణికాదివ్యనిర్మలపరిమళలోభితమధుకరనికరసంగీయమానుండును, కిన్నరసిద్ధచారణాద్యుపగీయమానుండును సురాసురప్రకరసంధ్యాయమానుండును సర్వాగ్రవిరాజమానుండును బ్రహ్మాండవిభుండును కైవల్యదుండును భగవంతుండును గారణకారణుండును నగు ననంతుండు లతాతరుగిరితరంగిణీసహితంబగు నన్నేకఫణంబుతో మోయుచు రసాతలమూలభాగంబునందుండు. ఆమహాబలుని మించినవాఁ డొకండు నెందునను లేఁడని సమగ్రంబుగా బలికి యతని వీడ్కొనె. అంత నాచాక్షుషకుమారి నాబల ప్రతిభాప్రభావాదులం దెలిసికొని మత్ప్రాప్త్యర్థంబై పిత్రాజ్ఞఁ గైకొని వింధ్యాచలంబున కరిగి గ్రీష్మంబునం బంచాగ్నిమధ్యమందుండి క్రాఁగియు వానలఁ దడిసియు జలినిం జన్నీట నాకంఠంబుగా మునిఁగియు స్థండిలంబునం బరుండుచు బ్రహ్మను గూర్చి తపం బనేకలక్షసంవత్సరంబులవఱ కొనరించుచుండె. అత్తఱి శక్రయమధనదాగ్నివరుణసూర్యచంద్రమంగళబుధగురుశుక్రశను లా తపస్వినీవయోరూపలావణ్యాదులం దిలకించి పరికించి మోహించి ముర్మురశరసంహతులై తాళజాలక యామె యాశ్రమంబున కేతెంచి మహానందంబుతో నిట్లనిరి. ౪౦

దేవేంద్రాదులు జ్యోతిష్మతిని మోహించి కోరుట.

ఉ॥ ఓ మదిరాక్షి! యెందుల క ♦ నుత్తమమౌ తపమిట్లొనర్తువో?
నీమెయి కష్టపెట్టుటయు ♦ నింద్యము ప్రాయమె యోగ్యమైనదే
యీమెయి మాకుఁ దెల్పు మది ♦ యిష్టఫలింపఁగఁ జేయనేర్తుమో
సామజయాన! నావు డల ♦ చాక్షుషపుత్రిక యిట్లు చెప్పెడిన్. ౪౧

ఆ॥ అయ్యలార! నాకు ♦ నాసహస్రాస్యుండు, పరుఁడు బలుఁడును భగ ♦ వంతుఁడగు న
నంతుఁ డిపుడు ప్రాణ ♦ నాయకుం డగుటకై, తపముఁ జేయుచుంటిఁ ♦ దత్పరతను.

క॥ అవ్వాల నవ్విబుధోత్తము, లవ్వచనము లాలకించి ♦ యరరే! యనుచున్
నవ్వి పకాపక యామెకు, నివ్విధి నొకఁడొకఁడు బల్కె ♦ నిందునిభాస్యా! ౪౩

వ॥ అందాదియందు బృందారకేంద్రుం డరుదెంచి యిట్లు హెచ్చరించె.

చ॥ సరసిజలోచనా! వృథగ ♦ సర్పముఁగూర్చి తపించుటేలకో?
త్వరను దనంతఁ దావలచి ♦ వచ్చిన నన్ను శతక్రతున్ సురే

శ్వరు వరుగా గ్రహించి బహు ♦ సౌఖ్యములం గనరాదె సుందరీ!
కరివరయాన! చంద్రముఖి! ♦ కంబుగళా! తడవేల? చెప్పుమా! ౪౫

ఉ॥ ఆవలఁ గాలుఁ డేగి యిటు ♦ లాడెఁ జెలీ! యమధర్మరాజు లో
కావళి శిక్షఁ జేసెడి మ ♦ హాబలవంతుఁడనైన నన్ను వే
నీవు వరించి యెల్లపుడు ♦ నెమ్మిని మత్పితృలోకమందునన్
భావుకసౌఖ్యముల్ గనుము! ♦ పంకజపాణిరో! కీరవాణిరో! ౪౬

ఉ॥ అంతఁ గుబేరుఁ డిట్లు పలు ♦ కాడను జాక్షుసపుత్రికామణీ!
సుంతను నెంతవారలను ♦ జొక్కఁగఁ జేసెడి ద్రవ్యరాశికిన్
గాంతుఁడ రాజరాజును న ♦ ఖండబలుండను గానఁ బామపైఁ
జింతను వీడి నన్నిపుడు ♦ చేకొనుమా! భువనైకమోహినీ! ౪౭

ఆ॥ అవల నగ్నివచ్చి ♦ యాడె నీవిధముగా, సర్వదేవముఖుని ♦ సర్వయజ్ఞ
సుప్రతిష్ఠితు నను ♦ సొంపుగాఁ జేపట్టు, మంబుజాక్షి! విడిచి ♦ యన్యబుద్ధి.

తే॥ అంత వరుణుండు నిట్లనె ♦ వ్యథను విడిచి, జలధినాయకుఁ బాశాది ♦ కలితు లోక
పాలకుని నన్ను వేగ చే ♦ పట్టి వైభవములఁ గనుమ జ్యోతిష్మతీ! ♦ కమలనేత్ర!

క॥ పెండియు రవి సని యిట్లనెఁ, జండకరుఁడ సర్వకర్మ ♦ సాక్షి జగచ్చ
క్షుండను స్వర్మణిఁ గావునఁ, బెండిలియగు నీచగతిని ♦ విడిచి మిటారీ! ౫౦

మ॥ పిదపన్ జంద్రుఁడు వోయి యిట్లనియె నో ♦ బింబాధరా! లోకవి
ద్యుదుఁ దారేశు సుధాంశు నోషధిపతిన్ ♦ రమ్యాంగు రాజున్ ననున్
మదిరాక్షీ! తమిఁ బెండ్లియాడు మిపుడే ♦ మావారు మీవారలున్
ముదముం జెంద ననంతుఁడన్ బలుసిపైఁ ♦ బోనీక నీబుద్ధినిన్. ౫౧

తే॥ అంత మంగళుఁ డిట్లనె ♦ నింతి! నాకుఁ దల్లి యీరత్నగర్భయు ♦ తండ్రియన్నఁ
బరుఁ డురుక్రముఁడగు పొట్టి ♦ వడుగు గాదె, వృద్ధి గోరినచో నన్నుఁ ♦ బెండ్లియాడు.

ఆ॥ అవల బుధుఁడు నిట్టు ♦ లనెఁ గామినీరస, వర్ధనుండ గుణిని ♦ బలుఁడఁ గాన
సకలసురల విడిచి ♦ సుకముగా నాతోడ, రతులఁ దేలుచుండ ♦ రాదె రమణి!

క॥ అంత బృహస్పతి యిట్లనె, గాంతా! ధిషణుండ దేవ ♦ కాండగురుండన్
శాంతుఁడ దాంతుఁడ మంత్రిని, స్వాంతమునకు నచ్చెనేని ♦ వరియింపు ననున్.

క॥ అవలన్ శుక్రుం డిట్లనె, గవివరుఁడను భార్గవుఁడ న ♦ ఖండబలుండన్
దివిజార్యాచార్యుండను, బ్రవిమలమతిఁ జూచి నన్ను ♦ వరియింపు చెలీ! ౫౫

తే॥ అంత శని యిట్లు వాకొనె ♦ నంబుజాక్షి, నిఖలనిర్జరశిరములన్ ♦ నిలుచు బలుఁడ
నాదు దృష్టిని సర్వాల ♦ బూదిగల్పఁ, గలను గావున నన్ గోరి ♦ గనుమ సుఖము.

వ॥ తత్సరంబునం దక్కరిణి నక్కావరు లొక్కుమ్మడి వచ్చి వక్కాణించుట
నక్కన్యకామణి యాలకించి వెక్కసపడి యొక్కమాటు నన్నొక్కువగా స్మరించి

యధరంబు చలింపఁ గన్నుల నిప్పులు రాల మండిపడుచు నావేల్పులం గాంచె. తత్కోపంబున బ్రహ్మాండంబంతయు గంపించె. అనిలింపాధిపాదులు శాపం బిచ్చునేమోయని ప్రార్థించిరి. కాని యాతపస్విని కొంత శాంతించియుఁ దాళంజాలక యవ్వారల నిట్లు శపింపం గడంగె. ౫౭

జ్యోతిష్మతి యింద్రాదులను శపించుట.

చ॥ అరెరె నిగా! హరించుటకు ♦ నైననుఁ జేరితి వక్కటాసఁ బం
గురధర్మశాంగ కాత్యసిత ♦ కుత్సితవిద్యుతినీచదృష్టులన్
వఱలఁగ శ్వేతమాష్టతిల ♦ భక్షివి గమ్మిఁక ముందు నిట్టితె
వ్వరిదరిఁ జేరఁ బోవకుము ♦ భద్రము భస్మమొనర్తు వ్రేల్మిడిన్. ౫౮

సీ॥ కావ్య! కాణుండవు♦గమ్మ! బర్హిర్ముఖ,గురువరా! స్త్రీసంజ్ఞ♦కుండవగుము!
సౌమ్య! నీదినమున♦సర్వశూన్యంబౌత!, నుర్వీజ! వానరా♦స్యుండవగుము!
శశి! నీవు రాజయ♦క్ష్మంబున మెచ్చుమా! ద్యుమణి! సంభగ్నదం♦తుండవగుము!
వరుణ! జలంధర♦బాధితుండవుగమ్మ!, స్వాహేశ! సర్వభ♦క్షకుఁడవగుము!
తే॥ గుహ్యకేశ్వర! వ్యాతపుష్ప♦కుండవగుము!, యంతకా! నీవు దనుజవ♦రావమాని
తుఁడవు గమ్మని భీతిభీ♦తుఁడగు నిర్జ,రేశ్వరుం గని చీకొట్టి♦యిటు శపించె. ౫౯

మ॥ సురనీచా! సురనేతనంచు నిటకున్ ♦ సుద్దుల్ సళింపన్ ననున్
హరియింపన్ జనుదెంచి యుంటి విటుఁ నీ ♦ యన్నున్ నృపుండొక్కఁడే
ద్రొఱఁగాఁ జేయుచు నీవు వోవనెటకో ♦ దివ్యంబు నీస్వర్గమున్
బరిపాలించుత తుచ్ఛ! మత్పతిఁ బరున్ ♦ బ్రహ్మన్ బడన్ దూఱెదే? ౬౦

తే॥ మఱియు నొక మహాబలిరణ♦మండలమున, నిన్ను నిర్జించి పాశాళి♦నెఱిగఁగట్టి
ప్రసభముగ లంకయందలి♦బహుభయంక,రాంధకారగృహమున వే♦యంగలండు.

ఉ॥ అంతట నట్లు శప్తులయి ♦ నట్టి యమర్త్యుల నింద్రుఁ డాగ్రహ
క్రాంతమనస్వియై "సుదతి" ♦ కారులఁ బల్కెదవేల? యిష్ట్రాజ
న్మాంతరమందొ యేసమయ ♦ మందొ యనంతుఁడు నీకు నెట్టులోఁ
గాంతుఁడుగా లభించినను ♦ గల్గఁడు పుత్రుఁడొకండు నైతమున్. ౬౧

తే॥ అని శపించి తద్విద్యుతి ♦ కాగలేక, వేల్పులంగూడి నిజదివ్య ♦ విష్టపమున
కరిగె నంతట నక్కన్య ♦ మరలఁ దపము,సేయఁ గడఁగెను జిత్తంబు♦చెదరకుండ.

ఆ॥ తత్పరమున బ్రహ్మ ♦ తత్తపంబునుమెచ్చి, బ్రాహ్మణులనుగూడి ♦ వాణితోడ
హంసనెక్కి యామె♦యాశ్రమంబునకేగి, యంబరమున నిలిచి♦యనియె నిట్లు.

క॥ జ్యోతిష్మతి! నీతపమే, ప్రీతిం గలిగించె నాకు ♦ వేగంబే త్వ
చ్చేతస్థితవాంఛాస్థితి, యీతఱి నెఱిఁగించికొనుము! ♦ యిచ్చెద నిపుడో. ౬౨

చ॥ అనుపమతన్మనోగతిని • నాకమలాసనదివ్యసూక్తులన్
విని గళవారినుండి వడి • వెల్వలకున్ జనుదెంచి భక్తితోఁ
గని వినుతించి మ్రొక్కులిడి • కారుణికోత్తమ! నా కనంతుఁడే
పెనిమిటియౌనటుల్ సలిపి • వేడ్కను గూర్పుమ! యీక్షణంబునన్. ౬౬

బ్రహ్మవరంబున జ్యోతిష్మతి రేవతియై పుట్టుట.

వ॥ పిమ్మట నత్తమ్మిచూలి యమ్మా! నీవరంబు దుర్లభంబు. అట్లైన నొసంగెదనుగాని యిప్పుడే ధరను వైవస్వతమన్వంతరంబు ప్రారంభించె. ఇందిరువదియేడవ యుగం బతిక్రమించుసమయంబున నీమనోరథంబు సఫలంబు గాఁగలదు. అంతవఱకు వేచియుండుమన నక్కన్నియ క్రమ్మఱం బ్రణమిల్లి వాణీవల్లభా! మీఁగడు వతిదీర్ఘంబుగా నున్నది. సహింపజాల. సర్వసమర్థులు నావాంఛితం బతిశీఘ్రంబుగా ఫలించున ట్లొనర్పుము. లేదేని నాచే దేవతలు శాపదగ్ధులైనట్లు నీవును గాఁగలవన నానలువ భయభీతుండై యించుక యోజించి కుమారీ! యొండొక కారణంబున నాగడువు త్రుటిగాఁ జనఁగలదు. కాన నీవు వెంటనే కుశస్థలీపురి నుండు రేవతుండను రాజునకుం బుట్టి నీకోరిక దీర్చుకొనుమని వరం బిచ్చి యంతర్హితుం డయ్యె. అంత నాజ్యోతిష్మతి తద్విధంబునం బుట్టి రేవతియను నామంబుతో శుక్లసుధాంశుభాతిఁ గ్రమంబుగా రూపౌదార్యాదిగుణంబులతో వర్ధిల్లుచు వివాహయోగ్యయగుటం దండ్రియగు రేవతుండు గాంచి కుమారీ! నీకెట్టి కాంతుం డిష్టుండో యని చనవున నడిగి సర్వాధికబలుండే నాకు ప్రియుండను ప్రత్యుత్తరంబు గైకొని తాదృశవరుని యోజించి తోఁచక విచారింప బ్రహ్మలోకంబునకుం బుత్రీసహితంబుగా నరిగి యట క్షణంబు గడుపునంతలో నిలను బహుళ్మదితకాలం బతీతసన్నంబయ్యె. ఇంతవఱకు నక్కన్నియతో నాతం డందుననేయున్నాఁడు. కాన నీవు క్షిప్రంబుగా నాకన్యకయందుఁ బ్రవేశించి ద్వారకాపురమందు నాతో సుఖంబుగా విహరింపుమని యాజ్ఞాపించె. అంత ౬౭

తే॥ నాగలక్ష్మియు స్వప్రాణ • నాయకుఁడు న
ఖండబలుఁడు పరుఁడునగు సం • కర్షణునకు
మ్రొక్కి వీడ్కొని విధి లోక • మునఁ జెలంగు
రేవతీకన్యకన్ జొచ్చె • కవితోడ. ౬౮

తే॥ అవలఁ నట్టి సంకర్షణుం • డఖిలలోక,వినుతగోలోకమందుండి • చనియె నిద్దియఘహారంబగు బలరాము•నాగమ మిఁక,నెద్ది వినఁదువో యువరాజ!•యెఱుఁగఁ జెపుమ!

ప్రాడ్వివాకుండు దుర్యోధనునకు శ్రీకృష్ణచరిత్ర
సంగ్రహించి వచించుట.

చ॥ అనవుడు భూపుఁ డిట్లనియె ♦ నాబలు భక్తుఁడనైన నాకుఁ ద
ద్ఘనమహిమంబుఁ జెప్పి కృతి ♦ గా నొనరించితి రీర లావిధం
బున నలరామకృష్ణు లిలఁ ♦ బుట్టి పితన్ విడి గోకులంబునం
జనిరెటుఁ దమ్ము వ్రేలెఱుఁగ ♦ జాలనియట్లిటులుండిరో ? గురూ !

తే॥ ఇట్టివిషయము సెప్పుమా! ముని♦సింహ! యనఁగఁ బ్రాడ్వివాకుండునిట్లనెఁ♦బార్థివేంద్ర
యొక్కతఱి మధురాపురి♦నుగ్రసేను, నన్నయగు దేవకుండను♦యదువిభుండు.

చ॥ తనసుతయైన దేవకినిఁ ♦ దద్వసుదేవున కిచ్చి పెండిలిన్
బొనరిచి పంపునప్పు యదు ♦ భూమివిభుండగు నుగ్రసేను నం
దనుఁడగు కంసుఁడొక్క యర ♦ దంబున వారలఁ నెక్కఁజేసి వే
డ్కను వడి దోలఁగాఁ గడఁగెఁ ♦ గౌరవనాయక! యట్టికట్టునన్. ౬౨

తే॥ కంస! యీసతి యష్టమ ♦ గర్భమందుఁ
గలుఁగు పురుషుఁడు నిను జంపఁ ♦ గలఁడు సత్య
మనెడి నశరీరవాణిని ♦ నవధరించి
యా మహాబలుఁడగు కంసుఁ ♦ డాగ్రహించి. ౬౩

చ॥ కరమునఁ గత్తిఁబట్టి స్వస ♦ కంఠముఁ గోయఁగఁబోవఁ గాంచి బల్
త్వర వసుదేవుఁ డడ్డుపడి ♦ బావ! యధర్మము మాను మీ మెకొ
త్తఱిఁ దనయుల్ జనించెదరొ ♦ తత్క్షణమందునఁ దెచ్చి యిచ్చెదన్
నఱకుము స్వేచ్ఛ నానుడులు ♦ నమ్ముమనంగఁ దదాగ్రసేనియున్. ౬౪

ఉ॥ ఒప్పుచు వారినిర్వుర మ ♦ హోద్ధతితోఁ జెఱసాలయందునన్
జొప్పడఁజేసి చింతవిడి ♦ సొంపుగనుండె ననంతరంబునం
దప్పువుబోఁడికిన్ బ్రథమ ♦ మందు జనించిన దివ్యపుత్రునిన్
దెప్పునఁ గొంచు నట్టి వసు ♦ దేవుఁడు కంసున కిచ్చె నంతటన్. ౬౫

తే॥ కంసుఁడా వసుదేవునిఁ♦గల్లలాడు, వాఁడు గాఁడని పొగడి యా♦బాలుఁ జంప
కుండ విడె నంతఁ గయ్యపుఁ♦దిండి యతని, కడకు నరుదెంచి పల్కెఁ డ♦గడఁగ నిటుల.

చ॥ యదుభవులున్ నిలింపులు న ♦ హర్నిశలున్ భవదాత్యయంబునే
హృదయములన్ దలంతురని ♦ యోగను బిమ్మట జాతరోషుఁడై
యదువిభుఁ డాకి మొప్పటికి ♦ నప్పుడు దేవకి గన్నబిడ్డలన్
జదిపి యదుప్రధానులను ♦ జండతఁ జూచెడిఁ గుంది పాఱఁగాన్. ౬౬

తే॥ ఇంతలో దేవకీదేవి ♦ యేడవపరి, బలుని భగవంతుని సహస్ర ♦ వదను గర్భ
మందుఁదాల్ప శ్రీకృష్ణాజ్ఞ♦నట్టి యోగ,మాయ తత్తేజమునుగొని♦పోయి వడిగ.

ఆ॥ వ్రజమునందు నున్న ♦ వసుదేవపత్నియౌ, రోహిణి జఠరమున ♦ రూఢిఁ గూర్చి
మధురయందుఁ జెలఁగు ♦ మనుజలీయమగర్భ, మేడకేగె నంచు ♦ నాడి రంత. ౭౯

తే॥ అవల రోహిణి గర్భమై ♦ యొకదినము, లైన పిమ్మట దేవకీ ♦ మానవతియు
నందమందిరమందియు ♦ నాగొమైన, ప్రభల వెలుఁగంగ భవ్యమౌ ♦ వ్రజమునందు.

తే॥ ఐదుగ్రహము లుచ్చస్థితి ♦ నలరుచుండఁ, దులను స్వాత్యనుబుధవార ♦ కలితమైన
భాద్రపదశుద్ధషష్ఠిని ♦ బట్టపగలు, గులవధూమణియౌ నామె ♦ బలునిఁ గనఁగ.

ఉ॥ వేల్పులు మంచిపూవులను ♦ బెల్లుగఁ జల్లిరి వారిదోత్కరం
బల్పతుషారముం గురిసె ♦ నావల నంమఁదు బిడ్డకున్ ద్రయీ
జల్పితజాతకర్మమును ♦ సల్పి ధరామరపంక్తి కాలన
స్వల్పముగా నొసంగి పురి ♦ వర్తిలు గోపుల సత్కరించెఁగా. ౮౨

వ॥ అంతఁ గారాగృహంబందున్న దేవకీదేవి యష్టమగర్భంబు ధరించి పరిపూర్ణతముండగు శ్రీకృష్ణచంద్రునిం గాంచఁగా వసుదేవుండు తదాజ్ఞచే నొకడోలిక నాశిశువు నుంచికొని మహానిశీథంబున బయలువెడలి యమునానదిని దాఁటి వ్రజంబునందు యోగమాయం గాంచి నిద్రించెడి యశోద సెజ్జపై దనతనయుని డించి యందుండు యోగమాయాకన్యకం గొని వడితో నిజబంధనంబునం బ్రవేశించె. అవల దద్బాలికారోదనధ్వని యాలించి కావలివారు కంసునితోఁ జెప్ప నాతం డతిద్రుతగతినిఁ జనుదెంచి యాబిడ్డం గైకొని యొండుబండపైఁ గొట్ట నక్కన్యక చివుక్కునఁ బైకెగసి సిద్ధచారణాదులు స్తుతించుచుండ నిలిచి యోరీ దుష్టా! నిన్నుఁ జంపు బలుం డీవఱకే యొచటనో జనించియున్నాఁడు. వ్యర్థంబుగా దేవకీవసుదేవుల హింసించెదవేల? యని పలికి వింధ్యాచలంబున కేగె. తరువాత నాయదువిభుం డాలోచించి యవ్వారలఁ జెఱనుండి విడిచి పూతనాదిరాక్షసులం బిలిచి పదిదినంబుల లోపల ప్రపంచంబంతయుఁ దిరిగి వెదకి మీకుఁ గనఁబడిన పిల్లల నెల్లరను జంపి యావార్త దెలుపుండని పంచె. ఇఁక గోకులంబునందు నందుండు నందనోత్సవంబైనదని విని మహానందంబుతో మహోత్సవంబు సలిపె. ఇట్లు రామకృష్ణులు కంసభయమిష నటనుండి గోకులంబున కరుదెంచి గోపికాగోపకులను మోహపరచుచు నద్భుతంబులగు బాలక్రీడలం గావించుచుఁ బెరుఁగుచుండిరి. మఱియు నేమి వినవలతువో చెప్పుమన నాదుర్యోధనుండు సంతోషించి యామునీంద్రున కిట్లనియె. ౮౩

క॥ ధీర! యల రామకృష్ణులు, ధారుణిపై నవతరించి ♦ తద్వ్రజమందున్
ద్వారక మధుర మఱొకయెడ, నేరహిఁ దగి? రద్ది సంగ్ర ♦ హించుచుఁ జెపుమా!

తే॥ అనఁగ బ్రాడ్వివాకుండు నా ♦ యవనిపతికి, నీ కతఃపూర్వమందున ♦ నేను సెప్పి
నట్టి వ్రజమధురాద్వార ♦ కాదిపురుల, వారు సల్పిన లీలలన్ ♦ వరుసఁ జెప్పె.

తే॥ జనక ! తిరిగి సుయోధన ♦ చక్రవర్తి యిటుల నడిగెను మునివర్య! ♦ యెపుడు బలుఁడు
యమునదరి నాగకన్యక ♦ లైన గోపి, కలను గూడి క్రీడించెనో? ♦ పలుకుమయ్య !

ఆ॥ అనఁగఁ బ్రాడ్వివాకుఁ ♦ డను నిట్లు యువరాజ!, సీరి యొక్కతఱిని ♦ స్నేహితులను
జూడ నుత్సుకుఁడయి ♦ సుందరతాలాంక, సహితరథము నెక్కి ♦ సత్వరమున.

ఉ॥ ద్వారకనుండి గోకులము ♦ దక్షిణమందునఁ జేర నెయ్యరుల్
బేరిమి సల్పి తోడుకొని ♦ వేశ్మములన్ జనుదెంచి రంత నా
శూరుని రాక నందుఁడు య ♦ శోమతియున్ విని ప్రీతి నాతనిన్
జేరియుఁ గౌఁగిలించుకొని ♦ క్షేమము నడ్గిరి సక్రమంబుగాన్. ౮౮

తే॥ అంత బలరాముఁ డందున ♦ నాత్మమిత్ర, బంధుగోగోపికాగోప ♦ పంక్తితోడ
గలిసి చైత్రవైశాఖముల్ ♦ గడచుదాఁక, సంతసంబున నుండె నా ♦ సమయమందు.

ఆ॥ మున్ను జెప్పఁబడిన ♦ భోగికన్యక లిలఁ, బ్రేతలుగ జనించి ♦ రేవతీశ
లబ్ధకొఱకు దివ్య ♦ లాంగలిపంచాంగ, మును గ్రహించి గర్గ ♦ మునిముఖమున.

క॥ దాని జపించుచు సిద్ధి న, నూనముగాఁ బొందియుండి ♦ రుచ్చ్రియబలుం
డా నారీరత్నంబుల, తో నొప్పుచు నొక్కతఱిఁ గు ♦ తుకమతితోడన్. ౯౧

చ॥ యమునతటంబుఁ జేరి యమృ ♦ తాంశుఁడు సర్వకళాప్రపూర్ణుఁడై
సుమఫలవృక్షవల్లరుల ♦ శోభను జెందు వనంబునన్ వినో
దముగ వెలుంగ దివ్యసిక ♦ తామయవేదికలందుఁ జైత్రపూ
ర్ణిమఁ బృథురాసకేళులను ♦ నేర్పునఁ జేయఁగడంగ నిట్టులన్. ౯౨

బలరామరాసలీలావర్ణనము.

సీ॥ కమలమరందరే ♦ ణుమిళితగంధవా, హములు శీతముగ మం ♦ దముగ వీవ
బల్లవసుమరజో ♦ భాసురశుకపిక, బర్హిణాదులును బ్రశ ♦ వ్యముగఁ గూయ
మాలతీపద్మినీ ♦ మాధవీ మధుమత్త, షట్పదంబులు బ్రీతి ♦ ఝుంకరింప
శ్యామలవిద్యుతి ♦ చారుతరమగు కా, ళిందితరంగంబు లా ♦ నంద మిడఁగ

తే॥ మకుటకుండల కంకణ ♦ మణిమయాంగ, దాంగుళీయకహారతా ♦ రాదిభూష
ణాంచితుండయి యక్షిజ ♦ నాళి నొప్ప, ధనదువలె గోపికలతోడఁ ♦ దనరి బలుఁడు.

వ॥ వరుణదేవప్రేషితంబయి వనంబంతయుఁ బరిమళింపఁ జేయుచు సుమభార గంధిలోభిభ్రమరనాదితమేదినీరుహకోటరంబులనుండి స్రవించు వారుణిం గ్రోలి కెందామరచందంబున గన్నులు జెన్నుమీఱ మకరధ్వజావేశంబున సోలుచు విహార పరిశ్రమప్రస్వేదాంబుకణంబులచే గండస్థలమకరికాపత్రభంగంబు భంగంబుగా బాహుదండంబు వేదండశుండాదండంబును బోలి యొప్ప హలముసలాయుధంబులు హస్తంబులం బొల్పార నీలాంబరంబులు నిజాంగకంబున వినోదంబుగా మెఱయ గున్నయేనుఁగులీల నడచి తన తేజంబు కోటిపూర్ణేందుమండలద్యుతిం బురుడింపఁ

ద్రాసమండలభాసురసింహాసనాసీనుండై రత్నమంజీరనూపురకనకకింకిణీకంకణతాటంకహారాంగుళీయశిరోరత్నాద్యలంకారంబులచే నలంకృతలగు నా గోపికాసుందరులతోఁ గరేణువులంగూడి విహరించు మత్తకరీంద్రుఁడువలె నవ్వారల మనోరథంబు దీర మహాచిత్రంబుగా ననేకరీతులం గ్రీడించె. అంత ౯౪

తే॥ అట్టితనయాతటవనప♦ర్యటనబహువి,హారకష్టజనితనిదా♦ఘాంబుకణవృ
తాననారవిందుండగు♦హాలి జలకము,లాడ దవ్వునుండి రమ్మని♦యమునఁ బిల్చె.

తే॥ అతుల నాహూతిసందిన♦యమున యతని, దరికిఁ జనకుండె నత్తఱిఁ♦దద్బలుండు
గాంచి కనలి దానిని హలా♦గ్రమునఁ జెంత,కీడ్చుకొని నిష్ఠురంబుగ♦నిటులఁ బల్కె.

క॥ ఓసీ! కాళిందీ! నా,కీసమయమునం దవజ్ఞ♦ యీ వొనరుతువే?
నాసరివారలు లేరని, నీసూటికిఁ దగినలాగు♦ నెఱిఁ దిరిగెదవే? ౯౭

తే॥ కాని యీ ముసలంబుతో♦నీనిమిషము,నందు శతఖండములుగ ని♦న్నాచరింతు
నంచు భర్త్సింపగా నట్టి♦యమున భీతిఁ,బొంది తత్పాదనీరజ♦ములను వ్రాలి.

మ॥ బలరామా! యదువంశసాగరశశీ! ♦ భక్తాళిచింతామణీ!
పలుజోతంబులఁ జేయుచుంటిఁ గొనుమీ ♦ బ్రహ్మాండభాండంబు నీ
తల నావంతఁగఁదోఁచుచుండె నిఁక నా ♦ తప్పుల్ దయన్ బాపి నీ
బలమున్ గుత్తుకఁగంగలేని ననుఁ బ్రో ♦ వన్ వేఁడుచుంటిన్ విభూ! ౯౯

చ॥ ఇటు వినుతింప రాముఁడు న ♦ హీనదయన్ గని యా కళిందజన్
దటుకునఁ గ్రమ్మఱిల్లి గజ ♦ తుండముతోఁ దగు మత్తకుంజరం
బటు లల వ్రేతలన్ గలిసి ♦ యా యమునానదిఁ గ్రుంకి లేచి త
త్తటమునఁ జేరియుండె వసు ♦ ధావరవంద్యసుయోధనప్రభూ! ౧౦౦

తే॥ అపుడు యమునాతరంగిణి♦హాటకమణి, భూషణముల దివ్యాంబర♦ములను నీల
పటము లా బలునకు నిచ్చి♦వందనముల, సల్పి చనె నంత సిరియు♦నక్రమముగ.

తే॥ వేలువేలుగ వ్రేతలన్♦బిల్చి యవ్వి, యిచ్చి తాను నీలపటంబు♦లిచ్చఁ దాల్చి
స్వర్ణనవరత్నమాలికల్♦స్వగళమునందు, వేసి యైరావతముబోలె♦వెలిఁగె లలిగ.

ఆ॥ ఇటుల నట్టి రేవ♦తీశుండు చైత్రవై,శాఖనిశల గడిపె ♦ శమనభగిని
కరిపురివలె బలుని♦గండుసూచించుచుఁ, గృష్టపంథఁ జెలఁగు♦నిప్పటికిని. ౧౦౩

క॥ ఇది బలరామకథావిధి, సదివిన వ్రాసినను విన్న ♦ జనులకఘంబుల్
జదియఁగ సద్గతి నొదవెడి, నెఱిఁగించుమా? మఱియుఁ జెపుమ!♦యిభపురనాథా!

క॥ అనఁగ సుయోధనుఁ డిట్లనె, మునివర! యీ సతులు గర్గ ♦ మునిచే బలభ
ద్రుని పంచాంగం బెట్టులఁ,గొనిరో యీ వార్తనాకుఁ♦గూర్మిని జెపుమా! ౧౦౫

చ॥ వదఁపడిఁ బ్రాడ్వివాకుఁ డిటు ♦ పల్కెను గర్గనగంబునుండి స
మ్మదమున గర్గమౌని యొక ♦ మా అల సూర్యసుతాతటంబునన్

గొదరెడి దివ్యకుంజమున ♦ కుఱ్ఱ జని యేకనుఁడౌచు సాధుభ
క్తదయితరామకృష్ణులను ♦ ధ్యానముసేయుచునుండె భక్తితోఁ ౧౦౬

తే॥ అపుడు గోపికలుగఁబుట్టినట్టి నాగకన్య లాదిజన్మజ్ఞాన ♦ కలితలగుచు
వచ్చి యాగర్గమౌనికిఁ ♦ బరమభక్తి, వందనంబుల నొనరించి ♦ పలికి రిట్టుల. ౧౦౭

బలభద్రపంచాంగము.

క॥ బలభద్రుఁడు మాకిప్పుడు, సులువుగఁ జిక్కుంగవలయు ♦ సూరివరా! యం
దుల కేపనులను నేరీ,తుల సలుపవలెఁ జెపుమా య ♦ దుప్రవరగురూ! ౧౦౮

తే॥ పిదప గర్గుఁడు వారల ♦ విమలభక్తి, మెచ్చి బలభద్రపంచాంగ ♦ మిచ్చునిచ్చె
నవ సుయోధనుఁ డాలించి ♦ మునివరేణ్య!, యద్దియెట్టిదొ వివరింపు ♦ మార్య! యనఁగ.

ఆ॥ ప్రాడ్వివాకుఁ డిట్లు ♦ బల్కెఁ దద్బలరాము,పద్ధతి పటలముఁగ ♦ వచము నుతి స
హస్రనామములను ♦ నైదింటిలోఁ దొలి, దైనపద్ధతి విను ♦ మయ్య భూప! ౧౧౦

ఆ॥ ప్రతిదినంబునందు ♦ బ్రాహ్మ్యముహూర్తంబు,నందు "రామ! కృష్ణ" ♦ యంచు లేచి
గురుని మ్రొక్కి భువినిఁ ♦ గూడ ధ్యానించుచుఁ, బుడమిపైని నడుగు ♦ లిడి కడంక.

క॥ జలమును దాఁకి రహస్య,స్థలమున దర్భాసనమున ♦ సంస్థితుఁడై చే
తులఁ దొడపైనిడి చూపులఁ, నిలిపి స్వనాసాగ్రమందు ♦ నిష్ఠాపరుఁడై. ౧౧౨

చ॥ పరుని ననాదిమధ్యలయు ♦ భక్తజనప్రియు రేవతీమనో
హరు వనమాలికాధరుని ♦ హారవిలోలు సుశీలు మేచకాం
బరు జగదేకసుందరు ది ♦ వస్పతిదంతిసమాను గోపికా
వరు బలభద్రు ధ్యానమును ♦ భావమునందు నొనర్పఁగావలెన్. ౧౧౩

తే॥ ఇటుల నిత్యము తత్ప్రీతి ♦ కేకభుక్తి,ద్విజలపానములన్ దగి ♦ విడిచి కల్ల
విజితషడ్వర్గుఁడౌచు భు ♦ విని శయించి,మూఁడుపూఁటలన్ ధ్యానించు ♦ పూరుషునకు.

తే॥ సాంఖ్యయోగాదివిధులచే ♦ సంభవింప, నట్టి కారణకారణుఁ ♦ డైన బలుఁడు
గోచరుండయి కరుణతోఁ ♦ గోర్కెదీర్చు, నిదియ పద్ధతి పటలంబు ♦ నికను వినుమ!

వ॥ యువరాజా! అతిగుహ్యంబును వృద్ధిసిద్ధిప్రదాయకంబును బ్రహ్మచే నారదున కుపదేశింపఁబడినదియు నగు తత్పటలంబునకుం బ్రథమంబునం బ్రణవంబు నుద్ధరించి కామబీజంబుఁ జేర్చి కాళిందీభేదనసంకర్షణపదద్వయంబును జతుర్థ్యంతంబులుగా మార్చి కూర్చి తుదను "స్వాహా"యను పదంబు లగించి షోడశాక్షరాత్మక మంత్రరాజంబును దీక్షతో లక్షపదియారువేలమారులు జపించి తుట్టతుదను శుభప్రదంబగు స్థండిలంబున ద్వాత్రింశత్పత్రవిభాసురంబును గర్ణికాకేసరోజ్జ్వలితంబునగు పద్మంబు నైదురంగులతోఁ జిత్రించి దానిపై స్వర్ణసింహాసనం బేర్పరచి యందు బలభద్రప్రతిమ నుంచి దానికి "నమోభగవతే" యను మంత్రంబుచే శిరంబుతో నమస్కరించి "జయజయానంత" యను దానిచే వాహనంబిడి

"నమస్తేస్తు"అను మంత్రంబుతో నాసనాదిషోడశోపచారంబులం గావించి "విష్ణవే" యను దానిచేఁ బాదాదిసర్వాంగపూజం గావించి తన్నామమంత్రంబుచే శంఖ చక్రగదాపద్మాసిధనుర్బాణహలముసలకౌస్తుభవనమాలా శ్రీవత్సపీతాంబరనీలాంబర వంశీవేత్రగరుడాంకతాలాంక రథదారుక సుమతి కుముద కుముదాక్షశ్రీదామాదులను వేఱువేఱుగా నర్చించి విష్వక్సేనవేదవ్యాసదుర్గావినాయకదిక్పాలనవగ్రహంబులను సక్రమంబుగాఁ బూజించి స్థాలీపాకవిధానంబున వీతిహోత్రునిం దృప్తిపఱచి యందు మూలమంత్రంబుచే నిరువదివేలయాహుతులను,ద్వాదశాక్షరిని నెనిమిదివేల యాహుతులను, జతుర్వ్యూహమంత్రంబుచే నెనిమిదివేలయాహుతులను వ్రేల్చి యా యగ్నికిం బ్రదక్షిణంబు లాచరించి నమస్కరించి దివ్యాంబరసువర్ణభూషణ సవత్సగోధనంబు లాచార్యునకు సమర్పించి భోజనదక్షిణాదులచే బ్రాహ్మణులకుఁ దుష్టి గూర్చి నాగరులనుసైతము భోజనాద్యుపచారంబులచే గౌరవింపవలయు. ఇట్లీవటలంబు నియమంబుగా నడపు జనుం డిహాముత్రఫలసిద్ధులం బొందుఁగాదె. వెండియు వేదవ్యాసకృతంబగు తత్స్తోత్రంబు వివరించెద వినుముని యిట్లనియె.

సీ॥ దేవాదిదేవాయ ♦ రేవతీరమణాయ, సంకర్షణాయ ర ♦ సాధరాయ
శేషాయ పూర్ణాయ ♦ సీరహస్తాయ సహస్రాననాయ మ ♦ హాబలాయ
రోహిణీపుత్రాయ ♦ మోహనాకారాయ, యబ్జనేత్రాయ కృ ♦ ష్ణాగ్రజాయ
నీలవస్త్రధరాయ ♦ తాలాంకరుచిరాయ, కటివరపట్టణ ♦ కర్షకాయ
తే॥ కూటముష్టికకుంభాండ ♦ కూపకర్ణ, బిల్వలాసురధేనుక ♦ ద్వివిద రుక్మి
కంససోదరతతినాశ ♦ కాయ దివిజ,మానితాయ శూరాయ న ♦ మోనమోస్తు.

మ॥ యమునాభేదన ! కామపాల ! ముసలీ ! ♦ యాభీరవామాంగనా
రమణా ! గోకులమండనా ! కురుధరా ♦ రాజన్యశిక్షాగురూ
త్తమ ! నానావరతీర్థపర్యటనస ♦ క్తా ! భక్తచింతామణీ !
యమునోదారమనీష ! ప్రముక్కదను రా ♦ మా ! నన్నురక్షింపుమా ! ౧౧౮

క॥ మునిఫణిసురవరసన్నుత!, యనఘా ! బలభద్ర ! నీకు ♦ నభివాదనముల్
బొనరించెదఁ గైకొనుమీ,కనికరమున నన్ను గనుచుఁ ♦ గావు మనంతా ! ౧౧౯

తే॥ ఇద్ది నుతి యిఁకఁ గవచంబు ♦ నీవు వినుమ!,జనుఁడు నీరాడిక్షౌమవ ♦ స్త్రములఁగట్టి
దర్భబృసినొప్పికుశపవి ♦ త్రంబుఁ బెట్టి,శిరమునందా మంత్రమునఁ బ్రో ♦ క్షించుకొనియు.

ఆ॥ మనమునందు నతని ♦ మఱిమఱిఁ దలఁచుచు, వందనములఁ జేసి ♦ పాపహరము
క్షేమకరమునైన ♦ శ్రీబలకవచంబు, నిటు ధరింపవలయు ♦ నిభపురీంద్ర ! ౧౨౦

సీ॥ బ్రహ్మాండవిభుఁడును ♦ బరమేశుఁడునగు గో,లోకనాథుఁడు నన్ను ♦ సాఁకుగాత
సేనాచయంబులఁ ♦ సీరి రక్షించుత, హలి యుద్ధమునగల్పు ♦ సలుపుఁగాత

మునలి దుర్గంబులఁ ♦ బ్రోచుత వనములఁ, సంకర్షణుఁడు నన్ను ♦ సాకుఁగాత
యమునావిభేదనుం ♦ డప్పులఁ బ్రోచుతఁ, గాలాంబరుం డగ్నిఁ ♦ గాచుఁగాత
తే॥ ననిలమందు రాముండు గా ♦ పాడుఁగాత, బలుఁడు నింగిని బ్రోవుత ♦ వారిధుల న
నంతుఁడును రక్షసేయుత ♦ నగములందు, వాసుదేవుఁడు బ్రోచుతఁ ♦ బ్రత్యహమును.
సీ॥ పాదమున సహస్ర ♦ వదనుఁడు బ్రోచుతఁ, గామపాలుఁడు వేరఁ ♦ గాచుఁగాత
గామమునఁ దేను ♦ కామిత్రుఁ డోముతఁ, గలనున ద్వివిదారి ♦ గాచుఁగాత
బిల్వలారియు నాసఁ ♦ బ్రీతినిం బ్రోచుత, గద రౌహిణేయుఁడుఁ ♦ గాచుఁగాత
మోహమునఁ జరా ♦ పుత్రారి బ్రోచుత, నుదయాన వృష్ణీంద్రుఁ ♦ డోముఁగాత
తే॥ ప్రాహ్ణమున మధురాపతి ♦ రక్షసేయుఁ, గాత మధ్యాహ్నమున గోప ♦ కసఖుఁడోము
తఁ స్వరాట్టపరాహ్ణన ♦ దయను బ్రోచుఁ, గాత ఫణిపతి సాయానఁ ♦ గాచుఁగాత.
ఆ॥ క్షపఁ బరాత్పరుండు ♦ గాచుత నర్ధరాత్రమునఁ గల్యమున దు ♦ రంతబలుఁడు
గాచుఁగాత నాల్గు ♦ కడలఁ బ్రలంబారి, గాచుఁగాత నన్నుఁ ♦ గరుణతోడ. ౧౨౭
తే॥ నాల్గువిదిశలఁ రేవతీ ♦ నాథుఁ డోముఁ
గాత యాదవేంద్రుఁడు క్రిందఁ ♦ గాచుఁగాత
నూర్ధ్వమున బలభద్రుండు ♦ నోముగాత
నెల్లయెడలఁ బూర్ణుండు ర ♦ క్షించుగాత. ౧౨౮
క॥ కురుధరణీరమణా! యిది, సురనరదైతేయభీతి ♦ శోకహారంబుఁ
దురితేంధనతతివైశ్వానరమగు బలకవచమాచు ♦ నమ్ము మనంగన్. ౧౨౯
తే॥ కౌరవేశ్వరుఁ డిట్లన ♦ ధీరవర్య!, యట్టి పంచాంగమందున ♦ నైదవదిగ
దగుసహస్రనామంబుల ♦ దయను నాకుఁ, జెప్పుమనఁ బ్రాడ్వివాకుండు ♦ సెప్పె నిట్లు.

వ॥ ఈసహస్రనామస్తోత్రమహామంత్రంబునకు గర్గాచార్యుండు ఋషిగను, ననుష్టుభంబు ఛందంబుగను సంకర్షణపరమాత్మ దేవతగను, బలభద్రుండు బీజంబుగను, రేవతి శక్తిగను, ననంతుండు కీలకంబుగను నొప్పు. ఇది ముందుగా "స్ఫురదమలకిరీట" మ్మను శ్లోకంబుతో ధ్యానించి "బలభద్రయను" నామంబు మొదలుకొని "శుభాస్పద" యను నామంబువఱకుం గల వెయ్యింటిని జపింపం దగు. ఈ స్తవంబు నూరుమాఱులు జదివినవాఁడు విద్యావంతుండగు. నిత్యంబును బఠించువాఁ డాయుశ్శ్రీయశోబలంబులను జక్కఁగాఁ బొందు. గంగాతీరంబుననో దేవాలయంబుననో వెయ్యిమాఱు లిది పారాయణంబు గావించిన జగన్నుతబలిష్ఠుండగు. పుత్రార్థి పుత్రవంతుండగు. రోగి నిరోగియగు. బద్ధుండు విముక్తుండగు. ధనార్థి ధనవంతుండగు. దీనిని యథావిధిగాఁ బురశ్చరణంబు గావించి పదివేల మాఱులు జపించి స్వర్ణతర్పణగోదానంబులను సల్పి బ్రాహ్మణసంతర్పణంబులు [illegible] మండలేశ్వరపూజలం బొందుచు

నలంకృతంబగు మత్తేభంబు బహిర్ద్వారంబు నలంకరింప నఖిలైశ్వర్యంబులతో నొప్పారుచుండు. నిష్కారణంబుగా కేవలరేవతీపతిప్రీతికొఱకు దీనిం బఠించిన వాఁడు మేరుసమాననిజాఘౌఘంబుల దూరీకరించి సర్వసుఖంబుల ననుభవించి యంతిమంబున గోలోకంబు జేరంగలండని వచింప దుర్యోధనుండు పరమానంద భరితుండై నిజగురువరునకు విధివిధానంబుగా నర్చింపఁ బ్రాడ్వివాకుం డాశీర్వదించి యతని వీడ్కొని నిజాశ్రమంబున కేగె. ౧౨౯

ఆ। ఇలను నెవ్వఁడిట్టి♦బలభద్రఖండంబు, వినును వాఁడు సర్వ♦వృజినములను
దక్షణమున విడిచి ♦ ధర్మార్థకామమోక్షములఁ బొందఁగలఁడు ♦ జనకరాజ!

ఉ। మేరుసమానధీర! మణి ♦ మిశ్రితకాంచనభూషణాంచితా
కార! సుపర్వవైరికుల ♦ ఖండనవీర! మహాసముద్రగం
భీర! యఘౌఘదూర! వన ♦ బృందవిహార! పరా! పయోధృతా
హార! స్వభక్తదుఃఖహరి ♦ హార! రమారమణీమనోహరా! ౧౩౦

కాంతివృత్తము.

దేవాదిజనావన ♦ దివ్యకరా!, గోవర్ధననాయక ♦ గోత్రధరా!
శ్రీవత్సమనోహర ♦ సిద్ధికరా!, గోవిష్టపభాసుర ♦ గోపవరా! ౧౩౧

గద్యము:- ఇది శ్రీమత్పరమపవిత్రాపస్తంబసూత్ర, భారద్వాజసగోత్ర, చివుకుల
కులజలధికళానిధి, కోటయామాత్యతనయ, లక్ష్మీదేవి
సుబ్రహ్మణ్యదత్తపుత్ర, శ్రీకృష్ణప్రసాదాసాదితకవిత్వ
నిశ్చయ, సుజనవిధేయ, శ్రీనివాసాపరనామధే
యాప్పయశాస్త్రిచే నాంధ్రీకృతంబైన
శ్రీగర్గభాగవతం బందలి
బలభద్రఖండము
సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ
హరిః ఓం తత్సత్
శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీ కృష్ణపరబ్రహ్మణే నమః

శ్రీ గర్గ భాగవతము.

విజ్ఞాన ఖండము.



స్వకభక్తసౌఖ్యకర్తా !
సకలబ్రహ్మాండభర్త ! సర్గోద్ధర్తా !
శకునిముఖాసురహర్తా !
ప్రకటీకృతవిశ్వమూర్తి ! రాధాకృష్ణా ! ౧

వ॥ అనవుడు బహుళాశ్వుండు నారదమహర్షి కిట్లనియె. ౨

తే॥ అమరమునివర ! యెట్టిమార్గమున నేను, కృష్ణభక్తుఁడనగుదునో యెఱుఁగఁబలుక
వేఁడుచుంటిని నావుడు విబుధమౌని, పార్థివేంద్రున కిట్లు చెప్పందొడంగె. ౩

క॥ జనకా ! మును వ్యాసముఖంబున వినిన సుభక్తిమార్గమును జెప్పెద నా
ఘనపంథను శ్రీకృష్ణుఁడు గనుఁగొని కోరికలఁదీర్చు మైథిలనాథా ! ౪

చ॥ సరసిజనేత్రుఁడైన హరి సంద్రమునందు భుజాబలంబునన్
బరుసని శంఖునిఁ గెలిచి ద్వాదశయోజనవిస్తృతంబుతో
వఱలెడి ద్వారకాపురము పారకళావిభవంబు లొప్పను
ద్ధరణ మొనర్చెఁగా యట సుధర్మమహాసభ యొందు రాజిలున్. ౫

వ్యాసుం డుగ్రసేను దరి కరుదెంచుట.

సీ॥ వైడూర్యములతోడ భాసిలుకంబముల్, బద్మరాగంబుల వఱలు ధరణి
విద్రుమంబులచేత వెలుఁగుసోపానముల్, బచ్చలఁదగు బహిర్ద్వారములును

కాలమేఘపటలికల్పి ♦ తాళ భాసురములై, కుదిరికగానున్న ♦ కుడ్యములును
ముక్తావితానముల్ ♦ మొనయు పొన్నడ్డియుల్, శ్రీకరానేకప ద్వా ♦ రములు

తే॥ సఖలసుమఫలసహితంబు ♦ లైన ద్రుమావళి, సర్వతోభద్రనందన ♦ చైత్రరథవ
నములు గంధర్వవిద్యాధ ♦ రమహిళాళి, దంబకంబా సుధర్మను ♦ దనరుచుండు.

తే॥ అద్ది దశయోజనాయతం ♦ బైదుయోజ, నములమెత్తును గల్గి యొ ♦ క్కములఁ బొంది
తనుఁ బ్రవేశించువారి బృం ♦ దారకేంద్ర, సమఘనతనొప్పునట్టుల ♦ సలుపుచుండు.

ఆ॥ అందుఁ జేరునట్టి ♦ యనఘునకుఁ మూఁడు, జగములందునున్న ♦ చాతురిదగు
నెవ్వఁడందునుండు ♦ నెందాఁక నందాఁక. నూర్మిమట్ట మతిని ♦ నొందలేదు.

తే॥ అందునొక్కమూలకు నేఁబ ♦ దాఱుకోట్ల, యాదవులు సరిపోయి ర ♦ త్యద్భుతముగ
సానుచరుఁడగు శ్రీకృష్ణుఁ ♦ డంతనొప్పె, నతనివర్ణింపనేరికి ♦ నలవియగునె ? ౯

చ॥ ఒకతఱి నామహాసభ యు ♦ దూద్వహులందఱు సుట్టి కొల్వఁగా
సుకముగ వందిమాగధులు ♦ సూతుఁడు సన్నుతిసేయ యాదవ
ప్రకరవుఁ డుగ్రసేనుఁడు ది ♦ వంబున వచ్చెడి వ్యాసుఁ గాంచి కౌ
తుకమున గద్దె డిగ్గి విన ♦ తుల్ బొనరించి సపర్య సల్పియుఁ. ౧౦

తే॥ మంచి సింహాసనంబు న ♦ ర్పించి మౌనివర్య ! మజ్జన్మమందిర ♦ వంశదాన
యజ్ఞపట్టణప్రాభవా ♦ ద్యఖిలవిధులు, సఫలమయ్యె మీరాక నీ ♦ సమయమందు.

క॥ అనఘ ! సదానందమయుల, యిన మీక్షేమంబుఁగూర్చి ♦ పృచ్ఛించుటకుఁ
బనిగొనఁజాలని నాకీ, రనుకంప వచించి యేదొ ♦ హాయిని నిడుమా. ౧౨

క॥ ఎచ్చట నెచ్చటఁ ద్వాదృశ, సచ్చరితులు దిరుగుచుంద్రొ ♦ సకలమునీంద్రా !
యచ్చట నచ్చట సిహపర, ముచ్చయసంసిద్ధి గలుగు ♦ భూజనములకుఁ. ౧౩

తే॥ మఱియు మీబోఁటి వారెందుఁ ♦ గరుణ నొక్క
క్షణము నిలుతురో యందు నా ♦ జలజనాభుఁ
డొప్పునని చెప్ప నితరసౌ ♦ ఖ్యోత్కరంబు
వెలఁగిటిరునటం చేను ♦ సెప్పవలెనె ? ౧౪

చ॥ పరమమునీంద్ర ! సర్వవిభ ♦ వంబులతోడ వెలుంగు ద్వారకా
పురమిపుడేలు భాగ్యమును ♦ బొందుట కాదిని నే సవాదులఁ
సరిగనొనర్చియుంటినొకొ ? ♦ సత్యవతీసుత ! త్వాదృశుల్ ధరా
మరులు మదాలయంబునకు ♦ మాటికి వత్తురదేమిపుణ్యమో ! ౧౫

తే॥ ఇవ్వి నాకు లభించుట ♦ కేమహాసు, కృతములొనరించియుంటినో ♦ యెఱుఁగనైతి
గావునఁ బరావరవిద ♦ గ్రగణులు మీరు, దెలియఁజేయ వేఁడితిని బృ ♦ ధ్వీసురేంద్ర !

వ॥ అనవుడు వేదవ్యాసుం డుగ్రసేనా ! నీవు ధన్యుండవు. నీప్రశ్నంబు నాక
భిమతంబయ్యె. పూర్వజన్మంబునం దీవు మరుతుండను క్షత్రియుండవై నిష్కార

ణంబుగా విష్ణుప్రీతికొఱకు విశ్వజిద్యాగంబు మహావైభవంబుగా నొనర్చితివి. అద్దా
నికి మెచ్చి శ్రీకృష్ణుం డప్పుడు నీకుఁ బ్రసన్నుండయ్యె. భక్తవత్సలుండగు భగవం
తుండు భజించుభక్తులకు ముక్తి నొసంగునుగాదె. తత్సుకృతబలంబుననే యీజన్మం
బున నసంఖ్యకోటిబ్రహ్మాండవిభుండును గోలోకేశ్వరుండును బరాత్పరుండును
బరిపూర్ణతమావతారుండు నగు శ్రీకృష్ణుండు ముక్తి నొసంగ వచ్చి నీకు వశుండై
నీయింట వెలుంగుచున్నవాఁడు నీభక్తియోగం బనితరసాధ్యంబని యెఱుంగుమన
నాతండు మిక్కిలి సంతోషించి నమస్కరించి క్రమ్మఱ నమ్మహాముని నిట్లడిగె.

లోకకర్మగతి నిరూపణము.

తే. కారణంబులతోఁగూడ ♦ కర్మములకు, నెట్టిగతిగల్గు? లక్షణం ♦ బేది వాని
కొప్పు? వాని భేదములెన్ని ♦ యున్న? విప్పి, పలికి నాసంశయంబును ♦ బాపు మార్య!

క. అనవుడు వ్యాసుం డిట్లను, నని సత్వరజస్తమోగు ♦ ణాచరితకృతుల్
సనిమిత్తంబులు మది ఫల, మునుగోరకచేయు కృతులొ ♦ మూలరహితముల్.

తే. అందు సనిమిత్తకర్మంబు ♦ లఖిలబంధ, నముల నిడు నిర్నిమిత్తక ♦ ర్మములు మోక్ష
మిచ్చుఁ ద్రిగుణములు ప్ర ♦ కృతిభవములు, దన్మయం బీజగంబని ♦ తమి నెఱుఁగుము.

తే. నీరజాక్షుఁడీజగమందు ♦ నిండె దివికి, సాత్వికులు పోవగలరు రాజ ♦ సులును మనుజ
ధరకుఁ జనెదరు తామసుల్ ♦ నరకమునకుఁ, జనఁగలరు నిర్గుణుల్ హరిఁ ♦ జనెద రాస్థ

సీ. పంచాగ్నితప్తులౌ ♦ పరమమునీంద్రులు, సప్తర్షిలోకంబుఁ ♦ జనుచునుంద్రు
దండత్రయంబును ♦ దాల్చిన సంయముల్, సత్యలోకంబును ♦ జనుచునుందు
రష్టాంగయోగంబు ♦ లాచరించినయతుల్, జనలోకమునకును ♦ జనుచునుంద్రు
యజ్ఞముల్ సల్పిన ♦ ప్రాజ్ఞవరేణ్యులు, శక్రలోకంబును ♦ జనుచునుంద్రు

తే. దాత వోవును జంద్రమ ♦ స్థానమునకు, వ్రతియు నేగును భాస్కర ♦ పదమునకును
సత్యసంధుండు వారుణ ♦ జగముఁ బొందు, క్షేత్రయాయు లగ్నిపదంబుఁ ♦ జెందు మఱియు.

క. పితరుల సర్వవిధంబులఁ, బ్రతిదినమును బూజసేయు ♦ ప్రజ యట్టి త్విషాం
పతిదక్షిణపథమున జని, పితృలోకముఁ జేరఁగలదు ♦ విభవయుతంబై. ౧౩

ఆ. విష్ణుపూజకుండు ♦ విష్ణుపదంబొందు, సాంబభక్తుఁడొందు ♦ శైవపదము
పరమభక్తితోడఁ ♦ బంచాయతనపూజ, సలుపు స్మార్తుఁడరుగు ♦ స్వర్గమునకు. ౧౪

తే. మఱియు బ్రహ్మను బూజించు ♦ మానవుండు
దక్షముఖపితామహుల ప ♦ దంబుఁ బొందు
యక్షరాడ్భక్తుఁ డొందును ♦ యక్షపదము
భూతపతిభక్తుఁడొందును ♦ భూతపదము. ౧౫

క. మఱియొకఁడే సురఁగొలుచును, గరముగ నాతండు తజ్జ ♦ గంబును బొందున్
దురితనిరతులగు కుమతులు, నరకమునన్ నొచ్చుచుంద్రు ♦ న్యాయవిచారా!

తే॥ ఎల్లవారలు బొందెడి ♦ నెల్లలోకములు ననిత్యంబులని నీవు ♦ దలఁపుమయ్య!
యిట్టి బ్రహ్మాదిలోకంబు ♦ లేగుచుండు, వచ్చుచుండును బలుమారుఁ ♦ బార్థివేంద్ర!
తే॥ శాశ్వతంబులుగాని యా ♦ స్వర్గసుఖజగములను వారలు స్వసుకృత ♦ ములుం నశించి
న త్రుటి గ్రమ్మఱఁ గ్రిందికి ♦ నవయుచేగు, దెంచఁగలరని నీవు గు ♦ ర్తెఱుఁగు మధిప!
క॥ కావునఁ బ్రతికర్మంబును, శ్రీవిష్ణుప్రీతికొఱకుఁ ♦ జేయఁగవలయున్
భూవర! తత్కృతిఫలమును, భావమునను గోరవలదు ♦ ప్రతిమనుజుండున్.
తే॥ ఫలరహితుఁడగు భక్తుఁడై ♦ పరమహంస
సేవితం బభయమునగు ♦ శ్రీహరిపద
ములను జ్ఞానవైరాగ్యసం ♦ కలితమతినిఁ
బ్రీతిలక్షణవాణితో ♦ వేఁడవలయు. ౩౦
ఆ॥ అల్లభక్తవర్యుఁ ♦ డెల్లలోకంబులఁ, బ్రసభముగ క్షణమునఁ ♦ బాడుఁజేయు
మృత్యువేగి యెందు ♦ మిత్తినిబొందునో, యట్టి గోజగమున ♦ కరుగఁగలఁడు.
క॥ అనవుడు యదువిభుఁ డిట్లనె, మునివర! బ్రహ్మాదిలోక ♦ ములు పునరావ
ర్తనముఁగల వంచు మీముఖమున వినుట విరక్తి నాకుఁ ♦ బుట్టెనుజుమ్మీ! ౩౧
క॥ మఱియును గోలోకంబును, బరమంబు ననశ్వరంబు ♦ బద్మాక్షునిమం
దిరమని యెఱిఁగితి నది యెటవఱలునో? కరుణించి చెపుమ! ♦ యన నా మునియున్.
సీ॥ మా॥ ఏ మహావిష్టప ♦ మెల్లబ్రహ్మాండంబులకు బహిస్స్థలినిఁ జె ♦ లంగుచుండు
యే జగతికి రాధి ♦ కేశ్వరుఁడైన శ్రీకృష్ణచంద్రుండు వ ♦ సించుచుండు
నే భువనంబునఁ ♦ గృష్ణతేజోభవ, పార్షదుల్ వినతులై ♦ పరగుచుండు
రేదికామమదకో ♦ పాదులేమాత్రముఁ, జొరనీక దీప్తితో ♦ వఱలుచుండు
యేది జరామర ♦ ణాదిశూన్యంబయి, భక్తనిక్షేపమై ♦ ప్రబలుచుండు
నెందు నేదైనను ♦ నేగి మరలిరాక, యానంద మొప్పంగ ♦ నధివసించు
నేది వేదాదుల ♦ కిట్టి దట్టిదియని, పలుకగా లవమేనిఁ ♦ దెలియఁబడదొ
నే జగమందున ♦ నినచంద్రవహ్నులు, నెంతమాత్రము ప్రకా ♦ శింపలేరొ
తే॥ నద్ది శ్రీకర మిది నార ♦ దేష్టతమము, నెందుఁ బ్రకృతిగుణంబులు ♦ నెఱుఁగఁబడవొ
యేది బ్రహ్మర్షి రాజర్షి ♦ కృష్ణభక్తలోకసన్నుత మద్ది గో ♦ లోక మనఘ! ౩౪
వ॥ అందుఁ బంచాశత్కోటియోజనవిస్తృతంబును, శతకోటియోజనవిలంబితంబునునై చరాచరంబులతోఁ గూడిన యీ బ్రహ్మాండంబు పరమాణువుగాఁ గనుపడుచుండు. ఇట్టి వనేకబ్రహ్మాండంబు లొప్పారు. నిష్కారణంబగు భక్తినిఁ బ్రేమలక్షణవాక్యంబులతో నా పరాత్పరుం గొలుచు భక్తుండా మహాలోకంబుఁ బొంది మరలిరాక సుఖించుచుండు నని చెప్ప నుగ్రసేనుం డలరి బాదరాయణున కిట్లనియె. ౩౫

నిర్గుణభక్తియోగవర్ణనము.

ఆ॥ భక్తియోగ మెన్ని ♦ భంగులనున్నదో, దేనిచేత దేవ ♦ దేవుఁడైన
కృష్ణుఁ డలరి గోచ♦రించునో కనులకు?, నద్ది సెపుమ నాకు♦ ననఘచరిత! ౩౬

చ॥ అనవుడు వ్యాసుఁ డిట్లనియె ♦ హర్షము నాకు ఘటిల్లె నిప్డు నీ
మనము ప్రశంసనీయము సు♦మా యది పాపహరంబు గావునన్
వినుమల భక్తియోగము ద్వి♦భేదములన్ సగుణంబు నిర్గుణం
బనియు వచింపఁగాఁ జెలఁగు♦ నంచు నెఱుంగుమ! యాదవేశ్వరా! ౩౭

ఆ॥ అందు సగుణభక్తి ♦ నైకలక్షణముల, వఱలు నిర్గుణమగు ♦ భక్తి యేక
లక్షణంబుతోఁ జె♦లంగును ద్వారకా,నగరతిలకపాల♦నప్రధాన! ౩౮

ఆ॥ బహువిధయుతసగుణ ♦ భక్తి గుణంబులఁ, ద్రివిధభక్తులగుదు ♦ రవితథవిధి
నట్టి భక్తవరుల ♦ నానుపూర్విగ నీకుఁ, జెప్పుచుంటి వినుమ!♦ తప్పకుండ. ౩౯

సీ॥ దుర్దంభమత్సర ♦ క్రూరదృష్టుల హరిన్, దలఁచెడివారలు ♦ తామసులని
యాయురైశ్వర్యాదు♦లభిలషించుచు హరిన్, బ్రార్థించువారలు♦ రాజసులని
సమభావకృతినాశ♦సాయుజ్యముల్ గోరి, శౌరి వేఁడెడువారు♦ సాత్త్వికులని
తెలిసికొనుమ! యింక ♦ దెలివిని జిజ్ఞాసఁ, బీడను నర్థి నా ♦ విష్ణుమూర్తి

తే॥ వేఁడుదురనియు నెఱుఁగుమ!♦ వెండి యీవు, నిర్గుణంబగు భక్తిని♦ నెగడు లక్ష
ణము వచించెద సావధా♦నముగ వినుమ, ద్వారకాపాల! శ్రీకృష్ణ♦ భక్తలోల!

చ॥ జలనిధిలోనఁ జేరి యని ♦ శంబును బాఱెడి గంగకైవడిన్
ఫలరహితం బఖండము న ♦ పారము హేతువిహీనమౌచు ని
మ్ముల నది యీశ్వరుండు పరి ♦ పూర్ణతముండగు కృష్ణుఁ జేరుచున్
నిలుచునొ యా మనోగతియ ♦ నిర్గుణభక్తియటం చెఱుంగుమా! ౪౧

క॥ మఱియును నిర్గుణభక్తుల, సరణిని వివరింతు వారు ♦ స్వర్మాత్పదవిన్
సురవరవిభుతయు నణిమా,ద్యురుభూతుల దేనిఁగోర♦రో యదువర్యా! ౪౨

తే॥ మెచ్చి శ్రీహరి సాలోక్య ♦ మిచ్చినప్పటికిని సత్సంగసమ్మద ♦ ప్రకృతబుద్ధు
లైనవారలు గైకొన♦నభిలషింప, రంచు నీ వెఱుఁగుమ యాద♦వాధినాథ! ౪౩

క॥ ఆమాధవుఁ డాదృతితో, సామీప్యంబిడినఁ "దాము ♦ సన్నిధినున్నన్
బ్రేముడి నిట్టులఁ గనఁడని, యాముకొనరు దానిఁగొనఁగ ♦ నా భక్తవరుల్.

క॥ శ్రీరమణుఁడు దివ్యంబగు, సారూప్యంబిడిన వారు ♦ సములమను నహం
కారమునఁ దాము హరినే, వారతి విడఁగలము"టంచుఁ♦ బట్టరు దానిన్. ౪౫

క॥ ఘనసాయుజ్యంబు లభిం,చినఁ దద్భక్తాళి స్వామి ♦ సేవకభావం
బు నశింపఁ గలదటంచది, మనమునఁ గాంక్షింపఁబోరు♦ మానవనాథా! ౪౬

క॥ ధీరులు నిరపేక్షులు ని,ర్వైరులు సమదర్శులైన ♦ భక్తులు ముక్తిన్
[illegible] లోకపద గహ,కారణులై చెలఁగఁగలరు ♦ కౌంతిని భూపా! ౪౭

తే॥ నైరపేక్ష్యమహానంద ♦ నవ్యపదము, గాంతు రేని తద్భక్తులు ♦ గాక యొరులు
గాంచఁగలరొక్కొ ♦ సుమసమా ♦ కర్ణినాస, గాక లోచనయుగ్మంబు ♦ గాంచఁగలదె?

క॥ రసమును జేసెడి హస్తము, రసరుచి గుత్తెఱుఁగనట్లు ♦ ప్రథితసకాముల్
నసిగ నిరపేక్ష ముదమును, నిసుమంతయు నెఱుఁగలేరు ♦ పృథ్వీనాథా! ౪౯

ఆ॥ అల్లభక్తియోగ ♦ మాత్యంతికపదంబ, టంచుఁ దెలియుమింక ♦ నద్ది నవవి
ధంబులుగఁ జెలంగు ♦ దానిని నుడివెద, శ్రద్ధతోడ వినుము! ♦ సత్యశీల! ౫౦

తే॥ స్మరణకీర్తనశ్రవణస ♦ చ్చరణసేవ, నార్చన వినతిస్నేహదా ♦ స్యాత్మదాన
ము లన నవిసెల్లు నీభక్తిఁ ♦ గలుగువాఁడు, ధాత్రిలో దుర్లభుఁడుగాఁడె? ♦ దలఁచిచూడ.

భక్తమాహాత్మ్యము.

ఉ॥ యాదవనాథ! యీ నవవి ♦ ధాత్మకభక్తిని గన్నవారు ప్ర
హ్లాదశుకుల్ బరీక్షితుఁడు ♦ నబ్ధిజయుఁ బృథునామధేయస
మ్మోదియు గాందినీసుతుఁ డ ♦ మోఘబలానిలసూతి పార్థుఁడుఁ
యాదవవర్యుఁడుద్ధవుఁడు ♦ నట్టిబలిప్రభుఁడా వ్రజాంగనల్ ౫౧

తే॥ అంచుఁదోఁచెడి నుగ్రసే ♦ నా! యెవండు, విబుధవరులచే సత్కథ ♦ వినెడికోర్కె
సములతో మైత్రి హీనులఁ ♦ సత్కరుణయు, గలిగిచెలఁగునో యవ్వాఁడె ♦ ఘనబుధుండు

మ॥ మఱి యెవ్వాఁడు చతుర్భుజాంఘ్రియుగప ♦ ద్మభృంగమో యెవ్వఁడా
హరిసందర్శనలాలసుండో యెవఁడా ♦ యంభోజనేత్రుఁ మనో
హరునిం బ్రోషితభర్తృకావిధముగా ♦ హాళిఁ నిరీక్షించు నా
నరుఁడే భాగవతాగ్రగణ్యుఁడగు భూ ♦ నాథా! ప్రశంసార్హుఁడై. ౫౨

తే॥ ఎవఁడు "హరి! రామ! గోవింద ♦ కృష్ణ"యంచుఁ, బులకరింపదేహంబుగ ♦ న్నులను సమ్మ
దాశ్రులొలుక మధురవాణి ♦ హరిని సతము, దలఁచు నతఁడు భక్తశ్రేష్ఠుఁ ♦ డలఘుచరిత!

వ॥ అట్టి భక్తవరేణ్యులు భూనభస్థ్సలానిలానలసలిలజ్యోతిర్గణంబులందు నా శ్రీకృష్ణదేవునిం గాంచుచుందురు. ఆపరాత్పరుండు తన్నుఁ దలంచినప్పుడెల్ల యా భక్తులకుం బ్రసన్నుండగు. ఆసదానందమయుం గాంచి వారొకపరి నానందంబుతో హసింతురు. ఒకమా ఱుగ్గడింతురు. మఱియొకతడవ నగ్గింతురు. ఒకసారిఁ బరుగిడుదురు. ఒకతఱుణంబున నాడుదురు. మఱొకతఱిం బాడుదురు. వెండియు నొకసమయంబున మిన్నకుందురు. ఇట్లు నానావిధంబులుగా వార లభినందించుచుందురు. కాలయములుసైత మవ్వారిని దండింపలేరు. కౌమోదకీగద యెడమదెసను, సుదర్శనచక్రంబు కుడివైపునను ముందు శార్ఙ్గంబును వెనుకఁ బాంచజన్యంబును మఱియు నెల్లెడల నందకశతచంద్రాద్యాయుధంబు లొప్పియాభక్తులంగాచు. వారిశిరంబున కాతపంబు దగులకుండఁ బైదెస మహాపద్మం బాచ్ఛాదించియుండు. గరుత్మంతుండు నిజపక్షానిలంబున, దచ్ఛ్రమస్వేదం బార్చు. ఈభక్తు లేయేప్రదేశంబుల కరుగఁదలంతురో

గమనించి యాహరి ముందుగాఁ బోయి నిజపదపద్మరజంబులచే నాచోటులం బవిత్రీకరించు. వీరలున్నయెడ సమస్తతీర్థంబులును గలవు. ఆధివ్యాధు లీభక్తులను దాదవ్వులం గాంచి పరుగిడఁదొడఁగు. వీరికి నదీనదవనవనధిపర్వతాదులు సుఖమార్గంబు లొసంగు. ఈమహాత్ములు నివసించిన ప్రదేశంబున మృతుండైనవాఁడు పాపమూర్తియైనను విష్ణుపదంబు బొందు. ఈవిరక్తభక్తదర్శనంబు పుణ్యహీనులకు దుర్లభంబు. వీరు జనించినకులంబు కల్మషసంకులంబైనను విమలంబగు. ఈ మహామహులు తండ్రివైపునఁ బదుగురను దల్లిదెసఁ బదుగురను, నాలివంకఁ బదుగురను నిరయంబునుండి యుద్ధరించి కృతార్థులం గావింతురు. వీరిపుణ్యవిశేషంబున వారికి సంబంధించిన దాసదాసీమిత్రశత్రుభారవాహగణంబును, గృహపక్షిపిపీలికమశకకీటపతంగంబులును, నబ్రహ్మణ్యంబులగు సౌవీరకీకటదేశంబులు నసంస్కృతంబులగు మ్లేచ్ఛాదిదేశంబులును ధన్యతం గాంచు. తీర్థయాత్రాయజ్ఞసాంఖ్యయోగాదులను గావింపకపోయినను నీభక్తసంగతిం గాంచినవారు ధన్యతములు గాఁగలరని యెఱుఁగుమన నుగ్రసేనుండు విని సంతోషించి క్రమ్మఱ నమ్మునీంద్రున కిట్లనియె. ౫౬

భక్త్యుత్కర్ష వర్ణనము.

తే॥ ఓపరాశరపుత్రకా! యుత్తమహరి, భక్తలభ్యసాయుజ్యంబు పరమశత్రు
వైన దంతవక్త్రునకేవిధానఁ జిక్కెఁ? జెప్పుటకు ప్రొక్కుచుంటిని శిరముతోడ.

చ॥ అనఁగ వసిష్ఠసత్తముఁ డిటు లాడెను యాదవనాథ! నీది నా
దను విషమత్వ మారయఁగు నాన్వితజీవున కౌనుగాని చి
ద్ఘనపరమాత్మ కంటదని గట్టిగ నమ్ముము! యెట్టిరీతినై
నను మన మాపరాత్పరు మనంబునఁ గూర్పఁగ నౌను బూర్తిగాఁ. ౫౮

క॥ భయమునఁ బ్రియముననో యప్రియముననో మనము హరినిఁ బెట్టినవారల్
ప్రియతులగుచుఁ దప్పక తన్మయతను జెందంగగలరు మానవనాథా! ౫౯

క॥ చెలిమిని నందయశోదాదులు వసుదేవప్రభృతియదుప్రాజ్ఞవరే
ణ్యులు కామంబున గోపీజలజాక్షులు వొందిరట్టి జలజాతాక్షున్. ౬౦

తే॥ త్వత్సుతుండగు కంసుండు భయముతోడ, దద్దరిం బొందెఁగిన్కనీదంతవక్త్రుఁ
డట్టిశిశుపాలముఖులు నాయచ్యుతుఁజని, రీరలైక్యంబుచేఁగంటి రారమేశు. ౬౧

తే॥ సౌహృదంబున నిర్జర సంయమియును, నేను తత్ప్రభుఁగంటిమి నిశ్చయముగ
నెట్టిభావంబుచే నైనఁ గృష్ణుపైనిఁ, జిత్తమును నిరంతరమును జేర్పవలయు. ౬౨

సీ॥ ప్రథమదనుజులైన మధుకైటభులుహిర, ణ్యాక్షుండు మఱి హిరణ్యకశిపువును
వత్సాఘ ధేనుక బక కేశి పూతనా, శంఖప్రలంబాది సాల్వముఖులు
లంకాధిపతులు బలాశవరులగు రా, వణకుంభకర్ణులు వైరమునను
బాణవిభీషణ ప్రహ్లాదగుహ్యక, బలిముఖుల్ సత్సహవాసమునను

తే॥ తత్పరేశ్వరాకృతిగుణౌ♦దార్యశౌర్య,ధైర్యమహిమల మనములం♦దలఁచి తలఁచి
యామహాత్ముని ప్రీతినే♦యరమరలును, లేనియట్టులఁ బొందిరో♦మాననీయ!

మ॥ సనకాద్యత్రిపరాశరాసితశుకుల్ ♦ సాంఖ్యాయనుండున్ వసి
ష్ఠనిలింపర్షిబృహస్పతిప్రముఖులా ♦ శౌర్యాంఘ్రిపద్మంబులన్
మనముల్ భృంగముభంగిగా నిలిపి కా ♦ మంబేమియున్ లేకయా
యనిశంబున్ వినుతించుచున్ ధర నటా ♦ ట్యన్ సల్పుచుండ్రాస్థతోన్. ౬౪

చ॥ మఱియును నంబరీషయతి ♦ మైథిలనాథులు నుత్కలాంగులున్
భరతయదుప్రియవ్రతది ♦ వస్పతిపుత్రులు హేతుహీనులై
యఱగొఱ వీడుచున్ బరమ ♦ హంసలఁ బోలి యనారతంబు త
ద్ధరిచరణారవిందసుధ ♦ నానుచు సోలుచుఁ దిర్గుచుండ్రిలన్. ౬౫

ఆ॥ మఱి యహల్య శబరి♦మండోదరీ ద్రుపదసుత లత్రిభార్య♦తార కుంతి
లోను భక్తురాండ్రు♦మాని కామంబును, బరమహంసలవలెఁ♦బ్రబ్ధితలైరి. ౬౬

తే॥ వాలిసుతవాతసుత జాంబ♦వద్గరుడ జ
టాయువు గుహసుదాములు ♦ వాయకుండు
వెండి సుగ్రీవకాకభు ♦ శుండిముఖులు
కృష్ణసంగతి ధన్యత ♦ నెసఁగిరయ్య! ౬౭

ఉ॥ ఆనిఖిలాండనాయకుని ♦ నచ్యుతు నిర్మలభక్తి దక్క యా
దానజపాగ్నిహోత్రసవ ♦ ధర్మతపశ్శ్రుతిపారతీర్థముల్
గాని యమవ్రతాదులును ♦ గాని మహాద్భుతయోగసాంఖ్యముల్
గాని మఱెట్టిగొప్పకృతి ♦ గాని వశంబున నిల్పఁ జాలునే? ౬౮

చ॥ వ్రతసవనక్రియానిగమ ♦ పారయమాదితపస్స్వధర్మక
ర్మతతిసుతీర్థపర్యటన ♦ మంత్రమహాజపయోగసాంఖ్యస
త్కృతులను జేసినంత ఫల ♦ మెంతయు దీనికి నబ్బఁగాని య
వ్వితదమలోరుభక్తిఫల ♦ విస్తృతి నొందఁగఁజాల వెప్పుడున్. ౬౯

ఉ॥ తొమ్మరమణా! తలంప నర ♦ కప్రకరాన్వితకాలపట్టణో
ద్ధారిణి దుఃఖశుజ్మృతిగ ♦ దావృతసంసృతిఘోరసాగరో
త్తారిణి యింద్రియార్జితకృ ♦ తాంతవిహారిణి కృష్ణపాదస
త్కారిణి విశ్వరూపిణిగ ♦ దా! యల నిర్మలభక్తి యెల్లెడన్. ౭౦

చ॥ ప్రవిమలకృష్ణభక్తిలత ♦ ప్రాక్తనసత్కృతులన్ జనించి మా
ధవవరదర్శనాదిరస ♦ ధారల వృద్ధినిఁ బొంది పుణ్యప
ల్లవఫలభారనమ్రత నె ♦ లంగ వసంతుఁడు దివ్యపంచమీ
దివసముఖంబునన్ జగతిఁ ♦ దేజరిలున్ బరమోత్సవంబుతోన్. ౭౧

సీ॥ సమ్మోహకాలాభ్ర ♦ జాలమధ్యస్ఫుర,ద్జ్ఞానసౌదామిని ♦ కరణిఁదనరి
శాస్త్రార్థదర్శనా ♦ క్ష్యంచయపదదీపి,కా ప్రకారంబునఁ ♦ గ్రాలుచుండి
జయరూపకార్తిక ♦ సంస్ఫురద్దీపావ,ళులతోడ సొగసుగా ♦ వెలుఁగఁదొడఁగి
సత్వరజస్తమ ♦ స్సంహారకార్యస,మర్థత నాఖ్య న ♦ న్వర్థపఱచి
తే॥ యొప్పు విజయదశమి యట్టి ♦ యుత్తమహరి
భక్తి విజయంబుఁ జాటుచుఁ ♦ బ్రజల కెపుడు
నుత్సవంబులఁ బొందుచు ♦ నుర్విమీఁద
వెల్గుచుండెను యాదవా ♦ ధీవరేంద్ర ! ౭౨

తే॥ సాంఖ్యయోగదండములు పా ♦ ర్శ్వములఁదగ
గుణవిభేదకీలంబుల ♦ కోటు లొప్ప
భక్తి నవవిధానములు సో ♦ పానములుగ
జెలఁగ గోలోకనిశ్రేణి ♦ వెలుఁగు నధిప ! ౭౩

వ॥ అంత నుగ్రసేనుం డానందంబు బొంది వ్యాసమునీంద్రున కిట్లనియె. ౭౪

క॥ కర్మరతవరుఁడగు గృహియే, ధర్మమునన్ జేయవలెనొ ♦ తద్ధరిసేవన్ ?
నిర్మలభక్తిరహితుఁ డా,ధర్మాత్ముని హరిని నెట్లు ♦ దర్శించునొకో ? ౭౫

తే॥ వ్యాస ! నిజభక్తి యభివృద్ధి ♦ పడనియపుడు
మనుజుఁ డేమిసేయఁగవలె ♦ మాధవుఁ డల
వారి నెట్లు ప్రసన్నుఁడై ♦ వరము లిచ్చి
ధన్యులుగఁ జేయునో నాకు ♦ దయను జెపుమ ! ౭౬

హరిమందిర ప్రతిష్ఠావర్ణనము.

ఉ॥ అనవుడు వ్యాసుఁ డిట్లనియె ♦ యాదవనాయక ! లోకమందునన్
జనులకు నెప్డు సత్పురుష ♦ సంగతి భక్తి జనించు దానిచే
తన యల భక్తి వృద్ధియగుఁ ♦ దప్పదు నీకిఁకఁ గర్మ సేయఁగా
ననువగు కృష్ణసేవ పలు ♦ కాడెద శ్రద్ధగ నాలకింపుమా ! ౭౭

ఉ॥ నరుఁ డతిజాగరూకతను ♦ నవ్యచరిత్రుఁడు సాధుమిత్రుఁడున్
సరసిజలోచనాంఘ్రియుగ ♦ సన్నుతితత్పరుఁడున్ గులీనుఁడౌ
గురుని నొనర్పనౌఁ దొలుతఁ ♦ గొంకినచోఁ దనపుణ్యమేగు ని
ర్గురుఁడగువాని యాననము ♦ రూఢిఁ గనం దగ దేరి కెప్పుడున్. ౭౮

వ॥ అట్టి సద్గురునివలన విష్ణుసేవావిధిఁ దెలిసికొని విష్ణుదీక్షాపరాయణుండై
సభామండపాంగణచతుశ్శాలజాలకజలయంత్రాదిభాసురంబగు హరిమందిరంబు
నుత్తరాభిముఖంబుగా నిర్మించి తోరణంబులను గలువడంబులను జిత్రవిచిత్రంబు
లగు యవనికలం గట్టి యందుఁ బీఠకుంభసహితంబగు నున్నతసింహాసనంబు నమర్చి

దానికి సచ్చిదానందనామంబును సోపానత్రయంబుగాఁ గూర్చి యమూల్యంబులగు పట్టుపుట్టంబులచేఁ దళతళలాడునదియు నలుగడలఁ దలగడలు గలిగినదియు గోమలంబైనదియు నగు నొండాసనంబు తత్సింహాసనసమంబుగా నేర్పరుపవలయు. తత్ప్రాంగణమధ్యమంబునఁ దులసీమందిరంబుఁ గట్టవలయు. తద్ధరిమందిరబహిర్ద్వారంబున భద్రేభద్వయంబును సింహద్వయంబును గూర్చుండినట్లుగా లిఖింపందగు. తత్సువర్ణశిఖరంబున కెగువను దిగువను జక్రంబును ద్వారంబునందు హరి నామంబులను గుడ్యుభయపార్శ్వంబులందు శంఖపద్మశార్ఙ్గగదలను నామందిరంబునకు దాపలఁ దూణీరంబును గుడివైపున బాణంబులను వెనుక నందకశతచంద్ర హలముసలాయుధంబులను తత్సింహాసనపృష్ఠభాగంబున గోపికాగోమండలంబులను దదారోహణంబులను గోపకులను గవాటంబున జయవిజయులను దేహళిని గల్పతరువును స్తంభంబులందుఁ గల్పలతలును మఱియు గోడలయందు వీలయినచోటుల నెల్ల గంగాయమునాపులినబృందావనగోవర్ధనగోపికావస్త్రాపహరణ చిత్రకూట పంచవటీపరిత్యక్తజానకీహరణరామరావణయుద్ధ దశావతారచిత్ర నరనారాయణాశ్రమ పురసత్తక గ్రామత్ర యారణ్యానవకోషరనవకంబులను జిత్రతరంబుగాఁ జిత్రింపవలయు. ఇట్టి సుందరమందిరంబునందు ౭౯

క. మురళీధరు వక్రీకృత, వరదక్షిణచరణుఁ గృష్ణుఁ ♦ బరముని నిజస
ద్గురుహస్తంబున శ్రుతిహిత, సరణిఁ బ్రతిష్ఠింపఁజేయుఁ ♦ జను మేధావీ! ౮౦

ఉ. పిమ్మట నెజ్జ నిల్పినత్రి ♦ విక్రమసుందరవిగ్రహంబు దాఁ
గ్రమ్మఱ నిల్పి భక్తిమెయి ♦ ఘ్రాణము తత్తులసీదళంబులం
దమ్మధువైరి దివ్యచరి ♦ తాళి వినన్ జెవులా హరిప్రసా
దమ్మున జిహ్వ యొప్ప సత ♦ తంబును సేవలఁ జేయఁగాఁ దగున్. ౮౧

తే. అట్లు సేవించువాఁడుభ ♦ క్తాగ్రగణ్యుఁ, డని యెఱుంగుమ! రాజసూ ♦ యాశ్వమేధ
శతసహస్రముల్ సైత మీ ♦ శౌరిసేవ, కీడు రావని నమ్ముమా! ♦ యిద్ధచరిత! ౮౨

ఆ. మఱియు నెవ్వఁడట్టి ♦ గురుని దర్శించునో, వాఁడు కోటిజన్మ ♦ పాపములను
విడిచి యంతమందు ♦ విష్ణుదూతానీత, రథము నెక్కి చనుఁ బ ♦ రమపదంబు, ౮౩

ఆ. పార్థివేంద్ర! నరుఁడు ♦ బ్రాహ్మముహూర్తంబు,నందు మేలుకాంచి ♦ హరినిఁ బొగడి
గురుని పేరుఁ దలఁచి ♦ కుంభినిన్ మ్రొక్కుచుఁ, బుడమిపైని నడుగు ♦ లిడి కడంగి.

సీ. నీరు ద్రాఁకి యాసనమునఁ ♦ గూరుచుండి, కరములుత్సంగములయందుఁ ♦ గ్రాల శ్వాస
మడ్డి మఱి స్వస్తికాసన ♦ మందు నొప్పి, జ్ఞానముద్రను వేసి యో ♦ జ్జను నుతించి. ౮౫

చ. అమలుఁడు వంశివేత్రధరుఁ ♦ డభ్రనిభుండు కిశోరరూపుఁడున్
గమలదళాయతాక్షుఁడు జ ♦ గత్త్రియమోహనుఁడైన కృష్ణునిన్

విమలమతిఁ నతుల్ సలిపి ♦ వేఁడి యనంతరమందు బాహ్యదే
శమునకునేగి శౌచమిటు ♦ సల్పఁదగుఁ గృహి యోనరేశ్వరా! ౮౬

సీ॥ మంత్రపూర్వకముగ ♦ మన్నును గైకొని, యుదకంబుతో లింగ ♦ మొక్కతడవ
గుదమును ముమ్మాఱు ♦ బదిపరుల్ వామకరంబేడుపరులు కరములు రెండు
మూఁడేసిపర్యాయ ♦ ములఁ బ్రతిపాదముల్, శౌచనంబుల శ్రద్ధ ♦ సలుపవలయు
బ్రహ్మచారియువన ♦ వాసియుదీనికి, నినుమడిగా నాచ ♦ రింపనగును
తే॥ నలుమడిగయతివర్యుఁడు ♦ సలుపఁదగుఁద, దర్ధమును నిశ రోగి పాం ♦ థ ప్రతతిఁద
దర్ధమును, స్త్రీ ప్రదజులు త ♦ దర్ధమాచ, రింపవలయును యాదవో ♦ర్వీశ! యవల.

తే॥ ఆయురర్థసంపదలఁగాం ♦ త్యాదుల నిడ, వృక్షరాజంబు వినుతించి ♦ విమలకాష్ఠ
మొందుగొని దంతధావన ♦ ముత్తరముగను, ప్రాచిగను కూరుచుండి స ♦ ల్పంగవలయు
తే॥ అట్టిదంతధావనకార్య ♦ మందుఁ జనుఁడు, క్షీరికావటకార్పాస ♦ సిందుకాండ
కంటకీ బ్రహ్మవృక్షదు ♦ ర్గంధయుక్త, తరువులను వీడవలెనని ♦ యెఱుఁగుమనఘ!
క॥ శౌచాచారరహితమను, జాచరితకృతులును వ్యర్థ ♦ మగు మఱి ముఖసా
మీచీన్యవిహీనునకుఁ ద్ర, యీచారిమమంత్రఫలము ♦ లెనయవు పిదపన్. ౯౦

ఆ॥ రవిని సన్నుతించి ♦ ప్రహ్లాదముఖులైన, విష్ణుభక్తవరుల ♦ వినుతిసలిపి
తులసిమృత్స్నఁగొని యొ ♦ డలఁ బూసి దివ్యమా, వారియందు మునిఁగి ♦ భక్తితోడ.
సీ॥ యమునాదితీర్థాప ♦ గాష్టకవరనంబు, నాచరించి యల మా ♦ యాపురంబు
కాశి నవంతిక ♦ కాంచీపురము నయో, ధ్యామధురాపురీ ♦ ద్వారకలను
శంబలగ్రామస్థ ♦ శౌరిమందిరము న, ఖండనందిగ్రామ ♦ కౌశలమును
నగ్రగణ్యమగు శా ♦ లిగ్రామగతమహా, యోగ మర్బుదనైమి ♦ షోత్తమకురు
తే॥ జాంగలోత్పలావర్తపు ♦ ష్కలవనముల, దండకాటవి హేమవం ♦ తంబు సైంధ
వంబుఁ బృథుఁజంబూమార్గ ♦ వనముఁ బెక్కు, సారులు సముచ్చరించుచు ♦ జలకమాడి.

ఆ॥ క్షౌమపటముఁగట్టి ♦ చక్రగాద్వాదశ, తిలకములను బెట్టి ♦ దివ్యమైన
యష్టముద్రికలను ♦ వాళిని ధరియించి, సంధ్యవార్చిమాన ♦ శౌచములను. ౯౩

వ॥ శ్రీహరిమందిరంబున కేగి ఘంట వాయించి జయశబ్దంబుఁ బలికి కరతలంబులఁ జఱచి యుత్తిష్ఠ! యుత్తిష్ఠ! యని గోవిందుని యోగనిద్రనుండి మేల్కొల్పి తన్ముఖంబున కంతకును మంగళారతిం జూపి దివ్యపక్వాన్నంబు నివేదించి పునఃపునః ప్రణామంబు లాచరించి పంచామృతంబుల నభిషేకించి శుద్ధోదకంబున స్నానంబు చేయించి దివ్యాంబరాభరణాదులతో మనసార నలంకరించి సుమనఃపుంజంబునం బూజించి ధూపదీపంబు లిడి భోగ్యాన్నం బర్పించి నీరాజనం బిచ్చి నానారసభాసురంబగు మహాభోగ్యాన్నంబును సమర్పించి భోగార్తికం బిడి యాహారిక

శయనంబు మనోహరంబుగాఁ గూర్చి తులసీవాసనావాసితంబగు తత్ప్రసాదంబును స్వీకరింపవలయు, మధ్యాహ్నంబున శంఖనాదంబుతో రాజాన్నంబును నివేదించి రాజభోగార్తి నిచ్చి యా మహాత్మునికి శయ్య వేయందగు సంధ్యాసమయంబున దుగ్ధాదులను నివేదనం బొనర్చి నీరాజనం బిడి మరల రాత్రియందు మంగళారతి యొసంగి మృష్టభోగంబును సమర్పించి శయనంబునకై దివ్యతల్పంబు గూర్పందగు. రాజసంబగు నీ రాజసేవను బ్రత్యహం బొనర్చువాఁడు పాపవిముక్తుండై తనకు సంబంధించిన శతకులంబులంగూడ నుద్ధరించి పరమపదంబుఁ జెందగలఁడు. మఱియు మానవుండు శ్రీకృష్ణజన్మాష్టమీ రామనవమీ రాధాష్టమ్యన్నకూటవామనద్వాదశీ నృసింహచతుర్దశ్యనంతచతుర్దశ్యాదులయందు మహాపూజ యా శ్రీహరికిం జేయం దగు. తత్పూజావిధానం బెట్టిదంటివేని వినుమని యుగ్రసేనున కిట్లు చెప్పం దొడంగె. ౯౪

షోడశోపచారపూజావిధానము.

తే॥ స్నానమొనరించి శుభ్రవ♦స్త్రములఁగట్టి, నిత్యనైమిత్తికంబుల♦నిష్ఠఁదీర్చి
శుద్ధమగు ప్రదేశంబును♦జూచి యందు,స్థండిలంబును నిర్మించి♦దానియందు.

ఉ॥ గొప్పగఁ గేసరంబులను ♦ గూడిన కర్ణికతోడ దివ్యమౌ
ముప్పదిరెండుఱేకులను ♦ బొందిన తామర నైదురంగులన్
దప్పక వేసి దానిపయిఁ ♦ దద్ధరికైనను గద్దెఁగూర్చి యం
దప్పుడమిన్ సిరిన్ విరజ ♦ నా వృషభానుతనూజ రాధికన్. ౯౫

తే॥ ప్రాఁబలుకుపల్కులన్ నిల్పి ♦ వారినడుమ
నల్ల శ్రీకృష్ణు స్థాపించి ♦ యష్టపత్ర
ములను రాధాష్టసఖులను ♦ నిలిపి యష్ట
దళములన్ గృష్ణుచెలులను ♦ నిలిపి యవల. ౯౬

ఆ॥ షోడశదళములను ♦ సుందర శ్రీకృష్ణ,షోడశయుగసఖుల ♦ సొరిది నిలిపి
యల్లతమ్మిదరుల ♦ నబ్జగదాశంఖ,చక్రశార్ఙ్గఖడ్గ ♦ శరముల మఱి. ౯౭

తే॥ హలము ముసలంబు వనమాల ♦ నలఘుకౌస్తు
భంబు వంశి వేత్రముల శ్రీ ♦ వత్సనీల
వస్త్రపీతాంబరముల స్థా ♦ పనముఁజేయు
వలయుఁ బిమ్మట నవ్వాని ♦ పార్శ్వములను. ౯౮

సీ॥ గరుడాంక తాలాంక♦గరుడ కుముద కుము,దాక్ష సుమతి రథ♦దారుకులను
బల మహాబలులను♦బలుఁ జండునిఁ బ్రచండు, స్థాపించి వెండియు♦సర్వదిశల
దిక్పాలకుల నిల్పి♦ద్విపముఖ శివ విధి, పార్వతీ భారతీ♦వార్ధిజలను
షోడశమాతృకా♦సూర్యముఖగ్రహ,ములను విష్వక్సేన♦మూర్తి దుర్గ

తే॥ వహ్నిఁ గమలాగ్రమందు స్థా ♦ పనమొనర్చి
షోడశోపచారంబుల ♦ సొరిదిసల్పి
యచలభక్తిని బ్రార్థించి ♦ యవని శిరము
సోఁకఁ బ్రణమిల్లఁజెల్లునో ♦ సూరిగేయ! ౧౦౦

సీ॥ అలింపుమా! హరి♦యావాహనమునఁ బుష్పములాసనమున ద♦ర్భద్వయంబు
పాద్యంబునం దాకు♦పచ్చనిగఱిక యర్ఘ్యమున విష్ణుక్రాంత♦ప్రసవములును
స్నానమున నుశీర♦చందనాగరు ఘనసారకస్తూరికా♦సహితజలము
మధుపర్కమందు నా♦మలకకమలములు, ఘనధూపమందష్ట♦గంధములును
ఆ॥ దీపమునఁ గపురము♦దివ్యయజ్ఞోపవీతమును బచ్చనిది ప♦టమునఁ బీత
వస్త్రములఁ దొడవుల♦బంగారు గంధంబునందుఁ గుంకుమ హరి♦చందనములు.
తే॥ అలరునఁ దులసీమంజ♦రులును నక్షతలను దండులముల నివే♦దనమునందు
షడ్రసోపేతవివిధభో♦జనముల జలమునఁ గళిందజాజాహ్నవీ♦వనముల మఱి.
తే॥ ఆచమనమందు జాతీఫ♦లాదులు విడెమందు మిరియాలు దక్షిణఁ ♦హాటకముఁ బ్ర
దక్షిణాన వలగొనుట♦తన్మహత్వ, భార్తికంబున నుత్తమా♦జ్యంబు మఱియు.

క॥ వినుతిని బ్రియయుతభక్తియు, వినతిని సాష్టాంగనమ్ర ♦ విగ్రహమొప్పన్
వినుతద్వాదశవర్ణములను దగు మంత్రంబున శిఖ ♦ లిఁగట్టితమిన్. ౧౦౪

క॥ హరిపూజాపరికరముల, దరినిడికొని కృష్ణునెదుటఁ ♦ దనరుచుఁ దత్
త్పరమస్తుత్యాదితోక్తుల, వరుసగఁబఠియించు చిట్ల ♦ పచితింపవలెన్. ౧౦౫

తే॥ దీనవత్సల! గోవింద! ♦ దేవవంద్య!, యాదవేశ! గోలోకేశ! ♦ యంబుజాక్ష!
రాధికేశ్వర! దామోద♦ర! సుముఖమున, నిట్టి సింహపీఠిక నావ♦హింపుము! తమి.

తే॥ ఊర్ధ్వవృత్తమునఁ గెంపు ♦ లొప్పఁ జరణ
కమలములను వైడూర్యముల్ ♦ గ్రాల మెఱపు
వలె వెలింగెడి స్వర్ణకుం ♦ భములతోడఁ
గొదరు పీఠికఁ గొనుమ! వై ♦ కుంఠనాథ! ౧౦౬

ఆ॥ విశ్వరూప! భక్తి ♦ బిందుసరస్సునఁ, నుండి నేను వైఁడి ♦ గిండితోడఁ
దెచ్చినట్టి పాద్య♦మిచ్చెదఁ గొన నీకు, మ్రొక్కుచుంటి సర్వ♦మునివరేణ్య!
తే॥ చందనోశీరమల్లికా ♦ చందనహరిమిళితమగు నీజలంబుతో ♦ జలకమాడ
ద్వచ్చరణపద్మముల కభి♦వాదనములు, సలిపెదన్ దీర్ఘవరపాద! ♦ జగదధీశ! ౧౦౭
క॥ ఘనపీతాంబర! మధ్యం, దినరవిశశధరరభవంబు ♦ దివ్యము హృద్యం
బును నగు నీమధుపర్కం, బనుమానము వీడి యాద ♦ వాగ్రణి కొనుమా!
తే॥ పద్మకింజల్కరుచిరంబు♦పరమదుర్లభము స్వరచితంబు సర్వత్ర♦భాసురంబు
నైన పీతాంబరంబు మా♦హాదరమునఁ, గొనుము! గోపాలకృష్ణ! గో♦కులనివాస!

ఆ॥ జలము శ్రుతిఁ జదువుచుఁ♦జల్లి నైమిత్తిక, పంచకార్యములను♦బనివడునటు
త్వష్టసురుండు స్వర్ణ♦కాంతివడికిన యీ బ్రహ్మసూత్ర మిదియు♦పరమ! గొనుము!

క॥ మణికనకమయముఁ గాల్వా,రుణతేజస్సనము మదన ♦ రుగ్రుచిరంబుల్
బ్రణుతిమయరచితమగు భూ,షణమిది గొనుమయ్య! సర్వ ♦ జగదాధారా!

తే॥ సర్వభూభారపరిహార ♦ శౌండ! శుభక
రమును సంధ్యేందురుచిరంబు ♦ విమలకుంకు
మఘనసారపంకయుతంబు ♦ మండనకర
మైన యీ సుగంధంబుల ♦ నందుకొనుమ! ౧౧౪

మ॥ అనఘుండైన విరించనుండు మును బ్ర♦హ్మావర్తమం దెవ్వి సృ
ష్టినిజేసెన్ హరి యెవ్వి మంత్రజలసం♦సేకంబు గావించి వృ
ద్ధిని సల్పెన్ శివుఁ డెవ్వి రాక్షసులతో ♦ దిట్టంబుగాఁ బోరి కా
చెనొ యీ యక్షతలన్ గ్రహింపు మిపుడో ♦ శ్రీరాధికానాయకా! ౧౧౫

క॥ తులసీమంజరులందగు, జలరుహమందారపారి ♦ జాతామరవృ
క్షలలితసుమములఁ గొనుమీ!, జలజాక్షా! జలజనాభ! ♦ జగదాధారా!

తే॥ చందనలవంగచూర్ణమి ♦ శ్రమును హార్యశ్రీ
మంతిఁ బరిమళింపఁగఁ జేయు ♦ నట్టిదియును
నసురమానవసుఖదంబు ♦ నైన ధూప
మిదిగో యిచ్చెద శ్రీకృష్ణ! ♦ యీవు గొనుమ! ౧౧౬

క॥ జ్ఞానాకారము ఘనరస, ధేనుఘృతవర్తియుతము ♦ దివ్యంబు తమి
స్రానాశకమగు దీపము, జ్ఞానానందస్వరూప! ♦ కైకొనుమ! దయన్. ౧౧౭

తే॥ రుచికరంబును షడ్రస♦రుచిరముత్త, మామృతమనోహరంబు య♦శోమతీకృ
తము ఘనమగు నీనైవేద్య♦మమితదయను,గొనుమ! నందనందన! రమ్య♦కుందరదన!

ఆ॥ అధికకష్టముపడి ♦ యల్లగంగోత్తరి, యమృతకిరణశీత ♦ లామృతోప
మోదకంబు హాట ♦ కోరుపాత్రంబుతోఁ, దెచ్చియుంటిఁ గొనుమ ♦ దేవదేవ!

క॥ జాతీఫలకంకోలను,మాతత సురభీకృతామ ♦ లాచమనం బో
భూతదయాకర! రాధా,చేతశ్శతపత్రమిత్ర ♦ శ్రీహరి! కొనుమా! ౧౨౧

క॥ క్రముకైలా వర దేవకు,సుమఖాదిరజాతికోశ ♦ సుధ లాకులు రు
చ్యముగా భాసిల్లెడి నీ,తములముఁ గైకొనుమ! కృష్ణ! ♦ ధైర్యసుమేరూ!

తే॥ సర్వజనములఁ బ్రమటిలో వ♦శంబు జేసి,కొనెడి నీస్వర్ణమయదక్షి♦ణను గ్రహింపు
మష్టదిక్పాలపూజితా! ♦ యఖిలలోక,పాల! భక్తాలవాల! గో♦పాలబాల!

తే॥ ఉత్తమాజ్యాక్తపంచన♦వోరువర్తి, భాసురము మంగళకరంబు ♦ బరమదీప్తి
యుతమునైన యీమంగళా♦రతినిఁగొనుము,కృష్ణ! బ్రహ్మాండనాయకా! కృష్ణమిత్ర!

క॥ కరకర్ణశీర్ష బాహా । చరణేక్షణనామరూప । సాహస్రములే
పరమున కుండునో యా య,క్షరునకు యుగకోటిపతికి । సత్ప్రద నతులన్. ౧౨౫

తే॥ సవనదానతపోవ్రత । సత్యశౌచ, ధర్మతీర్థయాత్రాదిక । తనుకృతంబు
నిదుప్రదక్షిణంబులను గా । వించుచుంటి, గనుమ! కనులార కరుణ జ । గన్నివాస!

తే॥ దేవ! నావంటిపాతకి । త్రిజగములను, లేఁడు నీవంటిపరముఁడు । లేఁడుగాన
నిన్ను దీనతన్ జేరిన । నన్ను నిపుడు, బ్రోవవేఁడితి ద్వారకా । పురనివాస! ౧౨౬

తే॥ సచ్చిదానందమూర్తివి । శాశ్వతుఁడవ,గమ్యుఁడవు సర్వకారణ । కారణుఁడవు
శాంతుఁడవు విదూరీకృతా । సజ్జనుఁడవు, బ్రహ్మమగు నీకు మ్రొక్కెదఁ । బరమభక్తి.

—। శ్రీకృష్ణ దండకము. ।—

శ్రీరాధికాలోల లీలావిలోలా త్రయీధర్మపాలా తొల్లిన్ ధారణీదేవి దుర్మార్గులైనట్టి భూపాలురన్ దైత్యులన్ లోకులన్ మోయఁగాలేక కన్నీరుమున్నీరుఁగా గాఱ జింతించి యోజించి రూపించి గోరూపముందాల్చి యాసత్యలోకంబునం జేరి యబ్జాసనాసీనునిం గన్గొలారంగ వీక్షించి ధ్యానించి శావించి జోతంబులన్ దేవ! నావిన్నపం బిద్ది యాలించి ప్రేమించి యెంచంగ పిల్గాని నాయార్తి మాయించి రక్షింపవే యంచుఁ బ్రార్థింప నాతండు నాతల్లి నూరార్చి రేజోతి రేకంటు వేకంటి ముక్కంటి జేజేలతోఁగూడి వైకుంఠలోకంబునం గుండు నాతమ్మికంటిన్ విలోకించి యాకార్యపీక్షములఁ దెల్పి యాకేళ నాలోచనన్ వించు నాదేవుఁ డగ్రంబునందుండి మార్గంబుఁ జూపించుచున్ దోడుగా రాఁ బధంబందుఁ దైవారు లెక్కింపఁగారాని పెక్కన్నబ్రహ్మాండముల్ చిత్రముల్ భూనభోగోళముల్ బల్లెలన్ వీడులన్ మేడలన్ వాడలన్ బీడులన్ జేఁటలన్ దోఁటలన్ గానలన్ వాఁకలన్ గాంచు చారాధ్యమై యోగిసాధ్యంబునై సర్వకామప్రదంబై యఘగ్రామవజ్రంబునై శ్రీనివాసంబునై నీకు వాసంబునై యొప్పు గోలోకముం జేరి యాలోనిఖర్జూరజంబీర మందార బృందారకాగాదిరమ్యంబుగానున్న నికుంజమున్ జొచ్చి తేజోవిరాజత్సహస్రోరుపత్రాంచితార్జోర్ధ్వభాగోజ్జ్వలత్షోడశోచ్ఛ్రాయపత్రాంచ దంభోరు హార్ధ్వావటపత్రోల్లసద్దివ్యపద్మంబునన్ స్వర్ణసింహాసనంబందు దేవాదిదేవుండవై పద్మనేత్రుండవై భూషణాలంకృతాంగుండవై పద్మనేత్రుండవై చండమార్తాండకోటిప్రభాభాసమానుండవై రాధికాభామినీరత్నయుక్తుండవై మేఘవర్ణుండవై యున్న నిన్నున్ విలోకించి యారా యటంచెంతొ హర్షించి దేవా! పరేశా! చిదానందరూపా! యుపేంద్రా! నమస్తే యటం చౌదలల్ మేదినిందాఁక జోఁబిళ్లు గావించి మాకుయ్యి నాలించి పాలింపుమో దేవ! యీమేదినీదేవి దుఃఖంబుఁ ద్రోపాడి కాపాడుమో పీతచేలా! సుశీలా! యటంచున్ నుతిన్ సల్పఁగా నీవునున్ మెచ్చియో వేల్పులారా! ధరన్ నాదు నేమంబునన్ మీరలందందు నారీతులన్ బుట్టుఁ డంచంపి నీలోకమందుండి

నీయన్న మన్నింప విన్నాణమైనట్టి బృందాటవిన్ భూమిన్ దివ్యగోవర్ధనం బల్ల కాళిందినిన్ బంపి భూభారమున్ బాప భూదేవులన్ బ్రోవఁ బుణ్యాత్ములన్ గావ మూర్ఖాళి శిక్షింప వేదాల రక్షింప శీతంబునం దెండలన్ వానలన్ బెక్కుకష్టం బులన్ జిక్కియున్ నిశ్చలాత్ముల్ నిన్నున్ గూర్చి ప్రార్థించి కైకొన్న సర్వేష్టముల్ దీర్పఁ గారుణ్యచిత్తంబుతోఁ గంసకారాగృహంబందు భీతిల్లుచున్నట్టి శ్రీదేవకీ దేవికిన్ దివ్యరూపంబుతోఁ బుట్టి నీతండ్రికిన్ దల్లికిన్ జింతలన్ బాపు తంత్రంబులన్ జెప్పి గోగోపగోపీయుతంబైన శ్రీగోకులంబందునన్ జేరి యందున్న యాయోగమాయన్ వడిన్ దిర్గి తత్కారకుంబంచి నందాదులన్ శ్రీయశోదాదినారీలలామంబులన్ లీలలన్ ఖేలలన్ జూపులన్ మాటలన్ జేతలన్ బ్రీతినిం జోద్యమున్ గూర్చి నీయంశతో నొప్పు శ్రీరేవతీపుత్రుఁడౌ రాముతో నాడుచున్ గూడుచున్ బాడుచున్ బ్రాఁగుచున్ మెక్కుచున్ గోవులన్ గాయుచోఁ బొప్పారి యాగొప్ప బృందావనంబందు లీలావిహారంబుఁ గావించి యారాధఁ బెండ్లాడి రాసంబులన్ దేర్చి వంశి నీవూఁదవే గోపికల్ రా ననేకాకృతుల్ దాల్చి యావ్యాళితోఁ గూడి యాంతెంబులన్ వారలన్ జేరి క్రీడింపవే మోదముం గూర్పవే పుణ్యతీర్థంబులన్ నెంగు గోవిందు బెత్తి వేత్రవేలనున్ బ్రేతలన్ గావవే దావమున్ బ్రింగవే కాళియాహీంద్రు మర్దింపవే తత్పరోజాతు లర్థింప రక్షింపవే కోలకేశ్యాదిదైత్యేంద్రులన్ గూల్పవే వేగ నీకోటలన్ ధారణిన్ నిల్పవే వేదముల్ ధాతకీవిచ్చి సంప్రీతుఁగా నల్పవే రాధికాగోపికాయూథనాథుండవై సద్విహారంబులన్ జేయవే పూర్వజన్మంబునం దెన్నొమార్గంబులన్ గొల్చి నీయాజ్ఞచే బ్రేతలై పుట్టియున్నట్టి మానీంద్రులన్ భక్తులన్ జూచి రక్షింపవే దేవ! యన్నల్పుఁడౌ కంసునాహ్వానముం గొంచు నీలాంబరాక్రూరయుక్తుండవై సాఁగి ప్రీతిన్ భవద్విశ్వరూపంబు మార్గస్థమౌ వాఁకలోఁ గాందినీసూతికిన్ జూపి తత్పట్టణంబొంది కుబ్జాదులన్ గాంచి సంతోషమున్ గూర్చి యాకేదులోకంబులన్ సాటిలేనట్టి తత్కార్ముకంబట్టి భంగంబు గావించి తన్మత్తమాతంగముం ద్రుంచి చాణూరకూటాదులన్ గూల్చి లోకంబుఁ జీకాకుగాఁ జేయు నాకంసుఁ బోకార్చి శోకంబుతోనున్న యాయాదవశ్రేణులన్ బ్రోచి తద్బంధనంబందు దైవాఱు నాయుగ్రసేనున్ దయన్ జూచి మన్నించి మన్నీడుగాఁ జేసి నీతల్లిదండ్రుల్ ముదంబొంద వీక్షించి తత్కార మాయించి నీక్షేమముం దెల్పి యాగోపులం బెల్ల హర్షింపఁగా నుద్ధవుం బుచ్చవే నారదప్రేరితుండైన శ్రీమ్లేచ్ఛనాథుండు బాఱాడఁగాఁ గాటి భర్జింపవే తజ్జరాసంధు వేమాఱు నోడించి యంతంబునందట్టి భూదేవవాక్యంబు సత్యంబుగాఁ జల్పఁ దచ్ఛైలముం దెక్కి యందుండి యబ్ధిస్థమౌ ద్వారకన్ జేరి తద్యాదవశ్రేణినిం జేర్చి కాపాడవే రుక్మిణీసత్యభామాదులన్ బ్రీతిఁ బెండ్లాడవే భౌమునిం జంపి యవ్వాని కారాగృహంబందు బల్కుందు భూజానిపుత్రీలలామంబులన్ వీడి

ప్రేమింపవే యుగ్రసేనుంకు తద్విశ్వజిద్యాగముం జేయ బోధించి తంత్రంబు వాచించి దిక్కులఁ లలిఁ గెల్వఁగా నీకుమారుండు వీరుండు భూమోహనాకారుఁడౌ మారు నీమారుగాఁ బంపి యద్దృష్టు సాయంబులన్ జేయ నీవేగి మాత్సర్యభీమక్రియోత్సాహసంపన్నులౌ నాశకున్యాది దైతేయులన్ జంపి యాకంతు దిగ్జేతగా సల్పి తద్యాగరాజంబు రాజేంద్ర భోగీంద్ర దేవేంద్ర యోగీంద్ర పూజ్యంబుఁ బూర్ణంబు నౌనట్లుగాఁ జేసి తద్వాంఛలన్ దీర్పవే సచ్చిదానంద రూపుండవై యప్రమేయుండవై యాదిమధ్యాంతశూన్యుండవై సర్వమాన్యుండవై వేదశాస్త్రాదిగమ్యుండవై భక్తగమ్యుండవై నిర్మలాత్ముండవై నిర్వికారుండవై నిత్యశుద్ధుండవై నుత్యబుద్ధుండవై స్తుత్యవేదస్వరూపుండవై ధ్యాతవై ధ్యేయమై ధ్యానమై భోక్తవై భోగ్యమై భోగమై యొప్పు నీచెయ్వులన్ జూచి యాశ్చర్యముం బొంది సృష్టించు నాధాతవంచున్ దయన్ బెంచు విష్ణుండవం చెల్ల దూలించు రుద్రుండవంచున్ మఱిన్ బెక్కుమార్గంబులన్ గాంచి యగ్గింతు రీలోకులోయీశ! లోకేశ! యాలోచనం జేయ నవ్వారలున్నీవె కావా! సమస్తేంద్రియంబుల్ దగన్ నీవె కావా! మహారాజ! నీయందె యీలోకముల్ పుట్టు నీయందె చెన్నొందు నీయందె డిందున్ సుమీ దేవరాజా! మహాత్మా! భవద్భీతి సూర్యుండు దీపించు సోముండునున్ వెల్గు వాతంబు వీచున్ గృశానుండు మండున్ గృతాంతుండు శిక్షించు నాస్రష్ట సృష్టించు విష్ణుండు రక్షించు రుద్రుండు మాయించు నింద్రుండు నాకంబుఁ బాలించు శేషుండు నేలన్ వహించుంగదా శేషి! నీమోమునన్ బ్రాహ్మణుల్ మూపులన్ క్షత్రియుల్ సక్థులన్ వైశ్యులున్ బాదయుగ్మంబునన్ శూద్రులున్ డెందమం దిందుఁడున్ గన్నులన్ సూర్యుఁడున్ వక్త్రమం దగ్ని సుత్రాములున్ బ్రాణమందున్ జగత్ప్రాణమున్ నాభి నభ్రంబు శీర్షంబునన్ స్వర్గమున్ వీనులన్ దిక్కులున్ గాళ్ల నీభూమి నీరీతి నీ యన్నిలోకంబులన్ బుట్టి రాజిల్లవే యీమహారూపుఁగన్నట్టి నిన్నల్ల బ్రహ్మాదు లెన్నంగలేరన్న నాబోటిపిన్నల్ నుతింపంగ యత్నింతురొక్కో? పరంధామ! వందారుమందార! గోవింద! రామానుజా! శ్రీధరా! మేశ్వరా! యీశ్వరాజేంద్ర రాజేంద్రపూజావిరాజత్పదా! నీపదాంభోజముల్ గొల్చు డెందంబు నిన్మ్రొక్కు శీర్షంబు నీగాథలాలించు కర్ణంబులున్ నీవరాకారముం జూచు నేత్రంబులున్ నీప్రసాదంబులన్ గోరు వక్త్రంబును న్నిన్ను బూజించు హస్తంబులున్ నీమహామందిరంబుల్ ప్రవేశించు పాదంబులన్ నెమ్మి నాకిచ్చి కారుణ్యచిత్తంబుతోడన్ బ్రపన్నుండనౌ నన్ను మున్నల్ల ప్రహ్లాదవైరోచని ద్రౌపదీపార్థదేవర్షి గాంగేయరుక్మాంగదాహీంద్ర నందాంబరీషాదులన్ గాంచినట్టుల్ విలోకించి నాకామముం గోపమున్ లోభమున్ మోహమున్ గర్వమున్ మచ్చరంబున్ విడన్ జేసి మన్నించి రక్షింపవే భక్తచింతా

మణీ! దీనరక్షామణీ! నిర్జరగ్రామణీ! లోకచూడామణీ! యోయికృష్ణా నమస్తే నమస్తే నమః. ౧౨౯

వ॥ అట్లు హరిం బూజించి నమస్కరించి నుతించి యనంతరంబున నమోనారాయణాయ యని ప్రాణాయామం బొనరించి ప్రణవపూర్వక కేశవాదినామంబులతో నాపాదమస్తకంబు నర్చించి తద్విధంబుననే తదీయసఖీసఖశంఖచక్రగదాపద్మాసి ధనుర్బాణ హల ముసలకౌస్తుభ వనమాలా శ్రీవత్సపీతాంబర నీలాంబరవంశీ వేత్రతాలధ్వజ గరుడధ్వజ రథదారుకసుమతి గరుడ కుముద కుముదాక్షనందసునంద చండప్రచండబలమహాబలాదులను, విష్వక్సేన వినాయక శివవిధి దుర్గాదిక్పాలవరుణ నవగ్రహమాతృకాదులను, దత్తన్మంత్రంబులతోఁ బూజించి నమోవాసుదేవాయ యను మంత్రంబుతో శతాహుతులను యగ్నియందు వేల్చి ప్రదక్షిణించి మహాభోగం బర్పించి నమస్కరించి ధ్యాయేత్సదా యనుదానితో ధ్యానించి క్రమ్మఱఁ బ్రణమిల్లి నీరాజనంబిడి ఘటీఘటావీణావేణుకాంస్యకరతలతాలమర్దలాదిజయధ్వానంబులొప్ప భక్తజనులతోఁ గూడి సత్కథాశ్రవణతత్పరుండై యనన్యప్రేమలక్షణభక్తితో నా హర్యగ్రమందు నాట్యం బొనర్చి సాష్టాంగదండప్రణామంబులం గావించి తన్మందిరంబం దా సుందరనందనందనునకు దివ్యశయ్య వేయందగు. ఇట్లు శ్రీకృష్ణసేవనొనర్చు పుణ్యాత్ముఁడు బృందారకులుసైత మర్చింపఁ దన్నాకపదంబుఁ బొంది క్రమంబుగా నత్యుత్కృష్టధామంబగు గోలోకంబున కేగి సుఖించు. యుక్తభుక్తిభక్తిముక్తికరంబగు శ్రీకృష్ణసేవావిధానంబు క్రమంబుగాఁ జెప్పితి. మఱియు నేమివినవలతువో తెలుపుమన నుగ్రసేనుం డా వ్యాసమహర్షి కిట్లనియె. ౧౩౦

మ॥ హరిరూపంబున నొప్పు మీవలన నా ♦ యజ్ఞాతపూజావిధిన్
గరమాలించితి లోక మెన్నఁగఁ గ్రుధా ♦ గర్వవ్యథామోహమ
త్సరలోభాదిగుణప్రయుక్తమయి త ♦ ద్వైరాగ్య మావంతయున్
సరిగాఁ బొందదు తద్రమావిభున క ♦ ర్చల్ సేయ దెవ్వేళలోన్. ౧౩౧

తే॥ మోహ మెక్కారణమున నీ ♦ భువనమందు
బుట్టెనొకొ? మఱి యెట్టుల ♦ గిట్టగలదొ
కరుణఁ జెప్పగ వేఁడితి ♦ దురితదూర!
బాదరాయణి! గుణమణీ! ♦ వ్యాసమౌని! ౧౩౨

పరబ్రహ్మనిరూపణము.

చ॥ అనవుడు వ్యాసుఁ డిట్లనియె ♦ యాదవనాయక! యేవిధంబుగా
ఘనగగనాన నొప్పు నుడు ♦ కాంతునిబింబము క్రింది నీటిలోఁ
గనుపడి కంపమొందినటు ♦ కారణకారణుఁడైన యా పరా
త్మునిప్రతిబింబ మీ జగతి ♦ మోహదమై జనియించి యొప్పెడిన్. ౧౩౩

క॥ మాయాకాలమనంబులఁ, గాయజగుణములను మఱిఁ గు♦ కర్మంబులచేఁ
బ్రాయముగ జనుఁడు బద్ధుం,డౌ యాదవనాథ! యిది ని♦ రనుమానముసూ.

ఆ॥ అట్లు బద్ధుఁడైన♦ యాతఁడు కాచనై,కలగుణములఁ గనులఁ♦గాంచి బాల
వారి సర్పములని♦భ్రమియించి మోహించి, సంచరించి యాద♦సంచరించు.

వ॥ ఇజ్జగంబు విశేషంబుగా రజస్తమోగుణమయంబును, గ్వాచిత్కంబుగా సత్వగుణమయంబును మోహామయంబును మనోవిలాసంబును, జంచలంబును, భ్రాంతికరంబును, నానావికారసంయుతంబునునై యలాతచక్రంబువలె నొప్పుచుండునని యెఱుంగుమన నుగ్రసేనుం డానందించి మునివరా! పండితులా శ్రీకృష్ణుని జపమార్గముం దెన్నితెన్నుల నెన్ని ధ్యానింతురో తద్బ్రహ్మలక్షణం బెద్దియో తెలియఁజేయ వేఁడెదనని నమస్కరింప నా వ్యాసుండు ప్రసన్నవదనుండై యదువరున కిట్లనియె ౧౩౬

చ॥ జననమృతిక్షుధాప్రభృతి ♦ షట్కవిరోధసఖిత్వ బాల్యయౌ
వనజరఠత్వకష్టసుఖ ♦ భావసమున్నతి తృట్క్షుధాధిరో
గనివహభీతు లెవ్వియు న♦ ఖండుఁ డనశ్వరుఁడైన యా పరా
త్మునకణువేని లేవనుచు ♦ బుద్ధి నెఱుంగుమ! యాదవేశ్వరా! ౧౩౭

సీ॥ కాకశరీరంబు♦గాక ప్రాణంబులు,గాక యింద్రియములు♦గాక మనము
గాక మనీషయు♦గాక చిత్తంబును,గాక యహంకృతి♦గాక గుణము
గాక తన్మాత్రలు♦గాక శూన్యంబును,గాక స్థూలమును సూ♦క్ష్మమునుగాక
గాక హ్రాస్వంబును♦గాక దీర్ఘంబును, గాక వర్ణంబులు♦గాక జడము

తే॥ కాదుకాదనునదికాక♦కాదు కాదు,కాదనెడి దానియందునఁ♦గాంచఁబడుచు
శాశ్వతంబయి యెయ్యది♦చక్కవెలుఁగు,చుండునో యద్ది పరమాత్మ♦యుర్వరేశ!

సీ॥ నిర్విశేషుండును♦నిష్కారణుండు ని,ర్వాణప్రదుండు ని♦రామయుండు
నిర్వికారుండును♦నిర్వికల్పుండని,ర్వాచ్యుండు పరుఁడు ని♦రంజనుండు
త్రిగుణాశ్రయుండును♦త్రిజగత్స్వరూపుండు,నమలాత్ముఁడుఁ త్రిమూ♦ర్త్యాత్మకుండు
సంకల్పరహితుండు♦జగదేకదేవుండు, సచ్చిదానందుండు♦శాస్త్రయోని

తే॥ యాదిమధ్యాంతరహితుండు ♦ నప్రమేయుఁ
డక్షరుండు నంతర్యామి ♦ యతులితుండు
సర్వకారణాతీతుండు ♦ సాధుహృన్ని
వాసుఁడునుగాదె బ్రహ్మంబు ♦ పార్థివేంద్ర! ౧౩౮

తే॥ ఇట్టి పరమాత్మ తనలోన♦నెల్లజనము,చేష్టలుడుగుచు శయనంబుఁ♦జెందునపుడు
గోచరింపక యొరుల క♦కుంఠితముగ, మేలుకొనిచూచుచుండునో ♦ మేరుధీర!

చ॥ స్ఫటికమునందు నెట్టితర ♦ వర్ణములేవియు సంక్రమింపవో
యెటు లనలానిలాంబరము ♦ లింధనధూళిఘటాళిఁ జిక్కవో
యటుల గుణత్రయంబునఁ బ ♦ రేశుఁడు సిక్కక సంతతంబు ను
త్కటముగ వెల్గు నిర్మలవి ♦ ధంబున సజ్జనవందనీయుఁడై. ౧౮౧

తే॥ వ్యంగ్యశాస్త్రపదస్ఫోట ♦ వాదలక్ష,ణాదులకు నట్టి పరమాత్మ ♦ యందనపుడు
లౌకికోక్తులఁ దెలియునే? ♦ లలితచరిత!, దేవకానుజ! ద్వారావ ♦ తీపురీశ! ౧౮౨

మానినీ వృత్తము.

కొందఱు వేళగఁ ♦ గొందఱుసేఁతగ, గొందఱు క ర్తగఁ ♦ గొందఱు గో
విందుగఁ గొందఱు ♦ భీముగఁ గొందఱు, వేధగఁ గొందఱు ♦ వృత్రహుగాఁ
గొందఱు శూన్యుగఁ ♦ గొందఱు బ్రహ్మగ,గొప్పకతంబని ♦ కుంభిని ని
ట్లందఱు నారసి ♦ యన్నివిధంబుల, నాపరమాత్మను ♦ నందురుగా. ౧౮౩

వ॥ వెండియు గుణంబులకుఁ జిక్కక మాయ నంటక యింద్రియాంతఃకరణ
చతుష్టయంబులకు గోచరింపక వేదములకు నైత మెఱుంగఁబడక త్రైకాలికాబా
ధ్యంబై యాపరమాత్మ ప్రకాశించు. అందు విస్ఫులింగంబు లగ్నియందు లీనంబై
నట్లు సర్వంబును లయంబు బొందుచుండు. జనుండు విద్వాంసులచే వాసుదేవుండని
చెప్పంబడు హిరణ్యగర్భునిం బరమాత్మతత్వంబుగాఁ దెలిసికొని మోహంబు విడిచి
యసంగుండై సంచరింపందగు. చంద్రుం డేకకుండయ్యు నుదకపాత్రబృందంబునం
బహుత్వంబు జెందుచందంబునను వీతిహోత్రుం డొక్కండయ్యు గాష్ఠసముచ్చ
యంబునందు వివిధత్వంబు గాంచినకరణిని నాపరమాత్మ యొంటివాఁడయ్యు స్వకృత
దేహాదిబాహ్యాభ్యంతరంబులం బ్రవేశించి యనేకత్వంబుగాంచు. సూర్యోదయంబునఁ
దమంబు నశించి గృహపరికరంబులు గనుపడినట్లు జ్ఞానోదయంబునం దమంబు
నశించి పరమపదంబు గోచరించుచుండు. ఏకపదార్థంబు భిన్నభిన్నవృత్తులుగల యిం
ద్రియంబుల కనేకవిధంబులైనట్లు తేజస్స్వరూపుండగు నాకేవలుండును భిన్నశాస్త్ర
పారంగతులగు మహర్షులకు వివిధవిధంబులుగా వర్ణనార్హుండయ్యె. ఆపరంధా
ముండే యీ శ్రీకృష్ణుం డగుట నమస్కరించుచుంటినని చెప్పి వ్యాసుం డాయుగ్ర
సేను ననుమతిం గొని యాదవు లాలోకించుచుండ నంతర్హితుండయ్యె. ౧౮౪

❋ శ్రీగర్గభాగవత పఠనాదిఫలము. ❋

తే॥ జనక! యిట్లిప్డు నీకు వి ♦ జ్ఞానఖండ,మేను జెప్పితి శ్రీగర్గ ♦ కృతము సర్వ
దోషహరము బుణ్యంబు జ ♦ తుష్పదార్థ,దమగు దివ్యకోశంబిది ♦ ధరణినాథ!

సీ॥ నయనపర్వమొనర్పు ♦ నవఖండములతోడ, దనరారుచుండెడి ♦ ధరణికరణి
సర్గముల్ సేయఁగాఁ ♦ జను నవబ్రహ్మలఁ, బరగుచుండెడి పర ♦ బ్రహ్మమువలె

బ్రవిమలంబులయిన ♦ నవరత్నములతోడ, నతిశయించెడి నిగ్గ ♦ రాంగుళివలె
నవ్యంబులైన తన్నవరసంబులతోడ, బొల్పారు శ్రీకృష్ణ ♦ మూర్తిమాడ్కి
తే॥ దివ్యనవఖండములతోడఁ ♦ దేజరిలెడి, గర్గభాగవతంబిది ♦ కలుషహారము
పుణ్యాకరమును బురుషార్థ ♦ భూరిదంబు, విశ్వవిజ్ఞానదమునయి ♦ వెలుఁగుఁగాదె.
ఆ॥ ఇద్దివిన్నవార ♦ లిహలోకసౌఖ్యముల్, బొంది గోజగతిఁ ♦ జెందఁగలరు
భీతుఁ డిద్దివినిన ♦ భీతిని విడుచును, బామరుండువినినఁ ♦ బండితుఁడగు. ౧౪౭
ఉ॥ ఇంబుగ వంధ్యయైనసతి ♦ యేనియు స్నానముఁ జేసి దివ్యపీ
తాంబరముం ధరించి పతి ♦ యాజ్ఞను గైకొని భక్తి నిట్టిగ్రం
థంబును విన్నచోఁ ద్వరను ♦ దజ్జలజేక్షణసామ్యపుత్రజా
లంబును గాంచు శోభనవి ♦ లాసము లొప్ప స్వధామమందునన్. ౧౪౮
తే॥ రోగి యిద్ది వినినచో ని♦రోగియగును, పేద యిద్ది యాలించిన ♦ విత్తవంతుఁ
డగును బద్ధుండు విన్నచో ♦ నట్టిబంధ, నంబునుండి ముక్తుండగు ♦ నవ్యచరిత!
సీ॥ క్షత్రియుండీకృతిన్ ♦ గార్తికమాసంబు, నందు నాలించిన ♦ నధికభక్తి
బార్థివులందఱు ♦ బలులిడి మ్రొక్కఁగా, సూతమాగధముఖుల్ ♦ స్తుతులొనర్ప
వారనారీమణుల్ ♦ బాడుచు నాడంగ, సుందరపుత్రికల్ ♦ సొరిది మెలఁగ
వింధ్యాచలోద్భవ ♦ ద్విపములు జెన్నార, సింధుతురంగమ ♦ శ్రేణియొప్ప
తే॥ నిత్యకల్యాణములుగల్గ ♦ నిఖిలభూమి, మండలంబు వర్ణాశ్రమ ♦ మహితధర్మ
ములనునిలుపుచుఁ బాలింపఁ♦గలఁడు రాజ,చంద్ర! యీవిషయంబు ని♦స్సంశయంబు
తే॥ ఎవఁడు రౌప్యఖురంబులు♦ హేమశృంగ, ములును దామ్రపృష్ఠంబును♦ భూషణములు
బరగవత్ససంయుక్తగో♦ద్వయము సుప్రతి, ఖండమందిడునో వాఁడు♦ గాంచుఁగోర్కె.
ఆ॥ కారణంబులేక ♦ గర్గభాగవతంబు, వినిన సత్పురుషుని ♦ ఘనహృదయక
మలమునందు సతము ♦ మాధవుఁ డొప్పుచు, ధన్యతముగఁ జేయుఁ ♦ దథ్యమిద్ది.
క॥ ఈరహి బహుళాశ్వనకా, నారదుఁ డుపదేశమును నొ♦నర్చి యనుమతిం
గోరి నభోమార్గంబును, జేరెఁగదా శౌనక! ముని ♦ శేఖర! మఱియున్. ౧౫౩
క॥ జనకమహారాజీకృతి, విని ధన్యుఁడనైతినంచు ♦ వేమఱు స్వాంతం
బునఁ దలఁచుచుఁ జెలఁగెను శ్రీ,వనజేక్షణభక్తిభరిత ♦ భావముతోడన్. ౧౫౪
తే॥ నీదుకోర్కెనిఁ జెప్పితి ♦ నేను దీని, శౌనకా! యన్న నమ్ముని♦తూ్మసురేంద్ర!
నాకు హరిభక్తిగల్గె ధ♦న్యత ఘటిల్లె, ననఁగ గర్గమహర్షి యు ♦ ననియె నిట్లు.
మ॥ ధరణీభారనివారకుండు మధుర ♦ ధ్యానప్రతీత్యుజ్జ్వల
న్మురళీలోలుఁడు శూరవంశజలధి ♦ ప్రోద్యత్సుధాంశుండు స
చ్చరితుండున్ మునిశుద్ధమానససర ♦ శ్చక్రాంగభూతుండు నా
హరి రక్షించుత మిమ్ము మమ్ము ననయం ♦ బానంద మేపారఁగాన్. ౧౫౬

తే॥ ఇట్లు సర్గవిసర్గవి♦హిత హరికథ, శౌనకాదులకుఁ జెప్పి ♦ సర్వమునులు
భక్తి సాఁగనంపఁగ ముని♦పటలతిలకుఁ, డైన గర్గుఁడు గర్గాహ్వ♦యాద్రి కరిగె.

శా॥ శ్రీమద్ద్వాదశయోజనాయతమహా ♦ సింధూజ్జ్వలద్ద్వారకా
ధామా! యోగిమునీంద్రసన్నుతపరం ♦ ధామా! శుభోత్సాహము
త్సామా! యాదవవార్ధిసోమ! యభయ ♦ శ్రీకృష్ణనామా! మహో
ద్దామా! దుష్టవిరామ! కామసమ! రా ♦ ధామానసాబ్జార్యమా! ౧౫౮

ఉపేంద్రవజ్రము.

నిరంజనా! నిర్గుణ! ♦ నిర్వికల్పా!, నిరీశ! నిర్వాణద! ♦ నిర్వికారా!
నిరీహ! నిష్కారణ! ♦ నిర్విశేషా!, పరాత్పరా! వైదిక ♦ భాగధేయా!

గద్యము:- ఇది శ్రీమత్పరమపవిత్రాపస్తంబసూత్ర, భారద్వాజసగోత్ర, చివుకుల
కులజలధికళానిధి, కోటమాంబా కామయ తనయ, లక్ష్మీదేవీ
సుబ్రహ్మణ్య దత్తపుత్ర, శ్రీకృష్ణప్రసాదాసాదిత కవిత్వ
నిశ్చయ, సుజనవిధేయ, శ్రీనివాసాపరనామధే
యాప్పయశాస్త్రిచే నాంధ్రీకృతంబైన
శ్రీగర్గభాగవతం బందలి
విజ్ఞానఖండము
సమాప్తము.

శ్రీ శ్రీ శ్రీ

హరిః ఓం తత్సత్

శ్రీకృష్ణార్పణమస్తు.

శా॥ భారద్వాజపవిత్రగోత్రజుఁడ నా ♦ పస్తంబసూత్రుండ సీ
తారామప్రియశిష్యుఁడన్ చివుకులో ♦ త్కృష్టాన్వయాబ్ధ్యబ్జుఁడన్
శ్రీరాధేశపదారవిందవిలస ♦ చ్చిత్తాళి నప్పయ్య నే
ధీరప్రస్తుత గర్గభాగవతమున్ ♦ దెల్గించితిన్ బూర్తిగాన్.

తే॥ ఐదువేలపై నిర్వదై ♦ దబ్దములును, గ్రాలఁ గలియుగమందున ♦ శాలివాహ
శకమునందు నష్టాదశ ♦ శతశరదల, పైని నలుబదియాఱేండ్లు ♦ వఱలు తఱిని.

క॥ రక్తాక్షివత్సరంబున, యుక్తవిజయదశమియందు ♦ నుర్వీజను లా
సక్తినిఁ జూడఁగ నీకృతిఁ, బ్రాక్తన పాఠంబుదోలఁగఁ ♦ బ్రకటించితిఁగా.

మంగళంమహాత్.

శ్రీకృష్ణార్పణమస్తు.

శ్లో॥ "స్వస్తిప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయ్యేనమార్గేణ మహీంమహీశాః
గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యం లోకాస్సమస్తా స్సుఖినోభవంతు"

తప్పొప్పుల పట్టి.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
౨	౩౧	శ్రీకృషుండు	శ్రీకృష్ణుండు
౩	౧౫	తాకుముల్	తాళ్ళులఁ
౩	౧౯	హితార్భకబాల	హితార్భక
౩	౨౫	బాద్యు	భాద్యు
౭	౨౫	బృందిష్టోర్మి	బృందిక్షోర్మి
౮	౭	రామరా	రామగా
౧౭	౩	నాంకతిష్ఠ	నాంతికస్థ
౨౪	౧౪	మారడమ్మ	మాడరమ్మ
,,	౨౯	యశోల్లస	యశోలస
౨౯	౨౨	ధ్వంసబుఁ	ధ్వంసంబుఁ
౩౩	౬	గానవు	గావున
౪౨	౭	స్వగ్విణీ	స్రగ్విణీ
౪౬	౨౩	లిల	లీల
౫౫	౧౧	గమునక	గంబున
౫౬	౬	స్పర్శ	స్పష్టి.
౫౯	౧	,,	,,
౬౨	౬	హాసుండౌట	హాస్తుండౌట
,,	౨౫	తన్నిశాంత	త్వన్నిశాంత
౬౩	౧౩	రకార	యెరేఫ
౬౬	౧౫	ప్రకృతియె	ప్రకృతియై
౮౮	౨౪	నాజ్ఞ నవనిఁజేరఁ దలఁచి తొలుత సర్వ	నాజ్ఞ నవనిఁ♦జేరదలఁచి తొలుత♦
౯౫	౮	పర్లోల్లస	పర్ణోల్లస
౧౦౪	౧౨	మలనయను	మలనయముని
౧౦౬	౧౧	దక్షిణంబుగా	దక్షిణంబుగా
౧౦౮	౨౧	మహిళఁ	మహిళకుఁ
౧౧౨	౨౬	కారుణకారణిక	కారణకారుణిక
౧౨౯	౧౫	కొలుకూ	కొలువుకూ

పుట.	పం_క్తి.	తప్పు.	ఒప్పు.
౧౪౨	౨౨	సుట్ట	సుట్టు
౧౪౩	౧౫	శ్రీధరుఁబొరఁబ్రహరించి	శౌరి వదుఁనట్టులఁగొట్టి
౧౪౫	౨	యలరితివిగ	పొందితివిగ
౧౬౨	౧౭	కీర్తి	కీర్తి
౧౬౩	౨౩	జ్ఞాపురపతియ	జ్ఞపురనాథుఁడ
౧౫౯	౨౭	యటు	యటుల
౧౮౯	౩	థది	దధి
౧౮౭	౧౦	శూద్ర	శూద్ర
౧౮౮	౨౯	శూవా	శూహి
౨౩౭	౧౦	బ్రహ్మయ	బ్రహ్మమ
,,	౩౦	,,	,,
౨౭౦	౧౩	కెగిన	కేగిన
౨౮౨	౩	సక్రమంబుగ	క్రమముగా దివ్య
౩౦౯	౩౦	మధురగవ్యాదుల్	దధిపయస్సర్పుల్
౩౦౮	౨౬	ద్దండ	దుద్దండ
౩౧౯	౭	జెయంగ	జేయంగ
౩౧౭	౪	వాక్రువ్వ	వాక్రుచ్చ
౩౧౮	౨౩	బియ్య	బీయ
౩౨౦	౨౩	బాదరిస్థలం	బాదరాశ్రమం
,,	౩౦	బాదర్యాశ్రమమున	బాదరకాననమున
౩౨౧	౨౭	నందనుండు	నందనుఁడు
౩౨౩	౧౫	గూడుయయుఁ	గూడుటయుఁ
౩౨౪	౩౨	నిర్ధి	ర్ధిని
౩౨౭	౨౨	ద్భార్యామణిఁ మైథిలా !	ద్భామాలలామంబునఁ
౩౨౮	౧౬	ధాత్యా	గోత్రా
౩౩౦	౧౫	క్షేమకరంబులాట	క్షేమదమాట నిష్ఠ
౩౪౫	౧	క్రమముగ	నెట్టన
౩౯౪	౨౫	తచ్చీరల	యా చీరల
,,	,,	చీరలఁ	చీరముల్
౩౬౧	౮	ఇట్టుల	అట్టుల

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
౩౯౮	౨౨	లయ్యోను ఘోరరణంబు	మాత్ర మహారణమయ్యో
,,	౨౬	నీదునో	నామనో
౪౦౮	౩౧	జెడి	జేడి
౪౧౦	౨౩	దంతవక్త్రుఁడు గఁదఱ	నాతఁ డాత్మగదఁనా
౪౧౧	౧౪	భయమిను	భయమిన్మ
,,	౧౭	డేసగింపు	డేవగింపు
౪౨౦	౨	కరుణతోడ	సదయుఁడగుచు
౪౨౧	౧౨	కాశ్వపి	కాశ్యపి
౪౩౧	౧౩	ముంగల	చెంతను
౪౩౨	౧౯	వఁమమరవలె	ఁవమమరవలె
౫౬౨	౨౨	భిన్నాంఘ్రియై	ఛిన్నాంఘ్రియై
౫౬౩	౯	ధనుఁవుంగొని టం	విలుఁబూనుచుఁ డం
౫౭౮	౨౬	ఁదద్బాణ	నాబాణ
౮౧౬	౧౯	బరుఱఁబ్రహ్మ బలుఱ	బలుఱఁబ్రహ్మంబునుఱ
౮౨౯	౨౦	కైకొనుము ! దయఱ	సద్దయఁగొనుమా !
౮౩౪	౧౬	యన నామునియుఱ	వర ! యన మునియుఱ
౮౩౯	౧	కరణేఁదనరి	సరణిఁదనరి

☞ ఇంకను స న ష స థ ధ ల ళ రేఫ శకటరేఫార్ధానుస్వారాది ప్రత్యయంబులను మన్నించి వలసినట్లు సవరించుకొని పఠింప దోషజ్ఞులను బ్రార్థించుచున్నవాఁడను.

చి. అ. శా.

గుంటూరు: కన్యకా ముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడియె.

20-4-1926.